శ్రీవేదవ్యాస విరచితం

# గరుడమహాపురాణం

ద్వితీయ భాగం

(తెలుగు అనువాదంతో)


తెలుగు అనువాదకులు

**డా॥ కేసాప్రగడ సత్యనారాయణ**

సంపాదకులు

**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ**

ఎమ్.ఎ.(సంస్కృతం), ఎమ్.ఎ.(తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2024**

# GARUDA MAHAPURANAM
**SECOND PART**
(with Telugu Translation)

Translated by:
**Dr. Kesapragada Satyanarayana**

Editor:
**Dr. Akella Vibhishana Sarma**
**M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,**
**Special Officer, Purana Itihasa Project**
**T.T.Devasthanams, Tirupati.**

T.T.D. Religious Publications Series No.1465

© All Rights Reserved


First Print : 2024

Copies: 500


*Published by:*
**A.V.Dharma Reddy,** I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Cover Design & D.T.P. Type Setting:*
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు    శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## పురాణ ఇతిహాస ప్రాజెక్టు
## పండితపరిషత్తు - సలహామండలి

**అధ్యక్షులు**

**శ్రీ ఎ.వి.ధర్మారెడ్డిగారు ఐ.డి.ఇ.యస్.**

కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు.

**సభ్యులు**

**శ్రీమతి యస్.భార్గవిగారు ఐ.ఏ.యస్.**

సంయుక్తకార్యనిర్వహణాధికారి,తి.తి.దే.,తిరుపతి.

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు**
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు**
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు**
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ - హైదరాబాద్

సంచాలకులు

**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మగారు**

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

# పరిష్కరణ పరిషత్తు

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**గారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ సూరం శ్రీనివాసులు**గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీగోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం

**డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి**గారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, నిడదవోలు

**డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మ**గారు
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం

**డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులు**గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

**డా॥ ధూళిపాళ మహదేవమణి**గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ ధూళిపాళ అన్నపూర్ణ**గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తి**గారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం**గారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్ లైబ్రరీ, హైదరాబాద్

**శ్రీగార్లపాటి ప్రభాకరశర్మ**గారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచారపరిషత్, తి.తి.దే.

**సంచాలకులు**

**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మగారు**

ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## విషయానుక్రమణిక


| విషయం | పుటసంఖ్య |
|---|---|
| తొలిపలుకు | 1 |
| నివేదన | 3 |
| పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు | 7 |
| పురాణప్రశస్తి | 8 |
| అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం | 21 |
| గరుడమహాపురాణం ద్వితీయభాగ సారాంశం | 40 |
| **గరుడ మహాపురాణం - ధర్మకాండ ప్రేతకల్పం** | |
| 1. ప్రశ్నల పరంపర | 1 |
| 2. ఔర్ధ్వదైహిక కర్మవిపాక విధులు | 11 |
| 3. నరకప్రవేశం నిర్గమనం | 24 |
| 4. దహనవిధి మొదలగు విషయాలు | 39 |
| 5. యమలోకమార్గంలోని యాతనలు | 64 |
| 6. వృషోత్సర్గ (ఆబోతును వదలటం) మాహాత్మ్యం | 85 |
| 7. అయిదుగురు ప్రేతల కథ | 106 |
| 8. ఆత్మశ్రాద్ధ విధానం | 121 |
| 9. రాజు ఆబోతును విడుచుట | 126 |
| 10. శ్రాద్ధతృప్తి | 137 |
| 11. ప్రాణాలు పోయే విధానం | 151 |
| 12. మరణించిన వానిని ధర్మమే అనుసరించునని తెలుపుట | 153 |
| 13. ఆబోతును విడవటం, దానాలు వాటి ఫలితాలు | 158 |
| 14. గోదానవృషోత్సర్గం అనేకదానాల ఫలితం | 162 |
| 15. యమలోకానికి ప్రయాణం | 170 |
| 16. ప్రేతయమలోకానికి చేరే తీరు | 184 |
| 17. శ్రవణుల గొప్పదనాన్ని నిరూపించుట | 192 |

18.వృషోత్సర్గదానాదుల ఫల నిరూపణం 196
19.యమమందిరప్రవేశం విశేషాలు 202
20.ప్రేతబాధలు 206
21.స్వప్నాధ్యాయం 213
22.ప్రేతత్వోత్పత్తి తన్ముక్తి 218
23.ప్రేతచిహ్నాలు నివారణోపాయాలు 230
24.అకాలమరణకారణం బాలుర అంత్యేష్టి 233
25.మృతబాలుని విభిన్న అంత్యేష్టి నిర్వహణం 240
26.సపిండనవిధానం 247
27.ప్రేతత్వానికి కారణం పరిహారప్రకారం 257
28.వివిధదానాల ఫలితాన్ని నిరూపించుట 267
29.దర్భతిలతులసీపత్రాది వివిధదానాల అవసరాన్ని తెలుపుట 273
30.వివిధదానాల స్వరూపఫలితాలు 278
31.దానఫలం దేహాంతర ప్రవేశనిరూపణం 286
32.ప్రాణిపుట్టుక శరీరంలోని విశేషాలు 292
33.యమలోక బాధల విస్తరణం 310
34.ఔర్ధ్వదైహికం, సపిండీకరణం మొదలగునవి 317
35.సపిండీకరణం శవవిధి 338
36.ఉపవాసాలతో మరణిస్తే వచ్చే ఫలితం 345
37.జలపూర్ణపాత్రను దానం చేయుట 351
38.ఉత్తమలోకప్రాప్తి కారణాలు 354
39.సూతకకాలనిరూపణం 360
40.అపమృత్యుప్రస్తావం 363
41.ఆబోతును వదలుట 372
42.భూదానాది నిరూపణం 374
43.శుద్ధివిధి 378
44.ప్రమాదంలో మరణిస్తే పాటించవలసిన విధి 379

45. ప్రత్యాబ్దికశ్రాద్ధాదులు 384
46. శుభాశుభాలను గురించి 389
47. కర్మవిపాకం మొదలగునవి 395
48. ధర్మాధర్మపరామర్శ 403
49. మోక్షప్రాప్తిమార్గాన్ని చెప్పుట 411
**గరుడమహాపురాణం - బ్రహ్మకాండ**
1. సాత్త్వికాదిపురాణవిభాగం నమ్యానమ్యదేవ విభాగం 431
2. బ్రహ్మాదిదేవతలలోని తరతమభావ నిరూపణం 445
3. భగవానుని వీర్యస్వరూపాదికం 455
4. త్రిగుణాల సామ్యవైషమ్యాల నిరూపణ 464
5. తత్త్వాలను అభిమానించే దేవతల పుట్టుక తారతమ్యం 475
6. తత్త్వాభిమాని దేవతలు విష్ణువును స్తుతించుట 483
7. ఆ యా దేవతల స్తుతి తరతమభావ నిరూపణం 493
8. విష్ణుస్తుతి దేవతలతరతమ భావం 505
9. విష్ణుస్తుతి, దేవతల తారతమ్య నిరూపణం 508
10. ప్రాకృతవైకృత సృష్టులు 512
11. అజ్ఞాన కారణ నిరూపణం 520
12. బ్రహ్మ చేసిన విష్ణుస్తుతి 527
13. దేవతల పుట్టుకను వివరించుట 543
14. వైశ్వదేవం కోసం సారాసారవస్తు వివరణ 551
15. విష్ణువు యొక్క అవతారాల నిరూపణ 559
16. మహాలక్ష్మి అవతార నిరూపణ 564
17. భారతికి విశిష్టదేహం లభించుట 578
18. రుద్రరోదనకు హేతువు ఆనంద తారతమ్య నిరూపణం 585
19. నీలా వివాహ నిర్ణయం 597
20. భగవంతుని భర్తగా పొందుటకై భద్రచేసిన తపస్సు 608
21. భగవంతుడు కాలిందిని వివాహం చేసుకోవడానికి కారణం 616

22. లక్ష్మణతో వివాహానికి కారణం 622
23. వేంకటేశగిరియాత్రాక్రమం 635
24. శ్రీవేంకటేశ్వరపర్వతారోహణక్రమం, తద్భక్త, తత్పర్వతనామాలు 643
25. దేవి వేంకటేశ్వరుని దర్శించి స్తుతించుట 662
26. వ్యంకటగిరి మాహాత్మ్యం 671
27. కన్య దర్శించిన నానావిధ తీర్థయాత్రల నిరూపణం 691
28. విష్ణువే ఉపాస్యతత్త్వమని నిరూపించుట 697
29. తత్త్వరహస్య వివేచనం 720



## తొలిపలుకు

### "ఓం నమో వేంకటేశాయ"

త్రిమూర్తులలో ఒక్కడుగా, దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసే శ్రీమహావిష్ణువు యొక్క అవయవాలుగా పురాణాల్ని పెద్దలు చెప్పారు. ఇలా చెప్పడంలోనే పురాణాలు ధర్మస్వరూపాలని గ్రహించవచ్చు. పురాణాలు ఇహానికీ, పరానికీ ఉపయోగించే సాధనములు, మన సంస్కృతినీ, సంప్రదాయాల్నీ తెలుసుకోవడానికి ఈ పురాణజ్ఞానం చాలా ఆవశ్యకం. లోకశ్రేయోదాయకాలైన విషయాలకు ఆలవాలాలు పురాణాలు. వీటిలో సాంఘికమైనవీ, చారిత్రకమైనవీ అయిన ఎన్నో విషయాలున్నాయి వీటిలో. ప్రతీపురాణంలోనూ నీతి నియమాలు, ఆచారాలు, భగవద్భక్తివైశిష్ట్యం, భగవన్మహిమ, భగవదవతారాలు వర్ణింపబడ్డాయి. వేదాంతతత్త్వం స్పష్టంగా నిరూపితమయింది. వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో స్పష్టం చేయబడిందనీ, ఈ రెండిటిద్వారా గహనమైన విషయాలు పురాణాలద్వారా సుస్పష్టమవుతుందని పెద్దల మాట.

ఇన్ని విషయాలున్న పురాణాలన్నిటినీ సామాన్యులకు సైతం చేరువ చెయ్యాలనే సదుద్దేశంతో పురాణాల్ని తెలుగులోకి అనువదించే కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించింది. ప్రసిద్ధులైన పండితులతో సరళంగా తెలుగులో అనువాదాన్ని చేయిస్తోంది. అందులో భాగంగా ఈ గరుడపురాణానువాదం కూడా జరిగింది.

కొందరు పండితులు 'సాత్త్వికం, రాజసం, తామసం' అని పురాణాల్ని మూడుగా విభజించి, ఈ పురాణాన్ని 'సాత్త్వికపురాణం'గా చెప్పినారు. అలాగే శ్రీమహావిష్ణుని అవయవాల్లో ఈ పురాణానికి 'మజ్జ' అనే స్థానం నిర్దేశింపబడింది. "మజ్జా తు గారుడం ప్రోక్తం" అని వచనం.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో మరణానంతరం జీవి ప్రయాణం వర్ణింపబడింది. ఎంతో మందికి ప్రశ్నార్థకమైన ఈ విషయం అతి వివరంగా గరుత్మంతునికి శ్రీమహావిష్ణువు బోధించాడు. "పురాపి నవం పురాణం" అన్నట్టు ఇలాంటి విషయాలు అనాదిగా జరుగుతున్నవే అయినా, ఎప్పటికీ కొత్తవే! తెలుసుకోదగినవే! అలాగే మనిషి మరణానంతరం శ్రాద్ధాదికర్మలు నిర్వహించడం. అటు చనిపోయిన వ్యక్తికీ, ఇటు ఆ శ్రాద్ధకర్మ యథాశాస్త్రంగా నిర్వహించిన సంతానానికీ శ్రేయోదాయకమనీ, ముక్తిదాయకమనీ కూడా చెప్పబడింది.

ఈ గ్రంథంలో మానవుని జీవితంలో క్లిష్టపరిస్థితుల్లో మానసిక స్థైర్యాన్నీ, ధైర్యాన్నీ ఇచ్చే "ధర్మో జయతి నాధర్మః – సత్యం జయతి నానృతమ్ – క్షమా జయతి న క్రోధః" వంటి ఎన్నో మంచి మాటలున్నాయి. అంతే

కాకుండా "మీరు చేసే క్రియాకలాపం సఫలం కావాలంటే నైతికమైన ప్రవర్తన చాలా ముఖ్యము" అని ఈ పురాణం పదే పదే బోధిస్తుంది. "ధర్మప్రవృత్తి కలవాడు, ద్వేషాన్ని అహంకారాన్ని జయించినవాడు, వినయవంతుడైన పండితుడు, ఇతరులను బాధించనివాడు, తన భార్యను మాత్రమే ఇష్టపడి, ఇతర స్త్రీలకు దూరంగా ఉండేవాడు అయిన వ్యక్తిని నేను కూడా నమస్కరిస్తా'ను అని సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు చెప్పిన మాటనుబట్టి, నైతిక ప్రవర్తనకు ఈ పురాణం పెద్దపీట వేసిందని తెలుస్తోంది.

అలాగే శ్రీకృష్ణుని పట్టమహిషుల పూర్వజన్మ వృత్తాంతాలూ, వారి కల్యాణాలూ వర్ణింపబడ్డాయి. ఆ క్రమంలో జాంబవతీ వివాహాన్ని, ఆమె పూర్వజన్మ వృత్తాంతాన్ని వర్ణిస్తూ తీర్థయాత్రా క్రమాన్ని, పద్ధతినీ వర్ణించారు. ఆ సందర్భంలో 'తిరుమల యాత్రా క్రమాన్ని కూడా వర్ణించారు. ఇది నేటి శ్రీనివాసభక్తులైన ప్రజలందరికీ ఎంతో ఆనందాన్నిస్తుంది. ఈ పురాణానువాదంలో భాగంగా ఈ తిరుమల యాత్రాక్రమాన్ని ముద్రించి, సామాన్య జనసమూహానికి చేర్చడం ఎంతో ఆనందదాయకం!

ఇలా ఎన్నో ఆసక్తికరమైన జప, దాన తీర్థయాత్రల ఫలవర్ణనలూ, భగవద్భక్తి ప్రాశస్త్యం, ముక్తి మార్గ బోధకం అయిన ఎన్నో విశేషాంశాలు కల ఈ పురాణం చదవడం, వినడం శ్రేయోదాయకం. ఆనందకారకం.

ఈ పురాణాన్ని చదివితే, వింటే, ఎవరికైనా చెప్తే, పాపాలన్నీ నశించి స్వర్గానికి చేరుకుంటాండని ఫలాన్ని చెప్పారు. ఈ ఫలాన్ని అందరూ అందుకోవాలని మా శుభాశంస.

ఇటువంటి గరుడపురాణానికి చక్కని సరళమైన తెలుగు అనువాదాన్ని అందించిన డా॥ కేసాప్రగడ సత్యనారాయణగారికి, పరిష్కరించిన పండితవర్యులకు, ఈ గరుడపురాణపరిష్కరణలో ప్రత్యేకశ్రద్ధను చూపిన డా॥ సూరం శ్రీనివాసులుగారికి, ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారికి నా శుభాభినందనలు.

సమాజ శ్రేయస్సును చూపించేదీ, ధర్మనిరతిని బోధించేదీ, మానసికధైర్యాన్నిచ్చేది అయిన ఈ పురాణం భాగవతులకు ఎంతో ఉపయోగకారి అవుతుందని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో

**ఆళ్ళ వేంకట ధర్మారెడ్డి,** ఐ.డి.ఇ.ఎస్.,

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# నివేదన

**"అస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేతత్యత్, ఋగ్వేదో యజుర్వేద స్సామవేదో౽థాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి"**

అనే ఉపనిషద్వాక్యం వేదాల్లా పురాణాలు కూడా ఆ పరమాత్మయొక్క నిశ్వాసరూపమని చెప్పడంవల్ల – వేదాలకున్నంత ప్రాధాన్యం పురాణాలకు కూడా ఉందని స్పష్టమవుతోంది. పురాణం అన్న ఏకవచనం వల్ల పూర్వం ఒకటిగా ఉన్న పురాణం, అనేక పురాణాలుగా విస్తరించి విభజించబడిందని పెద్దల మాట. ఇలా విస్తృతరూపం పొందిన ఈ పురాణాలు పద్దెనిమిదింటిని, శ్రీమహావిష్ణువుయొక్క అవయవాలుగా చెప్పారు. దీన్నిబట్టి ధర్మసంస్థాపకుడైన శ్రీ మహావిష్ణువుకూ, ఆ ధర్మస్వరూపాన్ని సమీక్షించి నిర్ణయించే పురాణాలకూ ఉన్న ఏకాత్మతను గ్రహించవచ్చు. ఇలాంటి పురాణాల్ని చదవడం, వినడం రెండూ పాపనాశకాలని చెప్పారు.

**"యథా పాపాని పూయన్తే గంగానద్యవగాహనాత్ ।**
**తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥"**

పద్మపురాణం పురాణాలన్నిటినీ సాత్త్విక, రాజస, తామసాలుగా విభజించింది. ఈ గరుడపురాణాన్ని ("గారుడం చ తథా పాద్మం, వారాహం శుభదర్శనే" అని) సాత్త్విక పురాణంగా చెప్పింది. అంతేకాకుండా

**"విష్ణోః పురాణం, భాగవతం పురాణం, తథా**
**సర్వోత్తమం గారుడంచాహురార్యాః"** అని ఈ పురాణానికి భాగవతంతోనూ విష్ణుపురాణంతోనూ సమమైన స్థానాన్నిచ్చారు. భాగవతంలో ఈ గరుడపురాణ శ్లోకాల సంఖ్య "ఏకోనవింశత్సోపర్ణం" అని 19000శ్లోకాలని చెప్పబడింది. ఇది పూర్వఖండం, ఉత్తరఖండం అని రెండు భాగాలుగా ఉంది. "కీర్తితంపాపశమనం, పఠతాం శృణ్వతాం నృణామ్" – ఆ పురాణం చదివేవారినీ, వినేవారినీ పుణ్యాత్ములుగా తీర్చిదిద్దుతుంది.

విష్ణువాహనుడైన గరుత్మంతుడు శ్రీమహావిష్ణువును అడిగిన ప్రశ్నలకు, ఆ భగవంతుడు చెప్పిన సమాధానాలే ఈ గరుడపురాణం. ఉత్తరఖండంలో ప్రేతకాండం చాలా ప్రశస్తమైనది. ఇది మానవుని మరణానంతరం జీవి చేసే ప్రయాణాన్ని వివరంగా వర్ణిస్తుంది. దర్భాసనంపై శయనం, పరిశుద్ధమైన అగ్నిలో దహనసంస్కారం, సంసార సాగరంనుండి జీవి బయటపడడానికి చేసే ప్రాయశ్చిత్తాలనీ వివరిస్తోంది. ఈ కాండంలోనే, మానవుడు చేసే ఏ ఏ పాపాలకు ఏ ఏ నరకాలు పొందుతాడో వివరంగా ఉంది. కనుక మరణానంతరం, వారిసంతానం ఈ పురాణం పదిరోజులూ పారాయణ చేయడం ఒక సదాచారంగా వస్తోంది.

ఈ సందర్భంలో తిలల (నువ్వుల) ప్రాశస్త్యం చెప్తూ "మమ స్వేదేన సంభూతాస్తిలాస్తార్క్ష్య! పవిత్రకాః" అని శ్రీమహావిష్ణువు చెప్పాడు. కనుక విష్ణువు చెమటనుండి తిలలు పుట్టడంవల్ల తిలలు పవిత్రాలని చెప్పింది ఈ పురాణం. అలాగే మనిషి మరణించినప్పుడు చేసే కర్మకాండలో వృషోత్సర్జనాన్ని చెప్తూ, అది చేసే విధానాన్ని, ప్రాశస్త్యాన్ని, విరాధనగరమహారాజైన వీరవాహనుడి కథద్వారా చక్కగా వివరించింది ఈ పురాణం.

**"యజేత వాశ్వమేధేన నీలం వా వృషముత్సృజేత్"** అని అశ్వమేధయాగంతో సమానమైన ఫలదాయిగా ఈ వృషోత్సర్జనాన్ని చెప్పింది.

ఈ ప్రేతకాండలో మానవుని నైతిక ప్రవర్తనను నిర్ణయించే చక్కని ఉపదేశ శ్లోకాలెన్నో ఉన్నాయి.

**"యో ధర్మశీలో జితమానరోషో విద్యావినీతో న పరోపతాపీ ।**
**స్వదారతుష్టః పరదారదూరస్స వై నరో నో భువి వందనీయః ॥"**

ధర్మప్రవృత్తికలవాడు, అహంకారాన్ని, కోపాన్ని వదిలిపెట్టినవాడు, విద్యావంతుడై వినయసంపన్నత కలవాడు, ఇతరులను బాధించనివాడు, తన భార్యయందు సంతుష్టుడై ఇతర స్త్రీలను తల్లిలా ఆదరించేవాడు, అటువంటి వ్యక్తికి మేము కూడా నమస్కరిస్తామని సాక్షాత్తూ భగవంతుడే చెప్పాడు. పూజార్హుడెవరో చెబుతూ మానవాళికి మార్గదర్శనం చేశాడు. ఇక్కడ **'నః'** అన్న పదం ఈ విషయానికి ఎంతో ప్రత్యేకత చేకూర్చింది. మానవుడు మరణించాకా మోక్షస్థితిని పొందేందుకు మార్గాలున్నాయని మహర్షులు చెబుతారు. కానీ బ్రతికుండగానే సత్కర్మలు ఆచరిస్తే మోక్షాన్ని పొందిన దివ్యానుభూతి కలుగుతుందని ఈ పురాణం వివరిస్తోంది.

**స్వధర్మ కర్మార్జిత జీవితానాం, శాస్త్రేషు దారేషు సదా రతానామ్ ।**
**జితేంద్రియాణామతిథి ప్రియాణాం, గృహేఽపి మోక్షః పురుషోత్తమానామ్ ॥**

తమ ధర్మాన్ని ఆచరిస్తూ, సత్కర్మలను, శాస్త్రాధ్యయనాన్ని, గృహస్థధర్మాన్ని, శాస్త్రవిహితంగా ఆచరించాలి. ఇంద్రియనిగ్రహం, అతిథిసేవను పరమభాగ్యంగా తలచేవారు, తమ జీవితాన్ని ఇహలోకంలోనే మోక్షసుఖంగా భావించవచ్చును.

గరుడపురాణం – భగవదవతారాలు, విష్ణుదీక్ష, పంచముఖ శివార్చనవిధి, రోగాదులను నివారించే సుదర్శన పూజావిధి, సూర్యార్చనవిధి, దేవతల ప్రతిష్ఠావిధి వంటి దేవతలను ప్రసన్నం చేసుకొనే పద్ధతులను వివరిస్తోంది. పైగా ఇందులోని సరస్వతీ ఉపాసనా విధానం పరమాదరణీయమైనది. ఆయుర్వేదవైద్యులకు ఉపకరించే రోగకారణాలను చక్కగా వివరించింది. బుద్ధిబలం పెరిగేందుకు వాడవలసిన ఔషధాలు తెలియజేస్తోంది. అన్నిటికీ మించి మానవుని జీవనంలో తెలుసుకోదగిన నీతివచనాలకు నిధి, ఈ పురాణం – కొందరు యజమానులు చాలా ప్రమాదకరంగా ఉంటారు. కనుక ఆలాంటి సేవావృత్తిని నెరపేవారు ముందే ఈ విషయాన్ని గ్రహించాలి.

**కారణేన వినా భృత్యే, యస్తు కుప్యతి మానవః ।**
**స గృహ్ణాతి విషోన్మాదం, కృష్ణసర్ప విసర్జితమ్ ॥**

నల్లత్రాచు విషం చాలా ఉపద్రవాన్ని తెస్తుంది. అలాగే నిష్కారణంగా తమ సేవకులను ఎల్లప్పుడు కోపంతో నిందించే యాజమానులు కూడా ప్రమాదమైనవారు. కనుక వారు ఎక్కువ జీతాన్నిస్తున్నా వదిలి వేయాలి. కొన్ని గొప్ప లక్షణాలున్నా, దుర్గుణాలతో ఉన్నవారిలో శోభించవు. ఈ సత్యాన్ని గరుడపురాణం అందంగా వివరించింది–

**అర్థేన కిం కృపణ హస్తగతేన పుంసా, జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।**
**రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన, మిత్రేణ కిం వ్యసనకాల పరాఙ్ముఖేన ॥**

ధనం గొప్పదే కానీ పిసినారి చేతిలో ఉన్నప్పుడూ, జ్ఞానం గొప్పదే కానీ అది మూర్ఖుడిలో ఉన్నప్పుడూ, అందచందాలు గొప్పవి, అవి పిరికివాడికి ఉన్నప్పుడూ, మిత్రులున్నారు కానీ వారు కష్టకాలంలో ఆదుకోనప్పుడు– ఆ ధనం, జ్ఞానం, రూపం, మైత్రి ఇవి వృథా. కొంతమంది జీవితంలో చాలా పరిచయస్థులుగా ఉంటారు, కానీ కష్టాలొస్తే తప్పుకొంటారని కూడా గరుడ పురాణం హెచ్చరిస్తూ మనోజ్ఞంగా వివరించింది–

**వృక్షం క్షీణఫలం త్యజన్తి విహగాః, శుష్కం సరస్సారసాః,**
**నిర్ద్రవ్యం పురుషం త్యజన్తి గణికా, భ్రష్టం నృపం మంత్రిణః,**
**పుష్పం పర్యుషితం త్యజన్తి మధుపాః, దగ్ధం వనాన్తం మృగాః**
**సర్వః కార్యవశాత్ జనోహి రమతే కస్యాస్తికో వల్లభః?**

పండ్లు విరగకాసిన కాలంలో పక్షులు వృక్షాన్ని ఆశ్రయిస్తాయి. చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నంతకాలం తామరలుంటాయి. పూలువాడిపోతే తుమ్మెదలు దూరమౌతాయి. ధనముంటేనే వేశ్యలుంటారు. రాజ్యాధికారం లేని రాజును మంత్రులు వదిలివేస్తారు. కాలిపోయిన అడవిలో జంతువులుండవు. కనుక ఎప్పుడూ తమకు కావలసినవి లభిస్తేనే ఈ సృష్టిలో ప్రాణులు ఆశ్రయించడమనే పనిచేయడం జరుగుతుంది. స్వార్థపూరితమైన ఈ సృష్టిలో లౌకికమైన సంపదల ద్వారా, మనం నిష్కామమైన అనురాగాన్ని పొందలేము. కనుక, ఒక్క పరమాత్మే ఏ స్థితిలోనైనా నిష్కామంగా ఆశ్రయించిన ప్రాణులను ఆదరించి, సద్గతులను ప్రసాదిస్తాడు.

**మాతృనిందా మహావ్యాధిః, పితృనిందా పిశాచతః ।**
**దైవనిందా దరిద్రస్యాత్, గురునిందా కులక్షయం ॥**

అమ్మను నిందిస్తే దీర్ఘవ్యాధి, తండ్రిని దూషిస్తే పిశాచత్వం, దైవనింద వల్ల దుర్భరదారిద్రం, గురునిందవల్ల కులక్షయం సంక్రమిస్తాయి. ఇలాంటి ధర్మోపదేశాలు మానవుడిని సన్మార్గంలో నడిపిస్తాయి.

అలాగే "చేసిన కర్మను మనం అనుభవించి తీరాలి" అని వివరిస్తూ

**"సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా, పరో దదాతీతి కుబుద్ధిరేషా ।**

**పురాకృతం కర్మ సదైవ భుజ్యతే దేహిన్! క్వచిన్నిస్తరయత్త్వయాకృతమ్ ॥"** అని చెప్తూ మనం ఇప్పుడు అనుభవించే సుఖదుఃఖాలకు మనం పూర్వం చేసిన కర్మే కారణమన్నప్పుడు ఇప్పుడు మనం చెయ్యవలసిన కర్మ ఎలా ఉండాలన్న విచికిత్స ఏర్పడుతుంది కదా! ఇలాంటి ఎన్నో అద్భుతమైన ఉపదేశాలున్నాయి ఈ గరుడపురాణంలోని ప్రేతకాండలో.

దీంట్లో తృతీయాంశమైన బ్రహ్మకాండలో బ్రహ్మవిష్ణుమహేశ్వరాదుల సేవ, వారి తారతమ్య నిరూపణం, శ్రీమహావిష్ణువుయొక్క పరబ్రహ్మతత్త్వ నిరూపణం, అనేక దేవతాస్తోత్రాలు, మహాలక్ష్మీ అవతార వర్ణన వంటి ఆసక్తికరమైన అంశాలెన్నో ఉన్నాయి. అలాగే బ్రహ్మ, ఆదిశేషుడు మొదలైన దేవతలందరి స్వరూప స్వభావాలు వర్ణింపబడ్డాయి. విశేషంగా శ్రీకృష్ణుని పట్టమహిషుల వివాహగాథలు, వారి పూర్వజన్మ వృత్తాంతాలు ఉన్నాయి. చివరగా జాంబవతీ వివాహవర్ణనలో తీర్థయాత్రాక్రమం, పద్ధతి కూడా వివరింపబడింది.

అలాగే చివరి అధ్యాయమైన "తత్త్వరహస్యవివేచనం"లో చెప్పిన విషయాలు చాలా విలువైనవి. మానవ దైనందిన జీవితాన్ని భగవదర్పితం చెయ్యాలనీ, అలా చేస్తే దాని తాలూకు ఫలమేమీ మనకంటదన్నది పెద్దలమాటగా వింటూ ఉంటాం. మన సమస్త దైనందిన కార్యక్రమాన్నీ ఎలా భగవంతునికి అర్పించాలో వివరించే శ్లోకాలున్నాయి–

**సుసంగకాలే స్వస్త్రియశ్చైవ నిత్యం గోపీకుచద్వంద్వవిలాసినం హరిం ।**
**తాంబూలకాలే సంస్మరేచ్చైవ నిత్యం ప్రద్యుమ్నాఖ్యం వాసుదేవం హరిఞ్చ ।**
**పుత్రాదీనాం చుంబనే చైవ కాలే సువేణుహస్తం సంస్మరేత్కృష్ణదేవం ॥**


ఏ రెండు పాశాలు మానవుణ్ణి బద్ధుణ్ణి చేస్తాయో, ఆ రెండు అనుభవాల దగ్గరా ఆయా కృష్ణరూపాల్ని స్మరిస్తూ ఉండడం వల్ల ఆ యా బంధాలనుండి ముక్తి లభిస్తుంది. అలాగే ఇలా అన్ని దినచర్యలకు ప్రత్యేకంగా ఏ ఏ కృష్ణరూపాల్ని స్మరించాలో దీనిలో చెప్పబడింది. చివరగా సర్వకాల విముక్తికి ఉపాయంగా "హరిం స్మరేత్సర్వదా వై ఖగేంద్ర!" అని చెప్పబడింది.

ఈ గరుడపురాణం ఉత్తరకాండను సరళమయిన భాషలో అనువాదం చేసి ఇచ్చిన శ్రీడా॥ కేసాప్రగడ సత్యనారాయణగారికి, పరిష్కరించిన పండిత పరిషత్తు పండితులకు, ప్రత్యేకంగా ఈ పురాణాన్ని పరిశీలించి, తగినరీతిలో సూచనలిచ్చిన డా॥ సూరం శ్రీనివాసులుగారికి, సహకరిస్తున్న ప్రాజెక్టు సిబ్బందికి నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పాఠకులు ఈ గరుడ పురాణాన్ని పూర్వానువాద గ్రంథాల్లా చక్కగా ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

"శ్రీ వేంకటేశచరణౌ శరణం ప్రపద్యే"

**డా॥ఆకెళ్ళ విభీషణశర్మ**
**ప్రత్యేకాధికారి**

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు




బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

# పురాణప్రశస్తి

## (అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥**
**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥**

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

**అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।**
**పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥**

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

**'వేదోఽఖిలో ధర్మమూలం'** అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

**ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।**
**బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥**

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

**యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం**
**యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।**

**కాన్తాసమ్మితతయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా**
**కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥** (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

**కథా ఇమాస్తే కథితా మహీయసాం**
**వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।**
**విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!**
**వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥** (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

**'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'**

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

## పురాణ ప్రాముఖ్యం

**యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।**
**ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥**

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

## పురాణ శబ్దనిర్వచనం

**పురాణం అంటే -** పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

**పురాఽపి నవం -** ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

**పురా–అణతి–అగతానాగతే కథయతీతి పురాణం**–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

**పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్**–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

**పురా**–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

**పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం** – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

## పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోఛ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

**ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।**
**ఉఛ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥** అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

**"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".**(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించ వలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

**విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥**

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

**విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।**
**వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥**

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

## విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

**బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।**
**వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥**

**ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।**
**మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥**

**భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।**
**బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥**

**లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।**
**స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥**

**కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।**
**మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥**

**ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।**

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయ పురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

## పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥**

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

## పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

**బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।**
**భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥**
**ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।**
**వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

**సాత్త్వికాలు –**

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

**రాజసాలు –**

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

**తామసాలు –**

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

> **సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।**
> **స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥**

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

**ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।**
**తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥**

**చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।**
**దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥**

**కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।**
**బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥**

**మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।**
**పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥**

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

## పురాణ లక్షణం

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥**

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం–ఆయా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు – మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం –ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

**అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।**
**మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥**

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

## పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2--9)**

| | | | |
|---|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | - | 10,000 | శ్లోకాలు |
| 2. పద్మపురాణం | - | 55,000 | ,, |
| 3. విష్ణుపురాణం | - | 23,000 | ,, |
| 4. వాయుపురాణం | - | 24,000 | ,, |
| 5. భాగవతపురాణం | - | 18,000 | ,, |
| 6. నారదపురాణం | - | 25,000 | ,, |
| 7. మార్కండేయపురాణం | - | 9,000 | ,, |
| 8. అగ్నిపురాణం | - | 15,400 | ,, |
| 9. భవిష్యపురాణం | - | 14,500 | ,, |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | - | 18,000 | ,, |
| 11. లింగపురాణం | - | 11,000 | ,, |
| 12. వరాహపురాణం | - | 24,000 | ,, |
| 13. స్కందపురాణం | - | 81,100 | ,, |
| 14. వామనపురాణం | - | 10,000 | ,, |
| 15. కూర్మపురాణం | - | 17,000 | ,, |
| 16. మత్స్యపురాణం | - | 14,000 | ,, |
| 17. గరుడపురాణం | - | 19,000 | ,, |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 | ,, |
| **మొత్తం శ్లోకాలు** | - | **4,00,000** | |

## పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

## వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥**

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

## పురాణ ప్రయోజనం

**యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।**
**తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥**

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

## సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

**దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।**

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

**ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।**

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, -రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

## కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

**“ఋగ్వేదం భగవో౽ధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం”** (ఛాందో 7-1-2).

అందుచేత 600వ సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

## పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

**"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః"** అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

# అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

## 1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

**ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥**

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

## 2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

**యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।**
**లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥**

## 3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగర వంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

**“అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।**
**వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!” ॥**

‘అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు’ అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

**యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।**
**తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥**

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

## 4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని ‘శివపురాణ’ మని కూడా పేర్కొంటారు. **‘చతుర్వింశతి సాహస్రం పురాణం’** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

**యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।**
**న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥**

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

**ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।**
**కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥**

## 5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

**'నిగమకల్పతరోర్గళితం ఫలం'**-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

**'విద్యావతాం భాగవతే పరీక్షా'** అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

**భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।**
**శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥**

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

**మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।**
**మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥**

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

## 6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

**లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।**
**జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥**

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

**యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥**

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

## 7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

**శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।**
**సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥**

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

## 8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

**రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।**
**అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥**

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

**ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।**
**వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥**

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

**'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'**

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

## 9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

**"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।**
**ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥**

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।**
**అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥**

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

## 10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

**అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।**
**పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥**

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

**నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।**
**ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥**

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

**శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।**
**హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥**

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

## 11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్నీ వివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥**

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

**భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।**
**తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥**

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

**యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।**
**స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥**

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

## 12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

**శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।**

**సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥**

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

## 13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

**'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం'** – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెంద్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

**సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।**
**గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥**

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

## 14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

**పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।**
**శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥**

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

**యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।**

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

## 15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

**ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।**
**ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥**

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

**'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం'** అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

**ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।**
**పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥**

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

## 16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ

తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

**లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।**
**జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥**

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

**పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।**
**న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥**

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
**అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।**
**నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥**

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

## 17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు-వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

**అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।**
**రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥**

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

**'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్'** అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

## 18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషజ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ్ళ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

**య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।**
**స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥**

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

## గరుడమహాపురాణం ద్వితీయభాగ సారాంశం

శ్లో. మల్లానామశనిర్నృణాం నరవరః స్త్రీణాం స్మరో మూర్తిమాన్
గోపానాం స్వజనోఽసతాం క్షితిభృతాం శాస్తా స్వపిత్రోః శిశుః ।
మృత్యుర్భోజపతేర్విధాతృ విహితస్తత్త్వం పరం యోగినామ్
వృష్ణీనాంచపతిః సదైవ శుశుభే రంగేఽచ్యుతః సాగ్రజః ॥

శ్లో. నమో నారాయణాయేతి తస్మై వై మూలరూపిణే ।
నమస్కృత్య ప్రవక్ష్యామి నారాయణ కథామిమామ్ ॥

మల్లురకు వజ్రాయుధం వంటివాడును, నరులలో శ్రేష్ఠుడైన వాడును, స్త్రీలకు అందమైన ఆకారంగల మన్మథుని వంటివాడును, గోపాలురకు బంధువైనవాడును, దుష్టులైన రాజులను శిక్షించువాడును, తన తల్లితండ్రులకు శిశువు వంటివాడును, భోజపతియైన కంసునకు మృత్యువైనవాడును, బ్రహ్మకు మిక్కిలి హితమైనవాడును, యోగులకు పరతత్త్వమైనవాడును, వృష్ణివంశజులకు ప్రభువైనవాడును అయిన శ్రీకృష్ణుడు బలరామునితో కూడి జగన్నాటక రంగస్థలమందు ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉంటాడు. 'ఓం నమో నారాయణాయ' అనే మూలమంత్ర స్వరూపుడైనట్టి శ్రీకృష్ణపరమాత్మకు ప్రణమిల్లి "ప్రవక్ష్యామి నారాయణ కథా మిమామ్" అని పలికి ఈ బ్రహ్మకాండను ప్రవచించడానికి వ్యాసభగవానుడు ఉపక్రమించాడు. కావున, ఈ బ్రహ్మకాండకు "నారాయణ కథ" అనేపేరు కూడా ఉన్నట్లు విదితమౌతోంది.

మహాపుణ్యప్రదమైన నైమిశారణ్యంలో మహాత్ములు, బ్రహ్మవాదులునైన శౌనకాది మహర్షులు గొప్పదైన తపస్సుచేసారు. యజ్ఞేశ్వరుడు, జ్ఞానాత్మకుడైన నారాయణుని కొందరు జ్ఞానమార్గము చేతను, పరమభక్తితో పూజించారు, వారందరూ ధర్మార్థ కామమోక్షోపాయాలను తెలిసికోవాలనే ఆకాంక్షతో ఒకనాడు ఒక సభను ఏర్పాటు చేశారు. లోకానుగ్రహకారకులు, వీతరాగులునైన ఆ మహర్షులందరూ "విష్ణువు నందు మానవులకు స్థిరమైన భక్తి ఎలా సంభవిస్తుంది?' అని శౌనకుని ప్రశ్నించగా వారితో శౌనకుడిలా చెప్పాడు"పౌరాణికోత్తముడు, వ్యాసశిష్యుడు, యతీశ్వరుడు, సమస్తము తెలిసినవాడునైన సూతమహాముని సిద్ధాశ్రమంలో ఉన్నాడు. మనమందరము, మన సందేహాలనన్నింటిని ఆయననే అడుగుదామని" చెప్పగా వారందరూ శౌనకునితో కలసి సిద్ధాశ్రమానికి వెళ్ళి సూత మహామునికి నమస్కరించారు. "నరులకు శ్రీమహావిష్ణువు ఎలా ప్రసన్నుడౌతాడు? మానవులు విష్ణువును ఎలా పూజించాలి? అంతేగాక మోక్ష సాధన కారణమైన తత్త్వ నిర్ణయం కూడ తెలియజేయవలసిందని" శౌనకాది మహర్షులు సూతమహామునిని అడిగారు.

సూతమహాముని ముందుగా శ్రీమహావిష్ణువునకు నమస్కరించి, తదనంతరం క్రమంగా లక్ష్మికి, వాయువునకు నమస్కరించి, భారతికి, ఆదిశేషునకు, గురువైన వ్యాసునికి, కృష్ణునికి ప్రణమిల్లి "నాస్తి నారాయణసమం న భూతం న భవిష్యతి" అనే సత్యవాక్యంతోనే నేను సమస్త పురుషార్థాలను సాధిస్తున్నానని శౌనకాది మహర్షులకు తెలియజేశాడు.

అంతట శౌనకుడు “మునిశ్రేష్ఠా! గ్రంథాదియందు ఏ కారణంచే విష్ణువునకు నమస్కారం చేయాలి? అటు పిమ్మట లక్ష్మికి, అనంతరం వాయువునకు, తదనంతరం భారతికి, చిట్టచివర వ్యాసునకు ఏ కారణం చేత నమస్కరించావు? కారణాన్ని వివరించుమని” సూత మహాముని అడిగాడు. దానికి “సమస్త వేదములచేత తెలియజేయబడేవాడు, వేదములందు, శాస్త్రములందు, ఇతిహాసములందు, పురాణములందు కూడ విష్ణువొక్కడే 'సత్' శబ్దవాచ్యునిగా ప్రకాశింపబడే వాడగుటచే ముందుగా నమస్కరింపదగినవాడు హరియొక్కడే” అని సూతముని శౌనకునకు జవాబిచ్చాడు, అంతేగాక విష్ణువుతో సమానమైన దేవుడులేడు. వాయువుతో సమానమైన గురువులేడు. గంగతో సమానమైన పుణ్యతీర్థంలేదు. విష్ణుభక్తునితో సముడైన వేరొకభక్తుడు లేడని కూడ తెలియజేశాడు.

విష్ణువును ప్రతిపాదించే అన్ని పురాణాలు సాత్త్విక పురాణాలు, అట్టి సాత్త్విక పురాణాలలో హరికి ప్రియమైన ప్రధాన పురాణాలు మూడు మాత్రమే. ఆ మూడింటిలో కూడ ముఖ్యాతిముఖ్యమైనది భాగవత పురాణమనియు, అటుపిమ్మట విష్ణుపురాణమనియు, మూడవది గరుడపురాణమనియు తెలియజేయుటయేగాక గరుడపురాణంలో కొంత విశేషమున్నదని సూతమహాముని గరుడపురాణ విశిష్టత వివరించియున్నాడు. ఈ గరుడపురాణం మూడు అంశాలతో కూడుకొనియున్నది. మొదటి అంశం కర్మకాండ, రెండవ అంశం ధర్మకాండ, మూడవఅంశం బ్రహ్మకాండ. వీటిలో చివరిదైన బ్రహ్మకాండ మిక్కిలి శ్రేష్ఠమైనదనియు, ఈ కాండను వినడంవల్ల భాగవత శ్రవణ పుణ్యంతో సమానమైన ఫలం లభిస్తుందనే ఫలశ్రుతి కూడ ఈ సందర్భంగా వర్ణింపబడింది. అంతేగాక గరుడపురాణం శాస్త్రసమ్మతమైనదనియు, విష్ణుధర్మమును ప్రదర్శించుటలో గారుడంతో సమానమైన పురాణం లేదని కూడ ఈ సందర్భంలో సూత మహర్షిచే ప్రశంసింపబడింది. అంతేగాక తాను నమస్కరించిన క్రమానికిగల కారణాలను కూడ శౌనకాదులకు సూతమహర్షి వివరించడంతో మొదటి అధ్యాయం ముగిసింది. ఈ విధంగా సూత శౌనక సంవాదం రూపంలో ఈ అధ్యాయంలో 'గరుడపురాణ విశిష్టత, ప్రతిపాదిత అంశం' స్పష్టంగా తెలియజేయబడ్డాయి, తక్కిన బ్రహ్మకాండ అంతయు కృష్ణ గరుడసంవాద రూపంలోనే సాగింది.

బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతారతమ్య నిరూపణం, శ్రీమహావిష్ణువు యొక్క పరబ్రహ్మ తత్త్వ నిరూపణం 2వ అధ్యాయంలో వివరింపబడ్డాయి. భగవద్వీర్య స్వరూపం, దాని ఆధారం, గుణత్రయసృష్టి, జడేశభేదం మున్నగు అంశముల వర్ణన 3వ అధ్యాయంలోను, గుణవైషమ్య భేదం, బ్రహ్మదేవ స్వరూపం, గుణసామ్య నిరూపణం 4వ అధ్యాయంలోను వర్ణింపబడ్డాయి.

తత్త్వాభిమాన దేవతోత్పత్తి, వారితారతమ్య నిరూపణం 5వ అధ్యాయంలోను, తత్త్వాభిమాని దేవతల విష్ణుస్తుతి, వారి తారతమ్య నిరూపణం 6వ అధ్యాయంలోను వర్ణింపబడ్డాయి. ఈ సందర్భంగా లక్ష్మి, బ్రహ్మ, వాయువు, సరస్వతి మున్నగు దేవతలందరు విష్ణువును స్తుతించిన స్తోత్రములు ఈ అధ్యాయంలో మనకు లభ్యమౌతాయి. అట్లే ఇంద్రుడు, శచి, రతి, దక్షుడు, వరుణుడు, నారదుడు, భృగువు మున్నగు దేవతలు, మహర్షులు చేసిన విష్ణుస్తుతి 7వ అధ్యాయంలో వర్ణింపబడింది. మిత్ర, తార, నిర్‌ృతి, ప్రావహి, విష్వక్సేనుడు మున్నగువారు గావించిన విష్ణుస్తుతి 8వ అధ్యాయంలోను, ఆజానజులు, కర్మదేవతలు, గంధర్వులు మున్నగువారు గావించిన విష్ణుస్తుతి 9వ అధ్యాయంలోను వర్ణింపబడింది. ఈ విధంగా విష్ణుస్తుతి దేవతా తారతమ్యము సుమారుగా అయిదు అధ్యాయాలలో విస్తారంగా వర్ణింపబడింది.

బ్రహ్మాండాది వైకృతైక దేశప్రాకృత సృష్టినిరూపణం 10వ అధ్యాయంలోను, అజ్ఞాతహేతు నిరూపణం 11వ అధ్యాయంలోను, బ్రహ్మస్తుతి వర్ణనం 12వ అధ్యాయంలోను, దేవోత్పత్తి నిరూపణం 13వ అధ్యాయంలోను, వైశ్వదేవార్థకమైన సారాసార వస్తువివేకం 14వ అధ్యాయంలోను విస్తృతంగా వర్ణింపబడ్డాయి.

ఈశుడు, మహాత్ముడు, పురుషాఖ్యుడునైన హరి అవతారాలను ధరించడానికి ధ్యానమొనర్చాడు, అప్పుడు సమస్త సద్గుణ సముద్రుడు ప్రాదుర్భవించాడు. అతడే విష్ణువు అతడే బీజభూతుడు. ఆ విష్ణువే వాసుదేవుడయ్యాడు. సృష్టిచేయుటకు పురుషుడనే పేరుకలిగిన వాయువు యొక్క మాయ అనే చెప్పబడేదానియందు అతడు మూలరూపుడునైయున్నాడు. ఆ వాసుదేవుడే సమస్త సద్గుణ స్వరూపుడయిన సంకర్షణుడనే పేరుతో వాయువుకు జయ అనే ఆమెయందు సృష్టియొనర్చుటకై ప్రభవించాడు. ఆ సంకర్షణుడే ప్రద్యుమ్నుడనే పేరుతో విశ్రుతుడయ్యాడు. అతడే దేవితో కలిసి మూలరూపుడయ్యాడు, పదునారు కళలతో కూడుకున్న మహత్తత్త్వమును సృజించాడు, సూక్ష్మరూపం కూడ అతడే. ఆ దేవుడే అహంకార సహితుడై క్రీడించాడు.

పంచభూతాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు ఆ సంపూర్ణశక్తి కలిగినవాడే జీవులను సంగ్రహించి అనిరుద్ధుడనే పేరు కలిగినవాడయ్యాడు. ఆ ప్రభువే 'విరించి'మున్నగు సమస్త దేవతలను స్థూల దేహంతో సృజించాడు. అంతట పురుషుడనే పేరుగల ఆ విష్ణువే 'సనత్కుమారత్వమును' పొందాడు. అతడే ఎల్లప్పుడును పది ఇంద్రియాలను నిగ్రహించడం కోసమై ఇతరులకు సాధ్యంకాని బ్రహ్మచర్యాన్ని నిర్వహించి సనందనుడు మున్నగు పేర్లుకలిగిన వాడుగా చెప్పబడినాడు.

ఆ విష్ణువే భూమిని ఉద్ధరించడం కోసం, హిరణ్యాక్షుని సంహరించడం కోసం, సూకరత్వం పొందాడు. ఆ దేవుడు భూమిని స్థాపించడం కొరకే అలా అయ్యాడు. నాశనం లేనివాడైన ఆ విష్ణువే తపస్సు చేయుటకు, ఋషులకు జ్ఞానబోధ చేయుటకు, వేలకొలది అప్సరసలను తిరస్కరించుటకు 'నారాయణుడనే' పేరుతో బదరీవనంలో అవతరించాడు. మహాత్ముడైన హరి 'కపిలావతారమును' పొంది కాలబలంచే అంతర్ధానములైన తత్త్వాలను, 24 తత్త్వాలయందు శంకలను తొలగిపోవునట్లు ఉద్ధరిస్తూ ఆసురిని ఆజ్ఞాపించాడు.

ఆ మహా విష్ణువు అత్రి రూపుడై అనసూయయందు దత్తుడుగా అవతరించాడు. అతడు 'అలర్కుడు' అనువానికి 'అన్వీక్షికి' అనే పేరుగల తర్క విద్యనుపదేశించాడు. ఆ సచ్చిదానంద స్వరూపుడే సూర్యవంశంలో ఆకూతి యందుసుయజ్ఞునిగా అవతరించాడు. అతడు దేవతలతో కలిసి స్వాయంభువ మన్వంతరమంతటిని పాలించాడు. ఆ మహావిష్ణువే విద్యావంతులైన అభిమానులకు ఎల్లపుడును మిక్కిలి ఆశ్చర్యమును కలిగించువాడై, ఆగ్నీధ్ర పుత్రుడైన నాభికి, మేరు పుత్రియైన మేరుదేవియందు 'ఉరుక్రము'నిగా అవతరించాడు. సురాసురులు సముద్రమును మథించుచుండగా తన పృష్ఠభాగమున మందర పర్వతాన్ని ధరించి, బ్రహ్మాండమునంతటిని భరించడానికి శ్రీహరియే 'కూర్మ రూపము'ను స్వీకరించాడు, పిమ్మట హరి అపథ్య (రోగ) దోషాలను తొలగించడానికి, అమృత కుంభాన్ని చేతిలో ధరించి, ఆకుపచ్చని మణివంటి కాంతికల్గిన 'ధన్వంతరి' అనే పేరుతో ప్రాదుర్భవించాడు.

ఉన్మత్తులైన రాక్షసుల బలాన్ని చక్కగా వంచించడానికి 'మోహిని' అనే పేరుతో శోభాయుక్తమైన శరీరాన్ని శ్రీహరి స్వీకరించాడు. ఊరు ప్రదేశంలో హిరణ్యకశిపుని ఉంచుకొని, గోళ్ళతో చీల్చివేయుటకు హరి

'నృసింహు'డయ్యాడు. ఇంద్రునకు ఆధిపత్యాన్ని ఇచ్చి, రక్షించి, పాలించుటకై శ్రీమహావిష్ణువు కశ్యపుని వలన అదితియందు 'వామనుడు'గా అవతరించాడు.

బ్రహ్మద్వేషులైన క్షత్రియులను వధించి రాజులను లేకుండా చేయడం కొరకు 'పరశురాముని'గా అవతరించాడు. ఎనిమిదవ ద్వాపర యుగంలో వేదవిభాగం చేయడానికి విష్ణువు 'వ్యాసరూపుడై' పరాశరుని వలన సత్యవతియందు అవతరించాడు. సముద్రాదులతో విభేదించడానికి, రావణాదులను సంహరించడానికి సూర్యవంశంలో కౌసల్యయందు 'రాఘవుడై' ఆ హరి అవతరించాడు. కంసాదులను సంహరించడానికి, పాండవులను రక్షించడానికి, వసుదేవుని వలన దేవకియందు విష్ణువు 'కృష్ణరూపుడై' అవతరించాడు.

కలియుగం సంప్రాప్తిస్తూ ఉండగా, అసురులను సమ్మోహపరచడానికి కీకటులందు 'బుద్ధ'డనే పేరుతో పుట్టాడు. కలియుగ, కృతయుగ మధ్య సంధియందు దస్యుప్రాయులై భూమిని పాలించువారిని చంపుటకై విష్ణు గుప్తుని ఇంటిలో 'కల్కి' అనే పేరుతో హరి అవతరించగలడు. కేశవాదులు, సంకర్షణాదులు కలిసి ఇరవైనలుగురు, విశ్వాదులు వేలకొలది ఉన్నారు. వరాదులు అమిత సంఖ్యలోనున్నారు. ఈ విధంగా నారాయణుని అవతారాలు లెక్కలేనన్ని ఉన్నాయి. వారు అందరూ నారాయణులే అణుమాత్రం భేదంలేదు. బలంవల్లను, రూపంవల్లను, గుణంవల్లను, ఎప్పుడును అనంతుడైన విష్ణువు అనంతగుణ సంపూర్ణుడు ఈ విధంగా విష్ణువు అవతారాల నిరూపణం 15వ అధ్యాయంలో వర్ణింపబడింది.

మహాలక్ష్మీ అవతార నిరూపణం బ్రహ్మయొక్క స్వరూపాల వర్ణన, వాయుస్వరూపాల వర్ణన, భారతి అవతారాల వర్ణన విస్తారంగా 16వ అధ్యాయంలో చోటుచేసుకున్నాయి. భారతికి విశిష్టదేహ సంప్రాప్తికి గలకారణం 17వ అధ్యాయంలో వివరింపబడింది. శేషుని అవతారాలు రుద్రుని అవతారాలు, ఔర్వకారకుని వృత్తాంతం, రుద్రరోదనకు కారణం, ఆనంద నిర్ణయం, ఆనంద తారతమ్య నిరూపణం మున్నగు అంశాలు 18వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి.

"ఖగేంద్రా! దీపంనుండి వచ్చే అగ్నిజ్వాల శతగుణాలుగా ఉన్నప్పటికీ దీపంవలె మాత్రం ఉండదు. అగ్ని బహువిధాలుగా ప్రస్ఫుటమవుతున్నప్పటికీ సూర్యునివలె మాత్రం ఉండదు. ఏ విధంగా సూర్యుని కంటె చంద్రుడు రెండు గుణాలతో ప్రస్ఫుటించడో ఆనందతారతమ్యం కూడ ఆ విధంగానే తెలియజేయబడింది. అన్ని విశేషాలతో కూడుకొనియున్న నాయందున్న గుణాలను నేను గ్రహించగలను, మిక్కిలి సూక్ష్మ రూపాలను కూడ ఎల్లప్పుడు నేను గ్రహించగలను. నాకు గోచరింపనిదంటూ ఏదీలేదు" అని హరి సూక్ష్మాతి సూక్ష్మములైన వాటిని కూడ దర్శించగలిగిన జగత్ప్రభువు అనే విషయం స్పష్టంగా 19వ అధ్యాయంలో శ్రీహరియే స్వయంగా గరుత్మంతునకు తెలియజేసియున్నాడు. అంతేగాక "రుక్మిణి మున్నగు ఆరుగురు నాకు పట్ట మహిషులు, శ్రీదేవి వలె నీలాదేవి కూడ నా భార్యయే, ఆమె పూర్వసృష్టిలో హవ్యవాహనుని పుత్రి. పితరులలో ఒకడైన కవ్యవాహుడు ఆమెను పొందుటకు మిక్కిలి ప్రయత్నం చేసాడు. కాని ఆమె కన్యగా ఉండగానే కృష్ణపత్నిగా భావానుభూతిని పొందింది. నేను కృష్ణుని తక్క ఇతరుని భర్తగా ఇచ్ఛగింపజాలనని ఆమె తన తండ్రితో పలికి శేషాచలమునకు వెళ్ళింది. కపిలతీర్థము నుండి గొప్పదైన ఆ పర్వతమును అధిరోహించింది. అక్కడనున్న శ్రీనివాసుని దర్శించి, మూడు రోజులు ఉపవాసంచేసి, పాపవినాశనానికివెళ్ళి అక్కడ స్నానం చేసి, వివాహ సంకల్పం చేసికొన్నది. అక్కడికి ఉత్తర దిగ్భాగంలో

రెండు క్రోసుల దూరంలో ఉన్న ఒక గోతిలో ఏకాంతంగా గొప్పతపస్సు చేసింది. ఆ విధంగా వేయి దివ్య సంవత్సరాలు గడచిపోగా 'త్వమేవ మాతా చ పితా త్వమేవ... సమస్త దోషాలతో కూడుకొనియున్న నాకు నీ దర్శనం ఎట్లు చేకూరుతుంది? జగన్నివాసా! నన్నునుగ్రహించు' అని నీలాకుమారి శ్రీనివాసుని స్తుతింపగా శ్రీనివాసుడు ఆమె ఎదుట ప్రత్యక్షమయ్యాడు. వరము కోరుకొమ్మన్నాడు. అంతట నీలాకుమారి 'నేను నీకు భార్యను కావాలని మాధవుని ప్రార్థించింది. కృష్ణజన్మలో నీకు భర్తకాగలనని శ్రీనివాసుడు నీలాకుమారికి వరం అనుగ్రహించి అంతర్హితుడయ్యాడు. అక్కడే ఆ కుమారి తనదేహాన్ని విడిచి కుంభకుని ఇంటియందు 'నీల' అనేపేరుతో జన్మించి పితరులలో ప్రథముడైన కల్పవాహుని పొందింది. తదనంతరం ఆమె నాగ్నిజిత్తు యొక్క ఇంట కుమారిక గా జన్మించి 'నీల' అనే పేరు పొందింది. శివుని వరం వలన దేవమానవులచే బంధింపబడజాలని వృషభములను బంధించి, రాజులను జయించి, స్వయంవరంలో నీలను పొందాను" అని శ్రీకృష్ణుడు నీలను వివాహమాడిన వృత్తాంతాన్ని గరుడునకు వివరించాడు (19వ అధ్యాయంలో).

పూర్వ సృష్టిలో నలుడనే పేరుగలవానికి పుత్రికగా జన్మించినట్టియు, గుణములచే భద్ర అనుపేరు కలిగినట్టి ఆమె, విష్ణువునకు పత్నికావాలనే కోరికతో చిరకాలం హరికి ప్రదక్షిణం నమస్కారం గావించింది. శరీరాన్ని శుష్కింపజేసికొని హరికి దాసానుదాసురాలై, హరిచింతనతో శరీరాన్ని విడిచిపెట్టింది. ఆ భద్రయే, శ్రీకృష్ణుని తండ్రియైన వసుదేవునకు సోదరియగు శ్రుతకీర్తి గర్భంలో 'భద్ర' అను పేరుతో జన్మించి శ్రీకృష్ణుని పొందిన విధం 20వ అధ్యాయంలో వర్ణింపబడింది. ఈ సందర్భంగా హరికి ప్రణమిల్లుట, ప్రదక్షిణం చేయడం వల్ల కలిగే ఉత్తమగతులు గురించి వర్ణించబడింది. అంతేగాక హరి ప్రదక్షిణం, హరి నమస్కారం అనేది సూర్యునికిచ్చే అర్ఘ్యంతో సమానమైనదనియు, ఆ విధంగా చేయని మానవుల జన్మ వ్యర్థమనియు, అట్టివారిని యముడు రోటిలోవేసి, మిక్కిలి దుష్టులైన వారితో కలిసి పిండిచేస్తాడనియు ఈ సందర్భంగా నొక్కి వక్కాణింపబడింది.

ఇదే అధ్యాయంలో మిత్రవింద యొక్క వివాహమహోత్సవ కారణం కూడా వివరింపబడింది. ఈమె వసుదేవుని సోదరి యొక్క ఉదరంలో సుమిత్ర అనే పేరుతో జన్మించింది. ఈమె భాగవత కథా శ్రవణము, హరి నామాభివాంఛతో నిశ్చయంగా చిత్తమును శ్రవణమునందు మాత్రమే లగ్నంచేసి, ఆ శ్రవణం చేతనే హరిని మిత్రునిగా పొందింది. అందువలననే ఈమె మిత్రవింద అనే పేరు కలిగినదయ్యింది. స్వయంవరంలో ఆమె శ్రీకృష్ణుని వరించి శ్రీకృష్ణుని పత్ని అయ్యింది. పూర్వసర్గంలో కూడ ఈమె భూతలంలో దేహమున్నంత వరకు భాగవత కథాశ్రవణం హరినామ శ్రవణం మాత్రమే చేసి ఆ దేహాన్ని విడిచి ఇలా జన్మించి శ్రీకృష్ణుని పొందింది. ఈ సందర్భంగా భాగవత పురాణ శ్రవణం యొక్క మాహాత్మ్యం వివరింపబడింది. అంతమాత్రమేగాక హరిని పొందడానికి శ్రవణభక్తి కంటె వేరే సాధనం లేదని కూడ స్పష్టంగా ప్రతిపాదింపబడింది. అర్థలోభంతో భగవత్తత్త్వసారమైన పురాణాన్ని ఎవరు చెబుతారో, ఎవరు వింటారో వారికి యముడే గతి అని హెచ్చరించడమే గాక, స్వేచ్ఛగా వచ్చిన ధనంచే ఎవరు సంతుష్టులవుతారో వారే హరిని పొందడానికి సర్వదా యోగ్యులనే హితోపదేశం కూడ ఈ సందర్భంగా ఈ పురాణం అందిస్తోంది.

కృష్ణభగవానుడు కాళిందిని వివాహం చేసికొనుటకు గల కారణం 21వ అధ్యాయంలో వివరింపబడింది. ఈ సందర్భంగా "కాలింది అనుతాపంతో ప్రార్థించడం వలన ఆమెను అనుగ్రహించడం కోసమే ఆమెను వివాహమాడినాను గాని, సౌఖ్యంకోసం కాదని" శ్రీమహావిష్ణువు గరుత్మంతునకు స్పష్టంగా తెలియజేసియున్నాడు.

దీనినిబట్టి అనుతాపంతో మాత్రమే విష్ణువు ప్రసన్నుడౌతాడని స్పష్టంగా ఈ పురాణం ప్రతిపాదిస్తోందని చెప్పవచ్చును. ఆ అనుతాపం ఎలా ఉండాలో కూడ కాళింది ప్రార్థన ద్వారా ఈ ఘట్టంలో పాఠకులకు వివరింపబడింది.

లక్షణ వివాహ కారణ నిరూపణం 22వ అధ్యాయంలో వివరింపబడింది. ఈ సందర్భంగా హరిలోగల ముప్పైరెండు సులక్షణాలు వర్ణింపబడ్డాయి. బ్రహ్మాది ఇతర దేవతామూర్తులకు ఏయే లక్షణాలు తగ్గి ఎన్ని లక్షణాలున్నాయో కూడ చాలా విస్తారంగా వర్ణింపబడ్డాయి. అంతేగాక శారీరకంగా ఉండకూడని దుర్లక్షణాలు కూడా వర్ణింపబడ్డాయి. లక్షణయందు ఇరవై ఏడు లక్షణాలే ఉన్నప్పటికి ఆమె సులక్షణురాలుగా కీర్తింపబడింది. హరికి ప్రతినిత్యమూ ఆభరణాలు, అన్న వస్త్రాలు సమర్పించినచో మాధవుడనే పేరుగల హరి నిత్యమూ వాటిని గ్రహిస్తాడనియు, ఆ విధంగా అన్నాదికాలను సమర్పించినచో విష్ణువు ప్రీతుడై అట్టి గృహస్థు ఇంటిలో నిత్యుడై ఉండి, వారికి ప్రీతిని కలిగిస్తాడనియు తెలిసికొని ఆ విధంగా లక్షణాదేవి హరిని సంతోషపరచింది, సపర్యచేత, కర్మచేత హరియే తనకు పతికావాలని ధ్యానించి దేహాన్ని విడిచింది. మరుసటి జన్మలో మద్రరాజ పుత్రికగా, లక్షణాదేవిగా జన్మించడం చేత స్వయంవరంలో శ్రీకృష్ణుడు లక్ష్యాన్ని ఛేదించి, రాజులను తరిమి, లక్షణ పాణిగ్రహణం చేసినట్లుగా హరియే గరుడునకు తెలియజేసియున్నాడు, దీని ద్వారా సర్వసమర్పణ భావంతో హరికి ప్రీతిపాత్రులు కాగలరనే అంశం లోకానికి తెలియజేయబడింది.

'ఓ కృష్ణా! జాంబవతి ఏ విధమైన ఆరాధన చేసినందువల్ల నిన్ను పొందగలిగిందో తెలియజేయవలసిందని' గరుత్మంతుడు ప్రశ్నించగా సమాధానంగా శ్రీకృష్ణుడు జాంబవతి పూర్వజన్మలో సోముని పుత్రికగా సేవించిన విధానమే కారణమని తెలియజేసిన గాథ 23వ అధ్యాయంలో వర్ణింపబడింది. నిత్యం సత్పురాణాలు వినడం ద్వారా (శ్రవణ భక్తి) వైరాగ్యయుక్తులౌతారనియు, తద్వారా వాసుదేవునియందు ఏకాత్మత పొందుతారనియు, యాదృచ్ఛికంగా లభించిన దానితో జీవనవృత్తిని సాగిస్తూ, తన ఇంద్రియాలను, శరీరాంగాలను అన్నింటిని హరియందు మాత్రమే ఆయత్తం చేసి, నిష్కామబుద్ధితో ప్రవర్తించినచో హరి అనుగ్రహానికి పాత్రులుకాగలరనియు ఈ సందర్భంగా బోధింపబడింది. అంతేగాక ఊర్ధ్వరేతస్కులై సాలగ్రామంతో కూడి పాదచారులై, హరిగాథలు వింటూ అన్నార్తులకు అన్నదానంచేస్తూ తీర్థయాత్రలు కొనసాగించినచో సంపూర్ణఫలం పొందడానికి అర్హులౌతారని కూడ తెలియజేయబడింది. అంతేగాక హరియందు చిత్తానుసంధానం లేకుండా చేసిన ఎటువంటి కర్మయైనా వ్యర్థమనే హెచ్చరిక కూడా ఈ సందర్భంగా జారీచేయబడింది. జాంబవతి తన పూర్వజన్మలో 'శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాన్ని ఎప్పుడు దర్శించగలనో?' అనే తపనతో ధ్యానంతో పాదచారిణియై శేషాచలముపై ఉన్న శ్రీనివాసుని దర్శించుకొనిన విధానం శ్రీకృష్ణుడు ఈ అధ్యాయంలో గరుడునకు వివరించియున్నాడు, తద్వారా తిరుమల యాత్రా విధానం కూడ ఆ శ్రీనివాసుడే ఈ పురాణం ద్వారా లోకానికి వివరించినట్లయ్యింది. దీని ద్వారా వేంకటేశగిరి యాత్రా క్రమ నిరూపణం శ్రీనివాసుడే లోకానికి వివరించినట్లయ్యింది.

శ్రీవేంకటేశ్వరగిరి యొక్క ఆరోహణ క్రమం, శ్రీనివాసభక్తుల యొక్క స్వరూప నిరూపణం, కేశవ, నారాయణ, గోవింద, వాసుదేవ, మాధవ ఇత్యాది నామాలు ఏర్పడిన విధానం, తిరుమల వాసుడైన శ్రీనివాసుని దర్శనం, భూసమేత వరాహ స్వామి దర్శనం, ఏయే ఆవరణలో ఏయే దేవతలను ఏయేవిధంగా దర్శించాలో, శ్రీనివాసుని పీఠానికి దిక్కులన్నింటిలో ఏయే దేవతలను ఏయే విధంగా అర్చించాలో 24వ అధ్యాయంలో వివరింపబడింది.

ఇట్లు జైగీషవ్యుడు శాస్త్రవిధానంగా శ్రీనివాసుని దర్శించే విధానం కుమారికి బోధించగా ఆ దేవి మిక్కిలి సంతోషించి శ్రీనివాసుని దర్శనానికి బయలుదేరింది. ఆ దేవి కన్యలతో కలిసి శ్రీనివాసుని ద్వారదేశమునందలి స్వామి పుష్కరిణిని దర్శించింది. గురువు ఏ విధంగా ఉపదేశించాడో ఆ విధంగానే అచ్చట శ్రీనివాసుని పూజాదికం నిర్వహించింది. అంతట కుమారికి శ్రీనివాసుడు గొప్పదైన విగ్రహమందు తన స్వరూపం దర్శింపచేశాడు. దానితో కుమారి పులకలతో నిండిన శరీరం కలదై సంతోషించింది. విముక్తి ప్రసాదించి కాపాడమని అనేక విధాలుగా శ్రీనివాసుని స్తుతించింది. అంతట శ్రీనివాసుడు ప్రసన్నుడై "కుమారీ! ఇక్కడే మిక్కిలి భక్తితో రహస్యరూపమైన నా మంత్రమును చక్కగా జపించు" అని అదేశించి అతిరహస్యమైన వేంకటేశ మంత్రాన్ని శ్రీనివాసుడు కుమారికి ఉపదేశించి, తిరిగి విగ్రహంగా తన రూపాన్ని ప్రదర్శించాడు. ఆ దేవి శ్రీనివాసునికి నమస్కరించి, స్వామి పుష్కరిణి సమీపంలోనే ఉండిపోయింది. ఆ రోజున సమస్త బ్రాహ్మణులకు షడ్రసాన్నములతో సంతర్పణ చేసింది. ఆరోజు సాయంకాల సమయంలో శ్రీనివాసుని దర్శించి, ఉత్సవమూర్తి ఐన శ్రీనివాసునికి చక్కగా ప్రదక్షిణం చేసింది. శ్రీనివాసుని ఎదుట చప్పట్లు కొడుతూ, నా హస్తాలు సార్థకాలైనాయని పలుకుతూ, శ్రీనివాసుని సంతోష పరుస్తూ, ఆనందంతో తాను మునకలువేస్తూ తిరుమలతీర్థయాత్ర సఫలం చేసికొని జైగీషవ్యునితో కలిసి జైగీషవ్యుని ఆశ్రమానికి వెళ్ళిన పిదప, వేంకటేశమంత్రార్థమును, మంత్రావృత్తిని వివరించవలసిందని కుమారి జైగీషవ్యుని ప్రార్థించింది. అంతట జైగీషవ్యుడు వేంకటేశ మంత్రార్థాన్ని సవివరంగా తెలియజేసి, జపవిధానాన్ని కూడ తెలియజేసాడు. గురువాక్యాలను విని అక్కడనే రాత్రియందు నిద్రచేసి బ్రాహ్మీ ముహూర్తంలో మేల్గాంచి, హృదయంలో శ్రీనివాసుని స్మరించి, వేంకటేశ్వరునికి సుప్రభాతంతో స్తోత్రం చేసింది. (గరుడపురాణం – ఉత్తరఖండం – బ్రహ్మకాండ – 47 నుంచి 59వ శ్లో. వరకు) అనంతరం ఆ దేవి నిత్యకృత్యాలు తీర్చుకొని, జైగీషవ్యునితో కలసి స్వామి పుష్కరిణికి వెళ్ళి, స్నానమాచరించి, వేంకటేశుని మంత్రాన్ని భక్తితో జపించింది (ఇంతటితో 25వ అధ్యాయం ముగిసింది). ఈ సుప్రభాత స్తోత్రం, నేటి సుప్రభాత స్తోత్రం కంటే భిన్నమైనది.

తదనంతరం ఆ దేవి "శ్రీనివాసుడు ఎందు నిమిత్తం ఈ పర్వతానికి వచ్చాడు? శేషాచలం ఎక్కడ ఉంది? ఎప్పుడు ఇక్కడకు వచ్చింది? పాపాలను పోగొట్టే స్వామి పుష్కరిణి దేనికోసం ఇక్కడకు వచ్చింది? వివరించమని" జైగీషవ్యుని ప్రార్థించింది. అంతట జైగీషవ్యుడు ఆ దేవికి వేంకటేశుని రాక వేంకటేశశైలం యొక్క మాహాత్మ్యం సమగ్రంగా వివరించాడు. తండ్రియందు పితృత్వ బుద్ధి, పుత్రునియందు పుత్రత్వబుద్ధి, తల్లియందు మాతృత్వబుద్ధి, భర్తయందు భర్తృత్వబుద్ధి అంతా మిథ్యయే. ఎందువల్లనంటే హరియే సర్వమును నిర్మించేవాడు, రక్షించేవాడు. అందరికి ఎల్లప్పుడు హరియేతల్లి, మిగిలిన వారియొక్క మాతృత్వమనేది ఔపచారికం మాత్రమే. దేహమును పొందినవారికి పున్నామ నరకం నుండి రక్షించడానికి యోగ్యుడైన పుత్రరూపంలో ఉండేది పురాతనుడైన విష్ణువే. సర్వులను నరకం నుండి తరింపజేయువాడు విష్ణువు మాత్రమే వేరొక్కడు కాదు. భార్యాపుత్రులయందలి ప్రేమ అనే మాయను జ్ఞానమనే శస్త్రంచే ఛేదించి భక్తితో హరిస్మరణ చేయాలి. భక్తిపూర్వకంగా విష్ణునామస్మరణం, చేసినచో అది అన్ని విధాలా పాపాలను హరిస్తుంది. ఎవడు భక్తితో విష్ణునామ స్మరణం చేస్తాడో, అతడు పాపాలను పోగొట్టుకొనేవాడు అవుతాడు. ఈ కర్మభూమిలో మానవ జన్మదుర్లభమైనది. అందువలన అవకాశం వచ్చినప్పుడల్లా విష్ణుమూర్తి భజనం కర్తవ్యం. శ్రీనివాసుని పాదాలను సేవించి తీరాలి అనే హితోపదేశం ఈ సందర్భంలో లోకాలకు చేయబడింది. (26వ అధ్యాయం 9 నుండి 19వ శ్లోకం వరకు) అనంతరం వేంకటాచలం ఏ విధంగా ఇచ్చటకు

వచ్చిందో ఇలా వివరింపడింది. వైకుంఠ లోకంనుండి శేషుడనే పేరుకలిగిన పర్వతాన్ని అధిరోహించి పక్షీంద్రుని స్కంధంపై నుంచి, శ్రీమహావిష్ణువు స్వయంగా భూతలానికి వచ్చాడు. గరుడధ్వజుడైన హరి ఆ శేషాద్రిని భూతలంలో సువర్ణముఖీ తీరం మొదలుకొని, కృష్ణవేణి వరకు స్థాపనం చేశాడు. గిరియొక్క పుచ్ఛభాగం శ్రీశైలం, మధ్యభాగం అహోబిలం, ముఖభాగం శ్రీనివాస క్షేత్రంగా (తిరుమల) చెప్పబడుతోంది. గంగాది పుణ్యతీర్థాలన్నీ ఈ ప్రదేశమందు ఉన్నాయి. ఎవడు నిత్యం శ్రద్ధ, భక్తి కలిగినవాడై నిత్యం ఈ దేవుని సేవిస్తాడో, ఏయే కోరికలు కోరుకొంటాడో ఆయా కోరికలు అన్నివిధాలా పొందుతాడు. చింతించేది సాధింపబడుతుంది. కావున శ్రీనివాస క్షేత్రం చింతామణిగా పరిగణింపబడుతోంది. తిరుమల గిరియందుండే సరస్సులవల్ల తత్త్వార్థవిదులు దీనిని 'పుష్కరాద్రి' అని కూడా పిలుస్తారు. సువర్ణ స్వరూపంతో ఉండడంవల్ల ఈ పర్వతం 'కనకాద్రి' అని పిలువబడుతోంది. వైకుంఠం నుండి వచ్చిన కారణంచే 'వైకుంఠాద్రి' అని కూడ పిలువబడుతోంది. అమృతమై ఐశ్వర్యంతో కూడుకొన్నది గావున 'వేంకటాద్రి' అని పిలవబడుతోంది. వేంకటేశ శైలం యొక్క మాహాత్మ్యం సమగ్రంగా వర్ణించడానికి చతుర్ముఖుడు కూడా సమర్థుడు కాదని కుమారికి తెలియజేశాడు. అంతేగాక జైగీషవ్యుడు శ్రీ స్వామి పుష్కరిణి యొక్క మాహాత్మ్యాన్ని, స్వామి పుష్కరిణికి సమస్త దిక్కులందుగల సమస్త తీర్థముల మాహాత్మ్యం, ఆయా తీర్థాలలో ఏయే మూర్తిమత్వంతో ప్రకాశించే సాలగ్రామ దానం చేయాలో కూడ సమగ్రంగా ఆ దేవికి తెలియజేసియున్నాడు. ఆ విధంగా సాలగ్రామ శిలయందలి శ్రీహరి లక్షణాలను, దానఫలాన్ని వినడంవల్ల కూడా సాలగ్రామశిలాదానఫలం కలుగుతుందని కూడా మహర్షి తెలియజేసియున్నాడు. ఆ కన్యక ఈ విధంగా జైగీషవ్యునిచే చెప్పబడిన వ్రతనిష్ఠనుబూని స్వామి పుష్కరిణిలోను, తత్తీర తీర్థాలన్నింటిలోను స్నానమాచరిస్తూ, సాలగ్రామశిలాదానాలు చేస్తూ భక్తిపారవశ్యంతో అక్కడే ఇరవైయొక్క రోజులు నివాసం చేసింది (26వ అధ్యాయం దీనితో ముగిసింది). తదనంతరం ఆ దేవి పాపనాశనియైన నందానదిలో స్నానం చేయడానికి వెళ్ళింది. 'ఈ నది ఏమిపేరు గలది? ఈ నదీతీరంలో చేయదగిన పుణ్య కార్యాలేమిటి?' అని జైగీషవ్యుని ఆమె ప్రశ్నించగా, పాపాలను నశింపజేసే దీని గొప్పతనాన్ని ఇలా వివరించాడు.

"ఓ మహాభాగా! ఈ నది బ్రహ్మహత్యాది పాపాల సమూహాన్ని అంతటిని తొలగింపజేస్తుందనడానికి ఇక్కడ ప్రత్యక్ష నిదర్శనం గోచరమౌతూ ఉంటుంది. ఇక్కడ ఏ శుభ్రమైన నీరయితే ఉందో ఆ నీరు ఇక్కడ స్నానంచేయడానికి ఉపక్రమించేవారికి అశుభ్ర రూపంలో పాపాలతో కనబడుతూ ఉంటుంది. పాపాత్ముడు స్నానం చేసేటంత వరకూ కూడ ఆ నీరు అలాగే కనబడుతుంది. ఇందులో స్నానం చేసిన తరువాత కూడా శుభ్రమైన నీరు కనిపించకపోతే, స్నానంచేసినవారి పాపంనశించలేదని, శుద్ధోదకాలు వచ్చినట్లయితే వారి పాపంనశించిందని నిశ్చయం. గురుభార్యను పొందిన చంద్రుడు, అహల్యను పొందిన ఇంద్రుడు ఇక్కడ స్నానంచేసి పాపవిముక్తులైనారని" జైగీషవ్యుడు ఆ దేవికి తెలియజేయగా, ఆ కన్యక విధివిధానంగా 'పాపనాశని'లో స్నానం చేసి, వేంకటేశ మహామంత్రాన్ని జపించి, వస్త్రాలంకారాలతో బ్రాహ్మణులను సంతృప్తిపరచి అక్కడినుండి 'కుమారీ' తీర్థానికి వెళ్ళింది. కుమారీ తీర్థ మహాత్మ్యం కూడ విని, అక్కడ స్నానంచేసింది. తదనంతరం ఆమె 'విరజానది యొక్క మధ్య ప్రదేశానికి' వెళ్ళింది. అది గంగానదియనియు, భూమిలోపలిభాగం నుండి వస్తోందనియు, అది 'అంతర్గంగ' అని పిలువబడుతోందనియు, ఇందలి జలము శ్రీనివాసునకు మిక్కిలి ప్రీతిపాత్రమైనదినియు తెలిసికొని అక్కడ స్నానం, దానంచేసి, వేంకటేశ మంత్రం జపించింది. తదనంతరం ఆమె శ్రీనివాసుని ఆలయం చేరుకొని భక్తితో 'అంగ ప్రదక్షిణం' చేసింది. ఆ మరునాడు ఉదయం మళ్ళీ స్వామి పుష్కరిణిలో స్నానమాడి 'తుంబురుక తీర్థం'లో స్నానంచేయడానికి వెళ్ళింది.

ఆ తీర్థంయొక్క మాహాత్మ్యం వివరించవలసినదిగా ఆమె జైగీషవ్యుని ప్రశ్నించింది. 'వరవర్ణినియైన తుంబురుక' అనే పేరుగల ఒకామె ఇక్కడ ఉండడంచేత ఈ తీర్థానికి 'తుంబురుక తీర్థం' అనే పేరు వచ్చిందనియు, పూర్వం తుంబురునితో కలసి ఇక్కడ నారదుడు తపస్సు చేశాడనియు, నారదునికి మేలు కలిగించడానికి విష్ణువు ఇక్కడ ప్రాదుర్భవించాడనియు జైగీషవ్యుడు ఆమెకు తెలియజేశాడు. అంతమాత్రమే గాక మానవులకు ఇక్కడ స్నానంచేసే అవకాశం కొద్దిపాటి తపస్సువల్ల లభించేదికాదనికూడా తెలియజేశాడు. దానితో ఆమె అక్కడ స్నానాదులు ఆచరించి తిరిగి శ్రీనివాసుని సన్నిధికి వచ్చింది. స్వామి పుష్కరిణి మెట్లపై దీపాలను వరుసగా వెలిగించి శ్రీనివాసుని ప్రీతికి పాత్రురాలయ్యింది.

ఆ మరునాడు ఆమె 'శక్రతీర్థానికి' అక్కడనుండి 'విష్వక్సేన సరస్సు'కు వెళ్ళి అక్కడి పంచాయుధ తీర్థాలను సందర్శించి, స్నానంచేసింది. దానికి పైన ఉన్న 'బ్రహ్మతీర్థం', ఆపై ఉన్న సప్తర్షుల పుణ్యతీర్థాలను దర్శించింది. దివ్యమైన ఆ 'ఋషి తీర్థాలలో' తన అవతారం పూర్తి అయ్యేవరకు ఉత్తమమైన తపస్సు ఆచరించింది. ఆమె యోగధారణచే దేహాన్ని విడిచి జాంబవంతుని గృహంలో జాంబవతి అనే పేరుతో పుట్టి, పెరిగి, శ్రీకృష్ణునకు భార్య అయ్యింది. ఈ విధంగా కన్యక (జాంబవతి) చేసిన తిరుమలగిరులలోని నానాతీర్థయాత్రాది నిరూపణం 27వ అధ్యాయంలో వర్ణింపబడింది.

"వేంకటేశ్వరునకు నైవేద్యం ఎల్లప్పుడూ లక్ష్మీదేవి చేస్తుందని, బ్రహ్మ నిత్యమూ పూజిస్తాడని శాస్త్ర నిర్ణయం. వేంకటేశ్వరుని నైవేద్యాన్ని భక్షించేవారిని అపహాస్యం చేయరాదనియు, అట్టి నైవేద్య ప్రాశన లేనివారు నరకగతిని పొందుతారనియు" వేంకటేశ్వరుని ప్రసాదం యొక్క మాహాత్మ్యం కూడ వివరింపబడింది. "శ్రీనివాసాత్పరో దేవో న భూతో న భవిష్యతి – శ్రీనివాసునికంటె వేరైన దైవము పూర్వమునందు లేదు, భవిష్యత్కాలమందు ఉండదు" అనియు, తిరుమల శ్రీనివాసుడే పరబ్రహ్మమనియు, ఈ సందర్భంగా గరుడపురాణం ఘంటాపథంగా ప్రకటిస్తోంది. అనంతరం వివిధ దేవతామూర్తుల తారతమ్య నిరూపణం శ్రీకృష్ణునిచే వివరింపబడింది. పదునాల్గురు ఇంద్రులలో ఏడోవాడు పురందరుడు, వృత్రుడు నున్నగువారియొక్క శరీరం పురమనియు, దానిని వజ్రంతో చీల్చుటవలన పురందరుడయ్యాడని చెప్పబడింది. అదేవిధంగా ఆరోవాడు 'మంత్రద్యుమ్నుడు'. ఇతడు ఎనిమిది మంత్రాలను నిర్మించి వెల్లడిచేసిన కారణం వల్ల మంత్రద్యుమ్నుడయ్యాడు. కుంతీపుత్రుడైన అర్జునుడు మంత్రద్యుమ్నుని యొక్క అవతారమయ్యాడు. వారు పురందరుడని, గాధి, వికుక్షి, కుశుడు అని వీరందరు ఇంద్రులుగాను కీర్తింపబడ్డారు.

కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుడు కాముడుగా పేర్కొనబడ్డాడు. అతడే రాముని సోదరుడైన భరతుడు. ప్రద్యుమ్నుడు, భరతుడు, సుదర్శనుడు, సాంబుడు, స్కందుడు, సనత్కుమారుడు ఈ ఆరుగురు కామరూపకులు, వారిలోపల కాముడు ఇంద్రునికంటె తక్కువవాడుగా చెప్పబడుతున్నాడు. ఇంద్రుడు, కాముడు కూడ ఉమాదుల కంటె పదిపాళ్ళు తక్కువవారు. ప్రాణమే అహంకారం, అది గరుత్మంతుని అంశగా తెలియజేయబడుతోంది. ఇది కాముని కంటె, ఇంద్రునికంటె పదిపాళ్ళు తక్కువదనం కలది. కాముని కుమారుడైన అనిరుద్ధుడు హరికంటె వేరుగా చెప్పబడుతున్నాడు, ఇతడే భూలోకంలో హరిసేవచేయడానికి రామానుజుడుగా జన్మించాడు.

దేవేంద్రుని భార్యయైన 'శచి' రామావతార సమయంలో 'తార' అనే పేరుకలిగి వాలికి పత్ని అయ్యింది. కృష్ణావతార సమయంలో ఆ తారయే 'పిశంగద' అనే పేరుతో జన్మించి 'అర్జునునితో సాంగత్యం పొంది

బభ్రువాహనునకు తల్లి అయ్యింది. శచి, రతి, అనిరుద్ధుడు, మనువు, దక్షుడు, బృహస్పతి వీరు ఆరుగురు పరస్పరం సమానులుగా చెప్పబడ్డారు. వీరు 'అహంకారం' కంటె పదిపాళ్ళు తక్కువవారు. 'లక్ష్మి', బ్రహ్మ, శివుడు, గౌరి, పౌలోమ మున్నగువారెవరూ స్వతంత్రులుకారు. ఈ లోకంలో స్వతంత్రుడన్నవాడు లేడు. 'విష్ణువే పురుషుడు సత్యం పునః సత్యం' జీవుడు సత్యుడు, పరమాత్మ సత్యుడు, వారికి భేదము సత్యము ఇదంతా ఎల్లప్పుడు సత్యము. జడము సత్యమే, జీవ జడ భేదము సత్యము. అంతేగాక 'ద్వయం' యొక్క స్వరూపాన్ని పూర్తిగా తెలిసికొని, దానిని స్వీకరించు. నిత్యము స్నానాదికాన్ని, భార్యాద్వయాన్ని చక్కగా ఆచరించాలి. నిత్యము అట్లు చేయని పాపాత్ముడు మోక్షాన్ని పొందలేడు.

భార్యాద్వయమును, వాటి స్వరూపం తెలియకుండ ఒక దానిని స్వీకరించి, వేరొకదానిని పూర్తిగా విడిచిపెట్టి, మూఢబుద్ధితో చేసే కర్మలు వ్యర్థం. దానివలన మోక్షం, భోగం రెండూ చేకూరవు. ప్రతిజీవికీ భార్యాద్వయం 'బుద్ధి'. ఆమె రెండు రూపాలు కలది. ఒకటి దుష్టమైనది, రెండవది మిక్కిలి మంచిది, వాటిలో దుష్టరూపమైనది రెండవది తక్కువది. మంచిబుద్ధిరూపంలో ఉండేది మొదటిది శ్రేష్ఠమైనది. జీవుడు తక్కువదానిచేత నష్టం పొందుతాడు. తక్కువ దానియందు త్యాగబుద్ధిని ఆచరించు, తక్కువదైన దుష్టబుద్ధి సంగమాన్ని మిక్కిలి దూరంలో విడిచిపెట్టి, నీవెల్లప్పుడూ మిక్కిలి గొప్పదైన యజనాది కృత్యాలను ఆచరించు. సుబుద్ధిరూపమైన పెద్ద భార్యయు 'మిక్కిలి భక్తితో సేవించు' అని ప్రేరేపిస్తూ ఉంటుంది.

నిత్యము హరిని విడిచి వేరొకరిని భజించవద్దు. ఆ హరియే 'అదృష్టం' అనే పేరుతో ఉంటాడు, అయినా కంటికి కనబడనిది, లేనట్లుండేది ఆ 'అదృష్టమే' అదియే హరి. శ్రుతులందు చెప్పబడనిది, జీవునకు ద్రోహం చేసేది, జుగుప్స కలిగించేది అయిన చిన్న భార్యను (దుష్టబుద్ధిని) సేవించి, ఆమె అనుగ్రహం వల్ల, కుష్ఠరోగం, భగంధరం మున్నగు వాటిచే దుఃఖం అనుభవించి యమరాజధానికి ప్రయాణం కావద్దు. కాబట్టి ఓ జీవుడా! నీవు ఆ భార్యను సేవించవద్దు. సంసారదుఃఖం నుండి తరింపజేసే చక్కని రూపంతో ఉండే బ్రాహ్మణులను, వైష్ణవులను నీవు భజించు. సత్యుడైన విష్ణువు యొక్క సేవాదికాలను వదలి, మాయాదేవిని భజించడం వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. యమబాధలకు గురియౌతాడు. అందువల్ల విష్ణువు యొక్క పాదమూలాన్ని భజించు.

సమస్త దుఃఖాల నుండి తరింపజేసే, పరమదైవమైన నారాయణుని పూజించు. మిక్కిలి తక్కువయైన దేవతలయందు బుద్ధిని లగ్నం చేయవద్దు. అట్లే సారంలేని మాటలను వినవద్దు. మిక్కిలి క్షుద్రదేవతలను, దూరంగావిడిచిపెట్టి, స్వకులాచార ధర్మాన్ని శిరసా ధరించి, నరకానికి కారణభూతమైన దానిని దూరంగా పడవేయుము. హృదయంలో శాశ్వతంగా ఉండిపోయిన మూర్ఖ ముద్రను విడిచిపెట్టి, విష్ణుముద్రలచే శ్రేష్ఠమైన భూషణములు ధరించి, పవిత్ర గంగలో స్నానమాడి, అష్టాక్షరీ మంత్రాలతో ఎల్లప్పుడు శరీరాన్ని పవిత్రం గావించుకొనుము. బుద్ధిమంతుడవై హరి ప్రసంగాన్ని సేవించు. సద్వైష్ణవుల యొక్క సంగమం దుర్లభం! తారతమ్య స్వరూపంతో జ్ఞానం క్షుబ్ధమవుతుంది (కలతపెట్టబడింది).

గురువైన హరిని అనుసరించి, అతనివలన స్వస్వరూపమైన సత్యగతిని తెలిసికొనుము. దుష్టబుద్ధిని ఈ భావనతో దహింపజేసుకొని, నిత్యమూ సుబుద్ధి రూపాన్ని సేవించు. సద్గురువును కూడపొంది, నాతో కలిసి, వైరాగ్య ప్రధానమైన తత్త్వ లక్షణమును తెలిసికొని, దానితో మోక్షమును పొందుము. అది విష్ణువు యొక్క గొప్ప

అనుగ్రహం వల్లనే వస్తుంది. తక్కిన దేవతల వల్లవచ్చేదికాదు. విష్ణువు యొక్క గొప్ప అనుగ్రహం వల్లనే లక్ష్మికి కూడ ఆ శక్తి ఉంది, అట్టివాడు మాత్రమే నా భక్తశ్రేష్ఠుడని చెప్పబడతాడు. ఈ విధంగా శ్రీకృష్ణుడు గరుత్మంతునకు విష్ణువే ఉపాస్యమనే తత్త్వాన్ని, ఇతర దేవతల తారతమ్య నిరూపణ ద్వారా సవిస్తరంగా తెలియజేసి యున్నాడు (28వ అధ్యాయంలో).

శ్రీకృష్ణుడు గరుత్మంతునకు ప్రవహుని తరువాత పుట్టినవారి గురించి వివరింపసాగాడు (29వ అధ్యాయంలో). ఆది సృష్టియందు బ్రహ్మ కుమారుడై త్వక్కు నుండి ధర్ముడు ఉద్భవించాడు. అతడే సూర్యుని పుత్రుడయ్యాడు. సజ్జనులను సౌమ్యరూపంతో ధరించడంవల్ల 'ధర్ముడు' అనియు, పాపులను శిక్షించడంవల్ల 'యముడు' అనియు పేర్కొనబడ్డాడు. జ్ఞాన స్వరూపాన్ని ఇచ్చే విష్ణువును ఎల్లప్పుడు యముడు తెలిసికొనియున్నాడు. గంగ ఎల్లప్పుడు లోకాలను పవిత్రం చేసేదిగా చెప్పబడుతోంది. 'విష్ణుపది' అని కూడ కీర్తింపబడుతోంది, ఈ గంగను సేవించినచో క్రమంగా మోక్షాన్ని పొందుతాడు. భాగీరథి హరిపాద చిహ్నాలతో కూడినదని తెలిసికొనిన ఇంద్రుడు మిక్కిలి ఉత్కృష్టులైన భాగవతులలో ప్రధానమైన వాడయ్యాడు. మిక్కిలి ప్రీతితో కూడిన హరిభక్తితో ప్రసన్న హృదయుడై గంగను తన శిరస్సున ధరించి, మిక్కిలి అశివుడైనవాడు, శివుడయ్యాడు.

భాగీరథికి నాలుగు రూపాలున్నాయి. మహాభిషుడు అనే పేరుగల రాజేంద్రుని భార్య గంగయే. రెండవ రూపంలో గంగ శంతనుమహారాజునకు భార్య అయ్యింది. సుషేణుని భార్య అయిన సుషేణ అనేపేరుగల వానరకాంత గంగగా స్మరింపబడుతోంది. మండూకుని భార్యయైన మండూకిని కూడ గంగగానే పేర్కొనబడింది. ఆదిత్యుని వలన గంగ నుండి పర్జన్యుడు ఏర్పడినాడు. గొప్పదైన వైరాగ్యం మిక్కిలి వర్షించేవాడౌటటే 'పర్జన్యుడు' అనే పేరుగల వాడయ్యాడు. సర్వదా వైరాగ్యం కోసం సేవనం చేయాలి కాని విషయాలపై ప్రీతికలిగి ఉండరాదు. ఎల్లప్పుడు లింగాన్ని దేహయాత్రకై పుష్టిగానే ఉంచాలి. కాని ఎల్లప్పుడు యోని యందు ఆసక్తి చూపరాదు. యోనియందు ఆసక్తి విడిచిపెడితే అసంగత్వం వల్ల ముక్తిని పొందుతాడు. యముని భార్య అయిన శ్యామల ఎల్లప్పుడు కలికి ప్రియమైన భార్య. చక్కగా ఆలోచించి మానసికక్రియ ఎవ్వతె చేస్తుందో ఆమెయే శ్యామల అని పేరు పొందుతుంది.

హరిభక్తి విహీనులైనవారు ఉన్నతులు కారు. ఎప్పుడూ వారితో సాంగత్యం చేయదగింది కాదు. పాతకాలం నాటి తాళవృక్షాన్ని, పాతదైన వస్త్రాన్ని, మిక్కిలి చినిగిపోయిన బొంత, లేడిచర్మం, మేఖల, జీర్ణయజ్ఞోపవీతం, సాలెగూళ్ళచే చాందినిగా కప్పబడినది, చితికిపోయిన సమిధలు, దర్భలు, వీటితో నిండిన ఇల్లు కలికి ప్రియమైనది. పులిసిన మజ్జిగ, రసహీన పదార్థం, మిక్కిలికారం, ఎక్కువవేడి కలిగిన పదార్థాలు కలి భార్యకు ప్రియమైనవి. మిక్కిలి చెడ్డదైన ముఖం కలిగినది, పూజ్యులవల్ల పుట్టిన వారిని నిందించడం, సత్పురుషులను నిందించడం, భర్తకు సంబంధించిన వారిని మిక్కిలిగా పీడించడం, ఇంటిలోని ధాన్యం, వస్త్రాదులను దొంగిలించడం, చేతులందు వ్రేలాడుతున్న వెంట్రుకలు కలిగియుండడం ఇవన్నీ 'కలి'కి ప్రియమైనవి. ఇటువంటి వాటినన్నింటిని మిక్కిలి నిర్మలంగా చేయడం చేత ఆమె 'శ్యామల' అనే పేరు పొందింది. ఆమెయే దేవకిగా జన్మించింది. ఆమె యుధిష్ఠిరునకు పత్ని అయ్యింది. అక్కడ ఆ దేవకి అత్యంతం పూజింపబడింది.

గంగ మున్నగువారు ఆరుగురు ఎల్లప్పుడూ సమానులే. వారిలో ఉత్తమత్వమూలేదు, అధమత్వమూ లేదు. వీరిని గురించి తెలుసుకోవడం వల్ల నిత్యం పుణ్యాన్ని పొందేవాడౌతాడు. ఎల్లప్పుడూ హరి యొక్క సంపూర్ణమైన

ప్రీతిని పొందుతాడు. అగ్ని భార్యయైన స్వాహా దేవి గంగాదుల కన్న తక్కువదైనను, గుణములను అనుసరించి మాత్రం తక్కువదైనదికాదు. అగ్నికి భార్యవలన బుద్ధిమంతుడైన కుమారుడు కలిగాడు. అతడే బుధుడు, విశ్వములో పుట్టినదానినంతను బుద్ధిచే గ్రహించి ధరించేవాడు కావున బుధుడనే పేరు పొందాడు. అతడే అర్జునునికి 'అభిమన్యుడు'గా జన్మించాడు. కృష్ణుని యొక్కయు, చంద్రుని యొక్కయు, యముని యొక్కయు, అశ్వినుల యొక్కయు, హరుని యొక్కయు అంశలతో కూడుకొన్న వాడతడు. బుధుడు స్వాహా దేవికన్న తక్కువవాడైనను, విష్ణుదేవుని పాదారవిందాలయందు భక్తి కలిగినవాడు.

అశ్విని భార్య 'ఉష' అనే పేరుతో సార్థకనామం కలది. ఆమె బుధునికన్న తక్కువది. స్వాహాకన్న పదిపాళ్ళు తక్కువది. నకులుని భార్య మాగధుని కుమార్తె, సహదేవుని భార్య శల్యుని కుమార్తె. ఉషయు, ఆరురెట్లు ఎక్కువగా ఆద్యుడైన విష్ణువును ఉపాసిస్తారు. పృథివి ఆత్మగాగల శక్తి ఎల్లప్పుడు నెమ్మదిగా సంచరిస్తుంది. అందువల్ల శనైశ్చరుడనే పేరు వచ్చింది. ఇటువంటివారు ఉషకన్న పదిపాళ్ళు తక్కువవారు. 'కర్మ' ఆత్మగా కలిగినవాడు పుష్కరుడని చెప్పబడినాడు. నిత్యం పుష్కరం (నీటి)లో క్రీడించే కారణంవల్ల హరికి సంప్రీతి కలుగజేసే వాడయ్యాడు.

హరికి సంప్రీతిని కలిగించే ధర్మాలు శ్రీకృష్ణుడే స్వయంగా గరుత్మంతునికి ఇలా బోధించాడు. "ప్రభాత సమయంలోనే లేచి నారాయణుడైన హరిని స్మరించాలి. తులసికి వందనం చేయాలి. మలమూత్ర విసర్జన కాలంలో అపానానికి ఆత్మయైన కేశవుని భావించాలి. శౌచ సమయంలో గంగానదీ జలాలను పాన యోగ్యంగా చేసిన త్రివిక్రముడైన హరిని, పండ్లు తోముకునే సమయంలో చంద్రుని అంతరాత్మయైన హరిని స్మరించాలి. ముఖం కడుగుకొనే సమయంలో మాధవుని స్మరించాలి. గోవులను కాసే సమయంలో గోవర్ధనధారియైన హరిని స్మరించాలి. ఆవుపాలు పితికే సమయంలో గోపాల వల్లభుని స్మరించాలి. ఎవని ఇంటిలో ఉత్తమమైన గోవు ఉండదో, ఎవరి ముంగిలిలో తులసి ఉండదో, ఎవరి ఇంటిలో దేవుని మహోత్సవం ఉండదో, ఎవని ఇంటిలో విష్ణుగాథలను శ్రవణం చేయరో, ఆ ఇంటిలో సంసర్గం వల్ల దుఃఖాలను పొందుతారు. గోస్పర్శనం చేయనివాని, ఆవుపాలు పితకడం తెలియని, గోవులను పోషించడం చేయని వానియొక్క జన్మవ్యర్థం. పిల్లవాని స్తనపాన సమయంలో బాలకృష్ణుని స్మరించాలి. పెరుగును చిలికే వేళ ఆధారమైన మంధర పర్వతాన్ని స్మరించాలి. మృత్తికా స్నాన సమయంలో వరాహమూర్తియైన హరిని స్మరించాలి. ఊర్ధ్వపుండ్ర ధారణ సమయంలో కేశవాది 12మందిని స్మరించాలి. ముద్రలను ధరించే సమయంలో శంఖ చక్ర గదాధారియైన విష్ణువును స్మరించాలి. పద్మం, నారాయణి మున్నగు ముద్రలను స్మరించాలి. క్రోధ సమయంలో ఉల్కాదులను స్మరించాలి. సంధ్యాసమయంలో శ్రీరాముని స్మరించాలి. శ్రాద్ధసమయంలో అచ్యుతుని, అనంతుని, గోవిందుని స్మరించాలి. ప్రాణాదికాలపంచహోమాది వేళ అనిరుద్ధాదులను స్మరించాలి. అన్నాదులను సమర్పించే సమయంలో వాసుదేవుని స్మరించాలి. ఆపోశనం సమయంలో వాయువులో ఉన్న హరిని, వస్త్రధారణ సమయంలో ఉపేంద్రుడైన హరిని స్మరించాలి. యజ్ఞోపవీతం ధరించే సమయంలో వాసుదేవుడనే పేరుగల నారాయణుని స్మరించాలి. హారతి సమయంలో విష్ణువును స్మరించాలి. ప్రధానంగా పరశురాముడనే పేరుగల విష్ణువును స్మరించాలి. ఆపోశనమందు, వైశ్యదేవ సమయంలోను, హోమాది క్రియలలోను, భస్మధారణ సమయంలోను, జమదగ్ని పుత్రుడైన పరశురాముడనే పేరుగల నారాయణుని స్మరించాలి. ముమ్మారు తీర్థాన్ని స్వీకరించే సమయంలో వరుసగా కృష్ణుని, రాముని, వ్యాసదేవుని స్మరించాలి. అన్నాన్ని ఆరగించే సమయంలో ముద్దముద్దకు గోవిందుడనే పేరుగల విష్ణువును స్మరించడం కర్తవ్యం.

ఒకే ఒక భక్ష్యాన్ని తినే సమయంలో భక్తితో అచ్యుతుని స్మరించాలి. శాకాదులను భక్షించే సమయంలో నిత్యం ధన్వంతరిని స్మరించాలి. అదే విధంగా పరాన్నమును భుజించే సమయంలో భక్తితో పాండురంగవిభుని స్మరించాలి. వెన్నతో కలిపిన అన్నం తినే సమయంలో చక్కగా తాండవ కృష్ణునిగా పేరొందిన హరిని స్మరించాలి. పెరుగు అన్నం భక్షించే సమయంలో పరమపురుషుడైన గోపాలకృష్ణుని స్మరించాలి. పాలు అన్నం ఆరగించే సమయంలో శ్రీనివాసుడైన హరిని స్మరించాలి. శుభ్రమైన నూనె, నేయితో వండిన భక్ష్యాలను భుజించే సమయంలో వేంకటేశ్వరుని స్మరించాలి. ద్రాక్ష, నేరేడు, అరటి, తియ్యని మామిడి, నారింజ, దానిమ్మ, నారికేలం, రంభాఫలం, ఉసిరికాయలను భుజించే సమయంలో బాలకృష్ణుని స్మరించాలి. పానకాన్ని పానం చేసే సమయంలో భక్తితో నారసింహుడనబడే విష్ణువును స్మరించాలి. గంగామృతాన్ని పానంచేసే కాలంలో గంగాజనకుడైన విష్ణువును స్మరించాలి. ప్రయాణం చేసే సమయంలో గరుత్మంతుడు వాహనంగాగల విశ్వరూపుడు, నిర్గుణుడైన నారాయణుని స్మరించాలి. తన బిడ్డలను ముద్దుబెట్టుకొనే సమయంలో పిల్లనగ్రోవి చేతియందుగల కృష్ణుని స్మరించాలి. తన భార్యతో సంగమించే సమయంలో నిత్యము గోపికాస్తనయుగ్మ విలాసియైన హరిని స్మరించాలి. తాంబూల సేవన సమయంలో ప్రద్యుమ్నుడని పిలువబడే హరిని స్మరించాలి. పరుండే సమయంలో సంకర్షణుడని పిలువబడే హరిని స్మరించాలి.

నిద్రాకాలంలో పద్మనాభుని స్మరించాలి. కథా కాలక్షేపసమయంలో వ్యాసరూపుడైన హరిని స్మరించాలి. పాటపాడే సమయంలో పిల్లనగ్రోవిని మ్రోయించే కృష్ణుని స్మరిస్తూ ఉండాలి. తులసిని కోసే సమయంలో 'శ్రీరామ రామ' అని స్మరించాలి. పుష్పాదులను కోసే సమయంలో కపిలుడని చెప్పబడే హరిని భక్తితో స్మరించాలి. ప్రదక్షిణం చేసే సమయంలో గరుడాంతర్గతుడైన హరిని స్మరించాలి. ప్రణామం చేసే సమయంలో శేషాంతస్థుడైన విష్ణువును, నీతినుపదేశించే సమయంలో 'నారసింహుడైన' నారాయణుని భక్తితో స్మరించాలి. కర్మల పూర్తి జరిగిన సమయంలో వాసుదేవుడైన హరిని భక్తితో స్మరించాలి. ఈ విధంగా చేసిన కర్మలు హరికి ప్రీతిని కలిగించేవి. హరిభక్తుడైన పుష్కరుడు ఈ కర్మలను చక్కగా, భక్తిగా చేస్తూ ఉంటాడు. అందువల్ల సాటిలేని పుష్కరాఖ్యానమైన కర్మను శ్రీకృష్ణుడు గరుత్మంతునికి తెలియజేశాడు. ఈ విధంగా శ్రీవిష్ణుతత్త్వరహస్యాన్ని వివరించడమే గాక, శ్రీమహావిష్ణువునకు ప్రీతికరమైనవి, మానవులందరు సర్వత్ర, సర్వదా, సర్వ కార్యాలలో స్మరింపవలసిన హరినామాలను శ్రీకృష్ణుడు గరుత్మంతునికి వివరించడంతో గరుడమహాపురాణంలోని ఉత్తరఖండంలో తృతీయాంశంలో బ్రహ్మకాండం సమాప్తమయ్యింది. ఈ బ్రహ్మకాండ 1974 శ్లోకాలతో 29 అధ్యాయాలలో వ్యాసునిచే వివరింపబడింది. దీనితో గరుడమహాపురాణం సర్వం సమాప్తమయ్యింది.

## విశేషాంశాలు

గరుడమహాపురాణంలో ప్రతిపాదించబడిన, తెలియజేయబడిన అంశాలన్నీ సాక్షాత్తుగా శ్రీకృష్ణపరమాత్మ తెలియజేయడమే మిక్కిలి విశిష్టమైన విశేషాంశం. ఈ పురాణంలో వృషోత్సర్గ మాహాత్మ్య వర్ణనం, వృషోత్సర్గ విధినిరూపణం అనేకమార్లు వర్ణింపబడడం వల్ల మరణానంతరం ఆచరించవలసిన కర్మలలో దానికి గల ప్రాముఖ్యత, వైశిష్ట్యం ఈ పురాణంలోని విశేషాంశంగా పరిగణించవచ్చు. వీరవాహనుడనే రాజునకు బ్రహ్మపుత్రునిచే చెప్పబడిన పురాతన కథయైన పంచప్రేతోపాఖ్యానం, విష్వక్సేనుని అవతారగాథ, తత్తద్దేవతా తారతమ్య నిరూపణం, మహాలక్ష్మి

అవతార నిరూపణం, బ్రహ్మ స్వరూపాల వర్ణన, శేషుని అవతారాల వర్ణన, ఔర్వకారకుని వృత్తాంతం, సాత్త్విక పురాణాల విశిష్టత, భాగవత మహాపురాణ విశిష్టత, మొదలైన అనేక విశేషాంశాలు గరుడపురాణంలో మనకు కనిపిస్తాయి.

## నీలాదేవీకృత శ్రీనివాస స్తుతి

శ్రీకృష్ణుని భార్యలలో ఒకరైన నీలాకుమారి ఆమె పూర్వసర్గలో హవ్యవాహనుని పుత్రికగా జన్మించి, కన్యగా ఉండగానే కృష్ణపత్నిగా భావానుభూతిపొంది శేషాచలానికి ప్రయాణమై, కపిలతీర్థంనుండి గొప్పదైన శేషాచలాన్ని అధిరోహించింది. అక్కడ కొలువుతీరిన శ్రీనివాసుని దర్శించింది. మూడురోజులు ఉపవాసం చేసింది. పాపవినాశనానికి వెళ్ళి అక్కడ స్నానంచేసి వివాహ సంకల్పంచేసికొన్నది. పాపవినాశనానికి ఉత్తర దిగ్భాగంలో రెండు క్రోసుల దూరంలో ఉన్న ఒక గోతిలో ఏకాంతంగా వేయి దివ్య సంవత్సరాలు కఠోర తపస్సుచేసింది. అయినా శ్రీనివాసుని సాక్షాత్కారం లభించకపోవడంతో ఆమె

**శ్లో.** **త్వమేవ మాతాచ పితాత్వమేవ**
**త్వమేవ భర్తా చ సఖా త్వమేవ**
**త్వమేవ పుత్రశ్చ గురుర్గరీయాన్**
**మిత్రం స్వసాత్వం మమ వల్లభశ్చ ॥**

ఇత్యాదిగా ఏడుకొండలవానిని ఏడు శ్లోకాలతో స్తుతిస్తూ "ఓ ప్రభూ! నీ దాసులకు పరిచారికలకు దాస్యం చేయుటకు తగియున్న సమస్త దోషాలతో కూడుకొనియున్న నాకు నీ దర్శనం ఎట్లు చేకూరుతుంది? దేవేశా! జగన్నివాసా! నన్ను అనుగ్రహించుము" అని ఆర్తితో వేడుకొంది. అంతట ఆమె స్తోత్రానికి సంతుష్టుడైన శేషాచలవాసుడు ఆమెకు ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనగా ఆమె చిరునవ్వుతో కూడిన మోముకలదై పరమభక్తితో "మాధవా! సుందరా! నేనూ నీకు భార్యను కావాలి" అని శ్రీనివాసుని కోరింది. అంతట శ్రీనివాసుడు ఆమెకోరికను మన్నించి "ఓ కుమారీ! నేను భూతలంలో కృష్ణజన్మయందు నీకు భర్తకాగలను" అని అమెకు వరప్రదానం చేసి శ్రీనివాసుడు అంతర్ధానమయ్యాడు ఆ కుమారి అక్కడే తన దేహాన్ని విడిచింది. అనంతర జన్మలో నాగ్నజిత్తు మహారాజు యొక్క ఇంటియందు నీలాకుమారిగా జన్మించింది. నీలా స్వయంవరంలో శివుని వరం వల్ల దేవమానవులచే వధింపబడజాలని వృషభములను బంధించి రాజకుమారులను జయించి, నీలా సుందరిని శ్రీకృష్ణుడు వివాహమాడాడు.

ఈ విధంగా నీలాదేవి శ్రీకృష్ణునకు భార్య అగుటకు శేషాచలంలో శ్రీనివాసుని గూర్చి దివ్యమైన తపమాచరించి, శ్రీనివాసుని అనన్య శరణత్వం పొంది ఆర్తితో స్తుతించుటటే శ్రీనివాసుడిచ్చిన వరప్రభావమే కారణమని వర్ణించుట గరుడపురాణమునందు తక్క తక్కిన ఏ పురాణమునందును కనబడదు.

## వేంకటేశగిరియాత్రా క్రమ నిరూపణం

జాంబవతి, పూర్వసర్గలో సోముని పుత్రిక, ఆమె తండ్రి గృహమునందు ఉంటున్నదై తండ్రితో కలిసి విష్ణు శుశ్రూషణము చేస్తూ తన జన్మను సార్థకం చేసుకున్నది. హరిని సంతోషపరచుటకై తండ్రితో కలసి తీర్థాటనకు

బయలుదేరింది. అందులో భాగంగా శేషాచలంపైనున్న శ్రీనివాసుని దర్శించుటకు బయలుదేరింది. ఆమె మార్గ మధ్యంలో "శ్రీవత్సంలో, రత్నాలతో అలంకరింపబడిన విశాలమైన శ్రీనివాసుని వక్షమును ఎన్నడు దర్శించగలను? మూడు వళులతో ముద్రితమైన సుందరమైన శ్రీనివాసుని ఉదరాన్ని, మహర్లోకానికి ఆశ్రయమైన శ్రీనివాసుని కంఠాన్ని, అంతరిక్షానికి ఆశ్రయమైన మురారి వదనాన్ని, సత్యలోకానికి ఆశ్రయమైన శ్రీనివాసుని శిరస్సును, భువర్లోకానికి ఆశ్రయమైన శ్రీనివాసుని కటి ప్రదేశాన్ని, తలాతలానికి అశ్రయమైన శ్రీనివాసుని ఊరు ప్రదేశాన్ని, సుతలానికి అశ్రయమైన శ్రీనివాసుని జానుభాగాన్ని, రసాతలానికి ఆశ్రయమైన శ్రీనివాసుని జంఘ (పిక్క) భాగాన్ని పాతాళలోకానికి ఆశ్రయమైన హరిపాదతలాన్ని ఎప్పుడు దర్శించగలను?" ఈ విధంగా ఆ దేవి మార్గమునందు తలపోయుచున్నదై, పెక్కు వృక్షాలతోను, వానర వానరీ బృందాలతోను కూడియున్న, వేలకొలది పడగలతో ప్రకాశించుచున్న శేషాచలాన్ని, శేష దేవుని సందర్శించింది. అనేక జన్మల పుణ్య ఫలితంగా ఈ సందర్శనం కలిగిందని భావించి శిరస్సుతో ప్రణామం చేసింది. దాని ఎదురుగా సాలగ్రామాన్ని ఉంచి ఆమె పండ్రెండు మార్లు సాష్టాంగ ప్రణామం చేసింది. ఈ విధంగా పర్వతానికి నమస్కరించింది. శివుడు, బ్రహ్మ మున్నగు వారిచే పూజింపబడే నిత్యం శేషాచలాగ్రమునందు అంతర్యామియై ఉండే శ్రీనివాసుని ఇక చూడగలనని భావిస్తూ ఆ పర్వతాన్ని అధిరోహించడానికి ఉపక్రమించింది. కపిలతీర్థంలో స్నానం చేసి, ముండనం చేయించుకొని, తీర్థ పూజ చేయించుకొని, గో, భూ, హిరణ్యాది సమస్త దానాలను ఇచ్చి ఆమె శైలాన్ని అధిరోహింపసాగింది. తండ్రిముందు ఎదురుగా సాలగ్రామాన్ని ఉంచి ప్రణమిల్లగా ఆమె కూడా మిక్కిలి భక్తితో ప్రణామం చేసింది. ఈ విధంగా నూరుమెట్లువరకు అధిరోహించి, ఆమె ఒకచోట కూర్చుండి భాగవత పురాణాన్ని, వేంకటాద్రి మాహాత్మ్యాన్ని శ్రవణంచేసింది. జైగీషవ్యుడనే గురువుల ద్వారా భక్తితో ఈ శ్రవణం చేసింది. ఈ సందర్భంగా జైగీషవ్యుడు వేంకటాచలమనే పేరుగల ఈ పర్వతాన్ని ఎక్కేటప్పుడు నవ్వుతూ ఉండే ముఖంతో, పవిత్రత పాటిస్తూ గొప్పదైన గీతాపఠనం చేస్తూ పర్వతాన్ని అధిరోహించాలి. ప్రతిపదమునందు శ్రీనివాసుడు దేవుడంటూ, ఆయన సమర్థుడంటూ, ఆయన చాలు అంటూ ఆనందంలో శ్రీనివాసుని, గురువును ప్రస్తుతిస్తూ పర్వతారోహణం చేయసాగింది. ఆమెకు గురువైన జైగీషవ్యుడే శ్రీనివాసుడుగాన కనబడుచున్నాడు. దీనికి కారణమేమిటని ఆమె గురువునడుగగా బ్రహ్మాదులకు కూడ శ్రీనివాసుడు కనిపిస్తూ ఉంటాడని, రుద్రాదులకు లక్షసూర్యులకన్న ఎక్కువైన కాంతితోను, సత్పురుషులైన మానవులకు ప్రత్యక్షంగాను హరి, కనిపిస్తాడని వివరించాడు. అంతేగాక కలియుగమునందున్న నరులకందరికి శ్రీనివాసుడైన హరి శ్రీనివాసుని దేవియొక్క స్వరూపంతో కనబడతాడని వివరించాడు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు గరుడునకు ద్వేషాలను గూర్చి వివరించాడు. అంతేగాక నిజమైన భక్తులు తమ భక్తిని ఎలా ప్రదర్శిస్తారో కూడా వివరింపబడింది. అంతేగాక ప్రహ్లాదాది భక్తులను గూర్చి కూడ వివరింపబడింది. వారందరూ ఈ దివ్యక్షేత్రంలోనే ఉన్నారని కూడా వర్ణింపబడింది. శేషాచలాన్ని పొంది, అన్నం, వస్త్రం, భూషణం మున్నగువాటిని ఎవడు దానం చేయకుండా ఉంటాడో వాడు భక్తుడుకాడు. పశువు. కావున గోవిందా! నారాయణా! మాధవా! అంటూ ఈ పర్వతాన్ని అధిరోహించాలని గురువు తెలియజేయగా, వారందరూ అంతటా ప్రతిధ్వనించేటట్లు తాళధ్వని చేస్తూ, నాట్యంచేస్తూ పర్వతారోహణం చేశారు. నారసింహ తీర్థం చేరుకున్నారు. ఆ తీర్థం చుట్టూ అపరాహ్ణ సమయంలో 'జయ' శబ్దం సర్వత్రా వినబడుతూ ఉంటుంది. ఆ తీర్థంలో వారందరూ స్నానంచేసి, దీపదానం చేసి గోవింద నామాన్ని పలుకుతూ శ్రీనివాసుని దర్శించడానికి తిరిగి బయలుదేరారు.

శ్రీనివాసుని దివ్యధామం చేరిన తరువాత ఆమె 'శ్రీనివాసుని దర్శనం ఎలాచేసికోవాలని' జైగీషవ్యుని ప్రశ్నించింది అంతట జైగీషవ్యుడు ఆమెకు శ్రీనివాసుని దర్శించుకొనే విధానాన్ని చాలా విస్తారంగా ఏయే కోణాలలో ఏయే దిక్కులలో ఏయే దేవతలను దర్శించాలో వివరంగా తెలియజేశాడు. శ్రీనివాసుని మొదటి ద్వారాన్ని చూచి, భక్తుడు తన అపరాధాలన్నింటిని క్షమించి, దోషాలను పరిహరించమని ప్రార్థించాలి. అంతేగాక అది శ్రీనివాసుని ఆది ద్వారమైనందున జయ, విజయులను భక్తితో స్మరించాలి. దక్షాధ్వర సమయంలోని చండ, ప్రచండులను కూడ శ్రీనివాసుని ఆదిద్వారం వద్ద స్మరించాలి. శ్రీనివాసుని పశ్చాద్భాగమునందు నందుని, సునందుని భక్తితో స్మరించాలి. శ్రీనివాసుని ఎప్పుడు చూస్తానో కదా! అని స్మరిస్తూ పండ్రెండ్రు సార్లు ప్రదక్షిణం చేస్తూ అడుగు అడుగూ శ్రీనివాసుని స్మరించాలి.

శ్రీస్వామి తీర్థంలో భక్తితో వంగి, ఆచమించి, స్నానంచేసి, భూసమేత వరాహ స్వామికి వంగి ప్రణమిల్లి గోవిందా! గోవిందా! అంటూ ప్రధాన ద్వారం ప్రవేశించాలి. తదనంతరం హరికి సాష్టాంగ ప్రణామంచేసి, దేవమందిరం ప్రవేశించాలి. ద్వారం వద్ద ఉండి పీఠము నందలి దేవతలను మనసా ధ్యానిస్తూ ప్రవేశించాలి. ముందుగా పీఠ మధ్యమందున్న శ్రీనివాసునకు నమస్కరించాలి. దేవుని యొక్క ఎడమభాగంలో పీఠభాగానికి వెలుపలగల గురుదేవునకు కూడ నమస్కరించాలి. అనంతరం పీఠానికి ఎగువ దిగువ తావులలో ఆగ్నేయకోణంలో నమస్కరించాలి. నైరృతి భాగంలో వ్యాసదేవునకు నమస్కరించాలి. వాయవ్య కోణమందు భక్తితో దుర్గాదేవికి నమస్కరించాలి. తదనంతరం పీఠానికి ఊర్ధ్వభాగంలో అగ్నికోణంలో ధర్మాధి దేవతయైన యమునకు నమస్కరించాలి. పీఠం యొక్క పైభాగంలో నైరృతి దిశలో ఊర్ధ్వ కోణంలో జ్ఞానాధిపుడైన వాయుదేవునకు నమస్కరించాలి. పీఠం ఊర్ధ్వభాగంలో వాయుకోణంలో వైరాగ్యాలకు అధిపతియైన రుద్రునకు నమస్కరించాలి. పీఠానికి పైని, ఈశాన కోణంలో ఐశ్వర్యాలకు అధిపతియైన ఇంద్రునకు నమస్కరించాలి. పీఠానికి తూర్పుభాగంలో అర్యములకు అధిపతియైన నైరృతికి నమస్కరించాలి. పీఠానికి దక్షిణంలో ఉగ్రరూపురాలని చెప్పబడే దుర్గకు ప్రణమిల్లాలి. పీఠానికి పశ్చిమంలో ఆరోగ్యాలకు అధిపుడైన కామదేవునకు ప్రణామం చేయాలి. పీఠమునకు ఉత్తరంలో వైరాగ్యాదులకు అధిపతియైన రుద్రదేవుని స్మరించాలి. పీఠమునకు మధ్య ప్రదేశంలో ఎల్లప్పుడూ పరమపురుషుడని చెప్పబడే వరాహమూర్తికి ప్రణమిల్లాలి.

జైగీషవ్యుడు ఇలా అంతయూ చెప్పి శాస్త్రవిధానంగా దర్శనం చేయాలని తెలియజేశాడు. అంతట వారందరితో కలిసి సంతోషంతో బయలుదేరింది. ఆమె ద్వారదేశమందు శ్రీనివాసమనే స్వామి పుష్కరిణిని దర్శించింది. గురువు ఉపదేశించిన విధంగా అక్కడ నిర్వహించిన తరువాత శ్రీనివాసుని దివ్యదర్శనం పొందింది. ఈ విధంగా వేంకటగిరి యాత్రా క్రమనిరూపణం, శ్రీ వేంకటేశ్వరగిరి యొక్క ఆరోహణ క్రమం, శ్రీ వేంకటేశ్వర వైభవం శేషాచలానికి కల నామాలు, అవి ఏర్పడడానికి గల కారణాలు, శ్రీస్వామి పుష్కరిణీ వైభవం, శ్రీనివాసుని దర్శించుకొనే విధానం, శేషాచలంపైగల పాపనాశనం, అంతర్గంగ, తుంబురుక తీర్థం, మున్నగు తీర్థరాజముల మాహాత్మ్యం మున్నగువాటితో కూడిన తిరుమల వైభవ విశేషాలు ఈ గరుడపురాణంలోని అతిముఖ్యమైన విశేషాంశాలుగా చెప్పవచ్చును.

అంతమాత్రమేగాక శ్రీనివాసునిచేత స్వయంగా ఉపదేశింపబడిన వేంకటేశ మంత్రం, మంత్రార్థ వివరణ, మంత్రావృత్తిని గురించిన వివరణ జపవిధాన వివరణ గరుడపురాణమునందు మాత్రమే దర్శనమిచ్చు మిక్కిలి

విశేషాంశాలనడంలో అతిశయోక్తి లేదు. తక్కిన ఏ పురాణంలోనూ ఇట్టి విశేషాంశాలు కనబడవు. 'కలౌ వేంకటనాయకః' అని కలియుగదైవంగా కీర్తింపబడుచున్న, పూజింపబడుచున్న వ్యంకటేశుని (వేంకటేశుని) వైభవం, వేంకటాచల మాహాత్మ్యం, తిరుమల యాత్రా దర్శనం, సమగ్రంగా వర్ణింపబడిన మహాకావ్యంగా గరుడపురాణంలోని బ్రహ్మకాండను పేర్కొనవచ్చును. ఇందులో వివరింపబడిన విధానంలో వేంకటేశుని అర్చించిన వారికి శ్రీనివాసుని పరిపూర్ణానుగ్రహం కలిగి ఇహపరలోకాలలో సమస్త సౌఖ్యాలు పొందడమేగాక, శ్రీకైవల్యం లభిస్తుందనడంలో ఎట్టి సందేహము లేదు.

**పురాణం గారుడం పుణ్యం పవిత్రం పాపనాశనమ్ ।**
**శృణ్వతాం కామనా పూరం శ్రోతవ్యం సర్వదై వహి ॥**

**యశ్చేదం శృణుయాన్మర్త్యో యథాపి పరికీర్తయేత్ ।**
**విహాయ యాతనాం ఘోరాం ధూతపాపో దివం వ్రజేత్ ॥**

ఏ మనుష్యుడు ఈ గరుడ పురాణాన్ని వింటాడో, ఎవడు చక్కగా కీర్తిస్తాడో, అతడు భయంకరమైన యమయాతనలను విడిచి, సమస్త పాపాలనుండి విడువడినవాడై స్వర్గం చేరుకుంటాడు. పవిత్రమైన, పాపనాశనమైన, పుణ్యమైన గరుడ పురాణం వినినచో కామనలు తేలిపోతాయి, కాబట్టి ఎల్లప్పుడూ గరుడపురాణం వినదగినదని శ్రీకృష్ణభగవానుని ప్రబోధం. సూతమహర్షి ముఖంనుండి వెలువడిన, సమస్తశాస్త్రరహస్యాలతో నిండిన ఈ గరుడపురాణమనే విష్ణు సంబంధమైన వాగమృతాన్ని గ్రోలి శౌనకాది మహర్షులు సంతుష్టిని పొందారు. కావున మానవాళి సర్వదా, సర్వథా గరుడపురాణాన్ని పఠించిగాని, శ్రవణం చేసి గాని ఇహపరసుఖములను పొందుదురుగాక.

"కృష్ణం వందే జగద్గురుం"

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః
శ్రీవేదవ్యాస విరచితం

**గరుడమహాపురాణమ్** - గరుడమహాపురాణం

**ఉత్తరఖండః** - ఉత్తరఖండం

**ద్వితీయాంశాఖ్యే ధర్మకాండః ప్రేతకల్పః** - రెండవఅంశమనబడే ధర్మకాండ ప్రేతకల్పం

**ప్రథమోఽధ్యాయః** - మొదటి అధ్యాయం

**ప్రశ్న ప్రపంచః** - ప్రశ్నల పరంపర

**ధర్మదృఢబద్ధమూలో వేదస్కంధః పురాణశాఖాఢ్యః ।**
**క్రతుకుసుమో మోక్షఫలో మధుసూదనపాదపో జయతి ॥1॥**

ధర్మమే గట్టిమొదలుగా, వేదాలే స్కంధాలుగా, పురాణాలే కొమ్మలుగా, యజ్ఞాలే పువ్వులుగా, మోక్షమే పండుగా కలదీ విష్ణువనే కల్పవృక్షం జయంతో (ఉత్కర్షతో) ఉందు గాక!

**నైమిషేఽనిమిషక్షేత్రే శౌనకాద్యా మునీశ్వరాః ।**
**కర్మణామంతరే సూతం స్వాసీనమిదమబ్రువన్ ॥2॥**

నైమిషారణ్యంలో అనిమిషక్షేత్రంలో శౌనకుడు మొదలైన మునీశ్వరులు కర్మలు ముగిసిన పిమ్మట, సుఖాసీనుడైయున్న సూతుని ఇలా అడిగారు.

**సూత! జానాసి సకలం వస్తు వ్యాసప్రసాదతః ।**
**తేన నః సందిహానానాం సందేహం ఛేత్తుమర్హసి ॥3॥**

సూతా! వ్యాసుని అనుగ్రహం వల్ల సమస్త విషయాలు తెలుసుకొన్నావు. అందువల్ల సంశయగ్రస్తులైన మా సందేహాన్ని తొలగింప సమర్థుడవు.

**యథా తృణజలౌకేతి న్యాయమాశ్రిత్య కంచన ।**
**దేహినోఽన్యతనుప్రాప్తిం కేచిత్త్వేవం వదంతి హి ॥4॥**

**కేచిత్ పునర్యాతనానాం యామీనాముపభోగతః ।**
**పశ్చాద్దేహాంతరప్రాప్తిం వదంతి కిము తత్ర సత్ ॥5॥**

గడ్డిజలగయొక్క న్యాయాన్ని అనుసరించి (అది ముందు గడ్డి పరకను పట్టుకొని, వెనుకటి దానిని వదలి వేస్తుంది) అలాగే దేహధారులు మరో శరీరాన్ని అవలంబనంగా చేసుకొంటారని, కొందరు చెబుతూ ఉంటారు. (ఒక దేహంవిడిచి, మరో దేహాన్ని ఆశ్రయిస్తారు అని) కొందరయితే, యమలోకంలోని యాతనలను అనుభవించి, పిమ్మట మళ్ళీ మరో శరీరాన్ని పొందుతారని చెబుతారు. అందు ఏది సత్యం?

**సూత ఉవాచ** - సూతుడు వచించాడు.

**సాధు పృష్టం మహాభాగాః! శృణుధ్వం భవతాం పునః ।**
**సందేహో నోపపద్యేత లోకార్థం కిల పృచ్ఛతామ్ ॥6॥**

మహాభాగులారా! లెస్సగా ప్రశ్నించారు. వినండి. మీకు ఎప్పుడూ సందేహమనేది ఉండదు. లోకంకోసమై అడిగి యుందురు గాక!

**తదహం కృష్ణగరుడసంవాదద్వారకం ద్విజాః ।**
**అపాకరిష్యే సందేహం భవతాం భావితాత్మనామ్ ॥7॥**

ద్విజులారా! సంభావితాత్ములైన మీ యొక్క సందేహాన్ని కృష్ణగరుడసంవాదం ద్వారా నేను తొలగింప జేస్తాను.

**నమః కృష్ణాయ మునయే య ఏనం సముపాశ్రితాః ।**
**అంజస్తరంతి సంసారసాగరం కునదీమివ ॥8॥**

కృష్ణునకు, మునీశ్వరుడైన వ్యాసునకు నమస్కారం. (వ్యాసునకు కృష్ణుడనే పేరు కలదు) ఎవరు వీనిని ఆశ్రయిస్తారో, వారు సంసారమనే సాగరాన్ని చిన్నకాలువలా శీఘ్రంగా దాటగలుగుతారు.

**ఏకదా వైనతేయస్య లోకానాం లోకనస్పృహా ।**
**బభూవ సోఽథ బభ్రామ తేషు నామ హరేర్గృణన్ ॥9॥**

ఒకప్పుడు వినతాపుత్రుడైన గరుత్మంతునకు లోకాలనన్నింటినీ చూడాలనే కోరిక కలిగింది. అతడు ఆ లోకాలలో హరినామాన్ని ఉచ్చరిస్తూ తిరిగాడు.

**స పాతాలం భువం స్వర్గం భ్రాంత్వాఽలబ్ధశమాశయః ।**
**లోకదుఃఖేనాతిదుఃఖీ పునర్వైకుంఠమాగమత్ ॥10॥**

అతడు పాతాళాన్నీ, భూలోకాన్నీ, స్వర్గలోకాన్నీ పర్యటించి, శాంతిని పొందలేక అలమటించి, జనుల దుఃఖాలచే తాను దుఃఖితుడైపోయి, తిరిగి వైకుంఠానికి వెళ్ళాడు.

**న రజో న తమశ్చైవ సత్త్వం తాభ్యాం చ మిశ్రితమ్ ।**
**యత్ర ప్రవర్తతే నైవ సత్త్వమేవ ప్రవర్తతే ॥11॥**

అక్కడ రజోగుణమూ లేదు, తమోగుణమూ లేదు. కనీసం వాటితో కలిసిన సత్త్వగుణమూ లేదు. అక్కడ కేవలం శుద్ధసత్త్వగుణమే ప్రవర్తించి ఉంటుంది.

**న యత్ర మాయా నాశశ్చ న చ రాగాదయో మలాః ।**
**శ్యామావదాతాః సురుచః శతపత్రవిలోచనాః ॥12॥**

**సురాసురార్చితా యత్ర గణా విష్ణోః సుపేశసః ।**
**పిశంగవస్త్రాభరణా మణియుఙ్నిష్కభూషితాః ॥13॥**

**చతుర్భుజాః కుండలినో మౌలినో మాలినస్తథా ।**
**భ్రాజిష్ణుభిర్విమానానాం పంకిభిర్యే మహాత్మనామ్ ॥14॥**

అక్కడ మాయ కూడా లేదు, వినాశమూ లేదు, రాగాది వికారాలు లేవు. అక్కడివారు చామనచాయ, తెలుపు కలిగిన శరీరం కలవారు, చక్కని కాంతి కలవారు, తామరపూలవంటి కన్నులు కలవారు. సురాసురుల ద్వారా అర్చించబడే మిక్కిలి అందమైన విష్ణుపార్షదులు, పచ్చని వస్త్రాలు అలంకారాలు ధరించినవారు, మణులతో కూడిన బంగారు భూషణాలచే అలంకరింపబడినవారు. నాలుగు చేతులు కలవారు, కుండలాలు, కిరీటాలు, పుష్పమాలలు ధరించినవారు, విమానాలలో ప్రకాశించే విలేపనాలను ధరించిన మహాత్ములు.

**ద్యోతంతే ద్యోతమానానాం ప్రమదానాం చ పంక్తిభిః ।**
**శ్రీర్యత్ర నానావిభవైర్వరైః పాదౌ ముదార్చతి ॥15॥**

**హరిం గాయతి దోలాస్థం గీయమానాలిభిః స్వయమ్ ।**
**దదర్శ శ్రీహరిం తత్ర శ్రీపతిం సాత్వతాం పతిమ్ ॥16॥**

ప్రకాశించుచున్న ప్రమదాబృందాల పంక్తులతో శోభిల్లుతూ లక్ష్మి ఎక్కడయితే అనేక వైభవాలతో, శ్రీహరి పాదాలను అతిసంతోషంతో అర్చిస్తోందో తూగుటుయ్యాలపై ఉన్న హరిని శ్రీమహాలక్ష్మి స్వయంగా తన చెలికత్తెలతో కలసి కీర్తిస్తోందో, అక్కడ సాత్వతాంపతీ, (భక్తులకు ప్రభువు) శ్రీపతీ అయిన శ్రీహరిని గరుడుడు దర్శించాడు.

**జగత్పతిం యజ్ఞపతిం పార్షదైః పరిషేవితమ్ ।**
**సునందనందప్రబలార్హణముఖ్యైర్నిరంతరమ్ ॥17॥**

**భృత్యప్రసాదసుముఖమాయతారుణలోచనమ్ ।**
**కిరీటినం కుండలినం శ్రియా వక్షసి లక్షితమ్ ॥18॥**

**పీతాంశుకం చతుర్బాహుం ప్రసన్నహసితాననమ్ ।**
**అభ్యర్హణాసనాసీనం తాభిః శక్తిభిరావృతమ్ ॥19॥**

**ప్రధానపురుషాభ్యాం చ మహతా చాహమా తథా ।**
**ఏకాదశేంద్రియైశ్చైవ పంచభూతైస్తథైవ చ ॥20॥**

**స్వరూపే రమమాణం తమీశ్వరం వినతాసుతః ।**
**తద్దర్శనాహ్లాదయుతస్వాంతో హృష్యత్తనూరుహః ॥21॥**

**లోచనాభ్యామశ్రు ముంచన్ ప్రేమమగ్నో ననామ హ ।**
**తమాగతం నతం స్వీయవాహనం విష్ణురబ్రవీత్ ॥22॥**

**భూమిః కా లంఘితా పక్షిం స్త్వయేయన్తమనేహసమ్ ।**

జగత్తులకు ప్రభువైనవానిని, యజ్ఞేశ్వరుని, పార్షదులచే పరిసేవింపబడుతున్నవానిని ఎల్లప్పుడు సునందుడు, నందుడు, ప్రబలుడు, అర్హణుడు మున్నగువారిచే చుట్టుకొనబడి, సేవకులను అనుగ్రహించుచున్న ముఖం కలవానిని, విశాలమైన ఎఱ్ఱని కన్నులు కలవానిని, కిరీటధారిని, కుండలభూషితుని, లక్ష్మీదేవి వక్షమందు చిహ్నంగా కలవానిని,

పచ్చని వస్త్రం కలవానిని, నాలుగు చేతులు కలవానిని, ప్రసన్నమైన నగుమోము కలవానిని, పూజింపబడే ఆసనంపై ఆసీనుడైయున్నవానిని, ఆయాశక్తులచే ఆవరింపబడినవానిని, ప్రధానపురుషులచేతనూ, మహత్తత్త్వంచేతనూ, అహంకారతత్త్వంచేతనూ పదకొండు ఇంద్రియాలచేతను, పంచ భూతాలచేతనూ కూడుకొన్న స్వరూపంలో రమిస్తున్న ఆ ఈశ్వరుని వినతానందనుడు వీక్షించాడు. ఆ హరిని దర్శించుటవల్ల కల్గిన సంతోషంతో మనస్సు నిండి, వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. నేత్రాల నుండి కన్నీటి బిందువులు విడుస్తూ, ప్రీతితో నమస్కరించాడు. ఆ విధంగా వచ్చి వినతుడైన, తనవాహనమైన గరుడునితో విష్ణువు ఇలా పలికాడు. పక్షీ! నువ్వు ఎంతకాలం ఏ మేరకు ఈ భూమిని పర్యటించావని అడిగాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**తవ ప్రసాదాద్వైకుంఠ త్రైలోక్యం సచరాచరమ్ ॥23॥**

**మయా విలోకితం సర్వం జగత్ స్థావరజంగమమ్ ।**
**భూర్లోకాత్సత్యపర్యంతం పురం యామ్యం వినా ప్రభో ॥24॥**

మహావిష్ణూ! వైకుంఠవాసా! నీ అనుగ్రహంవల్ల కదిలే, కదలని–జంగమ స్థావరాత్మకమైన–జగత్తునంతను నేను వీక్షించాను. ప్రభూ! యమపురిని మాత్రం విడిచిపెట్టి, భూలోకం నుండి సత్యలోకం వరకు పర్యటించాను.

**భూర్లోకః సర్వలోకానాం ప్రచురః సర్వజంతుషు ।**
**మానుష్యం సర్వభూతానాం భుక్తిముక్త్యాలయం శుభమ్ ॥25॥**

భూలోకం సర్వలోకాలయందు ప్రాచుర్యం వహించింది. సమస్త ప్రాణులయందు మనుష్యజాతి ప్రాధాన్యం పొందింది. సర్వభూతాలకు భుక్తికి, ముక్తికి శుభమైన నివాసమది.

**అతః సుకృతినాం లోకో న భూతో న భవిష్యతి ॥26॥**

అంత పుణ్యాత్ముల లోకం ఇదివరకు లేదు. ఇకమీదట ఉండబోదు. (పుణ్యాత్ములు ప్రభవించే లోకం)

**గాయంతి దేవాః కిల గీతకాని ధన్యాస్తు యే భారతభూమిభాగే! ।**
**స్వర్గాపవర్గస్య ఫలార్జనాయ భవంతి భూయః పురుషాః సురత్వాత్ (సుయత్నాత్) ॥27॥**

భారత భూమి భాగంలో ఎవరయితే ఉన్నారో, వారు ధన్యులని దేవతలు గేయాలను పాడుతూ ఉంటారు. స్వర్గం, మోక్షం అనే ఫలాలను పొందుటకై అతి ప్రయత్నంతో పురుషులు (జీవులు) అక్కడ మళ్ళీ జన్మిస్తారు.

**ప్రేతః కౌక్షిప్యతే కస్మాత్ పంచరత్నం ముఖే కథమ్ ।**
**అధస్తాచ్ఛాలితా దర్భాః పాదౌ యామ్యాం వ్యవస్థితౌ ॥28॥**

**కిమర్థం పుత్రపౌత్రాశ్చ తస్య తిష్ఠంతి చాగ్రతః ।**
**కిమర్థం దీయతే దానం గోదానమపి కేశవ ॥29॥**

ప్రేతం భూమియందు ఏల పడవేయబడుతోంది? దాని నోటిలో పంచ రత్నాలను (స్వర్గ, గగన, మర్త్య, నాగ, పాతాళరత్నాలు) ఎందుకు వేస్తున్నారు? శవంక్రింద దర్భలు ఎందుకు పరుస్తారు? దాని పాదాలను దక్షిణదిశగా ఏల ఉంచుతారు? దాని ఎదురుగా కొడుకులు, మనుమలు ఏల నిలబడి ఉంటారు? కేశవా! రకరకాల దానాలు ఎందుకు చేస్తారు? గోదానాన్ని ఎందుకు చేస్తారు?

**బంధుమిత్రాణ్యమిత్రాశ్చ క్షమాపయంతి తత్కథమ్ ।**
**తిలాలోహం హిరణ్యం చ కర్పాసం లవణం తథా ॥30॥**

**సప్త ధాన్యం క్షితిర్గావో దీయంతే కేన హేతునా ।**
**కథం హి మ్రియతే జంతుర్మృతో వై కుత్ర గచ్ఛతి ॥31॥**

బంధువులు, మిత్రులు, శత్రువులు క్షమాయాచన ఎందుకు చేస్తారు? నువ్వులు, ఇనుము, బంగారం, పత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు (వ్రీహ,యవ, గోధుమ, పెసర, మినుము, కొఱ్ఱ, సెనగ) భూమి, గోవులు ఏకారణంచే దానం చేస్తారు? ప్రాణి ఎలా మరణిస్తాడు? చనిపోయినవాడు ఎక్కడకు వెడతాడు?

**అతివాహశరీరం చ కథం హి శ్రయతే తదా ।**
**శవం స్కంధే వహేత్పుత్రో అగ్నిదాతా చ పౌత్రకః ॥32॥**

అప్పుడు అతివాహిక శరీరాన్ని (నిరాధార రూపంలో ఆత్మను ధరించే శరీరం) ఎలా పొందుతాడు? శవాన్ని పుత్రుడు భుజంపై పెట్టుకొని ఎందుకు మోస్తాడు? నిప్పు కూడా ఎందుకు ముట్టిస్తాడు? మనుమడు కూడ ఎలా సహకరిస్తాడు?

**ఆజ్యేనాభ్యంజనం కస్మాత్ కుత ఏకాహుతిక్రియా ।**
**వసుంధరా కిమర్థం చ కుతః స్త్రీశబ్దకీర్తనమ్ ॥33॥**

శవంపై నెయ్యి ఎందుకు పోసి స్నానం చేయిస్తారు? ఒకే ఆహుతిని ఎందుకు ఇస్తారు? శవాన్ని భూస్పర్శ ఎందుకు చేయించాలి? ఎందుకు చనిపోయిన వ్యక్తి గురించి స్త్రీలు ఎందుకు రోదిస్తారు?

**యమసూక్తం కిమర్థం చ ఉదీచ్యా దిశమాహరేత్ ।**
**పానీయ మేకవస్త్రేణ సూర్యబింబనిరీక్షణమ్ ॥34॥**

శవానికి ఉత్తరంగా కూర్చుండి యమసూక్తం ఎందుకు పఠిస్తారు? ఏకవస్త్రంతోనే ఉండి శవ (స్నానార్థం) పానీయార్థం నీళ్ళు ఎందుకు తేవాలి? అప్పుడు సూర్యబింబాన్ని ఎందుకు చూడాలి?

**యవ సర్షపదూర్వాస్తు పాషాణే నింబపత్రకమ్ ।**
**వస్త్రం నరశ్చ నారీ చ విదధ్యాదధరోత్తరమ్ ॥35॥**

యవలను, ఆవాలను, గరికలను, వేపాకులను రాతిపై వేసి ఎందుకు తాకాలి? అప్పుడు మగ, ఆడ కూడ క్రింద, పైన కూడ ఒకే బట్ట ఎందుకు ధరించాలి?

**అన్నాద్యం గృహమాగత్య న భోక్తవ్యం జనైః సహ ।**
**నవకాంశ్చైవ పిండాంశ్చ కిమర్థం దదతే సుతాః ॥36॥**

ఆ సమయంలో ఇంటికివచ్చి, అక్కడ ఉన్న జనాలుకూడ, అన్నాదులను ఏల భక్షింపరు? (తొమ్మిది రోజుల పాటు) క్రొత్త పిండాలను కుమారులు ఎందుకు వేస్తారు? (పిండప్రదానం చేస్తారు?)

**కిమర్థం చత్వరే దుగ్ధం పాత్రే పక్వే చ మృన్మయే ।**
**కాష్ఠత్రయం గుణాబద్ధం కృత్వా రాత్రే చతుష్పథే ॥37॥**

**నిశాయాం దీయతే దీపో యావదబ్దం దినే దినే ।**
**దాహోదకం కిమర్థం చ కిమర్థం చ జనైః సహ ॥38॥**

వేడిచేసిన మట్టిపాత్రను (కాలిన పాత్రను) ముంగిలిలో అరుగుపై నుంచి, అందు పాలెందుకు పోస్తారు? మూడు కఱ్ఱలను త్రాళ్లతో కట్టి దానిని కూడలిలోనుంచి, దానిపై ఏడాదిపాటు ప్రతిదినమూ రాత్రి దీపాన్ని వెలిగించి ఎందుకు ఉంచుతారు? శవానికి దహనసంస్కారం, ఉదక సంస్కారం ఎందుకు చేస్తారు? మిగిలిన జనాలతో కలిసి ఎందుకు ఆచరిస్తారు?

**భగవన్నాతివాహశ్చ నవపిండాః ప్రదాపయేత్ ।**
**కథం దేయం పితృభ్యశ్చ వాహస్యావాహనం కథమ్ ॥39॥**

స్వామీ! అతడు అతివాహుడు కదా! తొమ్మిది రోజులు పిండాలు ఎందుకివ్వాలి? పితరులకు ఎలా సమర్పించాలి? అతివాహునకు ఆ వాహనం ఎలా కుదురుతుంది?

**ఇదశ్చేత్ క్రియతే దేవ కస్మాత్పిండం ప్రదాపయేత్ ।**
**కిం తత్ప్రదీయతే తస్య పిండదానాద్యనంతరమ్ ॥40॥**

దేవా! అలా వీలున్నచో, పిండమే ఎందుకు సమర్పించాలి? పిండప్రదానం తరువాత ఆ ప్రేతానికి ఏమివ్వాలి?

**అస్థిసంచయనం చైవ ఘటస్ఫోటం తథైవ చ ।**
**ద్వితీయేఽహ్ని కుతః స్నానం చతుర్థేనాగ్నికే ద్విజే ॥41॥**

అస్థిసంచయనం ఎలా చేయాలి? అప్పుడు నీటి కుండను ఎందుకు పగలగొడతారు? రెండవ రోజున, నాల్గవరోజున సాగ్నిక ద్విజ స్నానమేల చేస్తారు?

**దశమే కిం మలస్నానం కార్యం సర్వజనైః సహ ।**
**కస్మాత్తైలోద్వర్తనం చ స్కంధవాహగృహం నయేత్ ॥42॥**

పదో రోజున పరిజనులందరితో కలసి శుద్ధిస్నానం ఎందుకు చేస్తారు? తలంటుస్నానం ఎందుకు చేస్తారు? ప్రేతను భుజాలపైమోసిన వాని ఇంటికే వెళ్ళి ఎందుకు చేస్తారు?

**తైలోద్వర్తనకం చాపి దదుః స్థలజలాశయే ।**
**దశమేఽహని యత్పిండం తద్దద్యాదామిషేణ తు ॥43॥**

ఆ తలంటు స్నానం కూడ విశాల జలాశయతటంపైననే ఎందుకు చేస్తారు? పదోరోజున పిండాన్ని ఆమిషంతోకలిపి ఎందుకు ఇస్తారు? (మాంసం)

**పిండం చైకాదశే కస్మాద్వృషోత్సర్గాది పూర్వకమ్ ।**
**భాజనోపానహౌ చ్ఛత్రం వాసాంసి త్వంగులీయకమ్ ॥44॥**

పదకొండో రోజున వృషోత్సర్గం ముందుచేసి, పిండప్రదానం ఎందుకు చేస్తారు? పాత్ర, చెప్పులు, గొడుగు, వస్త్రాలు, అంగులీయకం మున్నగు దానాలు ఎందుకు చేస్తారు?

**త్రయోదశోఽహ్ని దేయం స్యాత్పదదానం కిమర్థకమ్ ।**
**శ్రాద్ధాని షోడశైతాని అబ్దం యావత్కుతో ఘటః ॥45॥**

**అన్నాద్యే నోదకేనైవ షష్ట్యాధిక శతత్రయమ్ ।**
**దినే దినే చ దాతవ్యం ఘటాన్నం ప్రేతతృప్తయే ॥46॥**

పదమూడో రోజుకూడ ఆ దాన కార్యక్రమం ఎందుకు ఉంటుంది? ఏడాది కాలంలో పదహారు శ్రాద్ధాలు ఎందుకు పెట్టాలి? ఏల కుండలను. మూడు వందల అరవై అన్నం నీటి కుండలను రోజు రోజుకు ఎందుకు దానం చేస్తారు? ప్రేతతృప్తికై ఒక కుండనైనను ఎందుకిస్తారు?

**ప్రాప్తే కాలే వై మ్రియతే అనిత్యా మానవాః ప్రభో ।**
**ఛిద్రం తు నైవ పశ్యామి కుతో జీవః స నిర్గతః ॥47॥**

**కుతో గచ్ఛన్తి భూతాని పృథివ్యాపో మనస్తథా ।**
**తేజో వదస్వ మే నాథ వాయురాకాశమేవ చ ॥48॥**

ప్రభూ! మానవులు అనిత్యులు కదా! కాలం సమీపించగా, మరణిస్తాడుకదా! కన్నం (రంధ్రం) ఎక్కడా కానరాదు. జీవుడు ఎలా బయటకు వెళ్ళిపోతాడు? ప్రభూ! భూతాలైన పృథివి, జలం,తేజస్సు, వాయువు, ఆకాశం అలాగే మనస్సు ఎక్కడకు వెడతాయో నాకు చెప్పు.

**కుతః కర్మేంద్రియాణీహ పంచ బుద్ధీంద్రియాణి చ ।**
**వాయవశ్చైవ పంచైతే కథం గచ్ఛంతి చాత్యయమ్ ॥49॥**

పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ వాయువులు మరణ సమయంలో ఎక్కడకు ఎలా వెడతాయి?

**లోభమోహాదయః పంచ శరీరే చైవ తస్కరాః ।**
**తృష్ణా కామో హ్యహంకారః కుతో యాంతి జనార్దన ॥50॥**

లోభం, మోహం మున్నగునవి, తృష్ణ, కామం, అహంకారం అనే అయిదుగురు దొంగలు శరీరంలో ఉన్నారు కదా! జనార్దనా! వారు ఎక్కడకు వెడతారు?

**పుణ్యం వాప్యథవాఽపుణ్యం యత్కించిత్ సుకృతం తథా ।**
**నష్టే దేహే కుతో యాంతి దానాని వివిధాని చ ॥51॥**

పుణ్యమైనా, పాపమైనా, ఏ కొంచెం సుకృతమైనా, శరీరం పతనమైనప్పుడు, ఆ నానావిధ దానాలు ఎక్కడకు వెడతాయి?

**సపిండనం కిమర్థం చ పూర్ణే సంవత్సరేఽపి వా ।**
**ప్రేతస్య మేలనం కేషాం కిం విధం తత్ర కారయేత్ ॥52॥**

మృతిని చెందినవానికి సంవత్సరం నిండిన తరువాత, సపిండీకరణం ఎందుకు చేస్తారు? ప్రేత పిండం ఎవరితో ఏ విధంగా కలపబడుతుంది? (సంవత్సరం లోపులోనే కూడా ఎందుకు చేస్తారు?)

**మూర్ఛనాత్పతనాద్వాపి విపత్తిర్యది జాయతే ।**
**యే దగ్ధా యేత్వదగ్ధాశ్చ పతితా యే నరా భువి ॥53॥**

**యాని చాన్యాని భూతాని తేషామంతే భవేచ్చ కిమ్ ।**
**పాపినో యే దురాచారా యేచాన్యే గతబుద్ధయః ॥54॥**

మూర్ఛవల్లగాని, పతనంవల్లగాని మృతిచెందితే (విపత్తు సంభవిస్తే) వారిని దహనం చేయాలా? దహనం చేయనక్కరలేదా? భూమియందు ఏ పతితులైన నరులున్నారో, అలాగే మిగిలిన ప్రాణులకు, అంత్యకాలంలో(మృతిలో) ఏ గతి వస్తుంది? ఏ దురాచారులైన పాపాత్ములున్నారో, మిగిలిన ఏ బుద్ధిహీన ప్రాణులున్నారో వారికి ఎటువంటి గతి ప్రాప్తిస్తుంది?

**ఆత్మఘాతీ, బ్రహ్మహా చ స్తేయీ విశ్వాసఘాతుకః ।**
**కపిలాయాః పిబేచ్ఛూద్రో యః పఠేదిదమక్షరమ్ ॥55॥**

**ధారయే ద్బ్రహ్మసూత్రం వా కాగతి స్తస్య మాధవ ।**
**శూద్రస్య బ్రాహ్మణీ భార్యా సంగృహీతా యదా భవేత్ ॥56॥**

మాధవా! ఆత్మఘాతి, బ్రహ్మహంతకుడు, దొంగ, విశ్వాసఘాతకుడు, కపిలగోవు పాలుత్రాగిన శూద్రుడు, అక్షరమంత్రాన్ని (ఓం) పఠించే ఓ అనధికారి, బ్రహ్మసూత్రధారి అయిన అనధికారి, శూద్రునికి భార్యగా వశమైన **బ్రాహ్మణి** - వీరికి ఎటువంటి గతి వస్తుంది?

**భీతోఽహం పాపిన స్తస్మాత్ తన్మే వద జగత్ప్రభో ।**
**అన్యచ్చ శృణు విశ్వాత్మన్ మయా కౌతుకినా రయాత్ ॥57॥**

జగత్ప్రభూ! ఇటువంటి పాపాత్ములను చూచి నేను భయం పొందాను. నాకొక్క విషయం చెప్పు విశ్వాత్మా! మరో విషయాన్ని కూడ విను. నాకు మిక్కిలి కోరికగా ఉంది.

**లోకాంల్లోకతయా లోకే జగాహే విశ్వమండలమ్ ।**
**తత్రాజని జనాన్ దృష్ట్వా దుఃఖేష్వేవ నిమగ్నతః ॥58॥**

లోకమందలి జనులను ఆలోకించే కోరికతో విశ్వమండలం అంతా పర్యటించాను. అక్కడ దుఃఖాలయందే మునిగిపోయిఉన్న జనాలను చూచేటప్పటికి నాకు అశాంతి చెలరేగింది.

**స్వాంతే మే దుర్ధరా పీడా తత్పీడాతో గరీయసీ ।**
**త్రిదివే దితిజాతేభ్యో భూమౌ మృత్యు రుగాదిభిః ॥59॥**

**ఇష్టవస్తు వియోగైశ్చ పాతాలే మామకం భయమ్ ।**
**ఏవం న నిర్భయం స్థానమన్యదీశ భవత్పదాత్ ॥60॥**

నా మనస్సునందు భరింప శక్యంకాని పీడకలిగింది. ఆ పీడవల్ల దుఃఖం మరింత ఎక్కువయింది. స్వర్గంలో దితివల్ల పుట్టిన దైత్యులవల్ల భయం, భూమియందు చావు, జబ్బులవల్ల భయం. కోరుకొన్న వస్తువు దొరకకపోతే భయం. పాతాలానికి (నాగులకు) నావల్ల భయం. ఈ విధంగా ఎక్కడా భయంలేని తావు అన్నది లేదు. ఈశ్వరా! నీ విష్ణుపదం తప్ప ఎక్కడచూచినా భయమే.

**అసత్యం స్వప్నమాయావత్ కాలేన కవ(బ)లీ కృతమ్ ।**
**తత్రాపి భారతే వర్షే బహు దుఃఖస్య భాగినః ॥61॥**

ఎక్కడ చూచినా అసత్యమే. స్వప్నమాయవలె అంతా కాలంచే మ్రింగబడిపోతోంది. అందునూకూడ భారత వర్షమందు పెక్కు దుఃఖాలు అనుభవించేవారు కోకొల్లలు.

**జనా దృష్టా మయా రాగ ద్వేషమోహాది విప్లుతాః ।**
**కేచిదంధాః కేకరాక్షా స్ఖలద్వాచస్తు పంగవః ॥62॥**

**ఖఞ్జాః కాణాశ్చ బధిరా మూకాః కుష్ఠాశ్చ లోమశాః ।**
**నానారోగపరీతాశ్చ ఖపుష్పాచ్ఛాభిమానినః ॥63॥**

రాగం, ద్వేషం, మోహం మున్నగు వాటితో కూరుకుపోయిన జనాలే నాకు కనిపించారు. కొందరు గ్రుడ్డివారు, మరికొందరు మెల్లకన్నువారు, ముద్దముద్దగా మాట్లాడేవారు, పిచ్చుకుంటు వాళ్ళు, కుంటి కాలివారు, ఒంటి కన్నువారు, చెవిటివారు, మూగవారు, కుష్ఠరోగులు, పీచుజుట్టు కలిగినవారు, ఎక్కడ చూచినా పెక్కు జబ్బులతో పీడింపబడేవారే. గగనకుసుమాభిమానవాదులే (లేని, కాని మాటలు మాట్లాడువారే).

**తేషాం దోషస్య వైచిత్ర్యం మృత్యోర్గోచరతామపి ।**
**దృష్ట్వా ప్రష్టుమనాః ప్రాప్తః కో మృత్యు శ్చిత్రతా కథమ్ ॥64॥**

చావు దగ్గర పడినవారు కూడ చేసే వారి దోషాలు చిత్రాతిచిత్రాలు. అటువంటివారిని చూచి నిన్ను వీక్షించి అడిగే కోరికతో వచ్చినవాడను. మృత్యువనేది ఎక్కడ ఎలా వస్తుంది? దాని వైచిత్ర్యం ఎటువంటిది?

**మృతి ర్యస్య విధానేన మరణాదప్యనంతరమ్ ।**
**విధినాబ్దక్రియా యస్య న స దుర్గతిమాప్నుయాత్ ॥65॥**

ఏ విధానంచే మృతి చెందినవానికి కర్మ చేయాలి? మరణం వచ్చిన తరువాత కూడ శాస్త్రవిధానంతో ఆబ్దికక్రియ ఎలా చేయాలి? ఏ కర్మవలన ఆ జీవుడు దుర్గతి పొందకుండ ఉంటాడు?

**ఋషిభ్యస్తు మయా పూర్వమితి సామాన్యతః శ్రుతమ్ ।**
**జ్ఞానాయ తద్విశేషస్య పృచ్ఛామీదమితి ప్రభో ॥66॥**

శాస్త్రవిధిచే కర్మనాచరించకపోతే ఆ జీవుడు దుర్గతి పొందుతాడని పూర్వం సామాన్యంగా ఋషులు చెప్పగా నేను విన్నాను ప్రభూ! దానిని విశేషంగా తెలిసికొనుటకై నిన్ను అడుగుతున్నాను.

**మ్రియమాణస్య కిం కృత్యం కిం దానం వాసవానుజ ।**
**వాహమృత్యో రంతరాలే కో విధిర్దహనస్య చ ॥67॥**

మరణించిన జీవికి ఎటువంటి కర్మను ఆచరించాలి? ఏమేమి దానాలు ఈయాలి? ఉపేంద్రా! శ్మశానానికి మృతుడు చేరుకొనే లోపల చేయవలసిన కర్మఏది? దహనసంస్కారం ఎలా చేయాలి?

**సద్యో విలంబతో వా కిం దేహమన్యం ప్రపద్యతే ।**
**సంయమన్యాం క్రమ్యయాణమావర్షం కా మృతిక్రియా ॥68॥**

వెంటనే సంస్కారం జరగకపోతే, కాలవిలంబనంవల్ల జీవికి మరో దేహం సంప్రాప్తిస్తుందా? సంయమనికి (శ్మశానానికి) చేరుకోనేలోగా చేయవలసిన కర్మ ఏమిటి? సంవత్సరపర్యంతం ఆ మృత్యుకర్మవిధానం ఎటువంటిది?

**ప్రాయశ్చిత్తం దుర్మతేః కిం పంచకాది మృతస్య చ ।**
**ప్రసాదం కురు మే మోహం ఛేత్తుమర్హస్యశేషతః ॥**
**సర్వమంతే మయా పృష్టం బ్రూహి లోకహితాయ వై ॥69॥**

దురాత్ములైన మృతులకు ప్రాయశ్చిత్తమనేది ఉందా? పంచకశాంతిని మృతునకు ఎలా జరిపించాలి? నాయందు అనుగ్రహం ప్రదర్శించు. నామోహాన్ని పూర్తిగా తొలగించుటకు తగినవాడవు. అంతకాల క్రియాసర్వస్వం నాచే అడుగబడింది. లోకాలకు మేలు కలిగించుట కొరకై చెప్పవలసింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ప్రశ్న ప్రపంచో నామ ప్రథమోఽధ్యాయః ॥1॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రశ్నప్రపంచమనే మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## ఔర్ధ్వదైహికవిధిః కర్మవిపాకవిధిశ్చ - ఔర్ధ్వదైహిక కర్మవిపాక విధులు

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు అన్నాడు.

**సాధు పృష్టం త్వయా భద్ర మనుష్యాణాం హితాయ వై ।**
**శృణుష్వావహితో భూత్వా సర్వమేవౌర్ధ్వదైహికమ్ ॥1॥**

సజ్జనా! మానవహితం కోసమై నీవు చక్కగా ప్రశ్నించావు. సమస్తమైన ఔర్ధ్వదైహిక క్రియలను సావధానుడవై అవధరించు.

**సమ్యగ్విభేదరహితం శ్రుతిస్మృతిసముద్ధృతమ్ ।**
**యన్న దృష్టం సురైః సేన్ద్రై ర్యోగిభిర్యోగచింతకైః ॥2॥**

**గుహ్యాద్గుహ్యతరం తచ్చ నాఖ్యాతం కస్యచిత్ క్వచిత్ ।**
**భక్తస్త్వం హి మహాభాగ వైనతేయ బ్రవీమి తే ॥3॥**

ఇది సమ్యగ్రూపం కావడంవల్ల భేదంలేనటువంటిది. శ్రుతిస్మృతులనుండి చక్కగా ఉద్ధరింపబడినటువంటిది. సురలు, ఇంద్రాదులు, యోగులు, యోగవేత్తలు కూడ గ్రహించలేనటువంటిది. రహస్యాలలో పరమరహస్యమైనది. అది ఎప్పుడూ, ఎవ్వనికి, చెప్పరానటువంటిది. మహాభాగా! వైనతేయా! నీవు భక్తుడవు కాన, నీకు చెప్పుచున్నాను.

**అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవ చ నైవ చ ।**
**యేనకేనాప్యుపాయేన కార్యం జన్మ సుతస్య హి ॥4॥**

పుత్రులు లేనివారికి ఉత్తమగతి ఉండదు. స్వర్గమునూ చేకూరదు. అది రానే రాదు. ఏదో ఒక ఉపాయంచే సుతుని పొందే కార్యం చేబట్టాలి.

**తారయేన్నరకాత్పుత్రో యది మోక్షో న విద్యతే ।**
**స్కందః పుత్రేణ కర్తవ్యో హ్యగ్నిదాతా చ పౌత్రకః ॥5॥**

నరకంనుండి పుత్రుడు తరింపజేస్తాడు. లేనిచో అక్కడ నుండి విముక్తి కలుగదు. శవాన్ని పుత్రుడు భుజంపై పెట్టుకొని మోయాలి. నిప్పుకూడ ముట్టించాలి, మనుమడు సహకరించవచ్చు.

**తిలదర్భైశ్చ భూమ్యాం వై కుటీ ఋతుమతీ భవేత్ ।**
**పంచరత్నాని వక్త్రే తు యేన జీవః ప్రరోహతి ॥6॥**

భూమిపై తిలలు, దర్భలు పరచి శవాన్ని పడుకోబెట్టాలి. వాటివల్ల భూమి (కుటి) ఋతుమతియైన స్త్రీతో సమానమవుతుంది. శవం నోటిలో పంచరత్నాలు వేయాలి. వాటివల్ల జీవుడు మొలకెత్తుతాడు కాబట్టి అవి బీజావాపాలతో సమానాలు. (కుటి-శవాన్ని ఉంచిన గుడిసె)

**యదా పుష్పం ప్రనష్టం హి క్వ తదా గర్భధారణమ్ ।**
**ఆదరాచ్చ తతో భూమౌ యేన గర్భం ప్రధార్యతే ॥7॥**

ఎప్పుడయితే పూవు నశిస్తుందో, అప్పుడు వేరే జన్మ ధరించడం ఎలా అని శంకవద్దు. ప్రీతితో కర్మచేస్తే, అప్పుడు భూమిపై తిరిగి జన్మ ధరింపబడుతుంది.

**లేప్యా తు గోమయై ర్భూమి స్తిలాన్ దర్భాన్ వినిఃక్షిపేత్ ।**
**తస్యామేవాతురో ముక్తః సర్వం దహతి కిల్బిషమ్ ॥8॥**

ముందు నేలను ఆవుపేడతో అలకాలి, పిమ్మట తిలలను, దర్భలను పరవాలి. మరణాసన్నవేళలో ఆ వ్యక్తిని వాటిపై పడుకోబెట్టాలి. అప్పుడు అతని పాపాలన్నీ దగ్ధమవుతాయి.

**దర్భతూలీ నయేత్స్వర్గ మాతురస్య న సంశయః ।**
**దర్భాం స్తత్ర క్షిపేద్వాథ తూలీగేందుక మధ్యతః ॥9॥**

దర్భలతో తయారుచేసిన కుంచె ఆతురుని స్వర్గానికి తీసుకొనిపోతుంది. సంశయంలేదు. కుంచె, చంద్రుని వలె నుండే మండలం. మధ్యభాగంలో మళ్ళీ దర్భలను ఉంచాలి.

**సర్వత్ర వసుధాఽపూతా యత్ర లేపో న విద్యతే ।**
**యత్ర లేపః స్థిత స్తత్ర పునర్లేపేన శుధ్యతి ॥10॥**

భూమిని గోమయంతో అలకకపోతే, అంతా అపవిత్రమైపోతుంది. ఎక్కడయితే పేడతో అలకబడుతుందో అక్కడ పవిత్రమవుతుంది. అందువల్ల మాలిన్యాలు తొలగించి పదే పదే శుద్ధి చేయాలి.

**యాతుధానాః పిశాచాశ్చ రాక్షసాః క్రూరకర్మిణః ।**
**అలేపం హ్యాతురం ముక్తం విశంత్యేతే వియోనయః ॥11॥**

యాతుధానులు (యాతువనే నామాన్ని ధరించినవారు), పిశాచులు, రాక్షసులు, క్రూరకర్ములు పేడతో శుద్ధి చేయకపోతే మరణాసన్నవ్యక్తిపై, ప్రాణాలు విడిచినవానిపై క్రిముల రూపంలో దాడిచేసి ప్రవేశిస్తారు.

**నిత్యహోమస్తథా శ్రాద్ధం పాదశౌచం ద్విజే తథా ।**
**మండలేన వినా భూమ్యామాతురో మ్రియతే న హి ॥12॥**

నిత్యహోమం, అలాగే నిత్యశ్రాద్ధం, పాదశౌచం, ద్విజార్చన, భూమిపై మండలీకరణ ఇవి లేకపోతే ఆతురుడు మరణించి విముక్తి పొందలేడు.

**బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ శ్రీర్హుతాశస్తథైవ చ ।**
**మండలేచోపతిష్ఠంతి తస్మాత్కుర్వీత మండలమ్ ॥13॥**

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, లక్ష్మి, అగ్ని మున్నగు దేవతలు మండలంలో ప్రకాశించి ఉంటారు. అందువలన మండలాన్ని ఏర్పరచాలి.

**అన్యథా మ్రియతే బాలో వృద్ధస్తార్క్ష్య యువాఽథవా ।**
**యోన్యంతరం న గచ్ఛేత్స క్రీడతే వాయునా సహ ॥14॥**

గరుడా! బాలుడుకాని, వృద్ధుడుకాని, యువకుడుకాని మరణించినచో, అతడు మరో విధంగా మరో జన్మ పొందలేడు. అతడు గాలిలో తిరుగుతూ ఉంటాడు.

**మిశ్రితం లోహితామిశ్రం తదేవం జన్మ జాయతే ।**
**తస్యైవ వాయుభూతస్య న శ్రాద్ధం నోదకక్రియా ॥15॥**

రంగు మారినా, కొంచెం ఎఱ్ఱబడినా, ఆ మృతునికి తిరిగి జన్మవస్తుంది. అలా కాక గాలిలో తిరుగాడేవాడికి శ్రాద్ధం ముట్టదు. ఉదకక్రియ కూడ అంటదు.

**మమ స్వేద సముద్భూతా స్తిలాన్తార్క్ష్య పవిత్రకాః ।**
**అసురా దానవా దైత్యా విద్రవంతి తిలైస్తథా ॥16॥**

గరుత్మంతుడా! తిలలు నా చెమటనుండి పుట్టాయి. అవి పవిత్రతను కలగజేస్తాయి. అసురులు, దానవులు, దైత్యులు, తిలలను ఉపయోగిస్తే పారిపోతారు.

**తిలాః శ్వేతాస్తిలా కృష్ణాస్తిలా గోమూత్రసంనిభాః । (న్ని)**
**దహంతు తే మే పాపాని శరీరేణ కృతాని వై ॥17॥**

తిలలు తెల్లగాను, నల్లగాను, గోమూత్రపు రంగులోనూ ఉంటాయి. అవి నా శరీరం ద్వారా చేయబడిన పాపాలను నశింపజేయు గాక! అనే భావనచేయాలి.

**ఏక ఏవ తిలో దత్తో హేమద్రోణతిలైః సమః ।**
**తర్పణే దానహోమేషు దత్తో భవతి చాక్షయః ॥18॥**

ఒక్క తిలదానం బంగారుకలశంలో నిండిన తిలలతో సమానం. తర్పణాలలో, దానాలలో, హోమాలలో ఇచ్చిన తిలదానం అక్షయఫలితాన్ని ఇస్తుంది.

**దర్భా రోమసముద్భూతా స్తిలాః స్వేదేషు నాన్యథా ।**
**దేవతా దానవాస్తృప్తాః శ్రాద్ధేన పితరస్తథా ॥19॥**

**ప్రయోగ విధినా బ్రహ్మా విశ్వం చాప్యుపజీవనాత్ ।**
**అపసవ్యాదితో బ్రహ్మా పితరో దేవదేవతాః ॥20॥**

దర్భలు నా రోమాలనుండి ఉద్భవించాయి. తిలలు స్వేదం నుండి పుట్టాయి. మరోవిధంగా కాదు. వాటివల్ల దేవతలు, దానవులైనా తృప్తిపొందుతారు. శ్రాద్ధంలో తిలలు పితరులకు తృప్తినిస్తాయి. వీటిని చక్కగా ప్రయోగిస్తే బ్రహ్మ, విశ్వం కల్యాణకారకమవుతాయి. అపసవ్యాది విధివలన బ్రహ్మ, పితరులు, దేవులు, దేవతలు తృప్తిపొందుతారు. (దేవతలకు సవ్యవిధి, పితరులకు అపసవ్యవిధి)

**తేన తే పితర స్తృప్తా అపసవ్యే కృతే సతి ।**
**దర్భమూలే స్థితో బ్రహ్మా మధ్యే దేవో జనార్దనః ॥21॥**

**దర్భాగ్రే శంకరం విద్యాత్త్రయో దేవాః కుశే స్మృతాః ।**
**విప్రా మంత్రాః కుశా వహ్నిస్తులసీ చ ఖగేశ్వర ॥22॥**

**నైతే నిర్మాల్యతాం యాంతి క్రియమాణాః పునః పునః ।**
**తులసీ బ్రాహ్మణా గావో విష్ణురేకాదశీ ఖగ ॥23॥**

**పంచ ప్రవహణాన్యేవ భవాబ్ధౌ మజ్జతాం నృణామ్ ।**
**విష్ణురేకాదశీ గీతా తులసీ విప్రధేనవః ॥24॥**

**అసారే దుర్గసంసారే షట్పదీ ముక్తిదాయినీ ।**
**తిలాః పవిత్రమతులం దర్భాశ్చాపి తులస్యథ ॥25॥**

**నివారయంతి చైతాని దుర్గతిం యాం తమాతురమ్ ।**
**హస్తాభ్యాముద్ధరేద్దర్భాం స్తోయేన ప్రోక్షయేద్భువి ॥26॥**

అపసవ్య విధానంగా కర్మచేస్తే దానివలన పితరులు తృప్తులవుతారు. దర్భ మొదలులో బ్రహ్మ, మధ్యభాగంలో దేవుడైన జనార్దనుడు, దర్భచివర శంకరుడు ఇట్లు ముగ్గురు దేవతలు కుశలలో ఉంటారని తెలియజేయబడుతోంది. ఖగరాజా! విప్రులు, మంత్రాలు, కుశలు, అగ్ని, తులసి. వీటిని ఎన్నిమారులు మళ్ళీమళ్ళీ ఉపయోగించినా అవి నిర్మాల్యములు కావు ఖగమా! అలాగే తులసి, బ్రాహ్మణులు, గోవులు, విష్ణువు, ఏకాదశి. ఈ ఐదును సంసారమనే సాగరమందు మునిగిపోయే నరులను మోసే ప్రయాణసాధనాలు (నౌకలు) విష్ణువు, ఏకాదశి, భగవద్గీత, తులసి, విప్రులు, ధేనువులు సారహీనమైన దుర్గమమైన సంసారంలో పడియున్నవారికి ముక్తినిచ్చే "షట్పది" సాధనాలు. తిలలు, దర్భలు, తులసి మిక్కిలి పవిత్రాలై ఇవన్నీ మరణాసన్నవ్యక్తికి దుర్గతి కలగకుండా కాపాడతాయి. రెండు చేతులతోను దర్భలను చీల్చాలి. వాటిని నేలపైనుంచి నీటిని చల్లాలి. వాటిని మరల పైకితీయాలి.

**మృత్యుకాలే క్షిపేద్దర్భాన్ కరయో రాతురస్య చ ।**
**దర్భైస్తు క్షిప్యతే యోఽసౌ దర్భైస్తు పరివేష్టితః ॥27॥**

**విష్ణులోకే స వై యాతి మంత్రహీనోఽపి మానవః ।**
**తూలీం కృత్వా కృతౌ పాదౌ సంస్థితౌ క్షితిపృష్ఠతః ॥28॥**

మృత్యుసమయంలో మరణాసన్నవ్యక్తి యొక్క రెండు చేతులలోను ఆ దర్భలను ఉంచాలి. ఎవడయితే ఈ విధంగా దర్భలచే చల్లబడి, చుట్టూ దర్భలు కలిగిఉంటాడో. అపుడా మానవుడు మంత్రహీనకర్ముడైనా, విష్ణులోకాన్ని పొందగలడు. పడకను చేసి, రెండు పాదాలను ఏకంగాచేసి, భూమిపై వెనుక భాగంలో ఉంచాలి.

**ప్రాయశ్చిత్తం విశుద్ధాగ్నౌ సంసారేఽసారసాగరే ।**
**గోమయో నోపలింపేత్తు దర్భాస్తరణ సంస్థితే ॥29॥**

పేడచే అలకబడిన నేలపై మృతి, దర్భాసనాలపై శయనం, పరిశుద్ధమైన అగ్నిలో దహనసంస్కారం అసార సంసార సాగరంనుండి ఉద్ధరింపబడడానికి ప్రాయశ్చిత్తాలు.

**యేన దత్తేన దానేన సర్వం పాపం వ్యపోహతి ।**
**లవణం తద్రసం దివ్యం సర్వకామప్రదం నృణామ్ ॥30॥**

ఆవ్యక్తి నిమిత్తం దానం చేస్తే సమస్తపాపాలు తొలగిపోతాయి. నరులకు లవణం, దానిరసం దానం చేయడం దివ్యమైనది. సమస్తములైన కోరికలను తీర్చేది.

**యస్మాదన్నరసాః సర్వే నోత్కటా లవణం వినా ।**
**పితౄణాం చ ప్రియం భవ్యం తస్మాత్స్వర్గప్రదం భవేత్ ॥31॥**

ఉప్పులేనినాడు అన్ని అన్నరసాలు రసవంతాలు కాజాలవు అందువల్ల లవణరసమంటే పితరులకు మిక్కిలి ప్రీతిభవ్యమైనది. అది స్వర్గాన్ని ఇచ్చేది

**విష్ణుదేహ సముద్భూతో యతోఽయం లవణో రసః ।**
**ఏతత్సలవణం దానం తేన శంసంతి యోగినః ॥32॥**

ఈ లవణరసం విష్ణుమూర్తి దేహంనుండి ఉత్పన్నమయింది. అందువల్ల యోగులు ఈ లవణంతో కూడిన దానాన్ని ప్రశంసిస్తారు.

**బ్రాహ్మణ క్షత్రియ విశాం స్త్రీణాం శూద్రజనస్య చ ।**
**ఆతురస్య యదా ప్రాణా న యాంతి వసుధాతలే ॥33॥**

**లవణం తు తదా దేయం ద్వారస్యోద్ఘాటనం దివః ।**
**అన్యచ్చ శృణు పక్షీంద్ర మృత్యో రూపం ప్రపంచతః ॥34॥**

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు, స్త్రీ జనాలకు నేలపై ఉండి ఏ మరణాసన్నవ్యక్తికైనా మరణం రాక వేదన దుర్భరంగా ఉంటే, అప్పుడు లవణం దానంచేస్తే వారికి స్వర్గద్వారం తెరచుకొంటుంది. పక్షీంద్రా! విను. ఇకపై మృత్యుస్వరూపాన్ని విస్తారపూర్వకంగా విను.

**యస్య కాలేన నో యాయాద్వియోగః ప్రాణదేహయోః ।**
**ప్రాణినశ్చ స్వసమయో మృత్యురత్యంతవిస్మృతిః ॥35॥**

ప్రాణం దేహంనుండి విడిపోయి వెళ్ళిపోవడానికి కాలం తప్ప మరో కారణంలేదు. ప్రాణికి తాను వెళ్లిపోయే సమయంలో మిక్కిలిగా మరపు వస్తుంది. అదే మృత్యుసమయం.

**యథా వాయుర్జలధరాన్వికర్షతి యతస్తతః ।**
**తద్వజ్జలదవత్తార్క్ష్య కాలస్యైవ వశానుగాః ॥36॥**

ఏ విధంగా వాయువు మేఘాలను ఇటూ అటూ ఎగరగొడుతుందో, అదేవిధంగా తారాక్ష్య! మేఘాలవలె కాలంయొక్క వశంలో జీవులు అందరూ సంచరిస్తారు.

**సాత్త్వికా రాజసాశ్చైవ తామసా యే చ కేచన ।**
**భావాః కాలాత్మకాః సర్వే ప్రవర్తంతే హి జంతుషు ॥37॥**

ప్రాణులయందు ఏవయితే సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అయిన భావాలున్నాయో, అవన్నీ కాలాత్మకంగా ప్రవర్తిస్తాయి.

**ఆదిత్య శ్చంద్రమాః శంభు రాపో వాయుః శతక్రతుః ।**
**అగ్నిః ఖం పృథివీ మిత్ర ఓషధ్యో వసవస్తథా ॥38॥**

**సరితః సాగరాశ్చైవ భావాభావౌ చ సర్పహన్ ।**
**సర్వే కాలేన సృజ్యంతే సంక్షిప్యంతే యథా పునః ॥39॥**

**కాలేన సంహ్రియంతే చ నూనం మృత్యావుపస్థితే ।**
**దైవయోగాత్తదా వ్యాధిః కశ్చిదుత్పద్యతే ఖగ ॥40॥**

గరుత్మంతా! ఆదిత్యుడు, చంద్రుడు, శంభుడు, జలం, వాయువు, ఇంద్రుడు, అగ్ని, ఆకాశం, భూమి, మిత్రుడు, ఓషధులు, వసువులు, నదులు, సముద్రాలు, ఉండుట, లేకపోవుట అన్నీ కాలం చేతనే సృజింప బడుతున్నాయి. వృద్ధి పొందుతున్నాయి. అలాగే మళ్లీ కాలంవల్లనే కనుమరుగవుతూ ఉంటాయి. ఖగమా! సాధారణంగా మృత్యువు సమీపిస్తూ ఉండగా, దైవయోగంవల్ల ఏదో ఒక రోగం ఉద్భవిస్తుంది.

**వైకల్యమింద్రియాణాం చ బలౌజో రంహసాం భవేత్ ।**
**యుగపద్వృశ్చిక కోటి శూకదంశో భవేద్యది ॥41॥**

ఇంద్రియాలు వికలమైపోతాయి. బలం, ఓజస్సు, వేగం, శిథిలాలయిపోతాయి. కోటితేళ్ళు ఒకేసారి కుట్టినంత బాధకలుగుతుంది.

**తదానుమీయతే తేన పీడా మృత్యుభవా ఖగ ।**
**తతః క్షణేన చైతన్యే వికలే జడతాం గతే ॥42॥**

**ప్రచాల్యంతే తతః ప్రాణా యామ్యైర్నికటవర్తిభిః ।**
**బీభత్సం తు తదారూపం ప్రాణైః కంఠగతైర్భవేత్ ॥43॥**

ఖగమా! అప్పుడు అతనిచే మృత్యువువలన కలిగే బాధ అనుభవింపబడుతుంది. అంత మెల్లగా చైతన్యం తగ్గుతూ ఉంటే జడత్వం పెరుగుతుంది. సమీపంలో ఉండే యమకింకరుల వలన అతని ప్రాణాలు మిక్కిలిగా చలించిపోతాయి, రూపం వికృతమవుతుంది. అప్పుడు ప్రాణం కంఠందాకా వచ్చి మొరాయిస్తుంది.

**ఫేనముద్గిరతే సోఽథ ముఖం లాలాకులం భవేత్ ।**
**అంగుష్ఠమాత్ర పురుషో హాహా కుర్వం స్తతస్తనోః ॥44॥**

నోటినుండి నురగ వెలువడుతుంది, చొంగ కారుతూ ఉంటుంది. అంత శరీరంనుండి అంగుష్ఠమాత్ర పురుషుడు హాహాకారాలు చేస్తాడు.

**తదైవ నీయతే దూతైర్యామ్యైర్వీక్షన్ స్వకం గృహమ్ ।**
**భయ ఏవ హి తే తాత మృత్యుకాలదశామిమామ్ ॥45॥**

అప్పుడు యమదూతల బలానికిలొంగి వారివెంట వెడతాడు. మమకారం వదలలేక తన ఇంటివైపు చూస్తూ ఉంటాడు. నాయనా! మళ్ళీ వారు విజృంభించగా ఇటువంటి మృత్యుకాలబాధను పొందుతాడు.

**ఉష్మా ప్రకుపితః కాయే తీవ్రవాయు సమీరితః ।**
**భినత్తి మర్మస్థానాని దీప్యమానో నిరింధనః ॥46॥**

తీవ్రమైన వాయువుతో ప్రేరేపింపబడి శరీరంలో అగ్నితత్త్వం చెలరేగుతుంది. ఇంధనం లేకుండగనే ప్రజ్వరిల్లి మర్మస్థానాలను విరిచివేస్తుంది.

**ఉదానో నామ పవనస్తత శ్చోర్ధ్వం ప్రవర్తతే ।**
**భక్తానామబుభుక్షాణా మధోగతి నిరోధకృత్ ॥47॥**

**యైర్నానృతాని చోక్తాని ప్రీతిభేదః కృతో న చ ।**
**ఆస్తికః శ్రద్ధధానశ్చ స సుఖం మృత్యుమృచ్ఛతి ॥48॥**

భక్తజనులకు, భోగాలపై (తిండిపై) ఆసక్తిలేనివారికి, అధోగతిని నివారిస్తూ, ఉదానమనే వాయువు ప్రశాంతంగా పైకి ప్రవహించి నిర్గమిస్తుంది. అసత్యం పలకనివారికి, విశ్వాసాన్ని వమ్ము చేయనివారికి, ఆస్తికులకు, పూజాదులపై శ్రద్ధకలిగిన వారికి అదే మృత్యువు సుఖంతో కూడుకొని ఉంటుంది.

**యో న కామాన్న సంరంభాన్న ద్వేషాద్ధర్మముత్సృజేత్ ।**
**యథోక్తకారీ సౌమ్యశ్చ స సుఖం మృత్యుమృచ్ఛతి ॥49॥**

ఎవడు కామానికి లొంగకుండా, మంచి పనులలో అలసత్వం చూపకుండా, ద్వేషంతో ధర్మాన్ని విడిచిపెట్టకుండా, స్వధర్మాన్ని యథావిధిగా ఆచరిస్తూ, సౌమ్యంగా జీవిస్తాడో అట్టివానిని మృత్యువు సుఖంగా తీసుకొనిపోతుంది.

**మోహజ్ఞానప్రదాతారః ప్రాప్నువంతి మహత్తమః ।**
**కూటసాక్షీ మృషావాదీ యే చ విశ్వాసఘాతుకాః ॥50॥**

**తే మోహం మృత్యుమృచ్ఛంతి తథా యే వేదనిందకాః ।**
**విభీషకాః పూతిగంధా యష్టిముద్గరపాణయః ॥51॥**

**ఆగచ్ఛంతి దురాత్మానో యమస్య పురుషాస్తదా ।**
**ప్రాప్తేత్వీదృక్పథే ఘోరం జాయతే తస్య వేపథుః ॥52॥**

మోహింపజేసే జ్ఞానాన్ని (అజ్ఞానాన్ని) ఉపదేశించేవారు అంధతమస్సును పొందుతారు. కూటసాక్షి (అబద్ధపు సాక్ష్యమిచ్చువాడు) అసత్యవాది, విశ్వాసఘాతకులు, వేదనిందకులు మోహమనే మృత్యువును పొందుతారు. ఘోరభయంకరులు, దుర్గంధ భూయిష్ఠులు, దురాత్ములయిన యమకింకరులు కఱ్ఱలు, ముద్గరాలు చేతబట్టి ఆ సమయంలో వస్తారు. ఇటువంటి ఘోరమైనతీరు కంటికి కన్పించగా అతనికి వణకు పుట్టుకొనివస్తుంది.

**క్రందయత్యవిరతం సోఽపి పితృమాతృ సుతానపి ।**
**సాస్య వాగస్ఫుటా యత్నే నైకవర్ణా విభాసతే ॥53॥**

**దృష్టి ర్వై భ్రామ్యతే త్రాసాచ్ఛ్వాసాచ్ఛుష్యతి చాననమ్ ।**
**సతతో వేదనావిష్ట స్తచ్ఛరీరం విముంచతి ॥54॥**

అతడు తల్లిదండ్రులను, కొడుకులను అరచి అరచి పిలుస్తాడు. కాని నోటినుండి మాటరాదు. ఎంతగింజుకున్నా ఒక్క శబ్దం బయటకురాదు. కళ్లు గిరగిరా తిరుగుతూ ఉంటాయి. ఎగఊపిరి వస్తుంది. ముఖం పొడి పొడిగా అయిపోతుంది. భరింపరాని వేదన ఎక్కువగా పొందుతూ, తన శరీరాన్ని విడుస్తాడు.

**అస్పృశ్యం కుత్సనీయం చ తత్క్షణాదేవ జాయతే ।**
**ఉక్తం మృత్యోః స్వరూపం తు ప్రసంగాదన్యదప్యథ ॥55॥**

వెంటనే శరీరంతా ముట్ట వీలులేనిదై అసహ్యంగా మారి పోతుంది. మృత్యుస్వరూపం ఈ విధంగా తెలియజేయబడింది. ప్రాసంగికంగా మరోవిషయాన్ని కూడ చెప్తాను.

**వైచిత్ర్యోత్తరం ప్రశ్నే ద్వితీయస్య వదామి తే ।**
**కర్మణాం ప్రాక్తనానాం తు తదసత్త్వేన భేదతః ॥56॥**

**భవేద్భోగస్య వైచిత్ర్యం భ్రామ్యతాం ప్రాణినామిహ ।**
**దేవత్వ మసురత్వం చ యక్షత్వాది సుఖప్రదమ్ ॥57॥**

**మనుష్యత్వం పశుత్వం చ పక్షిత్వాద్యతి దుఃఖదమ్ ।**
**కర్మణాం తారతమ్యేన భవతీహ ఖగేశ్వర ॥58॥**

అనేక విధాలైన సమాధానాలలో, నీ రెండవప్రశ్నకు సమాధానం చెబుతున్నాను. పూర్వజన్మలలోని కర్మఫలాలలోని భావా భావ భేద భోగంవల్ల సంసారంలో భ్రమించే ప్రాణికోటికి భోగాలలో వివిధమైన వైచిత్ర్యం కలుగుతూ ఉంటుంది. దేవత్వం, అసురత్వం, సుఖదాయకమైన యక్షత్వం, మనుష్యత్వం, పశుత్వం, మిక్కిలి దుఃఖదాయకమైన పక్షిత్వం మున్నగునవి, కర్మల తారతమ్యభేదంచే కలుగుతూ ఉంటాయి ఖగేంద్రా!

**అత్ర తే కీర్తయిష్యామి విపాకం కర్మణామహమ్ ।**
**వైచిత్ర్యస్య స్ఫుటత్వాయ యైర్జీవః సంసరత్యయమ్ ॥59॥**

ఈ వైచిత్ర్యం వల్లనే జీవుడు సంసారంలో చరిస్తాడు. దాని స్పష్టతకై నేను నీకు కర్మవిపాకాన్ని గూర్చి చెప్పబోతున్నాను.

**మహాపాతకజాన్ ఘోరాన్ నరకాన్ ప్రాప్య దారుణాన్ ।**
**కర్మక్షయాత్ప్రజాయంతే మహాపాతకినః క్షితౌ ॥60॥**

దారుణ, ఘోర, మహాపాతకాలవల్ల కలిగే నరకాలను పొంది, కర్మక్షయమవుతూ ఉండగా, ఆ మహాపాపాత్ములు భూమిలో జన్మిస్తారు.

**జాయంతే లక్షణైర్యేస్తు తాని మే శృణు సత్తమ ।**
**మృగాశ్వసూకరోష్ట్రానాం బ్రహ్మహా యోనిమృచ్ఛతి ॥61॥**

శ్రేష్ఠుడా! ఏఏ లక్షణాలతో ఉన్నవాడు (ఏ పాపాలకు) ఎటువంటి జన్మ పొందుతాడో, వాటిని నేను చెబుతున్నాను. విను. బ్రహ్మహత్య చేసేవాడు మృగం, అశ్వం, సూకరం, ఒంటె జన్మలు పొందుతాడు.

**కృమికీట పతంగత్వం స్వర్ణహారీ సమాప్నుయాత్ ।**
**తృణగుల్మలతాత్వం చ క్రమశో గురుతల్పగః ॥62॥**

బంగారాన్ని దొంగిలించినవాడు క్రిమి, కీటకం, పతంగం(పక్షి, మిడత) జన్మలు పొందుతాడు. గురుతల్పగుడు గడ్డి, దుబ్బు, లత మున్నగువానిని వరుసగా పొందుతాడు.

**బ్రహ్మహా క్షయరోగీ స్యాత్ సురాపః శ్యావదంతకః ।**
**హేమహారీ తు కునఖీ దుశ్చర్మా గురుతల్పగః ॥63॥**

బ్రహ్మహంత క్షయరోగి అవుతాడు. సురాపానం చేసేవాడు నల్లని పళ్లు (పిప్పిపళ్లు) కలిగినవాడవుతాడు. హేమాపహారి చెడ్డగోళ్లు పొందినవాడవుతాడు. గురుతల్పగుడు చెడుచర్మం కల్గినవాడవుతాడు.

**యో యేన సంవసత్యేషాం స తల్లింగోఽభిజాయతే ।**
**సంవత్సరేణ పతతి పాతితేన సహచరాన్ ॥64॥**

ఎవడు ఏ దోషంతో కూడుకొని ఉంటాడో, అతడు ఆయా యోనులలో జన్మిస్తాడు. సంవత్సరకాలం అలా పడిపోయి సహచరులను కూడ పడవేస్తాడు.

**సంలాపస్పర్శనిఃశ్వాస సహయానాశనాసనాత్ ।**
**యాజనాధ్యాపనౌద్యోనాత్ పాపం సంక్రమతే నృణామ్ ॥65॥**

సంలాపం, స్పర్శం, నిఃశ్వాసం, సహయానం, సహాశనం, సహాసనం, యాజనం, అధ్యాపనం, మున్నగు యోనులవల్ల (పాపయోని సంగంవల్ల) నరులకు పాపం సంక్రమిస్తుంది.

**గత్వా దారాన్ పరేషాఞ్చ బ్రహ్మస్వమపహృత్య చ ।**
**అరణ్యే నిర్జనే దేశే జాయతే బ్రహ్మరాక్షసః ॥66॥**

పరదారలను పొందేవాడు, బ్రాహ్మణుల సొమ్మును అపహరించేవాడు, అరణ్యంలో నిర్జనప్రదేశంలో బ్రహ్మరాక్షసుడై పుడతాడు.

**హీనజాతౌ ప్రజాయేత రత్నానామపహారకః ।**
**పత్రం చ శాఖినో హృత్వా గంధాశ్ఛుచ్ఛుందరీ పుమాన్ ॥67॥**

రత్నాలను అపహరించేవాడు హీనజాతిలో పుడతాడు. ఆకులు, కొమ్మలు(కూరలు) గంధాలను అపహరించే పురుషుడు చుంచువు అవుతాడు.

**మూషలో ధాన్యహారీ స్యాద్యానముష్ట్రః ఫలం కపిః ।**
**నిర్మంత్రభోజనాత్కాకో గృధ్రో హృత్వా హ్యుపస్కరమ్ ॥68॥**

ధాన్యాన్ని హరించేవాడు ఎలుక, వాహనాన్ని అపహరించేవాడు ఒంటె, పండ్లను అపహరించేవాడు కోతి, పిలవకుండా భోజనానికి వచ్చేవాడు కాకి, మాంసం దొంగిలించేవాడు గ్రద్ద అవుతాడు. ఇంగువ, జీలకఱ్ఱ అపహరించేవాడు కూడ గ్రద్ద అవుతాడు.

**మధుదంశః ఫలం గృధ్రో గాం గోధాగ్నిం బకస్తథా ।**
**స్యాచ్ఛ్వేత కుష్ఠీ స్త్రీవస్త్రం హ్యరుచీ రసహారకః ॥69॥**

మధువును దొంగిలించువాడు అడవిఈగ, మాంసాహారి గ్రద్ద, ఆవును అపహరించువాడు, గోశాలకు నిప్పుపెట్టేవాడు కొంగ, స్త్రీవస్త్రాపహారి తెల్లమచ్చలు కలవాడు, రసాలను హరించువాడు రుచితెలియనివాడుగా అవుతాడు.

**కాంస్యహారీ తు హంసః స్యాత్ పరస్వస్య చ హారకః ।**
**అపస్మారీ గురోర్హంతా క్రూరకృద్వామనో భవేత్ ॥70॥**

కంచును హరించువాడు హంస, పరులసొమ్ము హరించువాడు మూర్ఛరోగి, గురుహంత క్రూరమైన పనులుచేసే మరుగుజ్జు అవుతాడు.

**ధర్మపత్నీం త్యజఞ్ఛబ్దవేధీ ప్రాణీ భవేత్ క్షితౌ ।**
**దేవవిప్రస్వాపహారీ పాండురః పరమాంసభుక్ ॥71॥**

ధర్మపత్నిని విడిచినవాడు భూమియందు శబ్దవేధియై జన్మిస్తాడు. దేవవిప్రమాన్యాలను అపహరించువాడు పాండురోగి, పరమాంసభక్షకుడు అవుతాడు.

**భక్ష్యాభక్ష్యో గండమాలీ మహారోగీ ప్రజాయతే ।**
**న్యాసాపహారీ కాణః స్యాత్ స్త్రీజీవః ఖంజరో భవేత్ ॥72॥**

భక్ష్యాలను ఎక్కువగా తినేవాడు మెడచుట్టూ గడ్డలు లేచే జబ్బుకలవాడు, అభక్ష్యాలను తినేవాడు మహారోగి అవుతాడు. న్యాసద్రవ్యాన్ని అపహరించేవాడు ఒంటికన్ను వాడవుతాడు. స్త్రీపై ఆధారపడి జీవించేవాడు కుంటికాలు వాడవుతాడు.

**కౌమారదారత్యాగీ చ దుర్భగోఽథైకమిష్టభుక్ ।**
**వాతగుల్మీ విప్రయోషిద్గామీ వా జంబుకో భవేత్ ॥73॥**

కుమారులను, భార్యను విడిచిపెట్టినవాడు దుర్భగుడవుతాడు. ఇతరులకు పెట్టకుండా ఒక్కడే ఇష్టపదార్థాలను భుజించేవాడు వాతగుల్మరోగి అవుతాడు. బ్రాహ్మణపత్నితో అక్రమసంబంధం ఉన్నవాడు నక్క అవుతాడు.

**శయ్యాహర్తా క్షపణకః పతంగో వస్త్రహారకః ।**
**మాత్సర్యాదపి జాత్యంధః కపాలీ దీపహారకః ॥74॥**

శయ్యను దొంగిలించినవాడు క్షపణకుడు (దరిద్రుడు, అశుచి) అవుతాడు.వస్త్రాపహారి దీపపు పురుగు అవుతాడు. మాత్సర్యగ్రస్తుడు పుట్టుగ్రుడ్డి అవుతాడు. దీపాలను దొంగిలించేవాడు కపాలిగా పుడతాడు.

**కౌశికో మిత్రహంతా చ క్షయీ పిత్రాదినిందకః ।**
**స్ఖలద్వాగనృతవాదీ చ కూటసాక్షీ జలోదరీ ॥75॥**

మిత్రులను చంపేవాడు గుడ్లగూబ అవుతాడు. తల్లిదండ్రులను మున్నగువారిని నిందించేవాడు క్షయరోగి అవుతాడు. మాటపై నిలకడ లేనివాడు, అసత్యవాది, కూటసాక్షి జలోదరవ్యాధితో జన్మిస్తాడు.

**మశకః సోఽథచ్ఛిన్నోష్ఠో వివాహే విఘ్నకృద్భవేత్ ।**
**స్యాద్వాథ వృషలః సోఽయం చత్వరే వై విణ్మూత్రకృత్ ॥76॥**

**మూత్రకృచ్ఛ్రీ దూషకస్తు కన్యాయాః క్లీబతామియాత్ ॥**
**ద్వీపీ స్యాద్వేదవిక్రేతా వరాహోఽయాజ్య యాజకః ॥77॥**

వివాహంలో విఘ్నాలు కలగజేసేవాడు పెదవులు మున్నగు వాటిని విరిచేరోగం గల జన్మ (లేదా) దోమ వంటి జన్మ పొందుతాడు లేదా వృషలుడు అవుతాడు. కూడలిలో మలమూత్ర విసర్జన చేసేవాడు కూడ వృషలుడు అవుతాడు. లేదా మూత్రకృచ్ఛ్రరోగం కల్గినవాడవుతాడు. కన్యపై అపవాదు వేసేవాడు నపుంసకుడు అవుతాడు. వేదాన్ని అమ్ముకొనేవాడు పులిగా జన్మిస్తాడు. అయాజ్యయజ్ఞం చేసేవాడు పంది అవుతాడు.

**యతస్తతోఽశ్నన్మార్జారో ఖద్యోతో వనదాహకః ।**
**కృమిః పర్యుషితాదః స్యాన్మత్సరీ భ్రమరో భవేత్ ॥78॥**

ఏది కనపడితే అది తినేవాడు పిల్లి అవుతాడు, వనాలను అంటించేవాడు మిణుగుడు పురుగు అవుతాడు. చాలాకాలం క్రితం వండినది తినేవాడు కృమి అవుతాడు. మదంతో ప్రవర్తించేవాడు తేనెటీగ అవుతాడు.

**అగ్న్యుత్సాదీ తు కుష్ఠీ స్యాదదత్తాఽఽదానతో వృషః ।**
**సర్పో గోహారకోఽన్నస్య హారకః స్యాదజీర్ణవాన్ ॥79॥**

అగ్నిని పెల్లగించేవాడు (ఉమ్మేవాడు) లేదా గృహాదులకు నిప్పుపెట్టేవాడు కుష్ఠరోగి అవుతాడు. ఈయకుండా స్వీకరించేవాడు (లేదా) దాతకు ఇష్టంలేకున్నా దానమిప్పించేవాడు ఎద్దు అవుతాడు. గోవులను అపహరించేవాడు పాము అవుతాడు, అన్నాన్ని హరించేవాడు అజీర్ణరోగిగా జన్మిస్తాడు.

**జలహారీ తు మత్స్యః స్యాత్ క్షీరహారీ వలాకికా ।**
**అన్నం పర్యుషితం విప్రే ప్రదదత్కుబ్జతాం వ్రజేత్ ॥80॥**

జలప్రవాహాలను పాడు చేసేవాడు (దొంగిలించేవాడు) చేప అవుతాడు, పాలను దొంగిలించేవాడు కొంగ అవుతాడు, బ్రాహ్మణునకు పాసిపోయిన అన్నం పెట్టేవాడు గూనివాడు అవుతాడు.

**ఫలాని హరతే యస్తు సంతతిర్మ్రియతే ఖగ ।**
**అదత్త్వా భక్ష్యమశ్నాతి హ్యనపత్యో భవేన్నరః ॥81॥**

ఖగమా! పండ్లను ఎవడయితే హరిస్తాడో అతని సంతతి నశిస్తుంది. ఎదుటివారికి పెట్టకుండా భక్ష్యం తినే నరుడు సంతానహీనుడవుతాడు.

**ప్రవజ్యాఽగమనాద్రాజన్ భవేన్మరుపిశాచకః ।**
**చాతకో జలహర్తా స్యాజ్జన్మాంధః పుస్తకం హరన్ ॥82॥**

పక్షిరాజా! తాపస స్త్రీపై కామవికారం పొందేవాడు మరుభూమిలో పిశాచమవుతాడు, జలాపహారి చాతకపక్షిగా జన్మిస్తాడు, పుస్తకాన్ని అపహరించేవాడు పుట్టుగ్రుడ్డి అవుతాడు.

**ప్రతిశ్రుత్య ద్విజేభ్యోఽర్థమదదజ్జంబుకో భవేత్ ।**
**పరివాదాది జాతీనాం లభతే కాచ్ఛపీం తనుమ్ ॥83॥**

ద్విజులకు ఇచ్చెదననిచెప్పి, ధనాన్ని ఈయనివాడు నక్కగా జన్మిస్తాడు, తోటివారిపై అసత్యంగా నిందలు వేసేవాడు తాబేలుగా పుడతాడు.

**దుర్భగః ఫలవిక్రేతా వృకశ్చ వృషలీపతిః ।**
**మార్జారోఽగ్నిం పదా స్పృష్ట్వా రోగవాన్ పరమాంసభుక్ ॥84॥**

ఫలాలను అమ్మేవాడు దుర్భగుడవుతాడు, వృషలీపతి తోడేలుగా జన్మిస్తాడు. అగ్నిని పాదాలతో తాకేవాడు మార్జారమవుతాడు. పరమాంసాదులను భుజించేవాడు రోగగ్రస్తుడై పుడతాడు.

**జలప్రస్రవణం యస్తు భింద్యాన్మత్స్యో భవేన్నరః ।**
**హరేః కథాం న శృణ్వంతి యేన సాధుజనస్తవమ్ ॥85॥**

**తాన్నరాన్ కర్ణమూలోఽయం వ్యాప్నుయాన్నేతరాన్ జనాన్ ।**
**పరస్యాననసంస్థం యో గ్రాసం హరతి మందధీః ॥86॥**

జలప్రవాహాలను అడ్డుకొనే నరుడు చేప అవుతాడు, హరికథను వినని వారు, సాధుజనులను స్తుతించనివారు, ఇతర జనులను అడ్డుకొనేవారు కర్ణమూలవ్యాధి కలవారవుతారు. ఎదుటివారి నోటివద్దనున్న కూటిని లాగివేసేవారు మందబుద్ధిగా జన్మిస్తారు.

**దేవోపకరణాన్యేనం గండమాలినమీహతే ।**
**దంభేనాచరతే ధర్మం గజచర్మా భవేత్తు సః ॥87॥**

దేవోపకరణాలను దొంగిలించేవాడు గడ్డలు కలవాడవుతాడు, దంభంగా ధర్మం ఆచరించేవాడు గజచర్మరోగిగా జన్మిస్తాడు.

**శిరోఽర్తి ప్రముఖా రోగా యాంతి విశ్వాసఘాతకమ్ ।**
**లింగపీడే శివ స్వంచ శివనిర్మాల్యమేవ చ ॥88॥**

శిరస్సుకు సంబంధించిన రోగాలన్నీ విశ్వాస ఘాతకుని పొందుతాయి, శివద్రవ్యాన్ని, శివనిర్మాల్యాన్ని అపహరించే వాడు లింగపీడితుడవుతాడు.

**స్త్రియోఽప్యనేన మార్గేణ హృత్వా దోషమవాప్నుయుః ।**
**ఏతేషామేవ జంతూనాం భార్యాత్వముపజాయతే ॥89॥**

స్త్రీలుకూడా ఈ మార్గంచేతనే దోషాలు పొందుతారు. పురుషజన్మ ధరించకపోతే ఆ పాపప్రాణులకే భార్యలుగా జన్మిస్తారు.

**భోగాన్తే నరకస్యైతత్ సర్వమిత్యవధారయ ।**
**ఖగ ప్రదర్శ్యమేతత్తు మయోక్తం తే సమాసతః ॥**
**ద్రవ్య ప్రకారా హి యథా తథైవ ప్రాణిజాతయః ॥90॥**

నరకలోకానుభవం పూర్తి అయిన తరవాత ఈ విధంగా అంతా జరుగుతుందని గ్రహించు. ఖగమా! ఇదంతా నీకు సంక్షేపంగా నేను తెలియజేశాను. గమనించాలి. ఈ జగత్తులో ఎన్ని ద్రవ్యరూపాలు ఉన్నాయో అన్ని విభిన్న ప్రాణజాతులు ఉన్నాయి.

**ఏవం విచిత్రైర్నిజకర్మభిర్నృణాం సుఖస్య దుఃఖస్య చ జన్మనామపి ।**
**వైచిత్ర్యముక్తం శుభకర్మతః శుభం తథాఽశుభాచ్చాశుభమీరయంతి ॥91॥**

**ఏతత్తే సర్వమాఖ్యాతం యత్పృష్టోఽహమిహ త్వయా ॥92॥**

ఈవిధంగా నరులయొక్క వివిధ కర్మలననుసరించి, సుఖంయొక్క, దుఃఖం యొక్క వైచిత్ర్యం చెప్పబడింది. శుభకర్మవలన శుభం, అశుభకర్మవలన అశుభం కలుగుతుంది. నీవు ఏదయితే అడిగావో, దానినంతా నీకు చెప్పడం జరిగింది.

**శ్రీగారుడమహాపురాణం ఉత్తరఖండం రెండో అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఔర్ధ్వదైహికవిధి కర్మవిపాకయోర్వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఔర్ధ్వదైహిక కర్మవిపాక విధులు అనే రెండవ అధ్యాయం సమాప్తం.

## తృతీయోఽధ్యాయః – మూడవ అధ్యాయం

## నరకప్రవేశం నిర్గమనమ్ – నరకప్రవేశం నిర్గమనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవముత్సాహితః పక్షీ స్వరూపం నిరయస్య తు ।**
**పప్రచ్ఛ నరకాణ్యేవం శ్రుత్వా చోత్కూలితాంతరః ॥1॥**

ఇదివిన్న గరుత్మంతుడు ఉత్సాహవంతుడై నరకంయొక్క స్వరూపాన్నీ, వివిధ నరకాలను గురించి తహతహతో కూడిన మనస్సుతో ఇలా అడిగాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**నరకాణాం స్వరూపం మే వద యేషు వికర్మిణః ।**
**పాత్యంతే దుఃఖభూయిష్ఠాస్తేషాం భేదాంశ్చ కీర్తయ ॥2॥**

దుఃఖాలను ఎక్కువగా పొందే, నిషిద్ధకర్మలు ఆచరించేవారు ఏ నరకాలలో పడిపోతారో, వాటి స్వరూపాన్ని నాకు వివరించు. నరకాలలోని భేదాలను గురించికూడ తెలియజెప్పవలసింది.

**శ్రీ భగవానువాచ** – శ్రీ భగవంతుడు అన్నాడు.

**నరకాణాం సహస్రాణి వర్తంతే హ్యరుణానుజ ।**
**శక్యం విస్తరతో నైవ వక్తుం ప్రాధాన్యతో బ్రువే ॥3॥**

అరుణుని సోదరుడవైన గరుడా! వేలకొలది నరకాలు ఉన్నాయి. వాటినన్నింటిని విస్తరించి చెప్పడం వీలుకాదు. ప్రధానమైన వాటిని చెబుతాను.

**రౌరవం నామ నరకం ముఖ్యం తద్వై నిబోధ మే ।**
**రౌరవే కూటసాక్షీ తు యాతి యశ్చానృతీనరః ॥4॥**

రౌరవమనే నరకం చాలా ముఖ్యమైనది. దానిని గురించి నాద్వారా తెలిసికొనుము. కూటసాక్షియైనవాడు, అసత్యమాడే నరుడు అక్కడకు చేరుకొంటారు.

**యోజనానాం సహస్రే ద్వే రౌరవో హి ప్రమాణతః ।**
**జానుమాత్రప్రమాణం తు తత్ర గర్తం సుదుస్తరమ్ ॥5॥**

దాని ప్రమాణం రెండువేల యోజనాల విస్తీర్ణం. ఆ రౌరవంచుట్టూ మోకాలిలోతు ప్రమాణంగల కందకం ఉంది. అది దాటశక్యం కానిది.

**తత్రాంగారచయౌఘేన కృతం తద్ధరణీసమమ్ ।**
**తత్రాగ్నినా సుతీవ్రేణ తాపితాంగారభూమినా ॥6॥**

**తన్మధ్యే పాపకర్మాణం విముంచంతి యమానుగాః ।**
**సదహ్యమాన స్తీవ్రేణ వహ్నినా పరిధావతి ॥7॥**

అక్కడ నిప్పుల గుంపులతో సమానంగా భూమి నిర్మింపబడింది. అక్కడ తీవ్రంగా అగ్ని జ్వలిస్తూ ఉంటుంది. అది అంగారభూమిగా చేయబడింది. దాని మధ్యలో యమకింకరులు పాపాత్ముని విడిచిపెడతారు. ఆ పాపి తీవ్రాగ్నితో కాలిపోతూ అటూ ఇటూ పరుగులు తీస్తాడు.

**పదే పదే చ పాదోఽస్య స్ఫుట్యతే శీర్యతే పునః ।**
**అహోరాత్రేణోద్ధరణం పాదన్యాసేన గచ్ఛతి ॥8॥**

**ఏవం సహస్రం విస్తీర్ణం యోజనానాం విముచ్యతే ।**
**తతోఽన్యత్పాపశుద్ధ్యర్థం తాదృఙ్నిరయమృచ్ఛతి ॥9॥**

అడుగు అడుగు నందు పాదాలు బొబ్బలెక్కిపోతాయి. కన్నాలుపడిపోతాయి. రాత్రి పగలు అనే భేదం లేక లాగబడుతూ, పాదాలు అందు ఉంచుతూ పరుగులు తీస్తాడు. అలా ఒక వేయి యోజనాల దూరం పరుగులు తీశాక ఆ పాపి శుద్ధికొరకై అటువంటి నరకమే అయిన మరో నరకంలో త్రోసివేయబడతాడు.

**రౌరవస్తే సమాఖ్యాతః ప్రథమో నరకో మయా ।**
**మహారౌరవ సంజ్ఞం తు శృణుష్వ నరకం ఖగ ॥10॥**

నేను మొదటి నరకమైన రౌరవాన్ని గురించి నీకు తెలియజేశాను. ఖగమా! మహారౌరవమనే పేరుగల నరకాన్ని గురించి విను.

**యోజనానాం సహస్రాణి సంతి పంచ సమంతతః ।**
**తత్ర తామ్రమయీ భూమి రధస్తస్యా హుతాశనః ॥11॥**

ఈ నరకం అయిదువేల యోజనాల విస్తీర్ణంలో చుట్టూ పరచుకొని ఉంది. అక్కడి నేల రాగిరేకువలె ఉంటుంది. దానిక్రింద అగ్ని రగులుతూ ఉంటుంది.

**తథా తపంత్యా సా సర్వా ప్రోద్యద్విద్యుత్సమప్రభా ।**
**విభావ్యతే మహారౌద్రా పాపినాం దర్శనాదిషు ॥12॥**

అలా అగ్ని రగులుతూ ఉండగా భూమి ప్రభాసమైన విద్యుత్తువంటి కాంతితో ఉంటుంది. అది పాపులకు చూడడానికి మహా భయంకరంగా కనిపిస్తూ ఉంటుంది.

**తస్యాం బద్ధకరాభ్యాం చ పద్భ్యాం చైవ యమానుగైః ।**
**ముచ్యతే పాపకృన్మధ్యే లుంఠమానః సగచ్ఛతి ॥13॥**

అందు యమదూతలచే కాళ్లు, చేతులు కట్టివేయబడి, మధ్యలో త్రోసివేయబడి, ఆ యమదూతలు దొర్లిస్తూ ఉండగా పాపాత్ముడు దొర్లుతూ వెడుతూ ఉంటాడు.

**కాకైర్బకై ర్వృకోలూకై ర్మశకై ర్వృశ్చికై స్తథా ।**
**భక్ష్యమాణై స్తథా రౌద్రైర్గతో మార్గే వికృష్యతే ॥14॥**

మార్గంలో భయంకరములయిన కాకులు, కొంగలు, తోడేళ్లు, గుడ్లగూబలు, దోమలు, తేళ్లు వచ్చి పొడుస్తూ, చీల్చుతూ, కరుస్తూ, కుడుతూ, అందినంత మేరకు నమిలి తింటూ ఉండగా ముందుకు సాగుతాడు.

**దహ్యమానో గతమతి ర్భ్రాంత స్తాతేతిచాకులః ।**
**వదత్యసకృదుద్విగ్నో న శాంతిమధిగచ్ఛతి ॥15॥**

అలా బాధననుభవిస్తూ తెలివి తప్పిన వాడవుతాడు. తెలివి వచ్చి విభ్రాంతుడవుతాడు. బాబోయ్! అని ఒక్కసారి వ్యాకులుడై అరుస్తాడు. మళ్లీ మిక్కిలి దుఃఖిస్తాడు. ఇలా శాంతి అన్నది లేక పోతూఉంటాడు.

**ఏవం తస్మాన్నరై ర్మోక్షస్త్వతిక్రాంతై రవాప్యతే ।**
**వర్షాయుత యుతైః పాపం యైః కృతం దుష్టబుద్ధిభిః ॥16॥**

ఈవిధంగా దుష్టబుద్ధులు పదివేల సంవత్సరాల కాలం చేసిన పాపాన్నిబట్టి శిక్ష అనుభవిస్తారు. మొత్తానికి ఎట్టకేలకు నరులు దానినుండి విడుదల పొంది బయటపడతారు.

**తథాన్యస్తు తతో నామ సోఽతిశీతః స్వభావతః ।**
**మహారౌరవ వద్దీర్ఘ స్తథాంధ తమసా వృతః ॥17॥**

అలాగే అతిశీతమనే పేరుగల మరో నరకం ఉంది. అది స్వభావంతో మహారౌరవంతో సమానంగా పెద్దదైనది. చిమ్మచీకటితో అంతానిండి ఉంటుంది.

**శీతార్తా స్తత్ర బధ్యంతే నరాస్తమసి దారుణే ।**
**పరస్పరం సమాసాద్య పరిరభ్యాశ్రయంతి తే ॥18॥**

**దంతాస్తేషాం చ భజ్యంతే శీతార్తిపరికంపితాః ।**
**క్షుత్తృషాతిబలాః పక్షిన్నథ తత్రాప్యుపద్రవాః ॥19॥**

అక్కడ పాపులు భయంకరమైన చీకటిలో బంధింపబడి చలితో వణకిపోతూ ఉంటారు. ఏదీ కనబడక దిక్కుతోచక ఒకరినొకరు పట్టుకొని కౌగిలించుకుంటూ ఉంటారు. వారి పళ్లు టపటపా కొట్టుకొని విరిగిపోతూ ఉంటాయి. శీతలబాధతో గజగజవణకి పోతారు. ఖగమా! మిక్కిలి ఎక్కువగా ఆకలి, దాహం పీడిస్తాయి. అక్కడ ఎన్నో ఉపద్రవాలు.

**హిమఖండవహోవాయు ర్భినత్త్యస్థీని దారుణః ।**
**మజ్జాసృగస్థిగలిత మశ్నంత్యత్ర క్షుధాన్వితాః ॥20॥**

మంచు గడ్డల్ని వహించే గాలులు భయంకరంగా ఎముకలను పుటుక్కున విరిచివేస్తాయి. అక్కడ ఎక్కువ ఆకలితో పీడింపబడి మజ్జ, రక్తం, ఎముకలు, జారినవాటిని మ్రింగుతూ ఉంటారు.

**ఆలింగ్యమానా భ్రామ్యంతే పరస్పర సమాగమే ।**
**ఏవం తత్రాపి సుమహాన్ క్లేశ స్తమసి మానవైః ॥21॥**

ఒకరి నొకరు పట్టుకొంటూ, ఆలింగనం చేసుకొంటూ పరిభ్రమిస్తారు. ఈ విధంగా మానవు లక్కడ చిమ్మ చీకటిలో ఎంతో మిక్కుటమైన క్లేశం పొందుతారు.

**ప్రాప్యతే శకునిశ్రేష్ఠ యో బహూకృత సంచయః ।**
**నికృంతన ఇతి ఖ్యాతస్తతో ऽ న్యో నరకోత్తమః ॥22॥**

పక్షిశ్రేష్ఠమా! అక్కడ నికృంతనమనే పేరుగల మరో పెద్దనరకం ఉంది. బాగా ఎక్కువ పాపాలు చేసేవారు అందు పడద్రోయబడతారు.

**కులాల చక్రాణి తత్ర భ్రామ్యంత్యవిరతం ఖగ ।**
**తేష్వారోప్య నికృష్యన్తే కాలసూత్రేణ మానవాః ॥23॥**

ఖగమా ! అక్కడ కుమ్మరిచక్రాల వంటివి ఎల్లప్పుడూ తిరుగుతూ ఉంటాయి. పాపులైన మానవులు అందు ఎక్కించబడి (నిలబెట్టబడి) కాలసూత్రంచే త్రిప్పబడుతూ ఉంటారు.

**యమానుపాంగులిస్థేన ఆపాదతలమస్తకమ్ ।**
**న చైషాం జీవితభ్రంశో జాయతే పక్షిసత్తమ ॥24॥**

**ఛిన్నాని తేషాం శతశః ఖండాన్యైక్యం వ్రజంతి హి ।**
**ఏవం వర్షసహస్రాణి భ్రామ్యంతే పాపకర్మిణః ॥25॥**

(చక్రాలక్రింద సూదులు ఉంటాయి. చక్రం కదలగానే అవి పాపుల కాలి నుండి శిరస్సు వరకు పయనిస్తాయి) పక్షీంద్రా! వ్రేళ్లసందులతో సహా పాదం నుండి శిరస్సువరకు పాపులు యమయాతనలు పొందుతారు. అయినా వారికి పాపజీవితం నశించదు. వారి శరీరాలు వందలకొలది ముక్కలుగా నరకబడి మళ్లీ తిరిగి ముద్దగా అయిపోతాయి. ఈవిధంగా పాపకర్ములు వేల సంవత్సరాలు పరిభ్రమిస్తూ ఉంటారు.

**తావద్యావదశేషం చ తత్పాపం సంక్షయం గతమ్ ।**
**అప్రాతష్ఠం చ నరకం శృణుష్వ గదతో మమ ॥26॥**

సమస్తపాపం క్షయమయ్యేటంతవరకు అక్కడ పడిఉంటాడు. అక్కడ అప్రాతష్ఠమనే మరో నరకం ఉంది దానిని గురించి వివరిస్తాను. విను.

**తత్రస్థై ర్నారకై ర్దుఃఖమసహ్య మనుభూయతే ।**
**తాన్యేవ తత్ర చక్రాణి ఘటీయంత్రాణి చాన్యతః ॥27॥**

**దుఃఖస్య హేతు భూతాని పాపకర్మకృతాం నృణామ్ ।**
**చక్రేష్వారోపితాః కేచిద్ భ్రామ్యంతే తత్ర మానవాః ॥28॥**

అక్కడ నున్నవారిచే సహింపరాని నరకదుఃఖం అనుభవింపబడుతూ ఉంటుంది. అక్కడకూడ అటువంటి చక్రాలే ఉంటాయి. మరో ప్రక్క ఘటీయంత్రాలు ఉంటాయి. దుఃఖానికి హేతుభూతాలైన పాపకర్మలు చేసే నరులు చక్రాలయందు ఎక్కింపబడి, అక్కడ గిర గిరా త్రిప్పబడుతూ ఉంటారు.

**యావద్వర్షసహస్రాణి న తేషాం స్థితిరంతరా ।**
**ఘటీయంత్రేషు యే బద్ధా బద్ధా తోయవటీ యథా ॥29॥**

ఘటీయంత్రాలలో బంధింపబడినవారు, నీటి పిచికారీగొట్టాల స్థితివలె వర్ష సహస్రాల కాలం అయేటంత వరకు వారి స్థితిలో మార్పు ఉండదు.

**భ్రామ్యంతే మానవా రక్తముద్గిరంతః పునః పునః ।**
**అంత్రైర్ముఖవినిష్క్రాంతై ర్నేత్రైరంత్రావలంబిభిః ॥30॥**

చిమ్మబడుతూ భ్రమిస్తూ ఉంటారు మానవులు. మళ్లీ మళ్లీ రక్తం క్రక్కుతూ ఉంటారు. ప్రేగులు నోటిలోనుండి బయటకు వస్తాయి. నేత్రాలనుండి ప్రేగులు వెలుపలికివచ్చి వ్రేలాడుతూ ఉంటాయి.

**దుఃఖాని ప్రాప్నువంతీహ యాన్యసహ్యాని జంతుభిః ।**
**అసిపత్రవనం నామ నరకం శృణు చాపరమ్ ॥31॥**

ఇక్కడ ప్రాణులు భరింప శక్యంకాని దుఃఖాన్ని పొందుతారు. అసిపత్రవనమనే మరో నరకం గూర్చి విను.

**యోజనానాం సహస్రం యో జ్వలత్యగ్న్యాశ్రుతావనిః ।**
**సప్తతీవ్రకరాశ్చండైర్యత్ర తీవ్రే సుదారుణే ॥32॥**

అది వేయి యోజనాల విస్తీర్ణంలో అగ్నిజ్వాలలతో కూడిన భూమితో మండుతూ ఉంటుంది. ఆ భయంకర తీవ్ర నరకంలో ఏడుగురు సూర్యులు చండతీక్ష్ణతతో తిరుగుతూ ఉంటారు.

**ప్రతపంతి సదా తత్ర ప్రాణినో నరకౌకసః ।**
**తన్మధ్యే చరణం శీతస్నిగ్ధపత్రం విభావ్యతే ॥33॥**

**పత్రాణి యత్ర ఖండాని ఫలానాం పక్షిసత్తమ ।**
**శ్వానశ్చ తత్ర సుబలాశ్చరంత్యామిషభోజనాః ॥34॥**

అక్కడ నరకలోకవాసులైన ప్రాణులు ఎల్లప్పుడు కాలిపోతూ ఉంటారు. దాని మధ్యలో నాలుగో భాగంలో శీతస్నిగ్ధపత్రమనే వనం ఉంది. పక్షిశ్రేష్ఠమా! అక్కడ పండ్లు, ఆకులు కుప్పలుగా పడి ఉంటాయి. మాంసాన్ని భుజించే వేటకుక్కలు అక్కడ ఉంటాయి. అవి మిక్కిలి బలం కల్గినవి.

**మహావక్త్రా మహాదంష్ట్రా వ్యాఘ్రా ఇవ మహాబలాః ।**
**తతశ్చ వనమాలోక్య శిశిరచ్ఛాయమగ్రతః ॥35॥**

**ప్రయాంతి ప్రాణినస్తత్ర క్షుత్తాపపరిపీడితాః ।**
**మాతర్భ్రాతస్తాత ఇతి క్రందమానాః సుదుఃఖితాః ॥36॥**

వాటి నోళ్ళు పెద్దవి. దంతాలు ఇంకా పెద్దవి. పెద్దపులులవలె మిక్కిలి బలం కలవి. ఎదురుగా చల్లని నీడతోఉన్న ఆ వనాన్ని చూచి ఆకలిబాధతో మిక్కిలి తాపం చెందుతూ ప్రాణులు అక్కడకు పరుగులు తీస్తాయి. అమ్మా! నాన్నా! అని అరుస్తూ దుఃఖంతో రోదిస్తూ ఉంటాయి.

**దహ్యమానాంఘ్రియుగలా ధరణిస్థేన వహ్నినా ।**
**తేషాం గతానాం తత్రాపి అతిశీతః సమీరణః ॥37॥**

**ప్రవాతి తేన పాత్ర్యంతే తేషాం ఖడ్గాస్తథోపరి ।**
**ఛిన్నాః పతంతి తే భూమౌ జ్వలత్పావకసంచయే ॥38॥**

భూమిపై ఉన్న నిప్పుచే రెండు పాదాలు కాలిపోయి బొబ్బలెత్తుతాయి. వారు అలా వెడుతూ ఉండగా అతిశీతల వాయువులు వీచి వారిపై చురకత్తులవంటి ఆకులు మీద పడతాయి. భగ భగ మండిపోతున్న నిప్పులున్న నేలపై ముక్కలై పడిపోతారు.

**లేలిహ్యమానే చాన్యత్ర తప్తాశేషమహీతలే ।**
**సారమేయాశ్చ తే శీఘ్రం శాతయంతి శరీరతః ॥39॥**

**తేషాం ఖండాన్యనేకాని రుదతామతిభీషణే ।**
**అసిపత్రవనం తాత మయైతత్పరికీర్తితమ్ ॥40॥**

మహీతలమంతా మండిపోతూ కుత కుత ఉడికిపోతూ ఉండగా మరోవైపు నుంచి వెంటనే కుక్కలు మీదపడి శరీరాన్ని చీల్చివేస్తాయి. వారు మిక్కిలి భయంకరంగా ఏడుస్తూ ఉండగా వారిని పెక్కు ముక్కలు ముక్కలుగా చేసి కొరికివేస్తూ తినివేస్తాయి. నాయనా! ఇటువంటి అసిపత్రవనాన్ని గురించి నేను తెలియజేశాను.

**అతఃపరం భీమతరం తప్తకుంభం నిబోధ మే ।**
**సమంతతస్తప్తకుంభా వహ్నిజ్వాలాసమన్వితాః ॥41॥**

నేను ఇకమీదట మహాభయంకరమైన తప్తకుంభమనే నరకం గురించి చెప్పుచున్నాను. గ్రహించు. అక్కడ ఎక్కడ చూస్తే అక్కడ ప్రజ్వరిల్లుతున్న అగ్నిజ్వాలలతో కూడిన మండే పెద్ద పెద్ద బానలు ఉంటాయి.

**జ్వలదగ్నిచయాస్తప్తతైలాయశ్చూర్ణపూరితాః ।**
**ఏషు దుష్కృతకర్మాణో యామ్యైః క్షిప్తా హ్యధోముఖాః ॥42॥**

క్రింద పొయ్యిలో అగ్ని మండుతూ ఉంటుంది. బానలు సలసలా మరిగే నూనెతోను, ఇనుపరజనుతోను నిండి ఉంటాయి. యమభటులు పాపాత్ములను వీటిలో తలక్రిందులుగా పడవేస్తారు.

**క్వాథ్యన్తే విస్ఫుటద్గాత్రా గలన్మజ్జాజలాన్వితాః ।**
**స్ఫుటత్కపాలనేత్రాస్థిచ్ఛిద్యమానా విభీషణైః ॥43॥**

**గృధ్రైరుత్పాట్య ముచ్యంతే పునస్తేష్వేవ వేగితైః ।**
**పునశ్చిమశ్చిమాయంతే తైలేనైక్యం వ్రజంతి చ ॥44॥**

మజ్జ, జలం కారిపోతూ ఉండగా, శరీరాలను ముంచుతూ తేలుస్తూ, మహా భయంకరాలైన ఆయుధాలతో కపాలాలను, నేత్రాలను, ఎముకలను పొడుస్తూ వేయిస్తూ ఉంటారు. ఈలోగా వాటియందు గునపాలవంటి ముక్కులున్న గ్రద్దలు వేగంగా వచ్చి ముక్కులతో లాగుతూ వదలుతూ ఉంటాయి. మరగిన నూనెతో చిమ చిమ లాడుతూ, మళ్లీ ఒక ముద్దగా అయిపోతారు.

**ద్రవీభూతైః శిరోగాత్రైః స్నాయుమాంసత్వగస్థిభిః ।**
**తతో యామ్యైర్నరైరాశు దర్వ్యాఘట్టనఘట్టితాః ॥45॥**

**కృతావర్తే మహాతైలే క్వాథ్యంతే పాపకర్మిణః ।**
**ఏష తే విస్తరేణోక్తస్తప్తకుంభో మయా ఖగ ॥46॥**

సన్నని నరాలు, మాంసం, చర్మం, ఎముకలు బయటకురాగా, శిరస్సు, శరీరం ద్రవంకారుతూ ఉండగా, పెద్దతెడ్డుతో గట్టిగా కొట్టబడుతూ, యమభటులచే శీఘ్రంగా బాధపడుతూ, సల సల మరిగే నూనెచే కావింపబడిన సుడిగుండంలో విసరివేయబడి వేపుడు ముక్కలవలె పాపాత్ములు వేయింపబడుతూ ఉంటారు. ఖగమా! ఈ విధంగా నీకు విస్తారంగా తప్తకుంభనరకం గురించి నేను తెలియజేశాను.

**ఆదిమో రౌరవః ప్రోక్తో మహారౌరవకోఽపరః ।**
**అతిశీత స్తృతీయస్తు చతుర్థో హి నికృంతనః ॥47॥**

**అప్రతిష్ఠః పంచమః స్యాదసిపత్రవనోఽపరః ।**
**సప్తమస్తప్తకుంభస్తు సప్తైతే నరకా మతాః ॥48॥**

మొదటిది రౌరవమనే నరకం, రెండవది మహారౌరవం, మూడవది అతిశీతల, నాల్గవది నికృంతనం, ఐదవది అప్రతిష్ఠం, ఆతరువాత ఆరవది అసిపత్రవనం, ఏడోది తప్తకుంభమని చెప్పబడినాయి. ఈ ఏడు ప్రధానమైన నరకాలుగా పేర్కొనబడినాయి.

**శ్రూయంతేఽన్యాన్యపి తథా నరకాణి నరాధమాః ।**
**కర్మణాం తారతమ్యేన తేషు తేషు పతంతి హి ॥49॥**

అలాగే ఇంకా మిగిలిన నరకాలు ఎన్నో వినబడుతున్నాయి. నరాధములు కర్మల తరతమ భేదంచే ఆయా నరకాలలో పడుతూ ఉంటారు.

**తథా హి నరకో రోధః శూకరస్తాల ఏవ చ ।**
**తప్తకుంభో మహాజ్వాలః శబలోఽథ విమోహనః ॥50॥**

**క్రిమిశ్చ క్రిమిభక్షశ్చ లాలాభక్షో విషఘ్నః ।**
**అధః శిరాః పూయవహో రుధిరాంధశ్చ విడ్భుజః ॥51॥**

ఆ నరకాలు రోధం, శూకరం, తాలం, తప్తకుంభం, మహాజ్వాలం, శబలం, విమోహనం, క్రిమి, క్రిమిభక్షం, లాలాభక్షం, విషఘ్నం, అధఃశిరం, రుధిరాంధం, విడ్భుజం, పూయవహం.

**తథా వైతరిణీ మూత్రమసిపత్రవనం తథా ।**
**అగ్నిజ్వాలో మహాఘోరః సందంశో వాప్యభోజనః ॥52॥**

**తమశ్చ కాలసూత్రం చ లోహ శ్చాప్యభిదస్తథా ।**
**అప్రతిష్ఠోఽ ప్యవీచిశ్చ నరకా ఏవమాదయః ॥53॥**

అలాగే వైతరణీ, మూత్రం, అసిపత్రవనం, అగ్నిజ్వాల, మహాఘోరం, సందంశం, అభోజనం, తమం, కాలసూత్రం, లోహం, అభిదం, అప్రతిష్ఠం, అవీచి మొదలైన నరకాలు ఉన్నాయి.

**తామసాః నరకాః సర్వే యమస్య విషయే స్థితాః ।**
**యేషు దుష్కృతకర్మాణః పతంతి హి పృథక్ పృథక్ ॥54॥**

నరకాలన్నీ తామసాలే ఇవి యమలోకంలో ఉన్నాయి. వీటియందు పాపకర్మలు చేసినవారు వేరు వేరుగా పడుతూ ఉంటారు.

**భూమే రధస్తాత్తే సర్వే రౌరవాద్యాః ప్రకీర్తితాః ।**
**రోధో గోఘ్నో భ్రూణహా చ అగ్నిదాతా నరః పతేత్ ॥55॥**

ఆ రౌరవాది నరకాలన్నీ భూమిక్రింద(దక్షిణంగా) ఉన్నట్లుగా చెప్పబడుతున్నాయి. గోహత్య, భ్రూణహత్య, గృహదహనం చేసేవాడు రోధమనే నరకంలో పడతాడు.

**సూకరే బ్రహ్మహా మజ్జేత్సురాపః స్వర్ణతస్కరః ।**
**తాలే పతేత్ క్షత్రహంతా హత్వా వైశ్యం చ దుర్గతిః ॥56॥**

బ్రహ్మహంత, సురాపానం చేసినవాడు, బంగారాన్ని దొంగిలించినవాడు సూకరమనే నరకంలోను; క్షత్రహంత, వైశ్యుని చంపినవాడు దుర్గతిని పొంది తాలమనే నరకంలోను పడతారు.

**బ్రహ్మహత్యాం చ యః కుర్యాద్యశ్చ స్యాద్గురుతల్పగః ।**
**స్వసృగామీ తప్తకుంభీ తథా రాజభటోఽ నృతీ ॥57॥**

బ్రహ్మహత్య చేసేవాడు, గురుపత్నీగమనం, సోదరీగమనం చేసేవాడు, రాజపురుషుడై యుండి అబద్ధమాడేవాడు తప్తకుంభంలో పడతారు.

**తప్తలోహే చ విక్రేతా తథా బంధనరక్షితా ।**
**మాధ్వీవిక్రేయకర్తా చ యస్తు భక్తం పరిత్యజేత్ ॥58॥**

నిషేధింపబడిన పదార్థాలను విక్రయించేవాడు, అలాగే బంధింపబడవలసినవానిని శాస్త్రవిరుద్ధంగా రక్షించేవాడు, మదిరను అమ్మి బ్రతికేవాడు, స్వామియైయుండి తన భక్తులను విడిచేవాడు తప్తలోహంలో పడతారు.

**మహాజ్వాలీ దుహితరం స్నుషాం గచ్ఛతి యస్తు వై ।**
**వేదో విక్రీయతే యైశ్చ వేదం దూషయతే తు యః ॥59॥**

కుమార్తెను, కోడలిని ఎవడు పొందుతాడో, ఎవరిచే వేదం అమ్మబడునో, ఎవడు వేదాన్ని నిందిస్తాడో, అతడు మహాజ్వాలి అనే నరకంలో పడతాడు.

**గురుం చైవావమన్యంతే వాక్శరైస్తాడయంతి చ ।**
**అగమ్యాగామీ చ నరో నరకం శబలం వ్రజేత్ ॥60॥**

గురువును అవమానపరచువారు, వాగ్బాణాలతో హింసించేవారు, పొందకూడని వారిని పొందే నరుడు శబలమనే నరకాన్ని పొందుతారు.

**విమోహే పతతే శూరే మర్యాదాం యో భినత్తి వై ।**
**దురిష్టం కురుతే యస్తు కృమిభక్షం ప్రపద్యతే ॥61॥**

శూరుడైయుండి తన పరాక్రమప్రదర్శనలో మర్యాదను తప్పి ప్రవర్తించేవాడు విమోహమనే నరకంలో పడతాడు. ఎవరికీ ఇష్టంకాని పని చేసేవాడు కృమిభక్షమనే నరకంలో పడతాడు.

**దేవబ్రాహ్మణవిద్వేష్టా లాలాభక్షే పతత్యపి ।**
**కుండకర్తా కులాలశ్చ న్యాసహర్తా చికిత్సకః ॥62॥**

**ఆరామేష్వగ్నిదాతా చ ఏతే యాంతి విషఞ్జనే ।**
**అసత్ప్రతిగ్రహీ యస్తు తథైవాయాజ్యయాజకః ॥63॥**

**నక్షత్రై ర్జీవితే యస్తు నరో గచ్ఛేత్యధోముఖమ్ ।**
**క్షీరం సురాం చ మాంసం లాక్షాం గంధం రసం తిలాన్ ॥64॥**

**ఏవమాదీని విక్రీణన్ ఘోరే పూయవహే పతేత్ ।**
**యః కుక్కుటాన్నిబధ్నాతి మార్జారాన్ సూకరాంశ్చ తాన్ ।**
**పక్షిణశ్చ మృగాంశ్ఛాగాన్సోఽప్యేవం నరకం వ్రజేత్ ॥65॥**

దేవతలను, బ్రాహ్మణులను విశేషంగా ద్వేషించేవాడు లాలాభక్షం అనే నరకంలో పడతాడు. కుండలను తయారు చేసే కుమ్మరి, దాచియుంచమని ఇచ్చిన సొమ్మును అపహరించివాడు, (అక్కర లేకుండా) చికిత్స చేసేవాడు, తోటలను తగలబెట్టేవాడు–వీరు విషఞ్జనమనే నరకంలో పడతారు. చెడుపదార్థాలను (అర్హత లేక పోయినా) దానంగా స్వీకరించేవాడు, యజనం చేయరానిదానిని యజనం చేసేవాడు. నక్షత్ర గణనతో జీవించేవాడు అధోముఖం అనే నరకానికి వెడతాడు. పాలు, సుర, మాంసం, లక్క, గంధం, రసం, నువ్వులు మొదలైన వాటిని అమ్మేవాడు ఘోరమైన పూయవహం అనే నరకంలో పడతారు. ఎవడైతే కోళ్లను, పిల్లులను, పందులను, పక్షులను, మృగాలను, మేకలను బంధిస్తాడో అతడు కూడ అదే నరకంలో పడతాడు.

**అజావికో మహిషికస్తథా చక్రీ ధ్వజీ చ యః ।**
**రంగోపజీవికో విప్రః శాకునిర్గ్రామయాజకః ॥66॥**

**అగారదాహీ గరదః కుండాశీ సోమవిక్రయీ ।**
**సురాపో మాంసభక్షీ చ తథా చ పశుఘాతకః ॥67॥**

మేకమాంసాన్ని అమ్మి తినేవాడు, దున్నమాంసాన్ని అమ్మి తినేవాడు, చక్రాలు, ధ్వజాలు తయారు చేసేవాడు (ఆయుధాలు) నాట్యరంగంపై (నటరంగం) జీవించే విప్రుడు, పక్షులను వేటాడేవాడు, గ్రామ్యర్మాన్ని సేవించేవాడు, ఇళ్లను అంటించేవాడు, విషంపెట్టేవాడు, కుండాశి, సోమాన్ని విక్రయించేవాడు, సురాపానం చేసేవాడు, మాంసాన్ని తినేవాడు, అలాగే పశుహంతకుడు.

**రుధిరాంధే పతంత్యేతే ఏవమాహుర్మనీషిణః ।**
**ఉపవిష్టం త్వేకపంక్త్యాం విప్రం సంభోజయంతి యే ॥68॥**

**పతంతి నిరయే ఘోరే విడ్భుజే నాత్ర సంశయః ।**
**మధుగ్రాహో వైతరణీమాక్రోశీ మూత్రసంజ్ఞకే ॥69॥**

వీరు రుధిరాంధమనే నరకంలో పడతారని మనీషులు చెబుతారు. విప్రుని ఒకేపంక్తిలో కూర్చుండజేసి, భోజనం పెట్టే వారు విడ్భుజమనే ఘోరమైన నరకంలో పడతారు. సందేహమేమీ ఇందులేదు. తేనె తీసి అమ్మేవాడు వైతరణి అనే నరకంలోను, సుఖాన్ని క్రోధంతో పాడుచేసుకొని ఆక్రోశించేవాడు మూత్రమనే నరకంలోను పడతారు.

**అసిపత్రవనేఽ శౌచీ క్రోధనశ్చ పతేదపి ।**
**అగ్నిజ్వాలాం మృగవ్యాధో భోజ్యతే యత్ర వాయసైః ॥70॥**

అపవిత్రుడు, క్రోధనుడు అసిపత్రవనం అనే నరకంలో పడతాడు. మృగాలను వేటాడి హింసించేవాడు అగ్నిజ్వాలలో పడి కాకులచే భుజింపబడతాడు.

**ఇజ్యాయాం వ్రతలోపాచ్చ సందంశే నరకే పతేత్ ।**
**స్కందంతే యది వా స్వప్నే యతినో బ్రహ్మచారిణః ॥71॥**

**పుత్రై రధ్యాపితా యే చ పుత్రై రాజ్ఞాపితాశ్చ యే ।**
**తే సర్వే నరకం యాంతి నిరయం చాప్యభోజనమ్ ॥72॥**

దీక్షనుపొంది వ్రతనియమాలు సరిగా పాటించనివాడు సందంశం అనే నరకంలో పడతాడు. యతులు, బ్రహ్మచారులు, స్వప్నస్ఖలనం పొందినవారయితే, పుత్రులచే బుద్ధి, చదువు చెప్పించుకొనేవారు, పుత్రులచే ఆజ్ఞాపింపబడేవారు, ఇటువంటి వారందరు అభోజనమనే నరకాన్ని పొందుతారు.

**వర్ణాశ్రమవిరుద్ధాని క్రోధహర్షసమన్వితాః ।**
**కర్మాణి యే తు కుర్వంతి సర్వే నిరయవాసినః ॥73॥**

క్రోధంతోను, హర్షంతోను కూడుకొన్నవారై, వర్ణాశ్రమధర్మాలకు విరుద్ధంగా ఎవరయితే కర్మలాచరిస్తారో, వారందరు నరకలోకవాసులౌతారు.

**ఉపరిష్టాత్ స్థితో ఘోర ఉష్ణాత్మా రౌరవో మహాన్ ।**
**సుదారుణః సుశీతాత్మా తస్యాధ స్తామసః స్మృతః ॥74॥**

అన్నింటికన్న పైన ఘోరమై, మిక్కిలి వేడిని పుట్టించే రౌరవమనే నరకం ఉంది. ఇక దానికి క్రింద మిక్కిలి భయంకరమై ఎక్కువ చలిని పుట్టించే తామసమనే నరకం ఉంది.

**ఏవమాది క్రమేణైవ సర్వేఽధోఽధః పరిస్థితాః ।**
**దుఃఖోత్కర్షశ్చ సర్వేషు కర్మస్వపి నిమిత్తతః ॥75॥**

ఈ విధంగా మిగిలిన నరకాలు క్రమంగా అన్నీ ఒకదాని క్రింద ఒకటి ఉన్నాయి. కర్మల ఆధారంగా అన్ని నరకాలలోను దుఃఖంయొక్క ఉత్కర్ష ఎక్కువ.

**సుఖోత్కర్షశ్చ సర్వత్ర ధర్మస్యేహ నిమిత్తతః ।**
**పశ్యంతి నరకాన్దేవా హ్యధో వక్త్రాన్ సుదారుణాన్ ॥76॥**

ధర్మం కారణంగా అంతటా సుఖంయొక్క ఉత్కర్ష ఎక్కువ. దేవతలు మహాభయంకరాలైన నరకాలను తలక్రిందులుగా చూస్తారు.

**నారకా శ్చాపి తే దేవాన్ సర్వాన్ పశ్యంతి ఊర్ధ్వగాన్ ।**
**ఏతాన్యన్యాని శతశో నరకాణి వియద్గతే ॥77॥**

ఖేచరా! నరకలోకవాసులుకూడ ఆ దేవతలనందరిని తలలు పైకెత్తి చూస్తారు. ఇటువంటివెన్నో వందల కొలది నరకాలు ఉన్నాయి.

**దినే దినే తు నరకే పచ్యతే దహ్యతేఽన్యతః ।**
**శీర్యతే భిద్యతేఽన్యత్ర చూర్యతే క్లిద్యతేఽన్యతః ॥78॥**

ప్రతిదినం నరకంలో ఉడికించడం, అగ్నిలో కాల్చడం, పిండి పిండి చేయడం, ముక్కలు ముక్కలు చేయడం, చూర్ణం చేయడం, క్లేశపరచి శిక్షించడం ఎక్కడయినా ఇదే.

**క్వథ్యతే దీప్యతేఽన్యత్ర తథా వాతహతోఽన్యతః ।**
**ఏకం దినం వర్షశతప్రమాణం నరకే భవేత్ ॥79॥**

ఒకచోట వేయించడం, మరో చోట కాల్చడం, ఇంకొకచోట చలిలో కంపించడం ఇదే నరకస్థితి. నరకంలో ఒక్కరోజు నూరు  సంవత్సరాల ప్రమాణం కల్గినదవుతుంది.

**తతః సర్వేషు నిస్తీర్ణః పాపీ తిర్యక్త్వమశ్నుతే ।**
**కృమికీటపతంగేషు స్థావరైక శఫేషు చ ॥80॥**

**గత్వా వనగజాద్యేషు గోష్వేషుతథైవ చ । (గోవృషేషు)**
**ఖరోఽశ్వోఽశ్వతరో గౌరః శరభశ్చమరీ తథా ॥81॥**

పిమ్మట పాపాత్ముడు అన్ని నరకాలలోనూ దుఃఖానుభవాన్ని తరించి(దాటి) తిర్యగ్జన్మ ధరిస్తాడు. కృమి, కీటం, పతంగం, స్థావరం, శఫం(ఒకే డెక్క కలది) మున్నగు జన్మలు ధరిస్తాడు. పిమ్మట గొప్పవైన వనగజాలు, గోవులు, ఎద్దు మున్నగునవి. గాడిద, గుర్రం, అశ్వతరం (కంచరగాడిద), గౌరం(పచ్చని గుఱ్ఱం), శరభం (మిడత), చమరీమృగం.

**ఏతే చైక శఫాః షట్ చ శృణు పంచనఖానతః ।**
**అన్యాసు బహుపాదాసు దుఃఖదాసు చ యోనిషు ।।82।।**

ఈ ఆరూ ఒకగిట్ట కల్గినవి, ఇంకా ఐదుగోళ్లు కలిగినవీ. అలాగే పెక్కుపాదాలు కల్గి, దుఃఖాన్నిచ్చే జన్మలు ధరిస్తాడు.

**మానుష్యం ప్రాప్యతే కుబ్జో కుత్సితో వామనోఽపి వా ।**
**చండాల పుక్కసాద్యాసు నరయోనిషు జాయతే ।।83।।**

ఆ పై మానుష జన్మను పొందుతాడు. గూనివాడు, అసహ్యింపబడేవాడు, మరుగుజ్జు, పొట్టివాడు, చండాలుడు,పుల్కసుడు మున్నగు నరజన్మలు ధరిస్తాడు.

**ముహుర్గర్భే వసంత్యేవ మ్రియంతే చ ముహుర్ముహుః ।**
**అవశిష్టేన పాపేన పుణ్యేన చ సమన్వితః ।।84।।**

మిగిలియున్న పాపపుణ్యాలతో కూడుకొన్నవాడై, అనేక గర్భాలలో మళ్లీ మళ్లీ పుడుతూ, మరణిస్తూ ఉంటాడు.

**తతశ్చారోహిణీం యోనిం శూద్ర వైశ్య నృపాదికమ్ ।**
**విప్రదేవేంద్రతాం చాపి కదాచిదధిరోహతి ।।85।।**

ఒక్కొక్క జన్మను ఆరోహిస్తూ(అధిగమిస్తూ) శూద్ర, వైశ్య, క్షత్రియాది జన్మలు ధరిస్తూ, చివరకు బ్రాహ్మణ, దేవతా, ఇంద్రాది జన్మలను ఎప్పటికో ఒకప్పటికి పొందుతాడు.

**ఏవం తు పాపకర్మాణో నిరయేషు పతంత్యధః ।**
**యథాపుణ్యకృతో యాంతి తన్మే నిగదతః శృణు ।।86।।**

ఈ విధంగా పాపకర్ములు క్రిందనున్న నరకాలలో పడిపోతూ ఉంటారు. ఇక పుణ్యాత్ములు ఎలా ఉత్తమజన్మలు పొందుతారో నేను చెబుతున్నాను. విను.

**తే యమేన వినిర్దిష్టాం యోనిం పుణ్యగతిం నరాః ।**
**ప్రగీత గంధర్వగణా నృత్యోత్సవసమాకులాః ।।87।।**

**హారనూపురమాధుర్యైః శోభితాన్యమలాని తు ।**
**ప్రయాంత్యాశు విమానాని దివ్యగంధస్రగుజ్జ్వలాః ।।88।।**

యమునిచే నిర్దేశింపబడిన పుణ్యజన్మను ఆ నరులు పొందుతారు. గంధర్వగణాలు పాటలు పాడుతూ, నృత్యాలుచేస్తూ, ఉత్సవాలు చేస్తూఉండగా, దివ్య గంధాలు, చక్కని పూలదండలతో ప్రకాశిస్తూ, స్వచ్ఛములై, మనోహరాలైన, హారాలు, నూపురాలు శోభిల్లుతూ ఉండగా, విమానాలను అధిరోహించి వారు పయనిస్తారు. (స్వర్గాదులకు)

**తస్మాచ్చ ప్రచ్యుతా రాజ్ఞామన్యేషాం చ మహాత్మనామ్ ।**
**జాయంతే నీరుజాం గేహే సద్వృత్తపరిపాలకాః ॥89॥**

వారి స్వర్గలోకానుభవం పూర్తి అయినతరువాత మనుష్య జన్మలోకి తిరిగివస్తారు. అప్పుడు క్షత్రియుల ఇండ్లలో కాని, మిగిలిన మహాత్ముల ఇండ్లలో కాని, ఆరోగ్యవంతుల ఇండ్లలో కాని, సత్ప్రవర్తనను పరిపాలించువారై జన్మిస్తారు.

**భోగాన్ సంప్రాప్నువంత్యుగ్రాం స్తతో యాంత్యూర్ధ్వమన్యథా ।**
**అవరోహిణీం సంప్రాప్య పూర్వవద్యాంతి మానవాః ॥90॥**

అనేక భోగాలు అనుభవిస్తారు, అవి భరించలేనన్ని భోగభాగ్యాలు. తిరిగి మళ్లీ ఊర్ధ్వలోకాలు చేరుకొంటారు. లేదా పూర్వంవలె మానవులు క్రిందకు దిగివచ్చి నరకంలో పడిపోతారు.

**జాతస్య మృత్యులోకే వై ప్రాణినో మరణం ధ్రువమ్ ।**
**పాపిష్ఠానామధోమార్గాజ్జీవో నిష్క్రమతే ధ్రువమ్ ॥91॥**

మృత్యులోకంలో పుట్టిన ప్రాణికి మరణం తప్పదు. పాపాత్ములకు సంబంధించిన జీవుడు అధోమార్గంలో నిష్క్రమిస్తాడు. ఇది నిశ్చయం.

**పృథివ్యాం లీయతే పృథ్వీ ఆపశ్చైవ తథాప్సు చ ।**
**తేజస్తేజసి లీయేత సమీరే చ సమీరణః ॥92॥**

**ఆకాశే చ తథాకాశం సర్వవ్యాపి నిశాకరే ।**
**తత్ర కామ స్తథా క్రోధః కాయే పంచేంద్రియాణి చ ॥93॥**

ఆత్మ శరీరాన్ని విడిచిపోయిన తరువాత జీవిశరీరంలోని పృథివీతత్త్వం పృథివిలోను, జలతత్త్వం నీటిలోను, తేజస్తత్త్వం అగ్నిలోను, వాయుతత్త్వం గాలిలోను, ఆకాశతత్త్వం నింగిలోను, సర్వం వ్యాపించే మనస్సు చంద్రునిలోను లీనమవుతాయి. శరీరంలో ఉండే కామం, క్రోధం, పంచేంద్రియాలు కూడ అంతే.

**ఏతే తార్క్ష్య సమాఖ్యాతా దేహే తిష్ఠంతి తస్కరాః ।**
**కామః క్రోధో హ్యహంకారో మన స్తత్రైవ నాయకః ॥94॥**

**సంహారశ్చైవ కాలోఽసౌ పుణ్యపాపేన సంయుతః ।**
**పంచేంద్రియసమాయుక్తః సకలైర్విబుధైః సహ ॥95॥**

**ప్రవిశేత్స నవే దేహే గృహే దగ్ధే గృహీ యథా ।**
**శరీరే యే సమాసీనా సర్వే వై సప్తధాతవః ॥96॥**

**షాట్కౌశికో హ్యయం కాయః సర్వే వాతాశ్చ దేహినామ్ ।**
**మూత్రం పురీషం తద్యోగాద్యేచాన్యే వ్యాధయ స్తథా ॥97॥**

**పిత్తం శ్లేష్మా తథా మజ్జా మాంసం వై మేద ఏవ చ ।**
**అస్థి శుక్రం తథా స్నాయుర్దేహేన సహ దహ్యతి ॥98॥**

గరుడా! వాటికి నాయకుడైన మనస్సుకూడ దేహంలో దొంగలుగా చెప్పబడి స్థిరంగా ఉంటాయి. కామం, క్రోధం, అహంకారం అనేవీ, కాలమే సంహారుడు. పుణ్యపాపాలతో కూడుకొన్నవాడై, పంచేంద్రియాలతో కలిసియున్నవాడై, వాటికి అధిదైవతములైన వారందరితో కలసి గృహం దగ్ధంకాగా, గృహంలో నున్నవాడు వేరే ఇంటిలో ప్రవేశించినట్లుగా, జీవి క్రొత్తదైన దేహంలో ప్రవేశిస్తాడు. శరీరంలో తిష్ఠవేసి కూర్చున్నవన్నీ, ఏడుధాతువులతో కలసి ఆరు కోశాలతో కూడుకొన్న ఈ శరీరం (పంచకోశాలు మరియు హృదయకోశం), జీవుల దశ వాయువులు, శరీరంలో కలిసియున్న మూత్రపురీషాలు, మిగిలిన వ్యాధులు, పిత్తం, శ్లేష్మం, మజ్జ, మాంసం, మేదం, ఎముకలు, శుక్రం, నరాలు అన్నీ దేహంతో కలిసి మంటల్లో కాలిపోతాయి.

**ఏష తే కథిత స్తార్క్ష్య వినాశః సర్వదేహినామ్ ।**
**కథయామి పునస్తేషాం శరీరం చ యథా భవేత్ ॥99॥**

గరుడా! సమస్త ప్రాణుల ఈ వినాశం గురించి నీకు తెలియజేశాను. వారికి తిరిగి శరీరం ఎలా కలుగుతుందో ఇక చెప్పబోతున్నాను.

**ఏకస్తంబం స్నాయుబద్ధం స్థూణాత్రయవిభూషణమ్ ।**
**ఇంద్రియైశ్చ సమాయుక్తం నవద్వారం శరీరకమ్ ॥100॥**

**విషయైశ్చ సమాక్రాంతం కామక్రోధసమాకులమ్ ।**
**రాగద్వేషసమాకీర్ణం తృష్ణాదుర్గమతస్కరమ్ ॥101॥**

నరాలతో కట్టబడి ఒక దుబ్బులా ఉంటుంది. మూడు స్తంభాలతో (శరీరాలతో,స్థూల,సూక్ష్మ కారణాలతో) అలంకరింపబడి ఉంటుంది. ఇంద్రియాలతో కూడుకొని ఉంటుంది. తొమ్మిది ద్వారాలు కలిగిన శరీరం కలిగినట్టిది, విషయవాసనలచే ఆక్రమించబడి ఉంటుంది. కామం, క్రోధం వీటిచే వ్యాకులమై ఉంటుంది. రాగద్వేషాలతో కొట్టు మిట్టు లాడుతూ ఉంటుంది. తృష్ణ అనే దుష్టుడైన దొంగను కలిగి యుంటుంది.

**లోభజాలపరిచ్ఛిన్నం మోహవస్త్రేణ వేష్టితమ్ ।**
**సంబద్ధం మాయయా చైతల్లోభేనాధిష్ఠితం పురమ్ ॥102॥**

**ఏతద్గణసమాకీర్ణం శరీరం సర్వదేహినామ్ ।**
**ఆత్మానం యే న జానంతి తే నరాః పశవః స్మృతాః ॥103॥**

లోభమనే వలచే (సమూహాలచే) కప్పబడినట్టిది, మోహమనే వస్త్రంచే ఆదృతమైనట్టిది, మాయచే కట్టివేయబడినట్టిది, ఈ శరీరమనే పురం లోభంచే అధిష్ఠింపబడినట్టిది. సమస్త ప్రాణుల శరీరం ఈగణంతోనే వ్యాపించి ఉంటుంది. ఇటువంటి తనను ఎవరు తెలిసికొనలేరో ఆ నరులు పశువులుగా పేర్కొనబడుతున్నారు.

**ఏవమేవ సమాఖ్యాతం శరీరం తే చతుర్విధమ్ ।**
**చతురశీతిలక్షాణి నిర్మితా యోనయః పురా ॥104॥**

**ఉద్భిజ్జాః స్వేదజాశ్చైవ అండజాశ్చ జరాయుజాః ।**
**ఏతత్తే సర్వమాఖ్యాతం నిరయస్య ప్రపంచతః ॥105॥**

**కథయామి క్రమప్రాప్తం ప్రష్టుం వా వర్తతే స్పృహా ॥106॥**

ఈ విధంగా ఏర్పడిన శరీరం నాలుగు విధాలుగా ఉంటుందని నీకు చెప్పడం జరిగింది. పూర్వం ఎనభైనాలుగు లక్షల జీవరాశులుగా ఆయా జన్మలు నిర్మింపబడినాయి. ఉద్భిజ్జములు, స్వేదజాలు, అండజాలు, జరాయుజాలని అవి నాలుగు విధాలు. నరకం గురించి విస్తారంగా ఇదంతా నీకు తెలియజేశాను. అడిగే కోరిక ననుసరించి వినే ఆసక్తి ఉంటే క్రమంగా నీకు చెబుతాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే నరక తత్ ప్రవేశ నిర్గమనాది వర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో నరకప్రవేశం నిర్గమనం అనే మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్థోఽధ్యాయః** – నాల్గవ అధ్యాయం

## **దహనవిధ్యాదయః** – దహనవిధి మొదలగు విషయాలు

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు పలికాడు.

**జ్ఞానతోఽజ్ఞానతో వాపి యన్నరైః కలుషం కృతమ్ ।**
**తస్య పాపస్య శుధ్యర్థం విధేయా నిష్కృతి ర్నరైః ॥1॥**

నరులు తెలిసిగాని తెలియకగాని ఏమైనా పాపాలుచేసి ఉన్నట్లయితే, వాటినుండి శుద్ధి పొందడంకోసమై, ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**భస్మాది స్నానదశకమాదౌ కుర్యాద్విచక్షణః ।**
**యథాశక్తి షడబ్దాది ప్రత్యామ్నాయాచ్చరేదపి ॥2॥**

విద్వాంసుడు ముందుగా పవిత్రభస్మాది స్నానాలను పదింటిని చేయాలి. శక్తిననుసరించి షడబ్దం (ఆరు సంవత్సరాలపాటు కృచ్ఛ్రవ్రతం మున్నగునవి) ప్రత్యామ్నాయంగా ఆచరించాలి.

**తదర్ధం వా తదర్ధం వా తదర్ధార్ధమథాపి వా ।**
**యథాశక్త్యా తతః కుర్యా ద్దశదానాని వై శృణు ॥3॥**

దానిలో సగంకాని, లేదా దానిలో సగంకాని లేదా దానిలో సగంలో సగం కాని శక్తిననుసరించి వాటిని చేయాలి. పిమ్మట దశ దానాలు చేయాలి. వాటిని గురించి విను.

**గో భూతిల హిరణ్యాజ్య వాసో ధాన్య గుడాస్తథా ।**
**రజతం లవణం చైవ దానాని దశ వై విదుః ॥4॥**

గోదాన, భూదాన, తిలదానాలు, హిరణ్యదానం, ఆజ్యదానం(నేయి), వస్త్రదానం, ధాన్యదానం, గుడదానం, రజతదానం(వెండి), లవణదానం(ఉప్పు)–వీటిని దశ దానాలుగా తెలుసుకోవాలి.

**ప్రాయశ్చిత్తే త్వాగతా యే తేభ్యో దద్యాన్నరో దశ ।**
**తతో యమద్వారపథే పూయశోణితసంకులే ॥5॥**

**నదీం వైతరణీం తర్తుం దద్యాద్వైతరణీం చ గామ్ ।**
**కృష్ణస్తనీ స కృష్ణాంగీ సా వై వైతరణీ స్మృతా ॥6॥**

ఎవరయితే ఈ దశ దానాలు చేస్తారో వారికి ప్రాయశ్చిత్తం పూర్తిగా జరిగి, నరుడు శుద్ధుడవుతాడు. ఇక యమద్వారం వైపు వెళ్లేదారిలో చీము, నెత్తురుతో నిండిన వైతరణీ నది(అనేపేరుగల్గినదొకటి)ఉంది. ఆ వైతరణీనదిని సులువుగా దాటుటకై గోవును దానమీయాలి. (వైతరణి అనే గోవును) అది నల్లని పొదుగుతో, నల్లని అవయవాలతో ఉండి వైతరణిగా చెప్పబడింది.

**తిలా లోహం హిరణ్యం చ కర్పాసం లవణం తథా ।**
**సప్త ధాన్యం క్షితిర్గావ ఏకైకం పావనం స్మృతమ్ ॥7॥**

నువ్వులు, ఇనుము, బంగారం, పత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు, భూమి, గోవు-ఇవి ఒక్కొక్కటి పరమ పవిత్రంగా చెప్పబడ్డాయి.(ఉత్తరోత్తరం బలీయం)

**ఏతాన్యష్టౌ మహాదానాన్యుత్తమాయ ద్విజాతయే ।**
**ఆతురేణ తు దేయాని పదరూపాణి మే శృణు ॥8॥**

ఈ ఎనిమిదింటిని మహాదానాలు అంటారు. వీటిని ఉత్తముడైన బ్రాహ్మణునకు ఈయాలి. ఆతురుడు(మరణాసన్నవ్యక్తి) దానమీయాలి. ఇక అష్టవిధ పదదానాలను గురించి నేను చెబుతున్నాను. విను.

**ఛత్రోపానహ వస్త్రాణి ముద్రికా చ కమండలుః ।**
**ఆసనం భాజనం భోజ్యం పదం చాష్టవిధం స్మృతమ్ ॥9॥**

గొడుగు, చెప్పులు, బట్టలు, ముద్రిక(ఉంగరం), కమండలువు(జలపాత్ర), ఆసనం, భోజనపాత్ర, తినబడేపదార్థం - ఈ ఎనిమిదింటిని అష్టవిధ పదదానాలు అంటారు.

**తిల పాత్రం సర్పిఃపాత్రం శయ్యా సోపస్కరా తథా ।**
**ఏతత్సర్వే ప్రదాతవ్యం యదిష్టం చాత్మనోఽపి తత్ ॥10॥**

తిలపాత్ర, నేతిపాత్ర, శయ్య, భోజనానికి కావలసిన సంబారాలు, ఇవికాక తనకిష్టమైనవి ఏవి ఉన్నాయో, వాటినన్నింటిని దానం చేయవచ్చు.

**అశ్వో రథశ్చ మహిషీ వ్యంజనం వస్త్రమేవ చ ।**
**బ్రాహ్మణేభ్యః ప్రదాతవ్యం బ్రహ్మపూర్వమపి స్వయమ్ ॥11॥**

అశ్వం, రథం, మహిషి(పూజింపబడే స్త్రీ), వ్యంజనం(కూరలు మున్నగునవి) వస్త్రం బ్రాహ్మణులకు దానమీయాలి. స్వయంగా ముందు బ్రాహ్మణునకు ఈయాలి.

**దానాన్యన్యాన్యపి ఖగ తర్పయేత్ స్వీయ శక్తితః ।**
**ప్రాయశ్చిత్తం కృతం యేన దశదానాన్యపి క్షితౌ ॥12॥**

ఖగమా! తనశక్తిననుసరించి మిగిలిన దానాలతో తృప్తి కలిగించాలి. భూమియందు ఎవడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకొన్నాడో, వాడు క్షితి దానంతో బాటు దశ దానాలు తప్పక చేయాలి.

**దానం గోర్వైతరణ్యాశ్చ దానాన్యష్టౌ తథాపి వా ।**
**తిలపాత్రం సర్పిఃపాత్రం శయ్యాదానం తథైవ చ ॥13॥**

**పదదానం చ విధివన్నాసౌ నిరయగర్భగః ।**
**స్వాతంత్ర్యేణాపి లవణదానమిచ్ఛంతి సూరయః ॥14॥**

వైతరణి జాతికి చెందిన గోదానం, అలాగే ఎనిమిది దానాలు, తిలపాత్ర, నేతిపాత్ర, శయ్యాదానం, అష్టవిధ పదదానం శాస్త్రవిధిచే చేసినట్టివాడు నరకలోకం మధ్యలో పడుట సంభవింపదు. విద్వాంసులు స్వేచ్ఛగా లవణదానం కోరుకొంటారు.

**విష్ణుదేహ సముత్పన్నో యతోఽయం లవణో రసః ।**
**ఆతురస్య యదా ప్రాణా న యాంతి వసుధాతలే ॥15॥**

**లవణం చ తదా దేయం ద్వారస్యోద్ఘాటనం దివః ।**
**యాని కాని చ దానాని స్వయం దత్తాని మానవైః ॥16॥**

**తాని తాని చ సర్వాణి ఉపతిష్ఠంతి చాగ్రతః ।**
**ప్రాయశ్చిత్తం కృతం యేన సాంగం ఖగ స వై పుమాన్ ॥17॥**

**పాపాని భస్మసాత్కృత్వా స్వర్గలోకే మహీయతే ।**
**అమృతం తు గవాం క్షీరం యతః పతగసత్తమ ॥18॥**

**తస్మాద్దదాతి యో ధేను మమృతత్వం స గచ్ఛతి ।**
**దానాన్యష్టౌ తు దత్త్వా వై గంధర్వనిలయే వసేత్ ॥19॥**

దానికి కారణం? లవణరసం విష్ణుదేహంనుండి ఉద్భవించటమే. భూమియందు మరణాసన్న వ్యక్తి ప్రాణాలు పోనప్పుడు లవణదానం చేయాలి. అది స్వర్గలోక ద్వారాలను తెరిపిస్తుంది. మానవులు స్వయంగా ఏ ఏ దానాలు చేస్తారో ఆ యా దానఫలితాలన్నీ వానికి ముందే ప్రయాణమై వెళ్లిపోతాయి. ఖగమా! ఏ జీవి అయితే సాంగోపాంగంగా ప్రాయశ్చిత్తం చేసుకొంటాడో, వాని పాపాలన్నీ బూడిదయిపోయి, స్వర్గలోకంలో వాసి పొందుతాడు. పక్షిశ్రేష్ఠమా! ఆవులపాలు అమృతం కావున ఎవడయితే ధేనువును దానమిస్తాడో వాడు అమృతత్వాన్ని పొందుతాడు. ఎనిమిది దానాలు ఇచ్చినవాడు గంధర్వలోకంలో నివసిస్తాడు.

**ఆలయ స్తత్ర రౌద్రే హి దహ్యతే యేన మానవః ।**
**ఛత్రదానేన సుచ్ఛాయా జాయతే పథి తుష్టిదా ॥20॥**

యమనిలయం పరమ భయంకరం. అక్కడ మానవుడు మండిపోతూ ఉంటాడు. ఛత్రదానంచేస్తే యమ మార్గంలో సంతృప్తి కలిగించే చక్కని నీడ లభిస్తుంది.

**అసిపత్రవనం ఘోర మతిక్రామతి వై సుఖమ్ ।**
**అశ్వారూఢశ్చ వ్రజతి దదతే యద్యుపానహౌ ॥21॥**

చెప్పులను కనుక దానమిస్తే, గుఱ్ఱాన్ని అధిరోహించి వెడుతూ, ఘోరమైన అసిపత్రవనాన్ని సుఖంగా అతిక్రమించగలడు.

**భోజనాసనదానేన సుఖం మార్గే భునక్తి వై ।**
**ప్రదేశే నిర్జలే దాతా సుఖీ స్యాద్వై కమండలోః ॥22॥**

భోజనం, ఆసనం దానమిచ్చుటవల్ల యమలోకమార్గంలో సుఖంగా భుజిస్తూ వెడతాడు. కమండలువును దానమిచ్చుటవల్ల నిర్జలప్రదేశంలో సుఖిస్తూ సాగుతాడు.

**యమదూతా మహారౌద్రాః కరాలాః కృష్ణపింగలాః ।**
**న పీడయంతి దాక్షిణ్యా ద్వస్త్రాభరణదానతః ॥23॥**

యమదూతలు మహా భయంకరులు. క్రూర దర్శనులు . కొందరు నల్లగా, కొందరు పచ్చగా ఉంటారు. వస్త్రాలు, ఆభరణాలు దానం చేయడంవల్ల దయకలిగి వారు పాపులను పీడించరు.

**తిలపాత్రం తు విప్రాయ దత్తం పత్రరథ ధ్రువమ్ ।**
**నాశయేత్త్రివిధం పాపం వాఙ్మనఃకాయసంభవమ్ ॥24॥**

పత్రరథ (పక్షీ)! తిలపాత్రను బ్రాహ్మణునకు దానంచేసినవాడు నిశ్చయంగా, వాక్కుచేత, మనస్సుచేత, శరీరంచేత కలిగిన త్రివిధ పాపాలు పోగొట్టుకొంటాడు.

**ఘృతపాత్రప్రదానేన రుద్రలోకే వసేన్నరః ।**
**సర్వోపస్కరసంయుక్తాం శయ్యాం దత్త్వా ద్విజాతయే॥ 25**

**నానాప్సరోభిరాకీర్ణం విమానమధిరోహతి ।**
**షష్టి వర్షసహస్రాణి క్రీడిత్వా శక్రమందిరే ॥26॥**

**ఇంద్రలోకా త్పరిభ్రష్ట ఇహలోకే నృపో భవేత్ ।**
**సర్వోపస్కరణోపేతం యువానం దోషవర్జితమ్ ॥27॥**

**యోఽశ్వం దదాతి విప్రాయ స్వర్గలోకే చ తిష్ఠతి ।**
**యావంతి రోమాణి హయే భవంతి హి ఖగేశ్వర ॥28॥**

**తావతో రాజితాంల్లోకానాప్నువంతి హి పుష్కలాన్ ।**
**చతుర్భిస్తురగైర్యుక్తం సర్వోపకరణైర్యుతమ్ ॥29॥**

**రథం ద్విజాతయే దత్త్వా రాజసూయఫలం లభేత్ ॥30॥**

నేతిపాత్రను దానంచేసినవాడయితే, ఆ నరుడు రుద్రలోకంలో నివసిస్తాడు. సర్వసాధనాలతో (ఉపకరణాలతో) కూడుకొనిన శయ్యను బ్రాహ్మణునకు దానంచేసినవాడు ఎక్కువమంది అప్సరసలచే సేవింపబడే విమానాన్ని అధిరోహిస్తాడు. అరవైవేల ఏండ్లు ఇంద్రలోకంలో విహరించి, దేవేంద్రలోకం నుండి క్రిందకువచ్చి ఈ లోకంలో రాజుగా జన్మిస్తాడు. అన్నిఉపకరణాలతో కూడుకొన్న, ఏ దోషమూ లేని, లేతవయసులోనున్న గుఱ్ఱాన్ని ఎవడు విప్రునకు దానమిస్తాడో, అతడు స్వర్గలోకం చేరుకొంటాడు. ఖగరాజా! హయంపై ఎన్నిరోమాలు ఉన్నాయో, అంత కాలం (అన్ని ఏండ్లు) పుష్కలాలై ప్రకాశించే లోకాలను పొందుతారు. నాలుగు గుఱ్ఱాలను పూన్చి సమస్తోపకరణాలతో కూడుకొన్న రథాన్ని బ్రాహ్మణునకు దానమిస్తే రాజసూయయాగఫలం లభిస్తుంది.

**దుగ్ధాధికాం చ మహిషీం నవమేఘవర్ణాం సతుష్టతర్ణకవలీం జఘనాభిరామామ్ ।**
**దత్త్వా సువర్ణతిలకాం ద్విజపుంగవాయ లోకోదయం స జయతీతి కిమత్ర చిత్రమ్ ॥31॥**

ఎక్కువగా పాలనిచ్చే, నీలమేఘంవంటి కాంతి కల్గిన, సంతసంతో గంతువేసే దూడను కల్గిన, అందమైన జఘనభాగం కల్గిన, బంగారపు బొట్టునుంచిన, ఆడకారెనుబోతును ద్విజశ్రేష్ఠునకు దానం ఇచ్చినవాడు ఉత్తమలోకాన్ని జయించినవాడవుతాడని చెప్పుటలో ఆశ్చరమేముంటుంది కనుక

**తాలవృంతస్య దానేన వాయునా వీజ్యతే పథి ।**
**కాంతియుక్ సుభగః శ్రీమాన్ భవత్యంబరదానతః ॥32॥**

విసరుకఱ్ఱను దానంచేస్తే యమమార్గంలో వీచే వాయువువల్ల సుఖపడతాడు. వస్త్రదానంచేస్తే కాంతిమంతుడు, సౌభాగ్యవంతుడు, శ్రీమంతుడు అవుతాడు.

**రసాన్నోపస్కరయుతం గృహం విప్రాయ యోఽర్పయేత్ ।**
**న హీయతే తస్య వంశః స్వర్గం ప్రాప్నోత్యనుత్తమమ్ ॥33॥**

రసాన్నాలతోను, అన్ని సంభారాలతోను కూడుకొన్న ఇంటిని విప్రునకు సమర్పించిన వాని వంశం క్షీణించదు. మిక్కిలి గొప్పదైన స్వర్గాన్ని పొందుతాడు.

**భవత్యత్ర ఖగశ్రేష్ఠ ఫల గౌరవ లాఘవమ్ ।**
**శ్రద్ధాశ్రద్ధా విభేదేన దానగౌరవలాఘవాత్ ॥34॥**

పక్షిశ్రేష్ఠమా! దానంచేయడంలో అధికత్వం, అల్పత్వం వల్ల శ్రద్ధ, అశ్రద్ధ అనే భేదంవల్ల ఫలితంలో కూడ ఎక్కువ తక్కువలు కలుగుతాయి.

**తతో యేనాంబుదానాని కృతాన్యత్ర రసాస్తథా ।**
**తదా ఖగ తథాహ్లాదమాపది ప్రతిపద్యతే ॥35॥**

అటుపిమ్మట ఎవరయితే జలదానం చేస్తారో, ఎవరయితే అన్నరసాలు సమర్పిస్తారో, వారు ఖగమా! ఆపదయందు ఆహ్లాదాన్ని పొందుతారు.

**అన్నాని యేన దత్తాని శ్రద్ధాపూతేన చేతసా ।**
**సోఽపి తృప్తి మవాప్నోతి వినాప్యన్నేన వై తదా ॥36॥**

ఎవడయితే శ్రద్ధతో పవిత్రమైన మనసుతో భోజనాలు పెడుతూఉంటాడో, అతడు వేళకు భోజనంలేక పోయినప్పటికి తృప్తిని పొందినవాడవుతాడు.

**ఆసన్నే మరణే కుర్యాత్ సంన్యాసం చేద్విధానతః ।**
**ఆవర్తే పునర్నాసౌ బ్రహ్మభూయాయ కల్పతే ॥37॥**

మృత్యువు ఆసన్నమైనప్పుడు యథావిధిగా సన్న్యాసాన్ని స్వీకరించినవానికి పునర్జన్మ పొందడమనేది ఉండదు. అతడు బ్రాహ్మీభూతుడు అవుతాడు.

**ఆసన్న మరణో మర్త్య శ్చేత్తీర్థం ప్రతినీయతే ।**
**తీర్థప్రాప్తౌ భవే న్ముక్తి ర్మ్రియతే యదమార్గగః ॥**
**పదే పదే క్రతుసమం భవేత్తస్య న సంశయః ॥38॥**

మరణమాసన్నమైన మానవుని ఎవరయినా పుణ్యతీర్థానికి తీసుకొని వెడుతూ ఉంటే, (లేక స్వయంగా వెడుతూ ఉండగా) తీర్థస్థలంలో ప్రాణంపోయినా, లేక మార్గమధ్యంలో మరణించినా, అతనికి ముక్తి లభిస్తుంది. అతడు వేసే అడుగడుగూ క్రతువుతో సమానమవుతుంది. సంశయంలేదు.

**గృహ్ణీయాచ్ఛేదనశనం వ్రతం విధివదాగతే ।**
**మృత్యౌ న సోఽపి సంసారే భూయః పర్యటతి ద్విజ ॥39॥**

మృత్యువు ఆసన్నమైనవాడు యథావిధిగా అనశనవ్రతం చేపట్టి తానుగా మృతిపొందినప్పటికీ ద్విజమా! అతడు మళ్లీ సంసారంలోకి వచ్చుట(పునర్జన్మ పొందుట) అనేది ఉండదు. అతనికి సంసారభ్రమణం ఉండదు.

**కిం దానమితి తుర్యస్య ప్రశ్నస్యోత్తరమీరితమ్ ।**
**దాహమృత్యో రంతరే కిమితి ప్రశ్నోత్తరం శృణు ॥40॥**

మృతుని (ఆసన్నమృతుని) విషయంలో ఏమిదానం చేయవలెనన్న ప్రశ్నకు ఉత్తరమిచ్చాను. మృత్యుతాప దాహ విషయంలో ఏమి చేయాలన్న ప్రశ్నకు సమాధానం విను.

**గత ప్రాణం తతో జ్ఞాత్వా స్నాత్వా పుత్రాదిరాశు తమ్ ।**
**శవం జలేన శుద్ధేన క్షాలయేదవిచారయన్ ॥41॥**

**పరిధాప్యాహతే వస్త్రే చందనైః ప్రోక్షయేత్తనుమ్ ।**
**తతో మృతస్య స్థానే వై ఏకోద్దిష్టం సమాచరేత్ ॥42॥**

ఆ వ్యక్తి మరణించినట్లు తెలియగానే, స్నానంచేసి పుత్రులు మున్నగువారు శీఘ్రంగా, ఆ శవానికి ఏ విచారం లేకుండ శుద్ధజలముతో స్నానం చేయించాలి. క్రొత్తవస్త్రాన్ని దానిపై కప్పాలి. శరీరాన్ని చందనాదులచే ప్రోక్షణ చేయాలి. పిమ్మట ఆ వ్యక్తి చనిపోయినచోటనే ఏకోద్దిష్ట శ్రాద్ధం ఆచరించాలి.

**ప్రయోగపూర్వం దాహస్య యోగ్యతాదిర్యథా భవేత్ ।**
**ఆసనం ప్రోక్షణం చ స్యాన్నస్యాదేత చ్చతుష్టయమ్ ॥43॥**

**ఆవాహనార్చనం చైవ పాత్రాలంభావగాహనే ।**
**భవేద్దానాన్న సంకల్పః పిండదానం సదా భవేత్ ॥44॥**

దహనానికి యోగ్యమైన ప్రదేశం, ఉపకరణాలు మున్నగునవి ఎలా జరగాలో ప్రయోగపూర్వకంగా సిద్ధంచేసుకోవాలి. ఇందు ఆసన, ప్రోక్షణ క్రియలనే చేయాలి. ఆవాహనం, అర్చనం, పాత్రాలంభనం, అవగాహనం అనే నాలుగు క్రియలను చేయరాదు. పిండదానం తప్పనిసరిగా చేసి, అన్నదానానికి సంకల్పం చెప్పుకోవాలి.

**పదార్థపంచకం న స్యాద్రేఖా ప్రత్యవనే జనమ్ ।**
**దద్యాదక్షయ్య ముదకం నస్యాదేతత్త్రయం పునః ॥45॥**

పంచభక్ష్యపదార్థసమూహాన్ని వినియోగించరాదు. రేఖామాత్ర స్నానం చేయించాలి. అక్షయ్యోదకాన్ని సమర్పించాలి. ఈ మూడింటిని మళ్లీ చేయరాదు.

**స్వధా వాచన మాశీశ్చ తిలకం చ ఖగోత్తమ ।**
**ఘటం దద్యాత్సమాషాన్నం దద్యాల్లోహస్య దక్షిణామ్॥46॥**

పక్షిశ్రేష్ఠమా! స్వధావాచనం, ఆశీర్వాదం, తిలక క్రియ ఈ మూడింటినీ చేయరాదు. మినపగింజలతో కూడిన అన్నం నింపినపాత్రను, ఇనుపవస్తువును దక్షిణగా దానమీయాలి.

**పిండస్య చాలనం ప్రోక్తం నైవ ప్రోక్త మిదం త్రికమ్ ।**
**ప్రచ్ఛాదన విసర్గౌ చ స్వస్తి వాచనకం తథా ॥47॥**

అప్పుడు పిండాన్ని కదపాలి. ఆచ్ఛాదనం, విసర్జనం, స్వస్తివాచనం ఈ మూడింటిని ఇప్పుడు చేయకూడదని చెప్పబడింది.

**ఏషు షట్సు విధిః ప్రోక్తః శ్రాద్ధేషు మలినేషు తే ।**
**షడేవ మరణస్థానే ద్వారి చాత్వరికే తథా ॥48॥**

**విశ్రామే కాష్ఠచయనే తథా సంచయనే ఖగ ।**
**మృతిస్థానే శవో నామ భూమి స్తుష్యతి దేవతా ॥49॥**

ఈ ఆరు స్థానాలయందు మాలిన్యసహిత శ్రాద్ధక్రియలందు పిండప్రదానం చెప్పబడింది. ఖగమా! మరణస్థానం, ద్వారం, అరుగు(ముంగిలి), విశ్రామస్థానం, కాష్ఠచయనం, అస్థిసంచయనస్థానం – ఈ ఆరును పిండదానానికి పనికివచ్చే స్థానాలు. ప్రాణి మరణించినచోట ఇచ్చే పిండాన్ని శవపిండమంటారు. దీనివల్ల భూదేవి తృప్తి పొందుతుంది.

**పాంథో ద్వారి భవేత్తేన ప్రీతా స్యాద్వాస్తు దేవతా ।**
**చత్వరే ఖేచరస్తేన తుష్యేద్భూతాది దేవతాః ॥50॥**

ద్వారమందు ఇచ్చే దానిని పాంథ పిండమంటారు. దానివల్ల వాస్తుదేవత ప్రీతి పొందుతుంది. ముంగిలియందు ఇచ్చేదానిని ఖేచర పిండమంటారు. దానివల్ల భూతాదులు, దేవగణాలు తృప్తిపొందుతాయి.

**విశ్రామే భూత సంజ్ఞోఽయం తుష్టాస్తేన దిశో దశ ।**
**చితాయాం సాధక ఇతి సంచితౌ ప్రేత ఉచ్యతే ॥51॥**

విశ్రామ స్థానమందు ఇచ్చేదానిని భూతపిండమంటారు. దానివల్ల పది దిక్కులు తృప్తిపొందుతాయి. శ్మశానమందు ఇచ్చేదానిని సాధక పిండమని, అస్థిసంచయప్రదేశమందు ఇచ్చేదానిని ప్రేతపిండమని అంటారు. (వీటివల్ల రుద్రుడు, ప్రేతలు తృప్తి పొందుతారు)

**తిల దర్భ ఘృతైధాంసి గృహీత్వా తు సుతాదయః ।**
**గాథాం యమస్య సూక్తం వాప్యధీయానా వ్రజంతి హి ॥52॥**

శవయాత్రా సమయంలో తిలలు, కుశలు, నేయి, ఇంధనం పట్టుకొని, సుతులు మున్నగువారు పుణ్య(యమ)గాథలు లేదా యమసూక్తాన్ని గానంచేస్తూ ముందుకు సాగాలి.

**అహరహర్నీయమానో గామశ్వం పురుషం వృషమ్ ।**
**వైవస్వతో న తృప్యేత సురయాత్వివ దుర్మతిః ॥53॥**

ప్రతిదినమూ వెడుతూ, ఆవును, అశ్వాన్నీ, పురుషుని, వృషాన్నీ అనుసరించి యముడు తృప్తి పొందుతాడు. దుర్మతి సురనుచూచి తృప్తిపొందుతాడు. కాని యముడు అలాగున(అలా)తృప్తి పొందేవాడు కాడు. (ఒక్క సురను మాత్రమే చూచి దుర్మతి తృప్తి పొందనట్లుగా, యముడు కేవలం వీటిని మాత్రమే చూచి తృప్తిపడడు.)

**ఇమాం గాథామపేతేతి సూక్తం వా పథి సంపఠేత్ ।**
**దక్షిణస్యాం దిశ్యరణ్యం వ్రజేయుః సర్వబాంధవాః ॥54॥**

ఇటువంటి యమగీతనుకాని, "ఓం అపేతేతి..." అనే యమసూక్తాన్ని కాని మార్గంలో పఠించాలి. సర్వబాంధవులు దక్షిణదిశలో నున్న అరణ్యభూమికి కదలాలి.

**పథి శ్రాద్ధద్వయం కుర్యాత్ పూర్వోక్తవిధినా ఖగ ।**
**తతః శనై ర్భూతలే వై దక్షిణా శిరసం శవమ్ ॥55॥**

**స్థాపయిత్వా చితా భూమౌ పూర్వోక్తం శ్రాద్ధమాచరేత్ ।**
**తృణ కాష్ఠతిలాజ్యాది స్వయం నిన్యుః సుతాదయః ॥56॥**

ఖగమా! దారిలో రెండుచోట్ల దింపి పూర్వం చెప్పబడిన విధానంగా శ్రాద్ధం నిర్వహించాలి. పిమ్మట శ్మశానభూమిలో శవాన్ని మెల్లగా దక్షిణంవైపు తల ఉండేలాచేసి నేలపై పడుకోబెట్టి, పూర్వోక్తమైన శ్రాద్ధం ఆచరించాలి. సుతుడు మున్నగువారే గడ్డి, కట్టెలు, నువ్వులు, నేయి మున్నగునవి స్వయంగా తీసుకొని వెళ్లాలి.

**శూద్రానీతైః కృతం కర్మ సర్వం భవతి నిష్ఫలమ్ ।**
**ప్రాచీనావీతినా భావ్యం దక్షిణాభిముఖేన చ ॥57॥**

శూద్రులచే తీసుకొనిరాబడిన కర్మ అంతా నిష్ఫలమవుతుంది. అన్నిపనులు దక్షిణముఖంగా తిరిగి ప్రాచీనావీతివిధి (అపసవ్యవిధి) లో చేయాలి.

**వేదీ తత్ర ప్రకర్తవ్యా యథా శాస్త్రమథాండజ ।**
**ప్రేతవస్త్రం ద్విధా కృత్వార్ధేన తం ఛాదయేత్తతః ॥58॥**

**అర్ధం శ్మశాన వాసార్థం భూమావేవ వినిఃక్షిపేత్ ।**
**తతః పూర్వోక్తవిధినా పిండం ప్రేతకరే న్యసేత్ ॥59॥**

అండజమా! శాస్త్రసమ్మతంగా అక్కడొక వేదిని నిర్మించాలి. ప్రేతవస్త్రాన్ని రెండు భాగాలుగా చించి, ఒక సగంతో శవాన్ని కప్పాలి. రెండో సగాన్ని శ్మశానజీవుల కోసమై అక్కడ భూమిపై వదలివేయాలి. తరువాత పూర్వోక్తవిధిచే పిండాన్ని ప్రేత చేతిలో ఉంచాలి.

**ఆజ్యేనాభ్యంజనం కార్యం సర్వాంగేషు శవస్య చ ।**
**దాహమృత్యో రంతరాలే విధిః పిండస్య తం శృణు ॥60॥**

శవంయొక్క సర్వాంగాలయందు నేతితో అభ్యంజనం చేయాలి(పూయాలి). మృతికి దహనానికి మధ్య సమయంలో పిండదానవిధిని గురించి విను.

**పూర్వోక్తైః పంచభిః పిండైః శవస్యాహుతియోగ్యతా ।**
**అన్యథా చోపఘాతాచ్చ రాక్షసాద్యా భవంతి హి ॥61॥**

పూర్వం చెప్పబడిన మృత స్థానాదులలో పెట్టబడిన అయిదు పిండాలవల్ల శవానికి అగ్నిదాహయోగ్యత లభిస్తుంది. మరో విధంగా అయితే విధికి దూరమై రాక్షసులు అవుతారు.

**సంసృజ్య చోపలిప్యాథ ఉల్లిఖ్యోద్ధృత్య వేదికామ్ ।**
**అభ్యుక్ష్యోప సమాధాయ వహ్నిం తత్ర విధానతః ॥62॥**

**పుష్పాక్షతైశ్చ సంపూజ్య దేవం క్రవ్యాదసంజ్ఞకమ్ ।**
**శ్రౌతేన తు విధానేన హ్యాహితాగ్నిం దహేద్బుధః ॥63॥**

వేదికను ఏర్పరచి, అలికి, చక్కగా లేపనంచేసి, నేలను ఉద్ధరించి, శాస్త్రవిధానం ద్వారా అగ్నిని ఆవాహనం చేసి స్థాపించి, పుష్పాక్షతలతో క్రవ్యాది నామాలతో అగ్నిదేవుని పూజించి, శ్రౌతపద్ధతితో విద్వాంసుడు ఆహితాగ్నిని ముట్టించాలి.

**చండాలాగ్నిం చితాగ్నిం చ పతితాగ్నిం పరిత్యజేత్ ।**
**త్వం భూతకృజ్జగద్యోనిస్త్వం లోకపరిపాలకః ॥64॥**

**ఉపసంహర తస్మాత్త్వమేనం స్వర్గం నయామృతమ్ ।**
**ఇతి క్రవ్యాదమభ్యర్చ్య శరీరాహుతి మాచరేత్ ॥65॥**

చండాలాగ్నిని, చితాగ్నిని, పతితాగ్నిని పరిత్యజించాలి. "నీవే భూతకృత్తువు, నీవు జగద్యోనివి, నీవు లోక పరిపాలకుడవు. అందువల్ల నీవు ఈతనిని జన్మనుండి ఉపసంహరించు. అమృతమైన స్వర్గానికి గొనిపొమ్ము" అని క్రవ్యాదుని అర్చించి, శరీరాన్ని దహనం చేయాలి.

**అగ్నిదగ్ధే తథా దేహే దద్యాదాజ్యాహుతిం తతః ।**
**అస్మాత్త్వమధిజాతోఽసి త్వదయం జాయతాం పునః ॥66॥**

**అసౌ స్వర్గాయ లోకాయ స్వాహేత్యుక్త్వా తు నామతః ।**
**ఏవమాజ్యాహుతిం దత్త్వా తిలమిశ్రాం సమంత్రకమ్ ॥67॥**

దేహం అగ్నిదగ్ధమయిన పిమ్మట ఆజ్యాహుతిని ఈయాలి. "ఇతని వలన నీవు తెలియబడినవాడవయ్యావు. నీ వలన ఇతడు తిరిగి జన్మపొందును గాక! ఇతడు స్వర్గలోకానికి వెళ్లు గాక ! స్వాహా!" అని మంత్రం పలుకుతూ నువ్వులు, నేతితో కలిపి, ఒక ఆహుతిని శవంపై నున్న అగ్నికి సమంత్రకంగా ఈయాలి.

**రోదితవ్యం తతో గాఢమేవం తస్య సుఖం భవేత్ ।**
**దాహస్యానంతరం తత్ర కృత్వా సంచయనక్రియామ్ ॥68॥**

అంతవరకు రోదనధ్వనులను అదుపులో ఉంచి, అప్పుడు గట్టిగా రోదించాలి. అది ప్రేతకు సుఖాన్ని కలిగిస్తుంది. దహనక్రియ తరువాత, అస్థిసంచయన క్రియనాచరించాలి.

**ప్రేతపిండం ప్రదద్యాచ్చ దాహార్తి శమనం ఖగ ।**
**తతః ప్రదక్షిణం కృత్వా చితాప్రస్థాన పూర్వకాః ॥69॥**

**కనిష్ఠపూర్వాః స్నానార్థం గచ్ఛేయుః సూక్తజాపకాః ।**
**తతో జలసమీపే తు గత్వా ప్రక్షాళ్య చాంశుకమ్ ॥70॥**

**పరిధాయ పునస్తచ్చ బ్రూయుస్తం పురుషం ప్రతి ।**
**ఉదకం తు కరిష్యామః సచైలం పురుషా స్తతః ॥71॥**

**కురుధ్వమిత్యేవ వదేచ్ఛత వర్షావరే మృతే ।**
**పుత్ర్యాద్యా వృద్ధపూర్వాస్తే ఏకవస్త్రాః శిఖాం వినా ॥72॥**

ఖగమా! దాహార్తి ఉపశమించుటకోసమై ప్రేతపిండప్రదానం చేయాలి. తరువాత అక్కడకు వెళ్లినవారందరూ చితికి ప్రదక్షిణం చేసి, సూక్తం చదువుతూ స్నానార్థమై జలాశయ సమీపానికి వెళ్లాలి. ముందు చిన్నవారు స్నానం చేయాలి. ముందు తమ వస్త్రాలను తడుపుకొని,(పిండుకొని) స్నానానంతరం మరల వాటినే కట్టుకొని, చనిపోయిన వ్యక్తిని ధ్యానించి, జలప్రదానం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ఆ వ్యక్తి తేజోరూపంలో వచ్చి, ఆజ్ఞ ఇవ్వడం జరిగిందని భావించుకొని, మరల జలాశయానికి రావాలి. వంద సంవత్సరాలు పూర్తికాని వ్యక్తి మరణిస్తే, వచ్చిన పురుషులు, పుత్రాదులు, ఏకవస్త్రులై పిలక ముడిని విప్పి ముందు పెద్దవారు సాగుతూ ఉండగా నడవాలి.

**ప్రాచీనావీతినః సర్వే విశేయు ర్మౌనినో జలమ్ ।**
**అపనః శోశుచదఘమానేన పితృదిఙ్ముఖాః ॥73॥**

**జలావఘట్టనం చైవ న కుర్యుః స్నానకారకాః ।**
**తతస్తటే సమాగత్య శిఖాం బద్ధ్వా బుజాన్ కుశాన్ ॥74॥**

**దక్షిణాగ్రహస్తయోస్తు కృత్వాథ సతిలం జలమ్ ।**
**ఆదాయాంజలినా యామ్యాం దుఃఖీ పైతృకతీర్థతః ॥75॥**

అందరు మౌనంగా, జందెం అపసవ్యం చేసుకొని జలాలలోనికి ప్రవేశించాలి. అందరూ దక్షిణంపైపు తిరిగి "అపనః శోశుచదఘం" అనే మంత్రం చదవాలి. స్నానం చేసేవారందరు నీళ్లలో చప్పుడు చేయరాదు. తరువాత గట్టుపైకి వచ్చి, పిలకముడి వేసుకొని, కుశలను సరిగా పట్టుకొని. దక్షిణాగ్రాలుగా చేతితో పట్టుకొని,

దోయిలిలో నువ్వులతో కూడిన నీళ్లను నింపుకొని, దక్షిణంగా, దుఃఖిస్తూ, పితృతీర్థం ఇచ్చే పద్ధతిలో జలప్రదానం చేయాలి.

**ఏకవారం త్రివారంవాదశవార మథాపి వా ।**
**భూమావశ్మని వా సర్వే క్షిపేయు ర్వాగ్యతాః ఖగ ॥76॥**

ఖగమా! ఒకసారి కాని, మూడు సార్లు కాని, పది మారులు కాని, నేలపై కాని, రాతిపై గాని వాఙ్నియమంతో దోసిళ్లతో అందరూ నీళ్లుపోయాలి. (ఈ తిలాంజలి "అద్యోహోముక గోత్రాముక ప్రేతచితాదాహజనిత తాప తృషోపశమాయ ఏష తిలకుశతోయాంజలి ర్మయాదత్త స్తవోపతిష్ఠతాం" అని చదివి ఈయాలి)

**తృప్యంతు తృప్యతాం వాపి తర్పయామ్యుపతిష్ఠతామ్ ।**
**ప్రేతైతదముక గోత్రే త్యుక్తేష్వేవం సముచ్చరేత్ ॥77॥**

'తృప్తిని పొందుగాక! తృప్తులను పొందు గాక! తర్పణం ఇచ్చుచున్నాను. ఇచ్చట ఉండు గాక! ప్రేత! ఆయా జన్మాంతర గోత్ర సంభవా!' అని మంత్రాలతో ఈ విధంగా ఉచ్చరించాలి.

**జలాంజలౌ కృతే పశ్చాద్విధేయం దంతధావనమ్ ।**
**త్యజంతి గోత్రిణః సర్వే దినాని నవ కాశ్యప ॥78॥**

జలాంజలి ఇచ్చిన తరువాత దంతధావనం (నోరు పుక్కిలించుట) చేయాలి. కశ్యపవంశ సంభవా! తొమ్మిది రోజుల పాటు సగోత్రికులు అందరూ జలాలు విడిచిపెడతారు.

**తత ఉత్తీర్యోదకాద్వై వస్త్రాణి పరిధాయ చ ।**
**స్నానవస్త్రం సకృత్పీడ్య విశేయుః శుచి భూతలే ॥79॥**

**అశ్రుపాతం న కుర్వీత దత్త్వా దాహ జలాంజలిమ్ ।**
**శ్లేష్మాశ్రు బాంధవై ర్ముక్తం ప్రేతో భుంక్తే యతో౽వశః ॥80॥**

**అతో న రోదితవ్యం హి క్రియాః కార్యాః స్వశక్తితః ।**
**తతస్తేషూపవిష్టేషు పురాణజ్ఞః సుకృత్సుకః ॥81॥**

నీటినుండి, బయటకు వచ్చి (పొడి)బట్టలు కట్టుకోవాలి (లేదా) స్నానంచేసిన వస్త్రాన్ని తడిపి, పిడిచి, కట్టుకొని, పవిత్రమైన భూమిపై కూర్చోవాలి. 'దాహజలాంజలి ఇచ్చిన పిమ్మట కళ్లవెంబడి నీరు కారితే అది మృతిచెందినవారి నోటిలోకి వెడుతుంది. అందువల్ల ఏడ్చుట కర్తవ్యం కాదు. మీమీ శక్తిననుసరించి కర్మలు చేయడం విధిగా భావించండి'. అని అందరూ కూర్చొని ఉండగా, ఆ శ్మశానానికి వచ్చినవారిలో పురాణమర్మాలు తెలిసినవాడు, స్వతస్సిద్ధంగా పుణ్యాత్ముడు అయినవాడు చెప్పి ఓదార్చాలి.

**శోకాపనోదం కుర్వీత సంసారానిత్యతాం బ్రువన్ ।**
**మానుష్యే కదలీ స్తంభే అసారే సారమార్గణమ్ ॥82॥**

**కరోతి యః స సంమూఢో జలబుద్బుద సన్నిభే ।**
**పంచధా సంభృతః కాయో యది పంచత్వమాగతః ॥83॥**

సంసారంయొక్క అనిత్యత్వాన్ని వివరిస్తూ శోకాన్ని తొలగించాలి 'మానవ శరీరమే అంత. అరటిచెట్టు ఎంత ఏపుగా పెరిగినా కూలిపోక తప్పదు. సారహీనమైన సంసారంలో సారం గురించి వెదకడమనేది మూఢుడు చేసేపని. శరీరం నీటి బుడగవంటిది, శరీరం అయిదు పదార్థాలతో నిర్మింపబడుతుంది, ఇప్పుడు అయిదుగా విడిపోయింది.

**కర్మభిః స్వశరీరోత్థై స్తత్ర కా పరిదేవనా ।**
**గంత్రీవ సుమతీ నాశముదధి ర్దైవతాని చ ॥84॥**

**ఫేనప్రఖ్యః కథం నాశం మర్త్యలోకో న యాస్యతి ।**
**ఏవం సంశ్రావయేత్తత్ర మృదుశాద్వలసంస్థితాన్ ॥85॥**

తన శరీరంతో చేయబడిన కర్మలతో కలసి జీవించి, పంచ తత్త్వాలలో కలసిపోయింది? దానికోసం చింతించడమెందుకు? వసుమతి అయిన భూమియే కాలగర్భంలో కలసిపోతుంది. సముద్రం, దేవతాగణాలే నశించిపోతాయి. ఇది నీటిమీది నురగ లాంటి, మనుష్యలోకంలోని జనం ఎందుకు నశించకుండా ఉంటుంది?,' అని శ్మశానభూమిలో లేతపచ్చిక బయళ్లలో కూర్చుండి వినిపించాలి.

**తేఽయి సంశ్రుత్య గచ్ఛేయుర్గృహం బాలపురఃసరాః ।**
**విదశ్య నింబపత్రాణి నియతా ద్వారి వేశ్మనః ॥86॥**

ఓయీ! వారుకూడ ఆ మాటలువిని ఊరటచెంది బాలురు ముందు సాగగా ఇంటికి వెళ్లాలి. ఇంటిద్వారంవద్ద నియమంగా వేపాకులు నమలాలి.

**ఆచమ్య వహ్నిసలిలం గోమయం గౌరసర్షపాన్ ।**
**దుర్వా ప్రవాలం వృషభ మన్యదప్యథ మంగలమ్ ॥87॥**

**ప్రవిశేయుః సమాలభ్య కృత్వాశ్మని పదం శనైః ।**
**శ్రౌతేన తు విధానేన ఆహితాగ్నిం దహేద్బుధః ॥88॥**

ఆచమనం చేసి, అగ్ని, నీరు, పేడ, తెల్లఆవాలు, గరిక, పగడం, ఎద్దు మున్నగునవి లేదా మరేదైనా మంగళద్రవ్యాన్ని చేతితో తాకి, ఇంటియందు నెమ్మదిగా రాతిపై పాదాన్ని ఉంచి మెల్లగా, ఇంటిలోకి వెళ్లాలి, విద్వాంసుడు ఈ విధానంతో శ్రౌతపద్ధతితో ఆహితాగ్నిచే దహనం చేయాలి.

**ఊనద్వివర్షం నిఖనేన్న కుర్యాదుదకం తతః ।**
**యోషిత్పతివ్రతా యా స్యాద్భర్తారం యానుగచ్ఛతి ॥89॥**

**ప్రయోగపూర్వం భర్తారం నమస్కృత్యారుహేచ్చితిమ్ ।**
**చితి భ్రష్టా తు యా మోహాత్సా ప్రాజాపత్యమాచరేత్ ॥90॥**

రెండేళ్లలోపు వయసున్న పిల్లలు మరణిస్తే శ్మశానంలో గోయిత్రవ్వి పాతిపెట్టాలి. ఉదక దానాదులు చేయరాదు. భర్తను అనుసరింపదలచిన పతివ్రత ప్రయోగ పూర్వకంగా భర్తకు నమస్కరించి చితిని అధిరోహించాలి, ఏ స్త్రీ అయినా మోహంవల్ల చితిని వదలి పెడితే, ప్రాజాపత్యాన్ని ఆచరించాలి.

**తిస్రః కోట్యర్ధ కోటీ చ యాని లోమాని మానుషే ।**
**తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి ॥91॥**

మానవ శరీరంలో మూడు కోట్ల ఏబది లక్షల రోమాలు ఉంటాయి. అంతకాలం భర్తను అనుసరించి వెళ్లిన స్త్రీ స్వర్గంలో వసిస్తుంది.

**వ్యాల గ్రాహీ యథా వ్యాలం బిలాదుద్ధరతే బలాత్ ।**
**తద్వదుద్ధృత్య సా నారీ తేనైవ సహ మోదతే ॥92॥**

పాములను పట్టేవాడు ఏ విధంగా బలంతో బిలంనుండి పామును లాగి పట్టుకొంటాడో, ఆ విధంగా భర్తను అనుగమించిన నారి భర్తను ఉద్ధరించి అతనితో కలసి సుఖిస్తుంది.

**తత్ర సా భర్తృపరమా స్తూయమానాప్సరోగణైః ।**
**క్రీడతే పతినా సార్ధం యావదింద్రా శ్చతుర్దశ ॥93॥**

అక్కడ ఆమె భర్తృభక్తిపరాయణురాలుగా అప్సరోగణాలచే కొనియాడబడుతూ ఉంటుంది. ఆమె భర్తతో కలసి పదునలుగురు ఇంద్రుల కాలం విహరిస్తుంది.

**బ్రహ్మఘ్నో వా కృతఘ్నో వా మిత్రఘ్నో వా భవేత్పతిః ।**
**పునాత్యవిధవా నారీ తమాదాయ మృతా తు యా ॥94॥**

**మృతే భర్తరి యా నారీ సమారోహేద్ధుతాశనమ్ ।**
**సారుంధతీ సమాచారా స్వర్గలోకే మహీయతే ॥95॥**

పతి బ్రహ్మఘ్నుడయినా, కృతఘ్నుడయినా, మిత్రఘ్నుడయినా, సుమంగళి అయిన స్త్రీ భర్తను అనుసరించి మృతి చెందితే, ఆమె భర్తను పవిత్రుని కావిస్తుంది. భర్త మరణించగా ఏ భార్య అగ్నిలో ప్రవేశిస్తుందో ఆమె అరుంధతివలె సంచరిస్తూ, స్వర్గలోకంలో సుఖాన్ని పొందుతుంది.

**యావచ్చాగ్నౌ మృతే పత్యౌ స్త్రీ నాత్మానం ప్రదాహయేత్ ।**
**తావన్న ముచ్యతే సా హి స్త్రీ శరీరాత్కథంచన ॥96॥**

ఎంతకాలమయితే స్త్రీ భర్త మరణించగా తనను అగ్నికి అర్పించకుండా ఉంటుందో, అంతకాలం ఆమె ఎప్పుడూ స్త్రీ శరీరంనుండి విముక్తి పొందజాలదు.

**మాతృకం పైతృకం చైవ యత్ర చైవ ప్రదీయతే ।**
**కులత్రయం పునాత్యేషా భర్తారం యానుగచ్ఛతి ॥97॥**

అటు మాతృవర్గంవారిని, ఇటు పితృవర్గంవారిని తాను ఎక్కడయితే ఈయబడిందో ఆ భర్తృ వర్గం వారిని, ఇలా కులత్రయాన్నీ భర్తతో అనుగమించి వెళ్లిన స్త్రీ పవిత్రం కావిస్తుంది.

**ఆర్తార్తే ముదితే హృష్టా ప్రోషితే మలినా కృశా ।**
**మృతే మ్రియేత యా పత్యౌ సా స్త్రీ జ్ఞేయా పతివ్రతా ॥98॥**

భర్త ఆర్తుడై ఉండగా, తాను ఆర్తిపొందుతూ, భర్త సంతోషిస్తూ ఉండగా తాను ఆనందం పొందుతూ, భర్త పరస్థలంలో ఉండగా, తాను కృశించి మలినురాలై ఉంటూ, భర్త మరణించగా తాను మరణించిన స్త్రీ పతివ్రతగా తెలియజేయబడుతుంది.

**పృథక్ చితాం సమారుహ్య న ప్రియా గంతు మర్హతి ।**
**క్షత్రియాద్యాః సవర్ణాశ్చ ఆరోహేయు రపీహ తాః ॥99॥**

వేరే చితిపై అధిరోహించి, ప్రియురాలు భర్తను అనుగమించి వెళ్లుట తగినదికాదు. క్షత్రియకాంతలు, సవర్ణ కాంతలు కూడా ఇట్లే చితిని ఆరోహిస్తారు.

**చాండాలీ మవధిం కృత్వా బ్రాహ్మణీతః సమో విధిః ।**
**అగర్భిణీనాం సర్వాసా మబాలతాకానామపి ॥100॥**

చండాలుని ఆధారంగా చేసుకొని, చాండాలియైన బ్రాహ్మణికి కూడ ఈ విధి సమానమే, గర్భవతులు కానివారికి,చిన్నపిల్లలు లేనివారికి అందరికి ఇదే సమానమైన విధి.

**దహనస్య విధిః ప్రోక్తః సామాన్యేన మయా ఖగ ।**
**విశేషమపి తస్యాస్య కంచిత్కిం శ్రోతుమిచ్ఛతి ॥101॥**

ఖగమా! సామాన్యంగా జరిపే దహనవిధిని నీకు తెలియజేశాను. దాని గురించి విశేషంగా ఏదయినా వినగోరెదవా ఏమి?

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**ప్రోషితే తు మృతే స్వామిన్యస్థినాశముపేయుషి ।**
**కథం దాహః ప్రకర్తవ్య స్తన్మే వద జగత్పతే ॥102॥**

భర్త విదేశవాసియై లేదా ఎక్కడో ఆకస్మికంగా మరణిస్తే, ఎముకలూ లభ్యంకాని మృతునకు, జగదాధార! ఎలా దహనసంస్కారం (అపరకర్మ) చేయాలి? దానిని నాకు వివరించు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు పలికాడు.

**అస్థీని చేన్న లభ్యంతే ప్రోషితస్య నరస్య చ ।**
**తేషాం చ హిగతిస్థానం విధానం కథయామ్యహమ్ ॥103॥**

ప్రోషితుడైన నరునకు అసహజమరణం వస్తే, ఎముకలుకూడ లభ్యం గాకపోతే, వారు పొందే గతిని, ఆ అపరకర్మ విధానాన్ని నేను చెబుతున్నాను.

**శృణు తార్క్ష్య పరం గోప్యం పత్యు ర్దుర్మరణేషు యత్ ।**
**లంఘనై ర్యే మృతా జీవా దంష్ట్రిభి శ్చాభిఘాతితాః ॥104॥**

**కంఠగ్రహే విలగ్నానాం క్షీణానాం తుండఘాతినామ్ ।**
**విషాగ్ని వృష విప్రేభ్యో విషూచ్యా చాత్మఘాతకాః ॥105॥**

గరుత్మంతా! ఆకర్ణించు. ఇది పరమగోప్యమైనది, దుముకుట వల్ల గానీ, క్రూర జంతువుల బారినపడి కానీ భర్త మరణిస్తే కంఠాలు తెగిపోయి మొండెములు వ్రేలాడుతూ, ముక్కులు తెగిపోయి క్షీణిస్తారు. విషం, అగ్ని, వృషం, బ్రహ్మరాక్షసులు, విషూచి(విషజ్వరం) మున్నగువాటిచే క్షీణిస్తారు మరికొందరు. ఆత్మఘాతకులు ఇంకొందరు.

**పతనోద్బంధన జలై ర్మృతానాం శృణు సంస్థితమ్ ।**
**సర్పవ్యాఘ్రైః శృంగిభిశ్చ ఉపసర్గోపలోదకైః ॥106॥**

**బ్రాహ్మణైః శ్వాపదైశ్చైవ పతనై ర్వృక్షవైద్యుతైః ।**
**నఖైర్లోహై ర్గిరేః పాతై ర్భిత్తిపాతై ర్భృగో స్తథా ॥107॥**

**ఖట్వాయా మంతరిక్షే చ చౌరచాండాలత స్తథా ।**
**ఉదక్యా శునకీ శూద్ర రజకాది విభూషితాః ॥108॥**

**ఊర్ధ్వోచ్ఛిష్టా ధరోచ్ఛిష్టోభయో చ్ఛిష్టాస్తు యే మృతాః ।**
**శస్త్రఘాతై ర్మృతా యే చాస్యశ్వస్పృష్టా స్తథైవ చ ॥109॥**

**తత్తు దుర్మరణం జ్ఞేయం యచ్చ జాతం విధిం వినా ।**
**తేన పాపేన నరకాన్ భుక్త్వా ప్రేతత్వ భాగినః ॥110॥**

పడిపోవుటవల్ల గాని, బంధింపబడుటవల్ల గాని, నీరువల్ల గాని చనిపోయినవారు మరికొందరు. అటువంటి మృతుల స్థితిని విను. సర్పాలు, పులులు, కొమ్ములుగల జంతువులు, ఉత్పాతాలు, రాళ్లు, ఉదకం, బ్రహ్మరాక్షసులు, శ్వాపదాలు (పులి, హింసించెడి పశువు), చెట్లు, పిడుగులు మీదపడుట, గోళ్లు, లోహాలచే మరణించుట, కొండలపైనుండి పడిపోవుట(కొండలువిరిగి),గోడలు కూలిపోవుట, భృగుపాతం (కొండచరియలు విరిగి పడుట). మంచంపై గాని, అంతరిక్షంలో కాని, చోరులవల్ల, చండాలులవల్ల, రజస్వల, కుక్కవల్ల, శూద్రులవల్ల, రజకులవల్ల, వస్త్రాదిధారణవల్ల, విభూషణాదులవల్ల, మిక్కిలి(బయటి) ఎంగిలివల్ల కాని, తక్కువ(లోపలి) ఎంగిలివల్ల కాని అటు ఇటూ గానీ ఎంగిలివల్ల గాని మరణించేవారు, ఆయుధాల దెబ్బలచే మరణించేవారు, కత్తి, గుఱ్ఱములవల్ల మరణించేవారు. అది దుర్మరణంగా చెప్పబడుతుంది. కర్మవిధి లేకుండా జరిగినట్టిదది. ఆ పాపంవల్ల నరకాలను అనుభవించుటకై ప్రేతత్వాన్ని పొందుతారు.

**న తేషాం కారయే ద్దాహం సూతకం నోదకక్రియామ్ ।**
**న విధానం మృతాద్యం చ న కుర్యాదౌర్ధ్వదైహికమ్ ॥111॥**

వారికి దహన కర్మయూ లేదు, సూతకమూ లేదు, ఉదకక్రియకూడా లేదు. మృతాది సంస్కారవిధానమూ లేదు. వారికి ఔర్ధ్వ దైహికకర్మ చేయరాదు.

**న పిండదానం కర్తవ్యం ప్రమాదాచ్చేత్కరోతి హి ।**
**నోపతిష్ఠతి తత్సర్వ మంతరిక్షే వినశ్యతి ॥112॥**

వారికి పిండప్రదానం చేయదగినది కాదు. ప్రమాదవశాన చేసినప్పటికిని అది అతనికి చెందేదికాదు. చేసినదంతా అంతరిక్షంలో నశించిపోతుంది.

**అతస్తస్య సుతైః పౌత్రైః సపిండైః శుభమిచ్ఛుభిః ।**
**నారాయణ బలిః కార్యో లోకగర్హాభియా ఖగ ॥113॥**

ఖగమా! అందువల్ల లోకం నిందిస్తుందనే భయంతో అయినా, సుతులచేకాని, మనుమలచేగాని, సపిండులచేగాని మృతునికి శుభం కావాలనే కోరుకొనేవారు ముందు నారాయణబలిని ఆచరించాలి.

**తథా తేషాం భవేచ్ఛౌచం నాన్యథేత్యబ్రవీద్యమః ।**
**కృతే నారాయణబలా వౌర్ధ్వదైహిక యోగ్యతా ॥114॥**

అప్పుడు వారికి శుచిత్వం సిద్ధిస్తుంది తప్ప, మరోవిధంగా మాత్రం కాదని యముడు చెప్పియున్నాడు. నారాయణబలి అనే కర్మను ముందుచేస్తే, అపుడు ప్రేతానికి అపరకర్మ యోగ్యత కలుగుతుంది.

**తస్య శుద్ధికరం కర్మ తద్భవేన్న తదన్యథా ।**
**నారాయణబలిం సమ్యక్ తీర్థే సర్వం ప్రకల్పయేత్ ॥115॥**

అది ప్రేతానికి శుద్ధికరమైన కర్మ అవుతుంది. మరోవిధంగా మాత్రంకాదు, నారాయణబలి అనెడి కర్మనంతను శ్రద్ధతో పుణ్యతీర్థాలలో చేయాలి.

**కృష్ణాగ్రే కారయే ద్విప్రై ర్యేన పూతో భవేన్నరః ।**
**పూర్వం తు తర్పణం కార్యం విప్రైః పౌరాణవైదికైః ॥116॥**

**సర్వౌషధ్యక్షతై ర్మిశ్రైర్విష్ణు ముద్దిశ్య తర్పయేత్ ।**
**కార్యం పురుషసూక్తేన మంత్రైర్వా వైష్ణవైరపి ॥117॥**

శ్రీకృష్ణభగవానుని సమక్షంలో బ్రాహ్మణుల ద్వారా దీనిని జరిపించాలి. అప్పుడు మృతిచెందిన నరుడు పవిత్రుడవుతాడు. పురాణవేత్తలైన విప్రులచే ముందు తర్పణం ఇప్పించాలి. అన్ని ఓషధులతోను, అక్షతలతోను కలిపి విష్ణువును ఉద్దేశించి తర్పణాలు ఈయాలి. పురుషసూక్తంచేతగాని, వైష్ణవమంత్రాలచేగాని (విష్ణుసూక్తం చేతగాని) ఈ విధిని చేయుట కర్తవ్యం.

**దక్షిణాభిముఖో భూత్వా ప్రేతం విష్ణుమితి స్మరన్ ।**
**అనాది నిధనో దేవః శంఖ చక్ర గదాధరః ॥118॥**

**అక్షయః పుండరీకాక్షః ప్రేతమోక్షప్రదో భవ ।**
**తర్పణ స్యావసానే స్యాద్వీతరాగో విమత్సరః ॥119॥**

దక్షిణముఖంగా తిరిగి, ప్రేతను విష్ణువుగా స్మరిస్తూ, “అనాదినిధనుడు, దేవుడు, శంఖచక్రగదాధరుడు, అక్షయుడు, పుండరీకాక్షుడు ప్రేత విముక్తి దాయకుడవును గాక!” అని స్మరించాలి. తర్పణం ఇచ్చిన తరువాత కర్త రాగానికి, మాత్సర్యానికి దూరంగా ఉండాలి.

**జితేంద్రియమనా భూత్వా శుచిష్మాన్ ధర్మతత్పరః ।**
**భక్త్యా తత్ర ప్రకుర్వీత శ్రాద్ధాన్యేకాదశైవ తు ॥120॥**

ఇంద్రియాలను, మనస్సును అదుపులో నుంచుకొని, శౌచవంతుడై, ధర్మమునందు ఆసక్తి కల్గినవాడై, భక్తితో పదకొండు శ్రాద్ధాలను నిర్వహించాలి.

**సర్వకర్మ విధానేన ఏకైకాగ్రే సమాహితః ।**
**తోయవ్రీహియవాన్ దద్యాత్ గోధూమాంశ్చ ప్రియంగవః ॥121॥**

**హవిష్యాన్నం శుభం ముద్రాం ఛత్రోష్ణీషే చ దాపయేత్ ।**
**దాపయేత్సర్వసస్యాని క్షీరం క్షౌద్ర సమన్వితమ్ ॥122॥**

ఒక్కొక్క దానిని ఏకాగ్ర మనస్కుడై శాస్త్రవిధానంతో కర్మనంతనూ చేయాలి.నీరు, వ్రీహి, ధాన్యం, యవలు, గోధుమలు, కొఱ్ఱలు, శుభప్రదమైన హవిష్యాన్నం, ఉంగరం, గొడుగు, తలపాగా దానం చేయాలి. పిమ్మట సర్వసస్యాలను తేనెతో కూడిన పాలను దానం చేయాలి.

**వస్త్రోపానహ సంయుక్తం దద్యాదష్టవిధం పదమ్ ।**
**దాపయేత్సర్వపాపేభ్యో న కుర్యాత్పంక్తివంచనమ్ ॥123॥**

వస్త్రం, చెప్పుల జోడుతో కలిపి అష్టవిధ పద దానాలు చేయాలి. సర్వపాపాలనుండి అప్పుడు విముక్తుడవుతాడు. పంక్తివంచన చేయరాదు.

**భూమౌ స్థితేషు పిండేషు గంధపుష్పాక్షతాన్వితమ్ ।**
**దాతవ్యం సర్వవిప్రేభ్యో వేదశాస్త్ర విధానతః ॥124॥**

భూమియందు పిండాలు ఉండగానే, గంధం, పుష్పం, అక్షతలు వీటితో సమస్తవిప్రులను పూజించి, వేదోక్త శాస్త్రోక్త విధానంతో ఈ దానాలను ఈయాలి.

**శంఖే ఖడ్గేఽథ వా తామ్రే తర్పణం చ పృథక్ పృథక్ ।**
**ధ్యానధారణ సంయుక్తో జానుభ్యా మవనీంగతః ॥125॥**

**ఋచా వై దాపయే దర్ఘ మర్ఘోపదిష్టం పృథక్ ।**
**బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ యమః ప్రేతశ్చ పంచమః ॥126॥**

శంఖమునందు, ఖడ్గమునందు, తామ్రపాత్ర(పత్రము) పైన వేరువేరుగా తర్పణాలు ఈయాలి. (లేదా వాటితో తర్పణాలు ఈయాలి) తరువాత మోకాళ్లపై భూమియందుండి ధ్యానం, ధారణ చేసి, మంత్రాలతో సగం కాని, దానియందు సగం ద్రవ్యంతో కాని వేరువేరుగా(దేవతలకు) అర్ఘ్యం ఈయాలి. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, యముడు, అయిదోవాడు ప్రేత.

**పృథక్కుంభే తతః స్థాప్యాః పంచరత్న సమన్వితాః ।**
**వస్త్రయజ్ఞోపవీతాని పృథఙ్ముద్గాః పదాని చ ॥127॥**

**పంచశ్రాద్ధాని కుర్వీత దేవతానాం యథావిధి ।**
**జలధారాం తతః కుర్యాత్ పిండే పిండే పృథక్ పృథక్ ॥128॥**

ఈ అయిదు దేవీశక్తులను పంచ రత్నాలతో కలిపి వేరు వేరుగా కుండలయందు స్థాపించాలి. వేరు వేరుగా వస్త్రాలను, యజ్ఞోపవీతాలను, పెసలను, అష్టవిధ పదదానాలను స్థాపించాలి. యథావిధిగా బ్రహ్మ మున్నగు అయిదుగురు దేవతలకు శ్రాద్ధపూజలను నిర్వహించాలి. ప్రతి పిండంమీద వేర్వేరుగా పిమ్మట జలధారలు సమర్పించాలి.

**శంఖే వా తామ్ర పాత్రే వా అలాభే మృన్మయేఽపి వా ।**
**తిలోదకం సమాదాయ సర్వౌషధి సమన్వితమ్ ॥129॥**

**తామ్రపాత్రం తిలైః పూర్ణం సహిరణ్యం సదక్షిణామ్।**
**దద్యా ద్బ్రాహ్మణ ముఖ్యాయ పదదానం తథైవ చ॥ 130**

శంఖం కాని, తామ్రపాత్ర కాని లభ్యం కాకపోతే, మట్టిపాత్రలోనైనా, సమస్తములైన ఓషధులతో కూడిన తిలోదకాన్ని ఈయాలి. తిలలతో నిండిన తామ్రపాత్రను బంగారంతోను, దక్షిణతోను, బ్రాహ్మణశ్రేష్ఠునకు దానమీయాలి. అదేవిధంగా అష్టవిధ పదదానం కూడ చేయాలి.

**యమోద్దేశే తిలాంల్లోహం తతో దద్యాచ్చ దక్షిణామ్ ।**
**ఏవం విష్ణుబలిం దత్త్వా యథాశక్త్యా విధానతః ॥131॥**

**సముద్ధరతి తత్ క్షిప్రం నాత్ర కార్యా విచారణా ।**
**నాగదంశాన్మృతో యస్తు విశేషస్తన్తు మే శృణు ॥132॥**

యముని ఉద్దేశించి దక్షిణతో కూడుకొన్న తిలదానాన్ని, లోహదానాన్ని ఈయాలి. ఈ విధంగా యథాశక్తిగా శాస్త్రవిధానంతో విష్ణుబలి ఈయడంవల్ల ప్రేత(మృతవ్యక్తి) శీఘ్రంగా ఉద్ధరింపబడతాడు. ఇందు ఆలోచించవలసింది ఏదీలేదు. పాముకాటువల్ల మృతిచెందిన వానికి విశేషకర్మ ఉంది. దానిని నాద్వారా విను.

**సువర్ణభార నిష్పన్నం నాగం కృత్వా తథైవ గామ్ ।**
**విప్రాయ దత్త్వా విధివత్ పితురానృణ్యమాప్నుయాత్ ॥133॥**

ఒక ఎత్తు సువర్ణంతో నాగాన్ని తయారు చేయించి దానిని, అలాగే ఒక గోవును విధి ననుసరించి విప్రునకు దానమీయాలి. అపుడు కర్త తండ్రిఋణాన్ని తీర్చుకొన్నవాడవుతాడు.

**ఏవం సర్పబలిం దత్త్వా సర్పదోషాద్విముచ్యతే ।**
**పశ్చాత్పుత్తలకం కార్యం సర్వౌషధి సమన్వితమ్ ॥134॥**

ఈ విధంగా సర్పబలిని ఇచ్చినచో సర్పదోషంనుండి విముక్తుడు అవుతాడు. అటుపిమ్మట "పుత్తలకం" అనే క్రియను చేయాలి. సమస్తములైన ఓషధులతో కూడుకొన్నదది.

**పలాశస్య చ వృంతానాం విభాగం శృణు కాశ్యప ।**
**కృష్ణాజినం సమాస్తీర్య కుశైశ్చ పురుషాకృతిమ్ ॥135॥**

**శతత్రయేణ షష్ట్యా చ వృంతైః ప్రోక్తోఽస్థిసంచయః ।**
**విన్యస్య తాని వృంతాని అంగేష్వేషు పృథక్ పృథక్ ॥136॥**

కశ్యపవంశసంజాతా! మోదుగచెట్టుయొక్క తొడిమల(పుల్లల) విభాగాన్ని విను. కృష్ణాజినాన్ని పరచి సర్వౌషధులతో కూడుకొన్న దర్భలద్వారా పలాశవృక్షంయొక్క పుల్లలను మూడు వందల అరవై ఎముకలుగా పేర్చి ప్రేత ప్రతిమను తయారుచేసి, వేరు వేరుగా అవయవాలపై ఆ పుల్లలను ఉంచాలి.

**చత్వారింశ చ్ఛిరోభాగే గ్రీవాయాం దశ విన్యసేత్ ।**
**వింశత్యురః స్థలే దద్యా ద్వింశతిం జఠరే తథా ॥137॥**

శిరోభాగమందు నలబై, కంఠమందు పది, వక్షఃస్థలమందు ఇరవై, జఠర భాగమందు ఇరవై పుల్లలు ఉంచాలి.

**బాహుద్వయే శతం దద్యాత్కటిదేశే చ వింశతిమ్ ।**
**ఊరుద్వయే శతం చాపి త్రింశజ్జంఘాద్వయే న్యసేత్ ॥138॥**

రెండు భుజాలయందు నూరు, కటి ప్రదేశములో ఇరవై, రెండుతొడలయందు నూరు, రెండు జంఘలయందు ముప్పది పుల్లలు ఉంచాలి.

**దద్యాచ్చతుష్టయం శిశ్నే షడ్ దద్యాద్వృషణద్వయే ।**
**దశపాదాంగులీభాగే ఏవమస్థీని విన్యసేత్ ॥139॥**

లింగభాగంలో నాలుగు, అండకోశాలు రెండిటియందు ఆరు, కాలివ్రేళ్లయందు పది పుల్లలను ఉంచి ప్రేత పురుషుని అస్థిపంజరాన్ని ఏర్పరచాలి.

**నారికేలం శిరఃస్థానే తుంబం దద్యాచ్చ తాలుకే ।**
**పంచరత్నం ముఖే దద్యా జ్జిహ్వాయాం కదలీఫలమ్ ॥140॥**

**అంత్రేషు నాలికం దద్యాద్వాలుకాం ఘ్రాణమేవ చ ।**
**వసాయాం మృత్తికాం దద్యాద్ధరితాలమనః శిలాః ॥141**

దాని శిరోభాగంలో కొబ్బరి కాయను, తాలు ప్రదేశంలో సొరకాయను, నోటిలో పంచరత్నాలను, జిహ్వాభాగంలో అరటి పండును ఉంచాలి. ప్రేగులలో తామరకాడలను, ముక్కు నందు వాలుకను, వసయందు మట్టిని, హరితాలమును, మనశ్శిలను ఉంచాలి.(హరిదళం) (మణిశిల).

**పారదం రేతసః స్థానే పురీషే పిత్తలం తథా ।**
**మనః శిలా తథా గాత్రే తిల పక్వస్తు సంధిషు ॥142॥**

**యవపిష్టం తథామాంసే మధు శోణితమేవ చ ।**
**కేశేషు చ జటాజూటం త్వచాయాఞ్చ మృగత్వచమ్ ॥143॥**

రేతఃస్థానంలో పాదరసాన్ని, పురీష స్థానంలో ఇత్తడిని, శరీరమంతట మణిశిలను, సంధిభాగంలో నువ్వుల పిండిని, మాంసభాగంగా యవలపిండిని, రక్తంగా తేనెను, కేశరాశి స్థానంలో మఱ్ఱిఊడలను, చర్మభాగంలో మృగచర్మాన్ని ఉంచాలి.

**కర్ణయోస్తాలపత్రఞ్చ స్తనయోశ్చైవ గుంజికాః ।**
**నాసాయాం శతపత్రఞ్చ కమలం నాభిమండలే ॥144॥**

**వృంతాకం వృషణద్వంద్వే లింగే స్యాద్గుఞ్జనం శుభమ్।**
**ఘృతం నాభ్యాం ప్రదేయం స్యాత్ కౌపీనే చ త్రపు స్మృతమ్ ॥145॥**

కర్ణములందు తాలపత్రాలను, స్తనభాగాలయందు గురివిందపండ్లను, ముక్కు స్థానంలో శతపత్రాలను, బొడ్డు ఉండుచోట కమలపత్రాన్ని, అండకోశాల స్థానాలయందు వంకాయలను, లింగస్థానమందు చక్కని ముల్లంగిని, నాభియందు నేతిని, కౌపీనస్థానంలో తగరాన్ని ఉంచాలి.

**మౌక్తికం స్తనయో ర్మూర్ధ్ని కుంకుమేన విలేపనమ్ ।**
**కర్పూరాగురుధూపైశ్చ శుభైర్మాల్యైః సుగంధిభిః ॥146॥**

**పరిధానం పట్టసూత్రం హృదయే చైవ విన్యసేత్ ।**
**ఋద్ధివృద్ధీ భుజౌ ద్వౌ చ చక్షుర్భ్యాఞ్చ కపర్దకమ్ ॥147॥**

రెండు స్తనాలవద్ద ముక్తాఫలాలను, తలపై కుంకుమ విలేపనాన్నీ, కర్పూరం, అగురు, ధూపం, సుగంధ శుభ పుష్పమాలలు, పరిధాన స్థానంలో పట్టసూత్రం, హృదయమునందుకూడ రజత పట్టసూత్రం ఉంచాలి. కర్త ఆ ప్రతిమ భుజాలయందు ఋద్ధి, వృద్ధి అనే సిద్ధులను సంకల్పించి, కన్నులలో గవ్వలనుంచాలి.

**దంతేషు దాడిమీ బీజా న్యంగులీషు చ చంపకమ్ ।**
**సిందూరం నేత్రకోణే చ తాంబూలాద్యుపహారకమ్ ॥148॥**

**సర్వౌషధియుతం ప్రేతం కృత్వా పూజాం యథోదితామ్ ।**
**సాగ్నికే చాపి విధినా యజ్ఞపాత్రం న్యసేత్క్రమాత్ ॥149॥**

దంతాల స్థానంలో దానిమ్మ గింజలను, వ్రేళ్ల స్థానంలో సంపంగులను, నేత్రకోణంలో (కనుకొలకులలో) సిందూరాన్ని ఉంచి, దాని ప్రక్కనే తాంబూలాది వివిధోపహారాలను అమర్చాలి. సమస్తములైన ఓషధులతో ప్రేతకు పూజచేసి, చెప్పబడిన శాస్త్రవిధానంతో జలప్రదానాదులను చేయాలి. ప్రేత అగ్నిహోత్రి అయితే దానికి యజ్ఞపాత్రను కూడ ఇచ్చి క్రమంగా కర్మవిధి నాచరించాలి.

**స్త్రియః పునంతు మే శిర ఇమం మే వరుణేన చ ।**
**ప్రేతస్య పావనం కృత్వా సాలగ్రామ శిలోదకైః ॥150॥**

"శిరో మే శ్రీ.....పునంతు వరుణ....." అనే మంత్రాలతో కర్త సాలగ్రామ శిలోదకమైన అభిమంత్రిత జలం ద్వారా ప్రేతను పవిత్రీకరించాలి.

**విష్ణుముద్దిశ్య దాతవ్యా సుశీలా గౌః పయస్వినీ ।**
**తిలా లౌహం హిరణ్యఞ్చ కర్పాసం లవణం తథా ॥151॥**

**సప్తధాన్యం క్షితిర్గావ ఏకైకం పావనం స్మృతమ్ ।**
**తిలపాత్రం తతో దద్యాత్పదదానం తథైవ చ ॥152॥**

తరువాత విష్ణు భగవానునుద్దేశించి పాలిచ్చే సాధుస్వభావమైన గోవును దానమీయాలి. తిలలు, ఇనుము,బంగారం, పత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు, భూమి, గోవు, ఇవి ఒకదాని మించి మరొక్కటి పుణ్యదాయకమైనవి. తరువాత తిలపాత్రదానం, అలాగే అష్టవిధ పదదానం కూడ చేయాలి.

**కర్తవ్యం వైష్ణవం శ్రాద్ధం ప్రేతముక్త్యర్థ మాత్మనః ।**
**ప్రేతమోక్షం తతః కుర్యాద్ధృధి విష్ణుం ప్రకల్ప్య చ ॥153॥**

**ఏవం పుత్తలకం కృత్వా దాహయేద్విధిపూర్వకమ్ ।**
**తచ్ఛుద్ధయే తు సంస్కర్తా పుత్రాది ర్నిష్కృతిం చరేత్ ॥154॥**

ఈ సందర్భంలో ప్రేత ముక్తికోసమై, తన అభివృద్ధికోసంకూడ విష్ణువునుద్దేశించి శ్రాద్ధకర్మ నాచరించాలి. పిమ్మట విష్ణువును మనస్సులో ధ్యానించి, ప్రేతమోక్షణ కార్యాన్ని చేబట్టాలి. ఈ విధంగా పుత్తలక క్రియనాచరించి, విధిపూర్వకంగా కృత్రిమప్రేతను దహనం చేయాలి. అప్పుడు సంస్కర్తయైన పుత్రాది వర్గంచే ప్రాయశ్చిత్త మాచరింపజేసి, శుద్ధికర్మ జరిపించినట్లవుతుంది.

**త్రీన్ కృచ్ఛ్రాన్ షడ్ద్వాదశ చ తథా పంచదశాపి చ ।**
**ప్రాయశ్చిత్త నిమిత్తానుసారేణ విప్రవత్ స్మృతః ॥155॥**

మూడు కాని, ఆరు కాని, పంద్రెండు కాని, పదిహేను కాని కృచ్ఛ్ర వ్రతాలు ప్రాయశ్చిత్త నిమిత్తానుసారంగా విప్రునికివలె చెప్పబడ్డాయి.

**అశక్తౌ గోహిరణ్యాది ప్రత్యామ్నాయం చరేదపి ।**
**ఆత్మనోఽనధికారిత్వే శుద్ధిమేవం చరేద్బుధః ॥156॥**

**అశుద్ధేన తు యద్దత్త ముద్దిశ్యాశుద్ధిమేవ చ ।**
**నోపతిష్ఠతి తత్సర్వమంతరిక్షే వినశ్యతి ॥157॥**

వ్రతాలు ఆచరించుటకు శక్తి చాలనిచో ప్రత్యామ్నాయంగా గోహిరణ్యాది దానాలు చేయాలి. తనకు ఆచరించుటకు అధికారం (శక్తి) లేనిచో విద్వాంసుడు ఈ దానాలద్వారా శుద్ధికర్మ నాచరించాలి. అశుద్ధంగా ఏది

చేసినప్పటికి, అలాగే అశుద్ధియై ఉద్దేశించి ఏది ఇచ్చినా, అది అంతా అతనికి చెందదు. అంతా అంతరిక్షంలో నశించిపోతుంది.

**శుద్ధిం సంపాద్య కర్తవ్యం దహనాద్యౌర్ధ్వదేహికమ్ ।**
**అకృత్వా నిష్కృతిం యస్తు కురుతే దహనాదికమ్ ॥158॥**

**మతిపూర్వమమత్యాచ క్రమాత్తన్నిష్కృతిం శృణు ।**
**కృత్వాగ్నిముదకం స్నానం స్పర్శనం వహనం కథామ్ ॥159॥**

శుద్ధిని సంపాదించుకొని తరువాత ఔర్ధ్వదేహిక దహనకర్మ చేయాలి. ప్రాయశ్చిత్తం చేసికొనకుండా, ఎవడు దహనాదికం చేస్తాడో, అది బుద్ధిపూర్వకం అయినా, అబుద్ధి పూర్వకం అయినా క్రమంగా దానికి ప్రాయశ్చిత్తం విను. అగ్నిక్రియ నాచరించి స్నానం, ఉదకదానం, స్పర్శనం, వహనం, కథవినుట నిర్వహించాలి.

**రజ్జుచ్ఛేదాశ్రుపాతం చ తప్త కృచ్ఛ్రేణ శుద్ధ్యతి ।**
**ఏషామన్యతమం ప్రేతం యో వహేత్తు దహేత వా ॥160॥**

**కటోదక క్రియాం కృత్వా కృచ్ఛ్రం సాంతాపనం చరేత్ ।**
**నిమిత్తే లఘుని స్వల్పం మహన్మహతి కల్పయేత్ ॥161॥**

రజ్జువును ఛేదించుటవల్ల వచ్చే అశ్రుపాతదోషం తప్త కృచ్ఛ్రవ్రతంవల్ల శుద్ధి చెందుతుంది. వీటిలో దేనినో ఒక దానిని నిర్వహించి పిమ్మట ప్రేతను దహనం చేయాలి. కటోదక క్రియను ఆచరించి, కృచ్ఛ్రం, సాంతాపనం అనే వ్రతాలు ఆచరించాలి. స్వల్పనిమిత్త కర్మలకు తక్కువగాను, అధిక నిమిత్తకర్మలకు ఎక్కువగాను సంకల్పించుకోవాలి.

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కృచ్ఛ్రస్య తప్తకృచ్ఛ్రస్య తథా సాంతపనస్య చ ।**
**లక్షణం బ్రూహి మే స్వామిం స్త్రయాణామపి సువ్రత ॥162॥**

స్వామిా! సువ్రతా! కృచ్ఛ్రవ్రతానికి, తప్తకృచ్ఛ్రవ్రతానికి, సాంతపనవ్రతానికి ఈ మూడింటికి నాకు లక్షణాన్ని చెప్పు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**త్ర్యహం ప్రాతస్త్ర్యహం సాయం త్ర్యహమద్యాదయాచితమ్ ।**
**ఉపవాస స్త్ర్యహశ్చైవ ఏష కృచ్ఛ్ర ఉదాహృతః ॥163॥**

మూడు రోజులు ప్రాతః కాలంలోను మూడు రోజులు సాయంకాలమందు మూడు రోజులు అయాచిత హవిష్యాన్నం మాత్రమే తిని, మూడు రోజులు పూర్తిగా ఉపవాసం చేస్తే దీనిని కృచ్ఛ్రవ్రతమంటారు.

**తప్తక్షీరఘృతాంబూనామేకైకం ప్రత్యహం పిబేత్ ।**
**ఏకరాత్రోపవాసశ్చ తప్తకృచ్ఛ్ర ఉదాహృతః ॥164॥**

ఒకరోజు వేడిపాలు, రెండో రోజు వేడినేయి, మూడో రోజు వేడినీరు మాత్రమే క్రమంగా స్వీకరించి, నాలుగో రోజు రాత్రంతా ఉపవాసంచేస్తే అది తప్తకృచ్ఛ్రవ్రతమవుతుంది.

**గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్ ।**
**జగ్ధ్వా పరేఽహ్న్యుపవసేత్కృచ్ఛ్రం సాంతపనం చరన్ ॥165॥**

గోమూత్ర, గోమయ, గోక్షీర, గోదధి, గోసర్పిస్సు, కుశోదకం క్రమంగా రోజుకొకటి మాత్రమే స్వీకరించి, ఆ మరునాటినుండి కృచ్ఛ్రవ్రతం చేయడాన్ని సాంతపనవ్రతమంటారు.

**మయా తేఽయం సమాఖ్యాతో దుర్మృతస్య విధిః ఖగ ।**
**తదా మృతం విజానీయా ద్దీపనిర్వాణ మాగతః ॥166॥**

**అగ్నిదాహం తతః కుర్యాత్ సూతకం చ దినత్రయమ్ ।**
**దశాహం గర్తపిండఇ్చ కర్తవ్యం ప్రేతపూర్వకమ్ ॥167॥**

పక్షీ! నేను నీకు దుర్మృతుడైన వాని యొక్క కర్మవిధిని తెలియజేశాను. దీపమారిపోయినట్లుగా మృతుని గురించి తెలుసుకోవాలి. పిమ్మట అగ్ని దహనం చేయాలి. మూడు రోజులు సూతకం పాటించాలి, పది రోజులపాటు ప్రేత పూర్వకంగా గర్తపిండం ఈయాలి.(పుత్తలక క్రియయందు పెట్టిన దీపమారిపోతే ప్రాణం పోయినట్లుగా తెలుసుకోవాలి)

**ఏవం విధిం తతః కుర్యాత్తతః ప్రేతశ్చ ముక్తిభాక్ ।**
**మృతభ్రాంత్యా ప్రతికృతే కృతే దాహే స వై యది ॥168॥**

**ఆయాతి తేన కర్తవ్యం మజ్జనం ఘృతకుండకే ।**
**జాతకర్మాది సంస్కారాః కర్తవ్యాః పునరేవ తు ॥169॥**

ఈవిధంగా కర్మ నాచరించాలి. అప్పుడు ప్రేత ముక్తిపొందినవాడవుతాడు. చనిపోయిన వాడయ్యాడనే భ్రాంతిచే ప్రతిమచేసి ఈ కర్మ నాచరించి దహనంచేస్తే, మరల నేతి కుండతో ప్రతిమనుంచి స్నానం చేయించడం కర్తవ్యం. తిరిగి జాతకర్మాది సంస్కారాలు ఆచరించాలి.

**ఊఢామేవ స్వకాం భార్యా ముద్వహేద్విధివత్పుమాన్ ।**
**వర్షే పంచదశే పక్షిన్ ద్వాదశే వా గతే సతి ॥170॥**

ఖగమా! పంచదశ వర్షాలు గతించిన తరువాతకాని, పండ్రెండు ఏండ్లు దాటిన తరువాత కాని పురుషుడు శాస్త్రవిధానంగా కన్యనే తాను భార్యగా వివాహం చేసుకోవాలి.

**అజ్ఞాతస్య ప్రోషితస్య కృత్వా ప్రతికృతిం దహేత్ ।**
**రజస్వలా సూతికయో ర్విశేషం మరణే శృణు ॥171॥**

దేశాంతరగతుడైనవాడు ఏమయ్యాడో తెలియకపోతే వాని ప్రతిమనుచేసి దహించాలి. రజస్వల, బాలెంతరాలు మరణిస్తే పాటించవలసిన విశేషాన్ని విను.

**సూతికాయాం మృతాయాం తు ఏవం కుర్వంతి యాజ్ఞికాః ।**
**కుంభే సలిలమాదాయ పంచగవ్యం తథైవ చ ॥172॥**

**పుణ్యాభిరభిమంత్ర్యాపో వాచా శుద్ధిం లభేత్తతః ।**
**శత శూర్పోదకేనాదౌ స్నాపయిత్వా యథావిధి ॥173॥**

పురుటివేళ మరణించిన స్త్రీకి యాజ్ఞికులు ఈ విధంగా చేస్తారు. కుంభంలో నీళ్లుపోసి, అలాగే పంచగవ్యాల నుంచి, వాటిని నీటిచేతను, శుద్ధి మంత్రాల చేతను సంప్రోక్షించి పవిత్రీకరిస్తారు. ముందు శాస్త్రవిధానంతో నూరు చేటల నీటితో స్నానం చేయిస్తారు.(నూరు సార్లు చేటలో నీరుపోసి)

**తేనైవ స్నాపయిత్వా తు దాహం కుర్యాత్ ఖగేశ్వర ।**
**పంచభిః స్నాపయిత్వా తు గవ్యైః ప్రేతాం రజస్వలామ్ ॥174॥**

**వస్త్రాంతరాకృతిం కృత్వా దాహయేద్విధిపూర్వకమ్ ।**
**మృతస్య పంచకే దాహవిధిం వచ్మి శృణుష్వ మే ॥175॥**

ఖగరాజా! అలా స్నానం చేయించి దహనక్రియను ఆచరించాలి. రజస్వలగా మరణిస్తే పంచగవ్యాలతో స్నానం చేయించి, వస్త్రంతో మరో ఆకృతిని చేసి విధి పూర్వకంగా దహనం చేయాలి. ధనిష్ఠా పంచకాలలో మరణించినవానికి దహనవిధిని చెప్పుచున్నాను. విను

**ఆదౌ కృత్వా ధనిష్ఠార్ధమేతన్నక్షత్రపంచకమ్ ।**
**రేవత్యంతం సదా దూష్యమశుభం సర్వదా భవేత్ ॥176॥**

**దాహ స్తత్ర న కర్తవ్యో విషాదః సర్వజంతుషు ।**
**న జలం దీయతే తేషు అశుభం సర్వదా భవేత్ ॥177॥**

ధనిష్ఠా నక్షత్రంయొక్క పూర్వార్ధం ఉత్తరార్ధం మొదలు రేవతీ నక్షత్రం వరకు నక్షత్రపంచక మంటారు. ఇది ఎల్లప్పుడు దోషమై, అశుభమైన కాలమవుతుంది. ఆ సమయంలో దహనవిధి చేయరాదు. అది సమస్తప్రాణులకు విషాదం నింపుతుంది. అప్పుడు జలదానంకూడ ఈయరాదు. అది ఎల్లప్పుడు వారియందు అశుభాన్ని సూచిస్తుంది.

**పంచకానంతరం సర్వం కార్యం కర్తవ్యమన్యథా ।**
**పుత్రాణాం గోత్రిణాం తస్య సంతాపోఽప్యుపజాయతే ॥178॥**

పంచకానంతరమే సమస్త కార్యాలు చేయాలి. మరోవిధంగా చేస్తే పుత్రులకు, ఆ గోత్రికులకు, ఆ ప్రేతకు కూడ సంతాపమే సంభవిస్తుంది.

**గృహే హానిర్భవత్యేవ ఋక్షేష్వేషు మృతస్య చ ।**
**అథవా ఋక్షమధ్యే చ దాహస్తు విధిపూర్వకః ॥179॥**

ఈ నక్షత్రాలలో మరణించినవాని ఇంటిలో హాని కలుగుతుంది. లేనినాడు నక్షత్రసంధి సమయంలో విధి పూర్వకంగా దహనం చేయాలి.(నక్షత్రానికి నక్షత్రానికి మధ్య)

**క్రియతే మానుషాణాం తు స వా ఆహుతి పూర్వకః ।**
**విప్రైర్విధిరతః కార్యో మంత్రైస్తు విధిపూర్వకమ్ ॥180॥**

**శవస్థాన సమీపే తు క్షేప్తవ్యాః పుత్తలా స్తతః ।**
**దర్భకు్లప్తాస్తు చత్వార ఋక్షమంత్రాభిమంత్రితాః ॥181॥**

మానవులకు అది ఆహుతి పూర్వకంగా చేయబడుతుంది. శవంయొక్క స్థానంవద్ద దర్భలతో చేసిన నాలుగు పుత్తలాలను ఉంచాలి. నక్షత్రమంత్రాలతో అభిమంత్రించి (దర్భముక్కలను) నాలుగు అక్కడ వేయాలి. (పిమ్మట విప్రులు విధి పూర్వంగా మంత్రాలతో కర్మవిధి నాచరించాలి)

**తతో దాహః ప్రకర్తవ్య స్తైశ్చ పుత్తలకైః సహ ।**
**సూతకాంతే తదా పుత్రైః కార్యం శాంతిక పౌష్టికమ్ ॥182॥**

అనంతరం ఆ పుత్తలకాలతో కలిపి దహనం చేయాలి. సూతకం అయిన తరువాత పుత్రులు శాంతి, పౌష్టిక కర్మలను ఆచరించాలి.

**పంచకేషు మృతే యోఽసౌ న గతిం లభతే నరః ।**
**తిలాన్ గాఇ్చ సువర్ణఇ్చ తముద్దిశ్య ఘృతం దదేత్ ॥183॥**

ధనిష్ఠా పంచకాలలో మృతిపొందిన నరుడు ఉత్తమగతిని పొందజాలడు. ఆ ప్రేతనుద్దేశించి నువ్వులు, గోవు, బంగారం, నేయి దానమీయాలి.

**విప్రాణాం దాపయేద్దానం సర్వవిఘ్నవినాశనమ్ ।**
**భోజనోపానహౌ ఛత్రం హేమ ముద్రా చ వాససీ ॥184॥**

**దక్షిణా దీయతే విప్రే పాతకస్య ప్రమోచనః ।**

సమస్త విఘ్నాలను నశింపజేసే దానం విప్రులకు ఈయాలి. భోజనం, చెప్పులజోడు, గొడుగు, బంగారపుటుంగరం, వస్త్రాలు, దక్షిణ పాతకం పోవడంకోసం విప్రునకు ఈయాలి.

**మయా తేఽయం సమాఖ్యాతో విధిః పంచహరః స్థితః ।**
**సంయమిన్యాం యథా యానం యథావర్షం మృతక్రియా ॥185॥**

ధనిష్ఠా పంచక దోష పరిహారానికి సంబంధించిన కర్మవిధిని నీకు నేను వివరించాను. సంయమినియందు ఎన్ని సంవత్సరాలు, ఎలా ప్రయాణం ఉంటుందో, మృతక్రియ ఏ రీతిగా ఉంటుందో తెలియజేశాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే దహనవిధి కృచ్ఛ్రలక్షణ దగ్ధాగమన రజస్వలామరణవిధి పంచకమరణ ప్రాయశ్చిత్త నిరూపణం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో దహనవిధి మొదలగు విషయాలను వివరించే నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచమోఽధ్యాయః – అయిదవ అధ్యాయం

## యమలోకమార్గయాతనాః – యమలోకమార్గంలోని యాతనలు

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఏవం దగ్ధ్వా నరం ప్రేతం స్నాత్వా కృత్వా తిలోదకమ్ ।**
**అగ్రతః స్త్రీజనో గచ్ఛేద్గ్రవ్జేయుః పృష్ఠతో నరాః ॥1॥**

ఈ విధంగా మరణించిన వ్యక్తికి దహనసంస్కారం చేసి, తిలోదకాలను సమర్పించి, స్నానాలుచేసి (స్నానానంతరం తిలోదకాలు ఇచ్చి)ముందు స్త్రీలు నడుస్తూ ఉండగా, వెనుక పురుషులు వెంబడిస్తూ ఇల్లు చేరుకోవాలి.

**ప్రాశయే న్నింబపత్రాణి రుదంతో నామపూర్వకమ్ ।**
**విధాతవ్యం చాచమనం షాషాణోపరిసంస్థితే ॥2॥**

ద్వారం దగ్గర వేపాకులు నమలాలి. పొంగువచ్చే దుఃఖాన్ని అణచుకొంటూ రోదించవచ్చు. ఒక రాతిపై చేరి ఆచమనం చేయాలి.

**తే ప్రవిశ్య గృహం సర్వే సుతాద్యాశ్చ సపిండకాః ।**
**భవేయు ర్దశరాత్రం వై యత ఆశౌచకం ఖగ ॥3॥**

ఖగమా! సుతాదులు, సపిండులు మున్నగువారందరు ఇంటిలోనికి ప్రవేశించాలి. పది రాత్రులు అశౌచంతోనే వారు ఉండాలి.

**క్రీతలబ్ధాశనాః సర్వే స్వపేయుస్తే పృథక్ పృథక్ ।**
**అక్షారలవణాన్నాః స్యుర్నిమజ్జేయుశ్చ తే త్ర్యహమ్ ॥4॥**

**అమాంసభోజనాశ్చాధః శయీరన్ బ్రహ్మచారిణః ।**
**పరస్పరం న సంస్పృష్టా దానాధ్యయనవర్జితాః ॥5॥**

ఈ సమయంలో బయటనుండి భోజనం కొని తెచ్చుకొని తినాలి. వారు వేరు వేరుగా పరుండాలి. కారం, ఉప్పు లేకుండా చప్పిడి తినాలి. బ్రహ్మచర్యం, శాకభక్షణం, భూశయనం ఈ మూడు ఆచరిస్తూ ప్రతిదినం స్నానంచేయాలి. మాంసాన్ని భుజించరాదు, ఒకరినొకరు తాకరాదు. దానానికి, అధ్యయనానికి దూరంగా ఉండాలి.

**మలినాశ్చాధోముఖాశ్చ దీనా భోగవివర్జితాః ।**
**అంగ సంవాహనం కేశమార్జనం వర్జయంతి తే ॥6॥**

**మృన్మయే పత్రజే వాపి భుంజీరంస్తే చ భాజనే ।**
**ఉపవాసన్తు తే కుర్యురేకాహ మథవా త్ర్యహమ్ ॥7॥**

దీనులై, ముఖం వాల్చుకొని, మలినులై, భోగాలను విడిచిపెట్టి ఉండాలి. వారు అంగమర్దనాన్నీ, తలంటు స్నానాన్నీ అప్పుడు వర్జించాలి. మట్టిపాత్రలో కాని, ఆకులో కాని వారు భుజించాలి. భాజనపాత్రలు పనికిరావు. వారు ఒక రోజు కాని, మూడు రోజులు కాని ఉపవాసం చేయాలి.

**గరుడ ఉవాచ –** గరుడుడు అడిగాడు.

**అశౌచిన ఇతిప్రోక్తమాశౌచస్య చ వై ప్రభో ।**
**లక్షణం కిం కియత్కాలం భావ్యం వై తద్యుతైర్నరైః ॥8॥**

ప్రభూ! ఆశౌచికులకు ఎంతకాలం అశౌచం ఉంటుంది? దాని లక్షణం ఏమి? దాని కాలపరిధి ఏమి? అశుచిత్వం ఉన్న నరులు చేయవలసిన దేమి?

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**అపనోద్యన్త్విదం కాలాదిభిరాశు నిషేధకృత్ ।**
**పిండాధ్యయన దానాదేః పుంగతోఽతిశయో హి తత్ ॥9॥**

**దశాహం శావమాశౌచం సపిండేషు విధీయతే ।**
**జననేఽప్యేవమేవ స్యాన్నిపుణం శుద్ధి మిచ్ఛతామ్ ॥10॥**

ఈ అశౌచకాలం శీఘ్రంగా ముగియాలి. దీనిని శీఘ్రంగా నిషేధించాలి. పిండాధ్యయన దానాదుల కారణంగా, జీవులకు అది మిక్కిలి అతిశయం కలుగజేసేది కాబట్టి అశౌచం ఎక్కువ కాలం ఉండరాదు. సపిండులయందు మృతాశౌచం పదిరోజుల పాటు ఉంటుంది. పవిత్రతకోరే నిపుణుడైన కర్మిష్ఠి జననాశౌచాన్ని కూడ ఇలాగే పాటించాలి.

**జన్మన్యేకోదకానాన్తు త్రిరాత్రాచ్ఛుద్ధిరిష్యతే ।**
**శావస్య శేషాచ్ఛుధ్యంతి త్ర్యహాదుదక దాయినః ॥11॥**

పురుడు విషయంలో ఏకోదకులకు మూడు రాత్రులయినతరువాత శుద్ధి చెప్పబడింది. మృతాశౌచ విషయంలో మిగిలిన ఏడు రోజులు అయినతరువాత శుద్ధి. (సపిండులకు)ఉదకాన్ని ఇచ్చినవారికి మూడు రోజులు తరువాత శుద్ధి.

**అదంతజననాత్సద్య ఆచౌలాన్నైశికీ స్మృతా ।**
**త్రిరాత్ర మావ్రతాదేశా ద్దశరాత్రమతః పరమ్ ॥12॥**

దంతాలు మొలవని పిల్లలు మరణిస్తే ఖననమయిన వెంటనేశుద్ధి, పుట్టు వెంట్రుకలు తీయకముందు మరణిస్తే ఒకరోజు(రాత్రి)తో శుద్ధి, ఉపనయనం కాకముందు మరణిస్తే మూడు రాత్రులయిన తరువాత శుద్ధి. ఆ తరువాత పది రాత్రులు తరువాత శుద్ధి.

**ఆశౌచంతే సమాఖ్యాతం సంక్షేపాత్ప్రకృతం బ్రువే ।**
**జలం త్రిదివమాకాశే స్థాప్యం క్షీరఞ్చ మృన్మయే ॥13॥**

నీకు ఆశౌచం గురించి సంక్షిప్తంగా తెలియజేశాను. ప్రకృతాన్ని వివరిస్తాను. జలాన్ని ఆకాశంలో స్వర్గాన్ని ఉద్దేశించి ఈయాలి. మట్టిపాత్ర యందు ప్రేతను స్థాపించి పాలను ఇవ్వాలి.(పోయాలి)

**అత్ర స్నాహి పిబాత్రేతి మంత్రేణానేన కాశ్యప ।**
**కాష్ఠత్రయే గుణైర్బద్ధే ప్రీత్యై రాత్రౌ చతుష్పథే ॥14॥**

**ప్రథమేఽహ్ని తృతీయే వా సప్తమే నవమే తథా ।**
**అస్థిసంచయనం కార్యం దినే తద్గోత్రజైః సహ ॥15॥**

కాశ్యపా! "ఇక్కడ స్నానంచేయి, ఇక్కడ పానంచేయి" అనే మంత్రం పఠించాలి. మూడు కఱ్ఱపుల్లల మధ్య త్రాళ్లతో కట్టబడిన సాధనమందు(ఉట్టియందు) ఆ మట్టి పాత్రనుంచి, ప్రీతికొరకై రాత్రియందు కూడలియందుకాని, ముంగిలియందు కాని ఉంచాలి. మొదటిరోజున కాని, మూడు, ఏడు, తొమ్మిదో రోజున కాని అతని గోత్రస్థులతో కలిపి అస్థిసంచయనం చేయాలి.

**తదూర్ధ్వమంగసంస్పర్శః సపిండానాం విధీయతే ।**
**యోగ్యాః సర్వక్రియాణాం చ సమాన సలిలాస్తథా ॥16॥**

ఆ తరువాత మాత్రమే అంగ సంస్పర్శ సపిండులకు విధింపబడింది. సమానోదకులందరికి సర్వకర్మల యందు యోగ్యత ఉంది.

**ప్రేతపిండం బహిర్దద్యా ద్దర్భమాత్ర వివర్జితమ్ ।**
**ప్రాగుదీచ్యాం చరుం కృత్వా స్నాత్వా ప్రయతమానసః ॥17॥**

**భూమావసంస్కృతానాం చ సంస్కృతానాం కుశేషు చ ।**
**నవభిర్దివసైః పిండాన్నవ దద్యాత్సమాహితః ॥18॥**

దర్భలపై ఉంచకుండా ప్రేతపిండాన్ని బయట వేయాలి. స్నానం చేసి, నియతమనస్కుడై ఈశాన్యంలో చరువును తయారుచేసి,భూమిపై సంస్కరింపబడని లేదా సంస్కరింపబడిన కుశలపై శ్రద్ధతో తొమ్మిది రోజులపాటు తొమ్మిది పిండాలను ఈయాలి.

**దశమం పిండముత్సృజ్య రాత్రిశేషే శుచి ర్భవేత్ ।**
**అసగోత్రః సగోత్రో వా యది స్త్రీ యది వా పుమాన్ ॥19॥**

పదోరోజున పిండవిధిని విడిచిపెట్టాలి. పది రోజులు గడచిన పిమ్మట శుచిత్వం పొందవచ్చు. సగోత్రుడయినా, కాకపోయినా, స్త్రీ అయినా, పురుషుడయినా ఇదే విధి.

**ప్రథమేఽహని యో దద్యాత్స దశాహం సమాపయేత్ ।**
**శాలినా సక్తుభిర్వాపి శాకైర్వాప్యథ నిర్వపేత్ ॥20॥**

మొదటి రోజున ఎవడయితే చేశాడో, అతడే దశాహం వరకు నిర్వహించాలి.(శాలి)బియ్యం చేతకాని, సక్తు ఫలాలచే గాని, శాకాలచే గాని నిర్వపనక్రియ నిర్వహించాలి.

**ప్రథమేఽహని యద్ద్రవ్యం తదేవ స్యాద్దశాహికమ్ ।**
**యావదాశౌచమే కైకస్యాంజలేర్దానముచ్యతే ॥21॥**

మొదటి రోజున ఏ ద్రవ్యంతో పిండం వేస్తారో, దశాహపర్యంతం అదే ద్రవ్యాన్ని ఉపయోగించాలి. ఆశౌచ పర్యంతం ఒక్కొక్క దోసిలితో ఉదకదానం చేయాలి.

**యద్వా యస్మిన్దినే దానం తస్మింస్తద్దినసంఖ్యయా ।**
**దశాహేఽంజలయః పక్షిన్ పంచ పంచాశదంతిమే ॥22॥**

ఖగమా! లేదా ఏ రోజున జలదానం ఈయబడుతుందో, ఆరోజు నుండి సంఖ్యను బట్టి పెంచుకొంటూ దశాహంవరకు జలాంజలులు ఈయాలి. చివరిరోజున అయిదు ఎక్కువగా మొత్తం పదునైదు జలాంజలులు ఈయాలి.

**ద్వివృద్ధ్యా వా భవేత్ పక్షిన్నఞ్జలీనాం శతం పునః ।**
**యదా హి త్ర్యహమాశౌచం తదా వాఞ్జలయో దశ ॥23॥**

**త్రయో ఽంజలయ ఏవం తు ప్రథమేఽహని వై తదా ।**
**చత్వారస్తు ద్వితీయేఽహ్ని తృతీయే స్యు స్త్రయస్తథా ॥24॥**

**శతాంజలి యదాపక్షి న్నాద్యే త్రింశత్తదాహని ।**
**చత్వారింశ ద్ద్వితీయేఽహ్ని త్రింశదహ్ని తృతీయకే ॥25॥**

గరుడా! ఈ అంజలులనే రెట్టింపుగా ఇస్తుంటే మొత్తం వంద అవుతాయి. మూడు దినాల అశౌచంలో మొత్తం పది అంజలులు. మొదటి రోజు ఈ విధంగా మూడు, రెండో రోజున నాలుగు, మూడో రోజు మూడు ఈయాలి. ఖగమా! శతాంజలి దానక్రియా పద్ధతిలో మొదటి రోజున ముప్పై, రెండో రోజున నలభై, మూడో రోజున ముప్పై పర్యాయాలు ఇస్తారు.

**ఏవంజలస్యాంజలయో విభాజ్యాః పక్షయో ర్ద్వయోః ।**
**సర్వేషు పితృకార్యేషు పుత్రో ముఖ్యోఽధికారవాన్ ॥26॥**

ఈ విధంగా రెండుపక్షాలలోను జలాంజలి విధానాలు విభజింపబడినాయి. సమస్త పితృకార్యములందు ముఖ్యాధికారి పుత్రుడే.

**పిండ ప్రసేక స్తూష్ణీఞ్చ పుష్పధూపాదికం తథా ।**
**దశమేఽహని సంప్రాప్తే స్నానం గ్రామాద్బహిశ్చరేత్ ॥27॥**

ఈ ప్రేత శ్రాద్ధంలో పిండంపై నీళ్లు చిలకరించుట, పుష్పధూపాదులు సమర్పించుట మంత్రాలు లేకుండగనే చేయాలి. పదోరోజురాగా స్నానంకోసం ఊరిబయటకు వెళ్లాలి.

**తత్ర త్యాజ్యాని వాసాంసి కేశశ్మశ్రునఖాని చ ।**
**విప్రః శుద్ధ్యత్యపః స్పృష్ట్వా క్షత్రియో వాహనం తథా ॥28॥**

**వైశ్యః ప్రతోదం రశ్మీన్ వా శూద్రో యష్టిం కృతక్రియః ।**
**మృతాదల్పవయోభిశ్చ సపిండైః పరివాపనమ్ ॥29॥**

పదో రోజు కేశ శ్మశ్రునఖాలను, (దీక్షా) వస్త్రాలను పరిత్యజించాలి. విప్రుడు నీరు తాకి, క్షత్రియుడు వాహనం స్పృశించి, వైశ్యుడు పగ్గాలు లేదా కొరడాను తాకి, శూద్రుడు కఱ్ఱను స్పృశించి పరిశుద్ధులవుతారు. మృతునికన్న చిన్నవారూ, సపిండులైన వారూ శిరోముండనం చేయించుకోవాలి.

**కార్యన్తు షోడశీ షడ్భిః పిండైః దశభి రేవ చ ।**
**ప్రథమా మలినాహ్యేతై రాదశాహం మృతేర్భవేత్ ॥30॥**

ఆరు లేదా పది పిండాలతో షోడశీకర్మను చేయాలి. ఇది ప్రథమ మలిన షోడశీకర్మ అంటారు. దీనిని చనిపోయిన పిమ్మట పది రోజులలో ముగించాలి.

**దినాని దశ యాన్పిండాన్ కుర్వంత్యత్ర సుతాదయః ।**
**ప్రత్యహంతే విభజ్యంతే చతుర్భాగైః ఖగోత్తమ ॥31॥**

**భాగద్వయేన దేహః స్యాత్తృతీయేన యమానుగాః ।**
**తృప్యంతి హి చతుర్థేన స్వయమప్యుపజీవతి ॥32॥**

ఖగోత్తమా! సుతాదులు పది రోజులు ఇచ్చే పిండాలను ప్రతిదినం నాలుగు భాగాలుగా విభజించాలి. మొదటి రెండుభాగాలు దేహానికి (అతివాహిక శరీరానికి), మూడవ భాగాన్ని యమదూతలకు, నాలుగో భాగాన్ని స్వయంగా మృతిచెందినవానికి ఇచ్చి తృప్తిపరచాలి.

**అహోరాత్రైస్తు నవభిర్దేహో నిష్పత్తిమాప్నుయాత్ ।**
**శిరస్త్వాద్యేన పిండేన ప్రేతస్య క్రియతే తథా ॥33॥**

**ద్వితీయేన తు కర్ణాక్షినాసికం తు సమాసతః ।**
**గలాంసభుజ వక్షశ్చ తృతీయేన తథా క్రమాత్ ॥34॥**

తొమ్మిది రోజులు గడిచేసరికి మృతిచెందినవానికి దేహనిష్పత్తి కలుగుతుంది. ప్రేతకు ఈయబడిన మొదటి పిండంవల్ల శిరస్సు, రెండో పిండం వలన కర్ణాక్షినాసికలు సంక్షిప్తంగా ఏర్పడతాయి. అలాగే క్రమంగా మూడో పిండంవల్ల కంఠం, అంసభాగం, భుజాలు, వక్షం ఏర్పడతాయి.

**చతుర్థేన చ పిండేన నాభిలింగగుదం తథా ।**
**జానుజంఘం తథా పాదౌ పంచమేన తు సర్వదా ॥35॥**

**సర్వమర్మాణి షష్ఠేన సప్తమేన తు నాడయః ।**
**దంతలోమాన్యష్టమేన వీర్యన్తు నవమేన చ ॥36॥**

నాలుగో పిండంవలన నాభి, లింగం, గుదం, అయిదో పిండంవల్ల ఎప్పుడూ జానువులు, జంఘలు, అలాగే పాదాలు, ఆరో పిండంచే సర్వమర్మావయాలు, ఏడో పిండంవల్ల నాడులు, ఎనిమిదో పిండంవల్ల దంతాలు, రోమాలు, తొమ్మిదో పిండంవల్ల వీర్యం ఏర్పడతాయి.

**దశమేన తు పూర్ణత్వం తృప్తతా క్షుద్విపర్యయః ।**
**మధ్యమాం షోడశీం వచ్మి వైనతేయ శృణుష్వ మే ॥37॥**

పదో రోజు నాటికి పూర్ణత్వమేర్పడి ఆకలి దప్పులు కలుగుతాయి. వైనతేయా! ఇక మధ్యమ షోడశీ కర్మను నేను చెబుతున్నాను. విను.

**విష్ణ్వాది విష్ణుపర్యంతాన్యేకాదశ తథా ఖగ ।**
**శ్రాద్ధాని పంచ దేవానామిత్యేషాం మధ్యషోడశీ ॥38॥**

విష్ణువును ఉద్దేశించి విష్ణువు మొదలు, చివరకూడా విష్ణువుకే పదకొండు శ్రాద్ధాలను జరపాలి. ఖగమా! దేవతలనుద్దేశించి అయిదు శ్రాద్ధాలను జరపాలి. దీనిని మధ్యమషోడశి అంటారు.

**నిమిత్తం దుర్మతిం కృత్వా యది నారాయణో బలిః ।**
**ఏకాదశాహే కర్తవ్యో వృషోత్సర్గోఽపి తత్ర వై ॥39॥**

దుర్మృతుడైన ప్రేత నిమిత్తంగా మంగళంకోసం నారాయణబలికర్మ చేసిన సందర్భంలోనే, పదకొండో రోజు ఈ విధి నిర్వహించి, వృషోత్సర్గం చేయాలి.(దూడను గాని, ఎద్దును గాని వదలివేయుట)

**ఏకాదశాహే ప్రేతస్య యస్యోత్సృజ్యేత నో వృషః ।**
**ప్రేతత్వం సుస్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి ॥40॥**

**అకృత్వా యద్వృషోత్సర్గం కృతం వై పిండపాతనమ్ ।**
**నిష్ఫలం సకలం విద్యాత్ప్రమీతాయ న తద్భవేత్ ॥41॥**

పదకొండవ రోజున ప్రేతను ఉద్దేశించి వృషాన్ని విడువకుంటే మృతునకు శత శ్రాద్ధములు చేసినప్పటికిని, ప్రేతత్వం సుస్థిరమై ఉంటుంది. వృషోత్సర్గం చేయకుండగ, పిండప్రదానం చేసినప్పటికిని, అదంతా నిష్ఫలమై ఉంటుంది. అది ప్రమీత కొరకు (మృతుని కొరకు) చెందేది కాదు.

**వృషోత్సర్గాదృతే నాన్యత్కించిదస్తి మహీతలే ।**
**పుత్రః పత్న్యథ దౌహిత్రః పితా వా దుహితాథవా ॥42॥**

**మృతాదనంతరం తస్య ధ్రువం కార్యో వృషోత్సవః ।**
**చతుర్వత్సతరీయుక్తో యస్యోత్సృజ్యేత వా వృషః ॥43॥**

**అలంకృతో విధానేన ప్రేతత్వం తస్య నో భవేత్ ।**
**ఏకాదశేఽహ్ని సంప్రాప్తే వృషాలాభో భవేద్యది ॥44॥**

**దర్భైః పిష్టైస్తు సంపాద్య తం వృషం మోచయేద్బుధః ।**

భూమండలమందు వృషోత్సర్గంకన్న మినహాయించి వేరే గతిలేదు. పుత్రుడు కాని, భార్య కాని, దౌహిత్రుడు కాని, తండ్రి కాని, కుమార్తె కాని చనిపోయిన(తరువాత) మృతునుద్దేశించి వృషోత్సర్గం నిశ్చయంగా చేయదగియున్నది.

నాలుగేండ్లు కల్గిన మోయుటకు, దున్నుటకు శక్తి కల్గిన ఎద్దు ఏ వ్యక్తినిగూర్చి విడువబడుతుందో. శాస్త్రవిధానంగా అలంకరింపబడి ఈయబడుతుందో, అతనికి ప్రేతత్వమనేది ఉండదు. పదకొండో రోజు వృషం దొరకకపోతే, దర్భలచే కాని, పిండిచే కాని ఆ వృషాన్ని తయారుచేసి వివేకవంతుడు విడిచిపెట్టాలి.

**వృషోత్సర్జన వేలాయాం వృషాభావః(వృషాలాభః)కథంచన ।।45।।**

**మృత్తికాభిస్తు దర్భైర్వా వృషం కృత్వా విమోచయేత్ ।**

వృషోత్సర్జనసమయమందు ఎన్నడైననూ వృషం లభ్యంకానిచో మట్టిచే గాని, దర్భలచేగాని వృషాన్ని నిర్మించి విడిచిపెట్టాలి.

**యదిష్టం జీవితస్తస్య దద్యాదేకాదశేఽహని ।।46।।**

**మృతముద్దిశ్య దాతవ్యం శయ్యా ధేన్వాదికం తథా ।**
**విప్రాన్బహూన్ భోజయతి ప్రేతస్య క్షుద్విశాంతయే ।।47।।**

ఇష్టమైనచో అతడు బ్రతికియుండగనే ఈయవచ్చును. పదకొండో రోజున మృతునుద్దేశించి శయ్యాదానం, ధేను దానం మున్నగు వాటిని చేయాలి. ప్రేతయొక్క ఆకలి, దప్పిక తీరుటకై విప్రులకు భోజనం పెట్టాలి.

**తృతీయాం షోడశీం వచ్మి వైనతేయ శృణుష్వ తామ్ ।**
**ద్వాదశ ప్రతిమాస్యాని ఆద్యం షాణ్మాసికం తథా ।।48।।**

**సపిండీకరణం చైవ తృతీయా షోడశీ మతా ।**
**ద్వాదశాహే త్రిపక్షే చ షణ్మాసే మాసికేఽబ్దికే ।।49।।**

**తృతీయాం షోడశీమేనాం వదంతి మతభేదతః ।**

వైనతేయా! ఇటుపైన తృతీయ షోడశిని గురించి చెప్తున్నాను. దానిని విను. పండ్రెండు మాసాలలో పండ్రెండు మాసికాలు, మొదటి మాసికం, షాణ్మాసికం, సపిండీ కరణం (త్రైపక్షికం) అని చేయబడే కర్మ తృతీయ షోడశిగా చెప్పబడుచున్నది. పండ్రెండో రోజు కర్మయందు, త్రైపక్షికమునందు, షాణ్మాసికమునందు, మాసికమునందు, ఆబ్దికమునందు చేయబడే ఈ కర్మను తృతీయ షోడశిగా మతభేదంచే చెప్తున్నారు.(ద్వాదశాహం నాటి ఆద్యశ్రాద్ధం, పండ్రెండు మాసికాలు, మాస, ఆరవ మాస, సాంవత్సరికాలు)

**యస్యైతాని న దత్తాని ప్రేతశ్రాద్ధాని షోడశ ।।50।।**

**పిశాచత్వం స్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి ।**
**ఏకాదశే ద్వాదశే వా దినే ఆద్యం ప్రకీర్తితమ్ ।।51।।**

వందలకొలది శ్రాద్ధాలు నిర్వహించినప్పటికి, ఏ ప్రేతనిమిత్తం ఈ పదునారు శ్రాద్ధాలు చేయబడవో, అతనికి పిశాచత్వం స్థిరంగా ఉండిపోతుంది. పదకొండోరోజున కాని, పండ్రెండోరోజున కాని ఆద్యశ్రాద్ధం చేయాలని పేర్కొనబడింది.

**మాసాదౌ ప్రతిమాసఞ్చ శుద్ధం మృతతిథౌ ఖగ ।**
**ఏకేనాహ్నా త్రిభిర్వాపి హీనేషు వినతాసుత ॥52॥**

**మాసషణ్మాసవర్షేషు త్రిపక్షేషు భవంతి హి ।**
**శ్రాద్ధాన్యథ స్యాత్ సాపిండ్యం పూర్ణే వర్షే తదర్ధకే ॥53॥**

ఖగమా! చనిపోయిన మాసం మొదలు ప్రతి మాసమున శ్రాద్ధం మృతతిథి నాడు పెట్టాలి. వినతానందనా! మాస, షణ్మాస సాంవత్సరిక తిథులలో, త్రిపక్షకములందు శ్రాద్ధములను ఒకటి,(రెండు),మూడు రోజుల ముందే పెట్టాలి. సపిండీకరణాన్ని ఏడాది పూర్తి అయిన తరువాత కాని, ఆరు నెలలు తరువాత కాని చేయాలి.

**త్రిపక్షేఽభ్యుదయే వాపి ద్వాదశాహేఽథవా నృణామ్ ।**
**ఆనంత్యాత్కుల ధర్మాణాం పుంసాఞ్చైవాయుషః క్షయాత్ ॥54॥**

**అస్థిరత్వా చ్ఛరీరస్య ద్వాదశాహే ప్రశస్యతే ।**
**సపిండీకరణేష్వేవం విధిం పక్షీంద్ర మే శృణు ॥55॥**

వివాహాది మంగళకార్యాలు ఆయా తిథులలో వస్తూఉంటే, నలబై అయిదు రోజులకు ముందుగా గాని, పంద్రెండో రోజున గాని చేయవచ్చు. జీవుల కులధర్మాలు మిక్కిలి ఎక్కువ అగుటవల్ల, నరులకు ఆయుష్షు అశాశ్వతమగుటవల్ల పంద్రెండవ రోజున చేయడమే ఉత్తమమైనది. పక్షీంద్రా! సపిండీకరణవిధిని ఈ పద్ధతిగా విను.

**ఏకోద్దిష్ట విధానేన కార్యం తదపి కాశ్యప ।**
**తిలగంధోదకై ర్యుక్తం కుర్యాత్పాత్ర చతుష్టయమ్ ॥56॥**

**పాత్రం ప్రేతస్య తత్రైకం పిత్ర్యం పాత్రత్రయం తథా ।**
**సేచయేత్పితృపాత్రేషు ప్రేతపాత్రం ఖగ త్రిషు ॥57॥**

కశ్యపవంశ సంజాతా! ఆ విధిని కూడ ఏకోద్దిష్టవిధానాన్ని అనుసరించి చేయాలి. నాలుగు కుండలను (పాత్రలను) తీసుకొని, వాటిని తిలలతో, గంధంతో, నీటితో నింపాలి. ఒక పాత్రను ప్రేతానికి, మూడింటిని పితృ గణాలకు కేటాయించాలి. ఖగమా! ప్రేతపాత్రలోని జలం పితృపాత్రలపై చిలకరించాలి.

**చతురో నిర్వపేత్పిండాన్ పూర్వాంతేషు సమాపయేత్ ।**
**తతః ప్రభృతి వై ప్రేతః పితృసామాన్యమశ్నుతే ॥58॥**

నాలుగు పిండాలను పెట్టి, ఒక పిండాన్ని మృతునికి అంకితం చేసి, దానిని మూడు పిండాలుగా (భాగాలుగా)చేసి, వాటిని పితృపిండాలతో మొదటినుంచి చివరి వరకు కలపాలి. అప్పటి నుండి ప్రేతకు పితృసమానత్వం సిద్ధిస్తుంది.

**తతః పితృత్వ మాపన్నే తస్మిన్ ప్రేతే ఖగేశ్వర ।**
**శ్రాద్ధధర్మై రశేషైస్తు తత్పూర్వానర్చయేత్ పితౄన్ ॥59॥**

ఖగేశ్వరా! అప్పటినుండి ప్రేతకు పితృత్వం ప్రాప్తించిన తరువాత, సమస్త శ్రాద్ధకార్యాలకు పూర్వపితరులతో కలిపి, ఈ మృతవ్యక్తిని కూడ పూజించాలి.

**ఏకచిత్యారోహణే చ ఏకాహ్ని మరణే తథా ।**
**సాపిండ్యన్తు స్త్రియా నాస్తి మృతే భర్తృః స్త్రియో భవేత్ ॥60॥**

**పాకైక్యమథ కాలైక్యం కర్త్రైక్యఞ్చ భవేత్ఖగ ।**
**శ్రాద్ధాదౌ సహదాహే చ పతిపత్న్యోర్న సంశయః ॥61॥**

ఒకే చితిని ఆరోహించినను, ఆలు మగలు ఒకేరోజు మరణించినను, ఆ స్త్రీకి సపిండీకరణమవసరంలేదు. భర్త మరణించిన స్త్రీకి మాత్రమే ఆ విధి. ఖగమా! వారికి దహనైక్యం, కాలైక్యం, కర్త్రైక్యం, పాకైక్యం సిద్ధిస్తుంది. శ్రాద్ధాదియందును, సహదహనము నందును, పతి పత్నులకు ఐక్యమే ఉంటుంది. ఇందు సంశయంలేదు.

**భర్తుర్మృత తిథే రన్యత్తిథౌ చితిమథారుహేత్ ।**
**తాం మృతాహని తు సంప్రాప్తే పృథక్ పిండేన యోజయేత్ ॥62॥**

భర్తయొక్క మృతతిథినాడు కాక, మరో తిథి రోజున చితిని ఆరోహించిస్తే, ఆమె చనిపోయిన రోజు నాడు వేరేగా సపిండీకరణ చేయాలి.

**ప్రత్యబ్దఞ్చ నవశ్రాద్ధం యుగపత్తు సమాపయేత్ ॥63॥**

ప్రత్యాబ్దికాన్నీ, నవ శ్రాద్ధాలను ఒకేసారి చేయవచ్చును.

**యస్య సంవత్సరాదర్వాక్ సపిండీకరణం భవేత్ ।**
**మాసికఞ్చోదకుంభఞ్చ దేయం తస్యాపి వత్సరమ్ ॥64॥**

**నవశ్రాద్ధం సపిండత్వం శ్రాద్ధాన్యపి చ షోడశ ।**
**ఏకేనైవ తు కార్యాణి సంవిభక్త ధనేష్వపి ॥65॥**

ఎవనికి వేరుగా సాంవత్సరికం, సపిండీకరణం జరుగుతుందో, అతనికి మాసికాలనూ, ఉదకుంభాన్నీ వత్సరమంతా ఈయవలసినదే. నవ శ్రాద్ధాలు, సపిండీకరణం, షోడశ శ్రాద్ధాలు, వేరేగా ద్రవ్యవిభజనచేసి, కలిపి ఒకే తిథినాడు చేయవచ్చును.

**పితామహీభిః సాపిండ్యం తథా మాతామహైః సహ ।**
**ఉక్తం భర్త్రాపి సాపిండ్యం స్త్రియా విషయభేదతః ॥66॥**

పితామహి మున్నగువారితో సాపిండ్యము, అలాగే మాతామహులతో సాపిండ్యము, భర్తతో కలిపి సపిండీకరణం విషయభేదాన్ననుసరించి చెప్పబడింది.

**నవశ్రాద్ధస్య తే కాలం వక్ష్యామి శృణు కాశ్యప ।**
**మరణాహ్ని మృతిస్థానే శ్రాద్ధం పక్షిన్ ప్రకల్పయేత్ ॥67॥**

కశ్యపవంశ సంజాతా! ఖగమా! నవ శ్రాద్ధాల కాలంగురించి విను. మొదటిది చనిపోయిన రోజున మృతిస్థానంలో జరపబడాలి.

**ద్వితీయఇ్చ తతో మార్గే విశ్రామో యత్ర కారితః ।**
**తతః సంచయనస్థానే తృతీయం శ్రాద్ధముచ్యతే ॥68॥**

పిమ్మట శ్మశానానికి తీసుకొని వెడుతున్నప్పుడు దారిలో ఒకచోట ఆగుట, శవాన్ని దింపుట జరిగినచోట రెండవ శ్రాద్ధాన్ని పెట్టాలి. మూడవ శ్రాద్ధం అస్థిసంచయన స్థానంలో జరుపబడాలి.

**పంచమే సప్తమే తద్వదష్టమే నవమే తథా ।**
**దశమై కాదశే చైవ నవ శ్రాద్ధాని వై ఖగ ॥69॥**

ఖగమా! మిగిలినవి ఐదు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు రోజులలో పెట్టాలి. వీటిని నవ శ్రాద్ధాలు అంటారు.

**శ్రాద్ధాని నవచైతాని తృతీయా షోడశీ స్మృతా ।**
**ఏకోద్దిష్ట విధానేన కార్యాణి మనుజైస్తథా ॥70॥**

ఈ నవ శ్రాద్ధాలను తృతీయాషోడశి అనికూడ అంటారు. మానవులచే ఇవి ఏకోద్దిష్టవిధానంతో జరుపబడాలి.

**ప్రథమేఒహ్ని తృతీయే వా పంచమే సప్తమే తథా ।**
**నవమైకాదశే చైవ నవశ్రాద్ధం ప్రకీర్తితమ్ ॥71॥**

**ఉచ్యంతే షడిమానీహ నవస్యురపి యోగతః ।**
**ఉక్తాని తే మయా తాని ఋషీణాం మతభేదతః ॥72॥**

ఒకటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది, పదకొండు రోజులలో పెట్టేవాటికే నవశ్రాద్ధాలని అన్నారు. ఈ ఆరే అదనంగా చేసే కర్మలవలన తొమ్మిదిగా చెప్పబడుతున్నాయి. ఋషుల మతభేదాన్ని అనుసరించి వాటిని నీకు నేను వివరించాను.

**రూఢిపక్షో మమాభీష్టో యోగః కైశ్చిదిహేష్యతే ।**
**ఆద్యే ద్వితీయే దాతవ్య స్తథైవేకం పవిత్రకమ్ ॥73॥**

రూఢిపక్షమే నాకు అభీష్టమైనది. కొందరు యోగవిధానాన్నే అనుసరించుట జరుగుచున్నది. మొదటి, రెండు శ్రాద్ధాలకు ఒక పవిత్రమునే ఇవ్వాలి.

**ప్రేతాయ పిండో దాతవ్యో భుక్తవత్సు ద్విజాతిషు ।**
**ప్రశ్నస్తత్రాభిరమ్యేతి యజమాన ద్విజన్మనా ॥74॥**

**అక్షయ్యమముకస్యేతి వక్తవ్యం విరతౌ తథా ।**
**ఏకోద్దిష్టం మే నిబోధ చేత్థమావత్సరం స్మృతమ్ ॥75॥**

బ్రాహ్మణులు భోజనం చేసిన పిమ్మట ప్రేతకు పిండదానం చేయాలి. యజమానుడు బ్రాహ్మణుని ప్రసన్నులైతిరా? అని ప్రశ్నించాలి. పిమ్మట ఆయన "నేను ప్రసన్నుడనైతిని. మీ మృతజనునికి అక్షయ లోకాలు ప్రాప్తించాలి" అని అనాలి. ఇక ఏడాది చివరివరకు జరుగవలసిన ఏకోద్దిష్ట శ్రాద్ధాలను గురించి నేను చెప్పేది విను.

**సపిండీకరణా దూర్ధ్వం యాని శ్రాద్ధాని షోడశ ।**
**ఏకోద్దిష్ట విధానేన చరేద్వా పార్వణాదృతే ॥76॥**

**ప్రత్యబ్దం యో యథా కుర్యాత్తథా కుర్యాత్స తాన్యపి ।**
**ఏకాదశే ద్వాదశేఽహ్ని ప్రేతో భుంక్తే దినద్వయమ్ ॥77॥**

సపిండీకరణం తరువాత ఆపై జరిగే పదునారు శ్రాద్ధాలు ఏకోద్దిష్ట విధానంలోనే జరపాలి. పార్వణవిధిలో మార్పు ఉంటుంది. ప్రత్యబ్దం(సాంవత్సరికం) శ్రాద్ధం ఎవడు ఎలా చేస్తాడో, అలాగే అతడు వాటినికూడ చేయాలి. పదకొండు, పండ్రెండు రోజులలో పెట్టే రెండు శ్రాద్ధాలను ప్రేతయే స్వయంగా భుజిస్తాడు.

**యోషితః పురుషస్యాపి పిండం ప్రేతేతి నిర్వపేత్ ।**
**సాపిండ్యే తు కృతే తస్య ప్రేతశబ్దో నివర్తతే ॥78॥**

స్త్రీకి అయినను, పురుషునకైనను, ప్రేత పేరును ఉచ్చరించి పిండాన్ని ఉంచాలి. సపిండీకరణమయిన తరువాత ప్రేతశబ్ద ప్రయోగం నివారింపబడుతుంది.

**దీపదానం ప్రకర్తవ్య మావర్షన్తు గృహాద్బహిః ।**
**అన్నం దీపో జలం వస్త్ర మన్యద్వా దీయతే చ యత్ ॥79॥**

**తృప్తిదం ప్రేతశబ్దేన సపిండీకరణావధి ।**
**అబ్దకృత్యం మయోక్తం తే సమాసాద్వినతాసుత ॥80॥**

సంవత్సరపర్యంతం ఇంటికి బయట దీపాన్ని ఉంచాలి. సపిండీకరణమయ్యేటంతవరకు అన్నంకాని, దీపంకాని, జలంకాని, వస్త్రంకాని, మరొకటి ఏమి ఇచ్చినప్పటికి ప్రేత శబ్దం చేతనే తృప్తి కలిగిస్తుంది. వినతానందనా! ఆబ్దిక విధానాన్ని సంక్షేపంగా నీకు చెప్పుట జరిగింది.

**వైవస్వత గృహే యానం యథా తత్తు నిబోధ మే ।**
**త్రయోదశేఽహ్ని శ్రవణా కర్మణోఽనంతరన్తు సః ॥81॥**

**త్వగ్గృహీతాహివత్తార్క్ష్య గృహీతో యమకింకరైః ।**
**తస్మిన్మార్గే వ్రజత్యేకో గృహీత ఇవ మర్కటః ॥82॥**

ఇక జీవుల యమలోకప్రయాణం ఎలా ఉంటుందో దానిని నా ద్వారా గ్రహించు. పదమూడో నాటి శ్రాద్ధకృత్యం, (గరుడపురాణ) శ్రవణం తరువాత ఆ జీవుడు. యమకింకరులచే పట్టుకొనబడినవాడై, తారుక్ష్యుడా! పాములవాడికి దొరకిన పామువలె, గారడీవాడు పట్టుకొన్న కోతివలె, ఆ మార్గంలో ఒంటరిగా బయలుదేరుతాడు.

**వాయ్వగ్రసారివద్రూపం దేహమన్యత్ప్రపద్యతే ।**
**తత్పిండజం పాతనార్థమన్యత్తు పితృసంభవమ్ ॥83॥**

ఆ తరువాత వాయుప్రేరితుడై మరో దేహంలోకి అదే రూపంలో ప్రవేశిస్తాడు. ఆ శరీరం జీవిచేసిన కర్మను బట్టి, అపరకర్మ చేసిన కర్తయొక్క శ్రద్ధను బట్టి ఉంటుంది.

**తత్ప్రమాణ వయోఽవస్థా సంస్థానాం ప్రాగ్భవో యథా ।**

పూర్వమున్న వయస్సును, అవస్థను, అవయవాల అమరికను అనుసరించియే, ఆ ప్రమాణం ఉన్న రూపం వస్తుంది.

**షడశీతి సహస్రాణి యోజనానాం ప్రమాణతః ॥84॥**

**అధ్వాంతరాలికో జ్ఞేయో యమమానుషలోకయోః ।**
**సాధికార్ధ క్రోశయుతం యోజనానాం శతద్వయమ్ ॥85॥**

**చత్వారింశత్తథా సప్త ప్రత్యహం యాతి తత్ర సః ।**
**అష్టాచత్వారింశతా చ త్రింశతా దివసైరితి ॥86॥**

ప్రమాణమును బట్టి ఎనబై ఆరు వేలయోజనాల దూరం, యమలోక మానవలోకాల మధ్యనున్న అంతరాళంగా చెప్పబడింది. జీవుడు ఒక రోజుకు రెండువందల నలబై ఏడు యోజనాల అర క్రోసుదూరం ప్రయాణం చేస్తాడు. ఇలా మూడు వందల నలబై ఎనిమిది రోజుల పాటు పయనిస్తాడు.

**వైవస్వతపురం యాతి కృష్యమాణో యమానుగైః ।**
**ఏవం క్రమేణ యాతవ్యే మార్గే పాపరతైస్తు యత్ ॥87॥**

**జాయతే సప్రపంచం తచ్ఛృణు త్వరుణానుజ ।**
**త్రయోదశ దినే దత్తః పాశైర్బద్ధ్వాతిదారుణైః ॥88॥**

యమకింకరులచే పట్టుకొనబడి వెడుతూ వైవస్వతపురం చేరుకొంటాడు. అరుణుని సోదరుడా! ఈవిధంగా పయనించే మార్గంలో పాపరతులైనవారు ఏ అవస్థ పడతారో, దానిని నీవు విస్తరించి విను. మృత్యువు వచ్చిన పదమూడో రోజున అతిదారుణాలైన యమపాశాలచే చిక్కి, కట్టబడతాడు.

**యమస్యాంకుశ హస్తో వై భ్రుకుటీ కుటిలాననః ।**
**దండప్రహార సంభ్రాంతః కృష్యతే దక్షిణాం దిశమ్ ॥89॥**

యమకింకరుని చేతియందలి అంకుశాన్నీ, కనుబొమలు ముడిపడిన ముఖాన్నీ చూచి, వాని దండప్రహారంతో మిక్కిలి భయపడి, దక్షిణదిశగా ఈడ్చుకొని పోబడతాడు. (యమాంకుశ హస్తుడు,భ్రుకుటీ కుటిలాననుడు, దండప్రహార సంభ్రాంతుడు వానిని దక్షిణదిశగా ఈడ్చుకొని పోతాడు.)

**కుశ కంటక వల్మీక శంకు పాషాణ కర్కశే ।**
**తథా ప్రదీప్త జ్వలనే క్వచిచ్ఛ్వభ్ర శతోత్కటే ॥90॥**

**ప్రదీప్తాదిత్య తప్తే చ దహ్యమానః సదంశకే ।**
**కృష్యతే యమదూతైశ్చ శివావన్నాద భీషణైః ॥91॥**

**ప్రయాతి దారుణే మార్గే పాపకర్మా యమాలయే ।**
**కలేవరే దహ్యమానే మహాంతం క్షయమృచ్ఛతి ॥92॥**

దారిలో కుశలు, ముళ్లు, పుట్టలు, మేకులు, కర్కశాలైన రాళ్లు బాధిస్తూ ఉండగా, అగ్ని జ్వలిస్తూ ఉండగా, ఒక్కొక్కచోట కాళ్లకు పెద్ద పెద్ద కన్నాలు పడుతూ ఉండగా, సూర్యుడు మండిపోతూ ఉండగా, ఈగలు కుడుతూ ఉండగా, నక్కలు అరుస్తూ ఉండగా యమభటులు ఈడ్చుకొనిపోతారు. యమాలయానికి దారుణమైన మార్గంలో పాపాత్ముడు పయనిస్తూ ఉంటాడు. కళేబరం మండిపోతూ ఉండగా మిక్కిలి క్షీణదశను పొందుతాడు.

**భక్ష్యమాణే తథైవాంగే భిద్యమానే చ దారుణమ్ ।**
**ఛిద్యమానే చిరతరం జన్తుర్దుఃఖమవాప్నుతే ॥93॥**

శరీరం భక్షింపబడుతూ ఉండగా, దారుణంగా భేదింపబడుతూ ఉండగా, ఖండ ఖండాలుగా ఛేదింప బడుతుండగా ఆ ప్రాణి(జీవి) మిక్కిలి దుఃఖాన్ని పొందుతాడు.

**స్వేన కర్మవిపాకేన దేహాంతర గతోఽపి సన్ ।**
**పురాణి షోడశాముష్మిన్మార్గే తాని చ మే శృణు ॥94॥**

తన కర్మ పరిపాకంచేత, మరో దేహాన్ని పొందినా ఈ దుఃఖం అనుభవిస్తాడు. ఈ దారిలో పదునారు పురాలు ఉన్నాయి. వాటిని గురించి నా ద్వారా విను.

**యామ్యం సౌరిపురం నగేంద్రభవనం గంధర్వ శైలాగమౌ**
**క్రౌంచం క్రూరపురం విచిత్రభవనం బహ్వాపదం దుఃఖదమ్ ।**
**నానాక్రందపురం సుతప్త భవనం రౌద్రం పయోవర్షణమ్ ।**
**శీతాఢ్యం బహుభీతి షోడశ పురాణ్యేతాన్యదృష్టాని తే ॥95॥**

యామ్యపురి, సౌరిపురి, నగేంద్రభవనం, గంధర్వపురం, శైలాగమం, క్రౌంచపురం, క్రూరపురం, విచిత్రభవనం, బహ్వాపదం, దుఃఖదం, నానాక్రందపురం, సుతప్తభవనం, రౌద్రం, పయోవర్షణం, శీతాఢ్యం, బహుభీతి – ఇవన్నీ పరమ భయంకరాలై, దుర్దర్శనాలుగా ఉంటాయి.

**తత్ర యామ్యపురం గచ్ఛన్ పుత్రపుత్రేతి చ బ్రువన్ ।**
**హాహేతి క్రందతే నిత్యం స్వకృతం దుష్కృతం స్మరన్ ॥96॥**

అక్కడ యామ్యపురిలో వెడుతూ, "పుత్రా! పుత్రా!" అని విలపిస్తూ నిత్యమూ తానుచేసిన దుష్కృతాన్ని స్మరించుకొంటూ "హా! హా!" అని ఆక్రందిస్తూ ఉంటాడు.

**అష్టాదశే దినే తార్క్ష్య తత్పురం ప్రాప్నుయాదసౌ ।**
**పుష్పభద్రా నదీ యత్ర న్యగ్రోధః ప్రియదర్శనః ॥97॥**

తార్క్ష్యా! ఎక్కడయితే పుష్పభద్రానది ఉన్నదో, ఎక్కడ చూడడానికి మిక్కిలి ప్రీతిగా ఉండే న్యగ్రోధ (మఱ్ఱి)వృక్షం ఉందో, ఆ యామ్యపురానికి పదునెనిమిదో రోజు చేరుకొంటాడు.

**విశ్రామేచ్ఛాం కరోత్యత్ర కారయంతి న తే భటాః ।**
**క్షితౌ దత్తం సుతై స్తస్య స్నేహాద్వా కృపయా తథా ॥98॥**

**మాసికం పిండమశ్నాతి తతః సౌరిపురం వ్రజేత్ ।**
**వ్రజన్నేవం ప్రలపతే ముద్గరాహతి పీడితః ॥99॥**

అక్కడ విశ్రమించాలనే కోరికను పొందుతాడు. కాని ఆ యమభటులు అందుకు అంగీకరించరు. అక్కడ భూలోకంలో స్నేహంవల్ల గాని, దయచేత గాని, అతనికి సుతులచే ఈయబడిన మాసికపిండాన్ని తింటాడు. అక్కడ నుండి సౌరిపురం చేరుకొంటాడు. యమభటుల సమ్మెట దెబ్బలు తింటూ, వెడుతూ ఇలా విలపిస్తాడు.

**జలాశయో నైవకృతో మయా తదా మనుష్య తృప్త్యై పశుపక్షి తృప్తయే ।**
**గోతృప్తి హేతో ర్న చ గోచరః కృతః శరీర హే నిస్తర యత్త్వయా కృతమ్ ॥100॥**

అయ్యో! నాచేత మనుష్యుల తృప్తికోసంకాని, పశువుల, పక్షుల సంతృప్తికోసంకాని అప్పుడు(బ్రతికి ఉండగా) ఒక్క జలాశయం కూడ త్రవ్వింపబడలేదు. గోవుల తృప్తినిమిత్తం ఒక్క గోచరభూమి (గోశాల) ఏర్పాటు చేయబడలేదు. ఓ శరీరమా! చేసుకొన్నంతవారికి చేసుకొన్నంత ఫలితం కదా! నీవు అనుభవించు.

**తత్ర నామ్నా తు రాజాసౌ జంగమః కామరూపధృక్ ।**
**భయాత్ తద్దర్శనాజ్జాతాద్భుంక్తే పిండం సశంకితః ॥101॥**

**త్రిపక్షే జలసంయుక్తం క్షితౌ దత్తం తతో వ్రజేత్ ।**
**వ్రజన్నేవం ప్రలపతే ఖడ్గాఘాత ప్రపీడితః ॥102॥**

అక్కడ ఉండే ఆ సౌరిపురరాజు ఇచ్ఛానుసారంగా సంచరించేవాడు. కామరూపధారి. అతనిని చూడడంతోనే భయంతో వణకిపోతాడు. ఎలాగో అతి కష్టంతో భూలోకంలో తనకై అర్పించిన త్రిపక్ష జలసంయుక్త పిండాన్ని భుజించి అక్కడనుండి పాపి బయలుదేరుతాడు. యమభటుల ఖడ్గప్రహారాలచే పీడింపబడుతూ, ఇలా విలపిస్తాడు.

**న నిత్యదానం న గవాహ్నికం కృతం పుస్తం చ దత్తం న హి వేదశాస్త్రయోః ।**
**పురాణదృష్టో న హి సేవితోఽ ధ్వా శరీర హే నిస్తర యత్ త్వయా కృతమ్ ॥103॥**

నేనెప్పుడూ నిత్యదానం చేయలేదు, ఒక్క రోజునైనా గోవుకు గడ్డివేసి మేపలేదు, పోనీ! వేదశాస్త్రసంబంధమైన ఒక్క పుస్తకం కూడ దానమీయలేదు. పురాణాలలో చెప్పబడిన తీర్థయాత్రాది సత్కర్మ ఒక్కటికూడ నాచే చేయబడలేదు. ఓ శరీరమా! నువ్వు చేసిన పాపాల బాధలన్నీ భరించు.

**నగేంద్రనగరం గత్వా భుక్త్వా చాన్నం తథావిధమ్।**
**మాసి ద్వితీయే యద్దత్తం బాంధవైస్తు తతో వ్రజేత్ ॥104॥**

అక్కడ నుండి నగేంద్ర నగరం చేరుకొని, రెండవ మాసంలో బాంధవులచే ఈయబడిన పిండాన్ని భుజించి, అక్కడ నుండి మళ్లీ బయలుదేరుతాడు.

**వ్రజన్నేవం ప్రలపతే కృపాణ త్సరు తాడితః ।**
**పరాధీనమభూత్సర్వం మమ మూర్ఖ శిరోమణేః ॥105॥**

**మహతా పుణ్యయోగేన మానుష్యం లబ్ధవానహమ్ ।**
**తృతీయే మాసి సంప్రాప్తే గంధర్వనగరే శుభమ్ ॥106॥**

దారిలో యమభటులు కత్తిపిడులతో పొడుస్తూ ఉండగా వెడుతూ ఇలా విలపిస్తాడు. "ఎన్నోజన్మల పుణ్యఫలిత మహాయోగంవల్ల నేను మానవజన్మ పొందాను. నేను మూర్ఖాగ్రేసరుడనైపోయాను. నా బ్రతుకంతా పరాధీనమై పోయింది." మూడవ మాసం వస్తూఉండగా శుభమైన గంధర్వనగరం చేరుకొంటాడు.

**తృతీయ మాసికం పిండం తత్ర భుంక్త్వా వ్రజత్యసౌ ।**
**వ్రజన్నేవం విలపతే తదగ్రేణాహతః పథి ॥107॥**

అక్కడ శుభమైన తృతీయ మాసిక పిండాన్ని భుజించి, ఆ పాపాత్ముడు తిరిగి బయలుదేరుతాడు. దారిలో యమభటులు ముందు బాదుతూ ఉండగా, వెడుతూ ఇలా విలపిస్తాడు.

**మయా న దత్తం న హుతం హుతాశనే తపో న తప్తం హిమశైల గహ్వరే ।**
**న సేవితం గాంగమహో మహాజలం శరీర హే నిస్తర యత్త్వయా కృతమ్ ॥108॥**

నేను ఎవరికీ ఏ దానం చేయలేదు. అగ్నిలో ఆహుతి సమర్పించలేదు, హిమాలయగుహలో ఎటువంటి తపస్సూ ఆచరించలేదు. అయ్యో! కనీసం గంగామహాజల సేవనమయినా చేయలేదు. ఓ శరీరమా! నీ చేత చేయబడిన దానిని అనుభవించు.

**తుర్యే శైలాగమం మాసి ప్రాప్నుయాత్తత్ర వర్షణమ్ ।**
**తస్యోపరి భవేత్పక్షిన్ పాషాణానాం నిరంతరమ్ ॥109॥**

**చతుర్థమాసికం శ్రాద్ధం భుక్త్వా తత్ర ప్రసర్పతి ।**
**స పతన్నేవ విలపన్ పాషాణాద్యతిపీడితః ॥110॥**

నాలుగో మాసంలో శైలాగమం చేరుకొంటాడు. ఖగమా! అక్కడ అతనిపై నిరంతరం రాళ్లవర్షం పడుతూ ఉంటుంది. నాలుగో మాసికంలోని శ్రాద్ధపిండాన్ని భుజించి అక్కడ సంచరిస్తాడు. అతడు రాళ్ళు మున్నగు వాటిచే మిక్కిలిగా పీడింపబడుతూ, పడిపోతూ విలపిస్తాడు.

**న జ్ఞానమార్గో న చ యోగమార్గో న కర్మమార్గో న చ భక్తిమార్గః ।**
**న సాధుసంగాత్కిమపి శ్రుతం మయా శరీర హే నిస్తర యత్త్వయా కృతమ్ ॥111॥**

జ్ఞానమార్గం ఆచరింపబడలేదు, యోగమార్గం చేయబడలేదు, కర్మమార్గం నిర్వహింపబడలేదు. ఇక భక్తిమార్గమన్నది లేనే లేదు. సాధుసంగమం చేసి నేనేమియును శ్రవణం చేయలేదు. ఓ శరీరమా! నీవు చేసినదేదో, దానిని భరించు.

**తతః క్రూరపురం మాసి పంచమే యాతి కాశ్యప ।**
**భువిదత్తం పిండజలం భుక్త్వా క్రూరపురం వ్రజేత్ ॥112॥**

కశ్యపవంశ సంజాతా! అక్కడ నుండి అయిదో మాసంలో క్రూరపురం చేరుకొంటాడు. అక్కడ భూమియందు ఈయబడిన పిండం, జలం గ్రహించి క్రూరపురం వెడతాడు.

**వ్రజన్నేవం విలపతే పట్టిశైః పాతితః పథి ।**
**హా మాత ర్హా పిత ర్భ్రాతః సుతా హా హా మమ స్త్రియః ॥113॥**

**యుష్మాభిర్నోపదిష్టోఽహమవస్థాం ప్రాప్త ఈదృశీమ్ ।**
**ఏవం లాలప్యమానం తం యమదూతా వదంతి హి ॥114॥**

అలా వెడుతూ దారిలో పట్టిశాలతో కొట్టబడుతూ ఇలా విలపిస్తాడు. "అయ్యో! తల్లీ! తండ్రీ! సోదరా! కుమారులారా! నాచే పోషింపబడిన ఓ ముదితలారా! మీరు నాకెందుకు మంచి ఉపదేశం చేయలేదు? ఇప్పుడు నేను ఈ దురవస్థను పొందిఉన్నాను.." ఈ విధంగా రోదిస్తున్న అతనితో యమదూతలు ఇలా అంటారు.

**క్వ మాతా క్వ పితా మూఢ క్వ జాయా క్వ సుతః సుహృత్ ।**
**స్వకర్మోపార్జితం భుంక్ష్వ మూర్ఖ యాతాశ్చిరం పథి ॥115॥**

"ఓరీ మూర్ఖజీవుడా! ఇంకెక్కడి తల్లి? తండ్రి ఎక్కడ? భార్య ఎక్కడ? ఇంకెక్కడ కొడుకు? బంధుమిత్రులెక్కడ? మూఢుడా! చేసిన పాపం నీవొక్కడివే అనుభవించు. మార్గంలో ఎక్కువ దుఃఖాలు పొందు.

**జానాసి శంబలమలం బలమధ్వగానాం నోఽశంబలః ప్రయతతే పరలోక గత్యై ।**
**గంతవ్యమస్తి తవ నిశ్చితమేవ తేనమార్గేణ యేన న భవేత్ క్రయ విక్రయోఽపి ॥116॥**

పాప దోషబలం తెలుసుకొన్నావా? ఈ దారిలో వచ్చేవారిని ఏ పాపంలేని శక్తి కూడ కాపాడలేదు. పరలోకంలో జీవించేవారికి ఇతరాశ్రయమేదీ ఉండదు. నీ స్వకర్మార్జితమే నిన్ను నడిపిస్తుంది. ఈ మార్గంలో నీ పలుకుబడి కాని, క్రయ విక్రయాలు కాని పనిచేయవు."

**ఊనషాణ్మాసికే క్రౌంచే భుక్త్వా పిండన్తు సోదకమ్ ।**
**ఘటీ మాత్రన్తు విశ్రమ్య విచిత్ర నగరం వ్రజేత్ ॥117॥**

**వ్రజన్నేవం విలపతే శూలాగ్రేణ విదారితః ॥118॥**

క్రౌంచపురంలో ఊనషాణ్మాసిక పిండాన్ని, పిండోదకాన్ని భుజించి, ఒక్క గడియకాలం విశ్రమించి విచిత్ర నగరానికి వెడతాడు. అక్కడ శూలాగ్రాలచే చీల్చబడుతూ, వెడుతూ ఇలా విలపిస్తాడు.

**కుత్ర యామి న హి గామి జీవితం హామృతస్య మరణం పునర్నవై ।**
**ఇత్థమేవ విలపన్ ప్రయాత్యసౌ యాతనార్థ ధృత విగ్రహః పథి ॥119॥**

'ఈ బాధలు భరించలేకున్నాను. ఎక్కడికి వెళ్లగలను? నేను చచ్చాననుకొన్నాను కాని బ్రతికే ఉంటానని, ఈ బ్రతుకుకు చావులేదని ఇప్పుడు తెలుస్తోంది.' అని దారిలో యాతనలు పొందుటకు తగిన దేహాన్ని ధరించి, ఇలా విలపిస్తూ ఆ పాపాత్ముడు ఈడ్చుకుపోబడతాడు.

**విచిత్ర నగరే తత్ర విచిత్రో నామ పార్థివః ।**
**తత్ర షణ్మాసపిండేన తృప్తః సన్ వ్రజతే పురః ॥120॥**

అక్కడ విచిత్ర నగరంలో విచిత్రుడనే రాజు ఉంటాడు. అక్కడ ఆరో మాసిక పిండాన్ని భుజించి, తృప్తుడై మరో పురి వైపు వెడతాడు.

**వ్రజన్నేవం విలపతే ప్రాసాగ్రేణ ప్రపీడితః ॥121॥**

వెడుతూ, దారిలో ఈటెమొనతో మిక్కిలి పీడింపబడుతూ, ఇలా విలపిస్తాడు.

**మాతా భ్రాతా పితా పుత్రః కోఽపి మే వర్తతే న వా ।**
**యో మాముద్ధరతే పాపం పతంతం దుఃఖసాగరే ॥122॥**

అమ్మా నాన్నలారా! అన్నదమ్ములారా! పుత్రులారా! దుఃఖసాగరంలో పడి, మ్రగ్గుతున్న ఈ పాపాత్ముడనైన నన్ను ఈ దుఃఖంనుండి ఉద్ధరించడానికి ఏ ఒక్కడైనా, ఉన్నాడా? లేడా?

**వ్రజతస్తత్ర మార్గే తు తత్ర వైతరణీ శుభా ।**
**శతయోజన విస్తీర్ణా పూయశోణిత సంకులా ॥123॥**

**ఆయాతి తత్ర దృశ్యంతే నావికా ధీవరాదయః ।**
**తే వదన్తి ప్రదత్తా గౌ ర్యది వైతరణీ త్వయా ।**
**నావమేనాం సమారోహ సుఖేనోత్తర వై నదీమ్ ॥124॥**

అని ఏడుస్తూ వెడుతూ ఉండగా, అక్కడ శుభప్రదమైన, శతయోజనాలు విస్తీర్ణం కల్గిన ప్రాణుల చీము నెత్తురుతో నిండిన వైతరణీ నది తగులుతుంది. అక్కడ జాలరులు మున్నగు నావికులు కనబడతారు. వారు "నీచే వైతరణీ గోవుదానం చేయబడి ఉంటే, ఈ నౌకను అధిరోహించు. సుఖంగా ఈ నదిని తరించు" అంటారు.

**తత్ర యేన ప్రదత్తా గౌః స సుఖేనైవ తాం తరేత్ ।**
**అదాయీ తత్ర ఘృష్యేత కరగ్రాహస్తు నావికైః ॥125॥**

**ఉఖైః కాకైర్బకోలూకై స్తీక్ష్ణతుండై ర్వితుద్యతే ।**
**మనుజానాం హితం దానమన్తే వైతరణీ ఖగ ॥126॥**

ఎవడు గోవును దానం చేస్తాడో, అతడు అక్కడ సుఖంగా ఆ నదిని తరిస్తాడు. దానం చేయని వానిని నావికులు చేతులు పట్టుకొని హింసిస్తూ ఈడ్చుకుపోతారు. సూది ముక్కులున్న కాకులు, కొంగలు, గుడ్లగూబలు ముక్కలు ముక్కలుగా చేసి పొడుచుకొని తింటాయి. ఖగమా! అందువలన మరణసమయంలో మనుజులకు వైతరణీ గోదానం మేలు చేకూరుస్తుంది.

**దత్తా పాపం దహేత్ సర్వం మమ లోకన్తు సా నయేత్ ।**
**సప్తమే మాసి సంప్రాప్తే పురం బహ్వాపదం మృతః ॥127॥**

**వ్రజేత్తు సోదకం భుక్త్వా పిండం వై సప్తమాసికమ్ ।**
**వ్రజన్నేవం విలపతే పరిఘాహతి పీడితః ॥128॥**

ఆవును దానంచేస్తే సర్వపాపం దహింపబడుతుంది. ఆ దానం(గోవు)జీవిని నా లోకానికి తీసుకొనిపోతుంది. ఏడవ మాసం వచ్చేసరికి మృతుడు బహ్వాపదమనే పురం ప్రవేశిస్తాడు. అక్కడ ఏడవమాస పిండాన్ని, నీటిని సేవించి మరల బయలుదేరుతాడు. యమదూతలు లాటీకర్రలు పెట్టి కొడుతూ ఉండగా, వెడుతూ ఇలా అంగలారుస్తాడు.

**న దత్తం న హుతం తప్తం న స్నాతం న కృతం హితమ్ ।**
**యాదృశం చరితం కర్మ మూఢాత్మన్ భుంక్ష్వ తాదృశమ్ ॥129॥**

"ఓ మూఢాత్ముడా! ఏనాడూ దానం, హోమం, స్నానం, పరోపకారం చేయలేదు. ఎటువంటి కర్మాచరణ చేశాడో జరిగి ఉంటుందో అటువంటి ఫలితమే వస్తుంది. అనుభవించు" అనుకొంటూ రోదిస్తాడు.

**మాసస్యాష్టమే దుఃఖదే తు పురే భుక్త్వాథ సోదకమ్ ।**
**పిండం ప్రయాత్యసౌ తార్క్ష్య నానాక్రందపురం తతః ॥130॥**

ఆ తరువాత ఎనిమిదో మాసంలో దుఃఖదపురం చేరుకొంటాడు. అక్కడ అష్టమాసిక పిండ జలాలు సేవించి పిమ్మట ఆ మృతుడు నానాక్రందపురం చేరుకొంటాడు.

**ప్రయాణే చ ప్రవదతే ముసలా ఘాతపీడితః ।**
**క్వ జాయా చటులై శ్చాటు పటుభిర్వచనై ర్మమ ॥131॥**

**భోజనం భల్ల భల్లీభి ర్ముసలైశ్చ క్వ మారణమ్ ।**
**నవమే మాసి దత్తం వై నానాక్రందపురే తతః ॥132॥**

**పిండమశ్నాతి కరుణం నానాక్రందాన్ కరోత్యపి ।**

ప్రయాణమార్గంలో ముసలాల దెబ్బలుతింటూ ఇలా పలవిస్తాడు."అయ్యో! ఒకప్పుడు నా భార్య చక్కని పలుకులు పలుకుతూ, నన్ను కీర్తిస్తూ భోజనంపెట్టేది. ఇప్పుడు బల్లెపుపోటులను, ముసలాల దెబ్బలను తింటూ చస్తున్నాను." అని జాలిగా, అనేకవిధాలుగా ఆక్రందనలు చేస్తూ, తొమ్మిదో నెలలో నానాక్రందపురంలో ఆ నెలలోని పిండాన్ని తింటాడు.

**దశమే మాసి దత్తం వై సుతప్తభవనం తతః ॥133॥**

**సరన్నేవం విలపతే హలాహతి హతః పథి ।**
**స్వసూను పేశలకరైః పాదసంవాహనం మమ ॥134॥**

**క్వ దూత వజ్రప్రతిమ కరైర్మత్పద కర్షణమ్ ।**
**దశమే మాసి పిండాది తత్ర భుక్త్వా ప్రసర్పతి ॥135॥**

తరువాత పదో నెలలో సుతప్త భవనం అనే ప్రదేశానికి చేరుకొంటాడు. దారిలో వెడుతూ హలప్రహరణాల బాధలు తట్టుకోలేక ఇలా విలపిస్తాడు. "మెత్తని చేతులతో నా పుత్రులు పట్టే పాదసంవాహన మెక్కడ? యమదూతలు వజ్రసమానములైన చేతులతో ఈడ్చుకొనిపోతూంటే పాదసంఘర్షణ మెక్కడ?" అని బావురుమంటూ ఆ పదో మాసపిండాన్ని భుజించి ముందుకు వెడతాడు.

**మాసే చైకాదశే పూర్ణే పరం రౌద్రం స గచ్ఛతి ।**
**గచ్ఛన్నేవం విలపతే యథా పృష్ఠే ప్రపీడితః ॥136॥**

పదకొండో నెలరాగా అతడు రౌద్రపురం చేరుకొంటాడు. యమదూతలు వీపుపై బాదుతూ ఉండగా వెడుతూ ఇలా విలపిస్తాడు.

**క్వాహం సతూలీ శయనే పరివర్తన్ క్షణే క్షణే ।**
**భటహస్త భ్రష్ట యష్టి కృష్ట పృష్ఠః క్వ వా పునః ॥137॥**

**క్షితౌ దత్తఇ్చ పిండాది భుక్త్వా తత్ర తతో వ్రజేత్ ।**
**పయోవర్షణ మిత్యేతన్నామకం పురమండజ ॥138॥**

"ఒకనాడు పట్టు పరుపులపై శయనిస్తూ, మాటి మాటికి ఒత్తిగిలుతూ ఆనందించే నేనెక్కడ? ఈనాడు యమభటుల చేతులనుండి పడే కఱ్ఱదెబ్బల వీపు ఎక్కడ?" అని బొబ్బలుపెడుతూ, నేలపై ఈయబడిన పిండాదికాన్ని భుజించి, అండజా! అక్కడనుండి పయోవర్షణం అనే పేరుగల పురానికి లాగుకొని పోబడతాడు.

**వ్రజన్నేవం విలపతే కుఠారై ర్మూర్ధ్ని పీడితః ।**
**క్వ భృత్య కోమలకరై ర్గంధ తైలావసేచనమ్ ॥139॥**

**క్వ కీనాశానుగైః క్రోధాత్ కుఠారైః శిరసి వ్యథా ।**
**ఊనాబ్దికఇ్చ యచ్ఛ్రాద్ధం తత్ర భుంక్తే సుదుఃఖితః ॥140॥**

దారిలో యమభటులు గొడ్డళ్లతో నెత్తి మొత్తుతూ ఉండగా, వెడుతూ ఇలా విలపిస్తాడు, 'సేవకులు అందించే సుకుమార హస్తాల, సుగంధ తైలాభిమర్దన(స్నాన)మెక్కడ? యమభటులు అందించే క్రోధపూరిత కుఠార ప్రహారాల శిరోవేదన ఎక్కడ?' అంటూ మూలుగుతాడు, మిక్కిలి దుఃఖంతో అక్కడ ఊనాబ్దిక శ్రాద్ధపిండాన్ని భుజిస్తాడు.

**సంపూర్ణే తు తతో వర్షే శీతాఢ్యం నగరం వ్రజేత్ ।**
**గచ్ఛన్నేవం ఛురికయా ఛిన్నజిహ్వాస్తు రోదితి ॥141॥**

ఏడాది పూర్తి అవుతూ ఉండగా శీతాఢ్యమనే నగరికి ఈడ్చుకొని పోబడతాడు. దారిలో వెడుతూ యమదూతలు నాలుకను చురకత్తులతో చీలుస్తూ ఉండగా ఇలా రోదిస్తాడు.

**ప్రియాలాపైః క్వ చ రసమధురత్వస్య వర్ణనమ్ ।**
**ఉక్తమాత్రేఽసిపత్రాది జిహ్వాచ్ఛేదః క్వ చైవ హి ॥142॥**

'అయ్యో! ఒకనాడు నా నాలుక చల్లని కబుర్లు చెబుతుందని, రసాభ్యుచిత బంధమని ప్రశంసింపబడింది. నేడు కత్తిఅంచులతో తెగగోయబడుతోంది. ఆ బ్రతుకక్కడ. ఈ చావిక్కడ.

**వార్షికం పిండదానాది భుక్త్వా తత్ర ప్రసర్పతి ।**
**బహుభీతికరం తత్తత్ పిండజం దేహమాస్థితః ॥143॥**

**ప్రకాశయతి పాప్మానమాత్మానఞ్చ వినిందతి ।**
**యోషిదప్యేవమేతస్మిన్ మార్గే వై పరిదేవతి ॥144॥**

అక్కడ వార్షిక పిండదానాదులను సేవించి సంచరిస్తాడు. అక్కడ తన శరీరంమారి పిండజ శరీరంలో ప్రవేశించి బహుభీతికరమైన నగరం చేరుకొంటాడు. దారిలో ఆ పాపి తన పాపాలను గుర్తుచేసుకొని తనను తానే నిందించుకొంటాడు. స్త్రీ అయినా ఈ మార్గంలో ఈ విధంగానే పరిదేవన పొందుతుంది.

**తతో యామ్యం నాతిదూరే నగరం స హి గచ్ఛతి ।**
**చత్వారింశద్యోజనాని చతుర్యుక్తాని విస్తృతమ్ ॥145॥**

అక్కడ నుండి మిక్కిలి దగ్గరగా నున్న యమపురిని ఆ జీవి చేరుకొంటాడు.(ఆ మృతుడు). దాని విస్తీర్ణం నలభైనాలుగు యోజనాలు.

**త్రయోదశ ప్రతీహారాః శ్రవణా నామ తత్ర వై ।**
**శ్రవణా కర్మత స్తుష్యంత్యన్యథా క్రోధమాప్నుయుః ॥146॥**

అక్కడ శ్రవణ నామకులైన పదముగ్గురు ప్రతీహారులుంటారు. వీరికి శ్రవణకర్మఅంటే ఇష్టమగుటవలన దానిని చేస్తే సంతోషిస్తారు. లేకపోతే కోపిస్తారు.

**తతస్తత్రాశురక్తాక్షం భిన్నాంజనచయోపమమ్ ।**
**మృత్యుకాలాంతకాదీనాం మధ్యే పశ్యతి వై యమమ్ ॥147॥**

పిమ్మట అక్కడ చేరుకొన్న వెంటనే ఎఱ్ఱని కన్నులతో, చీల్చబడిన నల్లని కాటుక కొండవంటి కాంతితో పోల్చదగిన యమరాజును మృత్యువు, కాలాంతకుడు మున్నగువారి మధ్యలో చూస్తాడు.

**దంష్ట్రాకరాల వదనం భ్రుకుటీ దారుణాకృతిమ్ ।**
**విరూపై ర్భీషణైర్వక్త్రై ర్వృతం వ్యాధిశతైః ప్రభుమ్ ॥148॥**

**దండాసక్త మహాబాహుం పాశహస్తం సుభైరవమ్ ।**
**తన్నిర్దిష్టాం తతో జంతు ర్గతిం యాతి శుభాశుభామ్ ॥149॥**

భయంకరాలైన కోరల ముఖంతో, వికటమైన కనుముడితో ఘోరమైన ఆకారంతో, వికృతదారుణముఖాలతో రూపుదాల్చిన వందలకొలది వ్యాధుల మధ్య, యమదండంతో కూడుకొన్న మహాబాహువుల మధ్య, పాశహస్తంతో, భైరవరూపంతో ఉండే యముని ఆదేశానుసారం ఆ మృతుడు తరువాత శుభాశుభగతిని పొందుతాడు.

**పాపీ పాపాం గతిం యాతి యథా తే కథితం పురా ।**
**ఛత్రోపనహ దాతారో యే చ వేశ్మప్రదాయకాః ॥150॥**

**యే తు పుణ్యకృత స్తత్ర తే పశ్యంతి యమం తదా ।**
**సౌమ్యాకృతిం కుండలినం మౌలిమంతం ధృతశ్రియమ్ ॥151॥**

పాపి ఎటువంటి పాపగతి చెందుతాడో, ముందు నీకు తెలియ జేయబడింది కదా! గొడుగు, చెప్పులు దానం చేసినవారు, నికేతనాలను ఏర్పాటు చేసేవారు, ఇంకా అటువంటి పుణ్యాలు చేసేవారు అక్కడ ప్రసన్నమైన ఆకారం కల, కుండలధారి, కిరీటధారి, శ్రీమంతుడు అయిన యముని సౌమ్యరూపాన్ని సందర్శిస్తారు.

**ఏకాదశే ద్వాదశే హి షణ్మాసే ఆబ్దికే తథా ।**
**విప్రాన్ బహూన్ భోజయేత తత్ర యన్మహతీ క్షుధా ॥152॥**

**జీవన్పుత్ర కలత్రాది ప్రదిష్టమితరైః ఖగ ।**
**యో న సాధయతి స్వార్థమేవం పశ్చాద్ధి ఖిద్యతే ॥153॥**

ఖగమా! పదకొండు, పండ్రెండు, షాణ్మాసికం, ఆబ్దికం మున్నగు రోజులలో ఎక్కువమంది బ్రాహ్మణులకు భోజనం పెడితే, జీవించియున్న పుత్ర కలత్రాదులచే పెట్టబడినా, లేక ఇతరులచే పెట్టబడినా, ఆ గొప్పదైన ఆకలి దప్పికల బాధ ఏదయితే ఉందో ఇలా ఎవడు తన నిమిత్తం (పుణ్యం) సాధించుకొనకుండా ఉంటాడో, వాడు తరువాత దుఃఖిస్తాడు.

**ఏతత్తే సర్వమాఖ్యాతం సంయమిన్యాం యథాగతి ।**
**ప్రోక్తమావర్ష కృత్యం తే కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥154॥**

సంయమినీ నగరంలో వెళ్లునప్పుడు సంవత్సరమంతా చేయవలసిన కర్మవిధినీ, గమనవిధినీ, పూర్తిగా నీకు చెప్పాను. ఇక ఏమి వినగోరెదవు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే వర్షకృత్యయమలోక మార్గయాతనాది నిరూపణం నామ పంచమోఽధ్యాయః ॥5॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో సంవత్సర మంతయు చేయవలసిన విధి యమలోకమార్గంలోని యాతనలు అనే అయిదవ అధ్యాయం సమాప్తం.

## **షష్ఠోఽధ్యాయః** – ఆరవ అధ్యాయం

## **వృషోత్సర్గమాహాత్మ్యమ్** – వృషోత్సర్గ (ఆబోతును వదలటం) మాహాత్మ్యం

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**అపి సాధనయుక్తస్య తీర్థదానరతస్య చ ।**
**అకృతే తు వృషోత్సర్గే పరలోకగతిర్న హి ॥1॥**

**తస్మాత్ కృష్ణ వృషోత్సర్గః కర్తవ్య ఇతి మే శ్రుతమ్ ।**
**కిం ఫలం వృషయజ్ఞస్య పురా కేన కృతో హరే ॥2॥**

మంచి సాధనలు చేసినవానికి, తీర్థదానాసక్తుడైన వానికి కూడ వృషోత్సర్గం చేయకపోతే పరలోకగతి లేదుకదా! అందువలన కృష్ణా! వృషోత్సర్గం తప్పక చేయవలసిందిగా నేను వినియున్నాను. హరీ! వృషయజ్ఞం వలన ఏ ఫలితం సిద్ధిస్తుంది? పూర్వం ఎవనిచే ఇది చేయబడింది?

**అనడ్వాన్ కీదృశః ప్రోక్తః కస్మిన్ కాలే విశేషతః ।**
**కో విధిస్తస్య నిర్దిష్టః సర్వం మే కృపయా వద ॥3॥**

ఆ ఎద్దు ఎటువంటిదిగా చెప్పబడింది? విశేషించి ఏ సమయంలో చేయాలి? దానికి ఏ విధానం నిర్దేశింపబడింది? అంతను నాకు దయయుంచి వివరించు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఇతిహాసం మహాపుణ్యం ప్రవక్ష్యామి ఖగేశ్వర ।**
**బ్రహ్మపుత్రేణ యత్ ప్రోక్తం రాజానం వీరవాహనమ్ ॥4॥**

ఖగరాజా! మిక్కిలి పుణ్యమైన పురాతనకథను చెప్తున్నాను. ఇది వీరవాహనుడనే రాజుకు బ్రహ్మపుత్రునిచే చెప్పబడింది.

**విరాధనగరే రాజా వీరవాహన నామకః ।**
**ధర్మాత్మా సత్యసంధశ్చ వదాన్యో విప్రతుష్టికృత్ ॥5॥**

విరాధ నగరంలో వీరవాహనుడనే పేరు గల రాజు ఉండేవాడు. అతడు ధర్మాత్ముడు, సత్యసంధుడు. గొప్పదానాలు చేసినవాడు. విప్రులకు సంతోషం చేకూర్చినవాడు.

**స కదాచిద్వనం వీరో మహాత్మా ఖేటకం గతః ।**
**కించిత్ ప్రష్టుమనాస్తార్క్ష్య వసిష్ఠస్యా శ్రమం యయౌ ॥6॥**

ఆ మహాత్ముడైన వీరుడు ఒకనాడు వేటకై అరణ్యానికి వెళ్లాడు. గరుడా! ఏదో అడగాలనే మనస్సంకల్పంతో వసిష్ఠుని ఆశ్రమానికి వెళ్లాడు.

**నమస్కృత్య మునిం తత్ర కృతాసన పరిగ్రహః ।**
**ప్రశ్రయావనతో రాజా పప్రచ్ఛ ఋషి సంసది ॥7॥**

ఆ మునికి నమస్కరించి, అక్కడ కల్పించబడిన ఆసనాన్ని స్వీకరించాడు. ఆ ఋషిసదస్సులో వినయంతో తలవంచి రాజు ఇలా అడిగాడు.

**రాజోవాచ** – రాజు అడిగాడు.

**మునే మయా కృతో ధర్మో యథాశక్తి ప్రయత్నతః ।**
**యమస్య శాసనం శ్రుత్వా బిభేమి నితరాం హృది ॥8॥**

**యమఞ్చ యమదూతాంశ్చ నిరయాన్ ఘోరదర్శనాన్ ।**
**న పశ్యామి మహాభాగ తథా వద దయానిధే ॥9॥**

మునీంద్రా! నాచే శక్తికి తగినట్లుగా మిక్కిలి యత్నంతో ధర్మం ఆచరించబడింది. కాని యముని శాసనాన్ని విని హృదయంలో మిక్కిలి భయపడుతున్నాను. మహాభాగా! కృపానిధీ! యముని ఘోరంగా కన్పించే, నరకమందుండే యమకింకరులను చూడకుండా ఉండే విధానాన్ని వివరించవలసింది.

**వసిష్ఠ ఉవాచ** – వసిష్ఠుడు వచించాడు.

**ధర్మా బహువిధా రాజన్ వర్ణ్యంతే శాస్త్రకోవిదైః ।**
**సూక్ష్మత్వా న్న విజానంతి కర్మమార్గ విమోహితాః ॥10॥**

రాజా! శాస్త్రపండితులచే ధర్మాలు అనేక విధాలుగా చెప్పబడి ఉన్నాయి. అవి సూక్ష్మము లగుటవలన కర్మమార్గంలో విమోహం చెందేవారు వాటిని గ్రహించజాలరు.

**దానం తీర్థం తపో యజ్ఞాః సంన్యాసః పైతృకో మహః ।**
**ధర్మేషు గృహ్యమాణేషు వృషోత్సర్గో విశేషితః ॥11॥**

దానం, తీర్థసేవనం, తపస్సు, యజ్ఞాలు, సంన్యాసం, గొప్పదైన పితృక్రియ – ఇలా ధర్మాలు స్వీకరింపబడుతూ ఉంటే విశేషమైనది వృషోత్సర్గం.

**ఏష్టవ్యా బహవః పుత్రా యద్యేకోఽపి గయాం వ్రజేత్ ।**
**యజేత వాశ్వమేధేన నీలం వా వృషముత్సృజేత్ ॥12॥**

ఎక్కువమంది పుత్రులను సంపాదించుకోవాలి. ఒకడైనా గయకు వెళ్లి శ్రాద్ధం పెడతాడు. ఇంకొకడు అశ్వమేధయజ్ఞం చేస్తాడు. మరొకడు నీలవృషభాన్ని విడిచిపెడతాడు.

**బ్రహ్మహత్యాది పాపాని జ్ఞానాజ్ఞానకృతాని చ ।**
**నీలోద్వాహేన శుద్ధ్యేత్తు సముద్రప్లవనేన వా ॥13॥**

బ్రహ్మహత్య మున్నగు పాపాలు, తెలిసికాని, తెలియకకాని చేసిన పాపాలు, సముద్రాన్ని దాటి వెళ్లుటవలన వచ్చేదోషాలు, నీలవృషాన్ని దానం చేయుటవల్ల నశించి, పరిశుద్ధి కలుగుతుంది.

**ఏకాదశాహే రాజేంద్ర యస్య నోత్సృజ్యతే వృషః ।**
**ప్రేతత్వం నిశ్చలం తస్య కృతైః శ్రాద్ధైస్తు కిం భవేత్ ॥14॥**

రాజేంద్రా! పదకొండో రోజున ఏమృతుని ఉద్దేశించి వృషం విడువబడదో, అతనికి ప్రేతత్వం స్థిరంగా ఉండి పోతుంది. ఎన్ని శ్రాద్ధాలుపెట్టినా, ఏం ప్రయోజనం వస్తుంది కనుక?

**యథా కథంచిత్ కర్తవ్య స్తీర్థే వా పత్తనేఽథవా ।**
**వృషయజ్ఞైః ప్రముచ్యేత నాన్యథా సాధనైః ఖగ ॥15॥**

కాబట్టి ఏదోవిధంగా తీర్థమందు కాని, లేదా పత్తనమందు కాని ఆ విధి చేయదగియున్నది. ఖగమా! వృషయజ్ఞముల చేతనే ప్రేతవిముక్తి పొందగలడు. ఇతర సాధనాలవల్ల మాత్రం సాధ్యంకాదు.

**వృషభం పంచకల్యాణం యువానం కృష్ణకంబలమ్ ।**
**గోయూథ మధ్యే నితరాం విచరంతం విధానతః ॥16॥**

**చతసృభి ర్వత్సకాభి ర్ద్వాభ్యాశ్చైవైకయా ఖగ ।**
**వివాహ్య మంగలద్రవ్యై ర్మంత్రవత్తం సముత్సృజేత్ ॥17॥**

ఖగమా! శుభలక్షణాలు కల్గిన పంచకల్యాణ జాతికి చెందిన, నల్లని గంగడోలు కల్గిన, ఆలమందల నడుమ ఇచ్చవచ్చినట్లు సంచరించే కోడెఎద్దును నాలుగు లేదా రెండు లేదా ఒక దూడకిచ్చి శాస్త్రవిధిచే మంగళద్రవ్యాలతో, మంత్రపురస్సరంగా వివాహక్రియ ఆచరించి వదలివేయాలి.

**ఇహరతీతి షడ్ ఋగ్భిర్హోమం కుర్యాద్విభావసోః ।**
**కార్తిక్యాం మాఘవైశాఖ్యాం సంక్రమే పాత పర్వసు ॥18॥**

**తీర్థే పిత్ర్యే క్షయాహే చ విశేషేణ ప్రశస్యతే ।**

"ఓం ఇహరతిః స్వాహా.....ఇదమగ్నయే" (యజు...8! 51) అని ఆరు మంత్రాలు పఠిస్తూ, అగ్నిదేవునికి ఆహుతులను ఈయాలి. కార్తిక, మాఘ, వైశాఖమాసాలలో(పూర్ణిమలలో) సంక్రమణాలలో, వ్యతీపాతదినాలలో, పర్వాలలో, తీర్థములందు, పితృదేవతల క్షయతిథినాడు ఈ క్రియ విశేషంగా ప్రశస్తి పొందుతుంది.

**లోహితో యస్తు వర్ణేన ముఖే పుచ్ఛే చ పాండురః ॥19॥**

**పీతః ఖురవిషాణేషు స నీలో వృష ఉచ్యతే ।**
**శ్వేతవర్ణో భవేద్విప్రో లోహితః క్షత్ర ఉచ్యతే ॥20॥**

**పీతవర్ణో భవేద్వైశ్యః శూద్రః కృష్ణః స్మృతో బుధైః ।**
**యథావర్ణం సముద్దిష్టో వర్ణేషు బ్రాహ్మణాదిషు ॥21॥**

ఎఱ్ఱరంగులో ఉండి, మూతి, తోక తెల్లగాఉండి, గిట్టలు, కొమ్ములు పచ్చగా ఉండి కనబడే ఎద్దు నీలవృషభమని చెప్పబడుతుంది. విప్రుడు తెల్లగా ఉంటాడు. క్షత్రియుడు ఎఱ్ఱగా ఉంటాడు. వైశ్యుడు పచ్చగా ఉంటాడు, శూద్రుడు నల్లగా ఉంటాడని బుధులు చెబుతారు కావున బ్రాహ్మణాది వర్ణములందు ఆయా రంగు కల్గిన ఎద్దును వదలుట ఉద్దేశింపబడింది.(మంచిది)

**అథవా రక్తవర్ణస్తు సర్వేషామేవ శస్యతే ।**
**పితా పితామహశ్చైవ తథైవ ప్రపితామహః ॥22॥**

**ఆశాసతే సుతం జాతం వృషోత్సర్గం కరిష్యతి ।**
**ధర్మస్త్వం వృషరూపేణ జగదానందదాయకః ॥23॥**

కానినాడు అన్ని జాతులవారికి ఎఱ్ఱనిరంగు కల్గిన ఎద్దును విడుచుట ప్రశస్తమైనది. తండ్రికాని, తాతకాని, ముత్తాతకాని తనకు పుట్టిన కొడుకు వృషోత్సర్గం చేస్తాడని(చేయగలడని) ఆశతో ఎదురుచూస్తూ ఉంటారు. "నీవు వృషభరూపంలో నున్న ధర్మానివి. లోకానికి ఆనందాన్ని చేకూర్చుదానవు"

**అష్టమూర్తే రధిష్ఠానమతః శాంతిం ప్రయచ్ఛ మే ।**
**గంగాయమునయోః పేయ మంతర్వేదితృణం చర ॥24॥**

**ధర్మరాజస్య పురతో వాచ్యం మే సుకృతం వృష ।**
**దక్షిణాంసే త్రిశూలాంకం వామోరౌ చక్రచిహ్నితమ్ ॥25॥**

**ఇతి సంప్రార్థ్య వృషభం గంధపుష్పాక్షతాదిభిః ।**
**వృషం వత్సతరీయుక్తం పూజయిత్వా సముత్సృజేత్ ॥26॥**

"అష్టమూర్తి అయిన ప్రభువుకు(శివునికి) అధిష్ఠానమవు. అందువల్ల నాకు శాంతిని ప్రసాదించు. ఓ వృషభమా! యమధర్మరాజు ఎదుట నా పుణ్యకర్మలను విన్నవించు. గంగా యమునా నదీజలాలను త్రాగి, ఆ రెండు నదుల మధ్యప్రదేశంలో గడ్డి మేస్తూ సంచరించు" అని దానిని ప్రార్థించి, దాని కుడి భుజంపై త్రిశూల చిహ్నాన్ని, ఎడమతొడపై చక్రచిహ్నాన్ని వేయించి, దానిని గంధం, పూలు, అక్షతలు, మున్నగు వాటితో పూజించి వయస్సులో నున్న దూడతో కలిపి వృషభాన్ని వదలివేయాలి.

**తస్మాద్రాజన్ విధానేన వృషోత్సర్గం సమాచర ।**
**బహుసాధనయుక్తస్య నాన్యథా సద్గతిస్తవ ॥27॥**

అందువల్ల రాజా! శాస్త్రవిధానం ద్వారా వృషోత్సర్గక్రియను చక్కగా ఆచరించు. అనేక దైవికసాధనలు చేసిన నీకు మరోవిధంగా ఉత్తమగతి లభించదు.

**ఆసీత్త్రేతాయుగే పూర్వం విదేహ నగరే నృప ।**
**బ్రాహ్మణో ధర్మవత్సేతి స్వకర్మ నిరతః సుధీః ॥28॥**

నృపాలా! పూర్వం త్రేతాయుగంలో విదేహపురంలో ధర్మవత్సుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు మంచి విద్వాంసుడు. స్వీయకర్మలయందు ఆసక్తి కలవాడు.

**విష్ణుభక్తో౽ తితేజస్వీ యథాలాభేన తుష్టికృత్ ।**
**పితృపర్వణి సంప్రాప్తే కుశార్థీ కాననం యయౌ ॥29॥**

విష్ణువునందు భక్తికలవాడు, మిక్కిలి తేజస్సు(కాంతి) కలవాడు, దొరికిన దానితో సంతుష్టి పొందేవాడు. తండ్రి తిథి రాగా దర్భలకోసం అరణ్యానికి వెళ్లాడు.

**అటన్నిత స్తత స్తత్ర చిన్వన్ కుశపలాశకమ్ ।**
**సహసోపేత్య పురుషా శ్చత్వారశ్చారుదర్శనాః ॥30॥**

అక్కడ ఇటూ అటూ తిరుగుతూ దర్భలను, మోదుగ సమిధలను ప్రోగుచేసుకొనుచుండగా, అందమైన రూపం కల్గిన నలుగురు పురుషులు శీఘ్రంగావచ్చి.

**విభ్రాంత మనసం గృహ్య ప్రత్యగ్జగ్ముర్విహాయసా ।**
**బహువృక్ష సమాకీర్ణం గిరిదుర్గ భయానకమ్ ॥31॥**

**వనాద్వనాంతరం నిన్యుర్నదీనద సమాకులమ్ ।**
**స తత్ర నగరం రాజన్ దదర్శ బహు విస్తరమ్ ॥32॥**

భ్రాంతి పొందిన మనస్సు కల్గిన అతనిని పట్టుకొని ఆకాశమార్గంలో తీసుకొని పోయారు. ఎక్కువ చెట్లతో వ్యాపించియున్న, దుర్గమాలైన కొండలతో గిరిదుర్గాలతో భయం కలిగించే నదులతో నదాలతో కూడుకొనియున్న మరో వనానికి ఆ ఆరణ్యం నుండి తీసుకొని వెళ్లారు. రాజా! అతడు అక్కడ ఒక నగరాన్ని చూశాడు. అది మిక్కిలి విస్తీర్ణం కలది.

**గోపురద్వార రచితం సౌధప్రాసాద మండితమ్ ।**
**చత్వారాపణ పణ్యాది నరనారీ సమాకులమ్ ॥33॥**

**తూర్యద్వంద్వాభి నిర్ఘోష వీణాపటహనాదితమ్ ।**
**కాంశ్చిత్ క్షుధార్దితాన్ దీనాన్ మలినాన్ విగతౌజసః ॥34॥**

గోపురాలతోను, ద్వారాలతోను కూడుకొని ఉంది. సౌధాలతోను, ప్రాసాదాలతోను అలంకరింపబడి ఉంది. కూడళ్లతోను, అంగడులతోను, పణ్యాదులతోను, నరులతో, నారులతో సంకులంగా ఉంది. తూర్యధ్వనుల తోను, జంట చప్పుళ్లతోను(తాళాలు) రకరకాలైన స్వరాలతోను, వీణానాదాలతోను, పటహాది ధ్వనులతోను నిండి ఉంది. అక్కడ కొద్దిమందిని ఆకలితో పీడింపబడుతున్నవారిని, ఆర్తులను, మాలిన్యంతో ఉన్నవారిని, ఏ విధమైన తేజస్సులేనివారిని,

**తతో౽ తి తుష్టాన్ మలినాన్ వస్త్రఖండసమావృతాన్ ।**
**అగ్రతో హృష్టపుష్టాంశ్చ స్వర్ణవస్త్రోపశోభితాన్ ॥35॥**

**తతోఽపి సురసంకాశాన్స దృష్ట్వా విస్మితోఽభవత్ ।**
**కింస్వప్న ఉత మాయా వై మదీయో మానసో భ్రమః ॥36॥**

అక్కడే ఎదురుగా మిక్కిలి తృప్తిపొందియున్నవారిని, దుమ్ము కొట్టుకొనిపోయిన వారిని, గుడ్డపీలికతో కూడుకొన్నవారిని, సంతుష్టి పొందియున్నవారిని, మిక్కిలి పుష్టిగా నున్నవారిని, బంగారురంగు బట్టలతో ప్రకాశించేవారిని, దేవతాసమానులైనవారిని అతడు చూచి ఎక్కువ అచ్చెరువు పొందాడు. 'ఇది కలయా? లేక మాయయా? లేక నా చిత్త భ్రాంతియా?'

**సందిహానం ద్విజం నిన్యుః పురుషా రాజసన్నిధిమ్ ।**
**స తద్దదర్శ విప్రస్తు స్వర్ణప్రాసాద మందిరే ॥37॥**

**సింహాసనం మహాదివ్యం ఛత్రచామరవీజితమ్ ।**
**తత్రోపవిష్టం రాజానం కిరీటకనకోజ్జ్వలమ్ ॥38॥**

**మహత్యా చ శ్రియా యుక్తం స్తూయమానం సువందిభిః ।**
**రాజాపి దృష్ట్వా తం విప్రం ప్రత్యుత్థాయ కృతాంజలిః ॥39॥**

**పూజయామాస విధివన్మధుపర్కాసనాదిభిః ।**
**సంతుష్టమనసం దేవమస్తౌషీత్పరయా ముదా ॥40॥**

అనే సందేహం పొందిన ఆ ద్విజుని ఆ పురుషులు ఒక రాజు సన్నిధికి గొనిపోయారు. ఆ విప్రుడు అక్కడ బంగారు మేడలోని మందిరంలో గొప్ప దివ్యమైన ఛత్రచామరాలచే సేవింపబడుతున్న ఒక సింహాసనాన్ని చూశాడు. అందు కూర్చున్న బంగారు కిరీటంతో ప్రకాశించే రాజును. మిక్కిలి సంపదతో కూడుకొని, వందిపాఠకులచే స్తుతింపబడుచున్న వానిని వీక్షించాడు. ఆ రాజు కూడ ఆ విప్రుని చూచి ఒక్కసారిగా పైకిలేచి, దోయిలొగ్గి నమస్కరించి మధుపర్కం, ఆసనం మున్నగువాటిని కల్పించి, శాస్త్రపద్ధతిచే పూజించాడు. మనసా సంతసించిన ఆ విప్రదేవుని మిక్కిలి ఆనందంతో స్తుతించాడు.

**అద్య మే సఫలం జన్మ పావితఞ్చ కులం ప్రభో ।**
**విష్ణుభక్తస్య ధర్మస్య యత్త్వే దృగ్గోచరం గతః ॥41॥**

**నత్వా స్తుత్వా బహువిధమువాచానువసన్నృపః ।**
**యతః సమాగతో దేవః పునస్తత్రైవ నీయతామ్ ॥42॥**

'ప్రభూ! విష్ణుభక్తుడవైన, ధర్మాత్ముడవైన నీవు నా దృష్టికి కనిపించావు. ఇప్పుడు నా పుట్టుక సఫలమైంది. నా వంశం పావనమయింది, అని అనేక విధాలుగా స్తుతించి, నమస్కరించి ఆ నృపుడు అనుచరులతో ఇలా అన్నాడు. "ఈ విప్రదేవుని తీసికొనివచ్చిన చోటికే తిరిగి చేర్చండి"

**ఇతి శ్రుత్వా వచో రాజ్ఞః పప్రచ్ఛ ద్విజపుంగవః ।**

అనే రాజుయొక్క మాటలను విని ద్విజపుంగవుడిలా ప్రశ్నించాడు.

**బ్రాహ్మణఉవాచ –** బ్రాహ్మణుడు పలికాడు.

**కోఽయం దేశః కుతో లోకా ఉత్తమా మధ్యమాధమాః ॥43॥**

"ఇది ఏదేశం? ఒకేచోట ఉత్తములు, మధ్యములు, అధములు" ఎలా కనబడుతున్నారు.?

**కేన పుణ్యేన తు భవాన్ పారమేష్ఠ్య విభూషితః ।**
**కిమర్థమహమానీతః పున స్తత్రైవ నీయతే ॥44॥**

**అపూర్వమివ పశ్యామి సర్వం స్వప్నగతో యథా ।**

ఏ పుణ్యంవల్ల మీరు ఈ బ్రహ్మ (దేవేంద్ర) వైభవం పొందారు? ఏ కారణంచే నేను ఇక్కడకు తీసుకొని రాబడినాను. తిరిగి అక్కడకే ఎందుకు పంపుతున్నారు? అంతా కలగా కనిపిస్తోంది. ఇది పూర్వంలో చూసింది కాదు.'

**రాజోవాచ –** రాజు పలికాడు.

**స్వధర్మనిరతో యస్తు హరి భక్తిరతః సదా ॥45॥**

**విరక్త ఇంద్రియార్థేభ్యః స మే పూజ్యో న సంశయః ।**
**తీర్థయాత్రాపరో నిత్యం వృషోత్సర్గ విశేషవిత్ ॥46॥**

**సత్యదానపరో యస్తు స నమస్యో దివౌకసామ్ ।**
**దర్శనార్థ మిహానీతః పూజార్హశ్చ పరంతప ॥47॥**

'ఎవడయితే తన ధర్మమందు ఆసక్తుడై ఉంటాడో, ఎవడయితే విష్ణువు నందు భక్తియుక్తుడై ఉంటాడో, ఎవడయితే ఇంద్రియ విషయవాసనలందు విరక్తుడై ఉంటాడో, అతడు నాకు ఎల్లప్పుడు పూజింపదగినవాడు సందేహంలేదు. నిత్యమూ తీర్థయాత్రలు చేయుటయందు ఆసక్తి కలిగి, వృషోత్సర్గాన్ని గూర్చి విశేషంగా తెలిసి ఉంటాడో, సత్యం పలుకుటయందు, దానం చేయుటయందు ఎవడు నిష్ఠకలిగి ఉంటాడో అతడు దేవతలకు నమస్కరింపదగినవాడు. పరంతపా! నీవు పూజింపబడుటకు తగినవాడవు, నీ దర్శనమాశించి ఇక్కడకు నిన్నుగొని రావడం జరిగింది.'

**అనుగృహాణ మాం దేవ క్షమస్వ మమ సాహసమ్ ।**
**ఇత్యుక్త్వా దర్శయామాస మంత్రిణాం సంజ్ఞయా భ్రువః ॥48॥**

**వదిష్యతి సమగ్రం తే స్వయం వక్తుం న సాంప్రతమ్ ।**
**సామంతః సర్వవేదజ్ఞో జ్ఞాత్వా హార్దం నృపస్య చ ॥49॥**

'దేవా! నన్ను అనుగ్రహించు. నా సాహసాన్ని మన్నించు' అని పలికి మంత్రులకు కనుసంజ్ఞ చేస్తూ కనిపించాడు. ఇతడు నీకు సమస్తమూ చెప్పగలడు. స్వయంగా చెప్పుటకు అనర్హుడను అని రాజు పలుకగా, అతని మనోగతాభి ప్రాయం గ్రహించి సర్వవేదాల సారం తెలిసిన సామంతుడిలా అన్నాడు.

**విపశ్చిదువాచ** - సామంతుడు పలికాదు.

**పూర్వజన్మని వైశ్యోఽయం విశ్వంభర ఇతి శ్రుతః ।**
**విరాధనగరే విప్ర ద్విజదేవ విభూషితే ॥50॥**

**వైశ్యవృత్త్యా సదా జీవన్ కుటుంబపరిపాలకః ।**
**గవాం శుశ్రూషకో నిత్యం బ్రాహ్మణానాం చ పూజకః ॥51॥**

పూర్వజన్మలో ఇతడు విశ్వంభరుడనే పేరుగల వైశ్యుడు. విరాధనగరంలో ఉండేవాడు. విప్రోత్తమా! ద్విజులు, దేవతలు నివసించే ఆ నగరంలో వైశ్యవృత్తితో జీవించేవాడు. ఎల్లప్పుడు తన కుటుంబాన్ని పరివారాన్ని పోషించుకొంటూ ఉండేవాడు. నిత్యమూ గోసేవ చేసేవాడు. బ్రాహ్మణులను పూజించేవాడు.

**పాత్రదానపరో నిత్య మాతిథేయోఽగ్నిసేవకః ।**
**గార్హస్థ్యం విధివచ్చక్రే భార్యయా సత్యమేధయా ॥52॥**

సత్పాత్రులైనవారికి దానంచేసేవాడు. అతిథిసేవ, అగ్ని కార్యనిర్వహణ ఎల్లప్పుడు పాటించేవాడు. భార్యయైన సత్యమేధ సహకారంతో గృహస్థాశ్రమం శాస్త్రవిధానంగా నిర్వహించేవాడు.

**స్మార్తేన లోకానజయ చ్ఛ్రౌతేన తు హవిర్భుజః ।**
**కదాచిద్బంధుభిః సాకం కృత్వా తీర్థాని భూరిశః ॥53॥**

**యావదాయాతి సదనం దృష్టవాం ల్లోమశం పథి ।**
**దండవత్ప్రణిపత్యాశు కృతాంజలిపుటం స్థితమ్ ॥54॥**

**పప్రచ్ఛ వినయోపేతం కరుణావారివారిధిః ।**

స్మృతిధర్మంతో లోకాలను, శ్రౌతవిధానంచే అగ్నిహోత్రవిధిని జయించాదు (సాధించాదు). ఒకనాదు బంధువులతో కలసి అనేక తీర్థయాత్రలు చేస్తూ ఇంటికి తిరిగివస్తూ ఉండగా దారిలో లోమశమహర్షిని దర్శించాదు. వెంటనే సాష్టాంగ దండప్రమాణంచేసి, దోయిలొగ్గి, వినయంతో నిలిచిన విశ్వంభరునితో కరుణాసాగరుడైన ఆ మహర్షి ఇలా అన్నాదు.

**ఋషి రువాచ** - ఋషి పలికాదు.

**కుత ఆగమ్యతే సాధో బ్రాహ్మణై ర్బంధుభిర్యుతః ॥55॥**

**దృష్ట్వా త్వాం ధర్మనిలయం ప్రక్లిన్నం మానసం మమ ।**

'ఓ సాధూ! బ్రాహ్మణులతోను, బంధువులతోను కలసి ఎక్కడనుండి వస్తున్నావు? ధర్మానికి ఆవాసమైన నిన్ను చూడడంతోనే నా మనస్సు తడిసి ముద్దయినట్లయ్యింది.'

**విశ్వంభర ఉవాచ** – విశ్వంభరుడు పలికాడు.

**శీర్యమాణం శరీరం హి జ్ఞాత్వా మృత్యుం పురః స్థితమ్ ॥56॥**

**భార్యయా ధర్మచారిణ్యా తీర్థయాత్రాం వినిర్గతః ।**
**కృత్వా తీర్థాని విధివద్విశ్రాణ్య విపులం వసు ॥57॥**

**యావద్వ్రజామ్యహం వేశ్మ భవాన్ దృష్టిపథం గతః ।**

శరీరం శిథిలమయ్యేదని, మృత్యువు ఎల్లప్పుడు ఎదురుగానే ఉంటుందని తెలుసుకొని సహధర్మచారిణియైన భార్యతో కలసి తీర్థయాత్రలు చేస్తూ తిరిగి వస్తున్నాను. అనేక తీర్థాలు సేవించి, ధనాది దానాలతో శాస్త్రవిధితో పెక్కుమందిని తృప్తిపరచి, ఇంటికివస్తూ ఉండగా, మీరు నా కంటికి కనిపించారు.

**లోమశ ఉవాచ** – లోమశుడు అన్నాడు.

**తీర్థాని సంతి భూరీణి వర్షేஉస్మిన్ భారతే శుభే ॥58॥**

**యత్త్వయా హ్యుపచీర్ణాని తాని సర్వాణి మే వద ।**

'ఈ భరతవర్షం అనే పుణ్యభూమిలో పవిత్రతీర్థాలు ఎన్నోఉన్నాయి. నీచే ఏవేవి సేవించబడినాయో వాటినన్నింటినీ నాకు చెప్పు.

**వైశ్య ఉవాచ** – వైశ్యుడు అన్నాడు.

**గంగా చ సూర్యతనయా మహాపుణ్యా సరస్వతీ ॥59॥**

**దశాశ్వమేధై రయజద్యత్ర బ్రహ్మా సురేశ్వరః ।**
**తీర్థరాజ స్తతః కాశీ మహాదేవో దయానిధిః ॥60॥**

**మృతానాం యత్రజంతూనాం కర్ణే జపతి తారకమ్ ।**
**పులహస్యాశ్రమం పుణ్యం ఫల్గు తీర్థఞ్చ గణ్డకీ ॥61॥**

ఎక్కడయితే గంగ, సూర్యపుత్రి అయిన యమున, మహాపుణ్య అయిన సరస్వతి సంగమిస్తాయో, సురేశ్వరుడు అయిన బ్రహ్మ ఎక్కడ పది అశ్వమేధయజ్ఞాలు చేశాడో, ఆ ప్రయాగ అనే తీర్థరాజాన్ని సేవించాను. కృపానిధి అయిన మహాదేవుడు ఎక్కడ చనిపోయిన ప్రాణుల చెవులలో తారకమంత్రాన్ని ఉపదేశిస్తాడో, ఆ కాశీ నగరాన్ని సందర్శించాను. పులహాశ్రమాన్ని, పావనమైన ఫల్గు తీర్థాన్ని గండకీ నదిని సేవించాను.

**చక్రతీర్థం నైమిషఞ్చ శివతీర్థమనంతకమ్ ।**
**గోప్రతారక నాగేశమయోధ్యా బిందుసంజ్ఞితమ్ ॥62॥**

**యత్రాస్తే ముక్తిదః సాక్షాద్రామో రాజీవలోచనః ।**
**ఆగ్నేయం వాయుకౌబేరం కౌమారం భూరుహాం పునః ॥63॥**

చక్రతీర్థం, నైమిషం, శివతీర్థం, అనంతకం, గోప్రతారకం, నాగేశం, బిందుసరోవరం, ఎక్కడయితే రాజీవలోచనుడైన రాముడు నివసించాడో ఆ అయోధ్యను అగ్ని, వాయు, కుబేర, కుమార తీర్థాలను, అక్షయవట వృక్షాన్ని (గయ) సందర్శించా.

**సౌకరం మధురా యత్ర నిత్యం సన్నిహితో హరిః ।**
**పుష్కరం సత్యతీర్థఞ్చ జ్వాలాతీర్థం దినేశ్వరమ్ ॥64॥**

**ఇంద్రతీర్థం కురుక్షేత్రం యత్ర ప్రాచీ సరస్వతీ ।**
**తాపీ పయోష్ణీ నిర్వింధ్యా మలయః కృష్ణవేణికా ॥65॥**

**గోదావరీ దండకఞ్చ తామ్రచూడం సదోదకమ్ ।**
**ద్యావాభూమీశ్వరం దృష్ట్వా శ్రీశైలః పర్వతేశ్వరః ॥66॥**

**అసంఖ్య లింగ తీర్థాని యత్ర సంతి సదా మునే ।**
**వేంకటాద్రౌ మహాతేజాః శ్రీరంగాఖ్యః స్వయం హరిః ॥67॥**

సూకర క్షేత్రాన్ని, నిత్యమూ హరి సన్నిహితుడై ఉండే అయోధ్యనూ, పుష్కరతీర్థాన్ని, సత్యతీర్థాన్ని, జ్వాలా తీర్థాన్ని, దానేశ్వర, ఇంద్రతీర్థాలను, ఎక్కడ సరస్వతి తూర్పుగా ప్రవహిస్తుందో ఆ కురుక్షేత్రాన్ని, తాపీ, పయోష్ణీ, నిర్వింధ్యా నదులను, మలయపర్వతాన్ని, కృష్ణవేణిని, గోదావరిని, దండకాన్ని, తామ్రచూడాన్ని, సదోదక తీర్థాన్ని, ద్యావాభూమీశ్వరక్షేత్రాలను సందర్శించాను. మునీశ్వరా! అసంఖ్యాకంగా లింగాలు, తీర్థాలు ఎక్కడ ఉన్నాయో ఆ పర్వతేశ్వరుడైన శ్రీశైలాన్ని, వేంకటాద్రియందున్న మహాతేజస్వంతుని, స్వయంగా హరి వెలసిన శ్రీరంగనాథుని సందర్శించాను.

**వేంకటీ నామ తత్రైవ దేవీ మహిషమర్దినీ ।**
**చంద్రతీర్థం భద్రవటః కావేరీ కుటిలాచలౌ ॥68॥**

**అవటోదా తామ్రపర్ణీ త్రికూటః కోల్లకో గిరిః ।**
**వాసిష్ఠం బ్రహ్మతీర్థఞ్చ జ్ఞానతీర్థం మహోదధిః ॥69॥**

అక్కడనే వెలసిన వేంకటి అనే పేరుతో ఉన్న మహిషాసురమర్దినిని, చంద్రతీర్థాన్ని, భద్రవటాన్ని, కావేరిని, కుటిలాచలాన్ని, అవటోదాన్ని, తామ్రపర్ణిని, త్రికూటాన్ని, కోల్లకగిరిని, వసిష్ఠతీర్థాన్ని, బ్రహ్మతీర్థాన్ని, జ్ఞానతీర్థాన్ని, మహోదధిని వీక్షించాను.

**హృషీకేశం విరాజఞ్చ విశాలం నీలపర్వతః ।**
**భూమికూటః శ్వేతగిరీ రుద్రతీర్థముమావనమ్ ॥70॥**

**అవాప గిరిజాదేవీ తపసా యత్ర శంకరమ్ ।**
**వారుణం సూర్యతీర్థఞ్చ హంసతీర్థం మహోదయమ్ ॥71॥**

హృషీకేశుని, విరాజాన్ని, విశాలాన్ని, నీలపర్వతాన్ని, భూమికూటాన్ని, శ్వేతగిరిని, రుద్రతీర్థాన్ని, గిరిజాదేవి తపస్సుచేసి శంకరుని పొందిన ఉమావనాన్ని, వారుణ సూర్యతీర్థ హంసతీర్థాలను, మహోదయాన్ని సేవించాను.

**నిమజ్య యత్ర కాకోలా రాజహంసత్వ మాయయుః ।**
**అసురో యత్ర దేవత్వమవాప స్నానమాత్రతః ॥72॥**

ఎక్కడ అడవికాకులు స్నానంచేసి రాజహంసలుగా మారాయో, ఎక్కడ స్నానం చేసినంతమాత్రంచేతనే రాక్షసుడు దేవత్వాన్ని పొందాడో ఆ ప్రదేశాన్ని సేవించాను.

**విశ్వరూపం వందితీర్థం రత్నేశః కుహకాచలః ।**
**నర నారాయణం దృష్ట్వా ముచ్యతే పాపకోటిభిః ॥73॥**

విశ్వరూపుని, వందితీర్థాన్ని, రత్నేశాన్ని, కుహకాచలాన్ని వీక్షించాను. ఎక్కడ నర నారాయణులను చూచినంతమాత్రం చేతనే పాపరాశుల నుండి విముక్తి లభిస్తుందో, ఆ క్షేత్రాన్ని సందర్శించాను.

**సరస్వతీ దృషద్వత్యౌ నర్మదా శర్మదా నృణామ్ ।**
**నీలకంఠం మహాకాలం పుణ్యం చామరకంటకమ్ ॥74॥**

**చంద్రభాగా వేత్రవతీ వీరభద్రం గణేశ్వరమ్ ।**
**గోకర్ణం బిల్వతీర్థఇ్చ కూర్మకుండం సతారకమ్ ॥75॥**

**స్నానమాత్రేణ యత్రాశు ముచ్యతే కర్మ బంధనాత్ ।**
**అన్యాన్యపి చ తీర్థాని కృతాని కృపయా తవ ॥76॥**

సరస్వతిని, దృషద్వతిని, నిత్యమూ మానవులకు శాంతినిచ్చే నర్మదను నీలకంఠుని, మహాకాలుని, అమరకంటకాన్ని, చంద్రభాగను, వేత్రవతిని, వీరభద్రుని, గణేశ్వరిని, గోకర్ణాన్ని, బిల్వతీర్థాన్ని, కూర్మకుండాన్ని, స్నానమాత్రం చేతనే వెంటనే కర్మబంధాలనుండి విముక్తిని పొందే (పొందించే) సతారక తీర్థాన్ని సేవించాను. మీ అనుగ్రహంవల్ల మిగిలిన తీర్థాలను కూడ దర్శించాను.

**ఉత్పద్యతే శుభా బుద్ధిః సాధూనాం యదనుగ్రహః ।**
**ఏకతః సర్వతీర్థాని కరుణాః సాధవోఽ_న్యతః ॥77॥**

**అనుగ్రహాయ భూతానాం చరంతి చరితవ్రతాః ।**
**త్వం గురుః సర్వవర్ణానాం విద్యయా వయసాధికః ॥78॥**

సత్పురుషుల అనుగ్రహం శుభమైన బుద్ధిని పుట్టిస్తుంది. ఒకవైపు సర్వతీర్థాలు, మరోవైపు మీవంటి దయాస్వరూపులైన సాధువులు. సమస్త ప్రాణుల అనుగ్రహంకోసమై పుణ్యచరిత్రులు సంచరిస్తూ ఉంటారు. మీరు అన్ని వర్ణాలవారికి గురుదేవులు. విద్యచేతను, వయస్సుచేతను శ్రేష్ఠులు.

**అతః పృచ్ఛామ్యహం కించిదాధిభూతం చిరంతనమ్ ।**
**కింకుర్యాం కం ను పృచ్ఛేఽ_హం మనో మేఽ_తిచలం మునే ॥79॥**

చాలాకాలం నుండి ఆధిభౌతికమై వస్తున్న విషయం గురించి అందువల్ల మిమ్ములను నేను కొంచెం అడుగుతున్నాను. ఏం చేయాలి? ఎవరిని అడగను? మిమ్ములనే చెప్పమని అర్థిస్తున్నాను. మునీశ్వరా! నా మనస్సు మిక్కిలి చంచలమై పోతోంది.

**నిఃస్పృహం బ్రహ్మవిషయే విషయేష్వతిలాలసమ్ ।**
**మనాగపి న సహతే విరహం తిమిరం బ్రువత్ ॥80॥**

**మోహితం వివిధై ర్భావైః కర్మణాం క్షేత్రముత్తమమ్ ।**
**శాంతిం యథా సమాయాతి సంపన్నమివ భూసుర ॥81॥**

**వివేకప్రవణం శుద్ధం యథా స్యాత్ కృపయా వద ।**

అది బ్రహ్మవిషయంలో ఆసక్తిలేనిది. విషయవాసనలయందు ఆసక్తి కలది. వాటియందు కొంచెమైనను ఎడబాటు సహించలేకపోతున్నది. చీకటినే (అజ్ఞానమునే) పలకరిస్తోంది. నానావిధాలైన ఆలోచనలచే మోహం పొందుతోంది. బ్రాహ్మణోత్తమా! అది మంచికర్మలకు ఉత్తమమైన క్షేత్రంగా(స్థానముగా) సుసంపన్నమైన శాంతిని ఎలా పొందుతుంది? అది ఎలా వివేకానికి ఆశ్రయమవుతుంది? ఎలా పరిశుద్ధమవుతుంది? నాపై దయయుంచి చెప్పండి.

**ఋషిరువాచ** – ఋషి పలికాడు.

**మనస్తు ప్రబలం నిత్యం సవికారం స్వభావతః ॥82॥**

**వశం నయంతి కరిణం ప్రమత్త మపి హస్తిపాః ।**
**తథాపి సాధు సంగత్యా సాధనైరప్యతంద్రితః ॥83॥**

**తీవ్రేణ భక్తియోగేన విచారేణ వశం నయేత్ ।**
**ఇతిహాసం ప్రవక్ష్యామి తవ ప్రత్యయకారకమ్ ॥84॥**

మనస్సు మిక్కిలి బలీయమైంది. నిత్యం వికారం పొందడమే దాని స్వభావం. మిక్కిలి మదబలం కలిగిన ఏనుగును బక్కచిక్కిన మావటీండ్రు వశపరచుకొంటారు. అయినప్పటికిని, సత్పురుషసాంగత్యంచేతను, అలసత్వం (సోమరితనం) లేని సాధనలచేతను. ఉత్కృష్టమయిన భక్తియోగంచేతను, ఆత్మవిచారంచేతను మనస్సును స్వాధీనంలో ఉంచుకోవచ్చు. నీకు విశ్వాసం కలుగుటకోసమై ఒక ఇతిహాసం చెప్పుచున్నాను.

**నారదోఽ కథయన్మహ్యం స్వవృత్తం గతజన్మనః ।**

నారదుడు నాకు తన పూర్వజన్మ వృత్తాంతం గురించి ఇలా చెప్పాడు.

**నారద ఉవాచ** – నారదుడు వచించాడు.

**కస్యచిద్ద్విజముఖ్యస్య దాసీపుత్రః పురా మునే ॥85॥**

**శిక్షితో బాలభావేఽపి పాఠితో నితరామహమ్ ।**
**తత్రాపి సంగతిర్జాతా మహతాం పుణ్యకర్మణామ్ ॥86॥**

మునీశ్వరా! పూర్వం నేనొక దాసీపుత్రుడను. ఒక శ్రేష్ఠుడైన బ్రాహ్మణునింట ఉండేవాడిని. బాల్యకాలంలోనే నేను మిక్కిలిగా పాఠాలు నేర్చుకొని శిక్షింపబడినవాడను.(జ్ఞానార్జన చేసినవాడను) అక్కడే గొప్పవారైన పుణ్యాత్ములతో నాకు సాంగత్యం లభించింది.

**ప్రావృట్ కాలే మమ గృహేస్థితానాం భాగ్యయోగతః ।**
**శుశ్రూషణానువృత్త్యా చ ప్రశ్రయేణ దమేన చ ॥87॥**

**సంతోషం పరమం ప్రాప్య కృపయా త్విదమబ్రువన్ ।**
**మనీషా నిర్మలా యేన జాతా మమ శుభార్థినీ ॥88॥**

**యథా విష్ణుమయం సర్వమాత్మన్యేవ దదృశివాన్ ।**

వర్షాకాలంలో నా భాగ్యవశంవల్ల అక్కడనున్న సత్పురుషులకు శుశ్రూష చేయడంవల్ల, వారి కర్మప్రవృత్తికి అనుగుణంగా ఉండడంవల్ల నా వినయానికి, ఇంద్రియనిగ్రహానికి వారు మిక్కిలి సంతసంపొంది దయతో ఇలా పలికారు శుభాలను ప్రసాదించే నిర్మలమైన బుద్ధి అంతా విష్ణుమయమనే ఆ జ్ఞానం ఆత్మయందే దర్శించినవాడ వయ్యావు.

**మునయ ఊచుః** – మునులు పలికారు.

**శృణు వత్స ప్రవక్ష్యామో హితాయ తవ బాలక ॥89॥**

**యేన వై ధ్రియమాణేన ఇహాముత్ర సుఖం భవేత్ ।**
**దేవతిర్యఙ్మనుష్యాశ్చ సంసారే వివిధా జనాః ॥90॥**

బాలకా! వత్సా! నీ హితంకోసమై చెప్తున్నాము. విను. దీనిని ధారణచేస్తే ఈ లోకంలోను, పరలోకంలోను సుఖం కలుగుతుంది. సంసారంలో (సృష్టిలో) దేవతలు, తిర్యక్కులు, మనుష్యులు ఇలా అనేక విధాలైన జనులున్నారు.

**నిబద్ధాః కర్మపాశైస్తే భుంజన్ భోగాన్ పృథగ్విధాన్ ।**
**దేవత్వం యాతి సత్త్వేన రజసా చ మనుష్యతామ్ ॥91॥**

వారు కర్మలనే పాశాలచే బంధింపబడుతూ, పలు రీతులుగా ఉండే భోగాలను అనుభవిస్తూ ఉంటారు. సత్త్వగుణంవల్ల దేవత్వం పొందుతారు. రజోగుణంవల్ల మనష్యత్వం పొందుతారు.

**తిర్యక్త్వం తమసా జన్తుర్వాసనానుగతోఽబుధః ।**
**మాతుర్లబ్ధ్వా పునర్జన్మ మ్రియతే చ పునః పునః ॥92॥**

తమో గుణంవల్ల ప్రాణి తిర్యగ్జన్మ పొందుతాడు. అజ్ఞానియైనవాడు వాసనలను అనుభవిస్తూ, మాతృగర్భంలో ప్రవేశించి, మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటాడు. మళ్లీ చనిపోతూ ఉంటాడు.

**ఏవం గత్వా హ్యసంఖ్యాతా యోనీస్తాః కర్మభూరపి ।**
**మానుష్యం దుర్లభం లబ్ధ్వా కదాచిద్దైవయోగతః ॥93॥**

**అనుగ్రహేణ మహతాం హరిం జ్ఞాత్వా విముచ్యతే ।**
**రోగగ్రాహం మోహజాలమపారం భవసాగరమ్ ॥94॥**

**న పశ్యామి తితీర్షోరన్యద్ రామస్మరణం వినా ।**

ఈ విధంగా చరిస్తూ లెక్కలేనన్ని జన్మలెన్నో పొందుతాడు. ఒకానొకప్పుడు దైవయోగంవల్ల. కర్మభూమియందు దుర్లభమైన మనుజజన్మ పొంది పెద్దల అనుగ్రహంతో హరిని తెలుసుకొని విముక్తుడవుతాడు. సంసారమనే సాగరం రోగమనే మొసళ్లతో కూడి ఉంటుంది. మోహమనే వలలో చిక్కుకొంటుంది.(నిండిఉంటుంది.) దానికి తీరం కానరాదు. దానిని తరించడానికి రామస్మరణం మినహాయించి వేరే మార్గం కానరాదు.

**నవనీతం యథా దధ్నో జ్యోతిః కాష్ఠాదపి క్వచిత్ ॥95॥**

**మంథనైః సాధనైరేవం పరం జ్ఞాత్వా సుఖీ భవేత్ ।**

చిలకగా వెన్న పుట్టినట్టు, రాపాడించగా నిప్పు పుట్టినట్టు సాధనాలతో మథించి, పరమును తెలుసుకొని ఆనందిస్తాడు.

**ఆత్మా నిత్యోఽవ్యయః సత్యః సర్వగః సర్వభృన్మహాన్ ॥96॥**

**అప్రమేయః స్వయంజ్యోతి రగ్రాహ్యో మనసాపి యః ।**
**సచ్చిదానందరూపోఽసౌ సర్వప్రాణి హృదిస్థితః ॥97॥**

ఆత్మ నిత్యుడు, అవ్యయుడు, సత్యుడు, సర్వగుడు, సర్వాన్నీ భరించువాడు. గొప్పవాడు. ప్రమేయుడు స్వయంగా జ్యోతిస్స్వరూపమై ప్రకాశిస్తాడు. మనస్సుచేతకూడ గ్రహించుటకు వీలైనవాడు కాదు. సమస్తప్రాణుల హృదయాలలో ఉంటాడు. సత్యం, జ్ఞానం, ఆనందం రూపుదాల్చినవాడు.(నపుంసక లింగంలో కూడ చెప్పవచ్చు)

**వినశ్యత్స్వపి భావేషు న వినశ్యతి కర్హిచిత్ ।**
**ఆకాశః సర్వభూతేషు స్థితస్తేజో జలే తథా ॥98॥**

సమస్త పదార్థజాలం నశించినప్పటికి, తాను ఎన్నటికి నశించదు. సర్వభూతాలయందు ఆకాశం, అగ్ని, జలంలో ఉన్నట్లు ఉంటుంది.

**ఆత్మా సర్వత్ర నిర్లేపః పార్థివేషు యథానిలః ।**

భూ సంబంధ పదార్థాలలో గాలి ఉన్నప్పటికి, కలిసి లేనట్లు కనిపించినట్లుగా ఆత్మ అంతటను ఉన్నప్పటికి, కలిసి లేనట్లుగా ఉంటుంది.

**భక్తానుకంపీ భగవాన్ సాధూనాం రక్షణాయ చ ॥99॥**

**ఆవిర్భవతి లోకేషు గుణీవాజ్ఞైః ప్రతీయతే ।**
**ఏవం వివేకతయా యో బుద్ధ్యా సంశీలయేద్ధృది ॥100॥**

**భక్తియోగేన సంతుష్ట ఆత్మానం దర్శయేదజః ।**
**తతః కృతార్థో భవతి సదా సర్వత్ర నిఃస్పృహః ॥101॥**

భక్తులపట్ల దయ కలిగిన భగవంతుడు సత్పురుషుల రక్షణం కోసమై ఆయా లోకాల(జనుల)యందు ఆవిర్భవిస్తాడు. గుణాతీతుడయినప్పటికి, గుణసహితుడై ఉన్నట్లుగా అజ్ఞులకు కనిపిస్తాడు. ఈ విధమైన వివేకంతో కూడుకొనిన బుద్ధితో హృదయమందు ఎవడు ఆత్మజ్ఞానం కలిగి ఉంటాడో, అతని స్వరూపాన్ని యోగసంధానభక్తికి సంతుష్టుడై భగవంతుడు (అజుడయినా) అతనికి తన సందర్శనం ఇస్తాడు. అందువల్ల అతడు కృతార్థుడవుతాడు. అతడు అంతటా ఏ సంసక్తి లేకుండా ఉంటాడు.

**అతోఽహంకారముత్సృజ్య సానుబంధే కలేవరే ।**
**చరేదసంగో లోకేషు స్వప్నప్రాయేషు నిర్మమః ॥102॥**

అతడు బంధనయుక్తమైన ఈ శరీరంతోనే ఉంటూ, అహంకారాన్ని (అహంకర్తృత్వాన్ని) పూర్తిగావదలి, జనులయందు సంగంలేకుండా చరిస్తాడు. స్వప్నప్రాయమైన జీవితంపై మమతాసక్తి లేకుండా ఉంటాడు.

**క్వ స్వప్నే నియతం ధైర్యమింద్రజాలే క్వ సత్యతా ।**
**క్వ నిత్యతా శరన్మేఘే క్వ వా సత్యం కలేవరే ॥103॥**

కలలో కనబడే ధైర్యం స్థిరంగా ఉంటుందా? ఇంద్రజాలంలో(కనికట్టులో) నిజమెంత? శరత్కాలమేఘంలో సత్యమెంత? శరీరంలో శాశ్వతత్వమెంత?

**అవిద్యా కర్మజనితం దృశ్యమానం చరాచరమ్ ।**
**జ్ఞాత్వాచారవశీ యోగీ తతఃసిద్ధిమవాప్స్యసి ॥104॥**

ఈ కనబడే చరాచరజగత్తు అంతా అవిద్యా కర్మజనితమే (అజ్ఞానం కలిగించే కర్మవల్ల సంభవించిందే). ఇది తెలిసికొని నీవు ఇంద్రియనిగ్రహంతో చరిస్తూ యోగివి కమ్ము. అందువల్ల నీవు సిద్ధిని పొందగలవు.

**ఇత్యుక్త్వా తే గతాః సర్వే సాధవో దీనవత్సలాః ।**
**సోఽహం తదుక్తమార్గేణ తథైవాచర మన్వహమ్ ॥105॥**

ఈ విధంగా దీనులపై వాత్సల్యం కల్గిన ఆ సాధువులందరూ వెళ్లిపోయారు. నేనుకూడ ఆ తరువాత వారు చెప్పిన మార్గంలో ఆ విధంగానే ప్రతిదినం సాధన చేశాను.

**తతోఽచిరేణాత్మనీదం దృష్టవానహ మద్భుతమ్ ।**
**జ్యోతిర్మయం సదానందం శరచ్ఛీతాంశునిర్మలమ్ ॥106॥**

పిమ్మట తక్కువకాలంలోనే నేను నా అంతఃకరణలోనే శరత్కాలంలోని చంద్రునివలె నిర్మలమైన కాంతిగల్గి, ఎల్లప్పుడు ఆనందాన్ని ఇచ్చే ఒక ఆశ్చర్యకరదృశ్యాన్ని చూడగలిగాను.

**నిషిచ్య సుఖసందోహైర్మాం కృత్వాధిక సస్పృహమ్ ।**
**అంతర్హితం మహత్తేజో యథా సౌదామినీ దివి ॥107॥**

**భక్త్యా తదేవ మనసి భావయన్నహమద్భుతమ్ ।**
**కాలే కలేవరం త్యక్త్వా గతవాన్ హరిమవ్యయమ్ ॥108॥**

**తస్యేచ్ఛయా పునర్బ్రహన్ బ్రహ్మణో మేఽభవజ్జనిః ।**

సంతోషపుంజాలచే నన్ను తడిపి, నాకు మిక్కిలి స్పృహను కలిగించి ఆ మహాతేజం ఆకాశంలోని మెరుపులా మాయమైపోయింది. అప్పటినుండి నేను భక్తితో ఆ మహాద్భుత తేజఃపుంజాన్నే మనస్సులో ధ్యానిస్తూ, కాలం సమీపించగా శరీరంవిడిచి, అవ్యయమైన విష్ణుపదాన్ని చేరుకొన్నాను. ఆ హరిసంకల్పంతోనే బ్రాహ్మణోత్తమా! నాకు తిరిగి బ్రహ్మద్వారా జన్మ తటస్థించింది.

**అనుగ్రహా ద్భగవత స్త్రిషు లోకేషు నిః స్పృహః ॥109॥**

**ఆపీడయన్ ముహుర్వీణాం గాయమానశ్చరామ్యహమ్ ।**
**ఇత్యుక్త్వా మే స్వానుభవం యయౌ యాదృచ్ఛికో మునిః ॥110॥**

ఆ భగవంతుని కృపవల్లనే ఇతరత్ర అనాసక్తుడనై మూడు లోకాలయందు. మాటి మాటికి వీణ వాయించుకొంటూ, విష్ణుసంకీర్తనలు పాడుకొంటూ నేను తిరుగుతున్నాను అనిపలికి తన అనుభవాన్ని నాకు అందించి, నారదుడు యథేచ్ఛగా వెళ్లిపోయాడు.

**మమాపి పరమాశ్చర్యం సంతోషశ్చ మహానభూత్ ।**
**అతస్తే సాధుసంగత్యా భక్త్యా చ పరమాత్మనః ॥111॥**

**విశుద్ధం నిర్మలం శాంతం మనో నిర్వృతిమేష్యతి ।**
**అనేకజన్మ జనితం పాతకం సాధుసంగమే ॥112॥**

**క్షిప్రం నశ్యతి ధర్మజ్ఞ జలానాం శరదో యథా ।**

నాకుకూడ మిక్కిలి ఆశ్చర్యం, గొప్పసంతోషం కలిగింది వైశ్యోత్తమా! అందువల్ల నీకు సాధుసంగతి వల్ల, పరమాత్మ యందలి భక్తివల్ల మనస్సు పరిశుద్ధమై, నిర్మలమై, ప్రశాంతమై నిస్పృహను పొందింది. ధర్మం తెలిసినవాడా! పెక్కు పుట్టుకలనుండి సంభవించిన పాపాలన్నీ సత్పురుషుల సాంగత్యం వల్ల శరత్కాలంలో నీటిలోని మురికి పోయినట్లుగా (వర్షాలు కడముట్టినట్లు) నశించిపోతాయి.

**వైశ్య ఉవాచ** - వైశ్యుడు పలికాడు.

**పీత్వా తే వాక్యపీయూషం స్వాంతం మే శాంతిమగమత్ ॥113॥**

**సర్వతీర్థఫలం మేఽద్య సంజాతం తవ దర్శనాత్ ।**
**ఇతి శ్రుత్వా వచస్తస్య ప్రోవాచ ఋషిసత్తమః ॥114॥**

మునీంద్రా! మీవచనామృతాన్ని పానం చేయుటవల్ల నా అంతఃకరణం ప్రశాంతతను పొందింది మీ సందర్శనంవల్ల నాకు ఇప్పుడు సర్వతీర్థసేవాఫలం లభించింది. అని వైశ్యులు పలుకగా అతని మాటలు విని పలికాడు. అతని మాటలువిని ఋషిసత్తముడు ఇలా వచించాడు.

**లోమశ ఉవాచ** – లోమశుడు పలికాడు.

**హితాయ తవ రాజేంద్ర త్రివర్గఫలమిచ్ఛతః ।**
**యత్త్వయా సుకృతం భూరి వృషోత్సర్గం వినా కృతమ్ ॥115॥**

రాజేంద్రా! వృషోత్సర్గం చేయకపోయకపోతే, నీవు చేసిన మేలువల్ల, నీవు ఆచరించిన త్రివర్గఫలంవల్ల, నీవు చేసిన గొప్ప పుణ్యంవల్ల నీకు చేకూరిన ఈ గొప్పతనం

**మన్యేఽకించిత్కరం సర్వం నీహారసలిలం యథా ।**
**వృషోత్సర్గసమం కించిత్ సాధనం న మహీతలే ॥116॥**

అంతా మంచు బిందువువలె దండగే అని భావిస్తున్నాను. కావున భూమండలమునందు, వృషోత్సర్గముతో సమానమైన సాధనము మరోది లేదు.

**అనాయాసేన గచ్ఛంతి గతిం తే పుణ్యకర్మణామ్ ।**
**వృషోత్సర్గః కృతో యేన అశ్వమేధస్య యాజకః ॥117॥**

ఏ కష్టంలేకుండా అన్ని పుణ్యకర్మలు చేసినవారి సద్గతిని వారు పొందుతారు. వృషోత్సర్గం చేసినవాడు, అశ్వమేధ యాజకుడవుతాడు.

**ఉభౌ సమౌ మయా దృష్టౌ దివ్యౌ తౌ శక్రసన్నిభౌ ।**
**అతస్త్వం పుష్కరం గత్వా వృషోత్సర్గం విధాయ చ ॥118॥**

**తతో యాహి గృహం సాధో యేన సర్వం కృతం భవేత్ ।**

నా దృష్టిలో వారు ఉభయులూ సమానులు. వారు దేవతలే, ఇంద్రునితో సమానులు. అందువల్ల నీవు పుష్కరక్షేత్రం వెళ్లి వృషోత్సర్గవిధిని సుసంపన్నంచేసి అక్కడనుండి సాధూ ! ఇంటికివెళ్లు. అదిచేస్తే అంతా చేసినట్లే అవుతుంది.

**విపశ్చిదువాచ** – విపశ్చిత్తు పలికాడు (తన రాజు కథ చెబుతున్నాడు)

**తతః స పునరాగత్య కార్తిక్యాం పుష్కరే వరే ॥119॥**

**వరాహరూపీ భగవాన్ యత్రాస్తే యజ్ఞపూరకః ।**
**చకార విధివత్ సర్వం యదుక్తం ఋషిసత్తమైః ॥120॥**

అన్ని యజ్ఞాలను సంపూర్ణంచేసే భగవంతుడైన వరాహమూర్తి వెలిసిన ఆ శ్రేష్ఠమైన పుష్కరానికి కార్తిక మాసంలో(పున్నమినాడు), ఆ వైశ్యుడు తిరిగివచ్చి ఋషిశ్రేష్ఠులచే చెప్పబడిన విధానంలో విధిపూర్వకంగా అంతా నిర్వహించాడు.

**గతాని బహుతీర్థాని తతో లోమశ సంగతిః ।**
**తతోఽధికతరం జాతం పుణ్యం నీలవివాహజమ్ ॥121॥**

**స భుక్త్వా విషయాన్ దివ్యాన్ విమానవరమాశ్రితః ।**
**తేన రాజకులే జన్మ వీరసేనస్య ధర్మతః ॥122॥**

అనంతరం లోమశ మహర్షి ఆదేశం మేరకు, ఆయన పెక్కుతీర్థాలను దర్శించాడు. నీలవృషభానికి వివాహంచేశాడు. అందువల్ల మిక్కిలి ఎక్కువగా పుణ్యంవచ్చింది. చివరకు మరణానంతరం శ్రేష్ఠమైన విమానాన్ని అధిరోహించి, అతడు దివ్యభోగాలు అనుభవించి, ధర్మాత్ముడైన వీరసేనుని రాజవంశంలో జన్మించాడు.

**వీరపంచాననాఖ్యాశ్చతుర్వర్గైక సాధకమ్ ।**
**ప్రకుర్వతో వృషోత్సర్గం తత్ర యే పరిచారకాః ॥123॥**

**దివ్యరూపాఽభవన్ స్పృష్ట్వా గోపుచ్ఛోదక శీకరైః ।**
**సురూపాః పుష్టవపుషః పశ్యంతో దూరసంస్థితాః ॥124॥**

వీరసింహుడనే పేరును పొందాడు. నాలుగు విధాల పురుషార్థవర్గాలను ముఖ్యంగా సాధించే వృషోత్సర్గవిధిని లెస్సగా ఆచరించాడు. అక్కడి సేవకులు దూరంగాఉండి ఆ ఉత్సవాన్ని చూచి దివ్యరూపాలను పొందారు. ఆవుతోకయొక్క నీటిబిందువులను తాకి మంచి రూపం శరీరసౌష్ఠవం పొందారు.

**తతో దూరతరా యే చ దృశ్యంతే మలినా జనాః ।**
**దుర్భగా మలినా రూక్షాః కృశా విగతవాససః ॥125॥**

**వృషయజ్ఞమపశ్యంతో యే చాసూయాం ప్రకుర్వతే ।**
**సర్వం నివేదితం రాజ్ఞశ్చరితం పూర్వజన్మనః ॥126॥**

దానికి మిక్కిలి దూరంగా ఉన్న జనులు మలినులై కనిపించారు. వృషయజ్ఞాన్ని చూడక అసూయను ప్రకటించేవారు దుర్భగులు, మలినులు, తీక్ష్ణరూపులు, కృశాంగులు, వస్త్రహీనులు అవుతారు. రాజుయొక్క పూర్వజన్మ చరిత్ర అంతయూ నీకు నివేదింపబడింది.

**ధర్మ్యం విచిత్రమాఖ్యానం శ్రుతం మే యత్ పరాశరాత్ ।**
**అతస్త్వం స్వగృహం గచ్ఛ కృపాం కృత్వా మమోపరి ॥127॥**

ధర్మంతో కూడుకొన్న ఈ ఆశ్చర్యకరమైన గాథను నేను పరాశర మునిద్వారా వినడం జరిగింది. అందువల్ల నీవు నాపై దయయుంచి నీ ఇంటికి వెళ్లవలసింది.

**శ్రుత్వా విపశ్చిద్వాక్యం స విస్మయం పరమంగతః ।**
**గృహం జగామ విప్రోఽసౌ ప్రాపితో రాజసేవకైః ॥128॥**

విపశ్చిత్తు యొక్క వచనాలను విని, అతడు మిక్కిలి ఆశ్చర్యం పొందాడు. రాజసేవకులు వెంటరాగా ఆ విప్రుడు తన ఇంటికి తిరిగి వెళ్లాడు.

**వసిష్ఠ ఉవాచ** – వసిష్ఠుడు వచించాడు.

**తస్మాద్రాజన్ వృషోత్సర్గం వరిష్ఠం సర్వకర్మణామ్ ।**
**సమాచర విధానేన యది భీతో యమాదపి ॥129॥**

కాబట్టి రాజా! సమస్త కర్మలలోను వృషోత్సర్జనవిధి మిక్కిలి గొప్ప. యమునివల్ల భయం పొందినవాడవయితే దానిని శాస్త్రవిధితో ఆచరించు.

**వృషోత్సర్గసమం కించిత్ సాధనం న దివః పరమ్ ।**
**మయా ధర్మ రహస్యం తే కథితం రాజసత్తమ ॥130॥**

పరమమైన స్వర్గపదానికి వెళ్లాలంటే, వృషోత్సర్గంతో సమానమైన సాధనం మరొక్కటిలేదు. రాజోత్తమా! నాచే ధర్మం రహస్యం అంతా నీకు వినిపింపబడింది.

**పతిపుత్రవతీ నారీ భర్తురగ్రే మృతా యది ।**
**వృషోత్సర్గం న కుర్వీత గాం దద్యాచ్చ పయస్వినీమ్ ॥131॥**

భర్త, పుత్రులు (సంతానం) కల్గిన స్త్రీ భర్త కన్న ముందుగా మరణిస్తే, వృషోత్సర్గం చేయరాదు. పాలు ఇచ్చే ఆవును మాత్రమే దానం చేయాలి.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**శ్రుత్వా వాక్యం వసిష్ఠస్య రాజా మధుపురీం గతః ।**
**చకార విధివత్ సర్వం వృషోత్సర్గమహం ఖగ ॥132॥**

**గృహం గత్వా స ఆత్మానం కృతకృత్యమమన్యత ।**
**కాలేన నిధనం ప్రాప్తో నీతో వైవస్వతానుగైః ॥133॥**

గరుడా! వసిష్ఠుని వచనాలను విని రాజైన వీరవాహనుడు మధుపురికి మరలివచ్చి, శాస్త్రవిధిచే వృషోత్సర్జన విధినంతా నేను చెప్పిన రీతిలో చేశాడు. అతడు ఇంటికి వెళ్లి తనను కృతకృత్యునిగా (ధన్యునిగా) భావించాడు. కాలగమనంలో మరణం పొంది యముని అనుచరులచే తీసుకొనిపోబడినాడు.

**స కాలనగరం హిత్వా గతో దూరతరం పథి ।**
**శ్రాద్ధదేవపురం కుత్రేత్యేవం దూతానపృచ్ఛత ॥134॥**

అతడు శరీరం విడిచి కాలనగరం వైపు చాలాదూరం వెడుతూ దారిలో శ్రాద్ధదేవుని నగరం(కనిపించుటలేదు) అది ఎక్కడ? అని దూతలను అడిగాడు.

**పాపినో యత్ర పాత్యంతే యామ్యే పాపవిశుద్ధయే ।**
**యత్ర దేవః స ధర్మాత్మా ధర్మాధర్మ విచేతనః ॥135॥**

**గతం పాపపురం తత్తు న ద్రష్టవ్యం భవాదృశైః ।**
**అగ్రే దృష్ట్వా ధర్మరాజమూచుస్తే పరమాదరాత్ ॥136॥**

అది పాపాత్ముల పాపవిశుద్ధి కోసమై నరకంలో పడవేసేచోటని, అది ధర్మాధర్మ విచక్షణుడైన యమధర్మరాజు నిలిచి యుండేచోటని, అది పాపపురానికి వెళ్లేవారి చోటని, అది నీ వంటివారు చూసే చోటు కాదని చెప్పి, ధర్మరాజునెదురుగా చూపించి మిక్కిలి వినయగౌరవంతో పలికారు.

**దివ్యరూపస్తదా దేవో దేవ గంధర్వ సంయుతః ।**
**ఆత్మానం దర్శయామాస తస్య రాజ్ఞో మహాత్మనః ॥137॥**

అప్పుడు ఆ దేవుడు దివ్యరూపధారియై, దేవగంధర్వపరివేష్టితుడై, మహాత్ముడైన ఆ రాజుకు తనను దర్శింపజేశాడు.(దర్శనమిచ్చాడు)

**ప్రణమ్య దండవద్రాజా కృతాంజలిః పురః స్థితః ।**
**తుష్టావ బహుధా దేవం హర్షపూరితమానసః ॥138॥**

**ధర్మరాజోఽపి రాజానం ప్రశస్యేదమువాచ హ ।**
**నీయతాం దేవలోకాయ యత్ర భోగాః సుపుష్కలాః ॥139॥**

రాజు వెంటనే సాష్టాంగ దండప్రణామం చేసి, దోయిలొగ్గి, సంతోషం నిండిన మనస్సుతో తనఎదుట నున్న దేవుని పెక్కురీతులుగా స్తోత్రం చేశాడు. యమధర్మరాజు కూడ రాజును ప్రశంసించి "ఎక్కడయితే భోగాలు మిక్కిలి పుష్కలంగా ఉంటాయో, ఆ దేవలోకానికి ఈతడు తీసికొనివెళ్లబడుగాక!" అని శాసించాడు.

**తద్వీరవాహనః శ్రుత్వా పప్రచ్ఛ సమవర్తినమ్ ।**
**న జానే కేన పుణ్యేన స్వర్గం నయసి మాం విభో ॥140॥**

వీరవాహనుడు ఆ వచనాలను విని సమవర్తిని ఇలా అడిగాడు. "ప్రభూ! ఏ పుణ్యం వలన నన్ను స్వర్గానికి తీసుకొని వెళ్లమన్నావో తెలియలేకున్నాను."

**ధర్మరాజ ఉవాచ** - ధర్మరాజు బదులిచ్చాడు.

**త్వయా కృతాని పుణ్యాని దానం యజ్ఞాః సవిస్తరాః ।**
**మథురాయాం వృషోత్సర్గో వసిష్ఠ వచనాత్కిల ॥141॥**

నీ ద్వారా ఎన్నోపుణ్యాలు చేయబడినాయి. మిక్కిలి విస్తృతంగా దానాలు, యజ్ఞాలు, చేశావు. వసిష్ఠుని ఆదేశానుసారం మథురలో వృషాన్ని విడిచి పెట్టావు.

**ధర్మః స్వల్పోఽపి నృపతే యది సమ్యగుపాసితః ।**
**ద్విజదేవ ప్రసాదేన స యాతి బహువిస్తరమ్ ॥142॥**

నృపతీ! ధర్మం కొద్దిపాటిదైనా, అది సమ్యగ్దృష్టితో నిర్వహింపబడితే, ద్విజుల కృపవల్ల, దేవతల అనుగ్రహంవల్ల అది మిక్కిలి విస్తృతమై పరిఢవిల్లుతుంది.

**ఇత్యుక్త్వా యమునాభ్రాతా క్షణాదంతర్ధిమాయయౌ ।**
**వీరబాహుర్దివం గత్వా దేవైః సహ ముమోద హ ॥143॥**

అని పలికి యమునభ్రాతయైన యముడు ఆ క్షణంలోనే అంతర్ధానం అయ్యాడు. వీరబాహువు కూడ స్వర్గానికి వెళ్లి దేవతలతో కలసి సుఖించాడు.

**మయా తే కథితం పక్షిన్ వృషయజ్ఞః సువిస్తరః ।**
**ప్రాణినాం కర్మనిర్హారం శ్రుత్వా పాపైః ప్రముచ్యతే ॥144॥**

గరుడా! నేను నీకు మిక్కిలి విస్తారంగా వృషయజ్ఞం గురించి వివరించాను. ప్రాణుల పాపకర్మలను తొలగించే దీనిని వింటే, పాపాల నుంచి విముక్తుడవుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే వృషోత్సర్గ మాహాత్మ్య నిరూపణం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో వృషోత్సర్గ (ఆబోతును వదలటం) మాహాత్మ్యం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

## పంచప్రేతోపాఖ్యానమ్ - అయిదుగురు ప్రేతల కథ

**గరుడ ఉవాచ** - గరుడుడు పలికాడు.

**శ్రుతం మే మహదాఖ్యానం వృషోత్సర్గఫలం హరే ।**
**పునరన్యాం కథాం బ్రూహి యత్ర తే మహిమాద్భుతః ॥1॥**

హరీ! వృషోత్సర్గఫలితమనే గొప్ప ఇతిహాసాన్ని నేను విన్నాను. మళ్లీ ఆశ్చర్యపరచే మహిమ గల, మరో కథను నీవు చెప్పవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు పలికాడు.

**అహం తే కథయామ్యద్య సంవాదం పరమాద్భుతమ్ ।**
**సంతప్తకస్య ప్రేతైస్తద్రూపజ్ఞాపనాయ వై ॥2॥**

సంతప్తకునకు, ప్రేతలకు జరిగిన వారి రూపాన్ని గురించి తెలియజేస్తూ మిక్కిలి ఆశ్చర్యాన్ని అందించే పరస్పర సంవాదాన్ని నేను నీకు చెబుతాను.

**విప్రః సంతప్తకః కశ్చిత్ తపసా దగ్ధకిల్బిషః ।**
**సంసారాసారతాం జ్ఞాత్వారణ్యేష్వేవ చచార హ ॥3॥**

పూర్వం సంతప్తకుడనే విప్రుడు ఒకడు ఉండేవాడు. అతడు తపోబలంవల్ల పాపాలు లేనివాడయ్యాడు. సంసారంలో సారంలేదని తెలుసుకొని, అతడు అడవులలో సంచరించసాగాడు.

**వైఖానస మునివ్రాతైః ప్రణిపాత కృతేక్షణః ।**
**స కదాచిత్ తీర్థయాత్రాముద్దిశ్య స్మాటతి ద్విజః ॥4॥**

వైఖానసమునిబృందాల వారికి వినమ్రుడై నమస్కరిస్తూ, వారి కృపావలోకనాలకు పాత్రుడయ్యాడు. ఆ ద్విజుడు ఒకనాడు తీర్థయాత్రకు బయలుదేరాడు.

**ప్రత్యాకృష్టేంద్రియత్వాచ్చ బహిర్వృత్తి నిరోధకః ।**
**సంస్కారమాత్ర గమనో మార్గభ్రష్టో బభూవ హ ॥5॥**

అతడు బాహ్యచిత్తవృత్తులను అదుపులో పెట్టుకొని, దానిద్వారా ఇంద్రియాలపై విజయం సాధించి, సంస్కారవంతమైన దారిలోనే పయనిస్తూ, దారి తప్పిపోయాడు.

**చలన్నేవం స్నాన కాలే మధ్యాహ్నేఽథాభిలాషుకః ।**
**జలస్యోన్మీల్య నయనే దిశః సర్వా న్యమీలయత్ ॥6॥**

ఈ విధంగా ఇటూ అటూ తిరుగుతూ, మధ్యాహ్నం కాగా, స్నానకాలం సమీపించగా, నీటికోసమై కోరిక జనించగా, కన్నులు మూసుకొని దిక్కులన్నీ గాలిస్తూ దృష్టిని సారించాడు.

**స దదర్శ తదా గుల్మై ర్వీరుద్ వృక్షశతైశ్చితమ్ ।**
**త్వక్సారైః శాఖిశాఖాభిః సంకులం గహనం వనమ్ ॥7॥**

అతడు అప్పుడు పొదలతోను, తీగలతోను, వందలకొలది చెట్లతోను, గట్టిబెరడులు కలిగిన కొమ్మలతోను, మహావృక్షాలతోను వ్యాపించి, ప్రవేశింప శక్యంకాని ఒక మహారణ్యాన్ని చూశాడు.

**తత్ర తాలాస్తమాలాశ్చ ప్రియాలాః పనసాస్తథా ।**
**శ్రీపర్ణీ శాలశాఖోట స్యందనా స్తిందుకాస్తథా ॥8॥**

**సర్జార్జునామ్రాతకాశ్చ శ్లేష్మాతకాభిభీతకౌ ।**
**పిచుమర్దీశ్చిఞ్చిణీ చ కర్కంధూ కర్ణికారకౌః ॥9॥**

**ఏతే చాన్యే చ బహవో వృక్షాస్తేషు న దృశ్యతే ।**
**పక్షిణామపి వై పన్థా మనుష్యస్య కుతః పునః ॥10॥**

అక్కడ తాలవృక్షాలు, తమాలవక్షాలు (చీకటిమ్రాను), ప్రియాలవృక్షాలు(మోరటి), పనసచెట్లు, శ్రీపర్ణి వృక్షాలు (కూరనెల్లి), శాలవృక్షాలు, శాఖోటవృక్షాలు, స్యందనవృక్షాలు(నెమ్మిమ్రాను), తిందుకవృక్షాలు(నల్లచేవ), సర్జ వృక్షాలు (మద్దిచెట్లు), అర్జునవృక్షాలు(ఏరుమద్ది), ఆమ్రాతకాలు(అంబాళపు చెట్లు), శ్లేష్మాతకాలు(విరిగిచెట్లు), అభిభీతకాలు(మిక్కిలి వెఱపు పుట్టించేవి) పిచుమర్ది(వేప), చించిణి(చింత), కర్కంధువు(రేగుచెట్లు), కర్ణికారాలు (కొండగోగుచెట్లు) ఇవే కాకుండా ఎన్నో చెట్లు చాలా ఉన్నాయి. వాటియందు పక్షులకు కూడ దారి కనబడటంలేదు. ఇక మనుష్యుల సంగతి చెప్పనేల?

**తస్మిన్వనే మహాఘోరే సింహవ్యాఘ్ర సమాకులే ।**
**తరక్షు గవయై ర్ఋక్షై ర్మహిషైశ్చ నిషేవితే ॥11॥**

**కుంజరై రురుభి ర్నాగై ర్మర్కటైశ్చ తథా మృగైః ।**
**శ్వాపదైశ్చ తథాచాన్యైః పిశాచై రాక్షసైర్వృతే ॥12॥**

సింహాలతోను, పెద్దపులులతోను వ్యాపించబడినదై, సివంగులు, గవయమృగాలు, ఎలుగుబంట్లు, ఎనుబోతులతో కూడుకొన్నదై, ఏనుగులతోను, రురుమృగాలతోను, పాములతోను, కోతులతోను, నానావిధ మృగాలతోను, శ్వాపదాలతోను సంకులమై, ఇంకా పిశాచాలతోను, రాక్షసులతోను సంయుక్తమై ఆ అరణ్యం మహా భయంకరమై ఉంది.

**సంతప్తకో ద్విజః కించిద్భయ సంత్రస్తమానసః ।**
**కాందిశీకః సమభవద్ యద్భవిష్యో యయౌ పునః ॥13॥**

సంతప్తకుడనే ఆ ద్విజుడు కొంచెం భయంతో కంపించిన మనస్సుతో పారిపోబోయాడు. అయినా కానున్నది కాకమానదని తిరిగి ముందుకు వెళ్లాడు.

**ఝుంకారేషు చ ఝిల్లీనాం ఘూకానాం ఘూత్కృతేష్వపి ।**
**దత్తకర్ణః కునీలాంగ శ్చచాల పదపంచకమ్ ॥14॥**

ఒకవైపు కీచురాళ్ల అరుపులు, ఇంకొకవైపు గుడ్లగూబల ఘూత్కారాలు, విని అతని శరీరం నల్లబడి మొద్దుబారిపోయింది. అయిదు అడుగులు ఎలాగో వేశాడు.

**స తత్ర వటవృక్షాగ్రే స్నాయుబద్ధం శవం తథా ।**
**దదర్శ తద్భుజశ్చైవ పంచప్రేతాన్ సుదారుణామ్ (న్) ॥15॥**

**శిరాస్థి చర్మశేషాంగాన్ పృష్ఠలగ్నోదరాన్ ఖగ ।**
**త్యక్తాన్నాసికయా నేత్రకూపపాతభయాదివ ॥16॥**

అతడు అక్కడ మఱ్ఱిచెట్టుపై నరాలచే కట్టబడి వ్రేలాడుతున్న శవాన్ని చూశాడు. దానిని పీక్కుతింటున్న చాలా భయంకరంగా ఉండే అయిదు ప్రేతాత్మలను వీక్షించాడు. ఖగమా ! శిరస్సు, ఎముకలు, అన్ని అవయవాలు చర్మంతో కప్పబడి ఉన్నాయి. పృష్ఠభాగం, నడుము, పొట్ట కూడ అలాగే ఉన్నాయి. కళ్లు అనే గోతులలో పడిపోతాననే భయంచేత కాబోలు ముక్కు అసలే కనబడడంలేదు.

**సూచీ క్రకచక వ్రాత ఘాతపాతితకీకసాన్ ।**
**వసాక్తనవ మస్తిష్క స్వాద నిత్యమహోత్సవాన్ ॥17॥**

**రణత్కోటి మహాదంష్ట్రా నస్థి గ్రంథ్యవఘట్టితాన్ ।**
**తాన్ దృష్ట్వా త్రస్తహృదయో గతి మాకుంచ్య సంస్థితః ॥18॥**

సూదులచేత, రంపాల సమూలచేత చీల్చబడి, చితకకొట్టబడి, పడిపోతున్న ఎముకలతో, వసతో తడిసిన మెదడునందలి మాంసాన్నితింటూ, పిచ్చి ఆనందంతో ఎగిరి గంతులువేస్తూ, ఉత్సవం జరుపుకుంటూ పటపటలాడిస్తున్న కోరలతో ఎముకలను కటకటలాడిస్తూ తింటున్న ఆ ప్రేతలను చూచి గుండెలు అవిసిపోగా, నడక చాలించి మ్రాన్పడిపోయాడు.

**తే విలోక్యాగతం విప్రమటవీం జనవర్జితామ్ ।**
**అహం పూర్వమహం పూర్వం యామీత్యుక్త్వా ప్రదుద్రువుః ॥19॥**

నిర్జనారణ్యంలో వస్తున్న ఆ విప్రునిచూచి వారు నేను ముందు తినడానికి వెడతాను. కాదు నేను ముందు వెడతానని వాదులాడుకొంటూ పరుగు పెట్టుకొంటూ వచ్చారు.

**తేషు ద్వౌ ద్వావగృహ్ణీతామస్య హస్తావథాపరే ।**
**ద్వౌ ద్వౌ పాదావగృహ్ణీతాం మూర్ధానం పంచమోఽగ్రహీత్ ॥20॥**

వారిలో ఇద్దరు ఇద్దరు చొప్పున ఆ విప్రుని చేతులు పట్టుకొన్నారు. మరో ఇద్దరు అతని పాదాలు పట్టుకొన్నారు. అయిదోవాడు తలను పట్టుకొన్నాడు.

**స్వజాత్యుచిత వాక్యేన స్ఫుటవర్ణవతాబ్రువన్ ।**
**అహం భక్షామ్యహం భక్షామీతి కర్షణ తత్పరాః ॥21॥**

**సహసైవ సహైవాముం గృహీత్వా వ్యగమన్వియత్ ।**
**కియత్ స్థితం బటౌ మాంసం క్రియన్నేతి న్యభాలయన్ ॥22॥**

తమజాతికి తగిన వాక్యాలతో, స్పష్టంగా ఉండే అక్షరాలు కల్గిన భాషతో 'నేను భక్షిస్తాను. నేను మింగేస్తాను.' అని ఘర్షణ పడుతూ అతనిని పట్టుకొనడంలో ఆసక్తితో, వెంటనే కలసి ఆ శవాన్ని అలా ఉంచి విప్రుని కలిపి పట్టుకొని ఆకాశానికి ఎగిరిపోయారు. ఇంకా ఈ శవంలో ఎంత మాంసం ఉంది? దీనిని దండగ జేయడం ఎందుకని (దాన్నికూడ కాళ్లతో ఇరికించుకొన్నారు)

**తేఽపశ్యన్నిజ దంష్ట్రాయః పాటితాంత్రమిమం శవమ్ ।**
**అవతీర్య తతో వ్యోమ్నో గృహీత్వా చరణైః శవమ్ ॥23॥**

**స్వఖండిత శరీరన్తు పునర్వ్యోమ్నైవ చక్రముః ।**
**స నీయమానమాత్మానం విలోక్య వియతి ద్విజః ॥24॥**

వారు తమ ఇనుపదంతాలచే చీల్చబడిన ప్రేగులుకల ఆ శవాన్ని చూస్తూ, ఆకాశం నుండి ఒక్కసారిగా క్రిందకు దిగి, తాము చీల్చిన ఆ శవాన్ని తమ కాళ్లలో ఇరికించుకొని మళ్లీ ఆకాశానికి ఎగిరారు. అప్పుడా ద్విజుడు ఆకాశంలో తీసుకొని పోబడుతున్న తనను చూసుకొన్నాడు.

**జగామ మనసాం మాం స శరణం భయవిహ్వలః ।**
**నమశ్చక్రే చక్రధరం చేతసా చిన్మయం సమమ్ ॥25॥**

భయంతో వణకిపోతూ, మానసికంగా అతడు నన్ను శరణు అర్థించాడు. తన చిత్తంలో చిన్మయుడైన, సముడైన, చక్రధరుడనైన నాకు నమస్కారం చేశాడు.

**వక్రం నక్రం చక్రపాతేన దూరే కృత్వా హృత్వా తస్య దుఃఖం ముకుందః ।**
**మాతంగం యోఽమూముచన్నక్రవక్రాత్ పాశం సోఽసౌ కర్మణాం మే లునాతు ॥26॥**

వక్రబుద్ధి కల్గిన నక్రాన్ని తనచక్రాన్ని ప్రయోగించడం ద్వారా ఏనుగుయొక్క దుఃఖాన్ని హరించి, దూరం చేసి, మొసలి నోటినుండి, మాతంగాన్ని విడిపించిన పరమాత్మ ముకుందుడు నా కర్మపాశాన్ని ఛేదించు గాక!

**రుద్ధాఞ్ శుద్ధాన్ భూపతీ న్మాగధేన భీమేనైనం ఘాతయిత్వా మురారిః ।**
**నిర్బద్ధాన్యో భర్గయజ్ఞాయ ముక్తాన్ చక్రే మేఽసౌ కర్మపాశం లునాతు ॥27॥**

మహాత్ములైన భూపతులను జరాసంధుడు బంధించగా, అతనిని భీమునిచే వధింపజేసి, గొప్పదైన యజ్ఞం కోసమై వారిని విడిపింపజేసిన, ఆ పరమాత్మ మురారి నా కర్మపాశాన్ని ఛేదించు గాక!

**మనసైవేహ మామస్తౌత్ స్తూయమానోఽహముత్థితః ।**
**ఆగచ్ఛం సహసా తత్ర యత్ర ప్రేతైః స నీయతే ॥28॥**

అప్పుడు ఈ రీతిగా మనస్సుచేతనే నన్ను స్తుతించాడు. నేను ఈ విధంగా స్తుతింపబడి, ఒక్కసారిగా లేచి బయలుదేరాను. ఆ విప్రుడు ప్రేతలచే తీసుకొనిపోబడుతున్న చోటుకు నేను వెంటనే వెళ్ళాను.

**దృష్ట్వా తైర్నీయమానన్తు కౌతుకం మేఽభవత్ఖగ ।**
**పప్రచ్ఛ న కియంతం వై కాలం తాన్ పృష్ఠతోఽన్వగామ్ ॥29॥**

ఖగమా! వారిచే గొనిపోబడుతున్న విప్రుని చూచేసరికి, నాకు కుతూహలం ఒకటి కలిగింది. ఎంతసేపు తీసుకొని వెడతారో చూచి అడుగుదామని వారిని వెనుకగా వెంబడించాను.

**మమ సన్నిధి మాత్రేణ ద్విజాతిం తఞ్చ సర్పహన్ ।**
**తత్కాలం శిబికాసుప్తభూపాలసుఖమావిశత్ ॥30॥**

**మణిభద్రస్తతో మేరుం గచ్ఛన్ దృష్టో మయా పథి ।**
**నికోచ్యాక్షి స్వపార్శ్వం స నీతో వై యక్షరాణ్మయా ॥31॥**

సర్పహంతకుడవైన గరుత్మంతా! నా సన్నిధి మాత్రంచేతనే ఆ విప్రునికి ఆ సమయంలో ప్రేతల వీపుపై నున్నప్పటికి, శిబికయందు (పల్లకీ) పరున్న భూపాలుడు పొందే సుఖం కలిగింది. అంత మేరుపర్వతానికి వెడుతున్న మణిభద్రుడు దారిలో నా కంటబడ్డాడు. కళ్లను సంకోచించి నా ప్రక్కన వెడుతున్న ఆ యక్షరాజును నేను చూడడం జరిగింది.

**తమవోచం మహాయక్షం త్వం హి ప్రతిభటో భవ ।**
**ప్రేతాన్నాశయ తద్భూయః శవఞ్చ హర తద్గతమ్ ॥32॥**

ఆ మహాయక్షునితో నేను "నీవు వీరిని ఎదిరించు. ప్రేతలను నశింపజేయి అంతేకాక వారి వశమైయున్న శవాన్నికూడ విడిపించు(హరించు)" అని శాసించాను.

**ఇత్యుక్తః స మహాఘోరం కృత్వా రోషం సుదుఃసహమ్ ।**
**జగ్రాహ ప్రేతరూపం తత్ప్రేతానామపి దుఃఖదమ్ ॥33॥**

ఇలా నేను చెప్పగానే అతడు రోషం పొంది, ఆ ప్రేతలకూ మనస్తాపం(దుఃఖం)కలిగిస్తూ, మహా భయంకరమై, సహింప శక్యంకాని గొప్ప ప్రేతరూపాన్ని పొందాడు.

**స వివృత్య స్వకౌ బాహూ సృక్కిణీ పరిలేలిహన్ (సృక్విణీ) ।**
**భేదయన్నురువాతేన ప్రేతాంస్తాన్ సమ్ముఖో యయౌ ॥34॥**

అతడు తన బాహువులను సారించి, పెదవుల కొనలను నాకుతూ తాచుపామంత నాలుకతో, ఉచ్ఛ్వాస నిశ్వాస వాయువులతో వారిని కంపింపజేస్తూ ఆ ప్రేతలకు ఎదురుగా వెళ్లాడు.

**బాహుభ్యాం ద్వౌ ద్వౌ చ పద్భ్యాం మూర్ధ్నైకం చ సమాహరత్ ।**
**ప్రేతానథాపి సహసా జఘాన దృఢముష్టినా ॥35॥**

బాహువులతో ఇద్దరిని, పాదాలతో ఇద్దరిని, శిరస్సుతో ఒక్కనిని పట్టుకొన్నాడు. తన బలమైన పిడికిలిచే ఆ ప్రేతలను దబదబా బాదాడు.

**తే వివర్ణముఖాః సర్వే తం ద్విజఞ్చ శవం తథా ।**
**ఏకైకం హస్తపాదైశ్చ గృహీత్వా యుద్ధమారభన్ ॥36॥**

వారందరూ వెలవెల బోయిన ముఖాలతో ఆ ద్విజుని శవాన్ని ఒక్కొక్కరు చేతులతోను, కాళ్లతోను పట్టుకొని యుద్ధం ప్రారంభించారు.

**తే నఖైస్తలఘాతైశ్చ పాదఘాతై స్తథైవ చ ।**
**దంష్ట్రా ఘాతైశ్చ సర్వే తమేకం ప్రేతం వ్యదారయన్ ॥37॥**

వారు గోళ్లతోను, అరచేతి దెబ్బలతోను, పాదాల తన్నులుతోను, కోరలతో కొరికేస్తూ అందరూ ఆ ఒక్క ప్రేతాన్ని చీల్చిచెండాడసాగారు.

**తేషాం ప్రహారాన్ విఫలాన్ కృత్వా సంప్రతి తానథ ।**
**జీవం న తు శవం తేషాం జగ్రాహ ప్రాణ మివాంతకః ॥38॥**

అతడప్పుడు వారు కొట్టే దెబ్బలనన్నింటిని విఫలం చేశాడు. అంతకుడు ప్రాణాలను హరించునట్లుగా మణిభద్రుడు వారి ప్రాణాలు హరించకుండా (బ్రాహ్మణుని విడిపించి) శవాన్ని గ్రహించి మాయమైపోయాడు.

**హృతమాత్రే శవే తే తు పారియాత్రే గిరౌ ద్విజమ్ ।**
**ముక్త్వాఽధావన్ ప్రముదితా ఏకం ప్రేతం సుదారుణాః ॥39॥**

**స వాయుగమనః ప్రేతః ప్రాప్తస్తైః క్షణమాత్రతః ।**
**అదృశ్యతాం యయౌ తేఽథ హతాశా విప్రమాగమన్ ॥40॥**

శవాన్ని పట్టుకొని అతడు మాయం కాగా, ఆ ప్రేతలు పారియాత్ర పర్వతంపై విప్రుని విడిచిపెట్టి, మిక్కిలి భయంకరులై సంతోషిస్తూ ఆ మహాప్రేతం వెంటపడ్డారు. కాని ఒక్క క్షణకాలంలోనే ఆ మహాప్రేతం వాయుగమనాన్ని పొంది అదృశ్యమైపోయింది. అంత ఆ ప్రేతాలు దిక్కుతోచక మళ్లీ విప్రునివద్దకు వచ్చాయి.

**ప్రారబ్ధమాత్రే విప్రస్య పాటనే తత్ర పర్వతే ।**
**మమ స్థానస్య విప్రస్య మహిమ్నేవ చ తత్క్షణే ॥41॥**

**సద్యఃస్మృతిః సముత్పన్నా తేషాం పూర్వస్య జన్మనః ।**
**విప్రం ప్రదక్షిణీకృత్య ద్విజర్షభమథాబ్రువన్ ॥42॥**

విప్రునియొక్క ప్రారబ్ధవశంవల్ల వచ్చినకర్మ ఆ పర్వతంపై తొలగిపోగా (పర్వతం పైనున్న విప్రునివల్ల వారి ప్రారబ్ధకర్మ తొలగిపోగా) నా స్థానబలంవల్ల, విప్రుని మహిమవల్ల ఆ క్షణమందే వారికి పూర్వజన్మకు సంబంధించిన స్మృతి వెంటనే కలిగింది. వారు విప్రునికి ప్రదక్షిణ మాచరించి ఆ ద్విజశ్రేష్ఠునితో ఇలా పలికారు.

**అద్య నః క్షంతుమర్హోఽసీత్యుక్త్వా తే సురదామ్భికాః ।**
**గిరేరివ పరావర్తం సముద్రస్యేవ శోషణమ్ ॥43॥**

వారు దేవతామాయను పొంది మమ్ములను క్షమింప నర్హుడవని పలికారు. పర్వతం గిరగిరా తిరిగినట్లయింది. సముద్రం ఇంకిపోయినట్లయింది.

**తేషాం తద్వచనం శ్రుత్వాఽ పృచ్ఛత్కే యూయమిత్యథ ।**
**కిం మాయా కిము వా స్వప్న ఉతాహో చిత్తవిభ్రమః ॥44॥**

వారి మాటలను విని ఆ విప్రుడు ఇంతకూ మీరెవ్వరని ప్రశ్నించాడు. ఇది మాయా? లేక కలా? లేక చిత్తభ్రాంతియా?(తెలియరాదు)

**ప్రేతా ఊచుః** – ప్రేతలు పలికారు.

**అవేహి తత్త్వమేవైతత్ ప్రేతా వై కర్మజా వయమ్ ।**

"నీవు నీవే అని, ఇదంతా నీ పుణ్యమే అని తెలుసుకో. మేము మా కర్మలవల్ల ప్రేతలమయ్యాము"అన్నారు.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు అన్నాడు.

**కిం నామానః కిమాచారాః కథఞ్చేమాం దశాంగతాః ॥45॥**

**అవినీతాః కథం పూర్వం వినీతాః సాంప్రతం కథమ్ ।**

మీ పేర్లు ఏమిటి? మీరుచేసిన కర్మలెటువంటివి? ఏల ఈ దుర్దశను పొందారు? పూర్వం అవినీతులు ఎలా అయ్యారు? ఇప్పుడు వినీతులుగా ఎలా మారారు?"

**ప్రేతా ఊచుః** – ప్రేతలు బదులిచ్చారు.

**శృణు విప్రేంద్ర వక్ష్యామః ప్రశ్నానామనుపూర్వశః ॥46॥**

విప్రోత్తమా! నీ ప్రశ్నలకు క్రమంగా సమాధానం చెబుతాము విను. (ఉత్తరాణి=సమాధానాలు)

**ఉత్తరాణి మహాయోగిం స్త్వద్దర్శనగతాంహసః ।**
**అహం పర్యుషితో నామ్నా ఏష సూచీముఖః స్మృతః ॥47॥**

**తృతీయః శీఘ్రగస్తుర్యో రోధకో లేఖకః పరః ।**

మహాయోగీ! నీ దర్శనం వల్ల మా పాపం పోయింది. నేను పర్యుషితుడు అనే పేరుకలవాడను. ఈ రెండోవాడు సూచీముఖుడు ఇక మూడోవాడు శీఘ్రగుడు. నాలుగోవాడు రోధకుడు. మిగిలిన అయిదోవాడు లేఖకుడు.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు వచించాడు.

**ప్రేతానాం కర్మజాతానాం కుతో నామ నిరర్థకమ్ ॥48॥**

**నిరుక్తిమేషాం నామ్నాం వై ప్రేతా వదతి మా చిరమ్ ।**

కర్మసంజాతులైన ప్రేతల జన్మ ఎలా నిరర్థకమవుతుంది? మీ పేర్లు అర్థంలేనివని నాకనిపించడంలేదు. ప్రేతలారా! మీరు విస్తారంగా నాకు తెలియజేయండి అన్నాడు.

**శ్రీ కృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఏవ ముక్తాస్తు విప్రేణ పృథగుత్తరమబ్రువన్ ॥49॥**

ఈ విధంగా విప్రునిచే అడగబడినవారై, వారు వేరు వేరుగా ప్రత్యుత్తరమిచ్చారు.

**పర్యుషిత ఉవాచ** – పర్యుషితుడు అన్నాడు.

**కదాచిచ్ఛ్రాద్ధకాలే వై మయా విప్రో నిమంత్రితః ॥50॥**

ఒకానొకప్పుడు శ్రాద్ధసమయంలో నాచే ఒక విప్రుడు నిమంత్రింపబడినాడు.

**స చ కృత్వా విలంబేన వృద్ధో మద్గృహమాగతః ।**
**అకృతశ్రాద్ధకర్మాహం తం పాకం భుక్తవాన్ క్షుధా ॥51॥**

ఆ వృద్ధుడు చాలా ఆలస్యంచేసి నా ఇంటికి వచ్చాడు. నేను ఆకలిబాధతో శ్రాద్ధకర్మ చేయకుండానే, ఆ శాకపాకాలను తినివేశాను.

**అదదామన్నమాకృష్య విప్రే పర్యుషితం కియత్ ।**
**తస్మాత్పాపాన్మృతః పాపో యోనిం వై కుత్సితాం గతః ॥52॥**

**యతః పర్యుషితం దత్తం తతః పర్యుషితః స్మృతః ।**

ఆ బ్రాహ్మణునికి పర్యుషితాన్నాన్ని (పాసిపోయిన) ఎక్కడ నుండో తెప్పించి మరీ పెట్టాను. ఆ పాపంవల్ల మరణించిన పిమ్మట పాపయోనిని పొంది, కుత్సితత్వాన్ని పొందాను. పర్యుషితాహారాన్ని పెట్టిన కారణంవల్ల, నేను పర్యుషితుడు అనే పేరుతో వ్యవహరింపబడ్డాను.

**సూచీముఖ ఉవాచ** – సూచీముఖుడు వచించాడు.

**కదాచిద్బ్రాహ్మణీ కాచిత్తీర్థం భద్రవటం యయౌ ॥53॥**

**పంచవర్షసుతో వృద్ధా పుత్రమాత్రైక జీవితా ।**
**అహం క్షత్రియ దాయాదస్తస్యా రౌధ మకారిషమ్ ॥54॥**

ఒకప్పుడు ఒకానొక బ్రాహ్మణి భద్రవటం అనే తీర్థానికి వెళ్లింది. ఆమె వృద్ధురాలు, అయిదేండ్ల కుమారుడు కలది. ఆమె ఆ పుత్రునికోసమే జీవిస్తోంది. నేను క్షత్రియవంశసంజాతుడను. ఆమె మార్గానికి నేను అడ్డుపడ్డాను.

**వనే తు విజనే తత్ర పాపాధ్వగ గతిం గతః ।**
**తస్యాః సవస్త్రం పాథేయం తత్సూనోర్వసనాని చ ॥55॥**

**గృహీతాని మయా విప్ర శిరస్యాపీడ్య ముష్టినా ।**
**తృషార్తస్తత్ క్షణం బాలం పాత్ర సంస్థం జలం పిబన్ ॥56॥**

**తావన్మాత్రోదకే దేశే మయాహంకృత్య వారితః ।**
**మయాథ సకలం పీతం జలం పాత్రాత్తృషావతా ॥57॥**

ఆ నిర్జనారణ్యంలో పాపాత్ముడనై దారికాచి వారిని సమీపించాను. మార్గంలో తినడానికి మూట కట్టుకొన్న ఆమె వస్త్రాన్ని, ఆమె కుమారుని బట్టలు మున్నగు వాటిని, విప్రోత్తమా! నేను లాగుకొన్నాను పిడికిలిచే శిరస్సుపై బాదాను. ఆ సమయంలో బాలుడు దాహమని ఏడుస్తూ ఉండగా, తల్లి ఇచ్చిన పాత్రలోని నీళ్లను త్రాగుతూ ఉండగా, ఆ ప్రదేశంలో ఆ కొద్దిపాటి నీళ్లను నేను దౌర్జన్యంతో లాగేశాను, దాహపుబాధతో నేను ఆ పాత్రలోని జలాన్ని అంతా త్రాగేశాను.

**బాలోఽపి భయసంత్రస్తః పిపాసుర్వ్యసురాపతత్ ।**
**పుత్రశోకాన్మృతా మాతా కూపే ప్రాస్య నిజం వపుః ॥58॥**

ఆ పిల్లవాడు కూడ భయంతో వణకిపోతూ, దాహపీడితుడై తన అసువులను విడిచాడు.(మరణించాడు). తల్లికూడా గర్భశోకాన్ని తట్టుకోలేక నూతిలో దూకి తన శరీరాన్ని విడిచింది.

**ఏతస్మాత్పాతకాద్విప్ర ప్రేతత్వం ప్రాప్తవానహమ్ ।**
**సూచ్యగ్రప్రాయ వివరముఖః పర్వతదేహవాన్ ॥59॥**

విప్రవర్యా! ఈ మహాపాపం వల్ల నేను ఈ ప్రేతత్వాన్ని పొందాను. నాకు సూదిమొనవంటి కన్నం గల నోరు, పర్వతంవంటి దేహం ప్రాప్తించాయి.

**యద్యపి ప్రాప్నుయాం భక్ష్యం భక్షితన్తు న శక్యతే ।**
**మయా క్షుధానలేనాపి జ్వలతాస్యం నికోచితమ్ ॥60॥**

**అత ఆస్యే తు వివరం సూచ్యగ్రేణ సమం మమ ।**
**ఏతస్మాత్కారణా ద్విప్ర నామ్నా సూచీముఖోఽస్మ్యహమ్ ॥61॥**

నాకు ఎలాగో ఆహారం దొరికినప్పటికి, దానిని తినడానికి నాకు వీలు కలగడంలేదు. ఆకలి అనే మంటచే నా ముఖం, మాడిపోయి నొక్కుకు పోయింది. అందువల్ల నోటిలో కన్నం ఏర్పడింది. ముక్కు సూదిలా అయిపోయింది. విప్రోత్తమా! ఈ కారణంవల్ల నేను సూచీముఖుడు అనే పేరుగల వాడనయ్యాను.

**శీఘ్రగ ఉవాచ** – శీఘ్రగుడు వచించాడు.

**పురాహం వైశ్యజాతీయః సాకం సఖ్యా చ కేనచిత్ ।**
**వాణిజ్యం కర్తుమగమం దేశమన్యం మహాధనః ॥62॥**

**మిత్రం చ మే బహుధనం తస్య లోభో మహాంస్తతః ।**
**జాతోఽప్యదృష్టవైముఖ్యాన్మే నష్టం మూలమప్యుత ॥63॥**

నేను పూర్వం వైశ్యజాతియందు పుట్టినవాడను. ఒకానొక స్నేహితునితో కలసి వర్తకం చేయుటకై మరో దేశం వెళ్లాను. మిక్కిలి ధనవంతుడనయ్యాను. నాకన్న మిక్కిలిగా ధనం సంపాదించిన మిత్రుని సంపదను చూచేటప్పటికి నాకు మిక్కిలి లోభం కలిగింది. అదృష్టం తారు మారగుట వల్ల నా మూలధనం కూడ నష్టమైపోయింది.

**తతస్తస్మాత్తు నిష్క్రాంతా వావాం నావాథ నిమ్నగామ్ ।**
**మార్గగాం తర్తుమారబ్ధౌ లోహితాయతి భాస్కరే ॥64॥**

**సఖా స చ మదుత్సంగే సుష్వాపాధ్వక్లమాకులః ।**
**అభూత్తదతి పాపస్య క్రూరా మతిరతీవ మే ॥65॥**

ఆ తరువాత అక్కడ నుండి తిరిగి వెడుతూ ఉండగా, నది ఒకటి కనబడగా ఇరువురమూ నావను ఎక్కాము. నదీ మార్గాన్ని దాటబోతూ ఉండగా, సూర్యుడు ఎఱ్ఱబడ్డాడు (అస్తమించాడు) నా స్నేహితుడు మార్గాయాసంచే కునుకుపాట్లు పడుతూ నా తొడయందు నిద్రించాడు. ఆ సమయంలో మిక్కిలి పాపాత్ముడనైన నాకు క్రూరమైన బుద్ధిపుట్టింది.

**తముత్సంగగతం సూరే నష్టే పూరేఽక్షిపం తదా ।**
**తత్కృత్యం కుర్వతో నావిలోకైస్తు జ్ఞాతమేవ న ॥66॥**

సూర్యుడు పూర్తిగా అస్తమించి చీకటి పడగా, నా తొడపై నన్ను అతనిని ప్రవాహంలోకి తోసేశాను. నావయందు  ఆ పని చేస్తున్న నన్ను జనులెవ్వరూ చూడలేదు.

**రితస్య యద్వస్తు తత్సర్వం మణిముక్తాది కాంచనమ్ ।**
**ఆదాయ శీఘ్రగస్తస్మాద్దేశాత్ స్వగృహమాగతః ॥67॥**

అతని మణులు, ముత్యాలు, బంగారం మున్నగు వస్తువులనన్నింటిని తీసుకొని శీఘ్రంగా బయలుదేరి, ఆ ప్రదేశం నుండి నా ఇంటికి తిరిగి వచ్చేశాను.

**తత్సర్వం స్వగృహే ముక్త్వా తస్య పత్న్యై న్యవేదయమ్ ।**
**దస్యుభిర్మే హతో భ్రాతా ధనమాచ్ఛిద్య వై పథి ॥68॥**

దాని నంతటినీ ఇంటిలో విడిచి(దాచి) " నా సోదరుడు స్నేహితుడు దొంగలచే చంపివేయబడ్డాడు. వారు అతని సొత్తుఅంతా దోచుకున్నారు." అతి అతని భార్యకు తెలియజేశాను.

**ప్రజావతి ప్రద్రుతోఽహం మా రోదీత్యేవమబ్రువన్ ।**
**శోకార్తా సాపి తత్కాలం మమత్వం గృహబన్ధుషు ॥69॥**

**త్యక్త్వా చాతి ప్రియాన్ ప్రాణాఞ్జుహావాగ్నౌ యథావిధి ।**
**తతో నిష్కంటకం తద్ధి వీక్ష్య హృష్టో గతో గృహమ్ ॥70॥**

"అమ్మా! నేను "ఏడవవద్దు" అని ఓదార్చాను. శోకార్తురాలైన ఆమెకూడ ఆ సమయంలో ఇంటిమీదా, స్వజనంమీదా మమకారాన్ని విడిచి, మిక్కిలి ప్రియమైన ప్రాణాలను శాస్త్రవిధిచే అగ్నిలో హుతంచేసింది. అప్పుడు ఇంక ఏ బెంగాలేదని, అంతా నిష్కంటకం అయిందని, ఆ దృశ్యాన్నిచూచి,  సంతోషించి ఇంటికి వెళ్లిపోయాను.

**అభుంజం సర్వమాగత్య యావజ్జీవం తు తద్ధనమ్ ।**
**మిత్రం పూరే హి నిఃక్షిప్య యదహం శీఘ్రమాగతః ॥71॥**

**ఏతస్మాత్కారణాత్ ప్రేతః శీఘ్రగో౽హం తు నామతః ।**

ఇంటికి వచ్చిన పిమ్మట అతని సొమ్మంతా అనుభవించాను. జీవితాంతం అతని ధనంతోనే బ్రతికాను. మిత్రుని ప్రవాహంలోకి తోసేసి, నేను శీఘ్రంగా వచ్చిన ఈ కారణంచే ప్రేతత్వాన్ని పొందాను. నేను శీఘ్రగుడనే పేరుగల వాడనయ్యాను.

**రోధక ఉవాచ** – రోధకుడు వచించాడు.

**అహంతు శూద్రజాతీయః పురాభూవం మునీశ్వర ॥72॥**

**రాజప్రసాదాప్త మహాశత గ్రామాధికారవాన్ ।**
**వృద్ధౌ మే పితరావాస్తాం లఘురేకః సహోదరః ॥73॥**

మునీశ్వరా! పూర్వం నేను శూద్రజాతికి చెందినవానిగా జన్మించాను(అయ్యాను). రాజుయొక్క అనుగ్రహంవల్ల నూరు పెద్ద గ్రామాలపై అధికారం పొందినవాడనయ్యాను. నా తల్లిదండ్రులు వృద్ధులు. ఒక తమ్ముడు కూడ ఉండేవాడు.

**శీఘ్రం స చ మయా భ్రాతా లుబ్ధే నైకః పృథక్ కృతః ।**
**ఆప్తవాన్ పరమం దుఃఖం సో ౽న్న వస్త్రవివర్జితః ॥74॥**

నేను లుబ్ధత్వంచే నా సోదరు నొక్కనినీ శీఘ్రంగా వేరే ఉంచేశాను. అతడు అన్నం, బట్టలు లేక మిక్కిలి దుఃఖంతో విలవిలలాడాడు.

**అదత్తాం పితరౌ చ్ఛన్నం కించిత్ కించిత్తు తస్య చ ।**
**తస్మైపితృభ్యాం యద్దత్త మాప్తేభ్యస్తన్మయా శ్రుతమ్ ॥75॥**

నా తల్లిదండ్రులు అతనికి రహస్యంగా కొద్ది కొద్దిగా వస్తువులను పంపిస్తూ ఉండేవారు. అతనికి మాతా పితరులు చాటుగా పంపిస్తున్నారనే సంగతి ఆప్తులద్వారా నేను వినడం జరిగింది.

**తత్సర్వం తత్త్వతో జ్ఞాత్వా పిత్రో రోధమకారయమ్ ।**
**శూన్యమందిర ఏకస్మిన్ బద్ధ్వా తు నిగడై ర్దృఢైః ॥76॥**

ఆ విషయాన్ని అంతా తెలుసుకొన్న నేను ఒక శూన్య మందిరంలో బలమైన సంకెళ్లతో బంధించి తల్లిదండ్రులను, ఇక అలాజరగకుండా నిరోధించాను.

**తతస్తౌ జహతుః ప్రాణాన్ దుఃఖితౌ విషపానతః ।**
**సో౽సౌ బాలో౽పి బభ్రామ పితృభ్యాం రహితో ద్విజ ॥77॥**

అంత వారిరువురు దుఃఖిస్తూ విషంత్రాగి ప్రాణాలను విడిచారు. ద్విజోత్తమా ! చిన్నవాడయిన నా తమ్ముడు కూడ తల్లిదండ్రులు లేక పిచ్చివానిలా తిరుగసాగాడు.

**పురః పత్తన ఖర్వాటాన్ ఖేటానపి మృతః క్షుధా ।**
**ఏతస్మాత్ పాతకాద్విప్ర మృతః ప్రేతత్వమాగతః ॥78॥**

**రుద్ధౌతు పితరౌ యస్మాన్నామ్నాహం రోధకస్తతః ।**

పురాలు, పట్టణాలు, చిన్నచిన్న గ్రామాలు, భయాన్ని కలిగించే ప్రదేశాలు తిరుగుతూ ఆకలితో నకనకలాడుతూ మరణించాడు. విప్రా! ఈ మహాపాపం వల్ల మరణించి ప్రేతత్వాన్ని పొందాను. తల్లిదండ్రులను రుద్ధులను (నిర్బంధితులను) చేసిన కారణంచే రోధకుడనే పేరు వచ్చింది.

**లేఖక ఉవాచ** – లేఖకుడు వచించాడు.

**అహం విప్ర పూరాభూవమవంత్యాం ద్విజసత్తమః ॥79॥**

**భద్రస్య రాజ్ఞో దేవానాం పూజనేఽధికృతో హ్యహమ్ ।**
**బహ్వ్యస్తు ప్రతిమాస్తత్ర బభూవుర్బహునామికాః ॥80॥**

విప్రోత్తమా! నేను పూర్వం అవంతీనగరంలో ఒక ద్విజసత్తమునిగా జన్మించాను. భద్రుడనేరాజు నన్ను దేవాలయంలో దైవపూజకై పూజారిగా నియమించాడు. ఆ గుడిలో విభిన్న నామాలతో ఎన్నో దేవతావిగ్రహాలు ఉన్నాయి.

**హేమ్నస్తదంగేషు బహు రత్నజాతం బభూవహ ।**
**తాసాం మే కుర్వతః పూజాం పాపా మతి రజాయత ॥81॥**

ఆ బంగారు విగ్రహాలలో పలు తావులలో విలువైన రత్నాలు తాపడం చేయబడి ఉన్నాయి. వాటికి పూజను చేసేనాకు పాపబుద్ధి పుట్టింది.

**అఖిలం తీక్ష్ణలోహేన తాసామంగం విశీర్య చ ।**
**ఉల్లేఖనఞ్చ రత్నానాం నేత్రాదిభ్యః కృతం మయా ॥82॥**

నేను సూదిలా వాడిగా ఉండే ఒక ఇనుపమేకుతో వాటి అవయవాలను శిథిలం చేసి, కన్నులు మున్నగు వాటికి అతికించియున్న రత్నాలను అన్నీ పెకలించివేశాను.

**తథా కృతాన్యథాంగాని ప్రతిమానాం నిరీక్ష్య చ ।**
**నేత్రాణి చ విరత్నాని నృప శ్చుక్రోధ వహ్నివత్ ॥83॥**

ఆ విధంగా శైథిల్యం పొందిన అవయవాలతో కూడిన ప్రతిమలను వీక్షించి, రత్నాలు లేకుండా ఉన్న నేత్రాలను పరీక్షించి రాజు అగ్నిలా మండిపడ్డాడు.

**ప్రతిజజ్ఞే నృపః పశ్చాదేష బ్రాహ్మణపుంగవః ।**
**అభ్యో రత్నం సువర్ణఞ్చ హృతం యేన భవిష్యతి ॥84॥**

**జ్ఞాతశ్చ స హి మే వధ్యో భవిష్యతి న సంశయః ।**
**అహం తత్సకలం జ్ఞాత్వా రాత్రావసిధరో గృహమ్ ॥85॥**

**రాజ్ఞః ప్రవిశ్య రాజానం పశుమారమమారయమ్ ।**
**గృహీత్వాథ మణీన్ స్వర్ణం నిశీథేఽహం గతోఽన్యతః ॥86॥**

ఆ తరువాత రాజు "ఈ పని చేసిన వానిని, వాడు బ్రాహ్మణపుంగవుడైనా వీటినుండి రత్నాలను, సువర్ణాలను ఎవడు దొంగిలించాడో, వాడెవడో తెలిస్తేచాలు, వాడు వెంటనే నాచే చంపబడతాడు. సందేహంలేదు" అని (దేవునిఎదుట) ప్రతిజ్ఞ చేశాడు. నేను ఆ విషయాన్ని అంతా గ్రహించి, రాత్రిసమయంలో కత్తిని చేబూని, రాజమందిరంలోకి ప్రవేశించి, ఆ రాజును పశువును చంపునట్లు చంపేశాను. మణులను, స్వర్ణాలను పట్టుకొని, ఆ అర్ధరాత్రి సమయంలో నేను మరోచోటికి పారిపోయాను.

**వ్యాఘ్రేణ మహతారణ్యే నఖటంకై ర్విటంకితః ।**
**లేఖనాత్ప్రతిమాయా యన్మయా లోహేన కర్తితమ్ ॥87॥**

**ఏతస్మాత్పాతకాత్ ప్రేతో లేఖకో నామతోఽ స్మ్యహమ్ ।**
**ఆసీన్నరక భోగాన్తే నః ప్రేతత్వమిదం ద్విజ ॥88॥**

నేను ఇనుపమేకుతో పొడిచి పొడిచి ప్రతిమను పగలగొట్టిన ఫలితంగా ఒక మహారణ్యంలో నేను పులి గోళ్ళు అనే ఉలులచే ముక్కలు చేయబడ్డాను. ఈ మహాపాపంవల్ల నేను ప్రేతనయ్యాను. లేఖకుడు అనే పేరుగల వాడనయ్యాను. ద్విజవర్యా! నరకలోకాల దుఃఖాలను అనుభవించిన తర్వాత మేము ఈ ప్రేతత్వాన్ని పొందాము.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు అన్నాడు.

**సంజ్ఞా స్తాదృశ్య ఆఖ్యాతా యథైతా భవతా దశాః ।**
**వదంత్వాచారమాత్రం మే ప్రేతా ఆహారమప్యుత ॥89॥**

మీకు అటువంటి పేర్లు ఎలావచ్చాయో, మీరు ఇటువంటి దశలు ఎలా పొందారో తెలియజేశారు. ఇక ప్రేతల ఆచారవిధి, వాటి ఆహారం ఎటువంటిదో నాకు తెలియజేయండి.

**ప్రేతా ఊచుః** – ప్రేతలు పలికారు.

**వేదమార్గానుసరణం లజ్జా ధర్మో దమః క్షమా ।**
**ధృతిర్జ్ఞానం నైవ యత్ర వయం తత్ర వసామహే ॥90॥**

వేదమార్గానుసారం, లజ్జ, ధర్మం, దమం, క్షమ, ధృతి, జ్ఞానం ఎక్కడ ఉండవో, అక్కడ మేము ఉంటాము.

**తస్య పీడాం వయం కుర్మో నైవ శ్రాద్ధం న తర్పణమ్ ।**
**యస్య గేహే తదంగాత్తు మాంసఞ్చ రుధిరం క్రమాత్ ॥91॥**

**జక్షామశ్చ పిబామశ్చ ఉక్త ఆచార ఏష నః ।**
**శృణు చాహారమస్మాకం సర్వలోక విగర్హితమ్ ॥92॥**

ఇంటియందు శ్రాద్ధం, తర్పణం ఉండని అతనిని మేము పీడిస్తూ ఉంటాము. వాని శరీరంనుండి తెలియకుండానే మాంసాన్ని, రక్తాన్ని క్రమంగా తినివేస్తాము, త్రాగివేస్తూ ఉంటాము. ఇది మా ఆచారమని చెప్పబడింది. ఇక మా ఆహారం గురించి విను. సమస్త జనులకు మిక్కిలి అసహ్యం కలిగించేదది,

**దృష్టస్త్వయా చ కించిద్వై బ్రూమో జ్ఞాతం త్వయానఘ ।**
**వమనం విడ్ దూషికా చ శ్లేష్మా మూత్రాశ్రుణీ తథా ॥93॥**

**ఏతద్భక్ష్య ఇచ్ఛ పానఇచ్ఛ మాపృచ్ఛాతః పరం ద్విజ ।**
**లజ్జా నో జాయతే స్వామిన్నాహారం వదతాం స్వకమ్ ॥94॥**

అనఘా! నువ్వు చూసి కొంత తెలుసుకున్నావు. దానినే వివరిస్తాను. డోకబడిన పదార్థం, మలం, కంటిలోని పుసి, శ్లేష్మం, మూత్రం, కన్నీరు మున్నగునవన్నీ మాకు భక్ష్యాలు, పానీయాలు. ద్విజవర్యా! ఇంతకంటె ఏమీ అడగవద్దు. ఓ స్వామీ! మా ఆహారం గురించి చెప్పడానికి మాకే సిగ్గు పుట్టుకొనివస్తోంది.

**అజ్ఞానా స్తామసా మందా కాందిశీకా వయం విభో ।**
**అకస్మా జ్జన్మనాం విప్ర స్మృతిః ప్రాప్తా తు పౌర్వికీ ॥95॥**

**వినీతత్వా వినీతత్వే జానీమో నైవ నః ప్రభో ।**

ప్రభూ! మేము అజ్ఞానులం, తామసులం, మందబుద్ధులం, భయంతో పారిపోయే పిరికి జనాలం. విప్రోత్తమా! మాకు అకస్మాత్తుగా పూర్వజన్మలకు సంబంధించిన స్మృతి కలిగింది. ప్రభూ! మాకు వినయం, అవినయం ఏమీ తెలియవు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఏవం వదత్సు ప్రేతేషు తథా శ్రుతవతి ద్విజే ॥96॥**

**అదర్శయమహం రూపం తదా తార్క్ష్యదమేవ వై ।**
**స తు దృష్ట్వా ద్విజశ్రేష్ఠో హృద్గతం పురుషం పురః ॥97॥**

**స్తోత్రైస్తుష్టావ పక్షీశ దండవత్ప్రణనామ మామ్ ।**
**తేఽపి తేపుస్తతః ప్రేతా ఆశ్చర్యోత్ఫుల్లచక్షుషః ॥98॥**

ఈ రీతిగా ప్రేతలు పలుకుతూ ఉండగా, బ్రాహ్మణుడు అలావింటూ ఉండగా గరుడా! అప్పుడు నేను ఈ రూపాన్నే చూపించాను. ఆ ద్విజశ్రేష్ఠుడు అంత తన హృదయంలో ఉన్న పురుషుని ఎదురుగా వీక్షించి. పక్షీశ్వరా! నాకు సాష్టాంగ దండప్రణామం ఆచరించి, స్తుతులతో నన్ను నుతించాడు. ఆ ప్రేతలుకూడ ఆశ్చర్యంతో విప్పారిన కన్నులతో అంత నన్ను ధ్యానించారు.

**ప్రణయేన స్ఖలద్వాచః ఖగ నోచుః కిమప్యత ।**
**రజసా ఘోరచిత్తానాం తమసా మూఢచేతసామ్ ॥**
**కృపయా యః సముద్ధారం కురుషే వై నమోఽస్తు తే ॥99॥**

ఖగమా! మిక్కిలి వినయంతో మాటలు తడబడగా ఏమీ మాట్లాడలేకపోయారు."రజోగుణంతో ఉండే ఘోరచిత్తులను, తమోగుణంతో ఉండే మూఢచేతస్కులను నీవు దయతో ఉద్ధరించగలవు. నీకు నమస్కారం."

**ఏవం ద్విజాతౌ బ్రువతి ప్రభూత ప్రభైశ్చ ముఖ్యాంబరచారియుక్తైః ।**
**తదా మదిచ్ఛా ప్రభవై ర్విమానైః షడ్భిః సమంతాద్రురుచే గిరిః సః ॥100॥**

అని విప్రుడు పలుకుతూ ఉండగా, మిక్కిలి తేజస్సుతో, మిక్కిలిగా ఆకాశసంచారం చేయగల్గి, నా సంకల్పం మేరకు వచ్చిన ఆరు విమానాలతో ఆ పర్వతం ఒక్కసారి అంతటా ప్రకాశించింది.

**ఇత్థం విమానేన మదీయ లోకం గతో ద్విజ స్సోఽ పృథ పంచభి స్తైః ।**
**ప్రేతా యయుః స్వర్గమగణ్య పుణ్యం సత్సంగ సంసర్గ వశాత్సు పూర్ణమ్ ॥101॥**

ఈ విధంగా విమానాన్ని అధిరోహించి, ఆ పంచ ప్రేతలతో కలసి ఆ ద్విజుడు నా లోకం చేరుకొన్నాడు. సంపూర్ణమైన సత్సంగ సంసర్గవశంచే ఆ ప్రేతలు అయిదుగురు లెక్కించలేనంత పుణ్యధామమైన స్వర్గం చేరుకొన్నారు.

**ప్రేతాః సంగ వశేన నాకమవసన్ సంతప్తకో బ్రాహ్మణో**
**విష్వక్సేన ఇతి ప్రసిద్ధ విభవో నామ్నా గణే మేఽ భవత్ ।**
**ఏతత్తే సకలం మయా నిగదితం యశ్చైతదుత్కీర్తయే ।**
**దృశ్చేదం శృణుయాన్న సోఽ పి పురుషః ప్రేతత్వమాప్నోతి హి ॥102॥**

సత్సంగవశంచే ప్రేతలు స్వర్గం చేరుకొన్నారు. సంతప్తకుడనే బ్రాహ్మణుడు కూడ విష్వక్సేనుడు అనే పేరుతో మహావైభవంతో నా గణంలో ఒకడయ్యాడు. దీనినంతను నేను నీకు తెలియజేశాను. దీనిని వినని పురుషుడు ప్రేతత్వాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే పంచప్రేతోపాఖ్యానం నామ సప్తమోఽ ధ్యాయః ॥7॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో అయిదుగురు ప్రేతల కథ అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః** – ఎనిమిదవ అధ్యాయం

## **ఆత్మశ్రాద్ధవిధిః** – ఆత్మశ్రాద్ధవిధానం

**గరుడ ఉవాచ** – గరుడుడు పలికాడు.

**స్వామిన్ కస్యాధికారోఽత్ర సర్వ ఏవౌర్ధ్వదేహికే ।**
**క్రియాః కతివిధాః ప్రోక్తా వదైతత్సర్వమేవ మే ॥1॥**

స్వామి! ఈ సమస్తమైన ఔర్ధ్వదేహిక కార్యమందు ఎవరికి అధికారం ఉంది? ఆ క్రియలు ఎన్నివిధాలుగా చెప్పబడ్డాయి? దానినంతనూ నాకు తెలియజేయవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**పుత్రః పౌత్రః ప్రపౌత్రో వా తద్భ్రాతా భ్రాతృ సంతతిః ।**
**సపిండసంతతిర్వాపి క్రియార్హాః ఖగ జ్ఞాతయః ॥2॥**

**తేషామభావే సర్వేషాం సమానోదకసంతతిః ।**
**కులద్వయేఽపి చోచ్ఛిన్నే స్త్రీభిః కార్యాః క్రియాః ఖగ ॥3॥**

ఖగమా! పుత్రుడు, పౌత్రుడు(మనుమడు), ప్రపౌత్రుడు(మునిమనుమడు), భ్రాత, భ్రాతృసంతతి, సపిండులు, వారి సంతతి, స్వజాతీయులు(జ్ఞాతులు) వీరు క్రియావిధికి అర్హులు. వారు లేకపోతే అందరికి సమానోదకులు, వారి సంతతి అర్హులౌతారు. రెండు కులాలతోను తెగతెంపులయిపోతే(ఎవరూ లేకపోతే) స్త్రీలే ఈ క్రియలు చేయదానికి తగినవారు.

**ఇచ్ఛయోచ్ఛిన్న బంధశ్చ కారయేదవనీపతిః ।**
**పూర్వాః క్రియా మధ్యమాశ్చ తథా చైవోత్తరాః క్రియాః ॥4॥**

అందరితోను కావాలని తెగతెంపులు చేసుకొన్నవానికి రాజే ఈ క్రియను నిర్వహింపజేయాలి. పూర్వక్రియలు, మధ్యమక్రియలు, ఉత్తరక్రియలు అని ఇవి మూడు విధాలు.

**ప్రతి సంవత్సరం పక్షిన్నేకోద్దిష్ట విధానతః ।**
**శ్రాద్ధం తత్ర ప్రకర్తవ్యం ఫలం తస్య శృణుష్వ మే ॥5॥**

పక్షీ! ప్రతి సంవత్సరమూ ఈ శ్రాద్ధక్రియను ఏకోద్దిష్ట విధానంలో చేయవలసి ఉంటుంది. (తద్దినం) దాని వలన వచ్చే ఫలితాన్ని నా ద్వారా విను.

**బ్రహ్మేంద్రరుద్రనాసత్యసూర్యాగ్నివసుమారుతాన్ ।**
**విశ్వేదేవాన్ పితృగణాన్ వయాంసి మనుజాన్ పశూన్ ॥6॥**

**సరీసృపాన్ మాతృగణాన్ యచ్చాన్యద్భూత సంజ్ఞితమ్ ।**
**శ్రాద్ధం శ్రద్ధాన్వితః కుర్వన్ ప్రీణయత్యఖిలం జగత్ ॥7॥**

బ్రహ్మను, ఇంద్రుని, రుద్రుని, అశ్వినీదేవతలను, సూర్యుని, అగ్నిని, వసువులను, మరుద్గణాలను (వాయువును), సరీసృపాలను, విశ్వేదేవతలను, పితృగణాలను, పక్షులను, మనుష్యులను, పశువులను, మాతృగణాలను, ఇతరేతర ప్రాణులను, సమస్త జగత్తును, శ్రాద్ధాన్ని శ్రద్ధతో కూడుకొని చేసినచో ప్రసన్నం చేసుకోవచ్చు.

**తే తృప్తాస్తర్పయన్త్యేనం పుత్రదారధనై స్తథా ।**
**అధికారః క్రియాభేదః సమాసాత్తే నిరూపితః ॥8॥**

వారు సంతృప్తులై శ్రాద్ధకర్తను పుత్ర స్త్రీ ధనాదికం ద్వారా సంతోషపరుస్తారు. అధికారాన్ని, క్రియాభేదాన్ని గురించి నీకు సంక్షిప్తంగా వివరించడం జరిగింది.

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**ఉక్తేష్వేకోఽపి చేన్న స్యాదధికారీ సురోత్తమ ।**
**కర్తవ్యం కిం తదా విష్ణో పురుషేణ విజానతా ॥9॥**

దేవదేవా! విష్ణూ! నీవు చెప్పినవారిలో ఏ ఒక్క అధికారీలేనినాడు, జ్ఞానంకల పురుషుడు అప్పుడు ఏమి చేయవలసి ఉంటుంది?

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**అధికారో యదా నాస్తి యది నాస్తి చ నిశ్చయః ।**
**జీవితే సతి జీవాయ దద్యాచ్ఛ్రాద్ధం స్వయం నరః ॥10॥**

అధికారి లేకపోతే, తనకు శ్రాద్ధవిధిని పెట్టేవాడు లేడని నిశ్చయమయితే, జీవించియుండగానే స్వయంగా నరుడు తన జీవునికొరకు శ్రాద్ధం పెట్టుకోవాలి.(దీనిని జీవితశ్రాద్ధమంటారు).

**కృతోపవాసః సుస్నాతః కృష్ణాసంగః సమాహితః ।**
**కర్తార మథ భోక్తారం విష్ణుం సర్వేశ్వరం యజేత్ ॥11॥**

ముందు స్నానంచేసి, ఉపవాసముండి, కృష్ణునిపై మనస్సు పూర్తిగా లగ్నంచేసి, మిక్కిలి శ్రద్ధతో కర్త, భోక్త, సర్వేశ్వరుడు అయిన విష్ణువును పూజించాలి.

**సదక్షిణాశ్చ సతిలా స్తిస్రశ్చ జలధేనవః ।**
**నివేదయే త్పితృభ్యశ్చ స్వధేతి సుసమాహితః ॥12॥**

తన పితృగణాల పేరుతో మూడు జలధేనువులను (కృత్రిమధేనువులను) సృష్టించి, తిలలతో బాటు దక్షిణలను కూడ జోడించి, మిక్కిలి శ్రద్ధతో “ఓం పితృభ్యః స్వధా” అంటూ నివేదించాలి (కులబ్రాహ్మణునకు).

**అగ్నయే కవ్యవాహనాయ స్వధా నమ ఇతి స్మరన్ ।**
**సోమాయత్వా పితృమతే స్వధా నమ ఇతి స్మరన్ ॥13॥**

**దక్షిణేన తుదద్యాచ్చ తృతీయాం దక్షిణాయుతామ్ ।**
**యమాయాంగిరసే చాథ స్వధా నమ ఇతి స్మరన్ ॥14॥**

"ఓం అగ్నయే కవ్యవాహనాయ స్వధా నమః" అనే మంత్రం పఠిస్తూ, "ఓం సోమాయ త్వా పితృమతే స్వధా నమః" అనే మంత్రాన్ని చదువుతూ, దక్షిణంగా తిరిగి నివేదించిన వాటిని దానమీయాలి. దక్షిణాయుతంగా మూడో ధేనువును దానమిస్తున్నప్పుడు "ఓం యమాయ అంగిరసే స్వధా నమః" అనే మంత్రాన్ని పఠించాలి.

**తయోర్మధ్యే తు నిఃక్షిప్య విప్రాన్ సంమన్త్ర్య భోజయేత్ ।**
**ప్రథమాముత్తరే న్యస్య ద్వితీయాం దక్షిణే న్యసేత్ ॥15॥**

**మధ్యే తృతీయాం విన్యస్య పశ్చాదావాహనాదికమ్ ।**

విష్ణుభగవానుని పూజ, జలధేను దానాల మధ్య సమయంలోనే బ్రాహ్మణులను ఆవాహన చేసి భోజనంపెట్టాలి. మొదటి జలధేనువును ఉత్తరంలోను, రెండవ జలధేనువును దక్షిణంలోను, వాటి మధ్యలో మూడవ జలధేనువునుంచి, పిమ్మట ఆవాహనాదికాలను నిర్వహించాలి.

**ఆవాహనాదినా పూర్వం విశ్వేదేవాన్ ప్రపూజ్య చ ॥16॥**

**వసుభ్యస్త్వామహం విప్ర రుద్రేభ్యస్త్వా మహం తతః ।**
**సూరేభ్యస్త్వామహం విప్ర భోజయామీతి తాన్వదేత్ ॥17॥**

అన్ని క్రియలకన్న ముందు విశ్వేదేవతలను (తత్ప్రతినిధి బ్రాహ్మణులను) లెస్సగా పూజించి, ఆవాహనాదులను నిర్వహించాలి. విప్రా! నేను నిన్ను వసువులుగాను, పిమ్మట నిన్ను నేను రుద్రులుగాను, అటుపిమ్మట నిన్ను నేను ఆదిత్యులుగాను భావించి విప్రా! భోజనం పెడుతున్నానని వారితో చెప్పాలి.

**ఆవాహనాదికం శేషం కుర్యాచ్చ పితృశేషవత్ ।**
**సౌమ్యాం ధేనుం తతో దద్యాద్వసూద్దేశం ద్విజాయ తు ॥18॥**

**ఆగ్నేయ్యాం చాథ రౌద్రాయ యామ్యాం సూర్యద్విజాయ తు ।**
**విశ్వేభ్యశ్చాథ దేవేభ్య స్తిలపాత్రం నివేదయేత్ ॥19॥**

ఆ తరువాత ఆవాహనాదిక శేషకార్యాలను, పితృశేషకార్యంలో చేసినట్లే చేయాలి. పిమ్మట వసువులను ఉద్దేశించి బ్రాహ్మణునికి మంచి ఆవును దానంచేయాలి. ఆగ్నేయంలో రుద్రునకు, దక్షిణంలో ఆదిత్యునకు ప్రతినిధులుగా ఉన్న బ్రాహ్మణులకు కూడ గోదానం చేయాలి. అటుపిమ్మట విశ్వేదేవప్రతినిధియైన ద్విజునకు తిలపూర్ణ పాత్రను ఈయాలి.

**స్వస్తీత్యేవ తథాక్షయ్యం జలం దత్త్వాథ తాన్ ద్విజాన్ ।**
**విసర్జయేత్స్మరన్విష్ణుం దేవమష్టాక్షరం విభుమ్ ॥20॥**

అప్పుడు ఆ బ్రాహ్మణులకు అక్షయోదక దానం ఇస్తే, వారు “ఓం స్వస్తి” అని ఆశీర్వదిస్తారు. పిమ్మట అష్టాక్షర మంత్రంతో ప్రభువైన విష్ణుభగవానుని స్మరిస్తూ, ఆ బ్రాహ్మణులకు వీడ్కోలు చెప్పాలి.

**తతః కామం కులేశానీం శివం నారాయణం స్మరేత్ ।**
**చతుర్దశ్యాం తతో గచ్ఛేద్యథా ప్రాప్తాం సరిద్వరామ్ ॥21॥**

తరువాత ఇష్టంగా కులదేవతయైన పార్వతీదేవిని, శివకేశవులను స్మరించాలి. పిమ్మట చతుర్దశినాడు తనకు అందుబాటులో నున్న శ్రేష్ఠమైన నదికి వెళ్లాలి.

**వస్త్రాణి లోహఖండాని జితంత ఇతి సంజపన్ ।**
**దక్షిణాభిముఖో వహ్నిం జ్వాలయేత్తత్ర చ స్వయమ్ ॥22॥**

**పంచాశతా కుశై ర్బ్రాహ్మీం కృత్వా ప్రతికృతిం దహేత్ ।**
**హుత్వా శ్మాశానికం హోమం పూర్ణాహుత్యంతమేవ హి ॥23॥**

స్నానంచేసిన వస్త్రాలను, ఇనుపకడ్డీలను దానం చేయాలి. పిమ్మట దక్షిణముఖంగా కూర్చుండి “ఓం జితంతే” అని జపిస్తూ స్వయంగా అక్కడ అగ్నిని ప్రజ్వరిల్లజేయాలి. తరువాత ఏభై కుశలలో ఒక బొమ్మను తనకు ప్రతీకగా(దీనినే బ్రాహ్మీప్రతికృతి అంటారు) తయారుచేసి దానిని అగ్నికి ఆహుతిచేయాలి. పిమ్మట శ్మశానంలో చేయవలసిన హోమాన్ని అక్కడేచేసి, పూర్ణాహుతి చివరివరకు నిర్వహించాలి.

**నిరగ్నిమథవా భూమిం యమం రుద్రఇ్చ సంస్మరేత్ ।**
**హుత్వా ప్రాధానికే స్థానే పశ్చాదావాహయేచ్చ తమ్ ॥24॥**

**శ్రపయేచ్చాపరం వహ్నౌ ముద్గమిశ్రం చరుం తతః ।**
**తిలతండుల మిశ్రఇ్చ ద్వితీయం సపవిత్రకమ్ ॥25॥**

పిమ్మట అగ్నిలేకుండా ఉండే భూమిని, రుద్రుని, యముని స్మరించాలి. తరువాత హవనం చేసి ప్రధాన స్థానంలో వారిని ఆవాహన చేయాలి. అనంతరం ఆ అగ్నిలో పెసలతో కలిపిన ఒక చరువును (హవిష్యాన్నాన్ని) రెండోదిగా తిలతండుల సమ్మిశ్రితమైన చరువును పవిత్రంతో వండాలి.

**ఓం పృథివ్యై నమస్తుభ్యమితి చైకం నివేదయేత్ ।**
**ఓం యమాయ నమశ్చేతి ద్వితీయం తదనంతరమ్ ॥26॥**

“ఓం పృథివ్యై నమస్తుభ్యం...” అనే మంత్రంతో మొదటి చరువును నివేదన చేయాలి. “ఓం యమాయ నమశ్చ...” అనే మంత్రంతో రెండవ చరువును నివేదన చేయాలి.

**ఓం నమశ్చాథ రుద్రాయ శ్మశానపతయే నమః ।**
**తతో దీప్తే సమిద్ధేఽగ్నౌ భూమౌ ప్రకృతి దారుణే ॥27॥**

"ఓం నమశ్చాథ రుద్రాయ శ్మశానపతయే నమః" అనే మంత్రంతో రుద్రునికి(దేనినైనా) నివేదించాలి. తరువాత భూమియందు స్వభావసిద్ధంగా ప్రజ్వరిల్లే సమిద్ధాగ్నియందు ఈ క్రియలనాచరించాలి.

**సప్తభ్యో యమ సంజ్ఞేభ్యో దద్యాత్సప్త జలాంజలీన్ ।**
**యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయ చ ॥28॥**

**వైవస్వతాయ కాలాయ సర్వప్రాణహరాయ చ ।**
**స్వాధాకార నమస్కార ప్రణవైః సహ సప్తధా ॥29॥**

తరువాత శ్రాద్ధకర్త ఏడు పేర్లతో ఉండే యమునకు ఏడు జలాంజలులు ఈయాలి. స్వధాకారంతోను, నమస్కారంతోను, ప్రణవంతోను కలిపి "ఓం యమాయ స్వధా తస్మై నమః, ఓం ధర్మరాజాయ స్వధా తస్మై నమః, ఓం మృత్యవే స్వధా తస్మై నమః, ఓం అంతకాయ స్వధా తస్మై నమః, ఓం వైవస్వతాయ స్వధా తస్మై నమః, ఓం కాలాయ స్వధా తస్మై నమః, ఓం సర్వప్రాణహరాయ స్వధా తస్మై నమః" అని ఏడు మారులు ఈయాలి.

**అముకాముక గోత్రైతత్తు తుభ్యమస్తు తిలోదకమ్ ।**
**ప్రదద్యాద్దశ పిండాంస్తు అర్ఘ్యపుష్పసమన్వితాన్ ॥30॥**

**ధూపో దీపో బలిర్గంధః సర్వేషామస్తు చాక్షయః ।**
**దశ పిండాస్తు తాన్ దత్వా విష్ణోః సౌమ్యం ముఖం స్మరేత్ ॥31॥**

తరువాత శ్రాద్ధకర్త ఆయా(తన)గోత్రంతో నామంతో ఇది నీకు చెందుగాక అని పది పిండాలను తయారుచేసి తిలోదకం ఈయాలి. ఆర్ఘ్య, పుష్పం, ధూపం, దీపం, బలి(నైవేద్యం), గంధం, అక్షయజలప్రదానం చేసి ఆ పది పిండాలను దానం ఈయాలి. పిమ్మట విష్ణుభగవానుని ప్రసన్నముఖాన్ని ధ్యానించాలి.

**కుర్యాచ్చ మాసికం మాసి సపిండీకరణం తతః ।**
**ఆశౌచాన్తే తతః కుర్యాదాత్మనో వా పరస్య తు ॥32॥**

**కుర్యాదస్థిరతాం జ్ఞాత్వా శక్త్యారోగ్యధనాయుషమ్ ।**
**ఏతత్తే సర్వమాఖ్యాతం జీవచ్ఛ్రాద్ధం మయా ఖగ ॥33॥**

పిమ్మట ప్రతిమాసం మాసిక శ్రాద్ధం, తరువాత సపిండీకరణం చేయాలి. తన నిమిత్తంకాని, పరుని కోసంకాని ఆశౌచం పూర్తిఅయిన తరువాత సపిండీకరణవిధి చేయాలి. శక్తి, ఆరోగ్యం, ధనం, ఆయుష్షు ఈ నాలుగు అస్థిరమని తెలుసుకొని చేయాలి. ఖగమా! ఈ జీవచ్ఛ్రాద్ధం గురించి నీకు నేను అంతా తెలియజేయడం జరిగింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే శ్రాద్ధకర్త్రాత్మశ్రాద్ధయోర్నిరూపణం నామ అష్టమోఽధ్యాయః ॥8॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఆత్మశ్రాద్ధవిధానం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవమోऽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం

## రాజకృతవృషోత్సర్జనవిధిః – రాజు ఆబోతును విడుచుట

**గరుడ ఉవాచ** – గరుడుడు పచించాడు.

**ఉక్తమాద్యాం క్రియాం యావన్నృపోऽపీతి త్వయానఘ ।**
**కస్యచిత్ కేనచిద్రాజ్ఞా కిమాద్యా సా కృతా పురా ॥1॥**

"అనఘా! ఎవరూ లేనివానికి చేసే ఆద్యక్రియ రాజైనా చేయాలని నీవు తెలియజేశావు కదా! పూర్వం ఆ ఆద్యక్రియ ఏ రాజైనా ఎవని కోసమైనా చేశాడా?"

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు పలికాడు.

**సుపర్ణ శృణు వక్ష్యామి యథా రాజ్ఞా క్రియా కృతా ।**
**ఆసీత్ కృతయుగే రాజా వాంగో వై బభ్రువాహనః ॥2॥**

సుపర్ణా! రాజుచేత ఆ క్రియ ఎలా చేయబడిందో చెబుతున్నా విను. పూర్వం కృతయుగంలో వంగదేశంలో బభ్రువాహనుడనే రాజు ఉండేవాడు.

**పృథివ్యాశ్చతురన్తాయా గోప్తా పక్షీంద్ర ధర్మతః ।**
**చతుర్భాగాం భువం కృత్స్నాం స భుంక్తే వసుధాధిపః ॥3॥**

పక్షీంద్రా! అతడు ధర్మానుసారంగా నాలుగు దిక్కులు హద్దులుగా గల భూమిని రక్షిస్తూ ఉండేవాడు. ఆ భూమండలాధిపతి విశాలమైన నాలుగు భాగాలుగానున్న భూమిని (మేరువుకు నలుదిక్కులా ఉన్న భూమిని) పరిపాలిస్తూ ఉండేవాడు.

**న పాపకృత్కశ్చిదాసీత్తస్మిన్ రాజ్యం ప్రశాసతి ।**
**నాసీచ్చౌరభయం తార్క్ష్య న క్షుద్రభయమేవ హి ॥4॥**

అతడు రాజ్యపాలన చేస్తుండగా పాపం చేసేవాడు ఒక్కడూ లేడు. గరుత్మంతా! దొంగల భయమన్నది లేదు. క్షుద్రులవల్ల భయమనేది కానరాదు.

**నాసీద్వ్యాధి భయఞ్చాపి తస్మిఞ్జనపదేశ్వరే ।**
**స్వధర్మే రేమిరే చాసీత్తేజసా భాస్కరోపమః ॥5॥**

రోగభయమన్నది ఎక్కడా లేనేలేదు. అతడు రాజ్యాధిపతిగా ఉండగా, అందరును స్వధర్మాచరణులై ఆనందించారు. అతడు తేజస్సులో సూర్యునితో సమానుడు.

**అక్షుబ్ధత్వేऽచల సమః సహిష్ణుత్వే ధరాసమః ।**
**స కదాచి న్మహాబాహుః ప్రభూత బలవాహనః ॥6॥**

**వనం జగామ గహనం హయానాఇ్చ శతైర్వృతః ।**
**సింహనాదైశ్చ యోధానాం శంఖదుందుభినిఃస్వనైః ॥7॥**

ఏవిధమైన క్షోభను పొందకుండుటలో పర్వతంతో సముదు, సహనగుణంలో భూమితో సమానుడు. ఆ మహాబాహువు ఒకనాడు గొప్ప సైన్యంతోను, వాహనాలతోను, వందలకొలది గుఱ్ఱాలతో యోధాగ్రేసరుల సింహనాదాలతోను, శంఖాల, దుందుభుల ధ్వనులతోను, క్రూరమృగాలతోకూడిన అరణ్యానికి వెళ్లాడు.

**ఆసీత్కిలకిలా శబ్ద స్తస్మిన్ గచ్ఛతి పార్థివే ।**
**తత్ర తత్ర చ విప్రేంద్రైః స్తూయమానః సమంతతః ॥8॥**

ఆ మహారాజు వెడుతూ ఉండగా, దారిలో అక్కడక్కడ బ్రాహ్మణోత్తములు అనేక విధాల స్తుతిస్తూ ఉండగా ఆ వనంలో కోలాహలశబ్దం పుట్టుకొని వచ్చింది.

**నిర్యయౌ పరయా ప్రీత్యా వనం మృగజిఘాంసయా ।**
**సగచ్ఛన్ దదృశే ధీమాన్నందనప్రతిమం వనమ్ ॥9॥**

అతడు మిక్కిలి సంప్రీతితో, క్రూరమృగాలను వేటాడే సంకల్పంతో ఆ అడవిలో సంచరించాడు. ఆ ధీనిధి అయిన రాజు అలా వెడుతూ నందనవనంతో సమానమైన ఒక వనాన్ని చూశాడు.

**బిల్వార్క ఖదిరాకీర్ణం కపిత్థధ్వజసంయుతమ్ ।**
**విషమైః పర్వతైశ్చైవ సర్వతశ్చ సమన్వితమ్ ॥10॥**

**నిర్జలం నిర్మనుష్యఇ్చ బహుయోజనమాయతమ్ ।**
**మృగ సింహైర్మహాఘోరై రన్యై శ్చాపి వనేచరైః ॥11॥**

**తద్వనం మనుజవ్యాఘ్రః సభృత్య బలవాహనః ।**
**లీలయా లోడయామాస సూదయన్ వివిధాన్ మృగాన్ ॥12॥**

మారేడు, జిల్లేడు, చంద్ర చెట్లతోను, పొడవైన ధ్వజాలవంటి వెలగ చెట్లతోను కూడుకొని, అంతటా ఎగుడు దిగుడుగానున్న కొండలతోను వ్యాపించి, ఎక్కడా నీళ్లు, మనుష్య సంచారమూలేక, పెక్కుయోజనాలు వ్యాపించి మహాభయంకరాలైన సింహాలతోను, క్రూరమృగాలతోను ఇతర జంతువులతోను, వనేచరాలతోనున్న ఆ అడవినంతా సేవకులతోను, సైనికులతోను, వాహనాలతోను కూడుకొని నానావిధ మృగాలను సంహరిస్తూ ఒకలీలగా అల్లకల్లోలం చేశాడు.

**మృగస్య కస్యచిత్ కుక్షిం తతో వివ్యాధ భూమిపః ।**
**రాజా మృగప్రసంగేన తమనుప్రావిశద్వనమ్ ॥13॥**

**ఏకాకీ వై హృతబలః క్షుత్పిపాసాసమన్వితః ।**
**స వనస్యాంతమాసాద్య మహచ్చారణ్యమాసదత్ ॥14॥**

ఆ భూపాలుడు ఒక లేడి డొక్కలో బాణంవేసి కొట్టాడు. ఆ మృగం పరుగులు తీయగా, రాజు ఆ లేడిని వెంబడిస్తూ ఆసక్తితో వనమధ్యంలోకి వెళ్లాడు. పరివారానికి దూరమై ఏకాకి అయిపోయాడు. అంత ఆ మహారాజు అలవిమీరిన ఆకలితో, తట్టుకోలేనంత దప్పికతో సతమతమయ్యాడు. అతడు ఆ అడవిలోకి వెళ్లి, మహారణ్యంలోకి చొచ్చుకొనిపోయాడు.

**తృషయా పరయావిష్టోఽ న్విష్యజ్జలమితస్తతః ।**
**సదూరాత్పూరచక్రాహ్వం హంససారసనాదితైః ॥15॥**

**సూచితం సర ఆగత్య సాశ్వ ఏవ వ్యగాహత ।**

మిక్కిలిగా దప్పికతో పీడింపబడినవాడై, నీటికోసమై ఇటూ అటూ వెదకుతూ, అతడు చక్రవాక పక్షులతో హంసలతో, సారసపక్షులతోను కూడుకొని వాటి ధ్వనులతో నిండిన సరస్సును ఒకదానిని దూరంనుండి గుర్తించి పూరచక్రమనే పేరుగల దానిలో గుర్రంతో పాటు దిగాడు.

**పద్మానాఞ్చ పరాగేణ ఉత్పలానాం రజేన చ ॥16॥**

**సుగంధమమలం శీతం పీత్వాంభో నిర్జగామ హ ।**
**మార్గశ్రమ పరిశ్రాంత స్తటాగతట మండపమ్ ॥17॥**

తామరల పుప్పొడులతోను, కలువల ధూళితోను కూడుకొన్న చక్కని వాసనలతో నిండిన స్వచ్ఛమైన చల్లని నీరుత్రాగి అందుండి బయటకువచ్చాడు, ప్రయాణ శ్రమతో అలసిపోయి ఆ చెరువు గట్టుననున్న మండపంలో సమీపించాడు.

**న్యగ్రోధం వీక్ష్య తస్యాశు జటాస్వశ్వం బబంధ హ ।**
**స తత్రాస్తరమాస్తీర్య ఖేటకానుపధాయ చ ॥18॥**

**సుష్వాప వాయునా తత్ర సేవ్యమానస్తదా క్షణమ్ । (త)**

ఒక మఱ్ఱిచెట్టును చూచి వెంటనే దాని ఊడలతో అశ్వాన్ని కట్టివేశాడు. అతడు అక్కడ ఒక ఆసనం ఏర్పాటుచేసుకొని, వేట సామాగ్రినే(డాలునే)తలదిండుగా చేసుకొని, గాలితో సేవింపబడుతూ అక్కడ క్షణంలోనే నిదురించాడు.

**క్షణం సుప్తే నృపే తత్ర ప్రేతో వై ప్రేతవాహనః ॥19॥**

**కశ్చిదత్రాజగామాథ యుక్తః ప్రేతశతేన చ ।**
**అస్థిచర్మ శిరాశేష శరీరః పరివిభ్రమన్ ॥20॥**

రాజు అక్కడ క్షణకాలం నిద్రకై కన్నులు మూయగానే, ప్రేతవాహనుడు అనే ప్రేత ఒకడు వందమంది ప్రేతలతో కలసి అక్కడకు వచ్చాడు. ఎముకలు, చర్మం, సిరలతో నిండిన శరీరంతో పరిభ్రమిస్తూ ఏతెంచాడు.

**భక్ష్యం పేయం మార్గమాణో న బధ్నాతి ధృతిం క్వచిత్ ।**
**తమపూర్వం నృపో దృష్ట్వాఽ కరోదస్త్రం శరాసనే ॥21॥**

అతడు తినడానికి, త్రాగడానికి వెదుకుకొంటూ వచ్చాడు. పూర్వంలో ఎప్పుడునూ చూడని ఆ ప్రేతను చూచి రాజు ఏమాత్రం ధైర్యాన్ని కోల్పోక చివ్వునలేచి ధనుస్సులో బాణాన్ని సంధించాడు.

**దృష్ట్వా సోఽపి చిరం భూపం తస్థౌ స్థాణురివాగ్రతః ।**
**తమవస్థితమాలోక్య రాజా ప్రాప్త కుతూహలః ॥22॥**

**పప్రచ్ఛ తఞ్చ కోఽసీతి కుతో వా వికృతిం గతః ।**

ఆ ప్రేత కూడ చాలాసేపు రాజును చూచి, ఎదురుగా ఒకస్థాణువు(మొద్దు)వలె నిల్చుండి పోయాడు. అలా మ్రాన్పడిపోయి ఉన్న ప్రేతను చూచి రాజు కుతూహలంతో ఆ ప్రేతను "నీవు ఎవరివి? ఈ వికృతశరీరం నీకు ఎలా వచ్చింది?" అని అడిగాడు.

**ప్రేత ఉవాచ** – ప్రేత బదులు ఇచ్చాడు.

**ప్రేతభావో మయా త్యక్తో గతిం ప్రాప్తోఽస్మ్యహం పరామ్ ॥23॥**

**త్వత్సంయోగాన్మహాబాహో నాస్తి ధన్యతరో మయా ।**

"ఓ మహాబాహూ! నీ సంసర్గంవల్ల నేను ప్రేతభావాన్ని వదలివేశాను. నేను పరమగతిని పొందడానికి అర్హుడనయ్యాను. నాకన్న ధన్యతరుడు లేడు.

**బభ్రువాహన ఉవాచ** – బభ్రువాహనుడు పలికాడు.

**కిమేతద్విపినే ఘోరే సర్వత్రాతి భయానకే ॥24॥**

**దోధూయమానే వాతేన వాత్యారూపేణ కోణప ।**
**పతంగా మశకాః క్షుద్రాః కబన్ధాశ్చ శిరాంసి చ ॥25॥**

మిక్కిలి భయంకరమై, అంతటా ఘోరంగా కనిపిస్తున్న అడవిలో, ఇదేమిటి? గాలితో అంతా కల్లోలమయిపోతూ ఉంది. గాలులు, ఉరుములు, మెరుపులవంటి ధ్వనులతో శబ్దంచేస్తున్నాయి?(వు?) ఒకవైపు పక్షులు, దోమలు, క్షుద్రజంతువులు, ఇంకొకవైపు మొండెములు, శిరస్సులు.

**మత్స్యాః కూర్మాః కృకలాసా వృశ్చికా భ్రమరాహయః ।**
**అధోముఖోర్ధ్వపాదాస్తే క్రందమానాః సుదారుణమ్ ॥26॥**

చేపలు, తాబేళ్లు, తొండలు, తేళ్లు, తేనెటీగలు, పాములు. మరోవైపు తలలు క్రిందకువంచి, కాళ్లపైకి పెట్టి, మిక్కిలి తీవ్రంగా అరుస్తున్నవారెవరో?

**ప్రవాంతి వాయవో రూక్షా జ్వలంతో విద్యుదగ్నయః ।**
**ఇతస్తతో భ్రమన్తీవ వాయునా తృణసన్తతిః ॥27॥**

**దృశ్యంతే వివిధా జీవా నాగాశ్చ శలభవ్రజాః ।**
**శ్రూయంతే బహుధా రావా న దృశ్యంతే క్వచిత్ క్వచిత్ ॥28॥**

**దృష్ట్వేదం వికృతం సర్వం వేపతే హృదయం మమ ।**

గాలులు భయంకరంగా వీస్తున్నాయి. మెరపుతీగలు నిప్పులతో మండిపోతున్నాయి. నానావిధాలైన జీవరాశులు, నాగాలు, మిడతల దండ్లు కనిపిస్తున్నాయి. అనేక విధాలైన ధ్వనులు వినిపిస్తున్నాయి. ఏమీ కానరావడంలేదు. అక్కడక్కడ మాత్రమే గోచరిస్తున్నాయి. గాలిచే గడ్డిపరకలు పైకి ఇటూ అటూ ఎగిరిపోతున్నాయి. ఈ వికారరూపాలు, వికృతస్వరాలు, అన్నీ చూస్తూ వింటూ ఉంటే నా హృదయం కంపించి పోతోంది"

**ప్రేత ఉవాచ** – ప్రేత వచించాడు.

**యేషాం నైవాగ్ని సంస్కారో న శ్రాద్ధం నోదక క్రియాః ॥29॥**

**షట్పిండా దశగాత్రాణి సపిండీకరణం న హి ।**
**విశ్వాసఘాతినో యే చ సురాపాః స్వర్ణహారిణః ॥30॥**

**మృతా దుర్మరణాద్యే చ యే చాసూయపరా జనాః ।**
**ప్రాయశ్చిత్త విహీనా యే అగమ్యాగమనే రతాః ॥31॥**

**కర్మభిర్భ్రామ్యమాణాస్తే ప్రాణినః స్వకృతైరిహ ।**
**దుర్లభాహారపానీయా దృశ్యంతే పీడితా భృశమ్ ॥32॥**

ఎవరికయితే అగ్నిసంస్కారం, శ్రాద్ధం ఉండవో, తర్పణాలు లేకుండా ఉంటాయో, షట్పిండాలు(ఆరు), దశ(పది)గాత్రాలు, సపిండీకరణం జరగవో, ఎవరయితే విశ్వాసఘాతకులు, త్రాగుబోతులు, బంగారం దొంగిలించేవారు అయిఉంటారో, ఎవరయితే అపమృత్యువు వాతపడతారో, ఎవరయితే అసూయాపరులై ఉంటారో, ఏ జనులు ప్రాయశ్చిత్తాలు చేసుకోకుండా ఉంటారో, పొందకూడనివారి పొందు కోరుకొనే వారెవరయితే ఉంటారో, అటువంటి ప్రాణులు తమచే చేయబడిన పాపకర్మలచే పరిభ్రమిస్తూ ఇలా ప్రేతరూపాలు ధరిస్తారు. వారికి తిండి, నీరు దొరకదు. ఇలా మిక్కిలి పీడితులై కనిపిస్తారు.

**ఏతేషాం కృపయా రాజంస్త్వం కురుష్వోర్ధ్వ దేహికమ్ ।**
**యేషాం న మాతా న పితా న పుత్రో న చ బాంధవాః ॥33॥**

**తేషాం రాజా స్వయం కుర్యాత్ కర్మాణి తు యతో నృపః ।**
**ఆత్మనశ్చ శుభం కర్మ కర్తవ్యం పారలౌకికమ్ ॥34॥**

రాజా! వీరికి అందరికి దయతోనీవు ఔర్ధ్వదేహిక క్రియలు నిర్వహించు. ఎవరికయితే, తల్లి ఉండదో, తండ్రి ఉండడో, కొడుకు ఉండడో, బాంధవులు ఉండరో(శ్రాద్ధక్రియ చేయుటకు) వారికి రాజే స్వయంగా ఆ కర్మలు చేయాలి(చేయించాలి). దానివల్ల రాజు తాను శుభం పొందుతాడు. పారలౌకికమైన సుఖం(స్థానం)కూడ లభిస్తుంది.

**విముక్తః సర్వదుఃఖేభ్యో యేనాంజో దుర్గతిం తరేత్ ।**
**భ్రాతరః కస్య కే పుత్రా స్త్రియోఽపి స్వార్థకోవిదాః ॥35॥**

ఈ ప్రేతలకు సమస్త దుఃఖాలనుండి విముక్తి లభిస్తుంది. వీరు వెంటనే దుర్గతి నుండి తప్పించుకొన్న వారవుతారు. ఎవరి కెవరు? ఎవరికి ఎవరు పుత్రులు? సోదరులు? స్త్రీలయినా(భార్యలయినా) మన(వారి) స్వార్థంకొద్దీ దగ్గరవుతూ ఉంటారు.

**న కార్యస్తేషు విశ్రంభః స్వకృతం భుజ్యతే యతః ।**
**గృహేష్వర్థా నివర్తనే శ్మశానే చైవ బాంధవాః ॥36॥**

**శరీరం కాష్ఠమాదత్తే పాపం పుణ్యం సహ వ్రజేత్ ।**
**తస్మాదాశు త్వయా సమ్యగాత్మనః శ్రేయ ఇచ్ఛతా ॥37॥**

**అస్థిరేణ శరీరేణ కర్తవ్యశ్చౌర్ధ్వ దేహికమ్ ।**

కావున వాటియందు నమ్మిక పనికిరాదు. ఎవరి కర్మను వారే అనుభవించాలి. ధనాలు ఇండ్లలోనే వీడ్కోలు ఇస్తాయి. శ్మశానంలో బాంధవులు వీడ్కోలు ఇస్తారు. శరీరాన్ని కాష్ఠం స్వీకరిస్తుంది. పాపం పుణ్యం మాత్రం కలిసి వానివెంట వెడతాయి. నీ శ్రేయస్సును కోరుకొన్నవాడవై, అందువల్ల వెంటనే నీవు ప్రేతలకు శ్రాద్ధకర్మ ఆచరించు. శరీరం శాశ్వతంగా ఉండేదికాదు. దీనితో ప్రేతలకు ఔర్ధ్వదేహికకర్మ ఆచరించు.

**రాజోవాచ** – రాజు అన్నాడు.

**కృశరూపః కరాలాక్షస్త్వం ప్రేత ఇవ లక్ష్యసే ॥38॥**

**కథయస్వ మమ ప్రీత్యా ప్రేతరాజ యథాతథమ్ ।**
**తథా పృష్టః స వై రాజ్ఞా ఉవాచ సకలం స్వకమ్ ॥39॥**

నీవు కృశించిన రూపంతో ఉన్నావు. కళ్లు చూస్తే భయంకరంగా ఉన్నాయి. ప్రేతలాగా కనబడుతున్నావు. ఓ ప్రేతరాజా! ఉన్నదున్నట్లుగా ప్రీతితో నాకు తెలియజేయవలసింది. రాజు అలా అడుగగా అతడు తన సమస్త వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు.

**ప్రేత ఉవాచ** – ప్రేత వచించాడు.

**కథయామి నృపశ్రేష్ఠ సర్వమేవాదితస్తవ ।**
**ప్రేతత్వే కారణం శ్రుత్వా దయాం కర్తుమిహార్హసి ॥40॥**

రాజోత్తమా! మొదటినుండి నా వృత్తాంతాన్ని అంతనూ నీకు చెప్తున్నాను. నాకు ఈ ప్రేతత్వం వచ్చిన కారణాన్ని విని నువ్వు నాపై దయచూపు.

**వైదిశం నామ నగరం సర్వ సంపత్సుఖావహమ్ ।**
**నానాజన పదాకీర్ణం నానారత్న సమాకులమ్ ॥41॥**

**నానాపుష్పవనాకీర్ణం నానాపుణ్యజనావృతమ్ ।**
**తత్రాహం న్యవసం భూప దేవార్చనరతః సదా ॥42॥**

వైదిశమనే పేరుగల నగరం ఉండేది. అది సకల సంపదలకూ, సుఖాలకూ నిలయం. అనేక జనపదాలతో కూడుకొన్నది. అనేకులైన పుణ్యాత్ములతో వ్యాపింపబడినది. నానావిధ రత్న సమూహాలతో నిండినది. వివిధ పుష్పాలతో నిండిన ఉద్యానవనాలతో కూడుకొన్నది. రాజా! ఆ నగరంలో నేను నివసించేవాడిని. ఎల్లప్పుడు దేవతార్చనయందు ఆసక్తితో ఉండేవాడిని.

**వైశ్యజాతిః సుదేవోఽహం నామ్నా విదితమస్తు తే ।**
**హవ్యేన తర్పితా దేవాః కవ్యేన పితరో మయా ॥43॥**

నేను వైశ్యజాతికి చెందినవాడను. సుదేవుడు అనే పేరుతో పిలువబడేవాడిని. నీకు అంతా తెలిసే ఉంటుంది. నాచే ఈయబడిన హవ్యాలచే దేవతలు సంతుష్టి పొందారు. కవ్యాలచే పితృదేవతలు (పితరులు) సంతృప్తి నొందారు.

**వివిధైర్దానయోగైశ్చ విప్రాః సంతర్పితా మయా ।**
**ఆహారశ్చ విహారశ్చ మయా వై సునివేశితః ॥44॥**

నానావిధాలైన దానవిధులతో నేను బ్రాహ్మణులను బాగా సంతృప్తి పరచాను. ఆహారం, విహారం నాచే చక్కగా కల్పింపబడడం జరిగింది.

**దీనానాథ విశిష్టేభ్యో మయా దత్త మనేకధా ।**
**తత్సర్వం నిష్ఫలం జాతం మమ దైవాదుపాగతమ్ ॥45॥**

దీనులకు, అనాథులకు, విశిష్టులకు నేను ఎన్నోవిధాల సహాయం అందించాను. కాని దైవయోగం వల్ల ఏర్పడిన దానితో అదంతా నిష్ఫలమైపోయింది.

**నమేఽస్తి సంతతి స్తాత న సుహృన్న చ బాంధవాః ।**
**న చ మిత్రం హిత స్తాదృగ్యః కుర్యాదౌర్ధ్వ దైహికమ్ ॥46॥**

నాయనా! నాకు సంతానంలేదు. స్నేహితుడు (సుహృత్తు) లేడు, బాంధవులుకూడ లేరు. మిత్రుడు (మిత్రము)కాని, హితుడు కాని లేడు. ఇక ఔర్ధ్వదైహికకర్మను ఎవడు చేస్తాడు కనుక?

**ప్రేతత్వం సుస్థిరం తేన మమ జాతం నృపోత్తమ ।**
**ఏకాదశం త్రిపక్షఞ్చ షాణ్మాసిక మథాబ్దికమ్ ॥47॥**

**ప్రతిమాస్యాని చాన్యాని హ్యేవం శ్రాద్ధాని షోడశ ।**
**యస్యైతాని న దీయంతే ప్రేతశ్రాద్ధాని భూపతే ॥48॥**

**ప్రేతత్వం సుస్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి ।**
**ఏవం జ్ఞాత్వా మహారాజ ప్రేతత్వాదుద్ధరస్వ మామ్ ॥49॥**

రాజశేఖరా! ఆ కారణంచేత నాకు సుస్థిరమైన ప్రేతత్వం సంభవించింది. ఏకాదశవిధి, త్రిపక్షవిధి, షాణ్మాసికం, ఆబ్దికం, ప్రతిమాసంలోను పెట్టే మాసికం, అలాగే మిగిలిన షోడశ శ్రాద్ధాలు భూపాలా! ఇటువంటి ప్రేత శ్రాద్ధాలు

చేయబడనివాడికి మిగిలిన శ్రాద్ధాలు వందలకొలది చేసినప్పటికిని, ప్రేతత్వం స్థిరంగా ఉండిపోతుంది. మహారాజ! ఈ విషయాన్ని గ్రహించి నన్ను ఈ ప్రేతత్వంనుంచి ఉద్ధరించు.

**వర్ణానాఞ్చైవ సర్వేషాం రాజా బంధురిహోచ్యతే ।**
**తన్మాం తారయ రాజేన్ద్ర మణిరత్నం దదామి తే ॥50॥**

ఇక్కడ సర్వవర్ణాలవారికి రాజే బంధువని చెప్పబడుతోంది. అందువల్ల రాజేంద్రా ! నన్ను తరింపజేయి. మీకు ఈ మణిరత్నాన్ని ఇస్తున్నాను.

**యథా మమ శుభావాప్తి ర్భవేన్నృపవరోత్తమ ।**
**తథా కార్యం మహీపాల దయాం కృత్వా మయి ప్రభో ॥51॥**

రాజన్యవర్యా! నాకు శుభాభివృద్ధి ఏ విధంగా సంభవిస్తుందో, ఆ విధంగా మహీపాలా! ప్రభూ! నాయందు దయయుంచి చేయవలసింది.

**సపిండైర్వా సగోత్రైర్వా నిష్ఠురై ర్న కృతో హి మే ।**
**వృషోత్సర్గస్తతో దుష్టం ప్రేతత్వం ప్రాప్తవానహమ్ ॥52॥**

సపిండులచే కాని, సమాన గోత్రులచే కాని, నన్ను వ్యతిరేకబుద్ధితో నిష్ఠురంగా చూచేవారిచే కాని నాకు వృషోత్సర్గవిధి చేయబడలేదు. అందువల్ల నేను ఈ దుష్టమైన ప్రేతత్వాన్ని పొందాను.

**క్షుత్తృషావిష్ట దేహశ్చ భక్ష్యం పానం న చాప్నుయామ్ ।**
**అతో వికృతి రేషా వై కృశత్వాదిరమాంసకా ॥53॥**

**క్షుత్తృడ్జన్యం మహాదుఃఖమనుభవామి పునః పునః ।**
**అకల్యాణం హి ప్రేతత్వం వృషోత్సర్గం వినాకృతమ్ ॥54॥**

**తస్మాద్రాజన్దయాసింధో ప్రార్థయామి తవాగ్రతః ।**

ఆకలి దప్పికలతో కూడుకొన్న శరీరంతో తిండి, నీరు పొందలేకపోయాను. అందువల్ల మాంసం ఏమాత్రం లేక శరీరం కృశించిపోయి ఈ వికృతరూపాన్ని పొందింది. ఆకలి దప్పికలవల్ల పుట్టిన మహాదుఃఖాన్ని అనుక్షణం పొందుతున్నాను. అమంగళమైన ఈ ప్రేతరూపం వృషోత్సర్జనవిధి చేయకపోతే పోయేది కాదు. అందువల్ల రాజా! కృపాసాగరా! నీ ఎదుట పదే పదే వేడుకొంటున్నాను.

**రాజో వాచ** – రాజు వచించాడు.

**వర్తతే మత్కులే ప్రేత ఇతి జ్ఞేయం కథం నరైః ॥55॥**

**తన్మమాచక్ష్వ హి ప్రేత ప్రేతత్వాన్ముచ్యతే కథమ్ ।**

నా వంశంలో ప్రేత ఉన్నాడనే సంగతి నరులచే ఎలా గ్రహింపబడుతుంది? ఓ ప్రేతమా! ఆ విషయాన్ని నాకు తెలియజేయవలసింది. ప్రేతత్వంనుండి విముక్తి ఎలా లభిస్తుంది?

**ప్రేత ఉవాచ** – ప్రేత బదులిచ్చాడు.

**లింగేన పీడయా ప్రేతోఽనుమాతవ్యో నరైః సదా ॥56॥**

**వక్ష్యామి పీడాస్తా రాజన్యా వై ప్రేతకృతా భువి ।**
**ఋతుః స్యాదఫలః స్త్రీణాం యదా వంశో న వర్ధతే ॥57॥**

రాజా! కొన్ని చిహ్నాలద్వారా, పీడలద్వారా, నరులు నిత్యమూ ప్రేతత్వాన్ని గురించి ఊహించవచ్చు. భూమియందు ప్రేతలచే చేయబడే ఆ పీడలను గురించి చెబుతున్నాను. శాస్త్రోక్తంగా స్త్రీతో ఋతుకాలంలో సంభోగించినా ఫలితం ఉండదు, ఆ వంశం వృద్ధి చెందదు,

**మ్రియంతే చాల్పవయసః సా పీడా ప్రేతసంభవా ।**
**అకస్మాద్వృత్తి హరణ మప్రతిష్ఠా జనేషు వై ॥58॥**

**అకస్మాద్గృహ దాహః స్యాత్సా పీడా ప్రేతసంభవా ।**

అల్ప వయస్కులు మరణించినా, ఆ పీడ ప్రేతవల్ల కలిగిందే. అనుకోకుండా(వృత్తి) ఆదాయం పడిపోయినా, జనులయందు అప్రతిష్ఠ సంభవించినా, అకస్మాత్తుగా ఇల్లు తగలబడిపోయినా, ఆ పీడ ప్రేత వల్ల ఏర్పడిందే.

**స్వగేహే కలహో నిత్యం స్యాచ్చ మిథ్యాభిశంసనమ్ ॥59॥**

**రాజయక్ష్మాది సంభూతిః సా పీడా ప్రేతసంభవా ।**

స్వగృహంలో నిత్యం కలహం ఏర్పడినా, ఏ అపరాధమూ లేకుండా అపవాదు పొందినా, రాజయక్ష్మం (క్షయ)వంటి రోగాలు ఏర్పడినా, ఆ పీడ ప్రేతవల్ల సంభవించిందే.

**అపి స్వయం ధనం ముక్తం ప్రయత్నాదనవే పథి ॥60॥**

**నైవ లభ్యేత నశ్యేత సా పీడా ప్రేతసంభవా ।**

అతి ప్రయత్నంతో స్వయంగా సంపాదించిన ధనాన్ని మార్గమధ్యంలో పోగొట్టుకొని తిరిగి పొందలేక పోయినా, అది నశించినా, ఆ పీడ ప్రేతదోషంవల్ల కలిగిందే.

**సువృష్టౌ కృషినాశః స్యాద్వాణిజ్యాద్వృత్తి నాశనమ్ ॥61॥**

**కలత్రం ప్రతికూలం స్యాత్సా పీడా ప్రేతసంభవా ।**

సకాలంలో వర్షాలు పడినా పంటలు నాశనమైనా, వ్యాపారంలో లాభప్రవృత్తి లేకపోయినా, భార్య ప్రతికూలయై చరించినా, ఆ పీడ ప్రేతదోషంవల్ల ఏర్పడిందే.

**ఏవన్తు పీడయా రాజన్ ప్రేతజ్ఞానం భవేన్నృణామ్ ॥62॥**

**వృషోత్సర్గో యది భవేత్ప్రేతత్వాన్ముచ్యతే తదా ।**
**తస్మాన్నృప త్వమప్యేవం వృషోత్సర్గం కురు ప్రభో ॥63॥**

రాజా! ఈ విధంగా నరులకు ఏర్పడే పీడనుబట్టి ప్రేతకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. వృషోత్సర్గమే కనుక జరిగినట్లయితే ప్రేతత్వం నుండి అప్పుడు విముక్తి దొరుకుతుంది. ప్రభూ! రాజా! అందువల్ల నువ్వు కూడ వృషోత్సర్జనవిధి జరిపించవలసింది.

**మాముద్దిశ్య నృపేఽ పృత్రాధికారోఽ త్యనుకంపయా ।**
**రాజపుత్రో హతః కశ్చిన్మయైవాప్తస్తతో మయా ॥64॥**

**కురుష్వత్వం గృహీత్వా మే తద్ధనేన వృషోత్సవమ్ ।**
**కార్తిక్యాం పౌర్ణమాస్యాం వాశ్వయుజ్మధ్యేఽ థవా నృప ॥65॥**

రాజునందు అధికారం ఉందికాని నన్ను ఉద్దేశించి దయతో ఈ విధి చేయవలసింది. ఒకానొక రాజకుమారుడు నాచే హతుడైనాడు అందువల్ల నాకు ఈ ప్రేతత్వం వచ్చింది. నా ధనాన్ని(మణిని) నీవు స్వీకరించి, ఆ ద్రవ్యంతో కార్తికమాసంలో పౌర్ణమినాడు కాని, ఆశ్వయుజమాసం మధ్యలో కాని, రాజా! వృషోత్సవం నిర్వహించు.

**రేవతీయుక్త దివసే కృషీష్ఠా మే వృషోత్సవమ్ ।**
**పుణ్యాన్విప్రాన్ సమాహూయ వహ్నిం స్థాప్య విధానతః ॥66॥**

**మంత్రైర్హోమస్తథా కార్యః షడ్భిర్నృప విధానతః ।**

రేవతీ నక్షత్రంతో కూడుకొనిన రోజున కాని నాకు వృషోత్సవాన్ని జరిపించవలసింది. రాజా! పవిత్రులైన బ్రాహ్మణులను ఆహ్వానించి, శాస్త్రవిధిని అగ్నిని స్థాపనచేసి, మంత్రాలతో హోమం చేయించాలి. ఆరుగురిచే విధ్యుక్తంగా ఈ ఉత్సవం చేయించవలసింది.

**బహూన్ విప్రాన్ భోజయేథా స్తద్రత్నాప్తధనేన వై ।**
**ఏవంకృతే మహీపాల మమ ముక్తిర్భవిష్యతి ॥67॥**

ఆ రత్నంవల్ల లభించే ధనంతో ఎక్కువమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టవలసింది. ధరాధిపా! ఈ విధంగా చేసినట్లయితే నాకు ప్రేతత్వంనుండి విముక్తి లభిస్తుంది.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**తథేతి ప్రతిజగ్రాహ మణిం రాజా తతః ఖగ ।**

ఖగమా! అంత ఆ రాజు అలాగే అని ఆ మణిని స్వీకరించాడు.

**క్రియాధికారస్తస్యైవ యో ధనగ్రాహకో భవేత్ ।**
**కుర్వతోఽ స్తు తయోర్వార్తామేవం ప్రేతమహీక్షితోః ॥68॥**

**ఝణత్కారస్తు ఘంటానాం భేరీణాం భాంకృతిస్తథా ।**
**జాతస్తదా రాజసేనా చతురంగా సమాపతత్ ॥69॥**

ఎవడయితే ధనాన్ని తీసుకొంటాడో, అతనికే కర్మచేసే అధికారం ఉంటుంది. ఈ విధంగా ప్రేత, రాజు పరస్పరం సంభాషణ కొనసాగిస్తూ ఉండగా, ఘంటల ఝణత్కారాలతోను, భేరీ భాంకృతులతోను చతురంగయుక్తమైన రాజుసేన ఒక్కసారిగా కనబడి అక్కడకు వచ్చింది.

**తస్యామాగత మాత్రాయాం ప్రేతశ్చాదృశ్యతాం గతః ।**
**తస్మాద్వనాద్వినిఃసృత్య రాజాపి పురమాగమత్ ॥70॥**

సేన అలా వస్తూ ఉన్నంతలోనే ప్రేతకూడ అదృశ్యమై పోయింది. రాజుకూడ ఆ వనంనుండి బయటపడి తన పురానికి వెళ్లిపోయాడు.

**స కార్తిక్యాం పూర్ణిమాయాం ప్రేతముద్దిశ్య సంవ్యధాత్ ।**
**వృషోత్సర్గం విధానేన తన్మణ్యాప్తధనేన చ ॥71॥**

ఆ నృపుడు కార్తికమాసంలోని పూర్ణిమాతిథియందు ప్రేతను ఉద్దేశించి, ఆ మణిద్వారా పొంది ధనంతో శాస్త్రోక్త విధానంతో వృషోత్సర్గవిధిని నిర్వహించాడు.

**ప్రేతోఽ ప్యయం సపది లబ్ధ సువర్ణదేహః కర్మాంత ఆగత ఇతి ప్రణనామ భూపమ్ ।**
**దేవ త్వదీయ మహిమాయమితి స్తువన్ స యాతో దివం గరుడ భూపతినా కృతజ్ఞః ॥72॥**

ఆ ప్రేత కూడ వెంటనే బంగారపురంగు మేను పొంది అక్కడకు కర్మాంతంలో వచ్చి రాజుకు నమస్కరించాడు. దేవా! ఇది నీ సంబంధమైన గొప్పదనమే యని స్తోత్రం చేస్తూ కృతజ్ఞుడై, చివరకు గరుడా! ఈ విధంగా రాజుద్వారా ఆ ప్రేత స్వర్గానికి వెళ్ళాడు.

**ఏతత్తే సర్వమాఖ్యాతం యథా భూపతినాపి సః ।**
**ఉద్ధృతః ప్రేతభావాద్వై కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥73॥**

ఆ ప్రేత ఏవిధంగా ప్రేతభావంనుండి ఉద్ధరింపబడినాడో, దానినంతను నీకు తెలియజేశాను. ఇక ఏమి వినగోరుతున్నావు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే రాజకృతవృషోత్సర్గక్రియాది నిరూపణం నామ నవమోఽధ్యాయః ॥9॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో రాజు ఆబోతును విడుచుట అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **దశమోఽధ్యాయః** - పదవ అధ్యాయం

## **శ్రాద్ధతృప్తినిరూపణమ్** - శ్రాద్ధతృప్తి

**గరుడ ఉవాచ** - గరుడుడు పలికాడు.

**సపిండీకరణే జాతే ఆబ్దికే చ స్వకర్మభిః ।**
**దేవత్వం వా మనుష్యత్వం పక్షిత్వం వాప్నుయుర్నరాః ॥1॥**

**తేషాం విభిన్నాహారాణాం శ్రాద్ధం వై తృప్తిదం కథమ్ ।**

సపిండీకరణం, ఆబ్దికం తరవాత మృత్యవ్యక్తులు తమ కర్మానుసారంగా దేవత్వం కాని, మనుష్యత్వం కాని, పక్షిత్వం (తిరగ్జాతిత్వం) కాని పొందుతారు కదా! వారికి వేరు వేరు ఆహారాలు కదా! వారికి ఇక్కడ పెట్టిన శ్రాద్ధం ఎలా తృప్తినిస్తుంది?

**యద్యప్యన్యై ర్ద్విజైర్భుక్తం హూయతే యది వానలే ॥2॥**

**శుభాశుభాత్మకైః ప్రేతస్తద్దత్తం భుజ్యతే కథమ్ ।**
**శ్రాద్ధస్యావశ్యకత్వన్తు అమావాస్యాదిషు శ్రుతమ్ ॥3॥**

ప్రేతరూపంలోనున్న వానిని ఉద్ధరించడానికి ఇక్కడ బ్రాహ్మణులకు పెట్టే భోజనంకాని, అగ్నిలో హుతం చేసిన పిండం కాని, శుభాశుభ స్వరూపాలైన ఆహారాలు కాని, వారికి ఎలా చేరుతాయి? ఇచ్చిన వాటిని ప్రేత ఎలా భుజిస్తాడు? శ్రాద్ధాల ఆవశ్యకత అమావాస్యనాడు ప్రధానమని, మిగిలినరోజులుకూడ అటువంటివే అని వినబడుతోంది కదా! అని అడిగాడు.

**శ్రీ భగవానువాచ** - శ్రీ భగవంతుడు వచించాడు.

**ప్రేతానాం శృణు పక్షీంద్ర యథా శ్రాద్ధన్తు తృప్తిదమ్ ।**
**దేవో యదపి జాతోఽయం మనష్యః కర్మయోగతః ॥4॥**

**తస్యాన్నమమృతం భూత్వా దేవత్వేఽప్యనుయాతి చ ।**
**గాంధర్వ్యే భోగరూపేణ పశుత్వే చ తృణం భవేత్ ॥5॥**

పక్షీంద్రా! ఇక్కడ పెట్టిన శ్రాద్ధం ప్రేతలకు ఎలా తృప్తినిస్తుందో విను. మనుష్యుడు స్వపుణ్య కర్మయోగంవల్ల దేవతలలో పుట్టినవాడయితే, అతనికి పెట్టే శ్రాద్ధాన్నం అమృతంగా మారి దేవత్వంలో కూడ వానిచేతికి అందుతుంది. గంధర్వయోనిలో ఉద్భవిస్తే, భోగరూపంలో వానికి చేరుతుంది. పశుజన్మ పొందితే గడ్డిరూపంలో వానికి అందుతుంది.

**శ్రాద్ధం హి వాయురూపేణ నాగత్వేఽప్యనుగచ్ఛతి ।**
**ఫలం భవతి పక్షిత్వే రాక్షసేషు తథామిషమ్ ॥6॥**

**దానవత్వే తథా మాంసం ప్రేతత్వే రుధిరం తథా ।**
**మనుష్యత్వేఽన్నపానాది బాల్యే భోగరసో భవేత్ ॥7॥**

పాము జన్మ పొందితే శ్రాద్ధక్రియ వాయురూపంలో వాటిని చెందుతుంది. పక్షి జన్మ పొందితే ఫల రూపంలోను, రాక్షసయోని పొందితే ఆమిష రూపంలోను, దానవత్వాన్ని పొందితే మాంసరూపంలోను, ప్రేతత్వాన్ని పొందితే రక్తరూపంలో చేరుతుంది. మనుష్యజన్మ పొందితే అన్నపానాలుగాను, బాల్యంలో సుఖాన్నిచ్చే రసరూపంలోనూ అందుతుంది.

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**కథం కవ్యాని దత్తాని హవ్యాని చ జనైరిహ ।**
**గచ్ఛంతి పితృలోకం వా ప్రాపకః కోఽత్ర గద్యతే ॥8॥**

ఈ లోకంలో మనుష్యుల ద్వారా ఈయబడిన హవ్య కవ్యాలు పితృలోకం ఎలా వెడతాయి? వాటిని చేర్చే వాడెవడు?

**మృతానామపి జన్తూనాం శ్రాద్ధమాప్యాయనం యది ।**
**నిర్వాణస్య ప్రదీపస్య తైలం సంవర్ధయేచ్ఛిఖామ్ ॥9॥**

చనిపోయిన ప్రాణులకు ఇక్కడపెట్టే శ్రాద్ధం కడుపు నింపడమంటే, ఆరిపోయిన దీపంలో తైలం పోసి వెలుగులు విరజిమ్ముతాయన్నట్లుంటుంది.

**మృతాశ్చ పురుషాః స్వామిన్ స్వకర్మ జనితాం గతిమ్ ।**
**గాహంతః కే కథం స్వస్య సుతస్య శ్రేయ ఆప్నుయుః ॥10॥**

స్వామీ! చనిపోయిన పురుషులు తమ కర్మ ఫలితాన్ని అనుసరించి ఆయా ప్రదేశాలకు పోతారుకదా ! అప్పుడు వారి పుత్రులద్వారా చేయబడిన శ్రాద్ధకర్మయొక్క పుణ్యఫలాన్ని ఎలా పొందుతారు?

**శ్రీభగవానువాచ** - శ్రీభగవంతుడు వచించాడు.

**శ్రుతేః ప్రత్యక్షత స్తార్క్ష్య ప్రామాణ్యం బలవత్తరమ్ ।**
**శ్రుత్యా తు బోధితార్థస్య పీయూషత్వాది రూపతా ॥11॥**

**నామగోత్రం పితౄణాం వై ప్రాపకం హవ్యకవ్యయోః ।**
**శ్రాద్ధస్య మంత్రాస్తద్వత్తు ప్రాపకాశ్చైవ భక్తితః ॥12॥**

తార్క్ష్యా! ప్రత్యక్షంగా కనిపించే ప్రమాణంకన్న శ్రుతివాక్యప్రమాణం మిక్కిలి బలం కలది. శ్రుతిద్వారా బోధింపబడే జ్ఞానం అమృతం మున్నగు వాటితో సమానమైనది. శ్రాద్ధకర్మలో ఉచ్చరింపబడే నామగోత్రాలే పితరులకు హవ్య కవ్యాలను అందించే ప్రాపకాలు. అలాగే సుస్వరంతో పఠించే శ్రాద్ధంలోని మంత్రాలే వాటిని వారికి ప్రాప్తించేటట్లు చేస్తాయి.

**అచేతనాని చైతాని ప్రాపయంతి కథంత్వితి ।**
**సుపర్ణ నావగంతవ్యం ప్రాపకం వచ్మి తేఽ పరమ్ ॥13॥**

సుపర్ణా! ఈ మంత్రాలు అచేతనాలు కదా! ఇవి ఎలా అక్కడకు ప్రాప్తింప జేస్తాయని అనుకోకు. నీకు మరో విధానం గురించి చెబుతాను.

**అగ్నిష్వాత్తాదయస్తేషా మాధిపత్యే వ్యవస్థితాః ।**
**కాలే న్యాయాగతం పాత్రే విధినా ప్రతిపాదితమ్ ॥14॥**

**అన్నం నయంతి తత్రైతే జంతుర్యత్రావతిష్ఠతే ।**
**నామగోత్రఇచ్చ మంత్రాశ్చ దత్తమన్నం నయంతి తే ॥15॥**

వాటి ఆధిపత్యంలో అగ్నిష్వాత్తులు అనే పితృగణాలు నియమింపబడినారు. వారు సకాలంలో వచ్చి, శాస్త్రవిధితో లెస్సగా ఈయబడిన పితృపాత్రలలో సమర్పింపబడిన అన్నాన్ని తీసుకొనివెడతారు. నామగోత్ర మంత్రాలే శక్తిదాయకాలు కాబట్టి తదనుసారంగా వారు ఇక్కడ ఈయబడిన అన్నాన్ని అక్కడ ఆ ప్రాణులకు అందజేస్తారు.

**అపి యోనిశతం ప్రాప్తాం స్తాం తృప్తిరుపతిష్ఠతి ।**
**తేషాం లోకాంతరస్థానాం వివిధైర్నామ గోత్రకైః ॥16॥**

**అపసవ్యం క్షితౌ దర్భే దత్తాః పిండా స్త్రయస్తు వై ।**
**యాంతి తాం సర్పయన్త్యేవం ప్రేతస్థాన స్థితాన్ పితౄన్ ॥17॥**

వారు నూరు జన్మలను పొందియున్నప్పటికి, వారికి తృప్తిని కలగజేస్తుంది. లోకాంతరాలలో ఉన్నవారికి కూడ చేరుతాయి. నానావిధ నామ గోత్రాలలో, భూమియందు అపసవ్యంగా దర్భయందు ఈయబడిన మూడు పిండాలు ప్రేతస్థానాలను పొందియున్న పితరులకు చేరుతాయి. వారికి తృప్తిని కలగజేస్తాయి.

**అప్రాప్తయాతనాస్థానాః శ్రేష్ఠా యే భువి పంచధా ।**
**నానారూపాస్తు జాతా యే తిర్యగ్యోన్యాది జాతిషు ॥18॥**

**యదాహారా భవన్త్యేతే పితరో యత్ర యోనిషు ।**
**తాసు తాసు తదాహారా శ్రాద్ధాన్నేనోపతిష్ఠతి ॥19॥**

శ్రేష్ఠులైనవారు ఏ యాతనలూ లేని స్థానాలలో ఉంటారు. భూమియందు ఐదు విధాలుగా నానా రూపాలలో ఉద్భవించే ఉద్భిజ, స్వేదజ, అండజ, జరాయుజ, స్థావర తదితర తిర్యగాది యోనులలోని వారికికూడ, అవి ఆహారాలవుతాయి. పితరులు ఎక్కడెక్కడ ఏ ఏ జన్మలు ధరించి ఉంటారో, ఆయా ప్రాణులకు వారికి సంబంధించిన ఆహారంగా శ్రాద్ధాన్నం చేరుతుంది.

**యథా గోషు ప్రణష్టాసు వత్సో విందతి మాతరమ్ ।**
**తథాన్నం నయతే విప్ర జంతుర్యత్రావతిష్ఠతే ॥20॥**

ఆవులు తప్పిపోగా, దూడ తల్లిని పోల్చుకొని పరుగెత్తినట్లు, విప్రా! జీవి ఏ రూపంలో ఉన్నప్పటికి శ్రాద్ధాన్నం వారికే చేరుతుంది.

**పితరః శ్రాద్ధభోక్తారో విశ్వేదేవైః సదా సహ ।**
**ఏతే శ్రాద్ధం సదా భుక్త్వా పితౄన్ సంతర్పయంత్యతః ॥21॥**

**వసురుద్రాదితి సుతాః పితరః శ్రాద్ధదేవతాః ।**
**ప్రీణయంతి మనుష్యాణాం పితౄన్ (ఇన్) శ్రాద్ధేషు తర్పితాః ॥22॥**

పితరులు విశ్వేదేవతలతో కలిసి ఎల్లప్పుడూ శ్రాద్ధాన్నాన్ని భుజిస్తారు. వసురుద్రాదిత్యులు శ్రాద్ధదేవతలైన పితరులు వీరు శ్రాద్ధాన్నాన్ని చక్కగా భుజించి పితరులను సంతృప్తి పరుస్తారు. వీరు శ్రాద్ధములందు సంతుష్టి పొందడమే కాకుండా, శ్రాద్ధకర్తలయిన మనుష్యుల పితరులను కూడ తృప్తిపరుస్తారు.

**ఆత్మానం గుర్విణీ గర్భమపి ప్రీణాతి వై యథా ।**
**దోహదేన తథా దేవాః శ్రాద్ధైః స్వాంశ్చ పితౄన్నృణామ్ ॥23॥**

గర్భవతి అయిన స్త్రీ భుజించునప్పుడు తనకు, గర్భంలో నున్న శిశువుకు ఆనందం కలుగునట్లుగా, దేవతలు కూడ సంపూర్ణ శ్రాద్ధాలతో తామునూ ఆనందం పొందుతారు. మనుష్యుల పితరులనూ ఆనందపరుస్తారు.

**హృష్యంతి పితరః శ్రుత్వా శ్రాద్ధకాలముపస్థితమ్ ।**
**అన్యోన్యం మనసా ధ్యాత్వా సంపతంతి మనోజవమ్ ॥24॥**

**బ్రాహ్మణైః సహ చాశ్నంతి పితరో హ్యంతరిక్షగాః।**
**వాయుభూతాశ్చ తిష్ఠంతి భుక్త్వా యాంతి పరాం గతిమ్ ॥25॥**

శ్రాద్ధకాలం సమీపిస్తోంది అని వినగానే (తెలియగానే) పితరులు చాలా సంతోషిస్తారు. ఒకరి నొకరు మనస్సులో ధ్యానించుకొని మనోవేగంతో వచ్చేస్తారు. కొందరు అంతరిక్షంలో కూర్చుండి బ్రాహ్మణులతో కలసి భుజిస్తారు. (అంతరిక్షగాములైన పితరులకే ఇది సాధ్యం) మరి కొందరు వాయురూపంలో వచ్చి భోజనంచేసి పరమగతిని పొందుతారు.

**నిమంత్రితాస్తు యే విప్రాః శ్రాద్ధపూర్వదినే ఖగ ।**
**ప్రవిశ్య పితరస్తేషు భుక్త్వా యాంతి స్వమాలయమ్ ॥26॥**

ఖగమా! శ్రాద్ధానికి ముందురోజునే బ్రాహ్మణులు భోజనానికై నియంత్రింపబడతారు. కొందరు పితరులు వారిలో ప్రవేశించి, భుజించి తమ నిలయాలకు వెళ్ళిపోతారు.

**శ్రాద్ధకర్తా తు యద్యేకః శ్రాద్ధే విప్రో నిమంత్రితః ।**
**ఉదరస్థః పితా తస్య వామపార్శ్వే పితామహః ॥27॥**

**ప్రపితామహో దక్షిణతః పృష్ఠతః పిండభక్షకః ।**
**శ్రాద్ధకాలే యమః ప్రేతాన్ పితౄంశ్చాపి యమాలయాత్ ॥28॥**

**విసర్జయతి మానుష్యే నిరయస్థాంశ్చ కాశ్యప ।**

కశ్యపవంశసంజాతా! శ్రాద్ధకర్త శ్రాద్ధమందు ఒకే బ్రాహ్మణుని నిమంత్రించిన నాడు, ఆ విప్రుని ఉదరభాగంలో తండ్రి, వామభాగంలో పితామహుడు, దక్షిణభాగంలో ప్రపితామహుడు, వెనుకభాగంలో పిండ భక్షకుడు ప్రవేశిస్తారు. శ్రాద్ధకాలంలో యముడు ప్రేతలను పితరులను యమలోకం నుండి, నరకలోకాలలో నున్నవారిని మనుష్యలోకానికి వెళ్లడానికై వదలివేస్తాడు.

**క్షుధార్తాః కీర్తయంతశ్చ దుష్కృతఞ్చ స్వయంకృతమ్ ॥29॥**

**కాంక్షంతి పుత్రపౌత్రేభ్యః పాయసం మధుసంయుతమ్ ।**
**తస్మాత్తాం స్తత్ర విధినా తర్పయేత్పాయసేన తు ॥30॥**

వారు ఆకలిచే పీడింపబడుతూ, స్వయంగా తాము చేసిన దుష్కృతాలను పదే పదే తలచుకొంటూ, పుత్రులనుండి, పౌత్రులనుండి తేనెతో కలిపిన పాయసాన్ని కోరుకుంటూ ఉంటారు. అందువల్ల వారిని శాస్త్రవిధితో పాయసంతో అప్పుడు తృప్తిపరచాలి.

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**స్వామిన్ కేనాపి తే దృష్టా ఆగతాః పితరో ద్విజ ।**
**లోకాదముష్మాదాగత్య భుంజంతో భువి మానద ॥31॥**

"స్వామీ! ద్విజా! ఆ లోకంనుండి భూలోకానికి వచ్చి శ్రాద్ధంలో భుజిస్తున్న పితరులను చూసినవారెవరయినా ఉన్నారా?" అని అడిగాడు.

**శ్రీభగవానువాచ –** శ్రీభగవంతుడు వచించాడు.

**గరుత్మఞ్ఛృణు వక్ష్యామి యథా దృష్టాస్తు సీతయా ।**
**పితరో విప్రదేహే వై శ్వశురాద్యాస్త్రయః క్వచిత్ ॥32॥**

గరుత్మంతా! చెప్తున్నాను విను. ఒకప్పుడు సీతచే వారు చూడబడినారు. విప్రుని శరీరంలో ఆమె మామ మున్నగు ముగ్గురు పితరులను చూసింది.

**గృహీత్వా పితురాజ్ఞా వై రామో వనముపాగమత్ ।**
**తతః పుష్కరయాత్రార్థం రామోఽయాత్సీతయా సహ ॥33॥**

తండ్రిఆజ్ఞను శిరసావహించి రాముడు వనవాసానికి వెళ్లాడు. అక్కడ పుష్కరయాత్రకోసమై రాముడు సీతతో కలిసి వెళ్లాడు.

**తీర్థం చాపి సమాగత్య శ్రాద్ధం ప్రారబ్ధవాంస్తు సః ।**
**ఫలం పక్వస్తు జానక్యా సిద్ధం రామే నివేదితమ్ ॥34॥**

ఆ తీర్థానికి వచ్చి అతడు శ్రాద్ధకర్మను సంకల్పించి చేయసాగాడు. సీత పక్వానికి వచ్చిన పండ్లను సిద్ధంచేసి రామునికి నివేదించింది.

**స్నాతప్రియోక్త వాక్యాత్తు సుస్నాతా తమపాలయత్ ।**
**నభో మధ్యగతే సూర్యే కాలే కుతప ఆగతే ॥35॥**

**ఆయాతా ఋషయః సర్వే యే రామేణ నిమంత్రితాః ।**
**తాన్మునీనాగతాన్ దృష్ట్వా వైదేహీ జనకాత్మకా (జా) ॥36॥**

**రామాజ్ఞయాన్నమాదాయ పరివేష్టుముపాగతా ।**
**అపాసర్పత్తతో దూరే విప్రమధ్యే తు సంస్థితా ॥37॥**

స్నానంచేసి వచ్చిన భర్తయొక్క వాక్యానుసారంగా, ఆమె కూడ చక్కగా స్నానాదికాలు పూర్తిచేసి రామాజ్ఞను నిర్వర్తించింది. అంత సూర్యుడు ఆకాశ మధ్యభాగంలోకి రాగా, కుతపకాలం సమీపించగా, రామునిచే నిమంత్రింపబడిన ఋషులు అందరూ విచ్చేశారు. వచ్చిన ఆ మునులను చూసి, జనకపుత్రిక అయిన సీత రాముని ఆజ్ఞపై అన్నం కొనివచ్చి వడ్డించడానికి ఉపక్రమించింది. కాని వడ్డన అయిన తరువాత విప్రుల మధ్యలోనున్న ఆమె అక్కడనుండి దూరంగా తొలగి (వెళ్లి)పోయింది.

**గుల్మైరాచ్ఛాద్య చాత్మానం నిగూఢం సా స్థితా తదా ।**
**ఏకాంతే తు తదా సీతాం జ్ఞాత్వా రాఘవనందనః ॥38॥**

**విమృశ్య సుచిరం కాలమిదం కిమితి సత్వరమ్ ।**
**కించిత్ క్వచిద్గతా సాధ్వీ త్రపాయాః కారణేన హి ॥39॥**

చెట్టుచాటున తీగలతో తనను కప్పుకొని ఆమె అప్పుడు నిగూఢంగా ఉండిపోయింది. రఘునందనుడు అంత ఏకాంతంలోకి వెళ్లిన సీతను గుర్తించి, చాలాసేపు ఆలోచించి, వెంటనే ఏమిటిది? అనుకొంటూ, ఏదో కొంచెం సిగ్గుచేత ఏమో! కాబోలు ఇలా వెళ్లిఉంటుందని భావించాడు.

**కిం వా న భోజయన్ విప్రాన్ సీతామన్వేషయామ్యహమ్ ।**
**విమృశన్నేవమేవం స స్వయం విప్రానభోజయత్ ॥40॥**

'ఈమె ఎందుచే విప్రులకు పూర్తిగా వడ్డించలేదు? సరే! తరువాత నేను సీతను వెదకవచ్చులే?' అని ఈ రీతిగా ఆలోచిస్తూ తానే స్వయంగా విప్రులచేత భోజనాలు చేయించాడు.

**గతేషు ద్విజముఖ్యేషు ప్రియాం రామోఽబ్రవీదిదమ్ ।**
**కథం లతాసు లీనా త్వం మునీన్ దృష్ట్వా సమాగతాన్ ॥41॥**

ఆ ద్విజముఖ్యులు వెళ్లిపోయిన తరువాత రాముడు తన ప్రియురాలితో ఇలా అన్నాడు. 'వచ్చిన మునులను చూచి, నీవేల తీగలమాటుకు తప్పుకొన్నావు?

**తత్సర్వం మమ తన్వంగి కారణం వద మా చిరమ్ ।**
**ఏవముక్తా తదా భర్త్రా సీతా సాధోముఖీ స్థితా ॥42॥**

**ముంచంతీ చాశ్రుసంఘాతం రాఘవం వాక్యమబ్రవీత్ ।**

తన్వంగీ! దానికి కారణం వెంటనే నాకు పూర్తిగా తెలియజేయవలసింది'. అని భర్త పలుకగా ఆ సీత అప్పుడు తలవంచి నిల్చి, కన్నీరు విడుస్తూ రామునితో ఇలా అంది.

**సీతోవాచ** – సీత పలికింది.

**శృణు త్వం నాథ యద్దృష్ట మాశ్చర్యమిహ యాదృశమ్ ॥43॥**

**పితా తవ మయా దృష్టో బ్రాహ్మణాగ్రే తు రాఘవః ।**
**సర్వాభరణ సంయుక్తో ద్వావాన్యౌ చ తథావిధౌ ॥44॥**

'నాథా! నీవు వినవలసింది. ఇక్కడ నేను గొప్ప ఆశ్చర్యం కలిగించే దృశ్యాన్ని చూశాను. బ్రాహ్మణుల అగ్రభాగంలో సమస్తములైన ఆభరణాలతో కూడుకొన్న నీ తండ్రి దశరథమహారాజును నేను దర్శించాను. అలాగే మరో ఇరువురిని కూడ చూశాను.

**దృష్ట్వా త్వత్పితరఞ్చాహమపక్రాంతా తవాన్తికాత్ ।**
**వల్కలాజినసంవీతా కథం రాజ్ఞః పురః ప్రభో ॥45॥**

**భవామి రిపువీరఘ్న సత్యమేతదుదాహృతమ్ ।**
**స్వహస్తేన కథం దేయం రాజ్ఞే వా భోజనం మయా ॥46॥**

నీ తండ్రిని చూచి నేను నీ దగ్గరనుండి తప్పించుకొని వెళ్లిపోయాను. ప్రభూ! నారబట్టలతోను, జింకతోలుతోను నేను రాజు ఎదురుగా ఎలా ఉండగలను? శత్రువీరులను హింసించువాడా! ఇదంతా పరమసత్యం. దీనిని నీకు వివరించి చెప్పాను. మహారాజైన నీ తండ్రికి నేను ఈ భోజనాన్ని స్వహస్తంతో ఎలా వడ్డించగలను?(రాజ భోజనాలు ఆరగించినవానికి ఈ సామాన్యాహారం ఎలా వడ్డించగలను?)

**దాసానామపి యే దాసా నోపభుంజంతి కర్హిచిత్ ।**
**తృణపాత్రే కథం తస్మై అన్నం దాతుం హి శక్నుయామ్ ॥47॥**

సేవకులకే సేవకులయినవారు కూడ ఇటువంటి భోజనాన్ని ఎన్నడూ భక్షింపరు కదా! ఈ తృణపాత్రలో అన్నంవేసి పట్టుకొని, అటువంటి చక్రవర్తికి నేనెలా వడ్డించగలను?

**యాహం రాజ్ఞా పురా దృష్టా సర్వాభరణభూషితా ।**
**సా స్వేదమలదిగ్ధాంగీ కథం యాస్యామి భూపతిమ్ ॥48॥**

**అపకృష్టాస్మి తేనాహం త్రపయా రఘునందన ।**

నేను పూర్వం సర్వాభరణభూషితురాలనై ఆ మహారాజుకంటబడినదానను. అటువంటి నేను చెమటతో నిండిన, మలిన శరీరంతో ఆ భూపతికి ఎదురుగా ఎలా పోగలను? రఘునందనా! అందువల్ల నేను సిగ్గుతో అక్కడ నుండి తొలగిపోయాను.' అన్నది సీత.

**శ్రీభగవానువాచ** – శ్రీ భగవంతుడు అన్నాడు.

**ఇతి శ్రుత్వా ప్రియావాక్యం రామో విస్మితమానసః ॥49॥**

**ఆశ్చర్యమితి తజ్జ్ఞాత్వా తదా స్వస్థానమాగమత్ ।**
**సీతయా పితరో దృష్టా యథా తత్తే నివేదితమ్ ॥50॥**

ఈ విధమైన ప్రియురాలి వచనాలను విని, రాముడు ఆశ్చర్యంపొందాడు. ఆ విచిత్రకరసంఘటనను విని తన నెలవుకు వెళ్లిపోయాడు. సీతచే పితరులు చూడబడిన విధం నీకు తెలియజేయబడింది.

**అపరం శ్రాద్ధమాహాత్మ్యం కించిచ్ఛృణు సమాసతః ।**
**అమావస్యా దినే ప్రాప్తే గృహద్వారే సమాస్థితాః ॥51॥**

**వాయుభూతాః ప్రవాఞ్ఛన్తి శ్రాద్ధం పితృగణా నృణామ్ ।**
**యావదస్తమయం భానోః క్షుత్పిపాసాసమాకులాః ॥52॥**

ఇక నీవడిగిన శ్రాద్ధమాహాత్మ్యం గురించి కూడ కొంచెం సంక్షిప్తంగా చెబుతున్నాను. విను. అమావాస్యరోజు సంప్రాప్తించగా, పితృగణాలు వాయురూపులై నరుల యొక్క ఇంటిద్వారం వద్ద నిలిచి శ్రాద్ధం గురించి ఎక్కువ ఆరాటపడతారు. సూర్యుడు అస్తమించే వరకు ఆకలి దప్పికలతో నకనకలాడుతూ అలాగే ఉండిపోతారు.

**తతశ్చాస్తంగతే సూర్యే నిరాశాదుఃఖ సంయుతాః ।**
**నిఃశ్వసంత శ్చిరం యా ంతి గర్హయంతస్తు వంశజమ్ ॥53॥**

సూర్యుడు అస్తమించేవరకు అలాగేఉండి, నిరాశతో, దుఃఖంతో, ఎక్కువసేపు నిట్టూర్చి, ఆ వంశస్థుని పలువిధాల నిందిస్తూ వెళ్లిపోతారు.

**తస్మాచ్ఛ్రాద్ధం ప్రయత్నేన అమాయాం కర్తుమర్హతి ।**
**యది శ్రాద్ధం ప్రకుర్వంతి పుత్రాద్యాస్తస్య బాంధవాః ॥54॥**

**ఉద్ధృతా యే గయాశ్రాద్ధే బ్రహ్మలోకం చ తైః సహ ।**
**భజంతే క్షుత్పిపాసా వా న తేషాం జాయతే క్వచిత్ ॥55॥**

అందువల్ల అమావాస్యనాడు మిక్కిలి ప్రయత్నంతో శ్రాద్ధం పెట్టితీరాలి. పుత్రాదులు, బాంధవులు అతనికి (మృతునికి) శ్రాద్ధం నిర్వహించినట్లయితే పితరులు ఉద్ధరింపబడతారు. గయలో శ్రాద్ధం పెడితే వారు పితరులతో బాటు బ్రహ్మలోకం పొందుతారు. వారికి ఎప్పుడూ ఆకలికాని, దప్పికకాని ఉండవు.

**తస్మా చ్ఛ్రాద్ధం ప్రయత్నేన సమ్యక్ కుర్యాద్విచక్షణః ।**
**తస్మా చ్ఛ్రాద్ధం చరేద్భక్త్యా శాకైరపి యథావిధి ॥56॥**

అందువల్ల విచక్షణుడైనవాడు ఎంత ప్రయత్నం చేసియైనా శ్రాద్ధాన్ని చక్కగా నిర్వహించాలి. కాబట్టి శాస్త్రోక్త విధానంతో, భక్తితో కనీసం శాకాలతో నైనా శ్రాద్ధం ఆచరించాలి.

**కుర్వీత సమయే శ్రాద్ధం కులే కశ్చిన్న సీదతి ।**
**ఆయుః పుత్రాన్ యశః స్వర్గం కీర్తిం పుష్టిం బలం శ్రియమ్ ॥57॥**

**పశూన్ సౌఖ్యం ధనం ధాన్యం ప్రాప్నుయాత్పితృపూజనాత్ ।**
**దేవకార్యాదపి సదా పితృకార్యం విశిష్యతే ॥58॥**

నిర్ణీతసమయంలో శ్రాద్ధం నిర్వహిస్తే, ఆ వంశంలో ఎవడూ దుఃఖించడు. ఆయువు, పుత్రులు, యశస్సు, స్వర్గం, కీర్తి, పుష్టి, బలం, సంపద, పశువులు, సౌఖ్యం, ధనం, ధాన్యం పితరులను ఆరాధించుటవల్ల పొందుతాడు. దేవకార్యంకన్న కూడ ఎల్లప్పుడూ పితృకార్యం విశేషమైనది.

**దేవతాభ్యః పితౄణాం హి పూర్వమాప్యాయనం శుభమ్ ।**
**యే యజంతి పితౄన్ దేవాన్ బ్రాహ్మణాంశ్చ హుతాశనమ్ ॥59॥**

**సర్వభూతాంతరాత్మానం మామేవ హి యజంతి తే ।**
**స్మార్తేన విధినా శ్రాద్ధం కృత్వా స్వవిభవోచితమ్ ॥60॥**

దేవతలకన్న కూడ ముందు పితరులను ప్రసన్నులను జేసుకోవడం మిక్కిలి శుభప్రదం. ఎవరయితే పితరులను, దేవతలను, బ్రాహ్మణులను, హుతాశనుని పూజిస్తారో, వారు సర్వభూతాలలోను అంతరాత్మగానున్న నన్ను పూజించినవారే అవుతారు. కాబట్టి స్మృతి చెప్పిన విధానం ద్వారా తన వైభవానికి తగినట్లుగా శ్రాద్ధం నిర్వహించినట్లయితే,

**ఆబ్రహ్మస్తంబపర్యంతం జగత్ప్రీణాతి మానవః ।**
**అన్నప్రకిరణం యత్తు మనుష్యైః క్రియతే భువి ॥61॥**

**తేన తృప్తి ముపాయాంతి యే పిశాచత్వమాగతాః ।**
**యచ్చాంబుః స్నానవస్త్రేభ్యో భూమౌ పతతి ఖేచర ॥62॥**

**తేన యే తరుతాం ప్రాప్తా స్తేషాం తృప్తిః ప్రజాయతే ।**
**యాని గంధాంబూని చైవ పతంతి ధరణీతలే ॥63॥**

**తేన చాప్యాయనం తేషాం యే దేవత్వముపాగతాః ।**
**యే చాపి స్వకులాద్బాహ్యాః క్రియాయోగ్యాహ్యసంస్కృతాః ॥64॥**

**విపన్నాస్తే తు వికిర సమ్మార్జన జలాశినః ।**
**భుక్త్వాచామనం యచ్చ జలం యచ్చాప్ని సేవితమ్ ॥65॥**

**బ్రాహ్మణానాం తథైవాన్యత్తేన తృప్తిం ప్రయాంతి వై ।**
**పిశాచత్వ మనుప్రాప్తాః కృమికీటత్వ మేవ యే ॥66॥**

**ఉద్ధృతేష్వన్న పిండేషు భువి యే చాన్న కాంక్షిణః ।**
**తైరే వాప్యాయనం తేషాం యే మనుష్యత్వమాగతాః ॥67॥**

మానవుడు పిపీలికాది బ్రహ్మపర్యంతమున్న జగత్తునంతను సంతోషపరచినట్లే, మనష్యుల ద్వారా పెట్టబడే శ్రాద్ధంలో నేలపై రాలిన మెతుకుల వల్ల పిశాచయోనిలో నున్న పితరులకు తృప్తి కలుగుతుంది. ఆకాశంలో చరించే ఖగమా! స్నానవస్త్రాదుల ద్వారా భూమిపై పడిన నీటి ద్వారా వృక్షయోనిలో ఉన్న పితరులకు తృప్తి కలుగుతుంది. ఆ సమయంలో నేలపై పడిన సుగంధ జలబిందువుల వల్ల దేవత్వయోనిని పొందిన వారికి సంప్రీతి కలుగుతుంది. తమ కులంనుండి బహిష్కరింపబడినవారు ఏ సంస్కారానికి నోచుకోనివారు, ఏ క్రియకు యోగ్యులుకానివారు విపన్నులూ, బ్రాహ్మణులకు చేతులు కడుగుతున్నప్పుడు నేలపై పడిన జలాన్నాలతో తృప్తులౌతారు. బ్రాహ్మణులు భుజించిన తర్వాత ఆచమించిన నీరు, ఆ పూట సేవించిన నీరు, ఇతరత్రవారు వాడిన నీరు – వీటితో పిశాచత్వాన్ని పొందినవారు క్రిమికీటకాలుగా పుట్టినవారు తృప్తిపడతారు. భూమిపై ఉంచిన పిండాలను పైకి తీయగానే, అన్నం కావాలని కోరుకొనేవారికి, మనుష్యత్వాన్ని పొందిన వారికి ఆ పిండాలవల్ల సంతోషం కలుగుతుంది.

**ఏవం వై క్రియమాణానాం తేషాం చైవ ద్విజన్మనామ్ ।**
**కశ్చిజ్జలాన్న విక్షేపః శుచిరుచ్ఛిష్ట ఏవ వా ॥68॥**

**తేనాన్నేన కులే తేషాం యే వై జాత్యంతరం గతాః ।**
**భవత్యాప్యాయనం తేషాం సమ్యక్ శ్రాద్ధే కృతే సతి ॥69॥**

ఈవిధంగా చేయబడి, ఆ బ్రాహ్మణులకు సంబంధించిన ఆయా జలాన్నవిక్షేపం అది పవిత్రమైనా లేక ఎంగిలిదయినా, ఆ అన్నంవల్ల వారి కులంలోని ఇతర జాతులలో జన్మించినవారికి, ఆ శ్రాద్ధం శాస్త్రోక్తవిధిగా నిర్వహింపబడితే, వారికి అందరికి సంప్రీతినిస్తుంది.

**అన్యాయోపార్జితై ర్ద్రవ్యై ర్యచ్ఛ్రాద్ధం క్రియతే నరైః ।**
**తృప్యంతి తేన చండాలాః పుక్కసాద్యుపయోనిషు ॥70॥**

**ఏవం సంప్రాప్యతే పక్షిన్ యద్దత్తమివ బాంధవైః ।**
**శ్రాద్ధం కుర్వద్భి రన్నాంబు శాకై స్తృప్తిర్హి జాయతే ॥71॥**

అన్యాయంగా సంపాదించిన ద్రవ్యాలతో నరులు ఆ శ్రాద్ధాన్ని నిర్వహిస్తే, దానివల్ల చండాలురు, పుక్కసులు(అంటరానివారు), మున్నగు ఉపయోనులయందు జన్మించినవారు తృప్తులవుతారు. ఖగమా! కాబట్టి ఈ విధంగా న్యాయార్జితంగా సంప్రాప్తించిన ద్రవ్యాలచే ఇక్కడ బాంధవులచే ఈయబడిన అన్నం, నీరు, శాకాలతో పెట్టే శ్రాద్ధం తృప్తిని కలగజేస్తుంది.

**ఏతత్తే సర్వమాఖ్యాతం యన్మాం త్వం పరిపృచ్ఛసి ।**
**సద్యో దేహాంతర ప్రాప్తి ర్విలంబేనావనీతలే ॥72॥**

**పృష్టవానసి తత్తేఽహం ప్రవక్ష్యామి సమాసతః ।**
**సద్యో విలంబితశ్చైవోభయథా(ధా)పి కలేవరమ్ ॥73॥**

ఏదయితే నీవు నన్ను అడిగావో, దానినంతను నీకు తెలియజెప్పడం జరిగింది. ఇక వెంటనే మరో దేహాన్ని పొందుతాడా? లేక భూతలంలో ఆలస్యంగా (విలంబనంతో) జన్మిస్తాడా? అనే ప్రశ్నను నన్ను అడిగావుకదా! దానిగురించి నేను సంక్షిప్తంగా చెబుతున్నాను. వెంటనే జన్మధరించడం, లేదా కాలావలంబనం చేసి జన్మించడం రెండు విధాలుగా కూడ ఉంటుంది.

**యతో హి మర్త్యః ప్రాప్నోతి తద్విశేషఇ్చ మే శృణు ।**
**అధూమక జ్యోతిరివాంగుష్ఠ మాత్రః పుమాంస్తతః ॥74॥**

**దేహమేకం సద్య ఏవ వాయవీయం ప్రపద్యతే ।**
**యథా తృణజలౌకా హి పశ్చాత్పాదం తదోద్ధరేత్ ॥75॥**

**స్థితిరగ్ర్యస్య పాదస్య యదా జాతా దృఢా భవేత్ ।**
**ఏవం దేహీ పూర్వదేహం సముత్సృజతి తం యథా ॥76॥**

దానిని మర్త్యుడు ఏ విధంగా పొందుతాడో, నాద్వారా విను. పొగలేని దీపంలాగా వెలిగే మనుష్యునిలోని అంగుష్ఠమాత్ర పురుషుడు చనిపోయిన వెంటనే, వాయవీయశరీరాన్నొకదానిని పొందుతాడు. ఏ విధంగా గడ్డిజలగ అనే జీవి వెనుకనున్న పాదాన్ని పైకి ఎత్తి, ముందుపాదాన్ని దృఢంగా నొక్కి పట్టుకొని ఉంటుందో, ఆ విధంగానే దేహి కూడ పూర్వ శరీరాన్ని వదిలిపెడతాడు. (అనగా రెండవ మెట్టుపై కాలుపెట్టి మొదటి మెట్టుపైనున్న కాలిని వదిలివేస్తాడు)

**భోగార్థమగ్రే స్యాద్దేహో వాయవీయ ఉపస్థితః ।**
**విషయగ్రాహకం యద్వన్మ్రియమాణస్య చేంద్రియమ్ ॥77॥**

**నిర్వ్యాపారం తచ్చ దేహే వాయునైవ స గచ్ఛతి ।**
**శరీరం యదవాప్నోతి తచ్చాప్యుత్క్రమతి స్వయమ్ ॥78॥**

కర్మానుభవాన్ని పొందటంకోసమై మొదట వాయవీయదేహం ఏర్పడుతుంది. చనిపోతున్నవానికి (మృతునికి) విషయవాసనలను గ్రహించే ఇంద్రియం ఏ పనీలేకుండ అయిపోతుంది. అది దేహం నుండి వాయువుతో నెట్టివేయబడుతుంది. పిమ్మట పొందిన శరీరాన్ని కూడ స్వయంగా వదిలిపెట్టివేయవలసిందే.

**గృహీత్వా స్వం వినిర్యాతి జీవో గర్భ ఇవాశయాత్ ।**
**ఉత్క్రామన్తం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ॥79॥**

**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ।**
**ఆతివాహిక మిత్యేవం వాయవీయం వదంతి హి ॥80॥**

అమ్మకడుపులో నున్న ప్రాణి ఆమెద్వారా అన్నాదులను గ్రహించి, ఆ గర్భాశయాన్ని వదలిపెట్టి బయటకు వచ్చినట్టు బయటకు వెళ్తాడు జీవుడు. బయటకు వెళ్లిపోతున్నవానిని కాని, దేహంలో ఉన్నవానిని కాని, గుణాలకు తగినట్లుగా ఫలాన్ని అనుభవిస్తున్న వానిని కాని మూఢులు చూడజాలరు. జ్ఞాననేత్రం కలవారు మాత్రమే దర్శించగలరు. వాయవీయశరీరాన్ని ఆతివాహిక శరీరమనికూడ వ్యవహరిస్తారు.

**ఏవం తు యాతుధానానాం తమేవ చ వదంతి హి ।**
**సుపర్ణ ఈదృశో దేహో నృణాం భవతి పిండజః ॥81॥**

సుపర్ణా! ఈ విధంగానే యాతుధానులకు కూడ ఉంటుందని తెలియజేస్తారు. ఇటువంటి దేహమే నరులకు పిండజ స్థాయిదేహంగా ఉంటుంది.

**పుత్రాదిభిః కృతాశ్చేత్ స్యుః పిండా దశ దశాహికాః ।**
**పిండజేన తు దేహేన వాయుజశ్చైకతాం వ్రజేత్ ॥82॥**

పుత్రాదుల ద్వారా ఈయబడిన పది పిండాలు, చేయబడిన దశాహికాలు తరువాత వారి పిండజశరీరంతో వాయవీయ శరీరం ఏకమై కలిసిపోతుంది.

**పిండజో యది నైవ స్యా ద్వాయుజోఽర్హతి యాతనామ్ ।**
**దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ॥**
**తథా దేహాంతరప్రాప్తిః పక్షీంద్రేత్యవధారయ ॥83॥**

పిండజశరీరం కలవకపోతే వాయుజశరీరం యాతనల పాలవుతుంది. పక్షీంద్రా! శరీరధారికి ఈ దేహమందు కౌమారం, యౌవనం, ముసలితనం ఒకదాని తరువాత మరొకటి ఎలా మారుతాయో, అలాగే ఈ జన్మతరువాత మరొక జన్మ సంప్రాప్తిస్తుందని గ్రహించు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥84॥**

నరుడు చివికిపోయిన వస్త్రాలను విడిచి, క్రొత్త బట్టలను ధరించినట్లే, శైథిల్యం పొందిన శరీరాలను విడిచి, శరీరి క్రొత్త దేహాలను ధరిస్తాడు.(శరీరి=ఆత్మ)

**నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥85॥**

ఆ ఆత్మను ఆయుధాలు ఛేదించలేవు, అగ్ని దహింపజాలదు, జలములు తడుపజాలవు, వాయువు ఎండింప జేయలేదు.

**వాయవీయాం తనుం యాతి సద్య ఇత్యుక్తమేవ తే ।**
**ప్రాప్తిర్విలంబతో యస్య తం దేహం ఖలు మే శృణు ॥86॥**

మృతుడై వెంటనే జన్మపొందేవాడు వాయవీయ తనువును పొందుతాడని నీకు చెప్పడం జరిగింది కదా! ఆలస్యంగా జన్మపొందేవాడు ఎటువంటి దేహాన్ని పొందుతాడో, దానిని నాద్వారా విను.

**క్వచిద్విలంబతో దేహం పిండజం స సమాప్నుయాత్ ।**
**అధోగతో యామ్యలోకం స్వీయకర్మానుసారతః ॥87॥**

కాలవిలంబనంతో కూడిన జన్మపొందే ఆ మృతుడు మొదట పిండజశరీరాన్ని పొందుతాడు. (అది పొందడానికి కొంత సమయం పడుతుంది) అతడు తాను చేసిన కర్మలననుసరించి నరకలోకానికి వెడతాడు.

**చిత్రగుప్తస్య వాక్యేన నిరయాణి భునక్తి సః ।**
**యాతనాస్సమవాప్యాథ పశుపక్ష్యాదికీం తనుమ్ ॥88॥**

**యాం గృహ్ణాతి నరః సా స్యాన్మోహేన మమతాస్పదమ్ ।**
**శుభాశుభ కర్మఫలం భుక్త్వా ముచ్యేత మానవః ॥89॥**

చిత్రగుప్తుని శాసనానుసారంగా అతడు నరక దుఃఖాలను అనుభవిస్తాడు. అనేక యాతనలను పొందిన పశుపక్ష్యాది దేహాలను ధరిస్తాడు. చనిపోయే సందర్భంలో మోహంతో దేనిపై మమకారం ఉంచుతాడో ఆ శరీరాన్నే పొందుతాడు. ఈ విధంగా శుభాశుభకర్మల ఫలితాలను అనుభవించి మానవుడు చివరకు వాటినుండి విడుదల పొందుతాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**తీర్త్వా దుఃఖ భవాంబోధిం భవంతం కథమాప్నుయాత్ ।**
**బహుపాతక యుక్తోఽపి తద్వదస్వ దయానిధే ॥90॥**

ఓ దయాసాగరా! అనేక విధాలైన మహాపాపాలు చేసినవాడుకూడ దుఃఖమనే సంసారసముద్రాన్ని తరించి, మిమ్ములను ఎలా పొందగలడు? దానిని వివరించండి.

**భూయో దుఃఖస్య సంసర్గో నరస్య న భవేద్యథా ।**
**బ్రూహి శుశ్రూషమాణస్య పృచ్ఛతో మే రమాపతే ॥91॥**

ఆ నరునికి మళ్లీ దుఃఖసంసర్గం ఉండకుండా ఉండాలంటే ఏమి చేయాలి? రమాపతీ! వినాలనే కోరికతో అడుగుతున్న నాకు ఆ విషయం వచించు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥92॥**

నరుడు తన తన కర్మలయందు ఆసక్తి కలవాడయినా, సిద్ధిని పొందగలడు. స్వకర్మాసక్తుడు ఎలా సంసిద్ధి పొందుతాడో, దానిని విను.

**కర్మవిభ్రష్టకాలుష్యో వాసుదేవానుచింతయా ।**
**బుద్ధ్యా విశుద్ధ్యా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ॥93॥**

**శబ్దాదీన్ విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ।**
**విరక్తసేవీ లబ్ధాశీ యతవాక్కాయమానసః ॥94॥**

**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ।**
**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ॥95॥**

**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ।**
**అతః పరం నృణాం కృత్యం నాస్తి కశ్యపనందన ॥96॥**

సత్కర్మలచే పాపాలను దగ్ధంచేసుకొని, వాసుదేవునియందు నిరంతరచింతనచే విశుద్ధమైన బుద్ధిని పొంది, పట్టుదలతో తనను తానే నియమించుకొని శబ్దాది విషయాలను పరిత్యజించి, రాగద్వేషాలను పూర్తిగా వదలుకొని, విరక్త భావంతో జీవిస్తూ, దొరకిన దానిని తింటూ, మనస్సును, వాక్కును, శరీరాన్ని సంయమనం గావించుకొని, వైరాగ్యాన్ని చక్కగా పాటించి, నిత్యం ధ్యానం, యోగం వీటియందు ఆసక్తి కలవాడై, అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం, పరిగ్రహం విడిచిపెట్టి, మమత్వం వదలి, పరమశాంతుడై చివరకు బ్రహ్మ స్వరూపుడవుతాడు. కశ్యపవంశ సంజాతా! అటుపై అంతకుమించి నరులకు చేయవలసింది ఏదీలేదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే శ్రాద్ధస్య తృప్తిదత్వాది నిరూపణం నామ దశమోఽధ్యాయః ॥10॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో శ్రాద్ధతృప్తి అనే పదవ అధ్యాయం సమాప్తం.

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

## ఉత్క్రమణవిధిః - ప్రాణాలు పోయే విధానం

**గరుడ ఉవాచ** - గరుడుడు పలికాడు.

**మానుషత్వం లభేత్కస్మాన్మృత్యుమాప్నోతి తత్కథమ్ ।**
**మ్రియతే కః సురశ్రేష్ఠ దేహమాశ్రిత్య కుత్రచిత్ ॥1॥**

**ఇంద్రియాణి కుతో యాంతి హ్యస్పృశ్యః స కథం భవేత్ ।**
**క్వ కర్మాణి కృతానీహ కథం భుంక్తే ప్రసర్పతి ॥2॥**

సురశ్రేష్ఠా! దేనివల్ల మనష్యజన్మ లభిస్తుంది? అతనికి మృత్యువు ఎలా సంభవిస్తుంది? దేహాన్ని ఆశ్రయించి మరణించేది ఎక్కడయినా ఎవడు? అప్పుడు ఇంద్రియాలు ఎక్కడకు పోతాయి? ఆ చనిపోయినవాడు ఎలా అస్పృశ్యుడవుతాడు? ఇక్కడ చేసిన కర్మల ఫలితాన్ని ఎక్కడ ఎలా అనుభవిస్తాడు?

**ప్రసాదం కురు మే మోహం ఛేత్తుమర్హస్యశేషతః ।**
**కాశ్యపోఽహం సురశ్రేష్ఠ వినతాగర్భసంభవ ॥3॥**

**యమలోకం కథం యాంతి విష్ణులోకం చ మానవాః ।**

నాయందు అనుగ్రహం చూపించు. నా మోహాన్ని పూర్తిగా తొలగించుటకు తగినవాడివి. నేను కాశ్యపుడను. వినతాగర్భసంభవుడను.(అతి సామాన్యుడను) యమలోకానికి, విష్ణులోకానికి మానవులు ఏ విధంగా వెడతారు?

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు పలికాడు.

**పరస్య యోషితం దృష్ట్వా బ్రహ్మస్వమపహృత్య చ ॥4॥**

**అరణ్యే నిర్జనే దేశే జాయతే బ్రహ్మరాక్షసః ।**
**హీనజాతౌ ప్రజాయేత రత్నానామపహారకః ॥5॥**

పరస్త్రీని కామించినవాడు, బ్రాహ్మణధనాన్ని అపహరించినవాడు అరణ్యంలో నిర్జనప్రదేశంలో బ్రహ్మరాక్షసునిగా పుడతాడు. రత్నాలను అపహరించేవాడు హీనజాతియందు జన్మిస్తాడు.

**యం యం కామమభిధ్యాయేత్స తల్లింగోఽభిజాయతే ।**
**నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ॥6॥**

**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ।**
**వాక్ చక్షుర్నాసికా కర్ణౌ గుదం మూత్రస్య సంచరః ॥7॥**

మరణించేటప్పుడు ఎవడు ఏ కోరిక (ఆశ) పెట్టుకొంటాడో దానికనుగుణమైన జన్మనే పొందుతాడు. ఆత్మను (ఆ జీవాత్మను) ఆయుధాలు ఛేదించలేవు. అగ్ని దహింపలేదు, జలాలు తడపలేవు, గాలి ఆరేటట్లు

చేయలేదు, వాక్కు, చక్షువులు, నాసికారంధ్రాలు, చెవులు, గుదం, మూత్ర విసర్జకావయవం అనే నవరంధ్రాలు ఉన్నాయి కదా!

**అండజాదిక జంతూనాం ఛిద్రాణ్యేతాని సర్వశః ।**
**ఆనాభేర్మూర్ధపర్యంత మూర్ధ్వ చ్ఛిద్రాణి చాష్ట వై ॥8॥**

పక్షులు మున్నగు ప్రాణులకన్నింటికి కూడ ఈ రంధ్రాలే ఉంటాయి. నాభి మొదలుకొని శిరస్సువరకు ఉండే ఊర్ధ్వరంధ్రాలు ఎనిమిది.

**సంతః సుకృతినో మర్త్యా ఊర్ధ్వ చ్ఛిద్రేణ యాంతి వై ।**
**మృతాహే వార్షికం యావద్యథోక్తవిధినా ఖగ ॥9॥**

**కుర్యాత్సర్వాణి కర్మాణి నిర్ధనోఽపి హి మానవః ।**
**దేహే యత్ర వసేజ్జంతుస్తత్ర భుంక్తే శుభాశుభమ్ ॥10॥**

ఖగమా! సత్పురుషులు, పుణ్యాత్ములు అయిన మానవులు ఊర్ధ్వరంధ్రాలనుండి వెడతారు. చనిపోయిన నాటి నుండి సంవత్సర పర్యంతం శాస్త్రోక్తవిధానంచే మానవుడు ధనహీనుడయినా సమస్త శ్రాద్ధకర్మలు ఆచరించాలి. ప్రాణి ఈ దేహంలో ఉండగానే శుభా శుభ కర్మలు రెండింటిని అక్కడే అనుభవిస్తాడు.

**మనోవాక్కాయజాన్ దోషాంస్తథా భుంక్తే ఖగేశ్వర ।**
**మృతః స సుఖమాప్నోతి మాయాపాశైర్న బధ్యతే ।**
**పాశబద్ధో నరో యస్తు వికర్మనిరతో భవేత్ ॥11॥**

ఖగేశ్వరా! మనస్సుచేత, వాక్కుచేత, శరీరంచేత చేయబడిన దోషాలనన్నింటినీ అలా అక్కడే అనుభవించేస్తాడు. అతడు చనిపోయిన తరువాత మృత్యుమాయాపాశాలచే బంధింపబడడు. అతడు సుఖాన్ని పొందుతాడు. దుష్కర్మ నిరతుడైన నరుడే మృత్యుపాశ బద్ధుడవుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ఊర్ధ్వాధోగతి జ్ఞాపకోత్క్రమణద్వార నిరూపణం నామ ఏకాదశోఽధ్యాయః ॥11॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రాణాలు పోయే విధానం అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

## ద్వాదశోఽధ్యాయః – పన్నెండవ అధ్యాయం

## మృతస్య ధర్మమాత్రానుయాయిత్వమ్ – మరణించిన వానిని ధర్మమే అనుసరించునని తెలుపుట

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఏవం తే కథితం తార్క్ష్య జీవితస్య వినిర్ణయః ।**
**మానుషాణాం హితార్థాయ ప్రేతత్వవినివృత్తయే ॥1॥**

తార్క్ష్యా! మనుష్యులకు హితాన్ని కలిగిస్తూ, ప్రేతత్వంనుండి విముక్తిని పొందించే జీవనవిధాననిర్ణయాన్ని ఈ విధంగా నీకు తెలియజేయడం జరిగింది.

**చతురశీతి లక్షాణి చతుర్భేదాశ్చ జంతవః ।**
**అండజాః స్వేదజాశ్చైవ ఉద్భిజ్జాశ్చ జరాయుజాః ॥2॥**

ప్రాణులు నాలుగు భేదాలతో ఎలబైనాలుగు లక్షలుగా పేర్కొనబడ్డాయి. అవే అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు, జరాయుజాలు.

**ఏకవింశతి లక్షాణి అండజాః పరికీర్తితాః ।**
**స్వేదజాశ్చ తథా ప్రోక్తా ఉద్భిజ్జాశ్చ క్రమేణ తు ॥3॥**

**జరాయుజాస్తథా ప్రోక్తా మనుష్యాద్యా స్తథాపరే ।**
**సర్వేషామేవ జంతూనాం మానుషత్వం హి దుర్లభమ్ ॥4॥**

అందు అండజాలు ఇరవై ఒక్క లక్షలుగా చెప్పబడ్డాయి. స్వేదజాలు కూడ ఆ సంఖ్యలోనే ఉంటాయి. క్రమంగా ఉద్భిజ్జములు, జరాయుజాలు అవే సంఖ్య కలవి. కొందరు జరాయుజాలనే మనుష్యాదులుగా పేర్కొంటారు. సమస్త ప్రాణులలోను మానుషత్వం దుర్లభమైనది.

**పంచేంద్రియనిధానత్వం మహాపుణ్యైరవాప్యతే ।**
**బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రాస్తత్పరజాతయః ॥5॥**

పంచేంద్రియవిధానంతో కూడిన నిధి మహాపుణ్యాలవల్ల లభిస్తుంది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ప్రధానజాతులు. వీటికన్న పరమైన జాతులు.

**రజకశ్చర్మకారశ్చ నటో బరుడ ఏవ చ ।**
**కైవర్తమేదభిల్లాశ్చ సప్తైతే హ్యంతజాః స్మృతాః ॥6॥**

రజకుడు, చర్మకారుడు, నటుడు, బరుడుడు (మేదరి), కైవర్తుడు, మేదుడు, భిల్లుడు – ఈ ఏడు జాతులు అంత్యజులుగా స్మరింపబడతారు.

**మ్లేచ్ఛ తుమ్బు విభేదేన జాతిభేదాస్త్వనేకశః ।**
**జంతూనామేవ సర్వేషాం జాతిభేదాః సహస్రశః ॥7॥**

మ్లేచ్ఛుడు, తుంబుడు అనే భేదంచే జాతిభేదాలు అనేక విధాలుగా ఉంటాయి. సమస్త ప్రాణులలో వేలకొలది జాతిభేదాలు ఉంటాయి.

**జంతూనామేవ సర్వేషాం భేదాశ్చైవ సహస్రశః ।**
**ఆహారో మైథునం నిద్రా భయం క్రోధస్తథైవ చ ॥8॥**

సమస్తప్రాణులలో వేలకొలది భేదాలు కూడ ఉన్నాయి. ఆహారం, మైథునం, క్రోధం, నిద్ర, భయం అలాగే ఎన్నోభేదాలు.

**సర్వేషామేవ జంతూనాం వివేకో దుర్లభః పరః ।**
**ఏకపాదాది రూపేణ దేహభేదాస్త్వనేకశః ॥9॥**

ప్రాణులకన్నింటికీ గొప్ప వివేకం ఉండడం దుర్లభం. ఒకపాదం కలవి మున్నగు భేదాలతో దేహ భేదాలు ఎన్నోవిధాలుగా ఉన్నాయి.

**కృష్ణసారో మృగో యత్ర ధర్మదేశః స ఉచ్యతే ।**
**బ్రహ్మాద్యా దేవతాః సర్వాస్తత్ర తిష్ఠంతి సర్వశః ॥10॥**

కృష్ణసారమనే మృగం ఎక్కడ ఉంటుందో, అది ధర్మదేశం అని చెప్పబడుతోంది. బ్రహ్మాది దేవతలు అందరు అక్కడ ఎప్పుడూ ఉంటారు.

**భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం మతిజీవినః ।**
**మతిమత్సు నరాః శ్రేష్ఠాః నరేషు బ్రాహ్మణాః స్మృతాః ॥11॥**

సర్వభూతాలలోను ప్రాణంగలవి శ్రేష్ఠం. ప్రాణులలో బుద్ధిజీవనులు, బుద్ధి కల్గినవారిలో నరులు శ్రేష్ఠులు. నరులలో బ్రాహ్మణులు శ్రేష్ఠులు.

**మానుష్యం యః సమాసాద్య స్వర్గమోక్షైకసాధకమ్ ।**
**తయోర్న సాధయేదేకం తేనాత్మా వంచితో ధ్రువమ్ ॥12॥**

మానవజన్మ స్వర్గమోక్షసాధకం. ఆ జన్మను పొంది స్వర్గమోక్షాలలో ఏ ఒక్కదానిని కూడ సాధించకపోతే, వానిచేత అతని ఆత్మ నిశ్చయముగా వంచింపబడినట్లే.

**ఇచ్ఛతి శతీ సహస్రం సహస్రీ లక్షమీహతే కర్తుమ్ ।**
**లక్షాధిపతీ రాజ్యం రాజాపి సకలాం ధరాం లబ్ధుమ్ ॥13॥**

వంద ఉన్నవాడు వేయి చేయడానికి, వేయి ఉన్నవాడు లక్ష చేయడానికి కోరుకొంటాడు. లక్షాధిపతి రాజ్యాన్ని కాంక్షిస్తాడు. రాజు సకల భూమండలాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు.

**చక్రధరోఽపి సురత్వం సురభావే సకల సురపతిర్భవితుమ్ ।**
**సురపతిరూర్ధ్వగతిత్వం తథాపి న నివర్తతే తృష్ణా ॥14॥**

పృథ్వీచక్రధారి అయిన చక్రవర్తి దేవత్వాన్ని కోరుకొంటాడు. దేవత్వం పొందినవాడు దేవేంద్రపదవి కావాలని కాంక్షిస్తాడు. అలా ఇంద్రుడయిన తరువాత అంతకన్న ఎక్కువ పదవిని కోరుకొంటాడు. అయినప్పటికి తృష్ణమాత్రం తీరుటలేదు.

**తృష్ణయా చాభిభూతస్తు నరకం ప్రతిపద్యతే ।**
**తృష్ణా ముక్తాస్తు యే కేచిత్ స్వర్గవాసం లభన్తి తే ॥15॥**

తృష్ణకు బానిస అయినవాడు నరకానికి పోతాడు. తృష్ణను విడిచిపెట్టిన వారు స్వర్గావాసాన్ని పొందుతారు.

**ఆత్మాధీనః పుమాంల్లోకే సుఖీ భవతి నిశ్చితమ్ ।**
**శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గంధశ్చ తద్గుణాః ॥16॥**

లోకంలో ఆత్మాధీనుడైన పురుషుడు నిశ్చయంగా సుఖపడతాడు. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనేవి విషయవాంఛలు.

**తథా చ విషయాధీనో దుఃఖీ భవతి నిశ్చితమ్ ॥17॥**

**కురంగ మాతంగ పతంగ భృంగమీనా హతాః పంచభిరేవ పంచ ।**
**ఏకః ప్రమాదీ స కథం న హన్యతే యఃసేవతే పంచభిరేవ పంచ ॥18॥**

ఆ విషయాలకు (వాసనలకు) అధీనమైనవాడు నిశ్చయంగా దుఃఖం పొందుతాడు. లేడి, ఏనుగు, దీపం పురుగు, తేనెటీగ, చేప అనే అయిదునూ, శబ్దం, స్పర్శ, రూపం, గంధం, రసం అనే విషయవాసనలు అయిదింటిచేతను క్రమంగా నశిస్తున్నాయి. అందు ఒక్కొక్కటీ ఒక్కొక్క విషయవాంఛచే మరణిస్తున్నాయి. ఇక ఆ అయిదువలె ఒక్కొక్కటిగా గాక అయిందింటినీ ఆస్వాదించేవాడు నశించకుండా ఎలా ఉంటాడు?

**పితృ మాతృమయో బాల్యే యౌవనే దయితామయః ।**
**పుత్ర పౌత్రమయాశ్చాన్తే మూఢో నాత్మమయః క్వచిత్ ॥19॥**

బాల్యంలో తల్లిదండ్రులపై మమకారంతో ఉంటాడు. యౌవనంలో భార్యపై ప్రేమతో ఉంటాడు. చివరి సమయంలో కొడుకులపైన, మనుమలపైన అనురాగంతో జీవిస్తాడు. కాని మూఢుడైనవాడు ఒకప్పుడు కూడా ఆత్మప్రీతితో మాత్రం ఉండడు.

**లోహదారుమయైః పాశైః పుమాన్ బద్ధో విముచ్యతే ।**
**పుత్రదారమయైః పాశైర్నైవ బద్ధో విముచ్యతే ॥20॥**

ఇనుప సంకెళ్లతోను, కొయ్యముక్కల పాశాలతోను బంధింపబడే పురుషుడు ఎలాగో, అలాగ విముక్తి పొందగలడు. కాని పుత్రులు, భార్య అనే పాశాలతో బంధింపబడేవాడు మాత్రం విముక్తి పొందలేడు.

**ఏకః కరోతి పాపాని ఫలం భుంక్తే మహాజనః ।**
**భోక్తారో విప్రయుజ్యంతే కర్తా దోషేణ లిప్యతే ॥21॥**

మానవుడు ఒక్కడుగా పాపాలను చేస్తాడు, కాని ఆతనిని ఆశ్రయించినవారు అందరూ ఫలాన్ని అనుభవిస్తారు, అనుభవించేవారు పాపానికి దూరంగా ఉంటారు. కాని పాపం చేసే కర్తమాత్రం ఆ దోషాన్ని పొందుతాడు.

**కోఽపి మృత్యుం న జయతి బాలో వృద్ధో యువాపి వా ।**
**సుఖదుఃఖాదికో వాపి పునరాయాతి యాతి చ ॥22॥**

**సర్వేషాం పశ్యతామేవ మృతః సర్వం పరిత్యజేత్ ।**
**ఏకః ప్రజాయతే జన్తురేక ఏవ ప్రలీయతే ॥23॥**

బాలుడయినా, యువకుడయినా, వృద్ధుడయినా, ఎవడును మృత్యువును జయించలేడు. సుఖదుఃఖాలు అనుభవించే వాడుకూడ మళ్లీ మళ్లీ వస్తూ, పోతూ ఉంటాడు. అందరూ చూస్తూ ఉండగానే మృతుడు అన్నింటిని వదలివేసి వెళ్లిపోతాడు. ప్రాణి ఒక్కడుగా పుడతాడు. ఒక్కడుగానే చివరకు లీనమవుతాడు.

**ఏకోఽపి భుంక్తే సుకృతమేక ఏవ చ దుష్కృతమ్ ।**
**మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠసమం క్షితౌ ॥24॥**

**బాంధవా విముఖా యాంతి ధర్మస్తమనుగచ్ఛతి ।**
**గృహేష్వర్థాని వర్తంతే శ్మశానాన్మిత్ర బాంధవాః ॥25॥**

నరుడు తాను ఒక్కడుగానే పుణ్యాన్ని అనుభవిస్తాడు. అలాగే ఒక్కడుగానే దుష్కృతాన్ని కూడ అనుభవిస్తాడు. కర్ర, రాయితో సమమైన (జడమైన) మృతశరీరాన్ని భూమియందు వదలివేసి బాంధవులు విముఖులై వెళ్లిపోతారు. ధర్మంమాత్రం వానిని అనుసరిస్తుంది. సంపదలు ఇంటివద్దనే ఉండిపోతాయి. శ్మశానం నుండి మిత్రులు, బాంధవులు తొలగిపోతారు.

**శరీరం వహ్నిరాదత్తే సుకృతం దుష్కృతం వ్రజేత్ ।**
**శరీరం వహ్నినా దగ్ధం పుణ్యం పాపం సహ స్థితమ్ ॥26॥**

శరీరాన్ని అగ్ని స్వీకరిస్తుంది. సుకృతం, దుష్కృతం ఆ జీవుని వెంటాడుతాయి. శరీరం నిప్పులలో కాలిపోయినా, పుణ్యం, పాపం జతగా జీవునితోనే ఉంటాయి.

**శుభం వా యది వా పాపం భుంక్తే సర్వత్ర మానవః ।**
**యదనస్తమితే సూర్యే న దత్తం ధనమర్థినామ్ ॥27॥**

**న జానే తస్య తద్విత్తం ప్రాతః కస్య భవిష్యతి ।**
**రారటీతి ధనం తస్య కో మే భర్తా భవిష్యతి ॥28॥**

శుభమైనా, అశుభమైనా, మానవుడు అంతటా దానిని అనుభవించి తీరుతాడు. సూర్యుడు అస్తమించ కుండగానే ధనాన్ని అర్థులకు ఈయకపోతే, తెల్లవారిన తరువాత ఆ విత్తం ఎవనికి చెందుతుందో నేనే గ్రహించలేను. ఆ ధనమే రూపాన్ని ధరించి నన్ను భరించే విభుడెవడని రొద చేస్తుంది.

**న దత్తం ద్విజముఖ్యేభ్యః పరోపకృతయే తథా ।**
**పూర్వజన్మకృతాత్ పుణ్యాద్యల్లబ్ధం బహుచాల్పకమ్ ॥29॥**

ద్విజముఖ్యులకు దానం చేయకపోయినా, అలాగే పరోపకారం కోసమై ధనాన్ని వెచ్చించకపోయినా, పూర్వజన్మలో చేయబడిన పుణ్యంవల్ల వచ్చేది మిక్కిలి తక్కువ మాత్రమే.

**తదీదృశం పరిజ్ఞాయ ధర్మార్థే దీయతే ధనమ్ ।**
**ధనేన ధార్యతే ధర్మః శ్రద్ధాపూతేన చేతసా ॥30॥**

ఈ విషయాన్ని పరిజ్ఞానం ద్వారా పొంది, ధర్మార్థమై ధనాన్ని దానం చేయాలి, శ్రద్ధచే పవిత్రమైన మనస్సుతో ఇచ్చే ధనంతో ధర్మం ధరింపబడుతుంది.(నిలబడుతుంది)

**శ్రద్ధావిరహితో ధర్మో నేహాముత్ర చ తత్ఫలమ్ ।**
**ధర్మాచ్చ జాయతే హ్యర్థో ధర్మాత్ కామోఽపి జాయతే ॥31॥**

**ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాచరేత్ ।**
**శ్రద్ధయా సాధ్యతే ధర్మో బహుభిర్నార్థరాశిభిః ॥32॥**

శ్రద్ధలేకుండా చేసే ధర్మం ఇహలోకంలోను, పరలోకంలోనుకూడ ఫలితాన్ని ఈయదు. ధర్మంవల్ల అర్థం సంభవిస్తుంది. ధర్మంవల్లనే న్యాయబద్ధమైన కోరిక పుడుతుంది. ధర్మమే మోక్షానికి పరమ సాధనం. అందువల్ల ధర్మాన్ని చక్కగా ఆచరించాలి. శ్రద్ధవల్లనే ధర్మం సాధింపబడుతుంది. పెక్కు ధనరాశులవల్ల అది సాధింపబడదు.

**అకించనా హి మునయః శ్రద్ధావంతో దివంగతాః ।**
**అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ॥**

**అసదిత్యుచ్యతే పక్షిన్ ప్రేత్యచేహ న తత్ఫలమ్ ॥33॥**

అకించనులయిన (ఏ విషయంలోను కిం,చ,న, అనేవి లేనివారు) అయిన మునులు శ్రద్ధావంతులై స్వర్గానికి చేరుకొన్నారు. పక్షీంద్రమా! అశ్రద్ధచే ఈయబడినదీ, హుతం చేయబడినదీ, తపస్సు చేయబడినదీ, శ్రద్ధలేకుండా చేసే "అసత్" అని చెప్పబడుతుంది. మరణించిన తరువాత ఇక్కడ దానికి ఏ ఫలం ఉండదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే మృతస్యధర్మ మాత్రానుయాయిత్వ నిరూపణం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో మరణించిన వానిని ధర్మమే అనుసరించునని తెలుపుట అనే పంద్రెడవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## వృషోత్సర్గదానాదిఫలమ్ - ఆబోతును విడవటం, దానాలు వాటి ఫలితాలు

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కర్మణా కేన దేవేశ ప్రేతత్వం నైవ జాయతే ।**
**పృథివ్యాం సర్వజంతూనాం తద్బ్రూహి పరమేశ్వర ॥1॥**

"దేవేశా! పరమేశ్వరా! సమస్త ప్రాణులకు భూమియందు, ఏకర్మ చేయడంవల్ల ప్రేతత్వం కలగకుండా ఉంటుందో, దాని గురించి తెలియజేయవలసింది"

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**అథ వక్ష్యామి సంక్షేపాత్ క్షయాహాదౌర్ధ్వ దైహికమ్ ।**
**స్వహస్తేనైవ కర్తవ్యం మోక్ష కామైస్తు మానవైః ॥2॥**

నీవడిగిన దానిని సంక్షిప్తంగా తెలియజేస్తున్నాను. మోక్షం కావాలనే కోరుకొనే మానవులు తన చేతితోనే, మరణించిన రోజునుండి ఔర్ధ్వదైహికక్రియ చేయాలి. (స్వయంగా చేయాలి)

**స్త్రీణామపి విశేషేణ పంచవర్షాదికే శిశౌ ।**
**వృషోత్సర్గాదికం కర్మ ప్రేతత్వ వినివృత్తయే ॥**
**వృషోత్సర్గాదృతే నాన్యత్కించిదస్తి మహీతలే ॥3॥**

విశేషించి స్త్రీలకు, అయిదు సంవత్సరాలు దాటిన శిశువుకు ప్రేతత్వం తొలగిపోవాలంటే, వృషోత్సర్గం మున్నగు కర్మలను ఆచరించాలి. వృషోత్సర్గం మినహాయిస్తే (చేయకపోతే) భూతలంలో మరో కర్మ ఏదీలేదు.

**జీవన్వాపి మృతోవాపి వృషోత్సర్గం కరోతి యః ।**
**ప్రేతత్వం న భవేత్తస్య వినా దానమఖవ్రతైః ॥4॥**

జీవించియున్నా, లేదా చనిపోయినా, ఎవనికై వృషోత్సర్గం జరుగుతుందో, అతనికి ప్రేతత్వమనేది కలగనే కలగదు. దానాలవల్ల కాని, యజ్ఞాలవల్ల కాని, వ్రతాలవల్ల కాని అది సిద్ధించదు.

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కస్మిన్కాలే వృషోత్సర్గం జీవన్వాపి మృతోఽపి వా ।**
**కుర్యాత్ సురవరశ్రేష్ఠ బ్రూహి మే మధుసూదన ॥5॥**

**కిం ఫలం తు భవేదంతే కృతైః శ్రాద్ధైస్తు షోడశైః ॥6॥**

సురవర శ్రేష్ఠా! మధుసూదనా! వృషోత్సర్గం జీవించిఉన్నప్పుడే చేయాలా? లేదా చనిపోయిన తరువాత చేయాలా? ఏ కాలంలో చేయాలి? దానికి వచ్చే ఫలితం ఏమిటి? చనిపోయిన తరువాత చేసే శ్రాద్ధాలవల్ల, షోడశ శ్రాద్ధాలవల్ల ఏం ఫలితం వస్తుంది?

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**అకృత్వా తు వృషోత్సర్గం కురుతే పిండపాతనమ్ ।**
**నోపతిష్ఠతి తచ్ఛ్రేయో దాతుః ప్రేతస్య నిష్ఫలమ్ ॥7॥**

వృషోత్సర్గం చేయకుండా పిండప్రదానం చేసినప్పటికి, దానివల్ల శ్రేయస్సు సిద్ధించదు. అది చేసే కర్తద్వారా ప్రేతకు ఫలం కలగదు.

**ఏకాదశాహే ప్రేతస్య యస్య నోత్సృజ్యతే వృషః ।**
**ప్రేతత్వం సుస్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి ॥8॥**

పదకొండోరోజున ప్రేతను ఉద్దేశించి వృషం విడువబడకుంటే, నూరు శ్రాద్ధాలు చేసినప్పటికి, మృతునికి ప్రేతత్వం స్థిరంగా ఉండిపోతుంది.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**సర్పాద్ధి ప్రాప్త మృత్యూనా మగ్నిదాహాది న క్రియా ।**
**జలేన శృంగిణావాపి శస్త్రాద్యై ర్మ్రియతే యది ॥9॥**

**అసన్మృత్యు మృతానాం చ కథం శుద్ధిర్భవేత్ప్రభో ।**
**ఏతన్మే సంశయం దేవ ఛేత్తు మర్హస్యశేషతః ॥10॥**

ఎక్కడో పాము కాటువల్ల చనిపోయినవారికి, అగ్ని సంస్కారాదిక్రియ చేసే అవకాశం ఉండదు కదా! అలాగే నీటిలోపడి చనిపోయినవానికి, మొసలి మున్నగు వాటినోట పడినవానికి, ఆయుధాలు మున్నగు వాటిచే చనిపోయినవానికి, అపమృత్యువు వాతపడినవానికి ప్రభూ! ఏవిధంగా శుద్ధి చేకూరుతుంది? దేవా ! ఈ సంశయం నన్ను పీడిస్తోంది. దీనిని పూర్తిగా తొలగించడానికి నీవే తగినవాడవు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**షణ్మాసై ర్బ్రాహణః శుద్ధ్యేద్యుగ్మే సార్ధే తు బాహుజః ।**
**సార్ధమాసేన వైశ్యస్తు శూద్రో మాసేన శుద్ధ్యతి ॥11॥**

ఆరు మాసాలలో బ్రాహ్మణుడు శుద్ధుడవుతాడు, రెండున్నర మాసాలలో క్షత్రియుడు శుద్ధి పొందుతాడు, ఒకటిన్నర మాసాలలో వైశ్యుడు, ఒక నెలరోజులచే శూద్రుడు శుద్ధుడవుతాడు.

**దత్త్వా దానాన్యశేషాణి సుతీర్థే మ్రియతే యది ।**
**బ్రహ్మచారీ శుచి ర్భూత్వా న స యాతీహ దుర్గతిమ్ ॥12॥**

బ్రహ్మచారి మరణిస్తే పుణ్యతీర్థంలో నానావిధదానాలు చేస్తే శుద్ధుడవుతాడు. అతడు దుర్గతిని పొందదు.

**వృషోత్సర్గాదికం కృత్వా యతిధర్మం సమాచరేత్ ।**
**యతిత్వే మృత్యుమాప్నోతి స గచ్ఛేద్బ్రహ్మ శాశ్వతమ్ ॥13॥**

వృషోత్సర్గం మున్నగువాటిని చేసి, యతిధర్మాన్ని బ్రహ్మచారి విషయంలో ఆచరించాలి. యతిగా ఉండి మృత్యువును పొందితే అతడు శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందుతాడు.

**వికర్మ కురుతే యస్తు శిష్టాచారవివర్జితః ।**
**వృషోత్సర్గాదికం కృత్వా నగచ్ఛేద్యమశాసనమ్ ॥14॥**

సదాచారం పాటించకుండా, ఎవడయినా నిషిద్ధకర్మను ఆచరిస్తే, అతనినుద్దేశించి వృషోత్సర్గం మున్నగువాటిని చేస్తే అతడు యమదండనకు గురికాడు.

**పుత్రో వా సాదరో వాపి పౌత్రో బంధుజన స్తథా ।**
**గోత్రిణ శ్చార్థభాగీ చ మృతే కుర్యాద్ వృషోత్సవమ్ ॥15॥**

పుత్రుడు కాని, సోదరుడు కాని, పౌత్రుడు కాని, బంధు జనులు కాని, సగోత్రికులు కాని, అతని అర్థాన్ని(ధనాదులను) పంచుకొనేవాడుకాని మరణిస్తే వృషోత్సవం ఆచరించాలి.

**పుత్రాభావే తు పత్నీ స్యాద్దౌహిత్రో దుహితాపి వా ।**
**పుత్రేషు విద్యమానేషు వృషం నాన్యేన కారయేత్ ॥16॥**

పుత్రులు లేకపోతే, భార్య కాని, దౌహిత్రుడు కాని, దుహిత(కుమార్తె)కాని, చేయాలి. పుత్రులు ఉండగా మాత్రం వృషోత్సవం ఇతరులచే చేయించబడకూడదు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**పుత్రా యస్య న విద్యంతే నరా నార్యః సురేశ్వర ।**
**ఏతన్మే సంశయం దేవ చ్ఛేత్తు మర్హస్యశేషతః ॥17॥**

సురేశ్వరా! నరులు కాని, నారులు కాని, పుత్రులు లేనివారైతే, అప్పుడేమి చేయాలి? దేవా! నాకు ఉన్న ఈ సందేహాన్ని పూర్తిగా తొలగించుటకు తగినవాడవు నీవే.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవ చ నైవ చ ।**
**తస్మాత్కేనాప్యుపాయేన పుత్రస్య జననం చరేత్ ॥18॥**

పుత్రులు లేనివారికి ఉత్తమగతి లేదు. స్వర్గమన్నది లేదు, అది లేనేలేదు, అందువల్ల ఏదో ఒక ఉపాయంచే పుత్ర జనన కర్మ నాచరించాలి.

**యాని కాని చ దానాని స్వయం దత్తాని మానవైః ।**
**తాని తాని చ సర్వాణి తూపతిష్ఠంతి చాగ్రతః ॥19॥**

మానవులు స్వయంగా చేసిన దానాలు అతని ఎదురుగానే(ఫలరూపంలోనే) నిల్చుండి ఉంటాయి.

**వ్యంజనాని విచిత్రాణి భక్ష్య భోజ్యాని యాని చ ।**
**స్వహస్తేన ప్రదత్తాని దేహాంతే చాక్షయం ఫలమ్ ॥20॥**

చిత్ర విచిత్ర పదార్థాలు, నానావిధ భక్ష్య భోజ్యాలు తనచేతితో దానంగా ఇస్తే శరీర పతనానంతరం అవి ఏమాత్రం తరిగిపోని ఫలితాన్ని ఇస్తాయి.

**గోభూహిరణ్యవాసాంసి భోజనాని పదాని చ ।**
**యత్ర యత్ర వసేజ్జంతు స్తత్ర తత్రోపతిష్ఠతి ॥21॥**

గోదాన, భూదాన, హిరణ్యదాన, వస్త్రదాన, భోజనసంతర్పణ, అష్టపద దానాలను చేసిన ప్రాణి ఎక్కడెక్కడ ఉంటే, అక్కడక్కడ ఫలితరూపంలో అవి సాక్షాత్కరిస్తాయి.

**యావత్ స్వస్థం శరీరం హి తావద్ధర్మం సమాచరేత్ ।**
**అస్వస్థః ప్రేరిత శ్చాన్యైర్న కించిత్ కర్తుమర్హతి ॥22॥**

శరీరం చక్కనిస్థితిలో ఉన్నప్పుడే, అంతవరకు ధర్మం ఆచరించాలి. అస్వస్థుడయితే, ఇతరులు ఎన్నవిధాల ప్రేరేపించినా ఏ కొంచెం ధర్మాన్ని ఆచరించలేడు.

**జీవతోऽపి మృతస్యేహ న భూతం చౌర్ధ్వదైహికమ్ ।**
**వాయుభూతః క్షుధావిష్టో భ్రమతే చ దివానిశమ్ ॥23॥**

**కృమిః కీటః పతంగో వా జాయతే మ్రియతే పునః ।**
**అసద్గర్భే భవేత్సోऽపి జాతః సద్యో వినశ్యతి ॥24॥**

కాబట్టి జీవించి ఉండగానే ధర్మం ఆచరించాలి. మృతుడికి ఇక్కడ ఔర్ధ్వదైహిక క్రియ చేయకపోతే, అతడు గాలిలో కలసి(వాయురూపుడై) ఆకలితో పీడింపబడుతూ, రాత్రి పగలు భ్రమిస్తూ ఉంటాడు. తిరిగి కృమి గాను, కీటకం గాను, మిడత గాను జన్మించి, మళ్లీ మరణిస్తాడు. లేదా దుష్టజన్మను పొందుతాడు. వెంటనే నశిస్తూ ఉంటాడు.

**యావత్ స్వస్థమిదం శరీరమరుజం యావజ్జరా దూరతో**
**యావచ్చేంద్రియశక్తిరప్రతిహతా యావత్ క్షయో నాయుషః ।**
**ఆత్మ శ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నో మహాన్**
**సందీప్తే భవనే తు కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః ॥25॥**

ఈ శరీరం స్వస్థతతో ఉన్నప్పుడే, రోగం వచ్చేలోపుగానే, ముసలితనం దూరంలో ఉండగానే(రాకుండగానే), ఇంద్రియపాటవం దెబ్బతినక ముందే, ఆయుష్షు క్షీణించక ముందే విచక్షణుడు ఆత్మశ్రేయస్సుకై పాటుపడాలి. గొప్ప ప్రయత్నం చేయాలి. లేదా ఆ బ్రతుకు ఇల్లు తగలబడిపోతూండగా నూయి త్రవ్వే ప్రయత్నం వంటిదయిపోతుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే వృషోత్సర్గ దానధర్మ పుత్రాది ప్రశంసనం నామ త్రయోదశోऽధ్యాయః ॥13॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఆబోతును విడవటం, దానాలు – వాటి ఫలితాలు అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్దశోఽధ్యాయః – పద్నాల్గవ అధ్యాయం

## గోదాన వృశోత్సర్గవివిధదానఫలాని – గోదాన వృషోత్సర్గం అనేకదానాల ఫలితం

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**ఆర్తేన మ్రియమాణేన యద్దత్తం తత్ఫలం వద ।**
**స్వస్థావస్థేన దత్తేన విధిహీనేన వా విభో ॥1॥**

ప్రభూ! స్వాస్థ్యం లేని ఆర్తుడు మరణించగా, అతనిని ఉద్దేశించి చేసిన కర్మకు (దానాది విధికి) ఫలమేమి? స్వస్థావస్థలో చేసిన దానానికి ఫలితమేమి? శాస్త్ర విహీన కర్మకు ఫలితం ఉంటుందా?

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ఏకా గౌః స్వస్థచిత్తస్య హ్యాతురస్య చ గోశతమ్ ।**
**సహస్రం మ్రియమాణస్య దత్తం విత్తవివర్జితమ్ ॥2॥**

స్వస్థచిత్తుడైన వానికి ఒక గోవును, ఆతురుడైన వానికి(మరణాసన్నవ్యక్తికి) నూరు గోవులును దానమీయాలి ఇక పూర్తిగా చనిపోబోతున్నవానికి (చనిపోయినవానికి) ధనం లేనివాడయితే వేయి గోవులు దానమీయాలి.

**మృతస్యైవ పునర్లక్షం విధి పూతం చ తత్సమమ్ ।**
**తీర్థపాత్ర సమాయోగాదేకా గౌ ర్లక్షపుణ్యదా ॥3॥**

చనిపోయినవానికి ధనమున్నవాడయితే లక్ష గోవులు దానంచేయాలి. విధి విహీనునికి విధి పవిత్రత చేకూరాలన్నా అలాగే దానం ఈయాలి. తీర్థాలలో కాని, పాత్రుడైన వానికిగాని ఆ యోగం తటస్థిస్తే ఇచ్చే ఒక్క గోదానం లక్షగోదాన పుణ్యాన్ని ఇస్తుంది.

**పాత్రే దత్తే ఖగశ్రేష్ఠ అహన్యహని వర్ధతే ।**
**దాతు ర్దానమపాపాయ జ్ఞానినాం చ ప్రతిగ్రహః ॥4॥**

ఖగోత్తమా! పాత్రునికిచ్చిన దానం రోజు రోజుకు వృద్ధిపొందుతుంది. జ్ఞానులు స్వీకరించే ప్రతిగ్రహం దానంచేసే దాతకు పాపాన్ని పోగొట్టి పుణ్యాన్ని ఇస్తుంది.

**విషశీతాపహో మంత్రవహ్నిః కిం దోషభాజనమ్ ।**
**దాతవ్యం ప్రత్యహం పాత్రే నిమిత్తేషు విశేషతః ॥5॥**

యోగ్యునికి ఇచ్చేదానం విషాన్ని పోగొట్టే మంత్రం వంటిది, చలిని హరించే అగ్ని వంటిది అవుతుంది. అపాత్రదానం వల్ల ఏ ప్రయోజనం? ప్రతిదినం యోగ్యునికే దానమీయాలి. నైమిత్తిక కార్యాలలో విశేషంగాఈయాలి.

**నాపాత్రే విదుషా కించిదాత్మనః శ్రేయ ఇచ్ఛతా ।**
**అపాత్రే జాతు గౌర్దత్తా దాతారం నరకం నయేత్ ॥6॥**

తన శ్రేయస్సును కోరుకొనే విద్వాంసుడు అపాత్రునికి ఏ కొద్దిపాటి దానంకూడ చేయరాదు. ఎప్పుడైనా అయోగ్యునికి గోవును దానం చేస్తే, ఇచ్చిన వానిని ఆ దానం నరకాన్ని పొందిస్తుంది.

**కులైకవింశతియుతం గ్రహీతారం చ పాతయేత్ ।**
**దేహాంతరం పరిప్రాప్య స్వహస్తేన కృతం చ యత్ ॥7॥**

**ధనం భూమిగతం యద్వత్ స్వహస్తేన నివేశితమ్ ।**
**తద్వత్ఫలమవాప్నోతి హ్యహం వచ్మి ఖగేశ్వర ॥8॥**

దానాన్ని గ్రహించినవాడు కూడ ఇరవైఒక్క తరాలవారితో బాటుగా దుర్గతిని పొందుతాడు. భూమిలో తనచేతితో దాచిన ధనాన్ని తాను తిరిగి పొందినట్టు, తాను చేసిన దానఫలాన్ని కూడా మరో దేహంలోనూ పొందుతాడు. ఖగేశ్వరా! ఇకపై వాటిని నేను చెబుతున్నాను.

**అపుత్రోऽపి విశేషేణ క్రియాం చైవౌర్ధ్వ దైహికీమ్ ।**
**ప్రకుర్యాన్మోక్షకామశ్చ నిర్ధనశ్చ విశేషతః ॥9॥**

పుత్రులు లేనివాడు విశేషించి ఊర్ధ్వలోకగమన క్రియ సంబంధించిన దానిని ఆచరించాలి. నిర్ధనుడు విశేషించి మోక్షాన్ని కోరుకొన్నవాడు శ్రద్ధగా ఆచరించాలి.

**స్వల్పేనాపి హి విత్తేన స్వయం హస్తేన యత్కృతమ్ ।**
**అక్షయం యాతి తత్సర్వం యథాజ్యం చ హుతాశనే ॥10॥**

ఎంత తక్కువ విత్తంచేత నయిననూ, తన నేతితో స్వయంగా ఇచ్చినది అగ్నిలో వేసిన నేయి ప్రజ్వరిల్లినట్లు అదంతా అక్షయమై సంక్రమిస్తుంది.

**ఏకాచైకస్య దాతవ్యా శయ్యా కన్యా పయస్వినీ ।**
**సా విక్రీతా విభక్తా వా దహత్యాసప్తమం కులమ్ ॥11॥**

ఒకనికే ఒక శయ్యను కాని, కన్యను కాని, పాలిచ్చే ఆవును కాని దానం చేయాలి. దానిని అమ్మివేసినా, విభజనచేసినా, ఏడు తరాల వారిని దహింపజేస్తుంది.

**తస్మాత్సర్వం ప్రకుర్వీత చంచలే జీవితే సతి ।**
**గృహీత దానపాథేయః సుఖం యాతి మహాధ్వని ॥12॥**

**అన్యథా క్లిశ్యతే జంతుః పాథేయ రహితః పథి ।**
**ఏవం జ్ఞాత్వా ఖగశ్రేష్ఠ వృషయజ్ఞం సమాచరేత్ ॥13॥**

కాబట్టి జీవితం చంచలమని తెలుసుకొని సమస్తం ఆచరించాలి. ఆ దానాన్ని స్వీకరించినవానివల్ల (పుణ్యంవల్ల) పాథేయం (మార్గంలో భక్షించడానికి ఉపయోగించే తినుబండారం) పొంది, గొప్పదైన యమమార్గంలో సుఖంగా పయనిస్తాడు. అలా కాకపోతే దారిలో పాథేయం లేనివాడై ప్రాణి(జీవుడు) క్లేశాన్ని పొందుతాడు. ఖగశ్రేష్ఠుడా! ఇది తెలుసుకొని వృషయజ్ఞాన్ని చక్కగా ఆచరించాలి.

**అకృత్వా మ్రియతే యస్తు అపుత్రో నైవ ముక్తిభాక్ ।**
**అపుత్రోऽపి హి యః కుర్యాత్సుఖం యాతి మహాపథే ॥14॥**

పుత్రులు లేనివాడు వృషోత్సర్జనం చేయకపోతే (స్వయంగా చేసుకొనకపోతే) మరణానంతరం అతడు ముక్తిభాజనుడు కాలేడు. పుత్రులు లేనివాడయినా, ఆ ఉత్సవం చేస్తే యమలోక మార్గంలో సుఖం పొందుతాడు.

**అగ్నిహోత్రాదిభి ర్యజ్ఞదానైశ్చ వివిధైరపి ।**
**న తాం గతిమవాప్నోతి వృషోత్సర్గేణ యా గతిః ॥15॥**

**యజ్ఞానాం చైవ సర్వేషాం వృషయజ్ఞ స్తథోత్తమః ।**
**తస్మాత్సర్వ ప్రయత్నేన వృషయజ్ఞం సమాచరేత్ ॥16॥**

వృషోత్సర్జనంచే లభించే ఉత్తమగతి అగ్నిహోత్రం మున్నగువాటిచేగాని, నానావిధ యజ్ఞదానాలచే గాని సంప్రాప్తించదు. అందువల్ల అన్నివిధాలైన యజ్ఞాలలోను వృషయజ్ఞం ఉత్తమమైనది. కాబట్టి ఎంత ప్రయత్నంచేసి అయినా, వృషయజ్ఞాన్ని చక్కగా ఆచరించాలి.

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**కథయస్వ ప్రసాదేన క్షయాహం చౌర్ధ్వదైహికమ్ ।**
**కస్మిన్కాలే తిథౌ కస్యాం విధినా కేన తద్భవేత్ ॥17॥**

**కృత్వా కిం ఫలమాప్నోతి ఏతన్మే వద సాంప్రతమ్ ।**
**త్వత్ప్రసాదేన గోవింద ముక్తో భవతి మానవః ॥18॥**

నన్ననుగ్రహించి చెప్పు చనిపోయిన రోజునుండి ఔర్ధ్వదైహిక క్రియ ఏ కాలంలో, ఏ తిథియందు, ఏ విధానంతో ఆచరించాలి? అలాచేస్తే ఎటువంటి ఫలం పొందవచ్చు? దీనిని నాకు ఇప్పుడు వివరించు. గోవిందా! నీ అనుగ్రహంవల్ల మానవుడు ముక్తుడవుతాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**కార్తికాదిషు మాసేషు యామ్యాయన గతే రవౌ ।**
**శుక్లపక్షే తథా పక్షిన్ ద్వాదశ్యాది తిథౌ శుభే ॥19॥**

**శుభేలగ్నే ముహూర్తే వా శుచౌ దేశే సమాహితః ।**
**బ్రాహ్మణం తు సమాహూయ విధిజ్ఞం శుభలక్షణమ్ ॥20॥**

**జప హోమై స్తథా దానైః కుర్యాద్దేహస్య శోధనమ్ ।**
**పుణ్యే ఒభిజిత్సునక్షత్రే గ్రహాన్ దేవాన్సమర్చయేత్ ॥21॥**

ఖగమా! కార్తికమాసం మున్నగు మాసాలలోను, రవి దక్షిణాయనంలో ప్రవేశించినప్పుడు, శుక్లపక్షంలోను, అలాగే శుభములైన ద్వాదశి మున్నగు తిథులయందు, శుభలగ్నంలో, శుభముహూర్తంలో, పవిత్రప్రదేశంలో శ్రద్ధాయుక్తుడై శుభలక్షణాలు కల్గిన దైవజ్ఞుడైన బ్రాహ్మణుని ఆహ్వానించి జపహోమాలతోను, అలాగే దానాలతోను ముందు దేహానికి శుద్ధి కావించాలి. అభిజిత్తు నక్షత్రంలో కాని, పుణ్య నక్షత్రంలో కాని, గ్రహాలను, దేవతలను చక్కగా పూజించాలి.

**హోమం కుర్యాద్యథాశక్తి మంత్రైశ్చ వివిధైరపి ।**
**గ్రహాణాం స్థాపనం కుర్యాత్ పూర్వం చైవ ఖగేశ్వర ॥22॥**

ఖగరాజా! ముందు గ్రహాలకు ఆవాహన స్థాపనాదులను కావించాలి. తరువాత శక్తిననుసరించి ఆయా గ్రహ మంత్రాదులతో హోమం చేయాలి.

**మాతౄణాం పూజనం కార్యం వసోర్ధారాం చ పాతయేత్ ।**
**వహ్నిం సంస్థాప్య తత్రైవ పూర్ణం హోమం తు కారయేత్ ॥23॥**

మాతృకలను (మాతలను) విధిగా పూజించాలి. అగ్నిని సంస్థాపించి, అక్కడనే "వసోర్ధారాం" ఇత్యాది మంత్రాలతో పూర్ణాహుతి హోమం నిర్వర్తించాలి.

**శాలగ్రామం చ సంస్థాప్య వైష్ణవం శ్రాద్ధమాచరేత్ ।**
**వృషం సంపూజ్య తత్రైవ వస్త్రాలంకార భూషణైః ॥24॥**

**చతస్రో వత్సతర్యశ్చ పూర్వం సమధివాసయేత్ ।**
**ప్రదక్షిణం తతః కుర్యాద్ధోమాంతే చ విసర్జనమ్ ॥25॥**

శాలగ్రామాన్ని సంస్థాపించి, వైష్ణవ శ్రాద్ధాన్ని ఆచరించాలి. వస్త్రం, అలంకారం, భూషణం మున్నగు వాటితో ఎద్దును పూజించాలి. ముందుగా నాలుగు వత్సతరులను (విడవబడుతున్న ఎద్దునకు పత్నిగా భావింపబడిన మూడు సంవత్సరాలవయస్సుగల ఆవు వత్సతరి) అక్కడ ఉండేలా చేయాలి. పిమ్మట ప్రదక్షిణం ఆచరించాలి. హోమం పూర్తి అయిన తరువాత విసర్జనం చేయాలి.

**ఇమం మంత్రం సముచ్చార్య ఉత్తరాభిముఖఃస్థితః ।**
**ధర్మత్వం వృషరూపేణ బ్రహ్మణా నిర్మితః పురా ॥26॥**
**తవోత్సర్గ ప్రభావాన్మాముద్ధరస్వ భవార్ణవాత్ ।**
**అభిషిచ్య శుభైర్మంత్రైః పావనై ర్విధిపూర్వకమ్ ॥27॥**

"ఓ ధర్ముడా! నీవు మొదట వృషరూపంలో బ్రహ్మచే సృష్టింపబడినావు. నీ ఉత్సర్జన ప్రభావంతో నన్ను సంసారసముద్రంనుంచి ఉద్ధరించు." అనే మంత్రాన్ని పఠించి, ఉత్తరదిక్కుగా నిలిచి, పవిత్ర మంగళమంత్రాలతో శాస్త్రపూర్వకంగా అభిషేకించి,

**తేన క్రీడంతి మంత్రేణ వృషోత్సర్గం తు కారయేత్ ।**
**అభిషించేత్తతో నీలం రుద్రకుంభోదకేన తు ॥28॥**

**నాభిమూలే సమాస్థాయ తదంబు మూర్ధని న్యసేత్ ।**
**అన్న(ఆత్మ)శ్రాద్ధం తతః కుర్యాద్దద్యాద్దానం ద్విజోత్తమే ॥29॥**

"తేన క్రీడంతి" అనే మంత్రంతో వృషోత్సర్జన విధి నాచరించాలి. అటుపిమ్మట నీల వృషభాన్ని దర్భమూలంలో నున్న రుద్ర కుంభోదకాన్ని స్వీకరించి, ఆ నీటితో అభిషేకించాలి. ఆ నీటిపాత్రను దాని శిరస్సుపై ఉంచాలి. అనంతరం అన్న శ్రాద్ధం చేయాలి. దానిని అప్పుడు ద్విజోత్తమునకు దానం ఈయాలి.

**ఉదకే చైవ గంతవ్యం జలం తత్ర ప్రదాపయేత్ ।**
**యదిష్టం జీవతస్త్వాసీత్తచ్చ దద్యాత్ స్వశక్తితః ॥30॥**

**న్యూనం సంపూర్ణతాం యాతి వృషోత్సర్గే కృతే సతి ।**
**సుతృప్తో దుస్తరే మార్గే మృతో యాతి న సంశయః ॥31॥**

అది నీటిలో పయనిస్తూ వెళ్లాలి. అందువల్ల అక్కడ నీరు నిండా ఉంచాలి. తనకు ఇష్టమైతే జీవించియుండగానే స్వశక్తి ననుసరించి ఈ క్రియ నాచరించి దానం ఈయాలి. వృషోత్సర్గం ఈ విధంగా చేస్తే నిశ్చయంగా సంపూర్ణత్వం పొందుతుంది. చనిపోయినవాడు తరింపశక్యంకాని యమ మార్గంలో మిక్కిలి సంతృప్తుడై వెడతాడు. ఇందు సంశయంలేదు.

**యమలోకం న పశ్యంతి సదా దానరతా నరాః ।**
**యావన్న దీయతే జంతోః శ్రాద్ధం చైకాదశాహికమ్ ॥32॥**

**స్వదత్తం పరదత్తం వా నేహాముత్రోపతిష్ఠతి ।**
**త్రయోదశ తథా సప్తం పంచ త్రీణి క్రమేణ తు ॥33॥**

ఎల్లప్పుడు దాన నిరతులైన నరులు యమలోకాన్ని చూడరు. మృతునికి పదకొండో రోజు శ్రాద్ధం చేయబడక పోతే, అది స్వయందత్తమైనా, పరదత్తమైనా నిర్వహింపబడకపోతే, ఇహలోక పరలోకాలు సిద్ధింపబడవు. క్రమంగా మూడు, ఐదు, ఏడు, పదమూడో రోజు విధుల విషయం కూడ అంతే.

**పదదానాని కుర్వీత శ్రద్ధాభక్తిసమన్వితః ।**
**తిలపాత్రాణి కుర్వీత సప్త పంచ యథాక్రమమ్ ॥34॥**

శ్రద్ధతోను, భక్తితోను పదదానాలు చేయాలి. యథాక్రమంగా ఐదు, ఏడు తిలపాత్రలు కూడ ఈయాలి.

**బ్రాహ్మణాన్ భోజయేత్పశ్చాదేకాం గాంచ ప్రదాపయేత్ ।**
**వృషం చ శన్నోదేవీతి వేదోక్తవిధినా తతః ॥35॥**

**చతసృభిర్వత్సతరీభిః పరిణయం నమాచరేత్ ।**
**వామే చక్రం ప్రదాతవ్యం త్రిశూలం దక్షిణే తథా ॥36॥**

పిమ్మట బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఒక గోవును కూడ ఈయాలి. "శంనోదేవీ" అనే మంత్రంతో వేదోక్తవిధానంతో వృషానికి నాలుగు వయస్సులో నున్న దూడలతో పరిణయం చేయాలి. వామభాగంలో చక్రమును, దక్షిణభాగంలో త్రిశూలమును ఉంచి ఈయాలి.

**మూల్యం దద్యాద్ వృషస్యాపి తం వృషం విసర్జయేత్ ।**
**ఏకోద్దిష్ట విధానేన స్వాహాకారేణ బుద్ధిమాన్ ॥37॥**

**కుర్యాదేకాదశాహం చ ద్వాదశాహం చ యత్నతః ।**
**సపిండీకరణాదర్వాక్కుర్యా చ్ఛ్రాద్ధాని షోడశ ॥38॥**

ఆ వృషానికి సంబంధించిన మూల్యాన్ని చెల్లించాలి. అప్పుడు వృషాన్ని విడిచిపెట్టాలి. ఏకోద్దిష్ట విధానంతో స్వాహాకారంతో బుద్ధిమంతుడు ప్రయత్నంతో పదకొండోరోజు, పండ్రెండోరోజు కర్మలను చేయాలి. సపిండీకరణపర్యంతం షోడశ శ్రాద్ధాలను నిర్వర్తించాలి.

**బ్రాహ్మణాన్ భోజయిత్వా తు పదదానాని దాపయేత్ ।**
**కార్పాసోపరి సంస్థాప్య తామ్రపాత్రే తథాచ్యుతమ్ ॥39॥**

**వస్త్రేణాచ్ఛాద్య తత్రస్థమర్ఘం దద్యాచ్ఛుభైః ఫలైః ।**
**నావమిక్షుమయీం కృత్వా పట్టసూత్రేణ వేష్టయేత్ ॥40॥**

బ్రాహ్మణులకు భోజనంపెట్టి పదదానాలను చేయాలి. ప్రత్తిపై తామ్రపాత్రను స్థాపించి అందు అచ్యుతుని ఆవాహన చేసి, వస్త్రంచే కప్పి, అందున్న అచ్యుతునకు అర్ఘ్యం సమర్పించాలి. శుభఫలాలను నివేదించాలి. చెరకుముక్కలచే పడవను చేసి, దానిని పట్టసూత్రంతో చుట్టాలి.

**కాంస్యపాత్రే ఘృతం స్థాప్య వైతరణ్యా నిమిత్తతః ।**
**నావ ఆరోహణం కుర్యాత్ పూజయే ద్గరుడధ్వజమ్ ॥41॥**

కాంస్యపాత్రలో నేయి పోసి, వైతరణిని దాటుటకోసమై, నావపై దానిని ఎక్కించాలి. పిమ్మట గరుడధ్వజుడైన విష్ణువును పూజించాలి.

**ఆత్మవిత్తానుసారేణ తచ్చ దానమనంతకమ్ ।**
**భవసాగరమగ్నానాం శోకతాపార్తిదుఃఖినామ్ ॥42॥**

**ధర్మప్లవ విహీనానాం తారకో హి జనార్దనః ।**

తనవద్దనున్న ధనాన్ని అనుసరించి, అనంతుని ఉద్దేశించి దానిని దానం ఈయాలి సంసారమనే సాగరంలో మునిగి వారిని శోకం, తాపం, ఆర్తి–వీటిచే దుఃఖించేవారిని, ధర్మమనే తెప్ప(పడవ)లేనివారిని తరింపజేసేవాడు జనార్దనుడే.

**తిలాలోహం హిరణ్యం చ కార్పాసం లవణం తథా ॥43॥**

**సప్తధాన్యం క్షితిర్గావో హ్యేకైకం పావనం స్మృతమ్ ।**
**తిలపాత్రాణి కుర్వీత శయ్యాదానం చ దాపయేత్ ॥44॥**

నువ్వులు, ఇనుము, బంగారం, ప్రత్తి, ఉప్పు, అలాగే సప్తధాన్యాలు, భూమి, గోవులు, ఇవి ఒక్కొక్కటి పవిత్రమైనవిగా చెప్పబడడం జరిగింది. తిలపాత్రలను ఈయాలి. శయ్యాదానం చేయాలి.

**దీనానాథవిశిష్టేభ్యో దద్యాచ్ఛక్త్యా చ దక్షిణామ్ ।**
**ఏవం యః కురుతే తార్క్ష్య పుత్రవానప్యపుత్రవాన్ ॥45॥**

దీనులకు, అనాథులకు, విశిష్టులకు శక్తికొలది దక్షిణను ఈయాలి. తార్క్ష్యా! ఈ విధంగా ఎవడయితే చేస్తాడో, అతడు పుత్రులు లేనివాడయితే, పుత్రవంతుడవుతాడు.

**స సిద్ధిం సమవాప్నోతి యథా తే బ్రహ్మచారిణః ।**
**నిత్యం నైమిత్తికం కుర్యాద్యావజ్జీవతి మానవః ॥46॥**

బ్రహ్మచారులు ఏవిధంగా సిద్ధిని పొందుతారో, ఆ విధంగా అతడు కూడ సిద్ధిని పొందుతాడు. మానవుడు ఎంతకాలం బ్రతికి ఉంటాడో అంతకాలం కూడ నిత్య నైమిత్తిక కర్మలు ఆచరిస్తూనే ఉండాలి.

**యః కశ్చిత్ క్రియతే ధర్మస్తత్ఫలం చాక్షయం భవేత్ ।**
**తీర్థయాత్రా వ్రతాదీనాం శ్రాద్ధం సంవత్సరస్య హి ॥47॥**

**దేవతానాం గురూణాం చ మాతాపిత్రో స్తథైవ చ ।**
**పుణ్యం దేయం ప్రయత్నేన ప్రత్యహం వర్ధతే ఖగ ॥48॥**

ఏ ధర్మాన్ని ఆచరించినా అది అక్షయఫలవంతమవుతుంది. ఖగా! తీర్థయాత్రలను, వ్రతాదులను, సంవత్సర శ్రాద్ధాన్ని (అబ్దికాన్ని), దేవతాపూజను, గురుపూజను, మాతాపిత్రారాధనను ప్రయత్నంతో పుణ్యకర్మను, దానాలను చేస్తూనే ఉండాలి. వాటిఫలం ప్రతిదినం వృద్ధి పొందుతూనే ఉంటుంది.

**అస్మిన్యజ్ఞే హి యః కశ్చిద్భూరిదానం ప్రయచ్ఛతి ।**
**తత్తస్య చాక్షయం సర్వం వేదికాయాం యథా కిల ॥49॥**

ఈ యజ్ఞంలో ఎవడయినా ఎక్కువగా దానం ఇస్తే, యజ్ఞవేదియందు సమర్పించబడిన దానిలాగా, అది అతనికి అక్షయఫలితాన్ని అందజేస్తుంది.

**యథా పూజ్యతమా లోకే యతయో బ్రహ్మచారిణః ।**
**తథైవ ప్రతిపూజ్యంతే లోకే సర్వే చ నిత్యశః ॥50॥**

ఈ లోకంలో యతులు, బ్రహ్మచారులు ఎలా మిక్కిలిగా పూజింపబడతారో, అలాగే సమస్త జనాలు నిత్యం ఎక్కువ సత్కరింపబడుతూ ఉంటారు.

**వరదోఽహం సదా తస్య చతుర్వక్త్రస్తథా హరః ।**
**తే యాంతి పరమాం ల్లోకానితి సత్యం వచో మమ ॥51॥**

నేను అతనికి ఎల్లప్పుడూ వరాలు ఇస్తూ ఉంటాను. చతుర్ముఖుడైన బ్రహ్మ, హరుడు కూడ వరాలను ఇస్తూ ఉంటారు. వారు ఉత్కృష్ట లోకాలను పొందుతారు. నావచనం సత్యం.

**ఉత్సృష్టో వృషభో యత్ర పిబత్యపో జలాశయే ।**
**శృంగేణాలిఖతేవాపి భూమిం నిత్యం ప్రహర్షితః ॥52॥**

విడువబడిన వృషభం ఎక్కడయితే జలాశయంలో నీరు త్రాగుతుందో అక్కడా ,అది సంచరించినచోట పర్వత శిఖరంనుండి భూమిపై క్రిందకు పడినప్పటికి అక్కడా, దుఃఖం పొందకుండా నిత్యం మిక్కిలి సంతోషం తోనే ఉంటాడు.

**పితౄణా మన్నపానం చ ప్రభూత ముపతిష్ఠతి ।**
**పౌర్ణమాస్యామమాయాం వా తిలపాత్రాణి దాపయేత్ ॥53॥**

పితరులకు అన్నం పానం సమృద్ధిగా లభిస్తుంది. పౌర్ణమాస్యయందు, అమావాస్యయందు తిలపాత్రలను దానం చేయాలి.

**సంక్రాంతీనాం సహస్రాణి సూర్యపర్వ శతాని చ ।**
**దత్త్వా యత్ఫల మాప్నోతి తద్వై నీలవిసర్జనే ॥54॥**

వేయి సంక్రమణములందు, నూరు సూర్యగ్రహణములందు దానంచేస్తే ఏ ఫలం వస్తుందో, ఆ ఫలితం నల్లని ఎద్దును విసర్జిస్తే వస్తుంది.

**వత్సతర్యః ప్రదాతవ్యా బ్రాహ్మణేభ్యః పదాని చ ।**
**తిలపాత్రాణి దేయాని శివభక్త ద్విజేషు చ ॥55॥**

బ్రాహ్మణులకు పాలిచ్చే ఆవులను, పదదానాలను ఈయాలి. శివభక్తులైన బ్రాహ్మణులకు తిలపాత్రలను దానం చేయాలి.

**ఉమామహేశ్వరం చైకం పరిధాప్య ప్రదాపయేత్ ।**
**అతసీపుష్ప సంకాశం పీతవాససమచ్యుతమ్ ॥56॥**

**యే నమస్యంతి గోవిందం న తేషాం విద్యతే భయమ్ ।**
**ప్రేతత్వాన్మోక్షమిచ్ఛన్తో యే కరిష్యంతి సత్క్రియామ్ ॥57॥**

**యాస్యంతి తే పరాం ల్లోకానితి సత్యం వచో మమ ।**
**ఏతత్తే సర్వమాఖ్యాతం మయా చౌర్ధ్వదైహికమ్ ॥58॥**

ఉమా సహితమహేశ్వరుని ఒకే వస్త్రంతో ధరింపజేసి(అలంకరించి) దానంచేయాలి. అవిసెపూల కాంతితో ప్రకాశించే, పచ్చని బట్టధరించే, అచ్యుతుడైన గోవిందునికి నమస్కరించిన వారికి భయమనేది ఉండదు. ప్రేతత్వం నుండి మోక్షాన్ని కోరుకొనేవారు సత్కర్మను ఆచరిస్తే, పరలోకాలకు వెళ్లగలరు. నా వచనం సత్యం సుమా ! దీనినంతనూ నీకు ఔర్ధ్వదైహికక్రియను నేను చెప్పుట జరిగింది.

**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ।**
**శ్రుత్వా మాహాత్మ్యమతులం గరుడో హర్షమాగతః ॥**
**మానుషాణాం హితార్థాయ పునః పప్రచ్ఛ కేశవమ్ ॥59॥**

దీనిని విన్నచో సమస్తపాపాలనుండి విముక్తి పొందవచ్చును. సంశయం లేదు. గరుడుడు సాటిలేని ఈ మాహాత్మ్యాన్ని విని మిక్కిలి హర్షం పొందాడు. పిమ్మట మనుష్యుల మేలుకోసమై మళ్లీ కేశవుని ఇలా అడిగాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే గోదాన వృషోత్సర్గ దశదాన భూరిదానాది నిరూపణం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో గోదానం వృషోత్సర్గం అనేకదానాల ఫలితం అనే పదు నాల్గవ అధ్యాయం సమాప్తం.

## **పంచదశోఽధ్యాయః** – పదిహేనవ అధ్యాయం

## **యమలోకగమనమ్** – యమలోకానికి ప్రయాణం

**గరుడ ఉవాచ** – గరుడుడు పచించాడు.

> **భగవన్ బ్రూహి మే సర్వం యమలోకస్య నిర్ణయమ్ ।**
> **జంతోః ప్రయాణమారభ్య మాహాత్మ్యం వర్త్మ విస్తరమ్ ॥1॥**

భగవన్! యమలోక నిర్ణయం (గమనం) గురించి నాకు మొత్తం వివరించవలసింది. మృతుని ప్రయాణం మొదలుకొని దారిలో పడే భోగానుభవం గురించి విస్తరించి చెప్పవలసింది.

**శ్రీ భగవానువాచ** – శ్రీ భగవంతుడు పచించాడు.

> **శృణు తార్క్ష్య ప్రవక్ష్యామి యమమార్గస్య నిర్ణయమ్ ।**
> **ప్రయాణకాని సర్వాణి నగరాణి చ షోడశ ॥2॥**

తార్క్ష్యా! ఆలకించు. యమమార్గనిర్ణయం గురించి, ప్రయాణ సాధనాలను గురించి, పదునారు నగరాలు అన్నింటి గురించి చెబుతున్నాను.

> **షడశీతి సహస్రాణి యోజనానాం ప్రమాణతః ।**
> **యమలోకస్య చోర్ధ్వం వై అంతరా మానుషస్య చ ॥3॥**

మానుషలోకానికి, యమలోకానికి దూరం ప్రమాణం అనుసరించి ఎనబైఆరు వేల యోజనాలు పైన ఉన్నది.

> **సుకృతం దుష్కృతం వాపి భుక్త్వా లోకే యథార్జితమ్ ।**
> **కర్మయోగాద్యదా కశ్చి ద్వ్యాధి రుత్పద్యతే ఖగ ॥4॥**

> **నిమిత్తమాత్రం సర్వేషాం కృతకర్మానుసారతః ।**
> **యస్య యో విహితో మృత్యుః స తం ధ్రువమవాప్నుయాత్ ॥5॥**

సుకృతమైనా, దుష్కృతమైనా, సంపాదించిన, దానిని ఈ లోకంలో (లేదా మరోవిధంగా) అనుభవింపక తప్పదు. ఖగమా! ఆచరించిన కర్మయోగంవల్ల అంత్య సమయంలో ఏదో ఒక వ్యాధి పుడుతుంది. అందరికి అది ఒక నిమిత్తమాత్రమే. చేసిన కర్మను అనుసరించి ఎవనికి ఏ విధంగా మృత్యువు విహితమై ఉంటుందో, అతడు దానిని నిశ్చయంగా పొందుతాడు.

> **కర్మయోగాద్యదా దేహీ ముంచత్యత్ర నిజం వపుః ।**
> **తదా భూమిగతం కుర్యాద్గోమయేనోపలిప్య చ ॥6॥**

కర్మయోగాన్ననుసరించి దేహి ఇక్కడ తనశరీరాన్ని వదలి వెడతాడు. అప్పుడు పేడతో అలికిన నేలపై మృతి చెందినవ్యక్తిని పరుండబెట్టాలి.

**తిలాన్ దర్భాన్ వికీర్యాథ ముఖే స్వర్ణం వినిఃక్షిపేత్ ।**
**తులసీం సన్నిధౌ కృత్వా శాలగ్రామ శిలాం తథా ॥7॥**

తిలలను, దర్భలను చల్లి, నోటిలో బంగారాన్ని ఉంచాలి. అతని సమీపంలో తులసిమొక్కను, శాలగ్రామశిలను తెచ్చి ఉంచాలి.

**సేతు (ఏవం) సామాది సూక్తైస్తు మరణం ముక్తిదాయకమ్ ।**
**శలాకా స్వర్ణవిక్షేపైః ప్రేతప్రాణి గృహేషు చ ॥8॥**

ఆ వ్యక్తి మరణాన్ని వీలైనంతవరకు ముక్తిదాయకం చేయడానికై సామాది సూక్తాలను పఠించాలి. చిన్న చిన్న బంగారు రేకులను మరణించిన వాని ఇంటిలో ఉంచాలి.

**ఏకా వక్త్రేతు దాతవ్యా ఘ్రాణయుగ్మే తథా పునః ।**
**అక్ష్ణోశ్చ కర్ణయోశ్చైవ ద్వే ద్వే దేయే యథాక్రమమ్ ॥9॥**

**అథ లింగే తథాచైకా త్వేకాం బ్రహ్మాండకే క్షిపేత్ ।**
**కరయుగ్మే చ కంఠే చ తులసీం చ ప్రదాపయేత్ ॥10॥**

ఒకదానిని నోటిపై (ముఖంపై) వేయాలి. అలాగే నాసికా రంధ్రాలవద్ద రెండింటిని వేయాలి. కన్నులయందు చెవులయందు రెండేసి చొప్పున యథాక్రమంగా వేయాలి. లింగమందు ఒకదానిని, ఇంకొక దానిని బ్రహ్మాండకమునందు(గుదం)వేయాలి. రెండు చేతులయందు, కంఠభాగం పైన తులసీదళాలను ఉంచాలి.

**వస్త్రయుగ్మం చ దాతవ్యం కుంకుమైశ్చాక్షతైర్యజేత్ ।**
**పుష్పమాలాయుతం కుర్యాదన్యద్వారేణ సన్నయేత్ ॥11॥**

శవంపై రెండువస్త్రాలు వేయాలి. కుంకుమతో, అక్షతలతో పూజించాలి, పుష్పమాలలతో అలంకరించాలి, మరోద్వారం గుండా శవాన్ని తీసుకొని వెళ్లాలి..

**పుత్రస్తు బాంధవైః సార్ధం విప్రస్తు పురవాసిభిః ।**
**పితుః ప్రేతం స్వయం పుత్రః స్కంధమారోప్య బాంధవైః ॥12॥**

**గత్వా శ్మశాన దేశే చ ప్రాఙ్ముఖశ్చోత్తరా ముఖమ్ ।**
**అదగ్ధపూర్వా యా భూమి శ్చితాం తత్రైవ కారయేత్ ॥13॥**

పుత్రుడు బంధువులతో కలసివెళ్లాలి. విప్రుడు పురవాసులతో కలసివెళ్లాలి. తండ్రి శవాన్ని పుత్రుడు స్వయంగా బంధువులతో కలసి భుజంపై పెట్టుకొని మోయాలి. శ్మశానభూమికి సాగిపోవాలి. తూర్పుముఖంగా కాని, ఉత్తరాభిముఖంగా కాని, ఇదివరకు దగ్ధం చేయబడని చోటులో చితిని ఏర్పరచాలి.

**శ్రీఖండ తులసీ కాష్ఠ సమిత్పాలాశ సంభృతామ్ ।**
**వికలేంద్రియ సంఘాతే చైతన్యే జడతాం గతే ॥14॥**

**ప్రచలంతి తతః ప్రాణా యామ్యైర్నికటవర్తిభిః ।**
**ఏకీభూతం జగత్పశ్యే ద్దైవీ దృష్టిః ప్రజాయతే ॥15॥**

మంచిగంధపు కట్టెలు, ఎండిన తులసికాడలు, మోదుగు సమిధలు అందువేయాలి. ఇంద్రియాలన్నీ శక్తిని కోల్పోయి, చైతన్యం పోయి, శరీరం జడమైపోగా అప్పుడు ప్రాణాలు సమీపంలోఉన్న యమదూతలతో కలసి వెళ్లిపోతాయి. అప్పుడు మృతునికి దివ్యదృష్టి ఏర్పడుతుంది. అతడు అంత ఏకీభూతంగా ఉన్న జగత్తును చూస్తాడు.

**బీభత్సం దారుణం రూపం ప్రాణైః కంఠం సమాశ్రితైః ।**
**ఫేనముద్గిరతే కోపి ముఖం లాలాకులం భవేత్ ॥16॥**

**దురాత్మానశ్చ తాడ్యంతే కింకరైః పాశబంధనైః ।**
**సుఖేన కృతినస్తత్ర నీయంతే నాక నాయకైః ॥17॥**

కొందరి విషయంలో శరీరం బీభత్సంగా, భయంకరంగా, వికృతమయి పోతుంది. కొందరికి గురకవచ్చి నోటినుండి నురగ కారుతుంది. వీరు పాపాత్ములు, వీరిని పాశాలతో బంధించి యమకింకరులు బాదుతూ ఉంటారు. సుఖమరణాన్ని పొందిన పుణ్యాత్ములను స్వర్గాధిపతులు తీసుకొని వెడతారు.

**దుఃఖేన పాపినో యాంతి యమమార్గే చ దుర్గమే ।**
**యమశ్చతుర్భుజో భూత్వా శంఖ చక్ర గదాదిభృత్ ॥18॥**

**పుణ్యకర్మరతాన్ సమ్యక్ శుభాన్ మిత్రవదాచరేత్ ।**
**ఆహూయ పాపినః సర్వాన్ యమో దండేన తర్జయేత్ ॥19॥**

దుఃఖమరణం పొందిన పాపాత్ములు దుర్గమమైన యమమార్గంలో పయనిస్తారు. యముడు నాలుగుచేతుల్లో శంఖం,చక్రం,గద మున్నగు ఆయుధాలు ధరించిన, విష్ణురూపునిగా తోచి, పుణ్యకర్మనిరతులైన వారిని భక్తితో శుభకర్మలాచరించిన వారిని మిత్రునివలె గౌరవిస్తాడు. యముడు పాపాత్ములను అందరిని రావించి యమదండంతో శిక్షిస్తాడు.

**ప్రలయాంబుద నిర్ఘోష స్త్వంజనాద్రి సమప్రభః ।**
**మహిషస్థో దురారాధ్యో విద్యుత్తేజః సమద్యుతిః ॥20॥**

**యోజనత్రయ విస్తారదేహో రౌద్రోఽతిభూషణః ।**
**లోహదండధరో భీమః పాశపాణిర్దురాకృతిః ॥21॥**

**వక్రనేత్రోఽతిభయదో దర్శనం యాతి పాపినామ్ ।**

ప్రలయకాలంలోని మేఘ గర్జనలతో, కాటుకకొండతో సమానమైన కాంతితో మహిషంపై నిలిచి ఆరాధించుటకు శక్యం కానివాడై, మెరుపుతీగతో సమానమైన కాంతితో మూడు యోజనాల విస్తారదేహంతో, పరమరౌద్రుడై, ఎక్కువ అలంకారాలూ, ఇనుప దండాన్ని ధరించి, మహాభయంకరుడై, చేతియందు పాశంతో, భీకరమైన ఆకారం, వంకర కన్నులు, మిక్కిలి భీతిని కలిగించే రూపంతో పాపాత్ములకు దర్శనమిస్తాడు.

**అంగుష్ఠమాత్రః పురుషో హాహా కుర్వన్ కలేవరాత్ ॥22॥**

**తదైవ నీయతే దూతై ర్యామ్యై ర్వీక్షన్ స్వకం గృహమ్ ।**

అంగుష్ఠమాత్ర పురుషుడు హాహాకారం చేస్తూ, శరీరం నుండి బయటకు వెళ్లిపోతాడు. అప్పుడే తన ఇంటిని చూస్తూ యమకింకరులచే కొనిపోబడతాడు.

**నిర్విచేష్టం శరీరం తు ప్రాణైర్ముక్తం జుగుప్సితమ్ ॥23॥**

**అస్పృశ్యం జాయతే తూర్ణం దుర్గంధం సర్వనిందితమ్ ।**
**త్రిధావస్థా హి దేహస్య కృమివిడ్మస్మ సంజ్ఞితా(భస్మ) ॥24॥**

అప్పుడు మానవశరీరం ప్రాణాలచే విడవబడి చేష్టలు ఉడిగిఉంటుంది. చూడడానికి వెగటును కలిగిస్తుంది. వెంటనే స్పృశించరానిదయిపోతుంది. అందరిచేత అసహ్యంగా చూడబడి దుర్గంధయుక్తమై పోతుంది. శరీరానికి కృమి సంభరితం, విట్పూరితం,(మలం) మస్మ(భస్మ)యుక్తం అనే మూడు అవస్థలు కలుగుతాయి.

**కో గర్వః క్రియతే తార్క్ష్య క్షణవిధ్వంసిభిర్నరైః ।**
**దానం విత్తా దృతా వాచః కీర్తిధర్మౌ తథాయుషః ॥25॥**

**పరోపకరణం కాయాదసతః సారముద్ధృతమ్ ।**
**తస్యైవం నీయమానస్య దూతాః సంతర్జయంతి హి ॥26॥**

గరుడా! క్షణకాలంలో నశించే నరులు ఏ విషయంలో గర్వాన్ని పొందుతారు? శాశ్వతంగా ఉండని ఈ శరీరంద్వారా విత్తదానం, ఆదరమైన మాట, కీర్తి, ధర్మం, ఆయుష్షు, పరోపకారం, సారభూతమైన పుణ్యం ఆచరింపబడాలి. వీటిని ఆచరింపని దుష్టుని తోలుకొనిపోయే యమదూతలు అడుగడుగునా హింసిస్తూ ఉంటారు.

**దర్శయంతో భయం తీవ్రం నరకాయ పునః పునః ।**
**శీఘ్రం ప్రచల దుష్టాత్మన్ గతోఽసి త్వం యమాలయే ॥27॥**

తీవ్రమైన భయాన్ని చూపిస్తూ, నరకలోకానికి అదేపనిగా తోలుకొనిపోతూ "ఓరీ! దురాత్మా! శీఘ్రంగా కదలు(నడు) నువ్వు యమలోకానికి వెడుతున్నావు.

**కుంభీపాకాది నరకాంస్త్వాం నేష్యామశ్చ మా చిరమ్ ।**
**ఏవం వాచస్తదా శృణ్వన్ బంధూనాం రుదితం తథా ॥28॥**

**ఉచ్చైర్హాహేతి విలపన్నీయతేయమకింకరైః ।**

నిన్ను కుంభీపాకం మున్నగు నరకాలలో పడవేస్తాం. ఆలస్యంచేయకు." అప్పుడు ఇటువంటి మాటలు వింటూ, బంధువుల ఏడ్పులు గ్రహిస్తూ. గట్టిగా హా! హా! అని ఏడుస్తూ యమకింకరులతో తీసుకొనిపోబడతాడు.

**స్థానే శ్రాద్ధం ప్రకుర్వీత తథా చైకాదశేఽహని ॥29॥**

**మృతస్యోత్క్రాంతి సమయాత్ షట్ పిండాన్ క్రమశో దదేత్ ।**
**మృతస్థానే తథా ద్వారే చత్వరే తార్క్ష్య కారణాత్ ॥30॥**

**విశ్రామే కాష్ఠచయనే తథా సంచయనే చ షట్ ।**
**శృణు తత్కారణం తార్క్ష్య షట్ పిండపరికల్పనే ॥31॥**

పదకొండో రోజున సముచిత స్థానంలో శ్రాద్ధం పెట్టాలి. ప్రాణం పోయినప్పటినుండి మృతునకు ఆరు పిండాలను క్రమంగా ఈయాలి. గరుడా! మృతస్థానం, ద్వారం, నాలుగుదారుల కూడలి, ఏదో ఒక కారణంగా శవాన్ని దింపిన విశ్రామ స్థలమునందు, కాష్ఠచయనస్థలమునందు(చితి), అస్థి సంచయన స్థలమునందు ఆరు పిండాలను పెట్టాలి. తార్క్ష్యా! ఆరు పిండాల పరికల్పనంలో గల కారణాన్ని విను.

**మృతస్థానే శవో నామ తేన నామ్నా ప్రదీయతే ।**
**తేన దత్తేన తృప్యంతి గృహవాస్త్వధి దేవతాః ॥32॥**

చనిపోయినచోట పెట్టే పిండానికి శవపిండమని పేరు. దానిని ఈయడంవల్ల గృహదేవతలు, వాస్తుదేవతలు సంతృప్తి పొందుతారు.

**తేన భూమిర్భవేత్తుష్టా తదధిష్ఠాతృదేవతా ।**
**ద్వారే తు పిండం దేయం చ పాంథమిత్యభిధాయ తు ॥33॥**

దానివల్ల భూమి, దాని అధిష్ఠానదేవత తృప్తిపొందుతారు. పిమ్మట ద్వారంవద్ద పిండం పెట్టాలి. దానికి పాంథ పిండమని పేరు.

**దత్తేన తేన ప్రీణంతి ద్వారస్థా గృహదేవతాః ।**
**చత్వరే ఖేచరో నామ తముద్దిశ్య ప్రదాపయేత్ ॥34॥**

ఆ పిండాన్ని ఈయడంవల్ల ద్వారము నందలి గృహదేవతలు ప్రీతి పొందుతారు. నాలుగు బాటల కూడలియందు ఖేచరమనే పేరుగల పిండాన్ని ఖేచరుని ఉద్దేశించి పెట్టాలి.

**న చోపఘాతం కుర్వంతి భూతాద్యా దేవయోనయః ।**
**విశ్రామే భూత సంజ్ఞోఽయం తేన తత్ర ప్రదాపయేత్ ॥35॥**

దానివల్ల భూతాదులు, దేవయోనులు తృప్తిపొంది విఘ్నాలను కలగచేయకుండా ఉంటారు. విశ్రామస్థానంలో తరువాత పిండాన్ని ఉంచాలి. దానికి భూతపిండమని పేరు.

**పిశాచా రాక్షసా యక్షా యే చాన్యే దిశి వాసినః ।**
**తస్య హోతస్య దేహస్య నైవాయోగ్యత్వ కారకాః ॥36॥**

దానిని పెట్టడంవల్ల పిశాచ రాక్షస యక్ష గణాలు మిగిలిన దిగ్వాసి దేవతలు దహనం చేయబడే మృతుని శరీరానికి అయోగ్యత కలగకుండా చేస్తాయి.(ఉపకారంతో సహకరిస్తాయి)

**చితాపిండ ప్రభూతితః ప్రేతత్వముపజాయతే ।**
**చితాయాం సాధకం నామ వదంత్యేకే ఖగేశ్వర ॥37॥**

చితాస్థలంలో ఇచ్చే పిండంవల్ల ప్రేతత్వం సిద్ధిస్తుంది. ఖగేశ్వరా! చితాపిండానికే సాధకపిండం అనే పేరు ఉందని చెబుతారు.

**కేచిత్తం ప్రేతమేవాహుర్యథా కల్పవిదో బుధాః ।**
**తదాది తత్ర తత్రాపి ప్రేత నామ్నా ప్రదీయతే ॥38॥**

కల్పవేత్తలయిన బుధులు కొందరు దానినే ప్రేతమని పిలుస్తారు. అప్పటినుండి అన్ని తావులలోను ప్రేతపేరుపై ఈయబడుతుంది.

**ఇత్యేవం పంచభిః పిండైః శవస్యాహుతియోగ్యతా ।**
**అన్యథా చోపఘాతాయ పూర్వోక్తాస్తే భవంతి హి ॥39॥**

ఈ విధంగా ఈయబడిన అయిదు పిండాలవల్ల శవానికి దహన యోగ్యత సిద్ధిస్తుంది. అలా కానినాడు ముందు చెప్పబడిన వారందరు విఘ్నకారకులవుతారు.

**ఉత్క్రామే ప్రథమం పిండం తథా చార్ధపయేఽపి చ ।**
**చితాయాంతు తృతీయం స్యాత్త్రయః పిండాశ్చ కల్పితాః ॥40॥**

మరో మూడు పిండాలను ఒకటి ప్రాణం పోయినచోట, రెండోది శ్మశానానికి సగం దూరంలోను, మూడోది చితియందును క్రమంగా వేసేలా మూడు పిండాలను కూడా పరికల్పించాలి.

**విధాతా ప్రథమే పిండే ద్వితీయే గరుడధ్వజః ।**
**తృతీయే యమదూతాశ్చ ప్రయోగః పరికీర్తితః ॥41॥**

ప్రథమపిండంవల్ల విధాత, రెండోపిండంవల్ల గరుడధ్వజుడు(విష్ణువు), మూడోపిండంవల్ల యమదూతలు ప్రసన్నులవుతారని కీర్తింపబడింది.

**దత్తే తృతీయే పిండేఽస్మిన్ దేహదోషైః ప్రముచ్యతే ।**
**ఆధారభూత జీవశ్చ జ్వలనైర్జ్వాలయేచ్చితామ్ ॥42॥**

మూడో పిండం ఇస్తూ ఉండగానే, మృతుడు శారీరిక దోషాలనుండి విముక్తుడవుతాడు. అప్పుడు జీవాధారభూతమైన శరీరాన్ని చితియందుంచి అగ్నికీలలతో ప్రజ్వరిల్ల చేయాలి.(జ్వలన యోగ్యత పొందుతుంది)

**సంపూజ్య చోపలిప్యాథ ఉల్లిఖ్యోద్ధృత్య వేదికామ్ ।**
**అభ్యుక్ష్యోపసమాధాయ వహ్నిం తత్ర విధానతః ॥43॥**

చితిని ప్రజ్వలింపజేయుటకై ఒక వేదికను నిర్మించి, ఉల్లేఖనం, ఉద్ధరణం, అభ్యుక్షణం మున్నగు వాటినిచేసి, శాస్త్రపూర్వకంగా అగ్నిని సంస్థాపించాలి,

**పుష్పాక్షతైశ్చ సంపూజ్య దేవం క్రవ్యాదసంజ్ఞకమ్ ।**
**త్వం భూతకృజ్జగద్యోనే త్వం లోకపరిపాలకః ॥44॥**

**ఉపసంహారకస్తస్మాదేనం స్వర్గం మృతం నయ ।**
**ఇతి క్రవ్యాదమభ్యర్చ్య శరీరాహుతి మాచరేత్ ॥45॥**

పుష్పాలతోను, అక్షతలతోను పూజించి, క్రవ్యాదుడనే పేరుగల దేవుని "నీవు భూతాలను సృజించేవాడవు. జగద్యోనివి, నీవు లోక పరిరక్షకుడవు, నీవు ఉపసంహారకుడవు. ఈ మృతుని స్వర్గానికి కొని పొమ్ము" అని క్రవ్యాదుని ప్రార్థించి శవానికి నిప్పంటించాలి.

**అర్ధదగ్ధే తథా దేహే దద్యాదాజ్యాహుతిం తతః ।**
**లోమభ్యః స్వేతివాక్యేన కుర్యాద్ధోమం యథావిధి ॥46॥**

మృతుని దేహం సగం కాలాక నేతితో ఆహుతిని ఈయాలి. "లోమభ్యః స్వాహా" అనే మంత్రంతో యథావిధిగా హోమం చేయాలి.

**చితామారోప్య తం ప్రేతం హునేదాజ్యాహుతిం తతః ।**
**యమాయ చాంతకాయేతి మృత్యవే బ్రహ్మణే తథా ॥47॥**

**జాతవేదో ముఖే దేయా ఏకా ప్రేతముఖే తథా ।**
**ఊర్ధ్వం తు జ్వాలయేద్వహ్నిం పూర్వభాగే చితాం పునః ॥48॥**

పిమ్మట చితిపై నున్న ఆ మృతుని ఉద్దేశించి మళ్లీ హోమం చేయాలి. యముడు, అంతకుడు, మృత్యువు, బ్రహ్మ, జాతవేదుడు. వీరిని ఉద్దేశించి ఆహుతులు ఇచ్చి, ఒక ఆహుతిని ప్రేతముఖంపై ఇవ్వాలి. ముందుగా అగ్నిని పైభాగంలో జ్వలింపజేసి, దానిని తెచ్చి చితియొక్క తూర్పుభాగాన్ని మండించాలి.

**అస్మాత్త్వమధిజాతోఽసి త్వదయం జాయతాం పునః ।**
**అసౌ స్వర్గాయ లోకాయ స్వాహా జ్వలతి పావకః ॥49॥**

**ఏవమాజ్యాహుతిం దత్త్వా తిలమిశ్రాం సమంత్రకామ్ ।**
**తతో దాహః ప్రకర్తవ్యః పుత్రేణ కిల నిశ్చితమ్ ॥50॥**

"అందువల్ల నీవు జన్మలు తెలిసినవాడవు. వీడు తిరిగి జన్మించవలసి ఉన్నచో, వీడు స్వర్గలోకానికి అవశ్యం వెళ్లుగాక! పావకాయ స్వాహా" అనే మంత్రంతో తిలమిశ్రితమైన ఆజ్యాహుతులను ఈయాలి. ఈ విధంగా నిశ్చితంగా కొడుకే శవదహనం చేయాలి.

**రోదితవ్యం తతో గాఢమేవం తస్య సుఖం భవేత్ ।**
**దాహస్యానంతరం తత్ర కృత్వా సంచయన క్రియామ్ ॥51॥**

**ప్రేతపిండం ప్రదద్యాచ్చ దాహార్తి శమనం ఖగ ।**
**తావద్భూతాః ప్రతీక్షంతే తం ప్రేతం బాంధవార్థినమ్ ॥52॥**

ఆ సమయంలో మాత్రమే పుత్రుడు వెక్కి వెక్కి ఏడవాలి. అది ప్రేతకు సుఖాన్ని కలిగిస్తుంది. దహనకర్మ తరువాత అక్కడ సంచయన క్రియ ఆచరించాలి. ఖగమా! దాహపీడ తొలగిపోవడానికై అప్పుడు ప్రేతపిండం ఈయాలి. బాంధవులకు అర్థాన్ని సమకూర్చే ఆ ప్రేతను అంతవరకు భూతాలన్నీ చూస్తూ ఉంటాయి.

**దాహస్యానంతరం కార్యం పుత్రైః స్నానం సచైలకమ్ ।**
**తిలోదకం తతో దద్యాన్నామ గోత్రేణ తిష్ఠతు ॥53॥**

దహనసంస్కారమైన పిమ్మట పుత్రులు వస్త్రసహితంగా స్నానంచేయాలి. నిల్చుండి నామ గోత్ర సహితంగా తిలోదకాలు ఈయాలి.

**తతో జనపదైః సర్వైర్దాతవ్యా కరతాలికా।**
**విష్ణు ర్విష్ణురితి బ్రూయాద్గుణైః ప్రేతముదీరయేత్ ॥54॥**

అప్పుడు గ్రామ ప్రజలందరు గట్టిగా చప్పట్లు కొట్టి, విష్ణునామ సంకీర్తనం కొంత తడవు చేయాలి.ప్రేత గుణగణాలను కొంతసేపు చర్చించుకోవాలి.

**జనాః సర్వే సమాస్తస్య గృహమాగత్య సర్వశః ।**
**ద్వారస్య దక్షిణే భాగే గోమయం గౌరసర్షపాన్ ॥55॥**

**నిధాయ వరుణం దేవమంతర్ధాయ స్వవేశ్మని ।**
**భక్షయే న్నింబపత్రాణి ఘృతం ప్రాశ్య గృహం వ్రజేత్ ॥56॥**

జనాలు సాటివారందరూ మృతుని ఇంటికివచ్చి, ద్వారానికి దక్షిణ భాగంలో గోమయాన్ని, తెల్ల ఆవాలను ఉంచాలి. పిమ్మట మనస్సులో వరుణదేవుని ధ్యానిస్తూ, వేపాకులను నమలి, నోటిలో నేతిచుక్కను వేసుకొని ఎవరింటికి వారు వెళ్లిపోవాలి.

**కేచిద్దుగ్ధేన సించంతి చితాస్థానం ఖగేశ్వర ।**
**అశ్రుపాతం న కుర్వీత దద్యాదస్మై జలాంజలీన్ ॥57॥**

**శ్లేష్మాశ్రు బాంధవై ర్ముక్తం ప్రేతో భుంక్తే యతోఽవశః ।**
**అతో న రోదితవ్యం హి క్రియాః కార్యాః స్వశక్తితః ॥58॥**

ఖగరాజా! కొందరు "చితా స్థానాన్ని పాలతో తడుపుతారు, కన్నీరు కార్చరాదంటారు, జలాంజలులు ప్రేతకు దుఃఖం లేకుండా ఈయాలంటారు, బాంధవులు విడిచిన కన్నీరు, ముక్కునుండి పడే శ్లేష్మం వివశుడై ప్రేత

భుజిస్తాడంటారు. అందువల్ల ఏడుస్తూ ఉండడం పనికిరాదంటారు. తనశక్తి ననుసరించి కర్మ ఆచరించాలి" అని చెబుతారు.

**దుగ్ధం చ మృన్మయే పాత్రే తోయం దద్యాద్దినత్రయమ్ ।**
**సూర్యేచాస్తం గతే తార్క్ష్య వలభ్యాం చత్వరేఽపి వా ॥59॥**

**బద్ధః సంమూఢహృదయో దేహమిచ్ఛన్ కృతానుగః ।**
**శ్మశానం చత్వరం గేహం వీక్షన్ యామ్యైః స నీయతే ॥60॥**

ఒక మట్టిప్రమిదలో(పాత్రలో) మూడు రోజులపాటు నీరు, పాలు పోయాలి. గరుడా! సూర్యుడు అస్తమించిన తరవాత, ఇంటి కప్పుపై కాని, చత్వర ప్రదేశంలో కాని ఆ పాలపాత్రను, నీటిపాత్రను ఉంచాలి. ఇలా మూడు రోజులు చేయాలి. కొన్ని మూఢ హృదయ జీవాత్మలు ఆ మూడుచోట్ల తిరుగుతూ ఉంటాయి. అటువంటి జీవుడు స్వగృహాన్ని, ఆనాలుగు బాటల కూడలిని, శ్మశానాన్ని చూస్తూ యమకింకరులచే తీసుకొని పోబడుతూ ఉంటాడు.

**గర్తే పిండా దశాహం చ దాతవ్యాశ్చ దినే దినే ।**
**జలాంజలీః ప్రదాతవ్యాః ప్రేతముద్దిశ్య నిత్యశః ॥61॥**

**తావద్వృద్ధిశ్చ కర్తవ్యా యావత్పిండం దశాహికమ్ ।**
**పుత్రేణ హి క్రియా కార్యా భార్యయా తదభావతః ॥62॥**

భూమియందలి రంధ్రంలో పదోరోజువరకు ప్రతిదినం పిండప్రదానాలు చేయాలి. నిత్యమూ ప్రేతనుద్దేశించి జలాంజలులు ఈయాలి. పదోరోజు వరకూ పిండప్రమాణాన్ని వీలైనంతవరకూ పెంచుతూ ఉండాలి. ఈ క్రియలనన్నిటిని పుత్రుడే చేయాలి. పుత్రుడు లేని పక్షంలో భార్యచేయాలి.

**తదభావే చ శిష్యేణ తదభావే సహోదరః ।**
**శ్మశానే చాన్య తీర్థే వా జలం పిండం చ దాపయేత్ ॥63॥**

**ఓదనాని చ సక్తూంశ్చ శాకమూలఫలాదినా ।**
**ప్రథమేఽహని యద్దద్యాత్తద్దద్యాదుత్తరేఽహని ॥64॥**

ఆ అవకాశం లేకుంటే శిష్యుడు చేయాలి. కాకుంటే సోదరుడు చేయాలి, పిండప్రదానాన్ని, జలదానాన్ని శ్మశానంలో కాని, ఏవైనా తీర్థాలలో కాని చేయవచ్చు. ఓదనాలు, సక్తువులు, శాకాలు, మూలాలు, ఫలాలు (సక్తువు-పిండి) వీటితో పిండాలు చేయవచ్చు. తొలిరోజు ఏ పదార్థాన్ని ఉపయోగిస్తామో, చివరిరోజువరకు దానితోనేపెట్టాలి.

**దినాని దశపిండాని కుర్వంత్యత్ర సుతాదయః ।**
**ప్రత్యహం తే విభజ్యంతే చతుర్భాగాః ఖగేశ్వర ॥65॥**

ఇక్కడ పుత్రుడు మున్నగువారు పది రోజులు పిండాలు పెడతారు కదా! ఖగరాజా! ప్రతిదినం అవి నాలుగు భాగాలుగా విడిపోతాయి.

**భాగద్వయంతు దేహార్థం ప్రీతిదం భూతపంచకే ।**
**తృతీయం యమదూతానాం చతుర్థం చోపజీవ్యతి ॥66॥**

రెండు భాగాలు శరీరాన్ని నిర్మించే పంచ భూతాలకు ప్రీతిని కలిగిస్తాయి. మూడో భాగం యమదూతలకు తృప్తినిస్తుంది, నాలుగో భాగం మృతుని నోటికి చెందుతుంది.

**అహోరాత్రైస్తు నవభిః ప్రేతో నిష్పత్తిమాప్నుయాత్ ।**
**జంతో ర్నిష్పన్నదేహస్య దశమే బలవత్ క్షుధా ॥67॥**

తొమ్మిది అహోరాత్రాలు దాటేసరికి మృతునికి ప్రేతనిష్పత్తి ఏర్పడుతుంది. అలా పుట్టిన ప్రేత శరీరానికి పదో రోజున తీవ్రంగా ఆకలి కలుగుతుంది.

**న విధిర్నైవ మంత్రశ్చ న స్వధావాహనాశిషః ।**
**నామగ్రోతం సముచ్చార్య యద్దత్తం తద్దశాహికమ్ ॥68॥**

పదోరోజు చేసే పిండవిధిలో మంత్రం కాని, స్వధాకారం కాని, ఆవాహనకాని, ఆశీర్వాదం కాని ఉండవు. ఆనాడు చేయబడే కర్మఅంతా నామగోత్రోచ్చారణ పూర్వకంగా చేయబడుతుంది.

**దగ్ధే దేహే పునర్దేహమేవ ముత్పద్యతే ఖగ ।**
**ప్రథమేఽహని యః పిండ స్తేన మూర్ధా ప్రజాయతే ॥69॥**

ఖగమా! శరీరం దగ్ధమైపోయిన తరువాత మళ్లీ మృతునికి మరోదేహం పుడుతుంది. మొదటిరోజున ఇచ్చే పిండంతో శిరస్సు ఏర్పడుతుంది.

**గ్రీవా స్కన్ధౌ ద్వితీయే చ తృతీయే హృదయం భవేత్ ।**
**చతుర్థేన భవేత్పృష్ఠం పంచమే నాభిరేవ చ ॥70॥**

**షట్ సప్తమే కటీ గుహ్యమూరూ చాప్యష్టమే తథా ।**
**తాలూ పాదౌ చ నవమే దశమేఽహ్ని క్షుధా భవేత్ ॥71॥**

రెండో రోజున గ్రీవాస్కంధాలు, మూడో రోజున హృదయం, నాలుగో రోజున పృష్ఠం, అయిదో రోజున నాభి, ఆరో రోజున కటి, ఏడో రోజున గుహ్యం, ఎనిమిదో రోజున ఊరువులు, తొమ్మిదో రోజున తాలువులు, పాదాలు ఏర్పడతాయి. పదో రోజున మిక్కుటంగా ఆకలి వేస్తుంది.

**దేహం ప్రాప్తః క్షుధావిష్టో గృహే ద్వారే చ తిష్ఠతి ।**
**దశమేఽహని యః పిండస్తం దద్యా దామిషేణ తు ॥72॥**

**యతో దేహే సముత్పన్నే ప్రేతోఽతీవ క్షుధాన్వితః ।**
**అతస్త్వామిషబాహ్యేన క్షుధా తస్య న నశ్యతి ॥73॥**

దేహం ప్రాప్తించిన వెంటనే ఎక్కువ ఆకలితో ఇంటి ద్వారంవద్ద వేచి ఉంటాడు. అందువల్ల పదో రోజు ఇచ్చే పిండం ఆమిషంతో కలిపి ఈయాలి. ఎందువల్లనంటే దేహంరాగానే ప్రేత మిక్కిలి ఆకలితో నక నక లాడిపోతాడు. కాబట్టి ఆమిషం లేకపోతే ఆప్రేత ఆకలి తీరదు.

**ఏకాదశే ద్వాదశాహే ప్రేతో భుంక్తే దినద్వయమ్ ।**
**యోషితః పురుషస్యాపి ప్రేతశబ్దం సముచ్చరేత్ ॥74॥**

పదకొండో రోజు, పండ్రెండో రోజు ఆ రెండు రోజులు ప్రేత ఎక్కువగా తింటాడు. స్త్రీకి అయినా, పురుషునికయినా ఇకపై ప్రేత శబ్దాన్ని ఉచ్చరించాలి.

**దీపమన్నం జలం వస్త్రం యత్కించిద్వస్తు దీయతే ।**
**ప్రేతశబ్దేన తద్దేయం మృతస్యానందదాయకమ్ ॥75॥**

దీపమైనా, అన్నమైనా, జలమైనా, వస్త్రమైనా, ఇచ్చేది ఏ వస్తువయినా, దానిని ప్రేతశబ్దం ఉచ్చరించి ఈయాలి. అది మృతునికి ఆనందాన్ని ఇస్తుంది.

**త్రయోదశేఽహ్ని స ప్రేతో నీయతే చ మహాపథే ।**
**పిండజం దేహమాశ్రిత్య దివానక్తం బుభుక్షితః ॥76॥**

పదమూడో రోజున ఆ ప్రేత పిండజ శరీరాన్ని ఆశ్రయించి, పగలు రాత్రి ఆకలితో అలమటిస్తూ, మహాపథంలో (యమమార్గంలో) పయనిస్తాడు.(తీసుకొనిపోబడతాడు)

**శీతోష్ణ శంకు క్రవ్యాద వహ్నిమార్గస్తు పాపినామ్ ।**
**క్షుధా తృష్ణాత్మికా చైవ సర్వం సౌమ్యం కృతాత్మనామ్ ॥77॥**

చలి, వేడి, ఇనుపమేకులు, మాంసాన్ని తినే జంతువులు, నిప్పులుతో నిండి పాపాత్ముల మార్గంఉంటుంది. ఆ మార్గంలో ఆకలి, దప్పులు ఎక్కువ. ఇక పుణ్యాత్ములు వెళ్లే మార్గం అంతా సుప్రసన్నంగా ఉంటుంది.

**మార్గే చైతాని దుఃఖాని అసిపత్రవనాన్వితే ।**
**క్షుత్పిపాసార్దితో నిత్యం యమదూతైః ప్రపీడితః ॥78॥**

దుర్మార్గులు వెళ్లే మార్గంలో ఎన్నో కష్టాలు ఉన్నాయి. అసిపత్రకాననం కూడ ఇందే ఉంది. ఈ దారిలో వెళ్లే ప్రేత యమదూతలచే ఎంతో పీడింపబడుతూ ఉంటాడు. అతడు ఎల్లప్పుడు ఆకలి, దప్పికలతో అంగలారుస్తూ ఉంటాడు.

**అహన్యహని వై ప్రేతో యోజనానాం శతద్వయమ్ ।**
**చత్వారింశత్తథా సప్త అహోరాత్రేణ గచ్ఛతి ॥79॥**

ప్రతిదినం ప్రేత రెండు వందల నలబైఏడు యోజనాలు చొప్పున (అర్థక్రోశంఅధికం) రాత్రి, పగలు అనక పయనిస్తాడు.

**గృహీతో యమపాశైశ్చ హాహేతి రుదితే తు సః ।**
**స్వగృహం పరిత్యజ్య యామ్యం పురమనువ్రజేత్ ॥80॥**

అయ్యో! అయ్యో! అని అతడు మొరపెట్టుకుంటూ ఉండగానే యమపాశాలచే బంధింపబడి, అతడు తన ఇంటిని విడిచిపెట్టి, యామ్యపురానికి యమదూతల ననుసరించి వెడుతూ, ఈడ్చుకుపోబడతాడు.

**క్రమేణ యాతి స ప్రేతపురం యామ్యం శుభాశుభమ్ ।**
**అతీత్య తాని తాన్యేవ మార్గే పురవరాణి చ ॥81॥**

క్రమంగా ఆ ప్రేత శుభాశుభ సమ్మిళితమైన యామ్యపురాన్ని చేరుకొంటాడు. దారిలో ఆయా గొప్ప గొప్ప పురాలను దాటుకొంటూ వెడతాడు.

**యామ్యం సౌరిపురం నగేంద్రభవనం గంధర్వ శైలాగమౌ**
**క్రౌంచ క్రూరపురం విచిత్రభవనం బహ్వాపదం దుఃఖదమ్ ।**

**నానాక్రందపురం సుతప్తభవనం రౌద్రం పయోవర్షణం**
**శీతాఢ్యం బహుధర్మ భీతి భవనం యామ్యం పురం చాగ్రతః ॥82॥**

యామ్యపురి, సౌరిపురి, నగేంద్రభవనం, గంధర్వపురం, శైలాగమం, క్రౌంచపురం, క్రూరపురం, విచిత్ర భవనం, బహ్వాపదం, దుఃఖదం, నానాక్రందపురం, సుతప్తభవనం, రౌద్రం, పయోవర్షణం, శీతాఢ్యం, బహుభీతి నిచ్చే భవనం ఇవన్నీ యామ్యపురం చేరుకొనేలోపులో ముందుగా కానవచ్చే పురాలు.

**త్రయోదశేఽహ్ని స ప్రేతో గృహీతో యమకింకరైః ।**
**తస్మిన్మార్గే వ్రజత్యేకో గృహీత ఇవ మర్కటః ॥83॥**

అలా పదమూడోరోజున ఆ ప్రేత యమకింకరులచే బంధింపబడి గారడీవానికి పట్టుబడ్డ కోతిలాగ ఒక్కడూ ఆ మార్గంలో పయనిస్తాడు.

**తథైవ సవ్రజన్మార్గే పుత్రపుత్రేతి చ బ్రువన్ ।**
**హాహేతి క్రందతే నిత్యం కీదృశం తు మయా కృతమ్ ॥84॥**

అలా ఆ ప్రేత వారిచే ఈడ్చబడుతూ మార్గంలో "పుత్రా! పుత్రా!" అని బావురుమంటూ నిత్యం "అయ్యో! అయ్యో!" అని ఏడుస్తూ ఉంటాడు. నేను ఎటువంటి పాపం చేశానో కదా!

**మానుష్యం లభ్యతే కస్మాదితి బ్రూతే ప్రసర్పతి ।**
**మహతా పుణ్యయోగేన మానుష్యం జన్మ లభ్యతే ॥85॥**

**న తత్ ప్రాప్య ప్రదత్తం హి యాచకేభ్యః స్వకం ధనమ్ ।**
**పరాధీనం తదభవదితి బ్రూతే (రౌతి) సగద్గదః ॥86॥**

"నాకు ఈ మనుష్యజన్మ ఎందుకు వచ్చిందో కదా!" అని విలపిస్తూ సాగిపోతూ, లాగబడుతూ "గొప్పదైన పుణ్యయోగంచే మానవజన్మ వస్తుంది అంటారుకదా! అంత గొప్పజన్మను పొంది యాచకులకు నాధనాన్ని ఈయలేకపోయాను. అదంతా ఇప్పుడు పరాధీనమయిపోయింది." అని బొంగురుపోయే వణకే కంఠంతో బావురుమంటాడు.

**కింకరైః పీడ్యతే ఽత్యర్థం స్మరతే పూర్వదైహికమ్ ॥87॥**

ఇప్పుడు కింకరులు నన్ను ఎక్కువ చావబాదుతున్నారు (పీడిస్తున్నారు) అని తన పూర్వశరీరాన్ని తలచుకొంటూ ఉంటాడు.

**సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా పరో దదాతీతి కుబుద్ధిరేషా ।**
**పురా కృతం కర్మ సదైవ భుజ్యతే దేహిన్ క్వచిన్నిస్తరయత్త్వయా కృతమ్ ॥88॥**

సుఖాన్నికాని, దుఃఖాన్నికాని ఇచ్చేవాడు వేరే ఎవడూ లేడు. ఎవడో కలగజేస్తున్నాడని భావించడమనేది కుత్సితబుద్ధియే. పూర్వంలో చేసిన కర్మ ఎల్లప్పుడూ కర్త అనుభవించక తప్పదు. జీవుడా! ఏదయితే నీవు చేశావో దానిని అనుభవించు.

**మయా న దత్తం న హుతం హుతాశనే తపో న తప్తం హిమశైలగహ్వరే ।**
**న సేవితం గాంగమహెూ మహాజలం దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥89॥**

నేను దానం చేయలేదు, అగ్నిలో హోమం చేయలేదు, హిమవత్పర్వత గుహలో తపస్సు చేయలేదు. అయ్యో! గంగా మహాజలాన్ని సేవించలేదు, జీవుడా! నీవు ఏదిచేశావో దానినుండి తప్పించుకోలేవు. అనుభవించు.

**న నిత్యదానం న గవాహ్నికం కృతం న వేద దానం న చ శాస్త్రపుస్తకమ్ ।**
**పురా న దృష్టం న చ సేవితోఽధ్వా దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥90॥**

నేను నిత్యదానం చేయలేదు, ఆవులను మేపలేదు, గోశాలలో ఏ కర్మను చేయలేదు, వేదాలను ఎవ్వరికి ఉపదేశంచేయలేదు, శాస్త్రసంబంధ గ్రంథం ఎవరికీ దానం చేయలేదు అది పూర్వం నాచే చూడబడలేదు, బాటసారులకు భోజనమిచ్చి సేవ చేయలేదు, జీవుడా! ఏదయితే నీవు చేశావో దానిని అనుభవించు.

**జలాశయో నైవ కృతో హి నిర్జలే మనుష్యహేతోః పశు పక్షిహేతవే ।**
**గోతృప్తి హేతోర్న కృతం హి గోచరం దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥91॥**

మనష్యులకోసం కాని, పశువులకు, పక్షులకు మేలుకోసం కాని నిర్జలప్రదేశంలో జలాశయాన్ని కూడ నేను నిర్మించలేదు. గోవుల తృప్తికోసమై గోచరం (పాక మున్నగునవి) ఏర్పాటు చేయలేదు. జీవుడా! నీవు చేసిన కర్మనుండి ఎక్కడ తప్పించుకోగలవు, అనుభవించు.

**మయా న భుక్తం పతిసంగసౌఖ్యం వహ్నిప్రవేశో న కృతో మృతే సతి ।**
**తస్మిన్ మృతే తద్వ్రతపాలనం వా దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥92॥**

పతిసంగ సుఖాన్ని నేను అనుభవించలేదు, భర్త మరణించగా అగ్నిప్రవేశం (సహగమనం) చేయలేదు, పతి మరణించగా ఆయన వ్రతాన్ని కొనసాగించలేదు. జీవుడా! నీవు ఏదైతే చేశావో, దానిని ఎలా తరించగలవు? (స్త్రీ సంబంధవిషయం)

**మాసోపవాసైర్న విశోషితం వపుశ్చాంద్రాయణైర్వా నియమైశ్చ సంహతైః ।**
**నారీశరీరం బహుదుఃఖభాజనం లబ్ధం మయా పూర్వకృతైర్వికర్మభిః ॥93॥**

నా శరీరం మాసోపవాసాలచేత, చాంద్రాయణ వ్రతాలచేత, నియమబంధాలచేత శుష్కింపబడలేదు. స్త్రీ దేహం అనేక దుఃఖాలకు నిలయం. పూర్వంలో నే చేసిన నిషిద్ధ కర్మల ఫలితం నాకు ఈ విధంగా చేకూరింది.

**ఉక్తాని వాచ్యాని మయా నరాణా మతః శృణుష్వా వహితోఽపి పక్షిన్ ।**
**స్త్రీణాం శరీరం ప్రతిలభ్య దేహీ బ్రవీతి కర్మాణి కృతాని పూర్వమ్ ॥94॥**

ఖగమా! మానవులు మృతిచెందిన పిమ్మట రోదించే విలాపవాక్యాలను నీకు తెలియజేశాను. ఇవన్నీ సావధానుడవై విన్నావు కదా! జీవుడు స్త్రీల దేహాన్ని పొంది, పూర్వం తాను చేసిన కర్మల గురించి ఇలా విలపిస్తాడు సుమా!

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే యమలోకవిస్తార తన్మాహాత్మ్య తద్యాననిరూపణం నామ పంచదశోఽధ్యాయః ॥15॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో యమలోకానికి ప్రయాణం అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

## షోడశోऽధ్యాయః - పదహారవ అధ్యాయం

## ప్రేతయమలోకయాత్రా - ప్రేత యమలోకానికి చేరే తీరు

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు వచించాడు.

**ఏవం విలపత స్తస్య ప్రేతస్యైవం ఖగేశ్వర ।**
**క్రందమానస్య నితరాం పీడితస్య చ కింకరైః ॥1॥**

**సప్తదశ దినాన్యేకో వాయుమార్గే వికృష్యతే ।**
**అష్టాదశే త్వహోరాత్రే పూర్వం యామ్యపురం వ్రజేత్ ॥2॥**

ఖగరాజా! ప్రేత ఈ విధంగా విలపిస్తూ, భోరు భోరుమని ఏడుస్తూ, యమకింకరులు చావగొడుతూ ఉండగా, పదిహేడు రోజులపాటు ఒక్కడుగా వాయుమార్గంలో ఈడ్చుకుపోబడతాడు. పదునెనిమిదో రోజున మొదట యామ్యపురం చేరుకొంటాడు.

**తస్మిన్ పురవరే రమ్యే ప్రేతానాం చ గణో మహాన్ ।**
**పుష్పభద్రానదీ తత్ర న్యగ్రోధః ప్రియదర్శనః ॥3॥**

రమ్యమైన ఆ గొప్పపురంలో, పెద్దదైన ప్రేతగణం ఉంటుంది. అక్కడే పుష్పభద్రానది, చూడడానికి అందంగా ఉండే న్యగ్రోధవృక్షం దర్శనమిస్తాయి.

**పురే స తత్ర విశ్రామం ప్రాప్యతే యమకింకరైః ।**
**జాయా పుత్రాదికం సౌఖ్యం స్మరేత్తత్ర సుదుఃఖితః ॥4॥**

ఆ పురంలో ఆ ప్రేతకు అక్కడ ఒకింతకాలం యమకింకరులు విశ్రాంతి నిస్తారు. అక్కడ మిక్కిలి దుఃఖిస్తూ భార్యను,పుత్రాదులను, తాను అనుభవించిన సుఖాలను స్మరించుకొంటాడు.

**రుదతే కరుణైర్వాక్యై స్తృషార్తః శ్రమపీడితః ।**
**స్వధనం స్వకలత్రాణి గృహం పుత్రాః సుఖాని చ ॥5॥**

**భృత్యమిత్రాణి చాన్యచ్చ సర్వం శోచతి వై తదా ।**
**క్షుధార్తస్య పురే తస్మిన్ కింకరై స్తస్య చోచ్యతే ॥6॥**

అక్కడ దాహార్తి పొందుతూ, శ్రమచే పీడింపబడుతూ,జాలిపుట్టించే వాక్యాలతో ఏడుస్తాడు. తన ధనాన్ని,తన భార్యాదులను, ఇంటిని, పుత్రులను, సుఖాలను, సేవకులను, స్నేహితులను మిగిలిన వాటినన్నింటిని తలచుకొంటూ అప్పుడు రోదిస్తూ ఉంటాడు. ఆ పురంలో ప్రేత క్షుధార్తుడై పడిఉండగా, కింకరులు అతనితో ఇలా అంటారు.

**కింకరా ఊచుః** – కింకరులు అంటున్నారు.

**క్వ ధనం క్వ సుతా జాయా క్వ గృహం క్వ త్వమీదృశః ।**
**స్వకర్మోపార్జితం భుంక్ష్వ చిరం గచ్ఛ మహాపథే ॥7॥**

ఓ పాపాత్ముడా! ధనం ఎక్కడ? పుత్రులెక్కడ? ఎక్కడ భార్య? ఎక్కడ ఇల్లు? ఈ విధంగా ప్రేతవైన నీవెక్కడ? నీ కర్మను అనుసరించి చేసిన దానిని అనుభవించు. ఈ యమమార్గంలో చాలాసేపు పయనించవలసి ఉంది.

**జానాసి శంబలవశం బలమధ్వగానాం నో శంబలః ప్రయతతే పరలోకపాన్థ ।**
**గంతవ్యమస్తి తవ నిశ్చితమేవ తేన మార్గేణ యత్ర భవతః క్రయవిక్రయౌ నః ॥8॥**

ఇది నీ దారి బత్తెపు జీతగాళ్ల వశంలో సాగిపోయే దారి అనుకుంటున్నావేమో! ఓ పరలోకపు బాటసారీ! ఏ జీతగాడు నిన్ను విడిపించుటకు ప్రయత్నం చేయలేడు. నీ కర్మవల్ల ఏది నిశ్చయింపబడిందో, ఆ దారిలోనే నీవు వెళ్లవలసి ఉంది. నీ క్రయ విక్రయాలు ఈ దారిలో చెల్లవు.

**యమదూతోదితం వాక్యం పక్షిన్నైవం త్వయా శ్రుతమ్ ।**
**ఏవముక్త స్తతః సర్వైర్హన్యమానః సముద్గరైః ॥9॥**

**అత్ర దత్తం సుతైః పాత్రే (త్రైః) స్నేహాద్వా కృపయాథవా ।**
**మాసికం పిండమశ్నాతి తతః సౌరిపురం వ్రజేత్ ॥10॥**

ఖగమా! ఈ యమదూతల వాక్యాలు నీకు వినబడడంలేదు కాబోలు! అని వారందరూ అరుస్తూ, ముద్గరాలతో మొత్తుతూ ఉండగా, అక్కడ సుతులచేత కాని, పాత్రులచేత కాని ప్రేమతో కాని, దయతో గాని ఈయబడిన మాసికపిండాన్ని భుజిస్తాడు. అక్కడ నుండి సౌరిపురానికి ఈడ్చుకుపోబడతాడు.

**తత్ర నామ్నా తు రాజా వై జంగమః కాలరూపధృక్ ।**
**తం దృష్ట్వా భయభీతస్తు విశ్రామే కురుతే మతిమ్ ॥11॥**

అక్కడ ఉండే రాజు జంగముడు అనే పేరుతో, కాలరూపధారియై భయంకరంగా ఉంటాడు. అతనిని చూచి ప్రేత భయంతో గడగడలాడిపోయి మనస్సులో విశ్రాంతిని కోరుకొంటాడు.

**ఉదకం చాన్నసంయుక్తం భుంక్తే తస్మిన్పురే గతః ।**
**త్రైపక్షికే తు యద్దత్తం తత్పురం స వ్యతిక్రమేత్ ॥12॥**

ఆ పురంలో నిలిచి త్రైపక్షికంనాడు ఈయబడిన, అన్నంతో (పిండంతో) కూడుకొన్న ఉదకాన్ని స్వీకరిస్తాడు. పిమ్మట ఆ పురంనుండి వెళ్లిపోతాడు.

**నగేంద్రనగరే రమ్యే ప్రేతో యాతి దివానిశమ్ ।**
**గచ్ఛన్ వనాని రౌద్రాణి దృష్ట్వా క్రందతి తత్ర సః ॥13॥**

రమ్యమైన నగేంద్రనగరానికి రాత్రి, పగలు అనక పయనిస్తాడు. అలా వెడుతూ భయంకరారణ్యాలను చూచి ఆ ప్రేత అక్కడ ఆక్రందన చేస్తాడు.

**భీషణైః క్లిశ్యమానస్తు రుదతే చ పునః పునః ।**
**మాసద్వయావసానే తు తత్పురం సోఽతిగచ్ఛతి ॥14॥**

**భుక్త్వాచాన్నం జలం పీత్వా యద్దత్తం బాంధవైరిహ ।**
**క్లిశ్యమానస్తతః పాశైర్నీయతే యమకింకరైః ॥15॥**

అక్కడ భయంకరాకారులు కొడుతూ ఉండగా, ప్రేత మళ్లీ మళ్లీ రోదిస్తాడు. రెండో మాసం పూర్తిఅయ్యేసరికి ఆ పురాన్ని దాటి అతడు ముందుకు వెళ్లిపోతాడు. అక్కడ బంధువులిచ్చే అన్నం తిని, నీరు త్రాగి, యమకింకరులు పాశాలతో బంధించి లాగుతూఉండగా గగ్గోలు పెడతాడు.

**తృతీయే మాసి సంప్రాప్తే గంధర్వనగరం శుభమ్ ।**
**తృతీయం మాసికం భుక్త్వా తత్ర గచ్ఛత్యసౌ పురః ॥16॥**

మూడవ మాసం సంప్రాప్తించగా శుభమైన గంధర్వనగరం చేరుకొంటాడు. అక్కడ తృతీయమాసిక పిండాన్ని భుజించి, ప్రేత ముందుకు సాగిపోతాడు.

**శైలాగమం చతుర్థే స మాసే ప్రాప్నోతి వై పురమ్ ।**
**పాషాణాస్తత్ర వర్షంతి ప్రేతస్యోపరి సంస్థితాః ॥17॥**

నాలుగో మాసం రాగానే శైలాగమం అనే పురం చేరుకొంటాడు. అక్కడ ప్రేతపైన రాళ్లు వర్షిస్తాయి. అవి అతనిపై ఉండిపోతాయి.

**చతుర్థమాసికే శ్రాద్ధం భుంక్తే తత్ర సుఖీ భవేత్ ॥18॥**

అక్కడ చతుర్థమాసిక శ్రాద్ధపిండాన్ని భుజిస్తాడు. ప్రేత ఒకింత సేపు అప్పుడు సుఖాన్ని పొందుతాడు.

**తతో యాతి పురం ప్రేతః క్రూరం మాసే తు పంచమే ।**
**ఇహ దత్తం సుతైర్భుంక్తే ప్రేతో వై తత్పురే స్థితః ॥**
**షష్ఠే మాసి తతః ప్రేతో యాతి క్రౌంచాభిధం పురమ్ ॥19॥**

పిమ్మట అయిదో మాసంలో ప్రేత క్రూరపురం చేరుకొంటాడు, ఇక్కడ పుత్రులు ఇచ్చినదానిని ప్రేత భుజిస్తాడు. అక్కడ కొంతకాలం ఉండి, ఆరో మాసం రాగానే అక్కడనుండి అతడు క్రౌంచమనే పేరుగల పురానికి వెడతాడు.

**తత్ర దత్తేన పిండేన శ్రాద్ధే నాప్యాయితః పురే ।**
**ముహూర్తార్ధం తు విశ్రామ్య కంపమానః సుదుఃఖితః ॥20॥**

ఆ పురంలో ఈయబడిన శ్రాద్ధపిండాన్ని గ్రహించి ప్రీతి పొందుతాడు. ఒక గడియసేపు విశ్రాంతి పొందుతాడు. మళ్లీ వణకిపోయి మిక్కిలి దుఃఖాన్ని పొందుతాడు.

**తత్పురం స వ్యతిక్రమ్య తర్జితో యమకింకరైః ।**
**ప్రయాతి చిత్రనగరం విచిత్రో యత్ర పార్థివః ॥21॥**

అతడు ఆ పురాన్ని దాటిపోతూ, యమకింకరులు హింసిస్తూ ఉండగా, విచిత్రుడనే రాజు ఉండే, ఆ చిత్రనగరం చేరుకొంటాడు.

**యమస్యైవానుజః సౌరిర్యత్ర రాజ్యం ప్రశాస్తి హి ।**
**మాసైస్తు పంచభిః సార్ధైరూనషాణ్మాసికం భవేత్ ॥22॥**

యముని సోదరుడైన సూర్యపుత్రుడు ఎక్కడ రాజ్యంపాలిస్తున్నాడో, అక్కడకు చేరడానికి అయిదు నెలల పదియేను రోజులుదాటి ఊనషాణ్మాసికకాలం అవుతుంది.

**ఊనషాణ్మాసికం తత్ర భుంక్తే యామ్య సమాహతః ।**
**మార్గే పునః పునస్తస్య బుభుక్షా పీడయత్యలమ్ ॥23॥**

అక్కడ ఊనషాణ్మాసిక పిండాన్ని భుజిస్తాడు, యమభటులు బాదుతూఉండగా, దారిలో మళ్లీ మళ్లీ తినాలనే కోరిక, ఎంతో పీడిస్తుంది.

**సంతిష్ఠతే మృతే కోఽపి మదీయః సుత బాంధవః ।**
**సౌఖ్యం యో మే జనయతి పతతః శోకసాగరే ॥24॥**

మృతుడైన నా విషయంలో నావాడైన సుతుడు కాని, బంధువు కాని ఒక్కడూ నాముందు నిలబడడా? శోకసముద్రంలో పడిపోయిన నాకు ఒక్కడూ సుఖం కలగజేయడా?

**ఏవం మార్గే విలపతి వార్యమాణశ్చ కింకరైః॥**
**ఆయాంతి సమ్ముఖా స్తత్ర కైవర్తాస్తు సహస్రశః॥ 25**

ఆ దారిలో ప్రేత ఇలా ఏడుస్తూ ఉండగా, కింకరులు "ఈ ఏడుపు ఆపు" అని వారిస్తూ ఉండగా, అతని ఎదురుగా వేలకొలది జాలరులు వస్తారు.

**వయం తే తర్తుకామాయ మహా వైతరణీం నదీమ్ ।**
**శతయోజన విస్తీర్ణాం పూయశోణిత సంకులామ్ ॥26॥**

**నానా ఝష సమాకీర్ణాం నానా పక్షి గణైర్వృతామ్ ।**
**వయం త్వాం తారయిష్యామః సుఖేనేతి వదంతి తే ॥27॥**

ఈ మహా వైతరణీ నదిని దాట గోరుతున్న నిన్ను శతయోజన విస్తీర్ణమై, పూయశోణిత సంకులమై, నానా జలచర సమాకీర్ణమై, అనేకవిధ పక్షిగణ సంయుక్తమైన ఈ నదిని మేము సుఖంగా దాటింపగలమని వారు వచిస్తారు.

**అంతరం దేహి భో పాన్థ బహులా చేద్రుచిస్తవ ।**
**తేన తత్ర ప్రదత్తా గౌ స్తయా నావా ప్రసర్పతి ।**
**మనుజానాం హితం దానమన్తే వైతరణీ స్మృతా ॥28॥**

ఓ పాంథా! నీకు ఆసక్తి ఎక్కువగా ఉంటే మాకు అవకాశం లేదా ఇమ్ము, గోవు దానం చేయబడి ఉంటే, దాని ద్వారా ఈ పడవతో వెళ్లవచ్చు, చివరి సమయంలో మనుష్యులకు వైతరణీదానం మేలు చేకూరుస్తుందని చెప్పబడింది.

**పరాపాపం దహేత్సర్వం విష్ణులోకం చ సా నయేత్ ।**
**న దత్తా చేత్ ఖగశ్రేష్ఠ తాం సమేత్య స మజ్జతి ॥29॥**

గొప్పదైన ఆ గోవు సర్వపాపాన్ని దహించివేస్తుంది, విష్ణులోకానికి తీసుకొనిపోతుంది. ఖగోత్తమా! గోదానం చేయకపోతే, వైతరణిని సమీపించిన అతడు మునిగి పోతాడు.

**స్వస్థావస్థే శరీరేఽత్ర వైతరణ్యా వ్రతం చరేత్ ।**
**దేయా చ విదుషే ధేనుస్తాం నదీం తర్తుమిచ్ఛతా ॥30॥**

శరీరం స్వస్థావస్థలో ఉండగానే ఈ లోకంలోనే వైతరణీ గోదాన వ్రతాన్ని ఆచరించాలి. ఆ నదిని దాట గోరేవాడు విద్వాంసునకు ధేనువును దానమీయాలి.

**అవదన్మజ్జమానస్తు నందత్యాత్మానమాత్మనా ।**
**పాథేయార్థం మయా కించిన్న ప్రదత్తం ద్విజాయ చ ॥31॥**

**న దత్తం న హుతం జప్తం న స్నాతం న కృతం స్తుతమ్ ।**
**యాదృశం కర్మ చరితం మూఢ భుంక్ష్వేతి తాదృశమ్ ॥32॥**

వైతరణిలో మునిగిపోతూ తనను తాను నిందించుకొంటూ ఇలా అంటూ ఉంటాడు. "పాథేయం (దారిబత్తెము)కోసమై ఏ ద్విజునకూ నేను ఏ కొంచెమూ కూడ ఈయలేదు. దానం చేయలేదు, హోమం ఆచరించలేదు, జపం గావించలేదు, తీర్థస్నానం చేయలేదు, దేవుని స్మరిస్తూ ఏ స్తోత్రం చేయలేదు. ఓరీ మూఢా! ఎటువంటి కర్మ ఆచరింపబడిందో, అటువంటి ఫలితాన్నే అనుభవించు."

**తదైవ హృది సంమూఢ స్తాడితో భాషతే భటైః ।**
**వైతరణ్యాః పరతటే భుంక్తే దత్తం ఘటాదికమ్ ॥33॥**

**ఊనషాణ్మాసికశ్రాద్ధం భుక్త్వా గచ్ఛతి చాగ్రతః ।**
**తార్క్ష్య తత్ర విశేషేణ భోజయీత ద్విజాఞ్ఛుభాన్ ॥34॥**

ఆ విధంగా మూఢుడై మనస్సులో గొణకుకొంటూ ఉండగా, యమభటులు బాదుతూ ఉంటారు. వైతరణీనది ఆవలి ఒడ్డున ఈయబడిన ఘటాదులలోని ఊనషాణ్మాసిక శ్రాద్ధ పిండాన్ని భుజించి ముందుకు వెడతాడు. గరుడా! అందువల్ల ఆరోజు విశేషంగా పవిత్రులైన బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

**చత్వారింశత్తథా సప్తయోజనాని శతద్వయమ్ ।**
**ప్రయాతి ప్రత్యహం తార్క్ష్య అహోరాత్రేణ కర్శితః ॥35॥**

తార్క్ష్యా! ఈ విధంగా ప్రతిదినం రాత్రి, పగలు అనక కృశిస్తూ, సుమారు రెండు వందల నలభై ఏడు యోజనాల దూరం పయనిస్తాడు.

**సప్తమే మాసి సంప్రాప్తే పురం బహ్వాపదం వ్రజేత్ ।**
**తత్ర భుక్త్వా ప్రదత్తం యచ్ఛ్రాద్ధం సప్తమ మాసికమ్ ॥36॥**

ఏడవ మాసం వస్తూఉండగా, బహ్వాపదం అనే పురం చేరుకొంటాడు, అక్కడ ఈయబడిన సప్తమ మాసిక పిండాన్ని భుజిస్తాడు,

**అష్టమే మాసి సంప్రాప్తే నానా క్రందపురం వ్రజేత్ ।**
**నానాక్రంద గణాన్ దృష్ట్వా క్రందమానాన్ సుదారుణమ్ ॥37॥**

**స్వయం చ శూన్యహృదయః సమాక్రందతి దుఃఖితః ।**
**తన్మాసికం చ యచ్ఛ్రాద్ధం భుక్త్వా తత్ర సుఖీ భవేత్ ॥38॥**

ఎనిమిదో మాసం సంప్రాప్తించగా నానాక్రందపురం చేరుకొంటాడు, నానాక్రందగణాలను భయంకరంగా రోదిస్తున్నవారిని చూచి శూన్య హృదయుడవుతాడు. స్వయంగా దుఃఖిస్తూ, తానూ ఏడుస్తాడు అక్కడ ఆ మాసిక శ్రాద్ధపిండాన్ని భుజించి ఒకింత సుఖం పొందుతాడు.

**విహాయ తత్పురం ప్రేతో యాతి తప్తపురం ప్రతి ।**
**సుతప్తనగరం ప్రాప్య నవమే మాసి సోఽశ్నుతే ।**
**ద్విజభోజ్యం పిండదానం కృతం శ్రాద్ధం సుతేన యత్ ॥39॥**

ప్రేత ఆ పురాన్ని విడిచి ఆ తరువాత తప్తపురానికి వెడతాడు. తొమ్మిదో మాసంలో సుతప్తనగరానికి చేరి కొడుకు ఇచ్చిన, ద్విజులు భుజించిన శ్రాద్ధపిండాన్ని స్వీకరించి భుజిస్తాడు.

**మాసి వై దశమే ప్రాప్తే రౌద్రం స్థానం స గచ్ఛతి ।**
**దశమే మాసి యద్దత్తం తద్భుక్త్వా చ ప్రయాతి సః ॥40॥**

పదో మాసం రాగానే అతడు రౌద్రస్థానం చేరుకొంటాడు. పదో మాసంలో ఈయబడిన శ్రాద్ధపిండాన్ని భుజించి ప్రేత తిరిగి ప్రయాణమవుతాడు.

**దశైకమాసికం భుక్త్వా పయోవర్షణ మృచ్ఛతి ।**
**మేఘాస్తత్ర ప్రవర్షంతి ప్రేతానాం దుఃఖదాయకాః ॥41॥**

అక్కడ పదకొండో మాసపిండాన్ని భుజించి పయోవర్షణం చేరుకొంటాడు. ప్రేతలకు దుఃఖాన్ని కలుగజేస్తూ మేఘాలు అక్కడ మితిమీరి వర్షిస్తాయి.

**(తతః ప్రచలితో ప్రేతో బహుఘర్మ తృషార్దితః)**
**ద్వాదశే మాసి యచ్ఛ్రాద్ధం తత్ర భుంక్తే సుదుఃఖితః ॥42॥**

అక్కడ నుండి ప్రేత మిక్కిలి వేడిచే దాహ పీడితుడవుతాడు! పంద్రెండో మాసంలో మిక్కిలి దుఃఖిస్తూ అక్కడ ఈయబడిన శ్రాద్ధపిండాన్ని భుజిస్తాడు.

**కించిన్న్యూనే తతో వర్షే సార్ధే చైకాదశేఽథవా ।**
**యాతి శీతపురం తత్ర శీతం యత్రాతిదుఃఖదమ్ ॥43॥**

సంవత్సరం పూర్తి అవుతూ ఉండగా, ఇంకా కొద్ది తక్కువ కాలం ఉండగా, లేదా పదకొండున్నర మాసాలు గడువగా, శీతపురానికి చేరుకొంటాడు. అక్కడ మిక్కిలి దుఃఖాన్నిచ్చే చలి అధికంగా ఉంటుంది.

**శీతార్తః క్షుధితః సోఽథ వీక్షతే హి దిశో దశ ।**
**తిష్ఠేత్తు బాంధవః కోఽపి యో మే దుఃఖం వ్యపోహతి ॥44॥**

అక్కడ చలితో వణకిపోతూ, ఆకలితో నకనకలాడుతూ పది దిక్కులూ చూస్తాడు. నా దుఃఖాన్ని తొలగించే ఏ బంధువయినా ఎదురు పడతాడేమోయని పరికిస్తాడు.

**కింకరాస్తం వదంత్యేవం క్వ తే పుణ్యం హి తాదృశమ్ ।**
**శ్రుత్వా తేషాం తు తద్వాక్యం హా దైవ ఇతి భాషతే ॥45॥**

అప్పుడు కింకరులు ప్రేతతో "అటువంటి పుణ్యం నీకు ఎక్కడ లభిస్తుంది?" అని గద్దిస్తారు. వారి ఆ మాటలను విని 'అయ్యో! దైవమా!' అని విలపిస్తాడు.

**దైవం హి పూర్వసుకృతం తన్మయా నైవ సంచితమ్ ।**
**ఏవం సంచింత్య బహుశో ధైర్యమాలంబతే పునః ॥46॥**

పూర్వంలో చేసిన పుణ్యమే కదా దైవం అంటే! అటువంటిది నేనేమీ మూట గట్టుకోలేదు కదా! అని పరి పరి విధాల చింతించి తిరిగి ధైర్యం వహిస్తాడు.

**చత్వారింశద్యోజనాని చతుర్యుక్తాని వై తతః ।**
**ధర్మరాజపురం రమ్యం గంధర్వాప్సర ఆకులమ్ ॥47॥**

**చతురశీతి లక్షైశ్చ మూర్తామూర్తైరధిష్ఠితమ్ ।**
**త్రయోదశ ప్రతీహారా ధర్మరాజపురే స్థితాః ॥48॥**

అక్కడ నుండి రమ్యమైన యమధర్మరాజపురం నలభై నాలుగు వేల యోజనాల దూరంలో ఉంటుంది. గంధర్వులతో, అప్సరసలతో నిండి ఉంటుంది. అందు ఎనభైనాలుగు లక్షల జీవరాశులు మూర్తం, అమూర్తం రూపాలతోఅధివసించి ఉంటాయి. ఆ ధర్మరాజపురంలో పదముగ్గురు ప్రతీహారులు కూడ ఉంటారు.

**శుభాశుభం తు యత్కర్మ తే విచార్య పునః పునః ।**
**శ్రవణా బ్రహ్మణః పుత్రా మనుష్యాణాం చ చేష్టితమ్ ॥**
**కథయంతి తదా లోకే పూజితాపూజితాః స్వయమ్ ॥49॥**

బ్రహ్మపుత్రులైన శ్రవణులనేవారు మనుష్యుల చర్యలను గ్రహించి, వారల శుభాశుభ కర్మలను పదే పదే విచారించి, వారు లోకంలో పూజింపదగినవారా? పూజింపదగనివారా? అనే విషయాన్ని స్వయంగా వారే యమాదులకు తెలియజేస్తారు.

**నరైస్తుష్టైశ్చ పుష్టైశ్చ యత్ప్రోక్తం చ కృతం చ యత్ ।**
**సర్వమావేదయన్తి స్మ చిత్రగుప్తే యమే చ తత్ ॥50॥**

వారే చిత్రగుప్తునికి, యమునికి, తుష్టి పుష్టిమంతులైన నరుల వచనాలను, వారి నానావిధ కర్మలను అన్నింటిని నివేదిస్తారు.

**దూరాచ్ఛ్రవణ విజ్ఞానా దూరాద్దర్శన గోచరాః ।**
**ఏవం చేష్టాస్తు తే హ్యష్టౌ స్వర్భూపాతాలచారిణః ॥51॥**

**తేషాంపత్న్యస్తథైవోగ్రా శ్రవణ్యః పృథగాహ్వయాః ।**
**ఏవం తేషాం శక్తి రస్తి మర్త్యే మర్త్యాధికారిణః ॥52॥**

వారు దూరశ్రవణ జ్ఞానం కల్గినవారు, దూరదర్శనదృష్టిశక్తి ఉన్నవారు. ఇట్టి శక్తి కలవారు ఎనమండుగురు స్వర్గలోకంతో పాటు భూలోకం, పాతాల లోకం సంచరించి పరులచర్యలను గ్రహించగలరు. మర్త్యలోక నివాసాధికారుల విషయాలను, మర్త్యలోకాన్ని అంతటినీ గ్రహించేశక్తి వారికిఉంది. వారి భార్యలుకూడ అలాగే ఉగ్రరూపం కలవారే శ్రవణులని వేరే పేరు కలవారు (శ్రవణుల భార్యలు)

**వ్రతైర్దానై స్తవైర్యశ్చ పూజయేదిహ మానవః ।**
**జాయంతే తస్య తే సౌమ్యాః సుఖమృత్యు ప్రదాయినః ॥53॥**

వ్రతాలతోను, దానాలతోను, స్తవాలతోను ఇక్కడ మానవుడు భగవంతుని పూజిస్తే, వానివిషయంలో వారు సౌమ్యులై, సుఖప్రదమైన మృత్యువును ఇస్తారు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ప్రేతయాత్రాది నిరూపణ నామ షోడశోఽధ్యాయః ॥16॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రేత యమలోకానికి చేరే తీరు అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

## సప్తదశోఽధ్యాయః – పదిహేడవ అధ్యాయం

## శ్రవణమాహాత్మ్యనిరూపణమ్ – శ్రవణుల గొప్పదనాన్ని నిరూపించుట

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**ఏకో మే సంశయో దేవ హృదయే సంప్రబాధతే ।**
**శ్రవణాః కస్య పుత్రాశ్చ కథం యమపురే స్థితాః ॥1॥**

**మానుషైశ్చ కృతం కర్మ కస్మాజ్జానంతి తే ప్రభో ।**
**కథం శృణ్వన్తి తే సర్వే కస్మాజ్జ్ఞానం సమాగతమ్ ॥2॥**

దేవా! నా హృదయంలో ఒక సంశయం మిక్కిలిగా బాధిస్తోంది. శ్రమణులు ఎవని కుమారులు? వారెందుకు యమపురిలో ఉన్నారు? ప్రభూ! మనుష్యులు చేసే కర్మలను వారు ఎలా తెలుసుకొంటారు? వారందరూ ఎలా వింటారు? వారికి ఆ జ్ఞానం ఎలా వచ్చింది?

**కుత్ర భుంజంతి దేవేశ కథయస్వ ప్రసాదతః ।**
**పక్షిరాజవచః శ్రుత్వా భగవాన్ వాక్యమబ్రవీత్ ॥3॥**

దేవేశా! వారెక్కడ భుజిస్తారు? నాయందు అనుగ్రహం చూపించి చెప్పు. అని పల్కిన పక్షిరాజు వచనాలను విని భగవంతుడు ఇలా పలికాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు పలికాడు.

**శృణుష్వ వచనం సత్యం సర్వేషాం సౌఖ్యదాయకమ్ ।**
**తదహం కథయిష్యామి శ్రవణానాం విచేష్టితమ్ ॥4॥**

అందరికి సుఖాన్ని కలగజేసే నిత్య సత్య వచనాన్ని విను. శ్రవణులయొక్క ఆ విశిష్టచర్యలను నేను చెబుతున్నాను.

**ఏకీభూతం యదా సర్వం జగత్‌స్థావరజంగమమ్ ।**
**క్షీరోదసాగరే పూర్వం మయి సుప్తే జగత్పతౌ ॥5॥**

**నాభిస్థోఽజస్తపస్తేపే వర్షాణి సుబహూన్యపి ।**
**ఏకీభూతం జగత్ సృష్టం భూతగ్రామచతుర్విధమ్ ॥6॥**

స్థావర జంగమాత్మకమైన జగత్తు అంతా ఏకీభూతమై ఉన్న సమయంలో, పూర్వం జగత్పతినైన నేను క్షీరసాగరంలో శయనించి ఉండగా, నా నాభియందున్న బ్రహ్మ పెక్కు సంవత్సరాలు తపస్సు గావించాడు. ఏకీభూతమైన జగత్తు నాలుగు విధాలైన భూత సమూహాలుగా అప్పుడు సృష్టించబడింది.

**బ్రహ్మణా నిర్మితం పూర్వం విష్ణునా పాలితం తదా ।**
**రుద్రః సంహారమూర్తిశ్చ నిర్మితో బ్రహ్మణా తతః ॥7॥**

**వాయుః సర్వగతః సృష్టః సూర్యస్తేజోభివృద్ధిమాన్ ।**
**ధర్మరాజ స్తతః సృష్టశ్చిత్రగుప్తేన సంయుతః ॥8॥**

మొదట బ్రహ్మచే సృష్టి చేయబడింది. విష్ణువుచే తరువాత రక్షించబడింది. రుద్రుడు సంహారమూర్తి అయ్యాడు. అంత బ్రహ్మచే అంతటా వెళ్లగలిగే (వ్యాపించే) వాయువు సృజింపబడ్డాడు. అలాగే కాంతివృద్ధి కలిగియున్న సూర్యుడు సృష్టించబడ్డాడు. అప్పుడు చిత్రగుప్తునితో కూడుకొన్న ధర్మరాజుకూడ సృష్టింపబడ్డాడు.

**సృష్ట్వైతదాదికం సర్వం తపస్తేపే తు పద్మజః ।**
**గతాని బహువర్షాణి బ్రహ్మణో నాభిపంకజే ॥9॥**

ఇటువంటివన్నీ (మున్నగు వారినందరిని) సృష్టించి, పద్మజుడు తపస్సు చేశాడు. నాభికమలంలోనున్న బ్రహ్మకు అలా చాలా ఏండ్లు గతించాయి.

**యో యో హి నిర్మితః పూర్వం తత్తత్కర్మ సమాచరేత్ ।**
**కస్మింశ్చిత్సమయే తత్ర బ్రహ్మా లోకసమన్వితః ॥10॥**

**రుద్రో విష్ణు స్తథా ధర్మః శాసయన్తి వసుంధరామ్ ।**
**న జానీమో వయం కించిల్లోకకృత్య మిహోచ్యతామ్ ॥11॥**

పూర్వం ఎవడెవడు ఈ విధంగా నిర్మింపబడినాడో, వాడు వాడు ఆ విధంగా కర్మను ఆచరించాడు. ఒకానొక సమయంలో పదునాల్గు లోకాల సృష్టికర్త అయిన బ్రహ్మయు (సర్వజనులతో కూడిన బ్రహ్మయు). రుద్రుడు, విష్ణువు, ధర్ముడు వసుంధరను పాలిస్తూ ఉండేవారం. అయితే ఇప్పుడు చెప్పబడిన జనుల కర్మ విధులను మేము ఏ కొద్దిగానైనను గ్రహించలేకుండా ఉండేవారం.

**ఇతి చింతాపరాః సర్వే దేవా విమమృశుస్తదా ।**
**సంచింత్య బ్రహ్మణో మంత్రం విబుధైః ప్రేరితస్తదా ॥12॥**

**గృహీత్వా పుష్పపత్రాణి సోఽసృజద్ద్వాదశాత్మజాన్ ।**
**తేజోరాశీన్ విశాలాక్షాన్ బ్రహ్మణో వచనాత్తు తే ॥13॥**

**యోఽయం వదంతి లోకేఽస్మిఞ్ఛుభం వా యదివాఽశుభమ్ ।**
**ప్రాపయంతి తతః శీఘ్రం బ్రహ్మణః కర్ణగోచరమ్ ॥14॥**

అని సర్వదేవతలు చింతాపరులై పరస్పరాలోచన చేశారు. అప్పుడు దేవతలచే ప్రేరేపింపబడిన బ్రహ్మకు ఒక ఆలోచన స్ఫురించగా, అతడు పూరేకులను చేతదాల్చి, తేజస్వంతులై, విశాలనేత్రులగు పండ్రెండుగురు కుమారులను సృష్టించాడు. వారు బ్రహ్మ శాసనంతో, ఈ లోకంలో ఎవడు ఏది మాట్లాడినా, అది శుభమయినా, అశుభమయినా, వెంటనే బ్రహ్మచెవిని వేసేవారు.

**దూరాచ్ఛ్రవణ విజ్ఞానం దూరాద్దర్శనగోచరమ్ ।**
**సర్వే శృణ్వన్తి యత్పక్షింస్తే నైవ శ్రవణా మతాః ॥15॥**

వారికి దూరంలో మాట్లాడినా వినగలిగే జ్ఞానశక్తి ఉంటుంది. ఎంతదూరం నుండి అయినా చూడగలిగే సామర్థ్యం ఉంటుంది. పక్షీ! అందరూ ఆ విధంగా వినగలరు గనుక శ్రవణులు అని పేర్కొనబడినారు.

**స్థిత్వా చైవ తథాకాశే జంతూనాం చేష్టితం చ యత్ ।**
**త జ్ఞాత్వా ధర్మరాజాగ్రే మృత్యుకాలే వదన్తి చ ॥16॥**

వారు ఆకాశంలో ఉండి ప్రాణులచర్యల నన్నింటిని గ్రహించి, మృత్యుసమయంలో ధర్మరాజు ఎదుట వాటిని చెబుతారు.

**ధర్మం చార్థం చ కామం చ మోక్షం చ కథయంతి తే ।**
**ఏకో హి ధర్మమార్గశ్చ ద్వితీయశ్చార్థమార్గకః ॥17॥**

**అపరః కర్మమార్గశ్చ మోక్షమార్గశ్చతుర్థకః ।**
**ఉత్తమాధమమార్గేణ వైనతేయ ప్రయాంతి హి ॥18॥**

వారు ప్రాణుల ధర్మార్థ కామమోక్షాలను వివరించి చెబుతారు. అందు ఒకటి ధర్మమార్గం, రెండోది అర్థమార్గం, మూడోది కర్మమార్గం. మోక్షమార్గం నాల్గవది. వైనతేయా! ప్రాణులు ఉత్తమాధమ మార్గాలలో పయనిస్తారు. (ఉత్తముడు ధర్మమార్గంలో వెడతాడు)

**అర్థదాతా విమానైస్తు అశ్వైః కామప్రదాయకః ।**
**హంసయుక్త విమానైశ్చ మోక్షకాంక్షీ విసర్పతి ॥19॥**

అర్థాన్ని దానం చేసేవాడు విమానాలపైన, ఎదుటివారి కోరికలు తీర్చేవాడు అశ్వాలపైన, మోక్ష కాంక్షి అయినవాడు హంసలను బూన్చిన విమానాలపైన అధిరోహించి వెడతారు.

**ఇతరః పాదచారేణ త్వసిపత్రవనాని చ ।**
**పాషాణైః కంటకైః క్లిష్టః పాశబద్ధోఽథ యాతి వై ॥20॥**

అధమ మార్గంలో వెళ్లేవాడు పాదచారియై, అసిపత్రకాననాలను, పాషాణాలతో, కంటకాలతో కృశిస్తూ, యమపాశబద్ధుడై ఈడ్చుకొని పోబడతాడు.

**యః కశ్చిన్మానుషే లోకే శ్రవణాన్ పూజయేదిహ ।**
**వర్ధన్యా జలపాత్రేణ పక్వాన్న పరిపూర్ణయా ॥21॥**

**శ్రవణాన్ పూజయేత్తత్ర మయా సహ ఖగేశ్వర ।**
**తస్యాహం తత్ప్రదాస్యామి యత్సురైరపి దుర్లభమ్ ॥22॥**

ఏ మానవుడయినా సరే ఈ లోకంలో శ్రవణులను తప్పనిసరిగా పూజించాలి. వర్ధని(వృద్ధిపాత్ర) చేత, జలపాత్రచేత, పక్వాన్న పరిపూర్ణపాత్రచేత (వర్ధని) శ్రవణులను పూజించాలి. ఖగరాజా! నేను కూడ పూజిస్తాను. ఇలా పూజించే, వానికి నేను దేవతలకు కూడ దుర్లభమైన దానిని ప్రసాదిస్తాను.

**సంభోజ్య బ్రాహ్మణాన్ భక్త్యా త్వేకాదశ శుభాఞ్ఛుచీన్ ।**
**ద్వాదశం సకలత్రం చ మమ ప్రీత్యై ప్రపూజయేత్ ॥23॥**

పవిత్రులైన సదాచారులగు పదకొండుగురు బ్రాహ్మణులకు (సకలత్రంగా) భక్తితో భోజనంపెట్టి, పండ్రెండో వానిని సకలత్రంగా నాప్రీతికొరకై శ్రద్ధగా పూజించాలి.

**దేవైః సర్వైశ్చ సంపూజ్య స్వర్గం యాంతి సుఖేప్సయా ।**
**తైః పూజితైరహం తుష్టశ్చిత్రగుప్తేన ధర్మరాట్ ॥24॥**

**తైస్తుష్టైర్మత్పురం యాంతి లోకా ధర్మపరాయణాః ।**

అటువంటి వారు సర్వదేవతలచే పూజించబడి, సుఖానుభవం కోసమై స్వర్గం చేరుకొంటారు. వారిచే పూజించబడి నేనుకూడ సంతుష్టుడ నవుతాను. చిత్రగుప్తునితో సహా యమధర్మరాజుకూడ సంతుష్టుడవుతాడు వారిచే సంప్రీతులై, ధర్మపరాయణులైన జనులు నాలోకం చేరుకొంటారు.

**శ్రవణానాం చ మాహాత్మ్య ముత్పత్తిం చేష్టితం శుభమ్ ॥25॥**

**శృణోతి పక్షిశార్దూల స చ పాపైర్న లిప్యతే ।**
**ఇహలోకే సుఖం భుక్త్వా స్వర్గలోకే మహీయతే ॥26॥**

పక్షిశార్దూలా! శ్రవణుల ఉత్పత్తిని, వారి మాహాత్మ్యాన్ని, వారి శుభచర్యలను వానిని పాపాలు అంటవు అతడు ఇహలోక సుఖం అనుభవించి, స్వర్గలోకంలో ఆనందం పొందుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే శ్రవణ మాహాత్మ్య నిరూపణం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో శ్రవణుల గొప్పదనాన్ని నిరూపించుట అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

## వృశోత్సర్గదానఫలాదికమ్ - వృషోత్సర్గదానాదుల ఫల నిరూపణం

**శ్రీకృష్ణఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**శ్రవణానాం వచః శ్రుత్వా క్షణం ధ్యాత్వా పునస్తతః ।**
**యత్కృతం తు మనుష్యైశ్చ పుణ్యం పాపమహర్నిశమ్ ॥1॥**

**తత్సర్వం చ పరిజ్ఞాయ చిత్రగుప్తో నివేదయేత్ ।**
**చిత్రగుప్త స్తతః సర్వం కర్మ తస్మై వదత్యథ ॥2॥**

శ్రవణుల వాక్యాలను విని, అటుపిమ్మట ఒక క్షణకాలం ధ్యానించి, మనుష్యులు రాత్రి, పగలు చేసిన పుణ్యాపాపాల నన్నింటిని చిత్రగుప్తుడు మళ్లీ పూర్తిగా తెలుసుకొంటాడు. అంత ఆ ప్రాణి చేసిన కర్మనంతను యమధర్మరాజుకు చిత్రగుప్తుడు తెలియజేస్తాడు.

**వాచైవ యత్కృతం కర్మ కృతం చైవ తు కాయికమ్ ।**
**మానసం చ తథా కర్మ కృతం భుంక్తే శుభాశుభమ్ ॥3॥**

**ఏవం తే కథిత స్తార్క్ష్య ప్రేతమార్గస్య నిర్ణయః ।**
**విశ్రాంతిదాని సర్వాణి స్థానాని కథితాని తే ॥4॥**

వాక్కుచేత శరీరంచేత మనస్సుచేత ఏ కర్మ చేస్తాడో, ఆ శుభాశుభ కర్మఫలితాన్ని ప్రాణి అనుభవిస్తాడు. గరుడా! ఈ విధంగా నీకు ప్రేతయొక్క యమమార్గ నిర్ణయాన్ని తెలియజేయడం జరిగింది. అలాగే విశ్రాంతినిచ్చే సమస్త స్థానాలను నీకు వివరించాను.

**తముద్దిశ్య దదాత్యన్నం సుఖం యాతి మహాధ్వని ।**
**దివారాత్రౌ తముద్దిశ్య స్థానే దీపప్రదో భవేత్ ॥5॥**

ప్రేతను ఉద్దేశించి ఈయబడిన అన్నం, యమమార్గంలో సుఖాన్ని ఇస్తుంది. పగలు, రాత్రి కూడ ప్రేతనుద్దేశించి మృతిస్థానంలో దీపం పెట్టిఉంచాలి.

**అంధకారే మహాఘోరే శ్వపూర్ణే లక్ష్యవర్జితే ।**
**దీపేఽధ్వని చ తే యాంతి దీపో దత్తశ్చ యైర్నరైః ॥6॥**

**కార్తికే చ చతుర్దశ్యాం దీపదానం సుఖాయ వై ।**
**అథ వక్ష్యామి సంక్షేపాద్యమమార్గస్య నిష్కృతిమ్ ॥7॥**

లక్ష్యశూన్యమై (అగమ్యగోచరమై), కుక్కలతో నిండి, మహాఘోరమైన గాఢాంధకారంలో, దీపం పెట్టిన నరులు ఆ దీపకాంతిలో యమమార్గంలో పయనిస్తారు. కార్తికమాసంలో చతుర్దశినాడు ఇచ్చే దీపదానం సుఖాన్ని

ప్రసాదిస్తుంది. ఇక మరోసారి సంక్షిప్తంగా యమమార్గ నిష్కృతి గురించి(తప్పించుకొనే విధానంగురించి) తెలియజేస్తాను.

**వృషోత్సర్గస్య పుణ్యేన పితృలోకం స గచ్ఛతి ।**
**ఏకాదశాహ పిండేన శుద్ధదేహో భవేత్తతః ॥8॥**

**ఉదకుంభప్రదానేన కింకరా స్తృప్తి మాప్నుయుః ॥9॥**

వృషోత్సర్గపుణ్యంచే ప్రేతత్వం వదలి అతడు పితృలోకం వెడతాడు. పదకొండోరోజు ఇచ్చే పిండంచే ప్రేత పరిశుద్ధమైన దేహం కలవాడవుతాడు. ఉదకకుంభప్రదానంచే కింకరులు సంతృప్తి పొందుతారు.

**శయ్యాదానాద్విమానస్థో యాతి స్వర్గేషు మానవః ।**
**తదహ్ని దీయతే సర్వం ద్వాదశాహే విశేషతః ॥10॥**

శయ్యాదానంవల్ల మానవుడు విమానాన్ని అధిరోహించి స్వర్గాది లోకాలకు వెడతాడు. దానినంతా పగటివేళ చేయాలి. పండ్రెండో రోజున విశేషించి అన్నిదానాలు చేయాలి.

**పదాని సర్వవస్తూని వరిష్ఠాని త్రయోదశే ।**
**యో దదాతి మృతస్యేహ జీవన్నప్యాత్మహేతవే ॥11॥**

పదమూడో రోజున పదదానాలను, మిక్కిలి విలువైన సర్వవస్తువులను దానం చేయాలి. మృతునినుద్దేశించి వాటిని ఈయాలి. ప్రాణి తాను బ్రతికిఉండగానే ఆత్మాభ్యుదయం కోసమైనా చేసుకోవచ్చు.

**తదాశ్రితో మహామార్గే వైనతేయ స గచ్ఛతి ।**
**ఏక ఏవాస్తి సర్వత్ర వ్యవహారః ఖగాధిప ॥12॥**

వైనతేయా! ఆ ఫలితాన్ని ఆశ్రయించి, అతడు మహామార్గంలో పయనిస్తాడు. ఖగరాజా! అంతటా ఒకే కర్మ వ్యవహారవిధానం ఉంటుంది.

**ఉత్తమాధమమధ్యానాం తత్తదావర్జనం భవేత్ ।**
**యావద్భాగ్యం భవేద్యస్య తావన్మార్గేఽతిరిచ్యతే ॥13॥**

**స్వయం స్వస్థేన యద్దత్తం తత్తత్రాధికరోతి తమ్ ।**
**మృతే యద్బాంధవై ర్దత్తం తదాశ్రిత్య సుఖీ భవేత్ ॥14॥**

ఉత్తమ, మధ్యమ, అధముల ఆధారంగా అది అప్పుడు విడివడిపోతుంది. వారివారిభాగ్యాన్ని బట్టి, అది ప్రవర్తించేది అవుతుంది. తాను స్వస్థుడుగా ఉండగానే చేసుకొన్నది అతనిని అధికరించి (అనుసరించి) ఉంటుంది. మృతుడైన పిమ్మట బాంధవులచే ఈయబడిన దానిని ఆశ్రయించి సుఖం పొందుతాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**కస్మాత్పదాని దేయాని కిం విధాని త్రయోదశ ।**
**దీయతే కస్య దేవేశ తద్వదస్వ యథాతథమ్ ॥15॥**

ఎందువల్ల పదదానాలు చేయాలి? పదమూడు పదదానాలు అంటే ఏమిటి? దేవేశా! ఎవనికి చేయాలి? యథాతథంగా ఆ విషయాన్ని వివరించు.

**శ్రీ భగవానువాచ** – శ్రీ భగవంతుడు వచించాడు.

**ఛత్రోపానహవస్త్రాణి ముద్రికా చ కమండలుః ।**
**ఆసనం భాజనం చైవ పదం సప్తవిధం స్మృతమ్ ॥16॥**

ఛత్రం, పాదుక, వస్త్రం, ముద్రిక, కమండలువు, ఆసనం, భాజనం (భోజనపాత్ర) అని పదం ఏడు విధాలుగా చెప్పబడింది. (మరో ఆసనం, జలపాత్ర, అన్నం, భోజనసామగ్రి, నెయ్యి, యజ్ఞోపవీతం ఈ ఆరింటితో కలిపితే పదమూడు విధాలు)

**ఆతపస్తత్ర యో రౌద్రో దహ్యతే యేన మానవః ।**
**ఛత్రదానేన సుచ్ఛాయా జాయతే ప్రేతతుష్టిదా ॥17॥**

రౌద్రమైన ఎండ ఉన్నచోట మానవుడు భగ భగమండుతూ గగ్గోలుపెడతాడు. అప్పుడు ఛత్రదానఫలితంవల్ల ప్రేతకు చల్లని నీడ లభించి, తుష్టిని పొందడం జరుగుతుంది.

**అసిపత్రవనం ఘోరం సోఽతిక్రామతి వై ధ్రువమ్ ।**
**అశ్వారూఢాశ్చ గచ్ఛంతి దదతే య ఉపానహౌ ॥18॥**

భయంకరమైన అసిపత్రవనాన్ని అతడు నిశ్చయముగా దాటవలసి వస్తుంది. చెప్పులు దానంచేసినవారు, అక్కడ అశ్వారూఢులై వెడతారు.

**ఆసనే స్వాగతే(భోజనే)చైవ దత్తం తస్మై ద్విజాయ తే ।**
**సుఖేన భుంక్తే సప్రేతః పథి గచ్ఛఞ్ఛనైః శనైః ॥19॥**

వచ్చిన ఆ బ్రాహ్మణునకు స్వాగతాసనం, భోజనాసనం ఇచ్చినట్లయితే, ఆ ప్రేత దారిలో మెల్ల మెల్లగా నడుస్తూ సుఖిస్తాడు (బ్రాహ్మణునకు స్వాగతం పలికి ఆసనం ఇచ్చినట్లయితే)

**బహుఘర్మ సమాకీర్ణే నిర్వాతే తోయవర్జితే ।**
**కమండలు ప్రదానేన సుఖీభవతి నిశ్చితమ్ ॥20॥**

గాలి, నీరు లేక, మిక్కిలిగా వడదెబ్బ తగిలే దారిలో పయనిస్తున్నప్పుడు, కమండలు దానంవల్ల నిశ్చయంగా ప్రేత సుఖం పొందుతాడు.

**మృతోద్దేశేన యో దద్యాదుదపాత్రం తు తామ్రజమ్ ।**
**ప్రపాదానసహస్రస్య తత్ఫలం సోఽశ్నుతే ధ్రువమ్ ॥21॥**

మృతుని ఉద్దేశించి రాగితో చేసి ఉదకపాత్రను దానంచేస్తే, అతడు వేయి చలిపందిరులు నిర్మించిన ఫలాన్ని నిశ్చయంగా పొందుతాడు.

**యమదూతా మహారౌద్రాః కరాలాః కృష్ణపింగలాః।**
**న పీడయంతి దాక్షిణ్యాద్వస్త్రాభరణదానతః ॥22॥**

యమదూతలు మహారౌద్రులు, భయంకరులు, కృష్ణపింగలులు. వస్త్రాలు, ఆభరణాలు దానంచేస్తే, దానివల్ల వారు దయాస్వభావంతో పీడించకుండా ఉంటారు.

**సాయుధా ధావమానాశ్చ నమార్గే దృష్టి గోచరాః ।**
**ప్రయాంతి యమ దూతాస్తే ముద్రికాయాః ప్రదానతః ॥23॥**

యమమార్గంలో కంటికి కనబడకుండా ఆయుధాలు ధరించిన యమదూతలు ప్రేతలను పరుగులు పెట్టిస్తారు. ముద్రికాదానంవల్ల వారు ప్రసన్నులవుతారు.

**భాజనాసనదానేన ఆమాన్నభోజనేన చ ।**
**ఆజ్య యజ్ఞోపవీతాభ్యాం పదం సంపూర్ణతాం వ్రజేత్ ॥24॥**

భాజనం, ఆసనం దానమీయడంవల్ల, ఆమాన్న భోజనం పెట్టడంవల్ల, ఆజ్యదాన, యజ్ఞోపవీత దానాలవల్ల పదదానం సంపూర్ణత్వాన్ని పొందుతుంది.

**ఏవం మార్గే గచ్ఛమాన స్తృషార్తః శ్రమపీడితః ।**
**మహిషీరథ(దుగ్ధ)దానాచ్చ సుఖీ భవతి నిశ్చితమ్ ॥25॥**

ఇలా యమమార్గంలో వెడుతూ దప్పికతో అంగలార్చేవాడు, శ్రమతో పీడింపబడేవాడు మహిషీరథదానాలవల్ల నిశ్చయంగా సుఖం పొందుతాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**మృతోద్దేశేన యత్కించిద్దీయతే స్వగృహే విభో ।**
**స గచ్ఛతి మహామార్గే తద్దత్తం కేన గృహ్యతే ॥26॥**

ప్రభూ! మృతుని ఉద్దేశించి అతని యింటిలో ఏదో ఒకటి ఈయబడుతుంది కదా! అతడా మహామార్గంలో ప్రేతయై వెడతాడుకదా! ఇక్కడ ఈయబడిన దానిని అక్కడ అతడు ఎలా స్వీకరిస్తాడు? ఇంతకూ అది ఎవనిచే గ్రహింపబడుతుంది.?

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు పలికాడు.

**గృహ్ణాతి వరుణో దానం మమ హస్తే ప్రయచ్ఛతి ।**
**అహం చ భాస్కరే దేవే భాస్కరాత్సోఽశ్నుతే సుఖమ్ ॥27॥**

(నీటితో దానం ఇస్తారు కాబట్టి) వరుణుడు దానాన్ని స్వీకరించి, నా చేతిలో ఉంచుతాడు, నేను దానిని భాస్కరదేవునికి అందిస్తాను. భాస్కరునివద్ద నుండి మృతుడు స్వీకరించి సుఖాన్ని పొందుతాడు.

**వికర్మణః ప్రభావేన వంశచ్ఛేదే క్షితావిహ ।**
**సర్వే తే నరకం యాంతి యావత్పాపస్య సంక్షయః ॥28॥**

శ్రాద్ధకర్మను ఆచరింపకపోతే, దాని ప్రభావంవల్ల ఇక్కడ భూమిపై అతని వంశం క్షయమైపోతుంది. పాపమంతా నాశనం అయ్యేవరకు వారంతా నరకలోకానికి వెడతారు.

**కస్మింశ్చిత్ సమయే పూర్ణే మహిషాసన సంస్థితః ।**
**నరకాన్ వీక్ష్య ధర్మాత్మా నానాక్రంద సమాకులాన్ ॥29॥**

**చతురశీతి లక్షానాం నరకాణాం స ఈశ్వరః ।**
**తేషాం మధ్యే శ్రేష్ఠతమా ఘోరా యా ఏకవింశతిః ॥30॥**

ఒకానొక సమయంలో పాపం పూర్తి అవుతూ ఉండగా, మహిషాసనాన్ని అధిరోహించి ఆ ధర్మరాజు నానావిధ యాతనలు అనుభవిస్తూ, ఏడుస్తూఉండే వారితో నిండిన నరకాలను వీక్షిస్తాడు. ఎనభై నాలుగు లక్షల నరకాలకు అతడు ప్రభువు. వాటిమధ్యలో మిక్కిలి ఘోరాతి ఘోరమైనవి ఇరవై ఒకటి,

**తామిస్రం లోహశంకుశ్చ మహారౌరవ శాల్మలీ ।**
**రౌరవం కుడ్మలం కాలసూత్రకం పూతిమృత్తికా ॥31॥**

**సంఘాతం లోహతోదం చ సవిషం సంప్రతాపనమ్ ।**
**మహానరక కాలోలః సజీవన మహాపథః ॥32॥**

**అవీచిరంధతామిస్రః కుంభీపాకస్తథైవ చ ।**
**అసిపత్రవనం చైవ పతనశ్చైకవింశతిః ॥33॥**

తామిస్రం, లోహశంకువు, మహారౌరవం, శాల్మలి, రౌరవం, కుడ్మలం, కాలసూత్రం, పూతిమృత్తిక, సంఘాతం, లోహతోదం, సవిషం, సంప్రతాపనం, మహానరకం, కాలోలం, సజీవనం, మహాపథం, అవీచి, అంధతామిస్రం, కుంభీపాకం, అసిపత్రవనం, పతనం అనేవి ఇరవై ఒక్క నరకాలు.

**యేషాం తు నరకే ఘోరే బహ్వబ్దాని గతాని వై ।**
**సంతతి ర్నైవ విద్యేత దూతత్వం తే తు (ప్రేత్య) యాన్తి హి ॥34॥**

ఘోర నరకవాసంలో చాలాఏండ్లు గడిపినవారు, సంతతిలేక మరణించినవారు దూతత్వాన్ని పొందుతారు.

**యమేన ప్రేషితాస్తే వై మానుషస్య మృతస్య తు ।**
**దినే దినే ప్రగృహ్ణంతి దత్తమన్నాద్య పానకమ్ (అన్న ఘటాదికమ్) ॥35॥**

వారు యమునిచే పంపబడి చనిపోయిన మానవునికి ఈయబడిన అన్నాది ఘటాదికాలను ప్రతిదినం గ్రహిస్తారు.

**ప్రేతస్యైవ విలుంఠంతి మధ్యే మార్గే బుభుక్షితాః ।**
**మాసాంతే భోజనం పిండమేకే యచ్ఛన్తి తత్ర వై ॥36॥**

**తృప్తిం ప్రయాంతి తే సర్వే ప్రత్యహం చైవ వత్సరమ్ ।**
**ఏవమాది కృతైః పుణ్యైః క్రమాత్సౌరిపురం వ్రజేత్ ॥37॥**

ప్రేత రూపంలోనే ఉండి మార్గ మధ్యభాగంలో ఆకలితో అలమటిస్తూ పొర్లాడుతారు. ఎవరో కొందరు మాసాంతంలో భోజనం, పిండంవేస్తే వాటిని స్వీకరించి, ప్రతిదినం సంవత్సరంపాటు అనుభవించి, అటువంటివారందరూ తృప్తిని పొందుతారు. ఇటువంటి కర్మలచే కొంత పుణ్యం పొంది, క్రమంగా సౌరిపురం చేరుకొంటాడు.

**తతః సంవత్సరస్యాంతే ప్రత్యాసన్నే యమాలయే ।**
**బహుభీతికరే ప్రేతో హస్తమాత్రం సముత్సృజేత్ ॥38॥**

అటుపిమ్మట సంవత్సరం చివరకు యమాలయం చేరుకొని, మిక్కిలి భయాన్ని కలిగించే ఆ పురంలో ప్రేత హస్తమాత్రదేహాన్ని విడిచిపెడతాడు. (బహుభీతికరమనే పురంలో) (చిటికెన వ్రేలంత అవుతాడు)

**దివసైర్దశభిర్జాతం తం దేహం దశపిండజమ్ ।**
**జామదగ్న్యస్యేవ రామం దృష్ట్వా తేజః ప్రసర్పతి ॥39॥**

**కర్మజం దేహమాశ్రిత్య పూర్వదేహం సముత్సృజేత్ ।**

పది రోజులలో పది పిండాలవల్ల ఏర్పడిన ఆ పిండజ శరీరాన్ని, శ్రీరాముని చూచిన వెంటనే పరశు రాముని తేజస్సు ఆయనలో కలిసిపోయినట్లుగా, కర్మజన్యశరీరాన్ని ఆశ్రయించి పూర్వశరీరాన్ని విడిచివేస్తాడు.

**అంగుష్ఠమాత్రో వాయుశ్చ శమీపత్రం సమారుహేత్ ॥40॥**

**వ్రజంస్తిష్ఠన్ పదైకేన యథైవైకేన గచ్ఛతి ।**
**యథా తృణజలౌకేవ దేహీ కర్మానుగోఽవశః ॥41॥**

అంత అంగుష్ఠమాత్రుడై వాయురూపంతో శమీపత్రాన్ని అధిరోహిస్తాడు. ఒకేపాదంతో నడుస్తూ, నిలబడుతూ, ఇంకొక పాదంతో యథేష్టంగా వెడుతూ ఉంటాడు. తృణజలౌక (గడ్డిపురుగు) లాగా జీవుడు కర్మానుసారంగా అవశుడై ఉంటాడు.

**వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥42॥**

చినిగిపోయిన బట్టలను విడిచిపెట్టి, నరుడు నూతనవస్త్రాలు స్వీకరించి ధరిస్తున్నట్లే, శైథిల్యం చెందిన శరీరాలను వదలి ఆత్మ వేరే క్రొత్త దేహాలను ధరిస్తుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే వృశోత్సర్గనానాదాన ఫల యమలోక గమన కర్మజ దేహప్రాప్తి నిరూపణం నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో వృషోత్సర్గ దానాదుల ఫల నిరూపణం అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోऽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

## యమమందిరప్రవేశః - యమమందిరప్రవేశం విశేషాలు

**శ్రీభగవానువాచ** – శ్రీభగవానుడు వచించాడు.

**వాయుభూతః క్షుధావిష్టః కర్మజం దేహమాశ్రితః ।**
**తద్దేహం స సమాసాద్య యమేన సహ గచ్ఛతి ॥1॥**

అతడు అప్పుడు గాలిలోనే కదలుతూ, ఆకలితో పీడింపబడుతూ, కర్మజదేహాన్ని ఆశ్రయిస్తాడు. జీవి అప్పుడు ఆ దేహాన్ని పొంది యమునితో కలసి వెడతాడు.

**చిత్రగుప్తపురం తత్ర యోజనానాం తు వింశతిః ।**
**కాయస్థాస్తత్ర పశ్యంతి పాపపుణ్యాని సర్వశః ॥2॥**

అక్కడ నుండి ఇరవై యోజనాల దూరంలో చిత్రగుప్తపురం ఉంది. అక్కడనున్న కాయస్థులనేవారు ఆ జీవి పాప పుణ్యాలను అన్నింటిని వీక్షించగలరు.

**మహాదానేషు దత్తేషు గతస్తత్ర సుఖీ భవేత్ ।**
**యోజనానాం చతుర్వింశత్పురం వైవస్వతం శుభమ్ ॥3॥**

మహాదానాలు ఇచ్చినవాడు అక్కడకు వెళ్లి సుఖాన్ని పొందుతాడు. అక్కడ నుండి ఇరవై నాలుగు యోజనాల దూరంలో శుభమైన వైవస్వతపురం ఉంటుంది.

**లోహం లవణ కార్పాసం తిలపాత్రం చ యైర్నరైః ।**
**దత్తం తేనైవ తృప్యంతి యమస్య పురచారిణః ॥4॥**

ఇనుము, ఉప్పు, ప్రత్తి, తిలపాత్ర దానం చేసిన నరులు, దానిచేతనే యముని పురంలో సంచరిస్తూ సంతృప్తులవుతారు.

**గత్వా చ తత్ర తే సర్వే ప్రతీహారం వదంతి హి ।**
**ధర్మధ్వజ ప్రతీహార స్తత్ర తిష్ఠతి సర్వదా ॥5॥**

ధర్మధ్వజుడనే ప్రతీహారుడు ఎల్లప్పుడూ అక్కడ ఉంటాడు. వారు అందరు అక్కడకు వెళ్లి ప్రతీహారునితో ఇలా అంటారు.

**సప్తధాన్యస్య దానేన ప్రీతో ధర్మధ్వజో భవేత్ ।**
**తత్ర గత్వా ప్రతీహారో బ్రూతే తస్య శుభాశుభమ్ ॥6॥**

సప్త ధాన్యాల దానంచేత ధర్మధ్వజుడు సంప్రీతుడవుతాడు. అంత ఆ ప్రతీహారుడు వెళ్లి యమధర్మరాజుకు అతని శుభాశుభకర్మలను తెలియజేస్తాడు.

**ధర్మరాజస్య తద్రూపం సంతః సుకృతినో జనాః ।**
**పశ్యంతి చ దురాత్మానో యమరూపం సుభీషణమ్ ॥7॥**

ధర్మరాజుయొక్క ప్రసన్నరూపాన్ని పుణ్యాత్ములై, సత్పురుషులు అగు జనులుమాత్రమే చూడగలరు. దురాత్ములైనవారు మహాభయంకరమైన యముని తీవ్రరూపాన్ని చూస్తారు.

**తం దృష్ట్వా భయభీతస్తు హాహేతి వదతే జనః ।**
**కృతం దానం చ యైర్మర్త్యై స్తేషాం నాస్తి భయం క్వచిత్ ॥8॥**

ఆ భీకరస్వరూపుని వీక్షించి పాపజనుడు భయంతో వణకిపోతూ, "హా! హా!" (అయ్యో, అయ్యో)అంటూ ఆక్రందన చేస్తాడు. ఏ మానవులయితే దానాలు చేస్తారో, వారికి భయమనేది కొంచెంకూడ ఉండదు.

**ప్రాప్తం సుకృతినం దృష్ట్వా స్థానాచ్చలతి సూర్యజః ।**
**ఏష మే మండలం భిత్త్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి ॥9॥**

తనవద్దకు వచ్చిన పుణ్యాత్ముని చూచి తనస్థానం నుండి లేచి గౌరవిస్తాడు యముడు. అంతేకాక "ఇతడు నా మండలాన్ని భేదించుకొని బ్రహ్మాదిలోకాలకు వెడతాడు" అని పలుకుతాడు.

**దానేన సులభో ధర్మో యమమార్గః సుఖావహః ।**
**ఏషమార్గో విశాలోఽ త్ర న కేనాప్యనుగమ్యతే ॥10॥**

**దానపుణ్యం వినా వత్స నగచ్ఛేద్ధర్మమందిరమ్ ।**

దానంవల్లనే ధర్ముడు లభ్యమవుతాడు, యమమార్గంకూడ సుఖవంతమవుతుంది. ఈ మార్గం విశాలమైనది, ఇతరులు వెళ్లడానికి అనువు అయినదికాదు. వత్సా! దానపుణ్యం లేకపోతే, ధర్ముని మందిరం వెళ్లరానిది,

**తస్మిన్ మార్గే తు రౌద్రే వై భీషణా యమకింకరాః ।**
**ఏకైకస్య పురస్యాగ్రే తిష్ఠత్యేకసహస్రకమ్ ॥11॥**

ఆ రౌద్రమార్గంలో భయంకరులైన యమకింకరులు ఉంటారు. ఒక్కొక్క పురం ముందు ఒక్కొక్క వేయిమంది చొప్పున వారు ఉంటారు.

**పచంతి పాపినం ప్రాప్య ఉదకే యాతనాకరాః ।**
**గృహ్ణంతి మాసమాసాంతే పాదశేషం తు తద్భవేత్ ॥12॥**

**ఔర్ధ్వ దైహిక దానాని యైర్న దత్తాని కాశ్యప ।**
**మహా కష్టేన తే యాంతి తస్మాద్దేయాని శక్తితః ॥13॥**

యాతనలు కలగజేసేవారు పాపులను ఉదకంలో ముంచి వండేస్తారు, ప్రతిమాసం చివర అలాగే పాపులను పట్టుకొంటారు. ఒక్కభాగం మిగిలి ఉండగా మళ్లీ యథాస్థితికి పాపి చేరుకొంటాడు. కశ్యపపుత్రా! ఔర్ధ్వదైహిక

దానాలు ఎవరినుద్దేశించి ఈయబడవో, వారు ఎన్నో కష్టాలు పడుతూ వెడతారు. అందువల్ల శక్తిని అనుసరించి వాటిని చేయాలి.

**అదత్త్వా పశువద్యాన్తి గృహీతో బంధబంధనైః ।**
**ఏవం కృతేన సంపశ్యేత్స నరః భూతకర్మణా ॥**
**దైవికీం పైతృకీం యోనిం మానుషీం వాథ నారకీమ్ ॥14॥**

అలా ఈయకపోతే త్రాళ్లతోను, సంకెళ్లతోను బంధింపబడిన పశువువలె లాగుకొని పోబడతాడు. ఈ విధంగా చేయబడిన పూర్వకర్మ ననుసరించి నరుడు దైవయోనినో, పైతృకయోనినో, మనుష్యయోనినో, లేదా నరకావాసాన్నో చూచినవాడవుతాడు.

**ధర్మరాజస్య వచనాన్ముక్తిర్భవతి వా తతః ।**
**మానుష్యం తత్త్వతః ప్రాప్య స పుత్రః పుత్రతాం వ్రజేత్ ॥15॥**

ధర్మరాజు శాసనాన్ని అనుసరించిన పిమ్మట నరకలోక విముక్తి పొందుతాడు. సాధారణంగా మనుష్యజన్మ పొంది పుత్ర పౌత్రవంతుడవుతాడు (పుత్రుని ఇంటనే పుత్రునిగా జన్మిస్తాడు)

**యథా యథాకృతం కర్మ తాం తాం యోనిం వ్రజేన్నరః ।**
**తత్తథైవ చ భుంజానో విచరే త్సర్వలోకగః ॥16॥**

నరుడు ఎలా ఎలా కర్మను ఆచరిస్తాడో, తత్ఫలితానుసారంగా ఆయా జన్మను ధరిస్తాడు. అతడు సర్వలోకాలలోను ఆయా భోగాలు అనుభవిస్తూ సంచరిస్తాడు.

**అశాశ్వతం పరిజ్ఞాయ సర్వలోకోత్తరం సుఖమ్ ।**
**యదా భవతి మానుష్యం తదా ధర్మం సమాచరేత్ ॥17॥**

సర్వలోకాలలోనూ ఉండే గొప్ప సుఖం అశాశ్వతమైనదిగా తెలిసికొని, ఎప్పుడయితే మనుష్యజన్మ ధరిస్తాడో, అప్పుడు ధర్మం చక్కగా ఆచరిస్తాడు.

**కృమయో భస్మవిష్ఠా వా దేహానాం ప్రకృతిః సదా ।**
**అంధకూపే మహారౌద్రే దీపహస్తః పతేత్తు వై ॥18॥**

దేహాల స్వభావం ఎల్లప్పుడు కృమిభూయిష్ఠమూ, భస్మభూతమూ, విష్ఠామాత్రంగా ఉంటుంది. మిక్కిలి భయంకరమైన చీకటినూతిలో చేతిలో దీపం ఉంచుకొన్నట్లు పడిపోయినట్లే అవుతుంది.

**మహాపుణ్య ప్రభావేన మానుష్యం జన్మ లభ్యతే ।**
**యస్తత్ప్రాప్య చరేద్ధర్మం స గచ్ఛేత్పరమాం గతిమ్ ॥19॥**

ఎంతో గొప్ప పుణ్యంచేసుకొన్న ప్రభావంచేత మనుష్యజన్మ లభిస్తుంది. అటువంటి ఉత్తమమైన జన్మను పొంది, ధర్మం ఆచరించినవాడు పరమగతిని పొందుతాడు.

**అపి జానన్ వృథాధర్మం దుఃఖమాయాతి యాతి చ ॥20॥**

ధర్మస్వరూపం తెలిసికొని కూడా, వృధాగా ధర్మం ఆచరిస్తే, (అధర్మం) ఆచరిస్తే, అతడు దుఃఖాన్నే పొందుతాడు. ఆ దుఃఖమార్గంలోనే వెడతాడు.

**జాతీ శతేన లభతే కిల మానుషత్వం తత్రాపి దుర్లభతరం ఖగ భో ద్విజత్వమ్ ।**
**యస్తత్ర పాలయతి లాలయతి వ్రతాని తస్యామృతం భవతి హస్తగతం ప్రసాదాత్ ॥21॥**

ఖగమా! వందలకొలది జన్మలలో ఎప్పుడో మనుష్యజన్మ లభిస్తుంది. అందులోనూ, ద్విజత్వం పొందడం మిక్కిలి దుర్లభమైనది. ఎవడు ఆ జన్మయందు ధర్మవ్రతాలను (రక్షిస్తూ) పాలిస్తూ, ప్రీతితో ఆచరిస్తాడో, అతనికి ధర్మదేవతానుగ్రహంవల్ల మోక్షం హస్తగతమై ఉంటుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే యమమందిరప్రవేశ తదాజ్ఞాలబ్ధ మనుష్యాది దేహాంతరప్రాప్తి నిరూపణం నామ ఏకోనవింశోఽధ్యాయః ॥19॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో యమమందిరప్రవేశం విశేషాలు అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

### ప్రేతబాధాః - ప్రేతబాధలు

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**యే కేచిత్ ప్రేతరూపేణ కుత్ర వాసం లభన్తి తే ।**
**ప్రేతలోకాద్వినిర్ముక్తాః కథం కుత్ర వ్రజంతి తే ॥1॥**

"కొందరు ప్రేతరూపంలో ఉంటారు గదా, వారు ఎక్కడ నివాసాన్ని పొందుతారు? ప్రేతలోకం నుండి విముక్తి పొందినవారు ఎలా ఎక్కడకు వెడతారు?

**చతుర్యుక్తాశీతిలక్షై ర్నరకైః పర్యుపాసితాః ।**
**యమేన రక్షితా స్తత్ర భూతైశ్చైవ సహస్రశః ॥2॥**

**విచరంతి కథం లోకే నరకాచ్చ వినిర్గతాః ।**
**గరుడాదీరితం శ్రుత్వా లక్ష్మీనాథోఽబ్రవీదిదమ్ ॥3॥**

"ఎనబై నాలుగు లక్షల నరకాలలో నానావిధయాతనలు పొంది, యమునిచే రక్షింపబడి, వేలకొలదిగానున్న అచ్చటి ప్రాణులు నరకలోకంనుండి విముక్తిని పొంది లోకంలో ఎలా సంచరిస్తూ ఉంటారు?" అని వచించిన గరుడుని పలుకులు విని లక్ష్మీనాథుడు ఇలా అన్నాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు అన్నాడు.

**పక్షిరాజ శృణుష్వ త్వం యత్ర ప్రేతాశ్చరంతి వై ।**
**పరార్థదారగ్రహణాచ్ఛ(బ)లాద్ద్రోహాన్నిశాచరాః ॥4॥**

పక్షిరాజా! ప్రేతలు ఎక్కడ ఎలా సంచరిస్తారో నీవు వినవలసింది, ఇతరుల ధనాన్ని, భార్యలను అపహరించేవారు, కపటబద్ధి, ద్రోహబుద్ధితో ఆ పనులు చేసేవారు రాక్షసయోనులలో జన్మిస్తారు.

**తథైవ సర్వపాపిష్ఠాః స్వాత్మజాన్వేషణే రతాః ।**
**విచరంత్యశరీరాస్తే క్షుత్పిపాసార్దితా భృశమ్ ॥5॥**

అన్ని విధాలైన పాపాలు చేసేవారు, తన సంతాన వ్యామోహాసక్తితో పాపబుద్ధితో ఉండేవారు, మిక్కిలిగా ఆకలి, దప్పికలతో పీడింపబడుతూ, అశరీరులై గాలిలో తిరుగాడుతూ ఉంటారు.

**బందీగృహవినిర్ముక్తా యేభ్యో నశ్యంతి జంతవః ।**
**తే వ్యవస్యంతి చ ప్రేతా వధోపాయం చ బంధుషు ॥6॥**

కారాగారం నుండీ వెలువడి ప్రాణిహింస చేసేవారు ప్రేతలుగా మారుతారు. బంధువుల చావుకు ఉపాయం(కుట్ర)పన్నేవారు కూడ ప్రేతలే అవుతారు.

**పితృద్వారాణి రుంధంతి తన్మార్గోచ్ఛేదకాస్తథా ।**
**పితృభాగాన్ విగృహ్ణంతి పాంథేభ్యస్తస్కరా ఇవ ॥7॥**

దొంగలు బాటసారుల నుండి దోచుకొనే విధంగా, కొందరు ప్రేతలు పితృమార్గాలను ఛేదిస్తూ, పితృద్వారాలను నిరోధిస్తూ, పితృభాగాలను దోచుకొంటారు.

**స్వం వేశ్మ పునరాగత్య మిత్రస్థానే విశంతి తే ।**
**తత్ర స్థితా నిరీక్షంతే రోగశోకాదిబంధనాః ॥8॥**

కొందరు ప్రేతలు తమ ఇంటికే తిరిగివచ్చి, మిత్ర స్థానంలో ప్రవేశిస్తారు. (స్నేహితులుగా చొచ్చుకుపోతారు) రోగం, శోకం మున్నగు బంధాలుగా అక్కడే ఉంటూ నిరీక్షిస్తారు.

**పీడయంతి జ్వరీభూయ ఏకాంతరమిషేణ తు ।**
**తృతీయకజ్వరా భూత్వా శీతవాతాదిపీడయా ॥9॥**

కొందరు జ్వరరూపంగా మారి, కొందరు ఏకాంతంగా ఉండేమిషతో తృతీయకజ్వరంగా మారి శీత వాత పిత్తాదిరోగాలతో పీడిస్తూ ఉంటారు.

**అన్యాంశ్చ వివిధాన్ రోగాఞ్ఛిరోఽఽర్తి చ విషూచికామ్।**
**చింతయంతి సదా తేషా ముచ్ఛిష్టాది స్థలస్థితాః ॥10॥**

మరికొందరు ప్రేతలు కొంతమందిని శిరోవేదన, విషూచిక మున్నగు రోగాలతో వారి ఉచ్ఛిష్టస్థలం మున్నగు వాటియందు నిలిచి ఎల్లప్పుడు చింత కలగజేస్తారు.

**ఆత్మజానాం ఛలాల్లోకా భూతసంఘైశ్చ రక్షితాః ।**
**పిబంతి తే చ పానీయం భోజనోచ్ఛిష్ట యోజితమ్ ॥11॥**

**ఏవం ప్రేతాః ప్రవర్తన్తే నానాదోషై ర్వికర్మిణః ॥12॥**

వివిధ భూతసంఘాలతో రక్షింపబడుతూ, తన సంతానంకోసమై, ఇతర జనుల కార్యాలను పాడుచేస్తూ, ఉచ్ఛిష్టభోజనంపై మనస్సుఉంచి, ఎంగిలి నీళ్లు వారు త్రాగుతూ ఉంటారు. ఈ విధంగా ప్రేతలు చేయకూడని పనులు చేస్తూ, అనేక దోషాలతో ప్రవర్తిస్తూ ఉంటారు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**కథం కుర్వంతి తే ప్రేతాః కేన రూపేణ కస్య కిమ్ ।**
**జ్ఞాయతే కేన విధినా జల్పంతి న వదంతి వా ॥13॥**

**ఏనం ఛింది మనోమోహం మమ చేదిచ్ఛసి ప్రియమ్ ।**
**కలికాలే హృషీకేశ ప్రేతత్వం జాయతే బహు ॥14॥**

ఏ రూపంతో? ఏవనికి? ఏమి? ఏవిధంగా? ప్రేతలు చేస్తూఉంటారు. ఏ విధంగా వారికి అది తెలియజేయ బడుతుంది? వారు మాట్లాడతారా? లేక మాట్లాడరా? నాకు సంతోషం చేకూర్చదలచుకొంటే, నా మనస్సులోని

వ్యామోహాన్ని తొలగించు. హృషీకేశా! అందులోనూ కలికాలంలో ప్రేతత్వమనేది పెక్కు రీతులుగా కలుగుతుంది కదా!

**శ్రీవిష్ణురువాచ –** శ్రీమహావిష్ణువు వచించాడు.

**స్వకులం పీడయేత్ ప్రేతః పరిచ్ఛిద్రేణ పీడయేత్ ।**
**జీవన్ స దృశ్యతే స్నేహీ మృతో దుష్టత్వమాప్నుయాత్ ॥15॥**

ప్రేత తన వంశాన్నే పీడిస్తూ ఉంటాడు. చిన్న చిన్న భేదాలు అంతటా కల్పించి పీడిస్తాడు. మృతుడై దుష్టత్వాన్ని పొందుతాడు. తిరిగి ప్రేతగా జీవిస్తూ స్నేహితునిగా కనిపిస్తాడు.

**రుద్రజాపీ ధర్మరతో దేవతాతిథిపూజకః ।**
**సత్యవాక్ ప్రియవాదీ చ న ప్రేతైః స హి పీడ్యతే ॥16॥**

రుద్రుని జపించేవాడు, ధర్మమునందు ఆసక్తి కలిగియున్నవాడు, దేవతలను పూజించేవాడు, అతిథులను సత్కరించేవాడు, సత్యాన్ని వచించేవాడు, ప్రియాన్ని భాషించేవాడు ప్రేతలచే పీడింపబడడు.

**సర్వక్రియా పరిభ్రష్టో నాస్తికో ధర్మనిందకః।**
**అసత్యవాదనిరతో నరః ప్రేతైః స పీడ్యతే॥**

సమస్త పుణ్యకర్మలను విడిచిపెట్టినవాడు, వేదనిందకుడు, ధర్మనిందకుడు, అసత్య భాషణమందు ఆసక్తి చూపేవాడు అయిన నరుడు ప్రేతలచే పీడింపబడతాడు.

**కలౌ ప్రేతత్వ మాప్నోతి తార్క్ష్య శుద్ధక్రియాపరః ॥17॥**

**కృతాదౌ ద్వాపరాన్తే చ న ప్రేతో నైవ పీడనమ్ ।**
**బహూనా మేకజాతానా మేకః సౌఖ్యం సమశ్నుతే ॥18॥**

గరుడా! కలియుగంలో నిషిద్ధ కర్మలాచరించేవాడు ప్రేతత్వాన్ని పొందుతాడు. కృతయుగం మొదలు ద్వాపరయుగం చివరవరకు ప్రేతాలేదు, పీడ అన్నదీలేదు. లోకంలో ఒకే తల్లిదండ్రులకు పుట్టిన ఎక్కువమందిలో ఒకడు సుఖపడుతూ ఉంటాడు.

**ఏకో దుష్కృతకర్మా చ ఏకః సంతతిమాఞ్జనః ।**
**ఏకః సంపీడ్యతే ప్రేతై రేకః సుతధనాన్వితః ॥19॥**

మరొకడు పాప కర్మలను చేస్తాడు, ఒకడు సంతానవంతుడవుతాడు, మరొకడు ప్రేతలచే పీడింపబడతాడు, ఒకడు పిల్లలతో, ధనంతో తులతూగుతూ ఉంటాడు.

**ఏకస్య పుత్రనాశః స్యాదేకో దుహితృమాన్ భవేత్ ।**
**విరోధో బంధుభిః సార్ధం ప్రేతదోషేణ కాశ్యప ॥20॥**

కాశ్యపా! ఒకనికి పుత్రనాశం కలుగుతుంది, వేరొకనికి పుత్రికా లాభం కలుగుతుంది. బంధువులతో కూడ విరోధం కలగడమనేది ప్రేతదోషం వల్లనే సంభవిస్తుంది.

**సంతతి ర్దృశ్యతే నైవ సముత్పన్నా వినశ్యతి ।**
**పశుద్రవ్య వినాశశ్చ సా పీడా ప్రేతసంభవా ॥21॥**

ఒకనికి సంతతి అన్నదే కలుగదు, ఇంకొకనికి సంతతి కలిగినా నశించిపోతుంది, పశునాశం, ద్రవ్యవినాశం ప్రేతలవల్ల కలిగే పీడయే అవుతుంది.

**ప్రకృతేః పరివర్తః స్యాద్విద్వేషః సహబంధుభిః ।**
**అకస్మాద్వ్యసనప్రాప్తిః సా పీడా ప్రేతసంభవా ॥22॥**

ఒకనికి ప్రకృతియే తిరగబడినదవుతుంది, ఇంకొకనికి బంధువులపై ఎప్పుడూ ద్వేషమే, మరొక్కనికి అకస్మాత్తుగా వ్యసనాలు సంప్రాప్తిస్తాయి. ఇటువంటి పీడలన్నీ ప్రేతలవల్ల కలిగేవే.

**నాస్తిక్యం వృత్తి లోపశ్చ మహాలోభస్తథైవ చ ।**
**స్యాద్ధంత కలహో నిత్యం సా పీడా ప్రేతసంభవా ॥23॥**

**పితృమాతృనిహన్తా చ దేవబ్రాహ్మణనిందకః ।**
**హత్యాదోషమవాప్నోతి సా పీడా ప్రేతసంభవా ॥24॥**

నాస్తిక్యం, వృత్తిలోపం, మహాలోభం, అలాగే నిత్యమూ కలహం, ఇటువంటి పీడ ప్రేతదోషంవల్ల కలిగేదే. తల్లిదండ్రులను హింసించటం, దేవబ్రాహ్మణ నింద, హత్యాదోషం పొందడం ఇవన్నీ ప్రేతలవల్ల సంభవించేవే.

**నిత్యకర్మ వినిర్ముక్తో జపహోమ వివర్జితః ।**
**పరద్రవ్యాణాం చ హర్తా సా పీడా ప్రేతసంభవా ॥25॥**

నిత్యకర్మలు చేయకుండుట, జపం, హోమం విడిచిపెట్టడం, ఇతరుల ద్రవ్యాలను అపహరించటం. ఇటువంటి పీడ ప్రేతలవల్ల కలిగేదే.

**సువృష్టౌ కృషి నాశశ్చ వ్యవహారో వినశ్యతి ।**
**లోకే కలహకారీ చ సా పీడా ప్రేతసంభవా ॥26॥**

వర్షాలు ఎక్కువ కురిసి పంట నశించడం, వ్యాపార వ్యవహారాలలో నష్టం, జనాలతో ఎప్పుడూ కలహించడం. ఇవన్నీ ప్రేతలవల్ల సంభవించేవే.

**మార్గే జంగమ్యమానం తం పీడయేద్వాతమండలీ ।**
**ప్రేతపీడా తు సా జ్ఞేయా సత్యం సత్యం ఖగేశ్వర ॥27॥**

ఖగరాజా! దారిలో నడుస్తూ ఉండగా గాలి మున్నగువాటివల్ల పీడింపబడడమనేది ప్రేత పీడగానే తెలిసికోవాలి. ఇది సత్యం, పరమసత్యం.

**హీనజాత్యా చ సంబంధో హీనకర్మ కరోతి యః ।**
**అధర్మే రమతే నిత్యం సా పీడా ప్రేతసంభవా ॥28॥**

హీనజాతి వానితో సంబంధం, హీనకర్మను ఆచరించడం, అధర్మంతో నిత్యం చరించి ఆనందించడం ఆ ప్రేతవల్ల కలిగేదే,

**వ్యసనై ర్ద్రవ్యనాశః స్యాదుపక్రాంతం వినశ్యతి ।**
**చౌరాగ్ని రాజభిర్హానిః సా పీడా ప్రేతసంభవా ॥29॥**

వ్యసనాలవల్ల ద్రవ్యనాశం, సంపాదించినవి నశించిపోవడం, చోరులవల్ల అగ్నివల్ల, రాజులవల్ల హాని పొందడం - ఆ పీడ ప్రేతవల్ల సంభవించేదే.

**మహారోగోపలబ్ధిశ్చ బాలకానాం చ పీడనమ్ ।**
**జాయా సంపీడ్యతే యచ్చ సా పీడా ప్రేతసంభవా ॥30॥**

మహారోగాల పాలైపోవడం, పిల్లలకు చిన్నతనంలో కలిగే రోగపీడనం, భార్య పరిపరి విధాల పీడించడం, ప్రేతవల్ల కలిగేవే,

**శ్రుతి స్మృతి పురాణేషు ధర్మశాస్త్ర సముద్భవే ।**
**అభావో జాయతే ధర్మే సా పీడా ప్రేత సంభవా ॥31॥**

శ్రుతి స్మృతి పురాణాలయందు, ధర్మశాస్త్ర విషయాలయందు, ధర్మాచరణమందు విశ్వాసం లేకపోవడం- ఇటువంటి పీడ ప్రేతవల్ల సంభవించేదే.

**దేవతీర్థ ద్విజానాం తు నిందాం యః కురుతే నరః ।**
**ప్రత్యక్షం వాపరోక్షం వా సా పీడా ప్రేతసంభవా ॥32॥**

దేవతలను, తీర్థాలను, ద్విజులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నరుడు నింద చేయటం ప్రేతవల్ల సంభవించేదే.

**స్వవృత్తిహరణం యచ్చ స్వప్రతిష్ఠాహతిస్తథా ।**
**వంశచ్ఛేదః న దృశ్యేత ప్రేత దోషాద్వినాన్యథా ॥33॥**

తన వృత్తిని పోగొట్టుకోవడం, తన ప్రతిష్ఠ దిగజారిపోవడం, ప్రేత దోషమే. ప్రేత దోషంవల్ల కాకపోతే వంశవిచ్ఛేద మనేది కలగనే కలగదు.

**స్త్రీణాం గర్భవినాశః స్యా న్న పుష్పం దృశ్యతే తథా ।**
**బాలానాం మరణం యత్ర సా పీడా ప్రేతసంభవా ॥34॥**

స్త్రీలకు గర్భవినాశం, స్త్రీలు పుష్పవతులు కాకపోవడం, బాల్యంలోనే మరణించడం (పిల్లలు) ఆ పీడ ప్రేతవల్ల కలిగేదే.

**భావశుద్ధ్యా న కురుతే శ్రాద్ధం సాంవత్సరాదికమ్ ।**
**స్వయమేవ న కుర్వీత సా పీడా ప్రేతసంభవా ॥35॥**

మనశ్శుద్ధితో శ్రాద్ధక్రియ, ఆబ్దికక్రియ చేయకపోవడం, స్వయంగా ఆ కర్మ చేయలేకపోవడం–ఆపీడ ప్రేతవల్ల సంభవించేదే.

**తీర్థే గత్వా పరాసక్తః స్వకృత్యం చ పరిత్యజేత్ ।**
**ధర్మకార్యే న సంపత్తిః సా పీడా ప్రేతసంభవా ॥36॥**

తీర్థాలకు వెళ్లి అన్యాసక్తుడై ఉండడం, స్వధర్మాన్ని పరిత్యజించడం, ధర్మకార్యాలకు ధనం లేకపోవడంవంటి పీడ ప్రేతవల్ల సంభవమయ్యేదే.

**దంపత్యోః కలహశ్చైవ భోజనే కోపసంయుతిః ।**
**పరద్రోహే మతిశ్చైవ సా పీడా ప్రేతసంభవా ॥37॥**

భార్యాభర్తలు కలహించుకోవడం, భోజనసమయంలో కోపంతో ఉండడం, ఇతరులకు ద్రోహంచేసే బుద్ధి కలగడం వంటి పీడ ప్రేతదోషంవల్ల కలిగేదే,

**పుష్పం యత్ర న దృశ్యేత న దృశ్యేత ఫలం తథా ।**
**విరహో భార్యయా యత్ర సా పీడా ప్రేతసంభవా ॥38॥**

ఎక్కడా పూలు లేకపోవడం, అలాగే పండ్లులేకుండా ఉండడం, భార్యతో ఎడబాటు ఎక్కడ ఉంటుందో, ఆ పీడ ప్రేతజన్య దోషమే.

**యేషాం వై జాయతే చిహ్నం సదోచ్చాటపరం నృణామ్ ।**
**స్వక్షేత్రే నిష్ఫలం తేజః సా పీడా ప్రేతసంభవా ॥39॥**

పుట్టుమచ్చలు ఎక్కువగా ఉండటం, ఎప్పుడూ ఇంటిపట్టున లేకపోవటం, తన ఇంట రాణించలేకపోవటం. ఇవన్నీ ప్రేతలవల్ల సంభవించేవే?

**స్వగోత్ర ఘాతకశ్చైవ హంతి శత్రుమివాత్మజమ్।**
**న ప్రీతిర్నాపి సౌఖ్యం చ సా పీడా ప్రేతసంభవా ॥ 40॥**

తనగోత్రం వారిని చంపటం, కుమారుని శత్రువునువలె చంపటం, ప్రీతి, సౌఖ్యం లేకపోవటం–ఇటువంటి పీడ ప్రేతదోషంవల్ల కలిగేవే.

**పితృవాక్యం న కురుతే స్వపత్నీం చ న సేవతే ।**
**సదా క్రూరమతిర్వ్యగ్రః సా పీడా ప్రేతసంభవా ॥41॥**

ఒకడు తండ్రిమాట వినడు, ఇంకొకడు తన భార్యను ప్రీతితో చూడడు, మరొక్కడు వ్యగ్రుడై క్రూరబుద్ధి కలిగి ఉంటాడు. ఇటువంటివి అన్నీ ప్రేతలవల్ల కలిగే దోషాలే.

**వికర్మా జాయతే ప్రేతో హ్యవిధి క్రియయా తథా ।**
**తత్కాల దుష్టసంసర్గాద్వృషోత్సర్గాదృతే తథా ॥42॥**

**దుష్టమృత్యు వశాద్వాపి అదగ్ధవపుష స్తథా ।**
**ప్రేతత్వం జాయతే తార్క్ష్య పీడ్యంతే యేన జంతవః ॥43॥**

నిషిద్ధ కర్మలు ఆచరించేవాడు, అశాస్త్రీయకర్మలు ఆచరించేవాడు, సమయానుకూలంగా దుష్టసాంగత్యం చేసేవాడు, వృషోత్సర్జన కర్మ చేయబడనివాడు, ప్రేతగా పుడతాడు. దుష్ట మృత్యువు(అకాలమృత్యువు) వాతబడినవాడు, దహనం చేయబడని శరీరం కలవాడు ప్రేతత్వాన్ని పొందుతాడు. గరుడా! ఆ ప్రేతవల్ల ప్రాణులు పీడింపబడతారు.

**ఏవం జ్ఞాత్వా ఖగశ్రేష్ఠ ప్రేతముక్తిం సమాచరేత్ ।**
**యో వై న మన్యతే ప్రేతాన్మృతః ప్రేతత్వ మాప్నుయాత్ ॥44॥**

ఖగోత్తమా! ఈవిధంగా తెలిసికొని ప్రేతవిముక్తి క్రియను తప్పనిసరిగా ఆచరించాలి. మరోవిధంగా మాత్రం ప్రేతవల్ల జరిగేది కాదు, మృతుడైనవాడు మాత్రమే ప్రేతత్వాన్ని పొందుతాడు.

**ప్రేతదోషః కులే యస్య సుఖం తస్య న విద్యతే ।**
**మతిః ప్రీతీ రతిర్బుద్ధిర్లక్ష్మీః పంచ వినాశనమ్ ॥45॥**

ప్రేతదోషం ఏ కులంలో ఉంటుందో, ఆ వంశస్థులకు సుఖం అనేది ఉండదు. మతి, ప్రీతి, రతి, బుద్ధి, లక్ష్మి అనే అయిదు నశిస్తాయి.

**తృతీయే పంచమే పుంసి వంశచ్ఛేదో హి జాయతే ।**
**దరిద్రో నిర్ధనశ్చైవ పాపకర్మా భవే భవే ॥46॥**

ఆ పురుషుని మూడవ తరంలో కాని, అయిదో తరంలో కాని వంశచ్ఛేదం జరుగుతుంది. ప్రతి జన్మమునందు దరిద్రుడు, నిర్ధనుడు, పాపకర్ముడు అవుతాడు.

**యే కేచిత్ ప్రేతరూపా వికృతముఖదృశో రౌద్రరూపాః కరాలా**
**మన్యంతే నైవ గోత్రం సుత దుహితృ పితౄన్ భ్రాతృజాయాం వధూం వా ।**
**కృత్వా కామ్యం చ రూపం సుఖగతి రహితా భాషమాణా యథేష్టం**
**హా కష్టం భోక్తుకామా విధివశపతితాః సంస్మరంతి స్వపాకమ్ ॥47॥**

ప్రేతరూపంతో, వికృతముఖంతో, రౌద్రంగా, భయంకరంగా కనిపించటం; గోత్రం, కొడుకూ, కూతురూ మరదలు, కోడలూ తేడాలేకుండా ప్రవర్తించటం; ఇచ్ఛవచ్చిన రూపంగా తిరుగుతూ, మటాడుతూ సుఖం లేకుండా బ్రతకటం ఇవన్నీ ప్రేతబాధలే. అవి భరించేవారు విధివశులై, పతితులై తమ కర్మల ఫలితాన్ని స్మరిస్తుంటారు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ప్రేతావాస తద్బాధా ప్రకార నిరూపణం నామ వింశోఽధ్యాయః ॥20॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రేతబాధలు అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం

## స్వప్నాధ్యాయః - స్వప్నాధ్యాయం

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**ముక్తిం యాంతి కథం ప్రేతాస్తదహం ప్రష్టుముత్సుకః ।**
**యన్ముక్తౌ చ మనుష్యాణాం న పీడా జాయతే పునః ॥1॥**

ప్రేత ముక్తుడయినచో మనుష్యులకు మళ్లీ పీడ పుడుతుందా? ప్రేతలు ఎలా ముక్తిని పొందుతారు? ఆ విషయాన్ని అడగడానికై నేను ఉత్సుకతతో ఉన్నాను.

**ఏతైశ్చ లక్షణైర్దేవ పీడోక్తా ప్రేతజా త్వయా ।**
**తేషాం కదా భవేన్ముక్తిః ప్రేతత్వం న కథం భవేత్ ॥2॥**

దేవా! పైన చెప్పబడిన లక్షణాలుంటే అది ప్రేతలవల్ల కలిగే పీడగా నీచే చెప్పబడింది, వారికి ఎప్పుడు ముక్తి కలుగుతుంది? ప్రేతత్వం ఎలా తిరిగి రాకుండా ఉంటుంది?

**ప్రేతత్వే హి ప్రమాణం చ కతి వర్షాణి సంఖ్యయా ।**
**చిరం ప్రేతత్వ మాపన్నః కథం ముక్తిమవాప్నుయాత్ ॥3॥**

ప్రేతత్వం ఎన్ని సంవత్సరాల ప్రమాణంతో ఉంటుంది? చాలా కాలం ప్రేతత్వాన్ని పొందినవాడు ఎలా విముక్తి పొందుతాడు?

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**ముక్తిం ప్రయాంతి తే ప్రేతాస్తదహం కథయామి తే ।**
**యదైవ మనుజోఽవైతి మమ పీడా కృతా త్వియమ్ ॥4॥**

**పృచ్ఛార్థం హితమన్విచ్ఛన్ దైవజ్ఞే వినివేదయేత్ ।**
**స్వప్నే దృష్టః శుభో వృక్షః ఫలితశ్చూతచంపకః ॥5॥**

ఆ ప్రేతలు ఎలా ముక్తి పొందుతారో, దానిని గురించి నీకు నేను చెబుతున్నాను. ఎప్పుడయితే మానవుడు తనకు అటువంటి పీడ కలుగుతోందని తెలుసుకొంటాడో, అప్పుడు తనకు తగినమేలును అన్వేషిస్తూ, దైవజ్ఞుని అడగడం కోసమై వెళ్లి నివేదించాలి. ఫలించిన చూతవృక్షం, పుష్పించిన సంపెంగచెట్టు ఇవి శుభవృక్షాలు. ఇవి స్వప్నంలో కనబడితే మంచిదే (తనకు తగినమేలు కోసమై దైవజ్ఞుని అన్వేషిస్తూ అడుగుటకైవెళ్లి నివేదించాలి)

**విప్రో వా వృషభో దేవో భ్రమతే తీర్థగో యది ।**
**ఏవం దృష్టో యదా స్వప్నే మృతః కోఽపి స్వగోత్రజః ॥6॥**

**స్వప్నే సత్యం పరిజ్ఞాయ దృష్టం ప్రేత ప్రభావతః ।**
**అద్భుతాని ప్రదృశ్యంతే ప్రేత దోషాద్వినిశ్చితమ్ ॥7॥**

విప్రుడు కాని, వృషభం కాని, దేవుడు కాని, తీర్థానికి వెడుతూ సంచరించడం కాని ఈ విధమైన స్వప్నదృశ్యాలు మంచివే. ఎప్పుడయినా స్వప్నంలో తన గోత్రంలోనివాడు ఎవడైనా మరణించినట్లు కనబడితే, అందలి సత్యం తెలుసుకొని,అది ప్రేత ప్రభావమని తెలుసుకోవాలి. ఇటువంటి అద్భుతాలన్నీ నిశ్చయంగా ప్రేత దోషంవల్ల కనిపించేవే.

**తీర్థస్నానే మతిర్యావచ్చిత్తం ధర్మపరాయణమ్ ।**
**ధర్మాపాయం ప్రకురుతే ప్రేతపీడా తదా వ్రజేత్ ॥8॥**

తీర్థస్నానాలు చేయాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మకార్యాలు ఆచరించాలనే చిత్తసంకల్పం ఏర్పడుతుంది. కాని ఆ ధర్మ నిర్వహణయందు నిరాసక్తత ఏర్పడితే తప్పనిసరిగా అప్పుడు ప్రేతపీడ కలిగినట్లే.

**తదా తత్ర వినాశాయ చిత్తభంగం కరోతి సా ।**
**శ్రేయాంసి బహువిఘ్నాని సంభవన్తి పదే పదే ॥9॥**

అప్పుడు వాటిని పాడుచేయడం కోసమై ఆ పీడ చిత్తచాంచల్యాన్ని కలగజేస్తుంది. అడుగు అడుగున శ్రేయస్సులకు ఎక్కువ ఆటంకాలు ఉంటాయి.

**అశ్రేయసి ప్రవృత్తిం చ ప్రేరయంతి పునః పునః ।**
**ఉచ్చాటనం చ క్రూరత్వం సర్వం ప్రేతకృతం ఖగ ॥10॥**

ప్రేతలు మాటి మాటికి శ్రేయస్సునకు భంగం కలిగించే ప్రవృత్తిని ప్రేరేపిస్తారు. ఉచ్చాటనం కాని, క్రూరత్వం కాని ఖగమా! అంతా ప్రేతవల్ల కలిగేదే.

**సర్వవిఘ్నాని సంత్యజ్య ముక్త్యుపాయం కరోతి యః ।**
**తస్య కర్మఫలం సాధు ప్రేతవృత్తిశ్చ శాశ్వతీ ॥11॥**

**స భవేత్తేన ముక్తస్తు దత్తం శ్రేయస్కరం పరమ్ ।**
**స్వయం తృప్యతి భోః పక్షిన్ యస్యోద్దేశేన దీయతే ॥12॥**

అన్ని అడ్డంకులను తొలగించుకొని, ముక్తి కోసమై ఉపాయాన్ని కొనసాగించగలిగితే, అతని కర్మఫలం మంచిదే. శాశ్వతమైన ప్రేతవృత్తి అతని నుండి విడివడినట్లే అవుతుంది. అతనిచే మిక్కిలి శ్రేయస్సు చేకూర్చబడినట్లే. ఖగమా! ఎవనిని ఉద్దేశించి దానాదికం ఈయబడిందో, దానివల్ల అతడు స్వయంగా తృప్తుడవుతాడు.

**శృణు సత్యమిదం తార్క్ష్య యద్దదాతి భునక్తి సః ।**
**ఆత్మానం శ్రేయసా యుఞ్జ్యాత్ ప్రేతస్తృప్తిం చిరం వ్రజేత్ ॥13॥**

గరుడా! ఈ సత్యాన్ని విను. ప్రేతనుద్దేశించి ఈయబడిన, దానిని అతడు భుజిస్తాడు. తాను తన మేలుకోసమై యత్నం చేసుకొంటాడు. ప్రేత ఎక్కువ తృప్తిని పొందుతాడు.

**తే తృప్తాః శుభమిచ్ఛన్తి నిజబంధుషు సర్వదా ।**
**అజ్ఞాతయస్తు యే దృష్టాః పీడయంతి స్వవంశజాన్ ॥14॥**

వారు ఎల్లప్పుడు సంతృప్తులై తన బంధువులందు శుభాన్ని కోరుకొంటారు. జ్ఞాతులు కానివారు తన వంశస్థులను పీడిస్తారు.

**నివారయంతి తృప్తాస్తే జాయమానానుకంపకాః ।**
**పశ్చాత్తే ముక్తిమాయాంతి కాలే ప్రాప్తే స్వపుత్రతః ॥**
**సదా బంధుషు యచ్ఛన్తి వృద్ధిమృద్ధిం ఖగాధిప ॥15॥**

జ్ఞాతులు కానివారు సంతృప్తులైనపుడు అనుకంప(దయ)కల్గి, ఆ విఘ్నాలను (పీడలనుండి) నివారిస్తారు. పిమ్మట వారు కాలం సమీపించగా, తమ పుత్రుల ద్వారా విముక్తి పొందుతారు. ఖగరాజా! వారు ఎల్లప్పుడు బంధువులకు వృద్ధిని, సంపదను ప్రసాదిస్తారు.

**దర్శనాద్భాషణాద్యస్తు చేష్టాతః పీడనాద్గతిమ్ ।**
**న ప్రాపయతి మూఢాత్మా ప్రేతశాపైః స లిప్యతే ॥16॥**

స్వప్నాలలో ప్రేతాలు కనిపించినపిమ్మట కూడా, వాటి మాటలవల్ల, చేష్టలవల్ల, పీడలవల్ల దుఃఖిస్తూ కూడా ఉత్తమగతిని వాటికి కల్పించకుండా ఉండే మూఢాత్ముడు ప్రేత శాపాలకు గురి అవుతాడు.

**అపుత్రకోఽపశుశ్చైవ దరిద్రో వ్యాధితస్తథా ।**
**వృత్తిహీనశ్చ హీనశ్చ భవే జ్జన్మని జన్మని ॥17॥**

అటువంటివాడు ప్రతిజన్మలోను పుత్రులు లేనివాడు, పశువులు లేనివాడు, దరిద్రుడు, వ్యాధిపీడితుడు, వృత్తి లేనివాడు, మిక్కిలి దీనుడు అవుతాడు.

**ఏవం బ్రువంతి తే ప్రేతాః పునర్యామ్యం సమాశ్రితాః ।**
**తత్రస్థానాం భవేన్ముక్తిః స్వకాలే కర్మసంక్షయే ॥18॥**

"ఆ ప్రేతలు మళ్లీ యమలోకాన్ని ఆశ్రయిస్తారు. అక్కడున్న వారు, తమ కాలగతిలో కర్మ సంక్షయం అవుతుండగా ముక్తిని పొందుతారు" అని చెబుతారు.

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**నామగోత్రం న దృశ్యేత ప్రతీతిర్నైవ జాయతే ।**
**కేచిద్వదంతి దైవజ్ఞాః పీడాం ప్రేతసముద్భవామ్ ॥19॥**

**న స్వప్నేశ్చేష్టితం నైవ దర్శనం న కదాచన ।**
**కిం కర్తవ్యం సురశ్రేష్ఠ తత్ర మే బ్రూహి నిశ్చితమ్ ॥20॥**

"ప్రేతలకు నామం, గోత్రం కనిపించవు, వాటిప్రతీతి (ప్రతీక) కూడ ఉండదు. కలలో వాటికి చేష్ట కూడ ఉండదు. ఎన్నడూ వాటి దర్శనం అనేది కూడా కలుగదు, ప్రేతలవల్ల జనించే పీడకూడా శూన్యమే" అని కొందరు దైవజ్ఞులు చెబుతారు. సురశ్రేష్ఠా! ఇప్పుడు ఏం చేయాలి? ఈ విషయంలో నిశ్చితాభిప్రాయం నాకు తెలియజేయ వలసింది.

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు వచించాడు.

**సత్యం వాప్యనృతం వాపి వదంతి క్షితి దేవతాః ।**
**తదా సంచింత్య హృదయే సత్యమేతద్ద్విజేరితమ్ ॥21॥**

సత్యమైనా, అనృతమైనా చెప్పినవారు భూమియందలి దేవతలు. ద్విజా! ఈవిధంగా మనస్సునందు ఆలోచించి ఈ సత్యాన్నే నీకు చెప్పడం జరిగింది. (ద్విజ వచనాన్నే చెప్పడం జరిగింది)

**భావభక్తిం పురస్కృత్య పితృభక్తి పరాయణః ।**
**కృత్వా విష్ణుబలిం చైవ పురశ్చరణపూర్వకమ్ ॥22॥**

**జపహోమై స్తథా దానైః ప్రకుర్యాద్దేహశోధనమ్ ।**
**కృతేన తేన విఘ్నాని వినశ్యంతి ఖగేశ్వర ॥23॥**

భక్తిభావ పూర్వకంగా, పితృభక్తియందు నిష్ఠ కలిగినవాడై, నారాయణబలిని నిర్వహించి, మంత్రపురశ్చరణ పూర్వకంగా జపహోమాలచేతను, దానాలచేతను దేహశోధనం(శుద్ధి)చేసుకోవాలి. ఖగరాజా! ఆ విధంగాచేస్తే ఆటంకాలు అన్నీ నశించిపోతాయి.

**భూతప్రేత పిశాచైర్వా స చేదన్యైః ప్రపీడ్యతే ।**
**పిత్రుద్దేశేన వై కుర్యాన్నారాయణబలిం తదా ॥**
**విముక్తః సర్వపీడాభ్య ఇతి సత్యం వచో మమ ॥24॥**

పితృభక్తితో నారాయణబలిని నిర్వహిస్తే, భూతప్రేత పిశాచాలవల్ల కాని, ఇతరులవల్లకాని పీడింపబడినవాడు, సర్వపీడలనుండి విముక్తి పొందగలడని నా సత్యమైన వచనం.

**పితృపీడా భవేద్యత్ర కృత్యైరన్యైర్న ముచ్యతే ।**
**తస్మాత్సర్వ ప్రయత్నేన పితృభక్తిపరో భవేత్ ॥25॥**

పితృపీడ కలవాడు, మిగిలినవారు చేసిన పనులనుండి కూడ విడివడలేడు. అందువల్ల ఎంతో ప్రయత్నంచేసి పితృభక్తిపరుడై ఉండాలి.

**నవమే దశమే వర్షే పిత్రుద్దేశేన వై పుమాన్ ।**
**గాయత్రీమయుతం జప్త్వా దశాంశేన చ హోమయేత్ ॥26॥**

తండ్రిపోయిన తొమ్మిది లేదా పదో సంవత్సరంలో పురుషుడు పదివేల గాయత్రీ జపంచేసి, అందు దశాంశాన్ని పితరుల నిమిత్తం హోమం చేయాలి.

**కృత్వా కృష్ణబలిం పూర్వం వృషోత్సర్గాదికాః క్రియాః ।**
**సర్వోపద్రవహీనస్తు సర్వసౌఖ్యమవాప్నుయాత్ ॥**
**ఉత్తమం లోకమాప్నోతి జ్ఞాతిప్రాధాన్యమేవ చ ॥27॥**

ముందు నారాయణబలి, వృషోత్సర్గాది క్రియలు చేస్తే ఉపద్రవాలు ఏవీ లేనివాడై, సమస్త సౌఖ్యాలు పొందుతాడు. జ్ఞాతులలో ప్రాధాన్యం వహించి ఉత్తమలోకం పొందుతాడు.

**పితృమాతృసమం లోకే నాస్త్యన్యద్దైవతం పరమ్ ।**
**తస్మాత్సర్వ ప్రయత్నేన పూజయే త్పితరౌ సదా ॥28॥**

లోకంలో తల్లిదండ్రులతో సమానమైన గొప్పదైవతం మరొకడు లేడు, అందువలన సర్వప్రయత్నాలు చేసి ఎల్లప్పుడు పితరులను పూజించాలి.

**హితానాముపదేష్టా హి ప్రత్యక్షం దైవతం పితా ।**
**అన్యా యా దేవతా లోకే న దేహప్రభవో హి తాః ॥29॥**

హితాలను ఉపదేశించే తండ్రి ప్రత్యక్షదైవం. ఇతర దేవతలు లోకంలో దేహానికి ప్రభువులు కాజాలరు.

**శరీరమేవ జంతూనాం స్వర్గమోక్షైక సాధనమ్ ।**
**దేహో దత్తో హి యేనైవం కోఽన్యః పూజ్యతమస్తతః ॥30॥**

**ఇతి సంచిత్య హృదయే పక్షిన్ యద్యత్ ప్రయచ్ఛతి ।**
**తత్సర్వమాత్మనా భుంక్తే దానం వేదవిదో విదుః ॥31॥**

సర్వప్రాణులకు స్వర్గానికి కాని, మోక్షానికి కాని ఏకైక సాధనం శరీరమే. దేహం ఎవనివల్లనయితే వచ్చిందో, వానికన్న పూజ్యతముడు ఎవడుంటాడు? అని హృదయమందు ఆలోచించి ఇచ్చిన దాన ఫలము నంతనూ తాను అనుభవిస్తాడని వేదవేత్తలు చెప్తారు గరుడా!

**పున్నామ నరకా ద్యస్మాత్పితరం త్రాయతే సుతః ।**
**తస్మాత్పుత్ర ఇతిప్రోక్త ఇహచాపి పరత్ర చ ॥32॥**

"పుత్" అనే పేరుగల నరకంనుండి సుతుడు తండ్రిని రక్షిస్తాడు కాన అతడు పుత్రుడు అనే పేరుతో చెప్పబడతాడు. ఈ లోకంలోనుండి పరలోకంనుండి కూడ రక్షిస్తాడు.

**అపమృత్యుమృతౌ స్యాతాం పితరౌ కస్యచిత్ఖగ ।**
**వ్రతతీర్థ వివాహాది శ్రాద్ధం సంవత్సరం త్యజేత్ ॥33॥**

ఖగమా! ఎవరి పితరులు అయినా అపమృత్యువు వాతబడితే వారు ఆ సంవత్సరం వ్రతాలు, తీర్థాలు, వివాహాది మంగళ కార్యాలు తలపెట్టరాదు.

**స్వప్నాధ్యాయమిమం యస్తు ప్రేతలింగ నిదర్శకమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి ప్రేతచిహ్నం న పశ్యతి ॥34॥**

ప్రేత చిహ్నాలను నిరూపించే ఈ స్వప్నాధ్యాయాన్ని ఎవడు పఠించినా, విన్నా, అతడు ప్రేతచిహ్నాలను చూడడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే స్వప్నాధ్యాయో నామ ఏకవింశోఽధ్యాయః ॥21॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో స్వప్నాధ్యాయం అనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

## ప్రేతత్వోత్పత్తిః తన్ముక్తిశ్చ - ప్రేతత్వోత్పత్తి తన్ముక్తి

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**సంభవంతి కథం ప్రేతాః కేన తేషాం గతిర్భవేత్ ।**
**కీదృక్తేషాం భవేద్రూపం భోజనం కిం భవేత్ప్రభో ॥1॥**

**సుప్రీతాస్తే కథం ప్రేతాః క్వ తిష్ఠంతి సురేశ్వర ।**
**ప్రసన్నః కృపయా దేవ ప్రశ్నమేనం వదస్వ మే ॥2॥**

ప్రభూ! ప్రేతల ఉత్పత్తి ఎలా కలుగుతుంది? వారికి ఏ కారణంవల్ల ఆ గతి ఏర్పడుతుంది? వారికి ఎటువంటి రూపం కలుగుతుంది? వారి తిండి ఎటువంటిది? సురేశ్వరా! ప్రేతలు ఎలా సుప్రసన్నులవుతారు? వారు ఎక్కడ ఉంటారు.? దేవా! దయతో ప్రసన్నుడవై ఈ ప్రశ్నలకు ఉత్తరం నాకు చెప్పవలసింది.

**శ్రీ భగవానువాచ** - భగవంతుడు చెప్పాడు.

**పాపకర్మరతా యే వై పూర్వకర్మవశానుగాః ।**
**జాయంతేతే మృతాః ప్రేతా స్తాఞ్ఛృణుష్వ వదామ్యహమ్ ॥3॥**

పాపకర్మలయందు ఆసక్తి కలిగిన, వారు పూర్వకర్మవశానుసారంగా చనిపోయి, ప్రేతలుగా జన్మిస్తారు. వారిగురించి నేను చెబుతున్నాను. విను.

**వాపీ కూప తటాగాంశ్చ ఆరామం సురమందిరమ్ ।**
**ప్రపాం సద్మ సువృక్షాంశ్చ తథా భోజనశాలికాః ॥ 4॥**

**పితృపైతామహం ధర్మం విక్రీణాతి స పాపభాక్ ।**
**మృతః ప్రేతత్వమాప్నోతి యావదాభూతసంప్లవమ్ ॥5॥**

వాపీకూప తటాగాదులను, ఆరామాలను, దేవాలయాలను, చలిపందిరులను, గృహాలను, మంచివృక్షాలను, అలాగే భోజనశాలలను, పితృపైతామహ ధార్మికోపకరణాలను పాడుచేసేవాడు, అమ్మివేసేవాడు పాపకర్మలు ఆచరించేవాడవుతాడు. అతడు చనిపోయిన పిమ్మట సమస్త ప్రలయ పర్యంతం ప్రేతత్వాన్ని పొంది ఉంటాడు.

**గోచరం గ్రామ సీమాం చ తడాగారామగహ్వరమ్ ।**
**కర్షయంతి చ యే లోభాత్ ప్రేతాస్తే వై భవన్తి హి ॥6॥**

గోశాలలను, గ్రామసీమలను, చెరువులను, ఆరామాలను, గుహలను లోభబుద్ధితో అన్యాయంగా లాగుకొను, వారు ప్రేతలు కాగలరు.

**చండాలాదుదకాత్సర్పా ద్బ్రాహ్మణా ద్వైద్యుతాగ్నితః ।**
**దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణం పాపకర్మిణామ్ ॥7॥**

చండాలులవల్ల, నీటివల్ల, పామువల్ల, బ్రాహ్మణశాపంవల్ల, పిడుగువల్ల, అగ్నివల్ల, క్రూరమృగాలవల్ల, పశువులవల్ల, పాపకర్మలకు మరణం వస్తుంది.

**ఉద్బంధనమృతా యే చ విషశస్త్ర హతాశ్చ యే ।**
**ఆత్మోపఘాతినో యే చ విషూచ్యాదిహతా స్తథా ॥8॥**

**మహారోగై ర్మృతా యే చ పాపరోగైశ్చ దస్యుభిః ।**
**అసంస్కృత ప్రమీతా యే విహితాచారవర్జితాః ॥9॥**

**వృషోత్సర్గాదిలుప్తాశ్చ లుప్తమాసికపిండకాః ।**
**యస్యానయతి శూద్రాగ్నిం తృణ కాష్ఠ హవీంషి సః ॥10॥**

**పతనాత్పర్వతానాం చ భిత్తిపాతేన యే మృతాః ।**
**రజస్వలాదిదోషైశ్చ న చ భూమౌ మృతా చ యే ॥11॥**

**అంతరిక్షే మృతా యే చ విష్ణుస్మరణవర్జితాః ।**
**సూతకైః శ్వాదిసంపర్కైః ప్రేతభావా ఇహ క్షితౌ ॥12॥**

సంకెళ్లచే బంధింపబడి చనిపోయినవారు, విషంవల్ల, శస్త్రాలవల్ల మరణించినవారు, ఆత్మహత్య చేసుకొన్నవారు, విషూచి మున్నగు రోగాలచే మృతిచెందినవారు, మహారోగాలవల్ల చనిపోయినవారు, పాపరోగాలవల్ల, దొంగలవల్ల మరణించినవారు, ఏ సంస్కారం లేకుండా చనిపోయేవారు, శాస్త్రాచారాలను విడిచివేసినవారు వృషోత్సర్గం మున్నగు క్రియలు లోపించినవారు, మాసిక పిండ శ్రాద్ధాలు లోపించినవారు, శూద్రాగ్నిని, వారిద్వారా తృణాలను, కాష్ఠాలను, హవిస్సులను స్వీకరించినవారు, పర్వతాలనుండి పడిపోయి, గోడలు కూలిపోయి, రజస్వలాది దోషాలవల్ల మరణించినవారు భూమియందు కాకుండా మరోచోట చనిపోయినవారు, అంతరిక్షంలో మరణించినవారు, విష్ణుసంస్మరణ చేయనివారు, సూతకులతోను, శ్వవృత్తిని చేబట్టిన వారితోను సంపర్కం చేసినవారు భూమియందు ప్రేతభావాన్ని పొందుతారు.

**ఏవమాదిభి రన్యైశ్చ కుమృత్యువశగాశ్చ యే ।**
**తే సర్వే ప్రేతయోనిస్థా విచరంతి మరుస్థలే ॥13॥**

ఇటువంటి కారణాలతోనూ, ఇతర కారణాలతోనూ అపమృత్యువు వాత పడినవారు ప్రేత జన్మలు పొంది మరుస్థలంలో సంచరిస్తూ ఉంటారు.

**మాతరం భగినీం భార్యాం స్నుషాం దుహితరం తథా ।**
**అదృష్టదోషాం త్యజతి స ప్రేతో జాయతే ధ్రువమ్ ॥14॥**

తల్లిని, చెల్లెలిని, భార్యను, కోడలిని, కుమార్తెను, ఏ దోషమూ లేకపోయినా విడిచిపెట్టినవాడు నిశ్చయంగా ప్రేతయై పుడతాడు.

**భ్రాతృధ్రుగ్ బ్రహ్మహా గోఘ్నః సురాపో గురుతల్పగః ।**
**హేమక్షౌమహరస్తార్క్ష్య స వై ప్రేతత్వమాప్నుయాత్ ॥15॥**

గరుడా! సోదరుని చంపినవాడు, బ్రహ్మహత్య చేసినవాడు, సురాపానం చేసినవాడు, గురుతల్పగుడు; బంగారం, పట్టు, దొంగిలించేవాడు, ప్రేతత్వాన్ని పొందుతాడు.

**న్యాసాపహర్తా మిత్రధృక్ పరదారరతస్తథా ।**
**విశ్వాసఘాతీ క్రూరస్తు స ప్రేతో జాయతే ధ్రువమ్ ॥16॥**

న్యాసాన్ని అపహరించేవాడు, మిత్రద్రోహి, పరభార్యారతుడు, విశ్వాసఘాతకుడు, క్రూరుడు నిశ్చయంగా ప్రేతగా పుడతాడు.

**కులమార్గాంశ్చ సంత్యజ్య పరధర్మ రతస్తథా ।**
**విద్యావృత్త విహీనశ్చ స ప్రేతో జాయతే ధ్రువమ్ ॥17॥**

కులధర్మాలను విడిచిపెట్టి, పరధర్మాసక్తుడై ఉండేవాడు, విద్య, సత్ప్రవర్తన లేనివాడు నిశ్చయంగా ప్రేతగా పుడతాడు.

**అత్రైవోదాహరంతీమమితిహాసం పురాతనమ్ ।**
**యుధిష్ఠిరస్య సంవాదం భీష్మేణ సహ సువ్రత ॥**
**తదహం కథయిష్యామి యచ్ఛ్రుత్వా సౌఖ్యమాప్నుయాత్ ॥18॥**

ఇక్కడనే ఈ పురాతనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. సువ్రతా! యుధిష్ఠిరునికి భీష్మునితో జరిగిన ఆ సంవాదాన్ని నేను చెప్తున్నాను. దానిని వింటే సౌఖ్యం పొందవచ్చు.

**యుధిష్ఠిర ఉవాచ** – యుధిష్ఠిరుడు వచించాడు.

**కేన కర్మవిపాకేన ప్రేతత్వముపజాయతే ।**
**కేన వా ముచ్యతే కస్మా త్తన్మే బ్రూహి పితామహ ॥**
**యచ్ఛ్రుత్వా న పునర్మోహమేవం యాస్యామి సువ్రత ॥19॥**

ఏ కర్మఫలితంగా ప్రేతత్వం సంభవిస్తుంది? పితామహా! ఏ ప్రాయశ్చిత్తంవల్ల ఎలా విముక్తి లభిస్తుంది? దానిని నాకు వివరించవలసింది. సువ్రతా! దేనిని విని నేను తిరిగి మోహాన్ని పొందనో దానిని చెప్పు.

**భీష్మ ఉవాచ** – భీష్ముడిలా వచించాడు.

**యేనైవ జాయతే ప్రేతో యేనైవ స విముచ్యతే ।**
**ప్రాప్నోతి నరకం ఘోరం దుస్తరం దైవతైరపి ॥20॥**

దేనివల్ల ప్రేతగా పుడతాడో, దేనివల్ల విముక్తి పొందుతాడో అది చెప్తాను. ప్రేత దేవతలకుకూడ తరింపశక్యం కాని ఘోరమైన నరకాన్ని పొందుతాడు.

**సతతం శ్రవణాద్యస్య పుణ్యశ్రవణకీర్తనాత్ ।**
**మానవా విప్రముచ్యన్తే ఆపన్నాః ప్రేతయోనిషు ॥21॥**

ఎల్లప్పుడు పుణ్యవిషయాలు వినడంవల్ల, పుణ్యగాథలను కీర్తనం చేయడంవల్ల (విని కీర్తించడంవల్ల) ప్రేత యోనులలో పడిపోయిఉన్న మానవులు విముక్తి పొందగలరు.

**శ్రూయతే హి పురా వత్స బ్రాహ్మణః శంసితవ్రతః ।**
**నామ్నా సంతప్తకః ఖ్యాతస్తపోఽర్థే వనమాశ్రితః ॥ 22॥**

వత్సా! పూర్వం ప్రసిద్ధి వహించే వ్రతనిష్ఠుడైన బ్రాహ్మణుడు ఉండేవాడు. వినే ఉంటావేమో? అతడు సంతప్తకుడనే పేరుతో పిలవబడేవాడు. అతడు తపస్సుకోసమై ఒకవనానికి వెళ్లాడు.

**స్వాధ్యాయ యుక్తో హోమేన యో(యా)గయుక్తో దయాన్వితః ।**
**యజన్స సకలాన్ యజ్ఞాన్ యుక్త్యా కాలం చ విక్షిపన్ ॥23॥**

అతడు స్వాధ్యాయం చేసేవాడు, హోమాలు చేసేవాడు. దయతోకూడినవాడు, సకల యజ్ఞాలను ఆచరించేవాడు. ఇలా కాలం వెళ్లబుచ్చేవాడు.

**బ్రహ్మచర్య సమాయుక్తో యుక్తస్తపసి మార్దవే ।**
**పరలోక భయోపేతః సత్యశౌచైశ్చ నిర్మలః ॥24॥**

బ్రహ్మచర్యాన్ని అవలంబించేవాడు, సున్నితమైన తపస్సు ఆచరించేవాడు, పరలోకభీతి కలిగినవాడు, సత్యంచేత, శౌచంచేత నిర్మలుడు.

**యుక్తో హి గురువాక్యేన యుక్తశ్చాతిథిపూజనే ।**
**ఆత్మయోగే సదోద్యుక్తః సర్వద్వంద్వవివర్జితః ॥25॥**

గురువాక్యాలపై శ్రద్ధకలవాడు, అతిథిపూజయందు ఆసక్తికలవాడు, ఎల్లప్పుడు ఆత్మయోగనిష్ఠుడు, అన్ని ద్వంద్వాలను విడిచిపెట్టినవాడు.

**యోగాభ్యాసే సదా యుక్తః సంసార విజిగీషయా ।**
**ఏవంవృత్తః సదాచారో మోక్షకాంక్షీ జితేంద్రియః ॥ 26॥**

నిరంతరం యోగాభ్యాసం చేసేవాడు, సంసారబంధాన్ని జయించే కోరికగలవాడు, సదాచార సంపన్నుడు, జితేంద్రియుడు, మోక్షమందు కోరిక కలవాడు ఈ విధంగా సత్ప్రవర్తనతో ఉండేవాడు.

**బహూన్యబ్దాని విజనే వనే తస్య గతాని వై ।**
**తస్య బుద్ధిస్తతో జాతా తీర్థానుగమనం ప్రతి ॥27॥**

అతడు ఆ విధంగా జనంలేని అడవిలో ఉండగా చాలా ఏండ్లు గడచిపోయాయి, అంత అతనికి తీర్థయాత్రలకు వెళ్లాలనే సంకల్పం జనించింది.

**పుణ్యై స్తీర్థజలైరేవ శోషయిష్యే కలేవరమ్ ।**
**స తీర్థే త్వరితం స్నాత్వా తపస్వీ భాస్కరోదయే ॥28॥**

**కృతజాప్యనమస్కారో హ్యధ్వానం ప్రత్యపద్యత ।**

'పుణ్యతీర్థ జలాలతో ఈ శరీరాన్ని శోషింప జేసుకొంటాను' అని ఆ తపస్వి సూర్యోదయ సమయంలో ఒక తీర్థంలో శీఘ్రంగా స్నానంచేసి, జపం, నమస్కారం పూర్తిచేసి, తనదారి గుర్తించి పయనించాడు.

**ఏకస్మిన్దివసే విప్రో మార్గభ్రష్టో మహత్తపాః ।**
**దదర్శాధ్వని గచ్ఛన్స పంచప్రేతాన్ సుదారుణాన్ ॥29॥**

మహాతపస్వియైన ఆ విప్రుడు ఒకానొక రోజున దారితప్పాడు, ఆ మార్గంలో వెడుతూ, మహాభయంకరంగా ఉన్న అయిదు ప్రేతాలను చూశాడు.

**అరణ్యే నిర్జనే దేశే సంకటే వృక్షవర్జితే ।**
**పంచైతాన్ వికృతాకారాన్ దృష్ట్వా వై ఘోరదర్శనాన్ ॥**
**ఈషత్ సంత్రస్త హృదయోఽ తిష్ఠదున్మీల్యలోచనే ॥30॥**

**అవలంబ్య తతో ధైర్యం భయముత్సృజ్య దూరతః ।**
**పప్రచ్ఛ మధురాభాషీ కే యూయం వికృతాననాః ॥31॥**

ఏ వృక్షాలు లేని, ఆ నిర్జనారణ్యంలో ఒక సంకట ప్రదేశంలో ఘోరదర్శనులై, వికృతాకారులైన ఆ అయిదుగురు ప్రేతలను వీక్షించి, మనస్సులో కొంచెం భయం కలిగింది కన్నులు మూసుకొని అలాగే ఉండిపోయాడు. పిమ్మట భయం విడిచిపెట్టి, ధైర్యాన్ని కూడగట్టుకొని, దూరంలోనే ఉండి ప్రియంగాభాషిస్తూ "వికృతవదనం కల్గిన మీరెవరు?" అని అడిగాడు.

**కించాశుభం కృతం కర్మ యేన ప్రాప్తాః స్థ వైకృతమ్ ।**
**కథం వాచైకతః కర్మ ప్రస్థితాః కుత్ర నిశ్చితమ్ ॥32॥**

"ఏమయినా అమంగళకరమైన పని చేశారా? యీ వికృత రూపాలను ఎలా పొందారు? ఒక్కొక్కరు ఏ కర్మ చేశారు? ఎక్కడ ఉంటారు? నిశ్చయించి చెప్పండి" అని అడిగాడు.

**ప్రేతరాజ ఉవాచ** – ప్రేతరాజు పలికాడు.

**స్వైః స్వైః కర్మభిః ప్రాప్తం ప్రేతత్వం హి ద్విజోత్తమ ।**
**పరద్రోహరతాః సర్వే పాపా మృత్యువశంగతాః ॥33॥**

ద్విజోత్తమా! మామా కర్మలవల్ల ఈ ప్రేతత్వం సంప్రాప్తించింది. అందరం పరులకు ద్రోహం చేయుటలో ఆసక్తికలవారమే. పాపులమే అందువల్ల పాపమృత్యువుబారి పడినాము.

**క్షుత్పిపాసార్దితా నిత్యం ప్రేతత్వం సముపాగతాః ।**
**హతవాక్యా హతశ్రీకా హతసంజ్ఞా విచేతసః ॥34॥**

ఎల్లప్పుడు ఆకలి దప్పికలతో పీడింపబడుతూ ప్రేతత్వాన్ని పొందాము. మంచిమాట పలకలేము, సంపదలేవీ మాకు లేవు, ఊరుపేరూ లేనివారం, జ్ఞానశూన్యులం.

**న జానీమో దిశం తాత విదిశం చాతిదుఃఖితాః ।**
**క్వ ను గచ్ఛామహే మూఢాః పిశాచా కర్మజా వయమ్ ॥35॥**

మాకు దిక్కులు తెలియవు నాయనా! ఏ దిక్కులేక దుఃఖిస్తూ ఉంటాము. ఎక్కడికి వెళ్లగలం? మూఢులం, పిశాచాలం, మేము మా కర్మలవల్ల ఇలా పుట్టాము.

**న మాతా న పితాస్మాకం ప్రేతత్వం కర్మభిః స్వకైః ।**
**ప్రాప్తాః స్మ సహసాజాత దుఃఖోద్వేగసమాకులమ్ ॥36॥**

**దర్శనేన చ తే బ్రహ్మన్ ముదితాప్యాయితా వయమ్ ।**
**ముహూర్తం తిష్ఠ వక్ష్యామి వృత్తాంతం సర్వమాదితః ॥37॥**

మాకు తల్లీ లేదు, తండ్రీ లేదు. మామా కర్మలవల్ల వెంటనే దుఃఖానికీ ఉద్వేగానికీ లోనై ప్రేతత్వాన్ని పొందాము. బ్రాహ్మణా! నీ దర్శనంవల్ల మేము సంతోషం, సంతృప్తి పొందాము. ఒక ముహూర్తకాలం ఉండు. నా వృత్తాంతాన్ని అంతా మొదటినుండి తెలియజేస్తాను.

**అహం పర్యుషితో నామ ఏష సూచీముఖస్తథా ।**
**శీఘ్రగో రోధ(హ) కశ్చైవ పంచమో లేఖకః స్మృతః ॥38॥**

**ఏవం నామ్నా చ సర్వే వై సంప్రాప్తాః ప్రేతతాం వయమ్ ॥**

నేను పర్యుషితుడను పేరుగలవాడను. ఇతడు సూచీముఖుడు, వీరు శీఘ్రగుడు, రోధకుడు అనేవారు. అయిదోవాడు లేఖకుడు. మేము అందరం ఈ పేర్లతో ప్రేతత్వాన్ని పొందినవారం.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు వచించాడు.

**ప్రేతానాం కర్మజాతానాం కథం వై నామ సంభవః ।**
**కించిత్కారణముద్దిశ్య యేన బ్రూయాః స్వనామకాన్ ॥39॥**

కర్మ సంజాతులైన ప్రేతలకు పేరు ఎలా సంభవిస్తుంది? ఏదో కారణాన్ని ఉద్దేశించి మీరు మీ నామాలను చెప్పారు?

**ప్రేతరాజ ఉవాచ** – ప్రేతరాజు పలికాడు.

**మయా స్వాదు సదా భుక్తం దత్తం పర్యుషితం ద్విజ ॥40॥**

ద్విజా! నేను ఎల్లప్పుడు రుచికరమైన దానిని భుజించేవాడను. ఎంగిలియైన దానిని (అపవిత్రమైన దానిని)ఇతరులకు ఇచ్చేవాడిని.

**శీఘ్రం గచ్ఛతి విప్రేణ యాచితః క్షుధితేన వై ।**
**ఏతత్కారణముద్దిశ్య నామ పర్యుషితం మమ ॥41॥**

(ఇందు మొదటిపాదం రెండవ వానికి వర్తిస్తుంది) ఈ కారణాన్ని ఉద్దేశించి నాకు పర్యుషితమనే పేరువచ్చింది.

**శీఘ్రం గచ్ఛతి విప్రేణ యాచితః క్షుధితేన వై ।**
**ఏతత్కారణ ముద్దిశ్య శీఘ్రగోఽయం ద్విజోత్తమ ॥42॥**

ఎవడయినా విప్రుడు నిమంత్రిస్తేచాలు, ఆకలితో వీడు వెంటనే వెళ్లేవాడు. ద్విజోత్తమా! ఈ కారణాన్ని ఉద్దేశించి ఇతడు శీఘ్రగుడు అయ్యాడు.

**సూచితా బహవోఽనేన విప్రా అన్నాదికాంక్షయా।**
**ఏతత్కారణ ముద్దిశ్య ఏష సూచీ ముఖః స్మృతః ॥43॥**

పెక్కుమంది విప్రులు అన్నాదులపైనున్న కోరికతో ఇతనిచే సూచింపబడేవారు. ఈ కారణాన్ని ఉద్దేశించి ఇతడు సూచీముఖుడయ్యాడు.

**ఏకాకీ మిష్టమశ్నాతి పోష్యవర్గమృతే సదా ।**
**బ్రాహ్మణానామభావేన రోధకస్తేన చోచ్యతే ॥44॥**

తనచే పోషింపబడేవారు ఆకలితో చచ్చిపోతున్నా, తానొక్కడే మృష్టాన్నాన్ని భుజించేవాడు. బ్రాహ్మణులను రాకుండా(లేకుండా)చేసిన కారణంచే రోధకుడని చెప్పబడ్డాడు.

**పురాయం మౌనమాస్థాయ యాచితో విలిఖేద్భువమ్ ।**
**తేన కర్మవిపాకేన లేఖకో నామ చోచ్యతే ॥45॥**

పూర్వం ఇతడు మౌనం వహించి, ఎవరైనా అడిగితే భూమిలోని వస్తువులను పెల్లగించేవాడు. ఆ కర్మ విపాకంవల్ల ఇతడు లేఖకుడయ్యాడు.

**ప్రేతత్వం కర్మభావేన ప్రాప్తం నామాని చ ద్విజ ।**
**మేషాననో లేఖకోఽయం రోధకః పర్వతాననః ॥ 46॥**

**శీఘ్రగః పశువక్త్రశ్చ సూచకః సూచివక్త్రవాన్ ।**
**దుఃఖితా నితరాం స్వామిన్ పశ్య రూపవిపర్యయమ్ ॥47॥**

ద్విజా! ఈ విధంగా మా కర్మ పరిపాకంవల్ల ప్రేతత్వం, దానిననుసరించి పేర్లు వచ్చాయి. ఈ లేఖకుడు మేషముఖం కలవాడు రోధకుడు పర్వతముఖం కలిగినవాడు, శీఘ్రగుడు పశువక్త్రం కల్గినవాడు, సూచకుడు వాడియైన సూచివంటి ముఖం కలవాడు. స్వామి! మిక్కిలిగా దుఃఖించేవారం మేము, మా వికృతరూపాలనుచూడు.

**కృత్వా మాయామయం రూపం విచరామో మహీతలే ।**
**సర్వే చ వికృతాకారా లంబోష్ఠా వికృతాననాః ॥48॥**

**బృహచ్ఛరీరిణో రౌద్రా జాతాః స్వేనైవ కర్మణా ।**
**ఏతత్తే సర్వమాఖ్యాతం ప్రేతత్వే కారణం మయా ॥49॥**

ఈ మాయామయ రూపాన్ని ధరించి మహీతలంలో సంచరిస్తూ ఉంటాం. అందరమూ వికారమైన ఆకారం కలవారమే. వ్రేలాడే పెదవులు, వికృత ముఖాలు కల్గినవారమే. పెద్ద శరీరాలు, ఈ రౌద్రరూపాలు మామా కర్మలవలననే వచ్చాయి. దీనినంతను నీకు నేను మా ప్రేతత్వ కారణాల గురించి వివరించాను.

**జ్ఞానినోఽపి వయం సర్వే జాతాః స్మ తవ దర్శనాత్ ।**
**యత్ర తే శ్రవణే శ్రద్ధా తత్పృచ్ఛ కథయామి తే ॥50॥**

నీ దర్శనం వల్ల మేము అందరం కూడ జ్ఞానం కలిగినవారమయ్యాం. ఇంకా నీకు ఏం వినాలనే శ్రద్ధ ఉందో, దానిని అడుగు, నీకు వివరిస్తాను.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు అన్నాడు.

**యే జీవా భువి జీవంతి సర్వేఽప్యాహారమూలకాః ।**
**యుష్మాకమపి చాహారం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ॥51॥**

భూమియందు జీవించే జీవులన్నీ ఆహారమూలంగానే వ్యవహరిస్తాయి. మీ ఆహారం ఎటువంటిదో ఉన్నదున్నట్లుగా వినాలని కోరుకొంటున్నాను.

**ప్రేతా ఊచుః** – ప్రేతలు వచించారు.

**యది తే శ్రవణే శ్రద్ధా ఆహారాణాం ద్విజోత్తమ ।**
**అస్మాకం తు మహీభాగ (మహాభాగ) శృణు త్వం సుసమాహితః ॥52॥**

ద్విజోత్తమా! మహాభాగ! మా ఆహారాలను గురించి వినాలనే శ్రద్ధ నీకు ఉంటే, సావధానుడవై విను.

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు వచించాడు.

**కథయంతు మహాప్రేతా ఆహారం చ పృథక్ పృథక్ ।**
**ఇత్యుక్తాం బ్రాహ్మణేనేమమూచుః ప్రేతాః పృథక్ పృథక్ ॥53॥**

మహాప్రేతలారా! మీ ఆహారం గురించి వేరు వేరుగా చెప్పండి. బ్రాహ్మణుడు ఇలా అనగా ఆ ప్రేతలు (వేరు వేరుగా) దేనికి దానికే ఇలా చెప్పసాగాయి.

**ప్రేతా ఊచుః** – ప్రేతలు అన్నారు.

**శృణు చాహార మస్మాకం సర్వసత్త్వ విగర్హితమ్ ।**
**యచ్ఛ్రుత్వా గర్హసే బ్రహ్మన్ భూయో భూయశ్చ గర్హితమ్ ॥54॥**

బ్రాహ్మణా! విను. మా ఆహారం సమస్త జంతువులు అసహ్యించుకొనేది, దానిని వింటే నీవే నిందిస్తావు. అది పదే పదే అసహ్యమైనది.

**శ్లేష్మ మూత్ర పురీషోత్థం శరీరాణాం మలైః సహ ।**
**ఉచ్ఛిష్టైశ్చైవ చాన్యైశ్చ ప్రేతానాం భోజనం భవేత్ ॥55॥**

శ్లేష్మంతోను, మూత్రంతోను, పురీషంతోను కూడి శరీరాల మలంతో నిండి ఉంటుంది. ఉచ్ఛిష్టాలతోను, మిగిలిన వాటితోను ప్రేతల భోజనం ఉంటుంది.

**గృహాణి చాప్యశౌచాని ప్రకీర్ణోపస్కరణాని చ ।**
**మలినాని ప్రసూతాని ప్రేతా భుంజంతి తత్ర వై ॥ 56॥**

అపరిశుభ్రంగా ఉన్న ఇండ్లలో, వెదజల్ల బడియుండే వినియోగ ద్రవ్యాలను, ప్రసూత మలినాలను ప్రేతలు అంతటా భుజిస్తారు.

**నాస్తి సత్యం గృహే యత్ర న శౌచం న చ సంయమః ।**
**పతితైర్దస్యుభిః సంగం ప్రేతా భుంజంతి తత్ర వై ॥57॥**

ఏ గృహంలో సత్యం లేదో, శౌచం ఉండదో, సంయమనం ఉండదో, పతితులతోను, దొంగలతోను ఎక్కడ స్నేహం ఉంటుందో, అక్కడ ప్రేతలు భుజిస్తారు.

**బలిమంత్ర విహీనాని హోమహీనాని యాని చ ।**
**స్వాధ్యాయ వ్రతహీనాని ప్రేతా భుంజంతి తత్ర వై ॥58॥**

నివేదన, మంత్రం ఎక్కడ ఉండవో, హోమాలు ఎక్కడ ఉండవో, స్వాధ్యాయ వ్రతాలు ఎక్కడ ఉండవో, అక్కడ ప్రేతాలు భుజిస్తాయి.

**న లజ్జా న చ మర్యాదా యదాత్ర స్త్రీజితో గృహీ ।**
**గురవో యత్ర పూజ్యా న ప్రేతా భుంజంతి తత్ర వై ॥59॥**

లజ్జ, మర్యాద ఎక్కడ ఉండవో, ఎక్కడ గృహస్థుడు స్త్రీకి వశుడై ఉంటాడో, ఎక్కడ గురువులు పూజింపబడరో, ప్రేతలు అక్కడ భుజిస్తారు.

**యత్ర లోభస్తథా క్రోధో నిద్రా శోకో భయం మదః ।**
**ఆలస్యం కలహో నిత్యం ప్రేతా భుంజంతి తత్ర వై ॥60॥**

ఎక్కడయితే లోభం, క్రోధం, నిద్ర, శోకం, భయం, మదం, ఆలస్యం, నిత్య కలహం ఉంటాయో, అక్కడ ప్రేతలు భుజిస్తారు.

**భర్తృహీనా చ యా నారీ పరవీర్యం నిషేవతే ।**
**బీజం మూత్రసమాయుక్తం ప్రేతా భుంజంతి తత్తు వై ॥61॥**

భర్తలేని స్త్రీ పరుల వీర్యాన్ని ఎక్కడ సేవిస్తుందో, మూత్రంతో కూడుకొన్న బీజం ఎక్కడ ఉంటుందో, అక్కడ దానిని ప్రేతలు భుజిస్తారు.

**లజ్జా మే జాయతే తాత వదతో భోజనం స్వకమ్ ।**
**యత్ స్త్రీరజో యోనిగతం ప్రేతా భుంజంతి తత్తు వై ॥62॥**

అయ్యా! మా భోజనం గురించి చెప్పడానికి మాకే సిగ్గువేస్తుంది. స్త్రీ యోనిగతమైన రజస్సును ప్రేతలు భుజిస్తారు.

**నిర్విణ్ణాః ప్రేతభావేన పృచ్ఛామి త్వాం దృఢవ్రత ।**
**యథా న భవతా ప్రేతస్తన్మే వద తపోధన ॥63॥**

**నిత్యం మృత్యుర్వరం జంతోః ప్రేతత్వం మా భవేత్ క్వచిత్ ।**

దృఢవ్రతా! మేము ప్రేతభావంతో దుఃఖం పొందాము, నిన్ను అడుగుతున్నాం తపోధనా! ప్రేత కాకుండా ఉండాలంటే ఎలా ఉండాలి? దానిని నాకు చెప్పు. ప్రాణులకు నిత్యం మృత్యువు కోరదగినదే, కాని ప్రేతత్వం ఎలా లేకుండా ఉంటుంది?

**బ్రాహ్మణ ఉవాచ** – బ్రాహ్మణుడు వచించాడు.

**ఉపవాసపరో నిత్యం కృచ్ఛ్ర చాంద్రాయణే రతః ।**
**వ్రతైశ్చ వివిధైః పూతో న ప్రేతో జాయతే నరః ॥64॥**

నిత్యం ఉపవాసపరుడై ఉండాలి. కృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతాలయందు ఆసక్తుడై ఉండాలి. నానావిధ వ్రతాలతో పవిత్రుడై ఉండాలి. అటువంటి నరుడు ప్రేతగా జన్మించడు.

**ఏకాదశ్యాం వ్రతం కుర్వఞ్జాగరేణ సమన్వితమ్ ।**
**అపరైః సుకృతైః పూతో న ప్రేతో జాయతే నరః ॥65॥**

జాగరముతో కూడుకొని ఏకాదశీవ్రతాన్ని ఆచరించాలి. అలాగే తక్కిన పుణ్యకర్మలతో పవిత్రుడు కావాలి, అటువంటి నరుడు ప్రేతగా జన్మించడు.

**ఇష్ట్వా వై వాశ్వమేధాదీన్ దద్యాద్దానాని యో నరః ।**
**ఆరామోద్యానవాప్యాదేః ప్రపాయాశ్చైవ కారకః ॥66॥**

**కుమారీం బ్రాహ్మణానాం తు వివాహయతి శక్తితః ।**
**విద్యాదో ఽభయదశ్చైవ న ప్రేతో జాయతే నరః ॥67॥**

అశ్వమేధాది యజ్ఞాలు ఎవడు చేస్తాడో, ఏ నరుడు నానావిధ దానాలు చేస్తాడో, ఆరామాలు, ఉద్యానవనాలు, వాపి (దిగుడు బావులు), చలిపందిరులు మున్నగువాటిని ఎవడు నిర్మిస్తాడో, బ్రాహ్మణుల కన్యకు శక్తికి తగినట్లుగా వివాహం ఎవడు జరిపిస్తాడో, విద్యాదానం, అభయప్రదానం ఎవడు చేస్తాడో, ఆ నరుడు ప్రేతగా జన్మించడు.

**శూద్రాన్నేన తు భుక్తేన జఠరస్థేన యో మృతః ।**
**దుర్మృత్యునా మృతో యశ్చ స ప్రేతో జాయతే నరః ॥68॥**

శూద్రాన్నం తిని అది జీర్ణం కాకముందే మరణించినవాడు, అపమృత్యువు వాతపడేవాడు ప్రేత జన్మను పొందుతాడు.

**అయాజ్యయాజకశ్చైవ యాజ్యానాం చ వివర్జకః ।**
**కారుభిశ్చరతో నిత్యం స ప్రేతో జాయతే నరః ॥69॥**

యజనార్హత లేనివారిచే యజనం చేయించేవాడు, యజనార్హత ఉన్నవారిని విడిచిపెట్టేవాడు, నిత్యం కుత్సితులతో సంచరించేవాడు ప్రేతగా జన్మిస్తాడు.

**కృత్వా మద్యప సంపర్కం మద్యపస్త్రీనిషేవణమ్ ।**
**అజ్ఞానాద్భక్షయన్మాంసం స ప్రేతో జాయతే నరః ॥70॥**

సురాపానం చేసేవారితో సాంగత్యం(మద్యపానం చేసేవాడు), మద్యపానం చేసే స్త్రీలను సేవించడం, అజ్ఞానంవల్ల మాంసాన్ని భక్షించడం-ఇవిచేసే ఆ నరుడు ప్రేతయై పుడతాడు.

**దేవద్రవ్యం చ బ్రహ్మస్వం గురుద్రవ్యం తథైవ చ ।**
**కన్యాం దదాతి శుల్కేన స ప్రేతో జాయతే నరః ॥ 71॥**

దైవద్రవ్యం, బ్రహ్మద్రవ్యం, గురుద్రవ్యం అపహరించేవాడు, శుల్కం పుచ్చుకొని కన్యను దానం చేసేవాడు ప్రేతయై జన్మిస్తాడు.

**మాతరం భగినీం భార్యాం స్నుషాం దుహితరం తథా ।**
**అదృష్టదోషాం స్త్యజతి స ప్రేతో జాయతే నరః ॥72॥**

తల్లిని, సోదరిని, భార్యను, కోడలిని, కుమార్తెను, ఏదోషంలేనివారిని విడిచిపెట్టినవాడు ప్రేతయై జన్మిస్తాడు.

**న్యాసాపహర్తా మిత్రధ్రుక్ పరదారరతః సదా ।**
**విశ్వాసఘాతీ కూటశ్చ స ప్రేతో జాయతే నరః ॥73॥**

న్యాసాన్ని (ఇతరులు దాచమని ఇచ్చిన వస్తువు న్యాసం) అపహరించేవాడు, మిత్రద్రోహి, పరదారాసక్తుడు, విశ్వాసఘాతకుడు, కపటుడు ప్రేతయై జన్మిస్తాడు.

**భ్రాతృధ్రుక్ బ్రహ్మహా గోఘ్నః సురాపో గురుతల్పగః ।**
**కులమార్గం పరిత్యజ్య హ్యనృతోక్తా సదా రతః ॥**
**హర్తా హేమ్నశ్చ భూమేశ్చ స ప్రేతో జాయతే నరః ॥74॥**

భ్రాతృద్రోహి, బ్రహ్మఘాతకుడు, గోహంతకుడు, సురాపానం చేసేవాడు, గురుతల్పగుడు, కులమార్గాన్ని పరిత్యజించినవాడు, ఎల్లప్పుడు అసత్యభాషణమందు ఆసక్తి కలిగినవాడు, బంగారాన్ని, భూమిని అపహరించేవాడు ప్రేతయై జన్మిస్తాడు.

**భీష్మ ఉవాచ** – భీష్ముడు వచించాడు.

**ఏవం బ్రువతి వై విప్రే ఆకాశే దుందుభిస్వనః ।**
**అపతత్పుష్పవర్షం చ దేవైర్ముక్తం ద్విజోపరి ॥75॥**

ఈ విధంగా విప్రుడు పల్కుచుండగా, ఆకాశంలో దుందుభిధ్వని ఏర్పడింది. ఆ బ్రాహ్మణునిపై దేవతలు కురిపించిన పుష్పవర్షం పడింది.

**పంచదేవ విమానాని ప్రేతానామాగతాని వై ।**
**స్వర్గం గతా విమానైస్తే దివ్యైః సంపృచ్ఛ్య తం మునిమ్ ॥76॥**

**జ్ఞానం విప్రస్య సంభాషాత్పుణ్య సంకీర్తనేన చ ।**
**ప్రేతాః పాపవినిర్ముక్తాః పరం పదమవాప్నుయుః ॥77॥**

ఆ ప్రేతలనిమిత్తం అయిదు దేవ విమానాలు వచ్చాయి. ఆ మునిని సెలవడిగి(సంభాషించి) వారు ఆ దేవ విమానాలు అధిరోహించి స్వర్గానికి చేరుకొన్నారు. విప్రునితో సంభాషించడంవల్ల, పుణ్యశ్రవణసంకీర్తనం వల్ల జ్ఞానం పొంది, ప్రేతలు పాపాలనుండి విముక్తి పొంది, ఉత్తమమైన స్థానాన్ని పొందారు.

**సూత ఉవాచ** – సూతుడు వచించాడు.

**ఇదమాఖ్యానకం శ్రుత్వా కంపితోఽశ్వత్థపత్రవత్ ।**
**మానుషాణాం హితార్థాయ గరుడః పృష్టవాన్ పునః ॥78॥**

ఈ ఆఖ్యానాన్ని విని రావియాకువలె కదలిపోయి, మనుష్యుల మేలుకోసమై గరుడుడు మళ్లీ ఇలా ప్రశ్నించాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) భీష్మయుధిష్ఠిర సంవాదే ప్రేతత్వోత్పత్తి తన్ముక్తి పంచప్రేతోపాఖ్యాన నిరూపణం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో భీష్మయుధిష్ఠిర సంవాదంలో ప్రేతత్వోత్పత్తి తన్ముక్తి అనే ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

## ప్రేతచిహ్న నిదర్శనాదికమ్ - ప్రేతచిహ్నాలు నివారణోపాయాలు

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కిం కిం కుర్వంతి వై ప్రేతాః పిశాచత్వే వ్యవస్థితాః ।**
**వదంతి వా కదాచిత్కిం తద్వదస్వ సురేశ్వర ॥1॥**

సురేశ్వరా! పిశాచత్వాన్ని పొందిన ప్రేతలు ఏమేమి చేస్తారు? ఎప్పుడైనా వారు ఏమి మాట్లాడతారు? దానిని నాకు చెప్పు.

**శ్రీభగవానువాచ** - శ్రీభగవంతుడు పచించాడు.

**తేషాం స్వరూపం వక్ష్యామి చిహ్నం స్వప్నం యథాతథమ్ ।**
**క్షుత్పిపాసార్దితాస్తే వై ప్రవిశేయుః స్వవేశ్మని ॥2॥**

వారి స్వరూపాన్ని, ఆయా చిహ్నాలను, కలల విధానాన్ని యథాతథంగా చెప్తాను. ఆకలి దప్పికలతో పీడింపబడిన ఆ ప్రేతలు తమ ఇండ్లలోనే ప్రవేశిస్తారు.

**ప్రతిష్ఠా వాయుదేహేషు శయానాంస్తు స్వవంశజాన్ ।**
**తత్ర యచ్ఛన్తి లింగాని దర్శయంతి ఖగేశ్వర ॥3॥**

ఖగేశ్వరా! గాలిరూపంలో ఉన్నవారు పరుండి తన వంశస్థులు పరుండే శయ్యలను అపభ్రంశం చేస్తారు. అక్కడ మిక్కిలి అసహ్యకరమైన చెత్తపనులను కనిపించేలా చేస్తారు.

**స్వపుత్ర స్వకలత్రాణి స్వబంధుం తత్ర గచ్ఛతి ।**
**హయో గజో వృషో మర్త్యో దృశ్యతే వికృతాననః ॥4॥**

తమపుత్రులు, భార్యల, బంధువుల కలలో భయాన్ని కలిగించే అశ్వాలుగా, ఏనుగులుగా, ఎద్దులుగా, వికృతవదనులైన మనుష్యులుగా కనిపిస్తారు.

**శయానం విపరీతం తు ఆత్మానం చ విపర్యయమ్ ।**
**ఉత్థితః పశ్యతి యస్తు తద్వింద్యాత్ ప్రేతనిర్మితమ్ ॥5॥**

తన శయ్య పాడైపోయినా, తాను వికృతంగా కనబడుతున్నా, తటాలున లేచి ఏదో చూస్తూ ఉన్నా, అది ప్రేతచే జరుపబడినట్లుగా తెలియాలి.

**స్వప్నే నరో హి నిగడైర్బధ్యతే బహుధా యది ।**
**అన్నం చ యాచతే స్వప్నే కువేషః పూర్వజో మృతః ॥6॥**

**స్వప్నే యో భుజ్యమానస్య గృహీత్వాన్నం పలాయతే ।**
**ఆత్మనస్తు పరోవాపి తృషార్దస్తు జలం పిబేత్ ॥7॥**

**వృషభారోహణం స్వప్నే వృషభైః సహగచ్ఛతి ।**
**ఉత్పత్య గగనం యాతి తీర్థే యాతి క్షుధాతురః ॥8॥**

**స్వవాచా వదతే యస్తు గోవృషద్విజవాజిషు ।**
**లింగే గజే తథా దేవే భూతే ప్రేతే నిశాచరే ॥9॥**

స్వప్నంలో నరుడు తాను సంకెళ్లతో బహు విధాలుగా బంధింపబడినట్లు కనబడినా, కలలో అన్నం యాచిస్తున్నట్లు, చెడ్డరూపంలో ఉన్నట్లు, తన పూర్వజుడు మృతిచెందినట్లు కనబడినా, కలలో తాను భుజిస్తున్నప్పుడు ఎవడో ఆ అన్నాన్ని లాగుకొని పారిపోతున్నట్లు, తనకైనా ఇతరునకైనా దాహంతో గొంతెండిపోయి నీరు తాగుతూ ఉండగా పారిపోతున్నట్లు కనబడినా, కలలో ఎద్దు నెక్కి తిరుగుతున్నట్లు, ఎద్దులతో కలసి ఎక్కడికో వెళుతున్నట్లు, ఒక్కసారిగా పైకిలేచి ఆకాశంతో ఎగురుతున్నట్లు, ఆకలితో అలమటిస్తూ తీర్థంలో తిరుగుతున్నట్లు; ఆవు, ఎద్దు, పక్షి, గుఱ్ఱం మున్నగువాటితో తన గొంతుతోనే మాట్లాడుతున్నట్లు, తనపైనే ఏనుగు, దేవతలు, ప్రేతాలు, భూతాలు, రాక్షసులు మున్నగువారి చిహ్నాలు కనబడుతున్నా (అది ప్రేతదోషమే).

**స్వప్నమధ్యేతు పక్షీంద్ర ప్రేతలింగాన్యనేకధా ।**
**స్వకలత్రం స్వబంధుం వా స్వసుతం స్వపతిం విభుమ్ ॥**
**విద్యమానం మృతం పశ్యేత్ ప్రేతదోషేణ నిశ్చితమ్ ॥10॥**

పక్షీంద్రా! కలల నడుమ ఎన్నోవిధాలుగా ప్రేత చిహ్నాలు గోచరిస్తాయి. తనభార్యను, తన బంధువును, తన కుమారుని, తన ప్రభువైన భర్తను బ్రతికి ఉండగా చనిపోయినవానినిగా చూస్తే, అది ప్రేతదోషంగా నిశ్చయించుకోవాలి.

**యాచతే యః పరం స్వప్నే క్షుత్తృడ్భ్యాం చ పరిప్లుతః ।**
**తీర్థే గత్వా దదేత్పిండాన్ ప్రేతదోషై ర్న సంశయః ॥11॥**

కలలో ఆకలి దప్పికలతో అలమటిస్తూ, పరుని యాచిస్తూ ఉన్నట్లుగా కనిపిస్తే అతడు తీర్థానికి వెళ్లి పిండాలను ఈయాలి. అప్పుడు ప్రేతదోషాలు తొలగిపోతాయి! సంశయం లేదు.(తీర్థాలకు వెళ్లి పిండాలను ఇస్తున్నట్లు కనబడినా అవి ప్రేత దోషాలే)

**నిర్గచ్ఛేద్వా గృహాద్వాపి స్వప్నే పుత్ర స్తథా పశుః ।**
**పితా భ్రాతా కలత్రం చ ప్రేతదోషైస్తు పశ్యతి ॥12॥**

కలలో పుత్రుడు కాని, పశువు కాని, తండ్రి కాని, సోదరుడు కాని, భార్య కాని ఇల్లువదలి బయటకు వెళ్లిపోతున్నట్లు కనబడినా, అక్కడ ప్రేతదోషాలు ఉన్నట్లే సుమా!

**చిహ్నాన్యేతాని పక్షీంద్ర ప్రాయశ్చిత్తం నివేదయేత్ ।**
**కృత్వా స్నానం గృహే తీర్థే శ్రీవృక్షే తర్పణం జలైః ॥13॥**

**కృష్ణధాన్యాని పూజాం చ ప్రదద్యాద్వేదపారగే ।**
**హోమం కుర్యాద్యథాశక్తి సంపూర్ణం వాచయేత్సుధీః ॥14॥**

పక్షీంద్రా ! ఈ ప్రేతచిహ్నాలకు ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలి, ఆ వ్యక్తి ఇంట్లో కాని, తీర్థంలో కాని స్నానంచేసి మారేడుచెట్టు మొదట్లో జలతర్పణం చేయాలి. వేదపారగుని పూజించి నల్లధాన్యాలు దానం ఈయాలి, యథాశక్తి హోమం చేయాలి. పండితుడు గరుడపురాణం పూర్తిగా చదవాలి.

**ఏతద్ధి శ్రద్ధయా యస్తు ప్రేతలింగ నిదర్శనమ్ ।**
**పఠతే శ్రుణుతే వాపి ప్రేతచిహ్నం వినశ్యతి ॥15॥**

ఈ ప్రేతలింగ నిదర్శనాధ్యాయాన్ని శ్రద్ధతో చదివినా, విన్నా, ప్రేతచిహ్నం నశించిపోతోంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ప్రేతకృతి తదుక్తి తచ్చిహ్న తద్విముక్త్యుపాయ నిరూపణం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండో అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రేతచిహ్నాలు నివారణోపాయాలు అనే ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్వింశోఽధ్యాయః - ఇరవై నాల్గవ అధ్యాయం

## అకాలమరణకారణం బాలానామ్ అన్త్యేష్టి - అకాలమరణకారణం బాలుర అంత్యేష్టి

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**నాకాలే మ్రియతే కశ్చిదితి వేదానుశాసనమ్ ।**
**కస్మాన్మృత్యు మవాప్నోతి రాజా వా శ్రోత్రియోఽపి వా ॥1॥**

**యదుక్తం బ్రహ్మణా పూర్వమనృతం తద్ధి దృశ్యతే ।**
**వేదైరుక్తం తు యద్వాక్యం శతం జీవతి మానుషే ॥2॥**

అకాలంలో ఎవడూ మరణించడని వేదంయొక్క అనుశాసనం కదా! రాజయినా, శ్రోత్రియుడయినా ఏ కారణంచే అకాలమృత్యువును పొందుతున్నాడు? మనుష్యుడు నూరేండ్లు జీవిస్తాడనే వాక్యం వేదాలచే చెప్పబడింది కదా! పూర్వం బ్రహ్మకూడ అట్లే వక్కాణించాడు కదా! అది అసత్యంవలె కనబడుతోంది.

**జీవంతి మానుషే లోకే సర్వే వర్ణా ద్విజాతయః ।**
**అంత్యజా మ్లేచ్ఛజాశ్చైవ ఖండే భారతసంజ్ఞకే ॥3॥**

భారతమనే పేరుగలఖండంలో, మనుష్యలోకంలో, ద్విజాతులు మున్నగు సర్వవర్ణాలవారు, అంత్యజులు, మ్లేచ్ఛజాతులలో పుట్టినవారు కూడ జీవిస్తున్నారు.

**న దృశ్యతే కలౌ తచ్చ కస్మాద్దేవ సమాదిశ ।**
**ఆధానాన్మృత్యుమాప్నోతి బాలో వా స్థవిరో యువా ॥4॥**

దేవా! కలియుగంలో అలా కానరావడంలేదు, ఎందువల్ల ఇలా జరుగుతోందో ఆదేశించండి. అన్నింటిని ధరించడంవల్ల (గ్రహించడంవల్ల) బాలుడయినా, యువకుడయినా, ముసలివాడయినా మృత్యువును పొందుతున్నాడు.

**సధనో నిర్ధనో వాపి సుకుమారః సురూపవాన్ ।**
**అవిద్వాంశ్చైవ విద్వాంశ్చ బ్రాహ్మణ స్త్వితరో జనః ॥5॥**

ధనవంతుడైనా, ధనహీనుడైనా, సుకుమారుడు, సుందరరూపుడయినా, విద్వాంసుడైనా, మూఢుడైనా, బ్రాహ్మణుడైనా, ఇతర జనుడయినా,

**తపోరతో యోగశీలో మహాజ్ఞానీ చ యో నరః ।**
**సర్వజ్ఞానరతః శ్రీమాన్ ధర్మాత్మాతులవిక్రమః ॥6॥**

**సర్వమేత దశేషేణ జాయతే వసుధాతలే ।**
**కస్మాన్మృత్యుమవాప్నోతి రాజా వా శ్రోత్రియోఽపి వా ॥7॥**

తపోనిరతుడు, యోగశీలుడు, మహాజ్ఞానియైనా, సమస్త జ్ఞానసంపన్నుడు, శ్రీమంతుడు, ధర్మాత్ముడు, సాటిలేని పరాక్రమం కలవాడయినా, అశేషమైన ఈ సర్వజనం భూతలంలో జన్మిస్తోంది కదా! రాజయినా, శ్రోత్రియుడయినా ఎందువల్ల మృత్యువు పొందుతున్నారు?

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు వచించాడు.

**సాధు సాధు మహాప్రాజ్ఞ యస్త్వం భక్తోఽసి మే ప్రియః ।**
**శ్రూయతాం వచనం గుహ్యం నానాదేశ వినాశనమ్ ॥8॥**

**విధాతృవిహితో మృత్యుః శీఘ్రమాదాయ గచ్ఛతి ।**
**తతో వక్ష్యామి పక్షీంద్ర కాశ్యపేయ మహాద్యుతే ॥9॥**

మహాప్రాజ్ఞా! బాగు బాగు! నీవు నాకు భక్తుడవు, ప్రియుడవు, నానాదేశ వినాశకమైన, పరమగుహ్యమైన, వచనాన్ని విను. విధాతచే ఆజ్ఞాపింపబడి మృత్యువు శీఘ్రంగా వచ్చివేస్తుంది.(లాగుకొని పోతుంది) పక్షీంద్రా! కాశ్యపేయా! మహాద్యుతీ! దానిని చెబుతాను,

**మానుషః శతజీవీతి పురా వేదేన భాషితమ్ ।**
**వికర్మణః ప్రభావేణ శీఘ్రం చాపి వినశ్యతి ॥10॥**

మనుష్యుడు నూరు సంవత్సరాల జీవితం కలవాడని పూర్వం వేదంచే చెప్పబడింది. నిషిద్ధకర్మల ప్రభావంచే అలా కాకుండా ముందుగానే తొందరగా నశించిపోతున్నాడు.

**వేదానభ్యసనేనైవ కులాచారం న సేవతే ।**
**ఆలస్యాత్ కర్మణాం త్యాగో నిషిద్ధేఽప్యాదరః సదా ॥11॥**

**యత్ర తత్ర గృహేఽశ్నాతి పరక్షేత్రరతస్తథా ।**
**ఏతైరన్యైర్మహాదోషైర్జాయతే చాయుషః క్షయః ॥12॥**

వేదాధ్యయనం చేయకపోవడవల్ల, కులాచారాన్ని పాటించక పోవడంవల్ల, అలసత్వంవల్ల శాస్త్రవిహిత కర్మలను విడిచిపెట్టడంచేత, ఎల్లప్పుడూ నిషిద్ధకర్మలయందు ఆదరం ఉంచడంచేత, ఏ ఇల్లు కనబడితే ఆ ఇంట్లో తినడంవల్ల, పరక్షేత్రములందు ఆసక్తుడై ఉండడంవల్ల, ఇటువంటి మిగిలిన మహాదోషాలవల్ల ఆయుష్షు క్షీణమై పోతుంది.

**అశ్రద్ధధానమశుచిం నాస్తికం త్యక్త మంగలమ్ ।**
**పరద్రోహానృతకరం బ్రాహ్మణం యత(మ)మందిరమ్ ॥13॥**

**అరక్షితారం రాజానం నిత్యం ధర్మ వివర్జితమ్ ।**
**క్రూరం వ్యసనినం మూర్ఖం వేదవాద బహిష్కృతమ్ ॥**
**ప్రజాపీడన కర్తారం రాజానం యమశాసనమ్ ॥14॥**

**ప్రాపయంతి వశం మృత్యోస్తతో యాతి చ యాతనామ్ ।**

**స్వకర్మాణి పరిత్యజ్య ముఖ్యవృత్తాని యాని చ ॥15॥**

**పరకర్మరతో నిత్యం యమలోకం స గచ్ఛతి ।**

శ్రద్ధావిహీనుని, అపవిత్రుని, నాస్తికుని, శుభకార్యాలు చేబట్టనివానిని, పరద్రోహిని, అసత్యవాది అయిన బ్రాహ్మణుని యమమందిరానికి ముందే పంపడం జరుగుతుంది. రక్షించని రాజును, నిత్యం ధర్మం విడిచిపెట్టిన వానిని, క్రూరుని, దురభ్యాసపరుని, మూర్ఖుని, వేదాచారాన్ని వదలివేసినవానిని, ప్రజాపీడనం చేసేవానిని, చండశాసనుడైన రాజును, మృత్యువు అధీనంలోనికి ముందే పంపిస్తారు. అక్కడ మిక్కిలి యాతన పొందడం జరుగుతుంది. తనకు విధింపబడిన ధర్మాన్ని, కర్మలను విడిచి ఏ ధనాదాయాధిక ముఖ్యవృత్తులను స్వీకరించి పరధర్మ కర్మాసక్తుడై నిత్యం ఉంటాడో, అతడు ముందే యమలోకం వెడతాడు.

**శూద్రః కరోతి యత్కించిద్ద్విజ శుశ్రూషణం వినా ॥16॥**

**ఉత్తమాధమమధ్యే వా యమలోకే స పచ్యతే ।**

ఏ కొద్దిపాటి ద్విజసంసేవనం చేయకుండా, కేవలం లాభాపేక్షతో ఉత్తమమధ్యమాధమసేవ చేస్తాడో, ఆ శూద్రుడు యమలోకంలో పీడింపబడతాడు.

**స్నానం దానం జపో హోమో స్వాధ్యాయో దేవతార్చనమ్ ॥17॥**

**యస్మిన్దినే న సేవ్యంతే స వృథా దివసో నృణామ్ ।**

స్నానం, దానం, జపం, హోమం, స్వాధ్యాయం, దేవతార్చనం చేయబడనిరోజు నరులకు వ్యర్థమైనదే,

**అనిత్య మధ్రువం దేహమనాధారం రసోద్భవమ్ ॥18॥**

**అన్నోదకమయే దేహే గుణానేతాన్ వదామ్యహమ్ ।**

దేహం అనిత్యమైనది, ఎల్లకాలం ఉండేదికాదు, నిరాధారమైనది. రసంవల్ల పుట్టినటువంటిది. అన్నోదకమయమైన దేహంలో ఏవి మంచి గుణాలో నేను చెబుతాను.

**యత్ప్రాతః సంస్కృతం సాయం నూనమన్నం వినశ్యతి ॥19॥**

**తదీయరస సంపుష్టకాయే కా బత నిత్యతా ।**

ఏ అన్నం అయితే ప్రొద్దుటనే(ఉదయమే) చక్కగా వండబడిందో, అది సాయంకాలానికే తప్పనిసరిగా పాడైపోతుందికదా! మరి ఆ అన్నరసంచే పోషింపబడే శరీరంలో నిత్యత్వం ఎక్కడనుంచి వస్తుంది?

**గతం జ్ఞాత్వా తు పక్షీంద్ర వపురర్థం స్వకర్మభిః ॥20॥**

**నరః పాపవినాశాయ కుర్వీత పరమౌషధమ్ ।**

పక్షీంద్రా! కాబట్టి నరుడు జరిగిపోయిందేమిటో తెలుసుకొని, తనశరీరంకోసమై, తన విధ్యుక్త ధర్మాచరణంతోనే పాపాలు పోగొట్టుకోవడానికై, దివ్యౌషధాన్ని సంపాదించుకోవాలి.

**దేహః కిమన్నదాతుః స్విన్నిషేక్తుర్మాతు రేవ వా ॥21॥**

**ఉభయోర్వా ప్రభోర్వాపి బలినోగ్నేః శునోஉపి వా (బాలనోగ్నేః) ।**

ఈ శరీరం వీర్యాన్ని ఇచ్చే అన్నదాతకు సంబంధించిందా? లేక వీర్యాన్ని ధరించే తల్లికి సంబంధించిందా? లేదా ఉభయులకు అధికారం ఉందా? లేక బలిష్ఠమై సమర్థమైన తేజస్సుదా? లేక శ్వవృత్తికి సంబంధించినదా?

**కస్తత్ర పరమో యజ్ఞః కృమివిడ్భస్మ సంజ్ఞకే ॥22॥**

**కర్తవ్యః పరమో యత్నః పాతకస్య వినాశనే ।**
**అనేకభవ సంభూతం పాతకం తు త్రిధాకృతమ్ ॥23॥**

కృమివిడ్భస్మ సంయుతమైన శరీరవిషయంలో, శాస్త్రవిధానంచే పరమయజ్ఞాన్ని ఎవడు చేస్తాడు? అందువల్ల పాతకనాశనంకోసం మాత్రమే పరమప్రయత్నం చేయాలి. అనేక జన్మలనుండి సంప్రాప్తమైన పాతకం కూడ మూడు విధాలుగా ఉంటుంది.

**యదా ప్రాప్నోతి మానుష్యం తదా సర్వం తపత్యపి ।**
**సర్వజన్మాని సంస్మృత్య విషాదీకృతచేతనః ॥24॥**

ఎప్పుడయితే మనుష్యత్వం వచ్చిందో, అప్పుడు అంతటా తపిస్తూ, తన పూర్వజన్మలను సంస్మరించి విషాదానికి లోనవుతాడు.

**అవేక్ష్య గర్భవాసాంశ్చ కర్మజా గతయస్తథా ।**
**మానుషోదరవాసీ చేత్తదా భవతి పాతకీ ॥25॥**

గర్భవాస దుఃఖితులను చూస్తూకూడ, కర్మలవల్ల వచ్చే గతులు తెలిసికూడ, మనుష్యోదరవాసం చేయాలనుకొంటే, అప్పుడు పాతకుడు అవుతాడు.

**అండజాదిషు భూతేషు యత్ర యత్ర ప్రసర్పతి ।**
**ఆధయో వ్యాధయః క్లేశా జరారూప విపర్యయః ॥26॥**

పక్షులు మున్నగు ప్రాణులయందు, ఎక్కడెక్కడ తిరుగుతున్నప్పటికి ఆధులు, వ్యాధులు, క్లేశాలు, ముసలితనం, రూపవ్యత్యాసం ఉండనే ఉంటాయి.

**గర్భవాసాద్వినిర్ముక్త స్త్వజ్ఞానతిమిరావృతః ।**
**న జానాతి ఖగశ్రేష్ఠ బాలభావం సమాశ్రితః ॥27॥**

ఖగోత్తమా! గర్భవాసంనుండి బయటపడినా, అజ్ఞానమనే చీకటి మళ్లీ వ్యాపించగా, బాలభావాన్ని పొందినవాడై ఏమీ తెలియకుండా ఉండిపోతాడు.

**యౌవనే తిమిరాంధశ్చ యః పశ్యతి స ముక్తిభాక్ ।**
**ఆధానాన్మృత్యుమాప్నోతి బాలో వా స్థవిరో యువా ॥28॥**

యౌవనంలో అజ్ఞానంతో గ్రుడ్డివాడయిపోతాడు...ఈ విషయాన్ని జ్ఞానంతో ఎవడు చూస్తాడో, అతడు ముక్తి పొందుతాడు. బాలుడయినా, యువకుడయినా, ముసలివాడయినా, అన్నింటిని గ్రహించి వాటిచే కప్పబడి మృత్యువు పొందుతాడు.

**సధనో నిర్ధనశ్చైవ సుకుమారః కురూపవాన్ ।**
**అవిద్వాంశ్చైవ విద్వాంశ్చ బ్రాహ్మణ స్త్వితరో జనః ॥29॥**

**తపోరతో యోగశీలో మహాజ్ఞానీ చ యో నరః ।**
**మహాదానరతః శ్రీమాన్ ధర్మాత్మాతులవిక్రమః ॥**
**వినా మానుష దేహం తు సుఖం దుఃఖం న విందతి ॥30॥**

ధనవంతుడైనా, నిర్ధనుడైనా, సుకుమారుడైనా, కురూపుడయినా, విద్వాంసుడయినా, పామరుడైనా, బ్రాహ్మణుడయినా, తదితరుడయినా, తపోనిరతుడు, యోగశీలుడు, మహాజ్ఞాని, మహాదానాసక్తుడు, శ్రీమంతుడు, ధర్మాత్ముడు, అతులవిక్రముడు అయినా ఆ నరుడు మానుషదేహం ధరించకపోతే సుఖంకాని, దుఃఖంకాని పొందలేడు.

**ప్రాకృతైః కర్మపాశైస్తు మృత్యుమాప్నోతి మానవః ।**
**ఆధానాత్పంచవర్షాణి స్వల్పపాపై ర్విపచ్యతే ॥31॥**

ప్రకృతికి సంబంధించిన కర్మపాశాలవల్ల మానవుడు మృత్యువును పొందుతున్నాడు. ఐదు వత్సరాలు అయ్యేటప్పటికి కొద్ది పాపాలకు కారకుడవుతున్నాడు.

**పంచవర్షాధికో భూత్వా మహాపాపై ర్విపచ్యతే ।**
**యోనిం పూరయతే యస్మాన్మృతోఽప్యాయాతి యాతి చ ॥32॥**

**మృతో దానప్రభావేణ జీవన్మర్త్యశ్చిరం భువి ।**

అయిదు సంవత్సరాలు దాటినవాడయితే మహాపాపాలు మూటగట్టుకొంటాడు. జన్మను ధరిస్తే చావుతప్పదు, మృతుడు ఇలా వస్తూ పోతూ ఉంటాడు. దానప్రభావంచే భూమియందు మర్త్యుడు ఎక్కువ కాలం జీవిస్తాడు.

**సూత ఉవాచ** – సూతుడు వచించాడు.

**ఇతి కృష్ణవచః శ్రుత్వా గరుడో వాక్యమబ్రవీత్ ॥33॥**

ఇట్లు పల్కిన కృష్ణవచనాలను విని గరుడుడు ఇలా అన్నాడు.

**గరుడ ఉవాచ** – గరుడుడు పలికాడు.

**మృతే బాలే కథం కుర్యాత్ పిండదానాదికాః క్రియాః ।**
**గర్భేషు చ విపన్నానామాచూడాకరణాచ్ఛిశోః ॥34॥**

**కథం కిం కేన దాతవ్యం మృతాంతే కో విధిః స్మృతః ।**
**గరుడోక్తమితిశ్రుత్వా విష్ణుర్వాక్యమథాబ్రవీత్ ॥35॥**

"చనిపోయిన పిల్లవానిని ఉద్దేశించి పిండదానాదిక క్రియలు ఏవిధంగా చేయాలి? గర్భంలోనే మరణించిన శిశువుకు, చూడాకర్మకు ముందు(పుట్టు వెంట్రుకలు) మరణించిన శిశువుకు ఎవరు? ఏమి? ఏలా? ఈయాలి? చనిపోయిన పిమ్మట ఏవిధి చెప్పబడింది?" అని అడిగిన గరుడుని వాక్యం విని విష్ణువు ఇలా వచించాడు.

**శ్రీవిష్ణురువాచ** – శ్రీవిష్ణువు పలికాడు.

**యది గర్భో విపద్యేత స్రవతే వాపి యోషితః ।**
**యావన్మాసం స్థితో గర్భస్తావద్దినమశౌచకమ్ ॥36॥**

గర్భంలోనే ఉండి మరణించినా, స్త్రీకి గర్భస్రావమయినా, గర్భం ఎన్నినెలలుంటే అన్నిరోజులు అశౌచం.

**తస్య కించిన్న కర్తవ్య మాత్మనః శ్రేయ ఇచ్ఛతా ।**
**తతో జాతే విపన్నే తు ఆచూడాకరణాచ్ఛిశోః ॥37॥**

**దుగ్ధం భోజ్యం యథాశక్తి బాలానాం చ ప్రదీయతే ।**
**ఆ చూడాత్పంచవర్షే తు దేహదాహో విధీయతే ॥38॥**

తనకుమేలు కోరుకొనేవాడు, అతనికి చేయవలసినది ఏ కొద్దిపాటియులేదు. అటుపిమ్మట పుట్టినవాడు మరణిస్తే, శిశువుకు పుట్టువెంట్రుకలలోపులోనే మృత్యువు వస్తే, యథాశక్తిగా పాలు, ఆహారం పిల్లలను ఉద్దేశించి ఈయాలి. పుట్టు వెంట్రుకలనుండి అయిదు సంవత్సరాల లోపులో మరణిస్తే దేహదహన సంస్కారం విధింపబడింది.

**దుగ్ధం తస్య ప్రదేయం స్యాద్బాలానాం భోజనం శుభమ్ ।**
**పంచవర్షాదికే ప్రేతే స్వజాతి విహితాని చ ॥39॥**

**కుర్యాత్కర్మాణి సర్వాణి చోదకుంభాది పాయసమ్ ।**
**దాతవ్యం తు ఖగశ్రేష్ఠ ఋణసంబంధకస్తు సః ॥40॥**

అతనిని ఉద్దేశించి బాలురకు పాలు, శుభమైన భోజనం అర్పించాలి. అయిదు ఏండ్లు దాటిన తరువాత మరణిస్తే తనజాతికి విధింపబడిన సర్వకర్మలు ఆచరించాలి. ఉదకుంభం, పాయసం కూడా ఈయాలి. ఖగోత్తమా! అతడు అప్పటినుండి ఋణ సంబంధుడై ఉంటాడు.

**జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**కర్తవ్యం పక్షిశార్దూల పునర్దేహ క్షయాయ వై ॥41॥**

పక్షిశార్దూలా! పుట్టినవాడు గిట్టకమానడు, చనిపోయినవాడు తిరిగి జన్మించక తప్పదు, అందువల్ల మళ్లీ దేహక్షయమైన పిమ్మట కర్మ చేయవలసిందే.

**తస్మై యద్రోచతే దేయమదత్త్వా నిర్ధనే కులే ।**
**స్వల్పాయు ర్నిర్ధనో భూత్వా రతిభక్తివివర్జితః ॥42॥**

**పునర్జన్మాప్నుయాన్మర్త్యస్తస్మాద్దేయమృతే శిశోః ।**
**పురాణే గీయతే గాథా సర్వథా ప్రతిభాతి మే ॥43॥**

అతనికి ఏది ఇష్టమో, దానినే ఈయాలి. అలా ఈయకపోతే, నిరుపేదల వంశంలో తక్కువ ఆయుష్షుకలవాడై, ధనహీనుడుగా జన్మించి, రతి, భక్తిలేని వాడవుతాడు. అలా ఆ మర్త్యుడు పునర్జన్మను పొందుతాడు. అందువల్ల ఇష్టమైనదే ఈయాలి. శిశువు విషయంలో మినహాయింపు ఉంది. పురాణాలలో చెప్పబడిన గాథ ఒకటి నాకు ఎల్లప్పుడు ప్రతిభాసిస్తూ ఉంటుంది.

**మిష్టాన్నం భోజనం దేయం దానే శక్తిస్తు దుర్లభా ।**
**భోజ్యే భోజన శక్తిశ్చ రతిశక్తిర్వరస్త్రియః ॥44॥**

**విభవే దానశక్తిశ్చ నాల్పస్య తపసః ఫలమ్ ।**
**దానాద్భోగానవాప్నోతి సౌఖ్యం తీర్థస్య సేవనాత్ ॥**
**సుభాషణాన్మృతో యస్తు స విద్వా న్ధర్మవిత్తమః ॥45॥**

దానం చేయడానికి శక్తి చాలకపోతే మృష్టాన్న భోజనం పెట్టవలసింది. భోజ్యాలను భక్షించుటలో భోజనశక్తి, శ్రేష్ఠురాండ్రైన స్త్రీలలో రతిశక్తి, వైభవంలో దానశక్తి అల్పమైన తపఃఫలితంవల్ల వచ్చేవికావు. దానంవల్ల భోగాలు పొందుతాడు, తీర్థసేవనంవల్ల సౌఖ్యం పొందుతాడు. మంచిజ్ఞానం, ధర్మం, చక్కని సంభాషణంలో శ్రేష్ఠుడయినవాడు మరణిస్తే అతడు విద్వాంసుడవుతాడు.

**అదత్తదానాచ్చ భవేద్దరిద్రో దరిద్రభావాచ్చ కరోతి పాపమ్ ।**
**పాపప్రభావాన్నరకం ప్రయాతి పునర్దరిద్రః పునరేవ పాపీ ॥46॥**

దానం ఈయకపోవడంవల్ల దరిద్రుడవుతాడు, దరిద్రభావంవల్ల పాపంచేస్తాడు, పాపప్రభావంవల్ల నరకానికి వెడతాడు, మళ్లీ దరిద్రుడవుతాడు మళ్లీ పాపి అవుతాడు.

**ఇతి శ్రీగారుడే మహా పురాణే ఉత్తరఖండే ద్వితీయాంశే ధర్మకాండే (ప్రేతఖండే) శ్రీకృష్ణగరుడ సంవాదే అల్పయుర్మరణహేతు బాలాంత్యేష్ట్యోర్నిరూపణం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండో అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో అకాలమరణకారణం బాలుర అంత్యేష్టి అనే ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచవింశోऽధ్యాయః - ఇరవై అయిదవ అధ్యాయం

## మృతబాలాంత్యేష్టి వైవిధ్యమ్ - మృతబాలుని విభిన్న అంత్యేష్టి నిర్వహణం

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**అతఃపరం ప్రవక్ష్యామి పురుష స్త్రీ వినిర్ణయమ్ ।**
**జీవన్వాపి మృతోవాపి పంచవర్షాధికోऽపి వా ॥1॥**

**పూర్ణే తు పంచమే వర్షే పుమాంశ్చైవ ప్రతిష్ఠితః ।**
**సర్వేంద్రియాణి జానాతి రూపారూప విపర్యయౌ ॥2॥**

పురుష స్త్రీ (లింగ) నిర్ణయాన్నిగురించి ఇక మీదట చెబుతున్నాను. జీవించిఉన్నా, మరణించినా, అయిదేండ్లకన్న ఎక్కువవాడయితే, అయిదోఏడు పూర్తిఅయ్యేసరికి పురుషత్వం ఆ జీవునిలో ప్రతిష్ఠితమవుతుంది. సర్వేంద్రియాలను, రూపారూప వ్యత్యాసాలను తెలుసుకోవచ్చు.

**పూర్వకర్మ విపాకేన ప్రాణినాం వధబంధనమ్ ।**
**విప్రాదీనంత్యజాన్ సర్వాన్ పాపం మారయతి ధ్రువమ్ ॥3॥**

పూర్వకర్మపరిపాకంవల్ల ప్రాణులకు మృత్యుబంధ మేర్పడుతుంది. విప్రాదులను, అంత్యజులను, అందరినీ నిశ్చయంగా వారు చేసిన పాపమే చంపివేస్తుంది.

**గర్భే నష్టే క్రియా నాస్తి దుగ్ధం దేయం మృతే శిశౌ ।**
**పరం చ పాయసం క్షీరం దద్యాద్బాలవిపత్తితః ॥4॥**

గర్భంలో ఉండగానే మరణిస్తే కర్మవిధి ఏదీ ఉండదు. శిశువుగా మరణిస్తే, పాలు ఈయాలి. బాలుడుగా ఉండే వేళలో విపత్తి సంభవిస్తే ఉత్కృష్టమైన పాయసం, క్షీరం ఈయాలి.

**ఏకాదశాహం ద్వాదశాహం వృషం వృషవిధిం వినా ।**
**మహాదాన విహీనం చ కుమారే కృత్యమాదిశేత్ ॥5॥**

ఏకాదశాహ, ద్వాదశాహ, వృష, వృషోత్సర్గవిధుల అవసరంలేదు. మహాదానాలు ఈయనక్కరలేదు, కుమారునిగా ఉండే వయస్సులో మరణిస్తే తక్కిన కర్మ ఆచరించాలి.

**కుమారాణాం చైవ బాలానాం భోజనం వస్త్రవేష్టనమ్ ।**
**బాలే వా తరుణే వృద్ధే ఘటో భవతి వై మృతే ॥6॥**

కుమారులకు, బాలురకు, భోజనం, వస్త్రవేష్టనం తప్పనిసరి. బాలుడయినా, యౌవనుడయినా, వృద్ధుడయినా మరణిస్తే ఘటక్రియ చేయాలి.

**భూమౌ వినిఃక్షిపేద్బాలం ద్విమాసోనం ద్వివార్షికమ్ ।**
**తతః పరం ఖగశ్రేష్ఠ దేహదాహో విధీయతే ॥7॥**

బాలుని, ఇరవైరెండు నెలలలోపు వయస్సు వానిని భూమిలో కప్పిపెట్టాలి. ఖగోత్తమా! ఆ పైవానికి మరణించిన పిమ్మట దహనసంస్కారం విధింపబడింది.

**శిశురాదంత జననాద్బాలః స్యాద్యావదాశిఖమ్ ।**
**కథ్యతే సర్వశాస్త్రేషు కుమారో మౌంజిబంధనాత్ ॥8॥**

దంతాలు వచ్చేవరకు శిశువని, శిఖావర్తన పర్యంతం బాలుడని, మౌంజిబంధన పర్యంతం కుమారుడని సర్వశాస్త్రాలలోను చెప్పబడింది.

**శూద్రాదీనాం కథం కుర్యాత్ సంశయో మౌంజివర్జనాత్ ।**
**గర్భాచ్చ నవమం హిత్వా శిశురామాసషోడశమ్ ॥9॥**

**బాలశ్చాథ పరంజ్ఞేయ ఆమాస సప్తవింశతి ।**
**ఆపంచవర్షాత్కౌమారః పౌగండో నవహాయనః ॥10॥**

మౌంజిని విడిచిపెట్టుట అనటం చేత శూద్రాదులకు ఎలా చేయాలనే సంశయం కలుగుతుంది, గర్భం వచ్చినప్పటినుండి తొమ్మిది నెలలు వదలి, పదునారో నెలవరకు శిశువని, ఇరవైఏడోనెల వరకు బాలుడని, నిశ్చయించి తెలుసుకోవాలి. ఐదుసంవత్సరాల వరకు కౌమారమని, తొమ్మిదేండ్లవరకు పౌగండమని తెలుసుకోవాలి.

**కిశోరః షోడశాబ్దః స్యాత్తతో యౌవనమాదిశేత్ ।**
**మృతోఽపి పంచమే వర్షే అవృతః సంవృతోఽపి వా ॥11॥**

**పూర్వోక్తమేవ కర్తవ్యమీహతే దశపిండకమ్ ।**
**స్వల్పకర్మ ప్రసంగాచ్చ స్వల్పాద్విషయబంధనాత్ ॥12॥**

**స్వల్పాద్వపుషి వస్త్రాచ్చ క్రియాం స్వల్పమపీచ్ఛతి ।**
**యావదుపచయో జంతుర్యావద్విషయవేష్టితః ॥13॥**

పదునారు వత్సరాలవాడు కిశోరుడని, ఆ తరువాత యౌవనం ప్రవేశిస్తుందని గ్రహించాలి. అయిదో సంవత్సరంలో మరణిస్తే వస్త్రవేష్టితుడయినా, కాకపోయినా, పూర్వంలో చెప్పబడినట్లుగానే చేయాలి. దశపిండ విధానవిధి కూడ చెప్పబడింది. తక్కువగా ఉండే కర్మప్రసంగంవల్ల, స్వల్పంగా ఉండే విషయబంధనాలవల్ల, శరీరంలో స్వల్పవస్త్రధారణవల్ల, క్రియ కూడ స్వల్పంగానే చెప్పబడింది. ప్రాణి పెద్దవాడవుతున్నకొలది, విషయాలన్నింటితోను చుట్టుకోబడతాడు.

**యద్యద్యస్యోపజీవ్యం స్యాత్తత్తద్దేయ మిహేచ్ఛతి ।**
**బ్రహ్మబీజోద్భవాః పుత్రా దేవర్షీణాం చ వల్లభాః ॥14॥**

**యమేన యమదూతైశ్చ శాస్యంతే నిశ్చితం ఖగ ।**
**బాలో వృద్ధో యువా వాపి ఘటమిచ్ఛన్తి దేహినః ॥15॥**

ఎవనికి ఏది ఏది జీవనోపాధి అవుతుందో, ఇక్కడ అతనికి అదే ఈయాలని చెప్పబడింది. ఖగమా! బ్రహ్మబీజం వల్ల ఉద్భవించిన పుత్రులును దేవర్షులకు ప్రియంచేకూర్చేవారును అందరూ యమునిచేత, యమదూతలచేత నిశ్చయంగా శాసింపబడేవారే, బాలుడైనా, యువకుడయినా, వృద్ధుడయినా సర్వప్రాణులు ఘటాన్ని కోరుకొంటారు.

**సుఖం దుఃఖం సదా వేత్తి దేహీ వై సర్వగస్త్విహ ।**
**పరిత్యజ్య తదాత్మానం జీర్ణాం త్వచమివోరగః ॥16॥**

పాము కుబుసాన్ని విడిచిపెట్టినట్లుగా, అంతటా వ్యాపించిఉండే ఆత్మ తన శరీరాన్ని విడిచిపెడుతుంది. ఆత్మ ఎల్లప్పుడూ సుఖాన్ని, దుఃఖాన్ని గ్రహించగలుగుతుంది.(దేహీ – జీవాత్మ)

**అంగుష్ఠమాత్రః పురుషో వాయుభూతః క్షుధాన్వితః ।**
**తస్మాద్దేయాని దానాని మృతేబాలే సునిశ్చితమ్ ॥17॥**

అంగుష్ఠ పరిమాణం గల్గిన పురుషుడు వాయురూపుడై ఆకలితో నకనకలాడుతాడు, అందువల్ల బాలుడుగా మరణించినా, నిశ్చయంగా దానాలన్నీ చేయాలి.

**జన్మతః పంచవర్షాణి భుంక్తే దత్తమసంస్కృతమ్ ।**
**పంచవర్షాధికే బాలే విపత్తిర్యది జాయతే ॥18॥**

**వృషోత్సర్గాదికం కర్మ సపిండీకరణం వినా ।**
**ద్వాదశేఽహని సంప్రాప్తే కుర్యాచ్ఛ్రాద్ధాని షోడశ ॥19॥**

పుట్టిననాటినుండి అయిదేండ్లు వచ్చేవరకు సంస్కరింపబడని దానిని కూడ ఇచ్చేదానిని బాలుడు భుజిస్తాడు, బాలునికి అయిదేండ్లు దాటితే, విపత్తు సంభవిస్తే వృషోత్సర్గాది కర్మ, సపిండీకరణవిధి మినహాయించి, పండ్రెండోరోజు రాగానే పదునారు శ్రాద్ధాలు నిర్వహించాలి.

**పాయసేన గుడేనాపి పిండాన్దద్యాత్ యథాక్రమమ్ ।**
**ఉదకుంభ ప్రదానం చ పద(ఉప)దానాని యాని చ ॥20॥**

పాయసంతోకాని, బెల్లంతోకాని పిండాలను ఈయాలి. యథాక్రమంగా ఉదకుంభ ప్రదానం, పదదానాలూ ఈయాలి.

**భోజనాని ద్విజే దద్యాన్మహాదానాది శక్తితః ।**
**దీపదానాది యత్కించిత్ పంచవర్షాధికే సదా ॥21॥**

**కర్తవ్యం చ ఖగశ్రేష్ఠ వ్రతాత్ప్రాక్ ప్రేతతృప్తయే ।**
**యదా న క్రియతే సర్వం ముద్గలత్వంస గచ్ఛతి ॥22॥**

భోజనాలు కూడ పెట్టాలి, ద్విజునకు శక్తిననుసరించి మహాదానాలనుకూడ ఈయాలి. పంచ వర్షాలు దాటినవానికి ఎప్పుడూకూడ దీపదానాదులను కొద్దిగానైనా ఈయాలి. ఖగోత్తమా! వ్రతంకన్న ముందుగానే ప్రేతతృప్తికై ఇదంతా చేయవలసియుంది. అలా చేయకపోతే, అతడు పిశాచత్వాన్ని పొందుతాడు.

**వ్రతాత్ ప్రాగేవ దేయం తు తతః పితృగణస్య చ ।**
**స్వాహాకారేణ వై కుర్యాదేకోద్దిష్టాని షోడశ ॥23॥**

ఉపవాసాది రూపమైన వ్రతానికి ముందే ఇవన్నీ ఈయాలి. పిమ్మట పితృగణాలను ఉద్దేశించి స్వాహాకారంతో ఏకోద్దిష్ట షోడశకర్మలు ఆచరించాలి.

**ఋజుదర్భై స్తిలైః శుక్లైః ప్రాచీనావీతి నిశ్చితమ్ ।**
**అపసవ్యం చ కర్తవ్యం కృతే యాంతి పరాం గతిమ్ ॥24॥**

చక్కని దర్భలతోను, తెల్లనువ్వులతోను, నిశ్చయంగా "ప్రాచీనావీతి" విధిలో అపసవ్యంగా ఈ కర్మచేయాలి. అలా చేస్తే వారు పరాగతిని పొందుతారు.

**పునశ్చిరాయుషో భూత్వా జాయతే స్వకులే ధ్రువమ్ ।**
**సర్వసౌఖ్యప్రదః పుత్రః పిత్రోః ప్రీతివివర్ధనః ॥25॥**

పిమ్మట నిశ్చయంగా తనకులంలోనే చిరాయువవుతూ జన్మిస్తాడు. అతడు తల్లిదండ్రులకు ప్రీతిని పెంపొందించువాడై సమస్త సుఖాలను చేకూర్చే పుత్రుడవుతాడు.

**ఆకాశమేకం హి యథా చంద్రాదిత్యౌ యథైకతః ।**
**ఘటాదిషు పృథక్ సర్వం పశ్య రూపం చ తత్సమమ్ ॥26॥**

ఒకే ఆకాశం, ఒకే సూర్యుడు, ఒకే చంద్రుడు నేలపైనుంచిన నీటి కుండలలో వేరు వేరుగా కన్పించినట్లే ఉంటుంది కాని అంతా దానితో సమానరూపంగా చూడు.

**ఆత్మా తథైవ సర్వేషు పుత్రేషు విచరేత్సదా ।**
**యా యస్య ప్రకృతిః పూర్వం శుక్రశోణితసంగమే ॥27॥**

**సా(స)తేన భావయోగేన పుత్రాస్తత్కర్మకారిణః ।**
**పితృరూపం సమాదాయ కస్యచిజ్జాయతే సుతః ॥28॥**

అలాగే ఒకే తండ్రియొక్క ఆత్మ ఆయన పుత్రులందరిలోనూ ఎప్పుడూ చరిస్తూ ఉంటుంది. పూర్వం శుక్రశోణిత సంగమమైన శరీరంలో ఎవనికి ఏది స్వభావమై ఉంటుందో, ఆ భావనతో కూడుకొనే పుత్రులు ఆ కర్మానుసారంగా చేస్తూ ఉంటారు. ఒక్కొక్కని కొడుకు తండ్రిరూపాన్ని గ్రహించే పుడతాడు.

**పితృతః కోఽపి రూపాఢ్యో గుణజ్ఞో దానతత్పరః ।**
**సదృశః కోఽపి లోకేఽస్మిన్న భూతో న భవిష్యతి ॥29॥**

**అంధాదంధో న భవతి మూకాన్మూకో న జాయతే ।**
**బధిరాద్బధిరో నైవ విద్యావాన్విదుషో న హి ॥**
**అనురూపా న దృశ్యంతే మదీయం వచనం శృణు ॥30॥**

ఇంకొక్కడు తండ్రికన్న రూపవంతుడు, గుణవంతుడు, దానతత్పరుడు కావచ్చు. ఈ లోకంలో ఇంకొకడు తండ్రితో సమానుడుగా పూర్వంలో లేకపోవచ్చు. భవిష్యత్తులోను ఉండకపోవచ్చు. గ్రుడ్డివానికి గుడ్డివాడు పుట్టడంలేదు, మూగవానికి మూగవాడే జన్మించడంలేదు, చెవిటివానికి చెవిటివాడు ప్రభవించడంలేదు, విద్వాంసునకు విద్వాంసుడే సంభవించడంలేదు అందరు తండ్రిరూపాన్ని అనుసరించే పుట్టడం కన్పించడంలేదు. నా వచనాన్ని విను.

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**ఔరసక్షేత్రజాద్యాశ్చ పుత్రా దశవిధాః స్మృతాః ।**
**సంగృహీతః స తోయస్తు దాసీపుత్రశ్చ తేన కిమ్ ॥31॥**

ఔరస, క్షేత్రజాది పుత్రులు పది రకాలుగా ఉంటారు కదా! వీరిలో సంగృహీత(ఎక్కడనుండో తెచ్చుకొన్న పుత్రుడు)వల్ల, దాసీపుత్రునివల్ల కలిగే ప్రయోజనమేముంటుంది?

**కాం కాం గతి మవాప్నోతి జాతో మృత్యువశం గతః ।**
**భవేన్న దుహితా యస్య న దౌహిత్రో న వా సుతః ॥32॥**

**శ్రాద్ధం తస్యకథం కార్యం విధినా కేన తద్భవేత్ ।**

అలా పుట్టినవాడు మృత్యువుకు వశుడై చనిపోతే ఏ ఏ గతిని పొందుతాడు? ఎవనికయినా కుమార్తె లేకపోయినా, దౌహిత్రుడు(కూతురుకొడుకు)లేకపోయినా, కుమారుడు లేకపోయినా, అతనికి ఏ విధంగా శ్రాద్ధం చేయాలి? ఏ విధానంచే ఆ క్రియ నిర్వహించాలి?

**శ్రీభగవానువాచ** - శ్రీభగవంతుడు పలికాడు.

**ముఖం దృష్ట్వా తు పుత్రస్య ముచ్యతే పైతృకాదృణాత్ ॥33॥**

అప్పుడే పుట్టిన కొడుకు ముఖం చూడగానే పితౄణం నుండి ముక్తి లభిస్తుంది.

**పౌత్రస్య దర్శనాజ్జంతు ర్ముచ్యతే చ ఋణత్రయాత్ ।**
**లోకానంత్యం దివః ప్రాప్తిః పుత్రపౌత్రప్రపౌత్రకైః ॥34॥**

మనుమని ముఖం చూడగానే ప్రాణి ఋణత్రయంనుండి (దేవ,పితృ,ఋషి ఋణాలు) విముక్తుడవుతాడు. పుత్ర, పౌత్ర, ప్రపౌత్రుల ముఖంచూచినవారికి అనంత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది.

**అన్యక్షేత్రోద్భవాద్యా యే భుక్తిమాత్రప్రదాః సుతాః ।**
**కుర్వీత పార్వణం శ్రాద్ధమౌరసో విధివత్సుతః ॥35॥**

అన్యక్షేత్రాలలో పుట్టిన కొడుకులు మున్నగువారు తండ్రికి భుక్తి సుఖాన్ని మాత్రమే కలిగించగలుగుతారు. ఔరస పుత్రుడే తండ్రికి విధ్యుక్తంగా పార్వణశ్రాద్ధం పెట్టాలి.

**కుర్వంత్యన్యే సుతాః శ్రాద్ధమేకోద్దిష్టం న పార్వణమ్ ।**
**బ్రాహ్మ్యోఢాజస్తూన్నయతి సంగృహీతస్త్వధో నయేత్ ॥**
**శ్రాద్ధం సాంవత్సరం కుర్వఞ్జాయతే నరకాయ వై ॥36॥**

మిగిలిన సుతులు ఏకోద్దిష్ట శ్రాద్ధం పెట్టడానికే అధికారులవుతారు. కాని పార్వణానికి కాదు, బ్రాహ్మ వివాహనియమాల ప్రకారం పుట్టిన కొడుకే ఊర్ధ్వలోకాలకు తీసుకొనిపోగలడు. సంగృహీతుడయితే(దాసీ పుత్రుడయినా) అధోలోకాలకు పంపించగలడు. సాంవత్సర శ్రాద్ధం పెట్టినా నరకలోకానికే హేతువవుతుంది.

**సర్వ దానాని దేయాని హ్యన్నదానాదృతే ఖగ ।**
**సంగృహీతః సుతః కుర్యా దేకోద్దిష్టం న పార్వణమ్ ॥37॥**

ఖగమా! అన్నదానం ఒక్కటి వదలిపెట్టి అన్నిదానాలు చేయవచ్చు. సంగృహీత సుతుడు ఏకోద్దిష్ట శ్రాద్ధం చేయాలి. పార్వణశ్రాద్ధం చేయరాదు.

**ప్రత్యబ్దం పితృమాతృభ్యాం శ్రాద్ధం దత్వా న లిప్యతే ।**
**ఏకోద్దిష్టం పరిత్యజ్య పార్వణం కురుతే యది ॥38॥**

**ఆత్మానం చ పితౄంశ్చైవ స నయేద్యమమందిరమ్ ।**
**సంగృహీతస్తు యః కేచిద్దాసీపుత్రాదయశ్చ యే ॥39॥**

ప్రతి సంవత్సరం తండ్రికి, తల్లికి శ్రాద్ధం పెట్టినచో పాపాలు అంటుకోవు. ఏకోద్దిష్టవిధానాన్ని వదలిపెట్టి, పార్వణశ్రాద్ధం నిర్వహిస్తే, తనను, పితరులనుగూడ అతడు యమమందిరానికి పంపించినవాడవుతాడు. సంగృహీత పుత్రుడు ఎవడయితే ఉన్నాడో, అలాగే దాసీ పుత్రాదులు ఎవరయితే ఉన్నారో,

**తీర్థం కుర్యుః పితృశ్రాద్ధం దానం(మాసం) దద్యాద్ద్విజన్మనే ।**
**సంగృహీత సుతో భూత్వా పాకం వా యః ప్రయచ్ఛతి ॥40॥**

పితృశ్రాద్ధాన్ని తీర్థాలలో చేయవచ్చు. తండ్రిపేర బ్రాహ్మణులకు దానమీయవచ్చు. సంగృహీత పుత్రుడయి, వంటవండి ఎవడయితే శ్రాద్ధంచేస్తాడో,

**వృథా శ్రాద్ధం విజానీయా చ్ఛూద్రాన్నే న యథా ద్విజః ।**
**న ప్రీణయతి తచ్ఛ్రాద్ధం పితామహముఖాన్ పితౄన్ ॥**
**ఏవం జ్ఞాత్వా ఖగశ్రేష్ఠ హీనజాతీన్ సుతాం స్త్యజేత్ ॥41॥**

ద్విజుడు శూద్రాన్నంతో పెట్టిన శ్రాద్ధంవలె, ఆ శ్రాద్ధం వ్యర్థమైపోతుందని తెలుసుకోవాలి. ఆ శ్రాద్ధం పితామహుడు మున్నగు పితరులను సంతృప్తిపరచలేదు. ఖగోత్తమా ! ఈ విషయం తెలుసుకొని హీనజాతికి చెందినవారిని సుతులుగా గ్రహించరాదు.

**(బ్రాహ్మణ్యాం బ్రాహ్మణాజ్జాత శ్చాండాలాదధమః స్మృతః)**
**యస్తు ప్రవ్రాజితా జ్జాతో బ్రాహ్మణ్యాం శూద్రతశ్చ యః ॥42॥**

**ద్వావేతౌ విద్ధి చాండాలౌ సగోత్రాద్యస్తు జాయతే ।**
**స్వర్యాతి విహితాన్ పుత్రః సముత్పాద్య ఖగేశ్వర ॥43॥**

**తైః సువృత్తైః సుఖం ప్రాప్యం కువృత్తైర్నరకం వ్రజేత్ ।**
**హీనజాతి సముద్భూతైః సువృత్తైః సుఖమేధతే ॥44॥**

బ్రాహ్మణునిద్వారా కలిగిన చండాలునివల్ల బ్రాహ్మణియందు పుట్టినవాడు అధముడని చెప్పబడతాడు? ఎవడయితే ప్రవ్రాజితునివల్ల, శూద్రునివల్ల బ్రాహ్మణియందు పుడతాడో, వీరిద్దరు చండాలురు(లు)గా తెలుసుకోవాలి. సగోత్రికునివల్ల పుట్టినవాడు కూడ చండాలుడే, ఖగరాజా! కావున పుత్రుడు స్వర్లోకానికి పంపే యోగ్యత కలిగిన వారిని పొందినట్లయితే, అటువంటి చక్కని ప్రవర్తన కలిగిన వారిచే సుఖం పొందింపబడుతుంది. చెడుప్రవర్తన కలిగినవారిచే నరకం వెళ్లవలసివస్తుంది. హీనజాతిలో పుట్టినవారైనా, సత్ప్రవర్తన కలిగినవారయితే సుఖం పెంపొందుతుంది.

**కలికలుషవిముక్తః పూజితః సిద్ధసంఘై రమరచమరమాలా వీజ్యమానోఽప్సరోభిః ।**
**పితృశతమపి బంధూన్ పుత్రపౌత్రప్రపౌత్రా నపి నరకనిమగ్నానుద్ధరేదేక ఏవ ॥45॥**

కలిదోషము నుండి విడివడి, సిద్ధసంఘాలచే పూజింపబడి, అప్సరలచే వేలుపుల వింజామరలచే వీచబడుచున్నవాడై, వందలకొలది పితరులను, బంధువులను, పుత్రపౌత్రప్రపౌత్రులను నరకలోకంలో ఉండిపోయిన వారిని ఉద్ధరించేవాడు ఒక్కడే. (ముఖ్యుడు)

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే మృతబాలాంత్యేష్టి, భిన్నాభిన్నసుతకృతాంత్యేష్ట్యోర్వర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో మృతబాలుని విభిన్న అంత్యేష్టి నిర్వహణం అనే ఇరవై అయిదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశోఽధ్యాయః - ఇరవైఆరవ అధ్యాయం

## సపిండన నిరూపణమ్ - సపిండనవిధానం

**గరుడ ఉవాచ** - గరుడుడు వచించాడు.

**సత్యం బ్రూహి సురశ్రేష్ఠ కృపాం కృత్వా మయి ప్రభో ।**
**మృతానాం చైవ జంతూనాం కదా కుర్యాత్సపిండనమ్ ॥1॥**

ప్రభూ! సురశ్రేష్ఠా! నాయందు దయఉంచి, సత్యాన్ని చెప్పు. చనిపోయిన ప్రాణులకు సపిండీకరణం ఎప్పుడు చేయాలి?

**సపిండత్వే కుతో యాంతి అసపిండే కుతో గతిః ।**
**కేనైవ సహపిండత్వం స్త్రీ పుంసోర్వక్తుమర్హసి ॥2॥**

సపిండీకరణ విధివల్ల ఎక్కడకు వెడతారు? సపిండీకరణ చేయకపోతే గతి ఎక్కడకు? స్త్రీ పురుషులకు ఎవనిచే సహపిండత్వవిధి జరుపబడాలి? దీనిని వివరించడానికి నీవే తగినవాడవు.

**స్త్రీ పుమాంసౌ సహైకత్వం ప్రాప్నుతః కథముత్తమమ్ ।**
**జీవేద్భర్తరి నారీణాం సపిండీకరణం కుతః ॥3॥**

స్త్రీ పురుషులు కలసి ఒకే సమయంలో మృతిపొందితే ఏది ఉత్తమమవుతుంది? భర్త జీవించిఉండగా, చనిపోయిన స్త్రీలకు సపిండీకరణ విధి ఎలా?

**భర్తృలోకం కథం యాంతి స్వర్గలోకం సురేశ్వర ।**
**అగ్న్యారోహే కథం శ్రాద్ధం వృషోత్సర్గః కథం భవేత్ ॥4॥**

సురేశ్వరా! భర్తృలోకం, స్వర్గలోకం ఎలా చేరుకొంటారు? అగ్ని ఆరోహమందు (చితిపై సహగమనంలో) శ్రాద్ధవిధి ఎలా జరపాలి? వృషోత్సర్జనవిధి ఎలా చేయాలి?

**ఘటదానం కథం కార్యం సపిండీకరణే కృతే ।**
**కథయస్వ ప్రసాదేన హితాయ జగతాం ప్రభో ॥5॥**

సపిండీకరణ చేసిన తరువాత ఘటదానం ఎలా చేయాలి? ప్రభూ! లోకాలకు(జనుల)మేలుకోసమై అనుగ్రహించి చెప్పవలసింది.

**శ్రీభగవానువాచ** - శ్రీభగవంతుడు వచించాడు.

**యథావత్కథయిష్యామి సపిండీకరణం ఖగ ।**
**వర్షం యావత్ఖగశ్రేష్ఠ యదాచరతి మానవః ॥6॥**

ఖగమా! సపిండీకరణవిధిని ఉన్నదున్నట్లుగా చెబుతున్నాను. ఖగోత్తమా! మానవుడు సంవత్సరపర్యంతం ఆ విధిని ఆచరించవచ్చు.

**సపిండనే తతో వృత్తే పితృలోకం స గచ్ఛతి ।**
**తస్మాత్పుత్రేణ కర్తవ్యం సపిండీకరణం పితుః ॥7॥**

సపిండీకరణం జరిగిన తరువాతే అతడు పితృలోకం చేరుకొంటాడు. అందువల్ల తప్పనిసరిగా పుత్రుడు తండ్రికి సపిండీకరణం చేయవలసినవిధి.

**సంవత్సరే తు సంపూర్ణే కుర్యాత్ పిండప్రవేశనమ్ ।**
**పిండప్రవేశ విధినా తస్య నిత్యం మృతాహ్నికమ్ ॥8॥**

సంవత్సరం పూర్తి అవుతూ ఉండగా పిండప్రవేశశ్రాద్ధం చేయాలి. పిండప్రవేశవిధి ద్వారా చనిపోయినవానికి నిత్యం మృతాహ్నికవిధి చేయాలి.

**నిశ్చితం పక్షిశార్దూల వర్షాంతే పిండమేలనమ్ ।**
**సహపిండే కృతే ప్రేతస్తతో యాతి పరాం గతిమ్ ॥**
**తన్నామ సంపరిత్యజ్య తతః పితృగణో భవేత్ ॥9॥**

పక్షిశార్దూలా! సంవత్సరాంతంలో పిండసమ్మేలనం నిశ్చయింపబడింది. సపిండీకరణం చేయబడిన తరవాతే ప్రేత పరాగతి పొందుతాడు. అప్పుడు ప్రేత నామాన్ని విడిచిపెట్టి పితృగణంలోనికి చేరినవాడవుతాడు.

**త్రిపక్షేవాపి షణ్మాసే మేలయేత్ప్రపితామహైః ।**
**జ్ఞాత్వా వృద్ధివివాహాది స్వగోత్రవిహితాని చ ॥10॥**

సగోత్రుల ఇండ్లలో జరిగే శుభాభివృద్ధి వివాహాది కార్యాలను ముందుగా తెలుసుకొని, త్రిపక్షంరోజునకాని, ఆరోనెలలలోకాని, ప్రపితామహులతో పిండసమ్మేలనం చేయాలి.

**వివాహం నావకుర్వీత మృతే చ గృహమేధని ।**
**భిక్షుర్భిక్షాం న గృహ్ణాతి యావత్కుర్యాత్సపిండనమ్ ॥11॥**

గృహస్థుని ఇంటిలో ఎవరైనా మృతిచెందితే, అపరకర్మలు ముగిసేవరకు వివాహం ఆ ఇంటిలో చేయరాదు. సపిండీకరణం అయ్యేవరకు భిక్షువు భిక్షాటన(ఆ ఇంటి భిక్షను)చేసి స్వీకరింపరాదు.

**స్వగోత్రేఽ ప్యశుచిస్తావ ద్యావత్పిండం న మేలయేత్ ।**
**మేలనాత్ప్రేత శబ్దస్తు నివర్తేత ఖగేశ్వర ॥12॥**

స్వగోత్రంలో కూడ ఎవడయినా అశుచి పొందినవాడుంటే, పిండమేలనంవరకు అశుచి ఉండిపోతుంది. ఖగరాజా! పిండమేలనంవల్లనే ప్రేతశబ్దంనుండి బయటపడతాడు.

**ఆనంత్యాత్కులధర్మాణాం పుంసాఞ్చైవాయుషః క్షయాత్ ।**
**అస్థిరత్వా చ్ఛరీరస్య ద్వాదశాహః ప్రశస్యతే ॥13॥**

కులధర్మాలకు అంతం అనేది ఉండకపోవడంవల్ల, జీవులయొక్క ఆయుష్షు క్షీణించేదవడంవల్ల, శరీరం శాశ్వతంకానిదవడంవల్ల, పంద్రెండో రోజున సపిండీకరణ చేయడమే ప్రశస్తమై ఉంది.

**నిరగ్నికః సాగ్నికో వా ద్వాదశాహే సపిండయేత్ ॥14॥**

అగ్నిహోత్రి అయినా, కాకపోయినా పంద్రెండో రోజునే సపిండీకరణం చేయాలి.

**ద్వాదశాహే త్రిపక్షే వా షణ్మాసే వత్సరేఽపి వా ।**
**సపిండీకరణం ప్రోక్తమృషిభిస్తత్త్వదర్శిభిః ॥15॥**

పంద్రెడో రోజున కాని, త్రిపక్షంనాడు కాని, ఆరో మాసంలో కాని, సాంవత్సరికం రోజున కాని తత్త్వదర్శనులైన ఋషులచే సపిండీకరణవిధి అంగీకరించబడింది.(చెప్పబడింది)

**సపుత్రస్య న కర్తవ్య మేకోద్దిష్టం కదాచన ।**
**సపిండీకరణాదూర్ధ్వం యత్ర యత్ర ప్రదీయతే ॥16॥**

**తత్ర తత్ర త్రయం కార్యమన్యథా పితృఘాతకః ।**
**త్రిభిః కుర్యాదశక్తశ్చ పార్వణం మునినోదితమ్ ॥17॥**

సపిండీకరణం తరవాత, ఆపైన ఎక్కడెక్కడ ఏమి ఇచ్చినా, సపుత్రకుడైనవానికి ఎప్పుడూకూడ ఏకోద్దిష్ట విధానంద్వారా చేయరాదు. ఆయా సందర్భాలలో మూడింటిని కూడ చేయాలి. మరోవిధంగా చేస్తే పితృఘాతకుడు అవుతాడు. మూడింటినీ చేయడానికి శక్తిలేనివాడయితే, పార్వణవిధి మాత్రం తప్పనిసరి అని మునిచే చెప్పబడింది.

**తద్దినే తద్దినే కుర్యాత్ పితామహ ముఖాన్ యతః ।**
**అజ్ఞానాద్దిన మాసానాం తస్మాత్పార్వణ మిష్యతే ॥18॥**

పితామహుడు మున్నగువారు ఏ మాసంలో, ఏరోజున మరణించారో తెలియకపోవడంవల్ల ప్రతి తద్దినము నందు(తండ్రి మరణించిన రోజునే) చేయాలి. అందువల్ల పార్వణవిధి విధించబడింది.

**అనుత్పన్నశరీరస్య న దానం పితృభిః సహ ।**
**ఏతైః షోడశభిః శ్రాద్ధైః ప్రేతో ముక్తస్తు జాయతే ॥19॥**

పుత్రుడు లేనివానికి, పితరులతోసహా సపిండీకరణ శ్రాద్ధదానం పనికిరాదు. ఈ పదునారు శ్రాద్ధాలతోనే ప్రేత ముక్తుడై జన్మిస్తాడు.

**అపుత్రస్య సపిండత్వం నైవ కుర్యాత్ స్త్రియోఽపి వా ।**
**యావజ్జీవం చ సద్భక్త్యా న కుర్యాత్ సహపిండతామ్ ॥20॥**

పుత్రుడులేనివానికి సపిండత్వం పనికిరాదు, స్త్రీకి అయినా అంతే. ఎంతకాలం బ్రతికిఉన్నా, ఎంతభక్తి ఉన్నా, సపిండత్వం మాత్రం పనికిరాదు.

**బ్రాహ్మాదిషు వివాహేషు యా వధూరిహ సంస్కృతా ।**
**భర్తృగోత్రేణ కర్తవ్యా స్తస్యాః పిండోదకక్రియాః ॥21॥**

బ్రహ్మాదిశాస్త్రోక్తప్రకారం పెండ్లి జరిగిన సందర్భాలలో స్త్రీ మరణిస్తే, ఆమెకు సంస్కారకర్మ, పిండోదకక్రియలు భర్త గోత్రంతోనే చేయాలి.

**ఆసురాది వివాహేషు యా వ్యూఢా కన్యకా భవేత్ ।**
**తస్యాస్తు పితృగోత్రేణ కుర్యాత్ పిండోదకక్రియాః ॥22॥**

ఆసురాదులైన అశాస్త్రీయ వివాహాలలో వివాహితయైన స్త్రీ మరణిస్తే, ఆమెకు తండ్రిగోత్రంతోనే పిండోదక క్రియలు చేయాలి.

**పితుః పుత్రేణ కర్తవ్యం సపిండీకరణం సదా ।**
**పుత్రాభావే తు పత్నీస్యాత్ పత్న్యభావే సహోదరః ॥23॥**

సపిండీకరణం ఎల్లప్పుడు తండ్రికి పుత్రుడే చేయాలి. పుత్రుడు లేకపోతే భార్య చేయాలి. భార్య లేకపోతే సహోదరుడు చేయాలి.

**భ్రాతా వా భ్రాతృపుత్రో వా సపిండః శిష్య ఏవ వా ।**
**సపిండనక్రియాం కృత్వా కుర్యాన్నాందీముఖం తతః ॥24॥**

భ్రాతకాని, భ్రాతయొక్క పుత్రుడు కాని, సపిండుడు కాని, శిష్యుడు కాని సపిండన క్రియచేసి అనంతరం నాందీ ముఖం చేయాలి.

**జ్యేష్ఠస్యైవ కనిష్ఠేన భ్రాతృపుత్రేణ భార్యయా ।**
**సపిండీకరణం కార్యం పుత్రహీనే నరే ఖగ ॥25॥**

ఖగమా! పుత్రుడు లేనివానికి జ్యేష్ఠునకయితే కనిష్ఠుడు, లేదా భ్రాతయొక్క కుమారుడు లేదా భార్య సపిండీకరణం చేయవలసింది.

**భ్రాతౄణా మేకజాతానామేకశ్చేత్ పుత్రవాన్ భవేత్ ।**
**సర్వే తే తేన పుత్రేణ పుత్రిణో మనురబ్రవీత్ ॥26॥**

ఒకే తండ్రికి పుట్టిన అన్నదమ్ములలో ఒకడే పుత్రవంతుడయితే, ఆ అన్నదమ్ములందరికి ఆ పుత్రుడే పుత్రధర్మాలు ఆచరించాలని మనువు వచించాడు.(ఆ పుత్రుని చేతనే అందరూ పుత్రవంతులు అవుతారు)

**సర్వేషాం పుత్రహీనానాం పత్నీ కుర్యాత్సపిండనమ్ ।**
**ఋత్విజా కారయేద్వాపి పురోహితమథాపి వా ॥27॥**

అన్నదమ్ములందరూ కొడుకులు లేనివారయితే, భార్యయే సపిండీకరణం చేయాలి. లేదా ఋత్విక్కుచేత కాని, పురోహితునిచే కాని చేయించవచ్చు.

**కృతచూడోపనీతశ్చ పితుః శ్రాద్ధం సమాచరేత్ ।**
**ఉచ్చారయేత్ స్వధాకారం న తు వేదాక్షరాణ్యసౌ ॥28॥**

చూడాకరణోపనయన సంస్కారాలు జరిగిన పుత్రుడు తండ్రి శ్రాద్ధకర్మను నిర్వహించాలి. చూడాకరణం మాత్రమే జరిగిన పుత్రుడు కర్మచేయవచ్చును. అప్పుడు స్వధా మంత్రాలు చదవాలి కాని, వేదమంత్రాలు చదువరాదు.

**భర్త్రాదిభి స్త్రిభిః కార్యం సపిండీకరణం స్త్రియః ।**
**పితృవ్య భ్రాతృపుత్రేణ సోదరేణ కనీయసా ॥29॥**

స్త్రీకి సపిండీకరణం ఆమె పతి, మామ, మామగారి తండ్రితో కలసి జరపబడాలి. పినతండ్రికి భ్రాతృపుత్రునిచేత కాని, చిన్నవాడయిన సోదరుని చేత కాని కర్మచేయించాలి.

**అర్వాక్ సంవత్సరాత్సంధౌ పూర్ణే సంవత్సరేఽపి వా ।**
**యే సపిండీకృతాః ప్రేతాస్తేషాం న స్యాత్ పృథక్ క్రియా ॥30॥**

సంవత్సరం హద్దుగా ఆ ఏడాది మధ్యలోకాని, సంవత్సరంపూర్తి అవుతూఉండగా కాని ఈ క్రియ జరగాలి. ఏ ప్రేతలు సపిండీకరణం చేయబడినారో, వారికి మళ్లీ వేరే క్రియ ఆచరించరాదు.

**సపిండనే కృతే వత్స పృథక్త్వం తు విగర్హితమ్ ।**
**యస్తు కుర్యాత్ పృథక్ పిండం పితృహా సోఽభిజాయతే ॥31॥**

వత్సా! సపిండీకరణం అయిపోయిన తరవాత వారికి వేరే కర్మచేయడం నిందింపబడేది అవుతుంది. ఎవడు మళ్లీ వేరేగా పిండం పెడతాడో, వాడు తండ్రిని చంపినవాడుగా జన్మిస్తాడు.

**సపిండీకరణే వృత్తే పృథక్త్వం నోపపద్యతే ।**
**పృథక్ పిండే కృతే పశ్చాత్ పునః కుర్యాత్సపిండనమ్ ॥32॥**

సపిండీకరణం అయిపోయిన తరవాత వేరేగా విధి చేయనక్కరలేదు, అలాకాక వేరేగా పిండదానం చేస్తే, మళ్లీ సపిండీకరణం చేయాలి.

**సపిండీకరణం కృత్వా ఏకోద్దిష్టం కరోతి యః ।**
**ఆత్మానం చ తథా ప్రేతం స నయేద్యమశాసనమ్ ॥33॥**

సపిండీకరణం అయిన తరవాత ఎవడు ఏకోద్దిష్టశ్రాద్ధం చేస్తాడో, వాడు తనను, ప్రేతనుకూడ యమశాసనానికి గురిచేస్తాడు.

**వర్షం యావత్క్రియా కార్యా నామగోత్రేణ ధీమతా ।**
**ఘటాదిభోజనం నిత్యం పదదానాని యాని చ ॥**
**సపిండీకరణే వృత్తే ఏకస్యైవ తు దాపయేత్ ॥34॥**

సంవత్సర కాలంలో ప్రేత సంబంధమైన క్రియను విద్వాంసుడు మృతుని నామగోత్రాలను ఉచ్చరిస్తూనే చేయాలి. ఘటాదిక దానాలను, భోజనాదులను, పదదానాలను, ఇతరదానాలను అన్నింటిని సపిండీకరణంచేసి నిత్యం మృతవ్యక్తినుద్దేశించే చేయాలి.

**అన్నం పానీయ సహితం సంఖ్యాం కృత్వాబ్దికస్య చ ।**
**దాతవ్యం బ్రాహ్మణే పక్షిఞ్జలపూర్ణ ఘటాదికమ్ ॥35॥**

ఖగమా ! ఏడాదికి సరిపోయేటట్లుగా లెక్కకట్టి పానీయంతో పాటు అన్నాన్నీ, జలపూర్ణఘటాలను, బ్రాహ్మణునికి దానమీయాలి.

**పిండాంతే తస్య సకలా వర్షవృత్తిః స్వశక్తితః ।**
**దివ్యదేహో విమానస్థః సుఖం యాతి యమాలయమ్ ॥36॥**

పిండదానం తరవాత తనశక్తి ననుసరించి సంవత్సర గ్రాసాన్ని మృతునుద్దేశించి బ్రాహ్మణునికి ఈయాలి. అలాచేస్తే మృతవ్యక్తి యమాలయానికి దివ్యదేహధారియై విమానంలో సుఖంగా వెడతాడు.

**జీవమానే చ పితరి నహి పుత్రే సపిండతా ।**
**స్త్రీణాం సపిండనం నాస్తి తథా భర్తరి జీవతి ॥37॥**

తండ్రి బ్రతికిఉండగానే కొడుకు మరణిస్తే, అతని సపిండీకరణలో తండ్రిపేరు ఉండదు.(తాత,ముత్తాతలపేర్లు మాత్రమే ఉంటాయి) అలాగే పతి బ్రతికిఉండగానే స్త్రీ మరణిస్తే, ఆమె సపిండీకరణంలో భర్తపేరు ఉండదు. (మామ,ఆయనతండ్రి గోత్రనామాలే ఉంటాయి)

**హుతాశం యా సమారూఢా చతుర్థేఽహ్ని పతివ్రతా ।**
**తస్యా భర్తృదినే కార్యం వృషోత్సర్గాదికం చ యత్ ॥38॥**

పతివ్రతయైన స్త్రీ నాలుగో రోజున అగ్నిప్రవేశం చేసినట్లయితే(చితిపైకివెడితే) ఆమెకు భర్తపోయిన రోజునే (ఆ తిథినాడే) వృషోత్సర్గాది క్రియను చేయాలి.

**పుత్రికా పతిగోత్రా స్యా దధస్తాత్ పుత్రజన్మనః ।**
**పుత్రోత్పత్తేః పరస్తాత్సా పితృగోత్రం వ్రజేత్పునః ॥39॥**

పుత్రజన్మ, తరువాత పుత్రిక ఉద్భవించి మరణిస్తే పతి గోత్రంకలదే అవుతుంది. పుత్రజన్మకన్న ముందుగా పుత్రిక పుట్టి మరణిస్తే ఆమె తిరిగి పితృగోత్రంకలదే అవుతుంది.

**పతిపత్న్యోః సదైకత్వం హుతాశం యాధిరోహతి ।**
**పుత్రేణైవ పృథక్ శ్రాద్ధం క్షయాఖ్యే తస్య వాసరే ॥40॥**

పతి పత్నులకు ఎల్లప్పుడూ ఏకత్వం ఉంటుంది, అగ్నిని అధిరోహించిన స్త్రీకి పుత్రుని ద్వారానే భర్త మరణించినరోజునే వేరుగా శ్రాద్ధం నిర్వహింపజేయాలి.

**అపుత్రౌ చేన్మృతౌ స్యాతామేకచిత్యాం సమేఽహని ।**
**పృథక్ శ్రాద్ధాని కుర్వీత సాపిండ్యం పతినా సహ ॥41॥**

**పృథక్ పృథక్ చ పిండేన దంపతీ పతినా సహ ।**
**న లిప్యతే మహాదోషై రేతత్సత్యం వచో మమ ॥42**

ఒకేరోజున సమానంగా ఒకేచితిలో పుత్రులులేనివారు మరణిస్తే, వారికి శ్రాద్ధాలు వేరుగా చేయాలి. భర్తతో సపిండీకరణం చేయాలి. వేరు వేరుగా దంపతులకు పిండదానం చేయడంవల్ల, భర్తతో సపిండీకరణం చేయడంవల్ల మహాపాపాలు అంటవని నేను చెప్పిన ఈ మాట సత్యమైనది.

**ఏకచిత్యాం సమారూఢౌ దంపతీ నిధనం గతౌ ।**
**ఏకపాకం ప్రకుర్వీత పిండాన్ దద్యాత్ పృథక్ పృథక్ ॥43॥**

ఒకేచితిని అధిరోహించి దంపతులు మరణిస్తే, ఒకేపాత్రలో ఇరువురికి వంట వండవచ్చు. పిండాలుమాత్రం వేరు వేరుగా ఈయాలి.

**ఏకాదశే వృషోత్సర్గం ప్రేతశ్రాద్ధాని షోడశ ।**
**ఘటాది పదదానాని మహాదానాని యాని చ ॥**
**వర్షం యావత్ పృథక్ కుర్యాత్ ప్రేతస్తృప్తిం వ్రజేచ్చిరమ్ ॥44॥**

పదకొండో రోజున వృషోత్సర్గాన్ని, పదునారు ప్రేతశ్రాద్ధాలను చేయాలి. అలాగే ఘటాది పదదానాలను, మహాదానాలను, మిగిలిన దానాలను ఈయాలి. సంవత్సరమంతా శ్రాద్ధవిధులు వేరుగా చేయాలి. దానివల్ల ప్రేత ఎక్కువకాలం వెంటనే తృప్తిని పొందుతాడు.

**ఏకగోత్రే మృతానాం తు స్త్రియో వా పురుషస్య వా ।**
**స్థండిలం చైకతః కుర్యాద్ధోమం కుర్యాత్ పృథక్ పృథక్ ॥45॥**

ఒకే గోత్రంలోనివారు మరణిస్తే, స్త్రీకి అయినా పురుషునికి అయినా ఒకేచోట నేలపై దహనాదికం చేయవచ్చు. హోమంమాత్రం వేరు వేరుగా చేయాలి.

**ఏకాదశేఽహ్ని యచ్ఛ్రాద్ధం పృథక్ పిండాశ్చ భోజనమ్ ।**
**పాకైకేన పతిస్త్రీణా మన్యేషాం చ విగర్హితమ్ ॥46॥**

పదకొండోరోజున చేసే శ్రాద్ధం, వేరే వేరే పిండప్రదానం, భోజనం, భార్యా భర్తలిద్దరికి ఏకపాకంలో తయారు చేయవచ్చు. మిగిలినవారి విషయంలో అది నిందింపబడుతుంది.

**ఏకే నైవ తు పాకేన శ్రాద్ధాని కురుతే సుతః ।**
**ఏకం తు వికిరం కుర్యాత్ పిండాన్ దద్యాద్బహూనపి ॥**
**తీర్థే చాపరపక్షే వా చంద్రసూర్యగ్రహేఽపి వా ॥47॥**

ఒకే వంటతో సుతుడు శ్రాద్ధాలు పెట్టవచ్చు. ఒక పిండాన్ని అంతటా వెదజల్లాలి, తరువాత ఎన్ని పిండాలనైనా ఈయవచ్చు. తీర్థంలోకాని, అపరపక్షంలోకాని, చంద్ర సూర్య గ్రహణాలలో కాని ఈయవచ్చు.

**నారీ భర్తారమాసాద్య కుణపం దహతే యదా ।**
**అగ్నిర్దహతి గాత్రాణి ఆత్మానం నైవ పీడయేత్ ॥48॥**

భర్తను పొందిన నారి శరీరాన్ని శవాన్ని దహించివేసినట్లుగా అగ్ని దహిస్తుంది. ఆత్మను మాత్రం ఏ విధంగానూ పీడించదు.

**దహ్యతే ధాయమానానాం ధాతూనాం హి యథా మలమ్ ।**
**తథా నారీ దహేద్దేహం హుతాశే హ్యమృతోపమే ॥49॥**

శరీరంలో ఊదబడుచూ ఉండే ధాతువులను మలం ఎలా దహిస్తుందో, అలాగే అమృతసమమైన అగ్నిలో అమృతసమమైన అగ్నిలో నారి దేహాన్ని దహింపజేసుకొంటుంది.

**దివ్యాదౌ దివ్యదేహస్తు శుద్ధో భవతి పూరుషః ।**
**తప్తతైలేన లోహేన వహ్నినా నైవ దహ్యతే ॥50॥**

దేవాది సంబంధమైన దానిలో దివ్యదేహం కలిగినవాడై పురుషుడు పరిశుద్ధుడవుతాడు. సల సల మరుగుతున్న తైలంతో కాని, లోహమయమైన వహ్నితో కాని అతడు దహింపబడడు.

**తథా సా పతి సంయుక్తా దహ్యతే న కదాచన ।**
**అంతరాత్మా మృతే తస్మిన్ మృతేఽ ప్యేకత్వమాగతః ॥51॥**

అదేవిధంగా పతివ్రత కూడ పతితో కూడుకొని ఎన్నడూ దహింపబడదు. ఆమె మరణించినా, అతడు మరణించినా వారి అంతరాత్మ ఏకత్వాన్ని పొందుతుంది.

**భర్తృసంగం పరిత్యజ్య అన్యత్ర మ్రియతే యది ।**
**భర్తృలోకం న సా యాతి యావదాభూతసంప్లవమ్ ॥52॥**

భర్తతో సహగమనాన్ని వదలి, మరోవిధంగా మరణిస్తే, ప్రలయపర్యంతం ఆమె భర్తృ(పతి)లోకాన్ని చేరలేదు.

**లక్ష్మీయుతాన్ పరిత్యజ్య మాతరం పితరం తథా।**
**మృతం పతిమనువ్రజ్య సా చిరం సుఖమేధతే ॥53॥**

సంపదలతో కూడిన భోగాలన్నింటిని వదలి, చివరకు తల్లిని, తండ్రిని కూడ విడిచి, చనిపోయిన భర్తను అనుసరించే ఆ పతివ్రత చిరకాలం సుఖాన్ని పొందుతుంది.

**దివ్యవర్ష ప్రమాణేన తిస్రః కోట్యోఽర్ధకోటయః ।**
**తావత్కాలం వృషోత్సర్గే నక్షత్రైః సహ సర్వదా ॥54॥**

దివ్యవర్ష ప్రమాణంలో మూడున్నరకోట్ల సంవత్సరాల(31/2 కోట్లు) కాలపర్యంతం వృషోత్సర్గ విధిద్వారా నక్షత్రమండలంలో ఆమె ఎల్లప్పుడూ ఉంటుంది.

**తదంతే చరతే లోకే కులే భవతి భోగినామ్ ।**
**సా హి లబ్ధ మహాప్రీతి ర్భర్త్రా సహ పతివ్రతా ॥55॥**

**ఏవం న కురుతే నారీ ధర్మోఢా పతిసంగమమ్ ।**
**జన్మజన్మని దుఃఖార్తా దుఃశీలాఽప్రియవాదినీ ॥56॥**

ఆ పతివ్రత మహాప్రీతితో నక్షత్ర మండల నివాసం పూర్తిచేసుకొని పిమ్మట ఈ లోకంలో భోగవంతుల కుటుంబంలో జన్మించి, భర్తతో కలసి మిక్కిలి ప్రీతి పొందుతుంది. ధర్మపరురాలైన పతివ్రత భర్తతో కలసి, ఈ విధంగా ఏకచితి సమారోహణం చేయకపోతే, ప్రతిజన్మయందును దుఃశీలయై, అప్రియవచనాలు పలుకుతూ, దుఃఖంచే పీడింపబడుతూ ఉంటుంది.

**వల్గులీ గృహగోధా వా గోధావా ద్విముఖీ భవేత్ ।**
**స్వభర్తారం పరిత్యజ్య పరపుంసోఽనువర్తినీ ॥57॥**

మేకగా కాని, బల్లిగా కాని, ఉడుముగా కాని, రెండుముఖాలు కలదిగా కాని, తన భర్తను విడిచి పరపురుషులను అనువర్తించే స్త్రీగా అలా పుడుతుంది కానీ

**తస్మాత్సర్వ ప్రయత్నేన స్వపతిం స్త్రీ నిషేవతే ।**
**మనసా కర్మణా వాచా మృతం జీవంతమేవ వా ॥58॥**

అందువల్ల ఎన్ని ప్రయత్నాలతో నైనా, మనసా, కర్మణా, వాచా (త్రికరణాలచేత) బ్రతికినా, చనిపోయినా తన భర్తను స్త్రీ ఎల్లప్పుడూ సేవించాలి.

**జీవమానే మృతే వాపి కిల్బిషం కురుతే తు యా ।**
**సా చ వైధవ్యమాప్నోతి జన్మ జన్మని దుర్భగా ॥59॥**

భర్త బ్రతికియున్నా, చనిపోయినా, పాపం ఆచరించిన స్త్రీ జన్మ జన్మలకు దౌర్భాగ్యంతో వైధవ్యం పొందుతుంది.

**యద్దేవేభ్యో యత్పితృభ్యః శ్రద్ధయైవ ప్రదీయతే ।**
**తత్ఫలం భర్తృపూజాతః కుర్యాద్భర్త్రర్చనం తతః ॥60॥**

దేవతలకూ, పితరులకూ శ్రద్ధగా ఇచ్చినందువలన ఏ ఫలితం కలుగుతుందో ఆ ఫలితమంతా భర్తను పూజించడంవల్ల, పతిని అర్చించడంవల్ల లభిస్తుంది.

**ఏవంకృతే ఖగశ్రేష్ఠ పితృలోకే చిరం వసేత్ ।**
**యావదాదిత్య చంద్రౌ చ తావద్దేవసమా దివి ॥61॥**

**పునశ్చిరాయుషో భూత్వా జాయంతే విపులే కులే ।**
**పతివ్రతా యథా నారీ భర్తృదుఃఖం న విందతి ॥62॥**

ఖగోత్తమా! ఈ విధంగా చేసిన స్త్రీ పితృలోకంలో చాలాకాలం నివసిస్తుంది. సూర్యచంద్రులున్నంతకాలం జీవిస్తూ ఆమె ఉన్నతవంశాలలో జన్మిస్తుంది. పతివ్రత అయిన నారి భర్తృసంబంధమైన దుఃఖం పొందదు.

**సర్వమేతద్ధి కథితం మయా తవ ఖగేశ్వర ।**
**విశేషం కథయిష్యామి మృతస్యైవ సుఖప్రదమ్ ॥63॥**

ఖగరాజా! దీనినంతా నేను నీకు చెప్పడం జరిగింది. చనిపోయినవానికి సుఖాలను కలుగజేసే విశేషాలను ఇక చెబుతున్నాను.

**ద్వాదశాహే కృతం సర్వం వర్షం యావత్సపిండనమ్ ।**
**పునః కుర్యాత్సదా నిత్యం ఘటాన్నం ప్రతిమాసికమ్ ॥64॥**

మృతిచెందిన తరవాత పండ్రెండో రోజున యథావిధిగా ఆ ఏడు చేయవలసిన సపిండనాది సమస్త కార్యాలను నిర్వర్తించాలి. మళ్లీ నిత్యం ప్రతిమాసిక శ్రాద్ధం, ఘటాన్నదానం చేస్తూ ఉండాలి.

**కృతస్య కరణం నాస్తి ప్రేతకార్యాదృతే ఖగ ।**
**యః కరోతి నరః కశ్చిత్ కృతపూర్వం వినశ్యతి ॥65॥**

ఖగమా! ప్రేతకార్యం ఉన్నరోజున ఆ కార్యాన్ని మినహాయించి, వేరే ఇంకో కార్యం ఏదీ చేపట్టరాదు. అలాకాకుండా ఏ నరుడయితే ఇతరకార్యం చేస్తాడో, ఆ పనిఅంతా నష్టమైపోతుంది.

**మృతస్యైవ పునః కుర్యాత్ ప్రేతోఽక్షయ్య మవాప్నుయాత్ ।**
**ప్రతిమాసం ఘటా దేయా స్సోదకా జలపూరితాః ॥66॥**

మృతునికి మళ్లీ మళ్లీ చేస్తూఉంటే, ప్రేతకు అక్షయమైన సుఖం కలగవచ్చు. ప్రతి మాసంలోను, ఉదక పూర్ణఘటాలను దానం చేయవచ్చు.

**అర్వాక్చ వృద్ధేః కరణాచ్చ తార్క్ష్య సపిండనం యః కురుతే హి పుత్రః ।**
**తథాపి మాసం ప్రతిపిండమేక మన్నం చ కుంభం సజలం చ దద్యాత్ ॥67॥**

గరుడా! ప్రత్యేకంగా వృద్ధిశ్రాద్ధం చేసేటప్పుడుకూడా, పుత్రుడు సపిండీకరణం చేయాలి. అప్పుడుకూడా ప్రతిమాసంలోను ఒకపిండాన్ని, అన్నాన్ని, జలపూర్ణకుంభాన్ని దానం చేయాలి.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే సపిండన నిరూపణం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో సపిండనవిధానం అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తవింశోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం

## ప్రేతత్వప్రాప్తికారణం నివృత్త్యుపాయశ్చ - ప్రేతత్వానికి కారణం పరిహారప్రకారం

**తార్క్ష్య ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కథం ప్రేతా వసన్త్యత్ర కీదృగ్రూపా భవంతి తే ।**
**మహాప్రేతాః పిశాచాశ్చ కైః కైః కర్మఫలై ర్విభో ॥**
**సర్వేషా మనుకంపార్థం బ్రూహి మే మధుసూదన ॥1॥**

ప్రేతలు ఈ లోకంలో ఎలా నివసిస్తారు? వారు ఏ రూపాలలో ఉంటారు? ప్రభూ! ఏ ఏ కర్మఫలితాలవల్ల మహాప్రేతాలు, పిశాచాలుగా అవుతారు? మధుసూదనా! అందరిమేలు, అనుగ్రహం కోసమై నాకు వివరించు.

**ప్రేతత్వా న్ముచ్యతే యేన దానేన చ శుభేన చ ।**
**తన్మే కథయ దేవేశ మమ చేదిచ్ఛసి ప్రియమ్ ॥2॥**

ఏదానం వల్ల, ఏపుణ్యకర్మవల్ల, ప్రేతత్వం నుండి విముక్తి లభిస్తుంది? దేవేశా! నాకు ప్రియం చేకూర్చేవాడవయితే, నీవు నాకు తెలియజేయవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**సాధు పృష్టం త్వయా తార్క్ష్య మానుషాణాం హితాయ చ ।**
**శృణు చావహితో భూత్వా యద్వచ్మి ప్రేతలక్షణమ్ ॥3॥**

గరుడా! మనుష్యుల మేలుకోసమై నీవు చక్కని విషయం అడిగావు. నేను ప్రేతలక్షణాలను వివరిస్తాను, సావధానుడవై విను.

**గుహ్యా ద్గుహ్యతరం హ్యేతన్నాఖ్యేయం యస్య కస్యచిత్ ।**
**భక్తస్త్వం హి మహాబాహో తేన తే కథయామ్యహమ్ ॥4॥**

ఇది రహస్యాలలో మిక్కిలి రహస్యమైనది. ఇది వేరే మరొకరికి చెప్పరానిది, మహాబాహూ! నీవయితే గొప్ప భక్తుడవు, ఆ కారణంచేత నేను నీకు చెబుతున్నాను.

**పురా త్రేతాయుగే తాత రాజాసీద్బభ్రువాహనః ।**
**మహోదయపురే రమ్యే ధర్మనిష్ఠో మహాబలః ॥5॥**

వత్సా! పూర్వం త్రేతాయుగంలో బభ్రువాహనుడనే రాజు ఉండేవాడు. అతడు రమ్యమైన మహోదయ పురమునందు ఉండేవాడు. అతడు ధర్మాత్ముడు, మహాబలుడు,

**యజ్వా దానపతిః శ్రీమాన్ బ్రహ్మణ్యః సాధుసమ్మతః ।**
**శీలాచారగుణోపేతో దయాదాక్షిణ్యసంయుతః ॥6॥**

అతడు యజ్ఞాలు చేసేవాడు, దానాసక్తుడు, శ్రీమంతుడు, బ్రాహ్మణభక్తి కలవాడు, సత్పురుషులపట్ల వినయం కలవాడు. చక్కని శీలం, ఆచారం కలవాడు. సద్గుణవంతుడు. దయాదాక్షిణ్యాలతో కూడినవాడు.

**ప్రజాః పాలయతే నిత్యం పుత్రానివ మహాబలః ।**
**క్షత్రధర్మరతో నిత్యం స దండ్యాన్ దండయన్నృపః ॥7॥**

ఆ మహాబలవంతుడు నిత్యమూ ప్రజలను కుమారులుగా రక్షించేవాడు. ఆ నృపుడు ఎల్లప్పుడూ క్షత్రధర్మంపై ఆసక్తి కలవాడై, దండించవలసిన దోషులను శిక్షించేవాడు.

**స కదాచిన్మహాబాహుః ససైన్యో మృగయాం గతః ।**
**వనం వివేశ గహనం నానావృక్షసమన్వితమ్ ॥8॥**

**శార్దూలశతసంజుష్టం నానాపక్షినినాదితమ్ ।**
**వనమధ్యే తదా రాజా మృగం దూరాదపశ్యత ॥9॥**

ఆ మహాబాహువు ఒకనాడు సైన్యసమేతంగా వేటకువెళ్లాడు, వందలకొలది పెద్దపులులతో నిండి, నానావిధ పక్షినాదాలతో కూడుకొన్న, పలువిధాలైన చెట్లు కల్గిన ఒక దుర్గమారణ్యంలో ప్రవేశించాడు. అప్పుడు అడవి నడుమ ఆ రాజు ఒక మృగాన్ని దూరంనుండి చూశాడు.

**తేన విద్ధో మృగోఽతీవ బాణేన సుదృఢేన చ ।**
**బాణమాదాయ తం తస్య స వనేఽదర్శనం యయౌ ॥10॥**

**కక్షే తచ్ఛోణితస్రావాత్స రాజానుజగామ తమ్ ।**
**తతో మృగప్రసంగేన వనమన్యద్వివేశ సః ॥11॥**

మిక్కిలి దృఢమైన అతని బాణంవల్ల ఆ మృగం ఎక్కువగా గాయపడి, ఆ రాజువేసిన బాణంతోపాటు, మృగం ఆ అడవిలో కనబడకుండా పారిపోయింది. డొక్కలో రక్తంకారుతూ ఉండగా పారిపోతున్న ఆ మృగాన్ని రాజు వెంబడించాడు. అలా ఆ మృగ ప్రసక్తితో రాజు మరో అరణ్యంలోకి వెళ్లాడు.

**క్షుత్క్షామకంఠో నృపతిః శ్రమసంతాపమూర్ఛితః ।**
**జలస్థానం సమాసాద్య సాశ్వఏవావగాహత ॥12॥**

ఆకలితోను, దప్పికతోనూ నోరెండిపోతూ ఉండగా, శ్రమతోను, తాపంతోను తల్లడిల్లి, ఒక జలాశయాన్ని సమీపించి గుఱ్ఱంతోనే అందు ప్రవేశించాడు.

**పీత్వా తదుదకం శీతం పద్మగంధాధివాసితమ్ ।**
**తత ఉత్తీర్య సలిలాద్విమలాద్బభ్రువాహనః ॥13॥**

**న్యగ్రోధ వృక్షమాసాద్య శీతచ్ఛాయం మనోహరమ్ ।**
**మహావిటపినం హృద్యం పక్షిసంఘాతనాదితమ్ ॥14॥**

తామరపూల వాసనచే గుబాళించే చల్లని నీరుత్రాగి, బభ్రువాహనుడు స్వచ్ఛమైన ఆ నీటినుండి బయటకువచ్చి, ఒక మర్రిచెట్టును ఆశ్రయించాడు. మనస్సును దోచే చల్లని నీడనిచ్చే, పక్షి సమూహాల నినాదాలచే నిండిన కొమ్మలు కల్గిన ఆ రమణీయవృక్షంవద్దకు చేరాడు.

**వనస్య తస్య సర్వస్య కేతుభూతమివోచ్ఛ్రితమ్ ।**
**తం మహాతరుమాసాద్య నిషసాద మహీపతిః ॥15॥**

ఆ వనాని కంతటికి అది ఒక ఎత్తైన జెండాలా ఉంది. ఆ మహావృక్షాన్ని ఆశ్రయించి రాజు అక్కడ కూర్చున్నాడు.

**అథ ప్రేతం దదర్శాసౌ క్షుత్తృష్ణా వ్యాకులేంద్రియమ్ ।**
**ఉత్కచం మలినం కుబ్జం(రూక్షం)నిర్మాంసం భీమదర్శనమ్ ॥16॥**

**స్నాయుబద్ధాస్థి చరణం ధావమానమితస్తతః ।**
**అన్యైశ్చ బహుభిః ప్రేతైః సమంతాత్పరివారితమ్ ॥17॥**

అంత అతడు ఆకలిదప్పులతో వాడి ఇంద్రియాలు వశం తప్పి ఉన్నాయి. జుట్టు విరబోసుకొని మలినంగా, మాంసంలేని శరీరంతో భయంకరంగా కనిపిస్తున్నాడు. ఎముకలు, పాదాలు, నరాలతో కట్టివేసినట్టు కనిపిస్తున్నాయి. అటు ఇటూ పరిగెత్తుతున్నాడు. చాలా ప్రేతాలు దాన్ని చుట్టుముట్టాయి.

**తం దృష్ట్వా వికృతం ఘోరం విస్మితో బభ్రువాహనః ।**
**ప్రేతోఽపి దృష్ట్వా తాం ఘోరామటవీమాగతం నృపమ్ ॥18॥**

ఆ వికృతమైన ఘోరరూపంతోనున్న ప్రేతనుచూసి, బభ్రువాహనుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు. ప్రేతకూడ ఆ భయంకరమైన అడవికి వచ్చిన రాజును చూసి,

**తదా హృష్టమనా భూత్వా తస్యాంతికముపాగతః ।**
**అబ్రవీత్స తదా తార్క్ష్య ప్రేతరాజో నృపం వచః ॥19॥**

గరుడా! అప్పుడు సంతసం నిండిన మదితో అతని సమీపానికి వచ్చాడు. ప్రేతరాజు అప్పుడు రాజుతో ఇలా అన్నాడు,

**ప్రేతభావో మయా త్యక్తః ప్రాప్తోఽస్మి పరమాం గతిమ్ ।**
**త్వత్సంయోగాన్మహాబాహో నాస్తి ధన్యతరో మమ ॥20॥**

నేను ప్రేతభావాన్ని విడిచిపెట్టాను, ఉత్కృష్టమైన గతిని పొందాను. మహాబాహూ! నీ సమాగమంవల్ల నాకు ఈయోగం చేకూరింది, నాకన్న మిక్కిలి ధన్యుడు వేరొక్కడులేడు.

**నృపతి రువాచ** – రాజు చెప్పాడు.

**కృష్ణవర్ణః కరాలాస్యస్త్వం ప్రేత ఇవ లక్ష్యసే ।**
**కథయస్వ మమ ప్రీత్యా యథైవం చాసి తత్త్వతః ॥21॥**

**తథా పృష్టః స వై రాజ్ఞా ప్రోవాచ సకలం స్వకమ్ ॥22॥**

'నీవు నల్లని రంగుతో ఉన్నావు, భయంకరమైన వదనంతో కనబడుతున్నావు, ప్రేతలా గోచరిస్తున్నావు, నా తృప్తికోసమై వివరించు. నీవెందుకు ఇలా అయ్యావో ఉన్నది ఉన్నట్లుగా చెప్పు,' అలా రాజు అడగగా ఆ ప్రేత తనదైన సకలవృత్తాంతాన్ని ఇలా చెప్పాడు.

**ప్రేత ఉవాచ** – ప్రేత వచించాడు.

**కథయామి నృపశ్రేష్ఠ సర్వమేవాదితస్తవ ।**
**ప్రేతత్వే కారణం శ్రుత్వా దయాం కర్తుం మమార్హసి ॥23॥**

నృపోత్తమా! మొదటినుండి నా వృత్తాంతాన్ని అంతా నీకు తెలియజేస్తాను, నా ప్రేతత్వ కారణాన్ని విని, నాపై దయ చూపించడానికి తగినవాడవు నీవే,

**వైదిశం నామనగరం సర్వసంపత్సమన్వితమ్ ।**
**నానాజనపదాకీర్ణం నానారత్నసమాకులమ్ ॥**
**నానాపుణ్యసమాయుక్తం నానావృక్షసమాకులమ్ ॥24॥**

వైదిశం అనే పేరుగల నగరం ఉండేది. అన్ని సంపదలకు నిలయమైనట్టిది, ఎన్నో జనపదాలతో నిండి ఉండేది, అనేక పుణ్యాలకు ఆవాసమై విలసిల్లేది, వివిధ వృక్షాలతో (పచ్చగా) ఉండేది.

**తత్రాహం న్యవసం భూయో దేవార్చనరతః సదా ।**
**వైశ్యో జాత్యా సుదేవోఽహం నామ్నా విదితమస్తు తే ॥25॥**

నేను ఆ నగరంలో ఎల్లప్పుడూ దేవపూజయందు ఆసక్తి కల్గి ఉండేవాడిని, వైశ్యజాతికి చెందినవాడిని. సుదేవుడనే పేరుతో ఉండే నేను నీకు తెలిసియే ఉండవచ్చేమో!

**హవ్యేన తర్పితా దేవాః కవ్యేన పితరస్తథా ।**
**వివిధైర్దానయోగైశ్చ విప్రాః సంతర్పితా మయా ॥26॥**

నేను హవ్యాలతో దేవతలను, కవ్యాలతో పితరులను తృప్తి పరచాను. విప్రులను నానావిధ దానాలలోను, వివిధ లాభాలు కలిగేటట్లుగాను సంతృప్తిపరచాను.

**అవాహాశ్చ వివాహాశ్చ మయా వై సునివేశితాః ।**
**దీనానాథవిశిష్టేభ్యో మయా దత్త మనేకధా ॥27॥**

నేను అవాహితులకు వివాహాలుచేశాను, ఎంతోమందికి నివాసాలు కల్పించాను, దీనులకు, అనాథులకు, విశిష్టులకు అనేకవిధాలైన దానాలు చేశాను.

**తత్సర్వం విఫలం తాత మమ దైవాదుపాగతమ్ ।**
**యథా మే నిష్ఫలం జాతం సుకృతం తద్వదామి తే ॥28॥**

నాయనా! నేను చేసినదంతా ఫలితం లేనిదయిపోయింది. అది దైవంవల్ల సంక్రమించింది, నా సుకృతమంతా ఎలా నిష్ఫలమయిందో నీకు చెబుతున్నాను.

**న మే ఽస్తి సంతతిస్తాత న సుహృన్న చ బాంధవః ।**
**న చ మిత్రం హి మే తాదృగ్యః కుర్యాదౌర్ధ్వదైహికమ్ ॥29॥**

అయ్యా! నాకు సంతానంలేదు, మంచిహృదయం కల్గినవాడు గాని, బంధువు కాని, ప్రియమిత్రుడు కాని, నాకు ఊర్ధ్వదేహ క్రియలు ఆచరించేవాడు కాని ఒక్కడూ లేకపోయాడు,

**ప్రేతత్వం సుస్థిరం తేన మమ జాతం నృపోత్తమ ।**
**ఏకాదశం త్రిపక్షం చ షాణ్మాసికమథాబ్దికమ్ ॥**
**ప్రతిమాస్యాని చాన్యాని ఏవం శ్రాద్ధాని షోడశ ॥30॥**

**యస్యైతాని న దీయంతే ప్రేతశ్రాద్ధాని భూపతే ।**
**ప్రేతత్వం సుస్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి ॥31॥**

రాజోత్తమా! ఆ కారణంవల్ల నాకు ప్రేతత్వం శాశ్వతంగా ఉండిపోయింది. పదకొండో రోజు విధి కాని, త్రిపక్షం కాని, షాణ్మాసికం కాని, ఆబ్దికం కాని, మిగిలినటువంటి నెల నెలా వచ్చే మాసికం కాని, షోడశ శ్రాద్ధాలు కాని, భూపతీ! ఎవరికయితే ఈ ప్రేతశ్రాద్ధాలు జరపబడవో, అతనికి వందలకొలది శ్రాద్ధాలు పెట్టినా, ప్రేతత్వం మాత్రం సుస్థిరమై ఉండిపోతుంది.

**ఏవం జ్ఞాత్వా మహారాజ ప్రేతత్వా దుద్ధరస్వ మామ్ ।**
**వర్ణానాం చాపి సర్వేషాం రాజా బంధురిహోచ్యతే ॥32॥**

మహారాజా! ఈ విషయాన్ని గ్రహించి, నన్ను ప్రేతత్వంనుండి ఉద్ధరించు, సర్వవర్ణాలవారికి రాజే బంధువని చెప్పబడుతోంది కదా!

**తన్మాం తారయ రాజేంద్ర మణిరత్నం దదామి తే ।**
**యథా మమ శుభావాప్తి ర్భవేన్నృపవరోత్తమ ॥33॥**

**తథా కార్యం మహాబాహో కృపా యది మయీష్యతే ।**
**ఆత్మనశ్చ కురు క్షిప్రం సర్వమేవౌర్ధ్వ దైహికమ్ ॥34॥**

రాజేంద్రా! అందువల్ల నన్ను తరింపజేయవలసింది, నేను నీకు ఒక మణిరత్నాన్ని ఇస్తున్నాను, రాజన్యోత్తమా! మహాబాహూ! నాయందు దయను చూపగలిగితే, ఎలా నాకు శుభాభివృద్ధి కలుగుతుందో, ఆ విధంగా చేయవలసింది. నాకు శీఘ్రంగా ఊర్ధ్వదేహక్రియను అంతనూ జరిపించవలసింది.

**నృపతిరువాచ** – రాజు వచించాడు.

**కథం ప్రేతా భవన్తీహ కృతైరప్యౌర్ధ్వదైహికైః ।**
**పిశాచాశ్చ భవన్తీహ కర్మభిః కైశ్చ తద్వద ॥35॥**

ఇక్కడ ప్రేతలూ ఉన్నారు, పిశాచాలూ ఉన్నారు, వారు అలా ఎలా అవుతున్నారు? ఏ కర్మల వలన పిశాచత్వం కలుగుతోంది? ఊర్ధ్వదైహిక క్రియలు చేసినా ప్రేతత్వం ఎలా?

**ప్రేత ఉవాచ** – ప్రేత వచించాడు.

**దేవద్రవ్యం చ బ్రహ్మస్వం స్త్రీబాలధనసంచయమ్ ।**
**యే హరంతి నృపశ్రేష్ఠ ప్రేతయోనిం వ్రజంతి తే ॥36॥**

దేవతాద్రవ్యాన్ని, బ్రాహ్మణద్రవ్యాన్ని, స్త్రీలు, బాలురు కూడబెట్టుకొన్న ధనాన్ని ఎవరయితే అపహరిస్తారో, నృపోత్తమా! వారు ప్రేతయోనిని పొందుతారు.

**తాపసీం చ స గోత్రాం చ అగమ్యాం యే భజంతి హి ।**
**భవంతి తే మహాప్రేతా అంబుజాని హరంతి యే ॥37॥**

తాపసిని, పొందకూడని సగోత్రురాలిని, దగ్గరగా చేరదీసుకొని రమించినవారు, నీటియందు పుట్టినవాటిని (నీరుపుట్టేతావులను) అపహరించిన, వారు మహాప్రేతలవుతారు.

**ప్రవాలవజ్రహర్తారో యే చ వస్త్రాపహారకాః ।**
**తథా హిరణ్యహర్తారః సంయుగేఽసన్ముఖా గతాః ॥38॥**

**కృతఘ్నా నాస్తికా రౌద్రా స్తథా సాహసికా నరాః ।**
**పంచయజ్ఞవినిర్ముక్తా మహాదానరతాశ్చ యే ॥39॥**

**స్వామిద్రోహకరా మిత్రబ్రహ్మద్రోహకరాశ్చ యే ।**
**తీర్థపాపకరా రాజఙ్జాయంతే ప్రేతయోనయః ॥**
**ఏవమాద్యా మహారాజ జాయంతే ప్రేతయోనయః ॥40॥**

పగడాలు, వజ్రాలు ఎవరు హరిస్తారో, ఎవరు వస్త్రాలను అపహరిస్తారో, ఎవరు బంగారాన్ని హరిస్తారో, ఎవరు యుద్ధంలో ముఖం ప్రక్కకుత్రిప్పి పారిపోతారో(యుద్ధంలో అధర్మాచరణకు పూనుకొంటారో) ఎవరు కృతఘ్నులు, నాస్తికులు, రౌద్రులు అయిఉంటారో, ఏ నరులు సాహసికులు, పంచ యజ్ఞాలు విడిచిపెట్టినవారు, మితిమీరి మహాదానాలు చేసేవారు అవుతారో, రాజా! స్వామిద్రోహం చేసేవారు, మిత్రులకు, బ్రాహ్మణులకు ద్రోహంచేసేవారు, తీర్థాలలో పాపాలు చేసేవారు ఎవరయితే ఉంటారో, వారు ప్రేతయోనులలో జన్మిస్తారు. మహారాజా! ఇటువంటి వారందరూ ప్రేతజన్మలలో పుడుతూ ఉంటారు.

**రాజోవాచ** – రాజు వచించాడు.

**కథం ముక్తా భవంతీహ ప్రేతత్వాత్త్వం చ తేఽపి చ ।**
**కథం చాపి మయా కార్యమౌర్ధ్వ దైహికమాత్మనః ।**
**విధినా కేన తత్కార్యం సర్వమేతద్వదస్వ మే ॥41॥**

ప్రేతత్వంనుండి నీవూ, వారూ కూడ ఏ విధంగా ముక్తులవుతారు? ఔర్ధ్వదైహికక్రియ ఏ విధంగా నేను ఆచరించాలి? ప్రేతాత్మకు ఏ విధిగా కార్యం చేయాలి? దీనినంతా నాకు చెప్పు.

**ప్రేత ఉవాచ** – ప్రేత పలికాడు.

**శృణు రాజేంద్ర సంక్షేపాద్విధిం నారాయణాత్మకమ్ ।**
**సచ్ఛాస్త్ర శ్రవణం విష్ణోః పూజా సజ్జనసంగతిః ॥42॥**

**ప్రేతయోనివినాశాయ భవంతీతి మయా శ్రుతమ్ ।**
**అతో వక్ష్యామి తే విష్ణుపూజాం ప్రేతత్వనాశినీమ్ ॥43॥**

రాజేంద్రా! సంక్షిప్తంగా విను. నారాయణాత్మకవిధిని విను, చక్కని పురాణ శ్రవణం, విష్ణుపూజ, సజ్జన సాంగత్యం అనేవి, ప్రేతజన్మ వినాశంకోసమై ఉన్నాయని నేను వినడం జరిగింది, అందువల్ల ప్రేతత్వాన్ని నశింపజేసే నారాయణపూజను గురించి నీకు చెబుతున్నాను.

**సువర్ణ ద్వయమాహృత్య మూర్తిం భూప ప్రకల్పయేత్ ।**
**నారాయణస్య దేవస్య సర్వాభరణభూషితామ్ ॥44॥**

**పీతవస్త్ర యుగాచ్ఛన్నాం చందనాగురుచర్చితామ్ ।**
**స్నాపయేద్వివిధైస్తోయై రధివాస్య యజేత్తతః ॥45॥**

రాజా! ఇరవై రూకల ఎత్తుకల రెండు సువర్ణాలను తీసుకొని, నారాయణ దేవుని మూర్తిని తయారుచేయాలి. దానిని సమస్తాభరణాలతో అలంకరించాలి, రెండు పచ్చని బట్టలతో దానిని కప్పాలి. చందనంతోను, అగురుతోను విలేపనం చేయాలి. నానావిధ సుగంధతోయాలతో స్నానం చేయించాలి. అధివాసం చేయించి పిమ్మట పూజించాలి.

**పూర్వే తు శ్రీధరం దేవం దక్షిణే మధుసూదనమ్ ।**
**పశ్చిమే వామనం దేవముత్తరే చ గదాధరమ్ ॥46॥**

**మధ్యే పితామహం పూజ్య తథా దేవం మహేశ్వరమ్ ।**
**పూజయేచ్చ విధానేన గంధపుష్పాదిభిః పృథక్ ॥47॥**

తూర్పున దేవుడైన శ్రీధరుని, దక్షిణంలో మధుసూదనుని, పడమట వామనదేవుని, ఉత్తరంలో గదాధరుని, నడుమనున్న ప్రదేశంలో పితామహుని, అలాగే దేవుడైన మహేశ్వరుని పూజించాలి. శాస్త్రవిధానంతో గంధ పుష్పాదులతో వేరు వేరుగా వారిని అర్చించాలి.

**తతః ప్రదక్షిణీకృత్య అగ్నౌ సంతర్ప్య దేవతాః ।**
**ఘృతేన దధ్నా క్షీరేణ విశ్వాన్ దేవాం స్తథా నృప ॥48॥**

పిమ్మట హోమవిధానంచే దేవతలను పూజించి, ప్రదక్షిణం ఆచరించాలి. రాజా! నేయి, పెరుగు, పాలు వీటిచే విశ్వదేవతలను అభిషేకించాలి.

**తతః స్నాతో వినీతాత్మా యజమానః సమాహితః ।**
**నారాయణాగ్రే విధివత్ స్వక్రియామౌర్ధ్వ దైహికీమ్ ॥49॥**

**ఆరభేత వినీతాత్మా క్రోధలోభ వివర్జితః ।**
**శ్రాద్ధాని కుర్యాత్సర్వాణి వృషస్యోత్సర్జనం తథా ॥50॥**

పిమ్మట యజమానుడు స్నానంచేసి, వినయశీలుడై, శ్రద్ధాయుక్తుడై, నారాయణుని ఎదురుగా క్రోధలోభహీనుడై నియతాత్ముడై నిలిచి యథాశాస్త్రంగా ఔర్ధ్వదైహికక్రియను ఆరంభించాలి. వృషోత్సర్జనంతో బాటుగా సమస్త శ్రాద్ధకర్మలను ఆచరించాలి.

**త్రయోదశానాం విప్రాణాం వస్త్రచ్ఛత్రాణ్యుపానహౌ ।**
**అంగులీయకముక్తాని భాజనాసనభోజనైః ॥51॥**

**స్నానాశ్చ సోదకా దేయా ఘటాః ప్రేతహితాయ వై ।**
**శయ్యాదాన మథో దత్త్వా ఘటం ప్రేతస్య నిర్వపేత్ ॥52॥**

పదముగ్గురు విప్రులకు, వస్త్రాలు, గొడుగు, చెప్పులు, అంగులీయకం, ముత్యం, ఇతరోపకరణాలు, ఆసనం, భోజనం, స్నానాలు, ఘటోదక దానాలు ప్రేత మేలుకోసమై చేయాలి. పిమ్మట శయ్యాదానం చేసి, ప్రేతకు తరవాతి జన్మనుద్దేశించి ఘటం ఈయాలి.

**నారాయణేతి సన్నామ సంపుటస్థం సమర్చయేత్ ।**
**ఏవం కృత్వాథ విధివచ్ఛుభాశుభఫలం లభేత్ ॥53॥**

" నారాయణ!" అనే పవిత్రనామాన్ని సంపుటీకరణంచేసి భక్తితో అర్చించాలి. ఈ విధంగా శాస్త్రోక్తవిధితో చేస్తే, చేసిన కర్మననుసరించి శుభాశుభఫలితాలు లభిస్తాయి.

**రాజోవాచ** – రాజు వచించాడు.

**కథం ప్రేతఘటం కుర్యాద్దద్యాత్కేన విధానతః ।**
**బ్రూహి సర్వానుకంపార్థం ఘటం ప్రేతవిముక్తిదమ్ ॥54॥**

ప్రేతకు ఘటదానం ఎలా ఈయాలి? ఏ విధానంచే నిర్వహించాలి? అందరికి మేలు కలుగుటకోసమై దయతో ప్రేతవిముక్తిని కలిగించే ఘటదానం గురించి వివరించు.

**ప్రేత ఉవాచ** – ప్రేత వచించాడు.

**సాధు పృష్టం మహారాజ కథయామి నిబోధ తే ।**
**ప్రేతత్వం న భవేద్యేన దానేన సుదృఢేన చ ॥55॥**

మహారాజా! మంచివిషయాన్ని అడిగావు, నీకు అది తెలియజేస్తాను ఆలకించు. మిక్కిలి పటిష్ఠమైన ఏ దానంవల్ల ప్రేతత్వం కలగకుండా ఉంటుందో విను.

**దానం ప్రేత ఘటం నామ సర్వాశుభవినాశనమ్ ।**
**దుర్లభం సర్వలోకానాం దుర్గతి క్షయకారకమ్ ॥56॥**

దానికి ప్రేతఘటదానం అనిపేరు. సమస్తములైన అశుభాలను నశింపజేస్తుంది, అందరికి తేలికగా సాధ్యపడదు. దుర్గతిని పోగొట్టడానికి కారణమవుతుంది.

**సంతప్తహాటకమయం తు ఘటం విధాయ బ్రహ్మేశ కేశవయుతం సహలోకపాలైః ।**
**క్షీరాజ్యపూర్ణవివరం ప్రణిపత్య భక్త్యా విప్రాయ దేహి తవ దానశతైః కిమన్యైః ॥57॥**

మలినం లేని బంగారంతో తయారుచేసిన ఘటాన్ని ఉంచి, బ్రహ్మ, ఈశ్వరుడు, విష్ణువుతో కలిపి, లోకపాలురతో సహా అందరికి భక్తితో ప్రణమిల్లి, అందు క్షీరం, ఆజ్యం నిండాపోసి విప్రునికి దానంఇవ్వు. ఇక మిగిలిన వందలకొలది దానాలచే నీకు ఏం అవసరం ఉంది కనుక?

**బ్రహ్మా మధ్యే తథా విష్ణుః శంకరః శంకరోఽవ్యయః ।**
**ప్రాచ్యాదిషు చ తత్కంఠే లోకపాలాన్ క్రమేణ తు ॥58॥**

**సంపూజ్య విధివద్రాజన్ ధూపైః కుసుమచందనైః ।**
**తతో దుగ్ధాజ్యసహితం ఘటం దేయం హిరణ్మయమ్ ॥59॥**

రాజా! దానిమధ్యలో బ్రహ్మ, విష్ణువు, శంకరుడు పూజింపబడాలి, శంకరుడు అవ్యయుడు కదా! దాని కంఠభాగంలో తూర్పునుండి క్రమంగా లోకపాలురను శాస్త్రవిధిగా పూజించి, ధూపాలతోను, పుష్పాలతోను, చందనాలతోను అర్చించి, పిమ్మట పాలు, నేతితోకలిపి సువర్ణమయమైన ఆ ఘటాన్ని దానంచేయాలి.

**సర్వదానాధికశ్చైతన్మహాపాతకనాశనమ్ ।**
**కర్తవ్యం శ్రద్ధయా రాజన్ ప్రేతత్వవినివృత్తయే ॥60॥**

సర్వదానాలకన్న ఇది అధికమైనది, మహాపాతకాలను నశింపజేసేది. రాజా! ప్రేతత్వం రాకుండా ఉండడం కోసమై శ్రద్ధతో దీనిని నిర్వర్తించవలసియుంది.

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు వచించాడు.

**ఏవం సంజల్పతస్తస్య ప్రేతేన నియతాత్మనః ।**
**సేనా జగామానుపదం హస్త్యశ్వరథసంకులా ॥61॥**

ఈ విధంగా నియతాత్ముడై ప్రేతతో సంభాషిస్తున్న, ఆ రాజువద్దకు, ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలతో కూడుకొన్న సేన అతని అడుగు జాడలను గుర్తించి వచ్చింది.

**తతో బలే సమాయాతే దత్త్వా రాజ్ఞే మహామణిమ్ ।**
**నమస్కృత్య పునః ప్రార్థ్య ప్రేతోఽదర్శనమీయివాన్ ॥62॥**

ఆ విధంగా సేన అక్కడకురాగా, ఆ ప్రేత రాజుకు మహామణిని ఇచ్చి నమస్కరించి, మళ్లీ ప్రార్థించి కనబడకుండా వెళ్లిపోవడం జరిగింది.

**తస్మాద్వనాద్వినిష్క్రమ్య రాజాపి స్వపురం యయౌ ।**
**స్వపురం స సమాసాద్య సర్వం తత్ప్రేతభాషితమ్ ॥63॥**

**చకార విధివత్పక్షిన్నౌర్ధ్వదేహాదికం విధిమ్ ।**
**తస్య పుణ్యప్రదానేన ప్రేతో ముక్తో దివం యయౌ ॥64॥**

ఖగమా! రాజుకూడ ఆ వనంనుండి నిష్క్రమించి, తన నగరానికి వెళ్లిపోయాడు. తనపురం ప్రవేశించి, ఆ ప్రేతచెప్పిన శాస్త్రోక్తవిధిచే ఔర్ధ్వదైహిక కర్మనంతను చేశాడు. ఆ పుణ్యప్రభావంవల్ల ప్రేతకూడా విముక్తుడై స్వర్గానికి వెళ్లాడు.

**శ్రాద్ధేన పరదత్తేన గతః ప్రేతోఽపి సద్గతిమ్ ।**
**కిం పునః పుత్రదత్తేన పితా యాతీతిచాద్భుతమ్ ॥65॥**

ఇతరుడు పెట్టిన శ్రాద్ధంచేతనే ప్రేత సద్గతిని పొందగలిగితే, ఇక కుమారుడు అర్పించే శ్రాద్ధంచేత తండ్రి సద్గతిని పొందుతాడనే విషయంలో ఆశ్చర్యపడవలసిందేముంది కనుక?

**ఇతిహాసమిమం పుణ్యం శృణోతి శ్రావయేచ్చ యః ।**
**న తౌ ప్రేతత్వమాయాతః పాపాచారయుతావపి ॥66॥**

ఈ పుణ్యమైన ఇతిహాసాన్ని ఎవడు వింటాడో, ఎవడు వినిపిస్తాడో, ఆ ఉభయులు పాపాచారాలతో కూడుకొన్నవారైనా, ప్రేతత్వాన్ని పొందరు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే బభ్రువాహనప్రేతసంవాదే ప్రేతత్వహేతు తన్నివృత్త్యుపాయ నిరూపణం నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో బభ్రువాహనప్రేతసంవాదంలో ప్రేతత్వానికి కారణం పరిహారప్రకారం అనే ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టావింశోఽధ్యాయః** – ఇరవై ఎనిమిదవ అధ్యాయం

## **దానఫలనిరూపణమ్** – వివిధ దానాల ఫలితాన్ని నిరూపించుట

**గరుడ ఉవాచ** – గరుడుడు పలికాడు.

**సర్వేషామనుకంపార్థం బ్రూహి మే మధుసూదన ।**
**ప్రేతత్వాన్ముచ్యతే యేన దానేన సుకృతేన వా ॥1॥**

మధుసూదనా! అందరి మేలుకోసమై నాకు చెప్పవలసింది. ఏ దానంవల్ల, ఏ పుణ్యంవల్ల ప్రేతత్వంనుండి విముక్తి పొందవచ్చు?

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు చెప్పాడు.

**శృణు దానం ప్రవక్ష్యామి సర్వాశుభవినాశనమ్ ॥**
**సంతప్త హాటకమయం ఘటకం విధాయ బ్రహ్మేశకేశవయుతం సహలోకపాలైః ॥**
**క్షీరాజ్యపూర్ణవివరం ప్రణిపత్య భక్త్యా విప్రాయ దేహి తవ దానశతైః కిమన్యైః ॥2॥**

సమస్తములైన అశుభాలను నశింపజేసే దానం గురించి చెబుతున్నాను. విను. బాగా కరగించిన బంగారంతో తయారుచేసిన ఘటాన్ని ఉంచి, బ్రహ్మ, ఈశ్వరుడు, విష్ణువుతో కలిపి లోకపాలకులతో సహా భక్తితో ప్రణమిల్లి, పాలు నేతితో పూర్తిగా నింపి, విప్రునికి దానంచేయి. దీనికి మించి మిగిలిన వందలకొలది దానాలచే నీకేమి అవసరంఉంది?

**గరుడ ఉవాచ** – గరుడుడు పలికాడు.

**కిమేతత్కథితం దేవ విస్తరేణ వదస్వ మే ।**
**ఆముష్మికీం క్రియాం దేవ ఉత్క్రాంతి సమయాదను ॥3॥**

దేవా! నీవు చెప్పేది నాకు విస్తరించి వివరించవలసింది. దేవా! ప్రాణోత్క్రమణసమయాన్ని అనుసరించి (తరువాత) జరిపే పరలోకక్రియ ఏవిధంగా ఉంటుంది?

**సంసారే సాధు మే నాథ! బ్రూహి కృత్యం జనార్దన ।**
**యథాకార్యా నరైః సమ్యక్ క్రియా చైవౌర్ధ్వదైహికే ॥4॥**

నాథా! జనార్దనా! ఈ సంసారంలో ఏది మంచిదో చెప్పు. నరులు ఊర్ధ్వదైహిక క్రియ ఏ విధంగా చక్కగా చేయాలి?

**కథం ప్రేతా మహాకాయా రౌద్రరూపా భయానకాః ।**
**సంభవంతి సురశ్రేష్ఠ కర్మభిః కైః శుభాశుభైః ॥5॥**

**పిశాచాః సంభవంతీహ కస్యేదం కర్మణః ఫలమ్ ।**
**తన్మే కథయ దేవేశ అహమిచ్ఛామి వేదితుమ్ ॥6॥**

సురశ్రేష్ఠా! ఏ శుభాశుభకర్మలచే ప్రేతలు మహాకాయులై, రౌద్రరూపులై, భయంకర రూపులై ఎలా జన్మిస్తారు? ఏ కర్మఫలితంగా ఇక్కడ పిశాచాలుగా పుడుతున్నారు? దేవేశా! దానిని నాకు చెప్పు. దానిని తెలుసుకోవాలని నేను కోరుకొంటున్నాను.

**భూమ్యాం ప్రక్షిప్యతే కస్మాత్పంచరత్నం కుతో ముఖే ।**
**అధస్తాచ్చ తిలా దర్భాః పాదౌ యామ్యాం వ్యవస్థితాః ॥7॥**

శవాన్ని నేలపై ఎందుకు ఉంచుతారు? నోటిలో పంచరత్నాలను ఎందుకు వేస్తారు? తిలలను, దర్భలను క్రింద ఎందుకు వేస్తారు? పాదాలను దక్షిణదిక్కుగా ఎందుకు ఉంచుతారు?

**కిమర్థం మండలం భూమౌ గోమయేనోపలిప్యతే ।**
**కిమర్థం స్మర్యతే విష్ణుః విష్ణుసూక్తం చ పఠ్యతే ॥8॥**

నేలపై మండలాకారంగా ఆవుపేడతో ఎందుకు అలుకుతారు? అప్పుడు ఎందుకు విష్ణువును స్మరిస్తారు? విష్ణుసూక్తాన్ని ఎందుకు పఠిస్తారు?

**కిమర్థం పుత్ర పుత్రాశ్చ తస్య తిష్ఠంతి చాగ్రతః ।**
**కిమర్థం దీపదానఞ్చ కిమర్థం విష్ణుపూజనమ్ ॥9॥**

ఆ శవానికి ఎదురుగా కొడుకులు, మనుమలు ఎందుకు నిలబడతారు? దీపం ఎందుకు ఉంచుతారు? అప్పుడు విష్ణుపూజనం దేనికోసం?

**కిమర్థమాతురో దానం దదాతి ద్విజపుంగవే ।**
**బంధూన్మిత్రాణ్యమిత్రాంశ్చ క్షమాపయతి తత్కథమ్ ॥10॥**

దేనికోసమై మరణాసన్నవ్యక్తి ద్విజశ్రేష్ఠునకు దానంచేస్తాడు? బంధువులు, మిత్రులను, శత్రువులను అప్పుడు క్షమాపణ కోరుకుంటాడు?

**తిలా లోహం హిరణ్యం చ కార్పాసం లవణం తథా ।**
**సప్తధాన్యం క్షితిర్గావో దీయతే కేన హేతునా ॥11॥**

తిలలు, ఇనుము, బంగారం, ప్రత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు, భూమి, ఆవులు ఏ కారణంచే దానంగా ఇస్తారు?

**కథం చ మ్రియతే జంతుర్మృతస్య చ కుతో గతిః ।**
**అతివాహశరీరం చ కథం విశ్రమతే తదా ॥12॥**

ప్రాణి ఎలా మరణిస్తాడు? చనిపోయినవాని గమనం ఎలా ఉంటుంది? ఆ సమయంలో అతివాహశరీరం ఎలా విరమణ చెందుతుంది?

**శవం స్కంధే వహేత్పుత్రో వహ్నిదాతా చ పౌత్రకః ।**
**కిమర్థం దేవదేవేశ ఆజ్యేనాభ్యంజనం కుతః ॥13॥**

శవాన్ని పుత్రుడు భుజాలపై ఎందుకు మోస్తాడు? నిప్పును కూడ ఎందుకు ముట్టిస్తాడు? మనుమడు కూడ ఎందుకలాచేస్తాడు? దేవదేవేశా! ఆ సమయంలో శవాన్ని నేతితో ఎందుకు స్నానం చేయిస్తారు?

**యమసూక్తం కిమర్థం చ ఉదీచీం దిశమాహరేత్ ।**
**పానీయమేకవస్త్రేణ సూర్యబింబనిరీక్షణమ్ ॥14॥**

ఉత్తరదిశగా తలనుంచి యమసూక్తాన్ని పఠిస్తూ ఎందుకు తీసుకొని వెడతారు? ఏకవస్త్రంతో పానీయ వినియోగం ఎందుకు? అప్పుడు సూర్యబింబనిరీక్షణం ఎందుకు?

**యవ సర్షప దూర్వాశ్చ పాషాణే నింబచర్వణమ్ ।**
**వస్త్రం నరశ్చ నారీ చ విదధ్యాధరోత్తరమ్ ॥15॥**

యవలు, తెల్లఆవాలు, గరిక నోట్లో వేసుకొని రాతిపై వేపాకు నమలడం ఎందుకు? నరుడయినా, నారి అయినా ఉత్తరీయాన్ని, నడుముకు క్రిందచుట్టుకొనే వస్త్రధారణ ఎందుకు?

**అన్నాద్యం గృహమాగత్య భోక్తవ్యం గోత్రిభిః సహ ।**
**నవకాని చ పిండాని కిమర్థం వితరేత్సుతః ॥16॥**

ఇంటికి వచ్చిన తరువాత సగోత్రికులతో అన్నాదులను ఎందుకు భుజించాలి? కొడుకు తొమ్మిది పిండాలను ఎందుకు ఈయాలి?

**కిమర్థం చత్వరే దుగ్ధం పాత్రే పక్వే చ మృన్మయే ।**
**కాష్ఠత్రయం గుణే బద్ధ్వా కృత్వా రాత్రౌ చతుష్పథే ॥17॥**

**నిశాయాం దీయతే దీపో యావదబ్దం దినే దినే ।**
**దాహోదకం కిమర్థంచ సంవాదః స్వజనైః సహ ॥18॥**

ఇంటివాకిలిలో కాల్చిన మట్టిపాత్రలో పాలుపోసి ఎందుకు ఉంచుతారు? మూడు కర్రపుల్లలను త్రాటితో (ఉట్టిగా)కట్టి, నాలుగు బాటల కూడలిలో దానిలో దీపంఉంచి రాత్రిఎందుకు ఉంచుతారు? సంవత్సరపర్యంతం ప్రతిదినం రాత్రిదీపం ఎందుకు పెడతారు? దాహోదకాలను ఎందుకు ఈయాలి? స్వజనులు మంచిమాటలే ఎందుకు పలకాలి?

**భగవన్నతివాహస్య నవపిండైస్తు కిం భవేత్ ।**
**కథం దేవ పితృభ్యశ్చ వాహస్యావాహనం కథమ్ ॥19॥**

స్వామీ! అతివాహకదేహానికి తొమ్మిది పిండాలు ఈయడంవల్ల ఏం ప్రయోజనం చేకూరుతుంది? దేవా! దేవతలకోసం పితరులకోసమై అతివాహశరీరానికి ఆవాహనం ఎలా వీలవుతుంది?

**కిం తత్ప్రదీయతే తస్య పిండదానాదనంతరమ్ ।**
**అస్థి సంచయనం చైవ శయ్యాదానం కిమర్థకమ్ ॥20॥**

మృతునికి పిండప్రదానం తరవాత ఏం ఈయవలసిఉంది? అస్థిసంచయనం, శయ్యాదానం దేనికోసం చేయాలి?

**ద్వితీయేఽహ్ని కుతః స్నానం చతుర్థే సాగ్నికే ద్విజే ।**
**దశమే కిం మలస్నానం కార్యం సర్వజనైః సహ ॥21॥**

రెండో రోజు ఎందుకు స్నానంచేయాలి? నాలుగో రోజున (మృతుడైన) అగ్నిహోత్రి అయిన ద్విజునికి ఏం చేయాలి? సమస్త జనులతో కూడా పదో రోజు ఎందుకు మలస్నానం చేయాలి?

**కస్మాత్తైలోద్వర్తనం చ స్కంధవాహాన్ గృహం నయేత్ ।**
**తైః సముద్వర్తనం చాపి దద్యుః స్థలజలాశ్రయే ॥22॥**

శవాన్ని భుజాలపై పెట్టి మోసినవారిని, తలంటు స్నానం కోసమై ఎందుకు ఇంటికి పంపాలి? వారు జలాశయప్రదేశాలలో కూడ తలస్నానం ఎందుకుచేస్తారు?

**దశమేఽహని యః పిండస్తం దద్యాదామిషేణ తు ।**
**పిండం చైకాదశే కస్మాద్ వృషోత్సర్గః కథం భవేత్ ॥23॥**

పదో రోజున ఇచ్చే పిండం ఆమిషంతో కలిపి ఎందుకు ఈయాలి? పదకొండో రోజున కూడ ఎందుకు పిండం వేయాలి? వృషోత్సర్జనవిధి ఎలా జరపాలి?

**శ్రాద్ధాని షోడశైతాని అబ్దం యావత్కుతో వద ।**
**అన్నాది చోదకేనైవ షష్ట్యధిక శతత్రయమ్ ॥24॥**

ఈ షోడశశ్రాద్ధాలు అనేవి సంవత్సరపర్యంతం ఏల చేయాలో చెప్పు. మూడువందలఅరవై రోజులు ఉదకసహితంగా అన్నాదుల నేల ఈయాలి?

**దినే దినే చ దాతవ్యం ఘటాన్నం ప్రేతతృప్తయే ।**
**ప్రాప్తే కాలే చ మ్రియతే అనిత్యో మానవః ప్రభో ॥25॥**

ప్రేతతృప్తికోసమై ప్రతిదినం ఘటాన్నం ఎందుకు ఈయాలి? కాలం సమీపిస్తే ప్రాణి మరణిస్తాడు. ప్రభూ! మానవుడు అశాశ్వతుడు కదా!

**ఛిద్రం తు నైవ పశ్యామి కుతో జీవః స నిర్గతః ।**
**కుతో గచ్ఛన్తి భూతాని పృథివ్యాపో మనస్తథా ॥26॥**

**తేజో వదస్వ మే నాథ వాయురాకాశమేవ చ ।**
**వాయవశ్చైవ పంచైతే కథం గచ్ఛన్తి చాప్తయే ॥27॥**

ఎక్కడా రంధ్రమన్నది కానరాదు, మరి జీవుడు ఎలా బయటకు వెళ్లిపోతాడు? భూతాలు ఎలా బయటకు వెళ్లిపోతాయి. నాథా! భూమి, జలం, మనస్సు, అగ్ని, వాయువు, ఆకాశం అనే తత్త్వాలు ఎలా వెడతాయో నాకు చెప్పుచు, పంచ వాయువులు రహస్యంగా ఎలా వెళ్లిపోతాయి?

**లోభమోహాదయః పంచ శరీరే చైవ తస్కరాః ।**
**తృష్ణా కామోఽప్యహంకారః కుతో యాంతి జనార్దన ॥28॥**

జనార్దనా! లోభ మోహాదులు, తృష్ణ, కామం, అహంకారం అనే అయిదుగురు దొంగలు శరీరంలో ఉంటారుకదా! వారు ఎక్కడికి వెళ్లిపోతారు?

**పుణ్యం వాప్యథవాపుణ్యం యత్కించి త్సుకృతం తథా ।**
**నష్టే దేహే కుతో యాంతి దానాని వివిధాని చ ॥29॥**

పుణ్యమైనా, లేక పాపమయినా, లేదా ఏ కొంచెం సుకృతమయినా, దేహం నష్టంకాగా ఎక్కడికి వెడతాయి? వివిధ దానాలుకూడ ఎలా వెడతాయి?

**సపిండనం కిమర్థం చ పూర్ణే సంవత్సరేఽపి వా ।**
**ప్రేతస్య మేలనం సార్ధం కైస్సమం తత్ర కో విధిః ॥30॥**

సంవత్సరం పూర్తిఅయ్యేలోపుగా లేదా సాంవత్సరికంనాడు కాని, సపిండీకరణం దేనికోసం చేయాలి? ఎవరితో సమానంగా కలిపి ప్రేతకు సమ్మేలనం జరపాలి? అక్కడ జరగవలసిన విధి ఏమిటి?

**యో దగ్ధా యేత్వదగ్ధాశ్చ పతితా యే నరా భువి ।**
**యాని చాన్యాని భూతాని తేషామంతే భవేచ్చ కిమ్ ॥31॥**

భూమియందు ఎవరయితే దహింపబడతారో, ఎవరయితే దహింపబడరో, ఎవరయితే పతితులుగా మరణిస్తారో, అలాగే మిగిలిన ప్రాణులు ఏవయితే ఉన్నాయో, వారికి మరణాంతంలో జరిగేది ఏ విధంగా ఉంటుంది?

**పాపినో యే దురాచారా ముద్గలత్వం చ యే గతాః ।**
**ఆత్మఘాతీ బ్రహ్మహా చ స్తేయీ విశ్వాసఘాతకః ॥32॥**

**కపిలాం యః పిబేచ్ఛూద్రో యః పఠేద్వైదికాక్షరమ్ ।**
**ధారయేద్వా బ్రహ్మసూత్రం కాగతి స్తస్య మాధవ ॥33॥**

దురాచారులైన ఏ పాపాత్ములకు, ప్రేతత్వాన్ని పొందినవారికి, ఆత్మఘాతకునకు బ్రహ్మహంతకు, తస్కరునికి, విశ్వాసఘాతకునికి కపిలధేనువు పాలుత్రాగే శూద్రునికి వైదిక మంత్రాలతో బ్రహ్మసూత్రాన్ని ధరించిన శూద్రునికి, మాధవా! వచ్చే గతి ఏమిటి?

**విప్రస్య బ్రాహ్మణీ భార్యా సంగృహీతా యదా భవేత్ ।**
**తస్మాత్పాపాచ్చ భీతోఽహం తన్మే వద జగత్పతే ॥**
**సర్వమేతన్మయా పృష్టో వద లోకహితాయ వై ॥34॥**

విప్రుని భార్య అయిన బ్రాహ్మణి సంగృహీత అయినచో, ఆ పాపంవల్ల నేను మిక్కిలి భయపడతాను, జగత్పతీ! నాకు అవన్నీ వివరించు. ఇదంతా నిన్ను అడగడం జరిగింది. లోకహితం కోసమై వివరించు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ఔర్ధ్వదైహిక కర్మకాల క్రియమాణ దానాది ఫలప్రశ్న నిరూపణం నామ అష్టావింశోఽధ్యాయః ॥28॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో వివిధ దానాల ఫలితాన్ని నిరూపించుట అనే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం

## దర్భతిలతులసీపత్రాది వివిధ దానావశ్యక నిరూపణమ్ -

దర్భతిలతులసీపత్రాద్ది వివిధ దానాల అవసరాన్ని తెలుపుట

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**సాధు పృష్టం త్వయా భద్ర మానుషాణాం హితాయ వై ।**
**శృణుష్వావహితో భూత్వా సర్వమేవౌర్ధ్వదైహికమ్ ॥1॥**

భద్రా! మనుష్యుల మేలుకోసమై నీవు చక్కగా అడిగావు, సమస్తమైన ఊర్ధ్వదేహక్రియను సావధానుడవై విను.

**సమ్యగ్విభేదరహితం శ్రుతిస్మృతిసముద్ధృతమ్ ।**
**యన్న దృష్టం సురైః సేంద్రైర్యోగిభిర్యోగచింతకైః ॥2॥**

ఇది సరియైనది ఏ భేదాలు లేనటువంటిది, శ్రుతులనుండి, స్మృతులనుండి ఉద్ధరింపబడినటువంటిది. దేవతలచే కాని, ఇంద్రాదులచే గాని, యోగులచే కాని, ధ్యానచింతన చేసేవారిచే గాని చూడబడనటువంటిది.

**గుహ్యాద్గుహ్యతరం వత్స నాఖ్యాతం కస్యచిత్ క్వచిత్ ।**
**భక్తస్త్వం హి మహాభాగ సర్వం తే కథయామ్యహమ్ ॥3॥**

వత్సా! రహస్యాలలో మిక్కిలి రహస్యమైనది, ఎవ్వరికి ఎప్పుడూ చెప్పబడనటువంటిది. మహాభాగా! నీవు నా భక్తుడవు. అందువల్ల నీకు నేను అంతా తెలియజేస్తాను.

**అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవ చ నైవ చ ।**
**యేన కేనాప్యుపాయేన కార్యం జన్మ సుతస్య చ ॥4॥**

పుత్రులు లేనివారికి గతిలేదు, స్వర్గమూలేదు, స్వర్గమన్నది లేనేలేదు. అందువల్ల ఏదో ఒక ఉపాయంద్వారా సుతోత్పత్తికి తగిన కార్యం చేయవలసిఉంది.

**తారయేన్నరకాత్ పుత్రో యది మోక్షో న విద్యతే ।**
**దాహః పుత్రేణ కర్తవ్యో దేయః పౌత్రేణ పావకః ॥5॥**

పుత్రుడు నరకంనుండి తరింపజేస్తాడు, లేకపోతే విముక్తి అన్నది లభించదు. అగ్నిసంస్కారం పుత్రుడు చేయాలి. లేదా మనుమడు అగ్నిదాహం చేయాలి.

**తిలైర్దర్భైశ్చ భూమ్యాం వై కుటీ ధాతుమతీ భవేత్ ।**
**పంచరత్నాని వక్త్రే తు యేన జీవః ప్రరోహతి ॥6॥**

తిలలను, దర్భలను నేలపై వేయాలి, దానివల్ల దేహాన్ని ఉంచిన కుటి(గుడిసె) ఋతుమతి అవుతుంది. నోటిలో పంచ రత్నాలను ఉంచాలి. వాటివల్ల జీవుడు తిరిగి అంకురిస్తాడు.

**లిప్యాత్తు గోమయైర్భూమిం తిలాన్ దర్భాంశ్చ నిఃక్షిపేత్ ।**
**తస్యామేవాతురో ముక్తః సర్వం దహతి పాతకమ్ ॥7॥**

భూమిని గోమయంతో అలికి, అక్కడ తిలలను దర్భలను ఉంచాలి. అందువల్ల అక్కడనే ఆతురుడు విముక్తుడవుతాడు. సమస్త పాతకమూ నశించిపోతుంది.

**దర్భమూలీ నయేత్స్వర్గం సంస్థితం నాత్ర సంశయః ।**
**దర్భాంస్తత్ర హి యే భూమ్యాం తిలయుక్తా న సంశయః ॥8॥**

దర్భమూలి స్వర్గానికి గొంపోతుంది, అక్కడ ఉండేలా చేస్తుంది. అందు సందేహం లేదు. అక్కడ నేలపై తిలలతో కూడిన దర్భలను పరచాలి, సంశయమన్నది ఇసుమంతా లేదు.

**సర్వత్ర వసుధా పూతా యత్ర లేపో న విద్యతే ।**
**యత్ర లేపః స్థితస్తత్ర పునర్లేపేన శుద్ధ్యతి ॥9॥**

అందువల్ల భూమి పవిత్రమవుతుంది, ఎక్కడ పేడపూత లేనిచోట తిరిగి పేడపూత ఉండేలా చేయాలి. మళ్లీ అలాపేడతో అలకడంవల్ల అక్కడ శుద్ధి అవుతుంది.

**యాతుధానాః పిశాచాశ్చ రాక్షసాః క్రూరకర్మిణః ।**
**అలిప్తే ఆతురం ముక్తం విశంత్యేతే న సంశయః ॥10॥**

పేడపూత లేనిచోట యాతుధానులు, పిశాచులు, రాక్షసులు, క్రూరకర్ములు ముక్తుడయ్యే ఆతురుని వద్దకు ప్రవేశిస్తారు. సంశయంలేదు.

**నిత్యహోమం తథా శ్రాద్ధం విప్రాణాం పాదశోధనమ్ ।**
**మండలేన వినా భూమ్యాం కుర్వంత్యేతచ్చ నిష్ఫలమ్ ॥11॥**

నిత్యహోమం, అలాగే శ్రాద్ధం, బ్రాహ్మణుల పాదాలు కడగడం మున్నగునవన్నీ, భూమిపై మండలం లేకపోతే, చేసినవన్నీ చేయనట్లే అయి నిష్ఫలమౌతాయి.

**ఆతురో ముచ్యతే నైవ మండలేన వినా భువి ।**
**బ్రహ్మా రుద్రశ్చ విష్ణుశ్చ శ్రీర్హుతాసన ఏవ చ ॥**
**మండలేచోపతిష్ఠంత స్తస్మాత్ కుర్వీత మండలమ్ ॥12॥**

భూమియందు మండలం లేకపోతే ఆతురుడు ముక్తుడు కాలేడు. బ్రహ్మ, రుద్రుడు, విష్ణువు, లక్ష్మి, అగ్ని మండలంలో ఉపస్థితులై ఉంటారు. అందువల్ల మండలాన్ని ఏర్పరచాలి.

**అన్యథా మ్రియతే యస్తు బాలో వృద్ధో యువాపి వా ।**
**యోన్యంతరం స వై గచ్ఛేత్ క్రీడతే వాయునా సహ ॥13॥**

మరోవిధంగా ఎవడయితే మరణిస్తాడో, బాలుడయినా, యువకుడయినా, వృద్ధుడయినా, అతడు మరోజన్మను పొందుతాడు అంతవరకు గాలిలోనే జీవిస్తాడు.

**మిశ్రితం లోహతామ్రం తు తథైవ జన్మ జాయతే ।**
**తస్యైవం వాయుభూతస్య న శ్రాద్ధం నోదకక్రియా ॥14॥**

అలాగే ఇనుము, రాగి కలిసినట్లుగా జన్మను పొందుతాడు. అలా వాయుభూతుడై ఉండేవానికి శ్రాద్ధమూ లేదు, ఉదకక్రియ కూడ ముట్టదు.

**మమ స్వేదసముద్భూతా స్తిలాస్తార్క్ష్య పవిత్రకాః ।**
**అసురా దానవా దైత్యాస్తృప్యంతి తిలదానతః ॥15॥**

గరుడా! తిలలు నా చెమటనుండి పుట్టాయి, అవి పరమపవిత్రాలు, తిలదానం చేయడంవల్ల అసురులు, దానవులు, దైత్యులు తృప్తిపొందుతారు.

**తిలాః శ్వేతా స్తిలాః కృష్ణా స్తిలా గోమూత్రసన్నిభాః ।**
**తే మే దహంతు పాపాని శరీరేణ కృతాని చ ॥16॥**

కొన్ని తిలలు తెల్లగా, కొన్ని తిలలు నల్లగా, కొన్ని గోమూత్ర తుల్యాలుగా ఉంటాయి. నా సంబంధమైన ఆ తిలలు శరీరంచే చేయబడిన పాపాలను నశింపజేస్తాయి.

**ఏక ఏవ తిలద్రోణో హేమద్రోణతిలైః సమః ।**
**తర్పణే దానహోమే చ దత్తో భవతి చాక్షయః ॥17॥**

ఒక్క తిలలతో నిండిన దొన్నెయే, బంగారు దొన్నెలో నింపిన తిలలతో సమానం. తర్పణంలోను, దానంలోను, హోమంలోను, దానిని ఇచ్చినట్లయితే అది అక్షయమవుతుంది.

**దర్భా మల్లోమసంభూతా స్తిలాః స్వేదసముద్భవాః ।**
**తృప్తాః స్యు ర్దేవతా దానైః శ్రాద్ధేన పితరస్తథా ॥**
**ప్రయోగవిధినా బ్రహ్మా విశ్వఞ్చాప్యుపజీవనాత్ ॥18॥**

దర్భలు నా రోమాల నుండి పుట్టాయి. తిలలు నా స్వేదం నుండి ఉద్భవించాయి, దానాలచే దేవతలు తృప్తులవుతారు. శ్రాద్ధాలచేత పితరులు సంతృప్తులవుతారు. ప్రయోగవిధివల్ల బ్రహ్మ, విశ్వమూ కూడ ఉపజీవన కారకాలవుతున్నాయి.

**సవ్య యజ్ఞోపవీతేన బ్రహ్మాద్యా స్తృప్తిమాప్నుయుః ।**
**అపసవ్యేన తృప్యంతి పితరో దివి దేవతాః ॥19॥**

యజ్ఞోపవీతాన్ని సవ్యంగా చేయడంచే బ్రహ్మాదులు తృప్తిపొందుతారు. అపసవ్యవిధానంచే దివిలోని పితృదేవతలు సంతృప్తిపొందుతారు.

**అపసవ్యాదితో బ్రహ్మా దర్భమధ్యే తు కేశవః ।**
**దర్భాగ్రే శంకరం విద్యాత్ త్రయో దేవాః కుశే స్థితాః ॥20॥**

అపసవ్యవిధానంలో దర్భమూలంలో బ్రహ్మఉంటాడు. దర్భమధ్యలో కేశవుడు ఉంటాడు. దర్భ చివరిభాగంలో శంకరుడు ఉంటాడు. కుశయందు ఈ విధంగా ముగ్గురుదేవతలు ఉంటారు.

**విప్రా మంత్రాః కుశా వహ్ని స్తులసీ చ ఖగేశ్వర ।**
**నైతే నిర్మాల్యతాం యాంతి క్రియమాణాః పునః పునః ॥21॥**

**కుశాః పిండేషు నిర్మాల్యాః బ్రాహ్మణాః ప్రేతభోజనే ।**
**మంత్రాః శూద్రేషు పతితా శ్చితాయాశ్చ హుతాశనః ॥22॥**

ఖగరాజా ! విప్రులు, మంత్రాలు, కుశలు, అగ్ని, తులసి మళ్లీ మళ్లీ ఉపయోగించినా, ఇవి మలినత్వాన్ని పొందడమనేది ఉండదు. పిండాలపై ఉంచిన కుశలు మలినాన్ని పొందవు, ప్రేతనుద్దేశించి పెట్టిన భోజనం చేసినా బ్రాహ్మణులు మలినులు కారు, మంత్రాలు శూద్రులయందు అపవిత్రాలవుతాయి, చితియందున్న అగ్నికూడ అపవిత్రమైనదే,

**తులసీ బ్రాహ్మణా గావో విష్ణురేకాదశీ ఖగ ।**
**పంచప్రవహణాన్యేవ భవాబ్ధౌ మజ్జతాం సతామ్ ॥23॥**

ఖగమా! తులసి, బ్రాహ్మణులు, గోవులు, ఏకాదశి, విష్ణువు సంసారసాగరంలో మునిగిపోతున్న సత్పురుషులకు అయిదు ప్రయాణసాధనాలు.

**విష్ణురేకాదశీ గీతా తులసీ విప్రధేనవః ।**
**అపారే దుర్గ సంసారే షట్పదీ ముక్తిదాయినీ ॥24॥**

విష్ణువు, ఏకాదశి, గీత, తులసి, బ్రాహ్మణులు, గోవులు తీరంలేని, దాటశక్యంకాని సంసారంలో ఈ ఆరును ముక్తినిచ్చేటటువంటివి.

**తిలాః పవిత్రా స్త్రివిధా దర్భాశ్చ తులసీదలమ్ ।**
**నివారయంతి చైతాని దుర్గతిం యాంతమాతురమ్ ॥25॥**

మూడు విధాలైన తిలలు, దర్భలు, తలసీదళాలు పవిత్రాలు, ఇవి నరకాన్ని పొందే ఆతురుని దుర్గతిని నివారిస్తాయి.

**హస్తాభ్యా ముద్ధృతైర్దర్భై స్తోయేన ప్రోక్షయేద్భువమ్ ।**
**మృత్యుకాలే క్షిపేద్దర్భానాతురస్య కరద్వయే ॥26॥**

చేతులలో దర్భలను చల్లి, నీటితో నేలను ప్రోక్షణ చేయాలి, మృత్యుసమయంలో ఆతురుని రెండు చేతులలోను దర్భలను ఉంచాలి.

**దర్భేషు క్షిప్యతే యోఽసౌ దర్భ(ర్భై)స్తు పరివేష్టితః ।**
**విష్ణులోకం స వై యాతి మంత్రహీనోఽపి మానవః ॥27॥**

అలా దర్భలు వెదజల్లబడగా, దర్భలచే పరివేష్టితుడై, ఆ మానవుడు మంత్రాలు లేకపోయినా విష్ణులోకానికి చేరుతాడు.

**దర్భమూలీగతో భూమౌ దర్భపాణిస్తు యో మృతః ।**
**ప్రాయశ్చిత్త విశుద్ధోఽసౌ సంసారేఽపారసాగరే ॥28॥**

దర్భమూలీగతుడైన ప్రాణి భూమియందు,(నేలపై దర్భలపై ఉండి) దర్భలు చేతియందుండి మరణిస్తే, అతడు పాయశ్చిత్తవిధిచే పరిశుద్ధుడై సంసారసాగరపారాన్ని తరించగలుగుతాడు.

**గోమయేనోపలిప్తే తు దర్భస్యాస్తరణే స్థితః ।**
**తత్ర దత్తేన దానేన సర్వం పాపం వ్యపోహతి ॥29॥**

ఆవుపేడతో అలకబడిన నేలపై, దర్భాసనంపై ఉండి, అక్కడ ఇచ్చిన దానంచే, సర్వపాపమూ తొలగిపోతుంది.

**లవణం తద్రసం దివ్యం సర్వకామప్రదం నృణామ్ ।**
**యస్మాదన్నరసాః సర్వే నోత్కటా లవణం వినా ॥30॥**

లవణమూ, లవణరసమూ దివ్యమైనవి. అవి నరులకు కోరికలన్నింటినీ ఇచ్చేవి. ఎందువల్లనంటే అన్నరసాలన్నీ ఉప్పు లేకపోతే ఉత్కృష్టాలు కావు.

**పితౄణాం చ ప్రియం భవ్యం తస్మాత్స్వర్గప్రదం భవేత్ ।**
**విష్ణుదేహ సముద్భూతో యతోఽయం లవణో రసః ॥31॥**

ఈ లవణరసం విష్ణుదేహంనుండి ఉద్భవించిన కారణంచే ఇది పితరులకు ప్రియమైనది, భవ్యమైనది, అందువల్ల స్వర్గలోకగతి కలుగుతుంది.

**విశేషాల్లవణం దానం తేన శంసంతి యోగినః ।**
**బ్రాహ్మణ క్షత్రియ విశాం స్త్రీణాం శూద్రజనస్య చ ॥32॥**

**ఆతురాణాం యదా ప్రాణాః ప్రయాంతి వసుధాతలే ।**
**లవణం తు తదా దేయం ద్వారస్యోద్ఘాటనం దివః ॥33॥**

అందువల్ల లవణదానాన్ని విశేషంగా యోగులు ప్రశంసిస్తారు, కాబట్టి బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు, స్త్రీలకు, శూద్రజనులకు, ఆతురులకు భూతలంనుండి ప్రాణాలు పోయేటప్పుడు లవణదానం తప్పనిసరిగా ఈయాలి. అది స్వర్గద్వారాలను తెరిపిస్తుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ఔర్ధ్వదేహికకర్మణి పుత్రదర్భతిలతులసీగోభూలేప తామ్రపాత్ర దానాదీనామావశ్యకత్వనిరూపణం నామైకోనత్రింశోఽధ్యాయః ॥29॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఔర్ధ్వదేహిక కర్మలో దర్భతిలతులసీపత్రగోభూలేపన తామ్రపాత్రాది వివిధదానాల అవసరాన్ని తెలుపుట అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం

## నానాదాననిరూపణమ్ - వివిధదానాల స్వరూపఫలితాలు

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**శృణు తార్క్ష్య పరం గుహ్యం దానానాం దానముత్తమమ్ ।**
**పరమం సర్వదానానాం పరం గోప్యం దివౌకసామ్ ॥1॥**

**దేయమేకం మహాదానం కూర్పాసం చోత్తమోత్తమమ్ ।**
**యో న దత్తే న ప్రీయంతే భూర్భువఃస్వరితి క్రమాత్ ॥2॥**

గరుడా! విను, దానాలలోకెల్ల ఉత్తమమైనదానం ప్రత్తి (పత్తి) దానం. ఇది మిక్కిలి రహస్యమైనది, సర్వదానాలలో మిక్కిలి ఉత్కృష్టమైన దానం ఇది. దేవతలకు కూడ పరమగుహ్యామైనది. ఆ మహాదానం ఒక్కటి ఇస్తే చాలు. అదే ఉత్తమోత్తమమైన దానం. ఆ దానమిస్తే క్రమంగా భూలోక, భువర్లోక, స్వర్లోకాలు మూడూ ప్రసన్నమవుతాయి.

**బ్రహ్మాద్యా దేవతాః సర్వాః కార్యాచ్చ ప్రీతి మాప్నుయుః ।**
**దేయమేతన్మహాదానం ప్రేతోద్ధరణహేతవే ॥3॥**

ఆ దానం చేయడంవల్ల బ్రహ్మాది దేవతలందరూ సంప్రీతిని పొందుతారు. ప్రేతను ఉద్ధరించుటకొరకై, ఈ మహాదానం ఈయాలి.

**చిరం వసేద్రుద్రలోకే తతో రాజా భవేదిహ ।**
**రూపవాన్ సుభగో వాగ్మీ శ్రీమానతులవిక్రమః ॥**
**యమలోకం వినిర్జిత్య స్వర్గం తార్క్ష్య స గచ్ఛతి ॥4॥**

దానివల్ల రుద్రలోకంలో చాలాకాలం వసించి, పిమ్మట రూపవంతుడు, సౌభాగ్యవంతుడు, వాక్చతురుడు, శ్రీమంతుడు, సాటిలేని పరాక్రమంగలవాడు అయిన రాజుగా జన్మిస్తాడు. గరుడా! అతడు యమలోకాన్ని జయించి స్వర్గానికి వెడతాడు.

**గాం తిలాంశ్చ క్షితిం హేమ యో దదాతి ద్విజన్మనే ।**
**తస్య జన్మార్జితం పాపం తత్క్షణాదేవ నశ్యతి ॥5॥**

ఆవును, తిలలను, భూమిని, బంగారాన్ని బ్రాహ్మణునకు దానంచేస్తే, దాత పూర్వ ప్రస్తుత జన్మార్చిత పాపమంతా ఆ క్షణంలోనే నశించిపోతుంది.

**తిలా గావో మహాదానం మహాపాతకనాశనమ్ ।**
**తద్ద్వయం దీయతే విప్రే నాన్యవర్ణే కదాచన ॥6॥**

తిలలు, గోవులు మహాదానం అనబడతాయి. ఆ దానం మహాపాతకాలను నశింపజేస్తుంది. ఆ రెండింటిని విప్రునికే ఈయాలి, మిగిలిన వర్ణాలవారికి ఎన్నడును ఈయరాదు.

**కల్పితం దీయతే దానం తిలా గావశ్చ మేదినీ ।**
**అన్యేషు నైవ వర్ణేషు ప్రోష్యవర్గే కదాచన ॥7॥**

తిలలు, గోవులు, భూమి మహాదానంగా పరికల్పింపబడి ఇవ్వడం జరగాలి, మిగిలిన వర్ణాలవారికి, సేవక వర్గంవారికి ఎన్నడూ ఈయరాదు.

**పోష్యవర్గే తథా స్త్రీషు దానం దేయమకల్పితమ్ ।**
**ఆతురే వోపరాగే చ ద్వయం దానం విశిష్యతే ॥**
**ఆతురే దీయతే దానం తత్కాలేచోపతిష్ఠతి ॥8॥**

పోష్యవర్గమందు, స్త్రీలయందు మహాదానం చేయడం పరికల్పింపబడలేదు. ఆతురుని విషయంలో, గ్రహణ సమయంలో దానద్వయం(తిలలు,గోవులు) విశేషఫలితాన్ని ఇస్తుంది. ఆతురుని విషయంలో దానంచేస్తే, ఆ కాలంలోనే ఫలితం సంక్రమిస్తుంది.

**జీవితస్తు పునర్దత్త ముపతిష్ఠత్యసంస్కృతమ్ ।**
**సత్యం సత్యం పునః సత్యం యద్దత్తే వికలేంద్రియే ॥9॥**

అతడు వికలేంద్రియుడుగా జీవించి ఉండగానే, ఇచ్చినా, అతడు మరణించి వెంటనే ఇచ్చినా, ఇంకా సంస్కారం కాకుండగానే ఫలితాన్ని ఇస్తుంది. ఇది సత్యం, సత్యం. ముమ్మాటికీ సత్యం.

**యచ్చానుమోదతే పుత్రస్తచ్చ దానమనంతకమ్ ।**
**అతో దద్యాత్ సపుత్రో వా యావజ్జీవత్యసౌ చిరమ్ ॥10॥**

పుత్రుడు అయితే ఏ దానాన్ని ఆమోదిస్తాడో, ఆ దానం అనంతఫలితాలను ఇస్తుంది. అందువల్ల ఆ పుత్రుడూ దానంఈయాలి. తండ్రి కూడ జీవించినంత కాలం దానాలుచేయాలి.

**అతివాహస్తథా ప్రేతో భోగాంశ్చ లభతే యతః ।**
**అస్వస్థాతురకాలే తు దేహపాతే క్షితిస్థితే ॥**
**దేహే తథాతివాహస్య పరతః ప్రీణనం భవేత్ ॥11॥**

అందువల్ల అతివాహశరీరంతో ఉండే ప్రేతకూడ భోగాలను పొందుతాడు, అస్వస్థుడుగా, ఆతురుడుగా పడిఉన్న సమయంలోనూ, దేహం పతనమై నేలపై పడిపోయిన సమయంలోనూ, అలాగే అతివాహశరీరంలోనూ, పరలోకంలోనూ వాటివల్ల ప్రీతి పొందుతాడు.

**పంగావంధే చ కాణే చ హ్యర్ధోన్మీలితలోచనే ।**
**తిలేషు దర్భాన్ సంస్తీర్య దానముక్తం తదక్షయమ్ ॥12॥**

కుంటివాని విషయంలోను, గ్రుడ్డివాని విషయంలోను, ఒంటికన్నువాని విషయంలోను, అర్ధనిమీలితలోచనుని విషయంలోను తిలలపై దర్భలను పరచి దానంచేస్తే, అది అక్షయమవుతుందని చెప్పబడింది.

**తిలా లౌహం హిరణ్యఞ్చ కార్పాసం లవణం తథా ।**
**సప్తధాన్యం క్షితిర్గావ ఏకైకం పావనం స్మృతమ్ ॥13॥**

తిలలు, ఇనుము, బంగారం, ప్రత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు, భూమి, గోవులు ఒక్కొక్కటి పవిత్రంగా చెప్పబడ్డాయి.

**లోహదానాద్యమస్తుష్యే ద్ధర్మరాజ స్తిలార్పణాత్ ।**
**లవణే దీయమానే తు న భయం విద్యతే యమాత్ ॥14॥**

లోహదానంవల్ల యముడు సంతోషిస్తాడు. తిలలు దానంచేయడంవల్ల ధర్మరాజు తృప్తిపొందుతాడు. ఉప్పును దానంచేయడంవల్ల యమునివల్ల భయమనేది ఉండదు.

**కార్పాసస్య తు దానేన న భూతేభ్యో భయం భవేత్ ।**
**తారయంతి నరం గావ స్త్రివిధాశ్చైవ పాతకాత్ ॥15॥**

ప్రత్తి దానం చేయడంవల్ల భూతాలవల్ల భయంకలగదు. ఆవులు నరుని త్రివిధ పాతకాలనుండి(మనోవాక్కాయ పాతకాలనుండి) తరింపజేస్తాయి.

**హేమదానాత్ సుఖం స్వర్గే భూమిదానా న్నృపో భవేత్ ।**
**హేమభూమి ప్రదానాచ్చ న పీడా నరకే భవేత్ ॥16॥**

హేమదానంవల్ల స్వర్గంలో సుఖం కలుగుతుంది. భూమిదానంవల్ల రాజు కాగలడు. బంగారం, భూమి దానం చేయడంవల్ల నరకంలో పీడ అనేది కలగదు.

**సర్వేఽపి యమదూతాశ్చ యమరూపా విభీషణాః ।**
**సర్వే తే వరదా యాంతి సప్తధాన్యేన ప్రీణితాః ॥17॥**

మిక్కిలి భయంకరులై, తీవ్రరూపులైన, యమకింకరులు అందరూ సప్త ధాన్యాలచేత సంప్రీతులవుతారు. వారు అందరూ వరాలు ఇచ్చి వెడతారు.

**విష్ణోః స్మరణమాత్రేన ప్రాప్యతే పరమా గతిః ।**
**ఏతత్తే సర్వమాఖ్యాతం మర్త్యైర్యా గతిరాప్యతే ॥18॥**

విష్ణువుయొక్క స్మరణమాత్రం చేతనే పరమగతి లభిస్తుంది. మర్త్యులు పొందే గతిని నీకు పూర్తిగా చెప్పాను.

**తస్మాత్ పుత్రం ప్రశంసంతి దదాతి పితురాజ్ఞయా ।**
**భూమిస్థం పితరం దృష్ట్వా హ్యర్ధోన్మీలితలోచనమ్ ॥19॥**

**తస్మిన్ కాలే సుతో యస్తు సర్వదానాని దాపయేత్ ।**
**గయాశ్రాద్ధాద్విశిష్యేత స పుత్రః కులనందనః ॥20॥**

తండ్రి ఆజ్ఞచే కొడుకు ఇస్తాడు, కాబట్టి పుత్రుడుని ప్రశంసిస్తారు. అర్ధోన్మీలితలోచనుడై (కన్నులు సగం తెరచి ఎటోచూస్తూ ఉండే) నేలపై పడిపోయిఉన్న తండ్రిని చూచి, ఆ ఉత్క్రమణ సమయంలో ఏ కొడుకు సర్వదానాలు చేస్తాడో, ఆ ఫలితం గయాశ్రాద్ధంకన్న విశిష్టమవుతుంది. ఆ పుత్రుడు కులాన్ని ఆనందింపజేస్తాడు.

**స్వస్థానాచ్చలితశ్చాసౌ వికలస్య పితుస్తదా ।**
**పుత్రైర్యత్నేన కర్తవ్యా పితరం తారయంతి తే ॥21॥**

ఆ పుత్రుడు తనస్థానంనుండి చలితుడై ఉన్నతుడవుతాడు, మరణాసన్నసమయంలో ఉన్న తండ్రికి పుత్రులు ఆటంకాలను అధిగమించి దానాలు చేయాలి. అవి పితరులను తరింపజేస్తాయి.

**కిం దత్తై ర్బహుభిర్దానైః పితురన్త్యేష్టిమాచరేత్ ।**
**అశ్వమేధో మహాయజ్ఞః కలాం నార్హతి షోడశీమ్ ॥22॥**

ఇతరత్ర పెక్కుదానాలు చేయడంవల్ల ఫలితం ఏముంటుంది కనుక? తండ్రియొక్క అంత్యేష్టిలో దానాలు చేయాలి. అశ్వమేధమహాయజ్ఞం అందు పదహారో భాగానికి కూడ సాటిరాదు.

**ధర్మాత్మా స ను పుత్రో వై దేవైరపి సుపూజ్యతే ।**
**దాపయేద్యస్తు దానాని హ్యాతురం పితరం భువి ॥23॥**

భూమియందు ఆతురుడైన తండ్రిని ఉద్దేశించి ఏ పుత్రుడు దానాలను చేస్తాడో, అతడు ధర్మాత్ముడు కదా! ఆ పుత్రుడు దేవతలచేకూడ పూజింపబడతాడు.

**లోహదానఇ్చ దాతవ్యం భూమియుక్తేన పాణినా ।**
**యమం భీమఇ్చ నాప్నోతి న గచ్ఛేత్తస్య వేశ్మని ॥24॥**

నేలపై ఉండగానే చేతితో లోహదానం చేయవలసింది, అటువంటివాడు భయంకరుడైన యముని పొందడు. అతని గృహంలోకి ప్రవేశించడు.

**కుఠారో ముసలో దండః ఖడ్గశ్చ ఛురికా తథా ।**
**ఏతాని యమహస్తేషు దృశ్యాని పాపకర్మిణామ్ ॥25॥**

కుఠారం, ముసలం, దండం, ఖడ్గం, ఛురిక అనే ఈ ఆయుధాలు యమునిచేతులలో పాపాత్ములకు కనబడతాయి.

**తస్మాల్లోహస్య దానన్తు బ్రాహ్మణాయాతురో దదేత్ ।**
**యమాయుధానాం సంతుష్ట్యై దానమేతదుదాహృతమ్ ॥26॥**

అందువల్ల బ్రాహ్మణునకు ఆతురుడు లోహదానం చేయాలి. యముని ఆయుధాల సంతుష్టికోసమై ఈ దానం చెప్పబడింది.

**గర్భస్థాః శిశవో యే చ యువానః స్థవిరా స్తథా ।**
**ఏభిర్దానవిశేషైస్తు నిర్దహేయుః స్వపాతకమ్ ॥27॥**

గర్భస్థులైన శిశువులు, యువకులు, ముసలివాండ్రు మున్నగువారు, ఈ దానవిశేషాలతో తమపాతకాన్ని దహింపజేసుకొంటారు.

**ఘురిణః శ్యామశబలౌ షండామర్కా ఉదుంబరాః ।**
**శబలాశ్యామదూతా యే లోహదానేన ప్రీణితాః ॥28॥**

ఘురికాధారులు, శ్యామశబలులు, షండామర్కులు, ఉదుంబరులు, శబలులు, శ్యామదూతలు వీరు లోహదానంచే సంప్రీతులవుతారు.

**పుత్రాః పౌత్రాస్తథా బంధుః సగోత్రాః సుహృదస్తథా ।**
**దదతే నాతురేదానం బ్రహ్మఘ్నైస్తు సమాహితే ॥29॥**

పుత్రులు, పౌత్రులు, బాంధవులు, సగోత్రులు, సౌహృదులు ఆతురుని విషయంలో దానం చేయకపోతే వారు బ్రహ్మహంతకులతో సమానులవుతారు.

**పంచత్వే భూమియుక్తస్య శృణు తస్య చ యా గతిః ।**
**అతివాహః పునః ప్రేతో వర్షోర్ధ్వం సుకృతం లభేత్ ॥30॥**

నేలపై పడిపోయి ఉన్నవాడు మరణించగానే, ఆతనిగతి ఎలాఉంటుందో విను. అతడు వెంటనే అతివాహశరీరంగల ప్రేతగా మారి, ఒక ఏడు పూర్తిఅయ్యాక తన పుణ్యాల లాభాన్ని అనుభవిస్తాడు.

**అగ్నిత్రయం త్రయో లోకా స్త్రయో వేదా స్త్రయోఽమరాః ।**
**కాలత్రయం త్రిసంధ్యం చ త్రయోవర్ణా స్త్రిశక్తయః ॥31॥**

అగ్నులు మూడు, లోకాలు మూడు, వేదాలు మూడు, దేవతలు కూడా ముగ్గురే(త్రిమూర్తులు), కాలాలు మూడు, సంధ్యలు మూడు, వర్ణాలు మూడు, శక్తులు మూడు.

**పాదాదూర్ధ్వం కటిం యావత్ తావద్బ్రహ్మాధితిష్ఠతి ।**
**గ్రీవాం యావద్ధరిర్నాభేః శరీరే మనుజస్య చ ॥32॥**

**మస్తకే తిష్ఠతీశానో వ్యక్తావ్యక్తో మహేశ్వరః ।**
**ఏకమూర్తే స్త్రయో భాగా బ్రహ్మ విష్ణు మహేశ్వరాః ॥33॥**

మానవుని శరీరంలో పాదాలనుండి పైన కటివరకు బ్రహ్మ అధివసించి యుంటాడు. నాభినుండి కంఠంవరకు శ్రీహరి ఉంటాడు, శిరస్సునందు వ్యక్తావ్యక్త స్వరూపుడైన మహేశ్వరుడగు ఈశానుడు ఉంటాడు. ఈ విధంగా ఒకే మూర్తికి మూడు భాగాలు. అవే బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపాలు.

**అహం ప్రాణః శరీరస్థో భూతగ్రామచతుష్టయే ।**
**ధర్మాధర్మే మతిం దద్యాత్ సుఖదుఃఖే కృతాకృతే ॥34॥**

నేనే శరీరాలలో ప్రాణరూపుడనై జరాయుజ, స్వేదజ, అండజ, ఉద్భిజ్జాలలో (నాలుగు భూతగ్రామాలలో) నివసిస్తున్నాను. నేనే ధర్మాధర్మాలయందు, సుఖదుఃఖాలయందు, కృత్యాకృత్యములయందు ప్రవర్తించే బుద్ధిని ఇస్తాను.

**జంతో ర్బుద్ధిం సమాస్థాయ పూర్వకర్మాధివాసితామ్ ।**
**అహమేవ తథా జీవాన్ ప్రేరయామి చ కర్మసు ॥**
**స్వర్గం చ నరకం మోక్షం ప్రయాంతి ప్రాణినో ధ్రువమ్ ॥35॥**

ప్రాణులబుద్ధిలో స్థిరంగా ఉండి, వాటి పూర్వకర్మ వాసనాధారంగా నేనే కర్మలలో అలా జీవులను ప్రేరేపిస్తున్నాను. ప్రాణులు కూడా అలాగే నిశ్చయంగా నావల్లనే స్వర్గానికో, నరకానికో, మోక్షానికో వెడుతున్నారు.

**స్వర్గస్థం నరకస్థం వా శ్రాద్ధే నాప్యాయనం భవేత్ ।**
**తస్మాచ్ఛ్రాద్ధాని కుర్వీత త్రివిధాని విచక్షణః ॥36॥**

స్వర్గంలోనున్న వానికయినా, నరకంలో ఉన్నవానికయినా, శ్రాద్ధం తృప్తిని చేకూర్చేదవుతుంది. అందువల్ల విచక్షణుడయినవాడు త్రివిధ శ్రాద్ధాలను ఆచరించాలి.

**మత్స్యం కూర్మం చ వారాహం నారసింహఞ్చ వామనమ్ ।**
**రామం రామం చ కృష్ణం చ బుద్ధం చైవ స కల్కినమ్ ॥**
**ఏతాని దశ నామాని స్మర్తవ్యాని సదా బుధైః ॥37॥**

మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి ఈ పది నామాలను మనీషులు ఎల్లప్పుడూ స్మరిస్తారు.

**స్వర్గం జీవాః సుఖం యాంతి చ్యుతాః స్వర్గాచ్చ మానవాః ।**
**లబ్ధ్వా సుఖం చ విత్తం చ దయాదాక్షిణ్య సంయుతాః ॥**
**పుత్రపౌత్రై ర్ధనైరాఢ్యా జీవేయుః శరదాం శతమ్ ॥38॥**

వీరు ఈ స్మరణవల్ల సుఖంగా స్వర్గానికి వెడతారు, అక్కడనుండి జారి మానవులుగా మళ్లీ ఈ లోకంలో పుట్టి, సుఖాన్ని, సంపదలనూ పొంది, దయాదాక్షిణ్యసంయుక్తులై, ధన పుత్ర పౌత్రాభివృద్ధి పొందుతూ నూరేండ్లు ఆనందంగా జీవిస్తారు.

**అతురే చ దదేద్దానం విష్ణుపూజాఞ్చ కారయేత్ ।**
**అష్టాక్షరం తథా మంత్రం జపేద్వా ద్వాదశాక్షరమ్ ॥39॥**

ఆతురుని (మరణాసన్నవ్యక్తి) విషయంలో దానం ఈయాలి, విష్ణుపూజను కూడ చేయాలి, అష్టాక్షర మంత్రాన్ని జపించాలి లేదా ద్వాదశాక్షర మంత్రం జపించాలి.

**పూజయేచ్ఛుక్ల పుష్పైశ్చ నైవేద్యైర్ఘృతపాచితైః ।**
**తథా గంధైశ్చ ధూపైశ్చ శ్రుతిస్మృతిమనూదితైః ॥40॥**

శ్రుతి స్మృతులలో చెప్పబడిన మంత్రాలచే, శుక్లపుష్పాలతో, గంధధూపాలతో, నేతితో వండిన నైవేద్యాలతో పూజించాలి.

**విష్ణుర్మాతా పితా విష్ణు ర్విష్ణుః స్వజన బాంధవాః ।**
**యత్ర విష్ణుం న పశ్యామి తేన వాసేన కిం మమ ॥41॥**

విష్ణువే తల్లి, విష్ణువే తండ్రి, స్వజనులు, బాంధవులు అందరునూ విష్ణువే. ఎక్కడ విష్ణువును చూడకుండా ఉంటానో, అక్కడ నాకు నివాసంతో పనేమి?

**జలే విష్ణుః స్థలే విష్ణు ర్విష్ణుః పర్వతమస్తకే ।**
**జ్వాలా మాలాకులే విష్ణుః సర్వం విష్ణుమయం జగత్ ॥42॥**

జలంలో విష్ణువు ఉన్నాడు, స్థలంలోనూ విష్ణువు ఉన్నాడు, పర్వతశిఖరంపైనా విష్ణువు ఉన్నాడు, అగ్నిజ్వాలాకీలలలో విష్ణువు ఉన్నాడు. సర్వజగత్తూ విష్ణుమయమే.

**వయమాపో వయం పృథ్వీ వయం దర్భా వయం తిలాః ।**
**వయం గావో వయం రాజా వయం వాయు ర్వయం ప్రజాః ॥43॥**

**వయం హేమ వయం ధాన్యం వయం మధు వయం ఘృతమ్ ।**
**వయం విప్రా వయం దేవా వయం శంభుశ్చ భూర్భువః ॥44॥**

నేనే(మేమే) జలాన్ని, నేనే పృథివిని, నేనే దర్భలు, నేనే తిలలు, నేనే ఆవులు, నేనే రాజును, నేనే వాయువును, ప్రజలును నేనే(సంతానం), నేనే బంగారాన్ని, నేనే ధాన్యం, నేనే తేనె, నేనే నేయి, బ్రాహ్మణులును నేనే, దేవతలునూ నేనే, శంభుడను నేనే, భూర్భువాదులు నేనే (మేమే త్రిమూర్తులం)

**అహం దాతా అహం గ్రాహీ అహం యజ్వా అహం క్రతుః ।**
**అహం హర్తా అహం ధర్మో అహం పృథ్వీ అహం జలమ్ ॥45॥**

దాతను నేనే, గ్రహించేవాడను నేనే, నేనే యజ్వను, నేనే క్రతువును, నేనే సంహర్తను, ధర్మాన్ని నేనే, నేనే పృథివి, జలమునూ నేనే.

**ధర్మాధర్మే మతిం దద్యాం కర్మభిస్తు శుభాశుభైః ।**
**యత్ కర్మ క్రియతే క్వాపి పూర్వజన్మార్జితం ఖగ ॥46॥**

ధర్మాధర్మములందు, శుభాశుభకర్మలయందు బుద్ధిని కల్పించేవాడను నేనే, ఖగమా! ఎక్కడైనా పూర్వజన్మార్జిత కారణంగా కర్మ చేయబడుతుంది.

**ధర్మే మతిమహం దద్యామధర్మేఽప్యహ మేవ చ ।**
**యాతనాం కురుతే సోఽపి ధర్మే ముక్తిం దదామ్యహమ్ ॥47॥**

నేనే ధర్మమునందు బుద్ధిని కలుగజేస్తాను, నేనే అధర్మమునందుకూడ బుద్ధి కల్పించి యాతనలకు గురిచేస్తాను, నేనే ధర్మమునందు(ద్వారా)ముక్తిని ఇస్తాను.

**మనుజానాం హితా తార్క్ష్య అంతే వైతరణీ స్మృతా ।**
**తయావమత్య పాపౌఘం విష్ణులోకం స గచ్ఛతి ॥48॥**

గరుడా! మనుజులకు హితంగా అంత్యకాలంలో వైతరణి పేర్కొనబడింది, దానిచే పాపరాశులను కడిగివేసుకొని అతడు విష్ణులోకం వెడతాడు.

**బాలత్వే యచ్చ కౌమారే యచ్చ పరిణతౌ చ యత్ ।**
**సర్వావస్థా కృతం పాపం యచ్చ జన్మాంతరేష్వపి ॥49॥**

బాల్యమందు, కౌమారమందు, పరిణామస్థితియందు, సర్వావస్థలలోను ఏ పాపం చేయబడిందో, అలాగే జన్మాంతరాలందు ఏది చేయబడిందో,

**యన్నిశాయాం తథా ప్రాతర్యన్మధ్యాహ్నేపరాహ్ణయోః ।**
**సంధ్యయోర్యత్ కృతం కర్మ కర్మణా మనసా గిరా ॥50॥**

ఏ పాపకర్మ రాత్రి, అలాగే ఉదయం, మధ్యాహ్నం, అపరాహ్ణం, సంధ్యలయందు మనసా, వాచా, కర్మణా చేయబడిందో,

**దత్త్వా వరం సకృదపి కపిలాం సర్వకామికామ్ ।**
**ఉద్ధరేదంతకాలే స ఆత్మానం పాపసంచయాత్ ॥51॥**

అన్ని కోరికలను తీర్చే కపిలధేనువును దానమిస్తే, వెంటనే అది వరాన్ని ఇచ్చి పాపసంచయం నుండి తనను అంత్యకాలంలో ఉద్ధరిస్తుంది.

**గావో మమాగ్రతః సన్తు పృష్ఠతః పార్శ్వత స్తథా ।**
**గావో మే హృదయే సన్తు గవాం మధ్యే వసామ్యహమ్ ॥52॥**

ఆవులు నా ఎదుట(ముందు)ఉండు గాక! అలాగే వెనుకా, పార్శ్వభాగాలలో ఉండు గాక! ఆవులు నా హృదయంలో ఉండు గాక! నేను ఆవులమధ్యలో ఉంటాను.

**యా లక్ష్మీః సర్వభూతానాం యా చ దేవే వ్యవస్థితా ।**
**ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥53॥**

సర్వభూతాలయందు ఏ లక్ష్మిఉంటుందో, దేవునియందు ఏ దేవి స్థిరంగా ఉంటుందో, ధేనురూపంలో ఉండే ఆ దేవి నా పాపాన్ని పోగొట్టు గాక!

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే నానాదాననిరూపణం నామ త్రింశోऽధ్యాయః ॥30॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో వివిధదానాల స్వరూపఫలితాలు అనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశోఽధ్యాయః – ముప్పై ఒకటవ అధ్యాయం

## దానఫలాన్యదేహప్రవేశాది నిరూపణమ్ – దానఫలం దేహాంతరప్రవేశనిరూపణం

**శ్రీవిష్ణురువాచ** – శ్రీమహావిష్ణువు వచించాడు.

**యే నరాః పాపసంయుక్తాస్తే గచ్ఛన్తి యమాలయమ్ ।**
**నృణాం మత్సాక్షికం దత్తమనంతఫలదం భవేత్ ॥1॥**

పాపాలతో కూడుకొనిన నరులు, యమాలయానికి వెడతారు, నన్ను సాక్షిగా ఉంచుకొని ఇచ్చింది నరులకు అనంతమైన ఫలితాన్ని ఇస్తుంది.

**యావద్రజః ప్రమాణాబ్దం స్వర్గే తిష్ఠతి భూమిదః ।**
**అశ్వారూఢాశ్చ తే యాంతి దదతే యే హ్యుపానహౌ ॥2॥**

భూదానం చేసినవాడు ఆ భూమిలో ఎన్ని రజఃకణాలు ఉన్నాయో, అన్ని సంవత్సరాలు స్వర్గంలో నివసిస్తాడు. చెప్పులను ఎవరయితే దానమిస్తారో, వారు నరకమార్గంలో గుఱ్ఱాలను ఎక్కి వెడతారు.

**ఆతపే శ్రమయోగేన న దహ్యంతే చ కుత్రచిత్ ।**
**ఛత్రదానేన వై ప్రేతా విచరంతి సుఖం పథి ॥3॥**

గొడుగును దానమిస్తే ప్రేతలు శ్రమను కలిగించే ఆ మార్గంలో ఎండలో ఎక్కడా ఒడలు కాలకుండా సుఖంగా వెళ్లగలరు.

**యముద్దిశ్య దదాత్యన్నం తేన చాప్యాయితో భవేత్ ॥4॥**

ఎవనిని ఉద్దేశించి అన్నదానం చేయబడుతుందో, అతడు కడుపునిండుగా సంతుష్టి చెందుతాడు.

**అంధకారే మహాఘోరే అమూర్తే లక్ష్యవర్జితే ।**
**ఉద్ద్యోతే నైవ తే యాంతి దీపదానేన మానవాః ॥5॥**

యమమార్గంలో చిమ్మచీకటి అలముకొని, దారీ తెన్నూ కానరాక, ఎటువెడుతున్నామో తెలియక మహాఘోరంగా ఉంటుంది, మానవులు దీపదానం చేసినట్లయితే, ఆ చీకటి బాధింపక దారి తేజోవంతమై కనిపింపగా వారు పయనిస్తారు.

**అశ్వినే కార్తికే వాపి మాఘే మృతతిథావపి ।**
**చతుర్దశ్యాఇ్చ దీయేత దీపదానం సుఖాయ వై ॥6॥**

మృత తిథినాడునూ, అశ్వయుజ, కార్తిక, మాఘచతుర్దశుల లోనూ, చేసే దీపదానం సుఖకారక మవుతుంది.

**ప్రత్యహాఇ్చ ప్రదాతవ్యం మార్గే సువిషమే నరైః ।**
**యావత్ సంవత్సరం వాపి ప్రేతస్య సుఖలిప్సయా ॥7॥**

**కులే ద్యోతతి శుద్ధాత్మా ప్రకాశత్వం స గచ్ఛతి ।**
**జ్యోతిర్మయోఽసౌ పూజ్యోఽసౌ దీపదానప్రదో నరః ॥8॥**

ఆ ఏడాది అంతా కూడా ప్రేతసుఖంకోసమై మిక్కిలి విషమమైన మార్గంలో కాంతికొరకై ప్రతిదినం దీపదానం నరులచే చేయబడాలి, అలాచేసిన నరుడు ఆ కులంలో శుద్ధాత్ముడై ప్రకాశిస్తాడు. అతడు మిక్కిలి కాంతిని పొందుతాడు. దీపదానంచేసే ఆ నరుడు జ్యోతిర్మయుడై పూజింపబడతాడు.

**ప్రాఙ్ముఖోదఙ్ముఖం దీపం దేవాగారే ద్విజాతయే ।**
**కుర్యాద్యామ్యముఖం పిత్రే అద్భిః సంకల్ప్య సుస్థిరమ్ ॥9॥**

దేవాలయంలో అయితే తూర్పువైపు, బ్రాహ్మణులకోసమయితే ఉత్తరంవైపు, పితరులకోసమయితే(ప్రేతకై) దక్షిణంవైపు నిలబడి, సంకల్పపూర్వకంగా జలాన్ని తీసుకొని దీపం సమర్పించాలి(ధారపోయాలి)

**సర్వోపహారయుక్తాని పదాన్యత్ర త్రయోదశ ।**
**యో దదాతి మృతస్యేహ జీవన్నప్యాత్మ హేతవే ।**
**స గచ్ఛతి మహామార్గే మహాకష్టవివర్జితః ॥10॥**

మృతవ్యక్తికిచ్చే పదమూడు పదదానాలు ప్రేతకు అన్నివిధాలా సుఖాన్ని ఇస్తాయి, మృతవ్యక్తినుద్దేశించి గాని, బ్రతికి ఉండగా తన స్వంతానికి సంకల్పించి గాని ఎవడు ఏ దానం చేసినా, అతడు మహామార్గంలో మహాసంకటాలనుండి బయటపడి సుఖంగా పయనించగలడు.

**ఆసనం భాజనం భోజ్యం దీయతే యద్ద్విజాతయే। (ద్విజాయతే)**
**సుఖేన భుంజమానస్తు తేన గచ్ఛత్యలం పథి ॥11॥**

**కమండలు ప్రదానేన తృషితః పిబతే జలమ్ ॥12॥**

ఆసనం కాని, భాజనం కాని, భోజ్యం కాని విప్రున కిస్తే అతడు(ప్రేత) అనుభవించినవాడై, యమపథంలో సంతోషంగా వెడతాడు. కమండలువును దానంచేస్తే, దాహార్తితోనున్న ప్రేత జలాన్ని పానం చేస్తాడు.

**భాజనం వస్త్రదానఞ్చ కుసుమఞ్చాంగులీయకమ్ ।**
**ఏకాదశాహే దాతవ్యం ప్రేతోద్ధరణహేతవే ॥13॥**

ప్రేతను ఉద్ధరించే ప్రయత్నంతో భాజనం, వస్త్రదానం, కుసుమం, అంగులీయకం పదకొండో రోజున దానమీయాలి.

**త్రయోదశ పదానీత్థం ప్రేతస్య శుభమిచ్ఛతా ।**
**దాతవ్యాని యథాశక్త్యా ప్రేతోఽసౌ ప్రీణితో భవేత్ ॥14॥**

ప్రేతయొక్క శుభాన్ని కోరుకొనేవాడు ఈవిధంగా యథాశక్తిగా పదమూడు పదదానాలనూ చేయాలి. దానివల్ల ఆ ప్రేత సంప్రీతుడవుతాడు,

**భోజనాని తిలాంశ్చైవ ఉదకుంభాం స్త్రయోదశ ।**
**ముద్రికాం వస్త్రయుగ్మఇ్చ తయా యాతి పరాం గతిమ్ ॥15॥**

భోజనాలను, తిలలను, పదమూడు ఉదకుంభాలను, ముద్రికను, వస్త్రయుగ్మాన్ని దానంచేయడంవల్ల పరాగతిని పొందుతాడు.

**యోఽశ్వం నావం గజం వాపి బ్రహ్మణే ప్రతిపాదయేత్ ।**
**స మహిమ్నోఽను సారేణ తత్తత్సుఖముపాశ్నుతే ॥16॥**

గుర్రాన్ని, పడవను, ఏనుగును, బ్రాహ్మణునికి ఈయాలని ప్రతిపాదన చేస్తే, ఆ మహిమను అనుసరించి అతడు ఆయాసుఖాన్ని పొందగలడు.

**నానాలోకాన్ విచరతి మహిషీఇ్చ దదాతి యః ।**
**యమపుత్రస్య యా మాతా మహిషీ సుగతిప్రదా ॥17॥**

మహిషిని దానమిస్తే, అతడు అనేక లోకాలలో సంచరిస్తాడు. యమపుత్రుని తల్లి ఆ పట్టపురాణి సుగతిని ఇస్తుంది.

**తాంబూలం కుసుమం దేయం యామ్యానాం హర్షవర్ధనమ్ ।**
**తేన సంప్రీణితాః సర్వే తస్మిన్ క్లేశం న కుర్వతే ॥18॥**

యమదూతలకు సంతోషాన్ని పెంపొందించే తాంబూలాన్ని, కుసుమాన్ని దానంచేయాలి, దానివల్ల వారందరూ సంతృప్తులై ప్రేతయందు ఏ క్లేశాన్ని కలిగించరు.

**గో భూతిల హిరణ్యాని దానాన్యాహుః స్వశక్తితః ॥19॥**

**మృతోద్దేశేన యో దద్యాజ్జలపాత్రఇ్చ మృన్మయమ్ ।**
**ఉదపాత్ర సహస్రస్య ఫలమాప్నోతి మానవః ॥20॥**

తనశక్తి ననుసరించి గోభూతిల హిరణ్యాదానాలు చేయాలని చెబుతారు, మృతుని ఉద్దేశించి నీటితో నిండిన మట్టికుండను దానంచేస్తే, ఆ మానవుడు వేయి ఉదపాత్రలను దానం చేసిన ఫలితాన్ని పొందుతారు.

**యమదూతా మహారౌద్రాః కరాలాః కృష్ణపింగలాః ।**
**న భీషయంతి తం యామ్యా వస్త్రదానే కృతే సతి ॥21॥**

యమదూతలు మహారౌద్రులు, భయంకరరూపులు, కృష్ణపింగలులు, వస్త్రదానం చేస్తే ప్రేతను యమకింకరులు భయపెట్టరు.

**మార్గే హి గచ్ఛమానస్తు తృష్ణార్తః శ్రమపీడితః ।**
**ఘటాన్నదానయోగేన సుఖీభవతి నిశ్చితమ్ ॥22॥**

యమమార్గంలో వెడుతూఉండగా ఆకలితో నకనకలాడుతూ, కష్టానికి ఓర్వలేక బాధపడువానికి ఘటాన్నదానయోగం వల్ల నిశ్చితంగా సుఖం కలుగుతుంది.

**శయ్యా దక్షిణయా యుక్తా ఆయుధాంబర సంయుతా ।**
**హైమశ్రీపతినా యుక్తా దేయా విప్రాయ శర్మణే ॥**
**తథా ప్రేతత్వ ముక్తోఽసౌ మోదతే సహదైవతైః ॥23॥**

సుఖంకోసమై దక్షిణతో కూడుకొన్న శయ్యాదానం, ఆయుధాలు అంబరాలతో కూడుకొన్న బంగారు విష్ణు ప్రతిమాదానం విప్రునికి దానమీయాలి. ఆ దానంవల్ల అతడు ప్రేతత్వం నుండి విముక్తుడై దేవతలతో కలిసి ఆనందం పొందుతాడు.

**ఏతత్ తే కథితం తార్క్ష్య దానమంత్యేష్టి కర్మజమ్ ।**
**అధునా కథయిష్యేఽహమన్య దేహప్రవేశనమ్ ॥24॥**

గరుడా! అంత్యేష్టి సంబంధమైన కర్మలో చేసే దానాల గురించి నీకు ఈ విధంగా తెలియజేశాను. ఇప్పుడు ఇక చనిపోయినవాడు మరో శరీరంలో ఏలాప్రవేశిస్తాడో నేను వివరిస్తాను.

**జాతస్య మృత్యులోకే వై ప్రాణినో మరణం ధ్రువమ్ ।**
**మృతిః కుర్యాత్ స్వధర్మేణ యాస్యతశ్చ పరంతప ॥25॥**

మృత్యులోకంలో పుట్టిన ప్రాణికి మరణం తప్పదు, పరంతపా! మరణించి వెళ్లిపోతున్నవానికి స్వధర్మానుసారంగా మృతవిధిని ఆచరించాలి.

**పూర్వకాలే మృతానాఞ్చ ప్రాణినాఞ్చ ఖగేశ్వర ।**
**సూక్ష్మో భూత్వాత్వసౌ వాయునిర్గచ్ఛత్యాస్య మండలాత్ ॥26॥**

**నవద్వారై రోమభిశ్చ జనానాం తాలురంధ్రకే ।**
**పాపిష్ఠానామపానేన జీవో నిష్క్రామతి ధ్రువమ్ ॥27॥**

ఖగరాజా! పూర్వకాలంలో చనిపోయిన ప్రాణులయొక్క వాయువు సూక్ష్మరూపంతో ముఖమండలంనుండి రోమాలనుండి, తాలురంధ్రం నుండి వెళ్లిపోయేది. పాపాత్ముల విషయంలో జీవుడు అపానం నుండి నిశ్చయంగా బయటకుపోతాడు.

**శరీరఞ్చ పతేత్ పశ్చాన్నిర్గతే మరుదీశ్వరే ।**
**వాతాహతః పతత్యేవ నిరాధారో యథా ద్రుమః ॥28॥**

గాలితాకిడికి(పిడుగు) నిరాధారమైన చెట్టు ఎలా కూలిపోతుందో, అలాగే వాయువులకు ప్రభువైన ప్రాణం (జీవుడు) బయటకుపోయిన వెంటనే శరీరంకూడ కుప్పకూలిపోతుంది.

**పృథివ్యాం లీయతే పృథ్వీ ఆపశ్చైవ తథాప్సు చ ।**
**తేజస్తేజసి లీయేత సమీరణః సమీరణే ॥**
**ఆకాశే చ తథాకాశః సర్వవ్యాపీ చ శంకరే ॥29॥**

పృథివి పృథివీతత్త్వంలో లీనమైపోతుంది, జలం జలతత్త్వంలోను, అగ్ని అగ్నితత్త్వంలోను, వాయువు వాయుతత్త్వంలోను, ఆకాశం ఆకాశతత్త్వంలోను లీనమైపోతాయి. సర్వవ్యాపియైన ఆత్మ శంకరునిలో లీనమై పోతుంది.

**తత్ర కామస్తథా క్రోధః కాయే పంచేద్రియాణి చ ।**
**ఏతే తార్క్ష్య సమాఖ్యాతా దేహే తిష్ఠంతి తస్కరాః ॥30॥**

గరుడా! అందు శరీరంలో కామం, క్రోధం, పంచేంద్రియాలు అనేవి ఉంటాయి, ఇవే దొంగలుగా చెప్పబడి శరీరంలో తిష్ఠవేసికొని ఉంటాయి.

**కామః క్రోధో హ్యహంకారో మనస్తత్రైవ నాయకః ।**
**సంహారకశ్చ కాలోఽయం పుణ్యపాపసమన్వితః ॥31॥**

క్రామం, క్రోధం, అహంకారం వీటికి నాయకుడైన మనస్సు అందే ఉంటాయి, పుణ్యపాపాలతో కూడుకొన్న ఈ కాలం వీటినన్నింటిని కూల్చివేస్తుంది.

**జగతశ్చ స్వరూపస్తు నిర్మితం స్వేన కర్మణా ।**
**పునర్దేహాంతరం యాతి సుకృతై ర్దుష్కృతై ర్నరః ॥32॥**

తనకర్మవల్లనే లోకస్వభావం నిర్మితమై ఉంటుంది. నరుడు తన సుకృత దుష్కృతాలచేతనే మళ్లీ మరో దేహాన్ని పొందుతాడు.

**పంచేంద్రియ సమాయుక్తం సకలై ర్విషయైః సహ ।**
**ప్రవిశేత్ స నవం దేహం గృహే దగ్ధే యథా గృహీ ॥33॥**

సమస్త విషయాలతో కలిసి పంచేంద్రియాలతో కూడుకొని, గృహం కాలిపోగా, క్రొత్త ఇంటిలోకి గృహస్థుడు వెళ్లిపోయినట్లు, శరీరం కూలిపోగా, జీవుడు మరో క్రొత్తదేహాన్ని ఆశ్రయిస్తాడు.

**శరీరే యే సమాసీనా సంభవేత్ సర్వధాతవః ।**
**షాట్కౌశికోహ్యయం కాయో మాతాపిత్రోశ్చ ధాతవః ॥34॥**

త్వక్, రక్తం, మాంసం, కొవ్వు, మూలుగ, ఎముక, అనే ఆరు ధాతువులతో ఏర్పడుతుంది కాబట్టి ఈ శరీరానికి షాట్కౌశికమని పేరు. శరీరంలో తిష్ఠవేసికొని ఉన్న సర్వధాతువులు మాతాపితల అనుగ్రహ ప్రసాదాలే (ధాతువులే).

**సంభవేయుస్తథా తార్క్ష్య సర్వే వాతాశ్చ దేహినామ్ ।**
**మూత్రం పురీషం తద్యోగా యే చాన్యే వ్యాధయస్తథా ॥35॥**

**అస్థిశుక్రం తథా స్నాయుః దేహేన సహ దహ్యతే ।**
**ఏష తే కథితస్తార్క్ష్య వినాశః సర్వదేహినామ్ ॥36॥**

గరుడా! అదేవిధంగా దేహధారులకు వాయువులన్నీ సంక్రమిస్తాయి. మూత్రం, పురీషం, వాటితో కలిసి ఉండేవి, మిగిలిన వ్యాధులు, ఎముకలు, శుక్రం, అలాగే స్నాయువు దేహంతో కలసి దహింపబడతాయి. తార్క్ష్యా! సర్వప్రాణుల వినాశనాన్ని గురించి నీకు ఇదంతా తెలియజేయడం జరిగింది.

**కథయామి పునస్తేషాం శరీరఞ్చ యథా భవేత్ ।**
**ఏకస్తంభం స్నాయుబద్ధం స్థూణాద్వయ సముద్ధృతమ్ ॥37॥**
**ఇంద్రియైశ్చ సమాయుక్తం నవద్వారం శరీరకమ్ ।**
**విషయైశ్చ సమాక్రాంతం కామక్రోధ సమాకులమ్ ॥38॥**
**రాగద్వేష సమాకీర్ణం తృష్ణాదుర్గ సుదుస్తరమ్ ।**
**లోభజాల సమాయుక్తం పురం పురుష సంజ్ఞితమ్ ॥39॥**

తిరిగి వారికి శరీరం ఎలా కలుగుతుందో చెబుతున్నాను. ఒకే స్తంభం కలిగి, నరాలచే కట్టివేయబడి,రెండు (ఇనుప) కంబాలచే నిలబెట్టబడి, ఇంద్రియాలచే కూడుకొని, తొమ్మిది ద్వారాలు కలిగిన శరీరం కలిగి, విషయాలచే పూర్తిగా ఆక్రమింపబడి, కామక్రోధాలచే వ్యాకులమై రాగద్వేషాలచే అట్టుడికి పోతూ, మిక్కిలిగా తరింపశక్యంకాని తృష్ణఅనే కోటవంటిది, లోభమనే మాయచే కొట్టుమిట్టులాడేటటువంటిది, పురుషుడనే పేరుగల పురం.

**ఏతద్గుణ సమాయుక్తం శరీరం సర్వదేహినామ్ ।**
**తిష్ఠంతి దేవతాః సర్వా భువనాని చతుర్దశ ॥40॥**

సమస్తదేహధారుల శరీరం ఇటువంటి గుణాలతో కూడుకొని ఉంటుంది. అలాగే సర్వదేవతలు, పదునాలుగు లోకాలు అందు ఉంటారు.

**ఆత్మానం యో న జానంతి తే నరాః పశవః స్మృతాః ।**
**ఏవమేతన్మయా ఖ్యాతం శరీరం తే చతుర్విధమ్ ॥41॥**
**చతురశీతిలక్షాణి నిర్మితా యోనయః పురా ।**
**ఉద్భిజ్జాః స్వేదజాశ్చైవ అండజాశ్చ జరాయుజాః ॥42॥**

ఈ విధంగా ఆత్మను (తనను) ఎవరు తెలియజాలకున్నారో, ఆ నరులు పశువులుగా స్మరింపబడుతున్నారు, ఈ విధంగా నాచే శరీరం గురించి నీకు వివరించబడింది, ఎనబై నాలుగు లక్షల జీవరాశులు నాలుగు విధాలుగా పూర్వం ఉద్భిజ్జాలు, స్వేదజాలు, అండజాలు, జరాయుజాలు అనే జన్మలలో సృష్టించబడినాయి.

**ఏతత్తే సర్వమాఖ్యాతం యత్పృష్టోఽహం త్వయానఘ ॥43॥**

అనఘా! నీవు అడిగిన, దానినంతను నీకు నేను చెప్పడం జరిగింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే దానఫలాన్యదేహప్రవేశాది నిరూపణం నామైకత్రింశోఽధ్యాయః ॥31॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో దానఫలం దేహాంతరప్రవేశనిరూపణం అనే ముప్పై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పై రెండవ అధ్యాయం

## జంతూత్పత్తిః శరీరగతవిశేషాశ్చః - ప్రాణిపుట్టుక శరీరంలోని విశేషాలు

**తార్క్ష్య ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కథముత్పద్యతే జంతుర్భూతగ్రామే చతుర్విధే ।**
**త్వచా రక్తం తథా మాంసం మేదో మజ్జాస్థి జీవితమ్ ॥1॥**

**పాదౌపాణీ తథా గుహ్యం జిహ్వా కేశనఖాః శిరః ।**
**సంధిమార్గాశ్చ బహుశో రేఖానైకవిధాస్తథా ॥2॥**

నాలుగు విధాల భూతసమూహంలో ప్రాణి ఏ విధంగా జన్మిస్తాడు? చర్మం, రక్తం, మాంసం, మేదస్సు,మజ్జ, అస్థి, జీవత్వం, చేతులు, గుహ్యం, జిహ్వ, కేశాలు, నఖాలు, శిరస్సు, సంధిమార్గాలు, అనేక విధాలైన పెక్కురేఖలు,

**కామః క్రోధో భయం లజ్జా మనో హర్షః సుఖాసుఖమ్ ।**
**చిత్రితం ఛిద్రితఞ్చాపి నానాజాలేన వేష్టితమ్ ॥3॥**

**ఇంద్రజాలమిదం మన్యే సంసారేఽసార సాగరే ।**
**కర్తా కోఽత్ర హృషీకేశ సంసారే దుఃఖసంకులే ॥4॥**

కామం, క్రోధం, భయం, లజ్జ, మనస్సు, హర్షం, సుఖం, దుఃఖం, అనేకాలైన గుంపులతో (నరాలు,మాయలు, ఇత్యాదులతో) చిత్రింపబడిన (ఏర్పడిన) రంధ్రాలతో నిండిన దీనిని సారంలేని సంసారసాగరంలో ఇంద్రజాలంగా (మాయగా)భావిస్తున్నాను. హృషీకేశా! దుఃఖసంకులమైన ఈ సంసారానికి ఇక్కడ కర్త ఎవడు?

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**కథయామి పరం గోప్యం కోశస్యాస్య వినిర్ణయమ్ ।**
**యస్య విజ్ఞానమాత్రేణ సర్వజ్ఞత్వం ప్రజాయతే ॥5॥**

ఈ కోశంయొక్క నిర్మాణం పరమ గోప్యమైనటువంటిది, దీనిని తెలిసికొన్నంతమాత్రంచేతనే సర్వం తెలుసుకోవడం జరుగుతుంది.

**సాధు పృష్టం త్వయా లోకే సదయం జీవకారణమ్ ।**
**వైనతేయ శృణుష్వ త్వమేకాగ్రకృతమానసః ॥6॥**

వైనతేయా! లోకంలోని జీవకారణంగురించి దయతో కూడుకొన్న మంచిప్రశ్న నీవు అడిగావు. ఏకాగ్రంగా చేయబడిన మనస్సుకలవాడవై నీవు విను.

**ఋతుకాలే చ నారీణాం వర్జ్యం దినచతుష్టయమ్ ।**
**యతస్తస్మిన్ బ్రహ్మహత్యాం పురావృత్ర సముత్థితామ్ ॥7॥**

**బ్రహ్మ శక్రాత్ సముత్తార్య చతుర్థాంశేన దత్తవాన్ ।**
**తావన్నాలోక్యతే వక్త్రం పాపం యావద్వపుః స్థితమ్ ॥8॥**

ఋతుకాలంలో స్త్రీలకు నాలుగురోజులు పరిత్యజింపబడే సమయం. ఎందువల్లనంటే ఆ సమయంలో పూర్వం బ్రహ్మ శక్రుని(ఇంద్రుని) తరింపజేయడానికై, వృత్రవధవల్ల సంక్రమించిన బ్రహ్మహత్యకు సంబంధించిన నాలుగో భాగాన్ని స్త్రీలకు పంచిపెట్టడం జరిగింది. అందువల్ల శరీరంలో ఉండే బ్రహ్మహత్యాపాపం వల్ల, వారి ముఖాన్ని ఆలోకించరాదు.

**ప్రథమేఽహని చాండాలీ ద్వితీయే బ్రహ్మఘాతినీ ।**
**తృతీయే రజకీ జ్ఞేయా చతుర్థేఽహని శుద్ధ్యతి ॥9॥**

మొదటి రోజున చాండాలిగా, రెండో రోజున బ్రహ్మఘాతకిగా, మూడో రోజున రజకిగా ఆమె పేర్కొనబడింది. నాలుగోరోజున పరిశుద్ధి పొందుతుంది.

**సప్తాహాత్ పితృదేవానాం భవేద్యోగ్యా కృతార్చనే ।**
**సప్తాహమధ్యే యో గర్భస్తత్సంభూతి ర్మలిమ్లుచా ॥10॥**

అప్పటినుండి ఏడు రోజులవరకు ఆమె పితరులను, దేవతలను పూజచేయడానికి యోగ్యత కలిగి ఉంటుంది. ఆ ఏడు రోజుల మధ్యలో గర్భంవస్తే దానిని మలిమ్లుచోత్పత్తి అంటారు.

**నిషేకసమయే పిత్రోర్యాదృక్ చిత్తవికల్పనా ।**
**తాదృగ్గర్భ సముత్పత్తి ర్జాయతే నాత్రసంశయః ॥11॥**

నిషేకసమయంలో తల్లిదండ్రులకు ఎటువంటి చిత్తకల్పనం ఉంటుందో, అటువంటి గర్భసముత్పత్తి మాత్రమే సంభవిస్తుంది, అందు సందియంలేదు.

**యుగ్మాసు పుత్రా జాయంతే స్త్రియోఽయుగ్మాసు రాత్రిషు ।**
**పూర్వసప్తమ ముత్సృజ్య తస్మాద్యుగ్మాసు సంవిశేత్ ॥12॥**

యుగ్మతిథులున్న (సరి) రాత్రులలో సంగమం జరిగితే కొడుకులు, అయుగ్మతిథులున్న రాత్రులలో (బేసి) అయితే పుత్రికలు పుడతారు. కాబట్టి కొడుకులు కావాలనుకోరేవారు ఋతుకాల యోగ్యానంతరం మొదటి ఏడు రాత్రులు వదలివేసి, తరువాత యుగ్మతిథులలో సంగమించాలి.

**షోడశర్తుర్నిశాః స్త్రీణాం సామాన్యాత్ సముదాహృతః ।**
**యా చతుర్దశమీ రాత్రిర్గర్భస్తిష్ఠతి తత్ర చేత్ ॥13॥**

**గుణభాగ్య నిధిః పుత్రస్తత్ర జాయేత ధార్మికః ।**
**సా నిశా తత్ర సామాన్యైర్న లభ్యేత ఖగాధిప ॥14॥**

సామాన్యంగా స్త్రీలలో ఋతుకాలం ఒకనెలలో పదహారు రాత్రులపాటు కొనసాగుతుంది, పదునాలుగవ రాత్రి గర్భాధానక్రియ జరిగితే, ఆ గర్భంనుండి గుణవంతుడు, భాగ్యవంతుడు, ధనవంతుడు, ధర్మనిష్ఠుడు అయిన పుత్రుడు పుడతాడు. ఖగరాజా! ఆ రాత్రి సామాన్యులకు లభ్యమయ్యేదికాదు.

**ప్రాయశః సంభవత్యత్ర గర్భస్త్వష్టాహ మధ్యతః ।**
**పంచమేఽహని నారీణాం కార్యం మాధుర్యభోజనమ్ ॥15॥**

సాధారణంగా ఎనిమిదోరోజు మధ్యకాలంలో గర్భం సంభవిస్తుంది, అందువలన ఋతుకాలంలో స్నానంఅయిన తరువాత అయిదోరోజున స్త్రీలకు మధురపదార్థభోజనమే స్వీకరింపదగింది.

**కటుక్షారఞ్చ తీక్ష్ణఞ్చ త్యాజ్యముష్ణఞ్చ దూరతః ।**
**తత్క్షేత్ర మోషధీపాత్రం బీజంఞ్చాప్యమృతాయితమ్ ॥16॥**

**(తత్రవప్తా)తస్మిన్నుప్త్వా నరః స్వామీ సమ్యక్ ఫలమవాప్నుయాత్ ।**
**తస్యాశ్చైవాతపోవర్జ్య శీతలం కేవలం చరేత్ ॥17॥**

చేదు, కారం, ఘాటు, ఉప్పు, వేడిగా ఉండేవాటిని దూరంగా విడిచిపెట్టాలి. అందువల్ల ఆ క్షేత్రం(ఆమెకడుపు) ఔషధపాత్రగాను, పురుషబీజం అమృతతుల్యంగాను ఉంటాయి. ఆ క్షేత్రమునందు యజమాని అయిన నరుడు భోగించి చక్కని ఫలాన్ని పొందుతాడు. ఆమెకూడ మిక్కిలి వేడికి దూరంగా ఉండాలి. శీతలత్వానికి నెలవై ఉండాలి.

**తాంబూల పుష్పశ్రీఖండైః సంయుక్తః శుచివస్త్రభృత్ ।**
**ధర్మమాదాయ మనసి సుతల్పం సంవిశేత్ పుమామ్ ॥18॥**

ఆ రాత్రి పురుషుడు, తాంబూలం సేవించి, పుష్పచందనాదులతో సువాసితుడై, శుభ్రమైన వస్త్రాలను ధరించి, ధర్మబద్ధ శుద్ధమనస్కుడై, సుందరతల్పాన్ని ప్రవేశించాలి.

**నిషేకసమయే యాదృఙ్నరచిత్త వికల్పనా ।**
**తాదృక్ స్వభావ సంభూతి ర్జంతుర్విశతి కుక్షిగః ॥19॥**

వీర్యంపడే సమయంలో నరుడు ఎంతమంచి ఆలోచనతో ఉంటాడో, అటువంటి స్వభావంకల్గిన ఉత్పత్తితో ప్రాణి కుక్షిలో ప్రవేశిస్తాడు.

**శుక్రశోణిత సంయోగే పిండోత్పత్తిః ప్రజాయతే ।**
**వర్ధతే జఠరే జన్తుస్తారాపతిరివాంబరే ॥20॥**

శుక్రశోణిత సంయోగంవల్ల పిండోత్పత్తి జరుగుతుంది. ఆకాశంలో చంద్రునిలా జఠరంలో ప్రాణి వృద్ధిపొందుతాడు.

**చైతన్యం బీజరూపం హి శుక్రే నిత్యం వ్యవస్థితమ్ ।**
**కామశ్చిత్తఞ్చ శుక్రఞ్చ యదాహ్యేకత్వ మాప్నుయుః ॥21॥**

**తదా ద్రావమవాప్నోతి యోషా గర్భాశయే నరః ।**
**రక్తాధిక్యే భవేన్నారీ శుక్రాధిక్యే భవేత్పుమాన్ ॥22॥**

శుక్రంలో నిత్యమూ చైతన్యం బీజరూపంలో ఉంటుంది. చిత్తం కామావృతమై శుక్రంలో కదలి అలా ఏకత్వాన్ని పొందుతాయి. అప్పుడు ద్రావస్థితిని పొందిన సమయంలో నరుడు స్త్రీ గర్భాశయంలో ఉంచడం జరుగుతుంది. ఆ వేళలో రక్తంబలంగా ఉంటే స్త్రీ, శుక్రం ఆధిక్యంలో ఉంటే పురుషుడూ కలుగుతాడు.

**శుక్రశోణితయో స్సామ్యే గర్భాః షండత్వమాప్నుయుః ।**
**అహోరాత్రేణ కలిలం బుద్బుదం పంచభిర్దినైః ॥23॥**

శుక్రశోణితాల సమానత్వంలో ఏర్పడిన గర్భాలు షండత్వాన్ని (నపుంసకత్వాన్ని) పొందుతాయి. ఆ సంయోగపదార్థం ఒకరోజులో కణంగా మారి, అయిదోరోజుకల్లా బుడగంత అవుతుంది.

**(దశమేహ్ని)చతుర్దశే భవేన్మాంసం మిశ్రధాతుసమన్వితమ్ ।**
**ఘనం మాంసఞ్చ వింశాహే గర్భస్థో వర్ధతే క్రమాత్ ॥24॥**

పదునాలుగో రోజునాటికి మిశ్రధాతు సంయుక్తమైన మాంసపు ముద్దగా మారుతుంది. అది ఘనీభవిస్తూ ఇరవైయో రోజునాటికి క్రమంగా గర్భంలో పిండరూపంగా వృద్ధిపొందుతుంది.

**పంచవింశతిమేచాహ్ని బలం పుష్టిం చ జాయతే ।**
**తథా మాసే తు సంపూర్ణే పంచతత్త్వం నిధారయేత్ ॥25॥**

ఇరవైఅయిదోనాటికి బలం(శక్తి), పుష్టి ఏర్పడతాయి అలాగే ఒకనెల పూర్తిఅయ్యేనాటికి పంచ తత్త్వాలు ధరించగల్గినదవుతుంది.

**మాసద్వయే తు సంజాతే త్వచా మేదశ్చ జాయతే ।**
**మజ్జాస్థీని త్రిభిర్మాసైః కేశాంగుల్యశ్చతుర్థకే ॥26॥**

రెండోమాసం రాగానే చర్మం, మేదస్సు ఏర్పడతాయి, మూడోమాసంలో మజ్జ, అస్థులు, నాలుగోమాసంలో కేశాలు, వ్రేళ్లు ఏర్పడతాయి.

**కర్ణౌ చ నాసికే వక్షో జాయేరన్ మాసి పంచమే ।**
**కంఠరంధ్రోదరం పృష్ఠే గుహ్యాదిర్మాసి సప్తమే ॥27॥**

అయిదోమాసంలో చెవులు, నాసికారంధ్రాలు, వక్షం ఏర్పడతాయి.(అప్పుడు కన్నులు మున్నగునవి ఏర్పడతాయి) కంఠం, రంధ్రాలు, ఉదరం, పృష్ఠం (ఆరోమాసంలోను), గుహ్యాదులు ఏడోమాసంలోను ఏర్పడతాయి.

**అంగప్రత్యంగ సంపూర్ణో గర్భో మాసై రథాష్టభిః ।**
**అష్టమే చలతే జీవో ధాత్రీ గర్భే పునః పునః ॥**
**నవమే మాసి సంప్రాప్తే గర్భస్థోజో దృఢం భవేత్ ॥28॥**

ఎనిమిదో నెలలో అంగప్రత్యంగాలతో సంపూర్ణరూపాన్ని పొందుతాడు. ఆ మాసంలోనే జీవుడు ధాత్రీ (ధరించేజనని) గర్భంలో ఇటు అటూ కదలుతూ ఉంటాడు. తొమ్మిదోమాసం రాగా ఓజోగుణం ఏర్పడి గర్భస్థపిండం పరిపక్వత పొందుతుంది.

**చికిత్సా జాయతే తస్య గర్భవాస పరిక్షయే ।(ఇచ్ఛాసంజాయతే)**
**నారీవాథ నరోవాథ నపుంస్త్వం వాభిజాయతే ॥29॥**

అప్పటినుండి ఆ శిశువుకు గర్భవాసంనుండి బయటపడే కోరిక పుడుతుంది. ఆడబిడ్డగానో, లేదా మగబిడ్డగానో, లేదా నపుంసకత్వంతోనో జన్మించడం జరుగుతుంది.

**శక్తిత్రయం విశాలాక్షం షాట్కౌశిక సమాయుతమ్ ।**
**పంచేంద్రియ సమోపేతం దశనాడీ విభూషితమ్ ॥30॥**

**దశప్రాణ గుణోపేతం యో జానాతి స యోగవిత్ ।**
**మజ్జాస్థి శుక్రమాంసాని రోమరక్తం బలం తథా ॥31॥**

**షాట్కోశికమిదం పిండం స్యాజ్జంతోః పాంచభౌతికమ్ ।**
**నవమే దశమే మాసి జాయతే పాంచభౌతికః ॥32॥**

మూడు శక్తులు, విశాలమైన కన్నులు, ఆరు కోశాలతో కూడుకొని, పంచేంద్రియాలతో కలిపి, పది నాడులతో పరితుష్టిపొంది, పది ప్రాణాలతో, వాటి గుణాలతో కలిసిన ఆ తత్త్వాన్ని ఎవడు తెలుసుకొంటాడో, అతడే యోగజ్ఞానం కలిగినవాడు. మజ్జ, ఎముకలు, శుక్రం, మాంసం, రోమాలు, రక్తం, బలం అలాగే, ఆరు కోశాలతో కూడుకొన్న ఈ పిండం ప్రాణికి పాంచభౌతిక శరీరం అవుతుంది. తొమ్మిదో మాసం, పదోమాసం, వీటిలో పాంచభౌతికదేహం స్పష్టంగా ఏర్పడుతుంది.

**సూతివాతైః సమాకృష్టః పీడయా విహ్వలీకృతః ।**
**పుష్టో నాడ్యాః సుషుమ్నాయా యోషిద్గర్భ స్థితస్త్వరన్ ॥33॥**

**క్షితిర్వారి హవిర్భోక్తా పవనాకాశమేవ చ ।**
**ఏభిర్భూతైః పీడితస్తు నిబద్ధః స్నాయుబంధనైః ॥34॥**

ప్రసవకాలీన వాయువులచే నెట్టబడి, అప్పుడు పొందే పీడచే వశంతప్పి, తల్లిగర్భంలో ఉండి సుషుమ్నానాడి ద్వారా శక్తినిపొంది, త్వరగా బయటపడడానికై, భూమి, జలం, హవిస్సు, భోక్త, గాలి, ఆకాశం అనే భూతాలచే పీడింపబడుతూ, స్నాయుతంత్రికలచే బంధింపబడి వుంటుంది.

**మూలభూతా ఇమే ప్రోక్తా సప్తనాడ్యంతరే స్థితాః ।**
**త్వచాస్థినాడ్యో రోమాణి మాంసశ్చైవాత్ర పంచమమ్ ॥35॥**

**ఏతే పంచ గుణాః ప్రోక్తా మయా భూమేః ఖగేశ్వర ।**
**యథా పంచగుణాశ్చాపస్తథా తచ్ఛృణు కాశ్యప ॥36॥**

ఇవి మూలభూతాలుగా చెప్పబడ్డాయి. ఇవి ఏడు నాడుల మధ్యలో ఉంటాయి. చర్మం, ఎముకలు, నాడులు, రోమాలు, ఇందు అయిదోదైన మాంసం, ఖగరాజా! ఈ అయిదునూ భూమియొక్క గుణాలుగా నేను చెప్తున్నాను, కశ్యపవంశసంజాతా! అలాగే జలంయొక్క అయిదు గుణాలు ఏ విధంగా ఉంటాయో విను.

**లాలామూత్రం తథా శుక్రం మజ్జా రక్తం చ పంచమమ్ ।**
**ఆపః పంచగుణాః ప్రోక్తా జ్ఞాతవ్యాస్తే ప్రయత్నతః ॥37॥**

లాలా, మూత్రం, శుక్రం, మజ్జ, అయిదోదైన రక్తం అనేవి నీటియొక్క అయిదు గుణాలుగా చెప్పబడ్డాయి. నీవు మిక్కిలి ప్రయత్నంతో తెలుసుకోవలసినవి.

**క్షుధా తృషా తథా నిద్రా ఆలస్యం కాంతిరేవ చ ।**
**తేజః పంచగుణం ప్రోక్తం తార్క్ష్య సర్వత్ర యోగిభిః ॥38॥**

గరుడా! ఆకలి, దప్పిక, నిద్ర, బద్ధకం, కాంతి అనేవి తేజస్సుకు సంబంధించిన అయిదు గుణాలుగా యోగులచే అంతటా పేర్కొనబడినాయి.

**రాగద్వేషౌ తథా లజ్జా భయం మోహస్తథైవ చ ।**
**ఇత్యేతత్ కథితం తార్క్ష్య వాయుజం గుణపంచకమ్ ॥39॥**

రాగం, ద్వేషం, లజ్జ, భయం, మోహం, అనేవి గరుడా! వాయువువల్ల పుట్టిన గుణపంచకంగా చెప్పబడింది.

**ఆకుంచనం ధావనఞ్చ లంఘనం చ ప్రసారణమ్ ।**
**నిరోధః పంచమః ప్రోక్తః వాయోః పంచగుణాః స్మృతాః ॥40॥**

సంకోచం, ధావనం, లంఘనం, ప్రసారణం, అయిదోదైనదిగా చెప్పబడిన నిరోధం అనేవి వాయువుయొక్క పంచ గుణాలుగా పేర్కొనబడ్డాయి.

**ఘోషశ్చింతా చ గాంభీర్యం శ్రవణం సత్యసంక్రమః ।**
**ఆకాశస్య గుణాః పంచ జ్ఞాతవ్యా స్తార్క్ష్య యత్నతః ॥41॥**

ఘోషం, చింత, గాంభీర్యం, శ్రవణం, సత్యవివేకం(సత్యాసత్య వివేకం)అనేవి గరుడా! ఆకాశం యొక్క అయిదు గుణాలుగా ప్రయత్నంతో తెలుసుకోవాలి.

**శ్రోత్రం త్వక్ చక్షుషీ జిహ్వా నాసా బుద్ధీంద్రియాణి చ ।**
**పాణీ పాదౌ గుదం ప్రాక్ చ గుహ్యం కర్మేంద్రియాణి చ (వాక్చ)॥42॥**

చెవి, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు, ఇవి జ్ఞానేంద్రియాలు. చేతులు, కాళ్లు, మాట, మలమూత్ర విసర్జకావయవ సంయుక్తగుదం ఇవి కర్మేంద్రియాలు.

**ఇడా చ పింగలా చైవ సుషుమ్నా చ తృతీయకా ।**
**గాంధారీ గజజిహ్వా చ పూషా చైవ యశా తథా ॥43॥**

**అలంబుషా కుహూశ్చైవ శంఖినీ దశమీ స్మృతా ।**
**పిండమధ్యే స్థితా హ్యేతాః ప్రధానా దశనాడయః ॥44॥**

ఇడ, పింగల, మూడవదైన సుషుమ్న, గాంధారి, గజజిహ్వా, పూష, యశ, అలంబుష, కుహు, పదోదైన శంఖిని, ఇవి పిండమధ్యంలో ఉండే ప్రధానాలైన దశ నాడులు.

**ప్రాణాపానౌ సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ।**
**నాగః కూర్మశ్చ కృకరో దేవదత్తో ధనంజయః ॥45॥**

**ఇత్యేతే వాయవః ప్రోక్తా దశదేహేషు సంస్థితాః ।**
**కేవలం భుక్తమన్నఇ్చ పుష్టిదం సర్వదేహినామ్ ॥46॥**

ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం, నాగం, కూర్మం, కృకరం, దేవదత్తం, ధనంజయం అనే ఈ పది దేహాలలో ఉండే వాయువులుగా చెప్పబడ్డాయి. సర్వప్రాణులకు కేవలం తిన్న ఆహారమే దాని పుష్టికి కారణమవుతుంది.

**నయతే ప్రాణదో వాయుః శరీరే సర్వసంధిషు ।**
**ఆహారో భుక్తమాత్రస్తు వాయునా క్రియతే ద్విధా ॥47॥**

మానవులు, ఆహారం తిన్నంతమాత్రంచేతనే ప్రాణవాయువు శరీరంలోకి, సర్వసంధులలోకి చేరవేస్తుంది. తిన్న ఆహారం వాయువుచే రెండు విధాలుగా విభజింపబడుతుంది.

**స ప్రవిశ్య గుదే సమ్యక్ పృథగన్నం పృథగ్జలమ్ ।**
**ఊర్ధ్వమగ్నేర్జలం కృత్వా తదన్నఇ్చ జలోపరి ॥48॥**

**అగ్నేశ్చాధః స్వయంప్రాణస్తమగ్నిఇ్చ ధమేచ్ఛనైః ।**
**వాయునా ధమ్యమానోఽగ్నిః పృథక్కిట్టం పృథగ్రసమ్ ॥49॥**

అది గుదంవరకు నేరుగా ప్రవేశించి అన్నాన్ని వేరుగా, జలాన్ని వేరుగా చేస్తుంది. అగ్నికన్న పైన జలాన్ని పొందుపరచి ఆ అన్నాన్ని జలంపైన, అగ్నికన్న క్రింద స్వయంగా ప్రాణం ఉండి నెమ్మదిగా అగ్నిని రగిలిస్తుంది, వాయువుద్వారా రగుల్కొల్పబడిన అగ్ని మలాన్ని వేరుగా, రసాన్ని వేరుగా చేస్తుంది.

**మలై ర్ద్వాదశభిః కిట్టం భిన్నం దేహాత్ పృథగ్భవేత్ ।**
**కర్ణాక్షి నాసికా జిహ్వా దంతనాభి వపుర్గుదమ్ ॥50॥**

**నఖా మలాశ్రయా హ్యేతే విణ్మూత్రఞ్చేత్యనంతకమ్ ।**
**శుక్రశోణిత సంయోగాదేతత్ షాట్ కౌశికం స్మృతమ్ ॥51॥**

పన్నెండు మలమార్గాలద్వారా మాలిన్యం శరీరంనుండి వేరుగాబడి బయటకు పోతుంది. చెవులు, కనులు, ముక్కు, నాలుక, దంతాలు, నాభి, శరీరం, గుదం, గోళ్లు ఇవన్నీ మలాశ్రయాలు. విష్ఠామూత్రాలచే ఎక్కువగాను, శుక్రశోణిత సంయోగరూపాలలోనూ ఈ మలం అనేక విధాలుగా ఉంటుంది. ఇది షాట్కౌశికంగా పేర్కొనబడింది.

**రోమ్ణాం కోట్యస్తథా తిస్రోఒ పృర్ధకోటి సమన్వితాః ।**
**ద్వాత్రింశద్దశనా ప్రోక్తాః సామాన్యా ద్వినతాసుత ॥52॥**

వినతానందనా! సామాన్యంగా మూడుకోట్ల ఏబదిలక్షల రోమాలతో కూడుకొని శరీరాలు ఉంటాయి. దంతాలు ముప్పదిరెండుగా పేర్కొనబడినాయి.

**సప్తలక్షాణి కేశాః స్యు ర్నఖాః ప్రోక్తాస్తు వింశతిః ।**
**మాంసం పలసహస్రైకం సామాన్యాద్దేహ సంస్థితమ్ ॥53॥**

అలాగే ఏడులక్షల కేశాలు, ఇరవై గోళ్లు ఉంటాయని చెప్పడం జరిగింది. సామాన్యంగా దేహంలో ఒక వేయి పలాలఎత్తు మాంసం ఉంటుంది. (నాలుగు కర్షముల ఎత్తు ఒక పలం) (పదహారు మాషాలఎత్తు ఒక కర్షం) (ఐదు గురివిందగింజల ఎత్తు ఒక మాషకం)

**రక్తం పలశతం తార్క్ష్య బుద్ధమేవ పురాతనైః ।**
**పలాని దశమేదశ్చ త్వచా చైవ తు తత్సమా ॥54॥**

గరుడా! నూరుపలాల రక్తం ఉంటుందని పురాతనులు గ్రహించియన్నారు. పదిపలాల మేదం, దానితో సమానంగా చర్మం ఉంటాయి.

**పలద్వాదశకం మజ్జా మహారక్తం పలత్రయమ్ ।**
**శుక్రం ద్వికుడవం జ్ఞేయం శోణితం కుడవం స్మృతమ్ ॥55॥**

పన్నెండు పలాల మజ్జ ఉంటుంది, మూడు పలాల మహారక్తం ఉంటుంది, రెండుమానెడుల శుక్రం ఉంటుంది, ఒకమానెడు శోణితం ఉంటుంది.

**శ్లేష్మాణశ్చ షడూర్ధ్వఞ్చ విణ్మూత్రం తత్ప్రమాణతః ।**
**అస్థ్నాంహి హ్యధికం ప్రోక్తం షష్ట్యుత్తర శతత్రయాత్ ॥56॥**

శ్లేష్మాలు ఆరు పలాలకు పైన ఉంటాయి, అదే ప్రమాణంలో విణ్మూత్రాలు ఉంటాయి, మూడువందలఅరవైకి ఎక్కువగానే ఎముకలు ఉంటాయని చెప్పబడింది.

**ఏవం పిండః సమాఖ్యాతో వైభవం సంప్రచక్ష్మహే ।**
**సుఖం దుఃఖం భయం క్షేమం కర్మణైవ హి ప్రాప్యతే ॥57॥**

ఈ విధంగా పిండం ఉంటుందని చెప్పబడుతుంది. దాని వైభవాన్ని తెలియజేశాను. కర్మానుసారంగా సుఖం, దుఃఖం, భయం, క్షేమం ప్రాప్తిస్తాయి.

**అధోముఖం చోర్ధ్వపాదం గర్భాద్వాయుః ప్రకర్షతి ।**
**తలే తు కరయోర్న్యస్య వర్ధతే జానుపార్శ్వయోః ॥58॥**

**అంగుష్ఠౌ చోపరిన్యస్తౌ జాన్వోరథ కరాంగులీ ।**
**జానుపృష్ఠే తథా నేత్రే జానుమధ్యే చ నాసికా ॥59॥**

**ఏవం వృద్ధిం క్రమాద్యాతి జంతుః స్త్రీగర్భసంస్థితః ।**
**కాఠిన్యమస్థీన్యాయాంతి భుక్తపీతేన జీవతి ॥60॥**

వాయువు గర్భంనుండి జీవుని బయటకు పంపించేటప్పుడు, కాళ్లుపైకి, ముఖంక్రిందికి ఉంటాయి. స్థలభాగంలో చేతులను, జానుపార్శ్వాలలో ఉంచి, వ్రేళ్లను పైభాగంలో పెడతాడు, జానువులపైన చేతివ్రేళ్లను ఉంచుకొంటాడు. జానుపృష్ఠంలో నేత్రాలను, జాను మధ్యంలో నాసికను (తత్త్వాలను) ఉంచుతాడు. స్త్రీగర్భంలో ఉండే జీవుడు ఇలావృద్ధిని క్రమంగా పొందుతాడు. తిన్నదానివల్ల, త్రాగిన రసాలవల్ల ఎముకలు కాఠిన్యం పొందుతూ ఉండగా అలా జీవిస్తాడు.

**నాడీ వాప్యాయనీ నామ నాభ్యాం తత్ర నిబధ్యతే ।**
**స్త్రీణాం తథాంత్ర సుషిరే స నిబద్ధః ప్రజాయతే ॥61॥**

ఆప్యాయని అనే పేరుగల నాడి నాభిలో బంధింపబడి ఉంటుంది. స్త్రీలయొక్క ఆంత్రఛిద్రానికి అది కూర్చబడి ఉంటుంది.

**క్రామంతి భుక్త పీతాని స్త్రీణాం గర్భోదరే తథా ।**
**తైరాప్యాయితే దేహోఽసౌ జంతుర్వృద్ధిముపైతి చ ॥62॥**

స్త్రీల గర్భోదరంలో తిన్నవి, త్రాగినవి తిరుగుతూ ఉంటాయి. వాటిచే పుష్టిపొందిన దేహంతో ఆ ప్రాణి వృద్ధి పొందుతూ ఉంటుంది.

**స్మృత్యస్తత్ర ప్రయాంత్యస్య బహ్వ్యః సంసారభూతయః ।**
**తతో నిర్వేద మాయాతి పీడ్యమాన ఇతస్తతః ॥63॥**

అక్కడ ఎన్నో సంసారవిషయజ్ఞానాలు అతనికి స్మృతులుగా స్ఫురిస్తూ ఉంటాయి. ఇటూ అటూ పీడింపబడుతూ ఎంతో నిర్వేదాన్ని పొందుతాడు.

**పునర్నైవం కరిష్యామి భుక్తమాత్ర ఇహోదరాత్ ।**
**తథా తథా యతిష్యామి గర్భం నాప్నోమ్యహం యథా ॥64॥**

పాపం మళ్లీ ఈవిధంగా చేయను, అనుభవించింది చాలు, ఇక్కడ ఈ గర్భంనుండి ఎలా బయటపడాలో దానికి ప్రయత్నిస్తాను. మళ్లీ గర్భావాసం నేను పొందదలచుకోలేదు.

**ఇతి సంచింతయఙ్జీవో స్మృత్వా జన్మశతాని వై ।**
**యాని పూర్వానుభూతాని దేవభూతాత్మజాని వై ॥65॥**

పూర్వంలో అనుభవించిన ఏ దేవభూతాది జన్మలున్నాయో, ఆ వందలకొలది జన్మలను స్మరించుకొంటూ, జీవుడలా విచారిస్తూ ఉంటాడు.

**తతః కాలక్రమాజ్జంతుః పరివర్త్యత్వధోముఖః ।**
**నవమే దశమే వాపి మాసి సంజాయతే తతః ॥66॥**

పిమ్మట కాలక్రమంగా ఆ ప్రాణి అధోముఖుడుగా పరివర్తితుడై, తొమ్మిదో మాసంలోకాని, పదో మాసంలోకాని ఇక్కడ పుడతాడు.

**నిష్క్రమ్యమాణో వాతేన ప్రాజాపత్యేన పీడ్యతే ।**
**నిష్క్రమతే చ విలపం స్తదా దుఃఖనిపీడితః ॥67॥**

ప్రాజాపత్య వాయుప్రభావంవల్ల నెట్టబడుతూ, బయటకువస్తూ, పీడింపబడతాడు. అప్పుడు దుఃఖపీడితుడై ఏడుస్తూ బయటకు వస్తాడు.

**నిష్క్రామంశ్చోదరాన్మూర్ఛా మసహ్యాం ప్రతిపద్యతే ।**
**ప్రాప్నోతి చేతనాం చాసౌ వాయుస్పర్శ సుఖాన్వితః ॥68॥**

ఉదరం నుండి బయటకువస్తూ సహింపశక్యం కాని మూర్ఛను పొందుతాడు. వాయుస్పర్శవల్ల సుఖం పొంది, తిరిగి ఆ శిశువు చైతన్యాన్ని పొందుతాడు.

**తతస్తం వైష్ణవీ మాయా సమాస్కందతి మోహినీ ।**
**తయా విమోహితాత్మాసౌ జ్ఞానభ్రంశమవాప్నుతే ॥69॥**

అంతట అతనిని అందరినీ మోహింపజేసే వైష్ణవీమాయ ఆవరిస్తుంది. దానివల్ల అతడు మోహంలో పడి జ్ఞానం కోల్పోతాడు.

**భ్రష్టజ్ఞానం బాలభావే తతో జంతుః ప్రపద్యతే ।**
**తతః కౌమారకావస్థాం యౌవనం వృద్ధతామపి ॥70॥**

**పునశ్చ తద్వన్మరణం జన్మ ప్రాప్నోతి మానవః ।**
**తతః సంసారచక్రేఽస్మిన్ భ్రామ్యతే ఘటయంత్రవత్ ॥71॥**

అలా ప్రాణి బాలభావంలోనే పూర్వజ్ఞానంనుండి భ్రష్టస్థితిని పొందుతాడు. పిమ్మట కౌమరకావస్థను, యౌవనాన్ని, వృద్ధత్వాన్నికూడ పొందుతాడు. ఇక మళ్లీ అలాగే మరణం, తిరిగి జననం మానవుడు పొందుతూ ఉంటాడు. ఇలా ఈ సంసారచక్రంలో ఘటయంత్రంలా సంభ్రమిస్తూ ఉంటాడు.

**కదాచిత్ స్వర్గమాప్నోతి కదాచిన్నిరయం నరః ।**
**స్వర్గం చ నిరయం చైవ స్వకర్మ ఫలమశ్నుతే ॥72॥**

ఒకప్పుడు స్వర్గాన్ని, మరొకప్పుడు నరకాన్ని నరుడు పొందుతాడు, తన కర్మఫలితాన్నిబట్టి స్వర్గాన్ని, నరకాన్ని పొందుతాడు.

**కదాచిద్భుక్తకర్మా చ భువం స్వల్పేన గచ్ఛతి ।**
**స్వర్లోకే నరకే చైవ భుక్తప్రాయే ద్విజోత్తమాః ॥73॥**

ఒక్కొక్కప్పుడు కర్మలు అనుభవిస్తూ, కొద్దిగా కర్మమిగిలి ఉండగా, భూమికి వెడతాడు. ద్విజోత్తములు స్వర్గలోకమందు, నరకలోకమందు కర్మలు అనుభవిస్తూ ఉండగా ఇది జరుగుతుంది.

**నరకేషు మహద్దుఃఖ మేతద్యత్స్వర్గవాసినః ।**
**దృశ్యతే నాత్ర మోదంతే పచ్యమానాస్తు నారకైః ॥74॥**

నరకములందు మహాదుఃఖాన్ని పొందడమనేది స్వర్గవాసులచే చూడబడుతుంది. నరకవాసులు దుఃఖ పడుతూండగా చూచి వారు మోదాన్ని పొందరు.

**స్వర్గేఽపి దుఃఖమతులం యదారోహణ కాలతః ।**
**ప్రభృత్యహం పతిష్యామిత్యేతన్మనసి వర్తతే ॥75॥**

స్వర్గంలోకూడ ఆరోహణ సమయంలో దుఃఖమెక్కువగా ఉంటుంది. అది మొదలుకొని నేనుకూడా పడిపోతానుగదా! అని మనస్సులో తలుస్తూ ఉంటాడు.

**నారకాంశ్చైవ సంప్రేక్ష్య మహద్దుఃఖమవాప్యతే ।**
**ఏవం గతిమహం గంతేత్యహర్నిశ మనిర్వృతః ॥76॥**

నరకలోకవాసులను వీక్షించి, మిక్కిలి దుఃఖం పొందడం జరుగుతుంది. ఇదే గతిని నేనుకూడ పొందుతానని రాత్రిపగలు సంతోషంలేకుండా ఉంటాడు.

**గర్భవాసే మహద్దుఃఖం జాయమానస్య యోనిజమ్ ।**
**జాతస్య బాలభావేఽపి వృద్ధత్వే దుఃఖమేవ చ ॥77॥**

గర్భావాసం మిక్కిలి దుఃఖం, యోనిలోనుండి పుడుతున్నప్పుడు మరింత దుఃఖం. పుట్టినపిమ్మట బాలభావంలో మహాదుఃఖం. వృద్ధత్వంలో అనంతదుఃఖం కదా!

**కామేర్ష్యా క్రోధసంబంధాద్యౌవనేఽపి చ దుఃసహమ్ ।**
**దుఃస్వప్నం యా వృద్ధతా చ మరణే దుఃఖముత్కటమ్ ॥78॥**

కామం, ఈర్ష్య, క్రోధం వీటి సంబంధంచే యౌవనంలో సహింపలేని దుఃఖం, దుఃస్వప్నం, వృద్ధత్వమనేది దుఃఖమయం, మరణసమయంలో అత్యంతదుఃఖం.

**కృష్యమాణశ్చ యామ్యైః స నరకేఽపి చ యాత్యధః ।**
**పునశ్చ గర్భాజ్జన్మ స్యాన్మరణం దుష్కరం తథా ॥79॥**

యమకింకరులచే నరకంలోకి లాగబడి అతడు అధోమార్గంలో వెడతాడు. మళ్లీ గర్భంలోపడి పుట్టడం, మళ్లీ మరణం, ఇది దుష్కరమైనది కదా!

**ఏవం సంసార చక్రేఽస్మిన్ జంతవో ఘటయంత్రవత్ ।**
**భ్రామ్యంతే ప్రాక్తనైర్బంధైర్బద్ధా విధ్యంతి చాసకృత్ ॥80॥**

ఈ విధంగా ఈ సంసారచక్రంలో ప్రాణులు ఘటయంత్రంలా తిరుగుతూ ఉంటారు. పూర్వపు బంధాలచే బద్ధులై అదేపనిగా బాధపొందుతారు.

**నాస్తి పక్షిన్ సుఖం కించిత్ క్షేత్రే దుఃఖ శతాకులే ।**
**వినతాసుత మోక్షాయ యతితవ్యం తతో నరైః ॥81॥**

ఖగమా! వందలకొలది దుఃఖాలతో, సంకులమైన క్షేత్రంలో సుఖం అనేది కొంచెం కూడ లేదు. వినతాపుత్రా! కాబట్టి నరులు మోక్షంకోసమై ప్రయత్నం చేయాలి.

**ఏతత్తే సర్వమాఖ్యాతం యథా గర్భస్య సంస్థితిః ।**
**కథయామి క్రమప్రశ్నం పృష్టం వా వర్తతే స్పృహా ॥82॥**

గర్భంలో ఉండే స్థితిని దీనినంతా నీకు చెప్పడం జరిగింది. నీ ప్రశ్నక్రమాన్ని అనుసరించి చెబుతాను, నీకు ఏదైనా అడగాలనే కోరిక ఉందా?

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**మధ్యేకృత మహాప్రశ్న ద్వయస్యాప్తం మయోత్తరమ్ ।**
**ప్రశ్నస్యాపి తృతీయస్య ఉత్తరం చ విధీయతామ్ ॥83॥**

నేనడిగిన మహాప్రశ్నలు రెండింటికి, మధ్యలో సమాధానాన్ని పొందాను. ఇక మూడవ ప్రశ్నకు సమాధానాన్ని వివరించెదవు గాక!

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**మ్రియమాణస్య కింకృత్యమితి త్వం పృష్టవానసి ।**
**శృణు తత్రోత్తరం తూక్తం కథయామి సమాసతః ॥84॥**

(చనిపోయే) చనిపోయినవానికి ఏ విధంగా కర్మను ఆచరించాలని నీవు అడిగావుకదా! దానికి చెప్పబడే సమాధానం విను, సంక్షేపంగా తెలియజేస్తాను.

**ఆసన్న మరణం జ్ఞాత్వా పురుషం స్నాపయేత్తతః ।**
**గోమూత్ర గోమయ సుమృత్ తీర్థోదక కుశోదకైః ॥85॥**

**వాససీ పరిధార్యాథ ధౌతే తు శుచినీ శుభే ।**
**దర్భాణ్యాదౌ సమాస్తీర్య దక్షిణాగ్రాన్ వికీర్య చ ॥86॥**

**తిలాన్ గోమయలిప్తాయాం భూమౌ తత్ర నివేశయేత్ ॥87॥**

మరణం బాగా దగ్గరపడిందని తెలిసిన తరవాత, ఆ పురుషుని గోమూత్ర, గోమయాలతో, చక్కని మట్టితో, తీర్థోదక, కుశోదకాలతో స్నానం చేయించాలి. పిమ్మట పవిత్రాలై, మంగళప్రదాలై, స్వచ్ఛములైన, వస్త్రాలను ధరింపజేసి, గోమయంతో అలికిన నేలపై ముందు దర్భలను పరచి, వాటిని దక్షిణాగ్రాలుగా ఉంచి, వాటిపై నువ్వులను చల్లి, అందు పరుండజేయాలి.

**ప్రాగుదక్ శిరసం వాపి ముఖే స్వర్ణం వినిఃక్షిపేత్ ।**
**శాలగ్రామశిలా తత్ర తులసీ చ ఖగేశ్వర ॥88॥**

ఆ వ్యక్తి తలను తూర్పువైపు గాని, ఉత్తరంవైపు గాని ఉంచి, నోటిలో చిన్నబంగారం ముక్కను వేయాలి. ఖగరాజా! అక్కడ సాలగ్రామ శిలను, తులసిని ఉంచాలి.

**విధేయా సన్నిధౌ సర్పిర్దీపం ప్రజ్వాలయేత్పునః ।**
**నమో భగవతే వాసుదేవాయేతి జపస్తథా ॥89॥**

**ఆదౌ తు ప్రణవం కృత్వా పూజా దానే తతః స్మృతే ।**
**సమభ్యర్చ్య హృషీకేశం పుష్పధూపాదిభిస్తతః ॥90॥**

పిమ్మట ఆ సమీపంలో (ఆవు) నేతిదీపాన్ని ఉంచి, దానిని వెలిగించాలి, ముందు ప్రణవంచేసి "నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రాన్ని జపించాలి, పిమ్మట పూజాదానాలు చేయబడాలి, అనంతరం పుష్పధూపాదులతో నారాయణుని అర్చించాలి.

**ప్రణిపాతైః స్తవైః పుణ్యైర్ధ్యానయోగేన పూజయేత్ ।**
**దత్త్వా దానం చ విప్రేభ్యో దీనానాథేభ్య ఏవ చ ॥91॥**

సాష్టాంగ నమస్కారాలతోను, పుణ్యప్రదాలైన స్తవాలతోను, ధ్యానయోగంతోనూ పూజించాలి, విప్రులకు, దీనులకు, అనాథులకు దానాలు ఈయాలి.

**పుత్రే మిత్రే కలత్రే చ క్షేత్రధాన్యధనాదిషు ।**
**నివర్తయే న్మమత్వం చ విష్ణోః పాదౌ హృది స్మరన్ ॥92॥**

**ఉచ్చైః పురుషసూక్తం చ యదిశ్రేష్ఠా పద స్తదా ।**
**పుత్రాద్యాః ప్రపఠేయుస్తే మ్రియమాణే నిజే జనే ॥93॥**

పుత్రునియందు, మిత్రునియందు, కలత్రమందు, క్షేత్ర ధాన్య ధనాదులయందు మమత్వాన్ని వదలిపెట్టాలి, విష్ణువుయొక్క పాదాలను హృదయమందు స్మరిస్తూ, స్వజనులు మరణిస్తూఉండగా, లేదా గొప్ప ఆపదలో ఉండగా ఆ పుత్రులు మున్నగువారు ఉచ్చైఃస్వరంతో పురుషసూక్తం పఠించాలి.

**ఏతత్తే సర్వమాఖ్యాతం కృత్యం మృత్యావుపస్థితే ।**
**ఫలమప్యస్య కృత్స్నస్య సమాసాత్తే వదామ్యహమ్ ॥94॥**

మృత్యువు సమీపిస్తూ ఉండగా చేయవలసిన కర్మనంతా నీకు చెప్పడం జరిగింది. ఈ అధికమైన కర్మకు వచ్చేఫలితాన్ని నేను నీకు సంక్షేపంగా వివరిస్తాను.

**స్నానేన శుచితా ప్రాప్తి రపావిత్ర్య హృతిస్తతః ।**
**తతో విష్ణోః స్మృతిస్తస్య జ్ఞానాత్సర్వ ఫలప్రదా ॥95॥**

స్నానంవల్ల శరీరానికి శుచిత్వమేర్పడి, అపవిత్రత దూరమవుతుంది. విష్ణునామస్మరణవల్ల, అతనికి జ్ఞానంగలిగి సర్వోత్తమ ఫలితాలు చేకూరుతాయి.

**దర్భతూలీ నయేత్ స్వర్గమాతురం తు న సంశయః ।**
**తిలైర్దర్భైశ్చ నిఃక్షిప్తైః స్నానం క్రతుమయం భవేత్ ॥96॥**

దర్భతూలి ఆతురుని స్వర్గానికి తీసుకొనిపోతుంది, సంశయంలేదు దర్భలుపరచి, తిలలుచల్లి, స్నానంచేయిస్తే అది యజ్ఞంలోని అవభృథ స్నానమంత గొప్పది.

**బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ శ్రీర్హుతాశస్తథైవ చ ।**
**మండలే చోపతిష్ఠంతి తస్మాత్కుర్వీత మండలమ్ ॥97॥**

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, లక్ష్మి, అలాగే అగ్ని మండలమందు ఉపస్థితులై ఉంటారు. అందువల్ల మండలం ఏర్పాటు చేయాలి.

**ప్రాగుదగ్వా కృతేనేహ శిరసా లోకముత్తమమ్ ।**
**వ్రజతే యది పాపస్యాల్పత్వం పుంసో భవేత్ఖగ ॥98॥**

తూర్పుదిక్కుగా గాని, ఉత్తరందిక్కుగా గాని తలను ఉంచి కర్మ చేస్తే ఉత్తమలోకానికి వెడతాడు. ఖగమా! జీవుల పాపంకూడ తక్కువ అవుతుంది.

**పంచరత్నే ముఖే ముక్తే జీవే జ్ఞానం ప్రరోహతి ।**
**తులసీ బ్రాహ్మణా గావో విష్ణురేకాదశీ ఖగ ॥99॥**

**పంచ ప్రవహణాన్యేవ భవాబ్ధౌ మజ్జతాం నృణామ్ ।**

పంచ రత్నాలను నోటిలో విడిస్తే(వేస్తే) జీవునిలో జ్ఞానం మొలకెత్తుతుంది. తులసి, బ్రాహ్మణులు, గోవులు, విష్ణువు, ఏకాదశి ఈ అయిదునూ ఖగమా! సంసారమనే సాగరంలో మునిగిపోతున్న నరులకు నౌకలవంటివి

**విష్ణురేకాదశీ గీతా తులసీ విప్రధేనవః ॥100॥**

**అసారే దుర్గ సంసారే షట్పదీ భక్తిదాయినీ ।**

విష్ణువు, ఏకాదశి, గీత, తులసి, విప్రులు, ధేనువులు ఈ ఆరు స్థానాలు సారంలేని దుర్గమమైన సంసారంలో భక్తిని ప్రసాదించేవి.

**నమో భగవతే వాసుదేవాయేతి జపే(ప)న్నరః ॥101॥**

**ఓంకారపూర్వం సాయుజ్యం ప్రాప్నుయాన్నాత్ర సంశయః ।**
**పూజయాపి చ మల్లోకప్రాప్తిరారాద్దివం వ్రజేత్ ॥102॥**

"ఓం"కారపూర్వకంగా "నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రాన్ని జపించే నరుడు సాయుజ్యాన్ని పొందుతాడు. ఇందు సంశయంలేదు. పూజవల్ల నా లోకాన్ని పొందుతాడు. వెంటనే(సమీపంలో)స్వర్గానికి వెడతాడు.

**బంధాభావే మమత్వే తు జ్ఞానం పురుషసూక్తతః ।**
**యస్య యస్యాధికత్వం తు సాధనేష్వేషు కాశ్యప ॥103॥**

**తత్తత్ఫలస్యాప్యాధిక్యం భవతీత్యవధారయ ।**
**దాతవ్యాని యథా శక్త్యా ప్రీతోఽసౌ సర్వదా భవేత్ ॥104॥**

పురుషసూక్తపఠనంవల్ల బంధమోహం నుండి విడివడి నాయందు ఆసక్తి కలిగి జ్ఞానాన్ని పొందుతాడు. కశ్యప వంశ సంజాతా! ఈ జ్ఞానసాధనాలలో దేనికి దేనికి ఆధిక్యం ఉంటుందో, ఆయా ఫలాలకు కూడా అలాగే ఆధిక్యం ఉంటుందని గ్రహించు. యథాశక్తిగా దానాలు ఈయాలి, దానివల్ల అతడు ఎల్లప్పుడూ ప్రీతి పొందుతాడు.

**ఏతత్తే సర్వమాఖ్యాతం స్నానాదిషు ఫలం మయా ।**
**బ్రహ్మాండే యే గుణాః సన్తి శరీరే తే వ్యవస్థితాః ॥105॥**

స్నానాదులవల్ల వచ్చే ఫలాన్ని, దీనినంతా నేను నీకు చెప్పడం జరిగింది. బ్రహ్మాండంలో ఏ గుణాలు ఉన్నాయో, అవన్నీ(మానవ)శరీరంలో ఉంటాయి.

**పాతాల భూధరా లోకాస్తథాన్యే ద్వీపసాగరాః ।**
**ఆదిత్యాది గ్రహాః సర్వే పిండమధ్యే వ్యవస్థితాః ॥106॥**

పాతాలం, భూమి, పర్వతాలు, లోకాలు, అలాగే మిగిలిన ద్వీపాలు, సాగరాలు, ఆదిత్యాది గ్రహాలు అన్నీ పిండాండం మధ్యలో ఉన్నాయి.

**పాదాధస్తు తలం జ్ఞేయం పాదోర్ధ్వం వితలం తథా ।**
**జానుభ్యాం సుతలం విద్ధి సక్థిదేశే మహాతలమ్ ॥107॥**

**తథా తలాతలఞ్చోరౌ గుహ్యదేశే రసాతలమ్ ।**
**పాతాలం కటిసంస్థస్తు పాదాదౌ లక్షయేద్బుధః ॥108॥**

పాదాల క్రిందిభాగం తలంగా తెలుసుకోవాలి, పాదాల పైభాగం వితలంగా తెలుసుకోవాలి, జానువుల యందు సుతలం ఉందని గ్రహించు. సక్థిప్రదేశంలో(తొడలభాగంలో) మహాతలం. ఊరువులయందు తలాతలం, గుహ్యస్థానంలో రసాతలం, కటిప్రదేశంలో పాతాలం, పాదంయొక్క మొదటినుండి ఉన్నట్లుగా విద్వాంసుడు గుర్తిస్తాడు.

**భూర్లోకం నాభిమధ్యేతు భువర్లోకం తదూర్ధ్వతః ।**
**స్వర్గలోకం హృదయే విద్యాత్ కంఠదేశే మహస్తథా ॥109॥**

**జనలోకం వక్త్రదేశే తపోలోకం లలాటకే ।**
**సత్యలోకం మహారంధ్రే భువనాని చతుర్దశ ॥110॥**

నాభిమధ్యంలో భూలోకం, దానికిపైన భువర్లోకం, హృదయంలో స్వర్గలోకం ఉన్నట్లు గ్రహించాలి. కంఠదేశంలో మహర్లోకం, ముఖభాగంలో జనలోకం, లలాటంలో తపోలోకం, మహా (బ్రహ్మ) రంధ్రంలో సత్యలోకం. ఈ విధంగా పదునాల్గు భువనాలు ఉన్నాయి.

**త్రికోణే సంస్థితో మేరురధః కోణే చ మందరః ।**
**దక్షిణే చైవ కైలాసో వామభాగే హిమాచలః ॥111॥**

శరీరత్రికోణంలో మేరువు ఉంది. అధఃకోణంలో మందరం ఉంది, దక్షిణంలో కైలాసం, వామభాగంలో హిమాచలం ఉంది.

**నిషధశ్చోర్ధ్వభాగే చ దక్షిణే గంధమాదనః ।**
**మలయో(రమణో) వామరేఖాయం సప్తైతే కులపర్వతాః ॥112॥**

ఊర్ధ్వభాగంలో నిషధం, దక్షిణంలో గంధమాదనం, వామరేఖలో మలయం(రమణం) ఈ ఏడునూ కులపర్వతాలుగా ఉన్నాయి.

**అస్థిస్థానే స్థితో జంబూః శాకో మజ్జాసు సంస్థితః ।**
**కుశద్వీపః స్థితో మాంసే క్రౌంచద్వీపః శిరాస్థితః ॥113॥**

**త్వచాయం శాల్మలిద్వీపో ప్లక్షః రోమ్ణాం చ సంచయే ।**
**నఖస్థః పుష్కరద్వీపః సాగరా స్తదనంతరమ్ ॥114॥**

అస్థిస్థానంలో జంబూద్వీపం ఉంది, శాకద్వీపం మజ్జాస్థానంలో ఉంది, మాంసంలో కుశద్వీపం ఉంది, శిరలలో క్రౌంచద్వీపం ఉంది, త్వచాభాగంలో శాల్మలిద్వీపం ఉంది, రోమాల సమూహంలో ప్లక్షద్వీపం ఉంది, నఖాలలో పుష్కరద్వీపం ఉంది. ఆ తరువాత సాగరాలు ఉన్నాయి.

**క్షారోదశ్చ తథా మూత్రే క్షారే క్షీరోదసాగరః ।**
**సురోదధిశ్చ శ్లేష్మస్థః మజ్జాయం ఘృతసాగరః ॥115॥**

**రసోదధిం రసే విద్యాచ్ఛోణితే దధిసాగరమ్ ।**
**స్వాదులం లంబికాస్థానే గర్భోదం శుక్రసంస్థితమ్ ॥116॥**

మూత్రంలో క్షారోదం, అలాగే క్షారతత్త్వంలో క్షీరసాగరం, శ్లేష్మతత్త్వంలో సురోదధి, మజ్జాస్థానంలో ఘృతసాగరం, రసంలో రసోదధి, రక్తంలో దధిసాగరం ఉన్నట్లు తెలియాలి. లంబికాస్థానంలో (మాంసలం) స్వాదూదకసాగరం, శుక్రంలో గర్భోదకసాగరం ఉన్నాయి.

**నాదచక్రే స్థితః సూర్యో బిందుచక్రే చ చంద్రమాః ।**
**లోచనస్థః కుజో జ్ఞేయో హృదయే చ బుధః స్మృతః ॥117॥**

**విష్ణుస్థానే గురుం విద్యాచ్ఛుక్రే శుక్రో వ్యవస్థితః ।**
**నాభిస్థానే స్థితో మందో ముఖే రాహుః స్థితః సదా ॥118॥**

**పాయు(ద)స్థానే స్థితః కేతుః శరీరే గ్రహమండలమ్ ।**
**విభక్తశ్చ సమాఖ్యాత మాపాదతలమస్తకమ్ ॥119॥**

నాదచక్రంలో సూర్యుడు ఉన్నాడు, బిందుచక్రంలో చంద్రుడు ఉన్నాడు, లోచనస్థుడై కుజుడు ఉన్నాడు, హృదయంలో బుధుడు ఉన్నాడు, విష్ణుస్థానంలో గురుడు ఉన్నాడు, శుక్రంలో శుక్రుడు ఉన్నాడు, నాభిస్థానంలో మందుడు(శని) ఉన్నాడు, ముఖంలో ఎల్లప్పుడూ రాహువు ఉన్నాడు, పాయు(ద)స్థానంలో కేతువు ఉన్నాడు, శరీరంలో గ్రహమండలం ఈ విధంగా విభజింపబడియుంది. పాదతలంనుండి శిరస్సు వరకు ఎలా గ్రహాలు ఉన్నాయో చెప్పడం జరిగింది.

**ఉత్పన్నా యే హి సంసారే మ్రియంతే తే న సంశయః ।**
**బుభుక్షా చ తృషా రౌద్రా దాహోద్భూతా చ మూర్ఛనా ॥120॥**

ఈ సంసారంలో ఎవరు పుడుతూ ఉంటారో, వారు చనిపోతూనే ఉంటారు. సంశయంలేదు. ఆకలి, దప్పిక, రౌద్రమైన తాపంవల్లవచ్చే మూర్ఛనం(తప్పవు)

**యత్ర పీడాస్త్విమా రౌద్రాస్తా వై వృశ్చిక దంశజాః ।**
**వినాశః పూర్ణకాలే చ జాయతే సర్వదేహినామ్ ॥121॥**

తేళ్లు, దోమలు(ఈగలు) వల్ల కలిగే ఇటువంటి పీడలవల్ల వచ్చే బాధలన్నీ రౌద్రాలే, కాలంనిండిపోగా సర్వప్రాణులకు వినాశం సంభవిస్తుంది.

**అగ్రే అగ్రే హి ధావంతి యమలోక గతస్య వై ।**
**తప్తవాలుకమధ్యేన ప్రజ్వలద్వహ్నిమధ్యతః ॥122॥**

**కేశగ్రాహైః సమాక్రాంతా నీయంతే యమకింకరైః ।**
**పాపిష్ఠా స్త్వధమా స్తార్క్ష్య దయాధర్మ వివర్జితాః ॥123॥**

యమలోకానికి వెళ్లేవానిని మున్ముందుగా ఉంచి భటులు తరుముతూ ఉంటారు, తప్తవాలుకం అనే నరకం మధ్యలో పడవేసి భగ భగమండే అగ్నిలో మధ్యభాగంలో కూలదోస్తారు. గరుడా! పాపిష్ఠులై, అధములై, దయాధర్మాలు విడిచిపెట్టినవారిని యమకింకరులు జుట్టుపట్టుకొని ఈడ్చుకుపోతూ, లాగుకొనిపోతూ ఉంటారు.

**యమలోకే వసంత్యేవ కుట్యాం జన్మ న విద్యతే ।**
**ఏవం సంజాయతే తారక్ష్య మర్త్యే జంతుః స్వకర్మభిః ॥124॥**

ఆ పాపాత్ములు యమలోకంలో నివసిస్తారు. (యమ)కుటియందు (యమసభా గృహం) ఉన్నంతకాలం అతనికి జన్మ అనేది ఉండదు. గరుడా! ఈ విధంగా మర్త్యలోకంలో ప్రాణి తన కర్మలవల్లనే వాటిని అనుసరించి సంభవిస్తాడు.

**ఉత్పన్నా యే హి సంసారే మ్రియంతే తే న సంశయః ।**
**ఆయుః కర్మ చ విత్తఞ్చ విద్యా నిధనమేవ చ ॥125॥**

**పంచైతాని హి సృజ్యంతే గర్భస్థస్యైవ దేహినః ।**
**కర్మణా జాయతే జంతుః కర్మణైవ ప్రలీయతే ॥126॥**

ఎవరయితే సంసారంలో ఉద్భవిస్తారో, వారు మరణించి తీరుతారు. సంశయంలేదు. గర్భంలోపడిన జీవికి ఆయువు, కర్మ, ధనం, విద్య, మరణం అనే ఈ అయిదూ సృజింపబడే ఉంటాయి. కర్మవల్లనే ప్రాణి పుడతాడు, కర్మవలనే తిరిగి లయమవుతాడు.

**సుఖం దుఃఖం భయం క్షేమం కర్మణైవాభిపద్యతే ।**
**అధోముఖం చోర్ధ్వపాదం గర్భాద్వాయుః ప్రకర్షతి ॥127॥**

సుఖం, దుఃఖం, భయం, క్షేమం అనేవి కర్మవల్లనే తప్పనిసరిగా లభిస్తాయి. తలక్రిందికి, కాళ్లుపైకి పెట్టి ఉన్న శిశువును వాయువు గర్భంనుండి బయటకు నెట్టుతూఉంది.

**జన్మతో వైష్ణవీ మాయా సంమోహయతి సత్వరమ్ ।**
**స్వకర్మకృత సంబంధో జంతుర్జన్మ ప్రపద్యతే ॥128॥**

పుట్టీ పుట్టగానే వెంటనే వైష్ణవీమాయ పూర్తిగా మోహింపజేస్తుంది. తనకర్మవల్ల చేయబడిన సంబంధం ప్రకారంగా జంతువు(ప్రాణి) జన్మను పొందుతాడు.

**సుకృతాదుత్తమో భోగభాగ్యవాన్ సుకులే భవేత్ ।**
**యథా యథా దుష్కృతం తత్ కులే హీనే ప్రజాయతే ॥129॥**

**దరిద్రో వ్యాధితో మూర్ఖః పాపకృద్దుఃఖభాజనమ్ ।**
**అతఃపరం కిమర్థం తే కథయామి ఖగేశ్వర ॥130॥**

సుకృతంవల్ల ఉత్తముడు, భోగవంతుడు, భాగ్యవంతుడు, సత్కుల సంజాతుడు అవుతాడు. చేసిన ఆయా దుష్కృతంవల్ల హీనకులంలో పుడతాడు. దరిద్రుడు, వ్యాధిగ్రస్తుడు, మూర్ఖుడు, పాపాత్ముడు, దుఃఖభాజనుడు అవుతాడు. ఖగరాజా! ఇకమీదట నీకు ఇక ఏమిచెప్పమంటావు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే జంతూత్పత్తి తద్గత ధాత్వాదివిభాగ భువనాదివిభాగ వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రాణిపుట్టుక శరీరంలోని విశేషాలు అనే ముప్పై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పై మూడవ అధ్యాయం

## యమలోకవిస్తృతిః - యమలోకబాధల విస్తరణం

**గరుడ ఉవాచ** - గరుడుడు పలికాడు.

**ఉత్పత్తి లక్షణం జంతోః కథితం మయి పుత్రకే ।**
**యమలోకః కియన్మాత్ర స్త్రైలోక్యే సచరాచరే ॥**
**విస్తరం తస్య మే బ్రూహి అధ్వాచైవ కియాన్ స్మృతః ॥1॥**

పుత్రసమానుడనైన నాకు ప్రాణియొక్క ఉత్పత్తి లక్షణం చెప్పావు. చరాచరాత్మకమైన త్రైలోక్యంలో యమలోకం ఎంత ప్రమాణంలో ఉంటుంది? యమమార్గం కూడ (ఎంతదూరంలో) ఎలా ఉంటుంది? దానిని నాకు విస్తరించి వివరించు.

**కైశ్చ పాపైః కృతైర్దేవ కేన వా శుభకర్మణా ।**
**గచ్ఛంతి మానవాస్తత్ర కథయస్వ విశేషతః ॥2॥**

దేవా! ఏ పాపాలు చేస్తే, లేదా ఏ శుభకర్మ చేస్తే మానవులు అక్కడకు చేరుకొంటారు. ఆ విషయాన్ని విశేషించి చెప్పవలసింది.

**శ్రీభగవానావాచ** - శ్రీభగవంతుడు వచించాడు.

**షడశీతి సహస్రాణి యోజనానాం ప్రమాణతః ।**
**యమలోకస్య చాధ్వానమంతరా మానుషస్య చ ॥3॥**

మానుషలోకానికి యమలోకానికి మధ్యనున్న మార్గం ఎనభైయారువేల యోజనాల ప్రమాణంలో ఉంటుంది.

**ధ్మాతతామ్ర మివాతప్తో జ్వలద్దుర్గో మహాపథః ।**
**తత్ర గచ్ఛంతి పాపిష్ఠా మానవా మూఢచేతసః ॥4॥**

ఆ మహామార్గం కాల్చబడిన రాగివలె మండిపోతూ, అగ్నిని రగిలిస్తూ, దుర్గమమయి ఉంటుంది. అక్కడకు మూఢచేతస్కులై పాపిష్ఠులైన మానవులు వెడతారు.

**కంటకాశ్చ సుతీక్ష్ణా వై వివిధా ఘోరదర్శనాః ।**
**తైస్తు వాలు క్షితిర్వ్యాప్తా హుతాశశ్చ తథోల్బణః (వర్త్మా) ॥5॥**

మిక్కిలి తీక్ష్ణములైన కంటకాలవంటివారై (కంటకప్రాయులై,తీక్ష్ణరూపులై) నానావిధ భయంకరదర్శనులై యమకింకరులు అక్కడ ఉంటారు. వారిచే ఆ మార్గ భూమిఅంతా నిండిపోయి ఉంటుంది. అగ్నికూడ గట్టిగా రగిలి ధ్వనిస్తూ ఉంటుంది.

**వృక్షచ్ఛాయా న తత్రాస్తి యత్ర విశ్రమతే నరః ।**
**గృహీత కాలపాశైశ్చ కృతైః కర్మభిరుల్బణైః ॥6॥**

ఎక్కడయినా నరుడు విశ్రాంతి పొందుదామంటే, అక్కడ చల్లని చెట్టునీడ కనబడదు, కాలపాశాలతో బంధించి ఈడ్చుకొనిపోతారు. ఉగ్రకృత్యాలతో భయపెడతారు

**తస్మిన్ మార్గే న చాన్నాద్యం యేన ప్రాణాన్ ప్రపోషయేత్ ।**
**న జలం దృశ్యతే తత్ర తృషా యేన విలీయతే ॥7॥**

ఏదైన తిని ఆ మార్గంలో ప్రాణాలు నిలబెట్టుకొందామంటే, అన్నాదులు లభ్యంకావు. అక్కడ ఎలాగో అలాగ దప్పిక తీర్చుకొందామంటే ఎక్కడా జలం కానరాదు.

**క్షుధయా పీడితో యాతి తృష్ణయా చ మహాపథే ।**
**శీతేన కంపతే క్వాపి యమమార్గేఽతి దుర్గమే ॥8॥**

**యద్యస్య యాదృశం పాపం స పంథా స్తస్య తాదృశః ।**
**సుదీనాః కృపణా మూఢా దుఃఖైర్వ్యాప్తా స్తరంతి తమ్ ॥9॥**

ఆ మహాపథంలో ఆకలితోను, దప్పికతోను పీడింపబడుతూ వెడతాడు. అతిదుర్గమమైన యమమార్గంలో ఒక్కొక్కప్పుడు ఎక్కడైనప్పటికి చలితో వణకిపోతూ ఉంటాడు. ఎవడు ఎటువంటి పాపంచేస్తాడో, అతనికి అటువంటి మార్గమే లభిస్తుంది. మిక్కిలి దీనులు, కృపణులు, మూఢులు, దుఃఖసంతప్తులై ఆ దారిలో ముందుకుపోతూ ఉంటారు.

**రుదంతి దారుణం కేచిత్ కేచిద్ద్రోహం వదంతి చ ।**
**ఆత్మకర్మ కృతైర్దోషైః పచ్యమానా ముహుర్ముహుః ॥10॥**

కొందరు దారుణంగా విలపిస్తారు, మరికొందరు చేసిన ద్రోహాలను చెప్పుకొంటారు. తాము చేసిన కర్మసంబంధదోషాలచే మాటి మాటికి దుఃఖిస్తూ ఉంటారు.

**ఈదృగ్విధః స వై పంథా విజ్ఞేయో దారుణః ఖగ ।**
**వితృష్ణా యే నరా లోకే సుఖం తస్మిన్ వ్రజంతి తే ॥11॥**

ఖగమా! ఈ విధంగా ఆ యమమార్గం దారుణంగా ఉంటుందని తెలుసుకో. ఈ లోకంలో తృష్ణను విడిచి పెట్టిన నరులు ఆ మార్గంలో సుఖంగా పయనిస్తారు.

**యాని యాని చ దానాని దత్తాని భువి మానవైః ।**
**తాని తాన్యుపతిష్ఠంతి యమలోకే పురః పథి ॥12॥**

భూమియందు మానవులు ఏ ఏ దానాలు చేస్తారో, యమలోకమార్గంలో ఆయా దానాల ఫలితాలు ఎదురుగా వచ్చి కూర్చుంటాయి.

**పాపినో నోపతిష్ఠంతి దాహశ్రాద్ధ జలాంజలి ।**
**భ్రమంతి వాయుభూతాస్తే యే క్షుద్రాః పాపకర్మిణః ॥13॥**

అగ్నిదాహం, శ్రాద్ధవిధి, జలాంజలి పాపాత్మునకు లభింపవు. పాపకర్ములు, క్షుద్రులు వాయుభూతులై (గాలిరూపంతో) భ్రమిస్తూ ఉంటారు.

**ఈదృశం వర్త్మ తద్రౌద్రం కథితం తవ సువ్రత ।**
**పునశ్చ కథయిష్యామి యమమార్గస్య యా స్థితిః ॥14॥**

సువ్రతా! ఈ విధమైన భయంకరమగు యమమార్గం గురించి నీకు చెప్పాను. యమమార్గ స్థితిని గురించి మళ్లీ చెబుతున్నాను.

**యామ్య నైరృతయోర్మధ్యే పురం వైవస్వతస్య తు ।**
**సర్వం వజ్రమయం దివ్యమభేద్యం తత్ సురాసురైః ॥15॥**

దక్షిణ నైరృత దిశల మధ్యలో వైవస్వతుని పురం ఉంది. అదంతా వజ్రమయమైనది, దివ్యమైనది. అది సురాసురులచే భేదింప శక్యంకానిది.

**చతురశ్రం చతుర్ద్వారం సప్తప్రాకారతోరణమ్ ।**
**స్వయం తిష్ఠతి వై యస్యాం యమో దూతైః సమన్వితః ॥16॥**

అది చతురస్రాకారమై, నాలుగు ద్వారాలతో, ఏడు ప్రాకారతోరణాలతో ఉంటుంది, ఆ పురిలో దూతలతో సహా యముడు స్వయంగా ఉంటాడు.

**యోజనానాం సహస్రం వై ప్రమాణేన తదుచ్యతే ।**
**సర్వరత్నమయం దివ్యం విద్యుజ్జ్వాలార్క తేజసమ్ ॥17॥**

**తద్గృహం ధర్మరాజస్య విస్తీర్ణం కాంచనప్రభమ్ ।**
**యోజనానాం పంచశత ప్రమాణేన సముచ్ఛ్రితమ్ ॥18॥**

ఒక వేయి యోజనాల(ప్రమాణ)విస్తారంతో అది ఉన్నట్లుగా చెప్పబడింది, అది సమస్త రత్నాలతో కూడు కొన్నట్టిది. దివ్యమైనది, మెరుపుతీగల కాంతులతో, సూర్యతేజస్సుతో భాసిస్తూ ఉంటుంది. అందు యమధర్మరాజు భవనం బంగారు కాంతులతో మెరసిపోతూ ఉంటుంది. దాని విస్తీర్ణం అయిదువందలయోజనాల ప్రమాణం. మిక్కిలి ఎత్తయినదది.

**వృతం స్తంభ సహస్రైస్తు వైడూర్యమణి మండితమ్ ।**
**ముక్తాజాల గవాక్షం చ పతాకా శతభూషితమ్ ॥19॥**

వేయిస్తంభాలపై నిలపెట్టబడి ఉంటుంది, వైడూర్యమణులతో అలంకరింపబడి ఉంటుంది. ముత్యాలదండలతో కూడిన గవాక్షాలతో, రెప రెపలాడుతున్న వందలకొలది పతాకలతో శోభిల్లుతూ ఉంటుంది.

**ఘంటాశతనినాదాఢ్యం తోరణానాం శతైర్వృతమ్ ।**
**ఏవమాదిభి రన్యైశ్చ భూషణై ర్భూషితం సదా ॥20॥**

వందలకొలది ఘంటల ధ్వనులు ఎల్లప్పుడూ వినబడుతూ ఉంటాయి. అలాగే వందలకొలది తోరణాలతో వ్యాపించి ఉంటుంది, ఇంతే కాక ఇంకా ఎన్నో భూషణాలతో ఎల్లప్పుడూ విలసిల్లుతూ ఉంటుంది.

**తత్రస్థో భగవాన్ ధర్మ ఆసనే తు సమే శుభే ।**
**దశయోజనవిస్తీర్ణే నీలజీమూతసన్నిభే ॥21॥**

అందులో పది యోజనాల విస్తీర్ణంలో, నీలమేఘసమానమై, శోభాసంపన్నమై, చతురస్రమై, శుభమైన ఆసనంపై భగవంతుడైన యమధర్మరాజు కూర్చొనిఉంటాడు.

**ధర్మజ్ఞో ధర్మశీలశ్చ ధర్మయుక్తో హితో యమః ।**
**భయదః పాపయుక్తానాం ధార్మికాణాం సుఖప్రదః ॥22॥**

ధర్మజ్ఞుడు, ధర్మశీలుడు, ధర్మయుక్తుడు అయిన యముడు ధార్మికులకు సుఖప్రదుడై, హితుడై ఉంటాడు. పాపయుక్తులకు భయాన్ని ఇచ్చేవాడయి ఉంటాడు.

**మందమారుత సంయోగై రుత్సవైర్వివిధై స్తథా ।**
**వ్యాఖ్యానైర్వివిధై ర్యుక్తః శంఖవాదిత్ర నిఃస్వనైః ॥23॥**

శంఖవాద్య ధ్వనులచేతను, నానావిధ వ్యాఖ్యానాలతోను కూడి, పిల్లగాలులు చల్లగా వీస్తూ ఉండగా, అనేక విధాలైన ఉత్సవాలతో హాయిగా ఉంటాడు.

**పురమధ్య ప్రవేశే తు చిత్రగుప్తస్య వై గృహమ్ ।**
**పంచవింశతి సంఖ్యానాం యోజనానాం సువిస్తరమ్ ॥24॥**

**దశోచ్ఛ్రితం మహాదివ్యం లోహప్రాకారవేష్టితమ్ ।**
**ప్రతోలీశతసంచారం పతాకాశతశోభితమ్ ॥25॥**

యమపుర మధ్యప్రవేశభాగంలో చిత్రగుప్తుని భవనంఉంది, అది ఇరవైఅయిదు యోజనాల విస్తీర్ణంలో ఉంది, దాని ఎత్తు పది యోజనాలు, మహాదివ్యమైన దది. ఇనుప ప్రాకారంతో చుట్టుకొనబడి ఉంటుంది. వందల కొలది దారులలో ఎందరో సంచరిస్తూ ఉంటారు. వందల సంఖ్యలో నున్న పతాకలతో విలసిల్లుతూ ఉంటుంది.

**దీపికా శతసంకీర్ణం గీతధ్వనిసమాకులమ్ ।**
**విచిత్ర చిత్రకుశలై శ్చిత్రగుప్తస్య వై గృహమ్ ॥26॥**

వందలకొలది దీపాలు వెలుగుతూ, నిత్యం గీతాలాపనలతో అలరిస్తూ, చిత్ర విచిత్ర ప్రావీణ్యంతో నిండిన కుడ్యాలతో విలసిల్లుతూ చిత్రగుప్తుని మందిరం ఉంటుంది.

**మణిముక్తామయే దివ్యే ఆసనే పరమాద్భుతే ।**
**తత్రస్థో గణయత్యాయుర్మానుషేష్వితరేషు చ ॥27॥**

మణులచేత, ముత్యాలచేత పొదగబడి, మిక్కిలి అద్భుతమైన దివ్యాసనంలో కూర్చుని, మనుష్యులకు, ఇతరులకు సంబంధించిన ఆయుష్షును చిత్రగుప్తుడు లెక్కిస్తూ ఉంటాడు.

**న ముహ్యతి కదాచిత్ స సుకృతే దుష్కృతేఽపి వా ।**
**యద్ యేనోపార్జితం యావత్ తావద్వై వేత్తి తస్య తత్ ॥28॥**

అతడు ఎన్నడూ సుకృతంలో కాని, దుష్కృతంలో కాని మోహం చెందదు. ఏది ఎవనిచే సంపాదింపబడుతుందో అదంతా – అతని కర్మ యావత్తూ చిత్రగుప్తుడు తెలిసికొంటాడు.

**దశాష్ట దోషరహితం కృతకర్మ లిఖత్యసౌ ।**
**చిత్రగుప్తాలయాత్ ప్రాచ్యాం జ్వరస్యాస్తి మహాగృహమ్ ॥29॥**

**దక్షిణేచాపి శూలస్య లతావిస్ఫోటకస్య చ ।**

ప్రాణులు చేసేకర్మను అంతను పదునెనిమిది దోషాలు లేకుండా చిత్రగుప్తుడు వ్రాస్తూఉంటాడు. చిత్రగుప్తుని ఆలయమునుండి తూర్పున జ్వరుని యొక్క మహాగృహం ఉంటుంది. దక్షిణంలో తలప్రహారంచే విస్ఫోటనం సృష్టించే శూలుని గృహం ఉంటుంది. (లతా–మెరుపుతీగలా విస్ఫోటనం చేయగల్గిన)

**పశ్చిమే కాలపాశస్య అజీర్ణస్యారుచే స్తథా ॥30॥**

**మధ్య పీఠోత్తరే జ్ఞేయా తథా చాన్యా విషూచికా ।**
**ఐశాన్యాం వై శిరోఽర్తిశ్చ ఆగ్నేయాఞ్చైవ మూకతా ॥31॥**

పశ్చిమాన కాలపాశుడు, అజీర్ణుడు, అరుచియొక్క భవనాలు ఉంటాయి. అలాగే మధ్యపీఠంయొక్క ఉత్తరభాగంలో మరోదైన విషూచికా స్థానం ఉంది. ఐశాన్యమందు శిరోవేదనా గృహం, ఆగ్నేయమందు మూకతాస్థానం ఉంటాయి.

**అతిసారశ్చ నైరృత్యాం వాయవ్యాం దాహసంజ్ఞకః ।**
**ఏభిః పరివృతో నిత్యం చిత్రగుప్తః స తిష్ఠతి ॥32॥**

నైరృతియందు అతిసారమనే స్థానం, వాయవ్యమందు దాహమనే పేరుగల స్థానం ఉంటాయి. వీటిఅన్నింటితోను కూడుకొని నిత్యమూ చిత్రగుప్తుడు కొలువుతీరి ఉంటాడు.

**యత్కర్మ కురుతే కశ్చిత్తత్ సర్వం విలిఖత్యసౌ ।**
**ధర్మరాజ గృహద్వారి దూతా స్తారక్ష్య తథా నిశి ॥**
**తిష్ఠంతి పాపకర్మాణః పచ్యమానా నరాధమాః ॥33॥**

ఎవడు ఏ కర్మ చేస్తాడో, దానినంతనూ లిఖిస్తూ ఉంటాడు అతడు. గరుడా! ధర్మరాజు గృహద్వారంలో రాత్రివేళ దూతలు నిలిచిఉంటారు. పాపకర్ములు, నరాధములు, అతిదుఃఖితులు(కుత కుతఉడికిపోతున్న)

**యమదూతై ర్మహాపాశైర్వ్యమానాశ్చ ముద్గరైః ।**
**వధ్యంతే వివిధైః పాపైః పూర్వకర్మకృతైర్నరాః ॥34॥**

మహాపాశాలచే, ముద్గరాలచే యమదూతలు కొడుతూఉండగా ఏడుస్తూ ఉంటారు. నరులు గతంలో చేసిన వివిధ పాపాలచే హింసింపబడుతూ ఉంటారు.

**నానాప్రహరణాగ్రైశ్చ నానాయంత్రైస్తథా పరే ।**
**ఛిద్యంతే పాపకర్మాణః క్రకచైః కాష్ఠవద్ద్విధా ॥35॥**

కొందరు మొనదేలిన వివిధ ప్రహరణాయుధాలచేత, మరికొందరు వివిధయంత్ర సాధనాలచేత బాధింపబడుతూ ఉంటారు. ఇంకకొందరు పాపకర్ములు రంపాలచే కఱ్ఱ రెండు ముక్కలుగా నరకబడినట్లుగా ఛేదింపబడుతూ ఉంటారు.

**అన్యే జ్వలద్భిరంగారైర్వేష్టితాః పరితో భృశమ్ ।**
**పూర్వకర్మ విపాకేన ధ్మాయంతే లోహపిండవత్ ॥36॥**

కొందరయితే చుట్టూ మండుతూఉన్న నిప్పులతో మిక్కిలిగా కుత కుతలాడుతూ ఉంటారు. పూర్వకర్మ పరిపాకంచే ఇనుపగుండు వలె కొందరు కాల్చబడుతూ ఉంటారు.

**క్షిప్త్వాన్యే చ ధరాపృష్ఠే కుఠారేణావకర్తితాః ।**
**క్రందమానాశ్చ దృశ్యంతే పూర్వకర్మ విపాకతః ॥37॥**

కొందరు నేలపైభాగంలో దొర్లుతూ (దొర్లింపబడుతూ) కుఠారంచే కత్తిరింపబడుతూ ఉంటారు. పూర్వకర్మ విపాకంచే ఆక్రందిస్తూ కొందరు కనబడతారు.

**కేచిద్గుడమయైః పాకై స్తైలపాకైస్తథాపరే ।**
**పీడ్యంతే యమదూతైశ్చ పాపిష్ఠాః సుభృశం నరాః ॥38॥**

కొందరు గుడమయ(బెల్లం)పాకాలచే, మరికొందరు తైల(నూనె)పాకాలచే పీడింపబడుతూ ఉంటారు. యమదూతలు పాపిష్ఠులైన నరులను మిక్కిలి దారుణంగా పీడిస్తారు.

**క్షణాహ్ని ప్రార్థయన్త్యన్యే దేహి దేహీతి కోటిశః ।**
**యమలోకే మయా దృష్టా మమ స్వం భక్షితం త్వయా ॥39॥**

"నా సొమ్ము కోట్లకొలది నువ్వు తిన్నావు. తిరిగి ఇవ్వు" అంటూ కొందరు ప్రతిక్షణమూ ఎవరినో అడుగుతుంటారు.

**ఇత్యేవం బహుశస్తార్క్ష్య నరకాః పాపినాం స్మృతాః ।**
**కర్మభి ర్బహుభిః ప్రోక్తైః సర్వశాస్త్రేషు భాషితైః ॥**
**దానోపకారం వక్ష్యామి యథా తత్ర సుఖం భవేత్ ॥40॥**

ఈ విధంగా ఎన్నో నరకాలు పాపాత్ములకు చెప్పబడ్డాయి. గరుడా! అనేక కర్మలవల్ల ఈ నరకాలు చెప్పబడడం జరిగింది. సర్వశాస్త్రాలుకూడ పదే పదే తెలియజేశాయి. అక్కడ ఎలా సుఖం చేకూరుతుందో, ఏ దానం చేయడంవల్ల ఫలితమేమిటో ఇక చెబుతాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే యమలోకవిస్తృతి వర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥33॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో యమలోకబాధల విస్తరణం అనే ముప్పై మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుస్త్రింశోఽధ్యాయః** - ముప్పై నాల్గవ అధ్యాయం

## **ఔర్ధ్వదైహికాది నిరూపణమ్** - ఔర్ధ్వదైహికం, సపిండీకరణం మొదలగునవి

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**శృణు తార్క్ష్య యథాన్యాయం ధర్మాధర్మస్య లక్షణమ్ ।**
**సుకృతం దుష్కృతం నృణా మగ్రే ధావతి ధావతామ్ ॥1॥**

గరుడా! ధర్మాధర్మాల లక్షణాలను యథోచితంగా విను, సుకృతం కాని దుష్కృతం కాని నరులకు పరుగుపెడుతూంటే, ముందుగానే పరుగుతీసి వస్తుంది.

**కృతే తపః ప్రశంసంతి త్రేతాయాం జ్ఞానసాధనమ్ ।**
**ద్వాపరే యజ్ఞదానే చ దానమేకం కలౌయుగే ॥2॥**

కృతయుగంలో తపస్సును ప్రశంసిస్తారు, త్రేతాయుగంలో జ్ఞానాన్ని సాధనంగా చెబుతారు, ద్వాపరయుగంలో యజ్ఞదానాలు ప్రశస్తాలు, కలియుగంలో ఒక్కదానమే గొప్పది.

**గృహస్థానాం స్మృతో ధర్మ ఉత్తమానాం విచక్షణైః ।**
**ఇష్టాపూర్తే స్వశక్త్యా హి కుర్వతాం నాస్తి పాతకమ్ ॥3॥**

ఉత్తములైన గృహస్థులకు విచక్షణులచే ధర్మం చెప్పబడింది, తన శక్తిననుసరించి ఇష్టాపూర్తాలు చేసేవానికి పాతక మన్నది లేనేలేదు.

**వృక్షస్తు రోపితో యేన ఖనికూపజలాశయాః ।**
**యమమార్గే సుఖం తస్య వ్రజతో నితరాం భవేత్ ॥4॥**

చెట్టు ఎవనిచే నాటబడుతుందో, గని, బావి, చెరువు ఎవడు ఏర్పాటుచేస్తాడో, అతనికి యమమార్గంలో వెడుతూ ఉంటే మిక్కిలి సుఖంగా ఉంటుంది.

**అగ్నితాప ప్రదాతారో యైః శీతపీడితే ద్విజే ।**
**తప్యమానాః సుఖం యాంతి సర్వకామైః ప్రపూరితాః ॥5॥**

చలితో వణకిపోతున్న ద్విజునకు, అగ్నితాపాన్ని కలిగించే ఉపకరణాలు ఇచ్చిన, వారు వేడిని కలిగించే సుఖాన్ని పొందుతూ, అన్నికోరికలు నెరవేరినవారై ముందుకు వెడతారు.

**సువర్ణమణిముక్తాది వస్త్రాణ్యాభరణాని చ ।**
**తేన సర్వమిదం దత్తం యేన దత్తా వసుంధరా ॥6॥**

బంగారం, మణులు, ముత్యాలు, వస్త్రాలు, ఆభరణాలు, ఇవన్నీ దానం ఇచ్చినవాడు, వసుంధరను ఇచ్చినవాడవుతాడు.

**యాని యాని చ భూతాని దత్తాని భువి మానవైః ।**
**యమలోకపథే తాని తిష్ఠంత్యేషాం సమీపతః ॥7॥**

భూమియందు మానవులు చేసిన భూతహిత దానాలు యమలోకమార్గంలో వారి సమీపంలోనే ఉంటాయి.

**వ్యంజనాని విచిత్రాణి భక్ష్యభోజ్యాని యాని చ ।**
**దదాతి విధినా పుత్ర! ప్రేతే తదుపతిష్ఠతి ॥8॥**

కుమారా! విచిత్ర వ్యంజనాలు, నానావిధ భక్ష్యభోజ్యాలు యథావిధిగా ఇస్తే, అవన్నీ ప్రేతకు చెందుతాయి.

**ఆత్మా వై పుత్రనామాస్తి పుత్రస్త్రాతా యమాలయే ।**
**తారయేత్ పితరం ఘోరాత్ తేన పుత్రః ప్రవక్ష్యతే ॥9॥**

తానే పుత్రుడనే పేర పుడతాడు. యమాలయంలో పుత్రుడే రక్షకుడు, ఘోరమైన నరకంనుండి తండ్రిని తరింపజేస్తాడు, అందువల్ల పుత్రుడని చెప్పబడతాడు.

**అతో దేయఇ్చ పుత్రేణ శ్రాద్ధమాజీవితావధి ।**
**అతివాహస్తదా ప్రేతో భాగాన్ వై లభతే హి సః ॥10॥**

అందువల్ల పుత్రుడు జీవించి ఉన్నంతవరకు శ్రాద్ధం చేస్తూనే(ఇస్తూ)ఉండాలి. అతివాహుడుగా ఉన్నసమయంలో ఆ ప్రేత భోగాలను పొందగలడు.

**దహ్యమానస్య ప్రేతస్య స్వజనై ర్యో జలాంజలిః ।**
**దీయతే ప్రేతరూపోఽసౌ ప్రీతో యాతి యమాలయే ॥11॥**

దహింపబడుతున్న ప్రేతకు స్వజనులు ఇచ్చే జలాంజలి యమాలయంలో ప్రేతరూపుడుగా ఉన్నప్పుడు ప్రీతి కలిగిస్తుంది.

**అపక్వే మృన్మయే పాత్రే దుగ్ధం దత్తం దినత్రయమ్ ।**
**కాష్ఠత్రయం గుణైర్బద్ధ్వా ప్రీత్యై రాత్రౌ చతుష్పథే ॥12॥**

బాగా కాలని మట్టిపాత్రలో మూడు రోజులపాటు పాలుపోయాలి, మూడు కర్రపుల్లలతో త్రాళ్లతో కట్టి రాత్రి ప్రేత ప్రీతి కొరకు చతుష్పథంలో ఉంచాలి.

**ప్రథమేఽహ్ని ద్వితీయే చ తృతీయే చ తథా ఖగ ।**
**ఆకాశస్థం పిబేద్దుగ్ధం ప్రేతో వాయువపుర్ధరః ॥13॥**

ఖగమా! మొదటి రోజున, రెండవ రోజున, మూడో రోజున అలా వాయురూపాన్ని ధరించియున్న ప్రేత ఆకాశంలో ఉన్న పాలను త్రాగుతాడు.

**చతుర్థే సంచయః కార్యః చతుర్థే వాపి సాగ్నికే ।**
**అస్థిసంచయనం కార్యం దద్యాదాపాఽంజలిం తతః ॥14॥**

నాలుగో రోజున సంచయం చేయాలి, నాలుగో రోజున అగ్నివిధితో అస్థిసంచయనం చేయాలి. పిమ్మట జలాంజలిని ఈయాలి.

**న పూర్వాహ్ణే న మధ్యాహ్నే నాపరాహ్ణే న సంధిషు ।**
**యాతే ప్రథమయామే తు దద్యాదాపజలాంజలీన్ ॥15॥**

పూర్వాహ్ణంలో కాని, మధ్యాహ్నంలో కాని, అపరాహ్ణంలో కాని, సంధికాలాలలో కాని జలాంజలిని ఈయరాదు. మొదటి యామం గడచిన తరువాత జలాంజలులను ఈయాలి.

**పుత్రేణ దత్తే తే సర్వే గోత్రిణో హితబాంధవాః ।**
**స్వజాత్యైః పరజాత్యైశ్చ దేయో నద్యాం జలాంజలిః ॥16॥**

పుత్రుడు ఇచ్చిన తరువాత సగోత్రికులు, హితులు, బాంధవులు, స్వజాతులు, పరజాతులు మున్నగువారందరూ కలసి నదియందు జలాంజలిని ఈయాలి.

**గంతవ్యం నైవ విప్రేణ దాతుం శీఘ్రం జలాంజలిమ్ ।**
**నివృత్తాశ్చ యదా నార్యో లోకాచారః సదా భవేత్ ॥17॥**

విప్రుడు గబ గబా వెంటనే జలాంజలి ఈయడానికి వెళ్లరాదు. ముందు స్త్రీలు అందరూ వెళ్లిపోయినతరవాత ఈయడమే లోకాచారంగా ఎప్పుడూ వస్తోంది.

**పంచత్వం చ గతే శూద్రే యః కాష్ఠం నయతే చితామ్ ।**
**అనువ్రజేద్యదా విప్రస్త్రిరాత్ర మశుచిర్భవేత్ ॥18॥**

శూద్రుడు కనుక మరణిస్తే, చితివద్దకు కాష్ఠాలు తీసుకొనివెడితే, విప్రుడు కనుక అనుసరించివెడితే, అప్పుడు మూడు రాత్రులు అశుచిగా ఉండాలి.

**త్రిరాత్రే చ తతఃపూర్ణే నదీం గచ్ఛేత్ సముద్రగామ్ ।**
**ప్రాణాయామశతం కృత్వా ఘృతం ప్రాశ్య విశుద్ధ్యతి ॥19॥**

మూడు రాత్రులు పూర్తిఅయిన తరువాత సముద్రంలోకి ప్రవేశిస్తున్న నదికి(నదీసాగరసంగమం వద్దకు) వెళ్లి స్నానంచేయాలి, వందమారులు ప్రాణాయామం చేయాలి. నేతిని ప్రాశనం చేయాలి, అప్పుడు శుద్ధి పొందుతాడు.

**శూద్రో గచ్ఛతి సర్వత్ర వైశ్య స్త్రిషు ద్వయోః పరః ।**
**గచ్ఛతి స్వీయవర్ణేషు దాతుం ప్రేతే జలాంజలిమ్ ॥20॥**

శూద్రుడు ఏవర్ణంవారు చనిపోయినా వెళ్లవచ్చు, వైశ్యుడు మూడు వర్ణాలవారికి వెళ్లవచ్చు. ఈ ఇద్దరికన్న ఇతరుడు మిగిలిన ఇద్దరు వారికి వెళ్లవచ్చు. ప్రేతకు జలాంజలి ఈయడానికి వెళ్లుటకు స్వీయవర్ణాలవారికి ఉండే నియమం సాధారణం.

**దత్తే జలాంజలౌ పశ్చాద్విదధ్యాద్దంతధావనమ్ ।**
**త్యజంతి గోత్రిణః సర్వే దినాని నవ కాశ్యప ॥21॥**

జలాంజలి ఇచ్చినపిమ్మట దంతధావనం చేయాలి, కశ్యపవంశ సంజాతా! సగోత్రికులు అందరూ తొమ్మిది రోజులూ జలాంజలులు విడుస్తారు.

**జలాంజలిం తథా దాతుం గచ్ఛంతి ద్విజసత్తమాః ।**
**యత్ర స్థానే మృతో యస్తు అధ్వన్యపి గృహేఽపి వా ॥**
**విశ్లేషస్తు తతః స్థానాన్న క్వచిద్విహితో బుధైః ॥22॥**

ద్విజసత్తములు జలాంజలిని ఇవ్వటానికి యథావిధిగా వెడతారు, ఎవడైనా స్థానంలో(తన) మరణించిన వాడైనా, మార్గంలో మరణించినా, ఇంటిలోఉండి మరణించిన, ఎడబాటనేది అతనినుండి ఎప్పుడూ ఉండదని బుధులచే విధింపబడింది.

**స్త్రీజన శ్చాగ్రతో గచ్ఛేత్ పృష్ఠతో నవసంచయః ।**
**ఆచమనం విధాతవ్యం పాషాణోపరిసంస్థితైః ॥23॥**

**యవాంశ్చ సర్షపాన్ దూర్వాః పూర్ణపాత్రే విలోకయేత్ ।**
**ప్రాశయే న్నింబపత్రాణి స్నేహస్నానం సమాచరేత్ ॥24॥**

ముందు స్త్రీజనం వెళ్లాలి. వెనుక క్రొత్తగావచ్చినవారి గుంపులు వెళ్లాలి. రాళ్లపై కూర్చున్నవారై ఆచమనం చేయాలి. యవలు, ఆవాలు, దూర్వలు నిండియున్న పాత్రలను విలోకించాలి. పిమ్మట వేపాకులు నములుతూ స్నేహ(తైల)స్నానం చేయాలి.

**గోత్రిభిర్నచ కర్తవ్యం గృహాన్నఞ్చ న భోజయేత్।**
**భుంజీత మృన్మయేపాత్రే ఉత్తానఞ్చ వివర్జయేత్ ॥25॥**

గోత్రికులచే ఆ గృహాన్నం స్వీకరింపబడరాదు, ఇతరులకు భోజనం పెట్టరాదు, మట్టితో తయారైన పాత్రలో భుజించాలి, పైకి విస్తరింపబడియున్న దానిని(ఎత్తయిన పీట)విడిచిపెట్టాలి.

**మృతకస్య గుణా గ్రాహ్యా యమగాథాం సముద్గిరేత్ ।**
**శుభాశుభే చ ధ్యాతవ్యే పూర్వకర్మోపసంచితే ॥26॥**

చనిపోయినవాని గుణాలను చెప్పుకోవాలి, యమగీతలను స్మరించుకోవాలి, పూర్వంలో చేసిన కర్మలద్వారా సంభవించిన శుభాలను, అశుభాలను తలచుకోవాలి.

**లబ్ధేనైవ చ దేహేన భుంక్తే సుకృత దుష్కృతే ।**
**వాయురూపో భ్రమత్యేవ వాయురూర్ధ్వం స గచ్ఛతి ॥27॥**

లభింపబడిన దేహంతోనే సుకృత దుష్కృతాలను అనుభవిస్తాడు. వాయురూపంలో భ్రమిస్తూ ఉంటాడు, ఆ వాయువు ఊర్ధ్వంలోకి కూడ వెడుతుంది.

**దశాహ కర్మక్రియయా కుటీ నిష్పాద్యతే ధ్రువమ్ ।**
**నవకైః షోడశ శ్రాద్ధైః ప్రయాతి హి కుటీం నరః ॥28॥**

పది రోజుల కర్మకలాపంచే నిశ్చయంగా కుటి(వాసం)మృతునికి ఏర్పడుతుంది. తొమ్మిది పిండాలచేత, షోడశ శ్రాద్ధాలచేత నరుడు కుటిని (యమసభను) గూర్చి వెడతాడు.

**తిలై ర్దర్భైశ్చ భూమ్యాం వై కుటీ ధాతుమయీ భవేత్ ।**
**పంచరత్నాని వక్త్రే తు యేన జీవః ప్రరోహతి ॥29॥**

తిలలచేత దర్భలచేత భూమియందున్న శవాన్ని ఉంచిన గుడిసె ధాతుమతి అవుతుంది, నోటిలో అయిదు రత్నాలువేస్తే, దానివల్ల జీవుడు అంకురిస్తాడు.

**యదా పుష్పం ప్రణష్టం హి తదా గర్భం న ధారయేత్ ।**
**ఆదరాచ్చ తతో భూమౌ తిలదర్భాన్ వినిఃక్షిపేత్ ॥30॥**

పుష్పం పూర్తిగా నశిస్తే, గర్భం ధరింపబడదు, అందువల్ల ప్రీతితో భూమియందు తిలలను, దర్భలను వెదజల్లాలి.

**పశుత్వే స్థావరత్వే చ యత్ర క్వాపి స జాయతే ।**
**తత్రైవ జంతురుత్పన్నః శ్రాద్ధం తత్రోపతిష్ఠతి ॥31॥**

పశుత్వంలో కాని, స్థావరత్వంలో కాని ఎక్కడో అక్కడ అతడు పుడతాడు, ఎక్కడ ప్రాణిగా పుడతాడో, అక్కడే శ్రాద్ధం ఫలరూపాన్ని పొందుతుంది.

**ధన్వినా లక్ష్యముద్దిశ్య మూర్తో బాణస్తదాప్నుయాత్ ।**
**యథాశ్రాద్ధం యముద్దిశ్య కృతంతస్యోపతిష్ఠతి ॥32॥**

విలుకాడు లక్ష్యాన్ని ఉద్దేశించి విడిచిన బాణం ఎలా దానిని పొందుతుందో, అలా శ్రాద్ధం ఎవనిని ఉద్దేశించి చేయబడుతుందో అతనిని చేరుతుంది.

**యావన్నోత్పాదితో దేహస్తావచ్ఛ్రాద్ధైర్న ప్రీణనమ్ ।**
**క్షుధా విభ్రమమాపన్నో దశాహేన చ తర్పితః ॥33॥**

ఎంతవరకు దేహం ఉత్పన్నంకాదో, అంతవరకు శ్రాద్ధాలవల్ల ప్రీతి జనింపదు, ఆకలిచే విశేషంగా కదిలి పది రోజుల విధులవల్ల తృప్తి పొందుతాడు.

**పిండదానం న యస్యాభూదాకాశే భ్రమతే తు సః ।**
**దినత్రయం వసంస్తోయే అగ్నావపి దినత్రయమ్ ॥**
**ఆకాశే వసతే త్రీణి దినమేకన్తు వాసకే ॥34॥**

పిండదానం ఎవనికై చేయబడదో,(అంతవరకు)అతడు ఆకాశంలో తిరుగుతూ ఉంటాడు, మూడు రోజులు నీటిలో వసిస్తాడు, అగ్నిలో మూడు రోజులు ఉంటాడు, ఆకాశంలో మూడు రోజులు నివసిస్తాడు, ఒకరోజు వస్త్రంలో(ఇంటిలో) ఉంటాడు.

**దగ్ధే దేహే చ వహ్నౌ చ జలేనైవ తు తర్పితః ।**
**స్నేహస్నానం జలేనైవ పూపకైః కృశరైర్గృహే ॥35॥**

దేహం వహ్నియందు దగ్ధంకాగా, జలంతోనే తృప్తిపొందుతాడు, చల్లని జలంతోనే తైలస్నానం కూడ, గృహంలోనే పూపకాలు, కృశరాలతో (నివేదన) చేయబడాలి.

**ప్రథమేఽహ్ని తృతీయే చ పంచమే సప్తమేఽపి వా ।**
**నవమైకాదశే చైవ శ్రాద్ధం నవకముచ్యతే ॥36॥**

మొదటిరోజున, మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండో రోజులలోను చేసే శ్రాద్ధం నవకమని చెప్పబడుతుంది.

**గృహద్వారే శ్మశానే వా తీర్థే దేవాలయేఽపి వా ।**
**యత్రాద్యో దీయతే పిండస్తత్ర సర్వాన్ సమాపయేత్ ॥37॥**

గృహద్వారంలో కాని, శ్మశానంలో కాని, తీర్థంలో కాని, దేవాలయంలో కాని, ఎక్కడ మొదటి పిండం ఈయబడుతుందో, అక్కడే మిగిలిన వాటినన్నిటిని ఈయాలి.

**ఏకాదశాహే యచ్ఛ్రాద్ధం తత్ సామాన్య ముదాహృతమ్ ।**
**చతుర్ణా మేకవర్ణానాం శుద్ధ్యర్థం స్నానముచ్యతే ॥38॥**

పదకొండో రోజున చేయబడే శ్రాద్ధం సామాన్యశ్రాద్ధంగా (అందరికి సమానమైనదిగా) చెప్పబడింది. నాలుగు వర్ణాలవారికి ముఖ్యంగా శుద్ధికోసమై ఒక్కస్నానమే చెప్పబడింది.

**కృత్వా చైకాదశాహఙ్చ పునః స్నాత్వా శుచిర్భవేత్ ।**
**దద్యాద్విప్రాయ యః శయ్యాం యథోక్తం ప్రేతమోక్షదామ్ ॥39॥**

పదకొండో రోజు శ్రాద్ధకర్మ చేసినతరవాత, మళ్లీ స్నానంచేసిన పిమ్మట శుచిత్వం పొందుతాడు. ఇదివరకు చెప్పబడినట్లుగా ప్రేతవిముక్తినిచ్చే శయ్యాదానాన్ని విప్రునికి ఈయాలి.

**న భవేత్ యదా సగోత్రో పరోఽపి విధి మాచరేత్ ।**
**భార్యా వా పురుషః కశ్చిత్ తుష్టశ్చ కురుతే స్త్రియః ॥40॥**

సగోత్రుడు లేకపోతే, ఇతరుడైనా ఆ విధి నాచరించాలి, భార్య కాని, పురుషుడు కాని, సంతుష్టుడైన ఏ ఒక్కడయినా కాని, స్త్రీలు అయినా కాని చేయాలి.

**ప్రథమేఽహని యః పిండో దీయతే విధిపూర్వకమ్ ।**
**అన్నాద్యేన చ తేనైవ సర్వశ్రాద్ధాని కారయేత్ ॥41॥**

మొదటిరోజున అన్నం మున్నగువానితో శాస్త్రపూర్వకంగా, ఏ పిండం ఈయబడుతుందో, అదేవిధంగా ఆ అన్నాదులతోనే అన్నిరోజులలోనూ శ్రాద్ధం నిర్వహించాలి.

**అమంత్రం కారయేచ్ఛ్రాద్ధం దశాహం నామగోత్రతః ।**
**శ్రాద్ధం కృతన్తు యైర్వస్త్రైస్తాని త్యక్త్వా గృహం విశేత్ ॥42॥**

పదోరోజున మంత్రపూర్వకంగా కాక, నామగోత్రాదులను మాత్రమే ఉచ్చరించి, శ్రాద్ధం చేయాలి, ఏ వస్త్రాలతో శ్రాద్ధం చేయబడిందో, ఆ వస్త్రాలను విడిచివేసి ఇంటిలోనికి ప్రవేశించాలి.

**అసగోత్రః సగోత్రో వా యది స్త్రీ యది వా పుమాన్ ।**
**ప్రథమేఽహని యః కుర్యాత్ స దశాహం సమాపయేత్ ॥43॥**

సగోత్రుడయినా, అసగోత్రుడయినా, స్త్రీఅయినా, పురుషుడు అయినా, మొదటిరోజున ఎవడు కర్మచేస్తాడో, అతడే పది రోజులు చివరివరకూ చేయాలి.

**జీవస్య దశభిః పిండైర్దేహో నిష్పాద్యతే ధ్రువమ్ ।**
**వృద్ధిశ్చ దశభి ర్మాసైర్గర్భస్థస్య యథా భవేత్ ॥44॥**

గర్భస్థశిశువుకు పది నెలలలో వృద్ధి జరిగినట్లు జీవునికి పది పిండాలచేత నిశ్చయంగా దేహం ఉత్పన్నమవుతుంది,

**ఆశౌచం యావదేతస్య తావత్ పిండోదక క్రియా ।**
**చతుర్ణామపి వర్ణానామేష ఏవ విధిః స్మృతః ॥45॥**

ఎంతవరకు పిండోదకక్రియ ఉంటుందో, అంతవరకు ఆశౌచం ఉంటుంది. నాలుగు వర్ణాలవారికి ఈ విధియే చెప్పబడింది.

**యత్ర త్రిరాతమాశౌచం తత్రాదౌ త్రీన్ ప్రదాపయేత్ ।**
**చతురస్తు ద్వితీయేఽహ్ని తృతీయే త్రీంస్తథైవ చ ॥46॥**

ఎక్కడయితే మూడు రాత్రులపాటు ఆశౌచం ఉంటుందో, అక్కడ మొదటి రోజున మూడు పిండాలను ఈయాలి. రెండో రోజున నాలుగు పిండాలను, మూడో రోజున మూడు పిండాలను ఈయాలి.

**పృథక్ శరావయోర్దద్యాదేకాహం క్షీరమమ్బు చ । (యై)**
**ఏకోద్దిష్టన్తు వై శ్రాద్ధం చతుర్థేఽహని కారయేత్ ॥47॥**

వేరు వేరుగా మూకుళ్లను ఉంచాలి. ఒకేరోజున పాలు నీళ్లు పోయాలి, నాలుగో రోజున ఏకోద్దిష్టశ్రాద్ధం నిర్వహించాలి.

**ప్రథమేఽహని యః పిండస్తేన మూర్ధా ప్రజాయతే ।**
**చక్షుః శ్రోత్రఞ్చ నాసా చ ద్వితీయేఽహ్ని ప్రజాయతే ॥48॥**

మొదటి రోజున ఇచ్చే పిండంవల్ల శిరస్సు ఏర్పడుతుంది, రెండో రోజున ఇచ్చే పిండంవల్ల కన్నులు, చెవులు, ముక్కు ఏర్పడతాయి.

**గండౌ వక్త్రం తథా గ్రీవా తృతీయేఽహని జాయతే ।**
**హృదయం కుక్షిరుదరం చతుర్థే తద్వదేవ హి ॥49॥**

మూడో రోజున కపోలాలు, ముఖం, అలాగే కంఠం ఏర్పడతాయి, అలాగే నాలుగో రోజున హృదయం, కుక్షి, ఉదరం, సంభవిస్తాయి.

**కటి పృష్ఠం గుదశ్చాపి పంచమేఽహని జాయతే ।**
**షష్ఠే ఊరూ చ విజ్ఞేయే సప్తమే గుల్ఫసంభవః ॥50॥**

కటి, పృష్ఠం, గుదం ఐదో రోజున పుడతాయి, ఆరో రోజున ఊరువులు ఏర్పడతాయి, ఏడో రోజున గుల్ఫం సముత్పన్నమవుతుంది.

**అష్టమే దివసే ప్రాప్తే జంఘే చ భవతోఽండజ ।**
**పాదౌ చ నవమే జ్ఞేయౌ దశమే బలవత్ క్షుధా ॥51॥**

గరుడా! ఎనిమిదో రోజు ప్రాప్తించగా జంఘలు ఏర్పడతాయి, తొమ్మిదో రోజున పాదాలు వస్తాయి, పదో మాసంలో బలవంతమైన ఆకలివేస్తుంది.

**ఏకాదశాహే యః పిండస్తం దద్యాదామిషేణ తు ।**
**సిద్ధాన్నం తస్య దాతవ్యం కృశరాః పూపకాః పయః ॥**
**ప్రక్షాళ్య విప్రచరణావర్ఘ్యం ధూపఞ్చ దీపకమ్ ॥52॥**

పదకొండో రోజున ఆమిషంతో కలిపిన పిండాన్ని ఆ ప్రేతకు ఈయాలి, విప్రుని పాదాలను కడిగి అర్ఘ్యం, ధూపం, దీపం సమర్పించి, అతనికి సిద్ధాన్నం ఈయాలి. అలాగే కృశరాలు (నువ్వులు బియ్యము కలిపి వండిన పక్వాన్నాలు) పూపకాలు (పిండివంటలు) పాలు కూడ ఈయాలి.

**ద్వాదశ ప్రతి మాస్యాని శ్రాద్ధాన్యేకాదశే తథా ।**
**త్రిపక్షఞ్చాపి షణ్మాసే ద్వే శ్రాద్ధాని చ షోడశ ॥53॥**

ప్రతి మాసానికి ఒక శ్రాద్ధంచొప్పున పండ్రెండు శ్రాద్ధాలను, అలాగే ఏకాదశ విధులను, త్రిపక్షాన్ని, ఆరోమాసంలో ఊనషాణ్మాసికం, షాణ్మాసికం అనే రెండు శ్రాద్ధాలను మొత్తం పదునాలు శ్రాద్ధాలు నిర్వహించాలి.

**ప్రతిమాసం ప్రదాతవ్యం మృతాహే యా తిథిర్భవేత్ ।**
**సమాసః ప్రథమో జ్ఞేయ ఇతి వేదవిదో విదుః ॥54॥**

చనిపోయినరోజున ఏ తిథిఉంటుందో, ప్రతి మాసం అదే తిథినాడు శ్రాద్ధం ఈయాలి, అదే మొదటిమాసంగా తెలియాలని వేదవిదులు గ్రహిస్తారు.

**శవహస్తే చ యచ్ఛ్రాద్ధం మృతిస్థానే ద్విజాసనే ।**
**తదేవ ప్రథమం శ్రాద్ధం తత్స్యాదేకాదశేఽహని ॥55॥**

**సా తిథిర్మాసికే శ్రాద్ధే మృతో యస్మిన్ దినే నరః ।**
**రిక్తయోశ్చ త్రిపక్షే చ సా తిథి ర్నాద్రియేత వై ॥56॥**

మృతి స్థానంలోను, ద్విజాసనమందు, శవహస్తమందును ఎప్పుడు శ్రాద్ధం చేయబడుతుందో, అదే ప్రథమ శ్రాద్ధమని మరో మతం. పదకొండో రోజున ఏదయితే ఉందో, ఆ తిథినాడే మాసిక శ్రాద్ధమని మరో మతం, నరుడు చనిపోయిన ఆ తిథి రిక్తతిథి అయితే, త్రిపక్షమునందు కూడ ఆ తిథి ఆదరింపబడరాదు.

**పౌర్ణమాస్యాం మృతో యోఽసౌ చతుర్థీ తస్యచోనకా ।**
**చతుర్థ్యాస్తు మృతో యస్తు నవమీ తస్య చోనకా ॥57॥**

**నవమ్యాఇ్చ మృతో యశ్చ రిక్తా తస్య చతుర్దశీ ।**
**ఏతా రిక్తాశ్చ విజ్ఞేయా అంత్యేష్టౌ కుశలేన చ ॥58॥**

పౌర్ణమాసియందు మరణించిన, అతనికి చతుర్థి ఊనకతిథి అవుతుంది, చతుర్థినాడు మరణిస్తే, అతనికి నవమి ఊనకతిథి అవుతుంది, నవమినాడు మరణిస్తే అతనికి చతుర్దశి రిక్తతిథి అవుతుంది, అంత్యేష్టియందు కౌశలంగలవారిచే ఈ తిథులు రిక్తతిథులుగా పేర్కొనబడినాయి.

**ఏకాదశాహే యచ్ఛ్రాద్ధం నవకం తత్ ప్రకీర్తితమ్ ।**
**చతుష్పథే త్యజేదన్నం పునః స్నానం సమాచరేత్ ॥59॥**

పదకొండోరోజున పెట్టే శ్రాద్ధం నవకమని కీర్తింపబడుతోంది, చతుష్పథంలో అన్నం ఉంచాలి, తిరిగి స్నానం ఆచరించాలి.

**ఏకాదశాహాదారభ్య ఘటస్యాన్నం జలాన్వితమ్ ।**
**దినే దినే చ దాతవ్యమబ్దం యావద్ద్విజోత్తమే ॥60॥**

పదకొండో రోజునుండి ప్రారంభించి సంవత్సర పర్యంతం ప్రతిదినం నీటితోకూడిన ఘటాన్నాన్ని ద్విజోత్తమునికి దానం ఈయాలి.

**మానుషస్య శరీరే తు విద్యతే హ్యస్థి సంచయః ।**
**తత్సంఖ్యాః సర్వదేహేషు షష్ట్యధిక శతత్రయమ్ ॥61॥**

మానవుని శరీరంలో ఎముకల గుంపు ఉంటుంది. దానిసంఖ్య సమస్త దేహాలలోను మూడువందల అరవై.

**ఉదకుంభేన పుష్టాని తాన్యస్థీని భవంతి హి ।**
**ఏతస్మాద్దీయతే కుంభః ప్రీతిః ప్రేతస్య జాయతే ॥62॥**

ఉదకుంభదానంచే ఆ ఎముకలు పరిపుష్టి పొందుతాయి, అందువల్ల ఈ ఉదకుంభాన్ని ఈయడంవల్ల ప్రేతకు ప్రీతి సంభవిస్తుంది.

**యస్మిన్ దినే మృతో జంతు రటవ్యాం విషమేఽపి వా ।**
**యదా తదా భవేద్దాహః సూతకం మృతవాసరాత్ ॥63॥**

అడవియందుకాని, విషమప్రదేశమందుకాని, ఏ రోజున జంతువు(ప్రాణి)మృతిచెందుతాడో, అతనికి ఎప్పుడు దహనక్రియ జరుగుతుందో, అప్పటినుండే మృతవాసరంగా సూతకం పాటించాలి.

**తిలపాత్రం తథాన్నాద్యం గంధధూపాదికఞ్చ యత్ ।**
**ఏకాదశాహే దాతవ్యం తేన శుద్ధో ద్విజో భవేత్ ॥64॥**

తిలపాత్ర, అలాగే అన్నాదికం, గంధధూపాదికం, పదకొండో రోజున ఈయాలి, అందువల్ల ద్విజుడు శుద్ధుడవుతాడు.

**క్షత్రియో ద్వాదశాహే తు వైశ్యః పంచదశే తథా ।**
**శుద్ధిః శూద్రస్య మాసేన మృతకే జాతసూతకే ॥65॥**

క్షత్రియుడు పండ్రెండోరోజున, వైశ్యుడు పదునైదోరోజున, శూద్రుడు ఒకనెల తరువాత చనిపోయినవానికి సంబంధించిన సూతకం నుండి శుద్ధుడవుతాడు.

**మాసత్రయే త్రిరాత్రం స్యాత్ షణ్మాసేన తు పక్షిణీ ।**
**అహః సంవత్సరాదర్వాక్ పూర్ణే దత్త్వోదకం శుచిః ॥**
**అనేనైవానుసారేణ శుద్ధిఃస్యాత్ సార్వవర్ణికీ ॥66॥**

మూడునెలలు లోపున మూడు రాత్రులు, ఆరునెలలులోపున, రెండుపగళ్లతోకూడిన రాత్రి(ఒకటిన్నర రోజులు) సంవత్సరంలోపున ఒకరోజు, సంవత్సరం నిండితే ఉదకప్రదానంచే శుద్ధి కలుగుతుంది. ఈ పద్ధతి ననుసరించియే సర్వవర్ణాలవారికి శుద్ధి కలుగుతుంది,

**ఏకాదశాహ ప్రభృతి పురతః ప్రతివత్సరమ్ ।**
**విశ్వేదేవాంస్తు సంపూజ్య పిండమేకఞ్చ నిర్వపేత్ ॥67॥**

పదకొండోరోజు మొదలుకొని ప్రతి సంవత్సరం ముందుగా, విశ్వదేవతలను పూజించి, ఒక పిండాన్ని ఈయాలి.

**యథా తారాగణాః సర్వే చ్ఛాద్యంతే రవిరశ్మిభిః ।**
**ఏవం ప్రచ్ఛాద్యతే సర్వం న ప్రేతో భవతి క్వచిత్ ॥68॥**

దానిచే ఏవిధంగా సూర్యకాంతులచే నక్షత్రసమూహాలన్నీ కప్పబడినట్లు, అంతా కప్పబడిపోతుంది. అతడు ఎప్పుడూ ప్రేత కాబోడు.

**శయ్యాదానం ప్రశంసంతి సర్వదైవ ద్విజోత్తమాః ।**
**అనిత్యం జీవనం యస్మాత్ పశ్చాత్ కో ను ప్రదాస్యతి ॥69॥**

ద్విజోత్తములు ఎల్లప్పుడూ శయ్యాదానాన్ని ప్రశంసిస్తారు, జీవనం(జీవితం) శాశ్వతమైనదికాదు, పిమ్మట దానిని ఎవడు ఈయగలడు?

**తావద్బంధుః పితా తావద్యావజ్జీవతి మానవః ।**
**మృతే మృత ఇతి జ్ఞాత్వా క్షణాత్ స్నేహో నివర్తతే ॥70॥**

మానవుడు ఎంతకాలం జీవించి ఉంటాడో, అంతకాలమే తండ్రి, అంతకాలమే బంధువు. చనిపోయిన తరువాత వాడు శవమయ్యాడనగానే, క్షణకాలంలోనే ప్రేమ మాయమైపోతుంది.

**ఆత్మైవ హ్యాత్మనో బంధురేవం జ్ఞాత్వా ముహుర్ముహుః ।**
**జీవన్నపీతి సంచింత్య స్వీయం హితమనుస్మరేత్ ॥71॥**

తనకు తానే బంధువని మాటి మాటికి తెలుసుకొని, జీవించియుండగానే చక్కగా గ్రహించి, తనకు జరిగే మేలును పదే పదే స్మరించుకోవాలి.

**మృతానాం కః సుతో దద్యాద్ద్విజే శయ్యాం సతూలికామ్ ।**
**ఏవం జానన్నిదం సర్వం స్వహస్తేనైవ దాపయేత్ ॥72॥**

చనిపోయిన వారియొక్క కుమారుడు పరుపుతో కూడుకొన్న శయ్యను ద్విజునకు దానం ఈయాలి, దీనినంతను ఈ విధంగా తెలుసుకొని, తనచేతులతోనే దానమిచ్చుకోవాలి.

**తస్మాచ్ఛయ్యాం సమాసాద్య సారదారుమయీం దృఢామ్ ।**
**దంతాదిరుచిరాం రమ్యాం హేమపట్టైరలంకృతామ్ ॥73॥**

**తస్యాం సంస్థాప్య హేమఞ్చ హరిం లక్ష్మ్యా సమన్వితమ్ ।**
**ఘృతపూర్ణఞ్చ కలశం తత్రైవ పరికల్పయేత్ ॥**
**విజ్ఞేయో గరుడ! ప్రీత్యై స నిద్రాకలశో బుధైః ॥74॥**

అందువల్ల గట్టిదై, మంచిదైన, కర్రతో ఒక రమ్యమైన మంచాన్ని తయారుచేసి(చేయించి) ఏనుగుదంతాలతో సుందరంగా, బంగారు గొలుసులతో అలంకరించి, అందు బంగారంతో చేసిన శ్రీలక్ష్మీసమన్వితుడైన శ్రీహరిని సంస్థాపించి, నేతితో నింపిన కలశాన్ని అక్కడనే పరికల్పించాలి, ప్రీతికొరకై ఏర్పాటుచేయబడిన నిద్రాకలశం అది అని బుధులు తెలియజేస్తారు.

**తాంబూల కుంకుమక్షోద కర్పూరాగురుచందనమ్ ।**
**దీపికోపానహచ్ఛత్ర చామరాసన భాజనమ్ ॥75॥**

తాంబూలం, కుంకుమ, చూర్ణం, కర్పూరం, అగురు, చందనం, దీపం, చెప్పులు, గొడుగు, చామరం, ఆసనం, భాజనం(పాత్రలు)

**పార్శ్వేషు స్థాపయేచ్ఛక్త్యా సప్తధాన్యాని చైవ హి ।**
**శయనస్థస్య భవతి యచ్చాన్యదుపకారకమ్ ॥76॥**

పార్శ్వభాగాలలో శక్తిననుసరించి సప్త ధాన్యాలను కూడ ఉంచాలి, పరుండేవానికి ఉపకరించేవన్నీ ఉంచాలి.

**భృంగారకరకాదర్శం పంచవర్ణం వితానకమ్ ।**
**శయ్యామేవం విధాం కృత్వా బ్రాహ్మణాయ నివేదయేత్ ॥77॥**

బంగారపు చెంబును, అద్దం, అయిదు రంగులు కల చాందిని, ఇటువంటివాని నన్నింటిని శయ్యకు జతపరచి బ్రాహ్మణునికి దానం ఈయాలి.

**సపత్నీకాయ సంపూజ్య స్వర్లోక సుఖదాయినీమ్ ।**
**వస్త్రైః సుశోభనైః పూజ్య చైలకం పరిధాపయేత్ ॥78॥**

ముందుగా పత్నితో కూడుకొన్న బ్రాహ్మణుని పూజించి, స్వర్గలోకంలో సుఖంచేకూర్చే ఆ శయ్యను దానం చేయాలి, మంచి మంగళదాయకాలైన వస్త్రాలతో అర్చించి, వస్త్రాన్ని దానిపై కప్పి ఈయాలి.

**కర్ణ కంఠాంగులీ బాహు భూషణైశ్చిత్ర భూషణైః ।**
**గృహోపకరణై ర్యుక్తం గృహం ధేన్వా సమన్వితమ్ ॥79॥**

కర్ణాభరణాలు, కంఠాభరణాలు, అంగుళీయకాలు, బాహువుల అలంకారాలు, విచిత్రాభరణాలు, గృహోపకరణాలు మున్నగువాటితో కూడుకొన్న గృహాన్ని ధేనువుతో కలిపి దానంచేయాలి.

**తతోఽర్ఘః సంప్రదాతవ్యః పంచరత్న ఫలాక్షతైః ॥80॥**

పంచ రత్నాలతోను, ఫలాలతోను, అక్షతలతోను పూజించి పిమ్మట అర్ఘం సమర్పించాలి.

**యథా న కృష్ణశయనం శూన్యం సాగరకన్యయా ।**
**శయ్యామమాప్యశూన్యాస్తు తథా జన్మనిజన్మని ॥81॥**

“ఏవిధంగా లక్ష్మీదేవితో కలసియే ఉండి విష్ణువుశయనం శూన్యం కాకుండా ఉంటుందో, అలాగే ప్రతి జన్మయందు నా శయ్యలుకూడ శూన్యాలు కాకుండా ఉండుగాక!” (అని ప్రార్థించాలి)

**దత్త్వైవం తల్పమమలం క్షమాప్య చ విసర్జయేత్ ।**
**తథా చైకాదశాహే తు విధిరేష ప్రకీర్తితః ॥82॥**

ఈ విధంగా స్వచ్ఛమైన తల్పాన్ని దానంచేసి, క్షమాపణ వేడుకొని, బ్రాహ్మణదంపతులను సాగనంపాలి, ఏకాదశినాడు చేసే సంస్కారాలలో శయ్యాదానవిధి ముఖ్యమైనదిగా కీర్తింపబడింది.

**దదాతి యో హి ధర్మార్థే బాంధవో బాంధవే మృతే ।**
**విశేషమత్ర పక్షే తు కథ్యమానం మయా శృణు ॥83॥**

ఎవడైతే బంధువు మరణించగా బాంధవుడు ధర్మంకోసమై శ్రాద్ధవిధి చేస్తాడో, అతని విషయంలో ఏ విశేషం ఉంటుందో, నేను చెప్పబోతున్న ఆ విషయాన్ని విను.

**ఉపయుక్తఞ్చ తస్యాసీత్ యత్ కించిత్ స్వగృహే పురా ।**
**తస్యయద్గాత్రసంలగ్నం వస్త్రం భాజనవాహనమ్ ॥**
**యదభీష్టఞ్చ తస్యాసీత్ తత్ సర్వం పరికల్పయేత్ ॥84॥**

పూర్వం అతడు ఏ కొంచెమైనా ఉపయోగించి తన శరీరసంస్పర్శను కల్పించిన తనఇంటిలో వస్త్రం, భాజనం, వాహనం, అతనికి మిక్కిలి ఇష్టమైనది మరేదైనా ఉంటే దానిని ముందు దానం చేయాలి.

**స్థాపయేత్ పురుషం హైమం శయ్యోపరి శుభం బుధః ।**
**పూజయిత్వా ప్రదాతవ్యా మృతశయ్యా యథోదితా ॥85॥**

వివేకవంతుడు ఉపయోగించిన శయ్యయందు పుణ్యపురుషుడైన విష్ణుదేవుని స్వర్ణప్రతిమను ఉంచి, పూజించి, మృతుడు అన్నింటితోను కలిపి దానం చేయాలి, ఇది మృతశయ్యగా చెప్పబడింది.

**పురందరగృహే సర్వం సూర్యపుత్రాలయే తథా ।**
**ఉపతిష్ఠేత్ సుఖం జంతోః శయ్యాదానప్రభావతః ॥86॥**

**పీడయంతి న తం యామ్యాః పురుషా భీషణాననాః ।**
**న ఘర్మేణ న శీతేన బాధ్యతే స నరః క్వచిత్ ॥87॥**

ప్రాణికి శయ్యాదానప్రభావంవల్ల ఇంద్రలోకమందు, యమలోకమందు కూడ సర్వసుఖం లభిస్తుంది. భయంకర ముఖాలుకల్గిన యమపురుషులు అతనిని పీడించరు, ఆ నరుడు ఎన్నడూ వేడివల్ల కాని, చల్లదనంవల్ల కాని బాధింపబడడు.

**శయ్యాదానప్రభావేణ ప్రేతో ముచ్యేత బంధనాత్ ।**
**అపి పాప సమాయుక్తః స్వర్గలోకం స గచ్ఛతి ॥88॥**

శయ్యాదానప్రభావంవల్ల ప్రేత బంధనంనుండి విముక్తుడవుతాడు, అతడెన్నో పాపాలతో కూడినవాడైనా స్వర్గలోకానికి వెడతాడు.

**విమానవరమారూఢః సేవ్యమానోఽప్సరో గణైః ।**
**ఆభూతసంప్లవం యావత్ తిష్ఠేత్ పాతకవర్జితః ॥89॥**

శ్రేష్ఠమైన విమానాన్ని అధిరోహించి, అప్సరోగణాలచే సేవింపబడుతూ, భూతప్రలయ పర్యంతం పాపరహితుడై ఉంటాడు.

**నవకం షోడశశ్రాద్ధం శయ్యా సాంవత్సరం తథా ।**
**భర్తుర్యా కురుతే నారీ తస్యాః శ్రేయో హ్యనంతకమ్ ॥90॥**

నవకశ్రాద్ధం, షోడశశ్రాద్ధం, శయ్యాదానం, సాంవత్సరికవిధి భర్తను ఉద్దేశించి చేసిన స్త్రీకి అనంతమైన శ్రేయస్సు కలుగుతుంది.

**ఉపకారాయ సా భర్తు ర్జీవంతీ న మృతా తథా ।**
**ఉద్ధరేజ్జీవమానా సా సతీ సత్యవతీ ప్రియమ్ ॥91॥**

ఆమె భర్తకు ఉపకారం చేయుటకోసమై భర్తతో కలసి, చితిని ఆరోహించి, మరణించకుండా, బ్రతికి ఉన్నప్పటికి, ఆ సతి సత్యవతియై జీవిస్తూ ప్రియుని (ఉద్ధరిస్తుంది)

**స్త్రియా దధ్యన్న శయనే హేమ కుంకుమమంజనమ్ ।**
**వస్త్రభూషా తథా శయ్యా సర్వమేతద్ధి దాపయేత్ ॥92॥**

మరణించిన స్త్రీనుద్దేశించి దధ్యన్నం, శయనం, హేమం, కుంకుమం, అంజనం, వస్త్రం, అలంకారం, శయ్య, ఇటువంటివన్నీ దానంచేయాలి.

**ఉపకారకరం స్త్రీణాం యద్భవేదిహ కించన ।**
**భూషణం గాత్రలగ్నఇ్చ వస్తు భోగ్యాదికఇ్చ యత్ ॥93॥**

**తత్సర్వం మేలయిత్వా తు స్వే స్వే స్థానే నియోజయేత్ ।**
**పూజయేల్లోకపాలాంశ్చ గ్రహాన్ దేవీం వినాయకమ్ ॥94॥**

స్త్రీలకు ఉపకారం కలుగజేసే ఏ ఏ వస్తువులిక్కడ ఉన్నాయో, (ఏ కొంచెమైన ఉపయోగించిన) భూషణంకాని, ఆమెశరీర స్పర్శనుపొందిన ఏ వస్తువయినా, ఏ భోగ్యాదికాలు అయినా, వాటినన్నింటిని ఒకచోటకు చేర్చి ఆయాస్థానాలలో పరికల్పనం చేయాలి. లోకపాలురను, గ్రహాలను, దేవిని, వినాయకుని పూజించాలి.

**తతః శుక్లాంబరధరో గృహీత కుసుమాంజలిః ।**
**ఇమ ముచ్చారయే న్మంత్రం విప్రస్య పురతో బుధః ॥95॥**

పిమ్మట తెల్లనిబట్టలు ధరించి, దోయిలిలో పూలు పట్టుకొని వివేకవంతుడు విప్రుని ఎదురుగా ఈ మంత్రాన్ని ఉచ్చరించాలి.

**ప్రేతస్య ప్రతిమాహ్యేషా సర్వోపకరణై ర్యుతా ।**
**సర్వరత్న సమాయుక్తా తవ విప్ర నివేదితా ॥96॥**

**ఆత్మా శంభుః శివా గౌరీ శక్రః సురగణైః సహ ।**
**తస్మాచ్ఛయ్యా ప్రదానేన సైష ఆత్మా ప్రసీదతు ॥97॥**

**ఆచార్యాయ ప్రదాతవ్యా బ్రాహ్మణాయ కుటుంబినే ।**
**గృహీతే బ్రాహ్మణస్తత్ర కోఽదాదితి చ కీర్తయేత్ ॥98॥**

సమస్తరత్నాలతో కూడుకొని, నానావిధోపకరణాలతో కూడుకొన్న, ప్రేతయొక్క ఈ బంగారు ప్రతిమను విప్రా! నీకు నివేదిస్తున్నాను, "ఆత్మస్వరూపుడగు శివుడు, మంగళస్వరూప అయిన గౌరి, సురగణాలతో కూడి ఇంద్రుడు, ఈ ఆత్మ ఈ శయ్యాదానంవల్ల ప్రసన్నులగుదురు గాక!" అని అంటూ, సపత్నీకుడయిన, బ్రాహ్మణాచార్యునికే దానమీయాలి. బ్రాహ్మణుడు ఆ దానాన్ని గ్రహిస్తూ "కఃఅదాత్" అనే మంత్రాన్ని పఠించాలి.

**తతఃప్రదక్షిణీకృత్య ప్రణిపత్య విసర్జయేత్ ।**
**విధినానేన వై పక్షిన్ దానమేకస్య దాపయేత్ ॥99॥**

పిమ్మట నమస్కరించి, ప్రదక్షిణమాచరించి, వీడ్కోలుపలకాలి, గరుడా! ఈ విధంగా శాస్త్రోక్త విధానంచే ఒక్కనికే దానమీయాలి.

**బహుభ్యో న ప్రదేయాని గౌర్గృహం శయనం స్త్రియః ।**
**విభక్త దక్షిణాహ్యేతే దాతారం పాతయంతి హి ॥100॥**

స్త్రీలు, ఆవు, ఇల్లు, శయనం ఇవన్నీ ఒక్కరికే దానంచేయాలి కాని, ఎక్కువమందికి ఈయరాదు. ఈ దక్షిణలను విభజిస్తే దాత కూడ పతనమవుతాడు.

**ఏవం యో వితరేత్ తార్క్ష్య శృణు తస్య చ యత్ ఫలమ్ ।**
**సాగ్రం వర్షశతం దివ్యం స్వర్గలోకే మహీయతే ॥101॥**

గరుడా! ఈ విధంగా దానంచేసినవానికి వచ్చేఫలం ఏమిటో విను. అతడు ముందు శత దివ్యసంవత్సరాలు స్వర్గలోకంలో సుఖం పొందుతాడు.

**యత్పుణ్యస్తు వ్యతీపాతే కార్తిక్యామయనద్వయే ।**
**ద్వారకాయాన్తు యత్పుణ్యం చంద్రసూర్యగ్రహే తథా ॥102॥**

**ప్రయాగే నైమిషే యచ్చ కురుక్షేత్రే తథార్బుదే ।**
**గంగాయాం యమునాయాఞ్చ సింధుసాగరసంగమే ॥103॥**

వ్యతీపాతయోగమందు, కార్తికపూర్ణిమయందు, అయనద్వయమందు దానం చేస్తే ఏ పుణ్యమో, అలాగే ద్వారకయందు, చంద్ర సూర్య గ్రహణములందు ఏ పుణ్యము లభిస్తుందో, ప్రయాగయందు, నైమిషమందు, అలాగే కురుక్షేత్రమందు, అర్బుదమందు ఏది లభిస్తుందో, గంగ యందు, యమునయందు, సింధుసాగర సంగమమందు,

**తేషు యద్దీయతే దానం తస్మాదప్యధికం త్విదమ్ ।**
**ఏతచ్ఛయ్యా ప్రదానస్య నాప్నోతి షోడశీం కలామ్ ॥104॥**

మున్నగు వాటియందు చేసిన దానం ఫలం కన్న ఇది చాలా ఎక్కువైనది, ఈ శయ్యాప్రదానానికి పదహారో (అంశం)వంతుకు కూడ అది సాటికాదు.

**యత్రాసౌ జాయతే ప్రాణీ భుంక్తే తత్రైవ తత్ఫలమ్ ।**
**కర్మక్షయే క్షితౌ యాతి మానుషః శుభదర్శనః ॥105॥**

**మహాధనీ చ ధర్మజ్ఞః సర్వశాస్త్రవిశారదః ।**
**పునః స యాతి వైకుంఠం మృతోఽసౌ నరపుంగవః ॥106॥**

ఈ ప్రాణి ఎక్కడయితే పుడతాడో, అతడు అక్కడే ఆ ఫలితాన్ని పొందుతాడు. భూమియందు కర్మక్షయంకాగా, అతడు వెళ్లిపోతాడు. ఉత్తమ మానవుడై, శుభదర్శనుడై, మహాధనవంతుడై, ధర్మజ్ఞుడై, సర్వశాస్త్రవిశారదుడై, ఆ నరపుంగవుడు చనిపోయిన వెంటనే అతడు మళ్లీ వైకుంఠానికి వెడతాడు.

**దివ్యం విమానమారుహ్య అప్సరోభిః సమావృతః ।**
**అహోఽ_సౌ హవ్యకవ్యేషు పితృభిఃసహ మోదతే ॥107॥**

దివ్యవిమానాన్ని ఆరోహించి, అప్సరోగణాలతో కూడుకొని, అతడు తిరిగిరాకుండా(పుట్టకుండా)హవ్య కవ్య స్వీకరణయందు పితృదేవతలతో కలసి సుఖం పొందుతాడు.

**అష్టకాసు కృతం శ్రాద్ధమమావాస్యా దినే తథా ।**
**మఘాసు పితృపర్వాణి యాని యాని చ తేషు చ ॥108॥**

అష్టక తిథులందు, అమావాస్యరోజున అలాగే మఘానక్షత్రాలయందు, ఆయా పితృపర్వములందు శ్రాద్ధం నిర్వహించాలి.

**శృణు తార్క్ష్య యథాన్యాయం ప్రేతత్వే పితరో యది ।**
**నోపతిష్ఠంతి శ్రాద్ధాని సపిండీకరణం వినా ॥109॥**

**సపిండీకరణం కార్యం పూర్ణే వర్షే న సంశయః ।**
**ఆద్యన్తు శవశుద్ధ్యర్థం కృత్వా చైవాత్ర షోడశీమ్ ॥110॥**

గరుడా! విను. పితరులు ప్రేతత్వాన్ని పొందియుంటే, శాస్త్రోక్తన్యాయంగా సపిండీకరణవిధి జరగకపోతే శ్రాద్ధాలు పెట్టినా, అవి అతనికి సంక్రమించవు. సంశయంలేదు. సంవత్సరం పూర్తిఅవుతూ ఉండగా, సపిండీకరణవిధి జరగాలి, మొదట శవశుద్ధికోసమై ఇక్కడ షోడశీ శ్రాద్ధవిధి చేయాలి.

**పితృపంక్తి విశుద్ధ్యర్థం శతార్ధేన తు యోజయేత్ ।**
**వృద్ధిం ప్రాప్యాగ్రతః కుర్యాచ్ఛూద్రస్య స్వచ్ఛయైవ హి ॥111॥**

పితృపంక్తిలో చేరుటకై విశుద్ధికోసమై శతార్ధంతో (ఏబైయవ శ్రాద్ధంతో) తప్పక చేయాలి. ఒకదానిపై ఒకటి వృద్ధి శ్రాద్ధం ముందుగానే చేయాలి. (వృద్ధి శ్రాద్ధం చేయాలి) శూద్రునకు స్వచ్ఛందంగా చేయవచ్చు, ఇది ఒక పక్షం.

**సాంప్రతం సాగ్నికే కార్యం ద్వాదశాహే సపిండనమ్ ।**
**న చాసౌ కురుతే యావత్ ప్రేత ఏవ స వహ్నిమాన్ ॥**
**ద్వాదశాహే తతః కార్యం సాగ్నికేన సపిండనమ్ ॥112॥**

ఇప్పుడయితే అగ్నిహోత్రి విషయంలో పంద్రెండవ రోజునే సపిండీకరణం చేయబడుతోంది. అది అతనికి చేయబడకపోతే ఆ అగ్నిహోత్రి ప్రేతయే, అందువల్ల అగ్నిహోత్రంతో సపిండీకరణం పంద్రెండవ రోజునే చేయాలి.

**అస్థిపోక్షే గయాశ్రాద్ధం శ్రాద్ధం చాపర పక్షికమ్ ॥**
**అబ్దమధ్యే న కుర్వీత సపిండీకరణం వినా ॥113॥**

అస్థిసంచయనం అయిన తరువాత గయాశ్రాద్ధం, అపరపక్షికం చేయబడాలి. సపిండీకరణం చేయకపోతే సంవత్సరం మధ్యలో ఇవి చేయరాదు.

**సపత్న్యో యది బహ్వ్యః స్యు రేకా పుత్రవతీ భవేత్ ।**
**సర్వాస్తాః పుత్రవత్యః స్యు స్తేనైకేనాత్మజేన హి ॥114॥**

ఎక్కువమంది సపత్నులు ఉంటే, వారిలో ఒకామెయే(సంతాన)పుత్రవతి అయితే, ఆ ఒక్క కుమారునివల్లనే వారందరూ పుత్రవతులు అవుతారు.

**నాసపిండోగ్నిమాన్ పుత్రః పితృయజ్ఞం సమాచరేత్ ।**
**సమాచారాద్భవేత్ పాపీ పితృహా చాపి జాయతే ॥115॥**

అగ్నిహోత్రియైన పుత్రుడు సపిండీకరణపూర్వక పితృయజ్ఞం చేయకపోతే, అతడెంత సదాచారుడైనా పాపాత్ముడు, పితృహంతకుడు అవుతాడు.

**మృతే భర్తరి యా నారీ ప్రాణాంశ్చైవ పరిత్యజేత్ ।**
**భర్త్రైవ సమం తస్యాః ప్రకుర్వీత సపిండనమ్ ॥116॥**

భర్త మరణించగా, భర్తతో పాటు ప్రాణాలు పరిత్యజించిన స్త్రీకి భర్తతో సమానంగా సపిండీకరణం చేయాలి.

**ఆస్థానికాపి యా వ్యూఢా వైశ్యా వా క్షత్రియాపి వా ।**
**యాః పత్న్యో వై పితుః కశ్చిత్ కుర్యాత్ పుత్రః సపిండనమ్ ॥117॥**

భార్యాస్థానంలోలేని ఇతరులు, వైశ్యస్త్రీ అయినా, క్షత్రియస్త్రీ అయినా, తండ్రికి పత్నులైఉంటే వారి పుత్రులలో ఒకడు సపిండనం చేయాలి.

**విప్రేణైవ యదా శూద్రా పరిణీతా ప్రమాదతః ।**
**ఏకోద్దిష్టస్తు తచ్ఛ్రాద్ధం సా తు తే నైవ యుజ్యతే ॥118॥**

విప్రుడు ప్రమాదవశాత్తు (గత్యంతరంలేక) ఎప్పుడయినా శూద్ర స్త్రీని పెండ్లాడితే, ఏకోద్దిష్ట శ్రాద్ధం ఆమెకు ఆ విప్రునితోనే తగియున్నది.

**అన్యే తు దశ వై పుత్రా జాతా వర్ణచతుష్టయే ।**
**తే తాసు తాసు యోక్తవ్యాః సపిండీకరణే సదా ॥119॥**

నాలుగు వర్ణాలవారియందు పదిమంది పుత్రులు ఇతరులు కలిగినా, వారు వారివారియందు సపిండీకరణవిధి నాచరించాలి.

**అన్వష్టకాసు యచ్ఛ్రాద్ధం యచ్ఛ్రాద్ధం వృద్ధిహేతుకమ్ ।**
**పితుఃపృథక్ ప్రదాతవ్యం స్త్రియాః పిండం సపిండనే ॥120॥**

అష్టకాలయందు శ్రాద్ధం వృద్ధిహేతుకమయిన శ్రాద్ధం. సపిండీకరణం తండ్రికి వేరేగా, తల్లికి వేరేగా చేయాలి.

**పితామహ్యా సమం మాతుః పితుఃసహ పితామహైః ।**
**సపిండీకరణం కార్యమితి తార్క్ష్య మతం మమ ॥121॥**

తల్లికి నాయనమ్మతోను, తండ్రికి తాతతోను గరుడా! సపిండీకరణం చేయదగియున్నదని నా అభిప్రాయం.

**అపుత్రాయాం మృతాయాం తు పతిః కుర్యాత్ సపిండనమ్ । (పితా)**
**(శ్వశ్రాది) మాత్రాదితిసృభిః సార్ధమేవం ధర్మేణ యోజయేత్ ॥122॥**

పుత్రులులేకుండా స్త్రీ చనిపోయినట్లయితే, భర్తయే సపిండీకరణం చేయాలి. తల్లి మున్నగు ముగ్గురితోను (అత్తగారు)కలిపి ధర్మంగా ఈ విధంగానే సపిండవిధి కావించాలి.

**పుత్రో నాస్తి న భర్తా చ స్త్రీణాం తార్క్ష్య సపిండనమ్ ।**
**కారయేద్వృద్ధి సమయే భ్రాతృదాయాద దేవరైః ॥123॥**

గరుడా! స్త్రీలకు పుత్రుడూ, భర్తా కూడ లేకపోతే, వృద్ధిశ్రాద్ధసమయంలో సోదరుడు కాని, దాయాది కాని, దేవరుడు (మరది) కాని సపిండవిధి చేయాలి.

**పతిపుత్ర విహీనానాం గోత్రీ నాస్తి న దేవరః ।**
**ఏకోద్దిష్టేన దాతవ్యం పరేణ సహ భ్రాతృభిః ॥124॥**

పతి, పుత్రులులేని స్త్రీలకు, సగోత్రులు, మరదిలేని స్త్రీలకు సోదరులతోకాని, ఇతరునితోకాని ఏకోద్దిష్టవిధానం చేయించాలి.

**అజ్ఞానాద్విఘ్నతో వాపి న కృతశ్చేత్ సపిండనమ్ ।**
**నవకం షోడశ శ్రాద్ధమాబ్దికం కారయేత్తతః ॥125॥**

అజ్ఞానంవల్ల కాని, విఘ్నంకలగడంవల్ల కాని సపిండీకరణం జరగకపోతే నవకశ్రాద్ధం, షోడశశ్రాద్ధం, ఆబ్దికం నిర్వహించి పిమ్మట దానిని చేయాలి.

**అదాహే న చ కర్తవ్యం సదాహే కారయేద్బుధః ।**
**దర్భపుత్తలకం కృత్వా వహ్నినా దాహయేచ్ఛవమ్ ॥126॥**

దహనక్రియ జరగకపోతే (ముందే) ఇది చేయరాదు. దహనక్రియ అయిన తరువాతనే బుధుడు దీనిని చేయించాలి. దర్భలతో పుత్తలకం(ప్రతిమ) నిర్మించి, ఆ దర్భమయశవాన్ని అగ్నిద్వారా దహించాలి.

**పితుః పుత్రేణ కర్తవ్యం న కుర్వీత పితాసుతే ।**
**అతిస్నేహాన్న కర్తవ్యం సపిండీకరణం సుతే ॥127॥**

తండ్రికి పుత్రుడు ఈ విధి చేయాలి. తండ్రి పుత్రునకు ఈ విధి చేయరాదు. ఎంత మిక్కిలి ప్రేమ ఉన్నప్పటికి సుతుని విషయంలో తండ్రి సపిండీకరణం చేయరాదు.

**బహవోఽపి యదా పుత్రా విధిమేకః సమాచరేత్ ।**
**నవశ్రాద్ధం సపిండత్వం శ్రాద్ధాన్యన్యాని షోడశ ॥128॥**

**ఏకేనైవ తు కార్యాణి అవిభక్త ధనేష్వపి ।**
**అన్త్యేష్టిం కురుతే హ్యేకో మునిభిః సముదాహృతమ్ ॥129॥**

ఎంత ఎక్కువమంది పుత్రులుఉన్నా, ఒక్కడే విధి నాచరించాలి, నవశ్రాద్ధం, సపిండీకరణం, మిగిలిన షోడశశ్రాద్ధాదులు ఒక్కడే అన్నికార్యాలు నిర్వహించాలి. ధనాలు పంచుకోకుండా ఉండేటంతవరకు ఒక్కడే అంత్యేష్టిని చేయాలని మునులు తెలియజేశారు.

**విభక్తైశ్చ పృథక్ కార్యా క్రియా సాంవత్సరాదికా ।**
**ఏకైకేన చ కర్తవ్యా పుత్రేణ చ స్వయం స్వయమ్ ॥130॥**

విభజింపబడినవారయితే మాత్రం వేర్వేరుగా సాంవత్సరికాది క్రియ నిర్వహింపబడాలి. ఒక్కొక్క పుత్రుడు ఎవరికి వారే స్వయంగా ఈ విధి నాచరించాలి.

**యస్యైతాని న దత్తాని ప్రేతశ్రాద్ధాని షోడశ ।**
**పిశాచత్వం స్థిరం తస్య కృతైః శ్రాద్ధశతైరపి ॥131॥**

ఎవనికయితే ఈ పదునారు ప్రేతశ్రాద్ధాలు చేయబడవో, అతనికి పిశాచత్వం స్థిరంగా ఉండిపోతుంది. వంద శ్రాద్ధాలు చేసినా అంతే.

**భ్రాతా వా భ్రాతృపుత్రో వా సపిండః శిష్య ఏవ వా ।**
**సపిండీకరణం కుర్యాత్ పుత్రహీనే ఖగేశ్వర ॥132॥**

ఖగరాజా! పుత్రుడు కనుక లేకపోతే భ్రాతకాని, భ్రాతృపుత్రుడుకాని, సపిండుడుకాని, శిష్యుడుకాని సపిండీకరణం చేయాలి.

**సర్వేషాం పుత్రహీనానాం పుత్రీ కుర్యాత్ సపిండనమ్ ।**
**ఋత్విజం కారయేద్వాథ పురోహితమథాపి వా ॥133॥**

పుత్రహీనులందరికి పుత్రిక సపిండీకరణం చేయాలి, ఋత్విజుని చేతనయినా చేయించవచ్చు, లేదా పురోహితుని చేతనయినా చేయించవచ్చు.

**మృతే పితర్యబ్దమధ్యే హ్యుపరాగో యదా భవేత్ ।**
**పార్వణం న సుతైః కార్యం శ్రాద్ధం నాందీముఖం న చ ॥134॥**

తండ్రి మరణించగా, సంవత్సరం మధ్యలో ఎప్పుడైనా గ్రహణం కనుక వచ్చినట్లయితే కుమారులు పార్వణవిధి కాని, నాందీముఖశ్రాద్ధం కాని చేయరాదు.

**తీర్థశ్రాద్ధం గయాశ్రాద్ధం శ్రాద్ధమన్యచ్చ పైతృకమ్ ।**
**అబ్దమధ్యే న కుర్వీత మహాగురువిపత్తిషు ॥135॥**

మహాగురు విపత్తులయందు తీర్థశ్రాద్ధం, గయాశ్రాద్ధం, మిగిలినటువంటి పితృశ్రాద్ధం సంవత్సరం మధ్యలో చేయరాదు.

**యమకే చ గజచ్ఛాయా మన్వాదిషు యుగాదిషు ।**
**పితృపిండో న దాతవ్యః సపిండీకరణం వినా ॥136॥**

యమకమందు, గజచ్ఛాయయందు, మన్వాదులయందు, యుగాదులందు సపిండీకరణం చేయకపోతే పితృపిండం ఈయరాదు.

**యజ్ఞపురుషస్య యద్దానం దీపదానఞ్చ యత్ తథా ।**
**అపూర్ణేఽ ప్యబ్దమధ్యేపి కర్తవ్యమితి కేచన ॥137॥**

యజ్ఞపురుషునికిచ్చే దానం, దీపదానం సంవత్సరం పూర్తికాకపోయినా, ఆ ఏడు మధ్యలోనయినా ఈయవచ్చని కొందరి భావన.

**పితృభ్యోఽ పి హి యద్దత్త మర్ఘపిండ వివర్జితమ్ ।**
**కర్తవ్యం తచ్చ వై సర్వమేష ఏవ విధిః స్మృతః ॥138॥**

అర్ఘపిండాన్ని మినహాయించి పితరులకిచ్చే శ్రాద్ధమయినా, తప్పనిసరిగా చేయవలసిందేయని విధిగా చెప్పబడింది.

**దేవానాం పితరో దేవా పితౄణామృషయస్తథా ।**
**ఋషీణాం పితరో దేవాః పితా జయతి తేన వై ॥139॥**

దేవతలకు పితరులే దేవతలు. పితరులకు ఋషులే దేవతలు. ఋషులకు పితరులే దేవతలు. అందువల్ల పిత ఎల్లప్పుడూ జయశీలుడే.

**పితృదేవ మనుష్యాణాం యజ్ఞనాథో విభుర్భవేత్ ।**
**యజ్ఞనాథస్య యద్దత్తం తద్దత్తం సర్వదేహినామ్ ॥140॥**

పితరులకు, దేవతలకు, మనుష్యులకు యజ్ఞనాథుడే విభుడు. యజ్ఞనాథునకు ఇస్తే, అది సర్వప్రాణులకు ఇచ్చినట్లే.

**మృతే పితర్యబ్దమధ్యే యః శ్రాద్ధం కారయేత్ సుతః ।**
**సప్తజన్మ కృతాద్ధర్మాత్ హీయతే నాత్ర సంశయః ॥141॥**

తండ్రి మరణించగా సంవత్సరం మధ్యలో సుతుడు శ్రాద్ధం జరిపిస్తే, అతడు ఏడు జన్మలలో చేసిన ధర్మంనుండి హీనుడవుతాడు. ఇందు సందేహం లేదు.

**ప్రేతీభూతాస్తు పితరో లుప్తపిండోదకక్రియాః ।**
**భ్రమంతి వాయునా సర్వే క్షుత్తృడ్భ్యాం పరిపీడితాః ॥142॥**

ప్రేతలుగా మారిన పితరులకు పిండోదకక్రియలు లోపిస్తాయి. అవుతారు వారు ఆకలిదప్పికలచే పీడింపబడుతూ, అందరూ వాయురూపంలో తిరుగుతుంటారు.

**పితరి ప్రేతతాపన్నే లుప్యతే పైతృకీ క్రియా ।**
**అథ మాతుర్విపత్తిః స్యాత్ పితృకార్యం న లుప్యతే ॥143॥**

తండ్రి ప్రేతత్వాన్ని పొందితే పైతృకీక్రియ లోపించినదవుతుంది, అందువల్ల తల్లికి విపత్తు సంభవిస్తుంది, కాబట్టి పితృకార్యంలో లోపం పనికిరాదు.

**మృతా మాతా పితా తిష్ఠే జ్జీవంతీ చ పితామహీ ।**
**సపిండనన్తు కర్తవ్యం పితామహ్యా సహైవ తు ॥144॥**

తల్లి మరణించి, తండ్రి, నాయనమ్మ జీవించిఉంటే, పితామహితో కలిపి (దేవతాస్వరూపంగా) సపిండనం చేయాలి.

**సత్యం సత్యం పునః సత్యం శ్రూయతాం వచనం మమ ।**
**న పిండో మిలితో యేషాం మృతానాన్తు నృణాం భువి ॥145॥**

**ఉపతిష్ఠేన్న వై తేషాం పుత్రైర్దత్తమనేకధా ।**
**హంతకార స్తదుద్దేశే శ్రాద్ధం నైవ జలాంజలిః ॥146॥**

సత్యం, సత్యం, మళ్లీసత్యం, ముమ్మాటికీ సత్యం, నా వచనం ఆలకించు. భూమియందు ఏ నరులయితే మరణించారో, వారికి పిండమేలనం జరగకపోతే, వారికి పుత్రులు ఎన్నివిధాలుగా ఏవి సమర్పించినా అవి వారికి చెందవు.వారిని ఉద్దేశించి చేసిన శ్రాద్ధం దుఃఖకారకమే. జలాంజలి ఈయకపోయినా అంతే.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ఔర్ధ్వదైహికాది నిరూపణం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥34॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండో అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఔర్ధ్వదైహికం, సపిండీకరణం మొదలగునవి అనే ముప్పై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచత్రింశోఽధ్యాయః - ముప్పై అయిదవ అధ్యాయం

## సపిండీకరణ శవవిధినిరూపణమ్ - సపిండీకరణం శవవిధి

**తార్క్ష్య ఉవాచ** - గరుడుడు వచించాడు.

**అపరం మమ సందేహం కథయస్వ జనార్దన ।**
**పురుషస్య చ కస్యాపి మాతా పంచత్వమాగతా ॥1॥**

**పితామహీ జీవతి చ తథాచ ప్రపితామహీ ।**
**వృద్ధ ప్రపితామహీ తద్వన్మాతృసక్తః పితా తథా ॥2॥**

**ప్రమాతామహశ్చ తథా వృద్ధప్రమాతామహ స్తథా ।**
**(పితామహ ప్రపితామహౌ వృద్ధశ్చ ప్రపితామహః।)**
**కేన సా మేలయతే మాతా ఏతత్ కథయ మే ప్రభో ॥3॥**

జనార్దనా! నాకు మరో సందేహంఉంది, వివరించు, ఏ పురుషుని తల్లిఅయినా మరణిస్తే, పితామహి ప్రపితామహి, వృద్ధప్రపితామహి బ్రతికిఉంటే; అలాగే తల్లిఉండి తండ్రి మరణిస్తే, పితామహుడు, ప్రపితామహుడు, వృద్ధ ప్రపితామహుడు జీవించియుంటే, ప్రభూ! ఆ తల్లి ఎవరితో సపిండీకరణ చెందాలి? ప్రభూ! నాకు ఈ విషయాన్ని వివరించు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వివరించాడు.

**పునరుక్తం ప్రవక్ష్యామి సపిండీకరణం ఖగ ।**
**ఉమాలక్ష్మీశ్చ సావిత్రీత్యేతాభి ర్మేలయద్ధ్రువమ్ ॥4॥**

ఖగమా! చెప్పిన సపిండీకరణ విధానాన్ని మళ్లీ చెబుతున్నాను, నిశ్చయంగా ఉమాలక్ష్మీ సరస్వతుల (సావిత్రుల)తో సమ్మేళనం చేయాలి.

**త్రయః పిండభుజో జ్ఞేయా స్త్యాజకాశ్చ త్రయః స్మృతాః ।**
**త్రయః పిండానులేపాశ్చ దశమః పంక్తిసంనిధః ॥5॥**

ఈ సంసారంలో ముగ్గురు పురుషులు పిండభోజకులు, ముగ్గురు త్యాజకులు, ముగ్గురు పిండానులేపకులు, పదోవాడు పంక్తిసంనిధుడు,

**ఇత్యేతే పురుషాః ఖ్యాతాః పితృమాతృకులేషు చ ।**
**తారయేద్యజమానస్తు దశ పూర్వాన్ దశావరాన్ ॥6॥**

ఈ పదిమంది పురుషులు అని చెప్పబడతారు. యజమాని(శ్రాద్ధ యజ్ఞకర్మను చేసేవాడు) తనకు ముందు పదితరాల పురుషులను, తన తరువాతి పదితరాల పురుషులను పితృమాతృ కులాలలో వారిని తరింపజేయగలడు.

**సపిండః స భవేదాదౌ సపిండీకరణే కృతే ।**
**అంత్యస్తు త్యాజకో జ్ఞేయో యో వృద్ధప్రపితామహః ॥7॥**

సపిండీకరణం చేయబడగానే, మొదటనుండి (తండ్రి,తాత,ముత్తాత సపిండులుగా భావింపబడతారు) ఆ తండ్రి సపిండుడుగా భావింపబడతాడు. చివరివాడైన వృద్ధ ప్రపితామహుడు త్యాజకుడుగా చెప్పబడతాడు.

**అంతిమ స్త్యాజకో జ్ఞేయో లేపకః ప్రథమో భవేత్ ।**
**లేపక స్త్వంతిమో యస్తు స భవేత్ పంక్తిసన్నిధః ॥8॥**

అతడు చివరి త్యాజకుడవుతాడు.(ఆయన, ఆయనతండ్రి, ఆయనతాత త్యాజకులవుతారు) ఆపై వానిని లేపకులతో మొదటివానిగా భావిస్తారు. (ఆపై వారిని ముప్వురుని లేపకులంటారు) అందులో చివరి లేపకుడు పంక్తిసన్నిధుడనబడతాడు.

**యజమానో భవేదేకో దశ పూర్వే దశావరే ।**
**ఇత్యేతే పితరో జ్ఞేయా ఏకవింశతి సంఖ్యకాః ॥9॥**

యజమానుడు ఒకడు, ముందు పది తరాలవారు, తరువాతి పది తరాలవారు, కలిపి ఈ ఇరవైఒక్కమంది పితరులుగా తెలియజేయబడతారు,

**విధినా కురుతే యస్తు సంసారే శ్రాద్ధముత్తమమ్ ।**
**జాయతేఽత్ర న సందేహః శృణు తస్యాపి యత్ ఫలమ్ ॥10॥**

సంసారంలో ఉత్తమమైన శ్రాద్ధాన్ని ఎవడు శాస్త్రవిధిచే చేస్తాడో, అతడు ఇక్కడ తిరిగి జన్మిస్తాడు, సందేహం లేదు, అతనికి గలిగే ఫలమేమిటో విను.

**పితా దదాతి పుత్రాన్ వై (అ) విచ్ఛిన్న సంతతిః ఖగ ।**
**(హే) హోమదాతా భవేత్సోఽపి యస్తస్య ప్రపితామహః ॥11॥**

ఖగమా! పితరులు (తండ్రి) ప్రసన్నులయితే పుత్రులకు, అవిచ్ఛిన్న సంతానాన్ని ప్రసాదించగలరు, అతనియొక్క ప్రపితామహుడు స్వర్ణదాత కాగలడు.

**కృతే శ్రాద్ధే గుణాహ్యేతే పితౄణాం తర్పణే స్మృతాః ।**
**దద్యా ద్విపులమన్నాద్యం వృద్ధస్తు ప్రపితామహః ॥12॥**

శ్రాద్ధంచే పితరులకు తర్పణాలు ఇస్తే, ఈ గుణాలు సంప్రాప్తిస్తాయి, వృద్ధ ప్రపితామహుడు ఎన్నో అన్నాదులను ఇస్తాడు.

**యస్య పుంసశ్చ మర్త్యే వై విచ్ఛిన్నా సంతతిః ఖగ ।**
**స వసేన్నరకే ఘోరే పంకే మగ్నః కరీ యథా ॥13॥**

ఖగమా! మర్త్యలోకంలో ఏ పురుషునియొక్క సంతతి విచ్ఛిన్నమవుతుందో, అతడు బురదలో కూరుకొనిపోయిన ఏనుగువలె ఘోరమైన నరకంలో నివసిస్తాడు.

**యోన్యంతరేషు జాయేత యత్ర వృక్షసరీసృపాః ।**
**న సంతతిం వినా సోఽత్ర ముచ్యతే నరకాద్ధ్రువమ్ ॥14॥**

ఎక్కడయితే వృక్షాలు, సరీసృపాలు పుడతాయో, అటువంటి అన్యయోనులందు జన్మిస్తాడు, సంతతిలేకపోతే అతడు నిశ్చయంగా నరకంనుండి విముక్తుడు కాలేడు.

**ఆచార్యస్తస్య శిష్యో వా యో దూరేఽపి హి గోత్రజః ।**
**నారాయణబలిం కుర్యాత్ తస్యోద్దేశేన భక్తితః ॥15॥**

**విశుద్ధః సర్వపాపేభ్యో ముక్తః స నరకాద్ధ్రువమ్ ।**
**నివసన్నాకలోకే చ నాత్ర కార్యా విచారణా ॥16॥**

అతని ఆచార్యుడు కాని, శిష్యుడు కాని, దూరంలోఉన్న ఏ గోత్రజుడైనా, అతనిని ఉద్దేశించి భక్తితో నారాయణబలి అనే పూజను చేయాలి. అప్పుడు సర్వపాపాలనుండి విశుద్ధుడై నిశ్చయంగా నరకంనుండి విముక్తుడు కాగలడు. స్వర్గలోకంలో నివసించగలడు. ఇందు ఆలోచించవలసినది ఏదీలేదు.

**ఆదౌ కృత్వా ధనిష్ఠాఇచ్చ ఏతన్నక్షత్రపంచకమ్ ।**
**రేవత్యంతం సదా దూష్యమశుభం సర్వదా భవేత్ ॥17॥**

ధనిష్ఠ(యొక్క)మొదటి నుండి రేవతి చివరివరకు, ఈ అయిదు నక్షత్రాల సమూహం ఎల్లప్పుడూ దూషింపదగినది, అశుభమయినదిగా చెప్పబడుతోంది.

**దాహ(బలి)స్తత్ర న కర్తవ్యో విప్రాది సర్వజాతిషు ।**
**దీయతే న జలం తత్ర అశుభం జాయతే ధ్రువమ్ ॥**
**లోకయాత్రా న కర్తవ్యా దుఃఖార్తః స్వజనో యది ॥18॥**

విప్రుడు మున్నగు సర్వజాతులలోను అప్పుడు దహనక్రియ చేయరానిది. ఆ సమయంలో జలం ఈయరాదు, అది నిశ్చయంగా అశుభాన్ని కలగజేస్తుంది. స్వజనం దుఃఖార్తిని పొందినప్పుడు లోకయాత్ర చేయరానిది.

**పంచకానంతరం తస్య కర్తవ్యం సర్వమన్యథా ।**
**పుత్రాణాం గోత్రిణాం తస్య సంతాపోఽప్యుపజాయతే ॥19॥**

ఆ నక్షత్రపంచకానంతరం మృతునికి సర్వమూ చేయవలసిఉంది, అట్లుకానినాడు పుత్రులకు, గోత్రికులకు, అతనికి సంతాపం సంభవిస్తుంది.

**గృహే హానిర్భవేత్తస్య ఋక్షేష్వేషు మృతశ్చ యః ।**
**అథవా ఋక్షమధ్యేఽపి దాహస్తస్య విధీయతే ॥20॥**

ఈ అయిదు నక్షత్రాలయందు ఎవడైనా మరణిస్తే, అతని ఇంటిలో హాని కలుగుతుంది. లేదా ఆనాడు ఆ మృతునికి నక్షత్రమధ్యకాలంలో దహనం విధింపబడింది.

**క్రియతే మానుషాణాన్తు సద్య ఆహుతి కారణాత్ ।**
**సద్యాహుతికరం పుణ్యం తీర్థే తద్దాహ ఉత్తమః ॥21॥**

మనుష్యులకు వెంటనే చేయవలసిన విధి నిర్వహింపబడుతోంది. అందువల్ల వెంటనే ఆహుతిచేయడం పుణ్యం కాబట్టి, తీర్థంలో అటువంటి దహనక్రియ ఉత్తమమైనది.

**విప్రైర్నియమతః కార్యః సమంత్రో విధిపూర్వకః ।**
**శవస్య చ సమీపే తు క్షిప్యతే పుత్తలాస్తతః ॥22॥**

విధిపూర్వకంగా, సమంత్రకంగా, నియమసహితంగా విప్రులచే ఇది చేయబడాలి. శవంయొక్క సమీపంలో పుత్తలాలు వేయబడాలి.

**దర్భమయాశ్చ చత్వారో విప్రా మంత్రాభిమంత్రితాః ।**
**తతో దాహః ప్రకర్తవ్యః తైశ్చ పుత్తలకైః సహ ॥23॥**

విప్రులు దర్భమయాలైన నాలుగు పుత్తలకాలను మంత్రాలచే అభిమంత్రించాలి. ఆ తరువాత పుత్తలకాలతో కలిపి దహనం చేయాలి.

**సూతకాంతే తతః పుత్రః కుర్యాచ్ఛాంతిక ముత్తమమ్ ॥24॥**

పిమ్మట సూతకం అయినతరువాత పుత్రుడు ఉత్తమమైన శాంతి కర్మను చేయాలి.

**పంచకేషు మృతో యోఽసౌ న గతిం లభతే నరః ।**
**తిలాన్ గాశ్చ సువర్ణం చ తముద్దిశ్య ఘృతం దదేత్ ॥25॥**

పంచక నక్షత్రాలయందు మరణించిన నరుడు ఉత్తమగతిని పొందలేడు, తిలలను, ఆవులను, బంగారాన్ని, నేతిని అతనిని ఉద్దేశించి ఈయాలి.

**విప్రాణాం దీయతే దానం సర్వోపద్రవనాశనమ్ ।**
**సూతకాంతే చ సత్పుత్రైః స ప్రేతో లభతే గతిమ్ ॥26॥**

విప్రులకిచ్చేదానం సమస్తములైన ఉపద్రవాలను నశింపజేస్తుంది. సూతకాంతంలో సత్పుత్రులవల్ల ఆ ప్రేత ఉత్తమగతిని పొందగలడు.

**భాజనోపానహౌ ఛత్రం హేమముద్రా చ వాససీ ।**
**దక్షిణా దీయతే విప్రే సర్వపాతకమోచనీ ॥27॥**

పాత్ర, చెప్పులు, గొడుగు, బంగారుముద్రిక, వస్త్రాలు ఈ దానాలు కూడ చేయాలి, విప్రునికి సమస్త పాప విముక్తినిచ్చే దక్షిణ ఈయాలి.

**బాలవృద్ధాతురాణాఞ్చ మృతానాం పంచకేషు హి ।**
**విధానం యో న కుర్వీత విఘ్నస్తస్య ప్రజాయతే ॥28॥**

పంచక నక్షత్రాలలో బాలుడైనా, వృద్ధుడైనా, ఆతురుడైనా మరణిస్తే, ఈ విధానంద్వారా చేయని వానికి విఘ్నం సంభవిస్తుంది.

**అష్టాదశైవ వస్తూని ప్రేతశ్రాద్ధే వివర్జయేత్ ।**
**ఆశిషో ద్విగుణాన్ దర్భాన్ ప్రణవాన్ నైకపిండతామ్ ॥29॥**

ప్రేతశ్రాద్ధంలో ఈ పదునెనిమిది వస్తువులను విడిచిపెట్టాలి, ఆశీర్వాదం, ద్విగుణదర్భలు, ఓంకారం, ఒకటికన్న ఎక్కువ పిండాలు.

**అగ్నౌకరణముచ్ఛిష్టం శ్రాద్ధం వై వైశ్వదైవికమ్ ।**
**వికిరం చ స్వధాకారం పితృశబ్దం నచోచ్చరేత్ ॥30॥**

అగ్నౌకరణం, ఉచ్ఛిష్టశ్రాద్ధం, వైశ్వదేవార్చన, వికిరదానం, స్వధాకారోచ్చారణం, పితృశబ్దప్రయోగం పనికిరావు.

**అనుశబ్దం న కుర్వీత నావాహనమథోల్ముకమ్ ।**
**ఆసీమాంతం న కుర్వీత ప్రదక్షిణవిసర్జనమ్ ॥31॥**

అనుశబ్దప్రయోగం చేయరాదు. ఆవాహనం, ఉల్ముకం పనికిరాదు. ఆసీమాంత గమనం, ప్రదక్షిణం, విసర్జనం చేయరాదు.

**న కుర్యాత్ తిలహోమఇ్చ ద్విజః పూర్ణాహుతిం తథా ।**
**నకుర్యా ద్వైశ్వదేవం చేత్కర్తా గచ్ఛత్యధోగతిమ్ ॥32॥**

తిలలతో హోమంచేయరాదు, ద్విజుడు పూర్ణాహుతిని ఈయరాదు, అంతంలో కర్త వైశ్వదేవం చేయకపోతే అధోగతి పొందుతాడు.

**మలినశ్రాద్ధ సంజ్ఞానం పూర్వషోడశకం తథా ।**
**స్థానే ద్వారే చార్ధమార్గే చితాయాం శవహస్తకే ॥33॥**

ప్రథమషోడశి మలినశ్రాద్ధ షోడశి అనేపేరు గల్గినదిగా వ్యవహారం. వీటిని మృత్యుస్థానం, ద్వారం, సగందారి (తీసుకొని వెడుతున్నప్పుడు) చితి, శవహస్తం అనేచోట వేయాలి.

**శ్మశానవాసి భూతేభ్యః పంచమం ప్రాతివేశ్యకమ్ ।**
**షష్ఠం సంచయనే ప్రోక్తం దశపిండా దశాహికాః ॥**
**శ్రాద్ధషోడశకఞ్చైతత్ ప్రథమం పరికీర్తితమ్ ॥34॥**

శ్మశానంలో నివసించే భూతాలకు అయిదోది ప్రత్యేకంగా ఉంచదగినది. ఆరోది అస్థిసంచయనకాలంలో జరగాలి. పది రోజులలోను వేసే పది పిండాలతో కలిపి ఈ పదునారు శ్రాద్ధాలు ప్రథమషోడశిగా పేర్కొనబడుతుంది.

**అన్యచ్చ షోడశం మధ్యే ద్వితీయం తార్క్ష్య మే శృణు ।**
**కర్తవ్యానీహ విధినా శ్రాద్ధాన్యేకాదశైవ తు ॥35॥**

**బ్రహ్మ విష్ణు శివాద్యైశ్చ తథాన్యచ్ఛ్రాద్ధపంచకమ్ ।**
**ఏవం షోడశకం ప్రాహురేతత్ తత్త్వవిదో జనాః ॥36॥**

గరుడా! మరో షోడశి, అదే ద్వితీయషోడశి, అదే మధ్యషోడశి అనబడుతుంది. దానిగూర్చి విను. అందు ఒక పద్ధతిగా శాస్త్రవిధిచే పదకొండు శ్రాద్ధాలను పెట్టాలి. పిమ్మట బ్రహ్మ, విష్ణు, శివ, యమ, తత్పురుషులను ఉద్దేశించి అయిదు శ్రాద్ధాలు పెట్టాలి. ఈ విధంగా తత్త్వవిదులైన జనులు దీనిని మరో షోడశిగా చెబుతారు.

**ద్వాదశ ప్రతిమాస్యాని శ్రాద్ధమేకాదశే తథా ।**
**త్రిపక్ష సంభవఞ్చైవ ద్వే రిక్తే ఖగ షోడశ ॥37॥**

పన్నెండు మాసాలలో పెట్టే పన్నెండు మాసికాలు ఏకాదశ శ్రాద్ధం, ఊనమాసికం, త్రిపక్షం, ఊనషాణ్మాసికం, (ఊనమాసికం, ఊనషాణ్మాసికం ఈ రెండు రిక్తాలు) ఖగమా! ఈ పదునారింటిని కలిపి మరో షోడశిగా వ్యవహరిస్తారు.

**ఆద్యం శవవిశుద్ధ్యర్థం కృత్వాన్యచ్చ త్రిషోడశమ్ ।**
**పితృపంక్తి విశుద్ధ్యర్థం శతార్ధేన తు యోజయేత్ ॥38॥**

శవ విశుద్ధికొరకై ఆద్యశ్రాద్ధాన్ని, మిగిలిన త్రిషోడశ శ్రాద్ధకర్మలను చేసి, వీటినన్నింటిని పితృపంక్తి విశుద్ధికోసంచేసే ఏబదవ శ్రాద్ధంతో కలపాలి.

**శతార్ధేన విహీనో యో మిలితః పంక్తిభాఙ్నహి ।**
**చత్వారింశత్ తథైవాష్టశ్రాద్ధం ప్రేతత్వనాశనమ్ ॥39॥**

ఏబదవ శ్రాద్ధంతో కలపకపోతే పితృపంక్తిలో కలిసే యోగ్యతదక్కదు. నలభైఎనిమిదో శ్రాద్ధం అలాగే ప్రేతత్వాన్ని నశింపజేస్తుంది.

**సకృదూనశతార్ధేన సంభవేత్ పంక్తిసన్నిధః ।**
**మేలనీయః శతార్ధేన సంధిః శ్రాద్ధేన తత్త్వతః ॥40॥**

నలభై తొమ్మిదో శ్రాద్ధంతో వెంటనే అతడు పంక్తి సన్నిధుడవుతాడు. ఏబదవ శ్రాద్ధంతో కలయిక తత్త్వపద్ధతితో సమ్మేళనక్రియగా చెప్పబడింది.

**(అథ శవవిధిః – అనంతరం శవవిధానం)**

**శవస్య శిబికాయాం కరచరణబంధనం తత్ర కర్తవ్యమ్ ।**
**ఏవంచేన్న విధానం విధీయతే తత్పిశాచ పరిభవనమ్ ॥41॥**

శవయాత్ర ప్రారంభించుటకు ముందు శవాన్ని ఉంచే పాడెకు కాళ్లు, చేతులు కట్టివేయడం కర్తవ్యం, అలా చేయకపోతే, ఈ విధానం అవలంబించకపోతే, అది పిశాచాలకు ఆటపట్టు(స్థానం)అవుతుంది.

**సంజాయతే రజన్యాఞ్చ శవనిర్గమనే రాష్ట్రం భయశూన్యమ్ ।**
**శవం న ముంచేత ముచ్యేత చేత్ దుఃస్పర్శాద్దుర్గతి ర్భవేత్ ॥42॥**

ముఖ్యంగా అది రాత్రికలుగుతుంది. శవం వెళ్లిపోయిన తరువాత రాష్ట్రం(ఆ ప్రదేశం) భయంలేనిదవుతుంది. శవాన్ని ఎప్పుడూ ఒంటరిగా ఉంచరాదు, శవాన్ని ఒంటరిగా విడిచిపెడితే, దానిని ముట్టరానివి ముట్టుటచే దుర్గతి కలుగుతుంది.

**గ్రామమధ్యే స్థితే ప్రేతే శ్రుతే భుంక్తే యదృచ్ఛయా ।**
**తదన్నం మాంసవజ్ జ్ఞేయం తత్తోయం రుధిరోపమమ్ ॥43॥**

గ్రామ మధ్యంలో ప్రేతఉందని తెలిస్తే (వింటే) స్వేచ్ఛగా కనుక భుజిస్తే, ఆ అన్నాన్ని మాంసంవంటిదని తెలుసుకోవాలి, ఆ త్రాగిన నీరు రక్తంతో పోల్చదగినది.

**తాంబూలం దంతకాష్ఠఇ్చ భోజనం ఋతుసేవనమ్ ।**
**గ్రామమధ్యే స్థితే ప్రేతే వర్జయేత్ పిండపాతనమ్ ॥44॥**

**స్నానం దానం జపో హోమస్తర్పణం సురపూజనమ్ ।**
**గ్రామమధ్యే స్థితే ప్రేతే శుద్ధ్యర్థం జ్ఞాతిధర్మతః ॥45॥**

గ్రామమధ్యంలో ప్రేతఉండగా, తాంబూలం, దంతకాష్ఠం, భోజనం, ఋతుసేవనం, పిండప్రదానం పనికిరాదు. గ్రామమధ్యంలో ప్రేత ఉండగా స్నానం, దానం, జపం, హోమం, తర్పణం, దేవతాపూజ పనికిరాదు. జ్ఞాతిధర్మంయొక్క విశుద్ధికోసమై ఈ విధానం ఆచరించాలి.

**జ్ఞాతిసంబంధినామేవం వ్యవహారః ఖగేశ్వర ।**
**విలుప్య జ్ఞాతిధర్మఇ్చ ప్రేతపాపేన లిప్యతే ॥46॥**

ఖగరాజా! ఇలా జ్ఞాతిసంబంధుల వ్యవహారం ఉంది. జ్ఞాతిధర్మం లోపించినట్లయితే, ప్రేత పాపంతో అలుముకొనిపోతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే సపిండన శవవిధ్యోర్నిరూపణం నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో సపిండీకరణం శవవిధి అనే ముప్పై అయిదవ అధ్యాయం సమాప్తం.

## షట్త్రింశోఽధ్యాయః - ముప్పై ఆరవ అధ్యాయం

## అనశనమృతగతి నిరూపణమ్ - ఉపవాసాలతో మరణిస్తే వచ్చే ఫలితం

**తార్క్ష్య ఉవాచ** - గరుడుడు ప్రశ్నించాడు.

**కస్మాదనశనం పుణ్యమక్షయ్య గతిదాయకమ్ ।**
**స్వగృహన్తు పరిత్యజ్య తీర్థే వై మ్రియతే యది ॥1॥**

**అప్రాప్య తీర్థం మ్రియతే గృహే వా మృత్యుమాగతః ।**
**భూత్వా కుటీచరో యస్తు స కాం గతిమవాప్నుయాత్ ॥2॥**

అనశనవ్రతం క్షీణించని పుణ్యం ఇస్తుందని, ఉత్తమగతి దాయకమని ఎలా చెప్పబడుతుంది?(తన)స్వగృహాన్ని విడిచిపెట్టి, పుణ్యతీర్థంలో మరణిస్తే ఏ గతి లభిస్తుంది? తీర్థం పొందకుండగానే చనిపోతే ఏ గతి వస్తుంది? ఇంటివద్దనే చనిపోతే ఏ గతి లభిస్తుంది? కుటీచరుడై ఉండగా మరణించి ఏ గతిని పొందుతాడు?

**సంన్యాసం కురుతే యస్తు తీర్థే వాపి గృహేఽపి వా ।**
**కథం తస్య ప్రకర్తవ్య మప్రాప్తనిధనేఽపి వా ॥3॥**

**నియమే చేత్ కృతే దేవ చిత్తభంగో హి జాయతే ।**
**కేన తస్య భవేత్ సిద్ధిః కృతేనాప్యకృతేన వా ॥4॥**

సంన్యాసాన్ని స్వీకరించినవాడు, తీర్థంలో కాని, ఇంటిలో కాని ఉండగా, అతనికి మరణం రాకపోతే అతనికి ఏ విధి నిర్వర్తించవలసిఉంది? దేవా ! సంన్యాస నియమాన్ని చేబట్టి, చిత్తభంగం కలిగితే, అతనికి సిద్ధి కలిగినా, సిద్ధి కలగకపోయినా, ఏమి చేయాలి?

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**కృత్వా నిరశనం యో వై మృత్యు మాప్నోతి కోఽపి చేత్ ।**
**మానుషీం తనుముత్సృజ్య మమ తుల్యో విరాజతే ॥5॥**

నిరశనవ్రతం చేబట్టి, మృత్యువును పొందినవాడు మానవశరీరం విడిచిపెట్టి, నాతో సమానుడు అవుతాడు.

**యావన్త్యహాని జీవేత వ్రతే నిరశనే కృతే ।**
**క్రతుభిస్తాని తుల్యాని సమగ్రవరదక్షిణైః ॥6॥**

నిరశనవ్రతం చేస్తూ జీవించిన రోజులన్నీ సంపూర్ణమై శ్రేష్ఠమగు దక్షిణలతో కూడుకొన్న యజ్ఞాలతో సమానాలు అవుతాయి.

**తీర్థే గృహే వా సంన్యాసం నీత్వా చేన్మ్రియతే యది ।**
**ప్రత్యహం లభతే సోఽపి పూర్వోక్తం ద్విగుణం ఫలమ్ ॥7॥**

సంన్యాసం తీసుకొని తీర్థమందు కాని గృహమందు కాని మరణించినట్లయితే, అతడు ప్రతిదినం పూర్వంలో చెప్పబడిన ఫలాన్ని రెండింతలుగా పొందగలడు.

**మహారోగోపపత్తౌ చ గృహీతేఽనశనే కృతే ।**
**పునర్న జాయతే రోగో దేవవద్ధి విరాజతే ॥8॥**

మహాభయంకర రోగం వచ్చినపుడు, అనశన వ్రతాన్ని స్వీకరిస్తే, ఆ రోగం తిరిగి సంభవింపదు. అతడు దేవతలా విరాజిల్లుతాడు.

**య ఆతురః సన్ సన్న్యాసం గృహ్ణాతి యది మానవః ।**
**పునర్న జాయతే భూమౌ సంసారే దుఃఖసాగరే ॥9॥**

ఏ మానవుడయినా ఆతురునిగా ఉండి సన్న్యాసాన్ని స్వీకరించినట్లయితే, అతడు భూమిలో సంసార దుఃఖసాగరంలో తిరిగి జన్మింపడు.(ప్రవేశింపడు)

**అహన్యహని దాతవ్యం బ్రాహ్మణానాఞ్చ భోజనమ్ ।**
**తిలపాత్రం యథాశక్తి దీపదానం సురార్చనమ్ ॥10॥**

**ఏవం వృత్తస్య దహ్యంతే పాపాన్యుచ్చావచాని చ ।**
**మృతో ముక్తిమవాప్నోతి యథా సర్వే మహర్షయః ॥11॥**

ప్రతిదినం బ్రాహ్మణులకు భోజనం, తిలపాత్రదానం, యథాశక్తి దీపదానం, దేవతార్చన నిర్వహించాలి. ఈ విధంగా చేసే వానికి నానావిధాలైన పాపాలు దహించిపోతాయి. మహర్షులందరు ముక్తి పొందినట్లే, అతడు కూడా మృతిపొంది ముక్తి పొందుతాడు.

**తస్మాదనశనం నృణాం వైకుంఠ పదదాయకమ్ ।**
**తస్మాత్ స్వస్థే చోత్తరే వా సాధయేన్మోక్షలక్షణమ్ ॥12॥**

అందువల్ల నరులకు అనశనవ్రతం వైకుంఠపదాన్ని ప్రాప్తింపజేస్తుంది. కాబట్టి స్వస్థానంలో కాని, ఉత్తరస్థానంలోకాని మోక్షలక్షణాన్ని సాధించాలి.

**పుత్రద్రవ్యాది సంత్యజ్య తీర్థం వ్రజతి యో నరః ।**
**బ్రహ్మాద్యా దేవతాస్తస్య భవేయు స్తుష్టి పుష్టిదాః ॥13॥**

పుత్రద్రవ్యాదులనన్నింటిని వదలివేసి, పుణ్యతీర్థానికి వెళ్లిపోయిన నరునికి, బ్రహ్మాదిదేవతలూ అతనికి తుష్టిని పుష్టిని ఇచ్చేవారవుతారు.

**యస్తీర్థసమ్ముఖో భూత్వా వ్రతే హ్యనశనే కృతే ।**
**చేన్మ్రియేతాంతరాలేఽపి ఋషీణాం మండలే వసేత్ ॥14॥**

ఎవడు తీర్థయాత్రకు ఉన్ముఖుడై వెడుతూ, అనశనవ్రతం చేస్తూ దారి మధ్యలోనే మరణిస్తాడో, అతడు సప్తర్షిమండలంలో నివసిస్తాడు.

**వ్రతం నిరశనం కృత్వా స్వగృహేఽపి మృతే యది ।**
**స్వకులాని పరిత్యజ్య ఏకాకీ విచరేద్దివి ॥15॥**

నిరశనవ్రతాన్ని చేబట్టి, తన ఇంటిలోనే మరణం పొందితే, తన కులంలోని వారినందరిని విడిచివేసి, స్వర్గంలో ఒంటరిగా సంచరిస్తాడు.

**అన్నఞ్చైవ తథా తోయం పరిత్యజ్య నరో యది ।**
**పీతమత్పాదతోయఞ్చ న పునర్జాయతే క్షితౌ ॥16॥**

నరుడు అన్నాన్ని, అలాగే నీటిని పరిత్యజించి, నా పాదతోయాన్ని మాత్రమే త్రాగితే, అతడు భూలోకంలో తిరిగి జన్మను పొందడు.

**కృత్త్యాసీనం తత్తీర్థగతం రక్షంతి వనదేవతాః ।**
**యమదూతా విశేషేణ న యామ్యా స్తస్య పార్శ్వగాః ॥17॥**

ఆ యా తీర్థాలకువెళ్లి, మృగచర్మంపై ఆసీనుడై యున్నవానిని వనదేవతలు రక్షిస్తారు. యమదూతలు విశేషించి యమకింకరులు అతని పార్శ్వానికి కూడ వెళ్లరు.

**తీర్థసేవీ నరో యస్తు సర్వకిల్బిషవర్జితః ।**
**తత్ర మ్రియేత దహ్యేత తత్తీర్థఫలభాగ్భవేత్ ॥18॥**

తీర్థసేవనం చేసే నరుడు అతడు సమస్తపాపాలనుండి విముక్తుడవుతాడు. అతడు అక్కడ చనిపోయి, అక్కడే దహింపబడితే ఆ తీర్థఫలాన్ని పొందుతాడు.

**సేవితేఽపి సదా(త)పథి హ్యన్యత్ర మ్రియతే యది ।**
**శుభే దేశే కులే ధీమాన్ స భవేద్వేదవిద్ద్విజః ॥19॥**

ఎల్లప్పుడు తీర్థాలు సేవిస్తూ, దారిలో కాని, మరోచోట కాని మరణిస్తే, అతడు ఉత్తమ దేశంలో, ఉన్నత కులంలో, ధీమంతుడైన వేదవిద్వాంసుడైన ద్విజుడుగా జన్మిస్తాడు.

**కృత్వా నిరశనం తార్క్ష్య పునర్జీవతి మానవః ।**
**బ్రాహ్మణాన్ స సమాహూయ సర్వస్వం యత్ పరిత్యజేత్ ॥20॥**

**చాంద్రాయణం చరేత్ కృత్స్నమనుజ్ఞాతశ్చ తై ర్ద్విజైః ।**
**అనృతం న వదేత్పశ్చాద్ధర్మమేవ సమాచరేత్ ॥21॥**

గరుడా! అనశన వ్రతం ఎన్నిరోజులుచేసినా, చావురాకుండా తిరిగి జీవించే మానవుడు బ్రాహ్మణులను ఆహ్వానించి తన సర్వస్వాన్ని విడిచిపెట్టాలి. ఆ ద్విజులచే ఆజ్ఞాపింపబడినవాడై చాంద్రాయణవ్రతం చేయాలి. అనృతం వచింపరాదు, పిమ్మట ధర్మాన్నే చక్కగా ఆచరించాలి.

**తీర్థే గత్వా చ యః కోఽపి పునరాయాతి వై గృహమ్ ।**
**అనుజ్ఞాతః స వై విప్రైః ప్రాయశ్చిత్తమథాచరేత్ ॥22॥**

ఏ ఒకడయినా తీర్థానికి వెళ్లి చావురాక, తిరిగి ఇంటికి మరలి వస్తే, అతడు విప్రులచే ఆజ్ఞతో ప్రాయశ్చిత్తాన్ని ఆచరించాలి.

**దత్త్వా వా స్వర్ణదానాని గోమహీ గజవాజినః ।**
**తీర్థం యది లభేద్యస్తు మృత్యుకాలే స భాగ్యవాన్ ॥23॥**

స్వర్ణదానాలను, గోవులు, భూమి, ఏనుగు, గఱ్ఱాలను దానంచేయాలి. తీర్థఫలితాన్ని మృత్యుకాలంలో అతడు పొందుతాడు.

**గృహాత్ ప్రచలితస్తీర్థం మరణే సముపస్థితే ।**
**పదే పదే తు గోదానం యది హింసా న జాయతే ॥24॥**

ఇంటినుండి తీర్థానికి కదలివెళ్లినవాడు, మరణం సమీపిస్తూఉండగా, ఎన్ని అడుగులు వేస్తే, అన్ని గోవులను దానంచేయాలి. అది అతనికి హింస (దుఃఖదాయకం) కాకపోతే

**గృహే తు యత్ కృతంపాపం తీర్థస్నానేన శుద్ధ్యతి ।**
**కురుతే తత్ర పాపఞ్చేద్వజ్రలేప సమం హి తత్ ॥25॥**

గృహంలో చేయబడిన పాపం, తీర్థస్నానంవల్ల శుద్ధిచేయబడుతుంది, అక్కడ కనుక పాపంచేస్తే, అది వజ్రలేపంతో సమం అవుతుంది.

**క్లిశ్యేత్ స నాత్ర సందేహో యావచ్చంద్రార్కతారకమ్ ।**
**తత్ర దత్తాని దానాని జాయంతే చాక్షయాణి వై ॥26॥**

అతడు పాపాత్ముడై దుఃఖం పొందుతాడు, అందు సందేహంలేదు, సూర్య చంద్ర నక్షత్రాలు ఉన్నంతవరకు అక్కడ ఇచ్చే దానాలు అక్షయాలు అవుతాయి.

**ఆతురే సతి దాతవ్యం నిర్ధనైరపి మానవైః ।**
**గావస్తిలా హిరణ్యఞ్చ సప్తధాన్యం విశేషతః ॥27॥**

ఆతురుడైననూ దానంచేయాలి, నిర్ధనులైన మానవులైననూ చేయాలి, గోవులు, తిలలు, హిరణ్యం, సప్త ధాన్యాలు విశేషించి దానం చేయాలి.

**దానవంతం నరం దృష్ట్వా హృష్టాః సర్వే దివౌకసః ।**
**ఋషిభిః సహ ధర్మేణ చిత్రగుప్తేన సర్వదా ॥28॥**

దానంచేసే నరునిచూచి దేవతలందరూ, ఋషులు, యమధర్మరాజు, చిత్రగుప్తునితో కలసి ఎల్లప్పుడూ సంప్రహృష్టులవుతారు.

**ఆత్మాయత్తం ధనం యావత్ తావద్విప్రే సమర్పయేత్ ।**
**పరాధీనం మృతే సర్వం కృపయా కః ప్రదాస్యతి ॥29॥**

తనకు సంబంధించిన ధనాన్ని అంతను విప్రునికి దానంచేయాలి, చనిపోయినపిమ్మట సర్వం పరాధీనమవుతుంది, అప్పుడు దయతో ఎవడు దానమిస్తాడు కనుక?

**పిత్రుద్దేశేన యః పుత్రైర్ధనం విప్రకరేఽర్పితమ్ ।**
**ఆత్మానం సధనం తేన చక్రే పుత్ర ప్రపౌత్రకైః ॥30॥**

తండ్రిని ఉద్దేశించి ఏ ధనం పుత్రులచే విప్రుని చేతులలో అర్పింపబడుతుందో, అది తనను, పుత్ర, పౌత్ర, ప్రపౌత్రకులతో సహా ధనవంతుణ్ణి చేస్తుంది.

**పితుః శతగుణం దత్తం సహస్రం మాతురుచ్యతే ।**
**భగిన్యా శతసాహస్రం సోదర్యే దత్తమక్షయమ్ ॥31॥**

తండ్రివిషయంలో చేసేదానం వందరెట్లు పుణ్యాన్ని ఇస్తుంది, తల్లివిషయంలో వేయిరెట్లు, సోదరివిషయంలో పదివేలరెట్లు, సోదర్యుని విషయంలో అక్షయ ఫలితాన్ని ఇస్తుంది.

**యది లోభాన్న యచ్ఛన్తి ప్రమాదాన్మోహితోఽపి వా ।**
**మృతాః శోచంతి తే సర్వే కదర్యాః పాపినస్త్వితి ॥32॥**

లోభంవల్లకాని, ప్రమాదంవల్లకాని, మోహంవల్లకాని, దానంచేయకపోతే వారు కుత్సితులైన ధనికులు, పాపాత్ములు అవుతారు. వారివల్ల ఆ చనిపోయినవారందరు దుఃఖిస్తారు.

**అతిక్లేశేన లబ్ధస్య ప్రకృత్యా చంచలస్య చ ।**
**గతిరేకైవ విత్తస్య దానమన్యా విపత్తయః ॥33॥**

మిక్కిలి కష్టపడి సంపాదించినా, స్వభావంచే చంచలమైన విత్తానికి దానమొక్కటే పరమార్థం, మరోది విపత్తులు ఇస్తుంది.

**మృత్యోః శరీరగోప్తారం వసురక్షం వసుంధరా ।**
**దుశ్చారిణీవ హసతి స్వపతిం పుత్రవత్సలమ్ ॥34॥**

దుష్టచారిణిఅయిన స్త్రీ పుత్రవాత్సల్యం కలిగిన తనపతిని పరిహసించినట్లుగా, మృత్యువు నుండీ తన శరీరాన్ని దాచుకొంటూ వసువును రక్షించుకొనేవానిని చూచి వసుంధర నవ్వుకొంటుంది.

**ఉదారో ధార్మికః సౌమ్యః ప్రాప్యాపి విపులం ధనమ్ ।**
**తృణవన్మన్యతే తార్క్ష్య ఆత్మానం విత్తమప్యథ ॥35॥**

గరుడా! ఉదారుడు, ధార్మికుడు, సౌమ్యుడు అయినవాడు విస్తారంగా ధనం సంపాదించినప్పటికిని, తనను, అలాగే విత్తాన్ని తృణంలా భావిస్తాడు.

**న చైవోపద్రవాస్తస్య మోహజాలో న చైవ హి ।**
**మృత్యుకాలే న చ భయం యమదూత సముద్భవమ్ ॥36॥**

అటువంటివానికి ఉపద్రవాలు సంభవించవు, మోహజాలం కలుగనే కలుగదు, మృత్యుకాలంలో యమదూతలవల్ల కలిగే భయం ఉత్పన్నంకాదు.

**సమాః సహస్రాణి చ సప్త వై జలే దశైకమగ్నౌ పవనే చ షోడశ ।**
**మహాహవే షష్టిరశీతి గోర్గృహే అనాశకే కాశ్యప చాక్షయా గతిః ॥37॥**

కశ్యపవంశ సంజాతా! ధర్మంకోసం నీట మునిగినవానికి ఏడువేల సంవత్సరాలపాటు, అగ్నిలో పడినవానికి పదకొండువేల సంవత్సరాలపాటు, తీవ్రమైన గాలిలో చిక్కుకొన్నవానికి పదునారువేల సంవత్సరాలపాటు, మహాసంగ్రామంలో మరణించినవానికి అరవైవేల సంవత్సరాలపాటు, గోరక్షణలో ప్రాణాలు అర్పించినవానికి ఎనబైవేల సంవత్సరాలపాటు శాశ్వతమైన అక్షయపుణ్యలోక ప్రాప్తి చేకూరుతుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే అనశనమృతగతి నిరూపణం నామ షట్త్రింశోఽధ్యాయః ॥36॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఉపవాసాలతో మరణిస్తే వచ్చే ఫలితం అనే ముప్పై ఆరవ అధ్యాయం సమాప్తం.

## **సప్తత్రింశోఽధ్యాయః** – ముప్పై ఏడవ అధ్యాయం

## **సోదకుంభశ్రాద్ధ నిరూపణమ్** – జలపూర్ణపాత్రను దానం చేయుట

**తార్క్ష్య ఉవాచ** – గరుడుడు వచించాడు.

**ఉదకుంభప్రదానం మే కథయస్వ యథాతథమ్ ।**
**విధినా కేన కర్తవ్యా కృతిరేషా జనార్దన ॥1॥**

**కిం లక్షణాః కేన పూర్ణాః కస్య దేయా జనార్దన ।**
**కస్మిన్ కాలే ప్రదాతవ్యా ప్రేతతృప్తిప్రసాధకాః ॥2॥**

జనార్దనా! ఉదకుంభప్రదానం గురించి నాకు చెప్పు, దానిని ఏ విధితో చేయాలి? దాని కృత్యం ఎటువంటిది? జనార్దనా! దాని లక్షణాలు ఎటువంటివి? వేటితో వానిని నింపాలి? ఎవ్వనికి ఈయాలి? ఏ కాలంలో దానిని ఈయాలి? అవి ప్రేతకు మిక్కిలిగా తృప్తిని సాధించేవి ఎలా అవుతాయి?

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**సత్యం పునః ప్రవక్ష్యామి ఉదకుంభప్రదానకమ్ ।**
**ప్రేతోద్దేశేన దాతవ్యా అన్నపానీయసంయుతాః ॥**
**విశేషేణ మహాపక్షిన్ ప్రేతముక్తి ప్రదాయకాః ॥3॥**

అది సత్యం, ఉదకుంభప్రదానం గురించి మళ్లీ చెబుతున్నాను, అది ప్రేతను ఉద్దేశించి ఈయబడాలి. దానిని అన్నంతోను, పానీయంతోను నింపాలి. మహాఖగమా! విశేషించి ఆ దానాలు ప్రేతకు ముక్తిని ఇచ్చేవి.

**ద్వాదశాహే చ షణ్మాసే త్రిపక్షే వాపి వత్సరే ।**
**ఉదకుంభాః ప్రదాతవ్యా మార్గే తస్య సుఖాయ వై ॥4॥**

పన్నెండో రోజున కాని, త్రిపక్షంలో కాని, ఆరోమాసంలో కాని, సాంవత్సరికంనాడు కాని ఉదకుంభాలను దానంచేయాలి. అవి ప్రేతకు యమమార్గంలో సుఖదాయకాలవుతాయి.

**అహన్యహని దాతవ్యా ఉదకుంభా స్తిలైర్యుతాః ।**
**సులిప్తే భూమిభాగే తు పక్వాన్నజలపూరితాః ॥5॥**

**ప్రేతస్య తత్ర దాతవ్యం భాజనఞ్చ యదృచ్ఛయా ।**
**సుప్రీతస్తేన దత్తేన ప్రేతో యామ్యైః స గచ్ఛతి ॥6॥**

ప్రతిదినం తిలలతో నిండిన ఉదకుంభాలను దానం చేయాలి. బాగా అలికిన భూమిభాగంపై పక్వాన్నం, జలంతో నిండిన పాత్రను ఉంచి, యాదృచ్ఛికంగా (స్వేచ్ఛతో) ప్రేతను ఉద్దేశించి, అక్కడ ఈయాలి. ఆ ఉదకుంభ ప్రదానంవల్ల ప్రేత సంప్రీతుడై యమభటులతో కలసి సుఖంగా పయనిస్తాడు.

**ద్వాదశాహే విశేషేణ ఉదకుంభాన్ ప్రదాపయేత్ ।**
**విధినా తత్ర సంకల్ప్య ఘటాన్ ద్వాదశ సంఖ్యకాన్ ॥7॥**

పన్నెండో రోజున విశేషించి ఉదకుంభాలను ప్రదానం చేయాలి. శాస్త్రోక్తవిధిచే సంకల్పం గావించి, పన్నెండు ఘటాలను ఈయాలి.

**ఏకాపి వర్ధనీ తత్ర పక్వాన్నఫలపూరితా ।**
**విష్ణుముద్దిశ్య దాతవ్యా సంకల్ప్య బ్రాహ్మణే శుభే ॥8॥**

అప్పుడు పక్వాన్న, ఫలాలతోనింపిన "వర్ధని" అనే ప్రత్యేక జలపాత్రను విష్ణుభగవానుని ఉద్దేశించి, సంకల్పించి సచ్చరిత్రుడైన బ్రాహ్మణునికి దానమీయాలి.

**ఏకో వై ధర్మరాజాయ తేన తుష్టేన ముక్తిభాక్ ।**
**చిత్రగుప్తాయ చైకం తు గతస్తత్ర సుఖీ భవేత్ ॥9॥**

ఇంకో దానిని ధర్మరాజుకు ఈయాలి, అతడు సంతోషించి ముక్తిని ఇస్తాడు. మరోదానిని చిత్రగుప్తుని ఉద్దేశించి ఈయాలి. ప్రేత అక్కడకు వెళ్లినపుడు సుఖాన్ని పొందుతాడు.

**షోడశాద్యాః ప్రదాతవ్యా మాషాన్నజలపూరితాః ॥10॥**

మాషాన్నం, జలంతో నిండిన పదహారు పాత్రలను దానంచేయాలి.

**ఉత్క్రాంతి శ్రాద్ధమారభ్య శ్రాద్ధషోడశకస్య తు ।**
**షోడశ బ్రాహ్మణానాన్తు ఏకైకం వినివేదయేత్ ॥11॥**

ఉత్క్రాంతి శ్రాద్ధం మొదలుకొని, పదునారో శ్రాద్ధంవరకు (షోడశివరకు) పదునార్గురు బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి ఒకటి చొప్పును నివేదించాలి.

**ఏకాదశాహాత్ ప్రభృతి దేయో నిత్యం దృఢాహ్వయః ।**
**పక్వాన్న జలపూర్ణో హి యావత్సంవత్సరం దినమ్ ॥12॥**

పదకొండోరోజు మొదలుకొని, సంవత్సరాంతంవరకు ప్రతిదినం, పక్వాన్న జలపూర్ణమైన పెద్దకుండను దానం చేయాలి.

**జలపాత్రాణి వృద్ధాని దత్తాని ఘటకాని చ ।**
**ఏకా వై వర్ధనీ తత్ర తస్యాం పాత్రన్తు వంశజమ్ ॥13॥**

**వస్త్రేణాచ్ఛాదయేత్ తాన్తు పూజయిత్వా సుగంధిభిః ।**
**బ్రాహ్మణేభ్యో విశేషేణ జలపూర్ణాని దాపయేత్ ॥14॥**

పెద్ద పెద్ద జలపాత్రలను, ఘటాలను దానంచేయాలి. అక్కడ ఒక వర్ధనిని ఉంచాలి. అందు పాత్రను ఉంచాలి. అందు పితృదేవతను ఆహ్వానించాలి. సుగంధాదులచే పూజించి దానిని వస్త్రంతో కప్పాలి. విశేషించి బ్రాహ్మణులకు జలపూర్ణపాత్రలను దానితో కలిపి దానం చేయాలి.

**అహన్యహని సంకల్ప్య విధిపూర్వం ఖగేశ్వర ।**
**బ్రాహ్మణాయ కులీనాయ వేదవృత్తయుతాయ చ ॥15॥**

**విద్యావృత్తవతే దేయం మూర్ఖే తన్న కదాచన ।**
**సమర్థో వేదవృత్తాఢ్య స్తారణే తరణేఽపి చ ॥16॥**

ఖగేశ్వరా! సంకల్పం గావించి రోజుకొకటి చొప్పున విధిపూర్వకంగా కులీనుడై, వేదవర్తనం కలిగి విద్యాప్రవృత్తితో కూడుకొన్న బ్రాహ్మణునకు దానమీయాలి. మూర్ఖునకు ఎన్నడూ దానిని ఈయరాదు. వేదప్రవృత్తితో కొనియాడబడేవాడు తాను తరించుటకు, ఇతరులను తరింపజేయుటకు సమర్థుడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే సోదకుంభశ్రాద్ధ నిరూపణం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥37॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో జలపూర్ణపాత్రను దానం చేయుట అనే ముప్పై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టాత్రింశోఽధ్యాయః - ముప్పై ఎనిమిదవ అధ్యాయం

## ఉత్తమలోకగత్యాగతి నిరూపణమ్ - ఉత్తమలోకప్రాప్తి కారణాలు

**తార్క్ష్య ఉవాచ -** గరుడుడు వచించాడు.

**దానతీర్థార్జితం మోక్షం స్వర్గఞ్చ వద మే ప్రభో ।**
**కేన మోక్ష మవాప్నోతి కేన స్వర్గే వసేచ్చిరమ్ ॥1॥**

ప్రభూ! దానతీర్థసేవనాలవల్ల మోక్షం, స్వర్గం లభిస్తాయికదా! దేనివల్ల మోక్షాన్ని పొందుతాడు? దేనివల్ల స్వర్గంలో ఎక్కువకాలం వసిస్తాడు? దానిని చెప్పు.

**కేన గచ్ఛతి తేజస్తు స్వర్లోకాత్ సత్యలోకతః ।**
**మానుష్యం కేన లభతే నరకేషు నిమజ్జతి ॥2॥**

స్వర్లోకంనుండి ఎవడు తేజోలోకం, సత్యలోకం చేరుకొంటాడు? ఎవడు సత్యలోకం నుండి తిరిగి మానుషలోకం పొందుతాడు? తిరిగి నరకంలో ఎందుకు పడతాడు.

**ఏతన్మే వద నిశ్చిత్య భక్తానాం మోక్షదాయక ।**
**బ్రూహి కస్మిన్ మృతే స్వర్గే పునర్జన్మ న విద్యతే ॥3॥**

భక్తులకు మోక్షాన్ని ఇచ్చేవాడా! దీనిని నిశ్చయించి నాకు చెప్పు. చనిపోయి స్వర్గానికి వెళ్లి, తిరిగి జన్మించకుండా ఉండేదెవడు? వివరించు.

**శ్రీవిష్ణురువాచ -** శ్రీమహావిష్ణువు వచించాడు.

**మానుష్యం భారతే వర్షే త్రయోదశసు జాతిషు ॥4॥**

**తత్ ప్రాప్య మ్రియతే క్షేత్రే పునర్జన్మ న విద్యతే ।**
**అయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ అవంతికా ॥5॥**

**పురీ ద్వారవతీ జ్ఞేయా సప్తైతా మోక్షదాయికాః ।**

భారతవర్షంలో మనుష్యజన్మ పదమూడు జాతులుగా ఉంది. ఆ జాతి నరుడు క్షేత్రాన్ని దర్శించి (పొంది) మరణాన్ని పొందినట్లయితే అతడు పునర్జన్మ పొందడు. అయోధ్య, మధుర, మాయానగరం, కాశి, కాంచి, అవంతిక, ద్వారకాపురి, ఆ ఏడునూ మోక్షాన్ని ఇచ్చేవిగా తెలియబడుతున్నాయి.

**సన్న్యస్తమితి యో బ్రూయాత్ ప్రాణైః కంఠగతైరపి ॥6॥**

**మృతో విష్ణుపురం యాతి న పునర్జాయతే క్షితిమ్ ।**

ప్రాణాలు తనగొంతులో కొట్టు మిట్టాడుతున్నప్పుడు ఎవడు “నేను సర్వసంగపరిత్యాగం చేస్తున్నాను” అని గట్టిగా అంటాడో అతడు మరణాన్ని పొందగానే విష్ణులోకానికి వెడతాడు. అతడు భూమియందు మరల పుట్టడు.

**సకృదుచ్చరితం యేన హరిరిత్యక్షరద్వయమ్ ॥7॥**

**బద్ధః పరికరస్తేన మోక్షాయ గమనంప్రతి ।**

ఎవడు మృత్యువేళ ఒక్కసారి “హరి” అనే రెండుఅక్షరాలను గట్టిగా ఉచ్చరిస్తాడో, అతడు మోక్షగమనంకోసమై, నడుం కట్టినట్లే.

**కృష్ణ కృష్ణేతి కృష్ణేతి యో మాం స్మరతి నిత్యశః ॥8॥**

**జలం భిత్వా యథా పద్మం నరకాదుద్ధరామ్యహమ్ ।**

కృష్ణ! కృష్ణ! కృష్ణ! అని నిత్యమూ నన్ను స్మరించిన వానిని నేను నీటినుండి పద్మాన్ని పైకితీసినట్లుగా నరకంనుంచి పైకి తీసుకొని వస్తాను.

**శాలగ్రామశిలా యత్ర యత్ర ద్వారవతీ శిలా ॥9॥**

**ఉభయోః సంగమో యత్ర ముక్తిస్తత్ర న సంశయః ।**
**శాలగ్రామశిలా యత్ర పాపదోషక్షయావహా ॥10॥**

శాలగ్రామశిల, ద్వారవతీశిల రెండునూ కలిసి ఉన్నచోట ముక్తి లభిస్తుంది. సంశయంలేదు. శాలగ్రామశిల ఎక్కడ ఉంటుందో అక్కడ సకలపాపాలు, సమస్తదోషాలు క్షీణించే అవకాశం ఉంటుంది.

**తత్సన్నిధాన మరణాన్ముక్తిర్జంతోః సునిశ్చితా ।**
**రోపణాత్ పాలనాత్ సేకాద్ధ్యానస్పర్శన కీర్తనాత్ ॥**
**తులసీ దహతే పాపం నృణాం జన్మార్జితం ఖగ ॥11॥**

ఆ శాలగ్రామ సమీపంలో మరణించడంవల్ల ప్రాణికి ముక్తి వస్తుందని దృఢంగా నిశ్చయింపబడింది. తులసిమొక్కను నాటడంవల్ల, పెంచడంవల్ల, నీటితో తడపడంవల్ల, ధ్యానించడంవల్ల, తాకడంవల్ల, గుణాలను గానం చేయడంవల్ల, ఖగమా! నరుల జన్మార్జిత పాపాలనన్నింటిని తులసి దహింపజేస్తుంది.

**జ్ఞానహ్రదే సత్యజలే రాగద్వేష మలాపహే ।**
**యః స్నాతో మానసే తీర్థే న స లిప్యేత పాతకైః ॥12॥**

జ్ఞానమనే హ్రదంలో, రాగద్వేషమాలిన్యాలను ధ్వంసంజేసే సత్యం అనే జలంలో, మానస తీర్థంలో స్నానం ఆచరించినవాడు పాపాలలో తగుల్కొనడు.

**న కాష్ఠే విద్యతే దేవో న శిలాయాం కదాచన ।**
**భావే హి విద్యతే దేవ స్తస్మాద్భావం సమాచరేత్ ॥13॥**

దేవుడు ఎన్నడూ దారువునందూ ఉండడు, శిలయందూ ఉండడు, భావమందు మాత్రమే దేవుడు ఉంటాడు. అందువల్ల భావాన్ని (ఆత్మను) చక్కగా ఉంచుకోవాలి.

**ప్రాతః ప్రాతః ప్రపశ్యంతి నర్మదాం మత్స్యఘాతినః ।**
**న తే శివపురీం యాంతి చిత్తవృత్తి ర్గరీయసీ ॥14॥**

ప్రతిప్రాతఃకాలం చేపలను పట్టే జాలరులు నర్మదా ప్రవాహాన్ని చూస్తూనేఉంటారు. అయినా వారు శివపురిని చేరుకోలేకపోతున్నారు. అందువల్ల చిత్తవృత్తి అన్నింటికన్న గొప్పది.

**యాదృక్ చిత్తప్రతీతిః స్యాత్ తాదృక్ కర్మఫలం నృణామ్ ।**
**పరలోక గతిస్తాదృక్ సూచీ సూత్రవిచారవత్ ॥15॥**

ఎటువంటి చిత్తప్రవృత్తి ఉంటుందో, అటువంటి కర్మఫలమే నరులకు సంభవిస్తుంది. అటువంటి పరలోకగమనమే సంప్రవర్తిస్తుంది. అది సూది, దారం వంటి విచారణకలది.

**బ్రాహ్మణార్థే గవార్థే చ స్త్రీణాం బాలవధేషు చ ।**
**ప్రాణత్యాగపరో యస్తు స వై మోక్షమవాప్నుయాత్ ॥16॥**

బ్రాహ్మణునికోసమై, గోవుకోసమై, స్త్రీలకోసమై, బాలకులకోసమై, వారిని హత్యచేస్తూ ఉంటే అడ్డుకోబోయి, ప్రాణాలుపోగొట్టుకున్నవాడు మోక్షాన్ని పొందుతాడు.

**అనాశకే మృతో యస్తు స వై మోక్షమవాప్నుయాత్ ।**
**అనాశకే మృతో యస్తు స ముక్తః సర్వబంధనైః ॥17॥**

అనశనం అనే వ్రతంచేస్తూ ఎవడు మరణించినవాడు మోక్షం పొందుతాడు. నిరాహారవ్రతంలో మరణిస్తే సర్వబంధనాలనుండి విముక్తుడవుతాడు.

**దత్త్వా దానాని విప్రేభ్య స్తతో మోక్షమవాప్నుయాత్ ।**
**ఏతే వై మోక్షమార్గాశ్చ స్వర్గమార్గా స్తథైవ చ ॥18॥**

విప్రులకు దానాలుచేస్తే అతడు మోక్షం పొందుతాడు. ఇవన్నీ మోక్షమార్గాలు, అలాగే స్వర్గమార్గాలుకూడ.

**గోగ్రహే దేశవిధ్వంసే మరణం రణతీర్థయోః ।**
**ఉత్తమాధమ మధ్యస్య బాధ్యమానస్య దేహినః ॥**
**ఆత్మానం తత్ర సంత్యజ్య స్వర్గవాసం లభేచ్చిరమ్ ॥19॥**

గోవును బంధించేటప్పుడు, దేశాన్ని విధ్వంసంచేసేటప్పుడు, రణమందు, తీర్థసేవనమందు, ఉత్తమమధ్యమాధమజీవులు బాధ పొందింపబడుతూ ఉండగా, తన దేహాన్ని విడిచిపెట్టేవాడు చాలాకాలం స్వర్గలోకవాసం పొందుతాడు.

**జీవితం మరణఞ్చైవ ద్వయం శిక్షేత పండితః ।**
**జీవితం దాన భోగాభ్యాం మరణం రణతీర్థయోః ॥20॥**

జీవితాన్ని, మరణాన్ని, ఈ రెండింటిని పండితుడు బోధపరచుకొంటూ ఉంటాడు, జీవితాన్ని దానభోగాలచేత, సంగ్రామ తీర్థక్షేత్రాలలో మరణాన్ని సార్థకం చేసుకొంటాడు.

**హరిక్షేత్రే కురుక్షేత్రే భృగుక్షేత్రే తథైవ చ ।**
**ప్రభాసే శ్రీస్థలే చైవ అర్బుదే చ త్రిపుష్కరే ॥21॥**

**భూతేశ్వరే మృతో యస్తు స్వర్గే వసతి మానవః ।**
**బ్రహ్మణే దివసం యావత్ తతః పతతి భూతలే ॥22॥**

హరిక్షేత్రమందు, కురుక్షేత్రమందు, భృగుక్షేత్రమందు, అలాగే ప్రభాసక్షేత్రమందు, శ్రీస్థలమందు, అర్బుదక్షేత్ర మందు, త్రిపుష్కరమందు, భూతేశ్వరమందు మరణించినవాడు, స్వర్గమందు వసిస్తాడు, బ్రహ్మదివసకాలపర్యంతం అక్కడఉండి, పిమ్మట పుడమిపై పుడతాడు.

**వర్షవృత్తిన్తు యో దద్యాద్ బ్రాహ్మణే దోషవర్జితే ।**
**సర్వం కులం సముద్ధృత్య స్వర్గలోకే మహీయతే ॥23॥**

ఏ దోషములేని బ్రాహ్మణునికి ఒక సంవత్సరంపాటు జీవననిర్వాహకానికి కావలసినదానిని ఏర్పాటు చేసినవాడు తన కులాన్ని అంతనూ ఉద్ధరించి స్వర్గలోకంలో గొప్పగా బ్రతుకుతాడు.

**కన్యాం వివాహయేద్యస్తు బ్రాహ్మణం వేదపారగమ్ ।**
**ఇంద్రలోకే వసేత్ సోఽపి స్వకులైః పరివేష్టితః ॥24॥**

ఒక కన్యను వేదపారగుడైన బ్రాహ్మణునికిచ్చి వివాహం చేయించినవాడు తన కులంవారితోను, పరివారంతోను కూడుకొని ఇంద్రలోకంలో నివసించగలడు.

**మహాదానాని దత్త్వా చ నరస్తత్ఫలమాప్నుయాత్ ।**
**వాపీకూప తటాగానా మారామసురసద్మనామ్ ॥25॥**

**జీర్ణోద్ధారం ప్రకుర్వాణః పూర్వకర్తుః ఫలం లభేత్ ।**
**జీర్ణోద్ధారేణ వా తేషాం తత్పుణ్యం ద్విగుణం భవేత్ ॥26॥**

మహాదానాలను ఇచ్చిన నరుడై నా ఆ ఫలాన్ని పొందుతాడు, వాపీకూప తటాగాదులను, దేవతామందిరాలను (నిర్మించేవాడు) పునర్నిర్మాణంచేసేవాడు, జీర్ణోద్ధారణచేసేవాడు పూర్వంచేసిన వారియొక్క ఫలితాన్ని పొందుతాడు. జీర్ణోద్ధారణవల్ల పై జెప్పిన వాటికి రెట్టింపు పుణ్యఫలం వస్తుంది.

**శీతవాతాతపహరమపి పర్ణకుటీరకమ్ ।**
**కృత్వా విప్రాయ విదుషే ప్రదదాతి కుటుంబినే ॥27॥**

**తిస్రః కోట్యర్ధ కోటీ చ నరః స్వర్గే మహీయతే ॥28॥**

శీత వాతాతప బాధలను హరించగల ఒక పర్ణకుటీరమైనా నిర్మించి కుటుంబియై వేదవిద్వాంసుడైన విప్రునకు దానమిచ్చినవాడు (నరుడు) మూడున్నర కోట్ల సంవత్సరాలపాటు స్వర్గంలో సుఖిస్తాడు.

**యా స్త్రీ సవర్ణా సంశుద్ధా మృతం పతి మనువ్రజేత్ ।**
**సా మృతా స్వర్గమాప్నోతి వర్షాణాం రోమసంఖ్యయా ॥29॥**

సవర్ణురాలైన, పరమపరిశుద్ధురాలైన స్త్రీ చనిపోయిన తనపతిని అనుగమిస్తే, ఆమె చనిపోయి శరీరంపై ఎన్నిరోమాలు ఉన్నాయో, అన్ని సంవత్సరాలపాటు స్వర్గాన్ని పొందుతుంది.

**పుత్ర పౌత్రాదికం త్యక్త్వా స్వపతిం యానుగచ్ఛతి ।**
**స్వర్గం లభేతాం తౌచోభౌ దివ్య స్త్రీభిరలంకృతౌ ॥30॥**

పుత్ర పౌత్రాదికములను విడిచి ఏ స్త్రీ తన భర్తను అనుగమిస్తుందో, ఆ దంపతులిరువురు దేవతా స్త్రీలచే సత్కరింపబడి స్వర్గలోకాన్ని పొందుతారు.

**కృత్వా పాపాన్యనేకాని భర్తృద్రోహమతిః సదా ।**
**ప్రక్షాళయతి సర్వాణి యా స్వం పతిమనువ్రజేత్ ॥31॥**

అనేక పాపాలను చేసినా, ఎల్లప్పుడూ భర్తపై ద్రోహబుద్ధి కలిగినదయినా, తన భర్తను అనుగమించిన, ఆమె వాటినన్నింటిని పూర్తిగా కడిగివేసుకుంటుంది.

**మహాపాపసమాచారో భర్తా చేద్దుష్కృతీ భవేత్ ।**
**తస్యాప్యనువ్రతా నారీ నాశయేత్ సర్వకిల్బిషమ్ ॥32॥**

తనభర్త ఎన్ని మహాపాపాలుచేసినా, ఎంత దుర్మార్గుడయినా, అతనిని అనుసరించిన స్త్రీ, అతని సర్వకిల్బిషాలను నశింపజేస్తుంది.

**గ్రాసమాత్రం నియమతో నిత్యదానం కరోతి యః ।**
**చతుశ్చామరసంయుక్తవిమానేనాధిగచ్ఛతి ॥33॥**

నిత్యమూ ఒక దిన గ్రాసం నియమంతో దానంచేసినవాడు నాలుగు చామరాలతో వెలుగొందే దివ్యవిమానం అధిరోహించి స్వర్గానికి వెడతాడు.

**యత్ కృతం హి మనుష్యేణ పాపమామరణాన్తికమ్ ।**
**తత్సర్వం నాశమాయాతి వర్షవృత్తిప్రదానతః ॥34॥**

ఎవరికైనా సంవత్సరగ్రాసం దానం ఇస్తే, చనిపోయేవరకు మనుష్యుడు ఏ పాపం చేసినాడో, అదంతా వినాశనాన్ని పొందుతుంది.

**భూతం భవ్యం భవిష్యచ్చ పాపం జన్మత్రయార్జితమ్ ।**
**ప్రక్షాళయతి తత్సర్వం విప్రకన్యోపనాయనాత్ ॥35॥**

బ్రాహ్మణకన్యకు వివాహం చేయించడంవల్ల భూత వర్తమాన భవిష్యాలలో, మూడు జన్మలలో సంపాదింపబడిన పాపమంతా పూర్తిగా కడగబడిపోతుంది.

**దశకూపసమా వాపీ దశవాపీసమం సరః ।**
**సరోభిర్దశభి స్తుల్యా యా ప్రపా నిర్జలే వనే ॥36॥**

పది నూతులలో సమానమైనది ఒకబావి, పది బావులతో సమానమైనది ఒక సరస్సు, పది సరస్సులతో సమానమైనది నీరులేని అడవిలో ఒక చలిపందిరి ఏర్పాటు చేయడం.

**యా వాపీ నిర్జలే దేశే యద్దానం నిర్ధనే ద్విజే ।**
**ప్రాణినాం యో దయాం ధత్తే స భవేన్నాకనాయకః ॥37॥**

నిర్జలదేశంలో వాపిని నిర్మించినవాడు, నిర్ధనుడైన ద్విజునకు దానంచేసినవాడు, ప్రాణులపై దయను ప్రదర్శించినవాడు, ఉత్తమగతినిపొంది స్వర్గలోకపు నాయకుడవుతాడు.

**ఏవమాదిభిరన్యైశ్చ సుకృతైః స్వర్గభాగ్భవేత్ ।**
**స తత్ సర్వం ఫలంప్రాప్య ప్రతిష్ఠాం పరమాం లభేత్ ॥38॥**

ఈ మున్నగు ఇతర పుణ్యకర్మలవల్ల స్వర్గలోకవాసి కాగలడు. అతడు ఆ ఫలాన్ని అంతాపొంది, గొప్పదైన ప్రతిష్ఠను అందుకొంటాడు.

**ఫల్గుకార్యం పరిత్యజ్య సతతం ధర్మవాన్ భవేత్ ।**
**దానం దమో దయా చేతి సారమేతత్ త్రయం భువి ॥39॥**

**దానం సాధోర్దరిద్రస్య శూన్యలింగస్య పూజనమ్ ।**
**అనాథప్రేత సంస్కారః కోటియజ్ఞ ఫలప్రదః ॥40॥**

సారంలేని పనిని విడిచిపెట్టి ఎల్లప్పుడు ధర్మాత్ముడై ఉండాలి. భూమియందు దానం, దమం, దయ, ఈ మూడును స్థిరమైనవి. సాధువైన దరిద్రునికి చేసేదానం, శూన్యజీర్ణశివాలయోద్ధరణం, అనాథప్రేత సంస్కారం, కోటియజ్ఞాలు చేసిన ఫలితాన్ని ఇస్తాయి.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ఉత్తమలోక గత్యాగతి మోక్షమానుష్య హేతునిరూపణం నామాష్టాత్రింశత్తమోఽధ్యాయః ॥38॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఉత్తమలోకప్రాప్తికారణాలు అనే ముప్పై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## **ఏకోనచత్వారింశోఽధ్యాయః** – ముప్పై తొమ్మిదవ అధ్యాయం

## **సూతకకాలాది నిరూపణమ్** – సూతకకాలనిరూపణం

**తార్క్ష్య ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**సూతకానాం విధిం బ్రూహి దయాం కృత్వా మయి ప్రభో ।**
**వివేకాయ హి చిత్తస్య మానవానాం హితాయ చ ॥1॥**

ప్రభూ! మానవుల మేలుకోసమై, చిత్తవివేకం కొరకై, నాయందు దయను ఉంచి సూతకులాచరించే విధి గురించి వివరించవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**మృతే జన్మని పక్షీంద్ర సూతకం స్యాచ్చతుర్విధమ్ ।**
**చతుర్ణామపి వర్ణానాం సామాన్యేన వివర్జితమ్ ॥2॥**

పక్షీంద్రా! జన్మ నుండి మృతిపొందిన పిమ్మట వచ్చే సూతకం నాలుగు విధాలుగా ఉంటుంది. నాలుగు వర్ణాలవారికి సామాన్యంగా విడిచిపెట్టవలసిన విధి ఇది.

**ఉభయత్ర దశాహాని కులస్యాన్నం వివర్జయేత్ ।**
**దానం ప్రతిగ్రహో హోమః స్వాధ్యాయశ్చ నివర్తతే ॥3॥**

ఆ పది రోజులు రెండువేళల కులాన్నాన్ని విసర్జించాలి, దానం, ప్రతిగ్రహం, హోమం, స్వాధ్యాయం పనికిరావు.

**దేశం కాలం తథాత్మానం ద్రవ్యం ద్రవ్యప్రయాజనమ్ ।**
**ఉపపత్తి మవస్థాం చ జ్ఞాత్వా కర్మ సమాచరేత్ ॥4॥**

దేశం, కాలం, తాను, ద్రవ్యం, ద్రవ్యప్రయాజనం, ఉపపత్తి, అవస్థ వీటిని బాగా తెలుసుకొని కర్మను ఆచరించాలి.

**గుహావహ్నిప్రవేశే చ దేశాంతరమృతేషు చ ।**
**స్నానం సచేలం కర్తవ్యం సద్యః శౌచం విధీయతే ॥5॥**

గుహాప్రవేశంలో, వహ్నిప్రవేశంలో, దేశాంతరాలలో మరణించినవారి విషయంలో సచేల స్నానం చేయవలసింది, వారికి వెంటనే శౌచం విధింపబడింది.

**ఆమగర్భాశ్చ యే జీవా యే చ గర్భాద్వినిఃసృతాః ।**
**న తేషా మగ్నిసంస్కారో నాశౌచం నోదకక్రియా ॥6॥**

ఆమగర్భులు (గర్భస్రావంఅయినవారు), గర్భంనుండి బయటపడి మరణించినవారు – వారికి అగ్నిసంస్కారంలేదు. ఉదకక్రియా లేదు. వారి విషయంలో అశౌచం ఉండదు.

**శిల్పినః కారవో వైద్యా దాసీదాసాస్తథైవ చ ।**
**రాజానః శ్రోత్రియాశ్చైవ సద్యః శౌచాః ప్రకీర్తితాః ॥7॥**

శిల్పులు, కౌరవులు(కార్యనిపుణులు), వైద్యులు, దాసదాసీ జనాలు, రాజులు, శ్రోత్రియులు వెంటనే శౌచం పొందేవారుగా పేర్కొనబడినారు.

**సత్రీ చ (వ్రతీ) మంత్రపూతశ్చ ఆహితాగ్నిర్నృపస్తథా ।**
**ఏతేషాం సూతకం నాస్తి యస్య చేచ్ఛంతి పార్థివాః ॥8॥**

సత్రయాగంచేసేవాడు (వ్రతం ఆచరించేవాడు), మంత్రపవిత్రుడు, ఆహితాగ్ని, రాజు – రాజులు ఎవరినయితే కోరుకొంటారో వారికి సూతకం లేదు.

**ప్రసవే చ సపిండానాం న కుర్యాత్ సంకరం ద్విజః ।**
**దశాహాచ్ఛుధ్యతే మాతా అవగాహ్య పితా శుచిః ॥9॥**

ప్రసవమందు పిండంమాత్రం బయటపడితే ద్విజుడు సంకరం చేయరాదు, అప్పుడు తల్లికి పదిరోజులు అశౌచం ఉంటుంది. తండ్రికి శౌచం స్నానంవల్లనే లభిస్తుంది.

**వివాహోత్సవ యజ్ఞేషు అంతరా మృతసూచకే ।**
**పూర్వసంకల్పితం విత్తం భోజ్యం తన్మనురబ్రవీత్ ॥10॥**

వివాహం, ఉత్సవం, యజ్ఞం మధ్యలో మృతవిషయం సూచింపబడితే, పూర్వసంకల్పానుసారంగా విత్తం, భోజ్యం అనుభవించవచ్చని మనువు చెప్పియున్నాడు.

**సర్వేషామేవమాశౌచం మాతాపిత్రోస్తు సూతకమ్ ।**
**సూతకం మాతురేవ స్యాదుపస్పృశ్య పితా శుచిః ॥11॥**

పైవారి విషయంలో అందరికి అశౌచం ఉంటుంది. తల్లికి తండ్రికి సూతకం ఉంటుంది. తల్లికి మాత్రమే సూతకం. తండ్రికి స్నానంతో శుచిత్వం,

**అంతర్దశాహే స్యాతాశ్చేత్ పునర్మరణ జన్మనీ ।**
**తావత్ స్యాదశుచిర్విప్రో యావత్ తత్ స్యాదనిర్దశమ్ ॥12॥**

పది రోజుల మధ్యలో మళ్లీ మరణం, జన్మసంబంధించిన అశౌచం వస్తే అంతవరకే అశుచిత్వం, విప్రుడయితే మాత్రం ఆ పదిరోజుల నియమం ఉండదు.

**ఉదితం నియమే దానే ఆర్తే విప్రే నివేదయేత్ ।**
**తథైవ ఋషిభిఃప్రోక్తం యథాకాలం న దుష్యతి ॥13॥**

ఆకలితోఉండే ఆర్తుడైన విప్రునకు నియమంగా దానం నివేదించాలి, అలాగే ఋషులచే చెప్పబడింది. కాలాన్ని అనుసరించి అది దోషంకాదు.

**మృన్మయేన తు పాత్రేణ తిలై ర్మిశ్రజలైః సహ ।**
**మృత్తికయా తథాన్తే చ నరః స్నాత్వా శుచిర్భవేత్ ॥14॥**

తిలలతో కలిపిన నీటితో నిండిన మట్టిపాత్రతోను అలాగే చివరలో మృత్తికతోను స్నానంచేస్తే నరుడు శుచి అవుతాడు.

**దానం పరిషదే దద్యాత్ సువర్ణం గోవృషం ద్విజే ।**
**క్షత్రియో ద్విగుణం చైవ వైశ్యస్తు త్రిగుణం తథా ॥15॥**

**చతుర్గుణం తు శూద్రేణ దాతవ్యం బ్రాహ్మణే ధనమ్ ।**
**ఏవఞ్చానుక్రమేణైవ చాతుర్వర్ణ్యం విశుద్ధ్యతి ॥16॥**

(విప్రుడు) దానాన్ని పరిషత్తును ఉద్దేశించి ఈయాలి, సువర్ణాన్ని, గోవృషాలను ద్విజునికి ఈయాలి. క్షత్రియుడు రెండు రెట్లు, వైశ్యుడు మూడు రెట్లు, శూద్రుడు నాలుగు రెట్లు బ్రాహ్మణునికి ధనం ఈయాలి. ఈ క్రమపద్ధతితో నాలుగు వర్ణాలు విశుద్ధిని పొందుతాయి.

**సప్తాష్టమాంతరై శీర్ణే గృహ్యాసంస్కారవర్జితే ।**
**అహస్తు సూతకం తస్య త్వబ్దానాం సంఖ్యయా స్మృతమ్ ॥17॥**

గృహ్యాసంస్కారం కాకుండా, ఏడు ఎనిమిది ఏండ్లవయస్సులో మరణిస్తే ఒక (రోజు) పగలు సూతకం ఉంటుంది. అతని వయస్సును సంఖ్యనుబట్టి సంవత్సరాలు లెక్కించుకోవాలి.

**బ్రాహ్మణార్థే విపన్నా యే నారీణాం గోగ్రహేషు చ ।**
**ఆహవేషు విపన్నానా మేకరాత్ర మశౌచకమ్ ॥18॥**

బ్రాహ్మణునికోసమై మరణించినా, స్త్రీలను రక్షించడంకోసమై, గోవులను కాపాడడంకోసమై, యుద్ధాలలో మరణించినా, ఒకరాత్రి మాత్రమే అశౌచం ఉంటుంది.

**న తేషామశుభం కించిద్విప్రేణ సహకారిణా ।**
**జలావగాహనాత్తేషాం సద్యః శుద్ధిరుదాహృతా ॥20॥**

వారికి అశుభం ఏకొంచెం కలగదు. విప్రునకు సహకారం చేసినవారికి మంచినీటితో స్నానంచేస్తే చాలు వెంటనే శుద్ధి చెప్పబడింది.

**వినివృత్తా యదా శూద్రా ఉదకాంత ముపస్థితాః ।**
**తదా విప్రేణ ద్రష్టవ్యా ఇతి వేదవిదో విదుః ॥21॥**

స్నానం పూర్తిఅయిన వెంటనే సూతకం నుండి శుద్ధులైన శూద్రులు అప్పుడు విప్రులచే సంవీక్షింపబడాలని వేదవిదులు చెబుతారు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే సూతక కాలాది నిరూపణం నామైకోనచత్వారింశోఽధ్యాయః ॥39॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో సూతకకాలనిరూపణం అనే ముప్పై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **చత్వారింశోఽధ్యాయః** – నలభైయవ అధ్యాయం

## **అపమృత్యుసుఖదుఃఖాది నిరూపణమ్** – అపమృత్యుప్రస్తావం

**తార్క్ష్య ఉవాచ** – గరుడుడు వచించాడు.

**భగవన్బ్రాహ్మణాః కేచిదపమృత్యువశం గతాః ।**
**కథం తేషాం భవేన్మార్గః కిం స్థానం కా గతిర్భవేత్ ॥1॥**

స్వామీ! కొంతమంది బ్రాహ్మణులు అపమృత్యువుబారి పడుతున్నారు, వారికి ఎటువంటి మార్గం లభిస్తుంది? వారికి గలిగే స్థానం ఎటువంటిది? ఏ గతి వారికి చేకూరుతుంది?

**కిం చ యుక్తం భవేత్తేషాం విధానం వాపి కీదృశమ్ ।**
**తదహం శ్రోతుమిచ్ఛామి బ్రూహి మే మధుసూదన ॥2॥**

వారికి ఏది యుక్తం? వారి విషయంలో ఎటువంటి విధానం అవలంబించాలి? మధుసూదనా ! దానిని నేను వినాలని కోరుకొంటున్నాను. నాకు వివరించి చెప్పు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ప్రేతీభూతద్విజాతీనాం సంభూతే మృత్యువైకృతే ।**
**తేషాం మార్గ గతిస్థానం విధానం కథయామ్యహమ్ ॥3॥**

ద్విజాతులకు ప్రేతత్వం కలగడంవల్ల, అపమృత్యువు సంభవించడంవల్ల కలిగే మార్గం, గతి, స్థానం, విధానం గురించి నేను చెబుతున్నాను.

**శృణు తార్క్ష్య పరం గోప్యం జాతే దుర్మరణే సతి ।**
**లంఘనైర్యే మృతా విప్రా దంష్ట్రిభిశ్చాభిఘాతితాః ॥4॥**

**కంఠగ్రాహ విమగ్నానాం క్షీణానాం తుండఘాతినామ్ ।**
**విషాగ్ని వృష విప్రేభ్యో విషూచ్యాచాత్మఘాతకాః ॥5॥**

**పతనోద్బంధనజలైర్మృతానాం శృణు సంస్థితిమ్ ।**
**యాంతి తే నరకే ఘోరే యే చ మ్లేచ్ఛాదిభిర్హతాః ॥6॥**

గరుడా! పరమరహస్యం విను, దుర్మరణం సంభవించగా, ప్రమాదాలలో (లంఘనాలలో) ఎవరైనా చనిపోయినా, విప్రులు వాడికోరలుగల్గిన క్రూరమృగాలచే హింసింపబడి చనిపోయినా, కుత్తుకచుట్టూ పట్టుకొని హింసించే మత్స్యాదులచే పీడింపబడుతూ, తుండాలచే కొట్టబడుతూ క్షీణదశపొందినా, విషం, అగ్ని, వృషం, విప్రశాపం, విషూచి, ఆత్మహత్య, పడిపోవడం, బంధింపబడడం, నీటి ప్రమాదాలవల్ల చనిపోయినా వారి స్థితిని విను. ఎవరయితే మ్లేచ్ఛులు మున్నగువారివల్ల మరణిస్తారో, వారు ఘోరమైన నరకాన్ని పొందుతారు.

**శ్వశృగాలాది సంస్పృష్టా అదగ్ధాః కృమి సంకులాః ।**
**ఉల్లంఘితా మృతా యే చ మహారోగైశ్చ పీడితాః ॥7॥**

**అభిశస్తాస్తథా వ్యంగా యే చ పాపాన్నపోషితాః ।**
**చండాలాదుదకాత్సర్పా ద్బ్రాహ్మణాద్వైద్యుతాగ్నితః ॥8॥**

**దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ వృక్షాది పతనాన్మృతాః ।**
**ఉదక్యా సూతకీ శూద్రా రజకీ సంగదూషితాః ॥9॥**

**తేన పాపేన నరకాన్ముక్తాః ప్రేతత్వభాగినః ।**
**న తేషాం కారయేద్దాహం సూతకం నోదక క్రియామ్ ॥10॥**

**న విధానం మృతాద్యం చ న కుర్యాదౌర్ధ్వదైహికమ్ ।**
**తేషాం తార్క్ష్య ప్రకుర్వీత నారాయణబలి క్రియామ్ ॥11॥**

గరుడా! కుక్క, నక్క మున్నగువాటిచే పీకబడేవారు, దహనసంస్కారం లేనివారు, క్రిములచే హింసింపబడేవారు, దాటుతున్నప్పుడు మరణించేవారు, మహారోగాలచే పీడింపబడేవారు, కఠినోక్తులచే పీడింపబడేవారు, అంగవైకల్యం పొందినవారు, పాపాన్నాలచే పోషింపబడేవారు, చండాలుడు, ఉదకం, సర్పం, బ్రహ్మరాక్షసుడు, పిడుగు, అగ్నివల్ల ఆపదపొందినవారు. దంష్ట్రలచేత, పశువులచేత, చెట్లమీదనుండి క్రిందకు పడిపోవడంచేత, బహిష్ఠురాలు, సూతకి, శూద్ర, రజకి, వీరి సంగమంవల్ల దూషింపబడేవారు, ఆ పాపంవల్ల నరకంనుండి బయటపడిన వెంటనే ప్రేతత్వాన్ని పొందుతారు. దహనసంస్కారం, సూతకక్రియ, ఉదకక్రియ మృతాది క్రియా విధానం, ఔర్ధ్వదైహికకర్మ జరగని వారి విషయంలో నారాయణబలిక్రియ శ్రద్ధతో నిర్వహింపబడాలి.

**సర్వలోక హితార్థాయ శృణు పాపభయాపహామ్ ।**
**షణ్మాసం బ్రాహ్మణే దాహ స్త్రిమాసం క్షత్రియే మతః ॥12॥**

**సార్ధమాసంతు వైశ్యస్య సద్యః శూద్రే విధీయతే ।**

సర్వజన హితంకోసమై పాపభయాన్ని తొలగించే నారాయణబలిగురించి విను. పుత్తలవిధి, దాహవిధి, తరువాత బ్రాహ్మణుని విషయంలో ఆరు నెలలు, క్షత్రియుని విషయంలో మూడు నెలలు, వైశ్యుని విషయంలో ఒకనెలపదునైదు రోజులు, శూద్రుని విషయంలో వెంటనే గడువుగా విధింపబడింది.

**గంగాయాం యమునాయాఞ్చ నైమిషే పుష్కరేఽథ చ ॥13॥**

**తటాగే జలపూర్ణే వా హ్రదే వా విమలోదకే ।**
**వాప్యాం కూపే గవాం గోష్ఠే గృహే వా ప్రతిమాలయే ॥14॥**

**కృష్ణాగ్రే కారయేద్విప్ర బలిం నారాయణాహ్వయమ్ ।**
**ప్రేతాయ తర్పణం కార్యం మంత్రైః పౌరాణవైదికైః ॥15॥**

గంగయందు కాని, యమునయందు కాని, నైమిషమందు కాని, పుష్కరమందు కాని, నీటితోనిండిన చెరువువద్ద కాని, స్వచ్ఛమైన జలపూరితమగు హ్రదంవద్ద కాని, బావివద్ద కాని, నూతివద్ద కాని, గోశాలలో కాని, ఇంటివద్ద కాని, దేవతామందిరంవద్ద కాని, విప్రా! విష్ణువు ఎదురుగా నారాయణమనే పేరుకల ఈ బలిని చేయించాలి, వేదపౌరాణికులద్వారా మంత్రాలతో ప్రేతకు ముందు తర్పణం ఈయాలి.

**సర్వౌషధ్యక్షతై ర్మిశ్రై ర్విష్ణుముద్దిశ్య తర్పయేత్ ।**
**కార్యం పురుషసూక్తేన మంత్రైర్వా వైష్ణవైరపి ॥16॥**

**దక్షిణాభిముఖో భూత్వా ప్రేతం విష్ణురితి స్మరేత్ ।**

సమస్తములైన ఓషధులతోను, అక్షతలతోను కలిపి విష్ణువునుద్దేశించి పిమ్మట తర్పణం ఈయాలి. దక్షిణందిక్కుగా తిరిగి ప్రేతను విష్ణువుగా స్మరించాలి, పురుషసూక్తంచే గాని, వైష్ణవమంత్రాలచే గాని ధ్యానించాలి.

**అనాది నిధనో దేవః శంఖచక్రగదాధరః ॥17॥**

**అవ్యయః పుండరీకాక్షః ప్రేతమోక్షప్రదో భవేత్ ।**
**తర్పణస్యావసానే చ వీతరాగో విమత్సరః ॥18॥**

“అనాదినిధనుడై, శంఖచక్రగదాధరుడై, అవ్యయుడై, పుండరీకాక్షుడైన నారాయణదేవుడు ప్రేతకు విముక్తినిచ్చేవాడు కావాలి” అని ధ్యానించాలి. తర్పణమైన పిమ్మట రాగం, అసూయ లేనివాడై,

**జితేంద్రియమనా భూత్వా శుచిష్మాన్ ధర్మతత్పరః ।**
**దానధర్మరతః శాంతః ప్రణమ్య వాగ్యతః శుచిః ॥19॥**

**యజమానో భవేత్తత్ర శుచి ర్బంధుసమన్వితః ।**
**భక్త్యా తత్ర ప్రకుర్వీత శ్రాద్ధాన్యేకాదశైవ తు ॥20॥**

జితేంద్రియుడై, మనస్వియై, పవిత్రుడై, ధర్మతత్పరుడై, దానధర్మనిరతుడై, శాంతుడై, వాఙ్నియమం కలవాడై, శుచియై, పరమపావనుడై, బంధువులతో కూడుకొన్నవాడై, యజమానుడు నమస్కారంచేస్తూ వినమ్రుడై ఉండాలి. అక్కడనే భక్తితో ఏకాదశ శ్రాద్ధాలను పెట్టాలి.

**సర్వకర్మ విపాకేన ఏకైకాగ్రే సమాహితః ।**
**తోయవ్రీహి యవాన్ షష్ట్యా గోధూమాన్ ప్రియంగుకాన్ ॥21॥**

**హవిష్యాన్నం శుభం ముద్రాం ఛత్రోష్ణీషే చ చేలకమ్ ।**
**దాపయేత్సర్వ సస్యాని క్షీర క్షౌద్రయుతాని చ ॥22॥**

తన కర్మ పరిపాకాన్ని అనుసరించి ఏకాగ్ర మనస్కుడై శ్రద్ధాన్వితుడై శ్రాద్ధాలు పెట్టాలి. మాగాణిలో పండే వ్రీహిధాన్యాన్ని, యవలను, అరవై రోజులకు పండేధాన్యాన్ని, గోధూమాలను, ప్రియంగుకాలను, పవిత్రహవిష్యాన్నాన్ని, శుభముద్రికను, గొడుగును, తలపాగాను, చేలాన్ని, సర్వసస్యాలను, పాలు, తేనెతో కలిపి దానమీయాలి.

**వస్త్రోపానహసంయుక్తం దద్యాదష్టవిధం పదమ్ ।**
**దాపయేత్సర్వ విప్రేభ్యో న కుర్యాత్ పంక్తిబంధనమ్ ॥23॥**

వస్త్రాలు, చెప్పులతో కలిపి ఎనిమిది విధాలైన పదదానాలను చేయాలి. పంక్తి భేదంలేకుండా బ్రాహ్మణులకు అందరికి ఈయాలి.

**భూమౌ స్థితేషు పిండేషు గంధపుష్పాక్షతాన్వితమ్ ।**
**శంఖపాత్రే తథా తామ్రే తర్పణఞ్చ పృథక్ పృథక్ ॥24॥**

నేలపై పిండప్రదానం పూర్తిఅయిన తరువాత, శంఖపాత్రతో, రాగిగిన్నెతో, గంధం, పుష్పాలు, అక్షతలతో కలిపి వేరు వేరుగా తర్పణాలు ఈయాలి.

**ధ్యానధారణసంయుక్తో జానుభ్యామవనిం గతః ।**
**దాతవ్యం సర్వవిప్రేభ్యో వేదశాస్త్ర విధానతః ॥25॥**

ధ్యానధారణలతో మనస్సును ఏకాగ్రంచేసి, మోకాళ్లపై నేలమీద నిలబడి, వేదశాస్త్రవిధానంచే సమస్త బ్రాహ్మణులకు దానం ఈయాలి.

**ఋచా వై దాపయే దర్ఘ్య మేకోద్దిష్టే పృథక్ పృథక్ ।**
**ఆపో దేవీర్మధుమతీ రాదిపీఠే ప్రకల్పితమ్ ॥26॥**

ఏకోద్దిష్ట శ్రాద్ధాలలో ఋగ్వేదమంత్రంతో వేరువేరుగా పదకొండు పిండాలకు అర్ఘ్యాలు ఈయాలి. "ఆపోదేవీర్మధుమతీః" అనే మంత్రంతో మొదటిపిండానికి అర్ఘ్యం ఈయాలి.

**ఉపయామ గృహీతోఽసి ద్వితీయేఽర్ఘ్యం నివేదయేత్ ।**
**యేనాపావక చక్షుషా తృతీయే చ సకల్పితమ్ ॥27॥**

"ఉపయామ గృహీతోఽసి" అనే మంత్రంతో రెండవ పిండానికి అర్ఘ్యం నివేదించాలి. "యేనాపావకచక్షుషా" అనే మంత్రంతో మూడవ పిండానికి అర్ఘ్యం ఈయాలి.

**యే దేవాసశ్చతుర్థే తు సముద్రం గచ్ఛ పంచమే ।**
**అగ్నిర్జ్యోతి స్తథా షష్ఠే హిరణ్యగర్భః సప్తమే ॥28॥**
**యమాయత్వాష్టమే జ్ఞేయం యజ్ఞాగ్రన్నవమే తథా ।**
**దశమే యాః ఫలినీతి పిండే చైకాదశే తతః ॥29॥**

**భద్రం కర్ణేభిరితి చ కుర్యాత్పిండవిసర్జనమ్ ।**
**కృత్వైకాదశ దేవత్యం శ్రాద్ధం కుర్యాత్ పరేఽహని ॥30॥**

"యే దేవాసః" అనే మంత్రంతో నాలుగోపిండానికి, "సముద్రం గచ్ఛ" అనే మంత్రంతో అయిదో పిండానికి అర్ఘ్యం ఈయాలి. "అగ్నిర్జ్యోతిః" అనే మంత్రంతో ఆరో పిండానికి, "హిరణ్యగర్భః" అనే మంత్రంతో ఏడో పిండానికి, "యమాయత్వా" అనే మంత్రంతో ఎనిమిదో పిండానికి, "యజ్ఞాగ్రత్" అనే మంత్రంతో తొమ్మిదో పిండానికి,

"యాఃఫలినీ" అనే మంత్రంతో పదోపిండానికి, "భద్రం కర్ణేభిః" అనే మంత్రంతో పదకొండో పిండానికి అర్ఘ్యం ఇచ్చి విసర్జించాలి. ఇలా ఏకాదశ దైవత్య శ్రాద్ధాన్ని పెట్టినతరవాత ఆమరునాడు శ్రాద్ధాన్ని ప్రారంభించాలి.

**విప్రా నావాహయేత్పంచ చతుర్వేద విశారదాన్ ।**
**విద్యాశీలగుణోపేతాన్ స్వకీయాజ్ఛీలసత్తమాన్ ॥**
**అభ్యంగాన్ సుప్రశస్తాంశ్చ నతవర్జ్యాన్ కదాచన ॥31॥**

నాలుగు వేదాలు చదివినవారు, విద్యాశీలగుణ సంపన్నులు, వర్ణాశ్రమధర్మాలు పాటించేవారు, శీలవంతులు, సత్పురుషులు, సర్వాంగ సుశోభితులు, సుప్రశస్తులు నగు అయిదుగురు బ్రాహ్మణులను ఎప్పుడూ విడిచిపెట్టకుండా ఆహ్వానించాలి.

**విష్ణుః స్వర్ణమయః కార్యో రుద్రస్తామ్రమయస్తథా ।**
**బ్రహ్మరూప్య మయస్తద్వద్యమో లోహమయో భవేత్ ॥32॥**

**సీసకం తు భవేత్ప్రేతం త్వథవా దర్భకం తథా ।**
**శన్నో దేవీతి మంత్రేణ గోవిందం పశ్చిమే న్యసేత్ ॥33॥**
**(అగ్న ఆయాహి మంత్రేణ,అగ్నిమీలేతి మంత్రేణ)**

బంగారంతో విష్ణుప్రతిమ చేయించాలి. రాగితో రుద్రప్రతిమను, వెండితో బ్రహ్మప్రతిమను, అలాగే యముని ప్రతిమను ఇనుముతోను చేయించాలి. సీసంతో ప్రేత ప్రతిమను చేయించాలి. లేదా దర్భలతో తయారు చేయించాలి. "శన్నోదేవీ" అనే మంత్రాన్ని పఠిస్తూ విష్ణుప్రతిమను పడమటిదిక్కులో ఉంచాలి.

**అగ్న ఆయాహీతి రుద్ర ముత్తరత్రైవ విన్యసేత్ ।**
**అగ్నిమీలేతి మంత్రేణ పూర్వేణైవ ప్రజాపతిమ్ ॥34॥**

"అగ్న ఆయాహి" అనే మంత్రంతో రుద్రప్రతిమను ఉత్తరదిశలో ఉంచాలి, "అగ్నిమీలే" అనే మంత్రంతో బ్రహ్మప్రతిమను తూర్పుదిశలో ఉంచాలి.

**ఇషేత్వోర్జేతి మంత్రేణ దక్షిణే స్థాపయేద్యమమ్ ।**
**మధ్యే మండలకం కృత్వా స్థాప్యో దర్భమయో నరః ॥35॥**

"ఇషేత్వోర్జేత్వా" అనే మంత్రంతో యమప్రతిమను దక్షిణదిశలో స్థాపించాలి, వాటిమధ్యలో మండలం ఏర్పాటుచేసి కుశమయ (దర్భమయ,సీసమయ) నరప్రతిమను దానిపై ఉంచాలి.

**బ్రహ్మా విష్ణు స్తథా రుద్రో యమః ప్రేతశ్చ పంచమః ।**
**పృథక్కుంభే తతః స్థాప్యాః పంచరత్న సమన్వితాః ॥36॥**

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, యముడు, అయిదోవాడైన ప్రేత వీరికి వేరు వేరుగా పంచ రత్నాలతో కూడిన కుంభాలను సిద్ధంచేసి ఉంచాలి.

**వస్త్రయజ్ఞోపవీతాని పృథఙ్ముద్రా పరాణి చ ।**
**జపం కుర్యాత్ పృథక్ తత్ర బ్రహ్మాదౌ దేవతాసు చ ॥37॥**

**పంచ శ్రాద్ధాని కుర్వీత దేవతానాం యథావిధి ।**
**జలధారాం తతో దద్యాత్ పీఠే పీఠే పృథక్ పృథక్ ॥38॥**

అలాగే విడి విడిగా వస్త్రాలను, యజ్ఞోపవీతాలను, ముద్రలను ప్రదానంచేయాలి. దేవతల మంత్రాలను వేర్వేరుగా పఠిస్తూ జపంచేయాలి. అక్కడ బ్రహ్మ మొదలుకొని మిగిలిన దేవతలకు పంచ శ్రాద్ధాలు సమర్పించాలి. దేవతలను యథావిధిగా పూజించాలి. ప్రతి పీఠమందు విడి విడిగా జలధారతో తర్పణమీయాలి.

**శంఖే వా తామ్రపాత్రే వా అలాభే మృన్మయేఽపి వా ।**
**తిలోదకం సమాదాయ సర్వౌషధి సమన్వితమ్ ॥39॥**

శంఖంలో కాని, తామ్రపాత్రలో కాని, అవి లేకపోతే మట్టిపాత్రలో కాని సమస్తములైన ఓషధులతో కూడుకొన్న తిలోదకాన్ని నింపి, తర్పణం ఈయాలి.

**ఆసనోపానహౌ ఛత్రం ముద్రికా చ కమండలుః ।**
**భాజనం భాజనాధారం వస్త్రాణ్యష్టావిధం పదమ్ ॥40॥**

ఆసనం, చెప్పులు, గొడుగు, ముద్రిక, కమండలువు, భాజనం, భాజనాధారం, వస్త్రాలు ఈ ఎనిమిది దానాలు పదదానాలు అనబడతాయి.

**తామ్రపాత్రం తిలైః పూర్ణం సహిరణ్యం సదక్షిణమ్ ।**
**దద్యాద్బ్రాహ్మణముఖ్యాయ విధియుక్తం ఖగేశ్వర ॥41॥**

ఖగరాజా! తిలలతో నిండిన తామ్రపాత్రను, బంగారంతోకలిపి దక్షిణతో సహా బ్రాహ్మణముఖ్యునకు శాస్త్రయుక్తంగా దానంచేయాలి.

**ఋగ్వేద పారగే దద్యాజ్జాతసస్యాం వసుంధరామ్ ।**
**యజుర్వేదమయే విప్రే గాఞ్చ దద్యాత్పయస్వినీమ్ ॥42॥**

పండిన పంటతో కూడుకొన్న భూమిని ఋగ్వేద విద్వాంసునకు దానం ఈయాలి, యజుర్వేదపారంగతుడైన విప్రునకు పాలిచ్చే ఆవును దానంచేయాలి.

**సామగాయ శివోద్దేశాత్ ప్రదద్యాత్కలధౌతకమ్ ।**
**యమోద్దేశాత్తిలాలోహం తతో దద్యాచ్చ దక్షిణామ్ ॥43॥**

శివుని ఉద్దేశించి సామవేద పండితునకు బంగారాన్ని(వెండిని)దానమీయాలి, యమునుద్దేశించి దక్షిణా పూర్వకంగా తిలలను, ఇనుమును ఈయాలి.

**పశ్చాత్పుత్తలకం కార్యం సర్వౌషధి సమన్వితమ్ ।**
**పలాశస్య చ వృంతానాం విభాగం శృణు కాశ్యప ॥44॥**

పిమ్మట సమస్తములైన ఓషధులలో పుత్తలకాన్ని ఏర్పరచాలి. కశ్యపవంశ సంజాతా! మోదుగచిదుగుల విభాగాన్ని విను.

**కృష్ణాజినం సమాస్తీర్య కుశైశ్చ పురుషాకృతిమ్ ।**
**శతత్రయేణ షష్ట్యాం చ వృంతైః ప్రోక్తోఽస్థిసంచయః ॥45॥**

కుశలద్వారా నిర్మితమైన ప్రేత ప్రతిమను కృష్ణాజినంపై ఏర్పరచాలి, మూడువందల అరవై పుల్లలతో(తొడిమలతో) ఎముకలులాగా నిర్మించాలి,

**విన్యస్య తాని వృంతాని అంగేష్వేషు పృథక్ పృథక్ ।**
**చత్వారింశ చ్ఛిరోదేశే గ్రీవాయాం దశ విన్యసేత్ ॥46॥**

ఆ తొడిమలను ఆయా అవయవాలయందు విడి విడిగా ఉంచాలి, శిరోభాగంలో నలభై, కంఠంలో పది ఉంచాలి.

**వింశత్యురఃస్థలే దద్యాద్వింశతిం జఠరేఽపి చ ।**
**బాహుయుగ్మే శతం దద్యాత్కటిదేశే చ వింశతిమ్ ॥47॥**

ఉరః స్థలంలో ఇరవై, జఠరమునందు ఇరవై, బాహువుల రెండింటిలో నూరు, కటిప్రదేశంలో ఇరవై ఉంచాలి.

**ఊరుద్వయే శతఞ్చాపి త్రింశజ్జంఘాద్వయే న్యసేత్ ।**
**దద్యాచ్చతుష్టయం శిశ్నే షడ్ దద్యాత్ వృషణద్వయే ॥**
**దశ పాదాంగులీ భాగే ఏవమస్థీని విన్యసేత్ ॥48॥**

రెండు ఊరువులందు వంద, రెండు జంఘలయందు ముప్పై, లింగమునందు నాలుగు, రెండు అండకోశాలకు ఆరు ఉంచాలి, కాలివ్రేళ్లకు పదికాడలను కేటాయించి, ఈ విధంగా ప్రేత పురుషుని అస్థిపంజరాన్ని ఏర్పాటుచేయాలి.

**నారికేలం శిరఃస్థానే తుంబం దద్యాచ్చ తాలుకే ।**
**పంచరత్నం ముఖే దద్యాజ్జిహ్వాయాం కదలీఫలమ్ ॥49॥**

**అంత్రేషు నాలకం దద్యాద్వాలకం ప్రాణ ఏవ చ ।**
**వసాయాం మేదకం దద్యాద్గోమూత్రేణ తు మూత్రకమ్ ॥50॥**

పిమ్మట శిరోభాగంలో కొబ్బరికాయను, తాలుప్రదేశంలో తుంబ(సొరకాయను)మును, నోటిలో పదిరత్నాలను, జిహ్వాభాగంపై అరటిపండును, ప్రేగులవద్ద తామరకాడలను ఉంచాలి. ప్రాణభాగంలో ఇసుకను, క్రొవ్వుభాగంలో మేదకం అనే స్ఫటికాన్ని మూత్రస్థానంలో గోమూత్రాన్ని ఉంచాలి.

**గంధకం ధాతవో దేయా హరితాలం మనఃశిలా ।**
**రేతఃస్థానే పారదఞ్చ పురీషే పిత్తలం తథా ॥51॥**

ధాతువులకు గంధకం వేయాలి, అలాగే హరితాలం మనఃశిలను ఉంచాలి, రేతఃస్థానంలో పాదరసాన్ని, మలస్థానంలో ఇత్తడిని ఉంచాలి.

**మనఃశిలాం తథా గాత్రే తిలకల్కఇచ్చ సంధిషు ।**
**యవపిష్టం తథా మాంసే మధు వై క్షౌద్రమేవ చ ॥52॥**

శరీరమంతా మనఃశిలను, సంధిభాగాలలో నువ్వుపిండినీ, మాంస భాగంలో యవలపిండిని, తేనెను, ముత్యాలపొడిని ఉంచాలి.

**కేశేషు వై వటజటా త్వచి దద్యాన్మృగత్వచమ్ ।**
**కర్ణయోస్తాలపత్రఇచ్చ స్తనయోశ్చైవ గుంజికాః ॥53॥**

**నాసాయాం శతపత్రం చ కమలం నాభిమండలే ।**
**వృంతాకం వృషణద్వంద్వే లింగే స్యాదంజనం శుభమ్ ॥54॥**

కేశపాశాల స్థానంలో మర్రి ఊడలను, చర్మభాగంలో మృగచర్మాన్ని, కర్ణాలభాగంలో తాలపత్రాలను, నాభిమండలంలో కమలాన్ని, నాసా భాగంలో శతపత్రాలను, స్తనభాగాలలో గురివిందపండ్లను, అండకోశద్వయ స్థానంలో వంకాయలను, లింగస్థానంలో శుభమైన ముల్లంగిని ఉంచాలి.

**ఘృతం నాభ్యాం ప్రదేయం స్యాత్ కౌపీనే చ త్రపు స్మృతమ్ ।**
**మౌక్తికం స్తనయోర్మూర్ధ్ని కుంకుమేన విలేపనమ్ ॥55॥**

**కర్పూరాగురుధూపైశ్చ శుభైర్మాల్యైః సుగంధిభిః ।**
**పరిధానం పట్టసూత్రం హృదయే రుక్మకం న్యసేత్ ॥56॥**

నాభివద్దనున్న కమలపత్రాలలో నేయిని పోయాలి, కౌపీనస్థానంలో త్రపువును, స్తనాలవద్ద ముక్తాఫలాలను, తలపై కుంకుమలేపనాన్ని ఉంచాలి. కర్పూరం, అగురు, ధూపం, సుగంధమంగళ పుష్పమాలలతో అలంకరణ చేయాలి. పరిధానస్థానంలో పట్టసూత్రాన్ని, హృదయంలో బంగారాన్ని ఉంచాలి.

**ఋద్ధి, వృద్ధీ భుజౌ ద్వౌ చ చక్షుషోశ్చ కపర్దకౌ ।**
**సిందూరం నేత్రకోణే చ తాంబూలాద్యుపహారకైః ॥57॥**

**సర్వౌషధియుతం ప్రేతం కృత్వా పూజా యథోదితా ।**
**సాగ్నికే(క్రైశ్చా)చాపి విధినా యజ్ఞపాత్రం న్యసేత్క్రమాత్ ॥58॥**

ఋద్ధి, వృద్ధి అనే సిద్ధులు రెండింటిని భుజాలవద్ద (యజమాని స్పృశించి), కన్నులలో గవ్వలను ఉంచాలి. కను కొలకులలో సిందూరం ఉంచి, తాంబూలం మున్నగు ఉపహారాలను చక్కగా అమర్చాలి. ఈ విధంగా నానా వస్తువులచే నిర్మింపబడిన ప్రేతకు సర్వౌషధియుక్తంగా శాస్త్రానుసారం పూజచేయాలి, అది అగ్నిహోత్రి ప్రేతమయితే, దానికి యథావిధిగా యజ్ఞపాత్రను కూడ ఈయాలి.

**శిరోమే శ్రీరితి ఋచా పునన్తు వరుణేతి చ ।**
**ప్రేతస్య పావనం కృత్వా శాలిశాలశిలోదకైః ॥59॥**

**విష్ణుముద్దిశ్య దాతవ్యా సుశీలా గౌః పయస్వినీ ।।60।।**

"శిరమే శ్రీః....పునన్తు వరుణ" అనే మంత్రాలతో యజమాని అభిమంత్రిత జలంద్వారా శాలగ్రామ శిలను కడిగి దానితోనే ప్రేతను పవిత్రీకరించాలి. పిమ్మట విష్ణుభగవానుని ఉద్దేశించి చక్కని నడవడిగల ఒకపాలిచ్చే గోవును, దానం చేయాలి.

**తిలాలోహం హిరణ్యం చ కార్పాసం లవణం తథా ।**
**సప్తధాన్యం క్షితిర్గావ ఏకైకం పావనం స్మృతమ్ ।।61।।**

నువ్వులు, ఇనుము, బంగారం, ప్రత్తి, ఉప్పు, సప్త ధాన్యాలు, భూమి, గోవులు, ఇవి ఒక్కొక్కటి పరమపావనమైనవిగా పేర్కొనబడ్డాయి.

**తిలపాత్రం తతో దత్త్వా పదదానం తథైవ చ ।**
**మహాదానాని దేయాని తిలపాత్రం తథేతి చ ।।**
**తతో వైతరణీ దేయా సర్వాభరణభూషితా ।।62।।**

అనంతరం తిలపాత్ర దానంచేసి, అలాగే పదదానాలు ఈయాలి. అనంతరం మహాదానాలు, మళ్లీ తిలపాత్ర ఈయాలి. అటుపిమ్మట సమస్తాభరణాలచే అలంకరించిన వైతరణీ ధేనువును దానమీయాలి.

**కర్తవ్యం వైష్ణవం శ్రాద్ధం ప్రేతముక్త్యర్థ మాత్మవాన్ ।**
**ప్రేతమోక్షం తతః కుర్యాద్ధృది విష్ణుం ప్రకల్ప్య చ ।।63।।**

అనంతరం ఆత్మీయుడైన యజమాని ప్రేతముక్తికోసమై విష్ణుభగవానుని ఉద్దేశించి శ్రాద్ధాన్ని నిర్వహించాలి. తరువాత మనస్సులో విష్ణువును ధ్యానించి ప్రేతమోక్షణ కార్యక్రమాన్ని చేబట్టాలి.

**ఓం విష్ణురితి సంస్మృత్య ప్రేతం తన్మృత్యుమేవ చ ।**
**అగ్నిదాహం తతఃకూర్యాత్ సూతకన్తు దినత్రయమ్ ।।64।।**

**దశాహకర్త్రా (దశాహగత) పిండాశ్చ కర్తవ్యాః ప్రేతముక్తయే ।**
**సర్వం వర్షవిధిం కుర్యాదేవం ప్రేతశ్చ ముక్తిభాక్ ।।65।।**

"ఓం విష్ణురితి" అనే మంత్రం పఠిస్తూ ఆ ప్రేతప్రతిమను మరణించినట్లు భావనచేస్తూ అగ్నిదహనం చేయాలి. తరువాత మూడు రోజులపాటు సూతకదినాలను పాటించాలి. పదోరోజు కర్మ, దానికి ముందటి పిండప్రదానాలు, వార్షికక్రియలు అన్నింటిని ప్రేతముక్తి కోసమై పద్ధతిప్రకారం చేయాలి. ఈ విధంగాచేస్తే ప్రేత విముక్తిని పొందుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే అపమృత్యౌ సుఖదుఃఖలాభాలాభ నిరూపణం నామ చత్వారింశత్తమోఽధ్యాయః ।।40।।**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండో అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో అపమృత్యుప్రస్తావం అనే నలభైయవ అధ్యాయం.

## ఏకచత్వారింశోఽధ్యాయః - నలబై ఒకటవ అధ్యాయం

## వృషోత్సర్గనిరూపణమ్ - ఆబోతును వదలుట

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**వృషోత్సర్గం ప్రకుర్వీత విధిపూర్వం ఖగేశ్వర ।**
**కార్తికాదిషు మాసేషు పౌర్ణమాస్యాం శుభే దినే ॥1॥**

ఖగరాజా! కార్తికం మున్నగు మాసాలలో, పూర్ణిమనాడు, శుభదినాన శాస్త్రపూర్వకంగా వృషోత్సర్గం ఆచరించాలి.

**వివాహోత్సర్జనం శ్రాద్ధం నాందీముఖ ముపక్రమేత్ ।**
**కుర్యాద్భువశ్చ సంస్కారా నగ్నిస్థాపనమేవ చ ॥2॥**

వివాహవిధిచే నాందీముఖశ్రాద్ధంచేసి, వృషోత్సర్గాన్ని ఉపక్రమించాలి, భూమియందు సంస్కారాలన్నీ పూర్తిచేసి, అగ్నిప్రతిష్ఠాపన కావించాలి.

**వాప్యాం కూపే గవాం గోష్ఠే స్థాప్యాగ్నిం విధివత్తతః ।**
**వివాహవిధినా సర్వం కుర్యాద్బ్రాహ్మణవాచనమ్ ॥3॥**

బావివద్ద కాని, నూతివద్ద కాని, గోశాలలో కాని శాస్త్రపద్ధతిచే అగ్నిని స్థాపించి, వివాహవిధిచే బ్రాహ్మణ స్వస్తివాచకపూర్వకంగా అంతా నిర్వహించాలి.

**పాత్రాసాదనం శ్రపణముపయమన కుశాదికమ్ ।**
**పర్యుక్షణాంతే హోమం చ కుర్యాద్వై బ్రాహ్మణేన తు ॥4॥**

పాత్రాసాదనం, శ్రపణం, ఉపయమనం, కుశాదికం, పర్యుక్షణం, చివర హోమం బ్రాహ్మణుని ద్వారా చేయాలి.

**ఆధారావాజ్యభాగౌ చ చక్షుషీ చ ప్రదాపయేత్ ।**
**ప్రథమేఽహరితి మంత్రేణ హోతవ్యాశ్చ షడాహుతీః (తయః) ॥5॥**

ఆధారావము, ఆజ్యభాగము, చక్షుస్సులను ఏర్పాటుచేయాలి, "ప్రథమేఽహః" అనే మంత్రంచే ఆరు ఆహుతులతో హోమం చేయాలి. (మొదట అహః అనే మంత్రంచే)

**ఆధారావాజ్యభాగౌ తు పాయసేనాంగ దేవతాః ।**
**అగ్నయే రుద్రాయ శర్వాయ పశుపతయే ఉగ్రాయ శివాయ ॥**
**భవాయ మహాదేవాయేశానాయ యమాయ చ ॥6॥**

ఆధారావాజ్య భాగాలు పాయసంతో ఈయాలి. అంగదేవతలను ఉద్దేశించి హోమం చేయాలి. అగ్ని, రుద్రుడు, శర్వుడు, పశుపతి, ఉగ్రుడు, శివుడు, భవుడు, మహాదేవుడు, ఈశానుడు, యముడు వీరికొరకై ఈయాలి.

**షష్ఠకేన సకృద్ధోమం పూషాగా ఇతి మంత్రతః ।**
**ఉభయోః స్విష్టికృద్ధోమశ్చరుణా పాయసేన చ ॥7॥**

"పూషాగా" అనే మంత్రంతో పిండిముద్ద (పిండివంట)తో "సకృత్" హోమం చేయాలి. చరువు, పాయసం, అనే రెండింటితోను "స్విష్టికృత్" అనే హోమం చేయాలి.

**ప్రథమం వ్యాహృతి హోమః ప్రాయశ్చిత్తం ప్రజాపతిః ।**
**సంస్రవ ప్రాశనం కుర్యాత్ ప్రణీతాపరిమోక్షణమ్ ॥8॥**

**పవిత్ర ప్రతిపత్తిశ్చ బ్రాహ్మణే దక్షిణా తతః ।**
**షడంగ రుద్రజాప్యేన ప్రేతో మోక్షమవాప్నుయాత్ ॥9॥**

మొదట వ్యాహృతిహోమం, ప్రజాపతి ప్రాయశ్చిత్తహోమంగురించి చేయబడేది. పిమ్మట సంస్రవ, ప్రాశనవిధి, ప్రణీతావిధి, పరిమోక్షణవిధి చేయబడాలి. పవిత్రవిధి, ప్రతిపత్తివిధి నిర్వహింపబడాలి. అనంతరం బ్రాహ్మణునకు దక్షిణ సమర్పించాలి. ఈ షడంగ రుద్రజపంతో ప్రేత విముక్తిపొందుతాడు.

**ఏకవర్ణం వృషఞ్చైవ సకృద్వత్సతరీం ఖగ ।**
**స్నాపయిత్వా తతః కుర్యాత్ సర్వాలంకారభూషితమ్ ॥10॥**

**ప్రతిష్ఠాప్య చ తద్యుగ్మం ప్రేతో మోక్షమవాప్నుయాత్ ।**

ఖగమా! మంచి వయస్సుగల్గిన పెయ్యదూడను, ఒకేరంగు కల్గిన వృషాన్ని స్నానం చేయించి, సర్వాభరణాలతో అలంకరించి, ఆ రెండింటిని సంస్థాపనచేసి పిమ్మట వృషోత్సర్జనం కావించాలి. అందువల్ల ప్రేత విముక్తిని పొందుతాడు.

**పుచ్ఛే చ తర్పణం కార్యముచ్ఛ్రితే మంత్రపూర్వకమ్ ।**
**బ్రాహ్మణాన్ భోజయేత్పశ్చాద్దక్షిణాభిశ్చ తోషయేత్ ॥11॥**

తోకను పైకి ఎత్తిపట్టుకొని, మంత్రపూర్వకంగా తర్పణం చేయాలి. పిమ్మట బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. దక్షిణలచే వారిని సంతృప్తిపరచాలి.

**తతః శ్రాద్ధం సముద్దిష్ట మేకోద్దిష్టం యథావిధి ।**
**జలమన్నం తథా దేయం ప్రేతోద్ధరణహేతవే ॥12॥**

అనంతరం శాస్త్రప్రకారంగా ఏకోద్దిష్ట శ్రాద్ధం నిర్వహింపబడాలి. పిమ్మట ప్రేతసముద్ధరణకోసమై జలపూరితాన్నం సమర్పింపబడాలి.

**ద్వాదశాహే తతః కుర్యాన్మాసే మాసే పృథక్ పృథక్ ।**
**ఏవంవిధిః సమాయుక్తః ప్రేతమోక్షం కరోతి హి ॥13॥**

అనంతరం ద్వాదశాహం చేయాలి, ప్రతి మాసం వేరు వేరుగా చేయబడాలి. ఈ ప్రకారంగా సమస్తోపకరణలచే నిర్వహింపబడేవిధి ప్రేతకు విముక్తిని కలుగజేస్తుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే వృషోత్సర్గనిరూపణం నామైకచత్వారింశోఽధ్యాయః ॥41॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ఆబోతును వదలుట అనే నలబై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశోఽధ్యాయః - నలబై రెండవ అధ్యాయం

## భూదానాది నిరూపణమ్ - భూదానాది నిరూపణం

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**యథా ధేనుసహస్రేషు వత్సో విందతి మాతరమ్ ।**
**తథా పూర్వకృతం కర్మ కర్తారమనుగచ్ఛతి ॥1॥**

వేయిగోవుల మధ్యలో దూడ తనతల్లివద్దకే పోయినట్లు, పూర్వజన్మలో చేయబడిన కర్మలు, గురితప్పకుండా వాటి కర్తను అనుసరించి తీరుతాయి.

**ఆదిత్యో వరుణో విష్ణుర్బ్రహ్మా సోమో హుతాశనః ।**
**శూలపాణిశ్చ భగవానభినందంతి భూమిదమ్ ॥2॥**

ఆదిత్యుడు, వరుణుడు, విష్ణువు, బ్రహ్మ, సోముడు, అగ్ని, భగవంతుడూ శూలపాణియగు శివుడు భూమిని దానంచేసేవానిని అభినందిస్తారు.

**నాస్తి భూమిసమం దానం నాస్తి భూమిసమో నిధిః ।**
**నాస్తి సత్యసమో ధర్మో నానృతాత్పాతకం పరమ్ ॥3॥**

భూదానంతో సమానమైన దానంలేదు, భూమితో సమానమైన నిధిలేదు, సత్యంతో సమానమైన ధర్మంలేదు, అనృతంతో సమానమైన మహాపాతకం లేదు.

**అగ్నేరపత్యం ప్రథమం సువర్ణం భూర్వైష్ణవీ సూర్యసుతాశ్చ గావః ।**
**లోకత్రయం తేన భవేత్ప్రదత్తం యః కాంచనం గాంచ మహీం చ దద్యాత్ ॥4॥**

సువర్ణాన్ని అగ్నియొక్క పెద్దకొడుకని (మొదటి సంతానమని), భూమిని వైష్ణవి అని, ఆవులను సూర్యుని కుమార్తెలని అంటారు. కాంచనాన్ని, ఆవును, భూమిని దానమిస్తే, ముల్లోకాలను దానంచేసిన ఫలితం ప్రాప్తిస్తుంది.

**త్రీణ్యాహురతిదానాని గావః పృథ్వీ సరస్వతీ ।**
**నరకాదుద్ధరంత్యేతే జపపూజన హోమతః ॥5॥**

గోవులు, భూమి, విద్య- ఈ మూడింటిని అతిదానాలు అంటారు. జపం, పూజనం, హోమంకన్న ఈ మూడూ నరకంనుండి ఉద్ధరిస్తాయి.

**కృత్వా బహూని పాపాని రౌద్రాణి విపులాని చ ।**
**అపి గోచర్మ మాత్రేణ భూమిదానేన శుధ్యతి ॥6॥**

మహాభయంకరాలై, విస్తృతి కల్గిన, ఎన్ని పాపాలుచేసినప్పటికీ, గోచర్మమంత భూమిని దానమిస్తేచాలు విశుద్ధిని పొందుతాడు. (వెయ్యిగోవులు, పది ఎద్దులు తిరగగల్గిన ప్రాంతాన్ని గోచర్మం అంటారు.)

**హరంతమపి లోభేన నిరుద్ధ్యైనం నివారయేత్ ।**
**స యాతి నరకే ఘోరే యస్తం న పరిరక్షతి ॥7॥**

లోభంవల్ల దొంగతనం చేసినవానిని కూడ నిరోధించి, అతని పాపాన్ని భూదానం నివారిస్తుంది. అలా కాకపోతే ఎవ్వడూ అతనిని పరిరక్షించలేడు. అతడు ఘోరమైన నరకానికి వెడతాడు.

**అకర్తవ్యం న కర్తవ్యం ప్రాణైః కంఠగతైరపి ।**
**కర్తవ్యమేవ కర్తవ్యమితి ధర్మవిదో విదుః ॥8॥**

ప్రాణాలు గొంతుమీద ఉన్నప్పటికి చేయకూడని దానిని చేయరాదు, చేయవలసిన దానిని తప్పకచేసితీరాలని ధర్మవిదులు చెప్తారు.

**ఆకరప్రవర్తనే పాపం గోసహస్రవధైస్సమమ్ ।**
**వృత్తిచ్ఛేదే తథావృత్తేః కరణం లక్షధేనుకమ్ ॥9॥**

జీవికకు (స్థానంలో మళ్లించడం) భంగం కల్గజేస్తే వచ్చేపాపం వేయిగోవులను వధించడంవల్ల వచ్చే పాపంతో సమానం, ఎవని జీవనోపాధిని కొల్లగొట్టినా, తిరిగి ధర్మబద్ధంగా ఉపాధి ఏర్పాటుచేస్తే లక్షగోదాన ఫలితం చేకూరుతుంది.

**వరమే కాప్యపహృతా న తు దత్తం గవాం శతమ్ ।**
**ఏకాం హృత్వా శతం దత్త్వా న తేన సమతా భవేత్ ॥10॥**

వంద గోవులను దానమీయడం కాదు, ఒక్క ఆవును అపహరించినా మిక్కిలి పాపం. గోహంతకులనుండి ఒక్కఆవును రక్షించినా వందగోవులను దానమిచ్చిన ఫలితం చేకూరుతుంది.

**స్వయమేవ తు యో దత్త్వా స్వయమేవ ప్రబాధతే ।**
**స పాపీ నరకం యాతి యావదాభూతసంప్లవమ్ ॥11॥**

స్వయంగా ఎవడు ఇచ్చినా, స్వయంగా ఎవడు బాధించినా ఆ పాపాత్ముడు భూతప్రలయపర్యంతం నరకం పొందుతాడు.

**నచాశ్వమేధేన తథా విధివద్దక్షిణావతా ।**
**అవృత్తి కర్శితే దీనే బ్రాహ్మణే రక్షితే యథా ॥12॥**

జీవనోపాధిలేని దీనుడైన బ్రాహ్మణునికి బ్రతుకుతెరువు ఇచ్చి రక్షిస్తేచాలు, ఆ ఫలం శాస్త్రపద్ధతితో దక్షిణతో కూడుకొన్న అశ్వమేధయాగ ఫలితంతో సమానమైనది కాదు.

**న తద్భవతి వేదేషు యజ్ఞే సుబహుదక్షిణే ।**
**యత్పుణ్యం దుర్బలే త్రస్తే బ్రాహ్మణే పరిరక్షితే ॥13॥**

దుర్బలుడై భయపడిన బ్రాహ్మణుని పరిరక్షిస్తే వచ్చే పుణ్యఫలం వేదాలలో చెప్పబడిన భూరిదక్షిణలతో కూడుకొన్న యజ్ఞాలవల్ల కూడా రాదు.

**బ్రహ్మస్వైశ్చ సుపుష్టాని వాహనాని బలాని చ ।**
**యుద్ధకాలే విశీర్యంతే సైకతాః సేతవో యథా ॥14॥**

బ్రాహ్మణుని ధనాన్ని అపహరించి వాటితో గొప్ప గొప్ప వాహనాలు, బలాలు సిద్ధంచేసుకొంటే యుద్ధకాలంలో ఇసుకతో కట్టిన వంతెనలువలె అవి కూలిపోతాయి.

**స్వదత్తాం పరదత్తాం వా యో హరేచ్చ వసుంధరామ్ ।**
**షష్టివర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే కృమిః ॥15॥**

తాను స్వయంగా ఇచ్చినదానినయినా, లేదా ఇతరులు ఇచ్చినదానినయినా దౌర్జన్యంగా భూమిని లాగుకొన్నవాడు అరవైవేల సంవత్సరాలు పాటు పేడపురుగుగా జన్మిస్తాడు.

**బ్రహ్మస్వం ప్రణయాద్భుక్తం దహత్యాసప్తమం కులమ్ ।**
**తదేవ చౌర్యరూపేణ దహత్యాచంద్రతారకమ్ ॥16॥**

బ్రాహ్మణుని నమ్మించి మోసంచేసి ధనాన్ని లాగుకొన్నవాడు తనతోబాటు ఏడుతరాలవారి పుణ్యాన్ని దహించివేస్తాడు. దానినే అపహరించినట్లయితే చంద్రుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం పుణ్యాలను భస్మం చేస్తాడు.

**లోహచూర్ణాశ్మ చూర్ణాని కదాచిజ్జరయేత్పుమాన్ ।**
**బ్రహ్మస్వం త్రిషులోకేషు కఃపుమాఞ్జరయిష్యతి ॥17॥**

ఇనుపరజనును, రాళ్లపొడిని ఎప్పుడయినా పురుషుడు అరగించుకోవచ్చునేమో కాని, బ్రాహ్మణుని సొమ్మును తిని మూడు లోకాలలోను ఏ ఒక్క పురుషుడయిననూ జీర్ణింపజేసుకోగలడా?

**దేవద్రవ్యవినాశేన బ్రహ్మస్వహరణే న చ ।**
**కులాన్యకులతాం యాంతి బ్రాహ్మణాతిక్రమేణ చ ॥18॥**

**బ్రాహ్మణాతిక్రమో నాస్తి విప్రే విద్యావివర్జితే ।**
**జ్వలంతమగ్నిముత్సృజ్య న హి భస్మని హూయతే ॥19॥**

దైవద్రవ్యాన్ని నాశనంచేసినా, బ్రాహ్మణధనాన్ని అపహరించినా, బ్రాహ్మణుని అవమానపరచినా వంశాలు వంశాలు నశించిపోతాయి. (ఆ వంశం వంశం హీనమవుతుంది) విద్యావివర్జితుడైన బ్రాహ్మణుని విషయంలో బ్రాహ్మణాతిక్రమ దోషంలేదు. జ్వలిస్తున్న అగ్నిలో హోమంచేయకుండా, బూడిదలో హోమం చేయకూడదు కదా!

**సంక్రాంతౌ యాని దానాని హవ్యకవ్యాని యాని చ ।**
**సప్తకల్పక్షయం యావద్దదాత్యర్కః పునః పునః ॥20॥**

సంక్రమణమందు, ఏయేదానాలు, ఏఏ హవ్యకవ్యాలు ఈయబడతాయో, ఏడు కల్పాలవరకు క్షీణించకుండా, సూర్యుడు మళ్లీ మళ్లీ ఆ ఫలితాలను ప్రసాదించగలడు. (ప్రసాదిస్తాడు)

**ప్రతిగ్రహాధ్యాపన యాజనేషు ప్రతిగ్రహం స్వేష్టతమం వదంతి ।**
**ప్రతిగ్రహాచ్ఛుధ్యతి జాప్యహోమం న యాజనం కర్మ పునంతి వేదాః ॥21॥**

ప్రతిగ్రహం, అధ్యాపనం, యాజనం అనేవాటిలో ప్రతి గ్రహాన్ని మిక్కిలి స్వేచ్ఛతో కూడుకొన్నదానినిగా చెబుతారు. ప్రతిగ్రహంవల్ల జపం, హోమం శుద్ధిని పొందుతాయి. వేదాలు యజనకర్మను పవిత్రీకరించలేవు.

**సదా జాపీ సదా హోమీ పరిపాకవివర్జితః ।**
**రత్నపూర్ణామపి మహీం ప్రతిగృహ్ణ న్నలిప్యతే ॥22॥**

ఎల్లప్పుడు జపం చేసేవాడు, ఎప్పుడూ హోమంచేసేవాడు కర్మపరిపాక విముక్తుడవుతాడు. రత్నాలతో నిండిన భూమిని ప్రతిగ్రహంచేసినా దోషం అతనిని అంటదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే భూదానాది నిరూపణం నామ ద్విచత్వారింశత్తమోఽధ్యాయః ॥42॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో భూదానాది నిరూపణం అనే నలబై రెండవ అధ్యాయం సమాప్తం.

* * *

## త్రిచత్వారింశోఽధ్యాయః - నలబై మూడవ అధ్యాయం

## శుద్ధినిరూపణమ్ - శుద్ధివిధి

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**జలాగ్ని బంధన భ్రష్టా ప్రవ్రజ్యానాశకచ్యుతాః ।**
**ఐందవాభ్యాం విశుద్ధ్యంతి దత్త్వా ధేనుం తథా వృషమ్ ॥1॥**

నీరు, అగ్ని, బంధనంవల్ల మరణించినవారికి, సన్న్యాసం స్వీకరించి దానినుండి చ్యుతులై మరణించినవారికి కృచ్ఛ్రచాంద్రాయణవ్రతాలవల్ల, ఆవును, ఎద్దును దానంచేయడంవల్ల శుద్ధి కలుగుతుంది.

**ఊనద్వాదశ వర్షస్య చతుర్వర్షాధికస్య చ ।**
**ప్రాయశ్చిత్తం చరేన్మాతా పితా వాన్యోఽపి బాంధవః ॥2॥**

నాలుగేండ్లు దాటి, పన్నెండుఏళ్ల నడుమ వయస్సు ఉన్నవారు మరణిస్తే తల్లిఅయినా, తండ్రిఅయినా, ఇతరుడైనా, బాంధవుడయినా ప్రాయశ్చిత్తకర్మ చేయాలి (ఆచరించాలి)

**అతో బాలనరస్యాపి నాపరాధో న పాతకమ్ ।**
**రాజదండో న తస్యాస్తి ప్రాయశ్చిత్తం న విద్యతే ॥3॥**

అందువల్ల బాలుడైన నరునకు అపరాధం ఉండదు. పాపమూలేదు. అతనికి రాజదండన ఏ మాత్రం ఉండదు. ప్రాయశ్చిత్తమనేది కూడ ఉండదు.

**రక్తస్య దర్శనే దష్టే ఆతురా స్త్రీ భవేద్ యది ।**
**చతుర్థేఽహ్ని పదాదీంశ్చ త్యక్త్వా స్నాత్వా విశుధ్యతి ॥4॥**

స్త్రీ ఆతురయై ఉండగా రజస్వల అయితే, నాలుగో రోజున పదాది దానాలను విడిచి స్నానంచేస్తే శుద్ధి కలుగుతుంది.

**ఆతురే స్నాన ఉత్పన్నే దశకృత్వో హ్యనాతురః ।**
**స్నాత్వా స్నాత్వా స్పృశేదేనం తతఃశుద్ధ్యేత్ స ఆతురః ॥5॥**

(రజస్వల రోగగ్రస్త అయితే స్నానం చేయలేనిస్థితిలోఉంటే) లేదా ఆతురుడై ఉండగా స్నానంచేయవలసి వస్తే ఆమెను కాని అతనిని కాని తప్పనిసరిగా చూడవలసిన అనాతురుడు పదిమార్లు స్నానంచేసి, స్పృశిస్తే ఆ ఆతురుని విషయంలో కాని, ఆతురురాలు విషయంలో కాని శుద్ధుడవుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే శుద్ధినిరూపణం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥43॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో శుద్ధివిధి అనే నలబై మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుశ్చత్వారింశోఽధ్యాయః** – నలభై నాల్గవ అధ్యాయం

## **దుర్మరణే కార్యాకార్యవిధిః** – ప్రమాదంలో మరణిస్తే పాటించవలసిన విధి

**శ్రీవిష్ణురువాచ** – శ్రీమహావిష్ణువు వచించాడు.

**స్వేచ్ఛయా తార్క్ష్య మరణం శృంగిదంష్ట్రిసరీసృపైః ।**
**చాండాలాద్యాత్మఘాతైశ్చ విషాద్యైస్తాడనైస్తథా ॥1॥**

**జలాగ్నిపాతవాతైశ్చ నిరాహారాదిభిస్తథా ।**
**యేషామేవ భవేన్మృత్యుః ప్రోక్తాస్తే పాపకర్మిణః ॥2॥**

గరుడా! కొమ్ములు కల్గిన వృషభాలవల్ల, కోరలుకల్గిన క్రూరమృగాలవల్ల, సరీసృపాదులవల్ల, చాండాలాదుల వల్ల, ఆత్మహత్యలవల్ల, విషాదులవల్ల, తాడనాలవల్ల, నీటివల్ల, అగ్నివల్ల, పడిపోవుటవల్ల, గాలితాకిడివల్ల, ఆహారం తీసుకోకపోవడంవల్ల, యాదృచ్ఛికంగా ఎవరికి మృత్యువు సంభవిస్తుందో వారు పాపకర్ములని చెప్పబడినారు.

**పాష(షం)ద్య నాశ్రమాశ్చైవ మహాపాతకిన స్తథా ।**
**స్త్రియశ్చ వ్యభిచారిణ్య ఆరూఢ పతితాస్తథా ॥3॥**

**న తేషాం స్యాన్నవశ్రాద్ధం న సంస్కారః సపిండనమ్ ।**
**శ్రాద్ధాని షోడశోక్తాని న భవంతి చ తాన్యపి ॥4॥**

పాషండులు, ఆశ్రమధర్మాలు పాటించనివారు, మహాపాతకులు, వ్యభిచారిణులైన స్త్రీలు, ఆరూఢపతితులు – ఇటువంటివారికి నవ శ్రాద్ధాలు ఉండవు. అగ్నిసంస్కారం లేదు. సపిండీకరణం ఉండనే ఉండదు. ఇదివరకు చెప్పబడిన ఆ పదహారు శ్రాద్ధాలు కూడ ఉండవు.

**వేతనం యత్ క్షిపేదప్సు గృహ్యాగ్నిశ్చ చతుష్పథే ।**
**పాత్రాణి నిర్దహేదగ్నౌ సాగ్నికే పాపకర్మణి ॥5॥**

వానిగతి నీళ్లల్లో పారివేయడమో, అగ్నిలో పడవేయడమో, ఏ చతుష్పథాలలో విసరివేయడమో. అతని పాత్రలను అగ్నిలో కాల్చివేయడమే. పాపకర్ముడైన అగ్నిహోత్రికి కూడ ఇదేగతి.

**పూర్ణే సంవత్సరే తేషామిత్థం కార్యం దయాలుభిః ।**
**ఏకాదశీం సమాసాద్య శుక్లపక్షే చ కాశ్యప ॥6॥**

**విష్ణుం యమఞ్చ సంపూజ్య గంధపుష్పాక్షతాదిభిః ।**
**దశపిండాన్ ఘృతాక్తాంశ్చ దర్భేషు మధుసంయుతాన్ ॥7॥**

**యజ్ఞోపవీతీ స తిలాన్ ధ్యాయన్ విష్ణుం యమం తథా ।**
**దక్షిణాభిముఖ స్తూష్ణీమేకైకం నిర్వపేత్తు తాన్ ॥8॥**

కశ్యపవంశ సంజాతా! సంవత్సరం నిండిపోయినతరువాత వారి విషయంలో దయాస్వభావులు ఈ విధంగానే చేయాలి. శుక్లపక్షంలో ఏకాదశీ తిథిరాగానే, గంధం, పుష్పాలు, అక్షతలు మున్నగువానిచే విష్ణువును, యముని భక్తితో పూజించి; నేతితోను, తేనెతోను కూడిన పది పిండాలను దర్భలపై ఉంచాలి. యజ్ఞోపవీతాన్ని ఉపవీతి స్థితిలోఉంచి నువ్వులతో దక్షిణాభిముఖుడై, (తూష్ణీంస్థితిలో) మౌనంగా విష్ణువును, యముని ధ్యానంచేస్తూ, ఒక్కొక్క దానిని నిర్వపనం చేయాలి.

**ఉద్ధృత్య మిశ్రితాన్ పశ్చాత్ తీర్థేఽ మ్భస్సు వినిఃక్షిపేత్ ।**
**క్షిపన్ సంకీర్తయన్నామ గోత్రం చ మృతకస్య చ ॥9॥**

తరువాత అన్నింటినీ కలిపి పైకి తీసి తీర్థంలో నీళ్లలో కలిపివేయాలి. చనిపోయినవాని గోత్రాన్ని, నామాన్ని ఉచ్చరిస్తూ కలపాలి.

**పునరప్యర్చయేద్విష్ణుం యమం కుసుమచందనైః ।**
**ధూపదీపైః స నైవేద్యై ర్భక్ష్యభోజసమన్వితైః ॥10॥**

పిమ్మట మళ్లీ పూలతోను, చందనాలతోను, ధూపదీపాలతోను, భక్ష్య, భోజ్యాలతో కూడిన నైవేద్యాలతోను విష్ణువును, యముని అర్చించాలి.

**తస్మిన్నుపవసేదహ్ని విప్రాంశ్చైవ నిమంత్రయేత్ ।**
**కులవిద్యాతపోయుక్తాన్ సాధుశీల సమన్వితాన్ ॥11॥**

**నవసప్తాథవా పంచ స్వసామర్థ్యానుసారతః ।**
**అపరేఽ హని మధ్యాహ్నే యమం విష్ణుం తథార్చయేత్ ॥12॥**

ఆరోజు ఉపవాసంలో ఉండాలి, కులీనులై, విద్యాతపస్సంపన్నులై, చక్కనిశీలంతో కూడుకొన్న విప్రులను ఐదుగురిని కాని, ఏడుగురిని కాని, తొమ్మండుగురిని కాని తన సామర్థ్యాన్ని అనుసరించి నిమంత్రణ చేయాలి. ఆ మరునాడు మధ్యాహ్నం మళ్లీ యముని, విష్ణువును అలాగే అర్చించాలి.

**ఉదఙ్ముఖాం స్తథా విప్రాం స్తాన్ సమ్యగుపవేశయేత్ ।**
**ఆవాహనార్ఘ దానాదౌ విష్ణుం యమసమన్వితమ్ ॥13॥**

**యజ్ఞోపవీతీ కుర్వీత ప్రేతనామ ప్రకీర్తయేత్ ।**
**ప్రేతం యమం చ విష్ణుం చ స్మరన్ శ్రాద్ధం సమాపయేత్ ॥14॥**

ఆ బ్రాహ్మణులను ఉత్తరముఖంగా చక్కగా కూర్చుండజేయాలి. విష్ణువును, యమునితో సహా ఆవాహన, అర్ఘ్యప్రదానాదులతో పూజించాలి. ప్రేతనామాన్ని ఉచ్చరిస్తూ యజ్ఞోపవీతిగా కర్మచేయాలి. ప్రేతను, యముని, విష్ణువును స్మరిస్తూ శ్రాద్ధవిధి పూర్తిచేయాలి.

**అన్యేభ్యశ్చాపి సర్వేభ్యః పిండదానార్థముద్ధరేత్ ।**
**పృథగ్వా దశపిండాంశ్చ పంచ దద్యాత్ క్రమేణ తు ॥15॥**

**ప్రథమం విష్ణవే దద్యాద్బ్రహ్మణే చ శివాయ చ ।**
**సభృత్యాయ శివాయాథ ప్రేతాయాపి చ పంచమమ్ ॥16॥**

మిగిలినవారందరికోసమై పిండప్రదానం చేయటానికి కలిపి కానీ పది పిండాలను వేరు వేరుగా కాని, క్రమంగా అయిదు పిండాలను ఈయాలి. మొదటి పిండాన్ని విష్ణువుకొరకు, రెండోదానిని బ్రహ్మకొరకు, మూడోదానిని శివునికొరకు, నాలుగోదానిని సపరివారుడైన శివునికొరకు, అయిదోదానిని ప్రేతకొరకు ఈయాలి.

**నామగోత్రం స్మరేత్తస్య విష్ణుశబ్దం ప్రకీర్తయేత్ ।**
**నమస్కార శిరస్కన్తు పంచమం పిండముద్ధరేత్ ॥17॥**

అతని నామాన్ని, గోత్రాన్ని స్మరించాలి. విష్ణుశబ్దాన్ని ఉచ్చరించాలి. ముందు "నమః" శబ్దాన్ని ప్రయోగించి, అయిదోపిండాన్ని ఉద్ధరించాలి.

**గోభూమి పిండదానాద్యైః శక్త్యా ప్రేతం స్మరంశ్చ తమ్ ।**
**తిలై స్తిలాంస్తు విప్రాణాం దర్భయుక్తేషు పాణిషు ॥18॥**

**దద్యాదన్నం ద్విజానాం చ తాంబూలం దక్షిణాం తథా ।**
**ఏవం శిష్టతమం విప్రం హిరణ్యేన ప్రపూజయేత్ ॥19॥**

ఆ ప్రేతను స్మరిస్తూ శక్తి ననుసరించి గోభూమి పిండదానాలను మున్నగువాటిని చేయాలి. తిలలతో దర్భలతో కూడుకొన్న విప్రులయొక్క చేతులందు తిలలు ఉంచి ఈ దానాలు చేయాలి. ద్విజులకు అన్నమును, తాంబూలమును, దక్షిణను సమర్పించాలి. ఈ విధంగా మహావిశిష్టుడైన బ్రాహ్మణునకు హిరణ్యం ఇచ్చి భక్తితో పూజించాలి.

**నామగోత్రం స్మరన్ దద్యాద్విష్ణు ప్రీతోస్త్వితి బ్రువన్ ।**
**అనువ్రజ్య ద్విజాన్ పశ్చాత్ త్యక్తామ్బో దక్షిణాముఖః ॥20॥**

ప్రేతనామాన్ని, గోత్రాన్ని స్మరిస్తూచేయాలి, విష్ణుప్రీతి పొందెదవు గాక! అని పైకి ఉచ్చరించాలి, అటుపిమ్మట దక్షిణాభిముఖంగా నీళ్లుచల్లుతూ ద్విజులను సాగనంపాలి.

**కీర్తయన్నామ గోత్రే తు భువి ప్రీతోస్త్వితి క్షిపేత్ ।**

ప్రేత నామగోత్రాలను ఉచ్చరిస్తూ ప్రీతిపొందెదవు గాక! అంటూ నేలపై నీళ్లుచల్లాలి.

**మిత్రబంధుజనైః సార్థం శేషం భుంజీత వాగ్యత ।**
**ప్రతిసంవత్సరాది స్యాదేకోద్దిష్టవిధానతః ॥21॥**

మిత్రులతోను, బంధుజనులతోను కలసి, మౌనంగా శేషాన్నం భుజించాలి. ప్రతి సంవత్సరం అది మొదలుకొని ఏకోద్దిష్టవిధాన శ్రాద్ధక్రియను ఆచరించాలి.

**ఏవంకృతే గమిష్యంతి స్వర్లోకం పాపకర్మిణః ।**
**సపిండీకరణాదౌ తు కృతే చైవాప్నువంతి తే ॥22॥**

ఈవిధంగా, సపిండీకరణాదులుచేస్తే ఎవరయితే ఉత్తమగతులు పొందుతారో, పాపకర్ములు అలాగే స్వర్లోకం చేరుకోగలరు.

**అథ కశ్చిత్ ప్రమాదేన మ్రియతే హ్యుదకాదిభిః ।**
**సంసార ప్రముఖస్తస్య సర్వం కుర్యాద్యథావిధి ॥23॥**

ఇక ఎవడయినా ప్రమాదవశాత్తు నీరు మొదలగువాటివల్ల మరణిస్తే, అతని కుటుంబంలోని ప్రముఖవ్యక్తి, ఆ మృతునకు యథావిధిగా సర్వమూ చేయాలి.

**ప్రమాదాదిచ్ఛయా మర్త్యో న గచ్ఛేత్సర్పసంముఖః ।**
**పక్షయోరుభయోర్నాగం పంచమీషు ప్రపూజయేత్ ॥24॥**

అలాకాని నాడు ప్రమాదంవల్లనూ, యాదృచ్ఛికంగాను మరణించిన మర్త్యుడు ఉత్తమగతి పొందలేడు. పాముకాటువల్ల మరణిస్తే, ప్రతిమాసంలోనూ, రెండు పంచమి తిథులలోను నాగదేవతను భక్తితో పూజించాలి.

**కుర్యాత్ పిష్టమయీం లేఖాం నాగానామాకృతిం భువి ।**
**అర్చయేత్ తాం సితైః పుష్పైః సుగంధైశ్చందనేన చ ॥25॥**

**ప్రదద్యాద్ధూపదీపన్తు తండులాంశ్చ సితాన్ క్షిపేత్ ।**
**ఆమపిష్టం తథైవాన్నం క్షీరఞ్చ వినివేదయేత్ ॥26॥**

భూమిపై శాలిచూర్ణంతో (బియ్యపుపిండితో) నాగదేవతల ఆకారరేఖను చిత్రించాలి. దానిని తెల్లనిపూలతో, సుగంధద్రవ్యాలతో, ధూపంతో, దీపం, తెల్లని అక్షతలతో చల్లి పూజించాలి. బాగా ముద్దగాచేయబడిన పిండిని, అలాగే అన్నాన్ని, పాలను నివేదన చేయాలి.

**ఉపస్థాయ వదేదేవం ముంచన్ ముద్రాంశుకాని చ ।**
**మధురం తద్దినేఽశ్నీయాద్దేవశ్రాద్ధం సమాపయేత్ ॥27॥**

**సౌవర్ణం శక్తితో నాగం తతో దద్యాద్ద్విజోత్తమే ।**
**ధేనుం దత్త్వా తతో బ్రూయాత్ ప్రీయతాం నాగరాడితి ॥28॥**

తరువాత అక్కడ వస్త్రాలను ఉంచాలి. ముద్రలను (కొన్ని పదార్థాలు) విసర్జించాలి. పైకిలేస్తూ నాగరాజు "ప్రసన్నుడగు గాక" అని ప్రార్థించాలి. అదేరోజు శ్రాద్ధాన్నిపెట్టి మధురమైన భోజనంచేయాలి. తరువాత శక్తిననుసరించి బంగారు నాగప్రతిమను బ్రాహ్మణవరేణ్యునికి దానమీయాలి. గోదానంకూడ చేయాలి.

**యథా విభవ్యం కుర్వీత కర్మాణ్యన్యాని పూర్వవత్ ।**
**స్వశాఖోక్తవిధానేన ఇత్థం కుర్యాద్యథాతథమ్ ॥**
**ప్రేతత్వాన్మోచయేత్ తాం స్తు స్వర్గమార్గం నయేచ్చ సః ॥29॥**

పూర్వంలాగానే, నానావిధ కర్మలను, తన వైభవాన్ని అనుసరించి చేయాలి. తన శాఖాచార సంప్రదాయ విధానంచే, యథాతథంగా ఇలాగే చేయాలి. ఆ విధి అలా మరణించినవారికి ప్రేతత్వం నుంచి విముక్తి కలిగిస్తుంది. స్వర్గమార్గంవైపు నడిపిస్తుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే దుర్మరణే కార్యాకార్యక్రియాది నిరూపణం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రమాదంలోమరణిస్తే పాటించవలసిన విధి అనే నలబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచచత్వారింశోஉధ్యాయః - నలభై అయిదవ అధ్యాయం

## ప్రత్యాబ్దికశ్రాద్ధాదినిరూపణమ్ - ప్రత్యాబ్దికశ్రాద్ధాదులు

**శ్రీవిష్ణురువాచ** - శ్రీమహావిష్ణువు వచించాడు.

**ప్రత్యబ్దం శ్రాద్ధమేవం తే కథయామి ఖగేశ్వర ।**
**ప్రత్యబ్దం పార్వణేనైవ కుర్యాతాం క్షేత్రజౌరసౌ ॥1॥**

ఖగేశ్వరా! ప్రతి సంవత్సరం చేయవలసిన శ్రాద్ధంగురించి నీకు ఈవిధంగా తెలియజేస్తున్నాను, ప్రతిసంవత్సరం ఔరసుడు కాని, క్షేత్రజ్ఞుడు కాని పార్వణ విధానంతో శ్రాద్ధం నిర్వహించాలి.

**విధినా చేతరైరేవమేకోద్దిష్టం న పార్వణమ్ ॥2॥**

ఇతరులచే చేయబడేటటువంటిదయితే శాస్త్రోక్తవిధానంచే ఏకోద్దిష్ట శ్రాద్ధం నిర్వహించాలి. పార్వణవిధానం కాదు.

**అనగ్నేశ్చ సుతౌ స్యాతామనగ్నీక్షేత్రజౌరసౌ ।**
**ఏకోద్దిష్టం న కుర్యాతాం ప్రత్యబ్దం తౌ తు పార్వణమ్ ॥3॥**

**యదా త్వన్యతరః సాగ్నిః(యదయం హి మృతః సాగ్నిః)పుత్రోవాప్యథవా పితా ।**
**ప్రత్యబ్దం పార్వణం తత్ర కుర్యాతాం క్షేత్రజౌరసౌ ॥4॥**

అగ్నిహోత్రి కానివాని కుమారులు అగ్నిహోత్రులు కాకపోయినా, క్షేత్రజౌరసులు ఆబ్దికాన్ని ఏకోద్దిష్టవిధానంచే చేయరాదు, పార్వణ విధానంతోనే చేయాలి. మృతుడైనవాడు అగ్నిహోత్రిఅయినా, అప్పుడుకూడా క్షేత్రజౌరసులు ప్రతిసంవత్సరం చేసే ఆబ్దికాన్ని పార్వణవిధితోనే నిర్వహించాలి.

**అనగ్నయః సాగ్నయో వా పుత్రా వా పితరోஉపి వా ।**
**ఏకోద్దిష్టం సుతైః కార్యం క్షయాహే ఇతి కేచన ॥5॥**

కొడుకులు కాని, తండ్రులు కాని అగ్నిహోత్రం చేసేవారయినా, అగిహోత్రం చేయనివారయినా, వారి విషయంలో చనిపోయిన రోజున కుమారులచే ఏకోద్దిష్టవిధానంచే శ్రాద్ధం నిర్వహింపబడాలని కొందరి మతం.

**దర్శకాలే క్షయో యస్య ప్రేతపక్షేஉథవా పునః ।**
**ప్రత్యబ్దం పార్వణం కార్యం తస్య సర్వైః సుతైరపి ॥6॥**

సూర్యేందుసంగమం ఉండే అమావాస్యనాడు కాని ప్రేతపక్షంలో కాని, అతని కుమారులందరిచేత పార్వణవిధానంచేతనే ప్రతి సంవత్సరం శ్రాద్ధం జరుపబడాలి.

**ఏకోద్దిష్ట మపుత్రాణాం పుంసాం స్యాద్యోషితామపి ।**
**ఏకోద్దిష్టే కుశా గ్రాహ్యాః సమూలా యజ్ఞకర్మణి ॥**
**బహిర్లూనాః సకృల్లూనాః శ్రాద్ధం వృద్ధిమతే సదా ॥7॥**

పుత్రులు లేనివారికి పురుషులకైనా, స్త్రీలకయినా ఏకోద్దిష్టవిధానమే నిర్దేశింపబడింది, ఏకోద్దిష్టంలో యజ్ఞకర్మయందు మూలాలతో కూడుకొన్న కుశలనే గ్రహించాలి. వృద్ధిశ్రాద్ధంలో మాత్రం మూలాలు లేని దర్భలనైనా వాడవచ్చు. అవి బయట త్రెంపబడినవైనాకావచ్చు, ఒక్కసారి త్రెంపబడినవైనా కావచ్చు.

**కర్తవ్యే పార్వణే శ్రాద్ధే ఆశౌచం యది జాయతే ।**
**ఆశౌచావగమే కుర్యాచ్ఛ్రాద్ధం హి తదనంతరమ్ ॥8॥**

పార్వణశ్రాద్ధం చేయవలసిన సమయంలో ఆశౌచం కనుక వచ్చినట్లయితే, ఆశౌచం తొలగిపోయినతరువాత శ్రాద్ధం నిర్వహించాలి.

**ఏకోద్దిష్టేతు సంప్రాప్తే యది విఘ్నః ప్రజాయతే ।**
**మాసేన్యస్మిన్ తిథౌ తస్యాం కుర్యాచ్ఛ్రాద్ధం తదైవ హి ॥9॥**

ఏకోద్దిష్ట శ్రాద్ధవిధానం జరిపేసమయంలో, విఘ్నమే కనుక సంభవిస్తే, ఆ తరువాతిమాసంలో అదే తిథిరోజున ఆ శ్రాద్ధాన్ని అదే విధానంతో జరిపించాలి.

**తూష్ణీం శ్రాద్ధస్తు శూద్రస్య భార్యాయా స్తత్సుతస్య చ ।**
**కన్యాయాశ్చ ద్విజాతీనా మనుపేత ద్విజస్య చ ॥10॥**

శూద్రుని విషయంలో, భార్యా పుత్ర పుత్రీ విషయంలో, ద్విజాతుల విషయంలో, ఉపనయన సంస్కారం లేని ద్విజుని విషయంలో తూష్ణీస్థితిలో శ్రాద్ధం నిర్వహించాలి.

**ఏకకాలే గతాసూనాం బహూనా మథవా ద్వయోః ।**
**తంత్రేణ శ్రపణం కుర్యాచ్ఛ్రాద్ధం కుర్యాత్ పృథక్ పృథక్ ॥11॥**

ఒకేకాలంలో ఎక్కువమంది మరణించినా, లేక ఇద్దరు మరణించినా, తంత్రవిధానంచే శ్రపణం (శ్రాద్ధాన్నం వండడం) చేయాలి. శ్రాద్ధంమాత్రం వేరు వేరుగా చేయాలి.

**దద్యాత్ పూర్వం మృతస్యాదౌ ద్వితీయస్య తతః పునః ।**
**తృతీయస్య తతః కుర్యాత్ సంనిపాతే త్వయం విధిః ॥12॥**

ముందు మొదట చనిపోయినవానికి చేయాలి, పిమ్మట రెండోవానికి చేయాలి, అనంతరం మూడోవానికి చేయాలి. మిక్కిలి సమీపంలో జరిగిన సమయంలో ఈ విధినాచరించాలి.

**ప్రత్యబ్దమేవం యః కుర్యాద్యథాతథ మతంద్రితః ।**
**తారయిత్వా పితౄన్ సర్వాన్ ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥13॥**

ప్రతి సంవత్సరం ఎవడయితే ఈ విధంగా యథాతథంగా అలసత్వం చూపకుండా నిర్వహిస్తాడో, అతడు సమస్తపితరులను తరింపజేస్తాడు. తాను పరమగతిని పొందుతాడు.

**న జ్ఞాయతే మృతాహశ్చేత్ ప్రస్థాన దినమేవ చ ।**
**మాసశ్చేత్ స్యాత్ పరిజ్ఞాతస్తద్దర్శే స్యాన్మృతాహికమ్ ॥14॥**

అతడు చనిపోయినరోజు తెలియకపోయనా, అతడు మహాప్రస్థానంచేసినరోజుకు సంబంధించిన ఆ మాసం తెలిస్తేచాలు, ఆ మాసంలో మృతశ్రాద్ధం నిర్వహించాలి. అమావాస్యనాడు

**యదా మాసో న విజ్ఞాతో విజ్ఞాతం దినమేవ చ ।**
**తదా మార్గశిరే మాసి మాఘే వా తద్దినం భవేత్ ॥15॥**

చనిపోయినమాసం ఏదో తెలియకపోతే, చనిపోయిన రోజుమాత్రం తెలిస్తేచాలు, అప్పుడు మార్గశిరమాసంలో కాని, మాఘమాసంలో కాని ఆ దినాన్ని మృతదినంగా పాటించాలి.

**దినమాసావవిజ్ఞాతౌ మరణస్య యదా పునః ।**
**ప్రస్థానదిన మాసౌ తు గాహ్యౌ పూర్వప్రోక్తక్రమేణ తు ॥16॥**

మరణించినవాని దినం, మాసం తెలియకుండాపోతే, అతడు ప్రస్థానంచేసిన దిన మాసాలు తెలిస్తేచాలు. అటువంటివారి విషయంలో నేను ముందుచెప్పిన విధి క్రమంలో గ్రహించాలి.

**ప్రస్థానస్యాపి న జ్ఞాతౌ దినమాసౌ యదా పునః ।**
**మృతవార్తా శ్రుతౌ గ్రాహ్యౌ పూర్వప్రోక్త క్రమేణ తు ॥17॥**

ప్రస్థానం చేసిన అతని దిన మాసాలు కూడా తెలియకుండా ఉంటే, అతని మరణవార్త తెలిసిన దిన మాసాలు గ్రహించి పూర్వోక్త విధానంతో విధి నిర్వహించాలి.

**ప్రవాసమంతరేణాపి స్యాతాం తౌ విస్మృతౌ యదా ।**
**తదానీమపి తౌ గ్రాహ్యౌ పూర్వవత్తు మృతాహికే ॥18॥**

చాలాకాలం ప్రవాసంలో ఉండిపోయిన సందర్భంలో ఆ దిన మాసాలుకూడ విస్మరింపబడిన సందర్భంలో, అప్పుడుకూడ పూర్వంలాగే దినమాసాలను గ్రహించి, మృతిపొందిన రోజుగా స్వీకరించాలి.

**గృహస్థే ప్రోషితే యచ్చ కశ్చిత్తు మ్రియతే గృహే ।**
**ఆశౌచాపగమే యత్ర ప్రారబ్ధే శ్రాద్ధకర్మణి ॥19॥**

**ప్రత్యాగతశ్చే జ్జానాతి తత్ర వృత్తం గృహీ తథా ।**
**ఆశౌచం గృహిణస్తేషాం న ద్రవ్యాదే స్తదా భవేత్ ॥20॥**

ఇంటిలోని వారెవరైనా మరణించి, అశౌచం ముగిసి, అనంతర శ్రాద్ధకర్మలు జరుపుతున్న సమయంలో ప్రవాసి మరలివచ్చి, మృతివిషయం తెలుసుకుంటే యథావిధిగా అతనికి అశౌచం, అతని వస్తువులకు అశౌచంలేదు.

**పుత్రాదినా యదారబ్ధం శ్రాద్ధం తత్త్వేన వాఖిలమ్ ।**
**సమాపనీయం తత్రాపి శ్రాద్ధం గృహీ తు దూరతః ॥21॥**

గృహస్థుదెవడైనా దూరంగా వున్నపుడు పుత్రాదులచే ఆరంభింపబడిన శ్రాద్ధకర్మ నిశ్చయంగా వారిచే తనే ముగింపబడాలి. అప్పుడు కూడ ఆ శ్రాద్ధం అతడు దూరంగా ఉండి గ్రహించాలి,

**దాత్రా భోక్త్రా చ న జ్ఞాతం సూతకం మృతకం తథా ।**
**ఉభయోరపి తద్దోషం నారోపయతి కర్హిచిత్ ॥22॥**

**యదాత్వన్యతర జ్ఞాతం సూతకం మృతకం తథా ।**
**భోక్తురేవ తదాదోషో నాన్యో దాతా ప్రదుష్యతి ॥23॥**

శ్రాద్ధకర్మ జరుగుతున్నప్పుడు యజమానికి కానీ భోక్తకు కానీ జాతాశౌచమృతాశౌచాలు కలిగినా వారికి తెలియకపోతే ఇద్దరికీ ఏ దోషమూ లేదు. ఒకవేళ భోక్తకు మాత్రమే సూతకమృతకాల విషయం తెలిస్తే అప్పుడు భోక్తకుమాత్రమే దోషం. కాని ఏ దోషంచేత కూడ దాత(కర్త) దూషింపబడడు.

**ఇత్యుక్తేన ప్రకారేణ యః కుర్యాన్మృతవాసరమ్ ।**
**అవిజ్ఞాతమృతాహస్య సతతం తారయత్యసౌ ॥24॥**

ఈ చెప్పబడిన విధానంద్వారా మృతవాసరాన్ని నిర్ణయించుకొని కర్మ జరిపిస్తే ఆ కర్మ మృతతిథి తెలియకుండా చనిపోయినవానిని తరింపజేస్తుంది.

**నిత్యశ్రాద్ధేఽథ గంధాద్యై ర్ద్విజానభ్యర్చ్య భక్తితః ।**
**సర్వాన్ పితృగణాన్ సమ్యక్ సహైవోద్దిశ్య భోజయేత్ ॥25॥**

నిత్యశ్రాద్ధంతో సర్వపితృగణాలను ఉద్దేశించి భక్తితో ద్విజులను గంధాదులచే అర్చించి, (ద్విజులను పితృదేవతలుగా సంభావించి) భోజనం పెట్టాలి.

**ఆవాహనం స్వధాకారో పిండాగ్నౌకరణాదికమ్ ।**
**బ్రహ్మచర్యాదినియమా విశ్వేదేవాస్తథైవ చ ॥26॥**

**నిత్యశ్రాద్ధే త్యజేదేతాన్ భోజ్యమన్నం ప్రకల్పయేత్ ।**
**దత్త్వా తు దక్షిణాం శక్త్యా నమస్కారై ర్విసర్జయేత్ ॥27॥**

ఆవాహనం, స్వధాకారం, పిండదానం, అగ్నౌకరణం, బ్రహ్మచర్యాది నియమాలు, విశ్వేదేవకృత్యాలు వీటిని నిత్యశ్రాద్ధంలో విడిచిపెట్టాలి. ద్విజులను అన్నభోజనంచే తృప్తులను చేయాలి. శక్తిని అనుసరించి దక్షిణ ఇచ్చి నమస్కారంతో సాదరంగా వారికి వీడ్కోలుచెప్పాలి.

**దేవానుద్దిశ్య విశ్వాదీన్ యద్దద్యాద్ద్విజ భోజనమ్ ।**
**తన్నిత్య శ్రాద్ధవత్కార్యం దేవశ్రాద్ధం తదుచ్యతే ॥28॥**

విశ్వాదిదేవతలను ఉద్దేశించి ద్విజులకు భోజనం పెట్టడం నిత్యశ్రాద్ధపద్ధతిలోనే చేయబడాలి. అది దేవశ్రాద్ధం అని పిలవబడుతుంది.

**మాతృశ్రాద్ధస్తు పూర్వేణ కర్మాదౌ పైతృకం తథా ।**
**ఉత్తరేఽహని వృద్ధౌస్యాన్మాతామహగణస్య తు ॥29॥**

ఆరోజు ముందుగా మొదట మాతృశ్రాద్ధం చేసినపిమ్మట పైతృక కర్మను ఆచరించాలి, ఆ తరువాతరోజున మాతా మహగణాన్ని ఉద్దేశించి చేసే శ్రాద్ధం వృద్ధిశ్రాద్ధం అనబడుతుంది.

**శ్రాద్ధత్రయం ప్రకుర్వీత వైశ్వదేవస్తు తాంత్రికమ్ ॥30॥**

**మాతృభ్యః కల్పయేత్పూర్వం పితృభ్యస్తదనంతరమ్ ।**
**మాతామహేభ్యశ్చ తథా దద్యాదిత్థం క్రమేణ తు ॥31॥**

ఈ విధంగా మూడు శ్రాద్ధాలను చేయాలి, వైశ్వదేవం తాంత్రికం అనబడుతుంది. ముందు మాతృదేవతలకై శ్రాద్ధమాచరించాలి, ఆ తరువాత పితృదేవతలకై శ్రాద్ధంచేయాలి, తదనంతరం మాతామహగణానికి శ్రాద్ధమాచరించాలి. ఈ క్రమంలో దీనిని చేయాలి.

**మాతృశ్రాద్ధే తు విప్రాణామభావే సుకులోద్గతాః ।**
**పతిపుత్రాన్వితాః సాధ్వ్యో యోషితోఽష్టౌ చ భావయేత్ ॥32॥**

మాతృశ్రాద్ధం చేసేటప్పుడు మంచికులంనుండి పుట్టిన విప్రులు లభించనినాడు భర్తతోను, పుత్రులతోను కూడుకొన్న ఎనమండుగురు సాధ్వీమణులను ఆహ్వానించి భావనచేయాలి.

**ఇష్టాపూర్తాదికే శ్రాద్ధం కుర్యాదభ్యుదయం తథా ।**
**ఉత్పాతాది నిమిత్తేషు నిత్యశ్రాద్ధవదేవ తు ॥33॥**

ఇష్టాపూర్తాదికాలు నిర్వహించేటప్పుడు అభ్యుదయశ్రాద్ధం చేయాలి. అలాగే ఉత్పాతం మున్నగు నిమిత్తాలలో నిత్యశ్రాద్ధంవలె ఆచరించాలి.

**నిత్యం దైవఇ్చ వృద్ధిఇ్చ కామ్యం నైమిత్తికం తథా ।**
**శ్రాద్ధాన్యుక్త ప్రకారేణ కుర్వన్ సిద్ధిమవాప్నుయాత్ ॥**
**ఇతి తే కథితం తార్క్ష్య కిమన్యత్ పరిపృచ్ఛసి ॥34॥**

నిత్యం, దైవం, వృద్ధి, కామ్యం, నైమిత్తికం అనే శ్రాద్ధాలను చెప్పిన విధానప్రకారంగా చేస్తే సిద్ధిని పొందుతాడు. గరుడా! నీకు ఈ విధంగా చెప్పడం జరిగింది. ఇక ఏమి అడుగదలచావు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే ప్రత్యాబ్దికాది శ్రాద్ధనిరూపణం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥45॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో ప్రత్యాబ్దికశ్రాద్ధాదులు అనే నలబై అయిదవ అధ్యాయం సమాప్తం.

## **షట్చత్వారింశోఽధ్యాయః** - నలబై ఆరవ అధ్యాయం

## **శుభాశుభగతినిరూపణమ్** - శుభాశుభాలను గురించి

**తార్క్ష్య ఉవాచ** - గరుడుడు పలికాడు.

**సుకృతస్య ప్రభావేణ స్వర్గో నానావిధో నృణామ్ ।**
**భోగాః సౌఖ్యాని రూపఞ్చ బలం వృద్ధిః పరాక్రమః ॥1॥**

**సత్యం పుణ్యవతాం దేవ జాయతేఽత్ర పరత్ర చ ।**
**సత్యం సత్యం పునఃసత్యం వేదవాక్యం న చాన్యథా ॥2॥**

నరులకు పుణ్యప్రభావంవల్ల స్వర్గం నానావిధాలుగా ఉంటుంది. దేవా! పుణ్యవంతులకు భోగాలు, సౌఖ్యాలు, రూపం, బలం, వృద్ధి, పరాక్రమం ఇక్కడా అక్కడా కూడ సంభవిస్తాయనేది సత్యం, అది సత్యం, సత్యమది, ముమ్మాటికీసత్యం. వేదవాక్యం మరోవిధంగా ఉండదు కదా!

**ధర్మో జయతి నాధర్మః సత్యం జయతి నానృతమ్ ।**
**క్షమా జయతి న క్రోధో విష్ణుర్జయతి నాసురః ॥3॥**

ధర్మం జయిస్తుంది, అధర్మం జయాన్ని పొందలేదు, సత్యం జయిస్తుంది. అసత్యం జయించదు. క్షమ జయిస్తుంది కాని క్రోధం జయాన్ని పొందలేదు. విష్ణువు జయిస్తాడు, అసురుడు జయాన్ని పొందలేదు.

**తద్వత్సత్యం మయా జ్ఞాతం సుకృతాచ్ఛోభనం భవేత్ ।**
**యథోత్కృష్టతమం పుణ్యం తథోత్కృష్టతరో నరః ॥4॥**

ఆ విధంగా సత్యంగురించి నేను తెలిసికొనియున్నాను. పుణ్యంవల్ల మంగళం కలుగుతుంది, పుణ్యం పరమోత్కృష్టమయినట్లే, నరుడు కూడ మిక్కిలి ఉత్కృష్టుడు.

**ఏవన్తు శ్రోతుమిచ్ఛామి జాయంతే పాపినో యథా ।**
**యేన కర్మవిపాకేన యథా నియమభాగ్భవేత్ ॥5॥**

**యాం యాం యోని మవాప్నోతి యథా పూపశ్చ జాయతే ।**
**తన్మే వద సురశ్రేష్ఠ సమాసేనాపి కాంక్షితమ్ ॥6॥**

పాపాత్ములు ఏవిధంగా జన్మిస్తారనే విషయాన్ని వినాలని కోరుకొంటున్నాను, ఏ కర్మ విపాకంవల్ల జన్మ వస్తుంది? ఎలా కర్మఫలితాలను పొందుతాడు? ఏ ఏ జన్మలను పొందుతాడు? ఎటువంటి రూపం కలుగుతుంది? సురశ్రేష్ఠా! ఇది నా కోరిక, దానిని గురించి సంక్షిప్తంగానైనా నాకు చెప్పవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**శుభాశుభఫలై స్తార్క్ష్య భుక్తభోగా నరా స్త్విహ ।**
**జాయంతే లక్షణైర్యైస్తు తాని మే శృణు కాశ్యప ॥7॥**

కశ్యపవంశ సంజాతా! గరుడా! ఇక్కడ నరులు శుభాశుభఫలితాలతో భోగాలు అనుభవిస్తారు, ఏ లక్షణాలచే ఎలా జన్మిస్తారో వాటిని నాద్వారా విను.

**గురురాత్మవతాం శాస్తా రాజా శాస్తా దురాత్మనామ్ ।**
**ఇహ ప్రచ్ఛన్నపాపానాం శాస్తా వైవస్వతో యమః ॥8॥**

ఆత్మజ్ఞానులను శాసించేవాడు గురువు, దురాత్ములకు శాసకుడు రాజు, ఇక్కడ ప్రచ్ఛన్నంగా పాపాలుచేసేవారికి శాసకుడు యమధర్మరాజు,

**ప్రాయశ్చిత్తేష్వచీర్ణేషు యమలోకా హ్యనేకధా ।**
**యాతనాభిర్విముక్తా యే యాంతి తే జీవసంతతిమ్ ॥9॥**

ప్రాయశ్చిత్తాలు తెలుసుకోకపోతే (దాటకపోతే) అనేకవిధాలైన యమలోకాలు పొంది, యాతనలు అనుభవించి, ముక్తులైనవారు జీవసంతతిని పొందుతారు.

**గత్వా మానుషభావే తు పాపచిహ్నా భవంతి తే ।**
**తాన్యహం తవ చిహ్నాని కథయిష్యే ఖగోత్తమ ॥10॥**

ఆ పాపచిహ్నులు మానుషభావాన్ని పొందేవారవుతారు, ఖగోత్తమా! ఆ పాప చిహ్నాలను నేను నీకు వివరిస్తాను.

**సోఢ్వా వై యాతనాః సర్వా గత్వా వైవస్వతక్షయమ్ ।**
**నిస్తీర్ణయాతనాస్తేతు లోకమాయాంతి చిహ్నితాః ॥11॥**

అన్నియాతనలు సహించి, వైవస్వతస్థానంనుండి తప్పించుకొంటారు, అన్నియాతనలు తరించినవారై వారు కొన్ని శేషచిహ్నాలతో తిరిగి ఈ లోకానికి చేరుకొంటారు.

**గద్గదోఽనృతవాదీ స్యాన్మూకశ్చైవ గవానృతే ।**
**బ్రహ్మహా జాయతే కుష్ఠీ శ్యావదంతశ్చ మద్యపః ॥12॥**

అసత్యవచనుడు బొంగురుపోయిన కంఠధ్వని కలవాడు, గోవులువిషయంలో అనృతమాడేవాడు, మూగవాడు అవుతాడు. బ్రహ్మహత్యచేసినవాడు కుష్ఠరోగి అవుతాడు. మద్యపానంచేసేవాడు పిప్పిపళ్లు కలవాడవుతాడు,

**కునఖీ స్వర్ణహరణాద్దుశ్చర్మా గురుతల్పగః ।**
**సంయోగీ హీనయోనిః స్యాద్దరిద్రోఽదత్తదానతః ॥13॥**

స్వర్ణాపహారి చెడ్డగోళ్లుకలవాడు, గురుతల్పగుడు చెడుచర్మం కలవాడవుతాడు. సంయోగంచేసేవాడు హీనయోని అవుతాడు, దానాలు చేయనివాడు దరిద్రుడు అవుతాడు.

**అయాజ్య యాజకో యాతి గ్రామసూకరతాం ద్విజః ।**
**ఖరో వై బహుయాజీ స్యాత్ కాకో నిర్మంత్రభోజనాత్ ॥14॥**

యజనార్హతలేక యాజకుడైన ద్విజుడు గ్రామ సూకరమవుతాడు, బహుయాజి ఖరు డవుతాడు, ఎవరినీ భోజనానికి ఆహ్వానించనివాడు కాకి అవుతాడు,

**అపరీక్షిత భోక్తారో వ్యాఘ్రాః స్యు ర్నిర్జనే వనే ।**
**బహుతర్జకో మార్జారః ఖద్యోతః కక్షదాహకః ॥15॥**

పరీక్షించకుండా భోజనంచేసేవారు నిర్జనవనంలో వ్యాఘ్రాలు అవుతారు, ఎక్కువమందిని పీడించేవాడు పిల్లి అవుతాడు, గడ్డివాములను అంటించేవాడు మినుగురుపురుగు అవుతాడు.

**పాత్రే విద్యాఽప్రదాతా చ బలీవర్దో భవేత్తు సః ।**
**అన్నం పర్యుషితం విప్రే ప్రదదత్ కుక్కురో భవేత్ ॥16॥**

పాత్రుడైనవానికి విద్యాదానం చేయనివాడు ఎద్దు అవుతాడు, విప్రునికి పాసిపోయిన అన్నంపెట్టినవాడు కుక్క అవుతాడు.

**మాత్సర్యాదపి జాత్యంధో జన్మాంధః పుస్తకం హరన్ ।**
**ఫలాన్యాహరతోఽపత్యం మ్రియతే నాత్ర సంశయః ॥17॥**

మాత్సర్యంవల్ల జాత్యంధుడవుతాడు, పుస్తకాన్ని అపహరించేవాడు పుట్టుగ్రుడ్డి అవుతాడు, ఫలాలను అపహరించేవాని సంతానం చనిపోతుంది. ఇందు సంశయంలేదు.

**మృతో వానరతాం యాతి తన్ముఖో గండవాన్భవేత్ ।**
**అదత్వా భక్ష్యమశ్నాతి అనపత్యో భవేత్తు సః ॥18॥**

అతడు (ఫలాలను అపహరించినవాడు) చనిపోయినపిమ్మట వానరత్వాన్ని పొందుతాడు, వానిముఖం కురుపులతో కూడి ఉంటుంది, ఎవరికీ ఈయకుండా భక్ష్యాలను ఆరగించేవాడు సంతానహీనుడవుతాడు.

**హరన్వస్త్రం భవేద్గోధా గరదః పవనాశనః ।**
**ప్రవ్రజ్యాగమనాద్రాజన్ భవేన్మరుపిశాచకః ॥19॥**

వస్త్రాన్ని అపహరించేవాడు ఉడుము అవుతాడు, విషంపెట్టేవాడు పాము అవుతాడు, పక్షిరాజా! సంన్యసించి తిరిగివచ్చినవాడు మరుభూమిలో పిశాచమవుతాడు.

**చాతకో జలహర్తా స్యాద్ధాన్యహర్తా చ మూషిక ।**
**అప్రాప్తయౌవనాం సేవన్ భవేత్సర్ప ఇతిశ్రుతిః ॥20॥**

జలాన్ని హరించేవాడు చాతకపక్షి అవుతాడు, ధాన్యాన్ని దొంగిలించేవాడు ఎలుక అవుతాడు, యౌవనంరాని కాంతను సేవించేవాడు సర్పం అవుతాడని వినికిడి,

**గురుదారాభిలాషీ చ కృకలాసో భవేద్ధ్రువమ్ ।**
**జలప్రస్రవణం యస్తు భింద్యాన్మత్స్యో భవేన్నరః ॥21॥**

గురువుగారి భార్యను అభిలషించేవాడు నిశ్చయంగా తొండ అవుతాడు, జలప్రవాహాన్ని అడ్డుకట్టవేసే నరుడు చేప అవుతాడు.

**అవిక్రేయ క్రయాచ్చైవ బకో గృధ్రో భవేన్నరః ।**
**అయోనిగో వృకో హి స్యాదులూకః క్రయవంచనాత్ ॥22॥**

అమ్మకూడనిదానిని అమ్మేటటువంటి నరుడు కొంగకాని, గ్రద్దకాని అవుతాడు. యోనిసంబంధమైన అనుభవాన్ని పొందకుండా ఉండేవాడు వృకం అవుతాడు, అమ్మకం,కొనుగోళ్లలో వంచనచేసేవాడు గుడ్లగూబ అవుతాడు.

**మృతస్యైకాదశాహే తు భుంజానశ్చాభిజాయతే ।**
**ప్రతిశ్రుత్య ద్విజేభ్యోఽ ఽ ర్థ మదదజ్జంబుకో భవేత్ ॥23॥**

మృతుడుచనిపోయిన పదకొండోరోజున, భోజనంచేసేవాడు లభిస్తే, ఆ బ్రాహ్మణులకు అర్థం (ధనం) ఇస్తానని మాటఇచ్చి, ఈయనివాడు నక్కఅవుతాడు.

**రాజ్ఞీం గత్వా భవేద్దంష్ట్రీ తస్కరో విడ్వరాహకః ।**
**శారివా ఫలవిక్రేతా వృషశ్చ వృషలీపతిః ॥24॥**

రాణిని పొందినవాడు కోరలుకల్గిన జంతువవుతాడు, తస్కరుడు మలభక్షణచేసే పందిఅవుతాడు, ఫలాలు అమ్మేవాడు గోరువంక అవుతాడు, వృషలీపతి వృషమవుతాడు.

**మార్జారోఽ గ్నిం పదా స్పృష్ట్వా రోగవాన్పరమాంసభుక్ ।**
**ఉదక్యాగమనాత్ షణ్డో దుర్గంధశ్చ సుగంధహృత్ ॥25॥**

అగ్నిని పాదంతో తాకేవాడు మార్జారం అవుతాడు, పరమాంసాన్ని తినేవాడు రోగగ్రస్తుడవుతాడు, రజస్వలను పొందేవాడు షండుడవుతాడు, సుగంధాన్ని హరించేవాడు చెడువాసన కలిగేవాడవుతాడు.

**యద్వా తద్వాపి పారక్యం స్వల్పం వా హరతే బహు ।**
**హృత్వా వై యోనిమాప్నోతి తిరశ్చాం నాత్ర సంశయః ॥26॥**

ఏది ఏమయినా పరుల సంబంధమైన దానిని తక్కువైనా, ఎక్కువైనా హరించేవాడు తిర్యగ్యోనిని పొందుతాడు, అందు సంశయంలేదు.

**ఏవమాదీని చిహ్నాని అన్యాన్యపి ఖగేశ్వర ।**
**స్వకర్మ వితతాన్యేవ దృశ్యంతే యైస్తు మానవైః ॥27॥**

ఖగేశ్వరా! ఇటువంటి చిహ్నాలూ ఇతరాలు కూడా తమ తమ కర్మల విస్తృతిచేత ఎన్నో మానవులచే చూడబడుతున్నాయి.

**ఏవం దుష్కృత కర్మా హి భుక్త్వా చ నరకాన్ క్రయాత్ ।**
**జాయతే కర్మ శేషేణ ఉక్తాస్వేతాసు యోనిషు ॥28॥**

ఈవిధంగా పాపకర్మలు చేసేవాడు క్రమంగా నరకాలను అనుభవించి, కర్మశేషంతో చెప్పబడిన ఆయా యోనులలో జన్మిస్తాడు.

**తతో జన్మశతం మర్త్యే సర్వజంతుషు కాశ్యప ।**
**జాయతే నాత్రసందేహః సమీభూతే శుభాశుభే ॥29॥**

కాశ్యపా! శుభాశుభాలను సమానంగా అనుభవిస్తూ, సర్వప్రాణులయందు మానవలోకంలో వందలకొలది జన్మలు ధరిస్తాడు. అందు సందేహం లేదు.

**స్త్రీ పుంసయోః ప్రసంగేన నిరుద్ధే శుక్రశోణితే ।**
**సముపేతః పంచభూతైర్జాయతే పాంచభౌతికః ॥30॥**

స్త్రీ పురుషుల సంయోగంలో శుక్రశోణితాలు కలువగా, పంచభూతాలతో కూడుకొన్న పాంచభౌతిక శరీరం ధరిస్తాడు.

**ఇంద్రియాణి మనః ప్రాణా జ్ఞానమాయుః సుఖం ధృతిః ।**
**ధారణా ప్రేరణం దుఃఖం మిథ్యాహంకార ఏవ చ ॥31॥**

**ప్రయతాకృతి వర్ణస్తు రాగద్వేషౌ భవాభవౌ ।**
**తస్యేద మాత్మనః సర్వమనాదేరాది మిచ్ఛతః ॥32॥**

**స్వకర్మబద్ధస్య తదా గర్భవృద్ధిర్భవేదితి ।**
**పురా యథా మయా ప్రోక్తం తవ జంతోర్హి లక్షణమ్ ॥33॥**

ఇంద్రియాలు, మనస్సు, ప్రాణాలు, జ్ఞానం, ఆయుష్షు, సుఖం, ధృతి, ధారణ, ప్రేరణ, దుఃఖం, మిథ్యాహంకారం, నియతమైన ఆకారవర్ణాలు, రాగద్వేషాలు, ఉండడం, లేకపోవడం (ఉనికి, శూన్యం) మున్నగునవి ప్రాణికి కోరికలవల్ల, తనంతటతానే అనాదినుండి ఆదివరకు తనకర్మలవల్ల బద్ధుడైన ప్రాణికి అప్పుడు గర్భవృద్ధి కలుగుతుందని పూర్వం నీకు నేను చెప్పినరీతిగా జంతువు(ప్రాణి)కు లక్షణం సంభవిస్తుంది.

**ఏవం ప్రవర్తితం చక్రం భూతగ్రామే చతుర్విధే ।**
**సముత్పత్తి ర్వినాశశ్చ జాయతే తార్క్ష్య దేహినామ్ ॥34॥**

ఈవిధంగా నాలుగు విధాలైన భూతసమూహాలలోను జీవనచక్రం తిరుగుతూ ఉంటుంది, గరుడా! ప్రాణులకు ఉత్పత్తి, వినాశం సంభవిస్తూ ఉంటాయి.

**స్వధర్మేణైవోర్ధ్వగతి రధర్మేణాప్యధోగతిః ।**
**జాయతే సర్వవర్ణానాం స్వధర్మచలనాత్ ఖగ ॥35॥**

స్వధర్మాచరణవల్ల ఊర్ధ్వగతి, అధర్మాచరణవల్ల అధోగతి కలుగుతాయి. ఖగమా! సర్వవర్ణాలవారికి స్వధర్మం నుండీ కలిగే చలనం వల్ల ఈగతి సంభవిస్తుంది.

**దేవత్వే మానుషత్వే చ దానభోగాదికాః క్రియాః ।**
**యా దృశ్యంతే వైనతేయ తత్సర్వం కర్మజం ఫలమ్ ॥36॥**

వైనతేయా! దేవత్వమందుకాని, మానుషత్వమందుకాని, ఏఏ దాన భోగాదిక్రియలు కనబడుతూ ఉంటాయో, అదంతా కర్మసంభవమైన ఫలితమే,

**అకర్మవిహతే ఘోరే కామక్రోధార్జితేఽశుభే ।**
**పతేద్వై నరకే భూయో తస్యోత్తారో న విద్యతే (భూయః) ॥37॥**

కామ క్రోధాదులచే సంపాదింపబడి, అశుభమైన, నిషిద్ధకర్మాచరణచే ఘోరమైన నరకమునందు పడిపోతాడు. తిరిగి వానిని ఉద్ధరించేవాడు ఎవడూ కనిపించడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే జీవస్య శుభాశుభగతి నిరూపణం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥46॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో శుభాశుభాలను గురించి అనే నలభై ఆరవ అధ్యాయం సమాప్తం.

## **సప్తచత్వారింశోఽధ్యాయః** – నలభై ఏడవ అధ్యాయం

## **కర్మవిపాకాదినిరూపణమ్** – కర్మవిపాకం మొదలగునవి

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**భగవన్ దేవదేవేశ కృపయా పరయా వద ।**
**దానం దానస్య మాహాత్మ్యం వైతరణ్యాః ప్రమాణకమ్ ॥1॥**

స్వామీ! దేవదేవేశ్వరా! దానంగురించి, దానంయొక్క గొప్పదనం గురించి, వైతరణియొక్క ప్రమాణం గురించి, మిక్కిలిదయతో తెలియజేయవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**యా సా వైతరణీ నామ యమమార్గే మహాసరిత్ ।**
**అగాధా దుస్తరా పాపైర్దృష్టమాత్రా భయావహా ॥2॥**

యమమార్గంలోని వైతరణి అనుపేరుగల మహానది చాలా లోతైనది పాపాత్ములకు తరింప శక్యంకానిది, చూచినంతమాత్రంచేతనే భయాన్ని కలిగించేది.

**పూయశోణితతోయాఢ్యా మాంసకర్దమసంకులా ।**
**పాపినశ్చాగతాన్ దృష్ట్వా నానాభయసమావృతా ॥3॥**

చీము, నెత్తురుతో కూడిన నీరు, మాంసపు బురదతో నిండుగా అల్లకల్లోలంగా ఉంటుంది, అక్కడకువచ్చి నిలిచే పాపులనుచూచి అనేక విధాలైన భయాలతో గుబులు రేపుతుంది.

**క్వాథ్యతే సత్వరం తోయం పాత్రమధ్యే ఘృతం యథా ।**
**క్రిమిభిః సంకులం పూయం వజ్రతుండైః సమావృతమ్ ॥4॥**

పాత్రమధ్యలో నెయ్యి మరుగుతున్నట్లుగా నీళ్లు వేగంగా సల సల మరుగుతున్నట్లు ఉంటాయి, క్రిములతో కూడుకొన్న చీముదోమలను చుట్టుముట్టి ఉంటాయి.

**శిశుమారైశ్చ మకరై ర్వజ్రకర్తరికాయుతైః ।**
**అన్యైశ్చ జలజీవైశ్చ హింసకైర్మాంసభేదిభిః ॥5॥**

కత్తెరలవంటి పళ్లతో కూడుకొన్న శిశుమారాలతోను, మకరాలతోను, మాంసాలను ఛేదించి హింసించే మిగిలిన జంతువులతోను కూడి ఉంటుంది. (శిశుమారం, మకరం మొసళ్ళలోని భేదాలు)

**ఉద్యాంతి ద్వాదశాదిత్యాః ప్రలయాంతే తథా హి తే ।**
**తపంతి తత్ర వై మర్త్యాః క్రందమానాస్తు పాపినః ॥6॥**

ప్రలయావసాన సమయంలో ద్వాదశాదిత్యులు ఉదయించినట్లుగా ఉంటుంది. అక్కడ పాపాత్ములైన మర్త్యులు ఆక్రందిస్తూ మలమల మాడిపోతూ ఉంటారు.

**హా భ్రాతః పుత్ర తాతేతి ప్రలపంతి ముహుర్ముహుః ।**
**విచరంతి నిమజ్జంతి గ్లానిం గచ్ఛంతి జంతవః ॥7॥**

అయ్యో! అన్నయ్యా! (తమ్ముడూ!) నాన్నా! అంటూ మాటి మాటికీ విలపిస్తూ ఉంటారు, అక్కడ ప్రాణులు ఇటు అటూ పరుగులుతీస్తూ, మునిగి తేలుతూ, ఎంతో శ్రమ పడతారు.

**చతుర్విధైః ప్రాణిగణై ర్దృష్టా వ్యాప్తా మహానదీ ।**
**తరంతి గోప్రదానేన త్వన్యథా చ పతంతి తే ॥8॥**

నాలుగు విధాలైన ప్రాణిసమూహాలతో వ్యాపించి ఆ మహానది గోచరిస్తుంది, గోదానం చేసినట్లయితే దానిని తరించగలరు. లేకపోతే ఆ పాపులు అందుపడిపోతారు.

**మాం నరా యేఽవమన్యంతే చాచార్యం గురుమేవ చ ।**
**వృద్ధానన్యాంశ్చాపి మూఢా స్తేషాం వాసస్తు తత్ర వై ॥9॥**

ఏ నరులు నన్ను అవమానిస్తారో, ఆచార్యుని, గురువును, మిగిలిన వృద్ధులను ఏ మూఢులయితే అగౌరవపరుస్తారో, వారికి అక్కడ అది నివాస మవుతుంది.

**పతివ్రతాం సాధుశీలాం మూఢాం ధర్మేషు నిశ్చలామ్ ।**
**పరిత్యజంతి యే మూఢాస్తేషాం వాసస్తు సంతతమ్ ॥10॥**

పతివ్రత అయి, సాధుశీల అయి, ధర్మాచరణయందు చలించని బుద్ధి కల్గిన స్త్రీని ఏ మూఢులు పరిత్యజిస్తారో, వారికి ఎల్లప్పుడు అది నివాసం అవుతుంది.

**విశ్వాస ప్రతిపన్నానాం స్వామిమిత్ర తపస్వినామ్ ।**
**స్త్రీబాల వికలాదీనాం వధం కృత్వా పతంతి హి ॥**
**పచ్యంతే తత్ర మధ్యే తు క్రందమానాస్తు పాపినః ॥11॥**

విశ్వాసంతో పరిపూర్ణంగా ఆశ్రయించిన యజమానులను, మిత్రులను, తపస్వులను, స్త్రీలను, బాలురను, వికలాంగులు మున్నగువారిని వధించే పాపాత్ములు ఆ నదీమధ్యభాగంలో పడి, కుత కుత ఉడుకుతూ, ఆ ఆక్రందన చేస్తూ ఉంటారు.

**శాంతం బుభుక్షితం విప్రం యో విఘ్నాయోపసర్పతి ।**
**క్రిమిభిర్భక్ష్యతే తత్ర యావదాభూతసంప్లవమ్ ॥12॥**

ఆకలితో నకనకలాడుతూ, శాంతుడైన విప్రుని చంపటానికి సమీపించినవాడు అక్కడ భూతప్రలయ పర్యంతం క్రిములచే భక్షింపబడుతూఉంటాడు.

**బ్రాహ్మణాయ ప్రతిశ్రుత్య యమర్థం న దదాతి తమ్ ।**
**ఆహూయ నాస్తి యో బ్రూయాత్ తస్య వాసస్తు తత్ర వై ॥13॥**

బ్రాహ్మణునకు అర్థాన్ని ఇస్తానని ప్రత్యేకంగాచెప్పి, ఈయకుండా ఉంటే, అతనిని ఆహ్వానించి లేదని చెబితే, అతనికి అక్కడ అది నివాసం అవుతుంది.

**అగ్నిదో గరదశ్చైవ కూటసాక్షీ చ మద్యపః ।**
**యజ్ఞవిధ్వంసకశ్చైవ రాజ్ఞీగామీ చ పైశునః ॥14॥**

**కథాభంగకరశ్చైవ స్వయందత్తాపహారకః ।**
**క్షేత్రసేతు విభేదీ చ పరదార ప్రధర్షకః ॥15॥**

**బ్రాహ్మణో సరవిక్రేతా తథా యో వృషలీపతిః ।**
**గోధనస్య చ తృషార్తస్య వాప్యా భేదం కరోతి యః ॥16॥**

**కన్యా విదూషకశ్చైవ దానం దత్త్వానుతాపకః ।**
**శూద్రస్తు కపిలాపాయీ బ్రాహ్మణో మాంసభోజనః ॥17॥**

**ఏతే వసంతి సతతం మా విచారం కృథాః క్వచిత్ ।**
**కృపణో నాస్తికః క్షుద్రః స తస్యాం నివసేత్ఖగ ॥18॥**

నిప్పు పెట్టేవాడు, విషం పెట్టేవాడు, అబద్ధపుసాక్ష్యం చెప్పేవాడు, మద్యపానం చేసేవాడు, యజ్ఞాలను ధ్వంసం చేసేవాడు, మహారాజ్ఞిని అనుగమించేవాడు, దుర్జనుడు, పురాణకథకు భంగం కలుగజేసేవాడు, తానే ఇచ్చినదానిని అపహరించేవాడు, క్షేత్రాలను, వంతెనలను విధ్వంసం చేసేవాడు, పరదారలను బలాత్కరించేవాడు, (పాదరసం) రసాలను అమ్మే బ్రాహ్మణుడు, వృషలీభర్త అయిన బ్రాహ్మణుడు, గోధనానికి, దాహపీడితునికి బావిలేకుండా అడ్డుపడేవాడు, కన్యలను దూషించేవాడు(కన్యలపట్ల విదూషకపాత్ర పోషించేవాడు), దానంఇచ్చి పరితపించేవాడు, కపిలగోవు పాలుత్రాగే శూద్రుడు, మాంసాన్ని భుజించే బ్రాహ్మణుడు. అటువంటివారందరూ ఎల్లప్పుడూ అందు ఉంటారు, (ఎక్కడా) ఎప్పుడూ మరో ఆలోచన చేయవద్దు, ఖగమా! కృపణుడు, నాస్తికుడు, క్షుద్రుడు అయినవాడు అందు నివసిస్తాడు.

**సదామర్షీ సదాక్రోధీ నిజవాక్య ప్రమాణకృత్ ।**
**పరోక్త్యుచ్ఛేదకో నిత్యం వైతరణ్యాం వసేచ్చిరమ్ ॥19॥**

**యస్త్వహంకారవాన్ పాపీ స్వవికత్థనకారకః ।**
**కృతఘ్నో గర్భసంతాపీ వైతరణ్యాం స మజ్జతి ॥20॥**

ఎల్లప్పుడూ ఓర్వలేనితనంతో ఉండేవాడు, ఎల్లప్పుడూ కోపంతో ఉండేవాడు, తనమాటనే ప్రమాణంగా చేసుకొనేవాడు, నిత్యం ఎదుటివారి మాటలను పూర్తిగా తిరస్కరించేవాడు, ఎల్లప్పుడూ వైతరణిలో నివసిస్తాడు.

అహంకారియైన పాపాత్ముడూ, తననుతాను పొగడుకొనేవాడు, కృతఘ్నుడు, గర్భసంతాపాన్ని కలుగజేసేవాడు వైతరణిలో మునకలువేస్తూ ఉంటాడు.

**కదాపి భాగ్యయోగేన తరణేచ్ఛా భవేద్యది ।**
**సానుకూలా భవేద్యేన తదాకర్ణయ కాశ్యప ॥21॥**

ఏదో ఒకానొక భాగ్యవిశేషంచేత, దానిని తరించేకోరిక కలిగినట్లయితే, కాశ్యపా! ఎవరికి అది సానుకూలం అవుతుందో దానిని విను.

**అయనే విషవే పుణ్యే వ్యతీపాతే దినోదయే ।**
**చంద్ర సూర్యోపరాగే వా సంక్రాంతౌ దర్శవాసరే ॥22॥**

**అన్యేషు పుణ్యకాలేషు దీయతే దానముత్తమమ్ ।**
**తదా తదా భవేద్వాపి శ్రద్ధా దానం ప్రతిధ్రువమ్ ॥23॥**

అయనసమయమందు, పుణ్యమైన విషవతిథియందు, వ్యతీపాతయోగమందు, దినోదయమందు, చంద్ర సూర్యగ్రహణాలందు, సంక్రమణమందు, దర్శవాసరమందు మిగిలిన పుణ్యకాలాలందు, (ఎప్పుడెప్పుడయితే నిశ్చయంగా దానం గురించి శ్రద్ధ జనిస్తుందో, అప్పుడు) ఉత్తమమైన దానం చేయాలి.

**తదైవ దానకాలః స్యాద్యతః సంపత్తి రస్థిరా ।**
**అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః ॥24॥**

(ఎప్పుడెప్పుడయితే నిశ్చయంగా దానంగురించి శ్రద్ధ జనిస్తుందో,) అదే దానానికి తగిన సమయం, ఎందువల్లనంటే సంపదలా స్థిరంగా ఉండేవికావు. శరీరాలా అనిత్యాలు, వైభవమా శాశ్వతం కాదు,

**నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః ।**
**కృష్ణాం వా పాటలాం వాపి కుర్యాద్వైతరణీం శుభామ్ ॥25॥**

మృత్యువెల్లప్పుడూ మిక్కిలి సమీపంలో ఉంటుంది, అందువల్ల వీలైనంత తొందరలో ధర్మసంగ్రహం చేయాలి, నల్లనైన లేదా ఎఱ్ఱనైన మంచి వైతరణీధేనువును దానంచేయాలి.

**స్వర్ణశృంగీం రౌప్యఖురాం కాంస్యపాత్రోపదోహనీమ్ ।**
**కృష్ణవస్త్రయుగాచ్ఛన్నాం సప్తధాన్య సమన్వితామ్ ॥26॥**

బంగారు కొమ్ములతోను, గిట్టలను వెండితో అలంకరించి, రెండు నల్లని వస్త్రాలను కప్పి, పాలుపితకడానికి సప్త ధాన్యాలతో నింపిన రాగిపాత్రను దానంచేయాలి.

**కార్పాసద్రోణ శిఖరే ఆసీనం తామ్రభాజనే ।**
**యమం హైమం ప్రకుర్వీత లోహదండసమన్వితమ్ ॥**
**ఇక్షుదండమయం బద్ధ్వా ప్లవం సుదృఢబంధనైః ॥27॥**

ప్రత్తితో చేసిన ద్రోణాచల శిఖరంవంటిదానిపై, రాగిపాత్రలో ఇనుపదండాన్నిపట్టుకొని కూర్చున్నట్లు ఉన్న యమధర్మరాజు బంగారు ప్రతిమను స్థాపించాలి. చెరకుగడలతో, మిక్కిలి గట్టివైన త్రాళ్లతోబంధించి, ఒక పడవను తయారుచేయాలి.

**ఉడుపోపరి తాం ధేనుం సూర్యదేహసముద్భవామ్ ।**
**కృత్వా ప్రకల్పయేద్విప్రశ్ఛత్రోపానహ సంయుతమ్ ॥28॥**

**అంగులీయకవాసాంసి బ్రాహ్మణాయ నివేదయేత్ ।**
**ఇమముచ్చారయేన్మంత్రం సంగృహ్య సజలాన్ కుశాన్ ॥29॥**

ఆ తెప్పపై సూర్యుని దేహంనుండి ఉద్భవించిన సూర్యపుత్రికగా ఆ గోవును సంభావించి; గొడుగు, పాదుకలతో ఉంగరం, వస్త్రాలతో కలిపి ఒక శ్రేష్ఠబ్రాహ్మణునకు నివేదించాలి. నీళ్లతో కూడిన నువ్వులను పట్టుకొని ఈ మంత్రాన్ని పఠించాలి.

**యమద్వారే మహాఘోరే శ్రుత్వా వైతరణీం నదీమ్ ।**
**తర్తుకామో దదామ్యేనాం తుభ్యం వైతరణీం నమః ॥30॥**

మహాఘోరమైన యమద్వారసమీపంలో వైతరణీనది ఉందని విని, దానిని తరించే కోరికతో, ఈ వైతరణీధేనువును దానంచేస్తున్నాను. నీకు నమస్కారం.

**గావో మే అగ్రతః సన్తు గావో మే సన్తు పార్శ్వతః ।**
**గావో మే హృదయే సన్తు గవాం మధ్యే వసామ్యహమ్ ॥31॥**

ఆవులు నా ఎదుట ఉండు గాక! నా పార్శ్వభాగాలందు గోవులు ఉండు గాక! నా హృదయంలో ధేనువులు ఉండు గాక! నేను గోవులమధ్యలో వసిస్తాను.

**విష్ణురూప ద్విజశ్రేష్ఠ మాముద్ధర మహీసుర ।**
**సదక్షిణయా మయా దత్తా తుభ్యం వైతరణీ నమః ॥32॥**

విష్ణురూపా! ద్విజశ్రేష్ఠా! మహీసురా! నన్ను ఉద్ధరించు. దక్షిణతో కూడుకొని నేను వైతరణీదానం చేయుచున్నాను. నీకు నమస్కారం.

**ధర్మరాజఇ్చ సర్వేశం వైతరణ్యాఖ్య ధేనుకామ్ ।**
**సర్వం ప్రదక్షిణీకృత్య బ్రాహ్మణాయ నివేదయేత్ ॥33॥**

తరువాత సర్వులకు ప్రభువైన యమధర్మరాజుప్రతిమకు, వైతరణి అనే పేరుకల్గిన ఆవుకు, ప్రదక్షిణంచేసి మొత్తమంతా బ్రాహ్మణునికి దానంచేయాలి.

**పుచ్ఛం సంగృహ్య ధేన్వాశ్చ అగ్రే కృత్వా వై ద్విజమ్ ।**
**ధేనుకే త్వం ప్రతీక్షస్వ యమద్వారే మహాభయే ॥34॥**

**ఉత్తారణాయ దేవేశి వైతరణ్యే నమోఽస్తు తే ।**
**అనువ్రజేత్తు గచ్ఛన్తం సర్వం తస్య గృహం నయేత్ ॥35॥**

ఆవుయొక్క తోకను చేతితో పట్టుకొని, ద్విజుని ముందు ఉంచి "ఓ ధేనువా! మహా భయంకరమైన యమద్వారమందు నన్ను తరింపజేయడానికై నీవు ఉండవలసింది. దేవేశీ! వైతరణీ! నీకు నమస్కారం" అని పలుకుతూ సర్వం అతనికి సమర్పించి, అతనిని అనుసరించి వెళుతున్న ఆ ద్విజుని, ఆ గోవును ఇంటివరకు సాగనంపాలి.

**ఏవంకృతే వైనతేయ సా సరిత్సుతరా భవేత్ ।**
**సర్వాన్కామానవాప్నోతి యో దద్యాద్భువి మానవః ॥36॥**

వైనతేయా! ఈ విధంగాచేస్తే ఆ నది సులభంగా తరింపజేస్తుంది (నదిని సులభంగా దాటవచ్చు). భూమియందు దీనిని దానంచేసిన మానవుడు అన్ని కోరికలను పొందుతాడు.

**సుకృతస్య ప్రభావేణ సుఖఞ్చేహ పరత్ర చ ।**
**స్వస్థే సహస్రగుణితమాతురే శతసమ్మితమ్ ॥37॥**

**మృతస్యైవ తు యద్దానం పరోక్షే తత్సమం స్మృతమ్ ।**
**స్వహస్తేన తతో దేయం మృతే కః కస్య దాస్యతి ॥38॥**

ఆ దానసుకృతప్రభావంచే ఇహలోకంలోను, పరలోకంలోను సుఖం కలుగుతుంది. తాను స్వస్థుడుగా ఉన్నప్పుడే దానంచేస్తే వేయిరెట్లు ఫలితం, మరణాసన్న సమయంలో దానంచేస్తే వందరెట్లు ఫలితం, చనిపోయినవాని విషయంలో పరోక్షంగా దానంచేసినా, దానితో సమానమైన ఫలితమే సిద్ధిస్తుంది. అందువల్ల తనచేతులతో తానిచ్చే దానమే ఉత్తమమైనది. చనిపోయిన తరువాత ఎవడు ఏమి ఇస్తాడో, ఎవనికి తెలుసు?

**దానధర్మ విహీనానాం కృపణై ర్జీవితేక్షితైః ।**
**అస్థిరేణ శరీరేణ స్థిరం కర్మ సమాచరేత్ ॥39॥**

దానం, ధర్మం ఏమీలేని లుబ్ధులు జీవితంలో అన్నింటిని చూచుకొంటూ, లెక్కించుకొంటూ ఉంటారు. అశాశ్వతమైన శరీరంతో శాశ్వతమైన కర్మ చేయాలి.

**అవశ్యమేవ యాస్యంతి ప్రాణాః ప్రాఘు (ఘూ)ర్ణికా ఇవ ॥40॥**

ప్రాణాలు తిరుగుతూ ఉండే అతిథులుగా ఎప్పుడూ వెళ్లిపోతూ ఉంటాయి.

**ఇతీదముక్తం తవ పక్షిరాజ విడంబనం జంతుగుణస్య సర్వమ్ ।**
**ప్రేతస్య మోక్షాయ తదౌర్ధ్వదైహికం హితాయ లోకస్య చరేచ్ఛుభాయ తు ॥41॥**

పక్షిరాజా! ప్రాణిగుణసర్వవిడంబనాన్ని నీకు ఈ విధంగా తెలియజేయడం జరిగింది. ఈ లోకంయొక్క మేలుకొరకు, శుభంకొరకు, ప్రేతయొక్క మోక్షంకొరకు ఆచరించే ఔర్ధ్వదైహికక్రియ అంతాచెప్పబడింది.

**సూతఉవాచ** – సూతుడు వచించాడు.

**ఏవం విప్రాః సమాదిష్టో విష్ణునా ప్రభవిష్ణునా ।**
**గరుడః ప్రేత చరితం శ్రుత్వా సంతుష్టిమాగతః ॥42॥**

విప్రులారా! ఈ విధంగా ప్రభవిష్ణువైన విష్ణువుచే వ్యాఖ్యానింపబడిన ప్రేతచరిత్రను విని గరుడుడు సంతుష్టిని పొందాడు.

**వ్రతతీర్థాదికం సర్వం పునః పప్రచ్ఛ కేశవమ్ ।**
**ధ్యాత్వా మనసి సర్వేశం సర్వకారణకారణమ్ ॥43॥**

సర్వకారణకారణుడై సర్వేశ్వరుడగు కేశవుని మనస్సులో ధ్యానించి, తిరిగి వ్రతం, తీర్థం మున్నగువాటిని గురించికూడ ధ్యానించి అడిగాడు,

**ఋషయః సర్వమేవైత జ్జంతూనాం ప్రభవాదికమ్ ।**
**మరణం జన్మ చ తథా ప్రేతత్వఞ్చౌర్ధ్వ దైహికమ్ ॥44॥**

**మయా ప్రోక్తం వై ముక్త్యై నిదానం చైవ సర్వశః ।**
**లాభస్తేషాం జయస్తేషాం కుతస్తేషాం పరాజయః ॥**
**యేషామిందీవరశ్యామో హృదయస్థో జనార్దనః ॥45॥**

ఋషులారా! జీవజాలంయొక్క జన్మాదిక విధానాలు అన్నీ ఇలాగే ఉంటాయి. ఇవే జననం, మరణం, ప్రేతత్వం, ఔర్ధ్వదైహికం మున్నగు నియమాలు, ముక్తికి ఆదికారణాలు. ఇదంతా వివరించడం జరిగింది, ఎవరి హృదయంలో నీలకమలంతో సమానుడై శ్యామలవర్ణుడైన జనార్దనుడు ఉంటాడో, వారికే లాభం, వారికే జయం కలుగుతాయి, అటువంటి మహాత్ములకు అపజయం ఎక్కడుంటుంది.

**ధర్మో జయతి నాధర్మః సత్యం జయతి నానృతమ్ ।**
**క్షమా జయతి న క్రోధో విష్ణుర్జయతి నాసురాః ॥46॥**

ధర్మం జయిస్తుంది. అధర్మం జయించదు. సత్యం జయిస్తుంది. అసత్యం జయించదు. క్షమ జయిస్తుంది. క్రోధం జయించదు. విష్ణువు జయిస్తాడు. అసురులు జయించరు.

**విష్ణుర్మాతా పితా విష్ణు ర్విష్ణుః స్వజనబాంధవాః ।**
**యేషామేవ స్థిరా బుద్ధి ర్న తేషాం దుర్గతిర్భవేత్ ॥47॥**

విష్ణువే తల్లి, తండ్రి విష్ణువే, స్వజన బాంధవులందరూ విష్ణువే. ఇటువంటి స్థిరమైన బుద్ధిగల, వారికి దుర్గతి కలుగదు.

**మంగలం భగవాన్విష్ణు ర్మంగలం గరుడధ్వజః ।**
**మంగలం పుండరీకాక్షో మంగలాయతనం హరిః ॥48॥**

భగవంతుడైన విష్ణువు మంగళుడు, గరుడధ్వజుడు మంగళుడు, పుండరీకాక్షుడు మంగళుడు, అంతటా శుభాన్ని చేకూర్చే హరి నిత్యమంగళుడు,

**హరి ర్భాగీరథీ విప్రా విప్రా భాగీరథీ హరిః ।**
**భాగీరథీ హరిర్విప్రాః సారమేతజ్జగత్త్రయే ॥49॥**

విప్రులారా! హరియే భాగీరథి. బ్రాహ్మణులారా! భాగీరథియే హరిద్విజులు. భాగీరథి, హరి మూడు లోకాలలోను సారత్రయమిదే,

**ఇతి సూతముఖోదీర్ణాం సర్వశాస్త్రార్థమండితామ్ ।**
**వైష్ణవీం వాక్సుధాం పీత్వా ఋషయస్తుష్టిమాయయుః ॥50॥**

ఈ విధంగా సూతుని ముఖంనుండి వెలువడిన, సమస్తశాస్త్ర సారభూషితమైన, విష్ణుసంబంధమైన, వాగమృతాన్ని త్రాగి ఋషులు సంతుష్టిని పొందారు.

**ప్రశసంసు స్తథాన్యోన్యం సూతం సర్వార్థ దర్శినమ్ ।**
**ప్రహర్షమతులం ప్రాపుర్మునయః శౌనకాదయః ॥51॥**

అంత సర్వార్థదర్శియైన సూతుని పరస్పరం అభినందించారు. శౌనకాదులైన మహామునులు సాటిలేని మిక్కిలి సంతోషాన్ని పొందారు.

**అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాంగతోఽపి వా ।**
**యఃస్మరేత్ పుండరీకాక్షం స బాహ్యాభ్యంతరం శుచిః ॥52॥**

ఏ ప్రాణి అయినా పవిత్రుడయినా, అపవిత్రుడయినా, ఎన్ని అవస్థలలో ఎటువంటి సమయంలో ఉన్నా, పుండరీకాక్షుని స్మరిస్తే చాలు, అతడు బయటా, లోపలా కూడా పవిత్రుడవుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే కర్మవిపాకాదినిరూపణం నామ సప్త చత్వారింశోఽధ్యాయః ॥47॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో కర్మవిపాకం మొదలగునవి అనే నలభై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టచత్వారింశత్తమో஽ధ్యాయః –** నలభై ఎనిమిదవ అధ్యాయం

## **ధర్మాధర్మనిరూపణమ్ –** ధర్మాధర్మపరామర్శ

**తార్క్ష్య ఉవాచ –** గరుడుడు వచించాడు.

**యే మర్త్యలోకే నివసంతి మానవా స్తే సర్వజాతౌ నిధనం ప్రయాంతి ।**
**కాలే స్వకీయే నిజపుణ్య సంఖ్యయా వదంతి లోకే కథయస్వ తన్మే ॥1॥**

మర్త్యలోకంలో నివసించే, సర్వజాతులలోని మానవులు అందరూ మరణం చెందుతారు. ఈ లోకంలో తన పుణ్య పరిగణనచే (జ్ఞానంచే) తన కాలం సమీపించగా మరణిస్తారని చెబుతారు. దానిని నాకు తెలియ జెప్పవలసింది.

**గచ్ఛన్తి మార్గేణ సుదుస్తరేణ విధాతృనిష్పాదితవర్త్మని స్థితాః ।**
**కేనైవ పుణ్యేన ముదం ప్రయాంతి తిష్ఠంతి కేనైవకులం బలం వయః ॥2॥**

బ్రహ్మచే ప్రతిపాదించబడే మార్గంలో నడిచి తరింప శక్యంకాని దారిలో పయనిస్తూ ఉంటారు. ఏవిధమైన పుణ్యంచే సంతోషాన్ని పొందుతారు? దేనివల్ల కులం, బలం, ఆయుష్షు పొందుతారు?

**సూతఉవాచ –** సూతుడు వచించాడు.

**శ్రుత్వాథ దేవో గరుడం త్వవోచత్ స్మృత్వా వపుః కర్మ భయఞ్చ రూపమ్ ।**
**సృష్టా ధరా యేన చరాచరం జగత్ స యేన శస్తా విహితో యమో విభుః ॥ 3॥**

గరుడుని మాటలు విని దేవుడు శరీరాన్నీ, కర్మభయాన్నీ, రూపాన్నీ తలచి, ఎవనిచే చరాచరజగత్తు సృష్టింపబడిందో, ఎవనిచే యముడు ప్రశస్తపాలకుడుగా నియమింపబడ్డాడో ఆయనను గూర్చి చెప్పాడు.

**శ్రీభగవానువాచ –** శ్రీభగవంతుడు వచించాడు.

**ధర్మార్థకామం చిరమోక్ష సంచయ మన్యం ద్వితీయం యమమార్గగామినామ్ ।**
**ప్రవిశ్యచా஽ంగుష్ఠసమే స తత్ర వై తం ప్రాప్య దేహం స్వపురం స్వమందిరమ్ ॥4॥**

ధర్మం, అర్థం, కామం, చాలాకాలానికి వచ్చే మోక్షసంచయం అనేది ఒక మార్గం. రెండోది యమమార్గంలో పోయేవారిమార్గం, జీవుడు అక్కడ అంగుష్ఠమాణంపొంది తనపురమైన దేహంలో తమ మందిరంలో (స్థానంలో,పిండజ శరీరంలో) ప్రవేశిస్తాడు.

**గృహీతపాశో రుదతే పునః పున ర్దేశే సుపుణ్యే ద్విజదేహ సంస్థితః ।**
**దేవేంద్రపూజా పితృదేవ తృప్తిదం మోహాన్నచేష్టం న చ పుత్రసంతతిః ॥5॥**

యమపాశబద్ధుడై పదేపదే రోదిస్తాడు. "మంచిప్రదేశంలో గొప్ప పుణ్యప్రదమైన ద్విజదేహంలో ప్రవేశించాను. దేవతాసమూహపూజను కాని, పితృదేవతలకు తృప్తినిచ్చే శ్రాద్ధకర్మను గాని మోహంచే చేయలేకపోయాను. పుత్రసంతతి లేనివాడనయ్యాను.

**నమేఽస్తి బంధుర్యమ మార్గగామినో మయా న కృత్యం ద్విజదేహలిప్సయా ।**
**సంప్రాప్య విప్రత్వమతీవదుర్లభం నాధీతవాన్ వేదపురాణసంహితాః ॥**
**ప్రాప్తం సురత్నం కరసంస్థితం గతం దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥6॥**

యమమార్గంలో పోయే నాకు బంధువన్నవాడు లేకుండాపోయాడు. కోరికతో ద్విజదేహాన్ని పొంది కూడ నేను కర్తవ్యాన్ని నిర్వహించలేదు, పొందశక్యంకాని విప్రత్వాన్ని పొందికూడ వేదపురాణసంహితలను అధ్యయనం చేయలేదు, ప్రాప్తించిన చేతిలోఉన్న గొప్పరత్నం చేయిజారిపోయింది. ఓ జీవుడా! ఏదయితే నీచే చేయబడిందో, దానిని అనుభవించు (అని బ్రాహ్మణుడు దుఃఖిస్తాడు)

**యః క్షత్రియో బాహుబలేన సంయుగే లలాటదేశా ద్రుధిరం ముఖే పపౌ ।**
**తత్సోమపానం హి కృతం మహామఖే జీవన్మృతః సోఽపి హి యాతి ముక్తిమ్ ॥7॥**

క్షత్రియు డన్నవాడు యుద్ధంలో బాహుబలంతో లలాటదేశంనుండి ప్రవహించే రక్తాన్ని నోటితో త్రాగాలి. అది జీవించియుండగా గొప్ప యజ్ఞంలో సోమపాన స్వీకరణే అవుతుంది. మరణించినతరవాత అతడు ముక్తిని పొందుతాడుకదా!

**స్థానాన్యనేకాని కృతాని తాని పీతాన్యనేకాన్యపి గర్హితాని ।**
**శస్త్రం గృహీత్వా సమరే రిపూణాం యః సమ్ముఖం యాతి స ముక్తపాపః ॥ 8॥**

నానావిధాలైన స్థానాలు ఎన్నో ఉన్నాయి. మిక్కిలిగా దూషింపబడే ఆ వివిధస్థానాలనన్నీ ఆస్వాదించాను. యుద్ధరంగంలో ఆయుధం ధరించి శత్రువులకు అభిముఖంగా ఎవడు వెడతాడో, అతడే పాపాలనుండి విముక్తిని పొందుతాడు కదా!

**క్షత్రాన్వయో వాపి విశాన్వయో వా శూద్రాన్వయో వాపి హి నీచవర్ణః ।**
**సంగ్రామదేవద్విజ బాలఘాతీ స్త్రీవృద్ధహా దీనతపస్విహంతా ॥9॥**

**ఉపద్రుతేష్వేషు పరాఙ్ముఖో యః స్యుస్తస్య దేవాః సకలాః పరాఙ్ముఖాః ।**
**తిలోదకం నైవ పిబంతి పూర్వే హుతం న గృహ్ణాతి హుతాశనోఽపి తత్ ॥10॥**

క్షత్రియవంశంవాడైనా, వైశ్యాన్వయంవాడైనా, శూద్రకులంవాడైనా, నీచవర్ణంవాడైనా సంగ్రామంలో దేవతలను, ద్విజులను, బాలురను చంపేవాడు, స్త్రీలను, వృద్ధులను చంపేవాడు, దీనులను, తపస్వులను సంహరించేవాడు, అటువంటివారికి ఉపద్రవాలు వస్తే ఎవడు పరాఙ్ముఖుడై ఉంటాడో, అతనికి సకలదేవతలు పరాఙ్ముఖులై ప్రవర్తిస్తారు. ముందు వారిచ్చే తిలోదకాన్ని త్రాగరు. అగ్నిదేవుడు కూడా వారు హోమంచేసినద్రవ్యాన్ని స్వీకరింపడు.

**ద్వేషా ద్భయాద్వా సమరే సమాగతే శస్త్రం గృహీత్వాపరసైన్యసమ్ముఖః ।**
**న యాతి పక్షీంద్ర మృతశ్చ పశ్చాత్ క్షాత్రం బలం తస్య గతం తథైవ ॥**
**ద్విజాయ దత్త్వా కనకం మహీమిమాం భూయః సపశ్చాద్భవతీహలోకే ॥11॥**

ద్వేషంవల్లకాని, భయంవల్లకాని, యుద్ధం సమీపించగా, ఎవడు ఆయుధాన్ని ధరించి పరసైన్యానికి అభిముఖంగా వెడతాడో, అతడు దుర్గతిని పొందడు. పక్షీంద్రా! అతడు చనిపోయినపిమ్మట అతని క్షాత్రం, బలం, అతనిని వెంబడించి ఉంటాయి. ద్విజునకు బంగారాన్ని, ఈ భూమిని దానమిచ్చినవాడు పిమ్మట తిరిగి ఈ లోకంలో జన్మిస్తాడు.

**దానం ప్రదత్తం గ్రహణే ద్విజేంద్రే స్నానం కృతం తేన సదా సుతీర్థే ।**
**గత్వా గయాయాం పితృపిండదానం కృతం సదా యో మ్రియతే తు యుద్ధే ॥12॥**

ద్విజునకు గ్రహణసమయంలో దానంఇస్తే ఏ ఫలితం వస్తుందో, ఎల్లప్పుడూ పవిత్రతీర్థంలో స్నానంచేస్తే అతనికి ఏ ఫలితం వస్తుందో, గయకు వెళ్లి పితృపిండదానంచేస్తే ఏ ఫలితం వస్తుందో, ఆ ఫలితం ఎల్లప్పుడూ యుద్ధంలో మరణించినవానికి వస్తుంది కదా!

**యః క్షాత్రదేహస్తు విహాయ శోచతే రణాంగణే స్వామివధే చ గోగ్రహే ।**
**స్త్రీ బాలఘాతే పథి సార్థహేతవే మయా స్వకోశం న హతం న పాతితమ్ ॥ 13॥**

"క్షత్రశరీరాన్ని విడిచిపెట్టి ఇప్పుడు దుఃఖిస్తున్నాను. రణాంగణమందు, యజమానిని వధించిన వానియందు, గోవును తస్కరించినవానియందు, స్త్రీలను, బాలురను హింసించేవానియందు, దారిలోపోయే సార్థవాహుల నిమిత్తమై నేను నా కోశాగారాన్ని ఉపయోగించలేకపోయాను. వారికి అడ్డుపడలేకపోయాను." (అని క్షత్రియుడు దుఃఖిస్తాడు)

**వైశ్యః స్వకర్మాణి విశోచతే తదా గృహీతపాశో న మయాపి సంచితమ్ ।**
**సత్యం న చోక్తం క్రయవిక్రయేణ మోహాద్విమూఢేన కుటుంబహేతవే ॥14॥**

"వైశ్యుడు యమపాశబద్ధుడై అప్పుడు తనకర్మలను తలచుకొని దుఃఖిస్తాడు. నేను దాచిన దానిని విడిచిపెట్టలేకపోయాను. క్రయ విక్రయ సమయంలో కుటుంబకారణంగా విమూఢుడనై మోహంతో సత్యం వచించలేకపోయాను." (అని వైశ్యుడు దుఃఖిస్తాడు)

**శూద్రం వపుఃప్రాప్య యశస్కరం సదాదానం ద్విజేభ్యో న కృతం ద్విజార్చనమ్ ।**
**జలాశయో నైవ కృతో ధరాతలే అసంస్కృతో విప్రవరో న సంస్కృతః ॥15॥**

"నేను ఈ శూద్రశరీరాన్ని పొందాను, ద్విజులకు ఎప్పుడూ యశస్సునిచ్చే దానం చేయలేదు. ద్విజార్చనం కూడ చేయలేదు. భూతలంపై ఒక్క జలాశయం కూడ నిర్మింపలేకపోయాను. ధనహీనుడై దహనసంస్కారానికి దూరమైన విప్రవరునకు దహనసంస్కారం ఏర్పాటు చేయలేకపోయాను.

**త్యక్త్వా స్వకర్మాణి మదేన సుస్థితం మయా సుతీర్థే స్వవపుర్నచోజ్ఝితమ్ ।**
**ధర్మోర్జితో నైవ న దేవపూజనం కృతం మయా చైవ విముక్తిహేతవే ॥16॥**

మదంతో స్వీయకర్మలను విడిచిపెట్టి ఉండిపోయాను, నేను పవిత్రతీర్థంలో నా శరీరాన్ని విడిచిపెట్టలేక పోయాను. ధర్మమునందు ఉత్సాహం కనబరచలేకపోయాను. విముక్తి కారణం అయిన దేవపూజనం నేను చేయలేదు."(అని శూద్రుడు దుఃఖిస్తాడు)

**దేహం సమాసాద్య తథైవ పిండజం వర్ణాంస్తథైవాఽ న్త్యజమ్లేచ్ఛ సంజ్ఞితాన్ ।**
**మరున్మయం దేహమిమే విశంతి నైవేహమానాః పథి ధర్మసంకులే ॥17॥**

ఈ దేహాన్ని పొంది, అలాగే పిండజశరీరాన్నిపొంది, పిమ్మట అంత్యజులు, మ్లేచ్ఛులు మున్నగుపేర్లు కలిగిన వర్ణాలతో వాయుమయమైన శరీరాలనుపొంది, ఎన్నో జన్మలుధరిస్తారు. ధర్మంతో వ్యాప్తమైన మార్గంలో మాత్రం ఎవరికి ఇచ్ఛ కలగడంలేదు.

**పరస్పరం ధర్మకృతం స్వకీయం సంపాద్య లక్ష్యం పథి సంచరం స్త్వమ్ ।**
**పక్షీంద్ర వాక్యాని శృణుష్వ తాని మనోరమాణి ప్రవదంతి యాని ॥18॥**

పక్షీంద్రా! ఒకరికొకరు తమ సంబంధమైన ధర్మమార్గాన్ని స్వీకరించి, జీవితపథంలో ఉత్తమలక్ష్యంతో సంచరించాలి. మనోహరాలైన ఏ వాక్యాలు అయితే చెబుతూ ఉంటారో, ఆ వచనాలను నీవు విను.

**సారా హి లోకేషు భవేత్త్రిలోకే ద్వీపేషు సర్వేషు చ జంబుకాఖ్యమ్ ।**
**దేశేషు సర్వేష్వపి దేవదేశః జీవేషు సర్వేషు మనుష్య ఏవ ॥19॥**

అన్నిలోకాలలోను మూడు లోకాలు సారభూతాలు, ద్వీపాలన్నింటిలోను జంబూద్వీపం సారవంతం, సర్వదేశాలలోను దేవదేశం(భూమి)సారమైనది. సర్వజీవులలోను మానవుడు సారభూతుడు.

**వర్ణాశ్చ చత్వార ఇవ ప్రశస్తాః వర్ణేషు ధర్మిష్ఠనరాః ప్రశస్తాః ।**
**ధర్మేణ సౌఖ్యం సముపైతి సర్వం జ్ఞానం సమాప్నోతి మహాపథే స్థితః ॥20॥**

మనుష్యులయందు నాలుగు వర్ణాలు ప్రశస్తములైనవి, వర్ణాలయందు ధర్మిష్ఠులైన నరులు శ్రేష్ఠులు, ధర్మంవల్ల సమస్త సౌఖ్యాన్ని పొందుతాడు. మహాపథంలో ఉంటూ జ్ఞానాన్ని పొందుతాడు.

**దేహం పరిత్యజ్య యదాగతాయుః పక్షిన్ స్థితోఽ హం కృమికీట సంస్థితః ।**
**సరీసృపోఽ హం మశకో వినిర్మిత శ్చతుష్పదోఽ హం వనసూకరోఽ హమ్ ॥21॥**

దేహాన్ని విడిచినవెంటనే ఆయుష్షు క్షీణించినవాడవుతాడు.(ఆయువు క్షీణించగా దేహాన్ని విడిచివేస్తాడు) ఖగమా! కృమికీటాలలోను ఉండేవాడను నేనే, నేనే సరీసృపాన్ని, మశకనిర్మాణంలోను నేను ఉంటాను, నేనే చతుష్పదుడను, వనసూకరాన్ని నేనే,

**సర్వం విజానాతి హి గర్భసంస్థితో జాతశ్చ సద్య స్తదిదఞ్చ విస్మరేత్ ।**
**యచ్చింతితం గర్భ సమాగతేన వై బాలో యువా వృద్ధవయా బభూవ ॥22॥**

గర్భంలో ఉన్నంతవరకు ప్రాణి సర్వమూ తెలిసికొనేఉంటాడు, పుట్టి బయటపడినవెంటనే ఇదంతా మరచిపోతాడు, గర్భంనుండి వెలువడినతరువాత చింతలతో కాలంగడుపుతూ బాలుడు, యువకుడు, వృద్ధవయస్కుడు అయిపోతాడు.

**మోహాద్వినష్టం యది గర్భ చింతితం స్మృతం పునర్మృత్యు గతే చ దేహే ।**
**తస్మిన్ ప్రనష్టే హృది చింతితం గతం స్మృతం పునర్గర్భగతే చ దేహే ॥23॥**

గర్భంలోఉండగా చింతించినది మోహంవల్ల నష్టమైపోతే, తిరిగి దేహం మృత్యువును పొందగానే స్మరించడం జరుగుతుంది, అది నష్టమయితే, హృదయంలో గతంలో చింతించినదానిని తిరిగి గర్భగతుడై దేహాన్ని పొందగానే స్మరించడం జరుగుతుంది.

**తస్మిన్ ప్రనష్టే హృది చింతితం పున ర్మయా స్వకోశే పరవంచనం కృతమ్ ।**
**ద్యూతైశ్ఛలేనాపి చ చౌర్యవృత్యా ధర్మం వ్యతిక్రమ్య శరీర రక్షణే ॥24॥**

అదికూడ నష్టమయిపోతే, మళ్లీ హృదయంలో చింతించడం జరుగుతుంది. నేను నా శరీరపోషణంలో పరులను వంచించాను. జూదంచేత, మర్యాదమీరి ప్రవర్తించడంచేత, దొంగతనంచేత నా శరీరరక్షణలో ధర్మాన్ని అతిక్రమించాను.

**కృచ్ఛ్రేణ లక్ష్మీః సముపార్జితా స్వయం మయా న భుక్తం మనసేప్సితం ధనమ్ ।**
**తాంబూలమన్నం మధురం సగోరసం దత్త్వాగ్ని దేవాతిథి బంధువర్గే ॥25॥**

ఎంతో కష్టపడి సంపదను ఆర్జించాను. స్వయంగా నేను కొంచెంకూడ అనుభవించలేదు, మనస్సుకు నచ్చినట్లుగా ధనం కాని, తాంబూలం కాని, అన్నం కాని, మధురపదార్థం కాని, చక్కనిమజ్జిగ కాని, అగ్నికి, దేవునికి, అతిథికి, బంధువర్గానికి ఇచ్చానా? (అదీలేదు)

**సోమగ్రహే సూర్య సమాగమేఽపి వా న సేవితం తీర్థవరిష్ఠ ముత్తమమ్ ।**
**కోశం స్వకీయం మలమూత్రపూరితం దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥26॥**

చంద్రగ్రహణమునందు కాని, సూర్యసమాగమంలోకాని, ఉత్తమమైన, శ్రేష్ఠమైన, తీర్థాన్ని నేను సేవించలేదు, నా సంబంధమైన ఈ అన్నమయకోశం మలమూత్రాలతో నిండినది కదా! ఓ జీవుడా! ఏదయితే నీవు చేశావో దానిని అనుభవించు.

**మయా న దృష్టా న నతా న పూజితా త్రైవిక్రమీ మూర్తి రిహ స్థితా భువి ।**
**ప్రభాసనాథో న చ భక్తి సంస్తుతో దేహిన్ క్వచి న్నిస్తర యత్త్వయా కృతమ్ ॥27॥**

ఇక్కడ భూమియందున్న త్రివిక్రమావతారస్వరూపుని చూడలేదు, నమస్కరించలేదు, పూజించలేదు, భక్తితో ప్రభాసనాథుని సంస్తుతించలేదు, జీవుడా! చేసిన దానిని ఎప్పుడూ దాట శక్యం కాదుకదా!

**గత్వా వరిష్ఠే భువి తీర్థ సన్నిధౌ ధనం న దత్తం విదుషాం కరే మయా ।**
**ఆప్లుత్య దేహం విధినా ద్విజే గురౌ దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥28॥**

ఈ భూమియందున్న శ్రేష్ఠమైన తీర్థసమీపానికి వెళ్లి, గంగాది పుణ్యతీర్థాలలో దేహాన్ని ముంచి, శాస్త్రవిధిచే ద్విజునికిగాని, గురువుకుకాని, విద్వాంసునికి కాని నేను చేతిలో ధనాన్ని ఉంచలేదు కదా! జీవుడా! చేసినదానిని అనుభవించు.

**న మాతృపూజా న చ విష్ణుశంకరౌ గణేశ చండ్యౌ న చ భాస్కరోఽపి వా ।**
**యచ్ఛోపచారై ర్బలియుక్త చందనై ర్దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥ 29॥**

శ్రీమాతను పూజించలేదు, విష్ణు శంకరులను ఆరాధించలేదు, గణేశచండీశ్వరులను, భాస్కరుని అర్చించలేదు, చందనాద్యుపచారములచేతను, బల్యన్న నివేదనలచేతను సంతృప్తిపరచలేదు, జీవుడా! చేసినదానిని అనుభవించు.

**లబ్ధా మయా మానవదేవతోపమా మోహాద్గతా సర్వమిదఞ్చ పార్థివ ।**
**గతిం న వీక్షేత స వై విమూఢధీ ర్దేహిన్ క్వచిన్నిస్తర యత్త్వయా కృతమ్ ॥30॥**

ఓ పార్థివశరీరమా! నాచే మానవులతోను, దేవతలతోను సాటివచ్చే కీర్తిపొందబడింది. మోహంవల్ల ఇదంతా నష్టమైపోయింది, ఓ మూఢబుద్ధీ! నీకు పట్టేగతిని చూసుకోలేకపోయావు, జీవుడా! చేసిన దానిని తరింపశక్యం కాదుకదా!

**ఏతాని పక్షిన్ మనసా విచిన్త్య వాక్యాని ధర్మార్థయశస్కరాణి ।**
**ముక్తిం సమాయాంతి మనుష్యలోకే వసంతి యే ధర్మరతాః సుదేశే ॥31॥**

ఖగమా! ధర్మార్థయుక్తాలైన, యశస్కరాలైన ఇటువంటి వాక్యాలను మనస్సులో చక్కగా విచారణచేసి, మనుష్యలోకంలో ధర్మాభిరక్తులై పుణ్యప్రదేశాలలో నివసించే వారు ముక్తిని పొందుతారు కదా!

**ఇత బ్రువాణై ర్యమదూతవర్గై ర్విహన్యతే కాలమయైశ్చ ముద్గరైః ।**
**హా దైవ హా దైవ ఇతి స్మరన్ వై ధనం న దత్తం స్వయమార్జితం యత్ ॥32॥**

అని వారు అంటూఉండగా, ప్రాణాలను పోగొట్టే ఇనుపసమ్మెటలతో యమకింకర సమూహాలు బాదుతూ ఉండగా, ఓ దైవమా! ఓ దైవమా! అంటూ స్మరిస్తూ స్వయంగా సంపాదించిన ధనాన్ని కూడా దానం చేయలేదు.

**న భూమి దానం న చ గోప్రదానం న వారిదానం న చ వస్త్రదానమ్ ।**
**ఫలం సతాంబూల విలేపనం వా త్వయా న దత్తం భువి శోచసే కథమ్ ॥33॥**

భూదానం చేయలేదు, గోదానం ఆచరించలేదు, నీళ్లనుకూడ ఎవరికీ ఈయలేదు, వస్త్రదానమయినా చేయలేదు, పండును కాని, ఒక తాంబూలం కాని, విలేపనాలు కాని భూమియందు నీవు ఎవ్వరికి సమర్పించలేదు, ఎందుకు ఏడుస్తావు?

**పితా మృతస్తే చ పితామహః సా యయా ధృతో వాప్యుదరే స్వకీయే ।**
**మృతోఽప్యసౌ బంధు జనః సమస్తో దృష్టం త్వయా సర్వమిదం గతాయుః ॥34॥**

నీ తండ్రి, తాత చనిపోయారు, తనగర్భంలో నిన్ను ధరించి మోసిన, తల్లికూడ మరణించింది, సమస్త బంధుజనమూ మృతిచెందింది. నీచే చూడబడిన ఈ సర్వస్వమూ ఆయుష్షుచే క్షీణత్వం పొందింది.

**కోశం త్వదీయం జ్వలితం చ వహ్నినా పుత్రై ర్గృహీతో ధనధాన్యసంచయః ।**
**సుభాషితం ధర్మచయం కృతఇ్చ యత్తదేవ గచ్ఛేత్తవ పృష్ఠసంస్థమ్ ॥35॥**

నీ శరీరం అగ్నిలో బూడిదఅయింది, నీ ధన ధాన్యరాశులన్నీ పుత్రులు పట్టుకొనిపోయారు. నీవు చెప్పిన మంచిమాట, నీవుచేసిన దానధర్మాలు ఏవయితే ఉన్నాయో, అవి నీ వెనుకనే ఉండి వస్తున్నాయి.

**న దృశ్యతే కోఽపి మృతః సమాగతో రాజా యతిర్వా ద్విజపుంగవోఽపి వా ।**
**యో వై మృతః సాహసికః సమర్త్యకో నాశం గతో యోఽపి ధరాతలే స్థితః ॥36॥**

రాజయినా, యతిఅయినా, ద్విజపుంగవుడైనా, ఎవడు మరణించినా వెంటబడి వచ్చేవాడు ఎవడూ కనిపించడు. ఎంతటి భటులతో కూడుకొన్న ధైర్యసాహసికుడైనా ఇక్కడనే మృతిచెందుతాడు. ధరాస్థలంలో ఎవడున్నా వాడు నాశం కాక తప్పదు.

**ఏవం గణాస్తే బ్రువతే సకిన్నరా ధైర్యం సమూలంబ్య విషాదపూరితః ।**
**శ్రుత్వా గణానాం వచనం మహాద్భుతం బ్రవీతి పక్షీంద్ర మనుష్యతాం గతః ॥37॥**

ఈవిధంగా ఆ కుత్సిత యమగణాలు పలుకుతూ ఉండగా, అతడు దుఃఖపూరితుడై ఏదోవిధంగా ధైర్యాన్ని అవలంబిస్తాడు. పక్షీంద్రా! ఆ గణాలలో కొందరు మహాద్భుతాలైన వాక్యాలు పలుకుతూ ఉండగా, విని మనుష్యత్వాన్ని పొంది ఇలా అంటాడు.

**దాన ప్రభావేణ విమానసంస్థితో ధర్మః పితా మాతృదయానురూపిణీ ।**
**వాణీ కలత్రం మధురార్థ భాషిణీ స్నానం సుతీర్థే చ సు బంధవర్గః ॥38॥**

దానప్రభావంతో విమానంపై అధిష్ఠిస్తాడు, యమధర్మరాజు తండ్రివలె కనిపిస్తాడు, దయతల్లిలా అనురూపంగా ఉంటుంది. మధురంగా మాటాడే వాణి భార్య అవుతుంది. మంచితీర్థంలో స్నానం బంధువర్గ మవుతుంది,

**కరార్పితం యత్ సుకృతం సమస్తం స్వర్గస్తదా స్యాత్ తవ కింకరోపమః ।**
**యో ధర్మవాన్ ప్రాప్స్యతి సోఽతిసౌఖ్యం పాపీ సమస్తం వివిధఇ్చ దుఃఖమ్ ॥39॥**

అతడు తనచేతులతో చేసిన సమస్తపుణ్యం అప్పుడు చేతిలో దర్శనమిస్తుంది, అప్పుడు స్వర్గమంతా నీకు(అతనికి) దాసోఽహమన్నట్లు అవుతుంది. ధర్మాత్ముడు మిక్కిలి సౌఖ్యాన్ని పొందుతాడు, పాపాత్ముడు నానావిధ దుఃఖసమూహాన్ని అనుభవిస్తాడు.

**యో ధర్మశీలో జితమానరోషో విద్యావినీతో న పరోపతాపీ ।**
**స్వదారతుష్టః పరదారదూరస్స వై నరో నో భువి వందనీయః ॥40॥**

ఎవడయితే ధర్మశీలుడై, రోషాన్ని జయించి, విద్యచే వినయసంపన్నుడై, పరులకు ఉపతాపం కలుగజేయక, పరదారలకు దూరంగాఉండి, తనభార్యయందు సంతుష్టి పొందినవాడై ఉంటాడో, భూమియందు ఆ నరుడు మాకు ఎల్లప్పుడు నమస్కరింపదగినవాడు.

**మిష్టాన్నదాతా చరితాగ్నిహోత్రో వేదాంతవిచ్చంద్రసహస్రజీవీ ।**
**మాసోపవాసీ చ పతివ్రతా చ షడ్జీవలోకే మమ వందనీయాః ॥41॥**

మృష్టాన్నాన్ని పెట్టువాడు, అగ్నిహోత్రాన్ని ఆచరించేవాడు, వేదాంతం తెలిసినవాడు, సహస్రచంద్ర దర్శనపర్యంతం జీవించేవాడు, మాసోపవాసి, పతివ్రత – ఈ ఆరుగురు జీవకోటిలో నాకు ఎల్లప్పుడు నమస్కరింప దగినవారే,

**ఏవం సమాచారయుతో నరోఽపి వాపీం సుకూపాం సజలం తడాగమ్ ।**
**ప్రపా శుభం హృద్గృహదేవమందిరం కృతం నరేణైవ స ధర్మ ఉత్తమః ॥42॥**

ఈవిధమైన గొప్పఆచారంతో నరుడుకూడ బావిని, మంచినూయిని, నీటితోనిండిన చెరువును, శుభమైన చలిపందిరిని, హృదయగృహాన్నే దేవమందిరంగా చేసుకొంటాడు, ఏ నరునిచేత ఇది చేయబడుతుందో, అదే ఉత్తమమైన ధర్మం.

**వర్షాశనం వేదవిదే చ దత్తం కన్యావివాహస్త్వృణమోచనం ద్విజే ।**
**భూమిః సుకృష్టాపి తృషార్తిహేతోస్తదేవమేతం సుకృతం సమస్తమ్ ॥43॥**

వేదవిద్వాంసునకు ఏడాదికి సరిపడే భోజనం ఏర్పాటుచేయడం, కన్యకు వివాహంచేయించడం, ద్విజునికి ఋణవిముక్తిని కల్గించడం, తృషార్తి కారణంగా చక్కని వ్యవసాయభూమిని ఈయడం, ఇటువంటి ఈ సమస్తమూ సుకృత మవుతుంది.

**అధ్యాయమేనం సుకృతస్య సారం శృణోతి గాయత్యపి భావశుద్ధ్యా ।**
**స వై కులీనః స చ ధర్మయుక్తోవిశ్వాలయం యాతి పరం స నూనమ్ ॥44॥**

సుకృతసారమైన ఈ అధ్యాయాన్ని మనశ్శుద్ధితో ఎవడు వింటాడో, గానంచేస్తాడో, అతడే ఉత్తమకుల సంజాతుడు. అతడే ధర్మసంయుక్తుడు, అతడు నిశ్చయంగా పరమమైన పరబ్రహ్మ (విష్ణు) స్థానాన్ని పొందగలడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే మనుష్యస్య సుఖదుఃఖ ప్రాపక ధర్మాధర్మనిరూపణం నామాష్టచత్వారింశత్తమోఽధ్యాయః ॥48॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో మనుష్యుని సుఖదుఃఖాలను పొందించే ధర్మాధర్మపరామర్శ అనే నలభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## **ఏకోనపంచాశత్తమోఽధ్యాయః** – నలభై తొమ్మిదవ అధ్యాయం

## **మోక్షోపాయనిరూపణమ్** – మోక్షప్రాప్తిమార్గాన్ని చెప్పుట

**గరుడ ఉవాచ** – గరుడుడు పచించాడు.

**శ్రుతా మయా దయాసింధో హ్యజ్ఞానాజ్జీవసంసృతిః ।**
**అధునా శ్రోతుమిచ్ఛామి మోక్షోపాయం సనాతనమ్ ॥1॥**

దయాసముద్రుడవైన మహావిష్ణూ! అజ్ఞానం వలన జీవునకు ప్రాప్తమయ్యే సంసారం గురించి విన్నాను. ఇంక ఇప్పుడు సనాతనమైన మోక్షాన్ని పొందే విధానం గురించి వినాలని కోరుతున్నాను.

**భగవన్ దేవదేవేశ శరణాగతవత్సల ।**
**అసారే ఘోరసంసారే సర్వదుఃఖమలీమసే ॥2॥**

**నానావిధ శరీరస్థా అనంతా జీవరాశయః ।**
**జాయంతే చ మ్రియంతే చ తేషామంతో న విద్యతే ॥3॥**

భగవంతుడా! దేవతలకే దేవేశ్వరా! శరణన్నవారిపై వాత్సల్యం చూపేవాడా! సారంలేక, సమస్త దుఃఖాలచే మలినమైన, భయంకర సంసారంలో అనంతాలైన జీవకోటులన్నీ, అనేకవిధాలైన శరీరాలను ధరిస్తూ, చస్తూ, పుడుతూ ఉంటారు. వాటికి అంతం కానరాదు.

**సదా దుఃఖాతురా ఏవ న సుఖీ విద్యతే క్వచిత్ ।**
**కేనోపాయేన మోక్షేశ ముచ్యంతే వద మే ప్రభో ॥4॥**

మోక్షానికి అధిపతీ! జీవులందరూ ఎల్లప్పుడూ దుఃఖాలచే పీడింపబడుతూనే ఉంటారు. ఎప్పటికీ వీరికి సుఖం అనేది కానరాదు. ప్రభూ! ఏ ఉపాయంచే వారు ముక్తిని పొందుతారు? దానిని నాకు చెప్పు.

**శ్రీభగవానువాచ** – శ్రీభగవంతుడు పచించాడు.

**శృణు తార్క్ష్య ప్రవక్ష్యామి యన్మాం త్వం పరిపృచ్ఛసి ।**
**యస్య శ్రవణమాత్రేణ సంసారాన్ముచ్యతే నరః ॥5॥**

గరుడా! నీవు నన్ను అడిగిన, దానిని చెబుతున్నాను విను, దీనిని విన్నంత మాత్రంచేతనే నరుడు సంసారంనుండి విముక్తిని పొందగలడు.

**అస్తి దేవః పరబ్రహ్మ స్వరూపో నిష్కలః శివః ।**
**సర్వజ్ఞః సర్వకర్తా చ సర్వేశో నిర్మలోఽద్వయః ॥6॥**

**స్వయంజ్యోతి రనాద్యంతో నిర్వికారః పరాత్పరః ।**
**నిర్గుణః సచ్చిదానంద స్తదంశా జీవసంజ్ఞకాః ॥7॥**

స్వయంగా ప్రకాశించేవాడు, పరబ్రహ్మస్వరూపుడు, (ఆద్యంతాలులేనిరూపం), కళాశూన్యుడు, శివుడు (మంగళప్రదుడు), సమస్తమూ తెలిసినవాడు, సమస్తమూ సృజించినవాడు, సర్వమునకూ అధిపతి, నిర్మలుడు, భేదం(రెండు)లేనివాడు, తనంతటతాను తాను ప్రకాశించేవాడు. ఆది, అంతాలు లేనివాడు, వికారాలు లేనివాడు, పరంకన్న పరుడు, ఏ గుణాలులేనివాడు, సచ్చిదానందస్వరూపుడు అయిన దేవుడొకడు కలడు. ఆ దేవుని అంశలే జీవులనే పేరుకలవారు.

**అనాద్యవిద్యోపహతా యథాగ్నౌ విస్ఫులింగకాః ।**
**దేహాద్యుపాధి సంభిన్నాస్తే కర్మభి రనాదిభిః ॥8॥**

అగ్నిహోత్రమందుండే అగ్నికణాలువలెనే, ఈశ్వరుని అంశలైన జీవులు చిరకాలంనుండి ఆవరించి ఉండే అజ్ఞానంచే కప్పబడి, ఆదిలేకుండా ఉండే కర్మలచే దేహం మున్నగు ఉపాధులచే భిన్నులవుతూ ఉన్నారు.

**సుఖదుఃఖప్రదైః పుణ్యాపాపరూపైర్నియంత్రితాః ।**
**తత్తజ్జాతియుతం దేహ మాయుర్భోగఇచ్చ కర్మజమ్ ॥9॥**

**ప్రతిజన్మ ప్రపద్యంతే తేషామపి పరం పునః ।**
**స సూక్ష్మలింగ శరీరమామోక్షాదక్షరం ఖగ ॥10॥**

సుఖదుఃఖాలనిచ్చే పుణ్యాపాపరూపాలతో నియంత్రింపబడినవారై, ఆయాకర్మలకు అనుకూలంగా దేహాన్ని, ఆయుష్షును, కర్మసంభవభోగాన్ని ప్రతిజన్మయందు పొందుతున్నారు. ఖగమా! అంతేకాక వారికి పరమైన సూక్ష్మలింగ శరీరమొకటి యుండి మోక్షం పొందేవరకు నశించకుండా ఉంటుంది.

**స్థావరాః కృమయశ్చాజాః పక్షిణః పశవో నరాః ।**
**ధార్మికా స్త్రిదశాస్తద్వన్మోక్షిణశ్చ యథాక్రమమ్ ॥11॥**

కదలని వృక్షపర్వతాదులును, యోని సంభవాలు కాని పురుగులును, పక్షులును, పశువులును, నరులును, ధర్మాత్ములగు దేవతలును వారి వారి మార్గాన్ని అనుసరించి యథాక్రమంగా మోక్షాన్ని పొందుతున్నాయి.

**చతుర్విధశరీరాణి ధృత్వా ముక్త్వా సహస్రశః ।**
**సుకృతాన్మానవో భూత్వా జ్ఞానీచేన్మోక్షమాప్నుయాత్ ॥12॥**

నాలుగు విధాలైన శరీరాలను ధరించి, ఆయా వేల జన్మలనుండి విడివడి, ఏదో ఒక పుణ్యవిశేషంచే మానుషజన్మపొంది, జ్ఞానం కలిగినవాడయితే మోక్షాన్ని పొందుతాడు.

**చతురశీతిలక్షేషు శరీరేషు శరీరిణామ్ ।**
**న మానుషం వినాన్యత్ర తత్త్వజ్ఞానన్తు లభ్యతే ॥13॥**

శరీరధారులలో ఎనభైనాలుగు లక్షల శరీరాలయందు మనుష్యశరీరం లేకుండా, మరోవిధంగా తత్త్వజ్ఞానం అన్నది లభింపదు.

**అత్ర జన్మ సహస్రాణాం సహస్రైరపి కోటిభిః ।**
**కదాచిల్లభతే జన్తు ర్మానుష్యం పుణ్యసంచయాత్ ॥14॥**

ఇక్కడ వేలకొలది జన్మలను, వేల కోట్ల జన్మలను పొందిన పిమ్మట ఏదోఒక పుణ్యవిశేషంవల్ల, తలవని తలంపుగా మనుష్యజన్మ అనేది లభిస్తుంది.

**సోపానభూతం మోక్షస్య మానుష్యం ప్రాప్య దుర్లభమ్ ।**
**యస్తారయతి నాత్మానం తస్మాత్పాపతరోఽత్ర కః ॥15॥**

మోక్షానికి సోపానప్రాయమై (మెట్టువంటిదయిన) దుర్లభమైన, మనుష్యజన్మను పొంది, ఎవడు తనను తాను తరింపజేసుకొనడో, వానికంటె మిక్కిలి పాపాత్ముడు ఇక్కడ ఎవడు ఉంటాడు?

**నరఃప్రాప్యోత్తరం జన్మ లబ్ధ్వాచేంద్రియ సౌష్ఠవమ్ ।**
**నవేత్త్యాత్మహితం యస్తు స భవే ద్బ్రహ్మఘాతకః ॥16॥**

నరుడు శ్రేష్ఠమైన జన్మనుపొంది, ఇంద్రియ సామర్థ్యంపొందికూడ, ఆత్మజ్ఞానం గురించి ఎవడు తెలుసుకోకుండా ఉంటే, అతడు బ్రహ్మ (ఆత్మ) హత్యచేసే మహాపాతకుడవుతాడు.

**వినా దేహేన కస్యాపి పురుషార్థో న విద్యతే ।**
**తస్మాద్దేహం ధనం రక్షేత్పుణ్యకర్మాణి సాధయేత్ ॥17॥**

శరీరం లేకపోతే ధర్మార్థకామమోక్షాలలో ఏ ఒక్కదానినైననూ సాధించుటకు వీలుకాదు, కాబట్టి దేహాన్ని, ధనాన్ని రక్షించుకొంటూ పుణ్యకార్యాలను సాధించాలి.

**రక్షేచ్చ సర్వదాత్మానమాత్మా సర్వస్య భాజనమ్ ।**
**రక్షణే యత్నమాతిష్ఠేజ్జీవన్ భద్రాణి పశ్యతి ॥18॥**

తన శరీరం అన్ని ప్రయోజనములకు ఆధారం కాబట్టి, ముఖ్యంగా ఎల్లప్పుడూ శరీరాన్ని తాను రక్షించుకోవాలి, శరీరరక్షణయందు ప్రధాన ప్రయత్నంచేయాలి, బ్రతికిఉంటే ఎన్ని శుభాలనైనాచూడవచ్చు.

**పునర్గ్రామః పునఃక్షేత్రం పునర్విత్తం పునర్గృహమ్ ।**
**పునః శుభాశుభం కర్మ న శరీరం పునః పునః ॥19॥**

గ్రామం, భూమి, ధనం, గృహం నశిస్తే మళ్లీ సంపాదించుకోవచ్చు, మళ్లీ పుణ్యపాపకర్మలను ఆచరించవచ్చు, శరీరం నశిస్తే మళ్లీ తిరిగి దానినే పొందుటకు సాధ్యంకాదు.

**శరీర రక్షణోపాయాః క్రియంతే సర్వదా బుధైః ।**
**నేచ్ఛంతి చ పునస్త్యాగమపి కుష్ఠాది రోగిణః ॥20॥**

తెలిసిన బుధులు అన్నివిధాలా శరీరసంరక్షణ ప్రయత్నాలు చేస్తూఉంటారు, కుష్ఠాదిరోగాలు పొందినవారు కూడ (ఏదోఒక ప్రయత్నంచేస్తారు కాని) శరీరాన్ని విడిచిపెట్టడానికి అంగీకరించరు.

**తద్గోపితం స్యాద్ధర్మార్థం ధర్మజ్ఞానార్థమేవ చ ।**
**జ్ఞానం తు ధ్యానయోగార్థమచిరాత్ప్రవిముచ్యతే ॥21॥**

శరీరాన్ని ధర్మార్థమై రక్షించుకోవాలి, ధర్మం జ్ఞానంకొరకు, జ్ఞానం భగవద్ధ్యానంకొరకు ఉపయోగిస్తే శీఘ్రంగా ముక్తిని పొందేవాడవుతాడు.

**ఆత్మైవ యది నాత్మానమహితేభ్యో నివారయేత్ ।**
**కోఽన్యో హితకర స్తస్మాదాత్మానం సుఖయిష్యతి ॥22॥**

ఆత్మయే తనను కామక్రోధాది శత్రువులనుండి నివారించకపోతే, ఇతరుడు ఎవడు తనకు మేలుచేయగలడు? ఎవడు తనను సుఖపెట్టగలడు?

**ఇహైవ నరక వ్యాధేశ్చికిత్సాం న కరోతి యః ।**
**గత్వా నిరౌషధం దేశం వ్యాధిభ్యః కిం కరిష్యతి ॥23॥**

ఇక్కడనే నరకవ్యాధికి చికిత్స ఎవడు చేసుకోకుండాఉంటాడో, ఔషధంలేని ప్రదేశానికి వెళితే వ్యాధులవల్ల వచ్చేబాధలనుండి నివారణ ఎలా చేయగలడు?

**వ్యాఘ్రీవాస్తే జరాచాయుర్యాతి భిన్నఘటాంబువత్ ।**
**నిఘ్నంతి రిపువద్రోగా స్తస్మాచ్ఛ్రేయః సమభ్యసేత్ ॥24॥**

ముసలితనం పెద్దపులివలె కనిపెట్టుకొని ఉంటుంది, ఆయుర్దాయం పగిలిన కుండలోని జలంవలె నశించిపోతుంది. రోగాలు శత్రువువలె హింసిస్తాయి, అందువల్ల మోక్షోపాయాన్ని చక్కగా తెలుసుకోవాలి.

**యావన్నాశ్రయతే దుఃఖం యావన్నాయాంతి చాపదః ।**
**యావన్నేంద్రియ వైకల్యం తావచ్ఛ్రేయః సమభ్యసేత్ ॥25॥**

తనకు దుఃఖం రాకముందే, ఆపదలు రాక పూర్వమే, ఇంద్రియాలు వికలత్వాన్ని పొందకముందే మోక్షోపాయాన్ని అభ్యసించాలి.

**యావత్తిష్ఠతి దేహోఽయం తావత్తత్త్వం సమభ్యసేత్ ।**
**సందీప్తకోశభవనే కూపం ఖనతి దుర్మతిః ॥26॥**

ఈ దేహం స్వస్థతగా ఉన్నప్పుడే, తత్త్వజ్ఞానాన్ని అభ్యసించాలి. ఇల్లు అగ్నికి ఆహుతి అయిపోతూఉంటే, దానిని నీళ్లకై దుర్మతి నూయి త్రవ్వుతాడు.

**కాలో న జ్ఞాయతే నానాకార్యైః సంసారసంభవైః ।**
**సుఖం దుఃఖం జనో హంత న వేత్తి హితమాత్మనః ॥27॥**

సంసారంలో ప్రభవించే నానా శుభాశుభసంఘటనలచే కాలం తెలియకుండా గడచిపోతుంది. జనం సుఖదుఃఖాలను పొందుతూఉంటారు కాని తనకు మేలునిచ్చే జ్ఞానం గురించి తెలుసుకోలేరు. ఎంతకష్టం?

**జాతానార్తాన్ మృతానాపద్గ్రస్తాన్ దృష్ట్వా చ దుఃఖితాన్ ।**
**లోకో మోహసురాం పీత్వా న బిభేతి కదాచన ॥28॥**

ఈ ప్రపంచంలో పుడుతూ, రోగాదులచే పీడింపబడుతూ, చస్తూ, ఆపదలతో గ్రసింపబడుతూ దుఃఖిస్తూ ఉన్నవారిని చూచి లోకం మోహం అనే కల్లుత్రాగి ఏమాత్రం భయపడకుండా ఉంటుంది.

**సంపదః స్వప్నసంకాశా యౌవనం కుసుమోపమమ్ ।**
**తడిచ్చపలమాయుష్యం కస్య స్యాజ్జానతో ధృతిః ॥29॥**

సంపదలు కలలవంటివి. యౌవనం పుష్పంవంటిది. ఆయుర్దాయం నిలకడలేని మెఱుపువంటిది. వీటి యథార్థస్థితి తెలుసుకొని ఎవడు ధైర్యంతో ఉంటాడు?

**శతం జీవితమత్యల్పం నిద్రాలస్యై స్తదర్ధకమ్ ।**
**బాల్యరోగ జరాదుఃఖై రల్పం తదపి నిష్ఫలమ్ ॥30॥**

నూరు సంవత్సరాల జీవితం మనుష్యులకు మిక్కిలి అల్పమైనది, నిద్రాలస్యాదులవల్ల అందు సగం గతించిపోతుంది, బాల్యం, రోగం, ముసలితనం, దుఃఖం వీటివల్ల ఆ స్వల్పాయుర్దాయం కూడ వ్యర్థమైపోతోంది.

**ప్రారబ్ధవ్యే నిరుద్యోగీ జాగర్తవ్యే ప్రసుప్తకః ।**
**విశ్వస్తస్య భయస్థానే హా నరః కో న హన్యతే ॥31॥**

ప్రయత్నంజేయదగిన (మోక్షంగురించి) ప్రవర్తించనివాడును, తెలిసికొనదగిన (పరబ్రహ్మం గురించి) తెలియకుండా నిద్రించువాడును, భయానికి నిలయమైన (సంసారంగురించి) భయపడక నమ్మకం ఉండేవాడును, అయ్యో! అట్టి నరుడు ఎవడైన బాధింపబడుతూ ఉంటాడుకదా!

**తోయఫేన సమే దేహే జీవేనాక్రమ్య సంస్థితే ।**
**అనిత్యప్రియసంవాసే కథం తిష్ఠతి నిర్భయః ॥32॥**

నీటియందుండే నురుగు(బుడగ)తో సమానమై, జీవునిచే వ్యాపింపబడి అశాశ్వతమైన సౌఖ్యానికి ఆధారమై ఉండే ఈ శరీరవిషయంలో ఎవడు భయంలేకుండా సుఖంగా ఉండగలడు?

**అహితే హిత సంజ్ఞః స్యాదధ్రువే ధ్రువ సంజ్ఞకః ।**
**అనర్థే చార్థవిజ్ఞానః స్వమర్థం యో న వేత్తి సః ॥33॥**

అహితమైనదానిని హితంగాను, అస్థిరమైనదానిని స్థిరంగాను, ప్రయోజనంలేనిదానిని ప్రయోజనంగాను తలచిన తాను తన తరణోపాయాన్ని తెలియకున్నాడు.

**పశ్యన్నపి ప్రస్ఖలతి శృణ్వన్నపి న బుధ్యతి ।**
**పఠన్నపి న జానాతి దేవమాయా విమోహితః ॥34॥**

భగవంతుని మాయచే మోహింపబడి చూస్తూ ఉండే జారిపడతాడు, వింటూ ఉన్నా గ్రహించలేడు, చదువుతూ ఉన్నా ఏమీ తెలుసుకోలేడు.

**తన్నిమజ్జజ్జగదిదం గంభీరే కాలసాగరే ।**
**మృత్యురోగ జరాగ్రాహై ర్న కశ్చిదపి బుధ్యతే ॥35॥**

మృత్యువు, రోగం, ముసలితనం మున్నగు మొసళ్లతోనిండి, మిక్కిలి లోతుగా ఉండే కాలసముద్రంలో ఈ ప్రపంచమంతా మునిగిఉంది.

**ప్రతిక్షణ భయం కాలః క్షీయమాణో న లక్ష్యతే ।**
**ఆమకుంభ ఇవాంభఃస్థో విశీర్ణో న విభావ్యతే ॥36॥**

ఈ కాలం ప్రతిక్షణం భయంతో తెలియకుండగానే తరిగిపోతోంది, ఈ శరీరంకూడ నీళ్లలో ముంచిన పచ్చికుండవలెనే పగిలి చెడిపోతుంది, కాని ప్రకాశిస్తూ మాత్రం ఉండదు.

**యుజ్యతే వేష్టనం వాయో రాకాశస్య చ ఖండనమ్ ।**
**గ్రథనఞ్చ తరంగాణా మాస్థానాయుషి యుజ్యతే ॥37॥**

గాలిని మూటగట్టవచ్చు, ఆకాశాన్ని ఖండింపవచ్చు, తరంగాలను ఒకచోటకు కూర్పవచ్చు, ఆయుష్షును స్థిరంగా ఉండేటట్లు చేయడానికి ఎవనికీ శక్యంకాదు.

**పృథివీ దహ్యతే యేన మేరుశ్చాపి విశీర్యతే ।**
**శుష్యతే సాగరజలం శరీరస్య చ కా కథా ॥38॥**

కాలం సమీపించగానే భూమి దహింపబడుతుంది, మేరుపర్వతం ఛేదింపబడుతుంది, సాగరజలాలు ఎండిపోతాయి. ఇక శరీరాన్ని గురించి చెప్పవలసింది ఏముంది కనుక?

**అపత్యం మే కలత్రం మే ధనం మే బాంధవాశ్చ మే ।**
**జల్పంతమితి మర్త్యాజం హంతి కాలవృకో బలాత్ ॥39॥**

ఇది నా సంతానమని, ఈమె నా భార్యయని, ఇది నా ధనమని, వీరు నా బంధువులని మమకారంచే మోహంపొందియుండే మనుష్యుడు అనే మేకను కాలం అనెడి తోడేలు బలవంతంగా పట్టుకొని చంపివేస్తుంది.

**ఇదం కృతమిదం కార్యమిద మన్యత్కృతాకృతమ్ ।**
**ఏవమీహాసమాయుక్తం కృతాంతః కురుతే వశమ్ ॥40॥**

నేను ఈ పనిని పూర్తిచేశాను, ఇక ఈ కార్యాన్ని చేయవలసిఉంది, దీనిని కొంతచేశాను, ఇంకా కొంత చేయవలసి ఉంది, అని ఈ విధంగా ఆలోచనచేస్తూ మోక్షంగురించి ప్రయత్నం చేయనివానిని యముడు తన వశం చేసుకొంటాడు.

**శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణేచా పరాహ్ణికమ్ ।**
**న హి మృత్యుః ప్రతీక్షేత కృతం వాప్యథవా కృతమ్ ॥41॥**

రేపు చేయవలసినది ఈ రోజే చేయాలి. మధ్యాహ్నపు పని ఉదయమే చేయాలి. మృత్యువు నువ్వు పని ముగించావా? ముగించలేదా? అని చూడదు.

**జరాదర్శిత పంథానం ప్రచండవ్యాధిసైనికమ్ ।**
**అధిష్ఠితో మృత్యుశత్రుం త్రాతారం కిం న పశ్యతి ॥42॥**

మృత్యువు ముసలితనంచే చూపబడినమార్గాన్ని, మిక్కిలి తీక్ష్ణమైన రోగాలనే సైనికులను మనకోసం పంపి వేచియుంది. ఆ మృత్యువుకు శత్రువై, రక్షకుడగు భగవంతుని ఎందుకు చూడడంలేదు.

**తృష్ణాసూచీ వినిర్భిన్నం సిక్తం విషయ సర్పిషా ।**
**రాగద్వేషానలే పక్వం మృత్యురశ్నాతి మానవమ్ ॥43॥**

ఆశలనే సూదులచే భేదింపబడి, విషయా లనే నేతిలోముంచి, రాగద్వేషాలనే అగ్నిలో ఉడకబెట్టి, మృత్యుదేవత మానవుని (మనుష్యమాంసాన్ని) భక్షించివేస్తుంది.

**బాలాంశ్చ యౌవనస్థాంశ్చ వృద్ధాన్ గర్భగతానపి ।**
**సర్వానావిశతే మృత్యురేవం భూతమిదం జగత్ ॥44॥**

బాలురను, యౌవనంలో ఉన్నవారిని, వృద్ధులను, గర్భంలోఉన్నవారిని, అందరిని కాలం సమీపించగానే మృత్యువు ప్రవేశిస్తుంది, ఈ ప్రపంచమంతా ఇలా మృత్యుదేవతకు స్వాధీనమై ఉంది.

**స్వదేహమపి జీవోఽయం ముక్త్వా యాతి యమాలయమ్ ।**
**స్త్రీమాతృపితృపుత్రాది సంబంధః కేన హేతునా ॥45॥**

కాలం సమీపించగానే ఈ జీవుడు తన శరీరాన్ని కూడా విడిచిపెట్టి, యమలోకానికి వెళ్లిపోతాడు. ఇక భార్యయని, తల్లియని, తండ్రియని, కుమారులని, మున్నగు సంబంధాలు ఏ హేతువువల్ల కలుగుతాయి?

**దుఃఖమూలం హి సంసారః స యస్యాస్తి స దుఃఖితః ।**
**తస్య త్యాగః కృతో యేన స సుఖీ నాపరః క్వచిత్ ॥46॥**

ఈ సంసారం దుఃఖానికి మూలకారణమై ఉంది, సంసారి దుఃఖం కలవాడే అవుతాడు. కాబట్టి ఈ సంసారం ఎవనిచే విడిచిపెట్టబడుతుందో, అతడే సుఖంకల్గినవాడవుతాడు, మరొక్కడు ఎవడూ సుఖవంతుడు కాలేడు.

**ప్రభవం సర్వదుఃఖానామాలయం సకలాపదామ్ ।**
**ఆశ్రయం సర్వపాపానాం సంసారం వర్జయేత్ క్షణాత్ ॥47॥**

సమస్త దుఃఖాలకు కారణమై, అఖిల విపత్తులకు నిలయమై, సర్వపాపాలకు ఆశ్రయమైన సంసారాన్ని శీఘ్రంగా విడిచిపెట్టాలి.

**లోహదారుమయైః పాశైః పుమాన్ బద్ధో విముచ్యతే ।**
**పుత్రదారమయైః పాశై ర్ముచ్యతే న కదాచన ॥48॥**

ఇనుము, కొయ్య మున్నగువానిచే చేయబడిన పాశాలచే బంధింపబడిన పురుషుడు విడిపించుకోవచ్చు గాని, భార్యాపుత్రులు మున్నగు ప్రేమపాశాలచే బంధింపబడినవాడు మాత్రం ఎన్నటికీ విడిపించుకోలేడు.

**యావతః కురుతే జంతుః సంబంధాన్ మనసః ప్రియాన్ ।**
**తావంతోఽస్య నిఖన్యంతే హృదయే శోకశంకవః ॥49॥**

ఎంతవరకు జీవుడు తన సంబంధం కలవారిని మనస్సుతో ప్రేమతో చూస్తూఉంటాడో, అంతవరకు అతని హృదయంలో దుఃఖరూపాలైన మేకులు నాటుకొని ఉంటాయి.

**వంచితా శేషవిత్తై స్తైర్నిత్యం లోకో వినాశితః ।**
**హా హంత విషయాహారైర్దేహస్థేంద్రియతస్కరైః ॥50॥**

అయ్యో! ఎంతకష్టం! విషయాలనే ఆహారాలచే, దేహంలోనున్న ఇంద్రియాలు అనే దొంగలచే, మోసానికి గురిచేసే సమస్త విత్తాలచే నిత్యం ఈ లోకం వినాశం చెందుతోంది.

**మాంసలుబ్ధో యథా మత్స్యో లోహశంకుం న పశ్యతి ।**
**సుఖలుబ్ధ స్తథా దేహీ యమబాధాం న పశ్యతి ॥51॥**

మాంసంపై ఆసక్తి కల్గిన చేప ఇనుముతో చేయబడిన గాలాన్ని చూడనట్లు, విషయసుఖాలయందు ఆసక్తికల్గిన జీవుడు యమబాధను లెక్కింపకుండా ఉంటాడు.

**హితాహితం న జానంతో నిత్యమున్మార్గగామినః ।**
**కుక్షిపూరణ నిష్ఠా యే తే నరా నారకాః ఖగ ॥52॥**

ఖగమా! మంచి ఏమిటో, చెడు ఏమిటో తెలుసుకోలేక, ఎల్లప్పుడూ ఉన్మత్తమార్గంలో సంచరించేవారూ, కడుపునింపుకొనుటయందే ఆసక్తి కల నరులు నరకాన్ని పొందేవారవుతారు.

**నిద్రాభీర్మైథునాహారాః సర్వేషాం ప్రాణినాం సమాః ।**
**జ్ఞానవాన్మానవః ప్రోక్తో జ్ఞానహీనః పశుః స్మృతః ॥53॥**

నిద్ర, భయం, మైథునం, ఆహారం అనేవి సర్వప్రాణులకు సమానంగానే ఉన్నాయి. జ్ఞానం కల్గినవాడే మానవుడని చెప్పబడతాడు. జ్ఞానంలేనివాడు పశువుతో సమానుడుగా చెప్పబడతాడు.

**ప్రభాతే మలమూత్రాభ్యాం క్షుత్తృడ్భ్యాం మధ్యగే రవౌ ।**
**రాత్రౌ మదననిద్రాభ్యాం బాధ్యంతే మూఢమానవాః ॥54॥**

మూఢులైన మానవులు ప్రభాతసమయంలో మలమూత్రాలచేత, సూర్యుడు మధ్యాహ్నంలో ఉండగా ఆకలిదప్పికలచేత, రాత్రి నిద్రామైథునాలచేత బాధింపబడుతూ ఉంటారు.

**స్వదేహధనదారాదినిరతాః సర్వజన్తవః ।**
**జాయంతే చ మ్రియంతే చ హా హంతాజ్ఞాన మోహితాః ॥55॥**

సర్వజనులు తన శరీరం, ధనం, భార్య మున్నగువారిపై ఆసక్తితో అజ్ఞానంతో మోహింపబడుతూ పుడుతున్నారు, చస్తున్నారు. ఎంతకష్టమో కదా!

**తస్మాత్సంగః సదా త్యాజ్యః సచేత్త్యక్తుం న శక్యతే ।**
**మహద్భిస్సహ కర్తవ్యః సంతః సంగస్య భేషజమ్ ॥56॥**

అందువల్ల సంగం ఎల్లప్పుడూ విడిచిపెట్టాలి, సంగాన్ని విడిచిపెట్టడం శక్యం కాకపోతే, గొప్పవారైన సత్పురుషులతో సాంగత్యం చేయాలి. సత్పురుషసహవాసమే సంగానికి ఔషధం.

**సత్సంగశ్చ వివేకశ్చ నిర్మలం నయనద్వయమ్ ।**
**యస్య నాస్తి నరః సోఽన్ధః కథం న స్యాదమార్గగః ॥57॥**

సత్సంగం వివేకం మానవునకు నిర్మలమైన రెండు కన్నులు. ఏ మానవునకు ఇవి లేవో వాడు అంధుడు. అట్టివాడు వెళ్ళకూడని మార్గంలో వెళ్ళకుండా ఎలా ఉంటాడు?

**స్వస్వవర్ణాశ్రమాచార నిరతాః సర్వమానవాః ।**
**న జానంతి పరం ధర్మం వృథా నశ్యంతి దాంభికాః ॥58॥**

దాంభిక ప్రవర్తన కల్గిన మనుష్యులందరు తమ తమ వర్ణాలయందు, ఆశ్రమాలయందు, ఆచారాలయందు తగులుకొని, ఉత్తమమైన ధర్మాన్ని తెలిసికొనలేకపోతున్నారు. అంతేకాక వ్యర్థంగా చెడిపోతున్నారు.

**కిమా యాసపరాః కేచిద్వ్రతచర్యాది సంయుతాః ।**
**అజ్ఞాన సంవృతాత్మానః సంచరంతి ప్రచారకాః ॥59॥**

కొందరు కర్మలను ఏవో ఆచరిస్తూ ఆయాసం పొందుతారు, మరికొందరు వ్రతం, దీక్ష మున్నగువాటిని ఆచరిస్తారు, ఇంకకొందరు అజ్ఞానమనే ఆవరణచే తాము మోహాన్ని చెందుతారు. కొందరు ప్రచారకులై సంచరిస్తారు.

**నామమాత్రేణ సంతుష్టాః కర్మకాండరతా నరాః ।**
**మంత్రోచ్చారణ హోమాద్యై ర్భ్రామితాః క్రతువిస్తరైః ॥60॥**

కొందరు (గొప్పపనులుచేసి) నామమాత్రంచే సంతుష్టిపొందుతారు. మరి కొందరు నరులు కర్మకాండయందు ఆసక్తి కలవారై మంత్రాలు పఠించడం, హోమాలు చేయడం మున్నగు క్రతువిశేషాలచే సంభ్రమిస్తూ ఉంటారు.

**ఏకభుక్తోపవాసాద్యై ర్నియమైః కాయశోషణైః ।**
**మూఢాః పరోక్ష మిచ్ఛంతి మమ మాయావిమోహితాః ॥61॥**

కొందరు మూఢులు నా మాయచే మోహింపబడినవారై, ఒంటిపూట భోజనంచేయడం, ఉపవాసాదులు చేయడం, మున్నగు నియమాలతో, శరీరాన్ని శుష్కింపజేసుకొంటూ, అపరోక్షానుభూతిని వదలి పరోక్షజ్ఞానాన్నే కోరుకొంటారు.

**దేహదండనమాత్రేణ కా ముక్తి రవివేకినామ్ ।
వల్మీకతాడనాదేవ మృతః కిన్ను మహోరగః ॥62॥**

పుట్టను కొట్టినంతమాత్రంచేత, పుట్టలోఉండే మహాసర్పం చనిపోదు, అట్లే దేహాన్ని బాధించినంతమాత్రంచేత అవివేకులకు ముక్తి ఎట్లు చేకూరుతుంది?

**జటాభారాజినైర్యుక్తా దాంభికా వేషధారిణః ।
భ్రమంతి జ్ఞానివల్లోకే భ్రామయంతి జనానపి ॥63॥**

కొంతమంది దాంభికులు జడలు, కృష్ణాజినంతో కూడికొని, విభూతి మున్నగువాటిని పూసుకొని వేషాలను ధరించి లోకంలో జ్ఞానులవలె సంచరిస్తూ, మిగిలిన జనులనుకూడ భ్రమింపజేస్తారు

**సంసారజ సుఖాసక్తం బ్రహ్మజ్ఞోఽస్మీతి వాదినమ్ ।
కర్మబ్రహ్మోభయభ్రష్టం తం త్యజేదంత్యజం యథా ॥64॥**

సంసారంలో ఉండే సుఖాలను అనుభవిస్తూ, నేను బ్రహ్మను తెలిసికొన్నవాడనని వాదిస్తూ, కర్మ బ్రహ్మల రెండింటినుండి జారిపోయిన భ్రష్టుని చండాలునివలె దూరంగా త్యజించాలి.

**గృహారణ్యసమా లోకే గతవ్రీడా దిగంబరాః ।
చరంతి గర్దభాద్యాశ్చ విరక్తాస్తే భవంతి కిమ్ ॥65॥**

లోకంలో కొందరు సిగ్గువిడిచి, బట్టలువదలి, గృహాన్ని అరణ్యసమంగా ఎంచి తిరుగుతూఉంటారు. వారు గాడిదలు మొదలగు జంతువులవంటివారు. వారు అంతమాత్రంచే విరక్తులు అవుతారా?

**మృద్భస్మోద్ధూలనాదేవ ముక్తాస్స్యుర్యది మానవాః ।
మృద్భస్మవాసీ నిత్యం శ్వా స కిం ముక్తో భవిష్యతి ॥66॥**

మానవులు మట్టిని, బూడిదను శరీరంపై పూసుకొన్నంతమాత్రంచేతనే ముక్తులయితే, శునకం ఎల్లప్పుడు బూడిదలోనే ఉంటుంది గదా! అది ఏమైనా ముక్తిపొందుతోందా?

**తృణపర్ణోదకాహారాః సతతం వనవాసినః ।
జంబుకాఖు మృగాద్యాశ్చ తాపసాస్తే భవంతి కిమ్ ॥67॥**

మనుష్యులు అరణ్యంలో నివసిస్తూ నిత్యం గడ్డి, ఆకులు, దుంపలు, నీళ్లు స్వీకరించినంతమాత్రాన తాపసులయితే, నక్క, ఎలుక, జంతువులు మున్నగునవి అన్నీ తాపసులు అవుతున్నారా (యా) ఏమి?

**ఆజన్మ మరణాంతఇ్చ గంగాది తటినీ స్థితాః ।
మండూక మత్స్యప్రముఖాః యోగిన స్తే భవంతి కిమ్ ॥68॥**

పుట్టినదిమొదలు చనిపోయేవరకు గంగ మున్నగు పుణ్యతటులలో ఉండే కప్ప, చేప మున్నగునవన్నీ యోగులు అవుతున్నారా(యా)ఏమి?

**పారావతాః శిలాహారాః కదాచిదపి చాతకాః ।**
**న పిబంతి మహీతోయం వ్రతినస్తే భవంతి కిమ్ ॥69॥**

పావురాలు రాళ్లను తిని బ్రతుకుతాయి. చాతక పక్షులు ఎల్లప్పుడూ ఆకాశంనుండి జారిపడే నీళ్లుత్రాగుతాయి. కాని నేలపైఉండే నీళ్లుత్రాగవు. వీటిని వ్రతాన్ని ఆచరించేవని చెప్పవచ్చా?

**తస్మాన్నిత్యాదికం కర్మ లోకరంజన కారకమ్ ।**
**మోక్షస్య కారణం సాక్షాత్తత్త్వజ్ఞానం ఖగేశ్వర ॥70॥**

ఖగరాజా! కాబట్టి ఈ చెప్పబడిన నిత్యకర్మలన్నీ లోకాన్ని ఆనందింపజేయడానికి కారణాలైఉన్నాయి. ఆత్మజ్ఞానం ఒక్కటే మోక్షానికి సాక్షాత్తుగా కారణమై ఉంది.

**షడ్దర్శన మహాకూపే పతితాః పశవః ఖగ ।**
**పరమార్థం న జానంతి పశుపాశ నియంత్రితాః ॥71॥**

ఖగమా! జ్ఞానంలేని నరపశువులు షడ్దర్శనాలనే(కామాదులనే)మహాకూపంలో పడినవారై, రాగద్వేషాలనే పాశాలచే బంధింపబడి పరమార్థజ్ఞానాన్ని తెలుసుకోలేకపోతున్నారు.

**వేదశాస్త్రార్ణవైర్ఘోరై రుహ్యమానా ఇతస్తతః । (రూ)**
**షడూర్మినిగ్రహగ్రస్తా స్తిష్ఠంతి హి కుతార్కికాః ॥72॥**

కొందరు కుతార్కికులు ఘోరాలైన వేదశాస్త్ర మహాసముద్రాలలో ఇటూ అటూ సుడులు తిరుగుతూ; శోకమోహాలు, సుఖదుఃఖాలు, ఆకలిదప్పిక లనే షడూర్ములను మొసళ్లతో మ్రింగబడినవారవుతూ ఉంటారు.

**వేదాగమ పురాణజ్ఞః పరమార్థం న వేత్తి యః ।**
**విడంబకస్య తస్యైవ తత్సర్వం కాకభాషితమ్ ॥73॥**

వేదశాస్త్ర పురాణాలను చదివినప్పటికీ, పరమార్థం తెలుసుకోలేకపోతే, వాని పలుకులన్నీ కాకిపలుకులే కాని ప్రయోజనం ఏమీ ఉండదు.

**ఇదం జ్ఞానమిదం జ్ఞేయమితి చింతాసమాకులాః ।**
**పఠంత్యహర్నిశం శాస్త్రం పరతత్త్వపరాఙ్ముఖాః ॥74॥**

ఇది జ్ఞానం, ఇది జ్ఞేయం (సిద్ధం, సాధ్యం) అనే విచారణతో వ్యాకులపాటుతో, పరమాత్మజ్ఞానమందు ఆసక్తిలేక రాత్రి, పగలు శాస్త్రాలను పఠిస్తూనే ఉంటారు.

**వాక్యచ్ఛందో నిబంధేన కావ్యాలంకారశోభితాః ।**
**చింతయా దుఃఖితా మూఢాస్తిష్ఠంతి వ్యాకులేంద్రియాః ॥75॥**

శాస్త్రవాక్యాలతోను, ఛందస్సుయొక్క నిబంధనలతోను, కావ్యనాటకాదులలోని అలంకారతర్కాలతోను, ఆలోచనలుచేస్తూ, నిరంతరం దుఃఖిస్తూ, ఇంద్రియాలను ఆకులపాటుకు గురిచేస్తూ, మూఢులై ఉండిపోతారు.

**అన్యథా పరమం తత్త్వం జనాః క్లిశ్యంతి చాన్యథా ।**
**అన్యథా శాస్త్రసద్భావో వ్యాఖ్యాం కుర్వంతి చాన్యథా ॥76॥**

పరమార్థతత్త్వం ఒకవిధంగా ఉంటే, జనులు మరోతీరుగా విచారించి విసుగుచెందుతూ ఉంటారు. శాస్త్రాలయొక్క నిజస్థితి ఒకలా ఉంటే మరోవిధంగా వ్యాఖ్యానంచేస్తూ ఉంటారు.

**కథయంత్యున్మనీభావం స్వయం నానుభవంతి చ ।**
**అహంకార రతాః కేచి దుపదేశాది వర్జితాః ॥77॥**

ఉన్మనీభావాన్ని బోధిస్తారు కాని స్వయంగా కొందరు అనుభవంలోకి తెచ్చుకోరు.(ధ్యేయవస్తువునందు మనస్సును లయింపజేయడం ఉన్మనీభావం అంటారు) లోకంలో కొందరు గురూపదేశాదులు లేకుండగానే, మేమే సర్వజ్ఞులమనే అహంకారంతో పరబ్రహ్మతత్త్వాన్ని బోధిస్తూ ఉంటారు.

**పఠంతి వేదశాస్త్రాణి బోధయంతి పరస్పరమ్ ।**
**న జానంతి పరం తత్త్వం దర్వీ పాకరసం యథా ॥78॥**

కొందరు వేదశాస్త్రాలు చదువుకొని పరస్పరం బోధచేసుకొంటారు (వాదాలు చేస్తూ ఉంటారు) గరిటె(తెడ్డు) వంటరుచిని తెలుసుకోలేనట్లుగా వారు పరతత్త్వాన్ని మాత్రం గ్రహించలేరు.

**శిరో వహతి పుష్పాణి గంధం జానాతి నాసికా ।**
**పఠంతి వేదశాస్త్రాణి దుర్లభో భావబోధకః ॥79॥**

పుష్పాలను శిరస్సు వహిస్తుంది, పరమళాన్నిమాత్రం ముక్కు గ్రహిస్తుంది, వేదశాస్త్రాలు చదువుతారు కాని, భావాన్ని గ్రహించడం మాత్రం సామాన్యంగా లభ్యం కాదు.

**తత్త్వమాత్మస్థ మజ్ఞాత్వా మూఢః శాస్త్రేషు ముహ్యతి ।**
**గోపః కక్షాగతే ఛ్ఛాగే కూపం పశ్యతి దుర్మతిః ॥80॥**

మూఢుడు తనలో ఉండే పరమాత్మను తెలుసుకోలేక, శాస్త్రాలలో తత్త్వం ఉందని చదివే మోహంలో ఉంటాడు. తనప్రక్కనే (చంకలో) మేక ఉండగా గొల్లవాడు నూతిలోపడింది అది అన్నట్లు భ్రమచెందుతాడు.

**సంసార మోహనాశాయ శాబ్దబోధో న హి క్షమః ।**
**న నివర్తేత తిమిరం కదాచిద్దీపవార్తయా ॥81॥**

సంసారంలోని మోహం నశించాలంటే  కేవలం మాటలతో బోధచేస్తే సరిపోతుందా? దీపంవెలిగిస్తే చీకటి పోతుంది కాని, దీపంపేరు చెప్పినంతమాత్రంచేత తిమిరం తొలగిపోతుందా?

**ప్రజ్ఞాహీనస్య పఠనం యథాంధస్య చ దర్పణమ్ ।**
**అతః ప్రజ్ఞావతాం శాస్త్రం తత్త్వజ్ఞానస్య లక్షణమ్ ॥82॥**

తెలివిలేనివాడు శాస్త్రపఠనంచేయడం ఎటువంటిదంటే గ్రుడ్డివాడు అద్దాన్ని చూచినట్లుగానే ఉంటుంది, కాబట్టి తెలివిగలవాడు శాస్త్రాభ్యాసం చేస్తే ఆత్మజ్ఞానం తెలుసుకొనే లక్షణం అవుతుంది.

**ఇదం జ్ఞాన మిదం జ్ఞేయం సర్వన్తు శ్రోతుమిచ్ఛతి ।**
**దివ్యవర్ష సహస్రాచ్చ శాస్త్రాంతం నైవ గచ్ఛతి ॥83॥**

ఇది జ్ఞానం, ఇది జ్ఞేయం, అని సర్వంతెలుసుకొనే(వినే)కోరికతో ఉంటాడు, కాని దివ్యవర్ష సహస్రాలుగడిచినా వాటి(శాస్త్రాల)అంతం కానరాదు.

**అనేకాని చ శాస్త్రాణి స్వల్పాయు ర్విఘ్నకోటయః ।**
**తస్మాత్సారం విజానీయాత్ క్షీరం హంస ఇవాంభసి ॥84॥**

శాస్త్రాలు అనేకాలు, ఆయుర్దాయమా స్వల్పం, ఇక కోట్లకొలది విఘ్నాలు, అందువల్ల హంస పాలు నీళ్లు కలిసి ఉండగా పాలనుమాత్రమే గ్రహించినట్లు సారాన్ని మాత్రమే గ్రహించాలి.

**అభ్యస్య వేదశాస్త్రాణి తత్త్వం జ్ఞాత్వాఽథ బుద్ధిమాన్ ।**
**పలాలమివ ధాన్యార్థీ సర్వశాస్త్రాణి సంత్యజేత్ ॥85॥**

కుప్పనూర్చినవాడు ధాన్యాన్నితీసుకొని, పొల్లును విడిచిపెట్టినట్లుగా; బుద్ధిమంతుడైనవాడు వేదశాస్త్రాలను అభ్యసించి, జ్ఞానాన్నిగ్రహించి, సమస్త శాస్త్రాలను వదలివేయాలి.

**యథామృతేన తృప్తస్య నాహారేణ ప్రయోజనమ్ ।**
**తత్త్వజ్ఞస్య తథా తార్క్ష్య న శాస్త్రేణ ప్రయోజనమ్ ॥86॥**

గరుడా! అమృతం త్రాగి తృప్తిచెందినవానికి మిగిలిన ఆహారంతో ఏమీ ప్రయోజనంఉండదు. యథార్థజ్ఞానం తెలిసినవానికి ఇతర శాస్త్రంవల్ల ప్రయోజనం అనేది ఉండదు.

**న వేదాధ్యయనాన్ముక్తి ర్నశాస్త్రపఠనాదపి ।**
**జ్ఞానాదేవ హి కైవల్యం నాన్యథా వినతాత్మజ ॥87॥**

వినతానందనా! వేదాధ్యయనంవల్ల కాని, శాస్త్రపఠనంవల్ల కాని ముక్తిలేదు, జ్ఞానంవల్లనే కైవల్యం సిద్ధిస్తుంది, మరోవిధంగా కాదు.

**నాశ్రమః కారణం ముక్తే ర్దర్శనాని న కారణమ్ ।**
**తథైవ సర్వకర్మాణి జ్ఞానమేవ హి కారణమ్ ॥88॥**

ముక్తికి ఆశ్రమం కారణం కాదు, దర్శనాలు అంతకన్నా కారణాలు కావు, అలాగే సర్వకర్మలు కూడ కారణాలు కావు, ముక్తికి జ్ఞానమే కారణం.

**ముక్తిదా గురువాగేకా విద్యాః సర్వా విడంబికాః ।**
**శాస్త్రభారసహస్రేషు హ్యేకం సంజీవనం పరమ్ ॥89॥**

గురువుయొక్క ఉపదేశమే ముక్తినిస్తుంది. సర్వవిద్యలు కేవలం విడంబనాలు మాత్రమే. బరువునుపెంచే వేలకొలది శాస్త్రాలలో ఒక్క సంజీవనమే శ్రేష్ఠమైనది.

**అద్వైతం హి శివం ప్రోక్తం క్రియయా పరివర్జితమ్ ।**
**గురువక్త్రేణ లభ్యేత నాధీతాగమకోటిభిః ॥90॥**

క్రియాయోగంచే వదలిపెట్టబడిన అద్వైతమొక్కటే శుభప్రదమైనదిగా చెప్పబడింది. అది గురుముఖతః లభిస్తుంది. ఎక్కువగా ఆగమాలు పఠించినంతమాత్రంచే వచ్చేదికాదు.

**ఆగమోక్తం వివేకోత్థం ద్విధా జ్ఞానం ప్రచక్షతే ।**
**శబ్దబ్రహ్మాగమమయం పరం బ్రహ్మ వివేకజమ్ ॥91॥**

ఆగమాలలో చెప్పబడింది, వివేకంవల్ల ఉత్పన్నమయ్యేది అని జ్ఞానం రెండువిధాలుగా చెప్పబడింది. ఆగమమయం శబ్దబ్రహ్మం. పరంబ్రహ్మతత్త్వం వివేకంవల్ల జనిస్తుంది.

**అద్వైతం కేచిదిచ్ఛంతి ద్వైత మిచ్ఛన్తి చాపరే ।**
**సమం తత్త్వం న జానంతి ద్వైతాద్వైతవివర్జితమ్ ॥92॥**

కొందరు అద్వైతాన్ని కోరుకొంటారు, మరికొందరు ద్వైతాన్ని ఇష్టపడతారు, ద్వైతాద్వైతాలను విడిచిన పరబ్రహ్మతత్త్వాన్ని (ఎవరూ) తెలుసుకొనలేరు.

**ద్వే పదే బంధమోక్షాయ న మమేతి మమేతి చ ।**
**మమేతి బధ్యతే జన్తు ర్న మమేతి ప్రముచ్యతే ॥93॥**

రెండక్షరాలే బంధాన్నైనా, మోక్షాన్నైనా కలగజేస్తాయి, ప్రాణి "మమ" అనే రెండక్షరాలతో బంధింపబడుతుంది. "న మమ" అనే దానిచే విముక్తిని పొందుతుంది.

**తత్కర్మ యన్న బంధాయ సా విద్యా యా విముక్తిదా ।**
**ఆయాసాయాపరం కర్మ విద్యాన్యా శిల్పనైపుణమ్ ॥94॥**

ఏది బంధనాన్ని కలిగించదో అదే కర్మ. ఏది విముక్తినిస్తుందో అదే విద్య. అందుకు భిన్నమైన కర్మ ఆయాసహేతువు అవుతుంది, దానికి(ముక్తికి) భిన్నమైన విద్య శిల్పనైపుణం మాత్రమే అవుతుంది.

**యావత్కర్మాణి దీప్యంతే యావత్సంసారవాసనా ।**
**యావదింద్రియచాపల్యం తావత్తత్త్వ కథా కుతః ॥95॥**

ఎంతవరకు కర్మలు కామ్యంతో వెలిగిపోతూ ఉంటాయో, ఎంతవరకు సంసారవాసన ఉంటుందో, ఎంతవరకు ఇంద్రియాల చపలత్వం ఉంటుందో, అంతవరకు తత్త్వనిర్ణయం ఎలా కలుగుతుంది?

**యావద్దేహాభిమానశ్చ మమతా యావదేవ హి ।**
**యావత్ప్రయత్నవేగోఽస్తి యావత్సంకల్ప కల్పనా ॥96॥**

**యావన్నో మనసః స్థైర్యం న యావచ్ఛాస్త్రచింతనమ్ ।**
**యావన్న గురుకారుణ్యం తావత్తత్త్వ కథా కుతః ॥97॥**

ఎంతవరకూ దేహాభిమానం ఉంటుందో, ఎంతవరకు మమకారం ఉంటుందో, ఎంతవరకు ఏదో సాధించాలనే ప్రయత్నంలో వేగం ఉంటుందో, ఎంతవరకు మనస్సుకు సంకల్ప వికల్పాలు ఉంటాయో, అంతవరకు తత్త్వజిజ్ఞాస అసంభవం. మనస్సుకు స్థైర్యం అనేది ఎప్పటివరకు ఏర్పడదో, శాస్త్రచింతనం అనేది ఎప్పటివరకు చేయబడదో, గురుకృప అనేది ఎంతవరకు ప్రసరించదో, అంతవరకు తత్త్వజిజ్ఞాస అనేది ఎక్కడనుండి వస్తుంది?

**తావత్తపో వ్రతం తీర్థం జపహోమార్చనాదికమ్ ।**
**వేదశాస్త్రాగమకథా యావత్తత్త్వం న విందతి ॥98॥**

ఎంతవరకు ఆత్మజ్ఞానం కలగదో, అంతవరకే తపస్సు, వ్రతం, తీర్థం, జపం, హోమం, అర్చన మున్నగునవి, వేదాధ్యయనం, శాస్త్రపఠనం, కథాశ్రవణం చేయాలి.

**తస్మాత్సర్వ ప్రయత్నేన సర్వావస్థాసు సర్వదా ।**
**తత్త్వనిష్ఠో భవేత్తార్క్ష్య యదీచ్ఛేన్మోక్షమాత్మనః ॥99॥**

గరుడా! తనకు మోక్షం కావాలనే కోరిక ఉంటే, అన్ని అవస్థలలోను, ఎల్లప్పుడు సర్వప్రయత్నాలతోను ఆత్మజ్ఞానమందు శ్రద్ధకలిగి ఉండాలి.

**ధర్మజ్ఞానప్రసూనస్య స్వర్గమోక్షఫలస్య చ ।**
**తాపత్రయాది సంతప్తశ్ఛాయాం మోక్షతరోః శ్రయేత్ ॥100॥**

ధర్మం, జ్ఞానం, పువ్వులుగా స్వర్గం, మోక్షం పండ్లుగా నున్న మోక్షమనే చెట్టుయొక్కనీడను ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే మూడు తాపాలతో తపింపబడేవాడు ఆశ్రయించాలి.

**తస్మా జ్ఞానే నాత్మతత్త్వం విజ్ఞేయం శ్రీగురోర్ముఖాత్ ।**
**సుఖేన ముచ్యతే జన్తు ర్ఘోరసంసారబంధనాత్ ॥101॥**

ఆ కారణంచే జ్ఞానపూర్ణుడైన సద్గురువుయొక్క ముఖంనుండి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలి, అప్పుడు మహాభయంకరమైన సంసారబంధంనుండి ప్రాణి సుఖంగా విడిపోతాడు.

**తత్త్వజ్ఞస్యాన్తిమం కృత్యం శృణు వక్ష్యామి తేఽధునా ।**
**యేన మోక్షమవాప్నోతి బ్రహ్మ నిర్వాణ సంజ్ఞకమ్ ॥102॥**

జ్ఞానంగలవాడు మృతిని పొందేవరకు ఏ ఏ కర్మను ఆచరిస్తే, బ్రహ్మానందరూపమైన మోక్షాన్ని పొందుతాడో, ఆ అన్తిమకృత్యాన్ని ఇపుడు చెబుతున్నాను. విను.

**అంతకాలే తు పురుష ఆగతే గతసాధ్వసః ।**
**ఛింద్యాదసంగ శస్త్రేణ స్పృహాం దేహేఽను యా చ తమ్ ॥103॥**

మరణకాలం సమీపించగానే పురుషుడు భయాన్ని వదలి, అసంగం అనే శస్త్రంతో దేహమందు కోరికను, దానిని అనుసరించే ఉండే ప్రీతిని ఛేదించాలి.

**గృహాత్ ప్రవ్రజితో ధీరః పుణ్యతీర్థజలాప్లుతః ।**
**శుచౌ వివిక్త ఆసీనో విధివత్కల్పితాసనే ॥104॥**

**అభ్యసేన్మనసా శుద్ధం త్రివృద్బ్రహ్మాక్షరం పరమ్ ।**
**మనో యచ్ఛేజ్జితశ్వాసో బ్రహ్మబీజమవిస్మరన్ ॥105॥**

మోక్షాన్ని పొందాలనుకొనే ధీరుడు ఇంటిని విడిచి, గంగాది పుణ్యతీర్థజలాలలో స్నానంచేసి, పరిశుద్ధమైన నిర్జనప్రదేశంలో ఆసీనుడై, విధ్యుక్తప్రకారంగా ఆసనం కల్పించుకొని, మనస్సునందు పరమపవిత్రమైన, అకారోకారమకార సంయుక్తమయి ప్రణవాక్షరమైన ఓంకారాన్ని మనస్సులో ధ్యానిస్తూ, మనస్సును స్థిరంచేసుకొని, శ్వాసజయించి, ప్రాణాయామపరుడై, ఓంకార ధ్యానపరుడై ఉండాలి.

**నియచ్ఛేద్విషయేభ్యోఽక్షాన్ మనసా బుద్ధిసారథిః ।**
**మనః కర్మభిరాక్షిప్తం శుభార్థే ధారయేద్ధియా ॥106॥**

ఇంద్రియాలను, విషయాలనుండి మళ్లించి, మనస్సును నిశ్చయాత్మకమైన బుద్ధి సహాయంతో, చిత్తాన్ని కర్మలయందు ఆసక్తిని పొందనీయకుండా, మంగళప్రదమైన పరమాత్మజ్ఞానమందు బుద్ధిని నిలబెట్టాలి.

**అహం బ్రహ్మ పరంధామ బ్రహ్మాహం పరమం పదమ్ ।**
**ఏవం సమీక్ష్య చాత్మాన మాత్మన్యాధాయ నిష్కలే ॥107॥**

**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥108॥**

నేనే పరబ్రహ్మను, పరబ్రహ్మయే నా స్వరూపం, బ్రహ్మ, ఆ పరబ్రహ్మమును నేనే, ఈ విధంగా అనుభవానికి తెచ్చుకొని, నిరుపాధికమైన పరబ్రహ్మమునందు తన ఆత్మస్వరూపము ఉన్నట్లు భావించి, పరబ్రహ్మ స్వరూపమగు ఓంకారం స్మరించి, నాయందే మనస్సుఉంచి, దేహాన్నివిడిచిపెట్టినవాడు అతడు పరమగతిని పొందుతాడు.

**న యత్ర దాంభికా యాంతి జ్ఞానవైరాగ్యవర్జితాః ।**
**సుధియస్తాం గతిం యాంతి తానహం కథయామి తే ॥109॥**

అక్కడకు దాంభికులు చేరలేరు. జ్ఞానం,వైరాగ్యం లేనివారు అక్కడకు వెళ్లలేరు. ఆత్మజ్ఞానవిదులుమాత్రమే ఆ గతిని పొందుతారు. వారిని గురించి నీకు నేను తెలియజేస్తాను.

**నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైర్గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ ॥110॥**

(మమకారం) రాగం, మోహం విడిచిపెట్టినవారు, సంగదోషాన్ని త్యజించినవారు, కామాభిలాషనుండి విడివడినవారు, సుఖదుఃఖాలనే పేర్లుకల ద్వంద్వాల నుండి బయటపడినవారు, నిత్యమూ ఆత్మజ్ఞానమందే ఆసక్తి కలవారు మాత్రమే, మూఢత్వంలేని తత్త్వజ్ఞానులయి అవ్యయమైన ఆ పదాన్ని చేరుకోగలరు.

**జ్ఞానహ్రదే సత్యజలే రాగద్వేషమలాపహే ।**
**యః స్నాతి మానసే తీర్థే స వై మోక్షమవాప్నుయాత్ ॥111॥**

జ్ఞానమనే హ్రదం(సరస్సు)లో సత్యమనే జలంలో, రాగద్వేషాలనే కల్మషాలను పోగొట్టే మానసతీర్థంలో స్నానంచేసినవాడు మోక్షాన్ని పొందగలడు.

**ప్రౌఢ వైరాగ్యమాస్థాయ భజతే మామనన్యభాక్ ।**
**పూర్ణదృష్టిః ప్రసన్నాత్మా స వై మోక్షమవాప్నుయాత్ ॥112॥**

చంచలం కాని వైరాగ్యాన్ని పొంది, నాయందు అనన్యభక్తి కలిగి ఎవడు సేవిస్తాడో, ఎవడు పూర్ణ ప్రజ్ఞావంతుడో, ఎవడు ప్రసన్నమైన చిత్తంకలిగి ఉంటాడో, అతడే మోక్షాన్ని పొందగలడు.

**త్యక్త్వా గృహం చ యస్తీర్థే నివసేన్మరణోత్సుకః ।**
**ముక్తిక్షేత్రేషు మ్రియతే స వై మోక్షమవాప్నుయాత్ ॥113॥**

ఇంటిని విడిచిపెట్టి, మరణంపై కోరికతో  పుణ్యతీర్థంలో ముక్తిక్షేత్రాలలో నివసించినవాడు మోక్షాన్ని పొందగలడు.

**అయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ అవంతికా ।**
**పురీ ద్వారవతీ జ్ఞేయాః సప్తైతా మోక్షదాయికాః ॥114॥**

అయోధ్య, మథుర, మాయ, కాశి, కాంచి, అవంతిక, ద్వారకాపురి ఈ ఏడును మోక్షాన్నిచ్చే తీర్థాలుగా పేర్కొనబడినాయి.

**ఇతి తే కథితం తార్క్ష్య మోక్షధర్మం సనాతనమ్ ।**
**జ్ఞానవైరాగ్యసహితం శ్రుత్వా మోక్షమవాప్నుయాత్ ॥115॥**

గరుడా! ఈవిధంగా నీకు ప్రాచీనమై, జ్ఞానవైరాగ్యాలతో కూడుకొన్న మోక్షధర్మాన్ని తెలియజేశాను! దీనిని విన్నచో మోక్షాన్ని పొందవచ్చు.

**మోక్షం గచ్ఛంతి తత్త్వజ్ఞా ధార్మికా స్వర్గతిం నరాః ।**
**పాపినో దుర్గతిం యాంతి సంసరంతి ఖగాదయః ॥116॥**

తత్త్వజ్ఞులు మోక్షాన్ని పొందుతారు, ధార్మికులు అయిన నరులు స్వర్గాన్ని చేరుతారు, పాపాత్ములు నరకానికి పోతారు, ఖగాదులు (పశుపక్ష్యాదులు) జననమరణాలను పొందుతూనే ఉంటాయి.

**సూత ఉవాచ** – సూతుడు వచించాడు.

**స్వప్రశ్నోత్తర రాద్ధాంతమేవం భగవతో ముఖాత్ ।**
**శ్రుత్వా హృష్టతనుస్తార్క్ష్యో ననామ జగదీశ్వరమ్ ॥117॥**

తన ప్రశ్నలకు తగిన ప్రత్యుత్తర సిద్ధాంతవిషయాలను ఈ రీతిగా భగవంతుని ముఖతః విని, గరుడుడు పులకాంకిత శరీరుడై, ఆ జగదీశ్వరునికి ప్రణమిల్లాడు.

**సందేహో మే మహాన్నష్టో భవద్వాక్య విరోచనాత్ ।**
**ఇత్యుక్త్వా విష్ణుమామంత్ర్య స గతః కశ్యపాశ్రమమ్ ॥118॥**

'నా పెనుశంక నీమాటల వెలుగుతో నశించింది', అని పలికి విష్ణుని సెలవడిగి ఆ గరుడుడు కశ్యపాశ్రమానికి వెళ్లిపోయాడు.

**సద్యో దేహాంతరం యాతి యథా యాతి విలంబతః ।**
**అనయో రుభయోశ్చైవ న విరోధస్తథైవ వః ॥119॥**

ఇలా కొంత కాలవిలంబం కాగా, వెంటనే అతడు మరోదేహాన్ని పొందాడు, వారిరువురికి ఏ భేదంలేదు, వారిద్దరికి ఏ భేదం లేనట్లే మీకుకూడ అంతే.

**సర్వమాఖ్యాతవాం స్తాత శ్రుతో భగవతో యథా ।**
**మారీచోऽపి ముదం లేభే శ్రుత్వా వాక్యం రమాపతేః ॥120॥**

తండ్రీ! సమస్తమూ భగవంతుడు తెలియజేశాడు. ఆ భగవంతుని వచనమంతా విన్నాను. రమాపతి యొక్క వాక్యాన్ని విని మారీచుడు కూడ సంతోషాన్ని పొందాడు.

**అపాకృతస్తు సందేహో బ్రాహ్మణా భవతాం మయా ।**
**ఉక్తం సుపర్ణ సంజ్ఞస్తు పురాణం పరమాద్భుతమ్ ॥121॥**

బ్రాహ్మణులారా! నాద్వారా, మీకు వచ్చిన సందేహం తొలగినట్లేకదా! పరమాద్భుతమైన గారుడ మనే పేరుగల పురాణం మీకు వివరించబడింది.

**ఇదమాప హరే స్తార్క్ష్య స్తార్క్ష్యాదాప తతో భృగుః ।**
**భృగో ర్వసిష్ఠః సంప్రాప వామదేవస్తతః పునః ॥122॥**

**పరాశరమునిః ప్రాప తస్మాద్వ్యాస స్తతో హ్యహమ్ ।**
**మయా తు భవతాం ప్రోక్తం పరం గుహ్యం హరేరిదమ్ ॥123॥**

దీనిని హరినుండి తార్క్ష్యుడు పొందాడు. పిమ్మట గరుడునినుండి భృగువు పొందాడు. భృగువునుండి వసిష్ఠుడు పొందాడు. ఆ తరువాత వామదేవుడు. అతని నుండి పరాశరముని. అతని నుండి వ్యాసుడు పొందారు. వ్యాసుని నుండి నేను గ్రహించాను. పరమ గుహ్యమైన హరిచెప్పిన ఈ పురాణాన్ని నేను మీకు వివరించాను.

**య ఇదం శృణుయాన్మర్త్యో యోవాప్యభిదధాతి చ ।**
**ఇహాముత్ర చ లోకే స సర్వత్ర సుఖమాప్నుయాత్ ॥124॥**

ఏ మనుష్యుడయితే దీనిని శ్రవణం చేస్తాడో, లేదా ఎవడయితే దీనిని ధారణచేస్తాడో, అతడు ఈ లోకంలోను, పరలోకంలోను అంతటా సుఖాన్ని పొందుతాడు.

**వ్రజతః సంయమన్యాం యద్దుఃఖమత్ర నిరూపితమ్ ।**
**అస్య శ్రవణతః పుణ్యం తన్ముక్తో జాయతే తతః ॥125॥**

సంయమనీ నగరానికి వెడుతూ, ఏ దుఃఖం నరుడు పొందుతాడని ఇక్కడ వివరింపబడిందో, దీనిని వినడంద్వారా ఆ దుఃఖం నుండి విడివడి, పిమ్మట పుణ్యాన్ని పొందుతాడు.

**అత్రోక్త కర్మపాకాది శ్రవణాచ్చ నృణామిహ ।**
**వైరాగ్య మావహే ద్యస్మాత్తస్మా చ్ఛ్రోతవ్యమేవ చ ॥126॥**

ఇందు చెప్పబడిన కర్మపరిపాకాదులను వినడంవల్ల, నరులకు ఇక్కడ వైరాగ్యం ఆవహిస్తుంది. ఆ కారణంచేత దీనిని తప్పక వినవలసియున్నది.

**భజత జితహృషీకాః కృష్ణమేనం మునీశం సమజని బత యస్మాద్దీః సుధాసారధారా ।**
**పృషత మపి యదీయం వర్ణరూపం నిపీయ శ్రుతిపుట చులుకేన ప్రాప్నుయాదాత్మనైక్యమ్ ॥127॥**

ఇంద్రియాలను జయించినవారై, ఆ మునీశ్వరుడైన కృష్ణుని భజించండి. ఎవనివలన ఆ సుధాసారధార లనే వచనాలు జనించాయో, ఈ వర్ణరూపాలైన ఉదకబిందువులను, చెవులనే పుడిసిలి ద్వారా త్రాగి పరమాత్మలో ఐక్యాన్ని పొందవచ్చు.

**వ్యాసఉవాచ** – వ్యాసుడు వచించాడు.

**ఇతి సూత ముఖోదీర్ణాం సర్వశాస్త్రార్థ మండితామ్ ।**
**వైష్ణవీం వాక్సుధాం పీత్వా ఋషయ స్తుష్టిమాయయుః ॥128॥**

ఈవిధంగా సూతుని ముఖంనుండి వెలువడి, సమస్తశాస్త్ర రహస్యాలతో నిండిన, విష్ణుసంబంధమైన వాగమృతాన్ని గ్రోలి ఋషులు సంతుష్టి పొందారు.

**ప్రశసంసు స్తథాన్యోన్యం సూతం సర్వార్థదర్శినమ్ ।**
**ప్రహర్షమతులం ప్రాపుర్మునయః శౌనకాదయః ॥129॥**

అంత వారు పరస్పరం సర్వార్థదర్శియైన సూతుని ప్రశంసించారు, శౌనకాదులందరు సాటిలేని పరమానందాన్ని పొందారు.

**ఇతి హరి వచనాని సూతవాచా ఖగపతి సంశయభేదకాని యాని ।**
**స మునిరపి నిశమ్య శౌనకేంద్రో బహుతర మానయతి స్మ చాత్మని స్వమ్ ॥ 130॥**

గరుడుని సంశయాలను ఛేదించిన హరివాక్యాలు సూతునిద్వారా ఆ శౌనకేంద్రుడగు ముని విని, మిక్కిలి ఎక్కువగా తనలో ఆత్మస్వరూపాన్ని గ్రహించాడు

**అపూజయంస్తే మునయ స్తదానీ ముదారవాగ్భి ర్ముహురేవ సూతమ్ ।**
**ధన్యోఽసి సూత త్వమిహేత్యుదైరయన్ వ్యసర్జయంస్తం చ నివర్తితేఽధ్వరే ॥131॥**

అప్పుడు ఆ మునులందరూ గౌరవపురస్సరాలయిన వాక్యాలచే ఆ సూతుని పదే పదే పూజించారు. “సూతా! నీవు ధన్యుడవు ఇప్పుడు ఇక్కడ నీరాకవల్ల మేము ధన్యులం” అని పలుకుతూ యాగం పూర్తికాగా ఆ సూతుని వీడ్కొలిపారు.

**పురాణం గారుడం పుణ్యం పవిత్రం పాపనాశనమ్ ।**
**శృణ్వతాం కామనాపూరం శ్రోతవ్యం సర్వదైవ హి ॥132॥**

పవిత్రమైన, పాపనాశకమైన,(కామనలతో నిండిన), పుణ్యమైన గారుడపురాణమును విన్నచో కామనలు తీరిపోతాయి. కాబట్టి ఎల్లప్పుడూ ఇది వినదగినది.

**శ్రుత్వా దానాని దేయాని వాచకాయాఖిలాని చ ।**
**పూర్వోక్తశయనాదీని నాన్యథా సఫలం భవేత్ ॥133॥**

విన్న పిమ్మట చెప్పినవానికి పూర్వంలో చెప్పబడిన శయనాది సమస్తదానాలను చేయాలి. లేనినాడు సఫలత్వం లేదు.

**పురాణం పూజయేత్పూర్వం వాచకం తదనంతరమ్ ।**
**వస్త్రాలంకార గోదానై ర్దక్షిణాభిశ్చ సాదరమ్ ॥134॥**

**అన్నదానైర్హేమదానై ర్భూమిదానైశ్చ భూరిభిః ।**
**పూజయేద్వాచకం భక్త్యా బహుపుణ్య ఫలాప్తయే ॥135॥**

ముందు పురాణాన్ని పూజించాలి. ఆ తరువాత వాచకుని పూజించాలి. వస్త్రాలంకారాలచేతను, గోదానాలచేతను, దక్షిణలతోను, అన్నదాన, హేమదాన, భూమిదాన, భూరిదానాలతోను (ఎక్కువ) పెక్కు పుణ్యఫలాలు పొందడానికై పురాణం చెప్పినవానిని భక్తితో పూజించాలి.

**యశ్చేదం శృణుయాన్మర్త్యో యథాపి పరికీర్తయేత్ ।**
**విహాయ యాతనాం ఘోరాం ధూతపాపో దివం వ్రజేత్ ॥136॥**

ఏ మర్త్యుడు దీనిని వింటాడో, ఎవడు చక్కగా కీర్తిస్తాడో, అతడు భయంకరమైన యమయాతనను విడిచి, సమస్త పాపాలనుండి విడివడి స్వర్గం చేరుకొంటారు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండే (ప్రేతకల్పే) శ్రీకృష్ణగరుడసంవాదే మోక్షోపాయనిరూపణం నామ ఏకోనపంచాశత్తమోఽధ్యాయః ॥49॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం రెండవ అంశమనబడే ధర్మకాండ (ప్రేతకల్పం)లో శ్రీకృష్ణగరుడ సంవాదంలో మోక్షప్రాప్తిమార్గాన్ని చెప్పుట అనే నలభై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం

**సమాప్తోఽయముత్తరఖండే ద్వితీయాంశాఖ్యే ధర్మకాండః ప్రేతకల్పః ।**

ఉత్తరఖండంలో, రెండవ అంశమనబడే ధర్మకాండ, ప్రేతకల్పం సమాప్తం.

## **గరుడమహాపురాణమ్** – గరుడమహాపురాణం
## **ఉత్తరఖండః** – ఉత్తరఖండం
## **తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండః** – మూడవఅంశమనబడే బ్రహ్మకాండ
## **ప్రథమోఽధ్యాయః** – మొదటి అధ్యాయం
## **సాత్త్వికాదిపురాణవిభాగః నమ్యానమ్య దేవవిభాగశ్చ** – సాత్త్వికాదిపురాణవిభాగం నమ్యానమ్య దేవవిభాగం

**మల్లానామశనిర్నృణాం నరవరః స్త్రీణాం స్మరో మూర్తిమాన్**
**గోపానాం స్వజనోఽసతాం క్షితిభృతాం శాస్తా స్వపిత్రోః శిశుః ।**
**మృత్యుర్భోజపతే ర్విధాతృవిహిత స్తత్త్వం పరం యోగినాం**
**వృష్ణీనాం చ పతిః సదైవ శుశుభే రంగేఽచ్యుతః సాగ్రజః ॥1॥**

మల్లురకు వజ్రాయుధంవంటివాడును, నరులలో శ్రేష్ఠుడును, స్త్రీలకు అందమైన ఆకారం కల మన్మథునివంటి వాడును, గోపాలురకు బంధువైనవాడును, దుష్టులైన రాజులను శాసించువాడును, తన తల్లిదండ్రులకు శిశువువంటివాడును, భోజపతియైన కంసునకు మృత్యువైనవాడును, బ్రహ్మకు మిక్కిలి హితమైనవాడును, యోగులకు పరతత్త్వమైనవాడును, వృష్ణివంశజులకు ప్రభువైనవాడును అయిన అచ్యుతుడు (శ్రీకృష్ణుడు) బలరామునితో కలసి రంగస్థలమందు ఎల్లప్పుడు ప్రకాశిస్తూ ఉంటాడు.

**నమో నారాయణాయేతి తస్మై వై మూలరూపిణే ।**
**నమస్కృత్య ప్రవక్ష్యామి నారాయణకథామిమామ్ ॥2॥**

'నమో నారాయణాయ' (నారాయణునకు నమస్కారం) అని ఆ మూలరూపునకు ప్రణమిల్లి, ఈ నారాయణకథను చెప్పబోతున్నాను.

**శౌనకాద్యా మహాత్మానో హ్యృషయో బ్రహ్మవాదినః ।**
**నైమిషాఖ్యే మహాపుణ్యే తపస్తేపుర్మహత్తరమ్ ॥3॥**

మహాత్ములైన బ్రహ్మవాదులగు శౌనకుడు మున్నగు ఋషులు మహాపుణ్యప్రదమైన నైమిష(శ)మనే అరణ్యంలో గొప్ప తపస్సు చేశారు.

**జితేంద్రియా జితాహారాః సంతః సత్యపరాయణాః ।**
**యజంతః పరయా భక్త్యా విష్ణుమాద్యం జగద్గురుమ్ ॥4॥**

ఇంద్రియాలను జయించిన, ఆహారముపై ఆసక్తి విడిచినవారు, సత్యపరాయణులైన సత్పురుషులు పరమ భక్తితో ఆద్యుడై, జగత్తునకు గురువైన విష్ణువును పూజించారు.

**గృణంతః పరమం బ్రహ్మ జగచ్చక్షుర్మహౌజసః ।**
**సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞా స్తేపుర్నైమిషకాననే ॥5॥**

సర్వశాస్త్రాలలోని సారాన్ని, అర్థాన్ని, తత్త్వాన్ని తెలిసికొనిన, గొప్పదైన తేజస్సు కల్గినవారు ఆ పరబ్రహ్మనే ఆలంబనంగా గ్రహించి, ఆ జగచ్చక్షువునే స్వీకరించి నైమిషారణ్యమందు తపస్సు చేశారు.

**యజ్ఞైః యజ్ఞపతిం కేచిత్ జ్ఞానైః జ్ఞానాత్మకం పరమ్ ।**
**కేచిత్ పరమయా భక్త్యా నారాయణమపూజయన్ ॥6॥**

కొందరు ఆ యజ్ఞేశ్వరుని యజ్ఞాలచేతను, కొందరు జ్ఞానమార్గంలో కొందరు పరుడై జ్ఞానస్వరూపుడైన, ఆ నారాయణుని పరమభక్తితో పూజించారు.

**ఏకదా తు మహాత్మానః సమాజం చక్రురుత్తమాః ।**
**ధర్మార్థకామమోక్షాణా ముపాయం జ్ఞాతుమిచ్ఛవః ॥7॥**

ఒకప్పుడు ధర్మం అర్థం కామం మోక్షం అనే పురుషార్థాలను తెలిసికొను ఉపాయం కోరి ఉత్తములైన ఆ మహాత్ములు ఒక సభను ఏర్పరచారు.

**షడ్వింశతి సహస్రాణి మునీనా మూర్ధ్వరేతసామ్ ।**
**తేషాం శిష్య ప్రశిష్యాణాం సంఖ్యా వక్తుం న శక్యతే ॥8॥**

ఆ సభలో ఊర్ధ్వరేతస్కులైన మునులు ఇరవైయారువేలమంది ఉన్నారు. ఇంక వారి శిష్య ప్రశిష్యుల సంఖ్యను చెప్పుటకు శక్యం కాదు.

**మునయో భావితాత్మానో మిలితాస్తే మహౌజసః ।**
**లోకానుగ్రహకర్తారో వీతరాగా విమత్సరాః ॥9॥**

వారందరూ లోకానుగ్రహకారకులు. రాగమును విడిచిపెట్టినవారు. మాత్సర్యం లేనివారు. గొప్ప తేజస్సు కలవారు. మహాజ్ఞానులు. అటువంటి మునులందరూ అక్కడ కలుసుకొన్నారు.

**కథం హరౌ మనుష్యాణాం భక్తిరవ్యభిచారిణీ ।**
**కేన సిధ్యేత్తు సకలం కర్మ త్రివిధమాత్మనః ॥10॥**

**ఇత్యేవం ప్రష్టుమాత్మాన ముద్యతాన్ ప్రేక్ష్య శౌనకః ।**
**సాంజలిర్వాక్యమాహ స్మ వినయావనతః సుధీః ॥11॥**

"విష్ణువునందు మనుష్యులకు స్థిరమైన భక్తి ఎలా సంభవిస్తుంది? తనకు సమస్తమైన మూడు విధములైన కర్మ ఏ విధంగా సిద్ధిని పొందుతుంది?" అని తనను ఈ విధంగా ప్రశ్నించబోవుచున్నవారిని చూచి శౌనకుడు వినయంచే తలవంచి దోయిలి యొగ్గి ఆ విద్వాంసుడు ఇలా అన్నాడు.

**శౌనక ఉవాచ** - శౌనకుడు అన్నాడు.

**ఆస్తే సిద్ధాశ్రమే పుణ్యే సూతః పౌరాణికోత్తమః ।**
**స ఏతదఖిలం వేత్తి వ్యాసశిష్యో యతీశ్వరః ॥12॥**

**తస్మాత్తమేవ పృచ్ఛామ ఇత్యేవం శౌనకో మునిః ।**
**అథ తే ఋషయో జగ్ముః పుణ్యం సిద్ధాశ్రమం తతః ॥13॥**

**పప్రచ్ఛు స్తే సుఖాసీనం నైమిషారణ్యవాసినః ।**

పుణ్యమైన సిద్ధాశ్రమంలో పౌరాణికులలో శ్రేష్ఠుడైన సూతుడు ఉన్నాడు. అతడు వ్యాసుని శిష్యుడు. అతడు యోగీశ్వరుడు (యతులకు పతి). అతడు దీనినంతను తెలిసినవాడు. అందువలన అతనినే అడుగుదామన్నాడు శౌనకుడనే ముని. అప్పుడు ఆ ఋషులందరూ పుణ్యమైన సిద్ధాశ్రమానికి వెళ్లారు. నైమిషారణ్యవాసులైన ఆ ఋషులు సుఖాసీనుడైన సూతుని ఇలా అడిగారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**వయంత్వతిథయః ప్రాప్తా స్త్వాతిథేయోఽసి సువ్రత! ॥14॥**

**స్నానదానోపచారేణ పూజయిత్వా యథావిధి ।**
**కేన విష్ణుః ప్రసన్నః స్యాత్స కథం పూజ్యతే నరైః ॥15॥**

**ముక్తిసాధనభూతం చ బ్రూహి తత్త్వ వినిర్ణయమ్ ।**

"వ్రతనిష్ఠుడా! మేము అతిథులం. నీవు అతిథులను సత్కరించే క్రియలచే తగినవాడవు, అని పలికి శాస్త్రవిధానంగా స్నానం, దానం మున్నగు ఉపచారాలచే పూజించి "విష్ణువు ప్రసన్నుడగుట ఎట్లు? నరులు వానిని ఎలా పూజించాలి? అలాగే మోక్షాన్ని సాధించడానికి కారణమైన తత్త్వనిర్ణయంకూడ చెప్పవలసినది" అని అడిగారు.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**శృణుధ్వం ఋషయస్సర్వే హరిం తత్త్వ వినిర్ణయమ్ ॥16॥**

**నత్వా విష్ణుం శ్రియం వాయుం భారతీం శేషసంజ్ఞకమ్ ।**
**ద్వైపాయనం గురుం కృష్ణం ప్రవక్ష్యామి యథామతి ॥17॥**

మునీశ్వరులారా! అందరూ వినండి. తత్త్వంచే విశేషంగా నిర్ణయింపబడు హరియైన విష్ణువుకు నమస్కరించి, లక్ష్మికి, వాయువునకు, భారతికి, ఆదిశేషునకు, గురువైన వ్యాసునికి, కృష్ణునికి ప్రణమిల్లి, నా బుద్ధికి తోచినట్లు చెప్పబోతున్నాను.

**నాస్తి నారాయణసమం న భూతం న భవిష్యతి ।**
**ఏతేన సత్యవాక్యేన సర్వార్థాన్ సాధయామ్యహమ్ ॥18॥**

నారాయణునితో సమానమైన వస్తువు ఇంతకు ముందు లేదు. ఇక పైని ఉండబోదు అనే ఈ సత్యవాక్యంతోనే నేను సకల పురుషార్థాలను సాధిస్తున్నాను.

**శౌనక ఉవాచ –** శౌనకుడు చెప్పాడు.

**కిమర్థం నమనం విష్ణోర్గ్రంథాదౌ మునిసత్తమ! ।**
**కర్తవ్యం బ్రూహి మే బ్రహ్మన్! కృపయా మమ సువ్రత! ॥19॥**

**తతః శ్రియం తతో వాయుం భారతీం చ తతః పరమ్ ।**
**అంతే వ్యాసం కిమర్థం చ త్వం నమస్కృతవానసి? ॥20॥**

**సూతసూత! మహాభాగ! బ్రూహి కారణమత్ర చ ॥**

శౌనకుడు ఇలా ప్రశ్నించాడు. "మునిశ్రేష్ఠుడా! వ్రతనిష్ఠుడా! బ్రహ్మణా! గ్రంథాదియందు ఏకారణంచే విష్ణువునకు నమస్కారం చేయవలెను? నాయందు దయయుంచి తెలియజేయుము. అటు పిమ్మట లక్ష్మికి, అనంతరం వాయువునకు, తదనంతరం భారతికి, చిట్ట చివర వ్యాసునకు నీవు ఏ కారణంచే నమస్కారం చేశావు? సూతా! మహాభాగా! ఆ కారణాన్ని వివరించు."

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఆదౌ వంద్యః సర్వవేదైకవేద్యో వేదే శాస్త్రే సేతిహాసే పురాణే ।**
**సత్త్వాం సతాం ప్రాయో విష్ణురేవైక ఏవ ప్రకాశతేఽతో నమ్య ఏకో హరిర్హి ॥21॥**

విష్ణువు మొదట నమస్కరింప దగినవాడు. సమస్తవేదాలచేత ముఖ్యంగా(ఒక్కనిగా) తెలియజేయబడేవాడు. వేదమందు, శాస్త్రమందు, ఇతిహాసమందు, పురాణమందుకూడ విష్ణువు ఒక్కడే తరచుగా సత్పురుషునిగా ప్రకాశించేవాడు. అందువలన హరి యొక్కడే (ముందుగా)నమస్కరించదగినవాడు గదా!

**సర్వత్ర ముఖ్య స్త్వధికోఽన్యతోఽపి స ఏవ నమ్యో న చ శంకరాద్యాః ।**
**నమంతి యేఽవినయాచ్ఛంకరంతు వినాయకం చండికాం రేణుకాంచ ॥22॥**

**తథా సూర్యం భైరవం మాతరిశ్వ(ం) తథా వాణీం గిరిజాం వై శ్రియం చ ।**
**సర్వేఽపి తే వైష్ణవా నైవ లోకే న తద్భక్తా వేతి చార్యా వదంతి ॥23॥**

అతడు అంతటను ముఖ్యుడు. అందరికన్న అధికుడు. అతడే నమస్కరించదగినవాడు. శంకరుడు మున్నగువారు కారు. ఎవరయితే వినయం లేక(ఋజుమార్గం తెలియక) శంకరుని, వినాయకుని, చండికను, రేణుకను, సూర్యుని, భైరవుని, వాయువును, అలాగే వాణిని, గిరిజను, లక్ష్మిని నమస్కరిస్తారో వారందరూ లోకంలో వైష్ణవులు కారని, వారు విష్ణుభక్తులు కూడ కారని ఆర్యులు చెప్తున్నారు.

**న పార్థక్యా న్నమనం కార్యమేవ ప్రీణంతి నైతా దేవతాః పూజనేన ।**
**పూజాం గృహీత్వా దేవతాశ్చైవ సర్వాః కించిద్దత్వా ఫలదానేన తాంశ్చ ॥24॥**

వేరు వేరుగా వారికి నమస్కారం చేయదగదు. ఈ దేవతలు పూజచే సంపూర్తిగా సంతుష్టి పొంది ఫలం పూర్తిగా ఇచ్చేవారు కారు. ఆ దేవతలు అందరును పూజలను స్వీకరించి, ఎంతో కొంత ఇచ్చి, కొద్ది ఫలితాలను మాత్రమే అందిస్తారు.

**సంతర్ప్య తుష్టైః స్వమనోఽనుసారాత్ తైః కారితాం కామ్యపూజాం తథైవ ।**
**నివేదయిత్వా పరదేవతాయాం విష్ణౌ హరౌ శ్రీపురుషాది వంద్యే ॥25॥**

చేసేవారి మనస్సులో ఉండే అభిలాషకు తగినట్లు వారు సంతుష్టులై, వారు చేసే కామ్యపూజకు తగినట్లుగా తృప్తిని పొందుతున్నారు. ఇతర దేవతలందువలె పరదేవతయైన విష్ణువు-హరి- శ్రీవల్లభునియందుకూడ కామ్యపూజయే నివేదించబడుతోంది.

**ఇహాపరత్రాపి సుఖేతరాణి దాస్యంతి పశ్చాదధరం వై తమశ్చ ।**
**అతో హ్యేతే నైవ పూజ్యా న నమ్యా మోక్షేచ్ఛుభి ర్బ్రాహ్మణాద్యై ద్విజేంద్ర! ॥26॥**

వారు ఇహలోకమునందు, పరలోకమునందు మోక్షసుఖంకన్న ఇతరములైన కర్మఫలితాలను ఇస్తున్నారు. అటు పిమ్మట తక్కువదైన అజ్ఞానాన్నికూడ ఇస్తున్నారు. అందువలన వీరు పూజింపదగినవారు కారు. ద్విజశ్రేష్ఠుడా! మోక్షేచ్ఛ కలిగిన బ్రాహ్మణునిచే వీరు నమస్కరింపదగినవారు కారు.

**తథైవ సర్వాశ్రమిభిశ్చ నిత్యం మహావిపత్తావపి విప్రవర్యాః! ।**
**శ్రీకామ్యయా యే తు భజన్తి నిత్యం శ్రీబ్రహ్మరుద్రేంద్ర యమాది దేవాన్ ॥27॥**

**ఇహైవ భుంజన్తి మహచ్చ దుఃఖం మహాపదః కుష్ఠభగందరాదీన్ ।**
**నమంతి యేఽ వైష్ణవాన్ బ్రహ్మరుద్ర వాయుప్రతీకాన్నైవ తే విష్ణుభక్తాః ॥28॥**

కావున విప్రవర్యులారా! ఏ ఆశ్రమమునందున్నవారైనా, మహాపద వచ్చినపుడైనా ఎవరైతే కేవలం కర్మఫలం కోరి లక్ష్మి, బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, యముడు మున్నగు దేవతలను పూజిస్తున్నారో వారు ఇక్కడనే గొప్ప దుఃఖాన్ని, మిక్కిలి ఆపదలను, కుష్ఠం, భగందరం మొదలగు వ్యాధులను పొందుతున్నారు. ఎవరైతే వైష్ణవాలు కాని బ్రహ్మ రుద్ర వాయు చిహ్నాలకు నమస్కరిస్తున్నారో వారు విష్ణుభక్తులు కారు.

**అభిప్రాయం త్వత్ర వక్ష్యే మునీంద్రాః! పరం గోప్యం హృది ధార్యం హి తద్ధి ।**
**వాయోః ప్రతీకం పూజ్యమేవేహ విప్రాః! న బ్రహ్మరుద్రాది ప్రతీకమేవ ॥29॥**

మునీంద్రులారా! ఇక్కడ నా అభిప్రాయాన్ని చెపుతున్నాను. ఇది పరమ రహస్యం. హృదయంలో మాత్రమే ధారణ చేయదగినది. విప్రులారా! ఇక్కడ వాయువుయొక్క ప్రతీకం(చిహ్నం) మాత్రం పూజింపదగినది. బ్రహ్మరుద్రాది ప్రతీకలు మాత్రం పూజింపదగినవి కావు. (ఇక్కడ రుద్ర శబ్దం శంకర శబ్దంకన్న భిన్నమయినది).

**పూజాకాలో దేవదేవస్య విష్ణో ర్వాయోః ప్రతీకం యోగ్యభాగే నిధాయ ।**
**అంతర్గతం తస్య వాయోర్హరిం చ లక్ష్మీపతిం పూజయిత్వా హి సమ్యక్ ॥30॥**

దేవదేవుడైన విష్ణువుయొక్క పూజాసమయమందు వాయువుయొక్క ప్రతీకను యోగ్యమైన భాగమందుంచి, అంతఃకరణమందుకూడ వాయువుయొక్క ప్రతీకమును, లక్ష్మీపతియైన హరిని శ్రద్ధగా భక్తితో పూజించి...

**పశ్చాద్వాయో స్సుప్రతీకం చ సమ్యక్ నిర్మాల్యశేషేణ హరే స్సమర్చయేత్ ।**
**పృథక్చ స్రగ్ధూప విలేపనాది పూజాం ప్రకుర్వంతి చ యే విమూఢాః ॥31॥**

అటుపిమ్మట హరియొక్క నిర్మాల్యంతో వాయువుయొక్క ప్రతీకాన్ని అర్చించాలి. అట్లు కాక వేరుగా మాల్యం, ధూపం, విలేపనం మున్నగు పూజను చేసే మూఢులకు

**తేషాం దుఃఖ మిహలోకే పరత్ర భవిష్యతే నాత్ర విచార్యమస్తి ।**
**ప్రాయశ్చిత్తం స్వస్తి విప్రాః కథంచిత్ తత్కుర్వంతు స్మరణం నామ విష్ణోః ॥32॥**

ఇహలోకంలోను, పరలోకంలోను దుఃఖం సంభవిస్తుంది. ఇందులో ఆలోచించాల్సింది ఏదీ లేదు. విప్రులు ప్రాయశ్చిత్తంగా ఏదో విధంగా స్వస్తి నిర్వహించాలి. లేదా విష్ణునామస్మరణం చేయాలి.

**పాషండ రుద్రాదిక సంప్రతిష్ఠితాన్ హరే ర్వాయోః శంకరస్య ప్రతీకాన్ ।**
**నమంతి యే ఫలబుద్ధ్యా విమూఢా స్తేషాం ఫలం శాశ్వతం దుఃఖమేవ ॥33॥**

వేదబాహ్యులైన, రుద్రాదిగణాలు ప్రతిష్ఠించిన హరి వాయు శంకర ప్రతీకలను ఫలబుద్ధితో నమస్కరించే మూఢులకు ఫలితం శాశ్వతమైన దుఃఖం మాత్రమే.

**వాయోః ప్రతీకం యది విప్రవర్యైః ప్రతిష్ఠితంచే న్నమనం హి కార్యమ్ ।**
**నైవేద్యశేషేణ హరేశ్చ విష్ణోః పూజా కృతా చేన్నహి దోషలేశః ॥34॥**

వాయువుయొక్క ప్రతీకం విప్రవర్యులచే ప్రతిష్ఠింపబడినచో అర్చన చేయదగినదే. శ్రీహరియైన విష్ణువుయొక్క నైవేద్య శేషంతో (నివేదింపబడిన ద్రవ్యశేషాలతో) వాయుప్రతీకాన్ని పూజ చేస్తే కొంచమైనను దోషం లేదు.

**గురుర్హి ముఖ్యో హనుమజ్జని ర్మహాన్ రామాంఘ్రిభక్తో హనుమాన్ సదైవ ।**
**ఏవం విదిత్వా పరమం హరిం చ పుత్రం పునర్ముఖ్యదేవస్య వాయోః ॥35॥**

హనుమంతుని పుట్టుక చాల గొప్పది. ఆయన గురువు. ప్రధానమైనవాడు. హనుమంతుడు ఎల్లపుడూ రామపాదభక్తుడు. ఈ విషయాన్ని గ్రహించి, పరముడైన హరిని, అలాగే ముఖ్యదేవుడైన వాయువుయొక్క పుత్రుడగు హనుమంతుని (అర్చించాలి).

**నమస్కారో నాన్యథా విప్రవర్యా ఆధీయతాం హృది సర్వై రహస్యమ్ ।**
**యే వైష్ణవా వైష్ణవదాస భృత్యాః సర్వేఽపి తే సర్వదా విష్ణుమేవ ॥36॥**

**నమంతి యే వై ప్రతిపాదయంతి తథైవ పుణ్యాని చ సాత్త్వికాని ।**
**నమంతి యే వాసుదేవం హరిం చ సమ్యక్ స్వశక్త్యా ప్రతిపాదయంతి ॥37॥**

విప్రవర్యులారా! అందరూ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచి, హృదయమునందు నమస్కరించెదరుగాక! మరొక విధంగా కాదు. ఎవరైతే వైష్ణవులో, విష్ణుదాసులో, విష్ణుసేవకులో వారందరూకూడ ఎల్లపుడూ విష్ణువునే ఎవరైతే సాత్త్వికములైన పుణ్యాలను ప్రతిపాదిస్తున్నారో వారు విష్ణువునకే ప్రణమిల్లుచున్నారు. ఎవరైతే తమ శక్త్యనుసారం లెస్సగా వాసుదేవుని ప్రతిపాదిస్తున్నారో వారు హరినే నమస్కరిస్తున్నారు.

**ప్రవృత్తిమార్గేణ న పూజయంతి హ్యాపత్కాలే పరదైవం తదన్యమ్ ।**
**తే వైష్ణవా వైష్ణవదాస భృత్యా అన్యే చ సర్వేఽ వైష్ణవమాత్రకాః స్మృతాః ॥38॥**

ఎవరైతే ఆపత్కాలమందు ప్రవృత్తి మార్గంచే అందరికంటె వేరైన పరదైవాన్ని(శ్రీహరిని), మిగిలిన దైవాలను పూజింపకుండా ఉంటారో ఆ వైష్ణవులు, విష్ణుదాసులు, విష్ణుసేవకులు, మిగిలినవారందరూ అవైష్ణవులుగానే స్మరింపబడుతున్నారు.

**ఉపక్రమై రుపసంహారస్య లింగై ర్హరిం గురుం హ్యంతరేణైవ యాంతి ।**
**తానేవాహుః సత్పురాణాని విప్రాః కలౌ యుగే నాభ్యసూయంతి సర్వే ॥39॥**

ఏవైతే ఉపక్రమం, ఉపసంహారం మొదలగు ప్రతీకాలచే మధ్యభాగంలో గురువైన హరినిగూర్చి వివరిస్తాయో వాటినే విప్రులు సత్పురాణాలుగా చెప్తున్నారు. కలియుగంలో ఎవరూ ఇందు దోషారోపణ చేయరు.

**యతో హితాన్యే ప్రతిపాదయంతి ప్రవృత్తిధర్మాన్ స్వస్వ వర్ణానురూపాన్ ।**
**అతో హ్యసూయంతి సదా విమూఢాః కలౌ హి విప్రాః ప్రచురా హితేఽపి ॥40॥**

తమ తమ వర్ణాలకు అనుగుణంగా హితదృష్టితో ప్రవృత్తి ధర్మాలను ప్రతిపాదించే కొందరు ఎల్లప్పుడును మూఢులై దోషారోపణ చేస్తూంటారు. విప్రులారా! కలియుగంలో అటువంటివారు విస్తరించియుంటారు.

**న చాస్తి విష్ణోః సదృశం చ దైవతం న చాస్తి వాయోః సదృశో గురుశ్చ ।**
**న చాస్తి తీర్థం సదృశం విష్ణుపద్యాః న విష్ణుభక్తేన సమోఽస్తి భక్తః ॥41॥**

విష్ణువుతో సమానమైన దేవుడు లేడు. వాయువుతో సమానమైన గురువు లేడు. గంగతో సమానమైన పుణ్యతీర్థం (నది) లేదు. విష్ణుభక్తునితో సముడైన భక్తుడు లేడు.

**అన్యాని విష్ణోః ప్రతిపాదకాని సర్వాణి తే సాత్త్వికానీతి చాహుః ।**
**శ్రావ్యాణి తాన్యేవ మనుష్యలోకే శ్రావ్యాణి నాన్యాని చ దుఃఖదాని ॥42॥**

విష్ణువును ప్రతిపాదించే అన్ని పురాణాలను సాత్త్వికాలని ఆ విప్రులు చెబుతారు. మనుష్యలోకంలో అవియే శ్రవణం చేయదగినవి. మిగిలినవి వింటే అవి దుఃఖాలను ఇస్తాయి.

**కలౌ యుగే సర్వపురాణమధ్యే త్రీణ్యేవ ముఖ్యాని హరిప్రియాణి ।**
**ముఖ్యం పురాణం హి కలౌ నృణాం చ శ్రేయస్కరం భాగవతం పురాణమ్ ॥43॥**

కలియుగంలో అన్ని పురాణాలలో హరికి ప్రియమైన ప్రధాన పురాణాలు మూడే. కలియుగంలో నరులకు ముఖ్యమైన పురాణం భాగవతపురాణం. అది శ్రేయస్సును కలుగజేస్తుంది.

**పూర్వం హి సృష్టిం ప్రతిపాద్యతేఽత్ర యతో హ్యతో భాగవతం పరం స్మృతమ్ ।**
**యస్మిన్ పురాణే కథయంతి సృష్టిం హ్యాదౌ విష్ణో ర్బ్రహ్మరుద్రాదికానామ్ ॥44॥**

ఇందు మొదటనే సృష్టినిగూర్చి ప్రతిపాదింపబడింది. అందువలన అది భాగవతంగా మిక్కిలిగా స్మరించ బడుతోంది. ఏ పురాణంలో ముందుగా విష్ణువుయొక్క బ్రహ్మరుద్రాదులయొక్క ఉత్పత్తి చెప్పబడుతోందో అదే ఇది.

**నానార్థమేవం కథయంతి విప్ర! నీచోచ్చరూపం జ్ఞానమాహుర్మహాంతః ।**
**తేనైవ సిద్ధిం ప్రవదంతి సర్వం హ్యతఃపరం భాగవతం పురాణమ్ ॥45॥**

బ్రాహ్మణుడా! ఈవిధంగా దీనిని అనేక ప్రయోజనాలనిచ్చేదిగా చెప్పుచున్నారు. మహాత్ములు ఉన్నతమైన జ్ఞానాన్ని, అధమ జ్ఞానాన్ని(అవిద్యను)కూడ తెలియజేసేదిగా దీనినిగూర్చి చెప్పుచున్నారు. ఆ పురాణంచేతనే సమస్తమైన సిద్ధి కలుగుతుందని చెప్తున్నారు. అందువలన భాగవతపురాణం శ్రేష్ఠమైనది.

**తతఃపరం విష్ణుపురాణ మాహుః తతఃపరం గారుడ సంజ్ఞకం చ ।**
**త్రీణ్యేవ ముఖ్యాని కలౌ నృణాం తు తథా విశేషో గారుడే కించిదస్తి ॥46॥**

అటు పిమ్మట విష్ణుపురాణం ఉత్తమమైనదని చెబుతున్నారు. ఆ తరువాత గారుడమనే పేరు కల్గిన పురాణం శ్రేష్ఠమైనదని చెబుతున్నారు. కలియుగంలో నరులకు ఈ మూడుపురాణాలు ప్రధానమైనవి. అయినప్పటికీ గరుడపురాణంలో కొంత విశేషముంది.

**శృణుధ్వం వై తం విశేషం చ విప్రా స్త్వంశైర్యుక్తం గారుడాఖ్యం పురాణమ్ ।**
**ఆద్యాంశం వై కర్మకాండం వదంతి ద్వితీయాంశం ధర్మకాండం తమాహుః ॥47॥**

విప్రులారా! ఆ విశేషమేమిటో వినండి. గారుడమనే పేరుగల పురాణం మూడు అంశాలతో కూడుకొని యుంది. మొదటి అంశం కర్మకాండ రెండవ అంశాన్ని ధర్మకాండ అని పిలుస్తున్నారు.

**తృతీయాంశం బ్రహ్మకాండం వదంతి తేషాం మధ్యే హ్యంతిమోఽయం వరిష్ఠః ।**
**తృతీయాంశ శ్రవణాత్పుణ్యమాహు స్తుల్యం పుణ్యం భాగవతస్య విప్రాః ॥48॥**

మూడవ అంశాన్ని బ్రహ్మకాండ అని వచిస్తున్నారు. వాటిలో చివరిదైన బ్రహ్మకాండ మిక్కిలి గొప్పది. మూడవ అంశాన్ని వినుటవలన పుణ్యం కలుగుతుందని చెపుతారు. విప్రులారా! ఇది భాగవతశ్రవణపుణ్యంతో సమానమైనది.

**తృతీయాంశే పఠితే వేదతుల్యం ఫలం భవేన్నాత్ర విచార్యమస్తి ।**
**తృతీయాంశ శ్రవణాదేవ విప్రాః ఫలం ప్రోక్తం పఠతోఽప్యర్థమేవమ్ ॥49॥**

మూడవ అంశాన్ని పఠిస్తే వేదతుల్యమైన ఫలితం లభిస్తుంది. అందు ఆలోచించవలసినది లేదు. విప్రులారా! తృతీయాంశాన్ని విన్నమాత్రంచేతనే పఠించుటవలన కలిగే ఫలం చెప్పబడింది.

**తృతీయాంశ శ్రవణాదర్థతశ్చ పుణ్యం చాహుః పఠతో వై దశాంశమ్ ।**
**తతో వరం మత్స్యపురాణమాహుస్తతో వరం కూర్మపురాణమాహుః ॥50॥**

మూడవ అంశాన్ని శ్రవణం చేసినా అర్థము చేసికొంటూ పఠించినా, లేదా పదవ భాగం పఠించినా (సృష్టి నిరూపణం పదవ భాగం), పుణ్యం కలుగుతుందని చెబుతారు. దీని తరువాత మత్స్యపురాణం శ్రేష్ఠమైనదంటారు. అటు పిమ్మట కూర్మపురాణం ఉత్తమమని చెబుతారు.

**తథైవ వాయుపురాణమాహు స్త్రీణ్యేవ చాహుః సాత్త్వికానీతి లోకే ।**
**తత్రాపి కించిద్వేదితవ్యం భవేచ్చ పురాణషట్కే సత్త్వరూపే మునీంద్రాః ॥51॥**

అట్లే వాయుపురాణంకూడ శ్రేష్ఠమైనదని చెబుతారు. లోకంలో ఈ మూడు పురాణాలు సాత్త్వికాలని చెబుతారు. అయినప్పటికీ కొంచెం తెలిసికోవలసినది ఉంది. మునీంద్రులారా! సత్త్వరూపమైన ఈ పురాణషట్కంలో (ఆరు పురాణాలలోను)...

**సత్త్వాధమే మాత్స్య కౌర్మే తథాహు ర్వాయుం చాహుః సాత్త్విక మధ్యమం చ ।**
**విష్ణోః పురాణం భాగవతం పురాణం సర్వోత్తమం గారుడం చాహురార్యాః ॥52॥**

మత్స్యకూర్మపురాణాలు సాత్త్విక పురాణాలలో అధమాలు. వాయుపురాణం మధ్యమం. విష్ణుపురాణం, భాగవతం, గరుడపురాణం ఉత్తమాలు. ఇది పెద్దల మాట.

**స్కాందం పాద్మం వామనం వై వరాహం తథాగ్నేయం భవిష్యం పూర్వసృష్టౌ ।**
**ఏతాన్యాహూ రాజసానీతి విప్రా స్తత్రైకదేశః సాత్త్విక స్తామసశ్చ ॥53॥**

విప్రులారా! స్కాంద, పాద్మ, వామన, వరాహ, అగ్నిపురాణాలను, భవిష్యపురాణాన్నీ, పూర్వకల్పమందు (ముందు సృష్టిని ప్రతిపాదించిన కారణంగా వీటిని రాజస పురాణాలుగా చెప్పారు) రాజసాలుగా పేర్కొన్నారు. అందు సాత్త్వికం, తామసం ఒక భాగంగానే ఉంటాయి.

**రజః ప్రాచుర్యా ద్రాజసానీతి చాహుః శ్రావ్యాణి నైతాని ముముక్షుభిః సదా ।**
**తేషాం మధ్యే సాత్త్వికాంశాశ్చ సంతి తేషాం శ్రుతే గారుడీయం ఫలం చ ॥54॥**

అందు రాజసం ఎక్కువగా ఉండుటవలన వాటిని రాజసాలుగా పేర్కొన్నారు. అందువలన మోక్షం కోరుకొనేవారు ఎప్పుడూ వీటిని వినరాదు. వాటిలోపల సాత్త్వికాంశాలు కూడ ఉన్నాయి. వాటిని శ్రవణం చేయడంవలన గరుడపురాణశ్రవణఫలం లభిస్తుంది.

**బ్రహ్మాండ లైంగ్యే బ్రహ్మవైవర్తకం వై మార్కండేయం బ్రాహ్మమాదిత్యకం చ ।**
**ఏతాన్యాహు స్తామసానీతి విప్రా స్తత్రైకదేశః సాత్త్వికో రాజసశ్చ ॥55॥**

బ్రహ్మాండపురాణం, లింగపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, మార్కండేయపురాణం, బ్రహ్మపురాణం, ఆదిత్య పురాణం వీటిని విప్రులారా! తామసాలుగా వ్యవహరిస్తారు. వీటిలో సాత్త్వికం, రాజసం ఒక భాగంగామాత్రమే ఉంటాయి.

**శ్రావ్యాణి నైతాని మనుష్యలోకే తత్త్వేచ్ఛుభి స్తామసానీత్యతో హి ।**
**తేషు స్థితాః సాత్త్వికాంశా మునీంద్రా స్తేషాం శ్రుతి ర్గారుడైకాంఘ్రితుల్యా ॥56॥**

అవి తామస పురాణాలైన కారణంచే మనుష్యలోకంలో తత్త్వం కోరుకొనేవారు అంతగా శ్రవణం చేయకూడదు. మునీంద్రులారా! వాటిలో ఏ సాత్త్విక విషయాలున్నాయో వాటిని వినటం గారుడంలో ఒక పాదంతో సమాన మవుతుంది.

**అల్పాన్యుపపురాణాని వదంత్యష్టాదశాని చ ।**
**విష్ణుధర్మోత్తరం చైవ తంత్రం భాగవతం తథా ॥57॥**

**తత్త్వసారం నారసింహం వాయుప్రోక్తం తథైవ చ ।**
**తథా హంసపురాణం చ షడేతాని మునీశ్వరాః! ॥58॥**

**సాత్త్వికాన్యేవ జానీధ్వం ప్రాయశో నాత్ర సంశయః ।**
**ఏతేషాం శ్రవణాదేవ గారుడార్ధఫలం శ్రుతమ్ ॥59॥**

అల్పపురాణాలను పదునెనిమిదిగా వచిస్తారు. విష్ణుధర్మోత్తరం, భాగవతతంత్రం, తత్త్వసారం, నారసింహం, వాయుప్రోక్త పురాణం, హంసపురాణం మునీశ్వరులారా! ఈ ఆరును ఉపపురాణాలు. వీటిని సాత్త్వికాలుగా తెలిసికోండి. అందు సంశయమెందును లేదు. వీటిని శ్రవణం చేయుటవలన గరుడపురాణశ్రవణంలోని సగం ఫలితం లభిస్తుంది.

**భవిష్యోత్తర నామానం బృహన్నారదమేవ చ ।**
**యమనారద సంవాదం లఘునారదమేవ చ ॥60॥**

**వినాయక పురాణం చ బృహద్బ్రహ్మాండమేవ చ ।**
**ఏతాని రాజసాన్యాహుః శ్రవణాద్భుక్తిరుత్తమా ॥61॥**

భవిష్యోత్తరమనే పేరుగల పురాణం, బృహన్నారదం, యమనారదసంవాదం, లఘునారదం, వినాయక పురాణం, బృహద్ బ్రహ్మాండపురాణం వీటిని రాజసాలని వచిస్తారు. వీటిని శ్రవణం చేయుటవలన ఉత్తమమైన భుక్తి చేకూరుతుంది.

**గారుడాత్పాద తుల్యం చ ఫలం చాహుర్మనీషిణః ।**
**పురాణం భాగవతం శైవం నందిప్రోక్తం తథైవ చ ॥62॥**

**పాశుపత్యం రైణుకం చ భైరవం తథైవ చ ।**
**ఏతాని తామసాన్యాహు ర్హరితత్త్వార్థవేదినః ॥63॥**

**ఏతేషాం శ్రవణాద్విప్రా గారుడాంఘ్ర్యర్ధమేవ చ ।**
**సర్వేష్వపి పురాణేషు శ్రేష్ఠం భాగవతం స్మృతమ్ ॥64॥**

వీటిని శ్రవణం చేయుటవలన గారుడంలో నాలుగవ వంతు ఫలితం లభిస్తుందని మనీషులు చెబుతారు. భాగవతపురాణం, శైవం, నందిప్రోక్త పురాణం, పాశుపత్యం, రైణుకం, భైరవం వీటిని హరితత్త్వజ్ఞానమెరిగినవారు తామసాలని వచిస్తారు. వీటిని శ్రవణం చేయుటవలన గారుడంలో ఒకపాదంలో అర్ధభాగ ఫలితం లభిస్తుంది. అన్ని పురాణాలలోను భాగవతం శ్రేష్ఠంగా స్మరింపబడింది.

**వేదైస్తుల్యం సమం పాఠే శ్రవణే చ తదర్ధకమ్ ।**
**అర్థతః శ్రవణే చాస్య పుణ్యం దశగుణం స్మృతమ్ ॥65॥**

అది వేదాలతో సమానమైనది. దీనిని పఠించుట వేదపఠనంతో సమానమైనది. శ్రవణం చేసిన సగం భాగంతో సమానం. దానిని అర్థంతో శ్రవణం చేయుటవలన పదిరెట్లు పుణ్యం అని స్మరింపబడినది.

**వక్తుః స్యాద్ ద్విగుణం పుణ్యం వ్యాఖ్యాతుశ్చ తథాధికమ్ ।**
**అనంతవేదై స్సామ్య మాహుర్మహాంతః ।**
**భారాన్మహత్త్వా ద్భారతస్యాపి విప్రాః ॥66॥**

**వేదేభ్యోఽ స్యత్వర్థతశ్చాధికత్వం ।**
**వదంతి వై విష్ణురహస్యవేదినః ॥67॥**

వక్తకు రెండురెట్లు పుణ్యం లభిస్తుంది. వ్యాఖ్యాతకు అంతకన్న అధికమైన పుణ్యం చేకూరుతుంది. మహాత్ములు దానిని అనంత వేదాలతో సమానమని వచిస్తారు. విప్రులారా! భారంలో గొప్పదగుటవలన అది భారతంతో సమానం. విష్ణుతత్త్వరహస్యవేత్తలు అర్థప్రాధాన్యమందు అది వేదాలకన్న అధికమని వచిస్తారు.

**తత్ర శ్రేష్ఠాం గీతికాం ప్రాహురార్యాః తథైవ విష్ణో ర్నామ సాహస్రకం చ ।**
**తయోస్తత్ర శ్రవణాద్భారతస్య దశాధికం ఫలమాహు ర్మహాంతః ॥68॥**

ఆ విషయంలో ఆర్యులు ఒక ఉత్తమ గీతిని గానం చేస్తారు. అదే విధంగా విష్ణునామసహస్రంకూడ. భాగవతం, విష్ణునామసహస్రం వినుటవలన భారతంకన్న పదిరెట్లు ఎక్కువ ఫలం లభిస్తుందని మహాత్ములు అంటారు.

**దైత్యా స్సర్వే విప్రకులేషు భూత్వా కృతే యుగే భారతే షట్ సహస్ర్యామ్ ।**
**నిష్కాస్య కాంశ్చిన్నవ నిర్మితానాం నివేశనం తత్ర కుర్వంతి నిత్యమ్ ॥69॥**

కృతయుగంలో భారతవర్షంలో దైత్యులందరూ విప్రవంశంలో జన్మించి, ఆరువేల సంవత్సరాల తరువాత వెళ్లిపోయి, అక్కడ కొన్ని క్రొత్తగా నిర్మింపబడిన నివేశనాలను నిత్యమూ ఏర్పరచుకొంటారు.

**మత్వా హరిం భగవాన్ వ్యాసరూపీ చక్రే తదా భాగవతం పురాణమ్ ।**
**తథా సమాఖ్యాయ చ వైష్ణవం తత్ తతః పరం గారుడాఖ్యం స చక్రే ॥70॥**

అప్పుడు భగవంతుడు వ్యాసరూపుడై హరిని తలచి భాగవతపురాణాన్నీ, అదేవిధంగా వైష్ణవపురాణాన్నీ, ప్రవచించి, అటు పిమ్మట గారుడమనే పురాణాన్ని నిర్మించాడు.

**అతో హి గారుడం ముఖ్యం పురాణం శాస్త్రసమ్మతమ్ ।**
**గారుడేన సమం నాస్తి విష్ణుధర్మ ప్రదర్శనే ॥71॥**

అందువలన గారుడమనే పురాణం ముఖ్యమైనది. శాస్త్రసమ్మతమైనది. విష్ణుధర్మమును ప్రదర్శించుటయందు గారుడంతో సమానమైనది లేదు.

**యథా సురాణాం ప్రవరో జనార్దనో యథాయుధానాం ప్రవరః సుదర్శనమ్ ।**
**యథాశ్వమేధః ప్రవరః క్రతూనాం ఛిన్నేషు భక్తేషు తథైవ రుద్రః ॥72॥**

**నదీషు గంగా జలజేషు పద్మ మచ్ఛిన్న భక్తేషు తథైవ వాయుః ।**
**తథా పురాణేషు చ గారుడం చ ముఖ్యం తదాహు ర్హరితత్త్వదర్శనే ॥73॥**

దేవతలలో జనార్దనుడు, ఆయుధాలలో సుదర్శనం, క్రతువులలో అశ్వమేధం; భగవంతుడు, భక్తుడు అనే ద్వైధీకరణ భక్తులలో రుద్రుడు. నదులలో గంగ, నీటియందు పుట్టినవాటిలో పద్మం, అద్వైత (ఏకీభావ) భక్తులలో వాయువు శ్రేష్ఠమైనట్లు పురాణములయందు గారుడం శ్రేష్ఠమైనది. అది హరితత్త్వమును ప్రదర్శించుటయందు ముఖ్యమైనదని అంటారు.

**గారుడాఖ్య పురాణే తు ప్రతిపాద్యో హరిః స్మృతః ।**
**అతో హరి ర్నమస్కార్యో గమ్యో యోగ్యో హరిః స్మృతః ॥74॥**

గారుడమనే పురాణంలో ప్రతిపాదింపబడేవాడు హరి అందువలన హరి నమస్కరింపదగినవాడు, పొందదగినవాడు, యోగ్యుడుగా కీర్తింపబడుతున్నాడు.

**భాగ్యాత్మకత్వా చ్ఛ్రీదేవ్యా నమన్ తదనుస్మృతమ్ ।**
**పరో నరోత్తమో వా స సాధకేశోఽపి చ స్మృతః ॥75॥**

భాగ్యస్వరూపుడగుటవలన శ్రీదేవితో కలిసిన హరికి నమస్కరించుట అనూచాన సంప్రదాయం. ధ్యానంలో సాధన చేయబడువారిలో ప్రభువని, పరుడని, నరోత్తముడని హరి కీర్తింపబడుతున్నాడు.

**అతో నమ్యో వాయురపి పురాణాదౌ ద్విజోత్తమాః! ।**
**భారతీవాక్యరూపత్వా న్నమ్యా వాయో రనంతరమ్ ॥76॥**

ద్విజోత్తములారా! అందువలన పురాణాదియందు వాయువుకూడ నమస్కార యోగ్యుడయినాడు. వాగ్రూపమగుట వలన వాయువు తరువాత భారతికూడ నమస్కరింపదగినది.

**ఉపసాధకో నరః ప్రోక్తో యతోఽత స్తదనంతరమ్ ।**
**నమ్య ఇత్యుచ్యతే సద్భి స్తారతమ్యేన సర్వదా ॥77॥**

నరుడు ఉపసాధకుడుగా చెప్పబడుతున్నాడు. అందువలన ఆ తరువాత ఎల్లప్పుడు తారతమ్యభేదంచే అతడుకూడ నమస్కరింపదగినవాడని సత్పురుషులచే చెప్పబడుతున్నది.

**అతో వ్యాసం నమస్కుర్యాద్ గ్రంథకర్తృత్వహేతుతః ।**

అందువలన గ్రంథకర్త (రచయిత) అనే కారణంచే వ్యాసునికికూడ నమస్కారం చేయాలి. అని సూతుడు పలుకగా శౌనకుడు ఇలా అడిగాడు.

**శౌనక ఉవాచ –** శౌనకుడు చెప్పాడు.

**వ్యాసస్య నమనం హ్యంతే కథం కార్యం మహాత్మనః ॥78॥**
**అంతే చ వన్దనే తస్య కారణం బ్రూహి సువ్రత! ।**

"మహాత్ముడైన వ్యాసునికి చివరగా నమస్కరించుట ఎలా కర్తవ్యం? వ్రతనిష్ఠుడా! వ్యాసునకు చిట్టచివరగా వందనమాచరించుటకు కారణమేమిటో చెప్పు".

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**విష్ణోరనంతరం వ్యాసనమనం ముఖ్యమేవ హి ॥79॥**

**హరిరేవ యతో వ్యాసో వాచ్యచక్ర స్వరూపకః ।**
**వ్యాసో నైవ సమత్వేన ప్రోక్తో భగవతో హరేః ॥80॥**

సూతుడు ఇలా అన్నాడు. "విష్ణువు తరువాత వ్యాసునికి నమస్కరించుటే ముఖ్యమైనది. వాచ్య వాచక రూపంగా హరియే వ్యాసుడు. అయినప్పటికి భగవంతుడైన హరికి సమానుడుగా వ్యాసుడు చెప్పబడటం లేదు.

**తత్రాపి కారణం వక్ష్యే సాదరేణ మునీశ్వరాః! ।**
**వ్యాసస్తు కశ్చన ఋషిః పురాణే తామసే స్మృతః ॥81॥**

మునీశ్వరులారా! అందులకు గల కారణాన్ని ఆదరబుద్ధితో చెపుతున్నాను. తామసపురాణములందు వ్యాసుడు ఒకానొక ఋషిగా చెప్పబడ్డాడు.

**ఇతి జ్ఞానావలంబేన దైత్యా దైత్యానుగైః సమాః ।**
**ప్రవిశ్యతి హ్యంధతమ ఇతి త్వంతే నమస్కృతః ॥82॥**

దైత్యులు, దైత్యులయొక్క అనుచరులతో సములై అంధతమస్సులో ప్రవేశించునట్టి జ్ఞానన్యాయము నవలంబించి, అంతములో వ్యాసుడు నమస్కరింపబడినాడు.

**యదిదం పరమం గోప్యం హృది ధార్యం న సంశయః ।**
**పరాణాం నమ్యమేవోక్తం ప్రతిపాద్యం యతోఽత్ర హి ॥83॥**

ఈ పరమ రహస్యం హృదయంలో ధారణ చేయదగినది. అందు సందేహం లేదు. పరాపరక్రమాలలో నమస్కారవిధి ఈ రీతిగా ప్రతిపాదింపబడింది.

**సమాస వ్యాసభావాద్ధి పరాణాం తత్ప్రతీయతే ।**
**వాస్తవం తం న జానీయు రుపజీవ్యో యతో హరిః ॥84॥**

**హరిర్వ్యాసస్త్వేక ఏవ వ్యాసస్తు హరివత్ స్మృతః ।**
**ఉపజీవ్య తదీశత్వే తయోరేవ న సంశయః ॥85॥**

శ్రేష్ఠులైనవారిని కలుపుట, విడదీయుట అను విధానంలో అట్లు ప్రతిపాదింపబడినది. హరి అందరినీ అనుసరించి జీవించువాడు అను పరమవాస్తవాన్ని తెలియలేరు. హరి వ్యాసుడు ఒక్కరే. వ్యాసుడు హరివంటివాడని స్మరింపబడినది. వారిరువురిలో ఒకడు ప్రభువయితే ఇంకొకడు ఆయనను అనుసరించి జీవించువాడు. ఇందు సందియం లేదు.

**ఈశకోటి ప్రవిష్టత్వా చ్ఛ్రియః స్వామిత్వమీరితమ్ ।**
**త్రయాణా మపజీవ్యత్వాత్ సేవ్యత్వాత్ స్వామితా స్మృతాః ॥86॥**

**వాయ్వాదీనాం త్రయాణాం చ సేవ్యతాత్ సేవ్యతా స్మృతా ।**
**భూభారహరణే విష్ణోః ప్రధానాంగం హి మారుతిః ॥87॥**

కోట్లకొలది ఈశ్వరులు ప్రవేశించి కొలుచుటవలన లక్ష్మికి ప్రభుత్వం చెప్పబడినది. ఒకరిని ఇంకొకరు అనుసరించి జీవించి సేవించుటవలన ముగ్గురికీ స్వామిత్వము పేర్కొనబడినది. వాయువు మొదలగు ముగ్గురికీ సేవించుటవలన సేవ్యభావం చెప్పబడినది. భూభారాన్ని హరించుటలో విష్ణువుకు ప్రధానాంగం మారుతి.

**వాక్యరూపా భారతీ తు ద్వితీయాంగం హి సా స్మృతా ।**
**తృతీయాంగం హరేః శేషో న నమ్యాః సామ్యతో హరేః ॥88॥**

వాగ్రూపయైన భారతి ద్వితీయాంగంగా చెప్పబడినది. హరికి తృతీయాంగం శేషుడు. హరితో సమానంగా వారు నమస్కరింపదగినవారు కారు.

**ప్రతిపాద్యా ముఖ్యతయా నమ్యా ఏవ సమీరితాః ।**
**అవాంతరాశ్చ వాయ్వాద్యా ననమ్యాస్తే న తే స్మృతాః ॥89॥**

ప్రధానత్వదృష్టిచే వారుకూడ నమస్కరింపదగినవారయ్యారని ప్రతిపాదింపబడినది. వాయువు మున్నగువారు అవాంతర దేవతలు. హరితో సమానంగా నమస్కరింపదగినవారు కారని తాత్పర్యము.

**భీష్మద్రోణాది నామాని భీష్మాదిష్వేవ ముఖ్యతః ।**
**వాచకాని యతో నిత్యం తన్నమ్యా స్తే మునీశ్వరాః ॥90॥**

భీష్మద్రోణాది నామములు భీష్ముడు మున్నగువారియందే ముఖ్యవాచకాలవుతాయి. మునీశ్వరులారా! అందువలన వారుకూడ నిత్యమూ నమస్కరింపదగినవారే.

**పరాణామేవ నమ్యత్వం ప్రతిపాద్యత్వమేవ హి ।**
**ఏతత్సర్వం సమాఖ్యాతం కిమన్య చ్ఛ్రోతుమిచ్ఛథ ॥91॥**

శ్రేష్ఠులైనవారికి మాత్రమే ఇక్కడ నమస్కార విధి ప్రతిపాదించబడినది. దీనినంతటిని మీకు చెప్పుట జరిగింది. ఇటుపై ఏమి వినగోరుతున్నారు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే సూతశౌనక సంవాదే సాత్త్వికాది పురాణవిభాగ నమ్యానమ్యదేవవిభాగాది విషయనిరూపణం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో సూతశౌనక సంవాదంలో సాత్త్వికాదిపురాణవిభాగం నమ్యానమ్యదేవవిభాగం అనే మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## బ్రహ్మాదిదేవతాతారతమ్యనిరూపణమ్ - బ్రహ్మాదిదేవతలలోని తరతమభావనిరూపణం

**శ్రీ శౌనక ఉవాచ-** శౌనకుడు అడిగాడు.

**కథం ససర్జ భగవాన్ తత్తత్తత్త్వాభిమానినః ।**
**సృష్టిక్రమం న జానామి దేవానామంతరం మునే! ॥1॥**

**శౌనకేనైవ ముక్తస్తు సూతో వచనమబ్రవీత్ ।**

'భగవంతుడు ఆయా తత్త్వాభిమానులను ఎట్లు సృష్టించాడు మునీశ్వరా! సృష్టిక్రమాన్ని, దేవతల విశేషాన్ని, వారి మధ్య భేదాన్ని తెలియకున్నాను', శౌనకుడు అలా అడుగగా సూతుడిలా చెప్పసాగాడు.

**సూత ఉవాచ-** సూతుడు పలికాడు.

**సమ్యగ్ వ్యవసితా బుద్ధిః తవ బ్రహ్మర్షిసత్తమ! ॥2॥**

**ఏవమేవ కృతః ప్రశ్నో హరౌ తు గరుడేన వై ।**
**యదుక్తవాన్ హర స్తస్మై తద్వక్ష్యామి తవానఘ! ॥**

బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడా! నీ బుద్ధి చక్కగా విదితమైనది. గరుడుడు హరిని ఇదే ప్రశ్న అడిగాడు. పుణ్యాత్ముడా! హరి వానికి చెప్పిన దానిని నీకు చెపుతాను.

**గరుడ ఉవాచ-** గరుడుడు అడిగాడు.

**సృష్టిం బ్రూహి మహాభాగ! సచ్చిదానంద విగ్రహ! ॥3॥**

**సృష్టౌ జాతే తవోత్కర్షో జ్ఞాతప్రాయో భవిష్యతి ।**
**బ్రహ్మాదీనాం తారతమ్య జ్ఞానం మమ భవిష్యతి ॥4॥**

మహాభాగా! సచ్చిదానందవిగ్రహా! సృష్టినిగూర్చి చెప్పవలసింది. సృష్టివిషయం తెలిసినచో నీ ఉత్కర్ష పూర్తిగా తెలిసినట్లే అవుతుంది. బ్రహ్మాదుల సంబంధమైన తరతమ భేదజ్ఞానం కూడ నాకు అవగతమవుతుంది.

**మోక్షోపాయస్స ఏవోక్తః ఇతరస్తస్య సాధనమ్ ।**
**గురుడేనైవ ముక్తస్తు కృష్ణో వచనమబ్రవీత్ ॥5॥**

ఎవడు ముక్తిప్రదాతయో అతడే మోక్షోపాయమని చెప్పబడినది. ఇతరమైనదంతయు మోక్షసాధనం మాత్రమే. గరుడుడు ఈ విధంగా అడుగగా కృష్ణుడు ఇలా చెప్పాడు.

**శ్రీకృష్ణ ఉవాచ-** శ్రీకృష్ణుడు చెప్పాడు.

**మూలరూపో హ్యతో జ్ఞేయో విష్ణుత్వాద్విష్ణురవ్యయః ॥6॥**

విష్ణువు యొక్క మూలరూపం తెలియదగియున్నది. అంతట వ్యాపించియున్న కారణాన విష్ణువు అవ్యయుడు.

**అవతారమిదం ప్రోక్తం పూర్ణత్వాదేవ సువ్రత! ।**
**అనేకో హ్యేకతాం ప్రాప్య సంశేతే ప్రలయాయ వై ॥7॥**

**తత్రాపి చ విశేషోఽ_స్తి జ్ఞాతవ్యం తత్త్వమేవ సః ॥8॥**

వ్రతనిష్ఠుడా! పూర్ణత్వంచేతనే ఇది అవతారంగా చెప్పబడినది. అనేకత్వం కలవాడయ్యును ఏకత్వం పొంది, ప్రలయంకొరకు పరుండును. అందుకూడ విశేషం కలదు. అతడే తత్త్వంగా తెలియబడువాడు. (తెలియదగిన తత్త్వమే అతడు)

**భేదేన దర్శనాద్వాపి భేదాభేదేన దర్శనాత్ ।**
**విష్ణోర్గుణానాం రూపాణాం తదంగానాం సుఖాదినామ్ ॥**
**తత్రైవ దర్శనాద్వాపి క్షిప్రమేవ తమో వ్రజేత్ ॥9॥**

భేదదర్శనంవలన గాని, ద్వైతాద్వైత దర్శనంవలన గాని విష్ణువుయొక్క గుణములను, రూపములను తెలిసికోవాలి. ఆయన అంగములై గొప్పవైన ఆకాశాదులను(ఖ=ఆకాశము) తెలిసికోవాలి. అట్లు దర్శనం చేయుటవలన వెంటనే తమస్సు దూరమగును.

**పురుషాంతరమారభ్య కల్పితా యే ద్విజోత్తమ! ।**
**హరిరూపాస్తు తే జ్ఞేయా ఏకీభూతా హి తేన తే ॥10॥**

ద్విజోత్తమా! పురుషుడనే అంతరాత్మ(పరమాత్మ)తో ఆరంభించి కల్పింపబడినవన్నీ హరిరూపాలే అని తెలిసికోవాలి. అందువలన అవన్నీ ఏకీభూతాలే.

**ప్రలయే సమనుప్రాప్తే జీవాః సంయాంతి మామకాః ।**
**విరాడ్రూపే హరేః సంతి తథా తే చ హ్యనేకధా ॥11॥**

ప్రలయం సంభవించబోయే సమయంలో నా సంబంధమైన జీవులందరూ నాలో లయమవుతున్నారు. అవన్నీ అంతవరకు హరి విరాడ్రూపంలో ఉంటాయి. ఆ విధంగా నామరూపాలు అనేకాలు.

**ఏకీభావం ప్రాప్నువంతి మూలేన ప్రలయే ద్విజ! ।**
**బింబేన తు స్వయం విష్ణు రేకీభావం వ్రజేద్యది ॥12॥**

ద్విజుడా! విష్ణువు స్వయంగా తన బింబంతో ఏకీభావాన్ని పొందినట్లయితే సర్వరూపాలు మూలంతో ఏకీభావాన్ని పొందుతాయి.

**ప్రతిబింబః కథం జీవో భవేన్నారాయణస్య చ ।**
**తదధీన స్తత్సదృశో హరే ర్జీవో న సంశయః ॥13॥**

**ప్రతిబింబస్య శబ్దార్థో హ్యయమేవ ముదాహృతః ।**
**తస్మాచ్ఛ బింబరూపాణా మేకీభావం న చింతయేత్ ॥14॥**

జీవుడు నారాయణుని ప్రతిబింబం కాదు. హరికి జీవుడు వశమై ఉన్నాడు. లేదా ఆయనతో తుల్యుడై ఉన్నాడు. ఏమీ సందేహం లేదు. ప్రతిబింబశబ్దంయొక్క అర్థం అదే అని నిర్వచించబడింది. అందువలన బింబరూపాల యొక్క ఏకీభావంలో వేరే ఆలోచించవలసిన అవసరం లేదు.

**కృష్ణరామాదివచ్చైవ త్వేకీభావో వివక్షితః ।**
**బింబానాం మూలరూపస్య భేదో నాత్ర వివక్షితః ॥15॥**

కృష్ణునికి, రామునికి వలె, బింబరూపాలకు ఏకీభావం వివక్షింపబడినది. మూలరూపమునకు, బింబములకు భేదం ఎక్కడా వివక్షింపబడలేదు.

**తత్రాపి చ విశేషోఽస్తి జ్ఞాతవ్య స్తత్త్వమిచ్ఛుభిః ।**
**ఏకాంశేన తు బింబైస్తు చైకీభావం వ్రజంతి తే ॥16॥**

అయినా తత్త్వం కోరువారు ఒక విషయాన్ని తెలిసికోవలసియుంది. బింబాలతో ఒక అంశంతోమాత్రమే అవి ఏకీభావాన్ని పొందుతున్నాయి.

**ఏకాంశేన తు జీవత్వే సంస్థితా నాత్ర సంశయః ।**
**బింబమూలం న జానంతి తే జనా హ్యసురాః స్మృతాః ॥17॥**

ఏకాంశచే మాత్రమే జీవత్వంలో ఏకీభావం. అందు సందియమిసుమంతయు లేదు. బింబమూలాలను తెలియకున్న వారు అసురులుగా భావింపబడుతున్నారు.

**ఏక ఏవ హరిః పూర్వం హ్యవిద్యా వశతః స్వయమ్ ।**
**అనేకో భవతి హ్యారాదాదర్శ ప్రతిబింబవత్ ॥18॥**

మొదట హరి ఒక్కడే. అవిద్యా(మాయా)వశంచే స్వయంగా దూరంగా ఉన్న అద్దములందున్న ప్రతిబింబముల వలె అనేకరూపుడై ఉన్నాడు.

**ఏవం వదంతి యే మూఢా స్తేఽపి యాంత్యధరం తమః ।**
**ఉపాధిర్ద్వివిధః ప్రోక్తః స్వరూపో బాహ్య ఏవ చ ॥19॥**

**బాహ్యోపాధిర్లయే యాతి ముక్తావన్యస్య సంస్థితిః ।**
**సర్వోపాధివినాశే హి ప్రతిబింబః కథం భవేత్ ॥20॥**

ఈవిధంగా చెప్పే అజ్ఞానులు కూడా తమస్సులోకి దిగజారినట్లే ఉపాధి రెండు విధములుగా చెప్పబడింది. స్వరూపం, బాహ్యరూపం అని బాహ్యోపాధి లయాన్ని పొందుతుంది. ముక్తస్థితిలో స్వరూపం మాత్రమే ఉంటుంది. సర్వోపాధులు వినాశం కాగా ప్రతిబింబం ఎలా సిద్ధిస్తుంది?

**చిద్రూపాఖ్యో హ్యుపాధిస్తు మోక్షే యేఽ ప్యధికారిణః ।**
**దుఃఖరూపో హ్యుపాధిస్తు తమసో యేఽ ధికారిణః ॥21॥**

**మిశ్రరూపో హ్యుపాధిస్తు నిత్యసంసారిణాం మతః ।**
**బాహ్యోపాధి ర్లింగదేహః సర్వేషాం నాత్ర సంశయః ॥22॥**

మోక్షమందు అధికారులైనవారికి చిద్రూపమైన ఉపాధి ఉంటుంది. అజ్ఞానమందు అధికారులైనవారికి దుఃఖరూపమైన ఉపాధి ఉంటుంది. నిత్యసంసారులకు మిశ్రరూపమైన ఉపాధి ఉంటుంది. బాహ్యోపాధియైన లింగదేహం అందరికీ ఉంటుంది. అందులో సందేహం లేదు.

**దైత్యాః దుఃఖాయతే యస్మాత్ తస్మాద్ దుఃఖీ హరిః స్వయమ్ ।**
**తత్తద్దుఃఖ స్వరూపత్వాత్ దైత్యానాం బింబరూపకః ॥23॥**

**దైత్యస్థితానాం బింబానాం మూలరూపస్య వై ప్రభోః ।**
**పరస్పరం తథా భేదం హ్యంతరం వా న చింతయేత్ ॥24॥**

దైత్యులు దుఃఖాన్ని పొందేవారు కనుక హరి స్వయంగా దుఃఖభాజనుడౌతాడు. ఆయా దుఃఖస్వరూపంవలన దైత్యులకు బింబరూపకుడు అవుతాడు. ప్రభువుయొక్క మూలరూపానికి పరస్పరం భేదం కాని, అంతరం కాని విచారించరాదు.

**శ్రీభూదుర్గాది రూపాణాం తథా సీతాది రూపిణామ్ ।**
**అన్యోన్యం నాణుమాత్రం చ భేదో బాహ్యంతరేఽపి చ ॥25॥**

**చింతనీయః కథమపి జ్ఞాత్వా యాంత్యధరం తమః ।**
**ప్రతిబింబస్థితో బింబః స్త్రీరూపో హ్యస్తి సర్వదా ॥26॥**

శ్రీదేవి, భూదేవి, దుర్గాదేవి మున్నగు రూపాలకు గాని, సీత మున్నగువారి రూపాలకు గాని, బాహ్యోపాధియందు, స్వరూపోపాధియందు, అన్యోన్యత్వమే తప్ప అణుమాత్రమూ భేదం లేదు. అది ఎట్లు కుదురునని విచారణ చేయువారు తెలిసి అంధతమస్సులో ప్రవేశిస్తున్నారు. అన్ని ప్రదేశాలలో ప్రతిబింబమునందు ఉండు బింబం స్త్రీరూపమే అయి ఉంటుంది.

**ప్రలయే సమనుప్రాప్తే లక్ష్మ్యా సహ ఖగోత్తమ! ।**
**ఏకీభావం నాప్నువంతి బింబేన సహసంస్థితాః ॥27॥**

పక్షిరాజా! ప్రలయం సంభవించుచుండగా బింబంతో కలిసి లక్ష్మితోకూడ ఉన్నవారందరూ ఏకీభావాన్ని పొందరు.

**బింబస్థితానాం రూపాణాం లక్ష్మ్యాశ్చ వినతాసుత! ।**
**భేదస్తు నాణుమాత్రం చ శంకనీయః కథంచన ॥28॥**

వినతాకుమారా! బింబస్థితములైన నానావిధ రూపాలకు, లక్ష్మికి కూడ ఎప్పుడూ అణుమాత్రమూ భేదాన్ని శంకింపరాదు.

**యదా హి శేతే ప్రలయార్ణవే విభుః జీవాంశ్చ సర్వానుదరే నివేశ్య ।**
**ముక్తాంశ్చ బ్రహ్మేంద్ర మరుద్గణాదీన్ ప్రాప్తవ్యముక్తీంశ్చసృతౌ చ సంస్థితాన్ ॥29॥**

**ప్రాప్తాంధకూపాది సమస్త జీవాన్ తథైవ ప్రాప్తవ్య కలీ నథాపరాన్ ।**
**తథైవ నిత్యం సృతి సంస్థితాజ్ఞనాన్ అచేతనాన్ ఋక్షరూపాది జీవాన్ ॥30॥**

**ఏవం జనాఞ్జఠరే సంనిధాయ సమ్యక్ శేతే హ్యంభసి వై స కల్పే ।**
**లక్ష్మీస్తు సా సర్వవేదాత్మికా చ భక్త్యా హరౌ నిత్య సంవర్ధితాపి ॥31॥**

**అత్యాదరం దర్శయతీవ సా తుఈడే విష్ణుం భక్తిసంవర్ధితాపి ।**
**చేష్టాదిరూపేణ తదా న కించిద్ ఆసీద్వినా విష్ణుమథ శ్రియం చ ॥32॥**

సమస్తమూ ఏకార్ణవమైన ప్రళయమునందు ప్రభువు సమస్త జీవులను ముక్తులైన బ్రహ్మ, ఇంద్రుడు, మరుద్గణాలు మున్నగువారిని, ముక్తి పొందబోయేవారిని సంసారమందున్న వారిని, అంధకూపమనే నరకాన్ని పొందిన సమస్త జీవులను, అట్లే నరకాలను పొందబోయే మిగిలినవారిని, అలాగే నిత్యమూ సంసారంలో పరిభ్రమించుచున్న జనాన్ని, అచేతనాలను, ఋక్షరూపాది జీవాలను ఈవిధంగా జనులందరిని జఠరము నందుంచుకొని అతడు ప్రతికల్పమునందు (సృష్టికి మొదట) సముద్రజలాలలో చక్కగా పరుండియుంటాడు. సర్వవేదాత్మికయైన లక్ష్మిమాత్రం హరియందు భక్తిని నిత్యం పెంపొందించుకొనుచున్నదై ఆమె మిక్కిలి గౌరవమును ప్రదర్శించుచున్నదానివలె భక్తిసంవర్ధితురాలై విష్ణువును స్తుతిస్తూ (కొలుస్తూ) ఉంటుంది. ఆ సమయంలో విష్ణువు, లక్ష్మి తప్ప మరేదీ కించిత్తును ప్రవర్తించదు.

**పర్యంకరూపేణ బభూవ దేవీ వాస స్వరూపేణ రమా విరేజే ।**
**సర్వం రమా సైవ తదైవచాసీత్ సైకా దేవీ బహురూపా బభాషే ॥33॥**

ఆ దేవి పర్యంకరూపంలోను, ఆ లక్ష్మి నివాస స్వరూపంగాను, ప్రకాశిస్తూ ఉంటుంది. అప్పుడు సర్వమూ రమారూపమై ఉండేది. ఒక్కటిగానున్న ఆ దేవియే బహురూపయై ఇట్లు వచించింది.

**త్వముత్కృష్ట స్సర్వదేవోత్తమత్వాత్ న త్వత్ సమః కశ్చిదేవాధికో వా ।**
**త్వం బ్రహ్మ ఏకో న చతుర్ముఖశ్చ నాహం రుద్రో న బృహస్పతిశ్చ ॥34॥**

సర్వదేవతలలో ఉత్తముడవైన కారణంచే నీవు ఉత్కృష్టుడవు. నీతో సమానమైన వాడు కాని, నీకన్న అధికుడు కాని వేరొకడు లేడు. నీవు ఒక్కడవే బ్రహ్మవు. చతుర్ముఖుడు కాడు. నేను కాని, రుద్రుడుకాని, బృహస్పతికాని కాదు.

**విష్ణావేవ బ్రహ్మశబ్దోఽపి ముఖ్యోహ్యన్యేష్వముఖ్యో బ్రహ్మరుద్రాదికేషు ।**
**అనంతగుణపూర్ణత్వాద్ బ్రహ్మేతి హరిరుచ్యతే ॥35॥**

బ్రహ్మశబ్దం విష్ణువునందే ముఖ్య ప్రతిపాదకం. మిగిలిన చతుర్ముఖ రుద్రాదులయందు అముఖ్యార్థం కలిగి యుంటుంది. అనంతగుణములతో పూర్ణుడైన కారణంచే హరియే బ్రహ్మగా చెప్పబడుచున్నాడు.

**గుణాది పూర్ణతాభావాన్నాన్యే బ్రహ్మేత్యుదాహృతాః ।**
**దేశానంత్యం గుణతః కాలతో వానాస్త్యానంత్యం క్వాపి దేశే చ కాలే ॥36॥**

గుణములు మున్నగువాటియొక్క పూర్ణత్వం లేకపోయిన(లేని)కారణంచే మిగిలినవారు బ్రహ్మశబ్దంచే చెప్పబడరు. దేశ, కాల, గుణములవలనను అనంతత్వం(ఒక్క విష్ణువునందే సార్థకమై) సిద్ధిస్తుంది. దేశకాలాదులను అనుసరించి అనంతత్వం మిగిలిన ప్రదేశములలో లేదు.

**యదానంత్యం కిము వక్తవ్యమత్రగుణానంత్యం నాస్తి బ్రహ్మాదికేషు ।**
**యద్యప్యహం దేశతః కాలతశ్చసమస్తదా వాసుదేవేన సాధ్యమ్ ॥37॥**

ఇచట అనంతత్త్వం అనే విషయంలో చెప్పదగినది ఏమున్నది కనుక! గుణాలలో ఆనంత్యం(అంతము లేకపోవుట) బ్రహ్మాదులయందును లేదు. దేశంవలన, కాలంవలన నేనయితే వాసుదేవునితో సమముగా ఉన్నదానను.

**తథాపి మే గుణతో నాస్త్యనంతం తతో ధర్మా గుణతోऽనంతతోశ్చ ।**
**సంతి శ్రుతావవిరుద్ధాశ్చ దేవే చింత్యాహ్యచింత్యా బహుధా తే హ్యనంతాః ॥38॥**

అయినప్పటికి నాకు గుణములవలన అనంతత్వం లేదు. గుణములవలన అనంతత్వము ననుసరించి సర్వధర్మములు ప్రవర్తిస్తాయి. వేదాలలో దేవునిలో(హరియందు) అవి ఏ విరుద్ధభావాలు లేకుండా స్థిరంగా ఉన్నాయి. అవి అనేకాలుగా ఉన్నాయి. కొన్ని ఊహింపదగినవి. కొన్ని ఊహకు అందనివి.

**అతో గుణాస్తవ దేవస్య విష్ణో! స్తోతుం సదా స్మో న హరేః కదాపి ।**
**నాహం న కేశౌ న చ గీ ర్నరుద్రో న దక్షకన్యా న చ మేనకాసుతా ॥39॥**

విష్ణుమూర్తీ! అందువలన దేవుడైన హరియొక్క గుణాలను స్తుతించుట ఎల్లప్పుడూ, ఎప్పుడూ మేము చేయలేము. నేను కాని, బ్రహ్మగాని, ఈశ్వరుడుగాని, సరస్వతిగాని, రుద్రుడుగాని, దక్షకన్య(సతీదేవి)గాని, మేనకాసుత(పార్వతి) గాని తగినవారము కాము.

**న వై బిడౌజా న చ వా పులోమజా న చేధ్మవాహో న యమో న చాన్యః ।**
**న నారదో నాపి భృగుర్వసిష్ఠో న విఘ్నపో నాపి బల్యాదయశ్చ ॥40॥**

ఇంద్రుడుగాని, శచీదేవిగాని, అగ్నిగాని, యముడుగాని, నారదుడుగాని, భృగువుగాని, వసిష్ఠుడుగాని, విఘ్ననాయకుడుగాని, బలి మున్నగువారుగాని మరెవ్వరూ కానీ తెలిసికొనలేరు.

**న వై విరాటో నాపి భీమః శనిశ్చ న పుష్కరో న కశేరు స్తథైవ చ ।**
**న కిన్నరాః పితరో నైవ దేవాః గంధర్వముఖ్యా నాపి వా తుష్యసంజ్ఞాః ॥41॥**

విరాట్టుగాని(గరుడుడు), భయంకరుడైన రుద్రుడుగాని, శనిగాని, పుష్కరుడుగాని, కశేరువుగాని, కిన్నరులుగాని, పితరులు గాని, దేవతలుగాని, గంధర్వముఖ్యులుగాని, తుష్యులనబడేవారుగాని తెలియజాలరు.

**న వై క్షితీశా న చ మానుషాశ్చ విష్ణోర్నజానంతి కిమత్ర చాన్యే ।**
**మత్తోऽధమః కోటిగుణేన బ్రహ్మసమో హి తస్య బ్రహ్మణో మాతరిశ్వా ॥42॥**

భూమిని పాలించే రాజులుగాని, మనుష్యులుగాని, విష్ణువుయొక్క గుణములను తెలియజాలరు. ఇకమిగిలిన వారి సంగతి చెప్పనేల? నాకన్న సృష్టికర్తయైన బ్రహ్మ కోటిగుణములు తక్కువవాడు. ఆ బ్రహ్మతో సమానుడు వాయువు.

**తౌ వై విరాగే హరిభక్తిభావే ధృతి స్థితి (స్తితి) ప్రాణబలేషు యోగే ।**
**బుద్ధౌ సమానౌ సంస్మృతౌ మోక్షకాలే పరస్పరాధారసమన్వితౌ చ ॥43॥**

హరిభక్తిభావనయందు వారిరువురు పూర్తిగా వైరాగ్యవృత్తి గలవారు. ధృతియందు, స్థితియందు, ప్రాణమునందు, బలమందు, యోగమందు, బుద్ధియందు సమానులు. సంసారమందు, మోక్షసమయంలో వారు పరస్పరం ఆధారం కలిగియుంటారు.

**అన్నాభిమానం బ్రహ్మచారిం మురారిం జీవాభిమానం వాయుమాహుర్మహాంతః ।**
**న శక్తోఽసౌ బ్రహ్మదేవో వివస్తుం వాయుం వినా సంసృతావేవ నిత్యమ్ ॥44॥**

**న తం వినా మాతరిశ్వా చ వస్తుం అన్యోన్యమాప్తిః కాలతో న్యూనతా చ ।**
**యదా మహత్తత్త్వ నియామకోఽభూద్ బ్రహ్మాండాంత స్థూలసృష్టౌ మహాత్మా ॥45॥**

**తదా వాయుర్నాశకద్వై మహాత్మా బాహ్యే సృష్టౌ కాలభేదేన చాస్తి ।**
**సరస్వతీ భారతీ బ్రహ్మణస్తు సంవత్సరానంతరం సంబభూవ ॥46॥**

మురారియైన పరమాత్మను అన్నాభిమానం కలవాడిగా చెపుతారు. మహాత్ములు వాయువును జీవాభిమానం కలవాడుగా వచిస్తారు. పరమాత్మ (బ్రహ్మము) వాయువు లేకుండ సంసారములో ప్రవేశించుటకు ఎప్పుడూ సమర్థుడు కాలేదు. విష్ణువు లేకుండగా వాయువు జీవునిలో నుండుటకు శక్తుడుకాడు. వారిరువురకు ఇట్లు అన్యోన్యం కలయిక, కాలంవలన న్యూనత్వం (విడివడుట) కలుగుతుంది. మహాత్ముడైన పరమాత్మ బ్రహ్మాండమువరకు చేసే స్థూలసృష్టిలో మహత్తత్త్వమును నియమించుటకు సిద్ధపడినపుడు అంతవరకు మహాత్ముడైన వాయువుయొక్క అస్తిత్వమునకు సామర్థ్యం లేదు. ఇట్లు బాహ్యసృష్టియందు వారిరువురికి సంయోగ వియోగములు కాలభేదంచే ఉంటాయి. సంవత్సరం తరువాత బ్రహ్మనుండి భారతియైన సరస్వతి ఏర్పడింది.

**యదా దశాబ్దాః సమతీతా మహాత్మా తదా వాయుః సమభూల్లోకపూజ్యః ।**
**కించిన్న్యూనత్వం స్థూలసృష్టౌ మహాత్మన్నైతావతా వానయోః సౌమ్యహానిః ॥47॥**

పది సంవత్సరాలు గడచిన తరువాత మహాత్ముడు, లోకపూజ్యుడు అయిన వాయువు సంభవించాడు. సౌమ్యా! మహాత్మా! స్థూలదృష్టియందు ఇట్లు కొంచెం న్యూనత్వం కలదు. అంతవరకును వారిరువురికిని సమత్వంలో వైషమ్యం లేదు.

**సరస్వతీ వత్సరాత్సంబభూవహ్యనంతరం బ్రహ్మణో జన్మకాలాత్ ।**
**గిరః సకాశాత్కాలతో న్యూనతాస్తివాయోస్తదా హ్యధమత్వే క్షతిః కా ॥48॥**

అనంతరం బ్రహ్మయొక్క జననకాలంలో ఒక వత్సరం తరువాత సరస్వతి ఉద్భవించింది. వాయువుకు ఇలా సరస్వతి యొక్క జననాన్నిబట్టి కాలన్యూనత్వం ఉంది. అయినప్పటికి (సరస్వతి తరువాత వాయువు అనే) తక్కువ అనే లెక్క ఉన్నా నష్టమేమీ లేదు.

**వాయోరనంతరం వాణీ హ్యభూత్ సంవత్సరాత్పరమ్ ।**
**యావత్పశ్చాత్ జని స్తావత్ పూర్వదేహక్షయో భవేత్ ॥49॥**

సంవత్సరం గడచిన తరువాత వాయువు తరువాత వాణి ఉద్భవించింది. సరస్వతియొక్క పూర్వజన్మ క్షయమైన పిమ్మట తిరిగి వాణిగా జన్మించినది (కావున వైరుధ్యం లేదు)

**శేషస్త్వింద్రో రుద్ర ఏతే త్రయశ్చ సమాహ్యేతే జ్ఞానబలాదికేష్వపి ।**
**తథాపి తేషాం కాలతో న్యూనతాస్తి కాలోఽ పి తేషాం దివ్యే సహస్రవర్షమ్ ॥50॥**

జ్ఞానమందు, బలమునందు, మిగిలిన వాటియందు శేషుడు, ఇంద్రుడు, రుద్రుడు వీరు ముువ్వురును సమానులే. అయినప్పటికిని కాలంవలన వారికి న్యూనత్వంకలదు. వారి కాలంకూడ దేవతామానమందు వేయి సంవత్సరాలు.

**అనంతరుద్రౌ బ్రహ్మవాయూ యథా వా తథా జ్ఞేయో నైవ హానిః స్వరూపే ।**
**స్థూలస్య సృష్టౌ బాహ్యసృష్టౌ మహాత్మన్! కాలాన్న్యూనత్వం స మయా నైవ చింత్యః ॥51॥**

అనంతుడు, రుద్రుడు, బ్రహ్మ, వాయువు వీరిలో అనంత రుద్రులు ఎట్లో బ్రహ్మవాయువులు అట్లే అని తెలియదగియున్నది. వీరికి స్వరూపమునందు హాని లేదు. మహాత్మా! స్థూలదృష్టియందు, బాహ్యదృష్టియందు వారికి కాలంచేత న్యూనత్వాన్ని నేను ఆలోచించటం లేదు.

**తేషాం సకాశాద్వారుణీ పార్వతీ చ సౌపర్ణీ నామ్నీ తిస్ర ఏతా మహాత్మన్! ।**
**దశాబ్దేభ్యో ఽ నంతరం సంబభూవుః సరస్వతీ భారతీవచ్చ బోధ్యా ॥52॥**

మహాత్మా! వారితో సమానంగా వారుణి, పార్వతి, సౌపర్ణి అనే పేర్లు కల ముగ్గురు పది సంవత్సరాల తరువాత ఉద్భవించారు. సరస్వతి భారతివలెనే గ్రహింపదగినది.

**ఇంద్రో వరో రుద్ర భార్యాధికేభ్య ఏవం జ్ఞానం సర్వదా దేహ్యమందమ్ ।**
**ఏవం జ్ఞానం యస్య భవేచ్చ లోకే స వై జ్ఞానీ వేదవేద్యః స ఏవ ॥53॥**

రుద్రుడు, భార్యుడు (సమస్తం భరించువాడు శేషుడు) మున్నగువారికన్న ఇంద్రుడు శ్రేష్ఠుడు అనే ఉత్తమమైన జ్ఞానమును నాకు ఇమ్ము. లోకంలో ఇటువంటి జ్ఞానం కలవాడే జ్ఞాని. అతడు వేదములచే తెలియబడేవాడు. (వేదార్థవిదుడు).

**న వై జ్ఞానీత్యంతరం యో న వేదస వేదవాదీ న చ వేదపాఠకః ॥54॥**

**వేదాక్షరాణి యావంతి పఠితాని ద్విజాతిభిః తావంతి హరినామాని ప్రియాణి చ హరేస్సదా ॥55॥**

ఈ అంతరం తెలియనివాడు జ్ఞాని కాదు. అతడు వేదంలోని విషయాలకు అర్థవాదం చేసేవాడు అవుతాడు. అతడు వేదపఠనం చేసినవాడు కాదు. ద్విజాతులచే ఎన్ని వేదాక్షరాలు పఠింపబడునో అవన్నీ హరినామాలై హరికి ఎల్లప్పుడును ఇష్టమైనవి.

**మమ స్వామీ హరిర్నిత్యం దాసోఽ హం సర్వదా హరేః ।**
**బ్రహ్మాద్యా దేవతా స్సర్వా గురవో మే యథాక్రమమ్ ॥56॥**

నాకు నిత్యమునూ హరియే స్వామి. హరికి ఎప్పుడును నేను దాసుడను. బ్రహ్మాది దేవతలందరునూ యథాక్రమంగా నాకు గురువులే.

**ఏతేషాం చ హరిః స్వామీ వేదే సర్వత్ర గీయతే ।**
**ఏవం జానంస్తు యో వేదాన్సంపఠేత్స ద్విజోత్తమః ॥57॥**

వేదములందు అంతట వీరందరికి హరియే ప్రభువు అని కీర్తింపబడుతోంది. వేదములను బాగుగా చదువుకొనినవారికి ఈ జ్ఞానం తెలుస్తుంది. అతడే ద్విజోత్తముడు.

**స వేదపాఠకో జ్ఞేయః తదన్యే వేదవాదినః ।**
**వేదభార భరాక్రాంతః స వై బ్రాహ్మణగర్దభః ॥58॥**

ఈ జ్ఞానం కలిగినవాడే వేదపాఠకుడుగా తెలియదగినవాడు. దానికన్న ఇతరులు వేదవాదులు మాత్రమే. వేదంయొక్క భారానికి సంబంధించిన బరువుచే ఆక్రమింపబడినవాడు బ్రాహ్మణాధముడు.

**జ్ఞానాభిమానీ వేదాభిమానీ ఉభౌ తు పరస్పరం హ్యూచతుః సర్వదైవ ।**
**జలం వేదో యత్ర వాసో మురారే రాచార్యాణాం సంగ దోషాద్ద్విజానామ్ ॥59॥**

మురారికి జలమే అధివాసమని తెలియాలి. అందు జ్ఞానాభిమాని, వేదాభిమాని వీరిరువురు ఎప్పుడూ పరస్పరం వాదించుకొంటూనే ఉంటారు. ద్విజులకు ఆచార్యులయొక్క సంగదోషం ఉంటుంది.

**మహాపరాధాః సంతి లోకే మహాత్మన్! సహస్రశః శతశః కోటిశశ్చ ।**
**హరిశ్చ తాన్ క్షమతే సర్వదైవ నామత్రయ స్మరణాద్ వై కృపాలుః ॥60॥**

మహాత్మా! లోకంలో వందలకొలది, వేలకొలది, కోట్లకొలది మహాపరాధాలున్నాయి. దయామయుడైన హరి ఆయన నామత్రయమును స్మరించుటవలన ఆ అపరాధాలన్నిటినీ క్షమిస్తాడు.

**సర్వాపరాధాద్రహితం దానమానైర్యుక్తం సదా తారతమ్యాచ్చ హీనమ్ ।**
**దృష్ట్వాపరాధం తస్య విష్ణు ర్మహాత్మాహాహాకారం కురుతే క్రోధబుద్ధ్యా ॥61॥**

ఏ అపరాధములూ లేనివానిని, దానం చేయువానిని, గౌరవం కలవానిని ఎల్లపుడు హరి క్షమిస్తాడు. అట్లు కాక తారతమ్యబుద్ధి లేనివానిని, అతని అపరాధాన్ని చూచి మహాత్ముడైన విష్ణువు క్రోధబుద్ధిచే హాహాకారం చేస్తాడు.

**ఉత్తిష్ఠ గోవింద! సువేదవేద్య సోవ్యాత్కృతాఖ్యో మయి సమ్యక్ ప్రసీద ।**
**భో కేశవోత్తిష్ఠ సుఖస్వరూప సృష్టౌ వ్యయే వర్తయితుం సమర్థః ॥62॥**

గోవిందా! వేదములచే చక్కగా తెలియజేయబడువాడా! లెమ్ము. ఆ వ్యాకృతుడు నాయందు చక్కగా అనుగ్రహించుగాక! ఓ కేశవా! సుఖస్వరూపా! లెమ్ము. సృష్టియందు ప్రలయం ప్రవర్తించుటకు నీవు సమర్థుడవు.

**సృష్ట్వా బ్రహ్మాణం ప్రేరయేత్ పూజ్య సృష్టౌసృష్ట్వా రుద్రౌ ప్రేరయేత్ సంహృతౌ చ ।**
**ప్రాప్తవ్యయోగ్యాన్ బ్రహ్మశేషాది దేవాన్ దృష్ట్వా దృష్ట్వా దేహి మోక్షం చ సమ్యక్ ॥63॥**

బ్రహ్మను సృష్టించి పవిత్రమైన సృష్టియందు ప్రేరేపిస్తావు. రుద్రుని సృష్టించి సంహారమునందు ప్రేరేపిస్తావు. పొందదగిన యోగము కల బ్రహ్మ, శేషుడు మున్నగువారిని పదే పదే వీక్షించి, వారికి చక్కగా మోక్షము నిమ్ము.

**హరే! మురారే! స్వాపహీనాద్య తిష్ఠ కల్పాదికానంతర జ్ఞానహీనాత్ ।**
**సమ్యక్ దృష్ట్వా కర్మదృష్ట్యా మహాత్మన్! లబ్ధం తమో దాహి దుఃఖస్వరూపమ్ ॥64॥**

హరీ! మురారీ! ఇప్పుడు సుప్తావస్థను విడిచి లెమ్ము.మహాత్మా! కల్పాదికం పూర్తి అయిన తరువాత మునుపటి జ్ఞానం లేకపోవుటవలన మమ్ము(నన్ను) లెస్సగా చూచి, ఎట్లు కర్మ(సృష్టి) చేయవలసినదో చూపించవలసినది. పొందిన దుఃఖస్వరూపమైన అజ్ఞానాన్ని దహించు.

**దైత్యాదికాన్ దుఃఖమతీన్ హ (హంతా) యస్మాత్తమస్యంధే సర్వదా చిత్స్వరూపీ ।**
**తస్మాదాహు ర్దుఃఖరూపీ హరిస్త్వం దుఃఖస్వరూపాత్త్వం చ దుఃఖీ హరే! త్వమ్ ॥65॥**

అంధతమస్సునందుండే దుఃఖమతులైన దైత్యాదులను వధించిన కారణంచే నీవు ఎప్పుడును చిత్స్వరూపుడవే అయినప్పటికి హరి దుఃఖరూపి అని అంటారు. హరీ! నీవు ఆసమయంలో దుఃఖస్వరూపంతో ఉండుటవలన దుఃఖివి అవుతావు.

**ఉత్తిష్ఠ నారాయణ! వాసుదేవ! హ్యుత్తిష్ఠ కృష్ణాచ్యుత మాధవేతి ।**
**ఉత్తిష్ఠ వైకుంఠ! దయార్ద్రమూర్తే! ఉత్తిష్ఠ లక్ష్మీశ నమో నమస్తే ॥66॥**

నారాయణా! వాసుదేవా! లెమ్ము. కృష్ణా! అచ్యుతా! మాధవా! లెమ్ము. వైకుంఠా! దయార్ద్రమూర్తీ! లెమ్ము. లక్ష్మీశా! లెమ్ము. నీకు పదే పదే నమస్కారం.

**ఉత్తిష్ఠ మధ్యేశ సరస్వతీశ ఉత్తిష్ఠ రుద్రేశ తథాంబికేశ ।**
**ఉత్తిష్ఠ చంద్రేశ తథా శచీశ విప్రేశ భక్తేశ గవేశ నిత్యమ్ ॥67॥**

మాధవేశ్వరా! సరస్వతీశ్వరా! లెమ్ము. రుద్రేశా! అంబికేశా! లెమ్ము. చంద్రేశా! శచీశ్వరా! లెమ్ము. విప్రులకు ఈశ్వరా! భక్తులకు ఈశ్వరా! నిత్యము గోవులకు ఈశ్వరా! లెమ్ము.

**శాస్త్రప్రియోత్తిష్ఠ ఋచిప్రియస్త్వం యజుఃప్రియోత్తిష్ఠ నిదానమూర్తే! ।**
**సామప్రియస్త్వం చ తథా మురారే! అథర్వవేదప్రియ సర్వదా త్వమ్ ॥68॥**

శాస్త్రప్రియా! లెమ్ము. నీవు ఋగ్వేదప్రియుడవు. యజుర్వేదప్రియా! లెమ్ము. ఆదికారణం ఆకారమైనవాడా లెమ్ము. మురారీ! నీవు సామగానప్రియుడవు. అదే విధముగా నీవు ఎల్లప్పుడు అథర్వవేదప్రియుడవు. లెమ్ము.

**గద్యప్రియస్త్వం చ పురాణమూర్తే స్తుతిప్రియోత్తిష్ఠ విచిత్రమూర్తే ।**
**సుగాయనప్రీతికరస్త్వమేవ హ్యుత్తిష్ఠ శీఘ్రం కమలాపతిస్త్వమ్ ॥69॥**
**ఏవం స్తుతో విష్ణురజః పురాణో హ్యతిత్వరావానుత్థితో నిత్యబుద్ధః ॥70॥**

పురాణమూర్తీ! నీవు గద్యప్రియుడవు. విచిత్రమూర్తీ! నీవు స్తుతిప్రియుడవు. లెమ్ము. సంగీతప్రీతికరుడవు నీవే. నీవు కమలాపతివి. శీఘ్రంగా లెమ్ము. ఈవిధంగా అజుడు, పురాతనుడు అయిన విష్ణువు స్తుతింపబడినవాడై, నిత్యబుద్ధుడగు ఆ దేవుడు అతిత్వరగా పైకి లేచాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడ సంవాదే బ్రహ్మ విష్ణుమహేశ్వరాది దేవతాతారతమ్యనిరూపణం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడ సంవాదంలో బ్రహ్మాది దేవతలలోని తరతమభావనిరూపణం అనే రెండవ అధ్యాయం సమాప్తం.

## **తృతీయోఽధ్యాయః** – మూడవ అధ్యాయం

## **భగవద్వీర్యనిరూపణాదికమ్** – భగవానుని వీర్యస్వరూపాదికం

**శ్రీ కృష్ణ ఉవాచ** – శ్రీ కృష్ణుడు వచించాడు.

**బభూవేచ్ఛా మమ దేవస్య విష్ణోః స్రష్టుం సృజ్యాన్ మోక్షయోగాంశ్చ మోక్తుమ్ ।**
**ఇచ్ఛాశక్తిః సర్వ దైవాస్తి విష్ణోస్తథాపి తద్వ్యాహరణం చ లౌకికమ్ ॥1॥**

దేవుడైన విష్ణువుకు సృజింపదగిన వారిని సృష్టించుటకు, మోక్షమునకు యోగ్యులైనవారికి ముక్తినిచ్చుటకు నాకు ఇచ్ఛ కలదు. దేవుడైన విష్ణువునకు ఎల్లప్పుడు ఇచ్ఛాశక్తివశమై ఉన్నది. అయినప్పటికి దానిని చెప్పటం లౌకికమై ఉంటుంది.

**తదా హరి ర్జగృహే లౌకికం చ తమఃపానం తేన రూపేణ చక్రే ।**
**తద్రూపమాహుః ప్రాకృతం వై తదజ్ఞాహ్యంధం తమః ప్రవిశన్త్యేవ సర్వే ॥2॥**

ఆ సమయంలో హరి లౌకికప్రక్రియను స్వీకరించాడు. ఆ రూపంతో తమస్సును పానంచేశాడు. ఆ విషయాన్ని గ్రహించని అజ్ఞులు దానిని ప్రాకృతరూపమంటారు. అటువంటి వారందరు అంధతమస్సులో ప్రవేశిస్తారు.

**అవతారా మహావిష్ణోః సర్వే పూర్ణాః ప్రకీర్తితాః ।**
**పూర్ణం చ తత్పరం రూపం పూర్ణాత్పూర్ణాః సమాగతాః ॥3॥**

మహా విష్ణువు అవతారాలన్నియు పూర్ణావతారాలుగా కీర్తింపబడినాయి. ఆతని పరమైన రూపం పూర్ణం. పూర్ణం నుండియే పూర్ణములు వచ్చాయి.

**పరావరత్వం తేషాం తు వ్యక్తిమాత్ర విశేషతః ।**
**న దేశకాల సామర్థ్యాత్ పారావర్యం కథంచన ॥4॥**

వారిలోని ఎక్కువ తక్కువలు వ్యక్తి మాత్ర విశేషమునకు చెందినవి. దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి, ఎన్నడునూ ఎక్కువ తక్కువలుండవు.

**పూర్వ రూపం చ పూర్ణం చ పూర్ణం పరవితారగమ్ ।**
**రూపం తదాత్మన్యాదాయ పూర్ణమేవావశిష్యతే ॥5॥**

పూర్వరూపం పూర్ణమే. తరువాతివైన వివిధావతారములను పొందేది పూర్ణమే. ఆ రూపాన్ని ఆత్మయందు (తనలో) గ్రహించినచో, పూర్ణమే మిగులుతుంది.
(పర– తరువాతివైన, వి– వివిధములైన, తార– అవతారములను, గమ్– పొందునది)

**లౌకికవ్యవహారోఽయం భూభారక్షపణాదికః ।**
**తస్య దృష్టిం వినా నాన్యో లయః కృష్ణాదినా క్వచిత్ ॥6॥**

భూభారమును వహించుట యనెడు లజ్జాకృత్యం మున్నగునవి లౌకికవ్యవహారం మాత్రమే. కృష్ణాదులచే ఒక్కొక్కచోట లయం చెప్పబడినది. ఆయన దృష్టికి గోచరం కానిదేదీ లేదు.

**తత్త్వే పీడా న కర్తవ్యా తయా దుఃఖాని విందతి ।**
**అత్యంత పీడనాత్తస్య రోగస్తస్య న సంశయః ॥7॥**

తత్త్వమునందు హీనత్వబుద్ధి ఉంచదగదు. ఆ బుద్ధిచే దుఃఖములను పొందును. ఆ దుఃఖములు మిక్కిలిగా పీడించుట వలన అతనికి రోగం కలుగుతుంది. సంశయం లేదు.

**జ్ఞాతవ్యాంశే తు పీడా తు కర్తవ్యా గురుణా సహ ।**
**తమంతే వాసినం చాహుః స ఏవ చ గురుః స్మృతః ॥8॥**

తెలుసుకొనదగిన అంశమందు, గురువుతో కలసి చేయదగినదే. అట్టి వానినే శిష్యుడంటారు. అట్టివాడే సరియైన గురువు.

**యే కుర్వంతి హరే స్తత్త్వవిచారం తు పరస్పరమ్ ।**
**తావేవ గురు శిష్యౌ తు వినతానందసంయుత ॥9॥**

వినతకు ఆనందమును చేకూర్చువాడా! హరిని గూర్చి పరస్పరం తత్త్వవిచారం చేసేవారే సరియైన గురుశిష్యులు.

**గురుణాపి సమం హాస్యం కర్తవ్యం కుటిలం వినా ।**
**హర్షామర్షయుతః శిష్యో గురుః కౌటిల్యసంయుతః ॥10॥**

**ఉభౌ తౌ నిరయం యాతౌ యావదాచంద్రతారకమ్ ।**

గురువుతో సమానంగా కౌటిల్యబుద్ధి లేకుండగా నవ్వుకోవచ్చు. హర్షామర్షములతో కూడుకొను శిష్యుడు, కౌటిల్యం కలిగిన గురువు ఇరువురును చంద్రుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం నరకం పొందుతారు.

**సాక్షాద్ధరిః పురుషః పింగలాక్షః స్వమాయాయాం గుణమయ్యాం మహాత్మా ।**
**స్వ పౌరుషేణైవ సుమంగలేన అథాత్తు వీర్యం భగవాన్వీర్యవాంశ్చ ॥11॥**

హరి సాక్షాత్తు పురుషుడు. పింగలాక్షుడు. మహాత్ముడు. భగవంతుడు అయిన ఆ వీర్యవంతుడు గుణమయియైన తన మాయ యందు మిక్కిలి శుభమైన తన పౌరుషంచే వీర్యం ఉంచినవాడు అయ్యాడు.

***గరుడ ఉవాచ*** – గరుడుడు అడిగాడు.

**వీర్య స్వరూపం బ్రూహి మే వాసుదేవ వీర్యే త్వదీయే సంశయో మే విభాతి ।**
**కిం వీర్యమీశస్య స్వరూపభూతం కిం వా విభిన్నం వద సాధు వేత్సి ॥12॥**

వాసుదేవా! నాకు వీర్యస్వరూపం తెలియజెప్పు. నీ సంబంధమయిన వీర్యవిషయంలో నాకు ఒక సంశయం విశేషంగా కలదు. ఈశ్వరుని వీర్యం స్వరూపమై ఉంటుందా? లేదా దానికన్నా భిన్నరూపమై ఉంటుందా? నీవన్నీ బాగా తెలిసినవాడవు. చెప్పు.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు చెప్పాడు.

**యద్వీర్యమాధత్త హరిః స్వయం ప్రభు ర్మాయాయాం వినతా తనూజ ।**
**తద్వీర్యమాహుర్నృహరేః స్వరూపం విపశ్చితో నిశ్చితతత్త్వదర్శినః ॥13॥**

వినతానందనా! ప్రభువు అయిన హరి స్వయంగా తన మాయయందు ఉంచిన వీర్యమే నృసింహస్వరూప మని తత్త్వదర్శనంచేసిన పండితులంటారు.

**భిన్నం తదాహుః ప్రాకృతమేవ చాహుః స్వనాభి పద్మాదికవచ్చ బోధ్యమ్ ।**
**నైతావతా జ్ఞానరూపస్య విష్ణోర్న వీర్యహానిరితి చింతనీయమ్ ॥14॥**

దానిని భిన్నరూపమైన ప్రాకృతరూపంగా చెప్పుచున్నారు. అది తన యొక్క నాభిపద్మం వంటిదని తెలియదగినది. అంతమాత్రంచేత జ్ఞానస్వరూపుడైన విష్ణువుకు వీర్యహానియని చింతింపనవసరం లేదు.

**వీర్య స్వరూపీ భగవా న్వాసుదేవఃసర్వత్ర దేశేఽ పి చ సర్వకాలే ।**
**సర్వార్థవా న్యది నస్యాత్ఖగేంద్ర! తర్హీశ్వరః పురుషో నైవ స స్యాత్ ॥15॥**

అన్ని ప్రదేశాలలోను, సర్వకాలాలోను, భగవంతుడైన వాసుదేవుడు వీర్యస్వరూపుడే. పక్షిరాజా! సర్వార్థములు కలిగి ఉండని వాడయితే ఈశ్వరుడు పురుషుడే కాడు.

**అచింత్యవీర్యై శ్చింత్యవీర్యైర్ద్విరూపః స్త్రీ రూపమేకం పురుషం తథా పరమ్ ।**
**ఉభే రూపే వీర్యవతీ ఖగేంద్ర తయోరభేద శ్చింతనీయో హి సమ్యక్ ॥16॥**

ఊహింపదగని వీర్యముల చేత, ఊహింపదగిన వీర్యముల చేత అతడు ద్విరూపుడు. ఒకటి స్త్రీ రూపం. రెండోది పురుష రూపం. పక్షిరాజా! ఈ రెండు రూపములనూ వీర్యవంతములే. వారికి చక్కగా అభేదం మాత్రమే ఊహింపవలసింది.

**స్త్రీ రూప వాన్యది న స్యాత్ఖగేంద్ర ।**
**స్త్రీణాం కథం ప్రతి బింబత్వమేవ ॥17॥**

**స్త్రీ రూపమస్మా ద్బ్రహ్మజం (ద్వాస్తవం) చింతనీయం స్వరూపమేతన్నాన్యథా చింతనీయమ్ ।**
**స్త్రీ రూపవన్నైవ విచింతనీయం నపుంసకం త్వస్యజన్యం హి విద్ధి ॥18॥**

పక్షిరాజా! అతడు స్త్రీరూపం కలిగినవాడు. కాకున్నచో, స్త్రీలకు ఎట్లు ప్రతిబింబత్వం సిద్ధిస్తుంది? అందువలన స్త్రీరూపం బ్రహ్మసంభవమని (వాస్తవమని) గ్రహించవలసియున్నది. ఇది స్వరూపమేకాని, భిన్నమైనదని ఆలోచింపరాదు. స్త్రీరూపం వలనే నపుంసకరూపం కూడ అని చింతింపరాదు. అది అతని నుండి పుట్టినదని తెలిసికొనుము.

**నపుంసకం నైవ నైవ స్వరూప భూత మతో హరౌ నాస్తి విచింతనీయమ్ ।**
**స్త్రీబింబ భూతే హరిరూపే ఖగేంద్ర శ్రీరూపమస్తీతి విచింతనీయమ్ ॥19॥**

నపుంసకరూపం స్వరూపభూతం కాదు. కావున హరి యందు అది లేదని నిర్ణయింపరాదు. పక్షిరాజా! స్త్రీ బింబభూతమైన హరిరూపమందు శ్రీరూపం కూడా కలదని గ్రహించాలి.

**గరుడ ఉవాచ –** గరుడుడు ప్రశ్నించాడు.

**స్త్రియా స్త్రియశ్చ సంయోగం వ్యర్థమాహుర్మనీషిణః ।**
**స్త్రీరూప భూతే బింబే తు స్త్రీ రూపాః సంతి సర్వదా ॥20॥**

**స్థితౌ తత్ర నిమిత్తం చ బ్రూహి కృష్ణ మమ ప్రభో ॥21॥**

మనీషులు స్త్రీకి స్త్రీతో సంయోగం వ్యర్థమని చెబుతారు. స్త్రీరూపభూతమైన బింబంతో ఎప్పుడును స్త్రీరూపాలే ఉంటాయి. కృష్ణా! ప్రభూ! అట్లుండుటకు కారణమేమిటో వచించు.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీ కృష్ణుడు వచించాడు.

**స్త్రీబింబభూత స్త్రీ రూపే లక్ష్మీర్నస్యాత్ ఖగేశ్వర ।**
**నిత్యా వియోగినీ దేవీ కథం స్యాత్పరమాత్మనః ॥22॥**

పక్షిరాజా! స్త్రీబింబభూతమైన స్త్రీరూపమందు లక్ష్మి లేనినాడు, పరమాత్మకు ఆ దేవి నిత్యానపాయిని (ఎల్లప్పుడు విడిచి పెట్టరానిదై) ఎట్లు కాగలదు?

**హరే రనంతరూపాణాం స్త్రీరూపాణాం ఖగేశ్వర ।**
**అనంతానంతరూపేణ నిత్యం శుశ్రూషణే రతా ॥23॥**

పక్షీంద్రా! హరికి అనంతరూపములైన స్త్రీరూపాలు ఉండుటచే, ఆమె నిత్యమూ అనంతరూపాలతో సేవా తత్పరురాలై ఉన్నది.

**అతో లక్ష్మ్యా వియోగస్తు శంకనీయః కథంచన ।**
**నారాయణో నామ హరిః స్వతంత్రః శ్రియా వినా నాస్తి కదాపి తార్క్ష్య! ॥**
**హరేర్ముకుందస్య పదారవిందే శుశ్రూషమాణా పరమాదరేణ ॥24॥**

అందువలన హరికి లక్ష్మితో వియోగం ఎన్నడును శంకింపరాదు. నారాయణుడనే పేరుగల హరి స్వతంత్రుడు. తార్క్ష్యా! ఆయనకు లక్ష్మితో వియోగం ఎప్పుడునూ లేదు. ఆమె ముకుందుడైన హరి పాదపద్మము నందు మిక్కిలి గౌరవంతో సేవాబుద్ధి కలది.

**హరిం వినా శ్రీరపి దేశకాలేనాస్తీతి మోక్షేచ్ఛుభిరేవ వేద్యమ్ ।**
**యస్యామదధాద్వీర్యమనుక్షణం చ సా మామికా చేంద్రజాలాత్మికేతి ॥25॥**

**వదంతి యే అసురా మూఢరూపా అంధమతః ప్రవిశంత్యేవ సర్వే ।**
**మాయా నామ ప్రకృతిస్త్వేవ మాహుః సుసూక్ష్మరూపా న తు చేంద్రజాలికా ॥26॥**

దేశకాలాలను బట్టికూడ లక్ష్మి హరిని విడిచియుండదని మోక్షమును కోరువారిచే తెలియదగినది. అందువలన అనుక్షణం నా వీర్యాన్ని ఆమె ధరించియున్నది. ఆమె నా సంబంధమైన ఇంద్రజాలరూపమైన మాయ

(పై శ్లోకముతో అన్వయము) అని ఎవరయితే వచిస్తారో, వారు అసురులు, మూఢరూపులు. అందువలన వారు అందరు అంధ తమస్సులో ప్రవేశిస్తున్నవారే. మాయ అనగా ప్రకృతియే. అది చాలా సూక్ష్మరూపమైనది. ఇంద్రజాలికావిద్య వంటిది కాదు.

**తస్యాభిమానఃశ్రీరితి వేదితవ్యో వీర్యాధానం తత్ర తేషాం చ మేలః ।**
**కార్యోన్ముఖం మేలనం చాహురార్యా ఇతో రూపం నాహు రార్యాశ్చ విష్ణోః ॥27॥**

హరియొక్క అభిమానం లక్ష్మి అని తెలియదగినది. అక్కడ వీర్యాధానమనునది ప్రకృతి పురుషుల మేలనం మాత్రమే ఆర్యులు ఆ సమ్మేలనాన్ని సృష్టికార్యమునకు ఉన్ముఖమగుట అని చెబుతారు. ఆ ఆర్యులే విష్ణువునకు ఇంతకన్నా వేరే రూపం ఇంకొకటి లేదని వచిస్తారు.

**సానాది నిత్యా సత్యరూపా చ విష్ణోర్మిథ్యా రూపా సా కథంస్యాత్ ఖగేంద్ర! ।**
**సత్యా తనుః ప్రకృతే స్తన్నిగూఢా సత్యత్వమాహుర్వ్యవహారార్థరూపమ్ ॥28॥**

ఆమె అనాది. నిత్య, సత్యరూప. ఖగేంద్రా! ఆమె విష్ణువు యొక్క మిథ్యారూపమెలా అవుతుంది? ప్రకృతి యొక్క తనువు సత్యమైనదే. అది నిగూఢమైనది. అచట వ్యవహారం కొరకు కల్పింపబడిన రూపంగా సత్యత్వమును వచిస్తారు.

**వ్యవహారరూపా సత్యతా చేత్ ప్రకృత్యాస్తదా కథం స్యాద్యదనాదిభూతా ।**
**అనాది నిత్యా యది న స్యాత్ ఖగేంద్ర! సుసూక్ష్మరూపేణ కారణం న స్యాత్ ॥29॥**

ప్రకృతికి వ్యవహారరూపమైన సత్యత్వమున్నచో, ఆమె అనాది ఎట్లు కాగలదు? ఖగరాజా! ఆమె అనాది, నిత్య కాకుండ ఉన్నచో, సుసూక్ష్మరూపమైన కారణం కూడ లేకుండపోతుంది.

**సూక్ష్మేణ రూపేణ చ కారణం స్యాత్తర్హి ప్రపంచస్య కారణం వద ।**
**అవిద్యయా వశతో విష్ణురేవ నానారూపై ర్దృశ్యతే విష్ణురేవ ॥30॥**

సూక్ష్మరూపమైన కారణం ఉంటేనే కదా! ప్రపంచానికి కారణమనేది ఉంటుంది. నీవే చెప్పు. విష్ణువు అవిద్యావశుడై ఉంటాడు. అందువలననే నానా రూపాలతో కనబడతాడు.

**శాస్త్రజ్ఞానాన్నాశమేతి హ్య విద్యా న సంశయో హరిణాచైక్యమేతి ।**
**ఏవం బ్రూషే యది వాదాత్ఖగేంద్రవక్ష్యేఽహం తే తత్ర యుక్తిం శృణు త్వమ్ ॥31॥**

శాస్త్రజ్ఞానం వలన అవిద్య నాశనం పొందుతుంది. హరితో ఐక్యం కావచ్చు సందేహంలేదు. ఖగేంద్రా! వాదంకోసమై మాటలాడదలచుకొంటే నేను నీకు అందు ఒక యుక్తిని చెబుతున్నాను. నువ్వు విను.

**సర్వజ్ఞ రూపస్య హి మే మురారేః కథం హరే ర్ఘటతే హ్యజ్ఞతా చ ।**
**సూర్యే యథా తమో నాస్తి తథా నారాయణే హరౌ ।**
**అజ్ఞానం నాస్తి పక్షీంద్ర! కథం తత్త్వం బ్రవీష్యహో ॥32॥**

మురారి, సర్వజ్ఞరూపుడు అయిన హరికి అజ్ఞత ఎట్లు ఘటించును కనుక? పక్షీంద్రా! సూర్యుని యందు ఎట్లు చీకటి ఉండదో, అదే విధంగా నారాయణుడైన హరి యందు అజ్ఞానం అనేది ఉండదు. ఇక తత్త్వ విషయంలో నీవు ఏమి వచిస్తావు కనుక?

**అతో నాహం బ్రాహ్మణస్త్వాది కాలా దుపాధి సంబంధ వశాదజ్ఞతా చేత్ ।**
**సర్వజ్ఞోఽసౌ కుత్ర పక్షీంద్ర! విష్ణురల్పజ్ఞ జీవో జ్ఞాన శూన్యశ్చ కుత్ర ॥33॥**

అందువలన నేను ఆదికాలం నుండి ఉన్న బ్రహ్మను కాకపోయినా, ఉపాధి సంబంధం వలన అజ్ఞత ఉన్నను, పక్షీంద్రా! సర్వజ్ఞుడైన విష్ణువు, అల్పజ్ఞుడైన జీవి అగుట ఎలా? జ్ఞానం లేనివాడగుట ఎలా?

**విరుద్ధయో శ్చానయోః సర్వదైవ కథం చైక్యం సంవదిష్యంతి వేదాః ।**
**దేశే కాలే సర్వదా దుఃఖహీనో జగత్కర్తా పూర్ణశక్తిః సదైవ ॥34॥**

ఎల్లప్పుడు విరుద్ధ భావాలు కలిగిన ఈ రెండింటిని వేదాలు ఎట్లు ఏకత్వాన్ని చెప్పగలవు? దేశం వలనను, కాలం వలనను ఎల్లప్పుడును దుఃఖహీనుడు కదా విష్ణువు! ఎల్లప్పుడును విష్ణువు జగత్కర్త, పూర్ణశక్తి కదా!

**జీవః సదా స్వల్ప కర్తాస్తి పూర్ణః సంసారరూపే దుఃఖ రూపే చ నిత్యమ్ ।**
**విరుద్ధయో శ్చానయోరైక్యమాహురీశస్య మాయా వశతో మాయినశ్చ ॥35॥**

దుఃఖరూపమైన సంసారమందు స్వల్పకర్తయైన జీవుడు నిత్యమూ పూర్ణుడే, ఈశ్వరునికి, మయావశుడైన అవిద్యా స్వరూపునకు; వైరుధ్యం కలిగిన వీరిరువురికీ ఐక్యాన్ని వచిస్తున్నారు.

**యే వైష్ణవా వైష్ణవ దాసవశ్యాస్తేషాం ద్రోహం సర్వదా సంచరేద్యః ।**
**హరిప్రీతిస్తేన భవేన్న నిత్యం ఆనంద వృద్ధి స్తేన భవేన్న ముక్తౌ ॥36॥**

ఎవరయితే విష్ణువుకు, విష్ణుదాసులకు సేవకులో అటువంటి వారికి ద్రోహం చేస్తూ ఎవడు ఎప్పుడూ సంచరిస్తూ ఉంటాడో, వానికి ఎప్పుడూ హరి ప్రీతి అన్నది సంభవింపదు. ముక్తి యందు వానికి ఆనందవృద్ధి కూడ కలుగదు.

**మాయీ సదా మాయిభృత్య స్తథాపి భేదజ్ఞానా న్నింద్యతే కార్యతే చ ।**
**తేనాపి తేషాం దుఃఖవృద్ధిర్భవేచ్చహ్యంధ తమః పునరావృత్తి హీనమ్ ॥37॥**

మాయి ఎటువంటివాడో, మాయి భృత్యుడు కూడ ఎల్లప్పుడు అటువంటివాడే (మాయికి మాయ వశమై ఉంటుంది. మాయి భృత్యుడు మాయకు వశమై ఉంటాడు). అయినా వారిరువురి నడుమ భేదజ్ఞానాన్ని కనబరచి చూస్తే నిందింపబడినవాడవుతాడు. అందువలన వారికి దుఃఖవృద్ధి కలుగుతుంది. అంతేకాదు తిరిగిరాని విధంగా అంధతమస్సును పొందుతాడు.

**ఖగేంద్రాతః ప్రకృతిః సూక్ష్మరూపాసా నిత్యా సా సత్యభూతా సదైవ ।**
**ఏవం స్వయం కాల వాయ్వాదికానాం పరా(రమా)ణవః సత్యరూపాశ్చ సంతి ॥38॥**

ఖగరాజా! అందువలన ప్రకృతి సూక్ష్మరూప. ఆమె నిత్య. ఆమె ఎల్లప్పుడును సత్యభూత. ఈ విధంగానే కాలుడు (కాలం), వాయువు మున్నగు వారికి కూడ స్వయంగా పరమాణువులు(పరాణువులు)సత్యరూపాలు అవుతున్నాయి.

**పరా(మాణూ)నాం లక్షణం వేదితవ్యం జ్ఞానేచ్ఛుభి ర్నాన్యథా వేదితవ్యమ్ ।**
**పదార్థానాం పార్థివానాం ఖగేంద్ర! విశేషాణాం చరమాఖ్యో విశేషః ॥39॥**

ఖగేంద్రా! జ్ఞానమును కోరువారిచే పరమాణువుల లక్షణం తెలియదగియున్నది. మరో విధంగా ఆ లక్షణం తెలియదగినది. పృథివి సంబంధమైన పదార్థముల విశేషాలలో అది చిట్టచివరి విశేషం.

**స ఏవ స్యాత్పరమాణుర్ద్విజేంద్ర**
**యోఽంత్యో వి(వ)శేషోఽవయవశ్చ స స్మృతః ॥40॥**

పక్షిరాజా! ఆ పరాణువే (విశేషమే) పరమాణువు. అది చిట్టచివరి విశేషం. అది అవయవం, అవశేషం అని కూడ స్మరింపబడుచున్నది.

**గరుడ ఉవాచ** – గరుడుడు అన్నాడు.

**హే కృష్ణ! హే మాధవ! సాత్త్వతాంపతే పదార్థానాం చరమాంశః పరాణుః ॥41॥**

**ఇతి ప్రోక్తం తత్ర మే సంశయోఽస్తి యోఽంత్యో విశేషః స తు నాంశయుక్తః ।**
**యోహ్యంశయుక్తో న తు సోఽంత్యో విశేష ఏవం మమాభాతి వచస్తు తథ్యమ్ ॥42॥**

ఓ కృష్ణా! ఓ మాధవా ! సాత్త్వతాంపతీ! పదార్థాల యొక్క చిట్టచివరి అంశం పరమాణువని నీచే చెప్పబడినది. అక్కడ నాకు ఒక సంశయం కలదు. ఏది చివరిదయిన విశేషమో, అది అంశతో కూడుకొని ఉండరాదు. ఏది అంశ సంయుక్తమైనదో అది చివరి విశేషం కాబోదు. ఈ విధమైన వచనం తథ్యంగా నాకు భాసిస్తోంది.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు ఇలా వచించాడు.

**య ఏవ లోకే సంస్థితా మానుషాస్తు విశేషాణాం దర్శనే శక్తియుక్తాః ।**
**తథాపి తే యస్య చాంశిత్వమేవ విశేషం వై నైవ ద్రష్టుం సమర్థాః ॥43॥**

లోకంలో మానుషులై(బుద్ధిమంతులై) ఉన్నవారు మాత్రమే విశేషాలను దర్శించుటలో శక్తి కలిగినవారు. వారు కూడ దివ్యాంశసంయుక్తులే. కానినాడు వారు విశేషాన్ని దర్శించుటకు సమర్థులు కారు.

**తమేవాహు శ్చరమాంశం విశేషం యే చైవ మాహుర్మునయస్తేన చాన్యే ।**
**యే కాణాదా గౌతమాద్యాః ఖగేంద్ర! నిరంశకం పరమాణుం వదంతి ॥44॥**

మునీశ్వరులూ మిగిలినవారునూ ఆ చరమాంశాన్ని విశేషంగా చెప్పుచున్నారు. ఖగరాజా! ఏ కణాదులు, గౌతమాదులు ఉన్నారో, వారు పరమాణువును నిరంశకముగా వచిస్తున్నారు.

**అనంతాంశైః సంయుతత్వేపి తాంశ్చ నిరంశినో భ్రాంతి దృష్ట్యా వదంతి ।**
**తస్మాత్పరా(రమా)ణోః పరమాణుత్వమస్తి తదంశానాం వినతాగర్భజాత! ॥45॥**

అవి అనంతాంశములతో కూడుకొని ఉన్నప్పటికిని, వాటిని నిరంకాలుగా భ్రాంతిదృష్టితో చెప్పుచున్నారు. వినతాగర్భసంభూతా! అందువలన పరాణువు యొక్క అంశలకు గూడ పరమాణుత్వం ఉంది.

**పరా(రమా) ణూనా మేకదేశే ఖగేంద్ర! తన్నో సంతి ప్రాణినాం రాశయశ్చ ।**
**ప్రత్యేకశః సంతి రూపా హరేశ్చ హ్యతశ్చ తత్పరమాణోరణీయః ॥46॥**

ఖగరాజా! పరమాణువుల యొక్క ఏకదేశంలో ప్రాణి సముదాయాలన్నీ లేవు. హరి యొక్క రూపాలు మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. అందువలన పరమాణువు కన్న అణురూపుడన్న వాక్యం వచ్చింది.

**యో వా త్వణీయాన్ పరమస్య విష్ణోః స ఏవ రూపో మహతో మహీయాన్ ।**
**తేషామన్యోన్యం న విశేషోఽస్తి కశ్చిద్ అచింత్యరూపే చ విచింతనీయః ॥47॥**

పరమాణురూపుడైన విష్ణువుకు ఏ అణుత్వం కలదో, అదే రూపంలో మహత్తు కన్న మహీయుడై కూడా యున్నాడు. ఆ రెండింటి మధ్య పరస్పరం ఏ విశేష భేదంలేదు. ఆ అచింత్యరూపుని యందు అదే గ్రహించవలసి యున్నది.

**కాలకోటి విహీనత్వం కాలానంత్యం విదుర్బుధాః ।**
**దేశకోటి విహీనత్వం దేశానంత్యం విదుర్బుధాః ॥48॥**

**గుణానామప్రమేయత్వే గుణానంత్యం విదుర్బుధాః ।**
**ఆనంత్యం త్రివిధం నిత్యం హరే ర్నాన్యస్య కస్యచిత్ ॥49॥**

కాలానికి అంచు లేకపోవటం కాలానంత్యం. దేశానికి హద్దు లేకపోవటం దేశానంత్యం గుణాలకు అప్రమేయత్వం వలన (వేరే విధంగా ప్రమాణం నిర్ణయించలేకపోవుట వలన) గుణానంత్యాన్ని జ్ఞానులు తెలిసికొంటారు. ఈ విధంగా హరికి మూడు విధాలైన ఆనంత్యంకలదు. వేరొకరికి ఇది లేదు.

**తస్య సర్వ స్వరూపేషు చానంత్యం తు త్రిలక్షణమ్ ।**
**తథాపి దేశతస్తస్య పరిచ్ఛేదోఽపి యుజ్యతే ॥50॥**

**పరిచ్ఛేద స్తథా వ్యాప్తే రేకరూపేఽపి యుజ్యతే ।**
**తస్యాచింత్యాద్భుతైశ్వర్యం వ్యవహారార్థమేవ చ ॥51॥**

ఈ విధంగా హరికి సర్వ రూపములయందు మూడు లక్షణాలతో ఆనంత్యం కలదు. అయినప్పటికి హరికి దేశం వలన పరిచ్ఛేదం కూడ చెప్పబడుచున్నది. ఒక్క రూపం నందే వ్యాపించబడి యుండుటవలన పరిచ్ఛేదం చెప్పబడుచున్నది.(నానావిధావతారాలు ధరించుట వలన) అది కూడ వ్యవహారం కోసం మాత్రమే. ఆ హరి యొక్క ఈశ్వరతత్త్వం ఆశ్చర్యకరమూ, ఊహింపరానిది,

**గుణతః కాలతశ్చైవ పరిచ్ఛేదో న కుత్రచిత్ ।**
**వ్యాప్తత్వం దేశతో హ్యస్తి సర్వభూతేషు యద్యపి ॥52॥**

గుణంవలన కాని, కాలంవలన కాని ఎప్పుడును(ఎక్కడను) పరిచ్ఛేదం సంభవింపదు. సర్వభూతములందు వ్యాపించి ఉండుటవలననే దేశంవలన మాత్రమే పరిచ్ఛేదం.

**న చ భేదః క్వచిత్తస్య హ్యణుమాత్రేఽపి యుజ్యతే ।**
**తథాపి విద్యతేఽణుత్వం తస్మాదైశ్వర్యయోగతః ॥53॥**

అతనికి భేద మనేది ఎన్నడును అణుమాత్రమునందు కూడ లేదు. అయినప్పటికిని ఐశ్వర్యయోగం కారణంగా అణుత్వం అనేది ఉన్నది.

**తస్మా ద్విద్ధ్యవతారార్థం వ్యాప్తత్వం చాపి భణ్యతే ।**
**యత్తస్య వ్యాపకం రూపం పరం నారాయణం విదుః ॥54॥**

ఇది కూడ అవతారం కోసమే అని గ్రహించు. అందు కూడ వ్యాప్తత్వం చెప్పబడుతోంది. అతని వ్యాపక రూపాన్ని పరముడైన నారాయణునిగా గ్రహిస్తారు.

**అతశ్చ పరమాణూనాం పార్థివాఽఽనంత్య వాదినామ్ ।**
**భేదః పరస్పరం జ్ఞేయ స్తథేశస్య మహాత్మనః ॥55॥**

అందువలన ఆనంత్యముచే చెప్పబడే పార్థివసంబంధమైన పరమాణువులకు పరస్పరం భేదమున్నట్లు తెలియవలసియున్నది. అదే విధంగా వాటికి, మహాత్ముడైన ఈశ్వరునకూ భేదం.

**జడేశయోర్జడానాం చ జీవానాం చ పరస్పరమ్ ।**
**తథైవ జడజీవనాం నిత్యం భేదో జడేశయోః ॥56॥**

జడమునకు ఈశునకు, జడములకు జీవములకు పరస్పరం భేదం కలదు. అట్లే జడజీవములకు జడమునకు ఈశునకు ఎల్లప్పుడు భేదమే.

**పంచభేదా ఇమే నిత్యం సర్వావస్థాసు సర్వశః ।**
**ఏతాదృశ్యాం తు మాయాయాం వీర్యామాధత్త వీర్యవాన్ ॥57॥**

**పురుషాఖ్యో హరిస్తస్మాత్ త్రిగుణానసృజత్ప్రభుః ॥58॥**

ఈ విధంగా సర్వావస్థలలోను, అంతటనూ, ఇట్లు నిత్యమూ పంచ భేదాలు కలవు. ఇటువంటి మాయయందు వీర్యవంతుడైన హరి వీర్యమును ధరింపజేశాడు(ఉంచాడు). పిమ్మట ప్రభువైన పురుషుడని చెప్పబడే ఆ హరి త్రిగుణాలను సృజించాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే భగవద్వీర్య స్వరూప తదాధాన ద్వారక గుణత్రయ సృష్టి జడేశ భేదాది నిరూపణం నామ తృతీయోఽధ్యాయః ॥3॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో భగవానునివీర్యస్వరూపం దాని ఆధానం గుణత్రయ సృష్టి జడేశ భేదం మున్నగు వాటిని నిరూపించే మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్థోऽధ్యాయః** – నాల్గవ అధ్యాయం

## **గుణవైషమ్యగుణసామ్యనిరూపణమ్** – త్రిగుణాల సామ్యవైషమ్యాల నిరూపణ

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీ కృష్ణుడు వచించాడు.

**యథా ససర్జ భగవాం స్త్రీన్ గుణాన్ ప్రకృతే స్తదా ।**
**లక్ష్మీ స్త్రిరూపా సంభూతా శ్రీభూదుర్గేతి సంజ్ఞితా ॥1॥**

భగవంతుడు ప్రకృతి ద్వారా మూడు గుణాలు సృజించాడు. అపుడు లక్ష్మి మూడు రూపాలుగా శ్రీదేవి, భూదేవి, దుర్గాదేవి అనే నామాలతో ఉద్భవించింది.

**సత్త్వాభిమానినీ శ్రీస్తు భూర్దేవీ రజమానినీ ।**
**తమోऽభిమానినీ దుర్గాహ్యేవ మాహుర్మనీషిణః ॥2॥**

శ్రీదేవి సత్త్వగుణంపై అభిమానం కలది. భూదేవి రజోగుణంపై అభిమానం కలది. దుర్గాదేవి తమోగుణంపై అభిమానం కలది అని ఈ విధంగా మనీషులు వచిస్తారు.

**అంతరం న విజానీయాద్రూపాణాం చ పరస్పరమ్ ।**
**గుణానాం చైవ సంబంధా ద్దుర్గాదీనాం ఖగేశ్వర ॥3॥**

ఖగేశ్వరా! గుణాది సంబంధంచే దుర్గాదులకు, ఆ రూపాలకు పరస్పరం భేదంలేదని తెలుసుకోవాలి.

**అంతరం యే విజానంతి తే యాంత్యంధతమః పరమ్ ।**
**పురుషస్తు త్రిరూపోऽభూద్విష్ణు ర్బ్రహ్మా భవేతి సః ॥4॥**

వారి నడుమభేదం ఉన్నదని భావించిన, వారు మిక్కిలి కష్టమైన అంధతమస్సులో ప్రవేశిస్తారు. ఆ పురుషుడు కూడ విష్ణువు, బ్రహ్మ, భవుడు అనే మూడు రూపాలు కలవాడయ్యాడు.

**సత్త్వేన లోకాన్వర్ధయితుం విష్ణుః సాక్షాద్ధరిః స్వయమ్ ।**
**సృష్టిం కర్తుం చ రజసా బ్రహ్మణి ప్రావిశద్ధరిః ॥5॥**

హరి సాక్షాత్తు స్వయంగా విష్ణువై సత్త్వగుణంతో లోకాలను ఉద్ధరించుటకు (పూనుకున్నాడు). హరి రజోగుణంతో సృష్టి చేయుటకు బ్రహ్మయందు ప్రవేశించాడు.

**ఆద్యో బ్రహ్మా స విజ్ఞేయో న తు సాక్షాద్ధరిః స్వయమ్ ।**
**తమసాపి సమాస్వంతుం రుద్రే చ ప్రావిశద్ధరిః ॥6॥**

అందువలన ఆ బ్రహ్మ ఆద్యుడని తెలుసుకోవాలి. స్వయంగా సాక్షాత్తు హరియైననూ ఆద్యుడు కాదు. ఆ హరియే తమోగుణంతో అందరిని సంహరించుటకై రుద్రునిలో ప్రవేశించాడు.

**రుద్రే స్థితో రుద్రసంజ్ఞో న రుద్రస్తు హరిః స్వయమ్ ।**
**విష్ణురేవ హరి స్సాక్షాత్ తావుభౌ న హరీ స్మృతౌ ॥7॥**

రుద్రునియందుండే హరి రుద్రుడనే పేరు కలవాడు. హరి స్వయంగా రుద్రుడు మాత్రం కాదు. విష్ణువే సాక్షాత్తు హరి. బ్రహ్మరుద్రు లిరువురూ హరి యని స్మరింపబడరు.

**ఆవిష్టరూపౌ విజ్ఞేయౌ బ్రహ్మరుద్రాభిధాయకౌ ।**
**ఏవం జ్ఞాత్వా మోక్షమేతి నాన్యథా తు కథంచన ॥8॥**

బ్రహ్మ, రుద్రుడు అని చెప్పబడేవారు హరిచే ఆవిష్కరింపబడేవారుగా తెలుసుకోవాలి. ఈ విధంగా తెలిసినవాడు మోక్షంపొందుతాడు. మరో విధంగా ఎన్నడునూ కాదు.

**విష్ణు బ్రహ్మాది రూపాణామైక్యం జానంతి యే ద్విజాః ।**
**తే యాంతి నరకం ఘోరం పునరావృత్తి వర్జితమ్ ॥9॥**

విష్ణు,బ్రహ్మ,రుద్ర రూపాలను ఒకటిగా భావించిన ద్విజులు తిరిగిరాని ఘోరనరకంలో ప్రవేశిస్తారు.

**గుణత్రయం ప్రవిష్టస్తు పురుషో హరి రవ్యయః ।**
**కార్యోన్ముఖం యథా భూయాత్ క్షోభయామాస వై తథా ॥10॥**

గుణత్రయాన్ని ప్రవేశించే పురుషుడు అవ్యయుడైన హరి మాత్రమే. జగత్కార్యమునకు పూనుకొన్నప్పుడు మూడు గుణాలకు క్షోభ (వికాసం) కలుగజేస్తాడు.

**జాత క్షోభాద్భగవతో మహానాసీద్గుణత్రయాత్ ।**
**గుణత్రయే విద్యమానాద్భాగాదేవ న సంశయః ॥11॥**

భగవంతుని వలన కలిగిన ప్రేరణ వలన, ఆ గుణత్రయంవలన మహత్తు ఏర్పడింది. గుణత్రయం భాసిస్తూండగా, ఆ భాగంనుండి అది సంభవించింది. సంశయంలేదు.

**మహతో బ్రహ్మ వాయూ చ జజ్ఞాతే స్వాభిమానినౌ ।**
**తస్య సంవత్సరాత్పశ్చాద్యమలౌ సంబభూవతుః ॥12॥**

మహత్తు వలన తమతమయందు అభిమానం కలిగిన బ్రహ్మ వాయువులు ఉద్భవించారు. ఒక సంవత్సరం గడిచిన తరువాత ఆ మహత్తుకు ఆ జంట కలిగింది.

**రజః ప్రధానం యత్తత్త్వం మహత్తత్త్వమితీరితమ్ ।**
**సర్గంత్విమం విజానీయాద్గుణ వైషమ్యనామకమ్ ॥13॥**

రజః ప్రధానమైన ఏ తత్త్వమయితే ఉన్నదో, అదే మహత్తత్త్వమని చెప్పబడినది. ఈ సర్గను గుణవైషమ్యమనే పేరుగల దానినిగా తెలియాలి.

**గరుడ ఉవాచ** – గరుడుడు పలికాడు.

**మహత్తత్త్వ స్వరూపస్య జ్ఞానార్థం దేవకీ సుత! ।**
**త్వయోక్తా గుణ వైషమ్యా నామికా సృష్టిరుత్తమా ॥14॥**

**గుణవైషమ్య శబ్దార్థం మమ బ్రూహి మహాప్రభో ।**

దేవకీనందనా! మహత్తత్త్వ స్వరూపం తెలియటానికి సంబంధించిన అర్థం నీచే చెప్పబడినది. గుణవైషమ్యమనే పేరుగల సృష్టి ఉత్తమమైనది. మహాప్రభూ! గుణవైషమ్య శబ్దం యొక్క అర్థం నాకు వివరించు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**గుణవైషమ్య శబ్దార్థ జ్ఞాపనాయ ఖగేశ్వర! ॥15॥**

**ఆపేక్షితం చ తత్రాదౌ గుణసామ్యం న సంశయః ।**
**సమ్యగ్ జ్ఞాపయితుం తత్ర ఖాదౌ తావత్ఖగేశ్వర ॥16॥**

పక్షిరాజా! గుణవైషమ్య శబ్దం యొక్క అర్థం తెలుసుకొనుటకై అందు మొదట గుణసామ్యం యొక్క అర్థం ఆపేక్షించవలసియుంది. ఖగరాజా! అందు సందియంలేదు. అది చక్కగా తెలియబడుటకు ముందు ఆకాశాదుల యందు (ఇంద్రియాదుల యందు) జరిగే గుణసామ్యవైషమ్యాలను కూడ తెలియాలి.

**రాశీభూతం గుణానాం తు దర్శయిష్యే స్థితం చ వై ।**
**రాశీభూతస్య తమసః సకాశాద్వినతా సుత ॥17॥**

**రాశీభూతం రజో జ్ఞేయం ద్విగుణం తత్తు నాన్యథా ।**
**రాశీభూతస్య రజసః సకాశాద్వినతాసుత ॥18॥**

**రాశీభూతం తథా సత్త్వం ద్విగుణం సముదాహృతమ్ ।**
**మూలప్రకృతిజాహ్యేతే న మూలా ప్రకృతిః స్మృతా ॥19॥**

రాశీభూతమైన గుణాల యొక్క స్థితిని ముందు తెలియజేస్తాను. వినతానందనా! రాశీభూతమైన తమస్సుతో సమానంగా రాశీభూతమైన రెండురెట్లు రజస్సు ఏర్పడింది. అది మరో విధంగా వచ్చినది కాదు. వినతాసుతా! రాశీభూతమైన రజస్సుతో సమానంగా అలాగే రెండురెట్లు సత్త్వం ఏర్పడింది. ఈ మూడునూ మూల ప్రకృతినుండి పుట్టినవి. మూలం మాత్రం ప్రకృతిగా స్మరింపబడదు.

**యతః ప్రకృతి రూపాణాం పరిచ్ఛేదో న విద్యతే ।**
**అతః ప్రకృతిజా జ్ఞేయా న మూలాస్తే ఖగేశ్వర! ॥20॥**

ఖగరాజా! ప్రకృతి రూపాలకు పరిచ్ఛేదం(ఖండింపబడుట) లేని కారణంచే, ఆ మూడింటిని ప్రకృతి జన్యాలుగా తెలియాలి. అవి మాత్రం మూలాలు కావు.

**ఏవం తవ గుణానాం చ పరిమాణం ఖగేశ్వర ।**
**ఉక్తం స్వరూపం తేషాం తు తవ సమ్యక్ ఖగేశ్వర ॥21॥**

పక్షీంద్రా! ఇట్లు నీకు గుణాల యొక్క పరిమాణం, వాటి స్వరూపం చక్కగా తెలియజేయబడినది.

**తత్ర రాశిత్రయే సత్త్వం కేవలం సముదాహృతమ్ ।**
**రజస్తమోభ్యాం గరుడ హ్యవిమిశ్రం హ్యతస్తు తత్ ॥22॥**

గరుడా! అక్కడ గుణరాశిత్రయమునందు రజస్తమోగుణాలచే కలియకుండా ఉండే కారణంచే సత్త్వం కేవలంగా చెప్పబడినది.

**కేవలం సత్త్వమిత్యుక్తం న తు శ్రేష్ఠత్వతః ప్రభో ।**
**సృష్టికాలే కేవలం స్యాత్ ప్రలయే మిశ్రితం భవేత్ ॥23॥**

పక్షిప్రభూ! సత్త్వం కేవలంగా చెప్పబడినది. శ్రేష్ఠత్వంచేత మాత్రం కాదు. సృష్టికాలంలో కేవలంగా ఉండే సత్త్వమే ప్రలయమునందు మిశ్రితమవుతుంది.

**సర్వదాప్యవిమిశ్రం చ సత్త్వరాశిం ఖగేశ్వర! ।**
**సర్వదాపి విమిశ్రం చ సత్త్వరాశిం ద్విజోత్తమ! ॥24॥**

**యే విజానంతి తే సర్వే విశంతి హ్యధరం తమః ।**
**రజస్తమోగుణౌ వీంద్ర! ఇతరాభ్యాం విమిశ్రితౌ ॥25॥**

ఖగేశ్వరా! సత్త్వరాశిని ఎల్లప్పుడు అమిశ్రంగానే తెలియాలి. ద్విజోత్తమా! ఎవరయితే సత్త్వరాశిని ఎల్లప్పుడు విమిశ్రంగా భావిస్తారో, వారు అంధతమస్సులో ప్రవేశిస్తారు. పక్షిరాజా! రజస్తమోగుణాలు మిగిలిన వాటితో కలుస్తాయి.

**సృష్టౌ ప్రలయకాలేఽపి మిశ్రావేవ ఖగేశ్వర! ।**
**రాశిభూతేఽపి రజసి రజోభాగాచ్ఛతాధికమ్ ॥26॥**

**సత్త్వం చ మిశ్రితం జ్ఞేయం నాన్యథ పక్షిసత్తమ! ।**
**రజసః శతభాగానాం మధ్యే తు వినతాసుత ॥27॥**

ఖగేశ్వరా! సృష్టియందు, ప్రలయకాలమునందు అవి మిశ్రమాలై ఉంటాయి. పక్షిసత్తమా! రాశీభూతమైన రజస్సు నందు రజోభాగం కన్న శతాధికంగా సత్త్వం మిశ్రితమై ఉన్నది! మరో విధంగా కాదు. వినతానందనా! రజస్సు యొక్క శతభాగముల మధ్యలో అది మిశ్రమై ఉన్నది.

**య ఏకో భాగ ఉద్దిష్ట స్తావత్పరిమితం తమః ।**
**రాశిభూతేఽపి రజసి మిశ్రితం పరికీర్తితమ్ ॥28॥**

**రజోరాశి స్థితిస్త్వేవం తాత! వ్యాప్తం తమోగుణైః ।**
**రాశిభూతేఽపి తమసి సత్త్వం చ వినతాసుత! ॥29॥**

అందు ఏ ఒక్క భాగం విధింపబడినదో దానికిమాత్రమే తమస్సు పరిమితమై ఉన్నది. ఇట్లు రాశీభూతమైన రజస్సు నందు మిశ్రమత్వం పేర్కొనబడుతోంది. వినతానందన! నాయనా! రజోరాశియొక్క స్థితి ఇటువంటిది. ఇట్లు అది తమోగుణాలచే వ్యాపింపబడింది. అట్లే రాశీభూతమైన తమస్సు నందు సత్త్వం కూడ.

**తమఃసకాశాద్గరుడ! దశ భాగాదికేన చ ।**
**మిశ్రితం భవతీత్యేవం జ్ఞాతవ్యం నాత్ర సంశయః ॥30॥**

**తమసో దశభాగానాం మధ్యే తు వినతాసుత! ।**
**య ఏకో భాగ ఉద్దిష్ట స్తావత్పరిమితం రజః ॥31॥**

**రాశిభూతేఽపి తమసి మిశ్రితం భవతి ధ్రువమ్ ।**
**తమోరాశి స్థితిస్త్వేవం జ్ఞాతవ్యా పక్షిసత్తమ! ॥32॥**

గరుడా! తమస్సుతో సమానంగా పది భాగాలకన్న ఎక్కువగా అది మిశ్రితమై ఉన్నదని తెలియాలి. అందు సందేహంలేదు. వినతానందనా! తమస్సు యొక్క పది భాగాల మధ్యలో ఒకభాగం వరకు మాత్రమే రజస్సు పరిమితమై ఉన్నది. ఇట్లు రాశీభూతమైన తమస్సునందు నిశ్చయంగా తమస్సు కలదు. పక్షిశ్రేష్ఠుడా! ఈ విధంగా తమోరాశియొక్క స్థితిని గూర్చి తెలియవలసి ఉంది.

**గరుడ ఉవాచ -** గరుడుడు అడిగాడు.

**రాశిభూతేఽపి రజసి రాశిభూతే తమస్యపి ।**
**సత్త్వాంశా హ్యధికాః సంతీత్యేవముక్తం మయానఘ ॥33॥**

**తత్ర మే సంశయో హ్యస్తి శృణు త్వం సాత్త్వతాంపతే ।**
**యద్రాశ్యాం యద్రాశి భాగా హ్యధికాః సంతి యావతా ॥34॥**

**తావతా వ్యవహారః స్యాత్ క్షీర నీరమివ ప్రభో! ।**
**శ్రుత్వా స గరుడే నోక్తం భగవాన్పురుషోత్తమః ॥35॥**

**ఉవాచ పరమ ప్రీత్యా సంస్తువన్ గరుడం హరిః ।**

"అనఘా! రాశీభూతమైన రజస్సు నందు, రాశీభూతమైన తమస్సు నందు సత్త్వాంశాలు అధికంగా ఉన్నాయని నాకు చెప్పడం జరిగింది. అక్కడ నాకు ఒక సంశయం ఉంది. సాత్త్వతాంపతీ! ప్రభూ! నీవు దీనిని విను. ఏ రాశియందు ఏ రాశి భాగాలు ఎంత అధికంగా ఉన్నాయో, అదంతా క్షీర నీర వ్యవహారమా!". గరుడునిచే వచింపబడిన దానిని విని భగవంతుడైన పురుషోత్తముడు (ఇలా అన్నాడు).

**శ్రీకృష్ణ ఉవాచ -** శ్రీకృష్ణుడు పలికాడు.

**రజోరాశ్యా తమో రాశ్యా సత్త్వరాశ్యధికా సదా ॥36॥**

**మిశ్రితం చాపి పక్షీంద్ర న సత్త్వమితి కీర్త్యతే ।**
**రజోరాశి స్తమోరాశి రిత్యేవం విబుధా విదుః ॥37॥**

పక్షీంద్రా! రజోరాశికన్న తమోరాశి కన్న సత్త్వరాశి ఎల్లప్పుడు ఎక్కువయినదే. అంతేకాదు సత్త్వం మిశ్రితం కాదని కూడ కీర్తింపబడుతోంది. రజోరాశి, తమోరాశి మాత్రమే మిశ్రితాలని పండితులు గ్రహిస్తారు.

**విషం తు చ తుదుగ్ధస్థం విషమిత్యుచ్యతే యథా ।**
**ఏవం మయోక్త గరుడ! గుణానాం నిజ సంస్థితిః ॥38॥**

గరుడా! పాలలో ఉండే విషం విషమని చెప్పబడినట్లుగా, గుణముల యొక్క యథార్థస్థితి నాచే చెప్పబడింది.

**సామ్యవస్థాం గుణానాం చ శృణ్విదానీం ఖగేశ్వర! ।**
**రాశీకృతాచ్చ రజసః జన్యం యచ్చ ఖగేశ్వర ॥39॥**

**మహత్తత్త్వే ప్రవిష్టం చ యద్రజః పరికీర్తితమ్ ।**
**ప్రలయే సమనుప్రాప్తే మహత్తత్త్వే స్థితం రజః ॥40॥**

**ద్వాదశాంశేన తు హ్యద్ధా విభక్తం భవతి ప్రభో ।**
**రాశీ భూతే హి సత్త్వే తు దశ భాగేన మిశ్రితమ్ ॥41॥**

ఖగరాజా! ఇప్పుడు గుణాల యొక్క సామ్యావస్థను విను. పక్షీంద్రా! రాశీకృతమైన రజస్సునుండి ఏది పుట్టినదో అది మహత్తత్త్వంలో ప్రవేశించిన రజస్సుగా పేర్కొనబడింది. ప్రలయం సంప్రాప్తిస్తూఉండగా మహత్తత్త్వంలో ఉన్న రజస్సు పక్షిప్రభూ! పంద్రెండు భాగాలుగా విభజింపబడినది. రాశీభూతమైన సత్త్వము నందు పదో భాగంచే సమ్మిశ్రితమయింది.

**సమ్యగ్భవతి పక్షీంద్ర! తథైకాంశేన చాండజ! ।**
**తమో రాశ్యా మిశ్రితం చ భవత్యేవ న సంశయః ॥42॥**

పక్షిరాజా! అండజా! అదే విధంగా ఒక అంశచే తమోరాశిలో కలిసింది. ఇందు సంశయమన్నది లేదు.

**అన్యైనైకేన భాగేన రజో రాశ్యా ఖగేశ్వర! ।**
**మిశ్రితం భవతీత్యేవం జ్ఞాతవ్యం నాన్యథా క్వచిత్ ॥43॥**

**గుణత్రయేఽపి భగవాన్ మహత్తత్త్వస్య చాండజ! ।**
**ఏవం లయస్తు జ్ఞాతవ్యో హృది తత్త్వార్థవేదిభిః ॥44॥**

ఖగేశ్వరా! మరొక ఇతర భాగంచే రజోరాశిలో సమ్మిశ్రితమైనదని తెలుసుకొనదగినది. మరో విధంగా ఎన్నడును కాదు. అండజా! గుణత్రయము నందును, మహత్తత్త్వం యొక్క అస్తిత్వమే భగవంతుడు. తత్త్వనిర్ణయం తెలిసినవారిచే ఈ విధంగా లయం కూడ అవుతుందని మనసా తెలియబడుతోంది.

**ఏవం గుణత్రయాణాం చ మిశ్రితత్వాత్ ఖగేశ్వర! ।**
**గుణసామ్యమితి ప్రాహురేవం జానీహి వై ఖగ! ॥45॥**

**అన్యథా యే విజానంతి తే యాంతి హ్యధరం తమః ।**

ఖగేశ్వరా! ఇట్లు గుణత్రయం యొక్క కలయికనే గుణసామ్యమని వచిస్తారు. ఆకాశసంచారీ! నీవు కూడ ఇట్లే తెలిసికొనుము. ఇలా కాకుండా మరో విధంగా తెలుసుకునే వారు అంధ తమస్సులోనికి ప్రవేశిస్తారు.

**గరుడ ఉవాచ –** గరుడుడు పలికాడు.

**రాశీకృత గుణానాం చ త్రయాణాం పరమేశ్వర! ॥46॥**

**విశాలానాం పరం బ్రహ్మ న్ప్రలయే గుణసామ్యతా ।**
**కథం బ్రూహి మహాభాగ ఏతత్తత్త్వం సమాసతః ॥47॥**

అంతట గరుడుడు ఇలా ప్రశ్నించాడు పరమేశ్వరా! పరంబ్రహ్మమా! ఎంతో విస్తీర్ణత కలిగి రాశీభూతములైన మూడు గుణాలకు ప్రలయమందు గుణసామ్యత ఎట్లు కలుగుతుంది? ఈ తత్త్వమును అంతటను సంక్షిప్తముగాచెప్పవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**రాశీభూత గుణానాం తు త్రయాణామపి సత్తమ ।**
**తదా విమిశ్రితత్త్వేన హ్యవస్థానం విదుర్బుధాః ॥48॥**

సత్తమా! (శ్రేష్ఠుడా!) రాశీభూతములైన మూడు గుణముల యొక్క విశేషమయిన కలయికచే ఒక ప్రత్యేకమైన ఉనికి ఏర్పడుతుందని బుధులు గ్రహిస్తారు.

**ఇదానీం గుణవైషమ్యం శృణు సమ్యఙ్మమ ప్రియ! ।**
**సృష్టికాలే తు సంప్రాప్తే యత్పూర్వం ప్రలయే ఖగ! ॥49॥**

**దశభాగైశ్చ సత్త్వే తు మిశ్రితం యద్రజ స్తథా ।**
**తమస్యప్యేక భాగేన ప్రవిష్టం యత్తు తద్రజః ॥50॥**

**రజస్యప్యేకభాగేన ప్రవిష్టం యచ్చ తద్రజః ।**
**ఏవం ద్వాదశభాగైశ్చ ప్రవిష్టం సర్వశో రజః ॥51॥**

నాకు ఇష్టమైనవాడా! ఇప్పుడు గుణవైషమ్యమును చక్కగా వినవలసింది. ఖగా! సృష్టికాలం సంప్రాప్తించగా పూర్వంలో ప్రలయము నందువలె ఏ రజస్సు అయితే ఉన్నదో, అది పది భాగాలతో సత్త్వంలో కలుస్తుంది. అట్లే ఆ రజస్సు, తమస్సు నందు ఒక భాగంలో ప్రవేశిస్తుంది. ఆ రజస్సే ఒక భాగంతో (మిశ్రమవుతున్న) రజస్సు లోనికి ప్రవేశిస్తుంది. ఈ విధంగా పండ్రెండు భాగాలతో రజస్సు అంతటను ప్రవేశిస్తుంది.

**సత్త్వస్తై ర్దశ భాగైశ్చ తథైకేన రజోఽ౦శినా ।**
**ఏవమేకాదశైర్భాగై స్తమస్థాంశేన వై ద్విజ ॥52॥**

**మిశ్రితం భవతి హ్యద్ధా మహత్తత్త్వం తదా స్మృతమ్ ।**
**ఏతదన్యో విశేషశ్చ మన్తవ్యో వినతా సుత ॥53॥**

ద్విజా! (పక్షీ!) సత్త్వమునందున్న పది భాగములతోను, అట్లే రజస్సు యొక్క ఒక అంశతోను, ఇట్లే ఏకాదశ భాగములతో తమోగుణమునందున్న ఒక అంశతోను సత్యబద్ధంగా మహత్తత్త్వం సమిశ్రితమవుతుందని స్మరింపబడినది. వినతానందనా! మరోవిశేష విషయం మననం చేయదగియున్నది.

**ఏకాంశస్తామసో జ్ఞేయో మహత్తత్త్వే న సంశయః ।**
**ఏవం త్రయోదశైర్భాగై ర్మిశ్రితం తచ్చ సత్తమ ॥54॥**

**ఏవ మేత ద్విజానీయాన్నాన్యథా తు కథంచన ।**

మహత్తత్త్వము నందు ఒక అంశమై తామసం ఎప్పుడూ ఉంటుంది. సంశయంలేదు. మిక్కిలి శ్రేష్ఠమైనవాడా! ఈ విధంగా మహత్తత్త్వము పదమూడు భాగములతో మిశ్రితమైఉన్నది. దీనిని ఇట్లు విశేషంగా తెలుసుకోవాలి. ఎన్నడును మరో విధంగా భావింపరాదు.

**గరుడ ఉవాచ –** గరుడుడు అడిగాడు.

**చతుర్ముఖాచ్ఛ్రుతం పూర్వం భగవన్ సాత్త్వతాంపతే ॥55॥**

**చతుర్భాగాత్సముత్పన్నం మహత్తత్త్వమితి ప్రభో ।**
**తత్రై కాంశస్తమః ప్రోక్తః త్రిభాగో రజ ఏవ చ ॥56॥**

భగవంతుడా! సాత్త్వతాంపతీ! ప్రభూ! పూర్వం చతుర్ముఖుని వలన వినడం జరిగింది. చతుర్భాగం నుండి మహత్తత్త్వం ఉద్భవించిందని, అందు ఒక భాగం తమస్సు అని, మూడు భాగాలు రజస్సు అని (విన్నాను).

**తదాహుర్బ్రహ్మణో రూపం గుణవైషమ్య నామకమ్ ।**
**చతుర్భాగాత్మకం ప్రోక్తం మహత్తత్త్వం శ్రుతం మయా ॥57॥**

**త్రయోదశాంశైః సంభూతమితి ప్రోక్తం త్వయానఘ ।**
**తదేతత్సంశయం ఛింధి కృపాలో! భక్తవత్సల! ॥58॥**

అది గుణవైషమ్యం అనే పేరుగల బ్రహ్మ యొక్క రూపమని చెబుతారు. మహత్తత్త్వం నాలుగు భాగాలతో ఉంటుందని నేను విన్నాను. భక్తవత్సలా! కృపాలూ! అనఘా! అది పదమూడు అంశములతో ఉద్భవించిందని నీవు చెప్పుట జరిగింది. ఈ సంశయాన్ని త్రుంచివేయవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీ కృష్ణుడు వచించాడు.

**బ్రహ్మోక్తస్య మయోక్తస్య వివాదో నాస్తి సర్వథా ।**
**మూలసత్త్వే మిశ్రితం చ దశభాగేన యద్రజః ॥59॥**

**తత్సర్వం చ మిలిత్వైవ త్వేకో భాగస్తు కీర్తితః ।**
**మూలే రజసి యచ్చోక్తో రజోభాగః ఖగేశ్వర ॥60॥**

**భాగే ద్వితీయే విజ్ఞేయ స్తతో నాత్ర సంశయః ।**
**మూలే తమసి యచ్చోక్తో రజోభాగస్తథైవ చ ॥61॥**

**తృతీయభాగో విజ్ఞేయో నాత్ర కార్యా విచారణా ।**
**తథా మూలే చ తమసి హ్యేకో భాగస్తమః స్మృతః ॥62॥**

బ్రహ్మచే వచింపబడిన దానికిని, నాచే చెప్పబడిన దానికిని ఎన్నడును వివాదం (భేదము) లేదు. మూల సత్త్వము నందు కలిసిన ఏ పది భాగముల రజస్సు ఉన్నదో, అదంతయును కలసి ఒక భాగంగా పేర్కొనబడింది. ఖగరాజా! అట్లే మూల రజస్సునందు ఏ రజో భాగం ఉన్నదని చెప్పబడిందో అది రెండోభాగమయిన రజస్సుగా పేర్కొనబడింది. సంశయంలేదు. అట్లే మూల తమస్సు నందు కలసిన రజో భాగం మూడవ భాగంగా పేర్కొనబడింది. ఇందు ఆలోచించవలసినదేమియును లేదు. అదే విధంగా మూలమైన తమస్సులో ఒక భాగం తమస్సు (నాలుగో భాగంగా) ఉన్నది.

**ఏవం త్రిభాగో రజసః ఏకాంశ స్తమసః స్మృతః ।**
**తదాహు ర్బ్రహ్మణో దేవం గుణ వైషమ్యనామకమ్ ॥63॥**

ఇట్లు మూడు భాగాలు రజస్సుకు సంబంధించినవి, ఒక భాగం తమస్సుకు సంబంధించినది అని గ్రహించాలి. దానిని గుణవైషమ్యమనే పేరు కల్గిన బ్రహ్మ యొక్క దేహమని వచిస్తారు.

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**మహత్తత్త్వస్య చత్వారో భాగాస్తేషు రజస్త్రయః ।**
**తమసస్త్వేక ఏవేతి త్వయోక్తం గరుడధ్వజ ॥64॥**

గరుడధ్వజా! మహత్తత్త్వమునకు నాలుగు భాగాలని, వాటియందు రజస్సు మూడు భాగాలని, తమస్సు ఒక భాగమని నీచే చెప్పబడింది.

**రజోభాగాత్మకో దేహో బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**ఇతి ప్రతీయతే బ్రహ్మన్ వచనాత్తవ మాధవ ॥65॥**

మాధవా! బ్రహ్మా! పరమేష్ఠి అయిన బ్రహ్మ యొక్క దేహం నీ వచనముల వలన రజోభాగాత్మకమైనదని ప్రతీయమానమగుచున్నది.

**శుద్ధసత్త్వాత్మకో దేహో బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**ఏవం హి శ్రూయతే కృష్ణ! సంశయో మేఽత్ర బాధతే ॥66॥**

**తమేవం సంశయం ఛింధి యద్ధి తచ్ఛ్రోతుమర్హతి ।**

కృష్ణా! పరమేష్ఠి అయిన బ్రహ్మ యొక్క దేహం శుద్ధ సత్త్వాత్మకమైనదని అంటారు. ఇక్కడ ఈ సంశయం నన్ను బాధిస్తోంది. దానిని నేను వినుటకు తగినవాడనైతే ఆ సంశయాన్ని తుడిచివేయవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**త్రిభాగ భూతే రజసి తథా ద్వాదశధాపి చ ॥67॥**

**రజసోపేక్షయా సత్త్వం దశాంశాధికమేవ చ ।**
**ప్రవిష్టమస్తీతి ఖగ! జ్ఞాతవ్యం తచ్ఛృణు ద్విజ! ॥68॥**

త్రిభాగభూతమైన రజస్సు నందు, అలాగే పండ్రెండు భాగములు కలిగిన మిశ్రమము నందు రజస్సుకన్న సత్త్వం పది భాగములు ఎక్కువగా ఉన్నది. ఖగమా! అది అలా ప్రవేశించినట్లుగా తెలియవలసియుంది. ద్విజా! దానిని విను.

**తమసోపేక్షయా సత్త్వం దశాంశాధికమేవ వై ।**
**ప్రవిష్టమస్తీతి ఖగ! వక్తవ్యం నాత్ర సంశయః ॥69॥**

ఖగమా! తమస్సు సత్త్వకన్న పది భాగాలుఎక్కువగా మిశ్రమంలో ప్రవేశించినదని చెప్పవలసియుంది. అందు సంశయం లేదు.

**తమసోపేక్షయా తత్ర తమ ఏకాదశం స్మృతమ్ ।**
**ఏకాంశస్తు రజో జ్ఞేయమేవ మాహుర్మనీషిణః ॥**
**ఏవం చ మిలితాన్భాగాన్ వక్ష్యే శృణు మహామతే! ॥70॥**

తమస్సునకు సంబంధించి మిశ్రమంలో పదకొండవ భాగం తమస్సుగా స్మరింపబడుతోంది. ఒకభాగం రజస్సుగా తెలియజేయబడుతోంది. అని మనీషులు చెబుతున్నారు. ఈ విధంగా కలిసిన భాగాలను చెప్పుచున్నాను మహామతీ! విను.

**మహత్తత్త్వ సముత్పత్తౌ ఉపాదానం ఖగేశ్వర! ।**
**త్రయోదశాంశా విజ్ఞేయా ద్వాదశాంశం రజఃస్మృతమ్ ॥71॥**

ఖగరాజా! మహత్తత్త్వంయొక్క పుట్టుకలో అవి ఉపాదానకారణాలు.అవి పదమూడు భాగాలని తెలియాలి. అందు పండ్రెండో భాగం రజస్సు అని వ్యవహరింపబడుతోంది.

**ఏకాంశ స్తమసో జ్ఞేయ స్తత్ర భాగాఞ్ఛృ (న్+శృ) ణు ద్విజ ।**
**ఆదౌ తు ద్వాదశాంశేషు భాగాన్ వక్ష్యామి తచ్ఛృణు ॥72॥**

అందు ఒకభాగం తమస్సుగా తెలుసుకోవాలి. అక్కడ ఉండే భాగాలగురించి విను. ముందుగా ద్వాదశాంశములలో ఉండే భాగాలను చెప్తున్నాను. వాటిని విను.

**ఏకాంశస్తమసో జ్ఞేయ స్తద్దశాంశాధికం రజః ।**
**తచ్ఛతాంశాధికం సత్త్వమేవ మాహుర్మనీషిణః ॥73॥**

'ఒక అంశను తమస్సుగా తెలియాలి. దానికన్న పది అంశాలు ఎక్కువని రజస్సును గ్రహించాలి. దాని కన్న నూరు అంశాలు ఎక్కువ సత్త్వమని భావించాలి'. అని మనీషులు వచిస్తారు.

**ఏకాంశ తమసి హ్యేవం విభాగాఞ్ఛృణుసత్తమ ।**
**ఏకాంశస్తు రజోజ్ఞేయ స్తమోహ్యేకాదశాధికమ్ ॥74॥**

**తమోభాగస్తు విజ్ఞేయా స్తద్దశాంశాధికః స్మృతః ।**
**సత్త్వభాగ ఇతిజ్ఞేయో మహత్తత్త్వే ఖగేశ్వర! ॥75॥**

సర్వశ్రేష్ఠుడా! ఒక అంశమైన తమస్సునందుండే విభాగాలను ఇట్లు విను. ఒక అంశ రజస్సుగా తెలియాలి. తమస్సు దానికన్న పదకొండు భాగాలు అధికం. ఈ విధంగా తమో భాగాలు గురించి తెలుసుకోవాలి. ఖగేశ్వరా! మహత్తత్త్వమందు వాటి కన్న పది భాగములు అధికంగా సత్త్వభాగమున్నదని గ్రహించాలి.

**సత్త్వాంశో బహులో యస్మాచ్ఛుద్ధసత్త్వం చతుర్ముఖః ।**
**ఉత్పత్తిర్మహతశ్ప్రోక్తా ఏవం చ వినతాసుత! ॥76॥**

**తజ్ఞానాన్మోక్షమాప్నోతి నాన్యథా తు కథంచన ॥77॥**

సత్త్వాంశం బహులంగా ఉన్న కారణముచే చతుర్ముఖుడు శుద్ధ సత్త్వం. వినతానందనా! మహత్తత్త్వం యొక్క ఉత్పత్తి ఈ విధంగా చెప్పబడినది. దానిని తెలియుట వలననే మోక్షం. ఎన్నడును మరో విధంగా కాదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే గుణవైషమ్య భేద బ్రహ్మదేహస్వరూప గుణసామ్యనిరూపణం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో గుణవైషమ్యభేదం బ్రహ్మదేహస్వరూపం గుణసామ్యనిరూపణం అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచమోఽ ధ్యాయః - అయిదవ అధ్యాయం

## తత్త్వాభిమానిదేవతోత్పత్తిః తారతమ్యనిరూపణం చ -

తత్త్వాలను అభిమానించే దేవతల పుట్టుక తారతమ్యం

**ఏతాదృశే మహత్తత్త్వే లక్ష్మ్యా సహ హరిః స్వయమ్ ।**
**ప్రవివేశ మహాభాగ! క్షోభయామాస వై హరిః ॥1॥**

మహాభాగా! ఇటువంటి మహత్తత్త్వము నందు స్వయంగా హరి లక్ష్మితో కలసి ప్రవేశించాడు. తరువాత హరి దానిని క్షోభింపజేశాడు.

**అహం తత్త్వమభూత్తన్మా జ్ఞానద్రవ్య క్రియాత్మకమ్ ।**
**అహంకార సముత్పత్తావేకాంశ స్తమసి స్మృతః ॥2॥**

**తద్దశాంశాధిక రజ స్తద్దశాంశాధికం ప్రభో ।**
**సత్త్వమిత్యుచ్యతే సద్భిర్హ్యేతదాత్మా త్వహం స్మృతమ్ ॥3॥**

దాని నుండి జ్ఞానం, ద్రవ్యం, క్రియ స్వరూపంగాగలిగిన అహంతత్త్వం ఉద్భవించింది. అహంకారం యొక్క సముత్పత్తి యొక్క ఒక అంశం తమస్సునందున్న అంశంగా తెలియబడుతోంది. పక్షిప్రభూ! దానికన్న పది అంశములు అధికం రజస్సు. దానికన్న పది అంశములు అధికం సత్త్వం అని సత్పురుషులచే చెప్పబడుతోంది. దీనికి ఆత్మ అహంతత్త్వమే.

**అహం తత్త్వాభిమానీ తు ఆదౌ శేషో బభూవ హ ।**
**సహస్రాబ్దాచ్చ పశ్చాత్తౌ జాతౌ ఖగ హరౌ ద్విజ ॥4॥**

ఆదిలో అహం తత్త్వాభిమానియే శేషుడయ్యాడు.వేయి సంవత్సరాలు గడిచిన పిమ్మట ద్విజా! ఖగ హరులు ఉద్భవించారు.

**అహం తత్త్వే ఖగహ్యేషు ప్రవిష్టో హరి రవ్యయః ।**
**క్షోభయామాస భగవాం ల్లక్ష్మ్యా సహ హరిః స్వయమ్ ॥5॥**

ఖగా! అవ్యయుడైన హరి అహంతత్త్వ(అభిమానం) రూపం కల వీరియందు ప్రవేశించాడు. భగవంతుడైన హరి స్వయంగా లక్ష్మితో కలసి దానిని వికాసపరచాడు. (క్షోభింపజేశాడు)

**వైకారికస్తామసశ్చ తైజసశ్చేత్యహం త్రిధా ।**
**త్రిధా బభూవ రుద్రోఽ పి యతస్తేషాం నియామకః ॥6॥**

అప్పుడు నేను వైకారికుడు, తామసుడు, తైజసుడు అని మూడు విధాలుగా అయ్యాను. వాటిని నియమించ గలిగిన రుద్రుడు కూడ మూడు విధాలుగా అయ్యాడు.

**వైకారిక స్థితో రుద్రో వైకారిక ఇతి స్మృతః ।**
**తామసే తు స్థితో రుద్ర స్తామసోహ్యభిధీయతే ॥7॥**

**తైజసే తు స్థితో రుద్రో లోకే వై తైజసః స్మృతః ।**
**తైజసే తు హ్యహం తత్త్వే లక్ష్మా సహ హరిః స్వయమ్ ॥8॥**

వైకారంతో ఉండే రుద్రుడు వైకారికుడని స్మరింపబడినాడు. తామసంతో ఉండే రుద్రుడు తామసుడని చెప్పబడినాడు. తైజసంతో ఉండే రుద్రుడు లోకంలో తైజసుడని గ్రహింపబడినాడు. తైజసమైన అహంతత్త్వమందు హరి స్వయంగా లక్ష్మితో కలసి

**విశిత్వా క్షోభయామాస తదాసౌ దశధాత్వభూత్ ।**
**శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ॥9॥**

**వాక్పాణి పాదం పాయుశ్చ ఉపస్థేతి దశస్మృతాః ।**
**వైకారికేహ్యహంతత్త్వే ప్రవిశ్య క్షోభయద్ధరిః ॥10॥**

ప్రవేశించి క్షోభింపజేశాడు. చెవి,కన్ను, చర్మం, నాలుక, ముక్కు, నోరు (వాక్కు) వాణి, పాదం, పాయువు, ఉపస్థ అని అవి చెప్పబడ్డాయి. హరి వైకారికమైన అహంతత్త్వమునందు ప్రవేశించి క్షోభపరిచాడు.(వికాసము కలుగజేసాడు)

**మహత్తత్త్వాదిమా ఆదావింద్రియాణాం చ దేవతాః ।**
**ఏకాదశ విధా ఆసన్ క్రమేణ తు ఖగేశ్వర! ॥11॥**

మహత్తత్త్వం నుండి (మొదట) ఈ ఇంద్రియాధి దేవతలు వచ్చారు. ఖగేశ్వరా! వారు ఏకాదశ విధాలుగా క్రమంగా అయ్యారు.

**మనోఽభిమానినీ హ్యాదౌ వారుణీ త్వభవత్తదా ।**
**అనంతరం చ సౌపర్ణీ గిరిజాపి తథైవ చ ॥12॥**

**శేషాదనంతరాస్తాసాం దశవర్షాదనంతరమ్ ।**
**ఉత్పత్తిరితి విజ్ఞేయం క్రమేణ తు ఖగేశ్వర ॥13॥**

మొదట మనోభిమానిని అయిన వారుణి కలిగింది. అనంతరం అలాగే సౌపర్ణి, గిరిజ కలిగారు. శేషుని తరువాత పది సంవత్సరాలైన పిమ్మట ఖగేశ్వరా! క్రమంగా వారి ఉత్పత్తి జరిగిందని తెలియాలి.

**మనోభిఽమానినావన్యావింద్రకామౌ ప్రజజ్ఞతుః ।**
**తార్క్ష్య హ్యనంతరౌ జ్ఞేయౌ ముక్తౌ సంసార ఏవ చ ॥14॥**

తార్క్ష్య! ఇతరులైన మనోభిమానులైన, ఇంద్రకాములు తరువాత జన్మించారు. వారు ముక్తియందు సంసారము నందుండువారని తెలియాలి.

**తత స్త్వగాత్మా హ్యభవత్సోహంకారిక ఈరితః ।**
**తతః పాణ్యాత్మకాశ్చైవ జజ్ఞిరే పక్షిసత్తమ ॥15॥**

అనంతరం త్వక్స్వరూపమేర్పడింది. అది అహంకారికమని చెప్పబడింది. పక్షిసత్తమా! తరువాత పాణ్యాది స్వరూపాలు కలిగాయి.

**శచీ రతిశ్చానిరుద్ధస్తథా స్వాయంభువో మనుః ।**
**బృహస్పతిస్తథా దక్ష ఏతే పాణ్యాత్మకా స్మృతాః ॥16॥**

శచి, రతి, అనిరుద్ధుడు, స్వాయంభువమనువు, బృహస్పతి, దక్షుడు వీరు పాణ్యాత్మకులని చెప్పబడ్డారు.

**దక్షస్యానంతరం జజ్ఞే ప్రతోహో నామ చాండజ ।**
**స ఏవోక్త శ్చాతివాహో యాపయత్యాత్మచోదితః ॥17॥**

అండజా! దక్షుని అనంతరం ప్రవాహమనేది కలిగినది. ఆ ప్రవాహుడే అతివాహుడని కూడ చెప్పబడినాడు. ఆత్మచే ప్రేరేపించబడి అతడే నడిపిస్తాడు (జరిగేటట్లు చేస్తాడు).

**హస్తాదనంతరం జ్ఞేయో న తు శచ్యాదివత్ స్మృతః ।**
**తతోఽ భవన్మహాభాగ చక్షురింద్రియమాత్మనః ॥18॥**

మహాభాగా! హస్తం తరువాత తన కళ్ళు ఏర్పడినట్లు తెలియాలి. అది శచ్యాదుల ఉత్పత్తి వంటిది కాదని గ్రహించాలి.

**స్వాయంభువ మనోర్భార్యా శతరూపా యమస్తథా ।**
**చంద్రసూర్యౌ తు చత్వారశ్చక్షురింద్రియ మానినః ॥19॥**

స్వాయంభువ మనువు భార్యయైన శతరూప, యముడు అలాగే సూర్యచంద్రులు – వీరు నలుగురు చక్షురింద్రియం యొక్క అభిమానం కలవారు.

**చంద్రః శ్రోత్రాభిమానీతి తథా జ్ఞేయః ఖగేశ్వర ।**
**జిహ్వేంద్రియాత్మా వరుణః సూర్యస్యానంతరో భవేత్ ॥20॥**

ఖగేశ్వరా! చంద్రుడు శ్రోత్రమును అభిమానించువాడుగా తెలియాలి. వరుణుడు సూర్యుని తరువాత జిహ్వేంద్రియమును అభిమానించువాడయ్యాడు.

**వాగింద్రియాభిమానిన్యో హ్యభవన్ వరుణాదను ।**
**దక్షపత్నీ ప్రసూతిశ్చ భృగురగ్ని స్తథైవ చ ॥21॥**

**తత్రైవైతే మహాత్మానో వాగింద్రియ నియామకాః ।**
**యే క్రవ్యాదయశ్చోక్తా స్తేఽ నంతత్వ నియామకాః ॥22॥**

వరుణుని అనుసరించి (తరువాత) వాగింద్రియాభిమానులు కలిగారు. దక్షపత్నియైన ప్రసూతి, అలాగే భృగువు, అగ్ని ఈ మహాత్ములందరు వాగింద్రియమును నియమించువారు. క్రవ్యాదులు వారు అనంతత్వమును నియమించువారు

**సామ్యత్వాచ్చ తథైవోక్తిర్నతు తత్త్వాభిమానినః ।**
**ఉపస్థ మానినో వీంద్ర బభూవు స్తదనంతరమ్ ॥23॥**

ఇట్లు చెప్పడమనేది సామ్యత్వం వలన మాత్రమే. అంత మాత్రంచే వారు తత్త్వాభిమానులుకారు. పక్షిరాజా! ఆ తరువాత ఉపస్థను అభిమానించేవారు కలిగారు.

**విశ్వామిత్రో వసిష్ఠోఽత్రిర్మరీచిః పులహఃక్రతుః ।**
**పులస్త్యోఽంగిరసశ్చైవ తథా వైవస్వతో మనుః ॥24॥**

వారు విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, అత్రి, మరీచి, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, అంగిరసుడు, వైవస్వతమనువు అనేవారు.

**మన్వాదయోనంతసంఖ్యా ఉపస్థాత్మాన ఈరితాః ।**
**పాయోశ్చమానినో వీంద్ర జజ్ఞిరే తదనంతరమ్ ॥25॥**

మన్వాదులు అనంతసంఖ్యలో ఉన్నారు. వారు ఉపస్థను అభిమానించు రూపాలుగా తెలియజేయబడినారు. పక్షీంద్రా! ఆ తరువాత పాయువును అభిమానించువారు జనించారు.

**సూర్యేషు ద్వాదశ స్త్వేకో మిత్రస్తారా గురోః ప్రియా ।**
**కోణాధిపో నిరృతిశ్చ ప్రవాహీ ప్రవహప్రియా ॥26॥**

**చత్వార ఏతే పక్షీంద్ర వాయు తత్త్వాభిమానినః ।**

ద్వాదశ సూర్యులలో ఒకడైన మిత్రుడు, గురువుకు ప్రియురాలైన తార, కోణాధిపుడైన నిరృతి, ప్రవహుని ప్రియురాలైన ప్రవాహి ఈ నలుగురు వాయుతత్త్వం గురించి అభిమానించువారు.

**ఘ్రాణాభిమానినః సర్వే జజ్ఞిరే ద్విజసత్తమ ॥27॥**

**విష్వక్సేనో వాయుపుత్రౌ హ్యాశ్వినౌ గణపస్తథా ।**
**విత్తపః సప్తవసవ ఉక్తో హ్యగ్నిస్తథాష్టమః ॥28॥**

ద్విజశ్రేష్ఠమా! ఆ తరువాత ఘ్రాణాభిమానులు అందరును జన్మించారు. విష్వక్సేనుడు, వాయుపుత్రులిరువురు, అశ్వినీ దేవతలిరువురు, గణనాయకుడు, కుబేరుడు, ఏడుగురు వసువులు, ఎనిమిదోవాడుగా చెప్పబడే అగ్ని. (వసువులలో ఏడుగురు)

**సత్యానాం శృణు నామాని ద్రోణః ప్రాణో ధ్రువస్తథా ।**
**అర్కో దోషస్తథావస్కః సప్తమస్తు విభావసుః ॥29॥**

సత్యులయొక్క (వసువులు యొక్క) నామాలు విను. ద్రోణుడు, ప్రాణుడు, ధ్రువుడు, అర్కుడు, దోషుడు, వస్కుడు ఏడో వాడు విభావసుడు.

**దశరుద్రాస్తథా జ్ఞేయా మూలరుద్రో భవః స్మృతః ।**
**దశరుద్రస్య నామాని శృణుష్వ ద్విజసత్తమ ॥30॥**

రుద్రులు పదిమందిగా తెలియాలి. మూల రుద్రుడు భవుడుగా స్మరింపబడతాడు. ద్విజశ్రేష్ఠుడా! రుద్రుని యొక్క పది నామాలు విను.

**రైవంతేయ స్తథా భీమో వామదేవో వృషాకపిః ।**
**అజైకపాదహిర్బుధ్న్యో బహురూపో మహానితి ॥31॥**

రుద్రుడు,(ఈశానుడు), రైవంతేయుడు, భీముడు, వామదేవుడు, వృషాకపి, అజుడు, ఏకపాదుడు, బహురూపుడు, అహిర్బుధ్న్యుడు, మహాంతుడు – అని వారి పేర్లు.

**దశరుద్రా ఇతి ప్రోక్తాః షడాదిత్యాఞ్ఛృణు ద్విజ ।**
**ఉరుక్రమ స్తథా శక్రో వివస్వాన్వరుణ స్తథా ॥32॥**

**పర్జన్యోఽ తి బాహురేత ఉక్తాః పూర్వం ద్విజోత్తమ ।**
**పర్జన్యవ్యతిరిక్తాస్తు పంచైవోక్తా న సంశయః ॥33॥**

వీరు దశరుద్రులుగా చెప్పబడినారు. ద్విజా! ఆరుగురు ఆదిత్యులను గురించి విను. ఉరుక్రముడు, శక్రుడు, వివస్వంతుడు, వరుణుడు, పర్జన్యుడు, అతిబాహువు అని వీరు ఆరుగురు చెప్పబడుతున్నారు. పర్జన్యుని మినహాయిస్తే వారు అయిదుగురుగా వ్యవహరింపబడుతున్నారు. సంశయం లేదు.

**గంగాసమస్తు పర్జన్య ఇతి చోక్తః ఖగేశ్వర ।**
**సవితా హ్యర్యమా ధాతా పూషా త్వష్టా తథా భగః ॥34॥**

**చత్వారింశత్ తథా సప్త మహతః పరికీర్తితాః ।**

ఖగేశ్వరా! పర్జన్యుడు గంగాసముడుగా చెప్పబడినాడు. సవిత, అర్యముడు, ధాత, పూషుడు, భగుడు, త్వష్ట అనే వారును, మరో నలభై మంది, అలాగే మరో ఏడుగురు మహత్తులుగా కీర్తింపబడినారు.

**ద్వా వుక్తావితి విజ్ఞేయో ప్రవహోతివహస్తథా ॥35॥**

ఇదివరలో చెప్పబడిన ప్రవహుడు, ఇతివహుడనే వారిరువురును మహత్తులనే తెలియాలి.

**తథా దశవిధా జ్ఞేయా విశ్వేదేవాః ఖగేశ్వర ।**
**శృణు నామాని తేషాం తు పురూరవార్ద్ర సంజ్ఞకౌ ॥36॥**

**ధూరిలోచన సంజ్ఞౌ ద్వౌ క్రతు దక్షేతి సంజ్ఞకౌ ।**
**సత్యవసుసంజ్ఞౌ చ కామ కాలక సంజ్ఞకౌ ॥37॥**

**ఏవం దశవిధా జ్ఞేయా విశ్వేదేవా ప్రకీర్తితాః ।**

ఖగేశ్వరా! అదేవిధంగా విశ్వేదేవతలు పది విధాలని తెలియాలి. వారి నామాలను విను. పురూరవుడు, ఆర్ద్రుడు, అనుపేరుగలవారును ధూరి, లోచనుడు అనుపేరుగలవారును క్రతుడు, దక్షుడు అనుపేరుగలవారును కాముడు, కాలకుడు అను పేరుగలవారును, ఈ విధంగా విశ్వేదేవతలు పది విధములుగా చెప్పబడినారు.

**తథా ఋభుగణశ్చోక్త స్తథా చ పితర స్త్రయః ॥38॥**

**ద్యావాపృథివ్యౌ విజ్ఞేయౌ ఏతే చ షడశీతయః ।**
**దేవాః ప్రజజ్ఞిరే సర్వే నాసికాద్రియమానినః ॥39॥**

అదే విధంగా ఋభుగణం చెప్పబడినది. పితరులు(పిత,పితామహుడు,ప్రపితామహుడు) ముమ్మరని చెప్పబడినది. ఈ విధంగానే ఆకాశం, భూమిని తెలియాలి. ఎనభైఆరు మంది దేవతలు సంభవించారు. వీరు అందరును నాసికను ఆదరించే అభిమానులు.

**ఆకాశస్యాభిమానీ తు గణపః సముదాహృతః ।**
**ఉభయత్రాభిమానీతి జ్ఞేయం తత్త్వార్థవేదిభిః ॥40॥**

గణనాయకుడు ఆకాశమును అభిమానించువాడుగా చెప్పబడినాడు. తత్త్వార్థం తెలిసినవారిచే ఇతడు ఆకాశం పట్ల (నాసిక), భూమి పట్ల కూడ ఉభయాభిమానిగా గ్రహింపబడుచున్నాడు.

**విష్వక్సేనం వినా సర్వే జయాద్యా విష్ణుపార్షదాః ।**
**అభవన్సమహీనాశ్చ విష్వక్సేనా దనంతరమ్ ॥41॥**

**ఏతేపి నాసికా యాశ్చ అవాంతర నియామకాః ।**
**అతస్తే తత్త్వమానిభ్యో హ్యవరాస్తే ప్రకీర్తితాః ॥42॥**

విష్వక్సేనుని మినహాయించి మిగిలిన జయుడు మున్నగు విష్ణుపార్షదులందరు సమానత్వం లేకుండ ఉద్భవించారు. విష్వక్సేనుని అనంతరం వారి ఉత్పత్తి జరిగింది. వీరు కూడ నాసికను అభిమానించే అవాంతర నియామకులు. అందువలన వీరు తత్త్వాభిమానుల కన్న అప్రధానులుగా తెలియజేయబడుతున్నారు.

**స్పర్శ తత్త్వాభిమానీ తు అపానశ్చేత్యుదాహృతః ।**
**రూపాభిమానీ సంజజ్ఞే వ్యానో నామమహాన్ ప్రభో ॥43॥**

పక్షిప్రభూ! అపానం (అపానుడు) స్పర్శతత్త్వమును అభిమానించువాడుగా గ్రహింపబడినాడు. గొప్పవాడైన వ్యానుడు రూపమును అభిమానించువాడుగా కలిగాడు.

**రసాత్మక ఉదానశ్చ సమానో గంధనామకః ।**
**అపాం నాథాశ్చ చత్వారో మరుతః పరికీర్తితాః ॥44॥**

రసాత్మకుడైన ఉదానుడు, గంధనామకుడైన సమానుడు, జలానికి నాథులు. నలుగురు మరుత్తులు పిమ్మట కీర్తింపదగిన వారు.

**జయాద్యనంతరాన్ వక్ష్యే సముత్పన్నాన్ ఖగేశ్వర ।**
**ప్రధానాగ్రే ప్రథమజః పావకః సముదాహృతః ॥45॥**

ఖగేశ్వరా! జయాదుల తరువాత ఉద్భవించినవారిని చెప్పుచున్నాను. ప్రధానమునకు ముందు పావకుడు మొదటివాడుగా పుట్టినవాడని తెలియజేయబడినాడు.

**భృగోర్మహర్షేః పుత్రశ్చ చ్యవనః సముదాహృతః ।**
**బృహస్పతేశ్చ పుత్రస్తు ఉతథ్యః పరికీర్తితః ॥46॥**

**రైవతశ్చాక్షుషశ్చైవ తథా స్వారోచిషః స్మృతః ।**
**ఉత్తమో బ్రహ్మసావర్ణీ రుద్రసావర్ణిరేవ చ ॥47॥**

**దేవసావర్ణి సావర్ణిరింద్రసావర్ణి రేవ చ ।**
**తథైవ దక్షసావర్ణి ర్ధర్మసావర్ణి రేవ చ ॥48॥**

**ఏకాదశ విధాహ్యేవం మనవః పరికీర్తితాః ।**

భృగు మహర్షి యొక్క పుత్రుడు చ్యవనుడని పేర్కొనబడినాడు. బృహస్పతి యొక్క పుత్రుడు ఉతథ్యుడని కీర్తింపబడినాడు. రైవతుడు, చాక్షుషుడు, స్వారోచిషుడు, ఉత్తముడు, బ్రహ్మసావర్ణి, రుద్రసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి, సావర్ణి, దక్షసావర్ణి, ధర్మసావర్ణి – ఇట్లు పదకొండుగురైన మనువులు కీర్తింపబడినారు.

**పితౄణాం సప్తకం చైవేత్యాద్యాః సంజజ్ఞిరే ఖగ ॥49॥**

**తదనంతర సముత్పన్నా స్తేభ్యో నీచాః శృణు ద్విజ ।**
**వరుణస్య పత్నీ గంగా, పర్జన్యాఖ్యో విభావసుః ॥50॥**

**యమభార్యా శ్యామలా తు హ్యనిరుద్ధ ప్రియా విరాట్ ।**
**బ్రహ్మాండ మానినీ సైవ హ్యుషా నామ్నాసు శబ్దితా ॥51॥**

**రోహిణీ చంద్రభార్యోక్తా సూర్య భార్యాతు సంజ్ఞకా ।**
**ఏతా గంగాది షట్సంఖ్యా జజ్ఞిరే వినతాసుత ॥52॥**

ఖగమా! ఆద్యులైన సప్త పితరులు అనంతరం ఉద్భవించుట జరిగినది. ద్విజా! ఆ తరువాత ఉత్పన్నులైన వారు అభిమానంలో వారికన్న తక్కువ వారు. వినుము. వరుణపత్నియైన గంగ, పర్జన్యుడనే విభావసువు, యముని భార్య శ్యామల అని, అనిరుద్ధుని ప్రియురాలు విరాట్–బ్రహ్మాండమును అభిమానించునది కూడ ఆమె. చక్కగా శబ్దించే ఉష అను పేరుగలది కూడ. చంద్రుని భార్యయైన రోహిణి, సూర్యుని భార్య అయిన సంజ్ఞ, వినతానందనా! గంగమున్నగు ఈ ఆరుగురు ఉద్భవించారు.

**గంగాద్యనంతరం జజ్ఞే స్వాహా వై మంత్ర దేవతా ।**
**స్వాహా నామాగ్ని భార్యోక్తా గంగాదిభ్యోఽధమా స్మృతా ॥53॥**

గంగాదుల తరువాత మంత్ర దేవతయైన స్వాహాదేవి జనించింది. ఆ స్వాహాదేవి అగ్ని యొక్క భార్యగా చెప్పబడినది. ఆమె తత్త్వాభిమానం కలవారిలో గంగాదుల కన్న తక్కువైనది.

**స్వాహానంతరజో జ్ఞేయో జ్ఞానాత్మా బుధనామకః ।**
**బుధస్తు చంద్ర పుత్రో యః స్వాహాయా అధమః స్మృతః ॥54॥**

స్వాహాదేవి అనంతరం పుట్టినవాడు జ్ఞానాత్మకుడైన బుధుడు అను పేరుకలవాడని తెలియాలి. బుధుడు చంద్రుని కుమారుడు. అతడు స్వాహాదేవి కన్న తక్కువవాడు.

**ఉషా నామ తథా జజ్ఞే బుధస్యానంతరం ఖగ ।**
**ఉషానామాభిమానీ తు హ్యశ్విభార్యా ప్రకీర్తితా ॥55॥**

**బుధాధమా సా విజ్ఞేయా నాత్ర కార్యా విచారణా ।**

ఖగమా! బుధుని తరువాత ఉష అనునామె ఉద్భవించింది. ఉష అను నామెను అభిమానించే స్త్రీ అశ్వి భార్యగా కీర్తింపబడింది. ఆమె బుధుని కన్న తక్కువని తెలియవలసియున్నది. ఇందు ఆలోచించవలసినది ఏమీ లేదు.

**తతః శనైశ్చరో జజ్ఞే పృథివ్యామేతి మిశ్రితః ॥56॥**

**ఉషాధమస్తు విజ్ఞేయ స్తతో జజ్ఞేథ పుష్కరః ।**
**కర్మాభిమానీ విజ్ఞేయః శనైశ్చర ఇతీరితః ॥57॥**

అనంతరం పృథివిలో శనైశ్చరుడు కలిగాడని ప్రసిద్ధి. అతడు ఉష కన్న తక్కువవాడని తెలియాలి. అనంతరం పుష్కరుడు జన్మించాడు. శనైశ్చరుడు కర్మాభిమానిగా తెలియబడుతున్నాడు.

**తత్త్వాభిమానినో దేవానేవం సృష్ట్వా హరిః స్వయమ్ ।**
**ప్రవివేశ సదేవేశ స్తత్త్వేషు రమయా సహ ॥58॥**

తత్త్వాభిమానులైన దేవతలను ఈ విధంగా హరి సృష్టించి, స్వయంగా ఆ దేవేశుడు లక్ష్మితో కలసి వారి యందు ప్రవేశించాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే తత్త్వాభిమాని దేవతోత్పత్తి తత్తారతమ్యనిరూపణం నామ పంచమోఽధ్యాయః ॥5॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో తత్త్వాభిమానదేవతోత్పత్తి వారి తారతమ్యనిరూపణం అనే అయిదవ అధ్యాయం సమాప్తం

## షష్ఠో౭ధ్యాయః - ఆరవ అధ్యాయం

## తత్త్వాభిమానిదేవతాకృత విష్ణుస్తుతిః - తత్త్వాభిమాని దేవతలు విష్ణువును స్తుతించుట

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు అన్నాడు.

**తత్ర తత్ర స్థితా స్తత్త్వే తత్తత్త్వాభిమానినః ।**
**స్వే స్వే హ్యాయతనే స్వాంగే తదర్థం చ ఖగేశ్వర ॥1॥**

**హరిం నారాయణం సమ్యక్ స్తోతుం సముపచక్రిరే ।**
**చింత్యాచింత్య గుణే విష్ణౌ విరుద్ధాః సంతి సద్గుణాః ॥2॥**

ఖగేశ్వరా! ఆయా తత్త్వములందుండే వారును, ఆయా తత్త్వాభిమానులు, తమతమ నివేశములందే స్వీయావయవము లందుండి వారి ప్రయోజనంకోసమై నారాయణుడైన హరిని భక్తితో స్తుతించుటకు ఉద్యుక్తులయ్యారు. ఊహలకు అందేటట్లు, అందనట్లు ఉండే సద్గుణాలు విరుద్ధాలుగా హరియందు గోచరిస్తూ ఉంటాయి.

**ఏకైకశో హ్యనంతాస్తే తద్గుణానాం స్తుతౌ మమ ।**
**క్వశక్తిరితిబుద్ధ్యా సా వ్రీడయావనతాబ్రవీత్ ॥3॥**

నాగురించి చేసే స్తుతియందు ఆ గుణాలు ఒక్కొక్కటి అనంతాలుగా ఉన్నాయి. నా శక్తి ఎక్కడ? అనే బుద్ధిచే లక్ష్మి సిగ్గుపడి, వంగి, నమస్కరించి, ఇలా అంది.

**శ్రీరువాచ** - లక్ష్మి పలికింది.

**నతాస్మి తే నాథ పదారవిందం న వేద చాన్యచ్చరణాదృతే తవ ।**
**త్వయీశ్వరే సంతి గుణాః శ్రుతాస్తు తథా౭శ్రుతాః సంతి చ దేవదేవ ॥4॥**

నాథా! నీ పాదపద్మమునకు నమ్రురాలను. నీ చరణం తప్ప మరొకటి తెలియనిదానను. దేవదేవా! ఈశ్వరుడవైన నీయందు ఇదివరలో వినినటువంటివి, విననటువంటివి గుణాలు ఎన్నో ఉన్నాయి.

**సమ్యక్ సృష్టం స్వాయతనం చ దత్వా గోవింద దామోదర మాం చ పాహి ।**
**స్తుత్యా మదీయశ్చ సుఖైకపూర్ణః ప్రియో జనో నాస్తి తథా త్వదన్యః ॥5॥**

గోవిందా! దామోదరా! చక్కగా నిర్మింపబడే నివేశమును నాకు కల్పించి నన్ను రక్షించు. ఆనందమయుడవు, ప్రియుడువునైన నీవు తప్ప వేరొక జనుడు నా స్తుతికి పాత్రుడు కాదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు

**లక్ష్మీపతే సర్వ జగన్నివాస త్వం జ్ఞానసింధుః క్వ చ విశ్వమూర్తే ।**
**అహం క్వచాజ్ఞ స్తవ వై శక్తి రస్తి హ్యజ్ఞో౭హం వై హ్యల్పశక్తిర్మమాస్తి ॥6॥**

లక్ష్మీపతీ! సమస్త జగత్తు నివాసమైనవాడా! నీవు జ్ఞానానికి సముద్రుడువంటివాడవు. విశ్వమూర్తీ! నీవుఎక్కడ? అజ్ఞుడనైన నేను ఎక్కడ? నీకు సంపూర్ణమైన శక్తి ఉన్నది. నేను అజ్ఞుడను. అల్పశక్తి మాత్రమే నాకు ఉన్నది.

**లక్ష్మ్యై శ్చైవ జ్ఞానవైరాగ్యభక్తిహ్యత్యల్ప మద్ధా మయి సర్వదైవ ।**
**తవ ప్రసాదాదస్తి జగన్నివాసతత్ర స్వామిత్వం నాస్తి విష్ణో సదైవ ॥7॥**

లక్ష్మికయితే జ్ఞానం, వైరాగ్యం, భక్తి ఉన్నాయి. నా యందు అవి ఎల్లప్పుడును మిక్కిలి స్వల్పంగానే ఉన్నాయి. సత్యం. జగన్నివాస! విష్ణూ! నీ అనుగ్రహప్రదర్శనం వలన, నీ యందు స్వామిత్వం కలదు. నాకు అది ఎన్నడునూ లేదు.

**న దేహిత్వం సర్వదా మే మురారేఅహం మమత్వం ప్రాప్యమేతావదేవ ।**
**గమ్యజ్ఞానం యోగ్యగుణే రమేశ ప్రమాదో వా నాస్తి నాస్త్వద్య నిత్య (నిత్యం) ॥8॥**

మురారీ! ఇంతవరకును నేను పొందిన అహంమమత్వాన్ని (మమకారత్వాన్ని) నాకు ఎప్పుడును నీవు ఈయవద్దు.  రమేశా! నిత్యా! యోగ్యమైన గుణమునందు పొందవలసిన జ్ఞానం గురించి ప్రమాదం ఎల్లప్పుడును వద్దు. వద్దు

**తన్మే హృషీకాణి పతంత్యసత్పథేపదారవిందే తు పతంతు సర్వదా ।**
**లక్ష్యాహ్యహం కోటిగుణేన హీనః స్తోతుం సామర్థ్యం నాస్తి మే సుప్రసీద ॥9॥**

నా ఇంద్రియాలు అసన్మార్గములందు పడిపోవుచున్నవి. నీ పదారవిందమునందే ఎల్లప్పుడు అవి పడియుండుగాక! నేను లక్ష్మికన్న కోటి గుణాలు తక్కువవాడను. నాకు నిన్ను స్తుతించుటకు సామర్థ్యంచాలదు. నన్ను మంచిగా అనుగ్రహించు.

**ఇతి స్తవం విష్ణుగుణాన్విధాతా తార్క్ష్య స్థితః ప్రాంజలి స్తస్యచాగ్రే ।**
**తదా వాయుర్దేవ దేవో మహాత్మా దృష్ట్వా విష్ణుం భక్తి సంవర్ధితాత్మా ॥10॥**

**స్నేహోత్థరావః స్ఖలితాక్షరస్తం ముంచస్కణాన్ ప్రాంజలి రాబభాషే ।**

తార్క్ష్యా! విధాత ఈ విధంగా విష్ణుగుణాలను స్తుతించి, ప్రాంజలియై అతని ఎదుట ఉండిపోయాడు. అప్పుడు మహాత్ముడు, దేవదేవుడునైన వాయువు విష్ణువును వీక్షించి,భక్తిచే వృద్ధి పొందింపబడిన మనస్సుతో, అనురాగంతో, పెల్లుబికిన ధ్వనితో అక్షరాల తొట్రుపాటుతో, ఆనందబాష్పాలు విడుస్తూ విష్ణువుకు దోయిలొగ్గి ఇలా పలికాడు.

**వాయురువాచ –** వాయువు అన్నాడు.

**ఏతేహి దేవా స్తవ భృత్యభూతాః పదారవిందం పరమం సుదుర్లభమ్ ॥11॥**

**చతుర్విధాన్ పురుషార్థాన్ రమేశ సంప్రార్థయే తచ్చ సదాపి దేవ ।**
**దృష్ట్వా హరేః సైవ మాయైవ తావత్ సుకారణం కించిదన్యన్న చాస్తి ॥12॥**

ఈ దేవతలందరూ నీకు దాసభూతులైనవారు. నీ పాదారవిందం వారికి మిక్కిలి (దుర్లభమైనది)గా పొంద శక్యం కానిది. రమేశా! దేవా! నాలుగు విధాలైన పురుషార్థాలను ఎల్లప్పుడును నేను కోరుకొనుచున్నాను. గమనించి చూస్తే హరి యొక్క ఆ మాయయే అన్నింటికి గొప్ప కారణమై ఉన్నది. మరొక్కటి కొంచెం కూడ లేదు.

**అతో నాహం ప్రదయోపి భూమన్ భవత్పదాంభోజ నిషేవణోత్సుకః ।**
**లోకస్య కృష్ణా ద్విముఖస్య కర్మణా అపుణ్యశీలస్య సుదుఃఖితస్య ॥13॥**

**అనుగ్రహార్థం చ తవావతారో నాన్యశ్చ కించిత్ పురుషార్థ స్తవేశ ।**
**గో భూసురాణాం చ మహీరుహాణాం తథా సురాణాం ప్రవరావతారైః ॥14॥**

**క్షేమోపకారాణి చ వాసుదేవ క్రీడన్విధత్తే నచకించిదన్యత్ ।**
**మనో న తృప్యత్యపి శంసతాం నః సుకర్మ మౌలేశ్చరితామృతాని ॥15॥**

ఓ మహాత్మా! అందువలన నేను గొప్ప రక్షకుడను కాను. నీ పాదారవిందాలను సేవించుట యందే ఆసక్తి కలవాడను. కృష్ణుని యందు విముఖత్వం కల్గిన బుద్ధిచే మిక్కిలి దుఃఖంపొందే పాప ప్రవర్తన కలిగిన లోకాన్ని అనుగ్రహించుటకోసమే నీ అవతారం. ఈశ్వరా! అంతకన్న వేరే పురుషార్థం నీకు లేశం కూడ లేదు. గోవులకు, భూసురులకు, మహీరుహాలకు (వృక్షాలకు), దేవతలకు గొప్ప అవతారాలచే వాసుదేవా! క్షేమాలను, ఉపకారాలను క్రీడిస్తూ చేకూరుస్తావు. అంతకన్న ఏ కొంచెమునూ లేదు. సత్కర్మలను శిరస్సు నందు ధరించే నీ చరితామృతాన్ని ప్రశంసించే మా మనస్సు తృప్తిపొందుట లేదు.

**అచ్ఛిన్న భక్తస్య హి మే ముకుందసదా భక్తిం దేహి పాదారవిందే ।**
**సదా తదేవాస్తు న కించిదన్యద్ యత్ర త్వమాసీః పురుషే దేవదేవ ॥16॥**

ముకుందా! నేను అభేదభక్తుడను. నీ పాదారవిందమునందు నాకు ఎల్లప్పుడు భక్తిని ప్రసాదించు. దేవదేవా! పురుషుడవైన నీవు ఎక్కడ ఉంటావో, అదే ఎల్లప్పుడు నాకు స్థానమగుగాక! మరొక్కటైన ఏ కొంచెమూ నాకు వద్దు.

**అహం చ తత్రాస్మి తవ ప్రసాదాద్ యత్రాస్త్యహం తత్ర భవాన్ మహాప్రభో ।**
**వ్యంసిర్మమేయం చ శరీరమధ్యేచతుర్ముఖశ్చైవ న చైతదన్యే ॥17॥**

మహాప్రభూ! నీ అనుగ్రహం వలన నేను అక్కడే ఉంటాను. నేను ఎక్కడ ఉంటానో నీవు అక్కడే ఉండవలసింది. నా ఈ శరీరమధ్యమందు స్కంధభాగం నీవే. చతుర్ముఖుడు కూడ అంతే. మిగిలినవారు కారు.

**మదీయ నిద్రా తవ వందనం ప్రభో మదీయ యామాచరణం ప్రదక్షిణమ్ ।**
**మదీయ వ్యాఖ్యాహరణం స్తుతిః స్యాద్ ఏవం విదిత్వా చ సమర్పయామి ॥18॥**

ప్రభూ! నా నిద్ర, నా వందనం, నా సంబంధమైన సంయమాచారవిధి, ప్రదక్షిణం, నా సంబంధమైన వ్యవహారం, నేను చేసే స్తుతి నీవేయని తెలుసుకొని నీకే సమర్పిస్తున్నాను.

**మద్బుద్ధియోగ్యం చ పదార్థజాతం దృష్ట్వా హరేః ప్రతిమా ఏవ తచ్చ ।**
**ఇత్థం మత్వాహం సర్వదా దేవదేవ తత్ర స్థితాన్ హరి రూపాన్ భజిష్యే ॥19॥**

దేవదేవా! నాబుద్ధి యందు ధ్యానించుటకు యోగ్యమైన పదార్థసమూహమంతా హరి యొక్క ప్రతిరూపమే అని వీక్షించి, ఎల్లప్పుడు అట్లే భావించి, నేను అక్కడ ఉన్న హరిరూపాలను సేవిస్తాను.

**యచ్చందనం యత్తు పుష్పం చ ధూపం వస్త్రం చ యద్భక్ష్య భోజ్యాదికం చ ।**
**ఏతత్సర్వం విష్ణుప్రీత్యర్థమేవే త్యేతద్ వ్రతం సర్వదా వై కరిష్యే ॥20॥**

చందనం, పుష్పం, ధూపం, వస్త్రం, భక్ష్యం, భోజ్యం మున్నగునవి అన్నీ విష్ణుప్రీతికోసం మాత్రమే అని ఎల్లప్పుడు వ్రతాన్ని ఆచరిస్తాను.

**అవైష్ణవాన్దూషయిష్యే సదాహం సద్వైష్ణవాన్ పాలయిష్యే మురారే ।**
**విష్ణుద్రుహో ఛేదయిష్యే చ జిహ్వాం తచ్ఛృణ్వతాం పూరయిష్యే త్రపూల్కాః ॥21॥**

నేను ఎల్లప్పుడు అవైష్ణవులను దూషిస్తాను మురారీ! మంచివారైన వైష్ణవులను లాలిస్తాను. విష్ణుద్రోహుల నాలుకలను త్రుంచివేస్తాను. ఆ మాటలు వినే వారిని సీసంతో కూడిన కొరివిమంటలతో (ఉల్కలతో) నింపివేస్తాను.

**ఏతాదృశీ శక్తిర్మమాస్తి దేవ తవ ప్రసాదాద్బలినోఽపి విష్ణో ।**
**అథాపి నాహం స్తవనే సమర్థః లక్ష్మ్యా హ్యహం కోటిగుణైర్విహీనః ॥22॥**

దేవా! విష్ణూ! నేను బలం కలిగినవాడనైనప్పటికిని, నీ అనుగ్రహం వలన ఇటువంటి శక్తి నాకు కలిగింది. అయినప్పటికినీ నిన్నుపొగడటానికి నేను సమర్థుడను కాను. నేను లక్ష్మికన్న కోటిరెట్లు తక్కువవాడను.

**ఏతత్ స్తోత్రం హ్యర్థయేచ్చైవ యా నః తత్ర ప్రీతి ర్హ్యక్షయా మే సదా స్యాత్ ।**
**స్తోత్రం హ్యేత త్పారయంతీహ లోకే తే వైష్ణవాస్తే చ హరిప్రియాశ్చ ॥23॥**

కొనియాడబడే ఈ స్తోత్రాన్ని అర్థవంతమగునట్లుగా చేస్తే, మాకు అందు ప్రీతి ఎల్లప్పుడు అక్షయమై ఉంటుంది. ఇహలోకంలో ఈ స్తోత్రమును పఠింపజేసిన, వారు వైష్ణవులు, హరికి ప్రియులు అవుతారు.

**కుర్వంతి యే పఠనం నిత్యమేవ సమర్పయిష్యంతి సదా హరౌ చ ।**
**తేషాం హరిః ప్రీయతే కేశవోలం హరౌ ప్రసన్నే కిమలభ్యమస్తి ॥24॥**

ఎవరయితే నిత్యమూ ఈ స్తోత్రం పఠనం చేస్తారో, ఎల్లప్పుడు హరియందు సమర్పణం చేస్తారో, వారికి హరి ప్రియుడవుతాడు. కేశవుడైన హరి ప్రసన్నుడయితే చాలును, ఇక లభించనిదంటూ ఏమీ ఉండదు.

**ఏవం స్తుత్వా బలదేవో మహాత్మాతూష్ణీం స్థితః ప్రాంజలి రగ్రతో హరేః ।**

మహాత్ముడైన, బలము కలిగిన ఆ దేవుడు (అతి బలుడు) ఈ విధముగా స్తుతించి హరికి ఎదురుగా దోయిలొగ్గి మిన్నకుండిపోయాడు.

**సరస్వత్యువాచ** - సరస్వతి అన్నది.

**కో వా రసజ్ఞో భగవన్ మురారే హరే గుణస్తవనాత్ కీర్తనాద్వా ॥25॥**

**అలం బుద్ధిం ప్రాప్నుయాద్దేవదేవ బ్రహ్మాదిభిః సర్వదా స్తూయమాన ।**
**యః కర్ణనాడీం పురుషస్య యాతో భవప్రదాం దేహరతిం ఛినత్తి ॥26॥**

భగవంతుడా! మురారీ! హరీ! నీ గుణములను స్తోత్రంచేయుటవలన కాని, కీర్తించుట వలన కాని, రసజ్ఞుడైన వాడే బుద్ధిమంతుడు. బ్రహ్మాదులచే నిత్యమూ స్తుతింపబడే దేవదేవుడవు నీవు. నీ పేరు చెవిసోకిన వానికి సాంసారికమైన దేహాభిమానం తొలగిపోతుంది.

**న కేవలం దేహరతిం ఛినత్త్యసద్ గృహక్షేత్రభార్యాసుతేషు నిత్యమ్ ।**
**పశ్వాది రూపేషు ధనాదికేషు అనర్ఘ్యరత్నేషు ప్రియం ఛినత్తి ॥27॥**

కేవలం దేహాభిమానం త్రుంచివేయడం మాత్రమే కాదు, నిత్యమూ గృహాలయందు, క్షేత్రములయందు, భార్యలయందు, సుతులయందు, పశువులు మున్నగురూపాలతో ఉండే ధనం మున్నగు వాటియందు, మిక్కిలి విలువైన రత్నములందు సంప్రీతిని పటాపంచలు చేస్తుంది.

**అనంతవేదప్రతిపాదితోఽపి లక్ష్మీ ర్న వై వేద తవ స్వరూపమ్ ।**
**చతుర్ముఖో నైవ వేద న వాయు రసౌ న వేత్తీతి కిమత్ర చిత్రమ్ ॥28॥**

అనంతాలైన వేదములయందు ప్రతిపాదింపబడిన నీ స్వరూపాన్ని లక్ష్మి కూడ తెలియజాలదు. చతుర్ముఖునికి కూడ తెలియదు. ఇంక ఈ వాయువు కూడ తెలియలేదనటంలో ఆశ్చర్యమేమున్నది?

**ఏతాదృశస్య స్తవనే క్వాస్తి శక్తి ర్మమ ప్రభో బ్రహ్మవాయ్వోః సకాశాత్ ।**
**శతైర్గుణైః సర్వదా న్యూనతాస్తి అతో హరే దయయా మాం చ పాహి ॥29॥**

ప్రభూ! ఇటువంటి వానిని స్తోత్రం చేయుటకు నాకు శక్తి ఎక్కడ ఉంటుంది? బ్రహ్మవాయువుల ముందు ఎల్లప్పుడు నూరు రెట్లు తక్కువదానను. అందువలన హరీ! దయతో నన్ను రక్షించు.

**ఏవం స్తుత్వా హరిం సా తు తూష్ణీమాస ఖగేశ్వర ।**
**భారతీ తు తదా స్తోతుం హరిం సముపచక్రమే ॥30॥**

ఖగేశ్వరా! సరస్వతి హరిని ఈ విధంగా స్తుతించి మిన్నకుండిపోయింది. అప్పుడు భారతి శ్రీమన్నారాయణుని స్తుతించుటకు ఉపక్రమించింది.

**భారత్యువాచ –** భారతి పలికింది.

**బ్రహ్మేశ లక్ష్మీశ హరే మురారే గుణాంస్తవ శ్రద్ధధానస్య నిత్యమ్ ।**
**తథా స్తువంతోఽస్య వివర్ధమానాం మతిం చ నిత్యం విషయేష్వసత్సు ॥31॥**

**కుర్వంతి వైరాగ్య మముత్ర లోకే తతః పరం భక్తి దృఢాం తథైవ ।**
**తతః పరం చైవ హరేః ప్రసన్నతాం కుర్వంతి నిత్యం తవ దేవదేవ ॥32॥**

బ్రహ్మేశా! లక్ష్మీశా! హరీ! మురారీ! నిత్యమూ నీ గుణాలను శ్రద్ధతో స్తుతించువానికి నానాటికీ వృద్ధి పొందే బుద్ధి, నిత్యమూ అసద్విషయములందు వైరాగ్యం పొందుతున్నారు. అనంతరం దృఢమైన భక్తిని మిక్కిలిగా అనుభవిస్తున్నారు. ఇహపరాలలో ఆ తరువాత పరమమైన హరి యొక్క ప్రసన్నత్వమును దేవదేవా! నిత్యమూ పొందుచున్నారు.

**తేనాపరోక్షం చ భవేచ్చ తస్య అతో గుణానాం స్తవనే చ మే రతిః ।**
**సా తు ప్రజాతా పురుషస్య నిత్యం సంసార దుఃఖం తు తతా చ్ఛినత్తి ॥33॥**

ఆ కారణంచే ఇంద్రియాలకు గోచరమయ్యే ప్రత్యక్షజ్ఞానం కలుగుతుంది. అందువలన నీ గుణాలను స్తవం చేయుటలో అనురక్తి మిక్కుటంగా నాకు పుట్టుగాక! దానివలన పురుషుని (జీవుని) సంసార దుఃఖం ఛేదింపబడుతుంది.

**విచ్ఛిన్న దుఃఖస్య తదాధికారిణ ఆనంద రూపాఖ్యఫలం దదాతి ।**
**హరేర్గుణానస్తువతాం చ పాపం తేషాం హి పుణ్యం చ తథా క్షిణోతి ॥34॥**

దుఃఖం పూర్తిగా తొలగిపోయిన సమయంలో మోక్షాధికారికి ఆనందరూపమని చెప్పబడే ఫలాన్ని హరి ఇస్తాడు. హరి గుణాలను స్తుతించని వారికి పాపం కలుగుతుంది. వారి పుణ్యం కూడ క్షీణిస్తుంది.

**ఏవం విదిత్వా పరమో గురుర్మమ వాయుర్దయాలుర్మమ వల్లభశ్చ ।**
**హరేర్గుణాన్ సర్వగుణ ప్రసాదాన్ మమైవ యోగ్యాన్ సుఖముఖ్య భూతాన్ ॥35॥**

ఈ విధంగా తెలుసుకొని, నా పరమగురువగు వాయువు, దయా స్వభావం కలిగిన నా వల్లభుడు, సమస్త గుణ విస్తారములైన హరి యొక్క గుణాలను, అవి నాకూ తగినవే సుఖముఖ్య స్వరూపాలను తెలుసుకున్నవారైనారు.

**ఉద్ధృత్య పుణ్యేభ్య ఇవార్త బంధుః శివశ్చ నో ద్రుహ్యతి పుణ్య కీర్తిమ్ ।**
**తవ ప్రసాదాచ్చ శ్రియః ప్రసాదాత్ వాయోః ప్రసాదాచ్చ మమాస్తి నిత్యమ్ ॥36॥**

ఆర్తబంధువు వలె పుణ్యకార్యములనుండీ ఉద్ధరించి, శివుడు నా పుణ్యకీర్తిని నశింపజేయకుండుగాక! నీ అనుగ్రహం వలన లక్ష్మి యొక్క ప్రసాదం వలన, వాయువు యొక్క అనుగ్రహం వలన కూడ నిత్యము నాకు శుభం చేకూరు గాక!(చేకూరుతుంది).

**యద్యత్కరోత్యేవ సదైవ వాయు స్తత్తత్కరోత్యేవ సదైవ నిత్యమ్ ।**
**వాయోర్విరోధం న కరోతి దేవః స తద్విరోధం న కరోతి నిత్యమ్ ॥37॥**

ఎల్లప్పుడు వాయువు ఏది, ఏది అయితే చేస్తాడో, భగవంతుడు నిత్యమూ అదే అదే చేస్తాడు. వాయువుకు విరుద్ధంగా దేవుడు ఏదీ చేయడు. అతడు హరికి విరుద్ధంగా ఎప్పుడూ ఏదీ చేయడు.

**హరేర్విరోధం న కరోతి వాయుః ర్వాయోర్విరోధం న కరోతి విష్ణుః ।**
**వాయోః ప్రసాదాన్మమ నాస్తి కించిద్ అతానభావశ్చ తవ ప్రసాదాత్ ॥38॥**

హరికి విరుద్ధంగా వాయువు ఏమియును చేయదు. వాయువునకు విరుద్ధంగా హరి ఏమియును ఆచరింపదు. వాయువు యొక్క ప్రసాదం వలనను, నీ యొక్క అనుగ్రహం వలనను నాకు అతానభావం (అజ్ఞానము) కొంచెం కూడ లేదు.

**యథైవమూలం చ తథావతారే దుఃఖాధికం నాస్తి సమీరణస్య ।**
**వాయు స్తథాన్యే చ ఉభౌ ముకుంద స్తథావతారేషు న దుఃఖరూపౌ ॥39॥**

ఈ విధంగా ఏ మూలనైనా అవతారమందు దుఃఖాధికం లేదో, అదే విధంగా సమీరణునికి (వాయువుకు) కూడ లేదు. అట్లే మిగిలిన అవతారములను వాయువు, ముకుందుడు ఇరువురును దుఃఖరూపులు కారు.

**అశక్తవద్దృశ్యతే వాయుదేవః యుగానుసారాంల్లోక ధర్మాంస్తు రక్షన్ ।**
**నరావతారే తత్ర దేవే మురారే హ్యశక్తతా నేతి విచింతనీయమ్ ॥40॥**

కాని వాయుదేవుడు శక్తిలేని వానివలె కనబడుతూ ఉంటాడు. అందు మురారీ! యుగానుసారంగా లోకధర్మాలను రక్షించే నరావతారమైన దేవుని యందు అసామర్థ్యమున్నదని ఎన్నడునూ భావింపరాదు.

**అవతార రూపే యమదుఃఖాదికం చ న చింతనీయం జ్ఞానిభిర్దేవదేవ ।**
**అహం కదాచిత్సుఖనాశ(ప్ర)దేశే దైత్యాం స్తథా మారయితుం గతోఽ (గతా) స్మి ॥41॥**

దేవదేవా! అవతారరూపుని యందు జ్ఞానులచే యమ దుఃఖాదులు ఆలోచింపదగినవి కావు. నేనుకూడ ఒక్కొక్కప్పుడు సుఖాన్ని నశింపజేసే స్థలము నందు దైత్యులను చంపుటకు వెళ్ళుదాననే కదా!

**నైతావతా మమ వాయోశ్చ నిత్యం దుఃఖాతనం నైవ సంచింతనీయమ్ ।**
**ఏతాదృశోఽ హం స్తవనేషు(ను) కాస్తి శక్తిర్గుణానాం మధుసూదన ప్రభో ॥**
**వాయోః సకాశాచ్చ గుణేన హీనా సంసార రూపే ముక్త రూపే చ దేవ ॥42॥**

అంతమాత్రంచేత నాకు, వాయువుకు కూడ నిత్యమూ దుఃఖరూపమైన అజ్ఞానమున్నదని ఊహింపరాదు. ఇటువంటి స్తవనమును అనుసరించుటయందు నేను ఎటువంటి శక్తి కలిగినదానను? ప్రభూ! దేవా! గుణ విషయంలో వాయువు ముందు నేను సంసారరూపంలోను, ముక్తరూపంలోను ఒకపాలు తక్కువదాననే.

**ఏవం స్తుత్వా భారతీ తు తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజః శేషః ప్రాంజలిః ప్రాహ కేశవమ్ ॥43॥**

ఖగేశ్వరా! ఈ విధంగా స్తుతించి భారతి ఊరకుండిపోయింది. ఆ తరువాత పుట్టిన శేషుడు అంజలిబద్ధుడై కేశవుని ఉద్దేశించి ఇలా అన్నాడు.

**శేష ఉవాచ** – శేషుడు అన్నాడు.

**నాహం చ జానే తవ పాద మూలం రుద్రో న వేత్తి గరుడో న వేద ।**
**అహం వాణ్యాః శతగుణాంశహీనో దత్వాహ్యాయతనం పాహి మాం వాసుదేవ ॥44॥**

వాసుదేవా! నేను నీ పాదమూలమును తెలియనివాడను. రుద్రుడు కూడ తెలియజాలడు. గరుడుడు కూడ గ్రహింపజాలడు. నేను వాణి కన్న వందరెట్లు తక్కువవాడను. నివేశనం కల్పించి నన్ను రక్షించు.

**ఏవం స్తుత్వా స శేషస్తు తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజో వీశః స్తోతుం సముపచక్రమే ॥45॥**

ఖగేశ్వరా! ఈ విధంగా స్తుతించి శేషుడు కూడ మిన్నకుండిపోయాడు. ఆ తరువాత పుట్టిన పక్షీంద్రుడు ఇలా స్తుతించుటకు ఉపక్రమించాడు.

**గరుడ ఉవాచ –** గరుడుడు పలికాడు.

**తవ పదోః స్తుతిం కిం కరోమ్యహం మమ పదాంబుజేహ్యర్పితం మనః ।**
**కథమహం ముఖే పక్షియోనిజః కథమేవం గుణానీడితం క్షమః ॥46॥**

నీ పదములను స్తుతించుట అనేది నేనేమి చేయగలను? నా మనస్సు నీ పదపద్మమందు అర్పితమై ఉన్నది. నేను పక్షియోనిలో జన్మించినవాడను. నేను నీ ఎదుట నిలిచి నీ గుణములను కొనియాడుటకు ఎలా సమర్థుడను కాగలను?

**ఏవం స్తుత్వా తు గరుడ స్తూష్ణీమాస నయాన్వితః ।**
**తదనంతరజో రుద్ర స్తోతుం సముపచక్రమే ॥47॥**

గరుడుడు ఈ విధంగా స్తుతించి వినయంతో కూడుకున్నవాడై అలా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన రుద్రుడు స్తుతించుటకు ఉపక్రమించాడు.

**రుద్ర ఉవాచ –** రుద్రుడు పలికాడు.

**యా వై తవేశ భగవన్న విదామ భూమన్ భక్తిర్మమాస్తు శివపాద సరోజమూలే ।**
**ఛన్నాపి సా నను సదా న మమాస్తి దేవ తేనాద్రుహం తవ విరుద్ధమతః కరోమి ॥48॥**

ఈశా! స్వామీ! బహుళా! నిన్ను తెలియజాలము. నీ మంగళప్రదమైన పాదసరోజమూలంలో నాకు భక్తి ఎప్పుడు ఉండు గాక! దేవా! ఆ భక్తి ఎల్లప్పుడు (మాయచే) కప్పబడి ఉంటుంది. అది నాకు లేకుండు గాక! ఆ కారణంచే ద్రోహచింతనలేని విరుద్ధకార్యం నీకు చేస్తున్నాను.

**సర్వాన్నబుద్ధిసహితస్య హరే మురారే కా శక్తి రస్తి వచనే మమ మూఢబుద్ధేః ।**
**వాణ్యా సదా శతగుణేన విహీనమేనం మాం పాహి చేశ మమ చాయతనం త్వా ॥49॥**

హరీ! మురారీ! సర్వవిషయాలలోను బుద్ధిరహితుడను. మూఢబుద్ధినైన నాకు స్తుతించుటకు శక్తి ఏమి ఉంటుంది కనుక? సరస్వతి(వాణి) కన్న ఎప్పుడు నూరు రెట్లు తక్కువవాడను. ఈశా! నాకు తగిన ప్రదేశమును ఇచ్చి ఇటువంటి నన్ను రక్షించు.

**ఏవం స్తుత్వా స రుద్రస్తు తుష్ణీమాస ద్విజోత్తమ ।**
**శేషానంతరజా దేవీ వారుణీ వాక్యమబ్రవీత్ ॥50॥**

ద్విజశ్రేష్ఠమా! ఈ విధంగా స్తుతించి రుద్రుడు మిన్నకుండిపోయాడు. అంత శేషుని అనంతరం ఉద్భవించిన వారుణి ఈ వాక్యం పలికింది.

**వారుణ్యువాచ** – వారుణి పలికింది.

**లక్ష్మీపతే బ్రహ్మపతే మనోఃపతే గిరఃపతే రుద్రపతే నృణాం పతే ।**
**గుణాం స్తవ స్తోతుమహం సమర్థాన పార్వతీ నాపి సుపర్ణపత్నీ ॥51॥**

**శేషాదహం దశగుణైర్విహీనా ।**
**మాం పాహి నిత్యం జగతామధీశా ॥52॥**

లక్ష్మీపతీ! బ్రహ్మపతీ! మనువునకు పతీ! వాక్కుకు పతీ! రుద్రపతీ! నరపతీ! నీ గుణాలను స్తుతించుటకు నేను సమర్థురాలను గాను. పార్వతీ, సుపర్ణపత్నీ కూడ శక్తి చాలనివారు. జగత్తులకు అధీశ్వరా! శేషుని కన్న నేను పది రెట్లు తక్కువదానను. నన్ను నిత్యం రక్షించు.

**ఏవం స్తుత్వా వారుణీ తు తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజా బ్రాహ్మీ సౌపర్ణీహ్యుపక్రమే ॥53॥**

ఖగేశ్వరా! వారుణి ఈ విధంగా స్తుతించి మాట్లాడక ఉండిపోయింది. ఆ తరువాత పుట్టిన బ్రాహ్మి అయిన సౌపర్ణి ఇలా ఉపక్రమించింది.

**సౌపర్ణ్యువాచ** – సౌపర్ణి పలికింది.

**స్తోతుం గుణాం స్తవ హరే జగదీశ వాచాశ్రోతుం హరే తవ కథాం శ్రవణే న శక్తిః ।**
**యస్త్వను స్మరతి దేవ తవ స్వరూపం కో వై ను వేద భువి తం భగత్పదార్థమ్ ॥54॥**

హరీ! జగదీశా! నీ గుణాలను వాక్కులచే స్తుతించుటకు, హరీ! నీ కథలను శ్రవణం చేయుటకు నాకు శక్తి చాలదు. దేవా! నిత్యమూ స్మరించినవాడే నీ స్వరూపాన్ని గ్రహించగలడు. భూమియందు ఆ భగవత్పదార్థమును ఎవడు తెలిసికొనగలడు?

**అతో గుణ స్తవనే నాస్తి శక్తి ।**
**ర్వీంద్రాహదం దశగుణైరవరా చ నిత్యమ్ ॥55॥**

**ఏవం స్తుత్వా తు సౌపర్ణీ తూష్ణీమాస ఖగేశ్వర ।**
**రుద్రానంతరజా స్తోతుం గిరిజాతూపచక్రమే ॥56॥**

పక్షీంద్రుని కన్న పది రెట్లు తక్కువదానను. ఖగేశ్వరా! సౌపర్ణి ఈ విధంగా స్తుతించి ఊరకుండిపోయింది. పిమ్మట రుద్రుని తరువాత పుట్టిన గిరిజ స్తుతించుటకు ఉపక్రమించింది.

**పార్వత్యువాచ –** పార్వతి పలికింది.

**గోవింద నారాయణ వాసుదేవ త్వయా హి మే కించిదపి ప్రయోజనమ్ ।**
**నాస్త్యేవ స్వామిన్న చ నామవాచా సౌభాగ్యరూపః సర్వదా ఏక ఏవ ॥57॥**

గోవింద! నారాయణా! వాసుదేవా! " నీచేత నాకు ఏ కొంచెమూ ప్రయోజనం లేదుకదా!" (అనవద్దు) స్వామీ! వాక్కు చేతనే కాదు పేరును బట్టి కూడ ఎల్లప్పుడు సౌభాగ్యరూపుడవు. ఏకరూపుడవు.

**నారాయణేతి చ తవ నామ చ ఏకమేవ వైరాగ్యభక్తివిభవే పరమం సమర్థామ్ ।**
**అసంఖ్య బ్రహ్మాధికహత్యనాశనే గుర్వాంగనా కోటి వినాశనే చ ॥58॥**

నారాయణ అన్న నీ నామం ఒక్కటే వైరాగ్యము నందు, భక్తి యందు, వైభవమందు మిక్కిలి సమర్థమైనది. లెక్కలేనన్ని బ్రహ్మహత్యాది పాపాలను నాశనం చేస్తుంది. గుర్వంగనాది కోటి పాపాలను నశింపజేస్తుంది.

**నామాధికారిణీచాహం గుణానాం చ మహాప్రభో ।**
**స్తవనే నాస్తి మే శక్తీ రుద్రాద్దశ గుణైరహమ్ ॥59॥**

**అవరా చ సదాస్త్యేవ నాత్ర కార్యా విచారణా ।**
**ఏవం స్తుత్వా సా గిరిజా తూష్ణీమాస ఖగేశ్వర ॥60॥**

మహాప్రభూ! నేను నీ నామమునకునూ, గుణములకునూ అధికారం ఉన్నదానను నిన్ను స్తుతించుటకు మాత్రంశక్తి లేనిదానను. నేను ఎల్లప్పుడు రుద్రుని కన్న పది గుణాలు(రెట్లు) తక్కువదాననునై ఇందులో ఆలోచించ వలసినది ఏదియును లేదు. ఖగేశ్వరా! ఆ గిరిజ ఇట్లు స్తుతించి మాట్లాడకుండ ఉండిపోయింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే తత్త్వాభిమాని తద్దేవకృత విష్ణుస్తుతి తత్తద్దేవతా తారతమ్యనిరూపణం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో తత్త్వాభిమానిదేవతల విష్ణుస్తుతి తారతమ్యనిరూపణం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం

## దేవతాది స్తుతిః తారతమ్యనిరూపణం చ – ఆ యా దేవతల స్తుతి తరతమభావనిరూపణం

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**పార్వత్యానంతరోత్పన్న ఇంద్రో వచనమబ్రవీత్ ।**

పార్వతి తరువాత ఉద్భవించిన ఇంద్రుడిలా పలికాడు.

**ఇంద్ర ఉవాచ** – ఇంద్రుడు అన్నాడు.

**తవ స్వరూపం హృది సంవిజానన్ సముత్సుకః స్యాత్ స్తవనే యస్తు మూఢః ।**
**అజానతః స్తవనం దేవదేవ తదేవాహుర్హేలనం చక్రపాణే ॥1॥**

నీ స్వరూపాన్ని మనసా గ్రహించినవాడే నిన్ను పొగడడానికి ముచ్చట పడతాడు. తెలియని మూఢుని స్తుతి అవహేళనమే.

**తథాపి తద్వై తవ నామ పూర్వం భవేత్తదా పుణ్యకరం భవేదితి ।**
**రుద్రాదికానాం స్తవనే నాస్తి శక్తి స్తదా వక్తవ్యం మమ నాస్తీతి కిం వా ॥2॥**

అయినప్పటికినీ నీనామం మొదట ఏమయి ఉన్నదో, అదే పుణ్యం కలుగజేసేది అవుతుంది. నిన్ను స్తుతించుటకు రుద్రాదులకే శక్తిచాలదన్నప్పుడు నాకును శక్తిచాలదని ఇక చెప్పవలసినది ఏమున్నది?

**గుణాంశతో దశభీ రుద్రతో వై సదా న్యూనో మత్సమః కామదేవః ।**
**జ్ఞానే బలే సమతా సర్వదాస్తి తథా కామః కించ దూతః సదైవ ॥3॥**

రుద్రుని కన్న గుణభాగంలో పదింతలు ఎప్పుడు తక్కువవాడను. నాతో సమానుడు కామదేవుడు. జ్ఞానమందు, బలమందు మాకు సమానత్వం ఉన్నది. అయినప్పటికినీ కాముడు ఎల్లప్పుడును దూతయే కదా!

**ఏవం స్తుత్వా దేవదేవో హరిం చ**
**తూష్ణీం స్థితః ప్రాంజలిర్నమ్రమూర్ధా ।**
**తదనంతరజో బ్రహ్మ అహంకారిక ఊచివాన్ ॥4॥**

ఈ విధంగా దేవేంద్రుడు హరిని స్తుతించి, శిరస్సు వంచి దోయిలొగ్గి మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన అహంకారిక బ్రహ్మ ఇట్లు వచించాడు.

**అహంకారిక ఉవాచ** – అహంకారికుడు అన్నాడు.

**నమస్తే గుణపూర్ణాయ నమస్తే జ్ఞానమూర్తయే ।**
**నమో జ్ఞానవిదూరాయ బ్రహ్మణేఽనంతమూర్తయే ॥5॥**

గుణపూర్ణుడవైన నీకు నమస్కారం. జ్ఞానమూర్తివైన నీకు ప్రణామం. అజ్ఞానం దూరం చేయువాడవై, అనంతమూర్తివై బ్రహ్మవైన నీకు నమస్కారం.

**ఇంద్రాదహం దశగుణైః సర్వదా న్యూన ఉక్తో న జానే త్వాం సర్వదా హ్యప్రమేయ ।**
**తథాపి మాం పాహి జగద్గురో త్వం దత్త్వా దివ్యం హ్యాయతనం చ విష్ణో ॥6॥**

అప్రమేయా! ఇంద్రుని కన్న నేను వందగుణాలు ఎల్లప్పుడు తక్కువవాడనుగా చెప్పబడుతున్నాను. నిన్ను ఎన్నడు నేను తెలియజాలను. జగద్గురూ! విష్ణూ! అయినప్పటికీ దివ్యమయిన ఆయతనం ఇచ్చి నీవు నన్నురక్షించు.

**అహంకారిక ఏవం తు స్తుత్వా తూష్ణీం బభూవ హ ।**
**తదనంతరజా స్తోతుం శచీ వచనమబ్రవీత్ ॥7॥**

అహంకారికుడు ఇట్లు స్తుతించి మౌనస్థితిని పొందాడు. ఆ తరువాత పుట్టిన శచి ఇలా పలికింది.

**శచ్యువాచ –** శచి వచించింది.

**సంచింతయామి హ్యనిశం తవ పాదపద్మం వజ్రాంకుశధ్వజ సరోరుహ లాంఛనాఢ్యమ్ ।**
**వాగీశ్వరైరపి సదా మనసాపి ధర్తుం నో శక్యమీశ తవ పాదరజః స్మరామి ॥8॥**

వజ్రం, అంకుశం, ధ్వజం, పద్మం, గుర్తులచే కొనియాడదగిన నీ పాదపద్మమును అనిశమూ ధ్యానించు చున్నదానను. వాక్పతులచేతకూడ ఎప్పుడు మనస్సులో ధరించుటకు శక్యం కానిదది. ఈశా! నీ పాదధూళినే స్మరిస్తూ ఉంటాను.

**ఆహంకారిక ప్రాణాచ్చ గుణైశ్చ దశభిః సదా ।**
**న్యూనభూతాం చ మాం పాహి కృపాలో భక్తవత్సల ॥9॥**

అహంకారిక ప్రాణం కన్న పదిపాళ్లు తక్కువదాననైయున్నాను. కృపాలూ! భక్తవత్సలా! నన్ను రక్షించు.

**ఏవం స్తుత్వా శచీదేవీ తూష్ణీం భగవతీహ్యభూత్ ।**
**తదనంతరజా స్తోతుం రతిః సముపచక్రమే ॥10॥**

భగవతి అయిన శచీదేవి ఇట్లు స్తుతించి మౌనం వహించింది. ఆ తరువాత పుట్టిన రతి స్తుతించుటకు ఉపక్రమించింది

**రతిరువాచ –** రతి పలికింది.

**సంచింతయామి నృహరే ర్వదనారవిందంభృత్యానుకంపిత ధియా హి గృహీత మూర్తిమ్ ।**
**యచ్ఛ్రీనికేతమజరుద్ర రమాదికైశ్చ సంలాలితం కుటిలకుంతల బృందజుష్టమ్ ॥11॥**

సేవకులకు ఉపయోగపడే బుద్ధిచే మూర్తిమత్వమును గ్రహించిన నృహరి యొక్క ముఖపద్మం ఎప్పుడూ ధ్యానిస్తూ ఉంటాను. అది వంకరలు తిరిగిన ముంగురులుచే సేవింపబడేది. శ్రీకి నిలయమైనట్టిది. బ్రహ్మ, రుద్రుడు, రమ మున్నగు వారిచే చక్కగా పాలింపబడేది.

**ఏతాదృశం తవ ముఖం నువితుం న శక్తిః శచ్యా సమాపి భగవన్నపరిపాహి నిత్యమ్ ।**
**కృత్వా స్తుతిం గతిరియం పరమాదరేణ తూష్ణీం స్థితా భగవతశ్చ సమీప ఏవ ॥12॥**

ఇటువంటి నీ మోమును స్తుతించుటకు నాకు శక్తిలేదు. భగవన్! శచీదేవితో సమానంగా నిత్యమూ నన్ను పరిరక్షించు. ఈ విధంగా రతి మిక్కిలి గౌరవంతో స్తుతిజేసి భగవంతుని సమీపంలో ఉండి మౌనం వహించింది.

**రత్యనంతరజో దక్షః స్తోతుం సముపచక్రమే ॥13॥**

రతి తరువాత పుట్టిన దక్షుడు ఇట్లు స్తుతించుటకు ఉపక్రమించాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు వచించాడు.

**సంచింతయే భగవతశ్చరణార్ద్రతీర్థం భక్త్యా హ్యజేన పరిషిక్త మజాది వంద్యమ్ ।**
**యచ్ఛౌచ నిఃసృత మజప్రవరావతారం గంగాఖ్య తీర్థమభవత్సరితాం వరిష్ఠమ్ ॥14॥**

భక్తిచే, అజునిచే, తడుపబడి, అజాదులచే నమస్కరింపబడి, కడుగబడి ప్రవహించి అజుని ద్వారా గొప్పదిగా అవతరించి నదులలో గొప్పదైన 'గంగ' అనే తీర్థం, పుట్టిన భగవంతుని చరణమును కడిగిన తీర్థాన్ని ఎల్లప్పుడు ధ్యానిస్తుంటాను.

**రుద్రోఽపి తేన విధృతేన జటాకలాప పూతేన పాదరజసా హ్యశివః శివోఽభూత్ ।**
**ఏతాదృశం తే చరణం కరుణేశ విష్ణో స్తోతుం శక్తిర్మమ నాస్తి కృపావతార ॥**
**రత్యా సమః శ్రుతిగతో నగతోఽస్మి మోక్షమ్ ఏతాదృశం చ పరిపాహి నిదానమూర్తే ॥15॥**

రుద్రుడు కూడ దానిని జటాజూటమునందుంచి ధరించుటచే ఆభరణ పవిత్రుడయ్యాడు, ఆ పాద రజస్సువలన అమంగళుడు కూడ మంగళుడు అవుతాడు. అటువంటి నీ పాదమును స్తుతించుటకు కరుణేశా! విష్ణూ! కృపావతారా! నాకు శక్తి చాలదు. రతితో సమునిగా వినబడుతూ ఉంటాను. మోక్షం పొందుటకు అర్హుడనుకాను. ఆదికారణమూర్తీ! ఇటువంటి వానిని పరిరక్షింపుము.

**ఏవం స్తుత్వా స దక్షస్తు తూష్ణీమేవ బభూవ హ ।**
**తదనంతరజః స్తోతుం బృహస్పతి రుపాక్రమీత్ ॥16॥**

ఆ దక్షుడు ఈవిధంగా స్తుతించి మౌనాన్ని పొందాడు. ఆ తరువాతపుట్టిన బృహస్పతి స్తుతించుటకు ఉపక్రమించాడు.

**బృహస్పతిరువాచ –** బృహస్పతి అన్నాడు.

**సంచింతయామి సతతం తవచాననాబ్జం త్వం దేహి దుష్టవిషయేషు విరక్తిమీశ ॥17॥**

**ఏతేషు శక్తిర్యది వై సజీవో (వః) కర్తా చ భోక్తా చ సదా చ దాతా ।**
**యోషాం చ పుత్ర సుహృదౌ చ పశూంశ్చ సర్వమేవం వినశ్యతి యతో హి తదాశు ఛింది ॥18॥**

ఈశా! నీ ముఖపద్మమును ఎల్లప్పుడు ధ్యానిస్తూ ఉంటాను. చెడ్డ విషయములందు విరక్తిని నాకు కలుగజేయవలసింది. వాటి యందు రక్తి ఉన్నచో అతడు జీవుడుగానే ఉంటాడు. ఆ జీవుడు తానే కర్త, భోక్త, దాత (అని భావిస్తాడు). స్త్రీని, పుత్రుని, స్నేహితుని, పశువులను సర్వమునూ పోగొట్టుకొంటాడు. అందువలన ఆ జీవత్వాన్ని వెంటనే ఛేదించు.

**సంసార చక్ర భ్రమణేనైవ దేవ సంసార దుఃఖమనుభూయే హా గతో౽స్మి ।**
**శక్తిర్నచాస్తి నవనే మమ దేవదేవ రత్యా సమంచ సతతం పరిపాహి నిత్యమ్ ॥19॥**

దేవా! సంసారచక్రంలో పరిభ్రమిస్తూ, సంసారదుఃఖాన్ని అనుభవించుటకు ఇక్కడకు వచ్చియున్నాను. దేవదేవా! నిన్ను నుతించుటకు శక్తిచాలదు. నేను రతితో ఎప్పుడు సమానుడను. నిత్యమూ నన్ను పరిరక్షించు.

**ఏవం స్తుత్వా చ పరమం తూష్ణీమేవ స్థితో మునిః ।**
**తదనంతరజః స్తోతుం హ్యనిరుద్ధోపచక్రమే ॥20॥ (ద్ధః)**

ఈ విధంగా మిక్కిలిగా స్తుతించి ఆ ముని మౌనం దాల్చి, ఉండి పోయాడు. ఆ తరువాత పుట్టిన అనిరుద్ధుడు స్తుతించుటకు ప్రారంభించాడు.

**అనిరుద్ధ ఉవాచ** – అనిరుద్ధుడు పలికాడు.

**ఏవం హరే స్తవ కథాం రసికాం విహాయ స్త్రీణాం భగే చ వదనే పరిముహ్య నిత్యమ్ ।**
**విష్ఠాంత్రపూరితబిలే రసికో హి నిత్యం స్థాయీ చ సూకరవదేవ విమూఢబుద్ధిః ॥21॥**

ఇటువంటివాడవైన హరివగు నీ యొక్క రసవంతమైన కథను విడిచి, నిత్యమూ స్త్రీల యొక్క భగము నందు, ముఖము నందు మోహపడి, పురీషంతోను, ప్రేగులతోను నిండిన రంధ్రమందు రసికుడై, నిత్యమూ విశేషమైన మోహబుద్ధి కలవాడు సూకరం వంటి వాడే కదా!

**మజ్జాస్థి పిత్త కఫ రక్త మలాది పూర్ణే చర్మాంత్రవేష్టిత ముఖే పతితం హి పీతమ్ ।**
**ఆస్వాదనే మమ చ పాపగతేర్మురారేమాయాబలం తవ విభో పరమం నిమిత్తమ్ ॥22॥**

మజ్జ, అస్థి, పిత్తం, కఫం, రక్తం, మలం మున్నగు వాటిచే నిండి చర్మంతోను, ప్రేగులతోను చుట్టుకొనబడిన ప్రదేశం ఎదుట (ముఖము నందు) పడిన దానిని త్రాగుతూ, ఆస్వాదిస్తూ ఉండే పాపగతినైన నాకు మురారీ! విభూ! నీ మాయాబలమే పరమకారణం కదా!

**సంసారచక్రే భ్రమతశ్చ నిత్యం సుదుఃఖ రూపే సుఖలేశ వర్జితే ।**
**మలం వమంతం నవభిశ్చ ద్వారైః శరీర మారుహ్య సుమూఢబుద్ధిః ॥23॥**

మిక్కిలి దుఃఖరూపమై, కొంచెమైన సుఖం కూడ లేని సంసారచక్రంలో నిత్యము పరిభ్రమిస్తూ, మలమును బయటకుత్రోసే తొమ్మిది ద్వారాలతో కూడిన శరీరాన్ని ఆరోహించి మిక్కిలి మూఢబుద్ధినై యున్నాను.

**నమామి నిత్యం తవ సత్కథామృతం విహాయ దేవ శ్రుతిమూల నాశమ్ ।**
**కుటుంబ పోషం చ సదా చ కుర్వన్ దానాద్యకుర్వన్నివసన్ గృహే చ ॥24॥**

నిత్యమూ నిన్ను నమస్కరిస్తున్నాను. నీదైన పుణ్యకథామృతమును విడనాడి, దేవా! వేదధర్మవినాశకమైన కుటుంబపోషణనే ఎల్లప్పుడు చేస్తూ, దానాదులనుఏమీ చేయకుండా, కేవలం గృహస్థుడనై వసిస్తున్నాను.

**దూరే చ సంసారమలం త్విదం కురు దేహిహ్యాదో దివ్య కథామృతం సదా ।**
**ఏతాదృశో౽హం తవ సద్గుణౌఘం స్తోతుం సమర్థో నాస్మి శచీ సమశ్చ ॥25॥**

ఈ సంసారమును దూరంగానుంచు. ఎల్లప్పుడు ఆ దివ్యకథామృతం నాకు ఇమ్ము. ఇటువంటివాడనైన నేను నీ సద్గుణాల సమూహమును స్తుతించుటకు సమర్థుడను కాను. నేను శచీదేవితో సమానమైనవాడను.

**ఏవం స్తుత్వానిరుద్ధస్తు తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజః స్తోత్రం మనుః స్వాయంభువోఽబ్రవీత్ ॥26॥**

ఈ విధంగా స్తుతించి అనిరుద్ధుడు మౌనందాల్చాడు. ఆ తరువాత పుట్టిన స్వాయంభువమనువు ఇలా స్తోత్రం చేశాడు.

**స్వాయంభువ ఉవాచ –** స్వాయంభువుడు పలికాడు.

**స్తోతుం హ్యనుప్రవిశతోఽపినగర్భదుఃఖం ।**
**తస్మాదహం పరమపూజ్యపదం గతస్తే ॥27॥**

గర్భదుఃఖమున ప్రవేశించువానికి స్తుతించుటకు శక్తిచాలదు. అందువలన నేను నీ పరమ పూజ్యపదాన్ని పొందుతున్నాను.

**మనోర్భార్యా మానవీ చ యమః సంయమినీ పతిః ।**
**దిశాభిమానీ చంద్రస్తు సూర్యశ్చక్షుర్నియామకః ॥28॥**

మనువు భార్య మానవి, సంయమినీవిభుడైన యముడు, దిశాభిమానియైన చంద్రుడు, చక్షువుకు నియామకుడైన సూర్యుడు వీరు సంసారమును విడుచుటలో పరస్పరం సమానమైనవారు.

**ప్రవాహో ద్విగుణో నశ్చేత్వేవం జానీహి చాండజ ।**
**సూర్యానంతరజః స్తోతుం వరుణః సంప్రచక్రమే ॥29॥**

అండసముద్భవా! ప్రవాహుని కన్న రెండుపాళ్లు వారు తక్కువైనవారు. సూర్యుని తరువాత పుట్టిన వరుణుడు ఇలా స్తుతించుటకు ఉపక్రమించాడు.

**వరుణ ఉవాచ –** వరుణుడు పలికాడు.

**త్వదిచ్ఛయా రచితే దేహగేహే పుత్రే కలత్రేఽపి ధనే ద్రవ్యజాతా ।**
**మమాహమిత్యల్ప ధియా చ మూఢా సంసారదుఃఖే వినిమజ్జంతి సర్వే ॥30॥**

నీ యొక్క సంకల్పంచే కల్పింపబడిన దేహమందు, గృహమందు, కలత్రమందు, పుత్రునియందు, ధనమునందు, ద్రవ్యసమూహమందు, “నాది, నేను” అనే అల్పబుద్ధితో అజ్ఞానులై అందరును సంసారదుఃఖంలో మునిగిపోతున్నారు.

**అతో హరే తాదృశీం కుబుద్ధిం వినాశ్య మే దేహి తే పాదదాస్యమ్ ।**
**అహం మనోః పాదపాదార్ధభూత గుణేన హీనః సర్వదా వై మురారే ॥31॥**

హరీ! అందువలన అటువంటికుత్సిత బుద్ధిని నశింపజేసి నాకు నీ పాదదాస్యాన్ని ఇమ్ము. నేను మనువుకన్న ఒకటిన్నర పాళ్లు మురారీ! ఎల్లప్పుడు తక్కువవాడను.

**ఏవం స్తుత్వా తు వరుణః ప్రాంజలిః సముపస్థితః ।**
**వరుణానంతరోత్పన్నో నారదోహ్యస్తువద్ధరిమ్ ॥32॥**

ఈవిధంగా వరుణుడు స్తుతించి దోయిలొగ్గి ఉండిపోయాడు. వరుణుని తరువాత ఉద్భవించిన నారదుడు హరిని ఇలా స్తుతించాడు.

**నారద ఉవాచ –** నారదుడు నుతించాడు.

**యన్నామధేయ శ్రవణానుకీర్తనాత్ స్వాద్వన్యతత్త్వం మమ నాస్తి విష్ణో ।**
**పునీహ్యతశ్చైవ పరో వరాయాన్యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తస్య ॥33॥**

విష్ణూ! నీ నామం శ్రవణం చేయడం, కీర్తించడం తప్ప మిగిలిన తత్త్వం నాకు రుచించునదికాదు. జిహ్వాగ్రమునందు నీ నామం అన్యమైన మరో నామంకంటె శ్రేష్ఠమై ఉంటుంది. కావున నన్ను పవిత్రుని చేయుము.

**యజ్జిహ్వాగ్రే హరినామైవ నాస్తి సబ్రాహ్మణో నైవ స ఏవ గోఖరః ।**
**అహం న జానే చ తవ స్వరూపం న్యూనో హ్యహం వరుణాత్సర్వదైవ ॥34॥**

ఎవని జిహ్వాగ్రంపై హరి నామం ఉండదో (పలుకబడదో), అతడు బ్రాహ్మణుడు కాడు. అతడు వాక్కునందు గాడిదే అవుతాడు. నేను నీ స్వరూపం తెలియనివాడను. నేను ఎల్లప్పుడునూ వరుణుని కన్న తక్కువవాడను.

**ఏవం స్తుత్వా నారదో వై ఖగేంద్రతూష్ణీమభూద్దేవదేవస్య చాగ్రే ।**
**యో నారదానంతరం సంబభూవభృగుర్మహాత్మా స్తోతుముపచక్రమే ॥35॥**

ఖగేంద్రా! ఈ విధంగా నారదుడు స్తుతించి దేవదేవుని ఎదుట మౌనస్థితిని వహించాడు. నారదుని తరువాత జన్మించిన, ఆ మహాత్ముడు భృగుడు స్తుతించుటకు ఉపక్రమించాడు.

**భృగురువాచ –** భృగువు పలికాడు.

**కిమాసనం తే గరుడాసనాయ కింభూషణం కౌస్తుభ భూషణాయ ।**
**లక్ష్మీ కలత్రాయ కిమస్తి దేయం వాగీశ కింతే వచనీయమస్తి ॥**
**అతో న జానే తవ సద్గుణాంశ్చ హ్యహం సదా వరుణాత్పాద హీనః ॥36॥**

గరుడాసనా! నీకు ఏ ఆసనం కల్పించగలను? కౌస్తుభభూషణా! నీకు ఇచ్చుటకు ఏమున్నది? (ఈయవలసినది ఏది) వాక్పతీ! నీకు చెప్పవలసినది ఏమున్నది? అందువలన నీ సద్గుణాలను తెలియని నేను ఎప్పుడును వరుణుని కన్న ఒకపాలు తక్కువవాడను.

**ఏవం స్తుత్వా హరిం దేవం భృగుస్తూష్ణీం బభూవ హ ।**
**తదనంతరజో హ్యగ్నిరస్తావీత్పురుషోత్తమమ్ ॥37॥**

ఈ విధంగా దేవుడైన హరిని స్తుతించి భృగువు మౌనం వహించాడు. ఆ తరువాత పుట్టిన అగ్ని పురుషోత్తముని ఇలా స్తుతించాడు.

**అగ్నిరువాచ –** అగ్ని పలికాడు.

**యత్తేజసాహం సుసమిద్ధతేజా ।**
**హవ్యం వహామ్యధ్వరే ఆజ్య సిక్తమ్ ॥38॥**

**యత్తేజసాహం జఠరే సంప్రవిశ్యపచన్నన్నం సర్వదా పూర్ణ శక్తిః ।**
**అతో న జానే తవ సద్గుణాంశ్చభృగోరహం సర్వదైవం సమోఽస్మి ॥39॥**

ఎవని తేజస్సుచే నేను మిక్కిలి ప్రకాశిస్తున్నానో, ఎవని తేజస్సుచే జఠరంలో ప్రవేశించి ఎల్లప్పుడు అన్నాన్ని పచనం చేస్తూ ఉంటానో, అధ్వరము నందు నేతితో తడుపబడిన హవ్యం గ్రహిస్తూ ఉంటానో, పూర్ణమైన శక్తిని కల్గి ఉంటానో, అటువంటి నేను నీ సద్గుణాలను తెలియజాలను.నేను ఎల్లప్పుడు భృగువుతో సమానుడను.

**తదనంతరజా స్తోతుం ప్రసూతిరుపచక్రమే ॥40॥**

ఆ తరువాత పుట్టిన ప్రసూతి ఇలా స్తుతించుటకు పూనుకొన్నది.

**ప్రసూతిరువాచ –** ప్రసూతి పలికింది.

**యన్నామార్థ విచారణేఽపి మునయో ముహ్యంతి వై సర్వదా**
**తద్భీతా అపి దేవతా హ్యవిరతం స్త్రీభిః సహైవ స్థితాః ।**
**మాంధాతృ ధ్రువ నారదాశ్చ భృగవో వైవస్వతాద్యాఖిలాః**
**ప్రేమ్ణా వై ప్రణమామ్యహం హితకృతే తస్మై నమో విష్ణవే ॥41॥**

ఎవని నామం యొక్క అర్థమును వివరించుటలో మునులు కూడ ఎల్లప్పుడు మోహం పొందుతూ ఉంటారో, ఎవని వలన భయపడి దేవతలు ఎల్లప్పుడు కూడ స్త్రీలతో కలసి ఒదిగి ఉంటారో, మాంధాత, ధ్రువుడు, నారదుడు, భృగువు, వైవస్వతుడు మున్నగువారు కూడ ఎవరికి ఒదిగి ఉంటారో, అటువంటి నీకు నేను ప్రీతితో నమస్కరిస్తున్నాను. మేలుచేసే ఆ విష్ణువుకు నమస్కారం.

**అతో న జానే తవ సద్గుణాన్సదా ఏవం విధా కా మమ శక్తి రస్తి ।**
**స్తుత్వా హ్యేవం ప్రసూతిస్తుతూష్ణీమాసీత్ఖగేశ్వర ॥42॥**

అందువలన నీ సద్గుణాలను ఎన్నడును నేను తెలియజాలను. ఇటువంటి నాకు అంతటి శక్తి ఎక్కడిది? ఖగేశ్వరా! ఈ విధంగా ప్రసూతి ప్రస్తుతించి మౌనం వహించింది.

**అగ్నిర్వాగాత్మకో బ్రహ్మపుత్రో భృగుఋషిస్తథా ।**
**తద్భార్యా వై ప్రసూతిస్తు త్రయ ఏతే సమాః స్మృతాః ॥43॥**

వాగాత్మకుడైన అగ్ని, బ్రహ్మపుత్రుడైన భృగుమహర్షి వారి భార్యలును, ప్రసూతియును వీరు ముగ్గురు సములుగా స్మరింపబడుతుంటారు.

**వరుణాత్పద హీనాశ్చ ప్రవహో ద్విగుణాధమాః ।**
**దక్షాచ్చుతావరా జ్ఞేయా మిత్రాత్తు ద్విగుణాధికాః ॥44॥**

వరుణుని కన్న ఒకపాలు తక్కువ వారు. ప్రవహుని కన్న రెండుపాళ్లు తక్కువవారు. దక్షుని కన్న వంద(నూరు) పాళ్లు తక్కువవారు. మిత్రుని కన్న రెండుపాళ్లు ఎక్కువవారు.

**ప్రసూత్యనంతరం జాతో వసిష్ఠో బ్రహ్మనందనః ।**
**వినయావనతో భూత్వా స్తోతుం సముపచక్రమే ॥45॥**

ప్రసూతి అనంతరం పుట్టిన బ్రహ్మనందనుడైన వసిష్ఠుడు. వినయంతో తలవంచి స్తుతించుటకు ఉపక్రమించాడు.

**వసిష్ఠ ఉవాచ –** వసిష్ఠుడు పలికాడు.

**నమోఽస్తు తస్మై పురుషాయ వేధసే నమోనమోఽసద్వృజినచ్ఛిదే నమః ।**
**నమో నమో స్వాఙ్గ భవాయ నిత్యం నతోఽస్మి హే నాథ తవాంఘ్రిపంకజమ్ ॥46॥**

ఆ పురుషునకు, వేధకు నమస్కారం. సత్తుకు భిన్నమైన పాపమును ఛేదించువానికి నమస్కారం. తన అంగములచే పుట్టిన (స్వయంభువుకు) వానికి నమస్కారం. ఓ ప్రభూ! నీ పాదపద్మమునకు నిత్యమూ వినమ్రుడనై ఉన్నాను.

**మాం పాహి నిత్యం భగవన్వాసుదేవహ్యగ్నేరహం సర్వదా న్యూన ఏవ ।**
**మిత్రాదహం సర్వదా కించిదూనః స్తుత్వా దేవం సోఽభవత్తత్ర తూష్ణీమ్ ॥47॥**

స్వామీ! వాసుదేవా! నిత్యమునూ నన్ను రక్షించు. అగ్నికన్న నేను ఎప్పుడూ తక్కువవాడను. మిత్రుని కన్న ఎల్లప్పుడును కొంచెం తక్కువవాడను. అని ఈ విధంగా దేవుని స్తుతించి అతడు అక్కడ మిన్నకుండిపోయాడు.

**యో వసిష్ఠానంతరజో మరీచిర్బ్రహ్మనందనః ।**
**హరిం తుష్టావ పరయా భక్త్యా నారాయణం గురుమ్ ॥48॥**

వసిష్ఠుని తరువాత పుట్టిన బ్రహ్మనందనుడైన మరీచి తన గురువైన హరిని నారాయణుని మిక్కిలి భక్తితో ఇలా స్తుతించాడు.

**మరీచిరువాచ –** మరీచి పలికాడు.

**దేవేన చాహం హతధీర్భవనప్రసంగాత్ సర్వాశుభోపగమనా ద్విముఖేంద్రియశ్చ ।**
**కుర్వే చ నిత్యం సుఖలేశలవాదినా త్వద్దరం మనస్త్వశుభకర్మ సమాచరిష్యే ॥49॥**

దైవంచే బుద్ధి హరింపబడినది నివేశన ప్రసంగంలో అశుభాలు అన్నీ వరించుట వలన ఇంద్రియనిగ్రహం కోల్పోయాను. నిత్యమూ కొద్దిపాటి సుఖమాశించి కర్మమాచరిస్తున్నాను. నీ వలన నా మనస్సు భయం పొందియున్నది. అశుభకర్మను ఆచరించిస్తున్నాను.

**ఏతా దృశోఽహం భగవాననంతః సదా వసిష్ఠస్య సమాన ఏవ ॥ 50**

నేను ఇటువంటివాడను. నీవు భగవంతుడవు, అనంతుడవు. ఎల్లప్పుడు నేను వసిష్ఠునితో సమానుడను.

**ఏవం స్తుత్వా మరీచిస్తు తూష్ణీమాస తదా ఖగ ।**
**తదనంతరజో హ్యత్రి రస్తావీత్ప్రాంజలిర్హరిమ్ ॥51॥**

ఖగమా! మరీచి ఈ విధంగా స్తుతించి మౌనాన్ని వహించాడు. ఆ తరువాత పుట్టిన అత్రి దోయిలొగ్గి హరినిలా స్తుతించాడు.

**ఆవిర్భవజ్జగత్ప్రభవాయావతీర్ణం తద్రక్షణార్థ మనవద్యం చ తథావ్యయాయ ।**
**తత్త్వార్థమూలమవికారి తవ స్వరూపంహ్యానందసారమత ఏవ వికారశూన్యమ్ ॥52॥**

జగత్తుయొక్క పుట్టుక కొరకు ఆవిర్భవించినది. నిందలేని రీతిలో దాని రక్షణకోసమై దిగి వచ్చినది. అట్లే అవ్యయమైనది. తత్త్వం యొక్క అర్థమే మూలమైనది నీ స్వరూపం. ఏవికారం లేనిది. వికారశూన్యమైన కారణంచే అది ఆనందమే సారమైనది.

**త్రైగుణ్య శూన్యమఖిలేషు చ సంవిభక్తం తత్ర ప్రవిశ్య భగవన్నహి పశ్యతీవ ।**
**అతో మురారే స్తవ సద్గుణాంశ్చస్తోతుం న శక్నోమి మరీచితుల్యః ॥53॥**

అది త్రైగుణ్యశూన్యమైనది. సమస్తమునందు చక్కగా విభక్తమై ఉంటుంది. భగవంతుడా! అక్కడ ప్రవేశించి యున్నప్పటికి చూడనట్లే ఉంటావు. అందువలన మురారివైన నీయొక్క సద్గుణాలను స్తుతించుటకు శక్తిలేనివాడను. మరీచితుల్యుడను.

**ఏవం స్తుత్వా హ్యత్రిరపి తూష్ణీమాస తదా ఖగ ।**
**తదనంతరజః స్తోతుమంగిరా వాక్యమబ్రవీత్ ॥54॥**

ఖగమా! ఈ విధంగా స్తుతించి అత్రి కూడ మౌనం దాల్చాడు, ఆ తరువాత పుట్టిన అంగిరసుడు స్తుతించుటకు ఇలా పలికాడు.

**అంగిరా ఉవాచ –** అంగిరసుడు పలికాడు.

**ద్రష్టుం న శక్నోమి తవ స్వరూపంహ్యనంత బాహూదరమస్తకం చ ।**
**అనంత సాహస్ర కిరీటజుష్టం మహార్హనానాభరణైశ్చ శోభితమ్ ॥**
**ఏతాదృశం రూపమనంతపారం స్తోతుం హ్యశక్తస్తు సమోఽస్మి చాత్రేః ॥55॥**

అనంతబాహువులతోను, మస్తకములతోను అనంతసహస్ర కిరీటాలచే మిక్కిలి విలువైన నానావిధా భరణములచే శోభించే నీ స్వరూపమును చూచుటకు నేను అర్హుడనుకాను. పారంలేని నీ స్వరూపం అనంతం. అటువంటి దానిని స్తుతించుటకు నేను అశక్తుడను. అత్రితో సమానుడను.

**ఏవం స్తుత్వా హ్యంగిరాశ్చ తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజః స్తోతుం పులస్త్యో వాక్యమబ్రవీత్ ॥56॥**

ఖగేశ్వరా! ఇట్లు స్తుతించి అంగిరుడు మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన పులస్త్యుడు స్తుతించుటకు ఇలా పలికాడు

**పులస్త్య ఉవాచ –** పులస్త్యుడు పలికాడు.

**యో వా హరిస్తు భగవాన్స (స్వ) ఉపాసకానాం సందర్శయే ద్భువన మంగల మంగలం చ ।**
**యస్మై నమో భగవతే పురుషాయ తుభ్యం యో వావితా నిరయభాగ గమప్రసంగే ॥57॥**

ఏ భగవంతుడైన హరి తన ఉపాసకులకు భువనమంగల శుభాలను ప్రదర్శిస్తూ ఉంటాడో, నరకలోక వాసం పొందే సమయంలో ఎవడు రక్షిస్తూ ఉంటాడో, అటువంటి భగవానుడవైన, పురుషుడవైన నీకు నమస్కారం.

**ఏతాం దృశాంస్తవ గుణాన్నవితుం న శక్తమ్ ।**
**మాం పాహి భగవన్ సదృశో హ్యంగిరసా చ ॥58॥**

భగవంతుడా! ఇటువంటి నీ గుణాలను నుతించుటకు అశక్తుడనైన నన్ను రక్షించు. నేను అంగిరునితో సమానుడను.

**ఏవం స్తుత్వా పులస్త్యోఽపి తూష్ణీమేవ బభూవ హ ।**
**తదనంతరజః స్తోతుం పులహో వాక్యమబ్రవీత్ ॥59॥**

ఇట్లు స్తుతించి పులస్త్యుడు కూడ మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన పులహుడు స్తుతించుటకు ఇలా పలికాడు.

**పులహ ఉవాచ –** పులహుడు పలికాడు.

**నిష్కామ రూపరహితస్య సమర్పితం చ స్నానాంబరోత్తమ పయః ఫలపుష్పభోజ్యమ్ ।**
**ఆరాధనం భగవతస్తవ సత్క్రియాశ్చ వ్యర్థం భవేదితి వదంతి మహానుభావాః ॥60॥**

ఏ కోరిక, రూపం, లేని నీకు స్నానం, వస్త్రం, శ్రేష్ఠమైనపాలు, ఫలం, పుష్పం, భోజ్యం సమర్పించడం భగవంతుని ఆరాధించడం, నీకు సత్క్రియలు ఆచరించడం వ్యర్థమే అవుతుందని మహానుభావులు వచిస్తారు.

**తస్మై సదా భగవతే ప్రణమామి నిత్యం నిష్కామయా తవ సమర్పణమాత్ర బుద్ధ్యా ।**
**వైకుంఠనాథ భగవన్ స్తవనే న శక్తిః సోఽహం పులస్త్య సదృశోఽస్మి న సంశయోఽత్ర ॥61॥**

అటువంటి భగవంతుడవైన నీకు నిష్కామమైన సమర్పణబుద్ధిమాత్రంచే ఎల్లప్పుడు ప్రణమిల్లుతుంటాను. వైకుంఠనాథా! స్వామీ! నీ స్తవనము నందు నాకు శక్తి చాలదు. నేను పులస్త్యునితో సమానుడనై ఉన్నాను. ఇందు సందియం లేదు.

**ఏవం స్తుత్వా తు పులహ స్తూష్ణీమాస తదా ఖగ ।**
**తదనంతరజః స్తోతుం క్రతుః సముపచక్రమే ॥62॥**

ఖగమా! ఇట్లు స్తుతించి పులహుడు మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన క్రతువు స్తుతించుటకు ఉపక్రమించాడు.

**క్రతురువాచ –** క్రతువు వచించాడు.

**ప్రాణప్రయాణసమయే భగవంస్తవైవ నామాని సంసృతిజ దుఃఖవినాశకాని ।**
**యేనైక జన్మ శమలం సహసైవ హిత్వాసంయాతి ముక్తి మమలాం తమహం ప్రపద్యే ॥63॥**

స్వామీ! ప్రాణాలు పోయే సమయంలో నీ నామాలు, సంసారదుఃఖాలను నశింపజేసేవి. ఎవని వలన ఈ నశించిపోయే జన్మను వదిలి వెంటనే నిర్మలమైన ముక్తిని పొందవచ్చో, అట్టి భగవంతుని నేను శరణు అర్థిస్తున్నాను.

**యే భక్త్యా వివశా విష్ణో నామమాత్రైకజల్పకాః ।**
**తేఽ పి ముక్తిం ప్రయాంత్యాశు కిముత ధ్యాయినః సదా ॥64॥**

ఎవరు భక్తితో పరవశులై విష్ణువు యొక్క నామం పలుకుతూ ఉంటారో, వారు శీఘ్రంగా ముక్తిని పొందుతున్నారు. ఇక ఎల్లప్పుడు ధ్యానం చేసే వారిని చెప్పనేల?

**ఏవం స్తుత్వా క్రతురపి తూష్ణీమాస ఖగేశ్వర ।**
**తదనంతరజః స్తోతుం మనుర్వైవస్వతోఽ బ్రవీత్ ॥65॥**

ఖగేంద్రా! ఈ విధంగా క్రతువు స్తుతించి మౌనస్థితిని పొందాడు. ఆ తరువాత పుట్టిన వైవస్వత మనువు స్తుతించుటకై ఇలా పలికాడు.

**వైవస్వత ఉవాచ –** వైవస్వతుడు పలికాడు.

**సోహం హి కర్మ కరణే నిరతః సదైవ స్త్రీణాం భోగే చ నిరతశ్చ గుదే ప్రమత్తః ।**
**జిహ్వేంద్రియే చ నిరతస్తవ దర్శనే చ సమ్యగ్విరాగసహితః పరమోదరేణ ॥66॥**

నేను ఎల్లప్పుడు కర్మలు చేయుట యందే ఆసక్తి కలవాడను. స్త్రీలను భోగించుట యందు ఆసక్తిగలవాడను. వారి గుదము నందు మిక్కిలి మదించియున్నవాడను. జిహ్వేంద్రియమందు(నాలుక) కూడ నిరతుడను. మిక్కిలి భయంతో నీ దర్శనమందు కూడ వైరాగ్యం కలవాడను.

**మాంసాస్థిమజ్జారుధిరైః సహితే చ దేహే భక్తిం సదైవ భగవన్నపి తస్కరే చ ।**
**గుర్వగ్నిబాడబ గవాదిషు సత్సు దుఃఖాత్ సమ్యగ్విరక్తి ముపయామి సహస్వ నిత్యమ్ ॥67॥**

భగవంతుడా! మాంసం, అస్థి, మజ్జ, రుధిరంతో కూడుకొన్న శరీరము నందు దొంగతనము నందు మాత్రమే ఎప్పుడును ప్రీతిని కలవాడను. గొప్పదైన అగ్ని, (గురువు అగ్ని)గుఙ్టాలు, గోవులు ఉన్నప్పటికిని దుఃఖంతో ఉన్నాను. గొప్పదైన విరక్తిని పొందుతున్నాను. నిత్యమూ నన్ను సహించు.

**లోకానువాదశ్రవణే పరమా చ శక్తిర్నారాయణస్య నమనే న చ మేఽ స్తి శక్తిః ।**
**లోకానుయాన కరణే పరమా చ శక్తిః క్షేత్రాది మార్గ గమనే పరమాహ్యాశక్తిః ॥68॥**

లౌకిక విషయాలను వినుటలో మాత్రమే ఎంతో శక్తి ఉంటోంది. నారాయణుని నమస్కరించుట యందు మాత్రం నాకు శక్తి సరిపోవుటలేదు. లౌకిక ప్రదేశాలకు ప్రయాణంచేయుటలో ఎంతో శక్తి ఉంటోంది. పుణ్యక్షేత్రాదుల మార్గంలో పయనించటానికి మాత్రం శక్తి లేకుండపోతోంది.

**వైశ్యాదికేషు ధనికేషు పరా చ శక్తిః ।**
**సద్బ్రాహ్మణేష్వపి న శక్తి రహో మురారే ॥69॥**

వైశ్యాదులందు, ధనవంతులందు ఉండటానికి ఎంతో శక్తి ఉంటోంది. మురారీ! అయ్యో! సద్బ్రాహ్మణుని యందుండుటకు శక్తి చాలటం లేదు.

**వైవస్వతమనుర్దేవం స్తుత్వా తూష్ణీం బభూవ హ ।**
**తదనంతరజః స్తోతుం విశ్వామిత్రోపచక్రమే ॥70॥**

ఈ విధంగా దేవుని వైవస్వత మనువు స్తుతించి, మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత పుట్టిన విశ్వామిత్రుడు స్తుతించుటకు ఉపక్రమించాడు.

**విశ్వామిత్ర ఉవాచ** – విశ్వామిత్రుడు వచించాడు.

**న ధ్యాతే చరణాంబుజే భగవతే సంధ్యాపి నానుష్ఠితా**
**జ్ఞానద్వార కపాట పాటన పటుర్ధర్మోఽపి నోపార్జితః ।**
**అంతర్వ్యాప్త మలాభిఘాత కరణే పట్వీ శ్రుతా తే కథా**
**నో దేవ శ్రవణేన పాహి భగవన్ మామత్రి తుల్యం సదా ॥71॥**

భగవంతుని చరణపద్మం ధ్యానించలేదు. సంధ్యను అనుష్ఠించలేదు. జ్ఞానమనే ద్వారం యొక్క తలుపును భేదించుటకు సమర్థుడనైనను, ఆ ధర్మమును పాటింపలేదు. లోపల వ్యాపించిన మాలిన్యాన్ని పూర్తిగా తొలగించుటలో నీకథ, సమర్థమైనదని తెలిసినను, దేవా! దానిని శ్రవణం చేయలేదు. స్వామీ! అత్రి తుల్యుడనైన నన్ను ఎల్లప్పుడు రక్షించు.

**విశ్వామిత్ర ఋషిస్త్వేవం స్తుత్వా తూష్ణీం బభూవ హ ।**
**భృగు నారద దక్షాంశ్చ విహాయ బహు పుత్రకాః ॥72॥**

**సప్త సంఖ్యా వసిష్ఠాద్యా విశ్వామిత్ర స్తథైవ చ ।**
**వైవస్వత మనుస్త్వేతే పరస్పర సమాః స్మృతాః ॥73॥**

విశ్వామిత్ర మహర్షి ఈ విధంగా స్తుతించి మౌనంగా ఉండిపోయాడు. భృగువును, నారదుని, దక్షుని, విడిచి మిగిలిన పెక్కు మంది పుత్రులను, వసిష్ఠుడు మున్నగు ఏడుగురు ఋషులును, అలాగే విశ్వామిత్రుడును, వైవస్వత మనువు ఒకరికొకరు సమానులుగా స్మరింపబడినారు.

**వహ్నే రప్యవరా నిత్యం కించిన్మిత్రాద్గుణాధికాః ।**
**తదనంతరజః స్తోత్రం వక్ష్యే శృణు ఖగేశ్వర ॥74॥**

వారు నిత్యమూ అగ్నికన్న తక్కువవారు. మిత్రుని కన్న కొంచెం గణాధిక్యం ఉన్నవారు. ఆ తరువాత పుట్టిన వారి స్తోత్రం చెబుతున్నాను, విను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే దేవతాది స్తుతి తత్తత్తారతమ్యనిరూపణం నామ సప్తమోఽధ్యాయః ॥7॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో దేవతాదులస్తుతి తారతమ్యభావనిరూపణం అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః** – ఎనిమిదవ అధ్యాయం

## **విష్ణుస్తుతిః దేవతా తారతమ్యం చ** – విష్ణుస్తుతి దేవతల తరతమభావం

**క్రతో రనంతరం జాతో మిత్రో (శ్రో) నామ ఖగేశ్వర ।**
**నారాయణం జగద్యోనిం స్తోతుం సముపచక్రమే ॥1॥**

ఖగేశ్వరా! క్రతువు తరువాత పుట్టిన మిత్రుడు(మిశ్రుడు) అనే పేరుగలవాడు జగత్కారకుడు అయిన నారాయణుని స్తుతించుటకు ఉపక్రమించాడు.

**మిత్ర ఉవాచ** – మిత్రుడు వచించాడు.

**నతోస్మ్యజ్ఞస్త్వచ్చరణారవిందం భవచ్ఛిదం స్వస్త్యయనం భవచ్ఛిదే ।**
**వేదే స్వయం భగవాన్ వాసుదేవో నాహం నాగ్నిర్న త్రిదేవా మునీంద్రాః ॥2॥**

నేను అజ్ఞుడను. సంసారాన్ని ఛేదించే, మంగళాన్ని పొందించే నీ చరణపద్మానికి నేను వినమ్రుడను. సంసారాన్ని ఛేదించు విషయంలో భగవంతుడైన వాసుదేవుడే స్వయంగా తెలియగలడు. నేను తెలియజాలను. అగ్ని, త్రిదేవులు, మునీంద్రులు తెలియజాలరు.

**అథా పరే భాగవత ప్రధానా యదా న జానీయు రథా పరే కుతః ।**
**మాం పాహి నిత్యం పరతోఽప్యధీశవిశ్వామిత్రాన్న్యూన ఏవేతి నిత్యమ్ ॥**
**అహం పర్జన్యాద్ద్విగుణ ఏవ నిత్యం అతో మమ స్తవనే నాస్తి శక్తిః ॥3॥**

అలాగే మిగిలిన భాగవతప్రధానులు కూడ తెలియజాలరు. ఇక తక్కిన వారి సంగతి చెప్పనేల? అధీశ్వరా! ఇతరుడనైనను నిత్యమూ నన్ను రక్షించు. విశ్వామిత్రుని కన్న ఎప్పుడునూ తక్కువవాడను. నేను పర్జన్యుని కన్న నిత్యమూ రెండుపాళ్లు తక్కువవాడను. అందువలన పొగడటానికి నాకు శక్తి చాలదు.

**ఏవం స్తుత్వా హరిం మిత్ర స్తూష్ణీమాస తదా ఖగ ।**
**తదనంతరజా తారా స్తోతుం సముపచక్రమే ॥4॥**

ఖగమా! ఈ విధంగా హరిని స్తుతించి మిత్రుడు మౌనం వహించాడు. ఆ తరువాత పుట్టిన తార స్తుతి చేయటానికి ఉపక్రమించింది.

**తారోవాచ** – తార పలికింది.

**అనన్యేన తు భావేన భక్తిం కుర్వంతి యో ధృఢామ్ ।**
**త్వత్కృతే త్యక్త కర్మాణ స్త్యక్త స్వజన బాంధవాః ॥5॥**

**త్వదాశ్రయాం కథాం శ్రుత్వా శృణ్వంతి కథయంతి చ ।**
**తథైతే సాధవో విష్ణో సర్వసంగదృఢవివర్జితాః ॥6॥**

ఇతర విషయములందు లగ్నం కాని మనస్సుతో ఎవరు దృఢమైన భక్తి కలిగి ఉంటారో, నీ విషయంలో అన్ని కర్మలను విడిచి, స్వజనబంధువులను కూడ విడిచి, నీవే ఆశ్రయంగా గల కథను ఎవరు వింటారో, చెబుతూ ఉంటారో, విష్ణూ! వారే సాధువులు, సర్వసంగపరిత్యాగులు.

**తన్మధ్యే పతితాం పాహి సదా మిత్రసమాం ప్రభో ।**
**తారాంతరజః ప్రాహ నిర్ఋతిశ్చ ఖగేశ్వర ॥7॥**

ఆ మధ్యలో పడి ఉన్న నన్ను రక్షించు. నేను ఎల్లప్పుడూ మిత్రునితో సమానురాలను. ఖగేశ్వరా! ఆ తరువాత పుట్టిన నిర్ఋతి ఇలా పలికాడు.

**నిర్ఋతి ఉవాచ –** నిర్ఋతి పలికాడు.

**యోగేన త్వయార్పితయా చ భక్త్యాసంయాంతి లోకాః పరమాం గతిం చ ।**
**ఆసేవయా సర్వ గుణాధికానాం జ్ఞానేన వైరాగ్యయుతేన దేవే ॥8॥**

'యోగంచేతను, నీయందు సమర్పింపబడిన భక్తిచేతను, సమస్త గుణాలలో అధికులైన వారిని ఎల్లప్పుడు సేవించుట చేతను, దేవుని యందు వైరాగ్యంతో కూడుకొనిన జ్ఞానంచేతను. జనులు పరమగతిని పొందుతారు.

**చిత్తస్య నిగ్రహేణైవ విష్ణోర్యాంతి పరం పదమ్ ।**
**అతో మాం పాహి దయయా సదా తారా సమం ప్రభో ॥**
**తదనంతరజా స్తోతుం ప్రావహీ తం ప్రచక్రమే ॥9॥**

చిత్తమును నిగ్రహించుట చేతనే విష్ణువు యొక్క పరమపదం పొందుతున్నారు. ప్రభూ! అందువలన దయతో నన్ను రక్షించు. నేను ఎప్పుడును తారతో సమానుడను.' ఆ తరువాత పుట్టిన ప్రావహి ఆ దేవుని స్తుతించుటకు ఉపక్రమించింది.

**ప్రావహ్యువాచ –** ప్రావహి పలికింది.

**సుతాః ప్రసంగేన భవంతి వీర్యాత్ తవ ప్రసాదాత్పరమాః సంపదశ్చ ।**
**యా హ్యుత్తమ శ్లోక రసాయనాః కథా స్తత్సేవనాదాస్త్వపవర్గ వర్త్మని ॥10॥**

ప్రకర్షతో కూడుకున్న సంగంచే వీర్యంవలన సుతులు కలుగుతారు. నీ అనుగ్రహం వలన గొప్పవైన సంపదలు కలుగుతాయి. నీ కథలు మిక్కిలి స్తుతింపబడేవి. ఆనందమును(రసమును) పొందించేవి. వాటిని సేవించుట వలన మోక్షమార్గము నందుండు గాక!

**భక్తిర్భవేత్సర్వదా దేవదేవ సదాప్యహం నిర్ఋతేః సామ్యమేవ ।**
**సహర్భాష్యకో మిత్రః త్కయీతారః ప్రకీర్తితాః ॥11॥**

దేవదేవా! ఎల్లప్పుడు నాకు భక్తి నీయందు ఉండాలి. నేను ఎల్లప్పుడును నిర్ఋతికి సమానుడను. సహుడు, భాష్యకుడు, మిత్రుడు, త్కయీతారుడు కూడ సమానులుగా కీర్తింపబడుతున్నారు.

**కోణాధిపో నిర్ఋతిశ్చ ప్రావహీ ప్రవహప్రియా ।**
**చత్వార ఏతే పర్జన్యాత్త్రిగుణాః పరికీర్తితాః ॥12॥**

కోణాధిపుడు, నిర్ఋతి, ప్రావహి, ప్రవహప్రియ ఈ నలుగురు పర్జన్యుని కన్న మూడు రెట్లు అధికులుగా కీర్తింపబడుతున్నారు.

**తదనంతరజాన్వక్ష్యే తాఞ్ఛృణు త్వం ఖగేశ్వర ।**
**ప్రవాహ భార్యానంతరజో విష్వక్సేనోఽథ పార్షదః ॥**
**వాయుపుత్రో మహాభాగః హరిం స్తోతుం ప్రచక్రమే ॥13॥**

ఖగేశ్వరా! ఆ తరువాత పుట్టిన వారిని గూర్చి చెబుతాను. నీవు వారిని గురించి విను. ప్రవాహుని భార్య తరువాత పుట్టినవాడు విష్వక్సేనుడు. అతడు విష్ణుపార్షదుడు. అతడు వాయుపుత్రుడు. ఆ మహాభాగుడు హరిని స్తుతి చేసేందుకుగాను ఉపక్రమించాడు.

**విష్వక్సేన ఉవాచ –** విష్వక్సేనుడు వచించాడు.

**భగవాన్మోక్షదః కృష్ణః పూర్ణానందో సదా యది ।**
**యది స్యాత్పరమా భక్తిర్హ్యపరోక్షత్వ సాధనా ॥14॥**

**తథా స్వగురుమారభ్య బ్రహ్మాంతేషు చ సాధుషు ।**
**తద్యోగ్యతానుసారేణ భక్తిర్నిష్కపటా యది ॥15॥**

**తులస్యాదిషు జీవేషు యది స్యాత్ ప్రీతిరండజ ।**
**సంస్మృతిశ్చ తదా నాశీ భూయా దేవ న సంశయః ॥16॥**

భగవంతుడైన కృష్ణుడు మోక్షప్రదాత, ఎల్లప్పుడు పూర్ణానందుడు. అయితే, పరమ భక్తి అపరోక్షసాధనకు కారణమైతే అలాగే తన గురువు మొదలుకొని బ్రహ్మవరకు ఉండే సాధువులయందు ఆయా యోగ్యతననుసరించి ఉండే భక్తి నిష్కపటమైతే, తులసి మున్నగు జీవులందు ప్రీతి ఉంటే, అండము నందు పుట్టినవాడా! నాకు వెంటనే చింత నశించాలని, అందు సందియం ఉండరాదని స్తుతించాడు.

**ఏవం స్తుత్వా మహాభాగో విష్వక్సేనో మహాప్రభో ।**
**తూష్ణీం బభూవ గరుడ ప్రాంజలిర్నమ్రకంధరః ॥**
**మిత్రాదహం న్యూన ఏవ నాత్ర కార్యా విచారణా ॥17॥**

మహాప్రభూ! ఈ విధంగా మహాభాగుడైన విష్వక్సేనుడు స్తుతించి, గరుడా! మెడవంచి దోయిలొగ్గి మిన్నకుండిపోయాడు. నేను మిత్రునికన్న తక్కువవాడను సుమా! ఇందులో ఆలోచించవలసినదేదీ లేదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే విష్ణుస్తుతిర్దేవతాతారతమ్యాది అష్టమోఽధ్యాయః ॥8॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో విష్ణుస్తుతిదేవతాతారతమ్యం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## విష్ణుస్తుతిః దేవతారతమ్యనిరూపణం చ - విష్ణుస్తుతి, దేవతల తారతమ్యనిరూపణం

**శ్రీ గరుడ ఉవాచ** - శ్రీ గరుడుడు పలికాడు.

**అజానజ స్వరూపం చ బ్రూహి కృష్ణ మహామతే ।**
**తదన్యాంశ్చ క్రమేణైవ వక్తుం కృష్ణత్వమర్హసి ॥1॥**

అజానజుల స్వరూపాన్ని మహామతీ! కృష్ణా! తెలియజేయవలసింది. కృష్ణా! మిగిలిన వారిని కూడ క్రమంగా చెప్పుటకు నీవు తగినవాడవు.

**శ్రీ కృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**అజానాఖ్య దేవతాస్తు తత్తద్దేవకులే భవాః ।**
**అజాన దేవతాస్తాహి తేభ్యోఽగ్ర్యాః కర్మదేవతాః ॥2॥**

అజానులనే చెప్పబడే దేవతలు ఆయా దేవకులాలలో ఉద్భవించారు. వారే అజానదేవతలు. వారిలో కర్మ దేవతలు శ్రేష్ఠులు.

**విరాధశ్చారుదేష్ణశ్చ తథా చిత్రరథస్తథా ।**
**ధృతరాష్ట్రః కిశోరశ్చ హూహూర్హాహాస్తథైవ చ ॥3॥**

**విద్యాధరశ్చోగ్రసేనో విశ్వావసు పరావసూ ।**
**చిత్రసేనశ్చ గోపాలో బలః పంచదశ స్మృతాః ॥4॥**

విరాధుడు, చారుదేష్ణుడు, చిత్రరథుడు, ధృతరాష్ట్రుడు, కిశోరుడు, హూహూ, హాహా, విద్యాధరుడు, ఉగ్రసేనుడు. విశ్వావసువు, పరావసువు, చిత్రసేనుడు, గోపాలుడు, బలుడు (రథుడు), ఈ పదునైదుగురు వారుగా చెప్పబడుతున్నారు.

**ఏవమాద్యాశ్చ గంధర్వాః శతసంఖ్యాః ఖగేశ్వర ।**
**అజానజ సమా జ్ఞేయా ముక్తౌ సంసార ఏవ చ ॥5॥**

ఖగేశ్వరా! ఇటువంటివారు గంధర్వులు వందలకొలది ఉన్నారు. వారు ముక్తియందు సంసారమునందు కూడ అజానజులతో సమమైన వారు.

**అజానజాస్తు మే (యే) దేవాః కర్మజేభ్యః శతావరాః ।**
**ఘృతాచీ మేనకా రంభా ఊర్వశీ చ తిలోత్తమా ॥6॥**

**సుకేతుః శబరీ చైవ మంజుఘోషా చ పింగలా ।**
**ఇత్యాదికం యక్షరత్నం సహ సంపరికీర్తితమ్ ॥7॥**

అజానజ దేవతలు కర్మదేవతలకన్న నూరుపాళ్లు తక్కువవారు. ఘృతాచి, మేనక, రంభ, ఊర్వశి, తిలోత్తమ, సుకేతువు, శబరి, మంజుఘోష, పింగల మున్నగువారు యక్షశ్రేష్ఠులు మిక్కిలిగా పేర్కొనబడినారు.

**అజానజ సమాహ్యేతే కర్మజేభ్యః శతావరాః ।**
**విశ్వామిత్రో వసిష్ఠశ్చ నారదశ్చ్యవన స్తథా ॥8॥**

**ఉతథ్యశ్చ మునిశ్చైతాన్ద్రాగ్ జపిత్వా ఖగేశ్వర ।**
**ఋషయశ్చ మహాత్మానో హ్యజానజసమాః స్మృతాః ॥9॥**

వీరు అజానజులతో సమానమైనవారు. కర్మజన్యదేవతలకన్న శతాంశాలు తక్కువవారు. ఖగేశ్వర! విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, నారదుడు, చ్యవనుడు, ఉతథ్యుడు, ముని – వీరిని శీఘ్రంగా జపిస్తే ఋషులు మహాత్ములై అజానజ దేవతలతో సమానంగా స్మరింపబడుతారు.

**శతర్చిః కశ్యపో జ్ఞేయో మధ్యమశ్చ పరాశరః ।**
**పావమాన్యః ప్రగాథశ్చ క్షుద్రసూక్తశ్చ దేవలః ॥10॥**

**గృత్సమదోహ్యసురిశ్చ భరద్వాజోఽథ ముద్గలః ।**
**ఉద్దాలకోహ్యృ(ఋ)ష్యశృంగః శంఖః సత్యవ్రతస్తథా ॥11॥**

**సుయజ్ఞశ్చైవ బాభ్రవ్యో మాండూకశ్చైవ బాష్కలః ।**
**ధర్మాచార్యస్తథాగస్త్యో దాల్భ్యో దాధర్యచ్యుత స్తథా ॥12॥**

**కవషో హరితః కణ్వో విరూపో ముసలస్తథా ।**
**విష్ణువృద్ధశ్చ ఆత్రేయః శ్రీవత్సో వత్సలేత్యపి ॥13॥**

**భార్గవశ్చాప్నవానశ్చ మాండూకేయ స్తథైవ చ ।**
**మండ్కశ్చైవ జాబచలిః వీతిహవ్య స్తథైవ చ ॥14॥**

**గృత్సమదః శౌనకశ్చ ఇత్యాద్యా ఋషయః స్మృతాః ।**
**ఏతేషాం శ్రవణాదేవ హరిః ప్రీణాతి సర్వదా ॥15॥**

శతర్చి, కశ్యపుడు, మధ్యముడు, పరాశరుడు, పావమాన్యుడు, ప్రగాథుడు, క్షుద్రసూక్తుడు, దేవలుడు, గృత్సమదుడు, ఆసురి, భరద్వాజుడు, ముద్గలుడు, ఉద్దాలకుడు, ఋష్యశృంగుడు, శంఖుడు, సత్యవ్రతుడు.సుయజ్ఞుడు, బాభ్రవ్యుడు, మాండూకుడు, బాష్కలుడు, ధర్మాచార్యుడు, అగస్త్యుడు, దాల్భ్యుడు, దాధరి, అచ్యుతుడు, కవషుడు, హరితుడు, కణ్వుడు, విరూపుడు, ముసలుడు, విష్ణువృద్ధుడు, ఆత్రేయుడు, శ్రీవత్సుడు, వత్సలుడు భార్గవుడు, ఆప్నవానుడు, మాండూకేయుడు, మండ్కుడు, జాబచలి, వీతిహవ్యుడు, గృత్సమదుడు, శౌనకుడు ఇత్యాదులు ఋషులుగా పేర్కొనబడినవారు. వీరి నామాలు వినుటతోనే హరి ఎల్లప్పుడు ప్రీతి పొందుతాడు.

**బ్రువే ద్వ్యష్టసహస్రం చ శృణు తార్క్ష్య మమ స్త్రియః ।**
**అగ్నిపుత్రాస్తు యద్ద్వ్యష్ట సహస్రం చ మమ స్త్రియః ॥**
**అజానజ సమాహ్యేతా (తే) నాత్ర కార్య విచారణా ॥16॥**

తార్క్ష్యా! పదునారువేల మంది స్త్రీలు నాకు (సేవకురాండ్రు). వారిని గురించి చెబుతాను విను. నాసంబంధమైన ఆ పదునారువేల మంది స్త్రీలు అగ్ని సంతానం. వీరు అజానజదేవతలతో సమానమైనవారు. ఇందులో ఆలోచించవలసినది లేదు.

**త్వష్టుః పుత్రీ కశేరూశ్చ తాసాం మధ్యే గుణాధికా ।**
**తదనంతరజాన్వక్ష్యే శృణు సమ్యక్ ఖగేశ్వర ॥17॥**

వారిమధ్యలో త్వష్టయొక్క కుమార్తె కశేరువు గుణాధికురాలు. ఖగేశ్వరా! ఆ తరువాత పుట్టినవారిని చెబుతాను చక్కగా విను.

**అజానేభ్యస్తు పితరః సప్తభ్యో ఽన్యే శతావరాః ।**
**తథాధికా హి పితరః సప్తభ్యో ఽన్యే శతావరాః ॥18॥**

అజానదేవతలు ఏడుగురి కన్న మిగిలిన పితరులు వందపాళ్లు తక్కువవారు. ఆ ఏడుగురికన్న పితరులు అధికులని వేదవేత్తల అభిప్రాయం. వారు వందపాళ్లు తక్కువవారని మిగిలినవారి మతం.

**తదనంతరజాన్ వక్ష్యే శృణు త్వం ద్విజోత్తమ ।**
**అష్టాభ్యో దేవగన్ధర్వా అష్టోత్తర శతం వినా ॥19॥**

**తేభ్యః శతగుణానందా దేవ ప్రేష్యస్తు ముఖ్యతః ।**
**స్వముఖేనైవ దేవైశ్చ ఆజ్ఞాప్యాః సర్వదా గణాః ॥20॥**

పక్షిశ్రేష్ఠమా! ఆ తరువాత పుట్టిన వారిని చెబుతున్నాను. నీవు విను. వారిలో ఎనమండుగురు కన్న దేవ గంధర్వులు అధికులు. వారిలో నూట ఎనిమిది మందిని మినహాయిస్తే వారి కన్న ముఖ్యంగా దేవసేవకులు నూరురెట్లు ఆనందం కలవారు. ఆ గణాలు ఎల్లప్పుడు దేవతలచే స్వయంగా ఆజ్ఞాపింపబడతాయి.

**ఆఖ్యాతా దేవగన్ధర్వాస్తేభ్యస్తే చ శతావరాః ।**
**తేభ్యస్తు క్షితిపా జ్ఞేయా అవరాశ్చ శతైర్గుణైః ॥21॥**

వారికన్న దేవగంధర్వులు నూరు అంశాలు(రెట్లు) తక్కువవారుగా చెప్పబడతారు. వారి కన్న వందరెట్లు భూపాలురు తక్కువవారుగా చెప్పబడుతున్నారు.

**తేభ్యః శతగుణా జ్ఞేయా మానుషేషూత్తమ గణాః ।**
**ఏవం ప్రాసంగికానుక్త్వా ప్రకృతం హ్యనుసరామ్యహమ్ ॥**
**ఏవం బ్రహ్మాదయో దేవా లక్ష్మ్యాద్యా అపి సర్వశః ॥22॥**

**స్తుత్వా తూష్ణీం స్థితాః సర్వే ప్రాంజలీకృత్య భో ద్విజ ॥23॥**

వారి కన్న మనుష్యులలో ఉత్తమగుణాలకు చెందినవారు వందరెట్లు తక్కువవారు. ఈ విధంగా ప్రసంగానుసారంగా వారిని గురించి చెప్పి నేను ప్రకృతాన్ని అనుసరిస్తున్నాను. ఈ విధంగా బ్రహ్మాది దేవతలు, లక్ష్మిమున్నగువారు, అందరును స్తుతించారు. ఈ విధంగా అందరును స్తోత్రంచేసి దోయిలొగ్గి మౌనం వహించారు.

**ఇతి స్తుతశ్చ దేవేశో భగవాన్ హరిరవ్యయః ।**
**తేషా మాయతనం దాతుం మనసా సమచింతయత్ ॥24॥**

భగవంతుడు, అవ్యయుడు, దేవేశుడైన, హరి ఈ విధంగా స్తుతించబడి, వారికి నివేశం కల్పించాలని మనస్సులో సంకల్పించుకున్నాడు.

**ఇదం పవిత్రమారోగ్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।**
**హరి ప్రసాదజనకం స్వరూప సుఖసాధనమ్ ॥25॥**

**ఇదం తు స్తవనం విప్రా న పఠంతీహ మానవాః ।**
**న శృణ్వంతి చ యే నిత్యం తే సర్వే చ మాయినః ॥26॥**

**న స్మరంతోఽన్తరం నిత్యం యే భుంజంతి నరాధమాః ।**
**తై ర్భుక్తా సతతం విష్ఠా సదా క్రిమిశతైర్యుతా ॥27॥**

ఇది పవిత్రమైనది, ఆరోగ్యమైనది, పుణ్యమైనది, పాపవినాశకం. హరి అనుగ్రహంచే పుట్టినది. స్వరూపానంద సాధనమైనది. ఈ స్తవమును ఏ విప్రులు, మానవులు, ఇక్కడ పఠింపరో, వినరో వారందరును నిత్యమూ మాయకు లోనవుతారు. ఏ నరాధములు నిత్యమూ దీనిని స్మరింపక భుజిస్తారో, వారిచే భుజింపబడినది ఎల్లప్పుడు పురీంమే. వందలకొలది క్రిములతో నిండిఉంటుంది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే దేవకృత విష్ణుస్తుతి దేవతాతారతమ్యనిరూపణం నామ నవమోఽధ్యాయః ॥9॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో విష్ణుస్తుతి, దేవతాతారతమ్యనిరూపణం అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **దశమోऽధ్యాయః – పదవ అధ్యాయం**

## **ప్రాకృతవైకృతసృష్టినిరూపణమ్ – ప్రాకృతవైకృతసృష్టులు**

**గరుడ ఉవాచ –** గరుడుడు పలికాడు.

**దేవైరేవం స్తుతో విష్ణుర్భగవాన్ సాత్త్వతాంపతిః ।**
**కీదృశం హ్యాశ్రయం దత్త్వైషాం వివేశ మహాప్రభుః ॥1॥**

**ఏతద్వేదితుమిచ్ఛామి కృష్ణ కృష్ణ మహాప్రభో ।**
**సమ్యక్ బ్రూహి దయాలో త్వం యదిత్త్వమచ్ఛ్రోత్రమర్హతి ॥2॥**

దేవతలచే ఈ విధంగా స్తుతింపబడిన, సాత్వతులకు పతి, మహాప్రభువగు విష్ణు భగవానుడు వారికి ఎటువంటి ఆశ్రయంను కల్పించి తాను ప్రవేశించాడు? మహాప్రభూ! శ్రీ కృష్ణా! ఈ విషయం తెలియగోరుతున్నాను. దయాలూ! నేను వినుటకు తగినవాడనయితే నీవు దానిని చక్కగా చెప్పవలసింది.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు పలికాడు.

**తేషు తత్త్వేషు భగవాన్స వివేశ మహాప్రభుః ।**
**క్షోభయామాస భగవాన్ సంబంధవిదురో హరిః ॥3॥**

భగవంతుడైన ఆ మహాప్రభువు ఆ తత్త్వాలలో ప్రవేశించాడు. భగవంతుడైన హరి వాటి సంబంధం లేకపోయినను వాటిని క్షోభింపజేశాడు.

**ఆదౌ ససర్జ భగవాన్ బ్రహ్మాండం కనకాత్మకమ్ ।**
**పంచాశత్కోటి విస్తీర్ణం యోజనానాం సమంతతః ॥4॥**

భగవంతుడు మొదట సువర్ణమయమైన బ్రహ్మాండాన్ని నిర్మించాడు. అది మొత్తం ఏబది కోట్ల యోజనాల విస్తీర్ణం కలది.

**తదూర్ధ్వమణ్వవయవ స్తావాన్కనక రూపకః ।**
**వర్తతే తత ఊర్ధ్వం తు పంచాశత్కోటి భూతలమ్ ॥5॥**

ఆపైన అణువులు అవయవాలుగా కలిగిన కనకరూపకమైన ఆవరణం ఉన్నది. దానిపైన ఏబది కోట్ల విస్తీర్ణం కలిగిన భూతలం ఉంది.

**ఏవం కోటిశతం తస్యావయవః పరికీర్తితః ।**
**తతశ్చ సప్తావరణైః సమంతాత్పరిధీకృతమ్ ॥6॥**

ఈ విధంగా వందకోట్లు విస్తీర్ణంగా దాని అవయవం (మిశ్రమము) పేర్కొనబడింది. పిమ్మట ఏడు ఆవరణలతో చుట్టూ పరిధి ఏర్పాటు చేయబడింది.

**కబంధావరణం హ్యాద్యం కోట్యా దశసహస్రకమ్ ।**
**ద్వితీయావరణం జ్ఞేయం పావకస్య మహాత్మనః ॥7॥**

అందు మొదటిదై పదివేల కోట్లతో జలావరణం రెండవ ఆవరణం మహాత్ముడైన అగ్ని సంబంధమైనది.

**అపాం దశగుణైర్వ్యక్తం సమంతాత్ పరిధీ(ఖీ) కృతమ్ ।**
**తృతీయావరణం జ్ఞేయం హరస్యైవ మహాత్మనః ॥8॥**

జలాలకు పది రెట్లతో కూడుకొని అది చుట్టును పరిధిగానున్నది మహాత్ముడైన హరుని యొక్క ఆవరణం మూడవదిగా తెలియదగియున్నది.

**దశాధికం పావకాచ్చ సమంతాత్పరివారితమ్ ।**
**చతుర్థావరణం జ్ఞేయం నభసోఽపి మహాప్రభో ॥9॥**

అది పావకుని కన్న పది రెట్లు అధికంగా చుట్టునూ వ్యాపించియున్నది. మహాప్రభూ! నాలుగో ఆవరణం ఆకాశానికి సంబంధించినదిగా తెలియుచున్నది.

**హరాద్దశగుణైరేవం సమంతాత్పరివారితమ్ ।**
**పంచమావరణం జ్ఞేయ మహంకారాఖ్యమేవ చ ॥10॥**

అది హరునికి సంబంధించిన దానికన్న పది రెట్లు అధికంగా చుట్టూ వ్యాపించింది. పంచమావరణం. అహంకారమనే పేరు కలది

**వ్యోమ్నో దశగుణైరేవం సమంతాత్పరివారితమ్ ।**
**షష్ఠావరణం ప్రోక్తం మహత్తత్త్వం ఖగేశ్వర ॥11॥**

ఆరో ఆవరణము ఆకాశం కన్న పది రెట్లు ఎక్కువగా చుట్టును వ్యాపించిఉన్నది. ఖగేశ్వరా! అది మహత్తత్త్వంగా చెప్పబడింది.

**అహంకారాద్దశ గుణం సమంతాత్పరివారితమ్ ।**
**సప్తమావరణం ప్రోక్తం త్రిగుణావరణం ప్రభో ॥12॥**

అది అహంకారం కన్న పది రెట్లు ఎక్కువగా చుట్టును వ్యాపించి ఉన్నది. ప్రభూ! త్రిగుణావరణం ఏడో ఆవరణంగా చెప్పబడింది.

**మహత్త్వాద్దశగుణైరధికం పరికీర్తితమ్ ।**
**మహత్త్వానంతరం చ తమో హ్యావరణం స్మృతమ్ ॥13॥**

అది మహత్తత్త్వం కన్న పది రెట్లు అధికంగా పేర్కొనబడింది. మహత్తత్త్వం తరువాత తమస్సు ఆవరణంగా ఉంది.

**మహత్త్వాత్ పంచగుణైరధికం పరికీర్తితమ్ ।**
**తస్మాచ్చ ద్విగుణం జ్ఞేయం రజోహ్యావరణం స్మృతమ్ ॥14॥**

మహత్తత్త్వంకన్న అయిదు గుణాలు అధికంగా కీర్తింపబడింది. మహత్తత్త్వం కన్న రెండు రెట్లు అధికంగా రజస్సు ఆవరణంగా ఉంది.

**తతశ్చ ద్విగుణం జ్ఞేయం సత్త్వావరణముత్తమమ్ ।**
**త్రయశ్చైవం మిలిత్వా తు ఏకావరణమీరితమ్ ॥15॥**

మహత్తత్త్వం కన్న రెండు రెట్లుఅధికంగా ఉత్తమమైన సత్త్వావరణం ఉంది. మూడు కలసి ఒక గుణం అధికంగా ఒక ఆవరణం వ్యాపించియుంది.

**అవ్యాకృతాఖ్యమాకాశం తదనంతరమీరితమ్ ।**
**మర్యాదా రహిత శ్చైవం తత్రాస్తే హరి రవ్యయః ॥16॥**

ఆ తరువాత అవ్యాకృతమనే పేరుగల ఆకాశతత్త్వం వ్యాపించి ఉంది. అది హద్దులు లేనిది. అచ్చట అవ్యయుడైన హరి ఉంటాడు.

**అష్టమావరణం వ్యోమ్నోరంతరా విరజా నదీ ।**
**పంచయోజన విస్తీర్ణా సమంతాత్పర్విధీకృతా ॥17॥**

**అస్తి పుణ్యతమా జ్ఞేయా లోక సంసారనాశినీ ।**
**ఏవం చతుర్ముఖేనైవ తదా హృష్యంతి చాండజ ॥18॥**

ఆకాశం మధ్యలో ఎనిమిదో ఆవరణమైన విరజానది ఉన్నది. అది అయిదు యోజనాల విస్తీర్ణంతో అంతటా పరిధిగా వ్యాపించి ఉన్నది. అది పరమ పుణ్యమైనదిగా స్మరింపబడినది. అది లౌకిక సంసారాన్ని నశింపజేసేది. అండోద్భవా! ఈ విధంగా చతుర్ముఖునితో కూడ అక్కడ అందరును సంతోషంతో ఉంటారు.

**తే సర్వే విరజా నద్యాం సమ్యక్ స్నాత్వా విసర్జ్య చ ।**
**లింగదేహం తతః పశ్చా న్మోక్షం విందంతి తే హరేః ॥19॥**

**అపరోక్ష దృశామేవం బ్రహ్మణా సహ గామినామ్ ।**
**విరజాతరణం విద్ధి నాన్యేషాం వినతాసుత ॥20॥**

వారందరునూ విరజానదియందు చక్కగా(భక్తితో) స్నానం చేసి లింగదేహం విడిచి, తరువాత మోక్షమును పొందుతున్నారు. వారు హరిని ప్రత్యక్షంగా దర్శించు భాగ్యమునకై బ్రహ్మతో కలసి వెళ్తున్నారు. వినతానందనా! దీనినే విరజానదీ తరణంగా తెలిసికొనుము. ఇది మిగిలిన వారికి చేకూరదు.

**అపరోక్ష దృశాం బ్రహ్మన్ వ్యాసాదీనాం ఖగేశ్వర ।**
**విరజాతరణం నాస్తి భోక్తవ్యత్వాచ్చ కర్మణః ॥21॥**

బ్రహ్మ! ఖగేశ్వరా! ఇంద్రియాతీత బ్రహ్మజ్ఞానం కలిగిన వ్యాసాదులకు కూడ కర్మ భోక్తృత్వకారణంగా విరజానదిని తరించడం అనేది లేదు.

**విరించేనైవ సాకం తు కల్పేఽస్మిన్నధికారిణామ్ ।**
**తేషాం తు నియమేనైవ సర్వప్రారబ్ధసంక్షయః ॥22॥**

**భవత్యేవం న సందేహో నాన్యేషాం సర్వ సంక్షయః ।**
**అతస్తు విరజాతరణం తేషామేవ భవేత్ పటో ॥23॥**

ఈ కల్పంలో అధికారులకు బ్రహ్మతో కలసి మాత్రమే విరజాతరణం. వారికి నియమం వలన ప్రారబ్ధమంతయు క్షయమైపోతుంది. (నియమం= అత్యంత యమం) అందువలన వారికి ఆ అవకాశం కలుగుతుంది. సందేహం లేదు. మిగిలిన వారికి ప్రారబ్ధమంతా క్షయం కాదు. బహుసమర్థుడా! అందువలన కర్మ సంక్షయమైన వారికే విరజాతరణం చేకూరుతుంది.

**విరజాతరణం నాస్తి తేషాం తత్సంగినాం యథా ।**
**సర్వారబ్ధక్షయో నాస్తి యతస్తేషాం ఖగాధిప ॥24॥**

ఖగాధిపా! సర్వప్రారబ్ధక్షయం ఎవరికి చేకూరదో, వారికీ వారితో కలసియున్న వారికి కూడ విరజాతరణం అన్నదిలేదు.

**అతశ్చ సర్వథా నాస్తి విరజాతరణం ప్రభో ।**
**ప్రలయే విరజానద్యా లయో నాస్తి ఖగేశ్వర ॥25॥**

ప్రభూ! అందువలన విరజాతరణమనేది అంతటా, అందరికీ లభించేది కాదు. ఖగేశ్వరా! ప్రలయంలో కూడా విరజానదికి లయం లేదు.

**లక్ష్మ్యాత్మికా తు సా జ్ఞేయా లింగదేహ విదారిణీ ।**
**బ్రహ్మత్వయోగ్యా ఋజవో నామ దేవాః ప్రకీర్తితాః ॥26॥**

ఆ నది లక్ష్మీస్వరూపమైనది. లింగదేహాన్ని కూడ నశింపజేసేది. బ్రహ్మత్వమునకు యోగ్యులైన వారు ఋజువులు అనే దేవతలుగా పేర్కొనబడుతున్నారు.

**తేఽపి ప్రత్యేకశః సంతి హ్యనంతాశ్చ పృథగ్గణాః ।**
**పృథక్ పృథక్ చ తైః సాకం మోక్షయోగ్యాః ఖగేశ్వర ॥27॥**

వారు కూడ ప్రత్యేకంగా ఒక్కొక్కరు అనంతములైన వేరు వేరు గణాలుగా ఉన్నారు. ఖగేశ్వరా! ఆ గణాలు కూడ వేరువేరుగా ఆ దేవతలతో కలిసి మోక్షానికి యోగ్యులవుతున్నారు.

**జీవాః సంతి హ్యనేకే చ ప్రతికల్పే సృజంతి తే ।**
**ద్వాత్రింశల్లక్షణైః సమ్యగ్యుక్తా వాయుత్వ యోగ్యకాః ॥28॥**

జీవులు ఎందరో ఉన్నారు. ప్రతి కల్పంలోను వారి సృష్టి కలదు. ముప్పదిరెండు లక్షణాలతో చక్కగా కూడుకొని వాయుస్థానానికి యోగ్యులవుతున్నారు.

**అష్టావింశల్లక్షణైశ్చ గిరీశ పదయోగినః ।**
**చతుర్వింశతిమారభ్యా షోడశాచ్చ సురాః స్మృతాః ॥29॥**

ఇరవై ఎనిమిది లక్షణాలతో కూడుకొని, ఈశ్వర స్థానమునకు యోగ్యులవుతున్నారు. ఇరవై నాలుగు లక్షణాలతో ప్రారంభించి పదునారు లక్షణాల వరకు ఉన్నవారు దేవతలుగా స్మరింపబడుతున్నారు.

**అష్టకా ఋషయః ప్రోక్తా స్తదూనాశ్చక్రవర్తినః ।**
**శతజన్మ సమారభ్య బ్రహ్మణః పరమేష్ఠినః ॥30॥**

**అపరోక్ష మితిప్రోక్తం తథా హ్యారబ్ధ సంక్షయః ।**
**ఏకోనశత కల్పేన వాయుత్వం యాతి భో ద్విజ ॥31॥**

ఎనిమిది లక్షణాలతో కూడుకున్నవారు ఋషులు అని చెప్పబడతారు. దానికి తక్కువ లక్షణాలు ఉన్నవారు చక్రవర్తులవుతారు. పరమేష్ఠి అయిన బ్రహ్మ యొక్క నూరుజన్మలు మొదలుకొని అపరోక్షమని చెప్పబడుతుంది. అలా ప్రారబ్ధం సంక్షయం ఆ బ్రహ్మకు అవుతుంది. ద్విజా! తొంబదితొమ్మిది కల్పముల తరువాత వాయుత్వాన్ని పొందుతాడు.

**శతజన్మని బ్రహ్మత్వం యాతి పశ్చాద్ధరేః పదమ్ ।**
**చత్వారింశద్బ్రహ్మ కల్పం సమారభ్య ఖగేశ్వర ॥32॥**

**రుద్రస్యాప్యపరోక్ష్యం స్యాత్ తథా ప్రారబ్ధ సంక్షయః ।**
**ఏకచత్వారింశ కల్పే శేషత్వం యాతి సువ్రత ॥33॥**

నూరుజన్మలలో బ్రహ్మత్వం పొందుతాడు. పొంది ఆ తరువాత హరిస్థానం పొందుతాడు. ఖగేశ్వరా! నలుబది బ్రహ్మ కల్పాలు మొదలుకొని రుద్రునికి అపరోక్షం అవుతుంది. (అదృశ్యం), అలా రుద్రునికి ప్రారబ్ధం సంక్షయమవుతుంది. సువ్రతా! నలుబది ఒకటవ కల్పంలో అతడు శేషత్వమును పొందుతాడు.

**బ్రహ్మణా సహ మోక్షం చ యాతి సమ్యఙ్నచాన్యథా ।**
**కల్పవింశతిమారభ్య బ్రహ్మణః పరమేష్ఠినః ॥34॥**

**ఇంద్రస్యాప్యపరోక్ష్యం స్యాత్ తథా ప్రారబ్ధ సంక్షయః ।**
**బ్రహ్మణైవ సహాయాతి హరిం నారాయణం పరమ్ ॥35॥**

ఆ తరువాత బ్రహ్మతో కలసి చక్కగా మోక్షం పొందుతాడు. మరో విధంగా కాదు. పరమేష్ఠి అయిన బ్రహ్మ యొక్క ఇరవై కల్పాలు మొదలుకొని ఇంద్రునికి అపరోక్షమవుతుంది. అలా ఇంద్రునికి ప్రారబ్ధం సంక్షయమవుతుంది. ఆ తరువాత బ్రహ్మతో కలసి పరుడైన నారాయణస్థానమైన హరిపదాన్ని పూర్తిగా చేరుకొంటాడు.

**గరుడ ఉవాచ –** గరుడుడు పలికాడు.

**పంచాశీతి బ్రహ్మకల్పం సమారభ్య మహాప్రభో ।**
**రుద్రస్యాప్యపరోక్ష్యం స్యాత్ తథా ప్రారబ్ధ సంక్షయః ॥36॥**

**ఇతి శ్రుతం మయా బ్రహ్మన్ బ్రహ్మణోక్తం హరేః ప్రియాత్ ।**
**ఇత్థం త్వయోక్తం శ్రీకృష్ణ సంశయో బాధతే మమ ॥37॥**

మహాప్రభూ! పంచాశీతి(85) బ్రహ్మ కల్పములు మొదలుకొని రుద్రునికి అపరోక్షమవుతుందని, ఆ విధంగా ప్రారబ్ధం రుద్రునికి క్షయమవుతుందని, హరికి ప్రియుడగు బ్రహ్మచే చెప్పబడినట్లుగా నేను వినియున్నాను. శ్రీకృష్ణా! కానీ నీవు వేరే విధంగా చెబుతున్నావు. సంశయం నన్ను బాధిస్తోంది.

**అతో మే సంశయం ఛింది యథా న స్యాత్తథా పునః ।**
**ఇతి తద్వచనం శ్రుత్వా కృష్ణో వచనమబ్రవీత్ ॥38॥**

అందువలన నా సంశయాన్ని తొలగించవలసింది. అది మరల నాకు లేకుండ చేయవలసింది. అని అడిగిన గరుడుని మాటలను విని శ్రీకృష్ణుడిలా వచించాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు పలికాడు.

**బ్రహ్మోక్తస్య మయోక్తస్య వివాదో నాస్తి సర్వథా ।**
**సందేహస్త్వజ్ఞ దృష్టీనాం జ్ఞానినాం నాస్తి సర్వథా ॥39॥**

**అశీతిహ్యష్టకా ప్రోక్తా అష్ట పంచ ఖగేశ్వర ।**
**చత్వారింశద్బ్రహ్మ కల్ప ఏవం ప్రాహ చతుర్ముఖః ॥40॥**

బ్రహ్మచెప్పినదానికి నేను చెప్పినదానికి వివాదమెన్నడును లేదు. అజ్ఞానదృష్టి కలిగిన వారికే సందేహం. జ్ఞానులకు ఎన్నడును సందేహం ఉండదు. అశీతి(80) అష్టకంగా (ఎనిమిది కలిగిన దానినిగా) చెప్పబడుతుంది. ఖగేశ్వరా! అష్టపంచ (58– అంకానాం వామతోగతిః 85 8×5= 40)అను దానినే నలుబది బ్రహ్మకల్పములుగా చతుర్ముఖుడు చెప్పియున్నాడు.

**తత్త్వానాం బహు గోప్యత్వాత్తథోక్తం బ్రహ్మణా పురా ।**
**అభిప్రాయస్త్వేవమేవ జ్ఞాతవ్యో నాత్ర సంశయః ॥41॥**

తత్త్వాలను మిక్కిలి గోప్యంగా ఉంచే కారణంచే ముందు బ్రహ్మచే అట్లు చెప్పబడింది. అభిప్రాయం మాత్రం ఈ విధంగానే తెలియవలసియున్నది. అందు సంశయం లేదు.

**పంచాశీతి బ్రహ్మకల్పం యే విజానంతి భో ద్విజ ।**
**తేఽంధతమః ప్రవిశంతి సత్యం సత్యం మయోదితమ్ ॥42॥**

ఓ ద్విజోత్తమా! ఎనబైఐదు బ్రహ్మ కల్పములని గ్రహించిన వారు అంధతమస్సులో ప్రవేశిస్తారు. నాచే చెప్పబడినది సత్యం, సత్యం.

**విరజానంతరం విప్ర తథా వ్యాకృతమంబరమ్ ।**
**అనంతపారం తదపి లక్ష్మీస్తస్యాభిమానినీ ॥43॥**

బ్రహ్మన్! విరజానది తరువాత అంబరం ఏ ఆకారం లేనిదై ఉంటుంది. అది అంతంలేనిది. అపారమైనది. దానిని అభిమానించేది లక్ష్మి.

**సంఖ్యానుగణనం నామ యస్య నాస్తి మహాప్రభో ।**
**న దానం జాతిప్రోక్తం సర్వదా నాస్తిసంశయః ॥44॥**

మహాప్రభూ! దానికి సంఖ్యానుగణనమనేది లేదు. అది దాన జాతి విభేదం లేనిది. ఎల్లప్పుడు అందు సందేహం లేదు.

**అండాభిమానీ బ్రహ్మ విరాడాఖ్యో హ్యభూత్తదా ।**
**ఏవం మతం స నిర్మాయ భగవాన్హరిరవ్యయః ॥45॥**

అంత అండాభిమానియైన బ్రహ్మ విరాట్టు అనుపేరు గలవాడయ్యాడు. భగవంతుడు, అవ్యయుడైన హరి ఇట్లు నిర్మించి అతడే అందున్నాడు. (పంచ భూతాలు, వాటి గుణాలు మున్నగునవన్నీ విశేషాలు.)

**విశేషా స్తత్ర గరుడ దేవైస్తత్త్వాభిమానిభిః ।**
**అధశ్చోర్ధ్వం తదాక్రమ్య హరిస్తిష్ఠతి సర్వదా ॥46॥**

గరుడా! విశేషం వలన తత్త్వాభిమానులైన దేవతలతో క్రిందకు, పైన వాటిని ఆక్రమించి హరి ఎల్లప్పుడు వాటియందుంటాడు.

**ఏవం ప్రాకృత సర్గోక్తిర్వైకృతం శృణు పక్షిరాట్ ॥47॥**

పక్షిరాజా! ఇట్లు ప్రాకృతసృష్టి జరిగింది. ఇక వైకృతసృష్టి గురించి ఆకర్ణించు.

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**సృష్టిరుక్తా త్వయా పూర్వం శ్రుతా సమ్యజ్ మయా హరే ॥48॥**

**కిం నామ ప్రాకృతం జ్ఞేయం తథా కిం వైకృతం ప్రభో ।**
**ఏతద్విస్తీర్య మే బ్రూహి శ్రోతుం కౌతూహలం హి మే ॥49॥**

హరీ! నీచే పూర్వం సృష్టిగురించి చెప్పబడింది. నేను శ్రద్ధగా విన్నాను. ప్రభూ! దేన్ని ప్రాకృతమనే పేరు గలదిగా తెలియాలి?ఏది వైకృతసృష్టి? దీనిని విస్తరించి నాకు వివరించు. వినాలని నాకు కోరిక ఉంది.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**అవ్యక్తాద్యాః పృథివ్యంతా అండాచ్చ బహిరుద్భవాః ।**
**తే సర్వే ప్రాకృతాః ప్రోక్తాస్తేషాం జ్ఞానాద్విముచ్యతే ॥50॥**

అవ్యక్తం మొదలుకొని పృథివి ఏర్పడే వరకు అండం బయట ఉద్భవించినవన్నీ ప్రాకృతసృష్టిజాతాలుగా చెప్పబడతాయి. దీనిని గురించి తెలియడం వలన విముక్తుడవుతావు.

**బ్రహ్మాండం వికృతం జ్ఞేయం బ్రహ్మాండాంతః ఖగేశ్వర ।**
**యా సృష్టిరుచ్యతే సృష్టిః సైవోక్తా వికృతేతి చ ॥51॥**

ఖగేశ్వరా! బ్రహ్మాండాన్ని వికృతంగా తెలియవలసింది. బ్రహ్మాండం మధ్యలో ఏ సృష్టిచేయబడిందో ఆ సృష్టి వైకృతంగా చెప్పబడుతుంది.

**సృష్టిశ్చ ప్రలయశ్చైవ సంసారో భక్తిరేవ చ ।**
**దేవతా ఋషిముఖ్యాశ్చ లోకా భూరాదయస్తథా ॥52॥**

**అనాద్యనంతకాలీనాః సర్వదైక ప్రకారకాః ।**
**జగత్ప్రవాహః సత్యోఽయం నైవ మిథ్యా కథంచన ॥53॥**

సృష్టి, ప్రలయం, సంసారం, భక్తి (దాని విభాగం)దేవతలు, ఋషిముఖ్యులు, భూలోకం మున్నగు లోకాలు ఆది నుండి ఉండేవి. వాటికి అంతం లేదు. అవి సర్వకాలీనాలు. ఎల్లప్పుడు ఒకే ప్రకారంగా ఉండేవి. ఈ జగత్ప్రవాహం సత్యమైనది. ఇది ఎన్నడు మిథ్య మాత్రం కాదు.

**యత్త్వేతదన్యథా బ్రూయుః సర్వహంతార ఏవ తే ।**
**జగత్ప్రవాహః సత్యోఽయం హరిసేవేతి సా తథా ॥54॥**

ఈ విషయం గురించి మరో విధంగా చెప్పేవారెవరో, వారు సమస్తమునూ సంహరించేవారవుతారు. ఈ జగత్ప్రవాహం సత్యం. హరి సేవయే అది

**సత్యం సత్యం పునఃసత్యముద్ధృత్య భుజముచ్యతే ।**
**వేదాచ్ఛాస్త్రం పరం నాస్తి న దేవః కేశవాత్పరః ॥55॥**

సత్యం. మళ్లీ సత్యం, మళ్లీమళ్లీ సత్యం ముమ్మాటికీ సత్యం. భుజం తట్టి చెప్పబడుతోంది. వేదాల వల్ల వచ్చిన శాస్త్రం కన్న పరమైనది లేదు. కేశవుని కన్న పరుడైన దేవుడు లేదు.

**సర్వోత్కృష్టం కేశవం చ విహాయాన్యముపాసతే ।**
**తేషామంధం తమో జ్ఞేయం పితౄణాం చ నృణామపి ॥56॥**

అందరికన్న ఉత్కృష్టుడైన కేశవుని విడిచి, తక్కిన వానిని ఉపాసిస్తే పితరులకు, నరులకు కూడ అంధతమస్సు మాత్రమే గతియని తెలియాలి.

**ఇదానీం శృణు పక్షీంద్ర వైకృతం సర్గముత్తమమ్ ।**
**సమ్యగ్జానాతి యో లోకే స యాతి పరమం పదమ్ ॥57॥**

ఇప్పుడు ఉత్తమమైన వైకృతసర్గం గురించి ఆకర్ణించు, లోకంలో దీనిని గురించి చక్కగా తెలుసుకున్నవాడు పరమపదాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే బ్రహ్మాండాది వైకృతైకదేశ ప్రాకృతసృష్టినిరూపణం నామ దశమోఽధ్యాయః ॥10॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో బ్రహ్మాండం మొదలుకొని వైకృతసృష్టి వరకు జరిగిన ప్రాకృతసృష్టినిరూపణం అనే పదవ అధ్యాయం సమాప్తం.

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

## అజ్ఞానహేతునిరూపణమ్ - అజ్ఞానకారణనిరూపణం

**శ్రీ కృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు పలికాడు.

**పురుషాఖ్యో హరిః సాక్షాద్భగవాన్పురుషోత్తమః ।**
**శిశ్యేత్వండోదక(కే) విష్ణుర్నృణాం సాహస్రవత్సరమ్ ॥**
**లక్ష్మీశ్చోదకరూపేణ శయ్యారూపేణ భోఽండజ ॥1॥**

**విద్యాతరంగరూపేణ వాయురూపేణ భోఽండజ ॥2॥**

అండజా! సాక్షాత్తు భగవంతుడై, పురుషోత్తముడై, పురుషుడనే పేరు కలిగిన హరి విష్ణువై (అంతటా వ్యాపించినవాడై) నరుల సంబంధమైన వేయి సంవత్సరాల కాలం అండోదకము నందు శయనించాడు. (అండోదక విష్ణువై) లక్ష్మీదేవి ఉదకరూపంతో శయ్యారూపమయి ఉన్నది. అండజా! అది వాయురూపమై తరంగస్వరూపమైన విద్య.

**తమోరూపేణ సైవాసీన్నాన్యదాసీత్కథంచన ।**
**ఆసీద్గర్భోదకే చైవ నాన్యదాసీత్కథంచన ॥3॥**

తమోరూపంలో ఆమెయే అట్లున్నది. మరొకటి ఏమియునూ లేదు. ఆ గర్భం ఉదకసంబంధమై ఉన్నది. మరొకటి ఏమియూ లేదు.

**లక్ష్మీస్తుష్టావ చ హరిం గర్భోదే పక్షిసత్తమ ।**
**లక్ష్మీధరాభ్యాం రూపాభ్యాం ప్రకృతిర్ద్వారిణా తథా ॥4॥**

పక్షిసత్తమా! ఆ గర్భోదకము నందున్నదై లక్ష్మి హరిని సంతోషపరుస్తుంది. లక్ష్మి, ధర ఈ రెండు రూపాలతో ప్రకృతి హరితో కూడుకొని ఉంటుంది.

**శేత శ్రుతి స్వరూపేణ స్తౌతి గర్భోదకే హరిమ్ ।**
**నారాయణ నమస్తేఽస్తు శృణు విజ్ఞాపనం మమ ॥5॥**

ఆమె గర్భోదకమునందు శయనించి శ్రుతిస్వరూపంతో హరిని స్తుతించింది. నారాయణా! నీకు నమస్కారం. నా విజ్ఞాపనం విను.

**అజాం జహి మహాభాగ యోగ్యానాం ముక్తిమావహ ।**
**అజా తు ప్రకృతిః ప్రోక్తా చాపరా ప్రకృతిః పరా ॥6॥**

మహాభాగా! మాయను తొలగించు. యోగ్యులకు ముక్తిని కలిగించు ప్రకృతిమాయగా చెప్పబడుతుంది. ఆ ప్రకృతికన్న వేరైనది పరాప్రకృతి.

**శతతోఽవరా తు బ్రహ్మాణీ బ్రహ్మపత్నీ వరాననా ।**
**ఉమా శచ్యవరా తస్యా అవరాః సంప్రకీర్తితాః ॥7॥**

శ్రేష్ఠమైన ఆననం కలిగిన బ్రహ్మపత్ని అయిన బ్రహ్మాణి ప్రకృతి కన్న నూరు పాళ్లు తక్కువ. ఉమాదేవి, శచీదేవి కూడ తక్కువవారే. ఈ విధంగా ప్రకృతి కన్న వీరు తక్కువవారు.

**ఏతాసాం హననం నైవ ప్రార్థయామః సదా హరే ।**
**అస్తి ప్రతినృషు బ్రహ్మ ప్రకృతీ ద్వే వ్యవస్థితే ॥8॥**

హరీ! వీరిని గూర్చి అవమానించడం చేయరాదని ఎల్లప్పుడు ప్రార్థిస్తున్నాను. ప్రతి మానవునియందు బ్రహ్మ, ప్రకృతీ రెండునూ కలిసి ఉంటాయి. (పరాపర భేదంచే వారిని హింసింపరాదు.)

**ఏకా తు నిత్య సంసారాత్వజశబ్దాభిధాయికా ।**
**ద్వితీయా తు తమోఽపోహ్యా అజశబ్దాభిధాయికా ॥9॥**

ఒకటి నిత్యమూ సంసారం చేసేది. అజ శబ్దంచే చెప్పబడుతుంది.(అజా). రెండవది తమస్సుచే ఆవరింప బడినిది. అది కూడ అజ శబ్దంచేతనే చెప్పబడుతుంది.(అజా)

**అత ఏవ త్వజే జ్యేష్ఠే ఇతి లోకే ప్రకీర్తితే ।**
**సుఖదుఃఖప్రదా చైవ అపరా దుఃఖదైవ తు ॥10॥**

అందువలననే రెండును కూడ(అజా) శ్రేష్ఠములైనవని లోకంలో కీర్తింపబడుతున్నాయి. అందు అపరా నామమైన అజ కేవలం దుఃఖమునే కలుగజేస్తుంది. రెండవది సుఖ,దుఃఖాలను రెండింటినీ కలుగజేస్తుంది.

**మోక్షాధికారిణామేవ జ్ఞానైశ్వరాదయో గుణాః ।**
**తేషామాచ్ఛాదికాహ్యేకా తమోఽంగా సా ప్రకీర్తితా ॥11॥**

మోక్షాధికారులకు మాత్రమే జ్ఞానం, ఐశ్వర్యం మున్నగు గణాలు(గుణాలు) ఉంటాయి. వాటిని ఒకటి ఆచ్ఛాదించి ఉంటుంది. ఆ అజ తమస్సుకు అంగంగా చెప్పబడుతుంది.

**జీవంప్రతి మహా విష్ణుం పా(బా)హ్యాచ్ఛాదయతి ప్రభో ।**
**సా పరా ప్రకృతిర్జ్ఞేయా పరమాచ్ఛాదికా స్మృతా ॥12॥**

ప్రభూ! రెండవది జీవుని, మహావిష్ణువును బాహ్యంగా ఆచ్ఛాదించి ఉంటుంది. అది పరాప్రకృతిగా చెప్పబడుతుంది. అది "పరమాచ్ఛాదిక" అని స్మరింపబడుతోంది.

**ఏవం సా పరమా దుష్టా తమోఽంగా తు ప్రకీర్తితా ।**
**జీవ వర్గేష్వేవ ఖగ బ్రహ్మాదేర్నాస్తి సా క్వచిత్ ॥13॥**

ఇట్లే తమస్సుకు అంగమైన అపరాప్రకృతి "పరమదుష్ట"గా తెలియజేయబడుతోంది. ఖగమా! ఇది జీవవర్గాలలో మాత్రమే ఉంటుంది. బ్రహ్మాదులకు ఎన్నడును ఉండదు.

**పిశాచవత్సముద్దిష్టా జీవస్యేత్యధికారిణః ।**
**ప్రేరికా తు తయోర్దేవ్యో స్త్వహమాద్యా సుఖాత్మికా ॥14॥**

అధికారియైన జీవునకు పిశాచంవలె ఆమె సుఖదుఃఖాలను కలుగజేస్తుంది. శ్రీదేవికి, భూదేవికి నేను మొదటిదైన సుఖాత్మికమైన ప్రేరకమగుచున్నాను.

**తత్ర విష్ణో మహాభాగ సగుణాచ్ఛాదకో హితః ।**
**పరమాచ్ఛాదికాం దుష్టాం వ్యాముచ్యైవ మహాప్రభో ॥15॥**

**మోక్షం దేహి మహాదేవ త్వద్భక్తానాం మహాప్రభో ।**
**పరమాచ్ఛాదికా హ్యస్మిన్నిత్య సంసారిణో యతః ॥16॥**

విష్ణూ! మహాభాగా! సగుణమైన ఆచ్ఛాదకం హితమైనది. మహాప్రభూ! పరమమైన ఆచ్ఛాదికను, దుఃఖమైన ఆచ్ఛాదికను తొలగించి నీ భక్తులకు మోక్షమునిమ్ము. ఇందు పరమాచ్ఛాదిక నిత్యసంసారం చేయువారికి ఉంటుంది.

**అత ఏవ చ నిత్యత్వాత్తస్మాత్తదపసారణమ్ ।**
**కురు దేవ మహాభాగ ఇతి విజ్ఞాయతాం మమ ॥17॥**

అందువలన మహాభాగా! దేవా! అది నిత్యత్వం కలది కావున ముముక్షువులకు దానిని తొలగించివేయి. ఇది నా విజ్ఞాపనం.

**ఏవం స్తుతో హరిః కృష్ణో సుప్రబుద్ధోऽపి సర్వదా ।**
**ఉద్బుద్ధవాన్మహావిష్ణు రభూదజ్ఞపరీక్షయా ॥18॥**

ఈ విధంగా కృష్ణుడైన హరి స్తుతింపబడినాడు, ఆయన ఎల్లప్పుడు పరిపూర్ణుడైన జ్ఞానవంతుడు. (మేల్కొని ఉండువాడు). మహావిష్ణువు అజ్ఞులను పరీక్షించుటకై మేల్కొనే ఉంటాడు.

**తస్య నాభే రభూత్పద్మం సౌవర్ణం భువనాశ్రయమ్ ।**
**తత్ప్రాకృతం చ విజ్ఞేయం భూదేవీత్యభిమానినీ ॥19॥**

విష్ణువు నాభినుండి భువనాలకు ఆశ్రయమై సువర్ణమయమైన పద్మం పుట్టింది. అది ప్రాకృతసృష్టిగా తెలియవలసి ఉంది. భూదేవి దానిని అభిమానించి ఉంటుంది.

**అనంత సూర్యవచ్చైవ ప్రకాశకరమీరితమ్ ।**
**చిదానందమయో విష్ణు స్తస్మాద్భిన్నో న సంశయః ॥ 20**

అది అనంత సూర్యులవలె కాంతినిస్తూ వ్యాపించింది. చిదానందమయుడైన విష్ణువు దాని కన్న భిన్నుడు. సంశయం లేదు.

**విష్ణోః స్వరూపభూతం చ యే విజానంతి తే నరాః ।**
**తే యాంతి హ్యధరం లోకం తథా తత్సంగిసంగినః ॥21॥**

ఏ నరులైతే దానిని విష్ణుస్వరూపంగా తెలుసుకుంటారో, వారు అధోలోకాన్ని పొందుతున్నారు. అలాగే వారితో సాంగత్యమున్నవారు, వారితో సంగతి చేసేవారు కూడ అంతే.

**కిరీటాదికవచ్చైవ జ్ఞాతవ్యం చ ఖగేశ్వర ।**
**కిరీటాద్యా అపి హరేర్ద్విధా సంతి న సంశయః ॥22॥**

ఖగేశ్వరా! అది కిరీటం మున్నగు వాని వలె తెలియదగియున్నది. హరికి కిరీటాదులు కూడ రెండు విధాలుగా ఉంటాయి. సంశయం లేదు. (శరీరం దానిపై నుండే కిరీటాదుల వలె).

**స్వరూపాహ్య స్వరూపాశ్చ స్వస్వరూప నిదర్శనే ।**
**గృహీతా ఇతి విజ్ఞేయా న స్వరూపాః ఖగేశ్వర ॥23॥**

స్వరూపాలు, అస్వరూపాలు అని రెండు విధాలు. ఖగేశ్వరా! తన స్వరూపనిదర్శనమందు విశేషించి తెలియజేయటానికి రెండును గ్రహింపబడతాయని తెలియాలి. స్వరూపాలు మాత్రము కాదు.

**బ్రహ్మాండం హ్యసృజత్తత్ర సర్వలోక విధాయకమ్ ।**
**ప్రలయే ముక్తిహీనశ్చ సుప్త ఇత్యుచ్యతే బుధః ॥24॥**

అంత సమస్తలోకాలకు ఆధారభూతమైన బ్రహ్మాండాన్ని అప్పుడు నిర్మించాడు. ప్రలయంలో ముక్తి పొందకుండా (అదృశ్యం కాకుండా) ఎల్లప్పుడు జాగ్రదవస్థలో (జ్ఞానావస్థలో) ఉండేవాడయినా నిదురిస్తాడని (సుప్తావస్థ) చెప్పబడింది.

**తస్య సమివస్త్రివం చ న జ్ఞాతవ్యా ఖగేశ్వర ।**
**ప్రలయోఽ పి మహాభాగ బ్రహ్మవాయ్వో ర్నచాస్తి హి ॥25॥**

ఖగేశ్వరా! అతని యొక్క సంఘాత సమూహమందు త్రిగుణస్థితి తెలియరానిది. మహాభాగా! బ్రహ్మవాయువులకు ప్రలయం కూడ లేదు.

**వృత్తిరూపం పరం జ్ఞానం పాదార్ఘ్యం నాత్ర సంశయః ।**
**ఇంద్రియాణా ముపరతిః సుప్తి రిత్యుచ్యతే బుధైః ॥26॥**

వృత్తిరూపమే పరమైన జ్ఞానం. అది పాదార్ఘ్యం వంటిది. అందు సంశయంలేదు. ఇంద్రియాల ఉపరతియే సుషుప్తి అని బుధులచే చెప్పబడుతోంది. (పాద్యం, అర్ఘ్యం ఒకేమారు ఈయబడినట్లుగా వృత్తి, జ్ఞానం కలిసి ఉంటాయి.)

**బ్రహ్మ వాయ్వోశ్చ పాసాగ్ని వాస్తవం స్యాత్ఖగేశ్వర । (పాశాగ్ని)**
**కథం తర్హి తయోర్వర్తే హ్యవిలయత్వముచ్యతే ॥27॥**

బ్రహ్మ వాయువుల స్థితి వరుణాగ్నుల స్థితి వంటి వాస్తవమే అవుతున్నది. అటువంటప్పుడు కూడ వారు ఉండుటచే లయం లేకుండుట చెప్పబడుతున్నది.

**తస్మాత్తద్వాస్తవం నాస్తి బ్రహ్మవాయ్వోః ఖగేశ్వర ।**
**స్వప్నావస్థాయాః సదృశీ హ్యవస్థా సుప్తి సంజ్ఞికా ॥28॥**

ఖగేశ్వరా! అందువలన బ్రహ్మ వాయువులకు వాస్తవం (వస్తు స్థితి) లేదు. స్వప్నావస్థకు సమానమైన అవస్థ సుప్తి అనే పేరు కలది.

**బ్రహ్మణ్యముఖ్యయా వృత్త్యా హ్యస్తీత్యేవం నిబోధయే ।**
**అతో న వాస్తవమిదమంగీకార్యం ఖగేశ్వర ॥29॥**

**వాస్తవం యే విజానంతి తేషాం నిత్యం ధనం తపః ।**

బ్రహ్మయందు అముఖ్య వృత్తిచే (అప్రధాన వృత్తిచే) అది ఉందని నావలన తెలిసికో. ఖగేశ్వరా! అందువలన ఇది వాస్తవం కాదని అంగీకరించవలసిందే. ఈ వాస్తవం ఎవరయితే తెలుసుకొంటారో, వారికి నిత్యమూ తపస్సే ధనం.

**శ్రీ గరుడ ఉవాచ -** గరుడుడు పలికాడు.

**సుప్తిస్త్వజ్ఞాన కార్యత్వాత్ సుప్తిర్నాస్తీత్యుదీరితా ॥30॥**

సుప్తి అనేది అజ్ఞానం వలన వచ్చేకార్యం. అందువలన సుప్తి అనేది వాస్తవం కాదని చెప్పబడింది.

**యదా హి కారణం చాస్తి తదా కార్యమితి ప్రభో ।**
**ఇత్యభిప్రాయ గర్భేణ త్వం సమాధస్వ తే యది ॥31॥**

**తర్హి తస్య మహాభాగ కథం బ్రూహి భయాదికమ్ ।**
**భయాదికం హ్యస్తు నామ కా వాస్మాకం క్షతిర్భవేత్ ॥32॥**

ప్రభూ! ఎప్పుడయితే కారణమనేది ఉంటుందో అప్పుడే కార్యం కలుగుతుంది. ఈ అభిప్రాయం లోపల ఉంచుకొని నీవు సమాధానం వచించు. మహాభాగా! నీకు తగిన నాడు భయాదికం ఎట్లు కలుగుతుందో చెప్పు. భయాదికమనేది ఉండవచ్చు గాక! మావంటి వారికి ఎలా తొలగుతుంది?

**ఏవ ముక్తస్తు గోవిందోఽబ్రవీత్తత్రాపి కారణమ్ ।**
**భయం త్వజ్ఞాన కార్యం స్యాత్కార్యాకారణ మత్ర హి ॥33॥**

గోవిందుడు ఇట్లు అడుగబడినవాడై అక్కడ ఉండే కారణం ఇలా వచించాడు."భయం అజ్ఞాన సంబంధమైన కార్యం. ఆ కార్యమునకు ఏకారణమూ అక్కడ లేదు.

**ప్రీయతే మత్వా బ్రహ్మ తస్మాత్ సుప్తిశ్చ తత్ర హి ।**
**అజ్ఞాదికం యది బ్రహ్మ తస్య న స్యాత్కథంచన ॥34॥**

అనగా తనకు ప్రీతి కలిగిస్తోందని తలచి బ్రహ్మ, ఆ కారణంచే సుప్తిని పొందుతున్నాడు కదా! అది అజ్ఞానమయితే బ్రహ్మకు, అది ఎన్నడును ఉండరాదు.

**కథం సుఖీ ప్రదృశ్యేత న కథంచిత్కరిష్యతి ।**
**కథం వా ముక్తి పర్యంతం జ్ఞానవ్యక్తిర్వదస్వ మే ॥35॥**

**యద్యజ్ఞానం తస్య సత్యం న స్యాత్తర్హి మహాప్రభో ।**
**అత్యాదరాత్ కథం బ్రహ్మాఙ్ఛ్రవణం కురుతే వద ॥36॥**

సుఖం కలవాడు ఎలా కనబడతాడు? ఏమి చేయకుండా ఎలా ఉంటాడు? ముక్తి వచ్చేవరకు జ్ఞానాభివ్యక్తి (వృద్ధి) ఎలా కలుగుతుంది? నాకు వచించు. మహాప్రభూ! బ్రహ్మకు అజ్ఞానముంటే సత్యముండకూడదు గదా! నాకు మిక్కిలి ఆదరంతో వినిపించవలసిందని కోరాడు.

**ఇతి తస్య వచఃశ్రుత్వా కృష్ణో వచనమబ్రవీత్ ।**
**భయం చ వాస్తవం తస్య న జానీహి మహామతే ॥37॥**

ఈ విధమైన గరుడుని వచనాలను విని కృష్ణుడిలా వచించాడు. మహామతీ! భయమనునది బ్రహ్మకు వాస్తవంగా లేదు. ఆ విషయం గ్రహించు.

**దృశ్యతే యద్భయం తస్య హరి ప్రీత్యర్థమేవ చ ।**
**భయాకామవతీవానమువాస్తవమీరితమ్ ॥38॥**

**ప్రాప్తప్రారబ్ధ లేశస్త తస్య నాస్తి ఖగేశ్వర।**
**దుఃఖజ్ఞానాధికం కించిత్కథం తస్మిన్ భవిష్యతి ॥39॥**

ఒకవేళ బ్రహ్మలో భయం కనపడితే అది హరి సంతోషం కోసమే అవుతుంది. భయం అకామంగా కలిగి యుండడమనేది వాస్తవంగా చెప్పబడినది. ఖగేశ్వరా! ప్రారబ్ధలేశం ప్రాప్తించడమనేది అతనికి లేదు. దుఃఖం, జ్ఞానం మున్నగునవి అతనియందు కొంచెం కూడ ఎలా కలుగుతాయి?

**విష్ణో రాజ్ఞానుసారేణ భయాయానుకరోత్యసౌ ।**
**తేన ప్రీణాతి చ హరి స్తస్య నాస్త్యత్ర సంశయః ॥40॥**

విష్ణువుయొక్క ఆజ్ఞ ప్రకారంగా అతడు భయంతో అనుకరిస్తున్నాడు. ఆకారణంచే హరి అతనికి ప్రీతిని కలిగిస్తున్నాడు. అందు సంశయం లేదు.

**శృణోతి సతతం బ్రహ్మా న చింత్యాత్తావతాజ్ఞతా ।**
**కదాచిద్దృశ్యతే బ్రహ్మా దుఃఖీ న చ ఖగేశ్వర ॥41॥**

బ్రహ్మ ఎల్లప్పుడు శబ్దాన్ని గ్రహిస్తాడు. అందువలన అతని అజ్ఞత చింతింపదగినది కాదు. ఖగేశ్వరా! బ్రహ్మ ఎన్నడును దుఃఖంతో కనిపించడు.

**యద్బ్రహ్మా చ న జానీయాద్ధరి ప్రీత్యర్థమేవ చ ।**
**దుఃఖి వద్దృశ్యతే బ్రహ్మా అజ్ఞానం మోహనాయ చ ॥42॥**

బ్రహ్మ తెలియనివానిగా ఉంటే (తెలుసుకోకపోయినట్లయితే) అది హరి ప్రీతి కోసం మాత్రమే. అజ్ఞానులను మోహింపజేయుటకై బ్రహ్మ దుఃఖి వలె కనబడతాడు.

**యోగ్యతా మనతిక్రమ్య యావజ్ జ్ఞానం చ తిష్ఠతి ।**
**బ్రహ్మణస్తావదేవాస్తి నాత్ర కార్యా విచారణా ॥43॥**

యోగ్యతను అతిక్రమించకుండా ఎంతవరకు జ్ఞానం ఉంటుందో, బ్రహ్మకుకూడ అంతవరకు ఉంటుంది. ఇందులో ఆలోచించవలసింది లేదు.

**జ్ఞానస్య వ్యక్తతా నామ విద్యమానస్య చాదరాత్ ।**
**జ్ఞానస్యాసాదనం చైవ జ్ఞానవ్యక్తి రితి స్మృతా ॥44॥**

జ్ఞానవ్యక్తీకరణమనగా (వ్యక్తమగుట) ఉన్నదానిని ఆదరించుటయే, జ్ఞానమును పొందుటయే జ్ఞానవ్యక్తి అని చెప్పబడుతుంది.

**అతో జ్ఞానాదికం నాస్తి బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**పద్మాద్ధిరణ్మయాజ్జాతో బ్రహ్మా తు చతురాననః ॥45॥**

అందువలన పరమేష్ఠి అయిన బ్రహ్మకు (అ)జ్ఞానాదికం లేదు. చతురాననుడైన బ్రహ్మ హిరణ్మయమైన పద్మంనుండి ఉద్భవించాడు.

**సర్వదాఽ ఽ లోచనా యుక్తస్తేన స్వాలోచనం కృతమ్ ।**
**అజ్ఞానం మోహనార్థాయ హరి ప్రీత్యర్థమేవ చ ॥46॥**

ఎల్లప్పుడు ఆలోచనతో కూడుకొని ఉంటాడు. అందువలన అతనిచే ఆలోచన చేయబడింది. అదికూడ అజ్ఞానులను మోహింపజేయుటకు, హరి సంతోషంకొరకు మాత్రమే.

**సంకల్పోఽ పి తథైవాస్తి నహ్యజ్ఞాన కృతస్తథా ।**
**కో వా మాం సృష్టవానత్ర ఇతి హ్యాలోచ్య స ప్రభుః ॥47॥**

**తం విచారయితుం బ్రహ్మా పద్మనాడీం వివేశ హ ॥48॥**

సంకల్పం కూడ అతనికి అలాగే కలిగింది. అజ్ఞానం వలన చేయబడినది మాత్రం కాదు. ఆ ప్రభువు నన్ను సృష్టించిన వాడెవడని ఆలోచించాడు. బ్రహ్మ ఆ విషయం తెలిసికొనుటకై పద్మనాళంలో ప్రవేశించాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే అజ్ఞానహేతు నిరూపణం నామైకాదశోఽ ధ్యాయః ॥11॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో అజ్ఞానకారణనిరూపణం అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

## ద్వాదశోऽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

## బ్రహ్మస్తుతిః - బ్రహ్మ చేసిన విష్ణుస్తుతి

**శ్రీ కృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**నాడీం సమావిశ్య మహానుభావః శ్రీవిష్ణుభక్తో త్వథ పుష్కరస్థః ।**
**విచారయామాస గురుం స్వమూలం నారాయణం నిర్గుణమద్వితీయమ్ ॥1॥**

నాళంలో ప్రవేశించి, మహానుభావుడై, శ్రీవిష్ణుభక్తుడైన బ్రహ్మ తన గురువు తండ్రి, మూలమైన నిర్గుణ, నారాయణుని గురించి ఆలోచింపసాగాడు.

**ఏతావతా హరిభక్తస్య తస్యాప్యచ్ఛిన్న భక్తస్య చతుర్ముఖస్య ।**
**విచార కాలే చ విచింతనీయో హ్యజ్ఞాన లేశస్తు ఖగేశ్వరేశ్వర ॥2॥**

పక్షిరాజులకు ప్రభువైనవాడా! ఈ విషయంలో ఎడతెగని భక్తి కలిగిన హరిభక్తులలో ఆ చతుర్ముఖునకు ఆ ఆలోచించే సమయంలో కొద్దిపాటి అజ్ఞానం ఉన్నట్లు ఊహింపవలసియుంది.

**యథాస్తి విష్ణోర్మనః సంకల్పఏవ తథైవ సోऽపి ప్రకరోతి నిత్యమ్ ।**
**ఆలోచనే తస్య సదాస్తి భూమన్ స్వయోగ్యతామనతిక్రమ్య చైవ ॥3॥**

విష్ణువుయొక్క మనస్సు నందు సంకల్పం ఎలా ఉంటుందో, అలాగే అతడు కూడ నిత్యమూ ప్రవర్తిస్తాడు. గొప్పవాడా! తన యోగ్యత అతిక్రమించకుండా, అతని ఆలోచనలో నిత్యమూ విష్ణుసంకల్పం ఉంటుంది.

**హరేః స్వరూపే చ తథా ప్రపంచః స్వస్మిన్ స్వరూపే చ ఖగాస్తి జ్ఞానమ్ ।**
**యథాపి నిత్యం పరిచారవారి చ అజ్ఞాతవద్దృశ్యతే విష్ణునా చ ॥4॥**

ఓ గరుడా! హరిస్వరూపంలో అంతయూ విస్తరించి ఉంటుంది. తనయందు, తన స్వరూపము నందును జ్ఞానం ఉంటుంది. నిత్యం తన చుట్టును నీరు సంచరిస్తూ ఉండడంచే విష్ణువుచే కూడ అతడు తెలియబడని వానివలె కనబడుతున్నాడు.

**హరేః ప్రీత్యర్థం కురుతేऽసౌ కదాచిత్ తత్రాపి కశ్చిద్విశేషోऽస్తి వీంద్ర ।**
**శృణుష్వ సమ్యఙ్నిగృహీతచిత్తో యథా ప్రోవాచ స విజానాతి దేవః ॥5॥**

పక్షీంద్రా! అతడు హరి ప్రీత్యర్థమే చేస్తాడు. (ఒకానొకప్పుడు) అప్పుడు కూడ ఒక విశేషం ఉంటుంది. ఆ దేవుడు ఏ విధంగా తెలుసుకొన్నట్లు చెప్పాడో దానిని శ్రద్ధగా నియమిత చిత్తంతో విను.

**సదా త్వదోషం ప్రవిశేషైశ్చ ముక్తవేదాస్తథా వా ప్రవిజానంతి నిత్యమ్ ।**
**తస్య స్వరూపం న తథా హరిం చ స్వయోగ్యతా మనతిక్రమ్య వేధాః ॥6॥**

ఎప్పుడు మిక్కిలి విశేషాలతో ఏ దోషమూ లేని వానిని వేదాలు కూడ నిత్యమూ తెలుసుకొనే విషయాన్ని విడిచిపెట్టిన వానిని, బ్రహ్మ కూడ తన యోగ్యతను అతిక్రమించలేక ఆ హరినీ, అతని స్వరూపాన్నీ తెలుసు కోలేకపోయాడు.

**హరేః స్వరూపం న విజానాతి సర్వం స్వయోగ్యరూపం సర్వదా వేత్తి విష్ణోః ।**
**తత్రాజ్ఞానం నాస్తి కించి ద్ద్విజేంద్ర యావత్స్వరూపం చ తథైవ లక్ష్మ్యాః ॥7॥**

హరిస్వరూపాన్ని పూర్తిగా తెలియలేకపోయాడు. తన అర్హతననుసరించి విష్ణుస్వరూపాన్ని ఎప్పుడూ తెలుకొంటూనే ఉంటాడు. పక్షీంద్రా! అక్కడ అజ్ఞానమనేది ఏ కొంచెం కూడ ఉండదు. లక్ష్మీస్వరూపం విషయంలోను అంతే.

**వేధా న జానాతి కుతస్తదన్యేతయోః స్వరూపం న విజానాతి సర్వమ్ ।**
**తథాపి వేదానేకదేశేన వేదజానాతి లక్ష్మీర్హరిరూపం చ యావత్ ॥8॥**

బ్రహ్మ కూడ తెలియజాలదు. ఇక మిగిలినవారిని చెప్పనేల? వారి స్వరూపమంతను బ్రహ్మ కూడ తెలియలేదు అయినప్పటికీ ఏకదేశంగా తెలియగలడు. హరిస్వరూపమునంతను అనేకదేశంగా లక్ష్మి తెలియగలదు.

**తావన్నజానాతి విధిః ఖగేంద్రజ్ఞానే విధాతుశ్చ స్వయోగ్యభూతే ।**
**అతో విరించస్య న చింతనీయో హ్యజ్ఞానలేశః క్వాపి దేశే చ కాలే ॥9॥**

ఖగేంద్రా! విధి అనేక దేశంగా (సర్వ విధముల) తెలియజాలడు. బ్రహ్మకు తన యోగ్యతకు తగిన జ్ఞానం మాత్రమే కలదు. అంత మాత్రంచే దేశకాలాలను బట్టి విరించికి అజ్ఞానలేశం కూడా చింతింపరానిది.

**నాడీం సమావిశ్య తదా విరించో న వేద నారాయణమేకవచ్చ ।**
**తథా శృణోత్తం కమలాసనం ప్రభుస్తప స్తప ద్వ్యక్షరం సాదరేణ ॥10॥**

అప్పుడు విరించుడు (విరించి) నాడిలో ప్రవేశించి ఒక్కడుగా నున్న నారాయణుని తెలుసుకోలేకపోయాడు. అప్పుడా ప్రభువు ప్రీతితో కమలాసనునికి "తపః తపః" (తపః తప) అనే రెండక్షరాల పదాలను రెండు సార్లు వినిపించాడు.

**అభిప్రాయం తస్య సమ్యగ్విదిత్వాతపః కురు త్వం హరితుష్ట్యర్థమేవ ।**
**తపోఽకరోద్ధరిపాదైకనిష్ఠోహరేః ప్రీత్యర్థం దివ్య సహస్రవర్షమ్ ॥11॥**

హరి సంతసించుట కోసమై నీవు తపమును ఆచరింపుమనే ఆ ప్రభువు యొక్క అభిప్రాయం శ్రద్ధగా తెలిసికొని, హరిపాదాలపై ఏకాగ్రచిత్తముంచి హరి ప్రీతి కొరకై దివ్య సహస్ర సంవత్సరాలు బ్రహ్మ తపస్సు చేశాడు.

**తతో హరిః ప్రాదురాసీత్ఖగేంద్ర వరం దాతుం భక్తవరస్య దివ్యమ్ ।**
**సదా విష్ణుం దేవదేవో దదర్శ చతుర్భుజం తం జలజాయతాక్షమ్ ॥12॥**

ఖగేంద్రా! అంత హరి ఆ భక్తశ్రేష్ఠునికి దివ్యవర మివ్వటానికి ప్రాదుర్భవించాడు. అప్పుడు దేవదేవుడైన బ్రహ్మ చతుర్భుజుడు, పద్మవిశాలనేత్రుడు అయిన విష్ణువును సందర్శించాడు.

**శ్రీవత్స లక్ష్మం గలశోభి కౌస్తుభం సంపశ్యంతం సుప్రసన్నార్ద్ర దృష్ట్యా ।**
**దృష్ట్వా హరిం బ్రహ్మా నారాయణం చ పురః స్థితం భక్త వశ్యం దయాలుమ్ ॥13॥**

ఆయన శ్రీవత్సలాంఛనుడు. కౌస్తుభాన్ని మెడలో ధరించినవాడు. ఆర్ద్రదృష్టితో బ్రహ్మను చూస్తున్నవాడు. భక్తవశ్యుడై, దయాళువై ఎదుట నిలిచిన నారాయణుని బ్రహ్మ చూశాడు.

**సమర్చయామాస మహావిభూత్యాభక్త్యా హరేః పాదతీర్థం దధార ।**
**అస్తౌన్మహాభాగవత ప్రధానోహరిం గురుం భక్తివివర్ధితాత్మా ॥14॥**

చూసి, మహావిభూతితో భక్తిగా అర్చించాడు. భక్తితో హరిపాదతీర్థం ధరించాడు. భక్తితో పెంపొందింపబడిన మనస్సు కలవాడై, మహాభాగవతులలో ప్రధానుడైన బ్రహ్మ తన గురువైన (తండ్రియైన) హరిని ఇలా స్తుతించాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ వచించాడు.

**రమేశ లోకేశ జగన్నివాస తవ స్వరూపం న విజానాతి దేవీ ।**
**తవ ప్రసాదాత్సు విజానాతి దేవీ గుణాన్వేదోక్తాన్ సర్వదా వీంద్ర సర్వాన్ ॥15॥**

రమేశా! లోకేశా! జగన్నివాసా! నీ స్వరూపం దేవి కూడ తెలియజాలదు. పక్షీంద్రా! (పక్షులకు ప్రభువా)! వేదోక్తములైన సర్వగుణాలను ఎల్లప్పుడు నీ అనుగ్రహం వలన మాత్రమే దేవి లెస్సగా తెలియగలదు.

**తథాపి సా న విజానాతి దేవసాకల్యేనాశేషితః సద్గుణాంశ్చ ।**
**యదప్యనుక్తం పంచభిర్నాస్తి వేదైస్తథాపి దేవేఽత్ర విశేష ఆస్తే ॥16॥**

అయినప్పటికి సంపూర్ణంగా అశేషంగా సద్గుణాలను ఆ దేవి కూడ తెలియజాలదు. అయిదు వేదాలలో (నాలుగు వేదాలు – పురాణసంహిత) చెప్పబడనిదంటూ ఏదీ లేకపోయినప్పటికినీ, అక్కడకన్న దేవుని యందు ఏదో విశేషం మించి ఉంటోంది.

**తత్త్వేచ్ఛవః ప్రవిజానంతి నిత్యం వేదే సూక్తాన్ క్వాప్యనుక్తాంశ్చ సర్వాన్ ।**
**ఆదౌ జానంత్యత్ర వేదా మురారేఋుగాదయః సుష్ఠు చత్వార ఏవ ॥17॥**

వేదమందు చక్కగా చెప్పబడిన వానిని, ఎక్కడా చెప్పబడకుండా ఉన్న వాటిని అన్నింటిని తత్త్వం కోరేవారు నిత్యమూ తెలిసికొంటారు. మురారీ! మొదట ఋగ్వేదాదులు నాలుగు చక్కగా తెలిసినవి

**వేదాహ్యేతే వేదయంతీతి దేవతథా పురాణం భారతం పంచరాత్రమ్ ।**
**క్రమాదితో విచింత్య సావిష్ణు గుణాన్ స్వయోగ్యాన్సదా విజానాతి రమాపి దేవీ ॥18॥**

దేవా! ఈ వేదాలు నిన్ను తెలుసుకొంటున్నాయి. అదే విధంగా పురాణం, భారతం, పంచరాత్రం కూడ. క్రమంగా ఆది నుండి గ్రహించి, ఆ రమాదేవి తన యోగ్యతానుసారంగా విష్ణువు యొక్క గుణాలను తెలియ గలుగుతోంది.

**విశేషతో హ్యుక్త గుణానృగాదిషుస్వయోగ్య భూతాన్సంవిజానాతి దేవీ ।**
**సామాన్యతః ప్రవిజానాతి దేవీహరేర్గుణాన్నవిశేషాచ్చ నిత్యమ్ ॥19॥**

విశేషించి నరులు, మున్నగు వారిలో చెప్పబడే గుణాలను బట్టి తన యోగ్యతానుసారంగా దేవి చక్కగా తెలుసుకోగలుగుతుంది. నిత్యమూ దేవి సామాన్యంగా చక్కగా తెలియగలదు. హరిగుణాలను విశేషంగా మాత్రం తెలియజాలదు.

**అహం విజానామి రమా ప్రసాదాత్ తవ ప్రసాదాచ్చ గుణాన్సదైవ ।**
**స్వయోగ భూతాఇళ్ళృతిషూక్తాన్ గుణాంశ్చకాంశ్చిద్విజానాతి హరేర్న కశ్చిత్ ॥20॥**

రమాదేవి అనుగ్రంవలన, నీ అనుగ్రహంవలన నీ గుణాలను ఎల్లప్పుడు నేను తెలియగలుగుతున్నాను. వేదాలలో చెప్పబడిన గుణాలను నా యోగ్యతానుసారంగా కొన్నింటిని మాత్రమే గ్రహిస్తున్నాను. హరియొక్క గుణాలను ఏ ఒక్కడునూ పూర్తిగా గ్రహింపజాలడు.

**తవ ప్రసాదాచ్చ మమ ప్రసాదాత్ కాలాంతరే తాంశ్చ జానాతి శేషః ।**
**దుష్కర్మలేశాన్న తిరోహితాన్ గుణాన్ యానేవ పూర్వం విదితాన్ స్వయోగ్యాన్ ॥21॥**

నీ అనుగ్రహంవలనను, నా అనుగ్రహంవలనను కాలాంతరంలో వాటిని శేషుడు తెలియగలడు. వాటిని తన యోగ్యానుసారంగా పూర్వమే గ్రహించిననూ, దుష్కర్మలేశం వలన మరుగునపడి, ఆ గుణాలు పూర్తిగా అంతర్ధానం కాకుండా ఉండిపోయాయి.

**తానేవ జ్ఞాత్వా పునరేవ శేషస్తిరోహితాం ల్లబ్ధగుణస్తతః స్మృతః ।**
**సదా స్వయోగ్యాంశ్చ హరే ర్గుణాంశ్చఉమాపతిశ్చాపి తవ ప్రసాదాత్ ॥22॥**

అంతర్ధానాలైన ఆ గుణాలనే మళ్లీ తెలుసుకొని, శేషుడు గుణవంతుడయ్యాడని చెప్పబడుతోంది. ఉమాపతి కూడ నీ అనుగ్రహం వలన హరిగుణాలను తనకు యోగ్యమైనట్లుగా గ్రహిస్తాడు.

**యదా విజానాతి హరే మురారే అప్రాప్తలబ్ధేతి తదోచ్యతే హరః ।**
**మమాపి లోకం చ యదా మురారే తదా విజానాతి తవ స్వరూపమ్ ॥23॥**

హరీ! మురారీ! ఎప్పుడయితే హరుడట్లు గ్రహించాడో, అప్పుడే అతడు "అప్రాప్తలబ్ధుడు" అయ్యాడని చెప్పబడతాడు. మురారీ! ఎప్పుడయితే నీ స్వరూపం నాకు తెలియబడుతుందో అప్పుడే లోకం కూడ నీ స్వరూపాన్ని తెలియగలదు.

**గోవింద నిత్యావ్యయ చిత్సుపూర్ణతవ ప్రసాదాన్నాస్తి శతేషు తన్మమ ।**
**యే యే హి దేవాశ్చ శరీరధారిణస్తే జ్ఞాన హీనా విషయేషు నిష్ఠాః ॥24॥**

గోవిందా! నిత్యా! అవ్యయా! జ్ఞానసంపూర్ణా! ఎవరెవరయితే దేవతలు, శరీరధారులై జ్ఞానహీనులు, విషయాసక్తులై ఉన్నారో వారికి, నీ సంకల్పం వలన నాకు ఉన్న జ్ఞానంలో నూరోవంతు జ్ఞానం కూడ ఉండదు.

**యే యే దేవా విషయేషు నిష్ఠాస్తే తే దేవా బహిరర్థభావాః ।**
**యే యే దేవా బహిరర్థభావాః మోక్షాదన్యే ప్రలపంతః సదైవ ॥25॥**

ఏ ఏ దేవతలు విషయములందు ఆసక్తి కలవారో, ఆయా దేవతలు బాహ్యప్రయోజనరతులై ఉంటారు. ఏ ఏ దేవతలు ప్రపంచాసక్తులో, వారు ముక్తి కన్న ఇతరవిషయాలనే ఎల్లప్పుడు మాటాడుతుంటారు.

**తవ స్వరూపే చ జగత్స్వరూపేతవాసమానం నాస్తి విష్ణో సదైవ ।**
**యతస్తవ ప్రాకృతో నాస్తి దేహోయతో జ్ఞానం నాస్తి  నాస్త్యేవ నిత్యమ్ ॥26॥**

విష్ణూ! నీ స్వరూపమందును, జగత్స్వరూపమునందును నీకు సాటి ఎప్పుడునూ లేదు. నీకు ప్రాకృతదేహం లేని కారణంగా నీకు అజ్ఞానమనేది నిత్యమూ ఉండనే ఉండదు. ఉండదు.

**పూర్ణానందజ్ఞానదేహోఽపి నిత్యం సదా శరీరీ భాష్యతే భక్తిమద్భిః ।**
**యతస్తవ నాస్తి ప్రాకృతో నాస్తి దేహోహ్యతోఽపి నిత్యమశరీరేతి స్మృతః ॥27॥**

పరిపూర్ణమైన ఆనందమూ, జ్ఞానమూ నీ దేహం. అయినా భక్తులు నిన్ను ఎల్లప్పుడు శరీరం కలవాడవని సంభాషిస్తారు. నీకు ప్రాకృతమైన దేహం లేని కారణంచే, నీవు నిత్యం అశరీరుడవుగానే స్మరింపబడతావు.

**నతోఽహం సర్వదాస్మిఞ్ఛరీరేఽహం మమేత్యభిమానేన శూన్యః ।**
**అతోఽప్యహం త్వశరీరీ సదైవ తథైవ నిత్యం బహిరర్థైశ్చశూన్యః ॥28॥**

ఎల్లప్పుడు నేను నీకు వినమ్రుడను. ఈశరీరమందు నాకు నేను, నాది అనే అభిమానం లేనివాడను (లేదు). అందువలన నేను కూడ ఎప్పుడునూ అశరీరుడనే. అదే విధంగా నిత్యమూ బహిర్విషయాసక్తి లేనివాడను.

**స్వభోగభార్యా సత్యలోకాదిభోగః స్వయోగ్యభోగో వస్త్రమాల్యాదిభోగః ।**
**ఏతే హి సర్వే బహిరర్థసంజ్ఞకాః నైసర్గకామాః సర్వదా మే హి విష్ణో ॥29॥**

తన భార్యతో భోగించుట, సత్యలోకం మున్నగుచోట్ల నివాసభోగం తన యోగ్యతననుసరించి అనుభవించుట, వస్త్రం, మాల్యములు మున్నగునవి ధరించుట – ఇవన్నీ బహిరర్థములనే పేరుతో వ్యవహరింపబడేవి. విష్ణూ! ఇవి నాకు స్వాభావికకామనలై ఎప్పుడూ ఉన్నాయి.

**తథాప్యహం కామహీనో హి నిత్యం రుద్రాదయః కామవంతో యతోఽతః ।**
**శరీరిణస్తే బహిరర్థభావా అజ్ఞానవంతోఽపి సంస్మృతాః ఖగ ॥30॥**

అయినప్పటికిని నిత్యమూ నేను కామహీనుడను. రుద్రాదులు అయితే కామవంతులు. అందువలన వారు బహిరర్థభావాలు కలిగిన వారు కావున శరీరాలు కలవారుగా వ్యవహరింపబడుతున్నారు. ఖగా! అందువలననే అజ్ఞానవంతులుగా కూడ వ్యవహరింపబడుతున్నారు.

**స్వదారభోగే కేవలాం ప్రీతిమేవం హరేరేవం సర్వదాహం కరోతి ।**
**స్తంబాస్త్రాదీన్ ధారయిష్యే సదైవవిష్ణోః ప్రీత్యర్థం నైవ గాత్రార్థమేవ ॥31॥**

హరికి కేవల(నైసర్గికమైన) ప్రీతి ఉన్నట్లుగా, నేను కూడ నిత్యమూ స్వదార భోగప్రీతి కలిగి ఉంటాను. అందువలన ఎల్లప్పుడు స్థిరంగా ఉండే దేహధారణసాధనాలను విష్ణువుయొక్క ప్రీతి కొరకు మాత్రమే ధరిస్తున్నాను. శరీరం కోసం మాత్రం కాదు.

**నిత్యానందాదన్యకామో న మే ఽస్తి అతః సదా బహిరర్థైశ్చ శూన్యః ।**
**మమాపి భార్యా బహిరర్థశూన్యా అమూఢభావా మూఢవతీవ దృశ్యతే ॥32॥**

ఎల్లప్పుడు ఆనందస్వరూపుడను కావున నాకు వేరేకోరిక ఏమీలేదు. అందువలన ఎప్పుడును బాహ్యా ప్రపంచార్థశూన్యుడను. నా భార్యకూడ బహిరర్థాలలో ఆసక్తి లేనిది. ఏ మూఢభావమూ లేనిదైననూ మూఢవతిగా కనిపిస్తుంది.

**అమూఢ భూతా జ్ఞానినాం సర్వదైవతథాజ్ఞానాం జ్ఞానహీనేతి భాతి ।**
**యావజ్జ్ఞానం చాస్తి మే వాస్తుదేవతావజ్ జ్ఞానం వాసుదేవస్య చాస్తి ॥33॥**

జ్ఞానులకు ఎల్లప్పుడు మూఢురాలు కానట్లుగను, అజ్ఞానులకు జ్ఞానహీనురాలుగను ఆమె గోచరిస్తుంది. దేవా! నాకు ఎంత జ్ఞానం ఉంటుందో, ఆమెకు కూడ ఆ జ్ఞానం అంతా ఉంటుంది. వాసుదేవునికి కూడ ఆ జ్ఞానం అంతా ఉంటుంది.

**యావజ్ జ్ఞానం వాసుదేవస్య చాస్తితావజ్జ్ఞానం జ్ఞానవతామృజూనామ్ ।**
**క్రమేణై వాజ్ఞానినాం వానృజూనాం అస్పష్టరూపో జ్ఞానగతో విశేషః ॥34॥**

వాసుదేవునికి ఎంత జ్ఞానం ఉన్నదో, అంత జ్ఞానం ఋజువులైన జ్ఞానవంతులకు ఉంటుంది. ఋజు(మార్గగాము) వులు కాని అజ్ఞానులకు క్రమంగా అస్పష్టరూపమైన జ్ఞానసంబంధవిశేషంగా ఉంటుంది.

**సౌరి ప్రకాశే చ యథైవ దర్శనం తథా మమ జ్ఞానగతో విశేషః ।**
**దీపప్రకాశే చ యథైవ దర్శనం తథా జ్ఞానం వాసుదేవస్య చాస్తి ॥35॥**

ఛాయాగ్రహప్రకాశమందు దర్శనం ఎటువంటిదో, నా జ్ఞానసంబంధవిశేషం కూడ అటువంటిదే. దీప ప్రకాశము నందు దర్శనం ఎటువంటిదో, వాసుదేవుని జ్ఞానం అటువంటిది.

**అస్పష్టరూపా న్యూనతా హ్యస్తి వాయౌతథా జ్ఞానం నైవ సంచింతనీయమ్ ।**
**ఏతాదృశీ జ్ఞానశక్తిర్మురారేర్వాయ్వాదీనాం మోక్షపర్యంతమస్తి ॥36॥**

వాయువునందు అస్పష్టరూపంగా న్యూనత ఉంది. జ్ఞానవిషయం కూడ అటువంటిదేయని ఎన్నడూ ఊహింపరాదు. ఇటువంటి జ్ఞానశక్తిమురారికి, వాయ్వాదులకు మోక్షపర్యంతం ఉంటుంది.

**జ్ఞానం త్వృజూనాం మోక్షకాలేఽ పిపంచవాయ్వాదీనాం ప్రలయేనార్ద్రాదీర్న ।**
**వాయోర్మమ ప్రలయకాలే తథాగాయత్ర్యా నాస్తి నాస్త్యేవ మోహః ॥37॥**

ఋజునామ దేవతలకు, పంచ వాయువులు, రుద్రులు మున్నగు వారికి మోక్షకాలమందు కూడ జ్ఞానం ఉంటుంది. ప్రలయంచే అది దూరం గాబోదు. అదే విధంగా వాయువుకు, నాకు, గాయత్రికి ప్రలయకాలము నందునూ మోహమనేది ఉండదు. ఉండనే ఉండదు.

**గాయత్రీవద్భారత్యా దేవదేవజ్ఞాతవ్యమేవం హరి తత్త్వవేదిభిః ।**
**మమాజ్ఞానం దృశ్యతే యత్ర కుత్రదైత్యాదీనాం మోహనార్థం సదైవ ॥38॥**

దేవదేవా! హరితత్త్వం తెలిసినవారిచే గాయత్రికి వలె భారతికి కూడ మోహం ఉండదని తెలియదగియున్నది. ఎక్కడయినా, ఎందయినా నాయందు అజ్ఞానం ప్రదర్శితమైతే అది దైత్యాదులను నిత్యమూ మోహపరచుటకు మాత్రమే.

**తేన ప్రీతిర్దేవదేవస్య విష్ణోర్భవిష్యతీత్యేవ వినిశ్చితాత్మా ।**
**ప్రశ్నాదికం త్వజ్ఞవత్సర్వదైవం కరిష్యేఽహం మోహనాయాధమానామ్ ॥39॥**

అందువలన దేవదేవుడైన విష్ణువుకు ప్రీతి కలుగుతుందని నిశ్చయింపబడిన మనస్సు కలవాడనై, అధములను మోహింపజేయుట కోసమై అజ్ఞునివలె ఎల్లప్పుడును ఇట్లు నేను ప్రశ్నించుట వంటివి చేస్తున్నాను.

**సూర్యోదయే నాస్తి యథా తమశ్చతథా జ్ఞానం నాస్తి నాస్త్యేవ దేవ ।**
**కరోమ్యహం శ్రవణం సర్వదైవహరి ప్రీత్యర్థం నిశ్చితార్థం సతాం హి ॥40॥**

దేవా! సూర్యోదయం కాగా తమస్సు ఎలా ఉండదో, అలాగే అజ్ఞానమనేది లేదు. లేదు సుమా! సత్పురుషుల యొక్క నిశ్చయజ్ఞానం కోసమై, హరిప్రీతికొరకై నేను ఎల్లప్పుడూ శ్రవణం చేస్తూ ఉంటాను.

**శతజన్మ గతానాం త్వనృజూనాం పూర్వమేవ తు ।**
**అపరోక్షాభావ ఏవ హ్యజ్ఞానం సముదీరితమ్ ॥41॥**

నూరు జన్మలుపొందిన ఋజువులు కానివారికి, (దేవతలకు) ముందుగానే అజ్ఞానం అదృశ్యమౌతుందని చెప్పబడింది.

**అపరోక్షానంతరం తు నాస్త్యజ్ఞానం న సంశయః ।**
**శతజన్మసు దేవేశ అపరోక్షేణ సర్వదా ॥42॥**

**పూర్ణజ్ఞానం మమాస్త్యేవ నాత్ర కార్యా విచారణా ।**
**శతజన్మసు పూర్వం తు పరోక్షేణ మమ ప్రభో ॥43॥**

**పూర్ణం జ్ఞానం సదాప్యస్తీత్యేవమాహుర్మహర్షయః ।**
**సంజ్ఞాజన్మమాగతాయాశ్చ సరస్వత్యా మహాప్రభో ॥44॥**

**నాజ్ఞానం చింతనీయం హి బ్రహ్మవాయ్వోశ్చ దేవ హి ।**
**అత్ర కశ్చిద్విశేషోఽస్తి జ్ఞాతవ్య స్తత్త్వమిచ్ఛుభిః ॥45॥**

అపరోక్షానంతరం అజ్ఞానమనేది ఉండదు. సంశయంలేదు. దేవేశా! వంద జన్మలయందును ఎల్లప్పుడు ప్రత్యక్షంగా పూర్ణజ్ఞానం ఉండనే ఉంటుంది. అందు ఆలోచించవలసిన పనిలేదు. ప్రభూ! శత జన్మలకు ముందు కూడ నాకు పరోక్షముగా. పూర్ణజ్ఞానం ఎల్లప్పుడూ ఉంటుందనే మహర్షులు చెప్తున్నారు. మహాప్రభూ! రాబోయే జన్మలో సరస్వతి అనే పేరు గలిగిన ఆమెకు కూడ అలాగే పూర్ణజ్ఞానం ఉంటుంది. దేవా! బ్రహ్మ వాయువులకు అజ్ఞానమనేది ఉంటుందని ఊహింపవలసిందే. అయితే ఇక్కడ ఒక విశేషం ఉంది. అది తత్త్వమును కోరువారిచే తెలియదగినది.

**అవతారేషు భారత్యాః కదాచిజ్ జ్ఞానపూర్వకమ్ ।**
**సర్వదా జ్ఞానరూపా సా సర్వదుఃఖవివర్జితా ॥46॥**

భారతికి అవతారములందు ఒకానొక జ్ఞానపూర్వకమైన శక్తి ఉంటుంది. ఆమె ఎల్లప్పుడు జ్ఞానరూప. సర్వదుఃఖాల నుండి తొలగింపబడి ఉంటుంది.

**దైత్యానాం మోహనార్థాయ అంశే దుఃఖీవ దృశ్యతే ।**
**తస్యా దుఃఖాదికం కించిన్నాస్తి నాస్త్యేవ సర్వదా ॥47॥**

దైత్యులను సమ్మోహపరచుటకై అంశలో దుఃఖితురాలుగా కనబడుతుంది. ఆమెకు దుఃఖాదికం కొంచెం కూడ లేదు. ఎప్పుడూ ఉండదు.

**అపరోక్ష తిరోభావ ఈషత్కాలే ప్రదృశ్యతే ।**
**తావన్మాత్రేణ వా జ్ఞానం తస్యా నైవాహితం చ యత్ ॥48॥**

ప్రత్యక్షజ్ఞానం తిరోభావమును పొందడమనేది కొంతకాలమే ఉంటుంది. అంతమాత్రంచేత అజ్ఞానం ఉందనటం హితకరం కాదు.

**మూలరూపే తు నాస్త్యేవ భారత్యా జ్ఞాన విస్మృతిః ।**
**భారత్యాస్తు యథా నాస్తి సరస్వత్యాస్తు కింపునః ॥49॥**

మూలరూపంలో భారతికి జ్ఞానవిస్మరణం (అజ్ఞానం) లేనేలేదు. భారతికే లేదంటే, సరస్వతికి లేదని మళ్లీ చెప్పటమెందుకు?

**అంశావతరణం నాస్తి సరస్వత్యాః కదాచన ।**
**అంశావతరణం నాస్తి మమాపి మధుసూదన ॥50॥**

సరస్వతికి ఎప్పుడును అంశావతరణమనేది లేదు. (ఒకానొకప్పుడుకు కూడ) మధుసూదనా! నాకుకూడ అంశావతరణమనేది లేదు.

**తథైవ జ్ఞానమస్త్యేవ హరేర్నారాయణస్య చ ।**
**వాయో రంశావతారోఽస్తి యథా మూలే తథైవ చ ॥51॥**

అదే విధంగా నారాయణుడైన హరికి కూడ జ్ఞానం ఉంటుంది. ఏ విధంగా మూలమునందున్నదో, అలాగే వాయువుకు కూడ అంశావతారం ఉంది.

**బలజ్ఞానాదికం సర్వం చింతనీయం న సంశయః ।**
**తథాపి వాయౌ దృశ్యంతే బలజ్ఞానాది వ్యక్తయః ॥52॥**

బలం, జ్ఞానంమున్నగునవి అన్నీ ఉంటాయి. అలా ఆలోచించుటలో సంశయంలేదు. అలాగే వాయువునందు కూడ బలం, జ్ఞానం మున్నగు అభివ్యక్తులు మూలమునందున్నట్లే గోచరిస్తాయి.

**అవతారేషు వాయోస్తు సమ్యక్ శక్త్యాత్మనాస్తి హి ।**
**అపరోక్షతిరోభావౌ నాంశావతరణేష్వపి ॥53॥**

వాయువు యొక్క అవతారములందు చక్కగా (పూర్తిగా) శక్తిస్వరూపంతో ఉంటుంది. అంశావతారాలందు కూడ ప్రత్యక్షం, అదృశ్యం అనేవి లేవు.

**బలజ్ఞానాదికం యావన్మూలరూపే ప్రదృశ్యతే ।**
**త్రేతాయుగ స్వరూపే చ న దర్శయతి తాదృశమ్ ॥54॥**

బలం, జ్ఞానం మున్నగునవి మూలరూపంలో కనిపిస్తాయి. త్రేతాయుగంలో వాయు స్వరూపంలో అటువంటిది కానరాదు.

**త్రేతాయుగ స్వరూపే చ యాదృక్ చాదర్శయత్ ప్రభో ।**
**ద్వాపరస్థే స్వరూపే తత్తద్దర్శయతి తాదృశమ్ ।**
**త్రేతాయుగస్వరూపే చ యాదృక్ చాదర్శయత్ ప్రభో ॥55॥**

**ద్వాపరస్థే వాయు రూపే యాదృగ్వాదర్శయత్ ప్రభుః ।**
**వాయుః కలియుగే రూపే తద్దర్శయతి తాదృశమ్ ॥56॥**

ప్రభూ! త్రేతాయుగ స్వరూపమందు ఏది కనబడుతుందో, అటువంటిదే, ద్వాపరమునందున్న స్వరూపంలో కూడ గోచరిస్తుంది. ప్రభూ! త్రేతాయుగ స్వరూపమునందు ఏది గోచరిస్తుందో, దానినే ద్వాపరమునందుండే వాయురూపుడైన ప్రభువు ప్రదర్శిస్తాడు. వాయువు కలియుగ రూపంలో దానినే, అటువంటి దానినే కనబరుస్తాడు.

**తథా దర్శయతే వాయుః దైత్యానాం మోహనాయ చ ।**
**అవతారేషు వాయోశ్చ అంతరం యే విదుః ప్రభో ॥57॥**

**తేఽంధతమః ప్రవిశంతే తే దైత్యా న చ తే సురాః ।**
**వాయావప్యంతరం నాస్తి హరితత్త్వ వినిర్ణయే ॥58॥**

దైత్యులను సమ్మోహపరచుటకై వాయువట్లు ప్రదర్శిస్తాడు. ప్రభూ! వాయువు యొక్క అవతారములందు ఎవరు భేదాన్ని గ్రహిస్తారో వారు అంధతమస్సులో ప్రవేశిస్తున్నారు. వారు రాక్షసులు. దేవతలు కారు. హరితత్త్వ నిర్ణయంలో వాయువునందు కూడ ఏ భేదమూ లేదు.

**నిందాం కుర్వంతి యే విష్ణో ర్జిహ్వాచ్ఛేదం కరోమ్యహమ్ ।**
**తదర్థమేవ వాయోశ్చ అవతారః సదా భువి ॥59॥**

ఎవరయితే విష్ణువును నిందిస్తారో, నేను వారి నాలుక త్రుంచివేస్తాను. వాయువు యొక్క అవతారం ఎప్పుడూ భూమిపై అందుకోసమే ఉంటుంది.

**గుణపూర్ణస్య విష్ణోస్తు నిర్గుణత్వ విచింతనమ్ ।**
**జాతానందాది పూర్ణాఖ్యం సోఽహమిత్యాది చింతనమ్ ॥60॥**

చిదానందాత్మకే దేహే ఉత్పత్త్యాది విచింతనమ్ ।
అచ్ఛేద్యాభేద్య గాత్రేషు చ్ఛేద భేదాది చింతనమ్ ॥**61**॥

దేవ్యా నిత్యావియోగిన్యా వియోగాది విచింతనమ్ ।
క్లేశ శోకాది శూన్యస్య హరేః క్లేశాది చింతనమ్ ॥**62**॥

వ్యాసరామాది రూపేష్వనృషి విప్రత్వచింతనమ్ ।
కృష్ణరామాది రూపేషు అంతరస్య విచింతనమ్ ॥**63**॥

రామకృష్ణాది రూపేషు అంతరస్య విచింతనమ్ ।
రామకృష్ణాది రూపేషు పరాజయ విచింతనమ్ ॥**64**॥

సంతానార్థం తు కృష్ణేన శివపూజాది చింతనమ్ ।
రామేణ దుఃఖయుక్తేన లింగస్య స్థాపనం కృతమ్ ॥**65**॥

పంచ ధాతుమయే కృష్ణే హరి రూప విచింతనమ్ ।
స్వయం వ్యక్తస్థలే చాపి చిదానందత్వకల్పనమ్ ॥**66**॥

పితృమాతృ ద్విజాతీనాం హరి రూపత్వ చింతనమ్ ।
అస్వతంత్రేణ రుద్రేణ హరేరైక్యాది చింతనమ్ ॥**67**॥

విష్ణోః సూర్యేణ సాకం చ అభేదాది విచింతనమ్ ।
సర్వోత్తమః సూర్య ఏవ విష్ణ్వాద్యా స్తస్య కింకరాః ॥**68**॥

ఇత్యాది చింతనం దోషో హరి నిందేతి చోచ్యతే ।
అన్యయం వ్యక్తి లింగేషు అశ్వత్థ తులసీషు చ ॥**69**॥

శాలగ్రామం విహాయైవ నమనం యే ప్రకుర్వతే ।
తే సర్వే హరి నిందాయామవికారిణ ఏవ హి ॥**70**॥

గుణపూర్ణుడైన విష్ణువుకు నిర్గుణత్వచింతనం, ఆనంద పూర్ణస్వరూపునితో "అతడే నేను" మున్నగు చింతనమూ చిదానంద స్వరూపమైన దేహమందు ఉత్పత్తి మున్నగు వాని చింతనమూ, ఛేదింపబడని, భేదింపబడని శరీరాలందు ఛేద, భేదాది చింతనమూ, నిత్యానపాయిని అయిన లక్ష్మితో ఎడబాటు మున్నగు చింతనమూ, క్లేశం, శోకం లేని హరికి క్లేశం మున్నగు వాటి విచింతనమూ, వ్యాసుడు, పరశురాముడు మున్నగు రూపములందు ఋషిత్వం, విప్రత్వం లేకపోవుటను గూర్చి చింతనమూ, కృష్ణ రామాది రూపాలందు భేదవిచింతనమూ, బలరామ కృష్ణాది రూపములందు భేదచింతనమూ, రామకృష్ణాది రూపాలందు పరాజయవిచింతనమూ, సంతానార్థం కృష్ణునిచే చేయబడిన శివపూజాది విచింతనమూ, దుఃఖంతో కూడుకొనిన రామునిచే శివలింగ స్థాపనవిచింతనమూ, పంచ ధాతువులతో కూడుకొనిన కృష్ణుని యందు హరిరూపవిచింతనమూ, స్వయంగా వ్యక్తమయిన ప్రదేశమందు చిదానందకల్పనమూ, (చిత్ = జ్ఞానం, ఆనంద = నిత్య సంతోషం) తండ్రి, తల్లి బ్రాహ్మణాదుల యందు హరి స్వరూపవిచింతనమూ, అస్వతంత్రుడైన రుద్రునితో హరికి ఏకత్వానుసంధాన విచింతనమూ, విష్ణువుకు సూర్యునితో

కలిపి అభేదవిచింతనమూ, సర్వోత్తముడు సూర్యుడే, విష్ణువు మున్నగు వారు సేవకు లనే విచింతనమూ, ఇటువంటి ఆలోచన తప్పు. అది హరినింద స్వయంవ్యక్తం కాని లింగములందు, (విగ్రహం), అశ్వత్థం, తులసి అనువాటియందు నింద, సాలగ్రామాన్ని విడిచి ఎవరు నమస్కారం చేస్తారో, వారందరును హరినిందయందు (అవికారులు) అధికారులు అవుతున్నారు.

**మోక్షాధికారిణో యే తు అజ్ఞానాత్పరమేశ్వరమ్ ।**
**పార్థక్యనయనం యేషు కుర్వంతి యర్హి వా ప్రభో ॥71॥**

**తర్హి తేషాం హి కాలేషు దుఃఖం యాతి న సంశయః ।**

ప్రభూ! మోక్షాధికారులు అజ్ఞానంవలన పరమేశ్వరునిపై భిన్నభావమును పొందుతారు! పొంది విడిచిపెడతారు. వారు కాలాంతరంలో దుఃఖమును పొందుతారు. సంశయం లేదు.

**అతః పార్థక్యనయనం యే కుర్వంత్యేషు సర్వదా ॥72॥**

**తే సర్వే త్వబుధా జ్ఞేయా నాత్ర కార్యా విచారణా ।**

అందువలన వీరి యందు నానావిధత్వ భావన చేసే వారందరును ఎప్పుడును అజ్ఞానులుగా గ్రహింపబడతారు. ఇందు విచారించవలసినది (విచారణ చేయవలసినది) ఏదియునూ లేదు.

**అస్వయంవ్యక్త లింగేషు నమనం యే ప్రకుర్వతే ॥73॥**

**తే సర్వేహ్యసురా జ్ఞేయా నాన్యథా తు కథంచన ।**
**విహాయ శూన్యమశ్వత్థం నమనం యే ప్రకుర్వతే ॥74॥**

**ద్విమాస హీనాం తులసీ మప్రసూతాం చ గాం నవామ్ ।**
**తే సర్వేహ్యసురా జ్ఞేయా నాత్ర కార్యా విచారణా ॥75॥**

శునకాది యోగ్యమైన అశ్వత్థమునకు, రెండు మాసములు అయినా నిండని తులసికి, అప్రసూత (ఈననటువంటి) క్రొత్త ఆవుకు, అస్వయంవ్యక్త లింగాలకు ఎవరు నమస్కృతి చేస్తారో వారందరూ అసురులుగా చెప్పబడతారు. ఎన్నడును మరో విధంగా కాదు. ఇందు విచారణ చేయవలసినది లేదు.

**గుల్మాద్యాశ్చ మనుష్యాంతాస్తే జ్ఞేయా బ్రహ్మ బాహవః ।**
**అస్మచ్ఛతాయుః పర్యంతమేక ఏవ కలిః స్మృతః ॥76॥**

గుల్మం మొదలుకొని మనుష్యుల వరకు ఉన్నవారందరు బ్రహ్మబాహువులుగా చెప్పబడతారు. నా సంబంధమైన నూరు ఆయువుల వరకు ఉండే కాలం ఒక కలియుగకాలంగా చెప్పబడుతుంది.

**కలౌ సంతి కల్పమానం కలే రంతే చ సంతి చ ।**
**తస్మిన్దినే బ్రహ్మరూపే గచ్ఛంతి చ తమోఽన్తికమ్ ॥77॥**

కలియుగమందు కల్పమానాలు ఉన్నాయి. కలి అంతమునందు కూడ ఉన్నాయి. ఆ రోజున బ్రహ్మ రూపమునందు తమస్సు సమీపానికి చేరుకొంటాయి.

**తత్ర స్థిత్వా లోకమార్గం ప్రతీక్షంతే న సంశయః ।**
**సాధకై ర్విష్ణు కార్యాణాం వాయుదాసైః ప్రపీడితాః ॥78॥**

అక్కడ ఉండి లోకగమనాన్ని గమనిస్తూ ఉంటారు. సంశయం లేదు. విష్ణుకార్యాలను సాధించే వాయుదాసులచే పీడింపబడుతూ ఉంటారు.

**శతవర్షానంతరం చ సర్వేషాం కలినా సహ ।**
**వాయోర్గదా ప్రహారేణ లింగభంగో భవిష్యతి ॥79॥**

నూరు సంవత్సరాలు తరువాత అందరికి కలితో సహా, వాయువు యొక్క గదాప్రహారంచే లింగభంగం (శరీరభంగం) కాగలదు.

**తమోఽంధం ప్రవిశంత్యేతే తారతమ్యేన సర్వశః ।**
**తమస్యంధేఽపి సంసారే నాత్ర కార్యా విచారణా ॥80॥**

పిమ్మట అందరునూ తారతమ్య భేదంచే అంధతమోరూపమైన సంసారం కొరకు తమోఽంధంను ప్రవేశిస్తారు. ఇందు ఆలోచించవలసింది లేదు.

**సర్వేషాముత్తమోఽంతే యః కలిరేవ న సంశయః ।**
**దూషకో విష్ణుభక్తానాం తత్సమో నాస్తి సర్వదా ॥81॥**

అంతమునందు అందరిలోను ఉత్తముడు కలియే. అందు సంశయంలేదు. విష్ణుభక్తులను దూషించేవాడు (వారిలో) కలితో సమానుడు ఎక్కడా ఉండడు.

**సంసారేవాంధతమసి సర్వత్ర హరి దూషకః ।**
**మిథ్యాదానే జ్ఞానబుద్ధిర్దుఃఖే చ సుఖబుద్ధిమాన్ ॥82॥**

**తస్మాత్కలి సమో లోకే శివభక్తో న కుత్రచిత్ ।**
**దుర్యోధనః స ఏవోక్తో దుఃఖానంత్య స్వరూపవాన్ ॥83॥**

అంధతమస్సులో సంసారంలో ఉన్నప్పుడు కూడ ఎప్పుడూ హరిదూషకుడై ఉంటాడు. మిథ్యావిషయం గ్రహించుటలో జ్ఞానబుద్ధి, దుఃఖము నందు సుఖబుద్ధి కలిగి ఉంటాడు. అందువలన లోకంలో కలితో సమానుడు శివభక్తుడు ఎచ్చట కానరాడు. అంతంలేని దుఃఖస్వరూపుడు అయిన దుర్యోధనుడు ఆ కలియే అని చెప్పబడతాడు.

**తస్మాచ్ఛత గుణాంశేన కలిభార్యా తు సర్వదా ।**
**అలక్ష్మీరితి విఖ్యాతా సా లోకే మంథరా స్మృతా ॥84॥**

కలి తరువాత నూరు గుణాంశాలతో ఎల్లప్పుడూ కలి భార్య “అలక్ష్మి” అని పేరుపొందింది. ఆమె లోకంలో మంథరగా చెప్పబడుతోంది.

**తస్మాద్దశగుణాంశో నో విప్రచిత్తిస్తు సర్వదా ।**
**జరాసంధః స ఏవోక్తః కాలనేమిస్తతః పరమ్ ॥85॥**

అతనికన్న పది గుణాంశాలు తక్కువవాడు ఎప్పుడూ విప్రచిత్తి అనేవాడు. అతడే జరాసంధుడని చెప్పబడతాడు. ఆ తరువాత కాలనేమి అనేవాడు.

**తస్మాచ్ఛత గుణాంశోనః సతు కంసేతి విశ్రుతః ।**
**తస్మాత్పంచగుణైర్హీనౌ మధుకైటభసంజ్ఞకౌ ॥86॥**

అతనికన్న పది గుణాంశాలు తక్కువవాడు కంసుడని చెప్పబడుతున్నాడు. అతని కన్నా ఐదు గుణాంశాలు తక్కువవారు మధుకైటభులనే పేరు గలవారు.

**తావేవ హంస హిడింబకౌ జ్ఞేయౌ తౌ చ జనార్దన ।**
**విప్రచిత్తి సమో జ్ఞేయో భౌమో వై భూతలే స్మృతః ॥87॥**

జనార్దనా! వారే హంసహిడింబకులుగా చెప్పబడుతున్నారు. విప్రచిత్తితో సమానుడు భూతలంలో భౌముడు (నరకుడు) అని స్మరింపబడుతున్నాడు.

**తస్మాదష్టగుణై రుచ్యో హిరణ్యకశిపుః స్మృతః ।**
**తస్మాచ్చ త్రిగుణైర్హీనో హిరణ్యాక్షో మహాసురః ॥88॥**

అతనికన్న ఎనిమిది గుణాలు తక్కువగా హిరణ్యకశిపుడు చెప్పబడుతున్నాడు. అతని కన్న మూడుగుణాలు తక్కువవాడు హిరణ్యాక్షుడనే మహాసురుడు.

**మణిమాంస్తత్సమో జ్ఞేయః కించిదూనో బకః స్మృతః ।**
**తస్మాద్వింశద్గుణైర్హీన స్తారకాఖ్యో మహాసురః ॥89॥**

మణిమంతుడు అతనికి సముడుగా తెలియబడుతున్నాడు. అతనికన్న కొంచెం తక్కువవాడు బకుడు. అతనికన్న ఇరవై గుణాంశాలు తక్కువవాడు తారకుడని చెప్పబడే మహారాక్షసుడు.

**తస్మాత్ షడ్గుణతో హీనః శంబరో లోక కంటకః ।**
**శంబరస్య సమో జ్ఞేయః శాల్వో దైత్యేషు చాధమః ॥90॥**

వానికన్న ఆరు పాళ్లు తక్కువవాడు లోకకంటకుడైన శంబరుడు. శంబరునితో సమానుడు దైత్యులలో అధముడైన శాల్వుడుగా చెప్పబడుతున్నాడు.

**శంబరాత్తు ద్విగుణతో హిడింబో న్యూన ఉచ్యతే ।**
**బాణస్తతోఽధమో జ్ఞేయః సతు కీచక నామతః ॥91॥**

శంబరుని కన్న హిడింబుడు రెండుపాళ్లు తక్కువవానిగా చెప్పబడుతున్నాడు. బాణుడు అతనికన్న తక్కువవాడు. అతడు కీచకుడు అనే పేరు కలిగినవాడు.

**ద్వాపరాఖ్యో మహాహాసో బాణాసుర సమః స్మృతః ।**
**తస్మాద్దశ గుణైర్హీనో నముచిః దైత్యసత్తమః ॥92॥**

ద్వాపరుడు అని చెప్పబడే మహాహాసుడు బాణాసురునితో సముడుగా తెలియజేయబడుతున్నాడు. అతనికన్న పది గుణాంశాలు తక్కువవాడు నముచి అనే దైత్యశ్రేష్ఠుడు.

**నముచేస్తు సమౌ జ్ఞేయౌ పాక ఇల్వల ఇత్యుభౌ ।**
**తస్మాచ్చతుర్గుణైర్హీనో వాతాపిర్దానవాధమః ॥93॥**

నముచికి సములుగా పాకుడు, ఇల్వలుడు అనే ఇరువురు చెప్పబడుతున్నారు. అతని కన్న నాలుగు గుణాంశాలు తక్కువవాడు వాతాపి అనే దానవాధముడు.

**తస్మాత్సార్ధ గుణైర్హీనో ధేనుకో నామ దైత్యరాట్ ।**
**ధేనుకార్ధగుణతః కేశీ దైత్యస్తు చావరః ॥94॥**

అతనికన్న సగం గుణాలు తక్కువవాడు ధేనుకుడనే దైత్యరాజు. ధేనుకుని కన్న సగం గుణాలు తక్కువవాడు కేశి అనే దైత్యుడు.

**కేశీ దైత్య సమో జ్ఞేయ స్తృణావర్తో మహాసురః ।**
**తస్మాద్దశ గుణైర్హీనో హంసో నామ రమాపతే ॥95॥**

కేశి అనే దైత్యునికి సముడుగా తృణావర్తుడనే మహాసురుడు చెప్పబడుతున్నాడు. రమాపతీ! అతని కన్న పది గుణాలు తక్కువ వాడు హంసుడనేవాడు.

**త్రిరికస్తు సమో జ్ఞేయ స్తత్సమః పౌరుకః స్మృతః ।**
**వేతః స ఏవ విజ్ఞేయః పూర్వజన్మని సత్తమ ॥96॥**

వానికి త్రిరికుడు సముడు. వానికి సముడు పౌరకుడు. సత్తమా! పూర్వజన్మమందు అతడే వేతుడుగా చెప్పబడుతున్నాడు.

**తస్మాదేక(వ) గుణైర్హీనౌ కుంభాండక కుపర్ణకౌ ।**
**దుఃశాసనస్తు విజ్ఞేయో జరాసంధ సమః ప్రభో ॥97॥**

అతని కన్న ఒక గుణం తక్కువవారు కుంభాండక కుపర్ణకులు ప్రభూ! దుఃశాసనుడు జరాసంధునితో సమునిగా చెప్పబడుతున్నాడు.

**కంసేన తుల్యో విజ్ఞేయో వికర్ణో దైత్యసత్తమః ।**
**కుంభకర్ణాచ్ఛత గుణైర్హీనౌ (నః) క్రధ్యేతి విశ్రుతః ॥98॥**

కంసునితో సముడు వికర్ణుడనే దైత్యసత్తముడని చెప్పబడుతున్నాడు. కుంభకర్ణునికన్న నూరు గుణాల తక్కువవాడుగా క్రధ్యుడు చెప్పబడుతున్నాడు.

**తస్మాచ్ఛత గుణైర్హీనః శతధన్వా మహాసురః ।**
**సమానస్తస్య విజ్ఞేయః కర్మారిః దైత్యసత్తమః ॥99॥**

అతని కన్న నూరు గుణాలు తక్కువవాడు శతధన్వుడనే మహాసురుడు. అతనితో సమానునిగా కర్మారి అనే దైత్యసత్తముడు చెప్పబడుతున్నాడు.

**కాలకేయస్తు విజ్ఞేయః సదా వేన సమో మతః ।**
**అధమానాం తు దైత్యానాముత్తమైః సామ్యముచ్యతే ॥100॥**

ఎల్లప్పుడు వేనునితో సమానునిగా కాలకేయుడు చెప్పబడుతున్నాడు. అధములైన దైత్యులకు ఉత్తములతో సామ్యం చెప్పబడుచున్నది. (దైత్య గుణాలు తక్కువగా ఉన్నవారికి)

**తత్రావేశాచ్చ విజ్ఞేయం దేవానాం నాత్ర సంశయః ।**
**తస్మాచ్ఛత గుణైర్హీన శ్చిత్తమానసురో మహాన్ ॥101॥**

వారియందు దేవతల ఆవేశం ఉందని తెలియాలి. ఇందు సందియం లేదు. కాలకేయుని కన్న నూరు గుణాలు తక్కువవాడు, గొప్పవాడు చిత్తమానుడనే అసురుడు.

**తచ్ఛరీరాభిమానీ తు తస్మాచ్ఛతగుణైర్వరః ।**
**తస్మాచ్ఛతగుణైర్హీనో హస్తమానసురో మహాన్ ॥102॥**

ఆ శరీరాన్ని అభిమానించువాడు అతనికన్న నూరు గుణాలు ఎక్కువవాడు. అతని కన్న నూరు గుణాలు తక్కువవాడు గొప్పవాడైన హస్తమానుడైన అసురుడు.

**తస్మాచ్ఛత గుణైర్హీనః పాదమానసురో మహాన్ ।**
**నేత్రేంద్రియాభిమానీ తు తస్మాచ్ఛతగుణో వరః ॥103॥**

అతనికన్న నూరు గుణాలు తక్కువవాడు గొప్పవాడైన పాదమానుడనే అసురుడు. నేత్రేంద్రియాన్ని అభిమానించువాడు అతని కన్న నూరు గుణాలు ఎక్కువవాడు.

**చక్షురింద్రియమానీ తు తస్మాచ్ఛతగుణో వరః ।**
**తస్మాచ్ఛతగుణైర్హీనః స్పర్శమానసురో మహాన్ ॥104॥**

చక్షురింద్రియాన్ని అభిమానించువాడు, అతనికన్న నూరు గుణాలు ఎక్కువవాడు. అతని కన్న నూరు గుణాలు తక్కువవాడు స్పర్శమానుడైన గొప్పవాడైన అసురుడు.

**తస్మాచ్ఛతగుణైర్హీనశ్చండమానసురో మహాన్ ।**
**తస్మాచ్ఛతగుణైర్హీనః శిశ్నమానసురో మహాన్ ॥105॥**

అతనికన్న నూరు గుణాలు తక్కువవాడు, గొప్పవాడైన చండమానుడనే అసురుడు. అతని కన్న నూరు గుణాలు తక్కువవాడు గొప్పవాడైన శిశ్నమానుడనే అసురుడు.

**తస్మాచ్ఛతగుణైర్హీనః కర్మమానసురః స్మృతః ।**
**కల్పాద్యైః ప్రేరితాః సర్వే రుద్రాద్యా అధికారిణః ॥106॥**

**కదాచిత్తువిరుద్ధం చ కుర్వంతి తవ సత్తమ ।**
**కదాప్యహం చ వాయుశ్చ విరుద్ధం నాచరేవ భోః ॥107॥**

అతని కన్న నూరు గుణాలు తక్కువవాడు కర్మమానుడనే అసురుడుగా చెప్పబడుతున్నాడు. రుద్రులు మొదలైన వారందరు, అధికారమున్నవారు కల్పాదులచే ప్రేరేపింపబడుతున్నారు. సత్తమా! వారు ఒకానొక సమయంలో నీకు విరుద్ధంగా కృత్యము నాచరిస్తున్నారు. అయ్యా! నేనుగాని, వాయువుగాని ఎన్నడును విరుద్ధకృత్యం ఆచరింపము.

**మూలేష్వంశావతారేషు రుద్రాదీనాం మహాప్రభో ।**
**బుద్ధిర్వినశ్యతే యస్మాత్తస్మాచ్ఛిన్నా హి తేఽఖిలాః ॥108॥**

మహాప్రభూ! రుద్రాదులకు మూలమైన అంశావతారములందు బుద్ధి నశించి ఉంటుంది. అందువలన వారందరూ విచ్ఛిన్నులు అవుతున్నారు.

**మహీపతే చ మద్బుద్ధిస్తస్మాదచ్ఛిన్న సంజ్ఞికః ।**
**ఏతాఽదృశో ప్యహం దేవ న చ శక్తిస్తు న స్తవే ॥109॥**

భూపతీ! అందువలన నాబుద్ధి అచ్ఛిన్నం అనే పేరు గల్గినది అవుతోంది. దేవా! నేను ఇటువంటివాడ నైనప్పటికినీ నాకు స్తవమందు శక్తి సరిపోవుటలేదు.

**మహ్యమచ్ఛిన్నభక్తాయ దయాం కురు మహాప్రభో ।**
**ఇతి స్తుత్వా హరిం బ్రహ్మా స్థితః ప్రాంజలిరగ్రతః ॥110॥**

మహాప్రభూ! అచ్ఛిన్నభక్తుడనైన నాపై దయను అనుగ్రహించు. ఇట్లు బ్రహ్మ హరిని స్తుతించి ఎట్టయెదుట దోయిలొగ్గి ఉండిపోయాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే బ్రహ్మస్తుతి వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో బ్రహ్మ చేసిన విష్ణుస్తుతి అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## దేవోత్పత్తినిరూపణమ్ - దేవతల పుట్టుకను వివరించుట

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**ఇతి స్తుతః స భగవాన్ స్వపుత్రేణ దయానిధిః ।**
**మేఘగంభీరయా వాచా ప్రోవాచ మధుసూదనః ॥1॥**

భగవంతుడు, దయానిధి అయిన ఆ మధుసూదనుడు ఈ విధంగా తన పుత్రుడైన బ్రహ్మచే స్తుతింపబడిన వాడై మేఘగంభీరవచనాలతో ఇలా పలికాడు.

**సృజ బ్రహ్మన్నిమాన్ దేవాన్ మత్ప్రసాదాత్క్రమేణ చ ।**
**యథా వై ప్రాక్క్షణే తద్వత్సృజ సర్వం మహాప్రభో ॥2॥**

బ్రహ్మ! మహాప్రభూ! నా అనుగ్రహంతో క్రమంగా ఈ దేవతలను సృజించు. ఏ విధంగా పూర్వకాలమందు సృష్టించావో, ఆ విధంగానే అంతా సృజించు.

**నాస్తి ప్రయోజనం తేన తవ మత్ప్రీతయే సృజ ।**
**ఏవముక్తస్తు హరిణా బ్రహ్మ స్తుత్వా హరిం పరమ్ ॥3॥**

**సృష్టిం కర్తుం మనో దధ్రే ప్రీణయన్నేవ మాధవమ్ ।**
**మహత్తత్త్వాత్మకో బ్రహ్మ వాయుం జీవాభిమానినమ్ ॥4॥**

**ఆదౌ ససర్జ గరుడ పురుషాత్మా స ఏవ చ ।**
**తతో దక్షిణ హస్తాత్తు బ్రహ్మాణీం భారతీం తథా ॥5॥**

**అసృజత్తే మహాభాగే అవ్యక్తస్య నియామికే ।**
**వామహస్తాత్సత్యపుత్రో మహత్తత్త్వాత్మకోఽనలః ॥6॥**

ఆ సృష్టివలన నీకు ప్రయోజనం లేదు. అయినను నా ప్రీతి కోసమై సృజించు. ఈ విధంగా హరిచే ఆజ్ఞాపించబడినవాడై, బ్రహ్మ శ్రేష్ఠుడైన హరిని స్తుతించి, మాధవుని సంతోషపరుస్తూ సృష్టిచేయటానికి మనస్సును నిలిపాడు. మహత్తత్త్వాత్మకుడైన బ్రహ్మ జీవాభిమాని అయిన వాయువును గరుడా! మొదట సృజించాడు. అతడే పురుషుడని చెప్పబడతాడు. పిమ్మట కుడిచేతి నుండి మహాభాగలైన అవ్యక్తాన్ని నియమించువారైన, బ్రహ్మాణిని, భారతిని, ఆ ఇరువురను సృజించాడు. వామ హస్తం నుండి సత్యపుత్రుడై మహత్తత్త్వాత్మకుడైన అనలుడు(అగ్ని) కలిగాడు.

**బ్రహ్మణో దక్షిణాద్ధస్తాదహంకారాత్మకో హరః ।**
**ఆదౌ శేష స్తతో జజ్ఞే గరుడస్తదనంతరమ్ ॥7॥**

బ్రహ్మయొక్క దక్షిణ హస్తం నుండి అహంకారాత్మకుడైన హరుడు జన్మించాడు. ముందు శేషుడు అక్కడి నుండి కలిగాడు, ఆ తరువాత గరుడుడు జన్మించాడు.

**తదనంతరజో రుద్రః స ఏవం సృష్టవాన్ ప్రభుః ।**
**స్వోత్పత్త్యనంతరం బ్రహ్మా దశవర్షాన్మహా ప్రభుః ॥8॥**

**వాయుముత్పాదయామాస వత్సరానంతరే ప్రభుః ।**
**గాయత్రీం జనయామాస వాయోరుత్పత్త్యనంతరమ్ ॥9॥**

ఆ తరువాత పుట్టినవాడు రుద్రుడు. ఆ ప్రభువు ఈ విధంగా సృష్టి చేశాడు. మహాప్రభువైన బ్రహ్మ తన ఉత్పత్తి తరువాత పది సంవత్సరాలకు వాయువును ఉద్భవింపజేశాడు. ఆ ప్రభువు వాయువుయొక్క ఉత్పత్తి తరువాత, ఒక సంవత్సరం గడచిన పిమ్మట గాయత్రిని జన్మింపచేశాడు.

**సంవత్సరానంతరే తు భారతీమసృజత్ప్రభుః ।**
**భారత్యనంతరం శేషం దివ్యసాహస్రవత్సరాత్ ॥10॥**

ఆ ప్రభువు సంవత్సరం తరువాత భారతిని సృజించాడు. భారతి తరువాత దివ్య సహస్రవర్షాలు గడచిన పిమ్మట శేషుని సృష్టించాడు.

**అనంతరం సంబభూవ గరుడస్తు తతః పరమ్ ।**
**దివ్యసహస్ర వర్షాత్తు తథా రుద్రం చ సృష్టవాన్ ॥11॥**

ఆ తరువాత గరుడుడు కలిగాడు. అటు పిమ్మట దివ్యసహస్ర సంవత్సరాల తరువాత రుద్రుని సృష్టించాడు.

**శేషస్యానంతరం దేవీం వారుణీం చ మహాప్రభుః ।**
**దశవర్షానంతరం తు హ్యసృజత్కమలాసనః ॥12॥**

మహాప్రభువైన కమలాసనుడు పది సంవత్సరాలు తరువాత శేషుని, అనంతరం దేవి అయిన వారుణిని సృష్టించాడు.

**గరుడానంతరం దేవీం సౌపర్ణీమసృజత్ప్రభుః ।**
**దశవర్షానంతరం చ పార్వతీం చ తథైవ సః ॥13॥**

ఆ ప్రభువు గరుడుని తరువాత దేవియైన సౌపర్ణిని సృజించాడు. పది సంవత్సరాల తరువాత అలాగే అతడు పార్వతిని సృజించాడు.

**పార్వత్యనంతరం చంద్రం మనస్తత్త్వనియామకమ్ ।**
**దశవర్షానంతరం తు వాసవం హ్యసృజత్తతః ॥14॥**

**అభిమానీ దక్షిణస్య బాహోశ్చ పరమేష్ఠినః ।**
**దశవర్షానంతరం తు శచీ తామసృజత్ప్రభుః ॥15॥**

పార్వతి తరువాత మనస్తత్త్వమును నియమించే చంద్రుని సృష్టించాడు. అంత పది సంవత్సరాలు గడచిన పిమ్మట వాసవుని (ఇంద్రుని) సృజించాడు. అతడు పరమేష్ఠి యొక్క దక్షిణ బాహువుయొక్క అభిమాని.పది సంవత్సరాలు గడిచిన పిమ్మట ఆ ప్రభువు శచిని సృష్టించాడు.

**ఇంద్రస్యానంతరం కామం త్రింశద్వర్షాదనంతరమ్ ।**
**అసృజ ద్వామబాహోశ్చ మనస్తత్త్వాభిమానినమ్ ॥16॥**

ఇంద్రుని తరువాత ముప్పది వర్షాలు గడచిన పిమ్మట వామబాహువునుండి మనస్తత్త్వాభిమాని అయిన కాముని సృజించాడు.

**తదనంతరజాం దేవీం దశవర్షాదనంతరమ్ ।**
**రతిం చ జనయామాస కామభార్యాం మహాప్రభుః ॥17॥**

ఆ మహాప్రభువు పది సంవత్సరాలు గడచిన పిమ్మట, ఆ తరువాత ప్రభవించిన దేవి అయిన, కాముని భార్య అయిన రతిని సృజింపజేశాడు.

**కామస్యాప్యభిమానీ తు స ఏవ పరికీర్తితః ।**
**బ్రహ్మాహంకారికం ప్రాణం కార్యోత్పత్తేరనంతరమ్ ॥18॥**

(కోరికను) కాముని అభిమానించు దేవతగా అతడు కీర్తింపబడినాడు. కార్యోత్పత్తి తరువాత బ్రహ్మ అహంకారికమైన ప్రాణం సృజించాడు.

**దశవర్షానంతరం తు నిర్మమే నాసికస్తతః ।**
**తస్య భార్యాం నాసికస్య పంచవర్షాదనంతరమ్ ॥19॥**

**నిర్మమే నాసికాం వామాం బ్రహ్మా లోకపితామహః ।**

పది సంవత్సరాలు గడచిన పిమ్మట నాసికుని నిర్మించాడు. లోకపితామహుడైన బ్రహ్మ అయిదు సంవత్సరాలు గడచిన తరువాత ఆ నాసికుని భార్య అయిన అందమైన నాసికను నిర్మించాడు.

**అహంకారాదనుబ్రహ్మా సంజ్ఞానం చ బృహస్పతిమ్ ॥20॥**

**నిర్మమే చ వర్షయుగ్మం పంచవర్షాదనంతరమ్ ।**
**పంచవర్షానంతరం తు తారాం భార్యాం వినిర్మమే ॥21॥**

పది సంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మ అహంకారం, తరువాత బృహస్పతి అనే పేరు గల వానిని సృజించాడు. అయిదు సంవత్సరాలు తరువాత అతని భార్య అయిన తారను వినిర్మించాడు.

**గురోరనంతరం బ్రహ్మా పంచవింశాదనంతరమ్ ।**
**స్వాయంభువం మనుం చైవ నిర్మమే మనసా విభుః ॥22॥**

ఆప్రభువైన బ్రహ్మ ఇరవైఐదు సంవత్సరాలు గడచిన పిమ్మట గురుని తరువాత మనస్సుచే స్వాయంభువ మనువును సృజించాడు.

**పంచవర్షానంతరం తు శతరూపాం వినిర్మమే ।**
**శతరూపానంతరం తు వింశద్వర్షదినాంతరమ్ ॥23॥**

**దక్షః శిష్యాత్మకో జజ్ఞే దక్షిణాంగుష్ఠతః ప్రభోః ।**
**పంచవర్షానంతరం తు వామాంగుష్ఠాచ్చతుర్ముఖః ॥24॥**

**ప్రసూతిమసృజద్బ్రహ్మా సృష్ట్యర్థం పరమాదరాత్ ।**
**దక్షస్యానంతరం బ్రహ్మా పంచవింశాదనంతరమ్ ॥25॥**

**నిర్మమే హ్యనిరుద్ధం చ మధ్యమాంగులి పర్వతః ।**
**పంచవర్షానంతరం తు ససర్జ భగవానజః ॥26॥**

**విరాజసంజ్ఞకాం భార్యాం మధ్యమాంగులి పర్వతః ।**
**అనిరుద్ధానంతరం తు శతవర్షాదనంతరమ్ ॥27॥**

**నిర్మమే ప్రవహం వాయుం కనిష్ఠాంగులి పర్వతః ।**
**దశవర్షానంతరం చ ప్రవాహీం నిర్మమే ప్రభుః ॥28॥**

ఐదు సంవత్సరాలు గడచిన పిమ్మట శతరూపను వినిర్మించాడు. శతరూపను సృజించిన పిమ్మట ఇరవై సంవత్సరాల దినాలు తరువాత ఆ ప్రభువుయొక్క కుడిచేతి బొటనవ్రేలి నుండి శిష్య స్వరూపుడైన దక్షుడు జన్మించాడు. అయిదు సంవత్సరాలు గడిచిన తరువాత చతుర్ముఖుడు తన ఎడమచేతి బొటనవ్రేలి నుండి ప్రసూతిని సృజించాడు. మిక్కిలి ప్రీతితో సృష్టికోసమై బ్రహ్మ ఆమెను సృజించాడు. దక్షుని తరువాత ఇరవై అయిదు సంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మ (నడుమవ్రేలు) మధ్యమాంగులి యొక్క కణుపు నుండి అనిరుద్ధుని సృజించాడు. అయిదు సంవత్సరాలు తరువాత భగవంతుడైన అజుడు మధ్యమాంగులి యొక్క కణుపు నుండి "విరాజ" అను పేరుగల అనిరుద్ధుని భార్యను సృజించాడు. అనిరుద్ధుని తరువాత నూరు సంవత్సరాలు గడచిన పిమ్మట కనిష్ఠాంగులి (చిటికెన వ్రేలు) కణుపు నుండి ప్రవాహమనే వాయువును నిర్మించాడు. ఆ ప్రభువు పది సంవత్సరాలు తరువాత ప్రవాహి అనే ఆమెను సృజించాడు.

**కనిష్ఠాంగులిపర్వాచ్చ వామదేవం న సంశయః ।**
**ప్రవాహానంతరం బ్రహ్మా శతవర్షాదనంతరమ్ ॥29॥**

బ్రహ్మ నూరు వర్షాలు గడిచిన పిమ్మట ప్రవాహుని తరువాత కనిష్ఠాంగులి కణుపు నుండే వామదేవుని సృజించాడు. సంశయం లేదు.

**యమం వినిర్మమే పృష్ఠా దష్టవర్షాదనంతరమ్ ।**
**తద్భార్యాం శమలాం దేవీం తస్మాదేవ మహాప్రభుః ॥30॥**

ఆ మహాప్రభువు ఎనిమిది సంవత్సరాలు తరువాత పృష్ఠభాగం నుండి యముని వినిర్మించాడు. ఆ భాగమునుండే అతని భార్య అయిన శమలాదేవిని సృజించాడు.

**యమస్యానంతరం చంద్రం త్రింశద్వర్షాదనంతరమ్ ।**
**అసృజ ద్దక్షిణాచ్ఛ్రోత్రా చ్ఛ్రోత్ర తత్త్వ నియామకమ్ ॥31॥**

యముని తరువాత ముప్పది సంవత్సరాలు గడచిన పిమ్మట దక్షిణ శ్రోతం నుండి శ్రోత్రతత్త్వ నియామకుడైన చంద్రుని సృజించాడు.

**నవవర్షానంతరం తు రోహిణీ మసృజత్ప్రభుః ।**
**వామశ్రోత్రాచ్చ గరుడం వామశ్రోత్రాభిమానినమ్ ॥32॥**

తొమ్మిది సంవత్సరాలు గడచిన పిమ్మట ఆ ప్రభువు రోహిణిని సృజించాడు. వామశ్రోత్రం నుండి వామశ్రోత్రాభిమానియైన గరుడుని సృష్టించాడు.

**చంద్రస్యానంతరం సూర్యం వింశద్వర్షాదనంతరమ్ ।**
**సమ్యగ్వినిర్మమే బ్రహ్మా దక్షిణాక్ష్ణశ్చ దేవతామ్ ॥33॥**

చంద్రుని తరువాత ఇరవైసంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మా కుడికన్ను నుండి సూర్యదేవుని చక్కగా వినిర్మించాడు.

**వామోక్ష్ణో నిర్మమే సంజ్ఞాం షడ్వర్షానంతరం ప్రభుః ।**
**సూర్యస్యానంతరం బ్రహ్మా శతవర్షాదనంతరమ్ ॥34॥**

**రసనేంద్రియాచ్చ వరుణం నిర్మమే తస్య మానినమ్ ।**

ఆ ప్రభువు ఆరు సంవత్సరాలు తరువాత ఎడమ కన్నునుండి సంజ్ఞను నిర్మించాడు. సూర్యుని తరువాత నూరు వర్షాలు గడిచిన పిమ్మట బ్రహ్మా రసనేంద్రియంనుండి, దానిని అభిమానించే వరుణుని నిర్మించాడు.

**వింశద్వర్షానంతరం తు తస్మాదేవేంద్రియాత్ప్రభుః ॥35॥**

**గంగాం వినిర్మమే బ్రహ్మా రసనేంద్రియదేవతామ్ ।**

ఇరవై సంవత్సరాలు తరువాత ప్రభువు అయిన ఆ బ్రహ్మా ఆ ఇంద్రియంనుండే రసనేంద్రియ దేవత అయిన గంగను వినిర్మించాడు.

**వరుణస్యానంతరం తు దశవర్షాదనంతరమ్ ॥36॥**

**ఉత్సంగాన్నిర్మమే బ్రహ్మా నారదం భగవత్ప్రియమ్ ।**

వరుణుని తరువాత పది సంవత్సరాలు గడిచిన పిమ్మట, బ్రహ్మా తన ఉత్సంగం (ఒడి) నుండి భగవత్ప్రియుడైన నారదుని నిర్మించాడు.

**నారదస్యానంతరం తు షష్టివర్షాదనంతరమ్ ॥37॥**

**అగ్నిం వినిర్మమే బ్రహ్మా త్వగింద్రియతః ప్రభుః ।**

నారదుని తరువాత అరవై సంవత్సరాలు గడిచిన పిమ్మట ప్రభువైన బ్రహ్మ తన త్వగింద్రియం నుండి అగ్నిని వినిర్మించాడు.

**అతో వాగభిమానీ స పంచవర్షాదనంతరమ్ ॥38॥**

**స్వాహాం నిర్మమే బ్రహ్మా తామాహుర్మంత్ర దేవతామ్ ।**

అందువలన అతడు వాక్కును అభిమానించువాడయ్యాడు. అయిదు సంవత్సరాలు తరువాత బ్రహ్మ స్వాహాదేవిని వినిర్మించాడు. ఆమెను మంత్రదేవత అని చెబుతారు.

**అగ్నేరంతరం వీంద్ర భృగు బ్రహ్మర్షి సత్తమమ్ ॥39॥**

**దశవర్షానంతరం తు భ్రువోర్మధ్యాద్వినిర్మమే ।**
**సంవత్సరానంతరం తు భృగుభార్యాం వినిర్మమే ॥40॥**

పక్షీంద్రా! అగ్ని తరువాత పది సంవత్సరాలు గడిచిన పిమ్మట కనుబొమ్మల మధ్యభాగం నుండి బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడైన భృగువును వినిర్మించాడు. ఒక సంవత్సరం తరువాత భృగుభార్యను వినిర్మించాడు.

**భృగోరనంతరం బ్రహ్మా శతవర్షాదనంతరమ్ ।**
**కశ్యపం జనయామాస మనసా చ స్వయం ప్రభుః ॥41॥**

ప్రభువగు బ్రహ్మ స్వయంగా భృగువు తరువాత నూరు వర్షాలు గడచిన పిమ్మట మనస్సుచే కశ్యపుని పుట్టించాడు.

**సంవత్సరానంతరం తు అదితిం నిర్మమే ప్రభుః ।**
**కశ్యపానంతరం చాత్రిం దశవర్షాదనంతరమ్ ॥42॥**

సంవత్సరం తరువాత ఆ ప్రభువు అదితిని సృష్టించాడు. కశ్యపుని తరువాత పది సంవత్సరాలు గడిచిన పిమ్మట అత్రిని వినిర్మించాడు.

**అత్రేరనంతరం బ్రహ్మా దశవర్షాదనంతరమ్ ।**
**అజీజనద్భరద్వాజం వసిష్ఠం తదనంతరమ్ ॥43॥**

అత్రి తరువాత పది సంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మ భరద్వాజుని జన్మింపజేశాడు. ఆ తరువాత వసిష్ఠుని వినిర్మించాడు.

**దశవర్షానంతరం తు తేషాం భార్యాః క్రమేణ తు ।**
**సంవత్సరానంతరేణ అసృజత్కమలాసనః ॥44॥**

పది సంవత్సరాలు గడచిన పిమ్మట కమలాసనుడు ఒక సంవత్సరం వ్యత్యాసం (ఎడమ)తో వారికి భార్యలను క్రమంగా సృజించాడు.

**వసిష్ఠస్యానంతరం తు గౌతమం హ్యసృజత్ప్రభుః ।**
**దశవర్షానంతరేణ జమదగ్నిం తతోఽసృజత్ ॥45॥**

వసిష్ఠుని తరువాత ఆ ప్రభువు గౌతముని సృజించాడు. పది సంవత్సరాలు గడచిన పిమ్మట జమదగ్నిని సృజించాడు.

**దశవర్షానంతరేణ మనుర్వైవస్వతోఽభవత్ ।**
**మనోరనంతరం జజ్ఞే శతవర్షాదనంతరమ్ ॥46॥**

**విష్వక్సేనో మహాభాగో వాయుపుత్రో మహాబలః ।**
**తస్మాచ్చతుర్దశే వర్షే గణపో హ్యభవద్విభో ॥47॥**

పది సంవత్సరాలు గడిచిన పిమ్మట వైవస్వత మనువు ఉద్భవించాడు. నూరు సంవత్సరాలు గడచిన పిమ్మట మనువు తరువాత మహాభాగుడై, మహాబలుడై, వాయుపుత్రుడైన విష్వక్సేనుడు జన్మించాడు. ఆ తరువాత పదునాల్గు సంవత్సరాలు గడచిన పిమ్మట ఆ విభువుకు గణనాయకుడు కలిగాడు.

**తదనంతరజో వీంద్ర అష్టవర్షాదనంతరమ్ ।**
**ధనపోహ్యభవత్తత్ర తద్భార్యా వత్సరే పరే ॥48॥**

పక్షీంద్రా! ఆ తరువాత పుట్టినవాడు, ఎనిమిది సంవత్సరాలు గడచిన పిమ్మట కలిగిన ధనాధిపతి అయిన కుబేరుడు. ఒక సంవత్సరం తరువాత అతని భార్య ఉద్భవించింది.

**విష్వక్సేనానంతరం తు దశవర్షాదనంతరమ్ ।**
**జయాదీన్ భగవద్భక్తాన్ సృష్టవాన్ కమలాసనః ॥49॥**

విష్వక్సేనుని తరువాత, పది సంవత్సరాలు గడచిన పిమ్మట, కమలాసనుడు భగవద్భక్తులైన జయాదులను సృష్టించాడు.

**జయాద్యనంతరం బ్రహ్మా వల్లాద్యాః కర్మదేవతాః ।**
**శతవర్షానంతరం తు సృష్టవాఞ్ఛివవాహనమ్ ॥50॥**

జయాదుల తరువాత బ్రహ్మ కర్మదేవతలైన వల్లాదులను సృష్టించాడు. నూరు సంవత్సరాలు గడచిన పిమ్మట శివ వాహనాన్ని సృజించాడు.

**కర్మదేవానంతరం తు త్రింశద్వర్షాదనంతరమ్ ।**
**పర్జన్యమసృజద్బ్రహ్మా మంత్రయంత్రాభిమానినమ్ ॥51॥**

కర్మదేవతల తరువాత ముప్పది సంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మ మంత్రయంత్రాభిమానియైన పర్జన్యుని సృజించాడు.

**పర్జన్యానంతరం బ్రహ్మా దశవర్షాదనంతరమ్ ।**
**పుష్కరం జనయామాస కర్మతత్త్వాభిమానినమ్ ॥52॥**

పర్జన్యుని తరువాత పది సంవత్సరాలు గడచిన పిమ్మట బ్రహ్మ కర్మతత్త్వాభిమాని అయిన పుష్కరుని సృజించాడు.

**ఏవం వినిర్మమే బ్రహ్మా మత్ప్రసాదాత్ ఖగేశ్వర ।**
**ఏవం జ్ఞాత్వా మోక్షమేతి నాన్యథా తు కథంచన ॥53॥**

ఖగేశ్వరా! నా అనుగ్రహంవల్ల బ్రహ్మ ఈ రీతిగా సృష్టి నిర్మాణం చేశాడు. ఇది ఇట్లు తెలుసుకొన్నవాడు మోక్షం పొందుతాడు. మరొక విధంగా మాత్రం ఎన్నడును కాదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే దేవోత్పత్తి నిరూపణం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో దేవతల పుట్టుకను వివరించుట అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్దశోఽధ్యాయః** – పద్నాల్గవ అధ్యాయం

## **వైశ్వదేవార్థక సారాసారవస్తువివేకః** – వైశ్వదేవం కోసం సారాసారవస్తువివరణ

**శ్రీగరుడ ఉవాచ** – శ్రీ గరుడుడు అడిగాడు.

**అవతారాన్ హరే బ్రూహి తథా లక్ష్మ్యా దివౌకసామ్ ।**
**గుణానామంతరం బ్రూహి శిష్యస్య మమ సువ్రత ॥1॥**

హరీ! సువ్రతుడా! హరియొక్క, అదేవిధంగా లక్ష్మియొక్క అవతారాలనుగూర్చి, దేవతలలో ఉండే గుణభేదాన్ని గూర్చి శిష్యుడనైన నాకు తెలియజేయుము.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీ కృష్ణుడు వచించాడు.

**యో మూలరూపీ భగవాననంతో బ్రహ్మాదిభిః పూర్ణగుణః స్వతంత్రః ।**
**పురాతనః పూర్ణ తనుర్మదాత్మా న తాదృశాః సంతి కదాపి వీంద్ర ॥2॥**

మూలరూపి అయిన భగవంతుడు బ్రహ్మాదుల కన్నా పూర్ణగుణుడు. స్వతంత్రుడు, పురాతనుడు, పూర్ణతనుడు. నా స్వరూపుడు. పక్షీంద్రా! అటువంటి వారు ఎప్పుడును ఉండరు.

**పాదశ్చ పూర్ణః పాదతలం చ పూర్ణం నఖాశ్చ పూర్ణాః కటి కంఠౌ చ పూర్ణౌ ।**
**ఊరూ చ పూర్ణే ఉదరం చ పూర్ణం లబ్ధ్వాపి పూర్ణాఙ్గగృహే తథాఽప్యురః ॥3॥**

పాదం పూర్ణం, పాదతలం పూర్ణం. నఖాలు (గోళ్లు) పూర్ణాలు. కటిస్థలం (మొల), కంఠభాగం పూర్ణాలు. ఊరువులు పూర్ణాలు, ఉదరం పూర్ణం. అన్నింటినీ పూర్ణంగానే పొంది, అలాగే ఉరమును కూడ (వక్షము) పూర్ణంగానే గ్రహించాడు.

**స్కంధాః సుపూర్ణాః సకలాశ్చ బాహవః పూర్ణాః కేశాః శ్మశ్రుదంతాశ్చ పూర్ణాః ।**
**లోమాని పూర్ణాని తథైవ రోమ కూపశ్చ పూర్ణాస్తు తథైవ శిశ్నః ॥4॥**

స్కంధాలు(మూపు) పూర్ణాలు. బాహువులన్నీ పూర్ణాలు, కేశాలు పూర్ణాలు. గడ్డం, మీసం, దంతాలు పూర్ణాలు. శరీరమందు మొలిచే వెంట్రుకలు పూర్ణాలు. అలాగే రోమకూపాలు పూర్ణాలు. అలాగే శిశ్నం పూర్ణం.

**అండశ్చ పూర్ణో హ్యండ రోమాణి కక్షా శ్చక్షుశ్చ శ్రోత్రే సర్వ ఏతే చ పూర్ణాః ।**
**కిం వర్ణయే మూల రూపం హరేశ్చయావద్బలం పూర్ణం సమగ్రదేహే ॥5॥**

**తావద్బలం హ్యేక రోమాదికేషుసంతి త్విమే హి యతః స ఏవ పూర్ణః ।**
**స ఏవ తు సర్వస్య కర్తా స ఏవహర్తా స తు సారాంశ భోక్తా ॥6॥**

అండం పూర్ణం, అండరోమాలు,కక్షలు (చంకలు) కన్ను, చెవులు ఇవన్నీ పూర్ణాలే. హరి యొక్క మూల రూపాన్ని ఏమని వర్ణిస్తాను? సమస్తదేహమందు బలమంతయు పూర్ణమే. ఆయనలో ఎంత బలమున్నదో, అంతబలమూ ఒక్క రోమకూపం మున్నగు వాటియందు ఉన్నది. ఇటువంటివన్నీ ఉన్న కారణంచేత అతడే పూర్ణుడు. అతడే సర్వానికి కర్త. సర్వానికి హర్త అతడే. అతడే సారాంశ భోక్త.

**అసారాంశం నైవ భోక్తా హరిస్తుసారాన్వక్ష్యే శృణు పక్షీంద్ర సమ్యక్ ।**
**ద్రాక్షేక్షుసారం నారికేలస్య సారంచూతస్య సారం పనసస్యాపి సారమ్ ॥7॥**

**నారంగసారం క్రముకస్యాపి సారం ఖర్జూరసారం కదలీఫలస్య ।**
**నారాయణో బీజరూపస్య సారం గృహ్ణాతి నిత్యం భక్తవర్యో దయాలుః ॥8॥**

**తాంబూలసారం ఖదిరస్య సారం పుష్పస్య సారం చందన స్యాపి సారమ్ ।**
**గోధూమసారం యవానాం చ సారం మాషస్య సారం హరేణోశ్చ సారమ్ ॥9॥**

**శుద్ధం తథా వ్రీహి నీవారసారం ।**
**శ్యామాకసారం శుద్ధధాన్యస్య సారమ్ ॥10॥**

**నిషిద్ధాన్ సర్వశాకస్య సారం (న్) (త) స్తథా నిషిద్ధాంల్లవణస్యాపి సారాన్ ।**
**గృహ్ణాతి విష్ణుః పరమాదరేణ అన్నస్య సారం భక్ష్యభోజ్యస్య సారమ్ ॥11॥**

**సూపస్య సారం పరమాన్నస్య సారం దుగ్ధస్య సారం దధితక్రస్య సారమ్ ।**
**ఘృతస్య సారం రామఠస్యాపి సారం గృహ్ణోతి విష్ణుః సర్షపస్యాపి సారమ్ ॥12॥**

**మారీచసారం జీరకస్యాపి సారం తథా హవిర్ఘృత పక్వస్య సారమ్ ।**
**తైలేషు పక్వస్య చ భర్జితస్యగుడస్య సారం నవనీతస్య సారమ్ ॥13॥**

**లవంగసారం శర్కరాయాశ్చ సారమిత్యాది సారాన్ వాసుదేవస్తు భుంక్తే ।**
**లక్ష్మీపతిః సర్వ జగన్నివాసస్తస్యాజ్ఞయా వాసుదేవోఽపి నిత్యమ్ ॥14॥**

హరి అయితే సారం లేని అంశమునకు భోక్త కాదు. పక్షీంద్రా! సారములను వచిస్తున్నాను. శ్రద్ధగా విను. ద్రాక్షసారం, ఇక్షుసారం (చెఱకు), నారికేల సారం(కొబ్బరి), చూతసారం (మామిడి), పనస సారం. నారంగసారం (నారింజ), క్రముకసారం (పోక), ఖర్జూరసారం, కదలీఫలసారం, సమస్తబీజరూపసారం నారాయణుడే. ఆశ్రయ మిచ్చువాడు, కోరదగినవాడు, దయగలవాడునై నిత్యమూ సారాన్ని స్వీకరిస్తాడు. తాంబూలసారం, ఖదిరసారం (ముడుగు దామర), పుష్పసారం, చందనసారం, గోధుమసారం, యవలయొక్కసారం, మాషసారం, హరేణుసారం (గుండ్రని సెనగలు). స్వచ్ఛమైన వ్రీహినీవారసారం (ఎఱ్ఱని వడ్లు, తృణధాన్యములు), శ్యామాకసారం (పప్పు ధాన్యములు), శుద్ధధాన్యసారం, నిషిద్ధములైన సర్వశాకముల సారం, అదే విధంగా నిషేధింపబడిన లవణ సారంను, పరమాదరంతో విష్ణువు స్వీకరిస్తాడు. అన్నసారాన్ని, భక్ష్యభోజ్యాల సారాన్ని (పప్పు) కూరలసారం, పరమాన్నసారం, పాలసారం, పెరుగుసారం, మజ్జిగసారం, నేతిసారం, ఇంగువసారం, ఆవాలసారం విష్ణువు స్వీకరిస్తాడు. మిరియాల

సారం, జీలకఱ్ఱసారం, హవిస్సుకు సంబంధించిన సారం, నేతితో వండినదాని సారం, తైలంతో వండిన దాని సారం, గుండుగా కొట్టిన బెల్లపు సారం (పానకం), నవనీతసారం, లవంగాలసారం, పంచదారసారం మున్నగు సారాలను వాసుదేవుడు భుజిస్తాడు. లక్ష్మీపతి సర్వజగన్నివాసుడునైన వాసుదేవుడు నిత్యమూ భగవదాజ్ఞగా స్వీకరిస్తాడు.

**తచ్ఛేషసారానపి చావనీశోమహాత్మనోఽంశాఞ్ఛృణు శిష్యవర్య ।**
**ఏవం విమూఢా వాసుదేవస్య భక్తాః కిం వ్యక్తవ్యం విష్ణుభక్తా హి లోకే ॥15॥**

శిష్యవర్యా! భూదేవికి భర్త అయిన ప్రభువు మిగిలిన సారాలనుకూడ గ్రహిస్తాడు. ఇక (ఇవి) ఆ మహాత్ముని అంశాలను ఆలకించు. వాసుదేవుని భక్తులు మూఢులు కారు. ఇక (విష్ణు భక్తుల గూర్చి) లోకంలో చెప్పవలసినదే మున్నది. వారే విష్ణుభక్తులు ఈ లోకంలో.

**కల్యాణాస్తే సారభోక్తార ఏవనైషాం భవేత్తే దుఃఖాభివృద్ధిః ।**
**భుంజంతి యే వైశ్వదేవం విహాయదుష్టాంస్తాన్వై భుక్తిచిత్తాంశ్చ విద్ధి ॥16॥**

ఆ విష్ణుభక్తులు మంగళస్వరూపులు. సారం మాత్రమే భుజిస్తారు. ఆ కారణంచే వారికి దుఃఖాభివృద్ధి కలుగదు. విశ్వమునకు దేవుడైన ఆ ప్రభువును విడిచి భుజించే వారిని దుష్టులుగను, భుక్తి యందు మాత్రమే చిత్తముగలవారిగా తెలిసికొమ్ము.

**వక్ష్యే విశేషం వైశ్వదేవే ఖగేంద్రశ్రుత్వా గోప్యం నో వదాన్యత్ర విద్వాన్ ।**
**సూర్యాదీనాం యే చ దానే చ దద్యుర్వినా వాయోరంతరస్థం హరిం చ ॥17॥**

**తే వై సదా సర్వభోక్తార ఏవజ్ఞేయా స్త్వతో విష్ణురేకో మహాత్మా ।**
**సారాంశ భోక్తా నతు సర్వస్య భోక్తాభునక్తి సర్వం త్వవిరుద్ధశక్తిః ॥18॥**

ఖగేంద్రా! వైశ్వదేవమందు గల విశేషం చెప్తున్నాను. విద్వాంసుడైనవాడు రహస్యం విని మరొకచోట వచింపడు. వాయువుయొక్క లోపలనున్న హరిని వదలి సూర్యాదులకు ఎవరు దానం (దానాదులు) ఇస్తారో, వారు ఎల్లప్పుడు సర్వమూ భుజించువారుగా తెలియబడతారు. అందువలన విష్ణువొక్కడే మహాత్ముడు. అతడు సారాంశ భోక్త. సర్వమూ భుజించువాడు కాదు. విరుద్ధశక్తియని సర్వమునూ భుజిస్తాడు.

**వక్ష్యే హ సారాన్ పునరన్యాన్ ఖగేంద్రశృణుష్వ గుహ్యం పరమాదరేణ ।**
**ద్రాక్షాదయః సర్వ ఏవ త్వసారాః కాలాదిదుష్టా భావదుష్టాః పదార్థాః ॥19॥**

ఖగేంద్రా! మళ్లీ మిగిలిన సారాలను గురించి చెబుతున్నాను. మిక్కిలి ప్రీతితో ఈ రహస్యం విను. ద్రాక్షాదులన్నీ ఒకప్పుడు సారంలేనివే. ఆ పదార్థాలు కొన్ని కాలాదులచే నింద్యాలు. మరికొన్ని భావంచే నింద్యాలు.

**అతి పక్వానంతరం తు తథా దినచతుష్టయే ।**
**అసారాః కలుషా జ్ఞేయాస్తథా జంబూఫలం స్మృతమ్ ॥20॥**

మిక్కిలిగా ముగ్గిన తరువాత, నాలుగు రోజులు గడచిన పిమ్మట, అవి సారం లేనివి, కలుషితాలుగా చెప్పబడతాయి. అట్లే జంబూఫలం కూడ

**మాసస్యానంతరం వీంద్ర త్వసారం పనసం స్మృతమ్ ।**
**షాణ్మాసానంతరం వీంద్ర ఖర్జూరం తిక్తవత్ స్మృతమ్ ॥21॥**

పక్షీంద్రా! ఒక నెల గడచిన పిమ్మట పనస ఫలం సారము లేనిదిగా చెప్పబడినది. ఆరు మాసాలు గడచిన పిమ్మట ఖర్జూరం (ఈత మున్నగునవి) చేదు వంటిదిగా చెప్పబడుతుంది.

**ఆర్ద్రం పూతం నారికేలం స్ఫోటనానంతరం ప్రభో ।**
**అహోరాత్రానంతరం తు అసారం పరికీర్తితమ్ ॥22॥**

ప్రభూ! నీటితో ఉన్న, శుద్ధమైన నారికేలం పగులకొట్టిన తరువాత, ఒకరోజు గడచిన పిమ్మట అసారంగా చెప్పబడుతుంది.

**శుష్కభూతం నారికేలం నారికేలం యథా తథా ।**
**పక్షస్యానంతరం చూతమసారం పరికీర్తితమ్ ॥23॥**

ఎండిపోయిన కొబ్బరి, ఖర్జూరం ఎలా ఉంటుందో, అలా ఉంటుంది. పదునైదు రోజులు గడచిన తరువాత చూతం (మామిడి) సారంలేనిదిగా చెప్పబడుతుంది.

**వర్షస్యానంతరం వీంద్ర పూగీఫలముదాహృతమ్ ।**
**ఘటికానంతరం వీంద్ర తాంబూలం పరికీర్తితమ్ ॥24॥**

పక్షీంద్రా! ఒక సంవత్సరం గడచిన పిమ్మట పూగీ ఫలం(పోక) అసారమైనది. ఖగరాజా! ఒక గడియ తరువాత తాంబూలం అసారమైనదిగా చెప్పబడుతుంది.

**యామస్యానంతరం చాన్నం సూపాన్నం పాయసం తథా ।**
**భక్ష్యం చ కథితం వీంద్ర అసారం పరికీర్తితమ్ ॥25॥**

ఒక జాము గడచిన తరువాత అన్నం, సూపాన్నం, పాయసం, అదే విధంగా భక్ష్యం పక్షీంద్రా! సారంలేనివిగా చెప్పబడుతున్నవి.

**త్రిపక్షానంతరం వీంద్ర తైలపక్వం తథా స్మృతమ్ ।**
**చతుర్యామానంతరం చ త్వసారం ఘృతపక్వకమ్ ॥26॥**

పక్షీంద్రా! మూడు పక్షాలు గడిచిన పిమ్మట తైలంతో వండినది అట్లే సారహీనం. నాలుగు జాములు గడచిన తరువాత నేతితో వండినది సారహీనంగా చెప్పబడుతుంది.

**త్రియామానంతరం శాకా నిఃసారాః పరికీర్తితాః ।**
**జంబీరం శృంగబేరే ధాత్రీ కర్పూరం చ చూతకమ్ ॥27॥**

**వత్సరానంతరం వీంద్ర నిఃసారం పరికీర్తితమ్ ।**
**పర్పటః పక్షమాత్రేణ నిఃసారః పరికీర్తితః ॥28॥**

మూడు జాములు గడచిన పిమ్మట శాకాలు సారంలేనివిగా చెప్పబడుతున్నాయి. జంబీరం(నిమ్మ), శృంగబేరం (అల్లం), ధాత్రీ (ఉసిరి), కర్పూరం (ఆరార్తిక్య కర్పూరం, సుగంధి కర్పూరం), చూతకం (మామిడి) పక్షీంద్రా! ఒక సంవత్సరం గడచిన పిమ్మట సారహీనాలుగా చెప్పబడుచున్నాయి. పర్పటం (పాపట చెట్టు కాయ) పక్షం రోజులలోనే సారం లేనిదిగా చెప్పబడింది.

**తులసీ సర్వదా సారా ఏకాదశ్యామపి ద్విజ ।**
**ఆర్ద్రా వాప్యథవా శుష్కా సార్ద్రా సారవతీ స్మృతా ॥29॥**

ద్విజా! తులసి ఎల్లప్పుడు సారమైనదే. ఏకాదశినాడు కూడ సారవంతమైనది. తడసినదైనను, లేదా ఎండినదైనను నీటితో కూడినదైనను సారంకలదే.

**ఏకాదశ్యాం తు తులసీ సారా గ్రాహ్యా మనీషిభిః ।**
**త్వచా నాసేంద్రియేణాపి న తు జిహ్వేంద్రియేణ చ ॥30॥**

**ఏకాదశ్యాం హరేరన్నం నిఃసారం పరికీర్తితమ్ ।**

ఏకాదశినాడు మనీషులచే తులసి సారవంతమైనదిగా గ్రహింపబడినది. త్వక్కుచే కాని, ముక్కుచే కాని స్వీకరింపదగినది. నాలుకతోమాత్రం స్వీకరింపరాదు (ఏకాదశినాడు తులసి తినరాదు). ఏకాదశినాడు హరికి సంబంధించిన అన్న స్వీకరణం సారహీనంగా చెప్పబడినది.

**ఏకాదశ్యాం హరే స్తీర్థం మనుష్యాణాం ఖగేశ్వర ॥31॥**

**ఏకవారే చ సారం స్యాద్ద్వివారే చ తతోఽధికమ్ ।**

ఖగేశ్వరా! మనుష్యులకు ఏకాదశినాడు హరి తీర్థం ముఖ్యం. ఒకసారి అయితే సారం కలిగినది. రెండు సార్లు తీసుకొంటే అంతకన్న ఎక్కువ సారం కలిగినదవుతుంది.

**ఏకాదశ్యాం మహాభాగ తీర్థం గంధాది మిశ్రితమ్ ॥32॥**

**అసారమితి సంప్రోక్తం తథా స్వాదూద మిశ్రితమ్ ।**

మహాభాగా! ఏకాదశినాడు గంధాదులచే కలుపబడిన తీర్థం సారంలేనిదని చెప్పబడినది. అదే విధంగా మధురమైన ఉదకంచే కలుపబడిన తీర్థం కూడ సారహీనమైనదే.

**ఏకాదశ్యాం హరేః సారం క్షీరం సర్పిమధూదకమ్ ॥33॥**

**నిఃసారం మనుజేంద్రాణామితి వేదవిదాం మతమ్ ।**
**ఆషాఢమాసే గరుడ శాకో నిఃసార ఉచ్యతే ॥34॥**

ఏకాదశినాడు నేయి, తేనె, నీరు కలిపిన పాలు హరికి నివేదన చేసినవి సారములైనవి. మనుష్యులకు ఆనాడు అవి నిస్సారములైనవని వేదవేత్తల మతం. గరుడా! ఆషాఢ మాసంలో కూర రుచికరంగా ఉండదని చెప్పబడుతోంది.

**మాసి భాద్రపదే వీంద్ర హ్యాసురం దధిచోచ్యతే ।**
**క్షీరం తు హ్యాశ్వినే మాసే నిఃసారం పరికీర్తితమ్ ॥35॥**

పక్షీంద్రా! భాద్రపద మాసంలో పెరుగు అసురాహారమని చెప్పబడుతోంది. ఆశ్వయుజ మాసంలో పాలు రుచిగా ఉండవని చెప్పబడుతోంది.

**ఊర్ధ్వపుండ్ర గదా హీన నార్యసారేతి గీయతే ।**
**హరి భక్తి విహీనా యే హ్యసురాః పరికీర్తితాః ॥36॥**

ఊర్ధ్వపుండ్రాలు లేనిది, రోగం కలది అయిన నారి సారహీనురాలిగా చెప్పబడుతోంది. హరిభక్తి లేనివారెవరో వారు అసురులుగా గ్రహింపబడుతున్నారు.

**హరి నామ విహీనం తు ముఖం నిఃసారముచ్యతే ।**
**హరి నైవేద్య హీనస్తు పాకో నిఃస్సార ఉచ్యతే ॥37॥**

హరి నామంలేని ముఖం నిస్సారమని చెప్పబడుతోంది. హరికి నివేదన చేయని వంట (పాకం) కూడ నిస్సారమని చెప్పబడుతోంది.

**త్రిదినైశ్చాతసీ పుష్పం నిఃసారం పరికీర్తితమ్ ।**
**ప్రహరం మల్లికాసారం జాతీ తు ప్రహరార్ధకమ్ ॥38॥**

మూడురోజులలో అతసీపుష్పం (అవిసెపూవు) నిస్సారమవుతుందని చెప్పబడుతోంది. ఒకజాము గడిస్తే మల్లిక సారంలేనిది అవుతుంది. అరజాముగడిస్తే జాతి(జాజి) సారం లేనిదవుతుంది.

**త్రియామం శతపత్రం స్యాత్ కరవీరమహర్నిశమ్ ।**
**ఘటికావధిసారం స్యాత్పారిజాతం ఖగేశ్వర ॥39॥**

మూడు జాములలో తామరపూవు నిస్సారమవుతుంది. ఒక్క రోజులో కరవీరం (గన్నేరు) సారహీనమవుతుంది. ఖగేశ్వరా! ఒక్క గడియ వరకే పారిజాతం సారం కలిగి ఉంటుంది.

**త్రివర్షం కేసరం ఫల్గు సారమిత్యుచ్యతే బుధైః ।**
**కస్తూరీ దశవర్షం తు కర్పూరం వర్షమాత్రకమ్ ॥40॥**

మూడు సంవత్సరాలవరకు కేసరం(పొగడ, సంపెంగ), ఫల్గు (మేడి) సారవంతములైనవని బుధులచే చెప్పబడుతోంది. కస్తూరి పది సంవత్సరాల వరకు, కర్పూరం (సుగంధి కర్పూరం) సంవత్సరం వరకు సారవంతమై ఉంటాయి.

**ససారమితి సంప్రోక్తం చందనం సర్వదా స్మృతమ్ ।**
**శుద్ధ నిఃసారభూతాంశ్చ వక్ష్యే శృణు ఖగేశ్వర ॥41॥**

చందనం ఎప్పుడు సారవంతమైనదిగా చెప్పబడుతుందని తెలుస్తోంది. ఖగేశ్వర! పూర్తిగా నిస్సారములైన వాటిని గురించి చెబుతున్నాను. విను.

**తుషామేధ్యా ఆరనాలం పుణ్యకం ఖిఃసటా తథా ।**
**ఉపోద్వజీ అలాబూశ్చ బృహత్కోశాతకీ తథా ॥42॥**

**వృంతాకం చుక్రశాకశ్చ బిల్వమౌదుంబరం తథా ।**
**పలాండుర్లశునం వృంతం కలంజం చ తథా ద్విజ ॥43॥**

**ఏతత్సర్వత్రకాలే చ నిఃసారమితికీర్తితమ్ ।**

ద్విజా! తుష (తాంద్ర ఊక), అమేధ్య(అపవిత్రమైనది), ఆరనాలం (కడుగునీళ్లు), పుణ్యకం (ఏమీ తినకపోవుట), ఖిఃసటా (మాడిన వంటకం), ఉపోద్వజీ (అధికమైన నీరుగల శాక విశేషం – దుంప బచ్చలి), అలాబువు (సొర చెట్టు), కోశాతకీ (బీర చెట్టు), బృహత్ (వాకుడు), వృంతాకం (నీటివంగ), చుక్రశాకం (చింత ఆకు), బిల్వం (మారేడు ఆకు), ఔదుంబరం (మేడి ఆకు), పలాండువు (నీరుల్లి), లశునం (వెల్లుల్లి), వృంతం (పూలతొడిమలు), కలంజం(గంజాయి), – ఇవన్నీ అన్ని కాలాలలోను నిస్సారాలుగా చెప్పబడ్డాయి.

**ఏకాదశ్యాం వైశ్వదేవం శ్రాద్ధం తర్పణమేవ చ ॥44॥**

**మంత్రేణ ప్రేత దహన మసారం పరికీర్తితమ్ ।**

ఏకాదశినాడు మంత్రపూర్వకంగా చేసే వైశ్వదేవం, శ్రాద్ధం, తర్పణం సారంలేనివే. మంత్రపూర్వకంగా ప్రేతదహనం కూడ సారహీనమైనదిగా చెప్పబడింది.

**హవి(రి)ర్నారాయణో దేవో ఏతాంశ్చ హ్యశుభాన్రసాన్ ॥45॥**

**న గృహ్ణాతి  న గృహ్ణాతి న గృహ్ణాతి హరిః స్వయమ్ ।**

నారాయణ భగవానుడు హవిస్స్వరూపుడు. ఇటువంటి అశుభాలైన రసాలను హరి స్వయంగా గ్రహింపడు. స్వీకరింపడు. ఇష్టపడి స్వీకరింపడు.

**తథాపి సర్వం జానాతి జీవానాం పాపకర్మకమ్ ॥46॥**

**ఆస్వాదనం కారయతి స్వయం నాస్వాదతే హరిః ।**

అయినప్పటికి పాప కర్ములయిన, జీవులనందరినీ తెలుసుకొంటాడు. వారిచే వాటిని ఆస్వాదింపజేస్తాడు. వాటిని మాత్రం హరి స్వయంగా ఆస్వాదింపడు.

**అసార భోజనం చైవ జీవానాం కర్మజం ఫలమ్  ॥47॥**

**అముఖ్య భోజినో జీవాః కుంత్యాద్యా ముఖ్యభోజినః ।**
**శుభాని చ పిబేద్విష్ణు రశుభం నో పిబేద్విభుః ॥48॥**

అసారమైన భోజనమనేది జీవుల యొక్క కర్మజన్య ఫలితం. జీవులందరు అప్రధానమైన వాటిని భుజిస్తారు. కుంతి మున్నగువారు ముఖ్యమైన వాటినే భుజిస్తారు. విష్ణువు శుభప్రదములయిన వాటినే పానం చేస్తాడు. ఆ విభువు అశుభరసాన్ని పానం చేయడు.

**కో వదేత్తస్య చేష్టాం తు పూర్ణానందో హరిః స్వయమ్ ।**
**స తేన సదృశః క్వాపి దేశే కాలే చ విద్యతే ॥**
**తస్యావతారాన్ వక్ష్యే ఽ హం శృణు పక్షీంద్ర సత్తమ ॥49॥**

హరి స్వయంగా సంపూర్ణానందుడు. అతని చేష్టను ఎవడు వివరింపగలడు? అతనితో సమానమైనవాడు ఏదేశము నందును, ఏ కాలమునందును ఉండడు. పక్షీంద్రశ్రేష్ఠమా! నేను అతని అవతారాలను చెప్పబోతున్నాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే వైశ్వదేవార్థక సారాసారవస్తువివేకో నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో వైశ్వదేవంకోసం సారాసారవస్తువివరణ అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## **పంచదశోఽధ్యాయః** – పదిహేనవ అధ్యాయం

## **విష్ణోః అవతారాణాం నిరూపణమ్** – విష్ణువు యొక్క అవతారాల నిరూపణ

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**అథావతారాన్ పురుషాఖ్యో హరిశ్చగతో ధ్యానం కర్తుమీశో మహాత్మా ।**
**ప్రాదుర్బభూవాఖిల సద్గుణార్ణవః స ఏవ విష్ణుః స చ బీజభూతః ॥1॥**

ఈశుడు, మహాత్ముడు, పురుషాఖ్యుడునైన హరి అవతారాలను ధరించటానికి ధ్యానమొనర్చాడు. అప్పుడు సమస్త సద్గుణ సముద్రుడు ప్రాదుర్భవించాడు. అతడే విష్ణువు. అతడే బీజభూతుడు.

**యో బీజభూతః పురుషాఖ్యవిష్ణుః స ఏవాభూద్వాసుదేవో మహాత్మా ।**
**సృష్టిం కర్తుం పురుషాఖ్యస్య వాయోర్మాయాఖ్యాయాం మూలరూపో యథాఽఽస ॥2॥**

మహాత్ముడు, బీజభూతుడు, పురుషుడని చెప్పబడే విష్ణువు వాసుదేవుడయ్యాడు. సృష్టి చేయుటకై పురుషుడనే పేరు గల్గిన వాయువుయొక్క మాయ అనే చెప్పబడే దానియందు అతడు మూలరూపుడునై యున్నాడు.

**యో వాసుదేవస్తు స ఏవ జాతః సంకర్షణాఖ్యోఽఖిల సద్గుణాత్మా ।**
**సృష్టిం కర్తుం సూత్రభూతస్య వాయోర్జయాఖ్యాయాం పూర్ణసంవిత్పరాత్మా ॥3॥**

వాసుదేవుడే సమస్త సద్గుణస్వరూపుడయిన సంకర్షణుడనే పేరుతో ప్రభవించాడు. సంపూర్ణ జ్ఞానవంతుడైన ఆ పరమాత్మ సూత్రభూతుడైన వాయువుకు జయ అనే ఆమె యందు సృష్టి చేయుటకై అలా ప్రభవించాడు.

**స ఏవ సంకర్షణ నామధేయః ప్రద్యుమ్ననామా చ (మ్నా) స ఏవ విశ్రుతః ।**
**సరస్వతీ భారతీ సర్జనార్థం స ఏవదేవ్యా మూలరూపో బభూవ ॥4॥**

ఆ సంకర్షుణుడనే పేరుగల అతడే, ప్రద్యుమ్నుడనే పేరుతో విశ్రుతుడయ్యాడు. సరస్వతి భారతి సృష్టి కోసమై అతడే దేవితో కలసి మూలరూపుడయ్యాడు.

**సృష్ట్వా యుక్తం షోడశభిః కలాభిర్మహత్తత్త్వం సూక్ష్మరూపం స ఏవ ।**
**సాహంకారం క్రీడయామాస దేవః శృణు త్వం షోడశాఖ్యాః కలాశ్చ ॥5॥**

పదునారు కలలతో కూడుకొన్న మహత్తత్త్వమును సృజించాడు. సూక్ష్మరూపం కూడ అతడే. ఆ దేవుడే అహంకార సహితుడై క్రీడించాడు. నీవు ఆ పదహారు కలలను విను.

**భూతాని కర్మేంద్రియ పంచకాని జ్ఞానేంద్రియాణీహ తథా మనశ్చ ।**
**తతో బభూవ హ్యనిరుద్ధ సంజ్ఞకోజీవాంశ్చ సంగృహ్య సంపూర్ణశక్తిః ॥6॥**

అవే పంచ భూతాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు. ఆ సంపూర్ణ శక్తి కలిగిన వాడే జీవులను సంగ్రహించి అనిరుద్ధుడనే పేరు కలిగినవాడయ్యాడు.

**సోఽయం విరించ్యాది సమస్త దేవాన్ స్థూలేన దేహేన ససర్జ నాథః ।**
**తథా స విష్ణుః పురుషాభిధస్తుసనత్కుమారత్వమవాప వీంద్ర ॥7॥**

ఆ ప్రభువే విరించి మున్నగు సమస్త దేవతలను స్థూలదేహంతో సృజించాడు. పక్షీంద్రా! అంత పురుషుడనే పేరు గల ఆ విష్ణువే సనత్కుమారత్వాన్ని పొందాడు.

**అనన్య సాధ్యం బ్రహ్మచర్యం చ కర్తుందశేంద్రియాణాం శోషణార్థం సదైవ ।**
**సనందనాదౌ పఠితః కుమారస్తస్మాన్నాన్యో నాత్ర విచారమస్తి ॥8॥**

ఎల్లప్పుడును పది ఇంద్రియాలను నిగ్రహించడంకోసమై ఇతరులకు సాధ్యంకాని బ్రహ్మచర్యాన్ని నిర్వహించి, అతడే ఆ సనత్కుమారుడే సనందనుడు మొదలగు పేర్లు కలిగినవాడుగా చెప్పబడినాడు. అందువలన అతడు ఇతరుడు కాడు. ఇందు ఆలోచించవలసింది ఏదీ లేదు.

**స ఏవ విష్ణుః సూకరత్వం హ్యవాపక్షోణీముద్ధర్తుం దైత్యవపుర్నిహంతుమ్ ।**
**హిరణ్యాక్షం సజ్జనానాం ఖగేంద్ర తథా భూమేః స్థాపనార్థం చ దేవః ॥9॥**

ఖగేంద్రా! ఆ విష్ణువే భూమిని ఉద్ధరించడం కోసమై, రాక్షస శరీరాన్ని గైకొన్న హిరణ్యాక్షుని సంహరించడం కోసమై, సజ్జనులను రక్షించడంకోసమై సూకరత్వం పొందాడు. ఆ దేవుడు భూమిని స్థాపించుటకొరకై అలా అయ్యాడు.

**తతో హరి ర్మద్విదా సత్త్వమాపాన్నృషేర్భార్యాయాం యామిన్యాం యో మహాత్మా ।**
**తత్రావతారే పంచరాత్రం సమగ్రం ఉపాదేష్టుం నాపదానం స్వతంత్రః ॥10॥**

అంత మహాత్ముడైన హరి నా జ్ఞానంచే సత్త్వమును పొందాడు. అనృషి (అంతకన్న వేరొక ఋషిలేదు) యొక్క భార్యయైన యామిని యందు ఆ అవతారంలో సమగ్రమైన పంచరాత్రాన్ని ఉపదేశించుటకై స్వతంత్రుడై ఏ దానమునూ (అన్యాభిప్రాయమును) స్వీకరింపలేదు.

**స ఏవ విష్ణుః సమభూద్బదర్యాం నారాయణాఖ్యః శమలాపహశ్చ ।**
**తపస్తప్తుం శిక్షయితుం ఋషీణాం తిరస్కర్తుం హ్యప్సరసాం సహస్రమ్ ॥11॥**

తపస్సు చేయుటకు, ఋషులకు జ్ఞానబోధ చేయుటకు, వేలకొలది అప్సరసలను తిరస్కరించుటకు, నాశనం లేనివాడైన ఆ విష్ణువే బదరీవనంలో నారాయణుడనే పేర అవతరించాడు.

**తతో హరిః కపిలత్వం హ్యవాపతిరోబలాన్ కార్య బలేన తత్త్వాన్ ।**
**చతుర్వింశతిం సంశయం చోద్ధరిష్యన్ నృపాదిశచ్చాసురయే మహాత్మా ॥12॥**

పిమ్మట మహాత్ముడైన హరి కపిలావతారాన్ని పొంది కాలబలంచే, అంతర్ధానములైన తత్త్వాలను, ఇరవై నాలుగు తత్త్వాలయందు శంకలను తొలగిపోవునట్లు ఉద్ధరిస్తూ, ఆసురిని ఆజ్ఞాపించాడు.

**స ఏవ దత్తః సమభూద్రమేశో௨ (అ)నసూయాయామత్రి రూపః పరాత్మా ।**
**ఆన్వీక్షికీం నామ సుతర్క విద్యామలర్క నామ్నే ప్రదదాత్తాం మహాత్మా ॥13॥**

ఆ పరమాత్మ అయిన రమేశుడు అత్రిరూపుడై అనసూయయందు దత్తుడుగా అవతరించాడు. ఆ మహాత్ముడు అలర్కుడు అను పేరు గలవానికి ఆన్వీక్షికి అనే పేరుగల గొప్ప తర్కవిద్యను ఉపదేశించాడు.

**స ఏవ వంశే௨ప్యభవద్రవేశ్చఆకూత్యాం యః సచ్చిదానందరూపః ।**
**స్వాయంభువం యత్తు మన్వంతరం చ దేవైః సాకం పాలయామాస వీంద్ర ॥14॥**

ఆ సచ్చిదానందరూపుడే సూర్యవంశంలో ఆకూతియందు (సుయజ్ఞునిగా) అవతరించాడు. పక్షీంద్రా! అతడు దేవతలతో కలసి స్వాయంభువమన్వంతరమంతను పాలించాడు.

**స ఏవ విష్ణుః స ఉరుక్రమో௨భూద్ ఆగ్నీధ్రపుత్ర్యాం మేరు దేవ్యాం చ నాభేః ।**
**విద్యారతానాం మానినాం సర్వ దైవమత్యాశ్చర్యం దర్శయితుం చ వీంద్ర ॥15॥**

పక్షీంద్రా! ఆ విష్ణువే విద్యావంతులైన అభిమానులకు ఎల్లప్పుడును మిక్కిలి ఆశ్చర్యం కలిగించువాడై, ఆగ్నీధ్ర పుత్రుడైన నాభికి మేరుపుత్రి అయిన మేరుదేవి యందు ఉరుక్రమునిగా అవతరించాడు. (ఆగ్నీధ్రునకు తొమ్మండుగురు కుమారులు. నాభి మున్నగువారు. పుత్రికలు లేరు. కోడలు మేరుదేవిని పుత్రికగా చూచుట జరుగవచ్చు. కృత్రిమపుత్రిక కావచ్చు. ఆగ్నీధ్ర పుత్ర్యాం – కృత్రిమ పుత్రికాయాం).

**తతో హరి ర్జగృహే కూర్మరూపం సురాసురాణా ముదధిం విమథ్నతామ్ ।**
**పృష్ఠే ధర్తుం మందరం పర్వతం చ బ్రహ్మాండం వా ధర్తుమీశో మహాత్మా ॥16॥**

ఈశుడు, మహాత్ముడునైన హరి అంత సురాసురులు సముద్రాన్ని మథించుచుండగా తన పృష్ఠభాగమున మందరపర్వతాన్ని ధరించుటకై, బ్రహ్మాండమునంతను భరించుటకు కూర్మరూపం స్వీకరించాడు.

**తతో హరిః ప్రాదురభూన్మహాత్మాధన్వంతరిర్నామ హరిన్మణిద్యుతిః ।**
**అపథ్య దోషాన్పరిహర్తుమేవహస్తే గృహీత్వా పూర్ణకుంభం సుధాభిః ॥17॥**

పిమ్మట మహాత్ముడైన ఆ హరి అపథ్య(రోగ) దోషాలను తొలగించుటకై అమృతంతో నిండిన పూర్ణ కుంభమును చేత గ్రహించి ఆకుపచ్చని మణివంటి కాంతి గల్గినవాడై ధన్వంతరి అనే పేరుతో ప్రాదుర్భవించాడు.

**తతో హరి ర్జగృహే శ్రీవపుశ్చయన్మోహినీతి ప్రవదంతి లోకే ।**
**ఉద్వృత్తానాం దితిజానాం మహాత్మాసమ్యక్తేషాం వంచయితుం హరి ర్బలమ్ ॥18॥**

తగవుతప్పి ప్రవర్తించే ఉన్మత్తులైన ఆ రాక్షసుల(దైత్యుల) యొక్క బలాన్ని (సేనలను) చక్కగా వంచించుటకై ఎవరు ఈ లోకంలో "మోహిని" పేర ప్రసిద్ధమై శోభాయుక్తమైన శరీరాన్ని, మహాత్ముడైన ఆ హరి స్వీకరించాడు.

**తతో హరిః ప్రాదురభూన్మహాత్మానృసింహనామా భగవాననంతః ।**
**దైత్యో హిరణ్యకశిపుశ్చ తథోరుదేశేసంస్థాపితః కరజైర్దారితశ్చ ॥19॥**

అనంతరం భగవంతుడు, అనంతుడు మహాత్ముడగు ఆ హరి నృసింహుడనే పేరుతో ఆవిర్భవించాడు. అప్పుడు తన ఊరుప్రదేశంలో దైత్యుడైన హిరణ్యకశిపుని ఉంచుకొని, గోళ్లతో చీల్చివేశాడు.

**తతో హరి ర్భగవాన్వామనోఽభూదదిత్యాం వై కశ్యపాద్దేవ దేవః ।**
**ఇంద్రాయేదం దాతు కామః ఖగేంద్రతదర్థం వై పావితుం సోవితుం చ ॥20॥**

ఖగేంద్రా! ఇంద్రునికి దీనిని (ఆధిపత్యాన్ని) ఇచ్చే కోరికతో అతనిని రక్షించి, పాలించుటకొరకై, ఆ భగవంతుడు దేవదేవుడైన హరి కశ్యపునివలన అదితియందు వామనుడుగా అవతరించాడు.

**తతో హరిర్జమదగ్నేః సుతోఽభూల్లోకే సర్వే పర్శురామం వదంతి ।**
**బ్రహ్మ ద్విషాం క్షత్రియాణాం చ వీంద్రభూమిం నిఃక్షత్రాం కర్తుకామో మహేశః ॥21॥**

పక్షీంద్రా! బ్రహ్మద్వేషులైన క్షత్రియులను వధించి రాజులను లేకుండా చేసే కోరికతో (భూమిని నిఃక్షత్రం చేసే కోరికతో), లోకంలో అందరును పర్శురాముడని (పరశురాముడని) ఎవరిని చెబుతూ ఉంటారో, అటువంటి అవతారాన్ని మహేశుడయిన హరి జమదగ్నిసుతుడుగా పొందాడు.

**తతోఽభవద్వ్యాసరూపీ స విష్ణుశ్చతుర్వారం రాఘవస్యాపి పూర్ణః ।**
**పరాశరాత్సత్యవత్యాం బభూవపైలాదిభిర్వేదభాగాంశ్చ కర్తుమ్ ॥22॥**

అంతట పైలుడు మున్నగువారితో కలిసి వేద విభాగాలను చేయటానికై, రాఘవుని కన్నా నాలుగురెట్లు పూర్ణుడై, ఆ విష్ణువు వ్యాసరూపుడై పరాశరుని వల్ల సత్యవతి యందు అవతరించాడు.

**తతో హరీ రఘువంశేఽవతీర్ణః కౌసల్యాయాం రాఘవః సూర్యవంశే ।**
**సముద్రాదేర్విగ్రహం కర్తుమీశో హంతుం భూమ్యాం రావణాదీంశ్చ వీంద్ర ॥23॥**

పక్షీంద్రా! సముద్రాదులతో విభేదించుటకై, భూమి యందు రావణాదులను సంహరించుటకై, ఆ ఈశ్వరుడైన హరి, సూర్యవంశంలో రఘుకులంలో కౌసల్య యందు రాఘవుడై (రాముడై) అవతరించాడు.

**తతో హరి ర్వ్యాసరూపీ బభూవఅష్టావింశే ద్వాపరే జ్ఞానరూపీ ।**
**పరాశరాత్సత్యవత్యాం మహాత్మా స్వయం వేదా న్సంవిభక్తుం చ దేవః ॥24॥**

అనంతరం ఇరవై ఎనిమిదో ద్వాపరంలో స్వయంగా వేదాలను విభజించుటకొరకై మహాత్ముడైన దేవుడగు ఆ హరి పరాశరుని వలన సత్యవతి యందు జ్ఞానరూపుడై, వ్యాసరూపియై అవతరించాడు.

**తతో హరిః కృష్ణరూపీ బభూవదేవక్యాం వై వసుదేవాత్స విష్ణుః ।**
**కంసాదీన్వై నితరాం హంతు కామః సమ్యక్పాతుం పాండవాంశ్చాపి వీంద్ర ॥25॥**

పక్షీంద్రా! పిమ్మట కంసాదులను పూర్తిగా చంపేకోరికతో, పాండవులను చక్కగా రక్షించే కోరికతో, విష్ణువైన హరి వసుదేవునివలన దేవకియందు కృష్ణరూపుడై అవతరించాడు.

**తతః కాలౌ సంప్రవృత్తే హరిస్తుసంమోహనార్థం చాసురాణాం ఖగేంద్ర ।**
**నామ్నా బుద్ధో కీకటేషు ప్రజాతోవేద ప్రమాణం నిరాకర్తుమేవ ॥26॥**

ఖగేంద్రా! అనంతరం కలియుగం సంప్రాప్తిస్తూ ఉండగా, అసురులను సమ్మోహపరచుటకై, వేదప్రమాణాన్ని నిరాకరించుటకై ఆ హరి మగధదేశంలో బుద్ధుడనే పేరుతో పుట్టాడు.

**తతో హరిః కల్కి సంజ్ఞశ్చ వీంద్రఉత్పత్స్యతే యుగయోర్మధ్యసంధౌ ।**
**దస్యుప్రాయాన్భూమిపాన్వై నిహంతుంనామ్నా హరి ర్విష్ణుగుప్తస్య గేహే ॥27॥**

పక్షీంద్రా! అనంతరం కలియుగ, కృతయుగ మధ్య సంధియందు దస్యుప్రాయులై, భూమిని పాలించు వారిని చంపుటకై విష్ణుగుప్తుని ఇంటిలో కల్కి అను పేరుగల్గిన అవతారంతో ఆ హరి ఉద్భవించగలడు.

**కేశవాద్యా శ్చతుర్వింశతిర్వై సంరక్షణాదయః ।**
**విశ్వాదయః సహస్రం చ పరాద్యా అమితాః స్మృతాః ॥28॥**

కేశవాదులు, సంకర్షణాదులు కలిసి ఇరవైనలుగురు. విశ్వాదులు వేలకొలది ఉన్నారు. పరాదులు అమితసంఖ్యలో అనగా అధికంగా ఉన్నారు.

**అవతారా హ్యసంఖ్యాతా విష్ణోర్నారాయణస్య చ ।**
**స్వయం నారాయణాస్తే తే నాణు మాత్రం విభిద్యతే ॥29॥**

విష్ణువగు నారాయణుని అవతారాలు లెక్కలేనన్ని ఉన్నాయి. అందరూ నారాయణులే వారు. అణుమాత్రమూ విభేదం లేదు.

**బలతో రూపతశ్చాపి గుణతశ్చ కథంచన ।**
**అనంతోఽనంత గుణతః పూర్ణో విష్ణుర్నచాన్యథా ॥30॥**

బలంవలనను, రూపంవలనను, గుణంవలనను, ఎప్పుడును అనంతుడైన విష్ణువు అనంతగుణ సంపూర్ణుడు. మరొక విధంగా కాదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే విష్ణోరవతారనిరూపణం నామ పంచదశోఽధ్యాయః ॥15॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో విష్ణువు యొక్క అవతారాల నిరూపణ అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

## **షోడశోఽధ్యాయః –** పదహారవ అధ్యాయం

## **మహాలక్ష్మ్యవతారనిరూపణమ్ –** మహాలక్ష్మి అవతారనిరూపణం

**శ్రీ కృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**మహాలక్ష్మ్యాః స్వరూపం చ అవతారాన్ ఖగేశ్వర ।**
**శృణు సమ్యఙ్మహాభాగ తజ్జ్ఞానస్య వినిర్ణయమ్ ॥1॥**

ఖగేశ్వరా! మహాభాగా! మహాలక్ష్మియొక్క స్వరూపాన్నీ, ఆమె అవతారాలను, ఆమెకు సంబంధించిన జ్ఞాన విశేష నిర్ణయాన్ని శ్రద్ధగా(భక్తిగా) విను.

**ఈశాదన్యస్య జగతో హ్యాత్మా లోచన ఏవ తు ।**
**విషయీకురుతే తత్స్యాజ్జ్ఞానం లక్ష్మ్యాః ప్రకీర్తితమ్ ॥2॥**

ఈశుని కన్న వేరైన జగత్తుకు ఆత్మను గురించి ఆలోచించగా, విషయీకృతమైన జ్ఞానమే లక్ష్మికి సంబంధించిన జ్ఞానంగా చెప్పబడింది.

**నిత్యావియోగినీ దేవీ హరి పాదైక సంశ్రయా ।**
**నిత్యముక్తా నిత్యబుద్ధా మహాలక్ష్మీః ప్రకీర్తితా ॥3॥**

హరిపాదాలనే ప్రధానంగా ఆశ్రయించియుండేది, ఎల్లప్పుడు హరిని విడిచిపెట్టక యుండేది, నిత్య ముక్తురాలు, నిత్యబుద్ధురాలు అయిన దేవి మహాలక్ష్మిగా కీర్తింపబడింది.

**మూలస్య చ హరేర్భార్యా లక్ష్మీః సా సంప్రకీర్తితా ।**
**పుంసో హి భార్యా ప్రకృతిః ప్రకృతేశ్చాభిమానినీ ॥4॥**

మూలభూతుడైన హరియొక్క భార్యగా ఆ లక్ష్మి ప్రకీర్తింపబడింది. పురుషుని యొక్క భార్య ప్రకృతి. ఆమె ప్రకృతిని అభిమానించేది.

**సృష్టిం కర్తుం గుణాన్వీంద్ర పురుషేణ సహ ప్రభో ।**
**తమః పానం తథా కర్తుం ప్రకృత్యాఖ్యా తదాభవత్ ॥5॥**

ప్రభూ! పక్షీంద్రా! గుణాలను సృష్టిచేయుటకై పురుషునితో కలిసి తమస్సును పానం చేయుటకై ప్రకృతి అనే పేరుతో ఆమె అవతరించింది.

**వాసుదేవస్య భార్యా తు మాయా నామ్నీ ప్రకీర్తితా ।**
**సంకర్షణస్య భార్యా తు జయేతి పరికీర్తితా ॥6॥**

**అనిరుద్ధస్య భార్యా తు శాంతా నామ్నీతి కీర్తితా ।**
**కృతిః ప్రద్యుమ్నభార్యాపి సృష్టిం కర్తుం బభూవ హ ॥7॥**

వాసుదేవుని భార్య మాయగా ఆమె పేర్కొనబడింది. సంకర్షణుని భార్య జయగా ఆమె కీర్తింపబడింది. అనిరుద్ధుని భార్య శాంత అనే పేరుతో ఆమె తెలియజేయబడింది. సృష్టిచేయుటకై ప్రద్యుమ్నుని భార్య కృతిగా అవతరించింది.

**విష్ణుపత్నీ కీర్తితా చ శ్రీదేవీ సత్త్వమానినీ ।**
**తమోఽభిమానినీ దుర్గా కన్యకేతి ప్రకీర్తితా ॥8॥**

విష్ణుపత్ని శ్రీదేవిగా ఆమె కీర్తింపబడింది. ఆమె సత్త్వాన్ని అభిమానించేది. తమోఽభిమానినిగా దుర్గగా, కన్యకగా ఆమె కీర్తించబడింది.

**కృష్ణావతారే కన్యేవ నందపుత్రానుజా హి సా ।**
**రజోఽభిమాని భూదేవీ భార్యా సా సూకరస్య చ ॥9॥**

కృష్ణావతారంలో కన్యగా, నందపుత్రుని సోదరిగానున్నది ఆమెయే. సూకరావతారమూర్తియైన హరికి భార్యగా నున్నదామెయే. భూదేవి రజోఽభిమానినిగా పేర్కొనబడింది.

**వేదాభిమానినీ వీంద్ర అన్నపూర్ణా ప్రకీర్తితా ।**
**నారాయణస్య భార్యా తు లక్ష్మీరూపాత్వజా స్మృతా ॥10॥**

పక్షీంద్రా! వేదాలను అభిమానించేదానిగా అన్నపూర్ణాదేవి కీర్తించబడింది. నారాయణుని భార్య లక్ష్మీ రూపమైన "అజ" గా పేర్కొనబడింది.

**యజ్ఞాఖ్యస్య హరే ర్భార్యా దక్షిణా సంప్రకీర్తితా ॥11॥**

యజ్ఞుడని పిలువబడే హరి యొక్క భార్య దక్షిణగా ప్రకీర్తింపబడింది.

**జయంతీ వృషభస్యైవ పత్నీ సంప్రకీర్తితా ।**
**విదేహపుత్రీ సీతా తు రామభార్యా ప్రకీర్తితా ॥12॥**

వృ(ఋ)షభునియొక్క భార్య జయంతిగా పేర్కొనబడింది. విదేహమహారాజు పుత్రిఅయిన సీత రామపత్నిగా కీర్తించబడింది.

**రుక్మిణీ సత్యభామా చ భార్యే కృష్ణస్య కీర్తితే ।**
**ఇత్యాదికా హ్యనంతాశ్చాప్యవతారాః పృథగ్విధాః ॥13॥**

రుక్మిణి, సత్యభామ కృష్ణుని యొక్క భార్యలుగా కీర్తింపబడినారు. ఇటువంటి అవతారాలు అనంతాలు. అవన్నీ వేరువేరుగా ఉన్నాయి.

**రమాయాః సంతి విప్రేంద్ర భేదహీనాః పరస్పరమ్ ।**
**అనంతానంత గుణకాద్విష్ణో ర్న్యూనాః ప్రకీర్తితాః ॥14॥**

పక్షులకు ప్రకృష్టుడవైన రాజా! పరస్పరం భేదంలేనివై రమకు ఎన్నో అవతారాలు ఉన్నాయి. అయితే అసంఖ్యాక గుణాలు కల్గిన విష్ణువు కన్న తక్కువగా చెప్పబడుతున్నాయి.

**అథ బ్రహ్మా చ వాయుశ్చ శ్రియః కోటి గుణాధమౌ ।**
**వక్ష్యే చ బ్రహ్మణో రూపం శృణు పక్షీంద్రసత్తమ ॥15॥**

బ్రహ్మ, వాయువు లక్ష్మి కన్న కోటి గుణాలు తక్కువవారు. పక్షీంద్ర శ్రేష్ఠమా! బ్రహ్మ స్వరూపం చెప్తున్నాను విను.

**వాసుదేవాత్సముత్పన్నో మాయాయాం చ ఖగేశ్వర ।**
**స ఏవ పురుషో నామ విరించ ఇతికీర్తితః ॥16॥**

ఖగేశ్వరా! వాసుదేవుని(విష్ణుని) వలన మాయయందు పుట్టిన ఆ పురుషుడే విరించుడు అనే పేరుతో కీర్తింపబడుతున్నాడు.

**అనిరుద్ధాత్తు శాంతాయాం మహత్తత్త్వ తనుస్త్వభూత్ ।**
**తదా మహాన్ విరించేతి సంజ్ఞామాప ఖగేశ్వర ॥17॥**

అనిరుద్ధునివలన శాంతయందు మహత్తత్త్వం శరీరరూపాన్ని ధరించింది. ఖగేశ్వరా! అప్పుడు "మహత్తత్త్వ (మహాన్) విరించుడు" అనే పేరును పొందాడు.

**రజసాత్ర సముత్పన్నో మాయాయాం వాసుదేవతః ।**
**విధిసంజ్ఞో విరించః స జ్ఞాతవ్యః పక్షిసత్తమ ॥18॥**

పక్షిశ్రేష్ఠమా! వాసుదేవుని వలన మాయయందు రజోగుణంనుండి పుట్టినవాడు విధి అనే పేరుగల్గిన విరించుడుగా తెలియబడుతున్నాడు.

**బ్రహ్మాండాంతః పద్మనాభో యో జాతః కమలాసనః ।**
**స చతుర్ముఖ సంజ్ఞాం చాప్యవాప ఖగసత్తమ ॥19॥**

ఖగసత్తమా! బ్రహ్మాండమునందు నాభిపద్మమందు ఉద్భవించిన కమలాసనుడే చతుర్ముఖుడనే పేరు గల్గిన వాడు.

**ఏవం చత్వారి రూపాణి బ్రహ్మణః కీర్తితాని చ ।**
**వాయోర్నామాని వక్ష్యేఽహం శృణు పక్షీంద్రసత్తమ ॥20॥**

ఈ విధంగా బ్రహ్మకు నాలుగు రూపాలు తెలియజేయబడినాయి. పక్షీంద్రసత్తమా! వాయువు నామాలను నేను చెబుతున్నాను విను.

**సంకర్షణాచ్చ గరుడ జయాయాం యో బభూవ హ ।**
**స వాయుః ప్రథమో జ్ఞేయః ప్రధాన ఇతి కీర్తితః ॥21॥**

గరుడా! సంకర్షణుని వలన జయయందు పుట్టినవాడే మొదటి వాయువుగా తెలియబడుతున్నాడు. ప్రధానమని అతడే చెబుతున్నాడు.

**లోకచేష్టా ప్రదత్వాత్స సూత్రనామ్నాపి కీర్తితః ।**
**బదరీస్థస్య విష్ణోశ్చ ధైర్యేణ స్తవనాయ సః ॥22॥**

**ధృతిరూపం యయౌ వాయు స్తస్మాద్ధృతిరితి స్మృతః ।**
**యోగ్యానాం హరిభక్తానాం ధృతిరూపేణ సంస్థితః ॥23॥**

లోకమందు చేష్టాప్రదాత కావున (చేష్టలను కలుగజేయువాడు.) గావున సూత్రుడనే పేరుతో కీర్తింపబడుతున్నాడు. బదరీవనంలో ఉండే విష్ణువును ధైర్యంతో స్తుతించుట కొరకై అతడు ధృతిరూపం పొందినాడు కావున వాయువు "ధృతి" అని చెప్పబడుతున్నాడు. అతడు యోగ్యులైన హరి భక్తులయెడ ధృతిరూపంతో ఉంటాడు.

**యతో హృది స్థితో వాయు స్తతో వై ధృతి సంజ్ఞకః ।**
**సర్వేషాం చ హృది స్థిత్వా స్మరతే సర్వదా హరిమ్ ॥24॥**

అందువలన హృదయమునందున్న వాయువు ధృతి అనే పేరు గలవాడు. అందరి హృదయములందు నివసిస్తూ ఎల్లప్పుడు హరిని స్మరిస్తాడు.

**అతో వాయుః స్థితిర్నామ బభూవ ఖగసత్తమ ।**
**అథవా వాయురేవైకః శ్వేతద్వీప గతం హరిమ్ ॥25॥**

**సదా స్మరతి వై వీంద్ర అతోఽసౌ స్మృతి సంజ్ఞకః ।**

ఖగసత్తమా! అందువలన వాయువు స్థితి అను పేరుగలవాడయ్యాడు. పక్షీంద్రా! లేదా శ్వేతద్వీపగతుడైన హరిని వాయువు ఒక్కడే ఎల్లప్పుడు స్మరించటం వల్ల అతడు స్మృతి అను పేరుగలవాడయ్యాడు.

**సర్వేషాం చ హృది స్థిత్వా జ్ఞాతో విష్ణురుదీరణాత్ ॥26॥**

**అతో మే ముక్తి నామాభూ ద్వాయురేవ న సంశయః ।**

అందరి హృదయాలలోను ఉండి, మిక్కిలి ప్రేరేపణ జేసి విష్ణువుని తెలియజేసేటట్లు చేస్తాడు. అందువలన నాకు ముక్తి అనే పేరు వచ్చింది. అతడే వాయువు సంశయం లేదు.

**జ్ఞానద్వారేణ భక్తానాం ముక్తితో మదనుజ్ఞయా ॥27॥**

**యతోఽసౌ వాయురేవైకో ముక్తినామా బభూవ హ ।**

నా ఆజ్ఞ చేత జ్ఞానమార్గంచే భక్తులకు ముక్తిని ఇస్తాడు. అందువలన ఆ వాయువు ఒక్కడే ముక్తి అను పేరు గలవాడయ్యాడు.

**విష్ణౌ భక్తిం వర్ధయతి భక్తానాం హృది సంస్థితః ॥28॥**

**అతోఽసౌ విష్ణు భక్తశ్చ కీర్తితో నాత్ర సంశయః ।**

భక్తుల హృదయాల్లో ఉన్నవాడై విష్ణుభక్తిని వృద్ధిపొందిస్తున్నాడు. అందువలన అతడు విష్ణుభక్తునిగా కీర్తింపబడుతున్నాడు. ఇందు సందేహం లేదు.

**ఏషోఽసౌ సర్వజీవానాం చిత్త సంజ్ఞానమేవ చ ॥29॥**

**చిత్తరూపో యతో వాయు రతశ్చిత్తమితి స్మృతః ।**

ఇతడే సమస్తజీవుల చిత్తజ్ఞానం. చిత్తరూపుడు. అందువలన వాయువు చిత్తమని స్మరింపబడుతున్నాడు.

**ప్రభుః ప్రభూణాం గరుడ సోదరాణాం చ సర్వశః ॥30॥**

**అతస్తు వాయు రేవైకో మహాప్రభురితి స్మృతః ।**

గరుడా! ఎల్లప్పుడు సోదరులకు, ప్రభువులకు ప్రభువతడు. అందువలన వాయువొక్కడే మహాప్రభువుగా స్మరింపబడుతున్నాడు.

**సర్వేషాం చ హృది స్థిత్వా బలం పశ్యతి సత్తమ ॥31॥**

**అతో బలమితి హ్యాఖ్యామవాప వినతాసుత ।**

సత్తమా! వినతానందనా! అందరి హృదయాలలో బలాన్ని చూస్తూ ఉంటాడు. కావున బలమనే పేరును పొందాడు.

**సర్వేషాం చ హృది స్థిత్వా పుత్రపౌత్రాదికై ర్జనైః ॥32॥**

**యాజనాం కురుతే నిత్యమతోఽసౌ యష్టృసంజ్ఞకః ।**

సమస్తజనుల హృదయాల్లో ఉండి పుత్రపౌత్రాదికజనులచే యాజనం (పూజాదియోగం) చేయించేవాడు (చేయువాడు) కాబట్టి అతడు యష్ట అని పిలువబడుతున్నాడు. కాబట్టి

**అనంత కల్పమారభ్య వాయుపర్యంతమేవ చ ॥33॥**

**వక్రత్వం నాస్తి యోగస్య ఋజుర్యోగ్య ఇతి స్మృతః ।**
**యోగస్య వక్రతా నామ కామ్యతా హరిపూజనే ॥34॥**

**ఈశ రుద్రాదికానాం చ కామ్యేన హరిపూజనమ్ ।**

అనంతకల్పం మొదలుకొని వాయువు వరకు యోగానికి వక్రత్వం లేదు. కావున ఋజుర్యోగ్యుడని(ఋజువు, యోగ్యుడు) స్మరింపబడుతున్నాడు. హరిపూజనమందు యోగమందు వక్రత అనగా కామ్యత. ఈశ, రుద్రాదులకు కూడ హరిపూజనం కామ్యంగానే ఉన్నది.

**కస్యచిత్త్వథ పక్షీంద్ర హ్యత స్త్వనృజవః స్మృతాః ॥35॥**

పక్షీంద్రా! ఎవరైననూ కామ్య కార్యం చేయువారు అనృజువులుగా పేర్కొనబడుతున్నారు.

**ఋష్యాదీనాం చ మధ్యేఽ పి కామ్యేన హరిపూజనమ్ ।**
**అతో న ఋజవో జ్ఞేయా మనుష్యాణాం చ కా కథా ॥36॥**

ఋషులలోపల కూడ హరిపూజనం కామ్యంగానే ఉన్నది. అందువలన వారు ఋజువులు కారు. ఇక మనుష్యుల సంగతి చెప్పవలసినది ఏమున్నది.

**యావత్కామ్య సపర్యాం వై న జహాతి నరోత్తమః ।**
**తథా ఋష్యాదయశ్చైవ మోక్షస్య పరిపంథినీమ్ ॥37॥**

**అనాది కాలమారభ్య కర్మజన్యా చ వాసనా ।**
**మోక్షాధికారిణః సర్వే కుర్వతే కస్య పూజనమ్ ॥38॥**

**నష్టప్రాయం చ తత్సర్వం గురోః సంజ్ఞాన బోధకాత్ ।**
**ప్రాప్యయోగం సమాచర్య అంతే మోక్షమవాప్నుయాత్ ॥39॥**

నరోత్తముడైనా, మునిశ్రేష్ఠులైనా మోక్షానికి ప్రతిబంధకమైన కామ్యకర్మను చేస్తున్నారంటే అది అనాదిగా ఉన్న కర్మఫలరూపమైన సంస్కారం. మోక్షాన్ని కోరుతూ అటువంటి పూజలు చేయటమంతా వ్యర్థమే. అదంతయూ నష్టప్రాయమైనదే. గురువు యొక్క జ్ఞానబోధ కారణంగా యోగాన్ని పొంది చక్కగా ఆచరించి అంతమందు మోక్షం పొందుచున్నాడు.

**కామ్యేన పూజనం విష్ణో రైశ్వర్యం ప్రదదాతి చ ।**
**జ్ఞానం చ విపరీతం స్యాత్ తేన యాత్యధరం తమః ॥40॥**

విష్ణువుయొక్క కామ్యపూజనం ఐశ్వర్యాన్ని ఇస్తుంది. జ్ఞానం దానికి విపరీతమైనది. కామ్యపూజనంవలన తక్కువైన తమస్సును పొందుచున్నాడు.

**తదేవ విపరీతం చేజ్జ్ఞానాయ పరికీర్తితమ్ ।**
**శిలాయాం విష్ణు బుద్ధిస్తు విష్ణుబుద్ధి ర్ద్విజే తథా ॥41॥**

**సలిలే తీర్థబుద్ధిస్తు రేణుకాయాం తథైవ చ ।**
**శివే సూర్యే షణ్ముఖే చ విష్ణుబుద్ధిః ఖగేశ్వర ॥42॥**

**ఇత్యాద్యమఖిలం జ్ఞానం విపరీతమితి స్మృతమ్ ।**
**శిలాద్యేషు చ సర్వేషు ఐక్యేనైవ విచింతనమ్ ॥43॥**

**విష్ణుబుద్ధి రితి ప్రోక్తం నతు తత్రస్థ వేదనమ్ ।**
**అనాద్యనంత కాలేఽ పి కామ్యేన హరిపూజనమ్ ॥44॥**

**యతో నాస్తి తతో వాయుః ఋజుర్యోగ్యః ప్రకీర్తితః ।**
**అన్యేషాం సర్వదా నాస్తి అతో న ఋజవః స్మృతాః ॥45॥**

ఆ కామపూజనమే విపరీతమయితే జ్ఞానంకొరకే అని కీర్తింపబడినది. శిలయందు విష్ణుబుద్ధి, అలాగే ద్విజునియందు విష్ణుబుద్ధి, ఖగేశ్వరా! నీటి యందు తీర్థబుద్ధి అలాగే రేణుక యందు, శివుని యందు, సూర్యుని యందు, షణ్ముఖునియందు విష్ణుబుద్ధి. ఇటువంటి సమస్తజ్ఞానమూ విపరీతంగా స్మరింపబడుతుంది. సమస్తములైన శిలలు మున్నగు వాటియందు ఏకత్వం (ఒకటే) అనే ఆలోచనం విష్ణుబుద్ధి అని చెప్పబడుతుంది. అందున్న జ్ఞానం మాత్రం కాదు. అనాదియై, అనంతమైన కాలం నుండి కామ్యముచే హరిపూజనం ఎందుండదో, అందు వాయువు ఋజువు, యోగ్యుడుగా కీర్తించబడుచున్నాడు. మిగిలినవారికి అది ఎన్నడు ఉండదు. అందువలన వారు ఋజువులు కానివారుగా భావింపబడుతున్నారు.

**హరిం దర్శయతే వాపి అపరోక్షేణ సర్వదా ।**
**మోక్షాధికారిణాం కాలే అతః ప్రజ్ఞేతి కథ్యతే ॥46॥**

ఎల్లప్పుడు హరిని ప్రత్యక్షంగా దర్శింపజేసేవాడు కావున మోక్షం పొందగలిగే అధికారులకు తగిన సమయంలో అపరోక్షజ్ఞానం కలుగజేసేవాడు కావున "ప్రజ్ఞుడు" అని చెప్పబడుచున్నాడు.

**పరోక్షేణాపి సర్వేషాం హరిం దర్శయతే సదా ।**
**అతో వాయుః సదా వీంద్ర జ్ఞానమిత్యేవ కీర్తితః ॥47॥**

పక్షీంద్రా! అందరికి హరిని పరోక్షంగా కూడ దర్శింపజేసేవాడు కావున వాయువు ఎల్లప్పుడు జ్ఞానమని కీర్తించబడుతున్నాడు.

**హితాహితోపదేష్టృత్వా ద్భక్తానాం హృదయే స్థితః ।**
**తతశ్చ గురుసంజ్ఞాం చాప్యవాప స చ మారుతః ॥48॥**

భక్తుల హృదయాల్లో ఉండి, హితాన్ని, అహితాన్ని ఉపదేశించేవాడు కావున ఆ వాయువు గురువు అనే పేరు కూడ పొందాడు.

**యోగినాం హృదయే స్థిత్వా స ధ్యాయతి హరిం పరమ్ ।**
**పార్థక్యేనాపి తం ధ్యాయన్ మహాధ్యాతేతి స స్మృతః ॥49॥**

యోగుల హృదయంలో ఉండి పరుడైన హరిని ధ్యానించే వాడు కావున, వేరుగా తాను కూడ ఆ హరిని ధ్యానించేవాడు కావున అతడు "మహాధ్యాత" అని భావింపబడుతున్నాడు.

**యద్యోగ్యతానుసారేణ విజానాతి పరం హరిమ్ ।**
**రుద్రాదౌ విద్యమానాంశ్చ గుణాఞ్జానాతి సర్వదా ॥50॥**

**అతో వై విజ్ఞ నామాసౌ ప్రోక్తో హి ఖగసత్తమ ।**
**కామ్యానాం కర్మణాం త్యాగాద్విరాగ ఇతి స స్మృతః ॥51॥**

ఎల్లప్పుడు యోగాన్ని అనుసరించి పరుడైన హరిని విశేషంగా తెలియువాడు కాబట్టీ, ఎప్పుడును రుద్రాదులయందుండే గుణాలను తెలియువాడు కావున, పక్షిశ్రేష్ఠమా! అతడు "విజ్ఞుడు" అనే పేరుతో చెప్పబడుతున్నాడు. కామ్యకర్మలను త్యాగంచేయుట వలన "విరాగుడు" అనికూడ అతడు భావింపబడుతున్నాడు.

**అథవా యోగినాం నిత్యం హృది స్థిత్వా స మారుతః ।**
**వైరాగ్యం సంజనయతి విరాగ ఇతి స స్మృతః ॥52॥**

లేదా ఆ వాయువు యోగుల హృదయాల్లో నిత్యమూ ఉండి వైరాగ్యం కలుగజేస్తాడు కావున "విరాగుడు" అని పిలువబడుతున్నాడు.

**దేవానాం పుణ్యపాపాభ్యాం సుఖమేవోత్తరోత్తరమ్ ।**
**తత్సుఖం తూత్తరేషాం చ వాయుపర్యంత మేవ చ ॥53॥**

**దేవానాం చ ఋషీణాం చ ఉత్తమానాం నృణాం తథా ।**
**సుఖాంశం జనయేద్వాయు ర్యతోఽ తః సుఖ సంజ్ఞకః ॥54॥**

దేవతలకు పుణ్యపాపాల నుండి ఉత్తరోత్తర సుఖాన్నీ, తదితరులకు కూడ ఉత్తమసుఖాన్నీ, (ఆ ఉత్తరులకు కూడ) వాయుకల్పపర్యంతం దేవతలకు, ఋషులకు, ఉత్తమమైన సుఖానుభవాన్నీ కలుగజేసే కారణంవలన వాయువు సుఖమనే పేరుగలిగినవాడయ్యాడు.

**భునక్తి సర్వదా వీంద్ర తత్ర ముఖ్యస్తు మారుతః ।**
**దుఃఖశోకాదికం కించిద్దేవానాం భవతి ప్రభో ॥55॥**

**తచ్చాసురావేశవశాదిత్యవేహి న సంశయః ।**
**తజ్జీవస్య భవేత్కించిద్దైత్యానాం క్రమశో భవేత్ ॥56॥**

పక్షీంద్రా! ప్రభూ! ముఖ్యమైన వాయువు దేవతలకు ఉండే కొద్దిపాటి దుఃఖశోకాదికాన్ని ఎల్లప్పుడు భుజిస్తాడు. (తాను స్వీకరించి వారికి లేకుండ చేస్తాడు.) అదికూడ అసురుల ఆవేశానికి వశమైన కారణమున కలుగుతుంది. సంశయం లేదు. అది జీవులకు కొద్దిపాటిగా ఉంటుంది. దైత్యులకు ఎక్కువగా ఉంటుంది.

**యతః కలిశ్చాధికః స్యాదతో దుఃఖీతి స స్మృతః ।**
**దైత్యానాం పుణ్యపాపాభ్యాం దుఃఖమేవోత్తరోత్తరమ్ ॥57॥**

వారివద్ద అధికంగా ఉంటుంది. అందువలన అతడు "దుఃఖి" అని స్మరింపబడుతున్నాడు. దైత్యులకు పుణ్యపాపాలలో ఉత్తరోత్తర బలం వలన దుఃఖమే ఉంటుంది.

**తద్దుఃఖ ముత్తరేషాం చ కలిపర్యంత మేవ చ ।**
**భునక్తి సర్వదా వీంద్ర తతః కలిరితి స్మృతః ॥58॥**

ఆ దుఃఖం ఇతరులకు కలిపర్యంతమూ ఉంటుంది. పక్షీంద్రా! ఎప్పుడూ దానిని భుజించువాడు కావున "కలి" అని చెప్పబడుతున్నాడు.

**సుఖహర్షాదికం కించిద్దైత్యానాం భవతి ప్రభో ।**
**దేవావేశో భవేత్తస్య నాత్ర కార్యా విచారణా ॥59॥**

ప్రభూ! దైత్యులకు తక్కువగా, కొద్దిపాటి సుఖం, హర్షం మున్నగునవి ఉంటాయి. దైత్యజాతికి దేవావేశం కూడ ఉంటుంది. అందులో ఆలోచించవలసినది లేదు.

**దేవానాం నిరయో నాస్తి దైత్యానాం వినతాసుత ।**
**సుఖస్వరూపం తన్నాస్తి విషయోత్థమపి ద్విజ ॥60॥**

**విషయోత్థం కించిదపి దేవావేశాదుదీరితమ్ ।**
**తమో నాస్త్యేవ దేవానాం దుఃఖం నాస్తి స్వరూపతః ॥61॥**

వినతానందనా! దేవతలకు నరకం లేదు. దైత్యాళికి సుఖస్వరూపం లేదు. ద్విజా! ఇంద్రియాల నుండి పుట్టిన శబ్దాది విషయాలవలన జ్ఞానంకూడ లేదు. విషయజన్య జ్ఞానం కొద్దిపాటిగా ఉన్నప్పటికిని దేవావేశంవలన వచ్చినది మాత్రమే. దేవతలకు తమస్సు లేదు. స్వరూపంగా దుఃఖమునూ లేదు.

**విషయోత్థం మహాదుఃఖం దేవానాం నాస్తి సర్వదా ।**
**దుఃఖశోకాదికం కించిదాసురావేశతో భవేత్ ॥62॥**

విషయాల నుండి పుట్టిన మహాదుఃఖం దేవతలకు ఎప్పుడూ ఉండదు. దుఃఖ శోకాదికం కొద్దిగానున్నను, అది ఆసురావేశంవల్ల కలిగినది మాత్రమే.

**అతః కలిః సర్వదుఃఖీ సుఖీ వాయుస్తు సర్వదా ।**
**మనుష్యాణామృషీణాం చ సుఖం దుఃఖం ఖగేశ్వర ॥63॥**

**భవేత్తత్పుణ్యపాపాభ్యాం పుణ్యభోగీ చ మారుతః ।**
**కష్టభంగః కలిలయో నాత్ర కార్యా విచారణా ॥64॥**

అందువలన కలి ఎల్లప్పుడు దుఃఖి, వాయువు ఎప్పుడూ సుఖి. ఖగేశ్వరా! మనుష్యులకు, ఋషులకు సుఖం దుఃఖం ఉంటాయి. పుణ్యపాపాల వలన ఇవి ఉంటాయి. వాయువు మాత్రం సుఖభోగి. కష్ట (దుఃఖ) భంగం (వినాశం) వాయువునందు ఉంటుంది. అదే పాపలయం. ఇందు ఆలోచించవలసినది ఏమీ లేదు.

**ప్రాణాది సుఖపర్యంతా అంశా ఏకోనవింశతిః ।**
**ప్రవిష్టాః సంతి లోకేషు పృథక్సంతి ఖగేశ్వర ॥65॥**

ఖగేశ్వరా! ప్రాణం మొదలుకొని సుఖం వరకు ఉండే అంశాలు పందొమ్మిది. లోకములందు(జనులందు) అవి ప్రవేశించి ఉంటాయి. వేరువేరుగా ఉంటాయి.

**మారుతేరవతారాంశ్చ శృణు పక్షీంద్ర సత్తమ ।**
**చతుర్దశసు చంద్రేషు ద్వితీయో యో విరోచనః ॥66॥**

**స వాయురితి సంప్రోక్త ఇంద్రాదీనాం ఖగేశ్వర ।**
**హరితత్త్వేషు సర్వేషు స విష్వగ్వ్యాయతేక్షణః ॥67॥**

పక్షీంద్ర సత్తమా! మారుతి యొక్క అవతారాలను విను. పదునాల్గురు చంద్రులయందు రెండవ వాడుగా ఎవడు విశేషమైన కాంతితో ఉంటాడో(విరోచనుడో), అతడు వాయువని చెప్పబడుతున్నాడు. ఇంద్రాదుల యందు కూడ అంతే. హరితత్త్వములన్నిటియందు, అంతటా విస్తరించిన దృష్టికలవాడు అతడే.

**అతో రోచన నామాసౌ మరుదంశః ప్రకీర్తితః ।**
**రామావతారే హనుమాన్రామకార్యర్థసాధకః ॥68॥**

**స ఏవ భీమసేనస్తు జాతో భూమ్యాం మహాబలః ।**
**కృష్ణావతారే విజ్ఞేయో మరుదంశః ప్రకీర్తితః ॥69॥**

అందువలన రోచనుడనే పేరుగల్గినవాడయ్యాడు. అది మరుదంశంగా కీర్తింపబడింది. రామావతార మందు రామకార్యార్థ సాధకుడైన హనుమంతుడు అతడే. అతడే కృష్ణావతారసమయంలో భూమియందు మహాబలుడైన భీమసేనునిగా ఉద్భవించాడు. అతడు వాయువు అంశగా కీర్తింపబడినాడు.

**మణిమాన్నామదైత్యస్తు సంకరాఖ్యో భవిష్యతి ।**
**సర్వేషాం సంకరం యస్తు కరిష్యతి న సంశయః ॥70॥**

**తేన సంకరనామాసౌ భవిష్యతి ఖగేశ్వర ।**
**ధర్మాన్భాగవతా న్సర్వా న్వినాశయతి సర్వథా ॥71॥**

మణిమంతుడనే దైత్యుడు సంకరుడనే పేరుగలవాడవుతాడు. అతడు అన్నింటిని సంకరం చేస్తాడు. సంశయంలేదు. ఖగేశ్వరా! అందువలన అతడు సంకరుడనే పేరుగలవాడు కాగలడు. అన్ని విధములా భాగవత ధర్మాలనన్నింటిని నాశనం చేస్తాడు.

**తదా భూమౌ వాసుదేవో భవిష్యతి న సంశయః ।**
**యజ్ఞార్థైః సదృశో యస్య నాస్తి లోకే చతుర్దశే ॥72॥**

అప్పుడు భూమియందు వాసుదేవుడు అవతరించగలడు. సంశయం లేదు. పదునాల్గు లోకములందు యజ్ఞవిషయంలో అతనికి సమానుడు లేడు.

**అతః స ప్రజ్ఞయా పూర్ణో భవిష్యతి న సంశయః ।**
**అవతారస్త్రయో వాయోర్మతం భాగవతాభిధమ్ ॥73॥**

అందువలన అతడు ప్రజ్ఞచే పూర్ణుడు కాగలడు. సంశయంలేదు. వాయువుకు అవతారాలు మూడని భాగవతులని చెప్పబడే వారి అభిప్రాయం (అది భాగవతాఖ్యమతం).

**స్థాపనం దుష్టదమనం ద్వయమేవ ప్రయోజనమ్ ।**
**నాన్యత్ప్రయోజనం వాయోస్తథా వైరోచనాత్మకే ॥74॥**

ధర్మస్థాపనం –దుష్టవినాశనం ఈ రెండే ప్రయోజనాలు. వైరోచనస్వరూపమైన వాయువుకు మరో ప్రయోజనం లేదు.

**అవతారత్రయే వీంద్ర దుఃఖం గర్భాది సంభవమ్ ।**
**నాస్తి నాస్త్యేవ వాయోస్తు తథా వైరోచనాదికే ॥75॥**

పక్షీంద్రా! మూడు అవతారాలందు గర్భం మున్నగు వానియందుండి పొందే దుఃఖం వాయువుకు లేదు. అదే విధంగా వైరోచనుడు మున్నగువారియందు కూడ లేదు సుమా!

**శుక్రశోణిత సంబంధో హ్యవతారచతుష్టయే ।**
**నాస్తి నాస్త్యేవ పక్షీంద్ర యతో నాస్త్యశుభం తతః ॥76॥**

పక్షీంద్రా! నాలుగు అవతారాలందు శుక్రశోణిత సంబంధం లేదు. లేదు సుమా! అందువలన అశుభమన్నది లేదు.

**పూర్వం గర్భం సమాశోష్య సమయే ప్రసవస్య చ ।**
**ప్రాదుర్భవతి దేవేశీ హ్యవతారచతుష్టయే ॥77॥**

అవతార చతుష్టయమందు దేవేశి మొదట గర్భవాసంచే శోషించబడి, ప్రసవసమయంలో దుఃఖించి ప్రాదుర్భవించింది.

**త్రయోవిశంతి రూపాణాం వాయోశ్చైవ ఖగేశ్వర ।**
**రూపైరృజు స్వరూపైశ్చ బ్రహ్మణః పరమేష్ఠినః ॥78॥**

**సత్యమేవ న సందేహో నిత్యానంద సుఖాదిషు ।**
**ఏవమేవ విజానీయాన్నాన్యథా తు కథంచన ॥79॥**

ఖగేశ్వరా! వాయువు యొక్క ఇరవైమూడు రూపాలయొక్క రూపములందును, ఋజు స్వరూపములందును పరమేష్ఠి అయిన బ్రహ్మ యొక్క నిత్యానందం, సుఖం మున్నగు వాటియందును శ్రేష్ఠత్వమే ఉన్నది. సందేహంలేదు. ఈ విధంగానే విశేషించి తెలుసుకోవాలి. ఎన్నడును మరో విధంగా కాదు.

**ఏతస్య శ్రవణాదేవ మోక్షం యాతి న సంశయః ।**
**తదనంతరజాన్వక్ష్యే శృణు పక్షీంద్రసత్తమ ॥80॥**

దీని శ్రవణంవలననే మోక్షం పొందును. సంశయంలేదు. పక్షీంద్రశ్రేష్ఠమా! ఆ తరువాత ఉద్భవించినవారిని చెబుతున్నాను. విను.

**కృతౌ ప్రద్యుమ్నతశ్చైవ సముత్పన్నే ఖగేశ్వర ।**
**స్త్రియౌ ద్వే యమలే చైవ తయోర్మధ్యే తు యద్యికా ॥81॥**

**వాణీతి సంజ్ఞకాం వీంద్ర బ్రహ్మాణీ సంజ్ఞకాం విదుః ।**
**పురుషాఖ్య విరించస్య భార్యా సావిత్రికా మతా ।**
**చతుర్ముఖస్య భార్యా తు కీర్తితా సా సరస్వతీ ॥82॥**

ఖగేశ్వరా! కృతయుగంలో ప్రద్యుమ్నుని వలన ఇద్దరు కన్యకలు కవలలుగా జన్మించారు. పక్షీంద్రా! వారిలోపల “యద్వీక” అనునామె వాణి అని పేరుపొందింది. ఆమెయే “బ్రహ్మాణి” అను పేరుకల్గినదయింది. ఆమెయే పురుషుడనే పేరు గల్గిన విరించునికి భార్యఅయింది. ఆమెయే సావిత్రి. ఆమెయే చతుర్ముఖునికి భార్యగా సరస్వతి అను పేరుతో కీర్తింపబడింది.

**ఏవం త్రిరూపం విజ్ఞేయం వాణ్యాశ్చ ఖగసత్తమ ।**
**వక్ష్యేఽ వతారాన్ భారత్యాః సమాహితమనాః శృణు ॥83॥**

ఖగశ్రేష్ఠమా! ఈ విధంగా వాణికి మూడు రూపములున్నట్లుగా తెలియదగియున్నది. భారతియొక్క అవతారాలను చెప్తున్నాను సావధానమనస్కుడవై విను.

**సర్వే వేదాభిమానిత్వాత్సర్వ వేదాత్మికా స్మృతా ।**
**మహాధ్యాతుశ్చ వాయోస్తు భార్యా సా పరికీర్తితా ॥84॥**

సర్వవేదాలను అభిమానించుట వలన ఆమె “సర్వవేదాత్మిక”గా స్మరింపబడింది. మహాధ్యాత అయిన వాయువుకు ఆమె భార్యగా కీర్తింపబడింది.

**జ్ఞానరూపస్య వాయోస్తు భార్యా సా పరికీర్తితా ।**
**సదా సుఖస్వరూపత్వాద్భారతీ తు సుఖాత్మికా ॥85॥**

**సుఖస్వరూప వాయోస్తు భార్యా సా పరికీర్తితా ।**

జ్ఞానరూపుడైన వాయువుకు ఆమె భార్యగా పేర్కొనబడింది. ఎల్లప్పుడు సుఖస్వరూపయై ఉండుట వలన భారతి సుఖాత్మిక. సుఖస్వరూపుడైన వాయువుకు భార్యగా ఆమె కీర్తింపబడింది.

**గురుస్తు వాయురేవోక్తస్తస్మిన్ భక్తియుతా సతీ ॥86॥**

**తతస్తు భారతీ నిత్యా గురుభక్తిరితి స్మృతా ।**
**మహాగురోర్హి వాయోశ్చ భార్యా వై పరికీర్తితా ॥87॥**

వాయువు గురువుగా చెప్పబడినాడు. ఆ సతి అతనియందు భక్తి కలిగి ఉంటుంది. అందువలన భారతి నిత్యయై గురుభక్తియని స్మరింపబడుతుంది. మహాగురువైన వాయువుకు భార్యగా ఆమె కీర్తింపబడింది.

**హరౌ స్నేహ యుక్తత్వాచ్చ హరిప్రీతిరితి స్మృతా ।**
**ధృతిరూపస్య వాయోశ్చ భార్యా సా పరికీర్తితా ॥88॥**

హరియందు స్నేహంతో కూడుకొని యుండుట వలన హరిప్రీతి అని ఆమె స్మరింపబడింది. ధృతిరూపుడైన వాయువునకు ఆమె భార్యగా పేర్కొనబడింది.

**సర్వమంత్రాభిమానిత్వాత్ సర్వమంత్రాత్మికా స్మృతా ।**
**మహాప్రభోశ్చ వాయోశ్చ భార్యా వై సా ప్రకీర్తితా ॥89॥**

ఆమె సర్వమంత్రాలను అభిమానించుటవలన, సర్వమంత్రాత్మికగా స్మరింపబడింది. ఆమె మహాప్రభువైన వాయువుకు భార్యగా కీర్తింపబడింది.

**భుజ్యంతే సర్వభోగాస్తు విష్ణుప్రీత్యర్థమేవ చ ।**
**అతస్తు భారతీ జ్ఞేయా భుజినామ్నా ప్రకీర్తితా ॥90॥**

విష్ణుప్రీతికోసమై సర్వభోగాలను అనుభవిస్తుంది. అందువలన భారతి "భుజి" అను పేరుతో పేర్కొనబడింది.

**చిత్తరూపస్య వాయోస్తు భార్యా సా పరికీర్తితా ।**
**రోచనేంద్రస్య భార్యా చ శ్రద్ధాఖ్యా పరికీర్తితా ॥91॥**

చిత్తరూపుడైన వాయువుకు ఆమె భార్యగా పేర్కొనబడింది. రోచనేంద్రునియొక్క భార్యగా శ్రద్ధ అను పేరుతో ఆమె కీర్తింపబడింది.

**హనుమాంశ్చ తదా జజ్ఞే త్రేతాయాం పక్షిసత్తమ ।**
**తదా శివాఖ్య విప్రాశ్చ జజ్ఞే సా భారతీ స్మృతా ॥92॥**

పక్షిశ్రేష్ఠమా! శివుడనే పేరుగల విప్రునివలన త్రేతలో ఆ భారతి ఉద్భవించింది. అప్పుడు త్రేతాయుగమందు హనుమంతుడు కూడ జన్మించాడు.

**న కేవలం భారతీ సా శచ్యాద్యై శ్చైవ సంయుతా ।**
**తస్మిన్సంజనితాః సర్వాః ప్రాపుర్యోగం స్వభర్తృభిః ॥93॥**

ఆమె కేవలం భారతిమాత్రమే కాదు. శచీదేవి మున్నగు వారియందు కూడ ఆ రూపంతో ఉంటుంది. ఆమెయందు (అతని) పుట్టినవారందరూ తమ భర్తలతో యోగాన్ని పొందారు.

**అన్యగేతి చ విజ్ఞేయా కన్యా తన్మతి సంజ్ఞికా ।**
**త్రేతాంతే సైవ పక్షీంద్ర శచాద్యై శ్చైవ సంయుతా ॥94॥**

"అన్యగా" అను పేరుగల కన్య "మతి" అను పేరుగల్గినదిగా పేర్కొనబడింది. పక్షీంద్రా! త్రేతాయుగాంతంలో శచీదేవి మున్నగువారితో ఆమె కూడుకొనియుండేది.

**దమయంత్యనలాజ్జాతా ఇంద్రసేనేతి చోచ్యతే ।**
**నలం నందయతే యస్మాత్తస్మాచ్చ నలనందినీ ॥95॥**

దమయంతి అనలుని వలన కలిగినది. "ఇంద్రసేన" అని కూడ చెప్పబడింది. నలుని ఆనందింపజేసిన కారణంచే ఆమె నలనందిని అని (కీర్తింపబడింది.)

**తత్ర స్వభర్తృసంయోగం నైవచాప ఖగేశ్వర ।**
**తత్రాన్యగాత్వం విజ్ఞేయం పురుషస్థేన వాయునా ॥96॥**

ఖగేశ్వరా! అప్పుడు తన భర్తతో ఆమె యోగాన్ని పొందలేదు. అందువలన పురుషస్థుడైన వాయువుచే ఆమె "అన్యగాత్వము"ను వహించినట్లుగా తెలియజేయబడింది.

**కించిత్కాలం తథా స్థిత్వా కన్యైవ మృతిమాప సా ।**
**శచ్యాది సంయుతా సైవ ద్రుపదస్య మహాత్మనః ॥97॥**

**వేదిమధ్యాత్సముద్భూతా భీమసేనార్థమేవ చ ।**
**తత్రాన్యగత్వం నాస్త్యేవ యోగశ్చ సహభర్తృభిః ॥98॥**

కన్యగా కొంతకాలం అలాగే ఉండి ఆమె మృతి పొందింది. శచ్యాదులతో కూడుకొను ఆమెయే మహాత్ముడైన ద్రుపదుని యొక్క యజ్ఞవేదికయందు భీమసేనునికొరకై మరల ఉద్భవించింది. అప్పుడు కూడ అన్యగాత్వము లేదు. అక్కడ భర్తలతో కలసిన యోగం ఉంది.

**కేవలా భారతీ జ్ఞేయా కాశిరాజస్య కన్యకా ।**
**కాలీ నామ్నా తు సా జ్ఞేయా భీమసేనప్రియా సదా ॥99॥**

కాశిరాజుయొక్క కుమార్తె అయిన కన్యక మాత్రం కేవలం భారతిగా తెలియదగియున్నది. ఆమె కాళి అను పేరుతో ఎల్లప్పుడు భీమసేనుని ప్రియురాలిగా ఉన్నది.

**వాచ్యాదిభిః సంయుతైవ ద్రౌపదీ ద్రుపదాత్మజా ।**
**దేహం త్యక్త్వాఽ విశిష్టైవ కరటీ గ్రామ సంజ్ఞకే ॥100॥**

వాచ్యాదులతో(చెప్పబడినవారితో) కూడుకొని ద్రుపదతనయయైన ద్రౌపది కరటి అనే పేరు గల గ్రామంలో ఏ విశిష్టతను పొందకుండగనే దేహం విడిచి,

**సంకరస్య గృహే వీంద్ర భవిష్యతి కలౌ యుగే ।**
**వాయోస్తృతీయ రూపార్థం సా కన్యైవ మృతిం గతా ॥101॥**

పక్షీంద్రా! కలియుగంలో సంకరుని గృహము నందు జన్మిస్తుంది. వాయువు యొక్క మూడవ రూపంకోసమై ఆ కన్యయే మృతి పొందుతుంది.

**ఇత్యాద్యా వాయుభార్యాశ్చ బ్రహ్మభార్యాశ్చ సత్తమ ।**
**స్వభర్తృభ్యాం చ పక్షీంద్ర గుణైశ్చైవ శతాధమాః ॥102॥**

శ్రేష్ఠమయినవాడా! పక్షీంద్రా! ఈ మొదలైన వాయు భార్యలు, బ్రహ్మభార్యలు తమ భర్తల కన్న నూరు అంశలు తక్కువవారు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే మహాలక్ష్మ్యవతారనిరూపణం నామ షోడశోఽధ్యాయః ॥16॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో మహాలక్ష్మి అవతారనిరూపణం అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

## **సప్తదశోఽధ్యాయః** – పదిహేడవ అధ్యాయం

## **భారత్యాః విశిష్టదేహసంప్రాప్తిః** – భారతికి విశిష్టదేహం లభించుట

**గరుడ ఉవాచ** – గరుడుడు అడిగాడు.

**చతుర్జన్మసు వై కృష్ణ శచ్యాద్యైః సహ భారతీ ।**
**ఏకదేహా విశిష్టేవ భువి జాతేతి చోక్తవాన్ ॥1॥**

**కారణం బ్రూహి మే బ్రహ్మన్ శిష్యాయ తవ సువ్రత ।**
**గరుడేనైవముక్త స్తమువాచ మధుసూదనః ॥2॥**

"కృష్ణా! భారతి శచీదేవి మున్నగువారితో కలసి నాలుగు జన్మల యందు ఒక్కదేహంతో కూడుకొన్నదై విశిష్టురాలుగా భూమియందు ఉద్భవించిందని చెప్పియున్నావు. బ్రహ్మమా! సువ్రతా! నీ శిష్యుడనైన నాకు కారణమేమిటో చెప్పవలసింది". గరుడుడు ఈ విధంగా అడుగగా మధుసూదనుడు అతనితో ఇలా అన్నాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీ కృష్ణుడు వచించాడు.

**విశిష్టదేహ సంప్రాప్తౌ భారత్యాః పక్షిసత్తమ ।**
**వక్ష్యామి కారణం వీంద్ర సావధానమనాః శృణు ॥3॥**

పక్షిశ్రేష్ఠమా! పక్షీంద్రా! భారతికి విశిష్టమైన దేహం ప్రాప్తించుటలో గల కారణం చెబుతున్నాను. సావధానమనస్కుడవై విను.

**పురా కృతయుగే వీంద్ర రుద్రభార్యా చ పార్వతీ ।**
**ఇంద్రభార్యా శచీదేవీ యమభార్యా చ శామలా ॥4॥**

**అశ్విభార్యా ఉషాదేవీ భర్తృభిః సహితా ఖగ ।**
**బ్రహ్మలోకం యయుస్తత్ర బ్రహ్మాణం దదృశు స్తదా ॥5॥**

పక్షీంద్రా! పూర్వం కృతయుగంలో రుద్రుని భార్య పార్వతి, ఇంద్రుని భార్య శచీదేవి, యముని భార్య శామల, అశ్వి భార్య ఉషాదేవి భర్తలతో కలసి బ్రహ్మలోకానికి వెళ్లారు. అప్పుడు అచట బ్రహ్మను సందర్శించారు.

**హావం భావం విలాసం చ దర్శయామాసు రంజసా ।**
**దృష్ట్వా తా ఉద్ధతా బ్రహ్మ శశాప ఖగసత్తమ ॥6॥**

**ఉద్ధతాశ్చ యతో యూయం మానుషీం యోనిమాప్స్యథ ।**
**తత్ర స్వ భర్తృసంయోగ మవాప్స్యథ ఖగేశ్వర ॥7॥**

వారు హావ, భావ, విలాసాలను శీఘ్రంగా ప్రదర్శించారు. పక్షిశ్రేష్ఠమా! అంత గర్వం కలిగిన వారిని బ్రహ్మ శపించాడు. మీరు ఇంత గర్వం కలిగిన వారు కావున మనుష్య జన్మధరించండి. అక్కడ మీ భర్తలతో సంయోగాన్ని పొందండి.

**ఏవం శప్తాస్తు తాః సర్వా ఆజగ్ము ర్మేరుపర్వతమ్ ।**
**తత్రోపవిష్టం బ్రహ్మాణం వంచయామాసు రంజసా ॥8॥**

ఈ విధంగా శపించబడిన వారందరు మేరుపర్వతానికి వచ్చారు. అక్కడ ఆసీనుడైయున్న బ్రహ్మను శీఘ్రంగా మోసపుచ్చారు.

**తూష్ణీమేవ స్థితే వీంద్ర వంచయంత్యః స్థితాః పునః ।**
**తత స్తూష్ణీం స్థితం వీంద్ర వంచయామాసు రంజసా ॥9॥**

పక్షీంద్రా! బ్రహ్మ మౌనస్థితిలో ఉండగా వారు మళ్లీ మోహవంచన మొనరించారు. ఖగేంద్రా! అయినను బ్రహ్మ మాట్లాడక మిన్నకుండగా శీఘ్రంగా (ఒకే దర్శనంలో మౌనస్థితిలో నేనున్ననూ) తిరిగి మోసపుచ్చారు.

**త్రివారానంతరం బ్రహ్మా శప్తవాం స్తా మహాప్రభుః ।**
**త్రివారం వంచనం యస్మాదేకవారం చ దర్శనమ్ ॥10॥**

**కించాశ్రుత్వాఽ తః పశ్చాచ్చతుర్జన్మసు భూతలే ।**
**ఏకదేహాన్మానుషత్వం భవిష్యతి న సంశయః ॥11॥**

మూడుసార్లు అట్లయిన తరువాత ప్రభువైన బ్రహ్మ వారిని శపించాడు. ముమ్మారు వంచించిన కారణంచే (ఒకే దర్శనంలో మౌనస్థితిలో నేనున్ననూ) భూతలంలో నాలుగు జన్మలలో ఏకదేహం(ఒకదేహం) వలన మానుషత్వం మీకు కలుగగలదు. సంశయం లేదు.

**ద్వితీయే జన్మని తథా అన్యగాత్వ మవాప్స్యథ ।**
**తృతీయే జన్మని తథా భర్తృసంయోగ మాప్స్యథ ॥12॥**

**జన్మన్యాద్యే చతుర్థే చ నాన్యగాత్వ మవాప్స్యథ ।**
**తథా స్వభర్తృ సంయోగం నావాప్స్యథ చ సర్వశః ॥13॥**

రెండవ జన్మలో "అన్యగాత్వము"ను పొందండి. మూడవ జన్మలో భర్తృసంయోగం పొందండి. మొదటి జన్మమునందును, నాలుగో జన్మయందును "నాన్యగాత్వమును" పొందండి. అన్నిచోట్ల స్వభర్తృసంయోగం పొందకుందురు గాక!.

**ఏవం శప్తాస్తు తాః సర్వా బ్రహ్మణా పక్షిసత్తమ ।**
**తదా విచారయామాసు ర్మిలిత్వా మేరుమూర్ధని ॥14॥**

పక్షిశ్రేష్ఠమా! ఈ విధంగా వారందరు బ్రహ్మచే శపింపబడి, మేరుశిఖరంపై కలుసుకొని విచారించసాగారు.

**బ్రహ్మ శాపస్త్వనీవార్యః ఉపాయైః శతశోఽ పి చ ।**
**నీచై స్సమాగమో నింద్య స్తథైవ చ విపత్తిదః ॥15॥**

**ఉత్తమేన చ సంగేన దైవేనాప్యర్థదో భవేత్ ।**
**దేవానాముత్తమో వాయు స్తదర్థం సంగమాచరేత్ ॥16॥**

వందలకొలది ఉపాయముల చేతనైనను బ్రహ్మశాపం నివారింపరానిది. అల్పులతో సమాగమం నింద్యం. అది ఆపదలను కలిగిస్తుంది. ఉత్తములతో సమాగమం వలన దైవం వలన ప్రయోజనం చేకూరుతుంది. దేవతలలో వాయువు ఉత్తముడు. ఆ దేవుని కోసమై సమాగమాన్ని ఆచరించవచ్చు.

**విచార్యైవ ముమాద్యా భారత్యాః సేవాం తు చక్రిరే ।**
**సహస్రవత్సరాంతే సా భారతీ తోషితాబ్రవీత్ ॥17॥**

ఈ విధంగా ఉమాదులు ఆలోచించి భారతిని సేవించుటకు ఉపక్రమించారు. వేయివత్సరాలు గడచిన పిమ్మట ఆ భారతి సంతుష్టురాలై ఇలా పలికింది.

**మత్సేవాం చ కిమర్థం వై హ్యాచరిష్యంతి సువ్రతాః ।**
**తస్యాం రక్తాశ్చ తా దేవ్య స్త్వబ్రువన్ స్వచికీర్షితమ్ ॥18॥**

"సువ్రతలారా! నా సేవను దేనికోసమై ఆచరిస్తున్నారు?" అని అడుగగా ఆమె యందు అనురక్తలైన ఆ దేవతలు తమ కోరికను ఇలా వచించారు.

**పురా వయం తు శప్తాః స్మ బ్రహ్మణా క్రోధరూపిణా ।**
**ఏకదేహాన్ మానుషత్వ మవాప్స్యథ వరాంగనాః ॥19॥**

పూర్వం క్రోధరూపియైన బ్రహ్మచే శపింపబడినవారము. "వరాంగనలారా! ఒకే దేహం వలన మీరు మనుష్యత్వాన్ని పొందండి" అని.

**చతుర్థ జన్మన్యప్యేవం ద్వితీయే జన్మని ప్రభో ।**
**సమాప్స్యథాన్యగాత్వం చేత్యేవం శప్తా హ భామిని ॥20॥**

**అస్మాకం వాయునా దేవేనాన్యగాత్వం న దోషభాక్ ।**
**అతస్త్వయైకదేహత్వమిచ్ఛామో దేవి జన్మసు ॥21॥**

ప్రభూ! నాలుగు జన్మలయందును ఈ విధంగానే అగుగాక! రెండవ జన్మయందు అన్యగాత్వాన్ని పొందుదురు గాక! భామినీ! ఈవిధంగా శపింపబడినాము. మాకు వాయుదేవుని వలన అన్యగాత్వం దోషం కలిగించేది కాదు. దేవీ! అందువలన అన్ని జన్మలయందు నీవలననే ఏకదేహత్వమును కోరుతున్నాము.

**ఇత్యుక్తా తాభిరథ చ తథేత్యుక్త్వా ద్విజోత్తమ ।**
**సా పార్వత్యాదిభిర్యుక్తా భారతీత్యభవద్భువి ॥22॥**

ద్విజోత్తమా! వారు ఇట్లు పలుకగా (కోరగా) ఆమె అలాగే! అని వచించింది. ఆ భారతి పార్వతి మున్నగువారు కోరగా భువియందు ఆవిర్భవించింది.

**శివనామ్నో ద్విజస్యైవ గృహే సా తు కుమారికా ।**
**కర్మైక్యార్థం తపశ్చక్రే విష్ణోశ్చ శివసంజ్ఞినః ॥23॥**

శివుడనే పేరు గల్గిన ద్విజుని యొక్క గృహమునందు ఆమె కుమారికగా జన్మించింది. కార్యంయొక్క ఏకత్వంకొరకై శివుడనే పేరుగల విష్ణువును గూర్చి తపస్సు చేసింది.

**తపసా తోషితో విష్ణుః శివ సంజ్ఞో మహాప్రభుః ।**
**వరం ప్రాదాత్తృతీయేఽస్మిన్ కృష్ణ జన్మని భో స్త్రియః ॥24॥**

**సమ్యక్త్వభర్తృ సంయోగో భవిష్యతి వినా భవమ్ ।**
**యతోఽనయా చ పార్వత్యా ప్రేరితా ఏవ సర్వశః ॥25॥**

**విలాసం దర్శయామాస బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**అతః సా పార్వతీ శ్రేష్ఠా బ్రహ్మదేహే న సంశయః ॥26॥**

మహాప్రభువై శివసంజ్ఞికుడైన విష్ణువు తపస్సుకు సంతోషించి వరమిచ్చాడు. “ఓ భామినులారా! మూడవదైన జన్మలో కృష్ణజన్మ సమయములో భవుని విడిచి, చక్కనైన భర్తృసంయోగం కలుగగలదు. ఎందువల్లననగా ఈ పార్వతిచే అన్ని విధాలా మీరు ప్రేరేపింపబడినారు. పరమేష్ఠియైన బ్రహ్మవద్ద విలాసాన్ని ఈమె ప్రదర్శించింది. అందువలన బ్రహ్మదేహవిషయమందు ఈ పార్వతి శ్రేష్ఠురాలు (ముఖ్యురాలు). సంశయం లేదు.

**కృష్ణదేహేఽపి తస్యాస్తు న భవిష్యతి సంగమః ।**
**అన్యగాత్వం ద్వితీయేఽస్మిన్ భవిష్యతి న సంశయః ॥27॥**

**రుద్రాంతఃస్థో హరిశ్చైవ వరం దత్త్వా స్త్రియాం ప్రభుః ।**
**అంతర్ధానం యయౌ శ్రీమాన్స్వలోకం గతవానభూత్ ॥28॥**

కృష్ణదేహమందు కూడ ఆమెకయితే సంగమమన్నదిలేదు. ఇక రెండవ జన్మలో “అన్యగాత్వం” అనేది కలుగగలదు. సంశయం లేదు. ఈ విధంగా ఆ స్త్రీలకు ప్రభువైన రుద్రుని లోపల ఉండే హరి వరమిచ్చి అంతర్ధానం పొందాడు. ఆ శ్రీమంతుడు పిమ్మట తన లోకానికి వెళ్లినవాడయ్యాడు.

**విసృజ్యతాశ్చ తం దేహం బభూవుర్నలకన్యకాః ।**
**ఇంద్రసేనేతి సంజ్ఞాం చ లబ్ధ్వా తాశ్చ తపోవనమ్ ॥29॥**

**యయుస్తత్ర చరంత్యస్తా దదృశు ర్ముద్గలం త్వృషిమ్ ।**
**తస్య దర్శనమాత్రేణ బభూవుః కామమోహితాః ॥30॥**

వారు దేహం విడిచిపెట్టి నలకన్యకలుగా జన్మించారు. ఇంద్రసేన అను పేరును పొంది వారు తపోవనానికి వెళ్లారు. అక్కడ వారు విహరిస్తూ ముద్గల మహర్షిని వీక్షించారు. ఆ ఋషి దర్శనమాత్రం చేతనే వారు కామపరవశలయ్యారు.

**ముద్గలస్యాభిమానం హి నాశయిత్వా చ మారుతః ।**
**రమయామాస తత్రస్థా భారత్యాది వరాంగనాః ॥31॥**

వాయువు ముద్గలుని తపోభిమానం నశింపజేసి అక్కడనున్న భారతి మున్నగు వరాంగనలను (భారతి వలన వరాన్ని పొందిన వరాంగనలను) ఆనందింపజేసాడు. (రమించాడు).

**తద్దేహేన విసృష్టా సా బభూవ ద్రౌపదీతి చ ।**
**యస్మాత్సా ద్రుపదాజ్జాతా తస్మాత్సా ద్రౌపదీ స్మృతా ॥32॥**

ఆ దేహాన్ని విడిచిపెట్టి ఆమె ద్రౌపదిగా జన్మించింది. ద్రుపదుని వలన జన్మించిన కారణాన ద్రౌపదిగా పేర్కొనబడింది.

**వేదీమధ్యాత్సముద్భూతా తస్మాత్సాఽ యోనిజా స్మృతా ।**
**కృష్ణవర్ణా యతస్తస్మాత్సా కృష్ణా భూతలే స్మృతా ॥33॥**

యజ్ఞవేదిక నుండి సముద్భవించిన కారణంగా ఆమె అయోనిజగా పేర్కొనబడింది. నల్లని రంగుతోనున్న కారణంచే ఆమె భూతలంలో కృష్ణగా స్మరింపబడింది.

**కృష్ణదేహేఽ పి భారత్యా అభిమానః సదా స్మృతః ।**
**శచ్యాదే రభిమానస్తు తస్మిన్దేహే కదాచన ॥34॥**

కృష్ణదేహమందు భారతికి అభిమానం ఎల్లప్పుడు ఉండేది. ఆ దేహమందు శచ్యాదులకు అభిమానం ఎప్పుడును లేదు.

**యస్యాః స్వభర్తృ సంయోగ కాలే చ ఖగసత్తమ ।**
**అభిమాన స్తదైవ స్యాత్తస్యా ఏవ న చాన్యథా ॥35॥**

పక్షిశ్రేష్ఠమా! స్వభర్తృ సంయోగసమయంలో భారతికి అభిమానం ఎల్లప్పుడూ ఉండేది. మరో విధంగా కాదు.

**ఏతాసాం రమణే కాలే ఉమాయాః పక్షి సత్తమ ।**
**అభిమానశ్చ నాస్త్యేవ స్వాప ఏవ రతా సదా ॥36॥**

పక్షిసత్తమా! వీరియందు సంయోగసమయంలో ఉమకు అభిమానమన్నది లేదు సుమా! ఎల్లప్పుడు ఆమె నిద్రయందు ఆసక్తురాలై ఉండేది.

**పార్థ స్వ రమణే కాలే ద్రౌపద్యాశ్చ కలేవరే ।**
**భారత్యాశ్చ తథా శచ్యా అభిమానద్వయం స్మృతమ్ ॥37॥**

**ఉమాదేః శామలాదేశ్చ అభిమానక్షతి స్తదా ।**
**సర్వాసాం స్వాప ఏవస్యాన్నాత్ర కార్యా విచారణా ॥38॥**

ద్రౌపదీశరీరమందు అర్జుననకు (పార్థునకు) సంయోగసమయంలో భారతీదేవికి, శచీదేవికి కూడ అభిమానద్వయం స్మరింపబడుతోంది. ఉమాదులకు, శామలాదులకు ఆ సమయంలో అభిమానానికి క్షయం ఉంటుంది. (ప్రీతి కలుగదు.) అందరికినీ ఆ సమయంలో నిద్రాస్థితి మాత్రమే. ఇందు ఆలోచించవలసినది లేదు.

**అర్జునం వీరరూపేణ ప్రవిష్టో వాయురేవ చ ।**
**భారతీం రమతే నిత్యం శామలాం చ యుధిష్ఠిరః ॥39॥**

వాయువు కూడ వీరరూపంలో అర్జునుని ప్రవేశించి ఉంటాడు. యుధిష్ఠిరుడు నిత్యమూ భారతిని, శామలను సంతోషపరచాడు.

**సుందరేణ చ రూపేణ ప్రవిష్టో నకులే మరుత్ ।**
**రమతే భారతీం నిత్యం నకులశ్చాప్యుషాం ఖగ ॥40॥**

ఖగమా! వాయువు నకులుని యందు సుందరరూపంతో ప్రవేశించి ఉండేవాడు. నకులుడు, నిత్యమూ భారతిని ఉషను సంతోషపరచేవాడు.

**నీతి రూపేణ చావిష్టో సహదేవే చ మారుతః ।**
**ద్రౌపదీం రమతే నిత్యం సహదేవోఽప్యుషాం ఖగ ॥41॥**

ఖగమా! వాయువు సహదేవుని యందు నీతిరూపంలో ప్రవేశించి ఉండేవాడు. సహదేవుడు నిత్యమూ ద్రౌపదిని, ఉషను సంతోషపరచేవాడు.

**శచ్యాద్యా ద్రౌపదీదేహే నాపుః సంగం చ మారుతః ।**
**తాసామతోఽన్యగామిత్వం కృష్ణాదేహే న చింతయేత్ ॥42॥**

శచ్యాదులు ద్రౌపదీదేహమందు, వాయువుతో కలసి సంగమం పొందలేదు అందువలన కృష్ణా దేహము నందు వారికి అన్యగామిత్వం విచారించనవసరం లేదు.

**ధర్మాది దేహసంగం చ భారత్యా నైవ చింతయేత్ ।**
**మనుజస్య చ దేహస్య తాసాం సంగం న చింతయేత్ ॥43॥**

భారతికి ధర్మరాజాదులతో దేహసంగం విచారించరానిది. వారికి మనుష్యదేహాలతో సంగమాన్ని గురించి కూడ ఆలోచించనవసరం లేదు.

**అపరోక్షవతీనాం తు తాసాం లేపో న సర్వథా ।**
**అథవా ముద్గలస్యైవ రతి కాలే ఖగేశ్వర ॥44॥**
**రమణం చక్రురేవం తా అతో దోషో న విద్యతే ।**

అదృశ్యరూపలైన వారికి ఎల్లప్పుడు భుక్తి (భోగం) లేదు. ఖగరాజా! లేదా రతికాలమందు ముద్గలునితోనే అనుభవాన్ని పొందియున్నారు కావున దోషమనేది ఉండనే ఉండదు.

**ఏకస్మిన్దివసే వీంద్ర ధర్మో వాయుశ్చ తావుభౌ ॥45॥**

**రమణం చక్రతుః సమ్యక్ కృష్ణదేహేఽపి మానద ।**
**తథాప్యనన్యగామిత్వం చింతనీయం న సంశయః ॥46॥**

పక్షీంద్రా! అభిమానం గలవాడా! ధర్ముడు, వాయువు, ఇరువురును ఒకరోజున మాత్రమే కృష్ణదేహంతో చక్కగా కలిసి ఆనందాన్ని పొందేవారు. అందువలన "అనన్యగామిత్వం" చింతనీయవిషయం కాదు. సంశయంలేదు.

**సురాణాం సుర భోగ్యాశ్చ భోగం జానంతి దేవతాః ।**
**న జానంత్యేవ మర్త్యాంస్తు తేషు దేహేషు తే పునః ॥47॥**

**నీరక్షీరవివేకం చ హంసో వేత్తి న చాపరః ।**
**అతః స్వభర్తృసంయోగం కృష్ణా దేహే న చింతయేత్ ॥**
**కృష్ణాదేహేఽన్య గామిత్వం నైవ చింత్యం ఖగేశ్వర ॥48॥**

దేవతలకు సురభోగ్యములైన భోగాలేవయితే ఉన్నాయో సురలు గ్రహించగలరు. మానవులయితే వారి దేహములందున్న మర్త్య భోగాలను గ్రహింపజాలరు. నీర క్షీర వివేకాన్ని హంస గ్రహించగలుగుతుంది. మరొక్కటి గ్రహింపజాలదు. ఖగేశ్వరా! అందువలన కృష్ణా (ద్రౌపదీ) దేహమందు స్వభర్తృ సంయోగం విచారణ చేయవలసినది కాదు. కృష్ణాదేహమందు "అన్యగామిత్వం" గ్రహింపదగినది కాదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే భారత్యాః విశిష్టదేహ సంప్రాప్త్యై నామ సప్తదశోఽధ్యాయః ॥17॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో భారతికి విశిష్టదేహం లభించుట అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టాదశోఽధ్యాయః –** పద్దెనిమిదవ అధ్యాయం

## **రుద్రరోదన కారణం ఆనంద తారతమ్యనిరూపణమ్ –**

రుద్రుని రోదనకు హేతువు ఆనంద తారతమ్యనిరూపణం

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీ కృష్ణుడు వచించాడు.

**అథానాంతరజాన్వక్ష్యే శృణు పక్షీంద్ర సత్తమ ।**
**శృణు తాన్సావధానేన శ్రుత్వా తానవధారయ ॥1॥**

పక్షీంద్ర శ్రేష్ఠమా! పిమ్మట తరువాత ఉద్భవించిన వారిగురించి చెబుతున్నాను విను. సావధానంగా వారిని గురించి విను. విని వారిని ధారణ చేయి.

**పురుషాఖ్య విరించానుజాతః శేషో మహాబలః ।**
**హరే రమాయాశ్చ యస్య స్వస్మిన్ నిద్రాం ప్రకుర్వతః ॥2॥**

పురుషుడనే పేరుగల విరించి ననుసరించి మహాబలుడైన శేషుడు ఉద్భవించాడు. హరికి, రమకు కూడ వానియందు నిద్రిస్తారు.

**శయనార్థ మభూదేష తేన కృత్యం హరేర్న తు ।**
**సర్వదా హరి దాసోఽహం సర్వదా హరిపూజకః ॥3॥**

**హరే సదా నమామి త్వాం బహు జన్మని జన్మని ।**
**ఏవం బుద్ధ్వా తు గరుడ హ్యభూశ్చ శయనం హరేః ॥4॥ (డో)**

ఇతడు వారి శయనం కోసమై ఆవిర్భవించాడు. ఇది హరి కృత్యం కాదు. "నేను ఎప్పుడును హరిదాసుడను. నేను ఎల్లప్పుడును హరిని పూజించువాడను. హరీ! ఎప్పుడూ పెక్కు జన్మలయందు కూడ నిన్ను నమస్కరిస్తాను" అనే బుద్ధితో గరుడ! హరికి శయనమయ్యాడు.

**సూత్రనామ్న స్తథా వాయోః సదాయం వినతాసుత ।**
**కాలనామా చ గరుడో వాహనార్థం హరేరభూత్ ॥5॥**

వినతానందనా! ఎల్లప్పుడు ఇతడు వాయువుకు సూత్రుడు(సూత్రము) అనే పేరుతో, హరికి కాలుడనే పేరుతో గరుడుడు వాహనమయ్యాడు.

**తతో మహత్తత్త్వ తనో ర్విరించాత్తు ఖగేశ్వర ।**
**అహంకారాత్మకో రుద్రః సమభూత్సేవితం హరిమ్ ॥6॥**

ఖగరాజా! అనంతరం మహత్తత్త్వ శరీరం ధరించిన విరించి వలన హరిని సేవించుటకై అహంకార స్వరూపుడైన రుద్రుడు ఆవిర్భవించాడు.

**త్రయ ఏతే మహాభాగ పరస్పరసమాః స్మృతాః ।**
**గాయత్రీ భారతీభ్యాం తే త్రయః శతగుణావరాః ॥7॥**

మహాభాగా! వీరు ముచ్చురు ఒకరికొకరు సమానులుగా స్మరింపబడినారు. ఆ ముచ్చురును గాయత్రీభారతుల కంటే నూరు రెట్లు తక్కువవారు

**శేషః స ఏవ విజ్ఞేయో భక్తో నారాయణస్య చ ।**
**విష్ణోర్వాయో రనంతస్య త్రిభిరంశైర్యుతః సదా ॥8॥**

నారాయణుని భక్తుడుగా ఆ శేషుడు తెలియబడుతున్నాడు. విష్ణువుయొక్క, వాయువుయొక్క, అనంతునియొక్క అంశతో ఎల్లప్పుడు కూడుకొని ఉంటాడు.

**సుమిత్రాంశో దశరథాజ్జాతో యో లక్ష్మణః ఖగ ।**
**సోఽపి శేషస్తు విజ్ఞేయో వాయ్వనంతాంశ సంయుతః ॥9॥**

ఖగమా! దశరథుని వలన సుమిత్రా నందనునిగా జన్మించిన లక్ష్మణుడు శేషుడని, విష్ణువుయొక్క, వాయువుయొక్క, అనంతునియొక్క అంశతో కూడుకొని ఉండేవాడని తెలియబడుతున్నాడు.

**రామస్య సేవాం కర్తుం సా సీతా భూమ్యాం ఖగాధిప ।**
**బలభద్రస్తు రోహిణ్యాం వసుదేవాదభూత్ఖగ ॥10॥**

ఖగేంద్రా! రామునికి సేవచేయుటకై ఆ సీత భూమియందు ఆవిర్భవించింది. ఖగమా! బలభద్రుడయినట్లయితే వసుదేవునివలన రోహిణి యందు కలిగాడు.

**సోఽయమేష తు విజ్ఞేయ స్త్వంశద్వయ సమన్వితః ।**
**ఆవిష్టః శుక్ల కృష్ణేన హరిణా రోహిణీసుతః ॥11॥**

తెల్లనైన కృష్ణుడగు హరిచే రోహిణీ సుతుడుగా ఆవిష్కరింపబడినవాడు "అతడే ఇతడు" అని తెలియబడు చున్నాడు. అతడు అంశద్వయంతో కూడుకొని ఉంటాడు. (హరి కేశాలలో తెల్లని కేశం బలరాముడు, నల్లని కేశం కృష్ణుడని అన్యపురాణ వచనం)

**త్రయ ఏతే మహాభాగావతారా ఫణినః స్మృతాః ।**
**న వీంద్రాస్యావతారోఽస్తి భూమ్యాం చాజ్ఞా తథా హరేః ॥12॥**

మహాభాగా! ఈ మూడు అవతారాలు శేషుని అవతారాలుగా స్మరింపబడుతున్నాయి. పక్షీంద్రా! అవి హరి అవతారాలు కావు. భూమి యందు అజ్ఞలు అట్లు వచిస్తారు.

**రుద్రావతారాన్ వక్ష్యే ఽహం తాన్శృణుత్వం సమాహితః ।**
**యోఽహంకారాత్మకో రుద్రః స ఏవాభూత్ ఖగేశ్వర ॥13॥**

ఖగరాజా! ఏ అహంకారాత్ముడగు రుద్రుడయితే ఆవిర్భవించాడో ఆ రుద్రుని అవతారాలను నేను చెప్తున్నాను నీవు శ్రద్ధగా విను.

**సదాఽ శివ ఇతి త్వాఖ్యామవాప స వినాశకః ।**
**తమోఽ భిమానీ సజ్ఞేయ స్త్వశివత్వాత్ సదాశివః ॥14॥**

సర్వసంహారుడగు అతడు“సదాఽ శివుడు” అనే పేరును పొందాడు. అశివుడవుట వలన ఎల్లప్పుడు శివుడు తమోఽ భిమానిగా తెలియబడుతున్నాడు.

**కపాలమాలామశివాం సదా ధారయతే యతః ।**
**అతః సదాఽ శివో జ్ఞేయో న చ భాగవతః శివః ॥15॥**

అశివమైన కపాలమాలను ఎప్పుడూ ధరించియుండే కారణంచే అతడు “సదాఽ శివుడు”గా తెలియబడు తున్నాడు. అందువలన శివుడు భాగవతుడు కాడు.

**గజాజినం చాపవిత్రం యతో ధారయతే హరః ।**
**లోకానమంగలాన్ సర్వాన్ హరతే చ సదా హరః ॥16॥**

అపవిత్రమైన గజచర్మం హరుడు ధరించియుంటాడు. కావున ఆశివుడు లోకాలలో అన్ని అశుభాలను ఎల్లప్పుడు హరించే కారణంచే హరుడైయ్యాడు. (లోకాన్ = జనుల సంబంధమైన)

**హర్యాజ్ఞయా సదా లోకాన్ విషయాసక్తచేతసః ।**
**విముఖాన్కురుతే యస్మాద్విష్ణో స్తస్మాత్సదాశివః ॥17॥**

హరి ఆజ్ఞచే ఎల్లప్పుడు జనులను విషయాలయందు లగ్నమైన చిత్తం నుండి విముఖులను చేస్తాడు. కావున విష్ణువు వలన సదాశివుడయ్యాడు.

**కదాచిదాసురావేశా ద్విరుద్ధం కురుతే హరః ।**
**అతః సదాశివో జ్ఞేయో న చ భాగవతః శివః ॥18॥**

ఒక్కొక్కప్పుడు అసురావేశంవలన హరుడు హరికి విరుద్ధంగా చేస్తాడు అందువలన సదాశివుడు భాగవతుడైన శివుడుగా తెలియబడడు.

**సోఽ యం శ్మశానవసతిం కర్తుమైచ్ఛద్యతో హరః ।**
**అతః సదాశివో జ్ఞేయో న చ భాగవతః శివః ॥19॥**

ఆ హరుడు శ్మశానవాసం చేయటానికి ఇష్టపడతాడు. అందువలన సదాశివుడు భాగవతుడైన శివుడుగా తెలియబడడు.

**దశవర్షం తపః కర్తుం వివేశ లవణాంభసి ।**
**అతో రుద్రస్తపః సంజ్ఞామవాప చ ఖగోత్తమ ॥20॥**

పది సంవత్సరాలు తపస్సు చేయుటకు లవణసముద్రంలో ప్రవేశించాడు. పక్షిరాజమా! అందువలన రుద్రుడు తపస్సు అనే పేరు పొందాడు.

**వ్యాసపుత్రః శుకః ప్రోక్తో వాయోరావేశ సంయుతః ।**
**రుద్రావతారో విజ్ఞేయో జ్ఞానార్థమభవద్భువి ॥21॥**

వ్యాసపుత్రుడైన శుకుడు వాయువుయొక్క అంశతో కూడియున్నవాడు. అతడు రుద్రుని అవతారమని గ్రహించాలి. భూమియందు జ్ఞానం తెలియచెప్పుటకై ఉద్భవించాడు.

**అత్రి పత్న్యనసూయాయాం జజ్ఞే రుద్రో మహాతపాః ।**
**దుర్వాసాస్తు స విజ్ఞేయో మానభంగాయ భూభృతామ్ ॥22॥**

అత్రిమహర్షి పత్నియైన అనసూయయందు మహా తపస్వియైన రుద్రుడు జన్మించాడు. అతడు దుర్వాసుడుగా చెప్పబడతాడు. రాజుల అభిమానవినాశానికై అవతరించాడు.

**ద్రోణాజ్జాతో ద్రౌణిసంజ్ఞో రుద్ర ఏవ ప్రకీర్తితః ।**
**ప్రారబ్ధం భోక్తు కామోఽసౌ పరపక్ష ప్రకాశకః ॥23॥**

ద్రోణుని వలన పుట్టిన అశ్వత్థామ అను పేరు కల్గినవాడు రుద్రుడే అని పేర్కొనబడినాడు. ప్రారబ్ధాన్ని అనుభవించే కోరికతో అతడు శత్రుపక్షప్రకాశకుడయ్యాడు.

**ఈశానకోణే సంస్థితో యస్తు రుద్రోహ్యావాప వై వామదేవేతి సంజ్ఞామ్ ।**
**స్వవామభాగే సంస్థితం చైవ వాయుస్తం యోగ్యభక్తం సేవతే సర్వదైవ ॥24॥**

ఈశానకోణంలో ఏ రుద్రుడైతే ఉన్నాడో, అతడు వామదేవుడనే పేరును పొందాడు. వాయువు తన వామ భాగంలోనున్న ఆ రుద్రుని యోగ్యుడైన భక్తునిగా ఎల్లప్పుడూ సేవిస్తూ ఉంటాడు.

**అతో రుద్రో వామదేవేతి సంజ్ఞామవాప శిష్టత్వ మథోత్తమత్వమ్ ।**
**కాలాత్మకత్వం  చ బలాత్మకత్వమవాప రుద్రో న తు సుందరత్వతః ॥25॥**

అందువలన రుద్రుడు వామదేవుడనే పేరును పొందాడు. అంతేకాక విశిష్టత్వం, ఉత్తమత్వం, కాలాత్మకత్వం, బలాత్మకత్వం కూడ రుద్రుడు పొందాడు. సుందరత్వంవలన మాత్రం వామదేవత్వం కాదు.

**సదా రుద్రో త్రిపురస్థాంశ్చ దైత్యాన్ విష్ణుద్రుహో హంతు కామో మహాత్మా ।**
**అఘోరరూపం ధృతవాన్ రుద్ర ఏవతత స్త్వఘోరేతి స ఆప సంజ్ఞామ్ ॥26॥**

విష్ణుద్రోహులై త్రిపురాలలోనున్న దైత్యులను చంపే కోరికతో మహాత్ముడైన రుద్రుడు (సదా) అఘోర రూపాన్ని ధరించాడు. అందువలన రుద్రుడు అఘోరుడనే పేరును పొందాడు.

**సేవాం కర్తుం త్విచ్ఛతో దైత్యసంఘాన్ కించిత్కాలం తపసా క్లిశ్యమానాన్ ।**
**వరాన్ దాతుం సద్య ఏవాభిజాతః సద్యోజాతేత్యేవ సంజ్ఞామవాప ॥27॥**

కొంతకాలం తపస్సుచేసి కృశించిన దైత్యసంఘాలకు మేలు చేకూర్చే కోరికతో వరాలను ఇచ్చుటకై వెంటనే అభివ్యక్తుడైన కారణంచే "సద్యోజాతుడు" అనే పేరును పొందాడు.

**ఉరోః పుత్రస్తు ఔర్వశ్చ రుద్ర ఏవ ప్రకీర్తితః ।**
**ఉ ఇత్యకృష్ట వాచిత్వాద్రుస్తు రోదన వాచకః ॥28॥**

**ఉరూ రుద్రో హ్యతః ప్రోక్తస్త త్పుత్రశ్చౌర్వసంజ్ఞకః ।**
**రుదముర్వరితం కర్తుమౌర్వోఽభూద్ రుద్ర ఏవ సః ॥29॥**

ఉరు పుత్రుడైన ఔర్వుడు రుద్రుడుగా పేర్కొనబడుతున్నాడు. "ఉ" అనేది అకృష్టవాచకం. "రు" అనేది రోదన వాచకం అందువలన ఉరుడు రుద్రుడుగా చెప్పబడినాడు. అతని పుత్రుడే ఔర్వుడు అనే పేరుగలవాడు. రోదించే ఉరుని కొరకై ఔర్వుడు కలిగాడు. అతడు రుద్రుడే.

**గరుడ ఉవాచ –** గరుడుడు ప్రశ్నించాడు.

**రోదనం కురుతే కస్మాదురు సంజ్ఞో హరే హరః ।**
**రుదముర్వరితం కస్మాత్ కురుతే ఔర్వకారకః ॥30॥**

**ఏతద్విస్తార్య మే బ్రూహి పౌత్రాయ తవ సువ్రత ।**
**ఇత్యుక్తస్తేన స హరి రువాచ కరుణానిధిః ॥31॥**

హరీ! ఉరుడనే పేరుగల హరుడు ఏ కారణంచే రోదనం చేశాడు? రోదించే ఉరుని వృద్ధి పొందించటం ఎందువల్ల ఔర్వకారకుడు చేశాడు? సువ్రతా! నీ పౌత్రుడనైన నాకు దీనినంతను విస్తరించి చెప్పవలసింది, అని గరుడుడు అడుగగా దయానిధి అయిన ఆ హరి ఇలా పలికాడు.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**దృష్ట్వా స్వబింబం సుగుణైస్తు పూర్ణం సంకర్షణాఖ్యం నతపాదపద్మమ్ ।**
**శ్రీ బ్రహ్మశేషై ర్జిష్ణుకామై స్తథాన్యైర్భారత్యా వై స్వస్తిపైశ్చాపి నిత్యమ్ ॥32॥**

నిత్యమూ జయశీలురైన లక్ష్మి, బ్రహ్మ, శేషులతోను, భారతితోను, మంగళవాచకులతోను, మిగిలిన వారితో కూడుకొని, సుగుణపూర్ణమైన వంగిన పాదపద్మాలు కలిగిన తన బింబాన్ని చూశాడు రుద్రుడు. ఆ బింబమే సంకర్షణ రూపం.

**దృష్ట్వా హరిం పులకాంగస్తు రుద్రః సబాష్పచక్షూ రుద్ధకంఠశ్చ హృష్టః ।**
**అనాద్యనంత బ్రహ్మ కల్పేషు నైవకృతం యథా స్మరణం సర్వదైవ ॥33॥**

అట్టి శ్రీహరిని వీక్షించి రుద్రుడు పులకించిన అవయవాలతో, ఆనందబాష్పాలతో నిండిన కన్నులతో, బొంగురుపోయిన కంఠంతో, సంతోషించినవాడై ఆ స్థితి ఎప్పుడు మొదలై ఎన్ని బ్రహ్మకల్పాల వరకూ సాగినదో తెలియదు. ఎల్లప్పుడు భగవత్స్మరణ చేయలేదు.

**పాదారవిందే సునఖైర్విభూషితే దృష్టే మయా కేన పుణ్యేన దేవ ।**
**దృష్ట్వా దృష్ట్వా పాదపద్మం మురారేః పునఃపునా రుద్ధకంఠో బభూవ ॥34॥**

అందమైన గోళ్ళతో అలంకరింపబడిన పాదారవిందాన్ని దేవా! ఏదో పుణ్యవిశేషంచే నేను చూడగలిగాను అని మురారి పాదపద్మాన్ని పదే పదే చూచి రుద్రుడు మరల రుద్ధకంఠుడయ్యాడు.

**రురోద రుద్రో భయ కంపితాంగః కథం పునర్దర్శనం మే ప్రభోః స్యాత్ ।**
**ముకుంద నారాయణ విశ్వమూర్తేవాగింద్రియేణ స్తవనం మే కథం స్యాత్ ॥35॥**

ముకుందా! నారాయణా! విశ్వమూర్తీ! నా జిహ్వతో నీ స్తోత్రం ఎలా చేయగలను? ప్రభువు యొక్క దర్శనం నాకు మళ్లీ ఎప్పుడు కలుగుతుంది? అంటూ రుద్రుడు భయంతో వణకిన అవయవాలతో రోదించాడు.

**మద్దర్శనం సర్వదా పాపయుక్తం తథా మద్వాక్ సర్వదా పాపయుక్తా ।**
**మద్దర్శనం సర్వదా స్త్రీషు సక్తం అభూచ్చ తే దర్శనం మే హ్యాసక్తమ్ ॥36॥**

నా దర్శనం ఎల్లప్పుడు పాపంతో కూడుకొన్నది. అలాగే నా వాక్కు కూడ ఎప్పుడు దోషంతో కూడుకొన్నది. నా దర్శనం నిత్యము స్త్రీ (ప్రకృతి) సంసక్తం నీ దర్శనమందు మాత్రం నాకు ఆసక్తి లేదు.

**ఆసక్తతా పుత్రదారాదికానాం సమ్యక్ శక్తిః స్తవనే నాస్తి విష్ణోః ।**
**విష్ణుస్తుతౌ నావకాశోఽస్తి వాచోదృష్టోత్వం కేన పుణ్యేన దేవ ॥37॥**

పుత్రదారాదులయందు నాకు ఆసక్తి. విష్ణువును స్తుతించుట యందు చక్కనైన శక్తి మాత్రం లేదు. విష్ణుస్తుతి యందు నా వాక్కుకు అవకాశం దొరకుటలేదు. దేవా! ఏదో పుణ్యవిశేషంచే నీవు నాకు కనిపించావు.

**అనంతకర్ణేన సుచంద్ర సంజ్ఞశ్రోత్రేణ నిత్యం న కథా శ్రుతా తే ।**
**శ్రుతా మయా బహుధా లోకవార్తాదృష్టో మయా త్వం కేన పుణ్యేన దేవ ॥38॥**

అనంత శబ్ద గ్రహణాలకు ప్రభువైనవాడా! చంద్రుడు అని పేరు గల్గిన వాడా! నా చెవులచే నిత్యమూ నీకథ వినబడలేదు. (నా చెవులు నీకథ వినలేదు) నేను బహువిధాలయిన లోకవార్తలనే విన్నాను. దేవా! ఏదో పుణ్య విశేషముచే నీవు నాకు కనిపించావు.

**దృష్ట్వా దృష్ట్వా పాదపీఠం హరేశ్చపునఃపునా రుద్ధకంఠో బభూవ ।**
**రురోద రుద్రో భయకంపితాంగః కథం పునః శ్రవణం స్యాత్కథాయాః ॥39॥**

హరి యొక్క పాదపీఠం పదేపదే వీక్షించి, మళ్లీ మళ్లీ రుద్ధకంఠుడయ్యాడు రుద్రుడు. హరికథాశ్రవణం మరల ఎలా కలుగుతుందని భయకంపితాంగుడై రుద్రుడు రోదించాడు.

**త్వమీశ వైకుంఠ సువాయుసంజ్ఞస్త్వదర్పితం గంధపుష్పాదికం చ ।**
**సదా న లిప్తం చ భుజైర్విలిప్తంత్వన్మూత్ర విష్ఠాదిమ కర్దమాంబుభిః ॥40॥**

ఈశ్వరా! వైకుంఠా! నీవు గొప్పదైన వాయువుయొక్క పేరు కల్గినవాడవు. నీకు అర్పించబడిన గంధ పుష్పాధికాలచే నేను ఎప్పుడును మైపూత ధరించలేదు. నీ సంబంధమైన మూత్రవిష్ఠాది కర్దమజలం నా భుజాల కెప్పుడూ అంటలేదు.

**స్త్రీణాం కుచోదైశ్చ కచోదకైశ్చకక్షోదకై ర్గాత్రజలై ర్ముకుంద ।**
**అనర్పితై ర్వస్త్ర గంధాదికైశ్చదృష్టో మయా కేన పుణ్యేన దేవ ॥41॥**

ముకుందా! నీ స్త్రీల కుచోదకంచేతను, కచోదకంచేతను, కక్షోదకంచేతను, గాత్రజలంచేతను (స్తనములు, జుట్టు, చంకలు, శరీరం) విలిప్తుడను గాను. వస్త్రగంధాదులను కూడా నీకు అర్పించలేదు. ఏదో పుణ్యవిశేషంచే దేవా! నీవు నాకు కనిపించావు.

**స్పృష్ట్వా స్పృష్ట్వా హరి నిర్మాల్య గంధం పునః పునా రుద్ధ కంఠో బభూవ ।**
**రురోద రుద్రో భయ కంపితాంగః కథం పునః స్పర్శనం స్యాత్సదా మే ॥42॥**

హరినిర్మాల్యాన్ని, గంధాన్ని, పదే పదే స్పృశించి, మళ్లీ మళ్లీ రుద్ధ కంఠుడయ్యాడు. నాకు మళ్లీ ఇట్టి స్పర్శనం ఎప్పుడు ఎట్లు కలుగుతుందని రుద్రుడు భయకంపితాంగుడై రోదించాడు.

**నృసింహ నాసాస్థిత నాసికేశ మన్నాసయా క్వాపి సుపద్మ సౌరభమ్ ।**
**నాఘ్రాతమిత్థం పునరాఘ్రాతమేవహ్యనర్పితం గంధపుష్పాదికం చ ॥43॥**

నృసింహా! నాసికేంద్రియాలకు ప్రభువైనవాడా! నాసికయందున్నవాడా! నా నాసికచే ఎప్పుడును మంచితామర పూలవాసన చూడలేదు. నీకు అర్పింపబడని గంధపుష్పాదికాలనే మళ్లీ మళ్లీ వాసన చూశాను.

**సునాసికం సుష్ఠు దంతం మురారేదృష్టం ముఖం కేన పుణ్యేన దేవ ।**
**ఘ్రాత్వా ఘ్రాత్వా విష్ణునిర్మాల్యగంధం పునః పునా రుద్ధ కంఠో బభూవ ॥44॥**

దేవా! మురారీ! అందమైన నాసిక, చక్కని పలువరుసగల నీ ముఖాన్ని ఏదో పుణ్యవిశేషంచే చూచినాను. అంటూ విష్ణు నిర్మాల్య గంధాన్ని పదేపదే ఆఘ్రాణిస్తూ రుద్రుడు మళ్లీమళ్లీ రుద్ధకంఠుడయ్యాడు.

**రురోద రుద్రో భయ కంపితాంగోజిఘ్రామి నిర్మాల్యమిదం కథం తే ।**
**జిహ్వోస్థితో జిహ్వ సంజ్ఞో మురారేజిహ్వేంద్రియేణాపి తథార్పితం చ ॥45॥**

**నైవేద్యశేషం తులసీ విమిశ్రితం విశేషతః పాదజలేన సిక్తమ్ ।**
**యో(యః) స్నాతి నిత్యం పురతో మురారేప్రాప్నోతి యజ్ఞాయుత కోటిపుణ్యమ్ ॥46॥**

ఇటువంటి నీ నిర్మాల్యద్రవ్యాన్ని ఎట్లనుభవించగలనని రుద్రుడు భయకంపితాంగుడై రోదించాడు. మురారీ! నువ్వు నాలుకపై నున్నవాడవు. నాలుకగా పేరుగలవాడవు. నీకు సమర్పింపబడిన నైవేద్యవిశేషాన్ని నా నాలుకతో రుచి చూడలేదు. తులసితో కలసిన, విశేషించి నీపాద జలంతో తడిసిన నీటిలో మురారి ఎదుట నిత్యమూ ఎవడు స్నానం చేసినవాడు, పదివేల కోట్ల యజ్ఞ పుణ్యఫలం పొందుతాడు.

**ఏతాదృశం తవ నైవేద్య శేషం న భుక్తం వై సర్వదాదిత్య రూపమ్ ।**
**అనర్పితం తవ దేవస్య విష్ణోర్భుక్తం మయా బహువారం ముకుంద ॥47॥**

విష్ణూ! ఇటువంటి నీ నైవేద్యశేషం, ఎల్లప్పుడు దేవతాస్వరూపంగా ఉండే ఈ పదార్థాన్ని భుజించినవాడను గాను. ముకుందా! దేవుడవైన నీకు అర్పింపబడని ద్రవ్యమే ఎన్నోమారులు నాచే భుజింపబడింది.

**పాదారవిందే నార్పితం భక్ష్య భోజ్యం దృష్టో మయా కేన పుణ్యేన దేవ ।**
**భుక్త్వా భుక్త్వా హరి నైవేద్యజాతం సుఖం త్వదీయం రమయా లాలితం చ ॥48॥**

నీ పాదపద్మాలకు భక్ష్యభోజ్యాలు నాచే అర్పింపబడలేదు. దేవా! ఏదో పుణ్యవిశేషంచే నాకు కనిపించావు. హరివైన నీకు సమర్పింపబడిన నైవేద్యం వలన పదేపదే కలిగిన సుఖం రమచే అనుభవింపబడి లాలింపబడినది.

**ద్యుభ్వాశ్రయం తవ మూర్ధానమాహుః కిరీటయుక్తం కుటిలైః కుంతలైశ్చ ।**
**అనేకజన్మార్జిత పుణ్యసంచయైర్దృష్టం మయా సజ్జన సంగమాచ్చ ॥49॥**

కిరీటంతో, కుటిల కుంతలాలతో కూడియున్న నీ శిరస్సు భూమ్యాకాశాలకు ఆశ్రయమైనదిగా చెప్తున్నారు. పెక్కు జన్మల నుండి సంపాదింపబడిన పుణ్య సమూహాలవలన, సజ్జనులతోడి సాంగత్యంవలన నాచే చూడబడినది.

**అనేక జన్మార్జిత పాపసంచయైరదర్శనం యాస్యతి దేవ దేవ ।**
**ఏవం సుభక్త్యా చ రురోద రుద్రోదృష్ట్వా హరిం సర్వగుణైః <u>సం</u>పూర్ణమ్ (సు) ॥50॥**

దేవదేవా! అనేక జన్మల నుండి సంపాదింపబడిన పాపసమూహాలవలన హరిదర్శనం పొందలేదు. సమస్తగుణ సంపూర్ణుడైన హరిని చూచి ఇలా మిక్కిలి భక్తితో రుద్రుడు రోదించాడు.

**పాదారవిందం తవ విశ్వమూర్తేయోగీశ్వరై ర్హృదయే సంగృహీతమ్ ।**
**దృష్టం మయా దయయా వాసుదేవద్రక్ష్యే కథం పునరిత్థం రురోద ॥51॥**

విశ్వమూర్తీ! యోగీశ్వరులచే తమ హృదయంలో గ్రహింపబడేది నీ పాదారవిందం. వాసుదేవా! దయతో గోచరించే ఆ పదపద్మం నాచే చూడబడింది. దానిని మరల ఎలా చూడగలను? అంటూ రుద్రుడు రోదించాడు.

**దృష్టం మయా త్వరివలే భవినాశిశంఖ చక్రాదికై స్త్రిజగతాపి చ దేవ పూర్ణమ్ ।**
**ఏతాదృశం త్వదుదరం చ కథం రమేశద్రక్ష్యే పునఃపునరహం త్వితి సంరురోద ॥52॥**

దేవా! శత్రు సంబంధ సంసార విషయాలను నశింపజేసే మూడు జగత్తులకన్న పూర్ణమైన శంఖచక్రాదులతో కూడిన నీరూపం నాచే చూడబడింది. రమేశా! ఇటువంటి నీ ఉదరాన్ని (వక్షః స్థలం) మళ్లీ మళ్లీ నేను ఎలా చూడగలనని రుద్రుడు ఎక్కువగా రోదించాడు.

**ఆనందపూర్ణ నఖపూర్ణ సుకేశ పూర్ణలోమాది పూర్ణ గుణ పూర్ణ సుఘోణ పూర్ణ ।**
**వక్షః స్థలం తవ విభోస్తు విశాలభూతం సద్భూషణం విమల కౌస్తుభ శోభి లక్ష్మ్యా ॥53॥**

ప్రభూ! నువ్వు ఆనందపూర్ణుడవు. మంచిగోళ్ళు, కేశాలు, రోమాలు, నాసిక గలవాడవు. గుణపరిపూర్ణుడవు. ప్రభుడవైన నీ వక్షఃస్థలం విశాలమై ఉన్నది. చక్కని అలంకారాలతో ఉన్నది. లక్ష్మీదేవితో కలసి స్వచ్ఛమైన కౌస్తుభమణి ప్రకాశిస్తూ ఉంది.

**సుకోమలం శ్రీతులస్యా స్తథైవసుపుష్పితం చందనై శ్చర్చితం చ ।**
**ఏతాదృశం తవ వక్షఃస్థలం చ దృష్టంమయా తవ కారుణ్యదృష్ట్యా ॥54॥**

శోభించే తులసిచే మిక్కిలి కోమలమైనది, చక్కగా పుష్పించిన పూలతో ఉండేది, చందనంచే పూయబడినది, అయిన నీ వక్షఃస్థలం నీ కరుణావలోకనంచే నాచే చూడబడింది.

**పునః పునర్దర్శనం మే కథం స్యాదేవం రుద్రః స భక్త్యా రురోద ।**
**అత స్తూరుర్నామ సంప్రాప్య రుద్రస్తత్పుత్రోஉ భూదౌర్వసంజ్ఞః స ఏవ ॥55॥**

మళ్లీ మళ్లీ నీ దర్శనం నాకు ఎలా చేకూరుతుందని, రుద్రుడు భక్తితో రోదించాడు. అంత ఉరువు అనే పేరుగల రుద్రుడు ఔర్వుడు అనే పేరుగల అతని పుత్రుడైన రుద్రుడనే వానిని పొందాడు.

**యస్మాద్రుద్రం చోర్వరితం వై చకారతస్మాత్స రుద్ర స్త్వౌర్వసంజ్ఞో బభూవ ।**
**ఔర్వస్తు లోకాన్మోక్ష యోగ్యాంశ్చ దృష్ట్వాహ్యత్యంతం వై విషయేష్వేవ నిష్ఠాన్ ॥56॥**

**స్తూద్దైవ చౌర్వో విష్ణు పాదారవిందం స్మృత్వా స్మృత్వా రుద్ధకంఠో బభూవ ।**
**తే పాపిష్ఠాః పాపరూపాన్ భజన్తోదినే దినే దుర్విషయాన్ కదింద్రియైః ॥57॥**

రుద్రుని ఆకర్షించి వృద్ధి పొందించిన కారణంచే ఔర్వుడనే పేరు గల్గినవాడుకూడ రుద్రుడే అయ్యాడు. ఔర్వుడైతే మోక్షయోగ్యులై మిక్కిలిగా విషయాసక్తులైన జనులను జూచి, దైవమా! ప్రతి దినమూ దుష్టములైన ఇంద్రియాలచే చెడ్డవిషయాలను, పాపరూపాలను గ్రహించేవారు పాపాత్ములు కదా! అని విష్ణుపాదారవిందాన్ని స్మరించి స్మరించి ఔర్వుడు రుద్ధకంఠుడయ్యాడు.

**కదా చైతాన్ హేయబుద్ధ్యా విముంచేన జానేஉ హం చేతి సమ్యగ్ రురోద ।**
**ఏతే హి మూర్ఖా విషయానర్థలబ్ధ్యైకుర్వంతి యత్నం పరమాదరేణ ॥58॥**

వీరిని హేయబుద్ధినుండి ఎప్పుడు విముక్తి చేస్తానో, నేను తెలియజాలనని గట్టిగా రోదించాడు. ఈ మూర్ఖులు అర్థసిద్ధికై మిక్కిలి ప్రీతితో విషయాల గురించి ప్రయత్నం చేస్తూ ఉంటారు.

**కదింద్రియార్థం హి ధనాదికం చ త్యజంతి సర్వే విషయేషు నిష్ఠాః ।**
**త్వన్మాయయా మోహితాన్నష్ట బుద్ధీన్ కదా చైతాన్ముంచసే విశ్వమూర్తే ॥59॥**

అందరును కుత్సితములైన ఇంద్రియప్రయోజనాలకోసమై విషయాసక్తులై ధనాలు మున్నగు వాటిని కూడ విడిచి వేస్తున్నారు. విశ్వమూర్తీ! నీ మాయచే మోహితులై వివేకహీనులైన వీరిని ఎప్పుడు విముక్తులను చేస్తావో కదా!

**స్మృత్వా స్మృత్వా వాసుదేవస్య మాయాం రురోద చౌర్వో భయకంపితాంగః ।**
**అతీవ కష్టేన చ లోకవృత్త్యాశ్రితా దైన్యం స్వీయకార్యం విహాయ ॥60॥**

వాసుదేవుని మాయను పదే పదే స్మరించి ఔర్వుడు భయకంపితాంగుడై రోదించాడు. మిక్కిలి కష్టంతో లోకప్రవృత్తి కోసమై తమ కర్తవ్యాన్ని కూడ విడిచి దైన్యాన్ని పొందుతున్నారు.

**అతీవ దైన్యేన ధనాధికం చ సంపాద్య సర్వేஉ పి సుపాపశీలాః ।**
**కష్టార్జితం ద్రవ్యధనాదికం చ త్యజంతి సర్వే పశవో వ్యర్థమేవ ॥61॥**

మిక్కిలి దైన్యంతో ధనాదికాలను సంపాదించి, అందరును పాపసంబంధ చరిత్ర కలవారై, కష్టార్జితద్రవ్య ధనాదులన్నింటినీ పశువులై వ్యర్థంగా విడిచి వేస్తున్నారు.

**సత్పాత్ర భూతే విష్ణుబుద్ధ్యా కదాపిత్యజంతి నైతే మాయయా వై మురారేః ।**
**ఏషామాయుర్వ్యర్థ మాహు ర్మహాంతః కథం నష్టా ఇతి సమ్యగ్రురోద ॥62॥**

వీరికి సత్పాత్రునియందు నిలిచే విష్ణుబుద్ధి ఎప్పుడు కలుగుతుందని, వీరు మురారి మాయను త్యజించలేక పోతున్నారని, వీరి ఆయువు వ్యర్థమని మహాత్ములు వక్కాణిస్తున్నారు. వీరు ఎంత నష్టపడుతున్నారో కదా! అని గట్టిగా రోదించాడు.

**ఏషామాయుర్వ్యర్థమేవం గతం చ ఏషాం దృష్ట్వా యౌవనం తు ధ్రువం చ ।**
**స్కంధస్య మృత్యుర్హసతే కృష్ణ విష్ణోతం వై న జానంతి విమూఢచేతసః ॥63॥**

వీరి ఆయువు వ్యర్థంగా గడిచిపోతోంది. వీరిని చూచి యౌవనంకూడ నిశ్చయంగా గడిచిపోతోంది అని వీరి మూపుపై ఉండి మృత్యువు నవ్వుతున్నాడు. కృష్ణా! విష్ణూ! విమూఢమైన మనస్సుగల వీరు ఆ విషయం తెలిసికొనలేకపోతున్నారు.

**గృహం మదీయం శతవర్షం చ జీవేత్ పుత్రా మదీయా శతవర్షం తథైవ ।**
**అహం చ జీవే శతవర్షం సుఖేనమదీయ భార్యాపి సులక్షణాఽఽస్తే ॥64॥**

ఇది నా ఇల్లు. ఇది నూరు సంవత్సరాలు నిలిచి ఉంటుంది. నాపుత్రులు కూడ నూరేండ్లు జీవిస్తారు. నేను కూడ సుఖంగా శతవర్షాలు జీవిస్తాను. నా భార్య కూడ మంచి లక్షణాలు కలదై ఉంది.

**గావశ్చ మే సంతి సుదుగ్ధ పూర్ణామిత్రాణి మే సంతి ముదా హి యుక్తాః ।**
**దాస్యే సుతం వరణార్థం తు వధ్వైపుత్రీం వివాహార్థమహం దదామి ॥65॥**

చక్కని పాలనిచ్చే ఆవులు నాకు ఉన్నాయి. సంతోషంతో కూడుకొన్న స్నేహితులు నాకు ఉన్నారు నాసుతుని వివాహం కోసం వధువుకు ఇస్తాను. నా పుత్రికను వివాహం కొరకై నేను (తగిన వరునికి) ఇస్తాను.

**దాస్యే చాహం సత్సు పుత్రీం ధనం వాదాస్యే చాహం ధనికేష్వేవ నిత్యమ్ ।**
**అదృష్ట శూన్యాన్ భగవాన్వాసుదేవోదృష్ట్వా దృష్ట్వా హసతే సర్వదైవ ॥66॥**

నేను మంచివారుండేచోట నా పుత్రినిగాని, ధనమును గాని ఇస్తాను. నిత్యం నేను ధనికులు ఉండేచోటులోనే ఇస్తాను. ఇటువంటి అదృష్టం లేని వారిని పదే పదే భగవంతుడైన వాసుదేవుడు చూచి, ఎల్లప్పుడూ నవ్వుతూ ఉంటాడు.

**నాహం కరిష్యే శ్రవణం కథాయామద్భాగ్యనాశస్య భవిష్యతీతి ।**
**నాహం హరిం పూజయిష్యే సదైవపుత్రాది నాశశ్చ భవిష్యతీతి ॥67॥**

నేను హరికథాశ్రవణం చేయలేదు నాభాగ్యమంతయు నాశనం పొందగలదు నేను ఎప్పుడూ హరిని పూజించి యుండలేదు. నాకు పుత్రాది నాశనం కలుగగలదు.

**కాలే కాలే దిష్టనామా హరిస్తుఫలప్రదో వాసుదేవోఽ ఖిలస్య ।**
**ఏతాదృశా మూర్ఖ జనాంశ్చ దృష్ట్వారురోద చౌర్వో వాసుదేవైకనిష్ఠః ॥68॥**

కాలానుగుణంగా అదృష్టమనే పేరుతో గల్గిన వాసుదేవుడైన హరి సమస్తానికీ ఫలమునిచ్చేవాడు. అది తెలియని ఇటువంటి మూర్ఖ జనులను చూచి, వాసుదేవుని యందు ప్రధానమైన నిష్ఠ కల్గిన ఔర్వుడు రోదించాడు.

**అతస్త్వౌర్వో రుద్రరూపీ ఖగేంద్రజానీహి నిత్యం కృష్ణ సుశిక్షితార్థః ।**
**యదా సతీ దక్షపుత్రీ ఖగేంద్రదక్షాధ్వరే స్వశరీరం విసృజ్య ॥69॥**

**జజ్ఞే పునర్మేనకాయం హిమాద్రేస్తదా రుద్రస్త్వౌర్వ సంజ్ఞా మవాప ।**
**ఊర్ధ్వరేతా భవేత్యుక్త్వాఊర్ధ్వరేతా బభూవ హ ॥70॥**

ఖగేంద్రా! అందువలన ఔర్వుడు రుద్రరూపి. అతడు నిత్యమూ కృష్ణుని యందు మాత్రమే చక్కని జ్ఞాననిష్ఠ కలవాడు. ఖగేంద్రా! ఎప్పుడయితే దక్షపుత్రి అయిన సతి దక్ష యజ్ఞంలో తన శరీరాన్ని విడిచిపెట్టి, తిరిగి హిమవత్పర్వతానికి మేనకయందు జన్మించిందో అప్పుడు రుద్రుడు ఔర్వుడు అను పేరుగల వాడయ్యాడు. ఊర్ధ్వరేతస్కుడవు గాక! యని పలికి తాను ఊర్ధ్వరేతస్కుడయ్యాడు.

**పాణిగ్రాహం రుద్రదేవో మహాత్మాయదా హిమాద్రేః కన్యకాయాశ్చకార ।**
**తస్యాం పరం లంపటః సంబభూవ అతో రుద్రః పరసంజ్ఞామవాప ॥71॥**

మహాత్ముడైన రుద్రదేవుడు ఎప్పుడయితే హిమాద్రి కన్యకను పెళ్ళి చేసికొన్నాడో, అప్పుడు ఆమెయందు మిక్కిలిగా లంపటుడయ్యాడు. అప్పుడు రుద్రుడు ఉత్కృష్టనామం పొందాడు.

**సదా శివాద్యా దశరుద్ర భ్రాతరః సౌమిత్రేయో రౌహిణేయ స్త్రయశ్చ ।**
**సమా ఏతే మోక్షకాలే సృతౌ చ శతైర్గుణై ర్న్యూనభూతశ్చ తాభ్యామ్ ॥72॥**

సదాశివాదులు పదిమంది రుద్ర సోదరులు. రుద్రుడు, లక్ష్మణుడు, బలరాముడు – వీరు ముగ్గురును ప్రలయకాలమందు సృష్టికాలమందునను సమానులు. వీరు బ్రహ్మాణి భారతులకన్న శతాంశాలు తక్కువవారు.

**గరుడ ఉవాచ –** గరుడుడు వచించాడు.

**ఆనంద నిర్ణయం బ్రూహి కృష్ణ పూర్ణదయానిధే ।**
**నిర్ణేతుం జ్ఞానినాం యద్వజ్జ్ఞాపకార్థం తథా మమ ॥73॥**

**బ్రూహి శిష్యా దయయా ఉద్ధర్తుం మాం చ సర్వదా ।**
**పూర్ణకామస్య తే కృష్ణ కా స్పృహా విద్యతే ప్రభో ॥74॥**

కృష్ణా! సంపూర్ణకృపానిధీ! ఆనందనిర్ణయంగురించి వచించు. జ్ఞానులను నిశ్చయించుటకు నాకు జ్ఞానం కలుగుటకు వివరించు. ఎల్లప్పుడు నన్ను ఉద్ధరించుటకు నీ శిష్యుడనైన నాకు తెలియజేయి. ప్రభూ! కృష్ణా! పూర్ణ కాముడవైన నీకు ఏ కోరిక ఉంటుంది కనుక?

**ఏవముక్తో హృషీకేశః పక్షీశేన మహాత్మనా ।**
**ఉవాచ కృపయా కృష్ణః ప్రసన్నః కమలేక్షణః ॥75॥**

మహాత్ముడైన పక్షీశుడు ఇట్లు అడుగగా, తామరపూలవంటి కన్నులు కలవాడు, సుప్రసన్నుడు, హృషీకేశుడు, అయిన కృష్ణుడు దయతో ఇలా వచించాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**గాయత్ర్యాశ్చ శతానంద ఏకానందస్తు వేధసః ।**
**ఏతాదృశః శతానందో బ్రహ్మణః పరికీర్తితః ॥76॥**

గాయత్రి కన్న, వేధ కన్న, శతానందుడు ఒక అంశ ఆనందం ఎక్కువ వాడు. ఇటువంటి శతానందత్వం బ్రహ్మకు ఉన్నట్లు కీర్తింపబడింది.

**శేషాదేశ్చ శతానందః సరస్వత్యాః ఖగోత్తమ ।**
**ఏకానందస్తు విజ్ఞేయో భారత్యా వినతా సుత ॥77॥**

ఖగోత్తమా! శేషాదులకన్న సరస్వతికి నూరు ఆనందాలు ఎక్కువ. వినతానందనా! భారతికి ఒక ఆనందం ఎక్కువని తెలియాలి.

**ఏవం తు నిర్ణయో జ్ఞేయ ఆనందస్య సదా ఖగ ।**
**ఏవముక్తం మయా సర్వం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥78॥**

ఖగమా! ఈ విధంగా ఆనంద నిర్ణయం తెలియదగియుంది. నాచే ఇదంతయూ తెలియజేయబడింది. ఇక ఏది వినదలచుకొన్నావు?

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే రుద్రరోదన హేత్వాననంతానంద తారతమ్యనిరూపణం నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో రుద్రరోదనకారణం ఆనందతారతమ్యనిరూపణం అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

## నీలావివాహనిర్ణయః - నీలా వివాహనిర్ణయం

***గరుడ ఉవాచ*** - గరుడుడు పచించాడు.

**త్వయోక్తం కృష్ణ గోవింద రుద్రాచ్ఛతగుణాదపి ।**
**బ్రహ్మాణీ భారతీ చోభే అధికే దేవసత్తమ ॥1॥**

కృష్ణా! గోవిందా! దేవశ్రేష్ఠుడా! బ్రహ్మాణి, భారతి అనేవారు ఇరువురు రుద్రుని కన్న నూరు రెట్లు అధికురాండ్రని చెప్పబడింది.

**మయా శ్రుతం విరించేన ఉమా పర్యంతమేవ చ ।**
**అనంతాంశై ర్విహీనత్వం విరించోక్తం సురాధిప ॥2॥**

**సహస్రాంశై ర్విహీనత్వం త్వయోక్తం కృష్ణ మాధవ ।**
**సర్వేషాం చైవ పూర్వేషా మవేక్ష్యైవ హరే విభో ॥3॥**

సురాధిపా! విరించితో ఉమాదేవివరకు అనంతాంశాలచే తక్కువన్నట్లుగా బ్రహ్మ చెప్పగా నేను వినియున్నాను. కృష్ణా! మాధవా! హరీ! విభూ! పూర్వంలోనున్న అందరినీ పర్యవేక్షించి, సహస్రాంశాలచే తక్కువన్నట్లుగా నీవు చెబుతున్నావు.

**జ్ఞానానందబలాదీనాం వాయుపర్యంతమేవ చ ।**
**సహస్రాంశై ర్విహీనత్వం జ్ఞానాదీనాం మహేశ్వర ॥4॥**

**నిర్ణయం బ్రూహి గోవింద సర్వజ్ఞోఽసి న సంశయః ।**
**గరుడేనైవముక్తస్తు వాసుదేవోఽబ్రవీద్ధ్రువమ్ ॥5॥**

మహేశ్వరా! జ్ఞానం, ఆనందం, బలంమున్నగు వాటితో వాయువువరకు వేయి అంశాల న్యూనత్వాన్ని జ్ఞానాది ప్రస్తావనలో చెప్పడం జరుగుతోంది. గోవిందా! నీవు సర్వజ్ఞుడవు. విషయం నిర్ణయించి వచించు. సంశయం లేకుండునట్లు చేయవలసింది. గరుడుడు ఈ విధంగా అడుగగా వాసుదేవుడు నిర్ణయాన్ని ఇలా వచిస్తున్నాడు.

**ఆనందాంశైర్విహీనత్వమపేక్ష్యైవ ఖగాధిప ।**
**ఉత్తరేషా ముత్తరేషాం యోగాదేవమితి స్ఫుటమ్ ॥6॥**

ఖగరాజా! ఆనందాంశములందు న్యూనత్వాన్ని అపేక్షించి, ఉత్తరోత్తర బలీయ న్యాయం వలన ఇది స్పష్టమవుతుంది.

**పరిమాణే శతగుణే ఆనందే స్ఫుటతావశాత్ ।**
**అనంతగుణవత్త్వం చ బ్రహ్మణా సముదీరితమ్ ॥7॥**

పరిమాణంలో నూరు అంశాలు, ఆనందం స్పష్టమౌ విషయంలో అనంతగుణాంశాలు బ్రహ్మచే చక్కగా ఏర్పడినాయి.

**సహస్ర గుణితత్వం చ వాయునా సముదీరితమ్ ।**
**యథానందే తథా జ్ఞానే విష్ణౌ భక్తౌ బలాధికే ॥8॥**

ఆనందమందు ఎట్లో, జ్ఞానమందును అట్లే. విష్ణుభక్తి బలాధిక్యమందును అట్లే. ఈ విధంగా సహస్ర గుణితత్త్వం వాయువుచే లెస్సగా చెప్పబడింది.

**సర్వే గుణైః శతగుణాః క్రమేణోక్తా న తేఽఖిలాః ।**
**భారత్యాశ్చ శతం జ్ఞానం సుఖం భక్తిబలాధికే ॥9॥**

అన్నియూ గుణాలచే నూరు రెట్లుగా క్రమంగా చెప్పబడినాయి. కాని(అన్నీ) అందరును అట్లు కాదు. భారతికి జ్ఞానం, ఆనందం, భక్తి బలమందు నూరు రెట్లు ఆధిక్యం.

**ఏవం జ్ఞానం సువిజ్ఞేయం మారుతేస్తు బలాదికమ్ ।**
**ఏవం జ్ఞానం శతం జ్ఞేయం మారుతే నాత్ర సంశయః ॥10॥**

ఈవిధంగా మారుతికి జ్ఞానం, బలాదికం చక్కగా తెలియదగియున్నది. ఈ విధంగా వాయువు నందు జ్ఞానం శతగుణాలుగా తెలియాలి. ఇందు సంశయం లేదు.

**భారత్యాశ్చ శతం జ్ఞానం బలం చ సముదాహృతమ్ ।**
**ఏవమేవ చ వాయోశ్చ జ్ఞానం చైవమితి స్ఫుటమ్ ॥11॥**

భారతికి జ్ఞానం, బలం నూరు గుణాలుగా చెప్పబడినాయి. ఇట్లే వాయువుకు కూడ జ్ఞానమనేది ఉందని స్పష్టమౌతోంది.

**యథా దీపాచ్ఛత గుణా అగ్నిజ్వాలా న దీపవత్ ।**
**స్ఫుటీ భవద్యథైవాగ్ని ర్బహులోఽపి న సూర్యవత్ ॥12॥**

దీపం నుండి వచ్చే అగ్నిజ్వాల శత గుణాలుగా ఉన్నప్పటికీ దీపం వలె మాత్రం ఉండదు. అగ్ని బహువిధాలుగా ప్రస్ఫుటమవుతున్నప్పటికీ సూర్యుని వలె మాత్రం ఉండదు.

**యథైవ సూర్యా ద్ద్విగుణశ్చంద్రో నైవ స్ఫుటీభవేత్ ।**
**ఆనందతారతమ్యం చ యథోక్తం తుమయా తవ ॥13॥**

ఏవిధంగా సూర్యునికన్న చంద్రుడు రెండు గుణాలతో ప్రస్ఫుటించడో, ఆనంద తారతమ్యం కూడ ఆవిధంగా నాచే నీకు తెలియజేయబడింది.

**తథైవ జానీహి ఖగ నాన్యథా తు కథంచన ।**
**అహం విజానామి మయి స్థితాన్ గుణాన్**
**సర్వైర్విశేషైశ్చ ఖగేంద్ర సంయుతాన్ ॥14॥**

ఖగమా! ఆవిధంగా తెలిసికొనుము. ఎన్నడును మరో విధంగా కాదు. ఖగేంద్రా! అన్ని విశేషాలతో కూడుకొని నాయందున్న గుణాలను నేను గ్రహించగలను.

**సు సూక్ష్మ రూపాంశ్చ సదా ఖగేంద్ర ।**
**మయాప్యదృష్టో నాస్తి నాస్త్యేవ కశ్చిత్ ॥15॥**

ఖగేంద్రమా! మిక్కిలి సూక్ష్మరూపాలను కూడ ఎల్లప్పుడు నేను గ్రహించగలను. నాకు గోచరించనిదంటూ ఏదీ లేదు సుమా!

**సర్వావతారేష్వపి విద్యమానం ।**
**హరింవిజానాతి రమాపి దేవీ ॥16॥**

సమస్తములైన అవతారాలలో ఉన్న హరిని, రమాదేవి విశేషంగా తెలిసిఉంటుంది.

**హరేర్గుణాన్ సర్వవిశేష సంయుతాన్ అఖండరూపాన్ సా విజానాతి దేవీ ।**
**సుసూక్ష్మ రూపాన్ సా విజానాతి దేవీ బ్రహ్మాదిభ్యో మత్ప్రసాదాదధికం చ ॥17॥**

సమస్త విశేషాలతో కూడి, పూర్ణరూపాలుగా ఉండే హరిగుణాలను దేవి గ్రహించింది. బ్రహ్మాదుల కన్న అధికంగా నా అనుగ్రహంవలన ఆ దేవి మిక్కిలి సూక్ష్మరూపాలను కూడ తెలిసియుంది.

**స్వాత్మ స్వరూపం ప్రవిజానాతి దేవీ సుసూక్ష్మరూపం సువిశేషైశ్చ యుక్తమ్ ।**
**స్వాన్యం ప్రపంచం ప్రవిజానాతి లక్ష్మీస్తథాప్యశేషైః సువిశేషైశ్చ యుక్తమ్ ॥18॥**

విశేషాలతో కూడుకొన్న సూక్ష్మరూపాన్ని, తన ఆత్మస్వరూపాన్ని దేవి విశేషంగా గ్రహించి ఉంటుంది. అదే విధంగా సమస్త విశేషాలతో కూడుకొని, తనకన్న వేరైన ప్రపంచాన్ని లక్ష్మి మిక్కిలి విశేషంగా తెలిసికొంటుంది.

**బ్రహ్మాపి పశ్యేత్సర్వగం వాసుదేవం వాయ్వాదిభ్యో హ్యధికాన్సద్గుణాంశ్చ ।**
**శ్రోత్రం న జానాతి హరేర్గుణాంశ్చ సుసూక్ష్మరూపాంశ్చ విశేష సంయుతాన్ ॥19॥**

వాయువు మున్నగు వారికన్న ఎక్కువ సద్గుణాలను, పొంది సర్వగుడైన వాసుదేవుని బ్రహ్మ అయితే దర్శించగలడు. విశేషాలతో కూడుకొన్న మిక్కిలి సూక్ష్మరూపాలను, హరిగుణాలను మాత్రం శ్రవణగ్రాహ్యాలుగా పూర్తిగా తెలియకున్నాడు.

**స్పష్టస్వరూపేణ యథా విదుః సురాముక్త్వా బ్రహ్మాణాం న తథా తేఽ ప్యముక్తాః ।**
**స్వాత్మాన మన్యచ్చ సదా విశేషైర్యుక్తం విజానాతి విధిశ్చ మారుతః ॥20॥**

బ్రహ్మను మినహాయిస్తే, అముక్తులయిన దేవతలు ఆవిధంగా స్పష్టస్వరూపంగా తెలియలేకున్నారు. తనను, విశేషాలతో కూడియున్న ఇతరాన్ని, బ్రహ్మ, వాయువు విశేషంగా తెలుసుకోగలుగుతున్నారు.

**వాణీ విజానాతి హరేర్గుణాంశ్చ స్వయంభువో నైవ తావద్విశేషాన్ ।**
**త్రైగుణ్య రూపాత్పరతః సదైవ పశ్యేద్విష్ణుం కృష్ణరూపం ఖగేంద్ర ॥21॥**

బ్రహ్మకు తెలిసినట్లుగా విశేషాలు తెలియకపోయినప్పటికి, హరి గుణాలను వాణి గ్రహించగలదు. ఖగేంద్రా! ఆమె త్రిగుణ రూపాలుకన్న పరుడైన కృష్ణరూపుడైన విష్ణువును ఎల్లప్పుడు వీక్షిస్తుంది.

**శేషో రుద్రో వీంద్ర ఏతైశ్చ సర్వేతమో మాత్రే ప్రవిజానంతి సంస్థమ్ ।**
**వాణీ దృష్టాన్సవిశేషాన్ గుణాంస్తేజానంతి నో సత్యమేవోక్తమంగ ।।22।।**

పక్షీంద్రా! శేషుడు, రుద్రుడు వీరందరు తమోగుణమాత్రమందున్న వానిని చూడగలరు. (తెలియగలరు) ఓయీ! వాణిచే చూడబడే సవిశేషగుణాలను మాత్రం వారు తెలియజేయజాలరన్నది నిజం.

**ఉమా సువర్ణా వారుణీ చేతి తిస్రః సహైవతాః ప్రవిజానంతి సుస్థమ్ ।**
**హరేర్విశేషాన్ రుద్ర దృష్టాన్ ఖగేంద్రజానంతి నైతాః క్వాపి దేశే చ కాలే ।।23।।**

ఉమా, సువర్ణా, వారుణీ వీరు ముష్వరు సుస్థిరుడైన వానిని తెలియగలరు. ఖగేంద్రా! రుద్రునిచే వీక్షింపబడే హరి విశేషాలను ఏ దేశము నందునూ, ఏకాలము నందునూ వీరు గ్రహింపజాలరు.

**ఇంద్రాదయః ప్రవిజానంతి వీంద్ర అహంకారే వ్యాప్తరూపం హరిం చ ।**
**దక్షాద్యా బుద్ధితత్త్వే స్థితం తం జానంతి తే సోమ సూర్యాదయశ్చ ।।24।।**

పక్షీంద్రా! అహంకారమందు వ్యాపించియున్న హరిరూపాన్ని ఇంద్రాదులు లెస్సగా తెలియగలరు. దక్షుడు మున్నగువారు బుద్ధితత్త్వంలో ఉండే హరిని గ్రహించగలరు. ఆ సోముడు సూర్యుడు మున్నగువారు కూడ తెలియగలరు.

**విష్ణుం హరిం భూతతత్త్వే స్థితం చ యే చాన్యే చ ప్రవిజానంతి నిత్యమ్ ।**
**అన్యే చ పశ్యంతి యథా స్వయోగ్యం అండాంతరస్థం హరి రూపం ఖగేంద్ర ।।25।।**

భూతతత్త్వమందున్న విష్ణువైన హరిని మిగిలినవారు నిత్యమూ తెలుసుకొంటున్నారు. ఖగేంద్రా! మరికొందరు తమ యోగ్యతానుసారంగా బ్రహ్మాండమందున్న హరిరూపాన్ని దర్శిస్తున్నారు.

**కేచిత్ప్రపశ్యంతి హరేశ్చ రూపం త్వదీయహృత్థం హృది కేచిత్సదైవ ।**
**ఏవం ప్రకారం ప్రవిజానీహి వీంద్రహ్యథోశృణు త్వం మమ భార్యాః షడేతాః ।।26।।**

కొందరు నీ హృదయమునందున్న హరి రూపం దర్శిస్తున్నారు. మరి కొందరు ఎల్లప్పుడు తమ హృదయాలలో దర్శిస్తున్నారు. పక్షీంద్రా! ఈ ప్రకారంగా తెలిసికొనుము. అటుపిమ్మట నీవు నా ఆరుగురు భార్యలగురించి విను.

**రుక్మిణ్యాద్యాః షణ్మహిష్యో మమశ్రీర్నీలా చ యా మమ భార్యా ఖగేంద్ర ।**
**సర్గే పూర్వస్మిన్ హవ్యవాహస్య పుత్రీతాస్తా భజే సద్య ఏవావిశేషాత్ ।।27।।**

నాకు రుక్మిణిమున్నగు వారు ఆరుగురు పట్టమహిషులు. ఖగేంద్రా! నాకు శ్రీ ఎట్టిదో, నీలాదేవి కూడ అట్టిదే. ఆమె పూర్వసర్గలో హవ్యవాహనుని పుత్రి. ఏ విశేషం లేక శీఘ్రంగా ఆయా స్త్రీలను స్వీకరిస్తూంటాను.

**కన్యైవ సా కృష్ణపత్నీ చ కామాం స్తాంస్తాన్ భజేన్మనసా చింతితాంశ్చ ।**
**అతీవయత్నం కవ్యవాహం ఖగేంద్రపితృష్వేకః సర్వదా వై చకార ।।28।।**

కన్యగా ఉండగానే ఆమె కృష్ణపత్నిగా, మనస్సులో తలుచుకొన్న ఆయా కోరికలను పొందింది. ఖగేంద్రా! పితరులలో ఒకడు ఆమెను పొందుటకై కవ్యవాహుని దగ్గర అదేపనిగా మిక్కిలి ప్రయత్నం చేశాడు.

**తథైవ సా నైవ భర్తా రమాప ।**
**యతస్తు సా కృష్ణ నిష్ఠైకచిత్తా ॥29॥**

అయినప్పటికినీ ఆమె కృష్ణునియందు నిష్ఠతోకూడిన ఏకాగ్రచిత్తంతో అతనిని భర్తగా పొందలేదు.

**తదాబ్రవీత్కవ్యవాహశ్చ పుత్రీం పతిం కిమర్థం నేచ్ఛసి మూఢబుద్ధే ।**
**తదాబ్రవీత్కవ్యవాహం చ పుత్రీ హరిం వినా సర్వ గుణోపపన్నే ।**
**జన్మన్యస్మిన్ భర్తృతా నాస్తి దేవయతో భర్తా హరిరేవైక ఏవ ॥30॥**

అప్పుడు కవ్యవాహుడు తన పుత్రికను ఉద్దేశించి, ఓసి అమాయకురాలా! నీవు భర్తను ఏ కారణంచే ఇష్టపడుట లేదు? అని అప్పుడు అడిగాడు. అంత కవ్యవాహునునితో ఆ పుత్రిక 'సర్వ గుణాలతో కూడుకొన్న హరిని విడిచి ఈ జన్మలో నాకు భర్తృయోగం లేదు. ఎందువల్లననగా దేవా! నాకు భర్త హరి ఒక్కడే సుమా!' అని పలికింది.

**యతో లోకే సుస్త్రియః సర్వ ఏవసదా జ్ఞేయా విధవాస్తే హి నిత్యమ్ ।**
**అనాది నిత్యం భువనైకసారం సుసుందరం మోక్షదం కామదం చ ॥31॥**

ఎందువల్లననగా లోకంలో సచ్ఛీలలైన స్త్రీలు అందరును నిత్యమూ అనాథలుగానే తెలియాలి. అనాది, నిత్యుడు, భువన ప్రధాన సారభూతుడు, సుసుందరుడు, ముక్తినిచ్చువాడు, కోరికలను తీర్చువాడు.

**ఏతాదృశం న విజానంతి యాస్తుసర్వాస్తా వై విధవాః సర్వదైవ ।**
**నిమిత్తభూతం భర్తృరూపం చ జీవం దైవోపేతం హరిభక్త్యా విహీనమ్ ॥32॥**

**సుకశ్మలం నవరంధ్రైః స్రవంతం దుర్గంధయుక్తం సర్వదా కుత్సితం చ ।**
**ఏతాదృశే భర్తృజీవే ను తాతప్రయోజనం నాస్తి కృష్ణం విహాయ ॥33॥**

అయిన హరిని తెలిసికొనలేని, స్త్రీలు ఎల్లప్పుడు విధవలే(అనాథలే). ఏదియో ఒక నిమిత్తం పొంది, దైవవశంవలన, భర్త రూపంలోనున్న హరిభక్తి లేని, జీవుని, ఎల్లప్పుడు దుర్గంధంతో కూడుకొన్న, తొమ్మిది రంధ్రాల నుండి స్రవించే కశ్మలంతో కూడుకొన్న భర్త అనబడే కుత్సితజీవుని యందు ఆసక్తివల్ల తండ్రీ! కృష్ణుని విడిచి ఏమీ ప్రయోజనం లేదు కదా!

**దేవస్త్రియో నిజభర్తౄన్ విహాయతత్ర స్థితం ప్రీణయంత్యేవ నిత్యమ్ ।**
**అతశ్చ తాః సధవాః సర్వదైవలోకైర్వంద్యా నాత్ర విచారమస్తి ॥34॥**

దేవస్త్రీలు కూడ తమ భర్తలను విడిచి అక్కడ ఉండే హరిని నిత్యమూ ఆనందపరుస్తూ ఉంటారు. అందువలన వారు ఎల్లప్పుడు సధవలు(సనాథలు). జనులచే నమస్కరింపదగినవారు. ఇందు ఆలోచించవలసింది ఏమీ లేదు.

**భర్తారస్తే హరిభక్తా యది స్యురాసాం స్త్రీణాం జన్మ సాఫల్యమేవ ।**
**అనేక జన్మార్జిత పుణ్యసంచయైస్త ద్భర్తారో హరి భక్తా భవేయుః ॥35॥**

ఆ భర్తలు కూడ హరి భక్తులైననాడు, ఆ భార్యల జన్మ సఫలత్వం పొందినట్లే. అనేక జన్మలలో సంపాదించ బడిన పుణ్యసమూహాలచే ఆ భర్తలు హరి భక్తులవుతారు.

**యద్భర్తారో హరి భక్తా న సంతితాభి స్త్యాజ్యం స్వీయగాత్రం భృశం హి ।**
**స్వభర్తృభూతం కృష్ణరూపం హరిం చ స్మృత్వా సమ్యగ్ యది గాత్రం త్యజేయుః ॥36॥**

**తదా నైవ హ్యాత్మహత్యాది దోషాః స్త్రీణామేవం నిర్ణయో౽యం హి శాస్త్రే ।**
**యద్భర్తారో న విజానంతి విష్ణుం తాసాం సంగో నైవ కార్యః కదాపి ॥37॥**

ఎవరి భర్తలు హరిభక్తులు కారో, వారిచే తమ శరీరం శీఘ్రంగా విడిచి పెట్టదగింది. తమ భర్తయే అనదగిన కృష్ణరూపుడైన హరిని భక్తితో స్మరించి శరీరాన్ని విడిచిపెడితే, అప్పుడు స్త్రీలకు ఆత్మహత్యాది దోషాలు ఉండవనేది శాస్త్రనిర్ణయం. ఎవరి భర్తలు విష్ణువును తెలియజాలకున్నారో, వారితో సంగతి ఒకప్పుడు కూడ చేయదగింది కాదు.

**అనేక జన్మార్జిత పుణ్య సంచయాత్ తద్భర్తారో విష్ణుభక్తా భవేయుః ।**
**కలౌ యుగే దుర్లభా విష్ణుభక్తాహరేర్భక్తిర్దుర్లభా సర్వదైవ ॥38॥**

అనేక జన్మలలో సంపాదింపబడిన పుణ్యపుంజాలవలన భర్తలు విష్ణుభక్తులవుతారు. కలియుగంలో విష్ణు భక్తులు లభింపరు. ఎల్లప్పుడు హరిపై భక్తి కలుగుటకూడ దుర్లభమే.

**హరేః కథా దుర్లభా మర్త్యలోకేహరేర్దీక్షా దుర్లభా దుర్లభా చ ।**
**హరే స్తత్త్వే నిర్ణయో దుర్లభో హిహరేర్దాసైః సంగమో దుర్లభశ్చ ॥39॥**

మర్త్యలోకమందు హరికి సంబంధించిన కథ దుర్లభమైనది. హరియందు దీక్ష కలుగుట కూడ దుర్లభం, మరీ దుర్లభం. హరితత్త్వమందు నిర్ణయం కూడ దుర్లభం. హరిదాసులతో సంగమం కూడ దుర్లభం.

**ప్రదక్షిణం దుర్లభం వై మురారేర్నమస్కారో దుర్లభో వై కలౌ చ ।**
**తద్భక్తానాం పాలనం దుర్లభం చ సద్వైష్ణవానాం దుర్లభం హ్యన్నదానమ్ ॥40॥**

మురారికి ప్రదక్షిణమాచరించుట దుర్లభం. కలియుగంలో హరికి నమస్కరించుట కూడా దుర్లభం. హరి భక్తులను పోషించుట దుర్లభం. సద్వైష్ణవులకు అన్నదానం చేయుట దుర్లభం.

**తంత్రోక్తపూజా దుర్లభా వై మురారేర్నామగ్రహో దుర్లభశ్చైవ విష్ణోః ।**
**సువైష్ణవానాం పూజనం దుర్లభం హిసద్వైష్ణవానాం భాషణం దుర్లభం చ ॥41॥**

మురారిని తంత్రంలో చెప్పబడినట్లు పూజించుట దుర్లభం. విష్ణునామ స్వీకరణం కూడ దుర్లభం. మంచివారైన వైష్ణవులను పూజించుట దుర్లభం. సత్పురుషులైన వైష్ణవులతో సంభాషణం దుర్లభం.

**శాలగ్రామ స్పర్శనం దుర్లభం చ సద్వైష్ణవానాం దర్శనం దుర్లభం హి ।**
**గో స్పర్శనం దుర్లభం మర్త్యలోకే సద్గాయనం దుర్లభం సద్గురుం చ ॥42॥**

శాలగ్రామాన్ని స్పృశించుట దుర్లభం. సద్వైష్ణవుల దర్శనం దుర్లభం. మర్త్యలోకంలో గోవును పూజించి తాకుట దుర్లభం. మంచివారిని స్తుతించుట, సద్గురువును పూజించుట దుర్లభం.

**సద్భార్యాః సత్పుత్రకా దుర్లభా హి శేషాచలస్థస్య హరేశ్చ దర్శనమ్ ।**
**సుదుర్లభం రంగనాథస్య తీరేకావేర్యా వై దర్శనం విష్ణుపద్యాః ॥43॥**

మంచి భార్యలు, మంచి కుమారులు లభించుట దుర్లభం. శేషాచలమునందుండే హరిని దర్శించుట దుర్లభం. విష్ణుపది (గంగ) అయిన కావేరీ తీరమందున్న రంగనాథుని దర్శించుట మిక్కిలి దుర్లభం.

**కాంచీక్షేత్రే వరదరాజస్య సేవాసుదుర్లభా దర్శనం చైవ లోకే ।**
**సుదుర్లభం దర్శనం రామసేతోః సుదుర్లభా మధ్వశాస్త్రే చ శక్తిః ॥44॥**

కాంచీక్షేత్రములో వరదరాజ సేవ, లోకంలో ఆ దేవుని దర్శనం దుర్లభం. రామసేతుసందర్శనం సుదుర్లభం. మధ్వశాస్త్రంలోని శక్తి సందర్శనం దుర్లభం.

**భీమాతీరే సంస్థితస్యాపి విష్ణోః సుదుర్లభం దర్శనం చాహురార్యాః ।**
**రేవాతీరే సంస్థితస్యాపి విష్ణోర్గయాక్షేత్రే విష్ణుపాదస్య చైవ ॥45॥**

భీమానదీతీరంలో సుస్థిరుడైయున్న విష్ణుసందర్శనం మిక్కిలి దుర్లభమని ఆర్యులు వచిస్తారు. రేవా తీరంలో నెలకొన్న విష్ణువును దర్శించుట, గయా క్షేత్రమునందు విష్ణుపాదాలను దర్శించుట దుర్లభం.

**తథా బద్రౌ సంస్థితస్యాపి విష్ణోః సుదుర్లభం మర్త్యలోకే స్థితానామ్ ।**
**శేషాచలే శ్రీనివాసాశ్రమే చ తపస్వినో దుర్లభా మర్త్యలోకే ॥46॥**

అదే విధంగా బద్రి క్షేత్రమునందున్న విష్ణుసందర్శనం, మర్త్యలోకంలో ఉండేవారికి మిక్కిలి దుర్లభమైనది. శేషాచలంలో శ్రీనివాసాశ్రమంలోనున్న తపస్వులు కూడ మర్త్యలోకంలో దుర్లభులు.

**ప్రయాగాఖ్యే మాధవస్యాపి నిత్యం సుదర్శనం దుర్లభం వై నృణాం హి ॥47॥**

ప్రయాగ అనే పేరు గల్గిన క్షేత్రమందు నిత్యమూ మాధవదర్శనం మానవులకు మిక్కిలి దుర్లభమైనది.

**అతో నేచ్ఛామి భర్తారం కృష్ణాదన్యం కదాచన ।**
**ఏవముక్త్వా సా పితరం యయౌ శేషాచలం ప్రతి ॥48॥**

అందువలన ఎప్పుడునూ కూడ కృష్ణుని కన్న ఇతరుని భర్తగా ఇచ్ఛగింపజాలను. ఆమె ఈ విధంగా తండ్రితో పలికి శేషాచలం వైపు వెళ్ళిపోయింది.

**కపిలాఖ్య మహాతీర్థే ఆరురోహ మహాగిరిమ్ ।**
**తత్రస్థం శ్రీనివాసం చ దృష్ట్వా నత్వా మహాసతీ ॥49॥**

**త్రిదినం సముపోష్యాథ గత్వా పాపవినాశనమ్ ।**
**తత్ర స్నాత్వా వివాహార్థ మేకాంతం ప్రయయావథ ॥50॥**

"కపిలం" అనే పేరుగల మహాతీర్థమందు గొప్పదైన ఆ పర్వతాన్ని అధిరోహించింది. అక్కడనున్న శ్రీనివాసుని దర్శించి, ఆ మహాసతి నమస్కరించి, మూడు రోజులు ఉపవాసం చేసి, పాపవినాశనానికి వెళ్లి, అక్కడ స్నానమాచరించి, వివాహసంకల్పం చేసికొని, పిమ్మట ఏకాంతంగా వెళ్లిపోయింది.

**తస్యా ఉత్తర దిగ్భాగే క్రోశయుగ్మే మహాతలే ।**
**గర్తభూతే చ ఏకాంతే చచార తప ఉత్తమమ్ ॥51॥**

ఆ నదికి ఉత్తర దిగ్భాగంలో రెండు క్రోసుల దూరంలో ఒక గొప్పదైన క్రింద ప్రదేశంలోని గోతిలో ఏకాంతంగా గొప్పదైన తపస్సు చేసింది.

**ధ్యాత్వా నారాయణం దేవం తత్రాసీచ్చ కుమారికా ।**
**దివ్యవర్ష సహస్రాంతే స్తోతుం సముపచక్రమే ॥52॥**

నారాయణదేవుని ధ్యానిస్తూ, ఆ కుమారిక అక్కడ ఉండిపోయింది. సహస్ర దివ్యసంవత్సరాలు గడచిపోగా, ఆ దేవుని స్తుతించుటకు ఉపక్రమించింది.

**కుమార్యువాచ** – కుమారి వచించింది.

**త్వమేవ మాతా చ పితా త్వమేవత్వమేవ భర్తా చ సఖా త్వమేవ ।**
**త్వమేవ పుత్రశ్చ గురుర్గరీయాన్ మిత్రం స్వసా త్వం మమ వల్లభశ్చ ॥53॥**

నీవే తల్లివి, తండ్రివి నీవే, నీవే భర్తవు, స్నేహితుడవు నీవే. నీవే పుత్రుడవు గొప్పవాడవై గురుడవు నీవే. మిత్రుడవు, భగినివి నీవే. నా వల్లభుడవు నీవే.

**అనాద్యనంతేష్వపి జన్మసు ప్రభోవిచార్యమాణా న విజానేఽ ప్యహం చ ।**
**ఏతేహి సర్వే చ నిమిత్త మాత్రతః పిత్రాదయ స్త్వం హ్యనిమిత్తమాత్రతః ॥54॥**

ప్రభూ! ఆది, అంతంలేని జన్మలనుండి ఎంత ఆలోచన చేసినా నేను నిన్ను తెలియకున్నాను. తండ్రి మొదలైన వారందరును నిమిత్తమాత్ర సంబంధం కలవారు. నీవు మాత్రం నిమిత్తమాత్ర సంబంధం లేనివాడవు.

**అతో మురారేశ్చ తదైవ భార్యాభూయాసమిత్యేవ తదా వ్రతం మే ।**
**దుఃసంగ మాత్రాది సమాగమం నసంసిద్ధిరిత్యేవ వదాన్యమూర్తే ॥55॥**

అందువలన మురారివైన నీకే భార్య కావలెనని నా వ్రతమై యున్నది. వదాన్యమూర్తీ! దుస్సంగం మాత్రమే చేసేవారితో సమాగమం సిద్ధిని చేకూర్చదు కదా!

**త్వద్దూషకాణాం తవ దాసవర్యవిదూషకాణాం దర్శనం ఛింది దేవ ।**
**గురుద్రుహాం దర్శనం ఛింది విష్ణోభక్తద్రుహాం మిత్రతాం ఛింది కృష్ణ ॥56॥**

నిన్ను దూషించు వారియొక్క, నీ దాస శ్రేష్ఠులను విశేషంగా నిందించు వారియొక్క దర్శనాన్ని దేవా! నాకు తొలగించు. విష్ణూ! గురుద్రోహం చేసేవారి దర్శనం ఛేదించు. కృష్ణా! భక్తులకు ద్రోహంచేసే వారితో స్నేహం నాకు కలిగించకు.

**తవ ధ్రుగ్భిర్భాషణం ఛింది దేవత్వం సంగమం దేహి పదారవిందే ।**
**శ్రీశైలవాసాయ నమో నమస్తేనమోనమః శ్రీనివాసాయ తుభ్యమ్ ॥57॥**

దేవా! నిన్ను గూర్చి ప్రగల్భ (నిందా) వాక్యాలు పలికే వారితో సంభాషణాన్ని విచ్ఛేదించు. నీ పాదపద్మమందు సంగమాన్ని కలిగించు. శ్రీశైలవాసా! నీకు పదే పదే నమస్కారం. శ్రీనివాసా! నీకు నమో నమః.

**స్వామిన్ పరావర రమేశ నిదానమూర్తేకాలో మహానపి గతశ్చ నిదర్శనం తే ।**
**అనంత జన్మార్జిత సాధనైశ్చత్వద్దర్శనం స్యాచ్చతుర్భుజస్య ॥58॥**

స్వామీ! పరావరా! రమేశా! ఆదికారణభూతుడా! ఎక్కువకాలం గడచిపోయింది. నీ దర్శనమనేది అనంత జన్మలనుండి సంపాదింపబడిన సాధనాలవలన చేకూరుతుంది. చతుర్ముఖునకు కూడ నీ దర్శనమటువంటిదే కదా!

**కథం మమ స్యాత్తవ దర్శనం ప్రభోసర్వైశ్చ దోషైశ్చ సుసంగతాయాః ।**
**దాస్యాస్పదాయాస్తవ దాస దాస్యాః ప్రసీద దేవేశ జగన్నివాస ॥59॥**

ప్రభూ! నీదాసులకు, పరిచారికలకు దాస్యం చేయటానికి తగినదానినైనా సమస్తదోషాలతో కూడుకొనియున్న నాకు నీ దర్శనం ఎట్లు చేకూరుతుంది? దేవేశా! జగన్నివాసా! నన్ను అనుగ్రహించు.

**ఏవం స్తుత స్తథా విష్ణుః శ్రీనివాసో దయానిధిః ।**
**ప్రాదురాసీద్వరరాట్ భక్త్యా తస్యా జనార్దనః ॥60॥**

ఈ విధంగా స్తుతించబడిన శ్రీనివాసుడు, దయానిధి, జనార్దనుడు, వరదరాజు అయిన విష్ణువు అప్పుడు భక్తితో (ప్రీతితో) ఆమె ఎదుట ప్రాదుర్భవించాడు.

**వరం వరయ భద్రం తే వరదోఽహమిహాగతః ।**
**హరిణోదీరితం వాక్యం శ్రుత్వా ప్రాహ స్మితాననా ॥61॥**

"నీకు భద్రమగుగాక! నేను ఇక్కడకు వరాన్ని ఇచ్చుటకై వచ్చియున్నాను వరాన్ని కోరుకొమ్ము" అని హరిచే చెప్పబడిన వాక్యం విన్నదై ఆమె చిరునవ్వుతో కూడిన మోముతో ఇట్లన్నది.

**ఉవాచ పరయా భక్త్యా శ్రీనివాసం జగత్ప్రభుమ్ ।**
**అహం హి భార్యా భూయాసం తవ మాధవ సుందర ॥62॥**

ఆమె జగత్ప్రభువైన శ్రీనివాసునితో పరమభక్తితో ఇలా పలికింది. "మాధవా! సుందరా! నేను నీకు భార్యను కావాలి."

**ఇతి తస్యా వచః శ్రుత్వా శ్రీనివాసోఽబ్రవీద్వచః ।**

ఆమె మాటలను విని శ్రీనివాసుడు ఇలా పలికాడు.

**శ్రీ భగవానువాచ –** భగవంతుడు పలికాడు.

**అహం కుమారి సుభాగే కృష్ణ జన్మని భూతలే ॥63॥**

**భవామి తవ భర్తాహం నాత్ర కార్యా విచారణా ।**
**ఏవముక్త్వా సుతా కన్యా పుణ్యరాశిం హరిం పరమ్ ॥64॥**

**ఉవాచ పరమప్రీతా హర్షగద్గదయా గిరా ।**

"కుమారీ! సౌభాగ్యరాలా! నేను భూతలంలో కృష్ణ జన్మయందు నీకు భర్త కాగలను. ఇందు ఆలోచించ వలసింది ఏదీ లేదు." ఇట్లు కన్యాకుమారి చెప్పబడి పుణ్యరాశి అయిన పరుడగు హరిని ఉద్దేశించి పరమ సంతుష్టురాలై, సంతోషంతో తొట్రుపాటు చెందిన వాక్కుతో ఇలా పలికింది.

**కన్యోవాచ –** కన్య పలికింది.

**కృష్ణజన్మన్యహం పత్నీ భూయాసం ప్రథమేఽహని ॥65॥**

"కృష్ణావతారమందు నేను నీకు పత్నిని కాగలను. మొదటి రోజున (సారి)

**సంస్కారాత్ప్రథమం చాహమంగనాభ్యః సమావృణే ।**
**ఓమిత్యుక్తః పునర్వాక్యమువాచ మధుసూదనః ॥66॥**

సంస్కారం వలన నేను సమస్తాంగనల కొరకు, మొదట నిన్ను వరించగలను ఓమ్(అలాగే) అని పలికి మధుసూదనుడు మళ్లీ ఇలా అన్నాడు.

**శ్రీభగవానువాచ –** భగవానుడు పలికాడు.

**కుమార్యా విధృతత్వాచ్చ మత్ప్రదానాచ్చ భామిని ।**
**తేషాం మనోభీష్ట సిద్ధిర్భవిష్యతి న సంశయః ॥67॥**

భామినీ! కుమారియొక్క విశేషధారణ వలనను, నా వరదానంవలనను, వారికి మనోఽభీష్టసిద్ధి చేకూరగలదు. సంశయం లేదు.

**ఇతి తస్యై వరం దత్వా తత్రైవాంతరధీయత ।**
**దేహం తత్రైవ సంత్యజ్య కుమారీ చైవ పుత్రికా ॥68॥**

**కుంభకస్య గృహే జాతా నీలా నామ్నాతు సా స్మృతా ।**
**కుంభకస్తు మహాభాగ నందశోభస్య శాలకః ॥69॥**

అని ఆమెకు వరమిచ్చి భగవానుడు అక్కడనే అంతర్ధానమయ్యాడు. ఆ కుమారి అనబడే పుత్రిక తన దేహాన్ని అక్కడే విడిచి, కుంభకుని ఇంటియందు పుట్టింది. ఆమె నీల అనే పేరుతో చెప్పబడింది. మహాభాగా! కుంభకుడు నందశోభుని శాలకుడు.

**కల్పవాహః స విజ్ఞేయః పితౄణాం ప్రథమః స్మృతః ।**
**శివస్యవరతశ్చైవ త్వజేయః ఖగసత్తమ ॥70॥**

అతడు కల్పవాహుడుగా చెప్పబడుతున్నాడు. పితరులలో అతడు ప్రథముడు. ఖగశ్రేష్ఠమా! వృషభాచలమందు నివసించే అతని గృహానికి నేను వెళ్లాను. శివుని వరంవలన అతడు అజేయుడయ్యాడు.

**దితిజాన్వినిహత్యైవ నీలా ప్రాప్తా ఖగేశ్వర ।**
**తతో నాగ్నిజితో రాజ్ఞో గృహే జాతా కుమారికా ॥71॥**

దైత్యులను చంపుటచే నీలాదేవి అతనిని పొందినది. అంత పిమ్మట నాగ్నిజిత్తు అనే రాజుయొక్క గృహమందు కుమారికగా ఆమె జన్మించింది.

**నాగ్నిజిత్కవ్యవాహోఽభూత్కన్యా నీలాహ్వయాభవత్ ।**
**తస్యాః స్వయంవరే చాహం గోవృషాన్సప్తసంఖ్యకాన్ ॥72॥**

**శివస్య వరతశ్చైవాప్యవధ్యాన్ దేవమానుషైః ।**
**బధ్వా వృషాన్నృపాఞ్జిత్వా ప్రాప్తా నీలా మహాఖగ ॥73॥**

నాగ్నిజిత్తు కల్పవాహుడయ్యాడు. కన్య నీల అనే పేరు కలదయ్యింది. ఆమె స్వయంవరంలో నేను ఏడు గోవృషభాలను శివుని వరం వలన దేవమానవులచేత కూడా వధింపబడజాలని ఎద్దులను బంధించి, రాజులను జయించాను. ఇట్లు పొందబడినది నీల.

**కుంభకస్య సుతా నీలా దేహస్థాః ప్రావిశన్ భృశమ్ ।**
**ఏకావయవతో యస్మాత్ తస్మాత్తత్రైవ సావిశత్ ॥74॥**

కుంభకుని కుమార్తె అయిన నీలను అనుసరించి దేహంలో ఉన్నవారందరును నీలలో ప్రవేశించారు. ఒకే అవయవంగా ఉన్న కారణంచే ఆమె అక్కడ అలా ప్రవేశించింది.

**భూమౌ ద్విధా సంప్రజాతా కుమార్యేవ న సంశయః ।**
**భద్రాజన్మ ప్రవక్ష్యామి శృణు పక్షీంద్రసత్తమ ॥75॥**

ఈ విధంగా కుమారి భూమియందు రెండు విధాలుగా అయి జన్మించింది. సంశయంలేదు. పక్షీంద్ర సత్తమా! భద్రాజన్మ గురించి చెప్పబోతున్నాను. విను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే నీలావివాహ నిర్ణయో నామ ఏకోనవింశోఽధ్యాయః ॥19॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో నీలావివాహనిర్ణయం అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

## భద్రాకృత భగవత్పతిత్వ ప్రాపక తపశ్చర్యానిరూపణమ్ -

భగవంతుని భర్తగా పొందుటకై భద్రచేసిన తపస్సు

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**యా పూర్వసర్గే నలసంజ్ఞస్య వీంద్రపుత్రీ భూత్వా విష్ణుపత్నీ స కామా ।**
**ప్రదక్షిణం భ్రమణం వై చకార గుణేన భద్రా భద్రసంజ్ఞా బభూవ ॥1॥**

పక్షీంద్రా! గతంలో పూర్వజన్మలో గుణాలచే భద్ర అయిన ఒకామె నలుడనే పేరుగలవానికి పుత్రికయై విష్ణుపత్ని కావాలన్న కోరికతో నిత్యమూ ప్రదక్షిణం భ్రమణం ఆచరిస్తూ ఉండేది. ఆమె గుణాలచే భద్ర అను పేరు గల్గినదయ్యింది.

**కన్యాభావే సంస్థితాం భద్ర సంజ్ఞాం పితా నల స్త్వబ్రవీత్తాం స పశ్యన్ ।**
**భద్రే కిమర్థం గాత్రపీడాం కరోషిఫలం హి తన్నందిని మే వదస్వ ॥2॥**

కన్యగానున్న భద్ర అను పేరుగల ఆమెను తండ్రియైన నలుడు చూచి, ఆమెతో ఇలా అన్నాడు. "భద్రా! కుమారీ! ఏ కారణంచే శరీరాన్ని శుష్కింపజేసికొంటున్నావు? దీనికి తగిన ఫలమేదో నాకు చెప్పు".

**భద్రోవాచ** - భద్ర అంది.

**శృణు త్వం మే తాత నమస్క్రియాదేః ఫలం వక్తుం కా సమర్థా భవేచ్చ ॥3॥**

తండ్రీ! నమస్కారం మున్నగు వాటికి కలిగే ఫలితాన్ని చెప్పుటకు ఎవ్వతె సమర్థురాలు కాగలదు?

**తథాప్యహం తవ వక్ష్యామి తాత యథాశక్త్యా శృణు సమ్యగ్ఘితాయ ।**
**సదా హరిర్మమ నాథో దయాలురహం హరేస్తవ దాసానుదాసీ ॥**
**మాం పాహి విష్ణోస్తవ వందే పదే ఇత్యుక్త్వా ప్రణామం చకారోద్దండరూపమ్ ॥4॥**

తండ్రీ! అయినప్పటికి నేను నీకు యథాశక్తిగా చెప్తున్నాను. సరియైన మేలు కలుగుట కోసమై విను. నాకు ఎల్లప్పుడు దయాలుడైన హరియే నాథుడు. నేను హరికిని నీకును దాసానుదాసురాలను. నన్ను రక్షించు విష్ణువుకు, నీకు కూడ పాదాభివందనం చేస్తున్నాను. అని పలికి దండ ప్రణామము చేసింది.

**హరేః ప్రణామం త్వితి కర్తవ్యశూన్యం వ్యర్థం తమాహుః జ్ఞానినస్తచ్ఛృణు త్వమ్ ।**
**రమేశ మధ్వేశ సరస్వతీశేత్యేవం వదన్ ప్రణమేద్విష్ణుదేవమ్ ॥5॥**

చేయవలసిందేమీ లేదని హరికి ప్రణామం చేయుట వ్యర్థమని జ్ఞానులు చెబుతూఉంటారు. దానిని నీవు విను. రమేశా! మధ్వేశా! సరస్వతీశా! అని పలుకుతూ విష్ణుదేవునికి ప్రణమిల్లాలి.

**యథా ప్రసన్నో వందనాద్దేవదేవస్తథా న తుష్టః పూజనాత్కర్మతశ్చ ।**
**యథా నామస్మరణా ద్వందనాద్వా పాపాన్నియచ్ఛేత్తు తథా న చాన్యైః ॥6॥**

దేవదేవుడు వందనంవల్ల ప్రసన్నుడైనట్లుగా, పూజవల్ల, క్రియా కలాపావల్ల సంతుష్టుడు కాడు. నామస్మరణం వల్ల, వందనంవల్ల పాపాలను తొలగించునట్లుగా, మిగిలిన క్రియలవల్ల తొలగించదు.

**దేహం తు యే పోషయంత్యేవ తాతహరేః ప్రణామైః శూన్యభూతం చ పుష్టమ్ ।**
**తదేవమాహుర్వ్యర్థమేవేతి తాత తత్పోషకాణాం నరకే దుఃఖమాహుః ॥7॥**

తండ్రీ! హరికి ప్రణామం చేయకుండా, ఎవరయితే తన దేహాన్ని పుష్టిపొందేటట్లుగా పోషించుకొంటూ ఉంటారో, అదంతా వ్యర్థమే అని చెబుతూఉంటారు. నాయనా! అట్టి శరీరపోషకులకు నరకంలో దుఃఖమే అని కూడ వచిస్తుంటారు.

**యమోఽపి తం తత్ర ఉలూఖలే తు నిధాయ పిష్టం సుఖలైః కరోతి ।**
**యో వా పరం న కరోత్యేవ తాత ప్రదక్షిణం దేవదేవస్య విష్ణోః ॥8॥**

తండ్రీ! దేవదేవుడైన విష్ణువుకు ఉత్కృష్టమైన ప్రదక్షిణం చేయనివానిని యముడు కూడ అక్కడ అతనిని రోటిలో వేసి, మిక్కిలి దుష్టులైన వారితో కలిపి పిండిచేస్తాడు.

**తస్యైవ పాదౌ తలయంత్రే నిధాయ యమశ్చ నిత్యం ప్రకరోతి పిష్టమ్ ।**
**ఏషాం జిహ్వా హరి కృష్ణేతి నామన వక్తి నిత్యం వ్యర్థభూతాం వదంతి ॥9॥**

అతని పాదాలను, తల యంత్రంలో ఉంచి, యముడు నిత్యమూ ముద్దచేస్తాడు. హరి, కృష్ణ అనే నామాన్ని నిత్యమూ పలుకకుండా ఉండే వీరి నాలుక వ్యర్థమైనదని చెప్తున్నారు.

**తేషాం జిహ్వా యమలోకే యమస్తు నిష్కాస్య పిష్టం ప్రకరోతి నిత్యమ్ ।**
**కాశీ నివాసేన చ కిం ప్రయోజనం కిం వా ప్రయాగే మరణేన తాత ॥10॥**

యమలోకంలో యముడు వారి జిహ్వను వెలుపలికి పీకి నిత్యమూ పిండి ముద్దచేస్తాడు. కాశీనివాసం వల్ల ఏం ప్రయోజనం? తండ్రీ! ప్రయాగలో మరణించడం వల్ల ఏం లాభం?

**కిం వా రణాగ్రే మరణేన సౌఖ్యంకింవా మఖాదేః సమనుష్ఠితేన ।**
**సమస్త తీర్థేష్వటనేన కింకిమధీతశాస్త్రేణ సుతీక్ష్ణ బుద్ధ్యా ॥11॥**

రణభూమిలో మరణం వల్ల ఏం సౌఖ్యం? చక్కగా యజ్ఞాదులు చేయడం వల్ల ఏమి ప్రయోజనం? సమస్త తీర్థాల యందు పర్యటించటం వల్ల ఏమి లాభం? కుశాగ్రబుద్ధితో శాస్త్రాలు అధ్యయనం చేయడం వల్ల ఏమి ఉపయోగం?

**యేషాం జిహ్వాగ్రే హరి నామైవ నాస్తియేషాం గాత్రై ర్నమనం నాపి విష్ణోః ।**
**యేషాం పద్భ్యాం నాస్తి హరేః ప్రదక్షిణం తేషాం సర్వం వ్యర్థమాహుర్మహాంతః ॥12॥**

ఎవరినాలుక పైన హరినామం పలుకబడదో, ఎవరి శరీరాలు విష్ణువుకు వంగి నమస్కరించవో, ఎవరి పాదాలు హరికి ప్రదక్షిణమాచరించవో, వారి సర్వమూ వ్యర్థమని మనీషులు వక్కాణిస్తారు.

**హర్యర్పణాద్రహితం నామ కస్మాత్ ప్రదక్షిణం నమనం చాహు రర్ఘ్యమ్ ।**
**అతో విష్ణోర్నమనం కార్యమేవహరేర్నామస్మరణం తాత కార్యమ్ ॥13॥**

ఏ కారణంచేత అయితే హరికి సమర్పించడమనేది, సూర్యుని హితం కొరకే అని చెప్పబడిందో, అందువలన హరి ప్రదక్షిణం, హరి నమస్కారం అనేది సూర్యునికిచ్చే అర్ఘ్యమని చెబుతారు. తండ్రీ! అందువలన విష్ణువుకు నమస్కారం చేయదగినది. అందువలన హరినామస్మరణ కూడ ఆచరించవలసింది.

**జన్మహ్యైత ద్దుర్లభం నశ్వరం తుయథా జలస్థం బుద్బుదం తత్తథైవ ।**
**నో విశ్వాసం కురు గాత్రే త్వదీయే జీవేష్వపి స్వః పరశ్చేతి తాత ॥14॥**

ఈ జన్మ దుర్లభమైనది. అది నశ్వరమైనది కూడ. నీటిలోనున్న బుడగ ఎటువంటిదో, అటువంటిదే ఇది. అందువలన తండ్రీ! ఈ శరీరమందు విశ్వాసం వద్దు. (ఇతర) జీవుల యందు స్వపర భ్రాంతి వద్దు.

**సద్యః కృతం నమనం న త్వదీయం సద్యః కృతం స్మరణం న త్వదీయమ్ ।**
**కదా ప్రాప్స్యే మరణం తన్న జానే న విశ్వాసం కురు గాత్రే మహాత్మన్ ॥15॥**

ఆయన గురించి నువ్వు నమస్కారం వెంటనే చేయకపోతే, హరిని గూర్చి నువ్వు నామస్మరణం వెంటనే ఆచరించకపోతే, మరణం ఎప్పుడు వస్తుందో నేను తెలియజాలను. మహాత్మా! శరీరమందు(శాశ్వతమనే) విశ్వాసం వదిలివేయి.

**ఏతచ్ఛ్రుత్వా నలో వీంద్ర పుత్రీవాక్యం సునిర్మలమ్ ।**
**నమస్కారం చ కృతవాన్ యథాశక్త్యా ప్రదక్షిణమ్ ॥16॥**

పక్షీంద్రా! మిక్కిలి విమలమైన కుమార్తెయొక్క వాక్యం విని, నలుడు నమస్కారం, యథాశక్తి ప్రణామం ఆచరించాడు.

**సాపి ప్రదక్షిణం చక్రే నమస్కారం సదా హరేః ।**
**ఏవం బహుదినం కృత్వా ధ్యాత్వా నారాయణం పరమ్ ॥17॥**

**కలేవరం చ తత్యాజ మరణే హరి చింతయా ।**
**మత్పితుర్వసుదేవస్య భగిన్యా ఉదరే ఖగ ॥18॥**

**కైకేయీతి చ నామ్నా సా త్వభవద్భద్ర సంజ్ఞికా।**
**యస్మాద్భద్ర గుణైర్యుక్తా భద్రా సా భద్ర నామికా ॥19॥**

ఆమె కూడ ఎల్లప్పుడు హరికి ప్రదక్షిణం, నమస్కారంచేసింది. ఈవిధంగా చాలారోజులు చేసి, పరుడైన నారాయణుని ధ్యానించి, హరి చింతనంతో మరణించి, శరీరాన్ని విడిచిపెట్టింది. ఖగమా! నా తండ్రియైన వసుదేవుని

సోదరి యొక్క ఉదరమందు భద్ర అను పేరుగల ఆమె కైకేయి అనే నామంతో జన్మించింది. భద్రములైన గుణాలతో కూడుకొనియున్న ఆ భద్రయే ఇప్పుడు కూడ భద్ర అనుపేరు కల్గినదయ్యింది.

**తస్యాత్మజైశ్చ కైకేయైః పంచభిః ఖగసత్తమ ।**
**ప్రత్యాదృతామిమాం భద్రాం ప్రాప్తవాన్ ఖగసత్తమ ॥20॥**

ఖగసత్తమా! ఖగశ్రేష్ఠమా! కేకయుడు అయిదుగురు కుమారులైన కైకేయులతో బాటుగా, మిక్కిలిగా ఆదరింపబడే ఈ భద్రను పొందాడు.

**వక్ష్యేఽహం మిత్రవిందాయాః పాణిగ్రహణకారణమ్ ।**
**సావధానమనా భూత్వా శృణు పక్షీంద్రసత్తమ ॥21॥**

పక్షీంద్ర శ్రేష్ఠమా! మిత్రవిందయొక్క పాణిగ్రహణమహోత్సవకారణం చెప్తున్నాను. సావధానుడవై విను.

**మిత్రవిందోవాచ –** మిత్రవింద వచించింది.

**యాన్ పూర్వ సర్గేఽప్యవృణోన్నికామతోహ్యగ్నీ షోమాన్నామికా మిత్రవిందా ।**
**మిత్రం హరిం చ ప్రాప్తుకామా సదైవతత్రోపాయం చింతయామాస దేవీ ॥22॥**

మిత్రవింద అను పేరు కల్గిన ఆమె పూర్వసర్గంలో స్వేచ్ఛగా, అగ్నీషోములను వరించింది. ఆ దేవియే హరిని మిత్రునిగా పొందే కోరిక కలదై, దానికి ఉపాయాన్ని ఎల్లప్పుడు ఆలోచించసాగింది.

**హరిప్రాప్తౌ సాధనాః సంతి తేషు ముఖ్యం కచ్చిచ్చింతయామాస దేవీ ।**
**తేషాం మధ్యే శ్రవణం శ్రేష్ఠమాహుః పురాణానాం సాత్త్వికానాం సదాపి ॥23॥**

హరిప్రాప్తికి సాధనాలు చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనదేదో ఆ దేవి ఆలోచించసాగింది. వాటి మధ్యలో శ్రవణం శ్రేష్ఠమైనదని సాత్త్వికపురాణాలు ఎల్లప్పుడు చెబుతూ ఉంటాయి.

**విష్ణోరుత్కర్షో వర్తతే యత్ర వాయోస్తథోత్కర్షః సజ్జనానాం పురాణే ।**
**శ్రాద్ధం సదా విష్ణుబుద్ధ్యా సదైవనాన్యచ్ఛ్రావ్యం సాధనం తత్ర చైవ ॥24॥**

ఎక్కడ విష్ణువుయొక్క ఉత్కర్ష చెప్పబడుతుందో, అలాగే ఎక్కడ వాయువు యొక్క ఉత్కర్ష తెలియ జేయబడుతుందో, అవి సత్పురుషుల పురాణాలు. విష్ణుబుద్ధిచే ఎల్లప్పుడు శ్రాద్ధం చేయాలి.అందుకు కూడ శ్రవణం కన్న వేరు సాధనం లేదు.

**యస్మిన్దినే శ్రవణం నాస్తి విష్ణోస్తేషాం జన్మ వ్యర్థమాహుః కథాయామ్ ।**
**స్నానం జపః పంచయజ్ఞం వ్రతం చ ఇష్టాపూర్తే కృచ్ఛ్రచాంద్రో చ దత్తమ్ ॥25॥**

ఏ రోజున విష్ణువును గూర్చి శ్రవణం చేయబడదో, (లేదో) వారి జన్మ వ్యర్థమని పురాణాలలో చెబుతారు. స్నానం, జపం, పంచ యజ్ఞములు, వ్రతాలు, ఇష్టాపూర్తాలు, కృచ్ఛ్రచాంద్రాయణ వ్రతాలు, దానం, (వాపి కూప తటాకాదులు, యాగాలు ఇష్టా పూర్తాలు)

**సర్వం వ్యర్థం వైష్ణవానాం చ దీక్షాకథాం వినా సమ్యగనుష్ఠితాం వై ।**
**యై ర్న శ్రుతం భాగవతం పురాణం స సంప్రదాయై ర్గురుభిః సంయుతైశ్చ ॥26॥**

చక్కని(శాస్త్ర) సంప్రదాయం తెలిసిన గురువులతో కూడుకొని భాగవతపురాణం ఎవరు వినరో, చక్కగా అనుష్ఠింపబడే భాగవత కథను విడిచి వేస్తారో, అటువంటి వైష్ణవుల దీక్ష సర్వం వ్యర్థం.(పైన చెప్పబడినవన్నీవ్యర్థములే)

**యై ర్న శ్రుతం భాగవతం పురాణం యై ర్న శ్రుతం బ్రహ్మకాండం పురాణమ్ ।**
**తేషాం జన్మ వ్యర్థమాహుర్మహాంతస్తస్మాచ్ఛ్రావ్యా హరివార్తా సదైవ ॥27॥**

ఎవరిచేత భాగవతపురాణం శ్రవణం చేయబడదో, ఎవరైతే బ్రహ్మకాండమనే ఈ పురాణాన్ని వినకుండా ఉంటారో వారి జన్మ వ్యర్థమని మనీషులు వచిస్తారు. అందువల్ల హరికథ తప్పనిసరిగా శ్రవణం చేయదగినది.

**న యత్ర గోవింద కథా మహానదీ న యత్ర నారాయణ పాదసంశ్రయః ।**
**న యత్ర విష్ణోః సతతం వచోఽస్తిన సంవసేత్తత్ క్షణమాత్రం కథంచిత్ ॥28॥**

ఎక్కడయితే గోవిందకథామహానది ఉండదో, ఎక్కడయితే నారాయణపాదసంశ్రయం ఉండదో, ఎక్కడయితే విష్ణువు యొక్క నామం(కథ) నిత్యమూ ఉండదో, అక్కడ ఒకప్పుడు కూడ క్షణమాత్రమయినా నివసింపరాదు.

**యస్మిన్ గ్రామే భాగవతం న శాస్త్రం న వర్తంతే భాగవతా రసజ్ఞాః ।**
**యస్మిన్ గృహే నాస్తి గీతార్థసారః యస్మిన్ గ్రామే నామ సాహస్రకం చ ॥29॥**

**తయో రసజ్ఞా యత్ర న సంతి తత్ర న సంవసేత్ క్షణమాత్రం కథంచిత్ ।**
**యస్మిన్దినే దివ్యకథా చ విష్ణోర్నవాస్తి జంతో స్తస్య చాయుర్వృథైవ ॥30॥**

ఏ గ్రామము నందు భాగవతశాస్త్రము ఉండదో, రసజ్ఞులైన భాగవతులు ఉండరో, ఏ గృహంలో గీతార్థసారముండదో, ఏ గ్రామంలో సహస్రనామపారాయణం ఉండదో, వాటి సారం తెలిసినవారు ఎక్కడయితే ఉండరో, అక్కడ క్షణమాత్రంకూడ ఎన్నడును ఉండరాదు. ఏ రోజు విష్ణువుయొక్క దివ్యకథాశ్రవణం ఉండదో, ఆ రోజు ప్రాణియొక్క ఆయువు వ్యర్థమే అవుతుంది.

**గర్భే గర్తే నాత్ర విచారమస్తి తన్మన్యతే దుర్లభం మర్త్యలోకే ।**
**కర్ణం కల్పై ర్భూషితం సుందరం చ న సుందరం చాహు రార్యా రసజ్ఞాః ॥31॥**

గర్భమనే గుంటలో పడి విచారించవలసిన పని ఉండదు. మర్త్యలోకంలో అది దుర్లభమని భావింప బడుతోంది. చెవి అంతటా అందంగా అలంకారాలచే కల్పింపబడినప్పటికి, అది సుందరమైనది కాదని రసజ్ఞులైన ఆర్యులు వక్కాణిస్తారు.

**విష్ణోః కథాఖ్యాభరణైశ్చ యుక్తం తదేవ కర్ణం సుందరం చాహురార్యాః ।**
**తస్మాత్సదా భాగవతార్థసారం శృణ్వంతి యే సతతం వాచయంతి ॥32॥**

**తేషాం జన్మ స్వస్థమాహుర్మహాంతోమహత్ఫలం చాస్తి తథైవ తేషామ్ ।**
**సోష్ణీషకంచుకయుతాశ్చ హరేః కథాం వైశృణ్వంతి యేఽ పి చ పఠంతి సదైవ మర్త్యాః ॥33॥**

**సర్వేఽ పి తే పూజనీయా హి లోకేన వై శిశ్నే చోదరే చైవ సక్తాః ।**

విష్ణువనే పేరు కల్గిన ఆభరణాలతో కూడుకొన్న ఆ కర్ణమే సుందరమైనదని ఆర్యులు వచిస్తారు. అందువల్ల నిత్యమూ భాగవతార్థసారాన్ని ఎవరు శ్రవణం చేస్తారో, ఎవరు ఎల్లప్పుడు వినిపింపజేస్తారో, మనీషుల జన్మ స్వస్థతతో కూడినదని, అలాగే వారికి గొప్పదైన ఫలితం కూడ కలుగుతుందని చెబుతారు. తలపాగలు, కవచాలు కూడా పొందగలరు. ఏ మానవులు హరికథను ఎల్లప్పుడు పఠిస్తారో, వారందరును లోకంలో పూజనీయులే. వారు శిశ్నోదరాసక్తులు కారు.

**యే దాక్షిణ్యాదర్థలోభాద్వదంతి సదా పురాణం భగవత్తత్త్వసారమ్ ॥34॥**

**ప్రచ్ఛాదయంతే తత్త్వ గోప్యాని యే తుతేషాం గతిః సూర్యసూనుః సదైవ ।**
**యే ధర్మకాండే కర్మకాండే సదైవ ఉత్పాదయంతే సురుచిం తత్ర నిత్యమ్ ॥35॥**

ఎవరయితే దక్షిణను ఆశించి, అర్థలోభంతో ఎల్లప్పుడు భగవత్తత్త్వసారమైన పురాణం చెబుతారో వారు తత్త్వరహస్యాలను కప్పివేస్తారు. ఎవరయితే ధర్మకాండమందు, కర్మకాండము నందు నిత్యమూ మిక్కిలి ఆసక్తిని కలుగజేస్తారో వారికి నిత్యమూ యముడు ఒక్కడే గతి.

**మౌల్యేన యే కథయేయుః పురాణం తేషాం గతిః సూర్యసూనుః సదైవ ।**
**మౌల్యేన యే భాగవతం పురాణం శృణ్వంతి వై హరిశాస్త్రార్థతత్త్వమ్ ॥36॥**

ధనంపై కోరికతో హరిశాస్త్రార్థతత్త్వమైన భాగవతపురాణం చెప్పేవారికి భాగవతపురాణం వినేవారికి సూర్యపుత్రుడైన యముడే గతి.

**మౌల్యేన వేదాధ్యయనం ప్రకుర్వతేతేషాం గతిః సూర్యసూనుః సదైవ ।**
**యదృచ్ఛయా ప్రాప్తధనేన యే తుసంతుష్టాస్తే హ్యత్ర యోగ్యాః సదైవ ॥37॥**

మూల్యంపై కోరికతో ఎవరు వేదాధ్యయనం చేస్తారో, వారికి నిత్యం యముడే గతి. స్వేచ్ఛగా వచ్చిన ధనంతో ఎవరు సంతుష్టులవుతారో, వారే ఎల్లప్పుడును యోగ్యులు.

**ధనార్జనే యే త్వతితృష్ణాభియుక్తాస్తేషాం న వై భాగవతేఽ ధికారః ।**
**మత్వా లోకే హరిరేవేతి నిత్యం అంతర్యామీ నాస్తి తదన్య ఈశః ॥38॥**

**ఏవం సదా యే ప్రవిచింతయంతి యోగక్షేమం బిభృయాద్విష్ణురేషామ్ ।**
**సద్వైష్ణవానా మశుభం నాస్తి నాస్తి ప్రదృశ్యతే సంశయజ్ఞానరూపాత్ ॥39॥**

ధనసంపాదనయందు ఎవరయితే మిక్కిలి తృష్ణతో ఉంటారో, వారికి భాగవతమందు అధికారం లేదు. లోకమునందు హరి ఒక్కడే నిత్యమని తలపోసి అంతర్యామి అయిన ఈశ్వరుడు మరియొక్కడు లేడని, ఇట్లు

ఎల్లప్పుడు మిక్కిలిగా భావిస్తారో, వారి యోగక్షేమాలను విష్ణువు భరిస్తాడు. సద్వైష్ణవులకు అశుభం కలుగదు. సంశయజ్ఞానమనేది కలుగనే కలుగదు.

**కర్మానుసారేణ హరిర్దదాతి ఫలం శుభానా మశుభస్య చైవ ।**
**అతస్తదర్థం నైవ యత్నం చ కుర్యాద్ధనార్థం వై హరితత్త్వే చ కుర్యాత్ ॥40॥**

శుభాలకు అశుభాలకు ఫలితాన్ని కర్మానుసారంగా హరి ఇస్తాడు. అందువలన దానికోసం, ధనం కోసం ప్రయత్నించరాదు. హరితత్త్వమునందు మాత్రం ప్రయత్నం చేయాలి.

**అతః స్నాత్వా దివ్యమంత్రం జపిత్వా విసర్జయిత్వా విష్ణునిర్మాల్యగంధమ్ ।**
**శుచిర్భూత్వా భాగవతం పురాణం సంశ్రావయేత్సర్వవేత్తాపి నిత్యమ్ ॥41॥**

అందువలన స్నానమాచరించి, దివ్యమంత్రాన్ని జపించి, విష్ణునిర్మాల్యగంధాన్ని పీల్చి, తరువాత విడిచి, శుచియై, నిత్యము సర్వము తెలిసినవాడు భాగవతపురాణాన్ని వినిపించాలి.

**కర్మానుసారేణ ధనార్జనం చ వేదార్జనం శాస్త్రసమార్జనం చ ।**
**భవిష్యతి శ్రవణం చాపి విష్ణోరత్యాదరాచ్ఛ్రవణం దుర్ఘటం చ ॥42॥**

కర్మానుసారంగా ధనార్జనం, వేదాధ్యయనం, శాస్త్రసంపాదనం కలుగుతాయి. వాటి శ్రవణం కూడ కలుగుతుంది. కాని మిక్కిలి భక్తితో విష్ణువును గూర్చి శ్రవణం చేయటం మాత్రం దుర్ఘటమైనది.

**అత్యాదరాద్భాగవతస్య సారం ఆస్వాదయే ద్దుర్ఘటం మర్త్యలోకే ।**
**ఆస్వాద్య తద్భాగవతం పురాణం ఆనంద బాష్పైర్యుక్తతా దుర్ఘటా చ ॥43॥**

మానవలోకంలో భాగవతసారాన్ని మిక్కిలి ప్రీతితో ఆస్వాదించుట అనేది దుర్ఘటమైనది. ఆ భాగవత పురాణాన్ని ఆస్వాదించి, ఆనందబాష్పాలతో కూడుకొని ఉండటం కూడ మిక్కిలి దుర్ఘటమే.

**శ్రుత్వా తత్త్వానాం నిర్ణయం ధారణం చ సుదుర్ఘటం చాహురార్యాః సమస్తమ్ ।**
**శ్రుత్వా తత్త్వానాం ధారణానంతరం చ కామ క్రుధోర్వారణం దుర్ఘటం చ ॥44॥**

విని, తత్త్వాలను నిర్ణయించటం, వాటిని ధారణ చేయడం, సమస్తమూ, మిక్కిలిదుర్ఘటమని ఆర్యులు వక్కాణిస్తారు. తత్త్వాలను విన్న తరువాత, ధారణ చేసిన తరువాత కూడ కామక్రోధాలను అణచివేయడం దుర్ఘటం.

**శ్రుత్వా తత్త్వానాం ధారణానంతరం చ ।**
**తథా యోగే దుర్ఘటం సంగతం చ ॥45॥**

తత్త్వాలను విన్న తరువాత, ధారణ చేసిన తరువాత కూడ యోగమందు సాంగత్యం కల్గడమనేది దుర్ఘటం.

**శ్రుత్వా తత్త్వానాం ధారణానంతరం చ సద్వైష్ణవానాం స్పర్శనం దుర్ఘటం చ ।**
**ఏతే దోషా జ్ఞాన పూతానపీహ కుర్వంతి సందేహయుతాన్సదైవ ॥46॥**

తత్త్వాలను విన్న తరువాత, ధారణ చేసిన తరువాత సద్వైష్ణవులను స్పృశించడమనేది దుర్ఘటం. ఇటువంటి దోషాలు జ్ఞానపవిత్రత కలిగినవారికి కూడ సందేహం కలిగిస్తాయి.

**అతో హ్యహం శ్రవణం సత్కథాయాః సదా కరిష్యే నాత్ర విచార్యమస్తి ।**
**తేనాప్యహం హరినామాభివాంఛా నిశ్చిత్య చిత్తం శ్రవణే వై చకార ॥**
**ఆదేహమేవం శ్రవణం చ కృత్వాత్యక్త్వా దేహం భూతలే సంప్రజాతా ॥47॥**

అందువలన నేను సత్కథా శ్రవణం ఎప్పుడూ చేస్తాను. ఇందు ఆలోచింపవలసింది లేదు. ఆ కారణంచే నేను హరినామాభివాంఛతో నిశ్చయంగా చిత్తమును శ్రవణమునందు మాత్రమే ఉంచుతాను. నాదేహాన్ని విడిచి భూతలంలో, దేహమున్నంతవరకు శ్రవణం చేసి ఉద్భవిస్తాను.

**నివస్తుం వసుదేవస్య భగిన్యా ఉదరే ఖగ ।**
**సుమిత్రా సంజ్ఞకాయాం చ జాతా వై మిత్రవిందికా ॥48॥**

ఖగమా! వసుదేవుని సోదరియొక్క ఉదరమందు నివసించుటకై సుమిత్ర అనుపేరుతో జన్మించింది ఆ మిత్రవింద.

**శ్రవణేన హరిం మిత్రం ప్రాప్తా సా మిత్రవిందికా ।**
**అతః సా మిత్రవిందేతి సంజ్ఞయా సంబభూవ హ ॥49॥**

ఆ మిత్రవిందిక శ్రవణంచే హరిని మిత్రునిగా పొందింది. అందువలన ఆమె మిత్రవింద అనుపేరు పొందింది.

**స్వయంవరే మిత్రవిందా రాజ్ఞాం మధ్యే తు భామినీ ।**
**మమాంసే వ్యసృజన్మాలాం తాం గృహీత్వా ఖగేశ్వర ।**
**విధూయ నృపతీన్ సర్వాన్ పురీం ప్రాప్తః ఖగేశ్వర ॥50॥**

ఖగేశ్వరా! స్వయంవరంలో రాజుల మధ్యలో భామినియైన మిత్రవింద నాభుజస్కందంపై పుష్పమాల వేసింది. ఆమెను స్వీకరించి నృపతులందరినీ విదిలించుకొని నా పురికి చేరాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే భద్రాకృత భగవత్పతిత్వ ప్రాపక తపశ్చర్యాది నిరూపణం నామ వింశోఽధ్యాయః ॥20॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో భగవంతుని భర్తగా పొందుటకై భద్రచేసిన తపస్సు అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం

## భగవతః కాలింద్యా వివాహే హేతునిరూపణమ్ -

భగవంతుడు కాలిందిని వివాహం చేసుకోవడానికి కారణం

**శ్రీ కృష్ణ ఉవాచ -** శ్రీ కృష్ణుడు వచించాడు.

**కాలింద్యా అపి చోత్పత్తిం ప్రవక్ష్యామి ఖగేశ్వర ।**
**వివస్వాన్ నామ సూర్యో ఽభూత్తస్య పుత్రీ వ్యజాయత ॥1॥**

ఖగేశ్వరా! కాలిందియొక్క పుట్టుకను కూడ చెప్తున్నాను. వివస్వంతుడనే పేరుగల సూర్యుడు ఉన్నాడు కదా అతనికి ఒక పుత్రిక కలిగింది.

**కాలిందీ సంజ్ఞకా వీంద్ర యమునా యానుజా స్మృతా ।**
**కృష్ణపత్నీత్వ కామేన చచార తప ఉత్తమమ్ ॥2॥**

పక్షీంద్రా! ఆమె కాలింది అనే పేరు కలది. యమున ఆమె సోదరిగా స్మరించబడింది. ఆమె కృష్ణపత్ని కావాలనే కోరికతో ఉత్తమమైన తపస్సు చేసింది.

**తప ఆలోచనం ప్రోక్తం తత్త్వానాం చ వినిర్ణయః ।**
**పూర్వార్జితానాం పాపానామనుతాప స్తపః స్మృతమ్ ॥3॥**

ఆలోచనమే తపస్సుగా చెప్పబడింది. తత్త్వవినిర్ణయం కూడ తపస్సే. పూర్వంలో సంపాదించబడిన పాపముల అనుతాపం కూడ తపస్సుగా చెప్పబడుతోంది.

**ప్రాయో నామ తపః ప్రోక్తం చిత్త నిగ్రహ ఉచ్యతే ।**
**ప్రాయశ్చిత్తమితి ప్రోక్తం న తు క్షౌరం ఖగేశ్వర ॥4॥**

మరణం కోసమై ఆహారం మానివేయడం కూడ తపస్సుగా చెప్పబడుతుంది. చిత్తనిగ్రహమన్నను తపస్సే. ఖగేశ్వరా! ప్రాయశ్చిత్తం కూడ తపస్సుగా పేర్కొనబడుతోంది. క్షౌరక్రియ మాత్రం తపస్సుకాదు.

**అనుతాపయుతం భూతం తచ్ఛృణు త్వం ఖగేశ్వర ।**
**పూర్వం న జప్తం దివ్యమంత్రం ముకుందతప్తం సదా క్లేశ దవానలేన ॥5॥**

ఖగేశ్వరా! అనుతాపంతో కూడిన తపస్సు గురించి నీవు విను. ముకుంద! పూర్వం దివ్యమంత్రం జపింపబడలేదు. ఎల్లప్పుడు క్లేశమనే దావాగ్నితో తపింపబడుతున్నాను.

**న వై స్మృతం హరినామామృతం చ సదా స్మృతం హరిదోషాదికం చ ।**
**న తు స్మృతం హరితత్త్వామృతం చ సమ్యక్ శ్రుతం లోలవార్తాదికం చ ॥6॥**

హరినామామృతం నాచే స్మరించబడలేదు (ఆస్వాదింపబడలేదు). హరిదోషాదికాలనే ఎల్లప్పుడు స్మరించాను. హరితత్త్వామృతం నాచే స్మరింపబడలేదు. చంచలమైన వార్తాదికాలనే ఎప్పుడు చక్కగా వినియున్నాను.

**న పూజితం హరిపాదారవిందం సుపూజితాః పుత్రమిత్రాదికాశ్చ ।**
**న వందితం హరిపాదారవిందం సువందితం మిత్రపాదః సుఘోరః ॥7॥**

హరిపాదపద్మం నాచే పూజింపబడలేదు. పుత్రులు, మిత్రులు నాచే మిక్కిలిగా ఆదరింపబడినారు. హరి పాదపద్మాలకు నమస్కరించలేదు. మిక్కిలి ఘోరమైన మిత్రుని పాదాలను సేవించాను.

**న దృష్టం వై న ధూప ధూమ్రైరుపేతం హరేర్వక్త్రం కుంతలైః సంవృతం చ ।**
**పుత్రాదికం లాలితం వై ముకుంద న లాలితం తవ వక్త్రం మురారే ॥8॥**

ధూపధూమంతో కూడిన, చూడముచ్చటైన ముంగురులతో కూడిన హరిముఖాన్ని నేను చూడలేదు. ముకుందా! పుత్రాదులు నాచే లాలింపబడినారు. మురారీ! నీ ముఖం నాచే లాలింపబడలేదు.

**సులాలితం భూషణైః పుత్రమిత్రం న లాలితం సర్వ పాపాపహారి ।**
**న భుక్తం వై హరి నైవేద్యశేషం మిత్రాలయే షడ్రసాన్నం చ భుక్తమ్ ॥9॥**

అలంకారాలచే పుత్రులు, మిత్రులు చక్కగా లాలింపబడినారు. సర్వ పాపాపహారి అయిన హరి నాచే లాలింపబడలేదు. హరినైవేద్యవిశేషం నేను భుజించలేదు. మిత్రుల ఇంటిలో షడ్రసాలను భుజించాను.

**సుపుష్పగంధా నార్పితా తే మురారేసమర్పితాః పుత్రమిత్రాదికేభ్యః ।**
**సంతప్తో ఽ హం పుత్ర మిత్రాదికేషుకదా ద్రక్ష్యే తవ వక్త్రం ముకుంద ॥10॥**

మురారీ! నీకు చక్కని పుష్పాలను, గంధాలను సమర్పించలేదు. పుత్రులకు, మిత్రులకు వాటినన్నింటినీ సమర్పించాను. పుత్ర మిత్రాది విషయాలలో మిక్కిలి క్లేశం అనుభవించాను. ముకుందా! నీ ముఖం ఎప్పుడు చూస్తానో కదా!

**అవైష్ణవాన్నైః శిగ్రుశాకాదికైశ్చహ్యనర్పితాన్నైశ్చ తథాప్యసంస్కృతైః ।**
**తథాప్యభక్ష్యై రసనా చ దగ్ధాకదా ద్రక్షే తవ వక్త్రం ముకుంద ॥11॥**

వైష్ణవులు కానివారి అన్నములచేతను, కాయగూరలచేతను, ఆకుకూరలచేతను, నీకు అర్పించబడని అన్నములచేతను, సంస్కరింపబడని భక్ష్యాలచేతను నా నాలిక దగ్ధమైనది (మొద్దుబారిపోయినది). ముకుందా! నీ ముఖాన్ని ఎప్పుడు చూస్తానో కదా!

**అష్టాక్షరీ పూజయా దివ్యతీర్థైర్విష్ణోః పురా భ్రామితైః శంఖతీర్థైః ।**
**న పావితం మచ్ఛరీరం మురారేకదా ద్రక్ష్యే తవ వక్త్రం ముకుంద ॥12॥**

మురారీ! అష్టాక్షరీమంత్రపూజచేతను, విష్ణువుయొక్క దివ్యతీర్థాలచేతను, పూర్వం యాత్రాభ్రమణం చేయునపుడు శంఖతీర్థాలచేతను నా శరీరం పవిత్రం కాలేదు. ముకుందా! నీ వదనాన్ని ఎప్పుడు వీక్షిస్తానో కదా!

**అనర్పితై ర్గంధ పుష్పాదికైశ్చఅనర్పితై ర్భూషణై ర్వస్త్రజాతైః ।**
**అవైష్ణవానాం దిగ్ధగంధాది దోషైర్గాత్రం దగ్ధం కదా హృద్ధరిష్యే ముకుంద ॥13॥**

నీకు అర్పించని గంధపుష్పాదులచేతను, నీకు సమర్పించని భూషణ వస్త్రజాలాలచేతను, వైష్ణవులు కానివారి మలినగంధాది దోషాలచేతను నా శరీరం దగ్ధమయ్యింది (అపవిత్రమయ్యింది). ముకుందా! నిన్ను ఎప్పుడు నా హృదయంలో ధరిస్తానో కదా!

**దగ్ధౌ చ పాదౌ మమ వాసుదేవ న గచ్ఛంతౌ క్షేత్రపథం హరేశ్చ ।**
**నేత్రే చ దగ్ధే మమ సర్వదాపి నాలోకితం తవ దేవ ప్రతీకమ్ ॥14॥**

వాసుదేవా! నా పాదాలు నిరుపయోగాలు. హరి యొక్క క్షేత్రమార్గాలలో అవి సంచరించలేదు. నా నేత్రాలు కూడ ఎల్లప్పుడు నిష్ప్రయోజనాలు. దేవా! నీ విగ్రహాన్ని అవి దర్శించలేదు.

**దగ్ధౌ చ హస్తౌ మమ వాసుదేవ న పూజితం తవ  విష్ణోః ప్రతీకమ్ ।**
**మయా కృతం పాపజాతం మురారేకదా ద్రక్ష్యే తవ వక్త్రం ముకుంద ॥15॥**

వాసుదేవా! నా చేతులు ఎందుకూ పనికిరానివి. విష్ణువైన నీయొక్క విగ్రహాన్ని పూజించలేదు. మురారీ! నాచే ఎన్నో పాపాలు ఆచరింపబడినాయి. ముకుందా! నీ ఆననాన్ని ఎప్పుడు దర్శించగలనో కదా!

**మదీయ దోషాన్ గణయన్న పూర్ణదయాం కురుత్వం శుద్ధదాస్యాన్ముకుంద ।**
**యావంతి లోమాని మదీయగాత్రేసంతి ప్రభో సర్వదోషైర్విదూర ॥16॥**

ముకుందా! నా సంబంధమైన దోషాలను పరిగణించకుండా నీవు నాపై సంపూర్ణదయను, శుద్ధదాస్యాన్ని ప్రసాదించు. ప్రభూ! నా శరీరములో ఎన్ని రోమాలు ఉన్నాయో, అన్ని దోషాలు నావద్ద ఉన్నాయి. వాటిని దూరం చెయ్యి (దూరంగా తొలగించు).

**తావంతి పాపాని మదీయగాత్రేకదా ద్రక్ష్యే తవ వక్త్రం ముకుంద ।**
**అనంతదేహే పతిపుత్రైర్గృహైశ్చమిత్రైర్ధనైః పశుభృత్యాదికైశ్చ ॥17॥**

**సుఖం నాప్తం హ్యణుమాత్రం ముకుందసేవా ముక్తా తవ దేవస్య విష్ణోః ।**
**ఇతఃపరం పుత్రమిత్రాదికం చ యాస్యే నాహం తవ దాసీ భవామి ॥18॥**

నా శరీరములో అన్ని పాపాలు ఉన్నాయి. (వాటిని దూరంగా తొలగించు). ముకుందా! నీ ముఖాన్ని ఎప్పుడు చూస్తానో కదా! అంతులేని ఈ దేహంలో భర్త, కుమారుడు, ఇళ్ళు, మిత్రులు, ధనం, పశువులు, భృత్యులు మున్నగువారిచేత, ముకుందా! అణుమాత్రం కూడ సుఖం పొందలేదు. విష్ణుదేవుడవైన నీ సేవను విడచి వచ్చాను(వేశాను). ఇక మీదట నేను పుత్ర మిత్రాదులవద్దకు వెళ్ళనే వెళ్లను. నీకు దాసిని అగుచున్నాను.

**యే యే బ్రూయుః పుత్ర మిత్రాదికైశ్చసమ్యక్ సుఖం జాయతే మర్త్యలోకే ।**
**తేషామాస్యే మూత్రవిష్టాదికం చ సమ్యక్ సదా పతితం చేతి జానే ॥19॥**

మర్త్యలోకంలో పుత్రమిత్రాదికములవలన చక్కని సుఖం కల్గునని ఎవరయితే చెబుతూ ఉంటారో, వారిముఖం (నోటి)లో మూత్రం విష్టాదికం మాత్రమే చక్కగా ఎల్లప్పుడు పడుతూ ఉంటుందని తెలిసికొన్నాను.

**మిత్రాదీనాం యత్కృతం ద్రవ్యజాతం వృథాగతం మలరూపం చ జాతమ్ ।**
**సద్వైష్ణవానాం యత్కృతం ద్రవ్యజాతం హరిప్రాప్తేః కారణం స్యాత్ సదైవ ॥20॥**

మిత్రాదులవలన ఏ ద్రవ్యసమూహం సంపాదించబడిందో, అదంతా మలరూపమై యుండి వ్యర్థమవుతుంది. సద్వైష్ణవులవలన ఏ ద్రవ్యజాతం ఏర్పాటు చేయబడిందో, అది ఎల్లప్పుడు హరిప్రాప్తికి కారణమౌతుంది.

**ఏతాదృశం తత్తు జాతం ముకుంద అలం హ్యలం తేన దుఃఖం చ భుక్తమ్ ।**
**సంగం దత్త్వాత్సజ్జనానాం సదా త్వం వినా చ త్వం దుర్జనానాం సంగాత్ ॥21॥**

ఇటువంటి వస్తుసంజాతం చాలు చాలు. అందువల్ల దుఃఖం అనుభవించాను. నీవు ఎల్లప్పుడు దుర్జన సాంగత్యం నాకు లేకుండ జేసి, నిత్యమూ సజ్జనులతో సాంగత్యం కలిగించు చాలు.

**సంగైః సదా దుర్జనానాం మురారే గాత్రం దగ్ధం న విరాగేణ యుక్తమ్ ।**
**ఏతాదృశాహం కాం గతిం వా ముకుందయాస్యే న జానే దయయా మాం చ పాహి ॥22॥**

మురారీ! నిత్యమూ దుర్జనులతోడి సంగములతో నా శరీరం మలమల మాడిపోయింది. వైరాగ్యం లేకుండ పోయింది. ముకుందా! ఇటువంటి నేను ఎటువంటి గతిని పొందుతానో తెలియకున్నాను. దయతో నన్ను రక్షించు.

**ఏతాదృశో హ్యనుతాపః ఖగేంద్రప్రాయశ్చిత్తం న చ క్షౌరాదికం చ ।**
**భానోః కన్యా హ్యనుతాపం చ కృత్వావిచారయామాస హరేః సుతత్త్వమ్ ॥23॥**

ఖగేంద్రా! ఇటువంటిది అనుతాపం అనబడుతుంది. ఇది ప్రాయశ్చిత్తమూ కాదు, క్షౌరాదికమునూ కాదు. సూర్య తనూజ ఇటువంటి అనుతాపాన్ని పొంది హరి యొక్క గొప్పదైన తత్త్వాన్ని ఆలోచించసాగింది.

**సర్వోత్తమో హరిరేకః సదైవయతః పూర్ణః సర్వగుణై స్తతశ్చ**
**సృష్టౌ యస్మాజ్జాయతే విశ్వజాతమతో హరిః సర్వగుణైశ్చ పూర్ణః ॥24॥**

హరి ఒక్కడే ఎల్లప్పుడు అందరికన్న శ్రేష్ఠుడు. అంతేకాక సమస్త గుణాలచేతను పూర్ణుడు. సృష్టియందు విశ్వజాలమంతయు హరివలననే ఉద్భవించింది. అందువల్ల హరి సర్వగుణప్రపూర్ణుడు.

**యో దేవానామాద్య అకార ఏవయతో బ్రహ్మాద్యా నైవ పూర్ణాః సమస్తాః ।**
**లక్ష్మీప్రసాదాచ్చిర పుణ్యేన జాతోయథాయోగ్యం పూర్ణగుణో విరించః ॥25॥**

హరి దేవతలకు ఆద్యుడు. అకారం ఆయన స్వరూపమే. అందువలన బ్రహ్మాదులందరును పూర్ణులు కారు. చాలా పుణ్యం వలన, లక్ష్మీ అనుగ్రహంవలన విరించి యథాయోగ్యంగా పూర్ణగుణుడు అవుతున్నాడు.

**న లక్ష్మీవద్గుణపూర్ణో విరించో న విష్ణువద్గుణపూర్ణా రమాపి ।**
**న వాయువద్భారతీ చాపి పూర్ణా న శేషవద్వారుణీ చాపి పూర్ణా ॥26॥**

లక్ష్మి వలె విరించి పూర్ణుడు కాడు. విష్ణువు వలె రమ గుణపూర్ణురాలు కాదు. వాయువువలె భారతి పూర్ణురాలు కాదు. శేషునివలె వారుణి పూర్ణురాలు కాదు.

**న వై రుద్రవత్పార్వతీ పూర్ణరూపాహ్యన్యేఽ ప్యేవం నైవ పూర్ణాః సదైవ ।**
**ఆలోచనామేవమేషా హి కృత్వాతపశ్చక్రే యమునాయాశ్చ తీరే ॥27॥**

రుద్రుని వలె పార్వతి పూర్ణరూప కాదు. మిగిలిన వారు కూడ ఇట్లే ఎల్లప్పుడు పూర్ణులు కాదు. ఈ విధంగా ఆమె ఆలోచన చేసి యమునానదీతీరమందు తపస్సు చేసింది.

**తదా చాహం యమునాయాశ్చ తీరం పార్థేన సాకం మృగయాం గతః ఖగ ।**
**దృష్ట్వా చ తాం తత్ర తపశ్చరంతీం తదాఽ బ్రువం మత్సఖాయాం చ పార్థమ్ ॥28॥**

ఖగా! అప్పుడు నేను యమునాతీరానికి అర్జునునితో కలసి వేటకు వెళ్లాను. అక్కడ తపస్సు ఆచరించుచున్న ఆమెను చూచి నా స్నేహితుడైన పార్థునితో ఇలా పలికాను.

**హే పార్థ శీఘ్రం వ్రజ కన్యాసమీపం త్వం పృచ్ఛ కస్మాదత్ర తపః కరోషి ।**
**ఏవం ప్రోక్త స్తత్సమీపం స గత్వాపృష్ట్వా చైతత్కారణం శీఘ్రమేవ ॥29॥**

ఓయీ అర్జునా! నీవు ఆ కన్యా సమీపానికి శీఘ్రంగా వెళ్లు. ఏ కారణం చేత తపస్సు చేయుచున్నావని ప్రశ్నించు. అని నేను చెప్పగా అతడు వెంటనే ఆమె సన్నిధికి వెళ్లి ఆ కారణం అడిగాడు.

**ఆగత్య మామవదత్ఫాల్గునోఽ యం సర్వం వృత్తాంతం త్వసౌ మత్సమీపే ।**
**తతస్త్వహం సుముహూర్తే చ తస్యాః పాణిగ్రహం కృతవాంస్తత్ర సమ్యక్ ॥30॥**

ఆ ఫాల్గుణుడు నావద్దకు వచ్చి నాకు సమస్తవృత్తాంతం తెలియజేశాడు. అంత నేను మంచి ముహూర్తంలో ప్రీతితో ఆమె పాణిగ్రహణం చేశాను.

**తస్యాశ్చ తాపాత్సంతతం మద్విచారాత్ ప్రసన్నోఽ హం సతతం సుప్రసన్నః ।**
**పూర్ణానందే రమమాణస్య నిత్యం తయా చ మే కిం సుఖం స్యాత్ఖగేంద్ర ॥31॥**

ఖగేంద్రా! నాపై ఆలోచనతో ఎల్లప్పుడు తాపంతోనుండే ఆమెకు నేను సుప్రసన్నుడనయ్యాను. సదా సుప్రసన్నుడనయ్యాను. నిత్యం పూర్ణానందంలో క్రీడించు నాకు ఆమెవలన వేరే సుఖం ఏమి ఉంటుంది?

**మయా వివాహోఽ నుగ్రహార్థం హి తస్యాఅంగీకృతో న తు సౌఖ్యాయ వీంద్ర ।**
**తథా వక్ష్యే లక్ష్మణాయాశ్చ రూపం పాణిగ్రహే కారణం చాపి వీంద్ర ॥32॥**

పక్షీంద్రా! ఆమెను అనుగ్రహించడం కోసమై వివాహానికి అంగీకరించాను. సౌఖ్యం కోసం మాత్రం కాదు. ఖగేంద్రా! అదే విధంగా లక్ష్మణయొక్క రూపాన్నీ, ఆమెను వివాహం చేసికొనుటలో గల కారణాన్నీ చెప్పబోతున్నాను.

**శృణుష్వ తత్తవ వక్ష్యామి గోప్యం సచ్ఛిష్యకే నాస్తి గోప్యం గురోశ్చ ॥33॥**

ఆ గోప్యం నీకు వివరిస్తున్నాను. విను. గురువుకు మంచిశిష్యునియందు గోప్యం ఉండరాదు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే భగవతః కాలింద్యా వివాహే హేతునిరూపణం నామ ఏకవింశోఽధ్యాయః ॥21॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో భగవంతుడు కాలిందిని వివాహం చేసికోవడానికి కారణం అనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## **ద్వావింశోఽధ్యాయః** – ఇరవై రెండవ అధ్యాయం

## **లక్ష్మణావివాహహేతునిరూపణమ్** – లక్ష్మణతో వివాహానికి కారణం

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**యా లక్ష్మణా పూర్వ సర్గే ఖగేంద్రపుత్రీహ్యభూద్వహ్నివేదస్య వేత్తుః ।**
**సులక్షణైః సంయుతత్వాద్యతః సా లక్ష్మణేతి ప్రథితా ఖగేంద్ర ॥1॥**

ఖగేంద్రా! ఆ లక్ష్మణ పూర్వసర్గమునందు వేదవేత్తయైన వహ్నివేదుని కుమార్తె. పక్షీంద్రా! మంచి లక్షణాలతో కూడియున్న కారణంచే ఆమె లక్ష్మణ అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది.

**యథా లక్ష్మీర్లక్షణైః సా సుపూర్ణాయథా హరిర్లక్షణై ర్వై సుపూర్ణః ।**
**యథా వాయుర్లక్షణైః పూర్ణ ఏవయథా గాయత్రీ లక్షణైః సా సుపూర్ణా ॥2॥**

ఎట్లు లక్ష్మి సులక్షణాలతో పూర్ణురాలో, ఎట్లు హరి లక్షణాలతో పూర్ణుడో, ఎట్లు వాయువు లక్షణాలతో పూర్ణుడో, గాయత్రి ఎట్లో, అట్లే ఆమె కూడా లక్షణాలతో సంపూర్ణురాలు.

**యథా రుద్రాద్యా లక్షణైర్వై ప్రపూర్ణాః రుద్రాదివల్లక్ష్మణా చైవ పూర్ణా ।**
**గుణేనైవం ధర్మతః కించిదేవ తథాను సంధానాద్ధ్రియతే నామ చాపి ॥3॥**

ఏ విధంగా రుద్రాదులు లక్షణాలతో ప్రపూర్ణులో, అట్లే లక్ష్మణ కూడ పూర్ణురాలు. ఇట్లు గుణప్రపూర్ణత చేతను కొద్దిపాటి ధర్మం చేతను, ఆమె నామం కూడ అనుసంధానంచే ఆదరించబడుతోంది. (కీర్తించబడుతోంది)

**తస్మాదాహుర్లక్ష్మణేత్యేవ సర్వేతల్లక్షణం శృణు చాదౌ ఖగేంద్ర ।**
**నారాయణే పూర్ణ గుణే రమేశేద్వాత్రింశత్సంఖ్యాని సులక్షణాని ॥4॥**

ఖగేంద్ర! అందువలన అందరు ఆమెను లక్ష్మణ అని పిలుస్తారు. ముందు ఆ లక్షణాలను విను. పూర్ణగుణుడైన రమేశుడగు నారాయణునిలో ముప్పది రెండు సులక్షణాలు(ఉన్నాయి).

**సంత్యేవ పక్షీంద్ర వదామ్యనుక్రమాన్మత్తః శ్రుత్వా మోక్షమాప్నోతి నిత్యమ్ ।**
**యః సప్త పాదాః షణ్ణవత్యంగులోఽంగశ్చతుర్భస్తః పురుష స్తీక్ష్ణదండః ॥5॥**

పక్షీంద్రా! అన్ని లక్షణాలు ఉన్నాయి. వాటిని క్రమానుసారంగా చెప్తున్నాను. నావలన విని నిత్యమూ మోక్షం పొందుతున్నాడు. (ఏడడుగులు) ఏడు పాదాలు కలిగినవాడు. తొంబదియారు అంగుళాల అవయవాలు (శరీరం), నాలుగు చేతులు, తీక్ష్ణదంతాలు కలిగిన పురుష డతడు.

**య ఏతత్సర్వం మిలితం చైకమేవ హరే ర్విష్ణో ర్లక్షణం చాహురార్యాః ।**
**ముఖం స్నిగ్ధం వర్తులం పుష్టిరూపం ద్వితీయం తల్లక్షణం చాహురార్యాః ॥6॥**

దీనినంతను కలిపి, హరియగు విష్ణువుయొక్క లక్షణంగా ఆర్యులు చెప్తున్నారు. స్నిగ్ధమైన, పుష్టిగానున్న, వర్తులాకారముఖం రెండవ లక్షణంగా ఆర్యులు చెబుతున్నారు.

**హనుర్యస్యానున్నతంచాస్తి వీంద్ర తల్లక్షణం ప్రాహురార్యా స్తృతీయమ్ ।**
**యద్దంతా వై తీక్ష్ణసూక్ష్మాశ్చ సంతి తల్లక్షణం చాహురార్యా చతుర్థమ్ ॥7॥**

ఎవని యొక్క హనువు(దవడ) మిక్కిలి ఎత్తుగా ఉండదో, ఆ లక్షణం మూడవ దానినిగా ఆర్యులు చెబుతున్నారు. ఎవరి దంతములయితే తీక్ష్ణములుగాను, సూక్ష్మములుగాను ఉంటాయో, ఆ లక్షణం నాలుగో లక్షణంగా ఆర్యులు వచిస్తారు.

**యస్యాధరే రక్తిమాత్వస్తి వీంద్రతల్లక్షణం పంచమం చాహురార్యాః ।**
**యస్య హస్తౌ అతిరక్తాః ఖగేంద్రతల్లక్షణం ప్రాహురార్యాశ్చ షష్ఠమ్ ॥8॥**

పక్షీంద్రా! ఎవరియొక్క పెదవియందు ఎఱ్ఱదనం ఉంటుందో దానిని అయిదో లక్షణంగా ఆర్యులు చెప్పుచున్నారు. ఖగేంద్రా! ఎవని హస్తాలు మిక్కిలి ఎఱ్ఱగా ఉంటాయో దానిని ఆరో లక్షణంగా ఆర్యులు వచిస్తారు.

**యస్మిన్నఖాః సంతి రక్తాః సుశోభాస్తల్లక్షణం సప్తమం చాహురార్యాః ।**
**యస్మిన్ కపోలే రక్తిమాత్వస్తి వీంద్రతల్లక్షణం హ్యష్టమం ప్రాహురార్యాః ॥9॥**

గోళ్లు మిక్కిలి శోభాయమానాలై ఎఱ్ఱగా ఉండటాన్ని, ఏడో లక్షణంగా ఆర్యులు చెబుతారు. పక్షీంద్రా! కపోలము (చెక్కిలి) నందు ఎఱ్ఱని కాంతి ఉండటాన్ని ఎనిమిదో లక్షణంగా ఆర్యులు చెబుతారు.

**యస్మిన్ కరే శంఖ చక్రాది రేఖావర్తంతే తన్నవమం ప్రాహురార్యాః ।**
**యస్యోదరం తంతు రూపం సుపుష్టం వలిత్రయై రంకితం సుందరం చ ॥10॥**

కరమునందు శంఖ చక్రాది రేఖలు ఉండటాన్ని తొమ్మిదో లక్షణంగా ఆర్యులు చెబుతారు. మిక్కిలి పుష్టి కలదై, సుందరమై, దారపు పోగుల వంటి మూడు వళులతో ఉదరం ఉండటం....

**తల్లక్షణం దశమం ప్రాహురార్యా ఏకాదశం నిమ్ననాభిం తదాహుః ।**
**ఊరుద్వయం యస్య చ మాంసలం వైతల్లక్షణం ద్వాదశం ప్రాహురార్యాః ॥11॥**

పదో లక్షణంగా ఆర్యులు చెబుతారు. లోతైన నాభి ఉండుట పదకొండో లక్షణంగా వచిస్తారు. రెండు తొడలు మాంసంతో బలిసి ఉండటం పండ్రెండో లక్షణంగా వక్కాణిస్తారు.

**కటిర్హి దీర్ఘా పృథులాస్తి యస్యత్రయోదశం లక్ష్మ తదాహురార్యాః ।**
**యస్యాస్తి ముష్కో సుపరిష్ఠితో వైచతుర్దశం లక్ష్మ తదాహురార్యాః ॥12॥**

కటిప్రదేశం పొడవుగాను, పెద్దదిగాను ఉండటం పదమూడో లక్షణంగా ఆర్యులు చెబుతారు. వృషణం చక్కని స్థితిలో ఉండటం పదునాలుగో లక్షణంగా ఆర్యులు చెబుతారు.

**సమున్నతం శిశ్న మథో హి లక్ష్మయస్యాస్తి తత్ పంచదశం వదంతి ।**
**సుతామ్రకం పాదతలం ఖగేంద్ర  తల్లక్షణం షోడశం ప్రాహురార్యాః ॥13॥**

శిశ్నం మిక్కిలి పొడవుగా ఉండటం పదిహేనో లక్షణంగా వచిస్తారు. ఖగేంద్రా! చక్కని రాగి వంటి పాద తలం పదహారో లక్షణంగా ఆర్యులు చెబుతారు.

**నిమ్నౌ చ గుల్ఫౌ సప్తదశం తదాహుర్గ్రీవారూపం ప్రాహురష్టాదశం చ ।**
**ఏకోనవింశం త్వక్షి పద్మం సురక్తం ప్రాహుర్బాహుం జాను వింశం తథైవ ॥14॥**

గుల్ఫములు లోతుగా ఉండుట పదిహేడో లక్షణంగా చెబుతారు. గ్రీవాభాగంకూడ నిమ్నంగా నుండుట పద్దెనిమిదో లక్షణం. మిక్కిలి ఎర్రనైన పద్మాలవంటి నేత్రాలు ఉండుట పందొమ్మిదో లక్షణం. బాహువులు, జానువులు అట్లే ఉండుట ఇరవయ్యవ లక్షణంగా చెబుతారు.

**విస్తీర్ణోరశ్చైకవింశం తదాహుః సింహో(హ) స్కంధం ద్వ్యుత్తరం వింశమాహుః ।**
**త్రయోవింశం సూక్ష్మమాస్యం తదాహుశ్చతుర్వింశం సుప్రసన్నే చ దృష్టీ ॥15॥**

విశాలమైన వక్షం కలిగియుండుట ఇరవై ఒకటో లక్షణంగాను, సింహస్కంధం ఇరవైరెండో లక్షణంగాను, చిన్నదైన నోరు ఉండుట ఇరవైమూడో లక్షణంగాను, సుప్రసన్నములైన నేత్రములుండుట ఇరవైనాలుగో లక్షణంగాను వచిస్తారు.

**హ్రస్వం లింగం మార్దవం చాపి వీంద్రతల్లక్షణం పంచవింశం వదంతి ।**
**సమౌ చ పాదౌ కటి జాను చోరూషడ్వింశమాహుశ్చ సమే చ జంఘే ॥16॥**

పక్షీంద్రా! మృదువైన, చిన్నది(పొట్టి)గా ఉండే లింగం ఉండుట ఇరవైఅయిదో లక్షణంగా చెబుతారు. సమానపాదాలు, కటి ప్రదేశం, జానువులు, ఊరువులు, కలిగియుండుట ఇరవైఆరో లక్షణంగా చెబుతారు. సమానములైన జంఘులు రెండును....

**సమాన హస్తౌ సమకర్ణౌ మిలిత్వా ద్వాత్రింశత్కం లక్షణం ప్రాహురార్యాః ।**
**ద్వాత్రింశత్కం లక్షణం వై ముకుందేద్వాత్రింశత్కం లక్షణం వై రమాయామ్ ॥17॥**

సమానములైన హస్తాలు రెండును, సమానములైన కర్ణాలు రెండును కలిపి ముప్పైరెండు లక్షణాలుగా ఆర్యులు చెబుతారు. ముప్పదిరెండు లక్షణాలు ముకుందుని యందును, అవే ముప్పదిరెండు లక్షణాలు రమాదేవి యందును ఉన్నాయి.

**ద్వాత్రింశత్కం లక్షణం బ్రహ్మణోఽపి తద్భారత్యాః ప్రవదంత్యేవ సత్యమ్ ।**
**తథా చ శంకా సమమేవ చక్రిణేత్యేవం సదా మా కురు నిర్ణయం బ్రువే ॥18॥**

బ్రహ్మకు కూడ ఈ ముప్పది రెండు లక్షణాలు ఉన్నట్లే, భారతికి కూడ అట్లే ఉన్నాయని వచిస్తారు. అది సత్యమే. అయినప్పటికి ఒక అసమానం ఉంది. ఇట్లు చక్రితో సమానంగా ఎప్పుడు నిర్ణయం చేయవద్దు. చెప్తున్నాను.

**ఏకస్య వై లక్షణస్యాపి విష్ణోర్లక్ష్మీర్రంతం నైవ సమ్యక్ ప్రపేదే ।**
**అతోఽనంతై ర్లక్షణైః సంయుతం చ హరిం చాహు ర్లక్షణజ్ఞాః సదైవ ॥19॥**

విష్ణువుయొక్క ఏ ఒక్క లక్షణాన్నీ, లక్ష్మి పూర్తిగా పొందలేదు. అందువల్ల అనంత లక్షణాలతో కూడుకొన్న వానిగా హరిని లక్షణజ్ఞులు ఎప్పుడు చెప్తుంటారు.

**జానాతి లక్ష్మీ ర్లక్షణం వాయురూపేస్వాపేక్షయా హ్యతిరిక్తం ఖగేంద్ర ।**
**స్వలక్షణాపేక్షయా భారతీ తుశతగుణైరధికా వేధసోఽపి ॥20॥**

ఖగేంద్రా! లక్ష్మి తన లక్షణాపేక్షచే వాయువుకన్న మిక్కిలి అధికురాలు భారతి కూడ స్వలక్షణాపేక్షచే బ్రహ్మ కన్న వంద (నూరు) రెట్లు అధికురాలు.

**ఖగేంద్ర తస్మాల్లక్షణే సామ్య చిత్తం విశ్వాదీనాం సర్వదా మా కురుష్వ ।**
**అష్టావింశతిం ప్రాహూ రుద్రాదికానాం భ్రూనేత్రయో ర్లక్షణేనైవ హీనః ॥21॥**

పక్షీంద్రా! అందువలన లక్షణములందు పోలికను విశ్వాదుల విషయంలో (గణదేవతల) ఎల్లప్పుడు చేయవద్దు. రుద్రాదులకు ఇరవైఎనిమిది లక్షణాలు ఉన్నట్లుగా చెబుతారు. అందు కనుబొమలు, కన్నుల విషయంలో తక్కువతనం గోచరిస్తుంది.

**అలక్షణం మన్యతే యద్ధి తస్య దుర్లక్షణం నైవ తచ్చింతనీయమ్ ।**
**అష్టావింశతిం లక్షణం వై హరస్య న భారతీవచ్చింతనీయం ఖగేంద్ర ॥22॥**

రుద్రునకు ఆ లక్షణాలు లేకపోవడమనేది చెడ్డలక్షణంగా మాత్రం భావింపరాదు. ఖగేంద్రా! హరునకు ఇరవై ఎనిమిది లక్షణాలు చెప్పబడినవి. భారతీదేవికివలె ఊహింపరాదు.

**అతో హరః క్రోధరూపీ సదైవ తయోరభావాత్ సత్యముక్తం తథైతత్ ।**
**అతో ద్వయం నాస్తి రుద్రే ఖగేంద్రశిశ్నోదరే కించిదాధిక్యమస్తి ॥23॥**

హరుడు ఎల్లప్పుడును క్రోధరూపుడే కదా! (భారతికి) అవి లేకపోవుట వలన అట్లు సత్యం చెప్పబడినది. ఖగేంద్రా! అందువలన రుద్రునియందు ఆ రెండు గుణాలు లేవు. శిశ్నోదరములందు మాత్రం కొద్ది ఆధిక్యం ఉంది.

**సప్తాధికైర్వింశతి లక్షణైస్తుసమాయుతాః స్వస్త్రియో లక్ష్మణాద్యాః ।**
**షడ్వింశత్యా లక్షణైశ్చాపి యుక్తావారుణ్యాద్యా పంచవింశైశ్చ చంద్రః ॥24॥**

తన స్త్రీలయిన లక్ష్మణ మున్నగువారు ఇరవై ఏడు లక్షణాలతో కూడుకొనియున్నారు. వారుణి మున్నగువారు ఇరవైఆరు లక్షణాలతో ఉన్నారు. చంద్రుడు ఇరవైఐదు లక్షణాలు కలిగి ఉన్నాడు.

**అర్థశ్చతుర్వింశతిభిశ్చైవ యుక్తో నాసావాయోర్ద్వ్యధికా వింశతిశ్చ ।**
**లక్షణైశ్చైక వింశత్యా శచీయుక్తా న సంశయః ॥25॥**

అర్థుడు (అర్థము కలిగినవాడు) ఇరవైనాలుగు లక్షణాలు కలిగి ఉంటాడు. నాసావాయువుల అధిదేవతలకు ఇరవై రెండు గుణాలు ఉన్నాయి. శచీదేవి ఇరవై ఒక్క లక్షణాలతో కూడికొనియుంది. సందేహం లేదు.

**ప్రవాహా వింశకైర్యుక్తా యమ ఏకోనవింశకైః ।**
**ప్రాశ్యష్టాదశభిర్యుక్తో దశసప్తయుతో నలః ॥26॥**

ప్రవాహ ఇరవై లక్షణాలతో కూడుకొనిఉంటుంది. యముడు పందొమ్మిది లక్షణాలతో, పాశి(వరుణుడు) పదునెనిమిది లక్షణాలతోను, అగ్ని పదిహేడు లక్షణాలతోను ఉంటారు.

**వైవస్వతః షోడశభిర్మిత్రః పంచదశైర్యుతః ।**
**చతుర్వింశైస్తు ధనపః పావకస్తు త్రయోదశైః ॥27॥**

వైవస్వతుడు పదునారు లక్షణాలతోను, మిత్రుడు పదునైదు లక్షణాలతోను, కుబేరుడు ఇరవై నాలుగు లక్షణాలతోను, పావకుడు పదమూడు లక్షణాలతోను ఉంటారు.

**గంగా ద్వాదశభిర్యుక్తా బుధ ఏకాదశైర్యుతః ।**
**శనిస్తు దశసంఖ్యాకైః పుష్కరో నవభిర్యుతః ॥28॥**

గంగ పంద్రెండు లక్షణాలతో ఉంటుంది.బుధుడు పదకొండు లక్షణాలతో ఉంటాడు. శని అయితే పది లక్షణాలతో కూడి యుంటాడు. పుష్కరుడు తొమ్మిది లక్షణాలతో ఉంటాడు.

**అథ షోడశ సాహస్రం భార్యాస్తు మమ వల్లభాః ।**
**అష్టభిశ్చైవ సంయుక్తాః సప్తభిః పితరస్తదా ॥29॥**

నా ప్రియురాండ్రైన పదహారువేలమంది భార్యలు ఎనిమిది లక్షణాలతో కూడిఉంటారు. పితరులు ఏడు లక్షణాలతో కూడి యుంటారు.

**షడ్భిశ్చ దేవగంధర్వాః పంచభిస్తదనంతరాః ।**
**చతుర్భిః క్షితిపాః ప్రోక్తా స్త్రిభి రన్యే చ సంయుతాః ॥30॥**

దేవ గంధర్వులు ఆరు లక్షణాలతోను, ఆ తరువాతివారు ఐదు లక్షణాలతోను ఉంటారు. భూమీశులు నాలుగు లక్షణాలతోను, మిగిలినవారు మూడు లక్షణాలతోను ఉంటారు.

**ఉదరే కించిదాధిక్యే హ్రస్వే పాదే చ కర్ణయోః ।**
**శిఖాధిక్యం వినా విప్ర భార్యాయాం శివస్య చ ॥31॥**

ఉదరమందు కొద్దిపాటి ఎక్కువతనం, పాదమునందు, కర్ణములయందు హ్రస్వత్వం, శిఖ యందు ఆధిక్యం దోషాలుగా ఉన్నాయి. విప్రా! శివుని యొక్క భార్యయందు మాత్రం వీటికి మినహాయింపు.

**లక్ష్మణాయాం పంచదోషాః శిరో గుల్ఫాదికం వినా ।**
**నాభ్యాధిక్యే సహైవాష్టౌ దోషాః సంత్యతి వాహికే ॥32॥**

లక్ష్మణయందు ఈ అయిదు దోషాలు ఉన్నాయి. శిరస్సునందు, గుల్ఫాదికమునందు మినహాయిస్తే నాభి యందు ఆధిక్యంతో కలిపి, ఈ ఎనిమిది దోషాలు అతివాహిక యందు ఉన్నాయి.

**జంఘాధిక్యే సహైవాష్టౌ దోషాః శచ్యాః సదా స్మృతాః ।**
**ఏవమేవ హి దోషాశ్చా ప్యూహనీయాః ఖగేశ్వర ॥33॥**

జంఘాధిక్యంతో కలిపి పై ఎనిమిది దోషాలు శచి యందు ఉన్నాయి. ఖగేశ్వరా! ఈ విధంగానే దోషాలు కూడ ఊహింపవలసి ఉన్నాయి.

**దుర్లక్షణైః సదా వీంద్ర సంస్రుతై స్తత్త్వవిద్భవేత్ ।**
**మహోదరో లంబనాభి రీషామాత్రోగ్రదంష్ట్రకః ॥34॥**

పక్షీంద్రా! ఎల్లప్పుడు ఇవి దుర్లక్షణాలుగా వినబడుతున్నాయని తత్త్వజ్ఞానం తెలుపుతుంది. పెద్ద పొట్ట, వ్రేలాడేబొడ్డు ఈషాదండం వంటి (కొయ్యవంటి) భయంకరములైన కోరలు కలిగి ఉండుట....

**అంధకూప గభీరాక్షో లంబకర్ణౌష్ఠ నాసికా ।**
**లంబగుల్ఫో వక్రపాదః కునఖీ శ్యావ దంతకః ॥35॥**

అంధకూపంవంటి లోతైన కన్నులు, వ్రేలాడే చెవులు, పెదవులు, ముక్కు, పొడవైన (వ్రేలాడే) గుల్ఫాలు, వంకరయైన కాళ్లు, చెడ్డవైన గోళ్లు, పిప్పిదంతాలు,

**దీర్ఘజంఘో దీర్ఘశిశ్న స్త్వేకాండశ్చైకనాసికః ।**
**రక్తశ్మశ్రూ రక్తరోమా వక్రాస్యః సంప్రకీర్తితః ॥36॥**

పొడవైన జంఘలు, పొడవైన శిశ్నం, ఒకే వృషణం, ఒకే నాసికా రంధ్రం, ఎఱ్ఱని గడ్డం, ఎఱ్ఱని రోమాలు, వంకరనోరు, ఇవి దోషాలుగా పేర్కొనబడడం జరిగింది.

**దగ్ధ పర్వత సంకాశో రక్త పృష్ఠః కలిః స్మృతః ।**
**అలోమాంసోఽ లోమశిరా రక్తగండ కపోలకః ॥37॥**

మండుచున్న పర్వతంతో సమానమైన ఎఱ్ఱని పృష్ఠభాగం దోషంగా పేర్కొనబడింది. రోమాలులేని అంసభాగం రోమాలు లేని (వెంద్రుకలు లేని) శిరస్సు, ఎఱ్ఱని గండశిలవంటి కపోలముండుట...

**లలాటే పాండుతా నిత్యం వామస్కంధే కరే ఖగ ।**
**క్రూరదృష్టి ర్దుష్టపాద స్తథా వై ఘర్ఘర స్వరః ॥38॥**

ఖగమా! వామ స్కంధమందు, వామ(ఎడమ) కరము నందు, లలాటము నందు నిత్యమూ తెల్లదనం; క్రూరమైన దృష్టి, క్రూరంగా కనిపించే పాదం, అలాగే ఘర్ఘర స్వరం....

**అత్యాశీ చాతిపానశ్చ స్తనౌ శుష్కఫలోపమౌ ।**
**ఊరౌ నవాంజికా రోమః తథా పృష్ఠే చ మస్తకే ॥39॥**

మితిమీరిన భోజనం, మిక్కిలిగా పానం చేయుట, ఎండిపోయిన ఫలాలతో పోల్చదగిన స్తనాలు, ఊరువుల యందు అలాగే పృష్ఠభాగమందు, మస్తకము నందు నల్లటి కాటుక వంటి రోమాలు, కలిగి ఉండుట,

**లలాటే త్రీణి దీర్ఘే తు సమే ద్వౌ సంప్రకీర్తితౌ ।**
**సర్పాకారస్తు యో మత్స్య స్తస్య శిశ్నే ప్రకీర్తితః ॥40॥**

లలాటమందు మూడు పొడవైన రేఖలు, రెండు సమానమైన రేఖలు దోషాలుగా చెప్పబడినాయి. సర్పాకారంగానున్న మత్స్యం వంటి రూపం అతని శిశ్నము నందుండుట....

**పాదత్రాణోపమో మత్స్యో రసనాగ్రే ప్రకీర్తితః ।**
**శిశ్నాకారశ్చ యో మత్స్యో గుదే తస్య ప్రసశ్యతే ॥41॥**

పాదుకతో (చెప్పుతో) పోల్చదగిన మత్స్యంవంటి రూపం నాలుకపై ఉండుట, శిశ్నాకారమైన మత్స్యంవంటి రూపం గుదమునందుండుట....

**వృశ్చికాకార మత్స్యస్తు పదోస్తస్య ప్రశస్యతే ।**
**శ్వాకారశ్చాపి మత్స్యో వై ముఖే తస్య ప్రకీర్తితః ॥42॥**

వృశ్చికం వంటి ఆకారం కల మత్స్యరూపం అతని పాదములందుండుట, శ్వాకారం(కుక్క) వంటి మత్స్య రూపం అతని ముఖము నందుండుట....

**హస్తే తు బహురేఖాః స్యు ర్లోమ నాసాపుటే స్మృతమ్ ।**
**అతిదీర్ఘం తు చాంగుష్ఠం కనిష్ఠం చాతిదీర్ఘకమ్ ॥43॥**

చేతియందు ఎక్కువ గీతలుండుట, నాసాపుటమందు ఎక్కువగా రోమాలుండుట, బొటనవ్రేలు, చిటికెన వ్రేలు మిక్కిలి పొడవుగా ఉండుట....

**దుర్లక్షణం త్వేవమాది కలావస్తి హ్యనేకశః ।**
**సులక్షణాన్యనేకాని మయి సంతి ఖగేశ్వర ॥44॥**

ఇటువంటి దుర్లక్షణాలు కలిలో అనేకాలుగా ఉన్నాయి. ఖగరాజా! అనేకమయిన సులక్షణాలు నాయందు ఉన్నాయి.

**ద్వాత్రింశల్లక్షణం విష్ణో ర్బ్రహ్మాద్యపేక్షయైవ తత్ ।**
**సహాభిప్రాయ గర్భేణ బ్రహ్మణోక్తం తవ ప్రభో ॥45॥**

ప్రభూ! తనకన్న ముప్పదిరెండు లక్షణాలు నీలో అధికంగా ఉన్నాయని బ్రహ్మచేతనే చెప్పబడింది.

**బ్రహ్మోక్తస్య మయోక్తస్య విరోధో నాస్తి సత్తమ ।**
**మయోక్తస్యైవ స వ్యాసః కంబుగ్రీవః ప్రదర్శ్యతే ॥46॥**

శ్రేష్ఠుడా! బ్రహ్మ చెప్పినదానికి నేను చెప్పినదానికి విరోధం లేదు. నాచే చెప్పబడిన దానినే శంఖంవంటి కంఠం కలిగిన అతడు (ఆ వ్యాసుడు) ప్రదర్శించినాడు.

**రక్తాధరం రక్తతాలు చైకీకృత్య మయోదితమ్ ।**
**అతో విరోధో నాస్త్యేవ తథా జ్ఞానాత్ప్రతీయతే ॥47॥**

ఎఱ్ఱని పెదవి, ఎఱ్ఱని తాలువు ఒకటిగా చేసి నాచే చెప్పబడింది. అందువలన విరోధమన్నది లేనేలేదు. అట్లు జ్ఞానంవలన ప్రతీయమానమగుచున్నది.

**సప్తాధికైర్వింశతి లక్షణైస్తుయాః స్త్రియో లక్ష్మణాద్యాః ॥48॥**

**భగే నేత్రే చ హస్తే చ స్తనే కుక్షౌ తథైవ చ ।**
**భారత్యపేక్షయా పంచభిర్న్యూనా త్వస్తి లక్షణైః ॥49॥**

లక్ష్మణాదులైన స్త్రీలు ఉన్నారో, ఇరవైఏడు లక్షణాలతో ఉంటారు. భగము నందు, నేత్రములందు, స్తనములందు, కుక్షియందు భారతీదేవి అపేక్షచే ఐదు లక్షణాలు తక్కువవారు.

**న రుద్రవన్న చాన్యాని లక్షణాని ఖగేశ్వర ।**
**షడ్వింశత్యా లక్షణైశ్చాపి యుక్తా వారుణ్యాః షడ్లక్షణైశ్చైవ హీనా ॥50॥**

ఖగేశ్వరా! రుద్రునికి లేనట్లుగా(రుద్రునివలె కాదు), మిగిలిన లక్షణాలు ఉండవు. ఇరవైఆరు లక్షణాలతో, వారుణి కన్న ఆరు లక్షణాలు తక్కువగా వారు ఉంటారు.

**కర్ణే కుక్షౌ నాసికా కేశపాశేగుల్ఫే భగే కించిదాధిక్యమస్తి ।**
**ఇంద్రో యుక్తః పంచవింశత్యా ఖగేంద్ర సదా హీనో లక్షణైః సప్తసంఖ్యైః ॥51॥**

కర్ణమునందు, కుక్షియందు, నాసికారంధ్రములందు, కేశపాశమందు, గుల్ఫమందు, భగమందు కొద్ది ఆధిక్యం ఉన్నది. ఖగేంద్రా! ఇంద్రుడయితే ఇరవై అయిదు లక్షణాలతో ఉంటాడు. అతడు ఏడు లక్షణాలతో ఎప్పుడు తక్కువవాడు.

**హస్తే పాదే ఉదరే కర్ణయోశ్చశిశ్నే గుల్ఫేత్వధరోష్ఠేధికం చ ।**
**చతుర్వింశత్యా లక్షణైశ్చాపి యుక్తోనాస్తిక్య వాయు స్తద్వదేవాష్టభిశ్చ ॥52॥**

హస్తమునందు, పాదమునందు, ఉదరమునందు, చెవులయందు, శిశ్నమునందు, గుల్ఫమునందు, అధరోష్ఠమునందు ఆధిక్యం ఉన్నది. వాయువు ఇరవై నాలుగు లక్షణాలతో కూడి ఉంటాడు. అట్లే ఎనిమిది లక్షణాలు తక్కువతనం గోచరిస్తుంది.

**నాభ్యాం గుల్ఫే హను రంధ్ర్యోశ్చ స్కంధేద్విజే నేత్రే త్వధరోష్ఠేధికం చ ।**
**త్రయోవింశత్యా లక్షణైశ్చాపి యుక్తాశచీ తథా నవదోషైశ్చ యుక్తా ॥53॥**

నాభియందు, గుల్ఫమునందు, హనువులందు, పాదములందు, స్కంధమునందు, దంతమునందు, నేత్రములందు, అధరోష్ఠమునందు ఆధిక్యం అనేవి అవి. శచీదేవి ఇరవైమూడు లక్షణాలతోను, తొమ్మిది దోషాలతో కూడి ఉంటుంది.

**భగే కేశే హ్యధరోష్ఠే చ కర్ణేజంఘే గండే వక్షసి గుల్ఫయోశ్చ ।**
**తథోత్తరోష్ఠే కించిదాధిక్యమస్తిఏవం విజానాహి ఖగేంద్రసత్తమ ॥54॥**

భగము నందు, కేశమునందు, అధరోష్ఠము నందు, కర్ణములందు, జంఘలయందు, గండభాగము నందు, వక్షము నందు, గుల్ఫములందు ఆ తక్కువతనం కనిపిస్తుంది. పై పెదవియందు కొద్ది ఆధిక్యం ఉంది. ఖగేంద్రసత్తమా! ఈ విధంగా తెలిసికొమ్ము.

**ద్వావింశత్యా లక్షణైః సంయుతస్తుదశభిర్దోషైః ప్రవహో నామ వాయుః ।**
**తథాంగుష్ఠే కించిదాధిక్యమస్తివింశత్యేకాదశభిర్దోషతోర్కః ॥55॥**

ప్రవాహమనే వాయువు ఇరవై రెండులక్షణాలతో, పది దోషాలతో కూడి ఉంటాడు. అట్లే అంగుష్ఠంలో కొద్ది ఆధిక్యం ఉంది. (ఇదికాక) ఇరవై లక్షణాలతోను, పదకొండు దోషాలతోను అర్కుడు ఉంటాడు.

**తద్వింశత్వా లక్షణైః సంయుతస్తుతదా దోషైర్ద్వాదశభిశ్చ యుక్తః ।**
**ఏకోనవింశత్యా లక్షణైశ్చాపి యుక్తస్త్రయోదశభి స్తదభావై ర్యుతోఽగ్నిః ॥56॥**

అట్లు ఇరవై లక్షణాలతో కూడి ఉంటాడు. అలాగే పంద్రెండు దోషాలు కలిగి ఉంటాడు. అగ్ని పందొమ్మిది లక్షణాలతోను, పదమూడు దోషాలతోను ఉంటాడు.

**అష్టాదశభిర్లక్షణైః సంయుతస్తువైవస్వత స్తదభావైశ్చతుర్దశభిః ।**
**మిత్రస్తు సప్త దశభిర్లక్షణైః సంయుతః ఖగ ॥57॥**

వైవస్వతుడు పదునెనిమిది లక్షణాలతోను, పదునాలుగు దోషాలతోను కూడి ఉంటాడు. ఖగమా! మిత్రుడు పదిహేడు లక్షణాలతో కూడి ఉంటాడు.

**సదోషైః పంచదశభిః సంయుక్తో నాత్ర సంశయః ।**
**తైశ్చ షోడశభిర్యుక్తో ధనపో నాత్ర సంశయః ॥58॥**

పదిహేను దోషాలతోను కూడుకొని ఉంటాడు. అందు సంశయం లేదు. కుబేరుడు పదునాలుగు లక్షణాలతో కూడుకొని ఉంటాడు. అందు సంశయం లేదు.

**తదభావైః షోడశభిః సంయుక్తః సంప్రకీర్తితః ।**
**తైః పంచదశభిశ్చైవ యుక్తో ఽగ్రే జ్యేష్ఠపుత్రకః ॥59॥**

అతడు పదహారు దోషాలతో కూడుకొన్నవాడుగా చెప్పబడతాడు. అతని ముందు జ్యేష్ఠపుత్రుడు పదిహేను లక్షణాలతో కూడుకొని ఉంటాడు.

**తైః సప్తదశభి ర్దోషైః సంయుక్తో నాత్ర సంశయః ।**
**తైశ్చతుర్దశభిశ్చైవ గంగా సంపరికీర్తితా ॥60॥**

అతడు పదిహేడు దోషాలతో కూడుకొని ఉంటాడు. అందు సంశయం లేదు. పదునాలుగు లక్షణాలతో గంగ యున్నట్లుగా పేర్కొనబడింది.

**తథాష్టాదశభిర్దోషైః సంయుతా నాత్ర సంశయః ।**
**త్రైస్త్రయోదశభిశ్చైవ సంయుతో బుధ ఏవ తు ॥61॥**

అట్లే ఆమె పద్దెనిమిది దోషాలతో కూడుకొనియుంది. ఇందు సంశయం లేదు. బుధుడయితే పదమూడు లక్షణాలతో కూడుకొని యున్నాడు.

**దోషైరేకోనవింశత్యా సంయుతో నాత్ర సంశయః ।**
**శనిర్వింశతిదోషేణ యుతో ద్వాదశలక్షణైః ॥62॥**

అట్లే పందొమ్మిది దోషాలతో కూడుకొనియున్నాడు. సందేహంలేదు. శని పండ్రెండు లక్షణాలతోను, ఇరవై దోషాలతోను  కూడియున్నాడు.

**లక్షణైరేకాదశభిః పుష్కరః పరికీర్తితః ।**
**ఏకవింశతి సంఖ్యాకైరసద్భావైః ప్రకీర్తితః ॥63॥**

పుష్కరుడు పదకొండు లక్షణాలతో ఉండేవాడుగా పేర్కొనబడినాడు. ఇరవైఒక్క సంఖ్య గల దోషాలతో ఉన్నట్లుగా చెప్పబడినాడు.

**దశభిర్లక్షణైర్యుక్తాః పితరో యే చిరాః ఖగ ।**
**త్రయోవింశతి దోషైశ్చ సంయుతా నాత్ర సంశయః ॥64॥**

ఖగమా! చిరకాలం ఉండే పితరులు పది లక్షణాలు కలిగిఉంటారు. అయితే ఇరవైమూడు దోషాలతో కూడి ఉంటారు. ఇందు సందేహించవద్దు.

**అష్టభిర్లక్షణైర్యుక్తా దేవగంధర్వసత్తమాః ।**
**దోషైశ్చతుర్వింశతిభిః సంయుక్తా పరికీర్తితాః ॥65॥**

దేవ గంధర్వశ్రేష్ఠులు ఎనిమిది లక్షణాలు కలిగి ఉంటారు.ఇరవైనాలుగు దోషాలతోకూడి ఉండేవారుగా చెప్పబడినారు.

**సప్తలక్షణసంయుక్తా గంధర్వా మానుషాత్మకాః ।**
**యైస్తు పంచవింశతిభిర్దోషైః సంయుక్తాః ప్రకీర్తితాః ॥66॥**

మానుష గంధర్వులు ఏడు లక్షణాలతో కూడుకొని ఉంటారు. వారు ఇరవైఐదు దోషాలతో కూడిఉన్నట్లు చెప్పబడినారు.

**షడ్గుణైః క్షితిపాయుక్తా షడ్వింశత్యా చ దోషతః ।**
**తదన్యే పంచభిర్యుక్తా శ్చతుర్భిః కేచిదేవ చ ॥67॥**

భూమీశ్వరులు ఆరు గుణాలతో, ఇరవైఆరు దోషాలతోను కూడిఉంటారు. మిగిలినవారు ఐదు గుణాలతోను, కొందరు నాలుగు గుణాలతోను ఉంటారు.

**త్రిభిః కేచిత్తతో హీనా న సంతి ఖగసత్తమ ।**
**యస్మిన్నరే క్షితిపే వా ఖగేంద్ర ఆధిక్యం యద్దృశ్యతే లక్షణస్య ॥68॥**

**న తే నరాః నైవ తే క్షితీశాః సర్వే నైవ హ్యుత్తమాః సర్వదైవ ।**
**యే దేవా యే చ దైత్యాశ్చసర్వే ఉ ప్యేవం ఖగాధిప ॥69॥**

కొందరు మూడు గుణాలతో ఉంటారు. పక్షిశ్రేష్ఠమా! అంతకన్న తక్కువ గుణాలతో ఎవరును ఉండరు. ఏ నరుని యందైనా లేక ఏ భూమీశునియందైనా, ఖగరాజా! లక్షణాలకు ఆధిక్యం గోచరిస్తే, వారు నరులును కారు, క్షితీశులును కారు (అంతకన్న ఎక్కువవారు.) అందరును ఎల్లప్పుడు ఎక్కువగు గుణాలతో కూడుకొని (ఉత్తములు) ఉండరు. ఖగరాజా! ఎవరయితే దేవతలో, ఎవరయితే దైత్యులో, అందరును ఈ విధంగా గ్రహింపబడతారు.

**లక్షణాలక్షణైశ్చైవ క్రమేణోక్తా న సంశయః ।**
**లక్షణైః సప్తవింశత్యాఉ లక్షణైః సంయుతా ఖగ ॥70॥**

లక్షణాలచేతను, అలక్షణాలచేతను ఇట్లు ఉండేవారు క్రమంగా చెప్పబడినారు. సందేహం లేదు. ఖగమా! ఇరవై ఏడు లక్షణాలతోను మిగిలిన అలక్షణాల చేతను ఆమె కూడుకొని యుంది.

**అతః సలక్షణా జ్ఞేయా ద్వాత్రింశల్లక్షణైర్నహి ।**
**పితుర్గేహే వర్ధమానా సదాపి స్వకుటుంబం శ్రేష్ఠయితుం ఖగేంద్ర ॥71॥**

**ఉవాచ సా పితరం దీయమానమన్నాదికం పుత్రమిత్రాదికేషు ।**
**సదాపి యే త్వనుసంధానేన యుక్తాఅంతర్గతే తత్ర తత్ర స్థితే చ ॥72॥**

**అజ్ఞాతత్వే చాన్నపానాదికం దత్తం సంతో వ్యర్థమేవం వదంతి ।**
**హరిం వక్ష్యే తత్ర తత్ర స్థితం చ తం వై శృణు త్వాదరేణాద్య నిత్యమ్ ॥73॥**

ముప్పదిరెండు లక్షణాలు లేకపోయినప్పటికినీ ఆమె సులక్షణురాలు. ఖగేంద్రా! తండ్రి గృహమందు పెరుగుతున్నను ఎల్లప్పుడు ఆమె తమ కుటుంబం ఉత్కర్షతోనుండుటకై, (తన) పుత్రమిత్రాదులకు అన్నాదికాలను సమకూర్చుచున్న తండ్రితో ఆమె ఇట్లు పలికింది. కనిపించినా కనిపించకపోయినా ఎల్లప్పుడు ఎవరయితే హరితో అనుసంధానసంయుక్తులై ఉంటారో వారికి తెలియనితనంతో అన్నపానాదికాలు ఇస్తున్నావు. సత్పురుషులు దీనినంతను వ్యర్థమని చెబుతారు. ఎక్కడయినా అంతా ఉండే హరిని గూర్చి చెప్తున్నాను. నిత్యం భక్తితో ఆ విషయం విను.

**బాలో హరిర్బాలరూపేణ కృష్ణః క్షీరాదికం నవనీతం ఘృతం చ ।**
**గృహ్ణాతి నిత్యం భూషణం వస్త్రజాత మేవం దద్యాత్సర్వదా విష్ణుతుష్ట్యై ॥74॥**

హరి బాలుడు, కృష్ణుడు బాలరూపుడై క్షీరాదికాన్ని, వెన్నను, నేతిని నిత్యమూ గ్రహిస్తాడు. అందువలన విష్ణువుయొక్క సంతుష్టి కొరకై నిత్యమూ భూషణాలను, వస్త్రాలను సమర్పిస్తూ ఉండాలి.

**మిత్రైర్హరిః కేశవాఖ్యో ముకుందో భుంక్తే దత్తం త్వన్నపానాదికం చ ।**
**పూర్వం దద్యాత్సర్వదా వై గృహస్థో ధన్యో భవేదన్యథా వ్యర్థమేవ ॥75॥**

సమర్పింపబడిన అన్నపానాదికాలను, కేశవుడనే పేరు కల్గిన ముకుందుడైన హరి మిత్రులతో కలసి భుజిస్తాడు. అందువలన గృహస్థుడైనవాడు మొదట ఎల్లప్పుడు వాటిని హరికి సమర్పించాలి. అతడే ధన్యుడవుతాడు. లేదా అంతా వ్యర్థమే.

**గృహ్ణాతి నిత్యం మాధవాఖ్యో హరిశ్చేత్యేవం జ్ఞాత్వా దేయమన్నాదికం చ ।**
**ఏవం జ్ఞాత్వా దీయమానేన నిత్యం ప్రీణాతి విష్ణుర్నాన్యథా వ్యర్థమేవ ॥76॥**

మాధవుడనే పేరుగల హరి నిత్యమూ వాటిని గ్రహించునని తెలుసుకొని అన్నాదికాలను సమర్పించాలి. ఇట్లు తెలుసుకొని నిత్యమూ అర్పిస్తే విష్ణువు ప్రీతుడవుతాడు. మరొక విధంగా అయితే అంతా వ్యర్థమే.

**గృహే నిత్యం వాసుదేవో హరిస్తు ప్రీణాతి నిత్యం తత్ర తిష్ఠన్ సుపర్ణ ।**
**ఏవం జ్ఞాత్వా స్వగృహం సర్వదైవ అలంకుర్యాద్ధాతురూపైః సదైవ ॥77॥**

సుపర్ణా! వాసుదేవుడైన హరి నిత్యమూ అటువంటివాని ఇంటిలో ఉండి ఎల్లప్పుడు ప్రీతిని ప్రకటిస్తాడు. ఇది తెలిసికొని తన గృహాన్ని సదా ధాతురూపాలతో అలంకరించుకోవాలి.

**గోవిందాఖ్య స్తిష్ఠతి వైష్ణవానాం పుత్రైర్యుత స్తిష్ఠతి వాసుదేవః ।**
**మిత్రే ముకుందః శాలకే చానిరుద్ధో నారాయణో ద్విజవర్యే సదాస్తి ॥78॥**

గోవిందుడనబడే వాసుదేవుడు వైష్ణవుల గృహాలలో పుత్రులతో కూడుకొని ఎల్లప్పుడు ఉంటాడు. మిత్రునియందు ముకుందుడు, శాలకుని యందు అనిరుద్ధుడు, ద్విజశ్రేష్ఠుని యందు నారాయణుడు ఎల్లప్పుడు ఉంటారు.

**గోష్ఠే చ నిత్యం విష్ణురూపీ హరిస్తు అశ్వే సదా తిష్ఠతి వామనాఖ్యః ।**
**సంకర్షణః శూద్రవర్ణే సదాస్తి వైశ్యే ప్రద్యుమ్న స్తిష్ఠతి సర్వదైవ ॥79॥**

గోష్ఠమునందు(పశువుల శాల) విష్ణురూపియైన హరి నిత్యమూ ఉంటాడు. వామనుడనే పేరుగల హరి అశ్వమునందు ఎల్లప్పుడూ ఉంటాడు. సంకర్షణుడు శూద్రజాతియందు నిత్యమూ ఉంటాడు. వైశ్యునియందు ప్రద్యుమ్నుడు ఎల్లప్పుడు ఉంటాడు.

**జనార్దన క్షత్రజాతౌ సదాస్తిదాశేషు నిత్యం మహిదాసో హరిస్తు ।**
**మహ్యాం నిత్యం తిష్ఠతి సర్వదైవహ్యుపేంద్రాఖ్యో హరిరేకః సుపర్ణ ॥80॥**

సుపర్ణా! జనార్దనుడు క్షత్రజాతియందు ఎల్లప్పుడూ ఉంటాడు. దాశులయందు నిత్యమూ ఉంటాడు. హరి మహిదాసుడు. భూమియందు నిత్యమూ ఉంటాడు. ఉపేంద్రుడూ, హరి ఒక్కడే.

**గజే సదా తిష్ఠతి చక్రపాణిః సదాంతరే తిష్ఠతి విశ్వరూపః ।**
**నిత్యం శుని తిష్ఠతి భూతభావనః పిపీలికాయామపి సర్వదైవ ॥81॥**

ఏనుగు నందు ఎల్లప్పుడు చక్రపాణి ఉంటాడు. ప్రతివస్తు మధ్యప్రదేశంలో ఆ విశ్వరూపుడు ఉంటాడు. నిత్యము శునకము నందు భూతభావనుడై ఉంటాడు. చీమలో ఎల్లప్పుడూ ఉంటాడు.

**త్రివిక్రమో హరి రూప్యంతరిక్షే సర్వజాతావనంతరూపీ హరిశ్చ ।**
**హరేర్న వర్ణోఽస్తి న గోత్రమస్తిన జాతిరీశే సర్వరూపే విచిత్రే ॥82॥**

అంతరిక్షమందు హరిరూపియై త్రివిక్రముడుంటాడు. (త్రివిక్రమరూపియై హరి ఉంటాడు.). సర్వజాతుల యందు హరి అనంతరూపాలతో ఉంటాడు. (అంతరాత్మరూపియై). హరికి వర్ణమూ లేదు, గోత్రమూ లేదు. విచిత్రస్వరూపుడగు ఆ ఈశునియందు జాతిలేదు.

**ఏవం జ్ఞాత్వా సర్వదా లక్ష్మణా తు హరిం సదా ప్రీణయామాస దేవీ ।**
**సపర్యయా వై క్రియమాణయా హరిః పతిర్మమ స్యాదితి చింతనేన ॥83॥**

నిత్యమూ ఈ విషయం తెలిసికొని లక్ష్మణాదేవి ఎల్లప్పుడును హరిని సంతోషపరిచింది. సపర్యచేత, కర్మచేత, హరియే నాకు పతి కావాలని ధ్యానించింది.

**తత్యాజ దేహం విష్ణు పతిత్వ కామామద్రేషు వై వీంద్ర పుత్రీ ప్రజాతా ।**
**స్వయంవరే లక్ష్మణాయా అహం చ భిత్వా లక్ష్యం భూపతీన్ ద్రావయిత్వా ॥84॥**

**పాణిగ్రహం లక్ష్మణాయాశ్చ కృత్వా గత్వా పురీం రమయామాస దేవీమ్ ।**
**తథైవాహం జాంబవత్యా వివాహం మత్పత్నీత్వే కారణం త్వాం బ్రవీమి ॥85॥**

విష్ణువునే భర్తగా కోరి దేహాన్ని విడిచిపెట్టింది. పక్షీంద్రా! మద్రదేశమందు, మద్రరాజ పుత్రిగా ఉద్భవించింది. లక్ష్మణాదేవి స్వయంవరమందు నేను లక్ష్యమును భేదించి, రాజులను తరిమివేసి, లక్ష్మణాపాణిగ్రహణం చేసి పురికి(ద్వారకా) వెళ్లి, ఆ దేవిని సంతోషపరచాను. అదే విధంగా జాంబవతీ వివాహాన్నీ ఆమె నాకు పత్నియైన కారణాన్నీ నీకు చెప్తున్నాను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే లక్ష్మణావివాహహేతునిరూపణం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో లక్ష్మణతో వివాహానికి కారణం అనే ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం

## త్రయోవింశోఽధ్యాయః – ఇరవై మూడవ అధ్యాయం

## వేంకటేశగిరియాత్రాక్రమనిరూపణమ్ – వేంకటేశగిరియాత్రాక్రమం

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**సోమస్య పుత్రీ పూర్వసర్గే బభూవభార్యా మదీయా జాంబవతీ మమ ప్రియా ।**
**తాసాం మధ్యే హ్యధికా వీంద్ర కించిత్ రుద్రాదిభ్యః పంచగుణై ర్విహీనా ॥1॥**

పూర్వసర్గమందు సోముని పుత్రిక నా భార్య అయింది. ఇప్పుడు జాంబవతియైన ఆమె నాకు ఇష్టురాలు. పక్షీంద్రా! వారి మధ్యలో కొంచెము అధికురాలు. రుద్రాదులకంటె ఐదు లక్షణాలు తక్కువ కలది.

**యదావేశో బలవాన్స్యాద్రమాయాం తదా నాస ప్రియ తే కేశవోఽలమ్ ।**
**యదావేశాద్ధ్రాసముపైతి కాలేతదా తాసాం సామ్యమాహుర్మహాంతః ॥2॥**

రమయందు ఎప్పుడు బలమైన ఆవేశమున్నచో అప్పుడు ఆ కేశవుడు ప్రియుడుగా ఎఱుగబడుచున్నాడు. కాలగతిలో ఆ ఆవేశం సన్నగిల్లినపుడు, అప్పుడు వారిలో సామ్యం గోచరిస్తుందని మహాత్ములు చెబుతారు.

**లక్ష్మ్యావేశః కించిదస్త్యేవ నిత్యమత ।**
**స్తాభ్యః కించిదాధిక్యమస్తి ॥3॥**

లక్ష్మికి ఆవేశం కొంచెం మాత్రమే ఉంటే, వారిలో నిత్యం కొద్ది ఆధిక్యం గోచరిస్తుంది.

**గరుడ ఉవాచ** – గరుడుడు వచించాడు.

**తాసాం మధ్యే జాంబవతీ తు కృష్ణఆరాధనం కీదృశం సా చకార ।**
**తన్మే బ్రూహి కృపయా విశ్వమూర్తే ఆధిక్యే వై కారణం తాభ్య ఏవ ॥4॥**

కృష్ణా! వారిమధ్యలో జాంబవతి ఏవిధమైన ఆరాధన చేసింది? విశ్వమూర్తీ! నా యందు దయయుంచి ఆ విషయం వివరించు. వారియందుకన్న ఆమెకుగల ఆధిక్యమేమి?

**గరుడేనైవముక్తస్తు భగవాన్ దేవకీసుతః ।**
**మేఘగంభీరయా వాచా ఉవాచ వినతాసుతమ్ ॥5॥**

గరుడుడు ఈవిధంగా పలుకగా భగవంతుడైన దేవకీపుత్రుడు మేఘగంభీరవచనాలతో వినతానందనునితో ఇలా అన్నాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీ కృష్ణుడు వచించాడు.

**యా పూర్వసర్గే సోమపుత్రీ బభూవ పితుర్గృహే వర్తమానాపి సాధ్వీ ।**
**జన్మ స్వకీయం సార్థకం వై చకార పిత్రా సాకం విష్ణుశుశ్రూషణే న చ ॥6॥**

పూర్వసర్గము నందు సోమపుత్రిగా ఉన్న, ఆ సాధ్వి తండ్రిగృహమునందు ఉండి, తండ్రితో కలసి విష్ణు శుశ్రూషణం చేస్తూ తన జన్మను సార్థకం చేసుకొన్నది.

**శుశ్రావ నిత్యం సత్పురాణాని చైవం చక్రే సదా విష్ణుపాదప్రణామమ్ ।**
**చక్రే సదా తారకస్యాపి విష్ణోః ప్రదక్షిణం స్మరణం కుర్వతీ సా ॥7॥**

నిత్యం సత్పురాణాలను వింది. ఎల్లప్పుడు విష్ణుపాదాలకు ప్రణామం చేసింది. నిత్యం తరింపజేసే విష్ణువుకు ప్రదక్షిణం ఆచరించింది. ఆమె విష్ణుస్మరణం ఎల్లప్పుడూ చేసింది.

**పిత్రా సాకం సా తు కన్యా ఖగేంద్ర వైరాగ్య యుక్తా శ్రవణాత్సంబభూవ ।**
**కోశం చ మిత్రం ద్విరదాదికం చ అనర్ఘ్యరత్నాని గృహాదికం చ ॥8॥**

**సర్వం హ్యేతన్నశ్వరం చైవ మేనే మమాధీనం హరిణా వైకృతం చ ।**
**యేనైవ దత్తం పుత్రమిత్రాదికం చ తేనాహృతం వేదనాం నైవ చక్రే ॥9॥**

ఖగేంద్రా! తండ్రితో కలసి ఆ కన్య శ్రవణంవల్ల విరక్తి పొందింది. కోశం, మిత్రులు, ఏనుగు మున్నగు వాటిని, విలువైన రత్నాలను, గృహం మున్నగువాటిని, సమస్తమైనదానిని నశించిపోయేదే అని భావించింది. నా ఆధీనంలో ఉన్నదంతా హరికోసమే చేయబడిందని తలపోసింది. పుత్రమిత్రాదులను ఇచ్చినవాడే దాని నపహరించాడు. అయినా ఆమె వేదన పొందలేదు.

**అద్యైవ విష్ణుః పరమో దయాలుః దయాం మయి కృతవాంస్తే న సుష్ఠు ।**
**పిత్రా సాకం కన్యకా సా తు వీంద్రసదాత్మని హ్యమలే వాసుదేవే ॥10॥**

పరమదయాలుడైన విష్ణువు ఇప్పుడే నాయందు చక్కగా దయ కనబరచు గాక! పక్షీంద్రా! తండ్రితో కలసి కన్యక ఎల్లప్పుడు నిర్మలమైన తన ఆత్మయందు (భక్తితో) వాసుదేవునితో చక్కగా ఏకాత్మతను పొందింది.

**ఏకాంతత్వం సుష్ఠు భక్త్యా గతా సాయదృచ్ఛయా సోపపన్నేన దేవీ ।**
**అకల్పయంత్యాత్మనో వీంద్ర వృత్తిం చకార యత్నావధిరాధం ప్రథైవ ॥11॥**

పక్షీంద్రా! ఆ దేవి యాదృచ్ఛికంగా లభించినదానితో వృత్తిని తనకు సమర్పించుకొన్నదై అవసరార్థం ప్రసిద్ధిగా ధ్యానవృత్తిని చేబట్టింది.

**సా వై విత్తం విష్ణుపాదారవిందే దుఃఖార్ణవాత్తారకే సంచకార ।**
**వాగింద్రియం ఖగ సమ్యక్ చకార హరేర్గుణానాం వర్ణనే వా సదైవ ॥12॥**

ఆమె తన ధనాన్ని విష్ణువుయొక్క పాదారవిందములందే అర్పించింది. దుఃఖమనే సముద్రాన్ని దాటడానికి ప్రయత్నం చేసింది. ఖగమా! వాగింద్రియాన్ని హరి. గుణాలను వర్ణించుటకు భక్తితో ఎల్లప్పుడు సిద్ధం చేసింది.

**హస్తౌ చ విష్ణోర్గృహ సంమార్జనాదౌ చకార దేవీ గాత్రమలాపహారమ్ ।**
**శ్రోత్రం చ చక్రే హరిసత్కథోదయే మోక్షాదిమార్గేహ్యమృతోపమే చ ॥13॥**

ఆ దేవి తనచేతులను విష్ణుదేవాలయాలను తుడిచి శుభ్రపరచుటకు ఉపయోగించి శరీరాన్ని ఆవరించియున్న మలదోషాన్ని పోగొట్టుకొన్నది. అమృతోపమానమైన మోక్షాదిమార్గంలో హరిసత్కథలను వినుటలో వీనులను లగ్నంచేసింది.

**నేత్రం చచక్రే ప్రతిమాదిదర్శనే అనాదికాలీన మలాపహారిణీ ।**
**సద్వైష్ణవానాం స్పర్శనే చైవ సంగే నిర్మాల్యగంధానువిలేపనే త్వక్ ॥14॥**

అనాది కాలం నుండి వచ్చే విష్ణుప్రతిమను సందర్శించుటయందు నేత్రాలను సంసక్తం చేసింది. తన శరీరాన్ని (చర్మాన్ని) సద్వైష్ణవులను తాకుటతోను, వారి సంగమునందును, నిర్మాల్యగంధమును మైపూతగా పూసుకొనుట యందు వినియోగించింది.

**ఘ్రాణేంద్రియం సా హరిపాదసారే చకార సంసారవిముక్తిదే చ ।**
**జిహ్వేంద్రియం హరినైవేద్యశేషే శ్రీమత్తులస్యాది విమిశ్రితే చ ॥15॥**

సంసారవిముక్తినిచ్చే హరిపాదసువాసనలను ఆఘ్రాణించుటయందు తన నాసేంద్రియాన్ని ఉపయోగించింది. శోభ కలిగించే తులసి మున్నగువాటితో కలసిన హరినైవేద్యశేషాన్ని భుజించుటయందు జిహ్వను సమాయత్తపరచింది.

**పాదౌ హరేః క్షేత్రపథానుసర్పణే శిరో హృషీకేశపదాభివందనే ।**
**కామం హృదాస్యే తు హరిదాస కామ్యాతథోత్తమ శ్లోకజనాశ్చరంతి ॥16॥**

హరియొక్క క్షేత్రమార్గాలలో సంచరించుటయందు పాదాలను, హృషీకేశుని పాదాలకు నమస్కరించుటలో శిరస్సును వినియోగించింది. హరిదాస సేవతో హృదయమనే పీఠమందు కోరికను పెంచింది. ఉత్తమ శ్లోకజనులు చరించే మార్గంలో సంచరించింది.

**నిష్కామరూపే చ మతిం చకారవాగింద్రియం స్తవనం స్వీచకార ।**
**ఏవం సదా కార్య సమూహమాత్మనాసమర్పయిత్వా పరమేశ పాదయోః ॥17॥**

బుద్ధిని నిష్కామపద్ధతిలో ఉపయోగించింది. వాగింద్రియాన్ని స్తవనానికి అంకితం చేసింది. ఇట్లు ఎల్లప్పుడు మనస్సుచే కార్యరూపమునంతనూ పరమేశుని పాదాలకు సమర్పించింది.

**తీర్థాటనం తు జగామ పిత్రాసాకం హరేః ప్రీణనాద్యర్థమేవ ।**
**ఆరాధయిత్వా బ్రాహ్మణాన్ విష్ణుభక్తాన్ ఆదౌ గృహే వస్త్రసంభూషణాద్యైః ॥18॥**

ముందు తన గృహమందు వస్త్రాలతో, అలంకారాలతో, విష్ణుభక్తులైన బ్రాహ్మణులను ఆరాధించి, హరిని సంతోషపరచటానికై తండ్రితో కలసి తీర్థాటనకై బయలుదేరింది.

**పశ్చాత్కల్పం కారయామాస దేవీ విష్ణోరగ్రే తీర్థయాత్రార్థమేవ ।**
**యావత్కాలం తీర్థయాత్రా ముకుంద తావత్కాలం తూర్ధ్వరేతా భవామి ॥19॥**

ఆ తరువాత ఆ దేవి తీర్థయాత్రకోసమై విష్ణువు ఎదుట సంకల్పం చేసింది. ముకుందా! ఎంతకాలం తీర్థయాత్ర కొనసాగుతుందో, అంతకాలం ఊర్ధ్వరేతస్కురాలనై ఉంటాను.

**యావత్కాలం తీర్థయాత్రాం కరిష్యే తావద్దత్తాద్వైష్ణవానాం చ సంగమ్ ।**
**హరేః కథాశ్రవణం స్యాన్ముకుంద నావైష్ణవానాం సంగినామంగసంగమ్ ॥20॥**

ఎంతకాలమయితే తీర్థయాత్ర చేస్తానో, అంతకాలం వైష్ణవులతో సాంగత్యమే చేస్తాను. ముకుందా! హరికథా శ్రవణం మాత్రమే చేస్తాను. వైష్ణవులు కానివారితోను, చెడు సంగతి కలిగిన వారితోను సాంగత్యం చేయను.

**సుహృజ్జనైః పుత్రమిత్రాదికైశ్చ తీర్థాటనం నైవ కుర్యాం ముకుంద ।**
**కుర్వంతి యే కామ్యయా తీర్థయాత్రం తేషాం సంగం కురు దూరే ముకుంద ॥21॥**

ముకుందా! సుహృజ్జనాలతోను, పుత్రమిత్రాదికులతోను, తీర్థాటనం నేను చేయను. ముకుందా! ఎవరయితే కామ్యబుద్ధితో తీర్థయాత్ర చేస్తారో, వారితో సాంగత్యం నాకు దూరం చేయవలసింది.

**శాలగ్రామం యే విహాయైవ యాత్రాం కుర్వంతి తేషాం కిం ఫలం ప్రాహురార్యాః ।**
**యదా తీర్థానాం దర్శనం స్యాత్తదైవశాలగ్రామం పురతః స్థాపయిత్వా ॥22॥**

శాలగ్రామాన్ని విడచి తీర్థయాత్ర చేస్తే వారికి ఏం ఫలం కలుగుతుందని(ఫలం కలగదని) ఆర్యులు చెబుతారు? అందువల్ల శాలగ్రామాన్ని ముందుంచుకొని, తీర్థయాత్రా సందర్శనం (తీర్థదర్శనం) చేస్తాను.

**తీర్థాటనం పాదచరైః కృతం చేత్ పూర్ణం ఫలం ప్రాహురార్యాః ఖగేంద్ర ।**
**పాదత్రాణం పాదరక్షాం చ కృత్వా తీర్థాటనం పాదహీనం తదాహుః ॥23॥**

ఖగేంద్రా! పాదచారులై తీర్థాటనం చేస్తే, సంపూర్ణమైన ఫలితమని ఆర్యులు వచిస్తారు. పాదాలకు తొడుగులు (మేజోళ్లు), పాదరక్షలు ధరించి చేసే తీర్థయాత్ర పాదాలు లేనివాడు చేసే తీర్థయాత్ర అని వారు చెబుతారు.

**యో వాహనే తురగే చోపవిష్టస్తీర్థాటనం కురుతే చార్ధహీనమ్ ।**
**వృషాదీనాం వాహనే పాదమాహుః పరాన్నానాం భోజనే వ్యర్థమాహుః ॥24॥**

వాహనమందు కాని, తురగమందు గాని కూర్చొని తీర్థయాత్రచేస్తే వానికి సగం ఫలితం పోతుంది. ఎద్లబండి మున్నగు వానిపై యాత్రచేస్తే నాలుగోవంతు ఫలితమే వస్తుంది. పరాన్నభోజనం వ్యర్థమని చెబుతారు.

**మహాత్మనాం వేదవిదాం యతీనాం పరాన్నానాం భోజనే నైవ దోషః ।**
**సంకల్పయిత్వా పరమాదరేణజగామ సా తీర్థయాత్రార్థమేవ ॥25॥**

మహాత్ములవద్ద, వేదవిదులవద్ద, యతులవద్ద పరాన్నభోజనంలో దోషంలేదు అని పరమ ప్రీతితో సంకల్పం చేసి, ఆమె తీర్థయాత్ర కోసమై వెళ్లింది.

**ఆదౌ స్నాత్వా హరి నిర్మాల్యగంధం విసర్జయిత్వా శ్రవణం వై చకార ।**
**పిత్రా సాకం భోజనం చాపి కృత్వాఽగ్రే దినే క్రోశమేకం జగామ ॥26॥**

ముందు స్నానంచేసి, హరినిర్మాల్యగంధాన్ని విసర్జించి, హరిని గూర్చి శ్రవణం చేసింది. తండ్రితో కలసి భోజనం కూడ చేసి మొదటి రోజున ఒక కోసు దూరం వెళ్లింది.

**తత్ర ద్విజాన్పూజయిత్వాన్నపానం రాత్రౌ తత్త్వం శ్రావయామాస దేవీ ।**
**ఏవం యాత్రాం యే ప్రకుర్వంతి నిత్యం తేషాం యాత్రాం సఫలాం ప్రాహురార్యాః ॥27॥**

అక్కడ ద్విజులను అన్నపానాలతో పూజించి, ఆ దేవి రాత్రియందు తత్త్వం వింది (వినిపించింది.) ఈ విధంగా ఎవరు యాత్రను చక్కగా చేస్తారో, వారి యాత్ర సఫలమవుతుందని ఆర్యులు వచిస్తారు.

**వినా దయాం తీర్థయాత్రా ఖగేంద్రవ్యర్థేత్యేవం వీంద్ర చాహుర్మహాంతః ।**
**దివా రాత్రౌ యే న శృణ్వంతి దివ్యాం హరేః కథాం తీర్థమార్గే ఖగేంద్ర ॥28॥**

ఖగేంద్రా! దయలేకుండగా చేసే తీర్థయాత్ర వ్యర్థమని మహాత్ములు చెబుతారు. పక్షీంద్రా! ఖగరాజా! తీర్థమార్గంలో రాత్రి, పగలు ఎవరు దివ్యమైన హరికథను వినరో,

**వ్యర్థం వ్యర్థం తస్య చాహుర్గతం వై అశ్వాదీనాం వాహనానాం చ విద్ధి ।**
**అశ్వాదీనామపరాధం వదస్వ గంగాదీనాం దర్శనాత్పాపనాశః ॥29॥**

అతని గమనం వ్యర్థం, వ్యర్థం అని చెబుతారు. అశ్వాదులకు, వాహనాలకు కూడ అట్లే అని గ్రహించు. అశ్వాదులకు (వినియోగంలో) అపరాధప్రాయశ్చిత్తం చెప్పమంటే గంగ మున్నగువాటి దర్శనంవల్ల పాప నాశమవుతుంది.

**క్షేత్రస్థ విష్ణోర్దర్శనాత్పాపనాశో మార్జారస్యాప్యపరాధం వదస్వ ।**
**క్షేత్రస్థ విష్ణోః పూజనాత్పాపనాశః పూజావతామపరాధం వదస్వ ॥30॥**

క్షేత్రస్థుడైన విష్ణువుయొక్క దర్శనం వల్ల, మార్జారదర్శనంవల్ల కలిగే దోష ప్రాయశ్చిత్తం చెప్పమంటే ఆ విషయంలో అపరాధముంటే పాపనాశనమవుతుంది. పూజచేయువారి అపరాధమును చెప్పమంటే క్షేత్రస్థుడైన విష్ణువుయొక్క పూజనంవల్ల ఆ పాపం నాశనమవుతుంది.

**జపాదీనాం కుర్వతాం పాపనాశో విష్ణోర్ధ్యానాత్సద్య ఏవాఘనాశః ।**
**అనుసంధానాద్రహితం సర్వమేవ కృతం కర్మ వ్యర్థమేవేతి చాహుః ॥31॥**

జపాదులు చేసేవారి అశ్రద్ధాపాపనాశనమెట్లంటే, విష్ణుధ్యానంవల్ల వెంటనే అఘనాశనమవుతుంది. చిత్తానుసంధానం లేకుండచేసిన కర్మ అంతయూ వ్యర్థమే అని చెబుతారు.

**అతో హరేః పాపవినాశనీయం కథాం శ్రుత్వా విష్ణోర్భక్తిమాన్ స్యాత్ఖగేంద్ర ।**
**దృష్ట్వా దృష్ట్వా హరిపాదాంకితం చ స్మృత్వా స్మృత్వా భక్తిమాన్ స్యాత్ఖగేంద్ర ॥32॥**

ఖగేంద్రా! అందువల్ల హరియొక్క పాపవినాశకమైన కథను విని విష్ణువునందు భక్తి కల్గినవాడవుతాడు. హరిపాదాలకు సమర్పింపబడిన ద్రవ్యాన్ని పదేపదే చూచి, ఖగేంద్రా! పదే పదే స్మరించి భక్తి కల్గినవాడవుతాడు.

**పిత్రా సాకం కన్యకా సాపి వీంద్రశేషాచలస్థం శ్రీనివాసం చ ద్రష్టుమ్ ।**
**జగామ సా మార్గమధ్యే హరిం చ సా చింతయామాస రమాపతిం చ ॥33॥**

పక్షీంద్రా! ఆ కన్యక తండ్రితో కలసి శేషాచలంపైనున్న శ్రీనివాసుని దర్శించుటకు వెళ్లింది. ఆమె మార్గ మధ్యంలో రమాపతియైన హరిని ధ్యానించసాగింది.

**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య వక్షః శ్రీవత్సరత్నైర్భూషితం విస్తృతం చ ।**
**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య తుందం వలిత్రయేణాంకితం సుందరం చ ॥34॥**

శ్రీవత్సంతో, రత్నాలతో అలంకరించబడి, విశాలమైన శ్రీనివాసుని వక్షమును ఎప్పుడు దర్శింపగలను? మూడు వళులతో ముద్రితమైన సుందరమైన శ్రీనివాసుని ఉదరాన్ని ఎప్పుడు వీక్షింపగలను?

**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య కంఠం మహర్లోకస్యాశ్రయం కంబుతుల్యమ్ ।**
**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య నాభిం సదాంతరిక్షస్యాశ్రయం వై సుపూర్ణమ్ ॥35॥**

మహర్లోకానికి ఆశ్రయమై, శంఖంతో సమానమైన, శ్రీనివాసుని కంఠాన్ని ఎప్పుడు చూడగలను? ఎల్లప్పుడు అంతరిక్షానికి ఆశ్రయమైన, మిక్కిలి గుండ్రంగా ఉండే శ్రీనివాసుని నాభిని ఎప్పుడు సందర్శింపగలను?

**కదా ద్రక్ష్యే వదనం వై మురారేర్జనలోకస్యాశ్రయం సర్వదైవ ॥36॥**

జనలోకానికి ఆశ్రయమైన మురారియొక్క వదనాన్ని ఎల్లప్పుడు ఎప్పుడు వీక్షింపగలను?

**శిరః కదా శ్రీనివాసస్య ద్రక్ష్యే సత్యస్య లోకస్యాశ్రయం సర్వదైవ ।**
**కటిం కదా శ్రీనివాసస్య ద్రక్ష్యే భూర్లోకస్యాశ్రయం సర్వదైవ॥37॥**

ఎల్లప్పుడు సత్యలోకానికి ఆశ్రయమైన శ్రీనివాసుని శిరస్సును ఎప్పుడు దర్శింపగలను? ఎల్లప్పుడు భూర్లోకానికి ఆశ్రయమైన శ్రీనివాసుని కటిప్రదేశాన్ని ఎప్పుడు వీక్షింపగలను?

**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య చోరూ తలాతలస్యాశ్రయం సర్వదైవ ।**
**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య జాను సుకోమలం సుతలస్యాశ్రయం చ ॥38॥**

ఎల్లప్పుడు తలాతలానికి ఆశ్రయమైన శ్రీనివాసుని ఊరుప్రదేశాన్ని ఎప్పుడు చూడగలను? సుతలానికి ఆశ్రయమై మిక్కిలి కోమలమైన శ్రీనివాసుని జాను (మోకాలు)భాగాన్ని ఎప్పుడు చూడగలను?

**కదా ద్రక్ష్యే శ్రీనివాసస్య జంఘేర సాతలస్యాశ్రయే సర్వదైవ ।**
**కదా ద్రక్ష్యే పాదతలం హరేశ్చ పాతాలలోకస్యాశ్రయం సర్వదైవ ॥39॥**

సర్వదా రసాతలానికి ఆశ్రయమైన శ్రీనివాసుని జంఘ(పిక్క)భాగాన్ని ఎప్పుడు చూడగలను? సదా పాతాలలోకానికి ఆశ్రయమైన హరిపాదతలాన్ని ఎప్పుడు దర్శింపగలను?

**ఇత్థం మార్గే చింతయంతీ చ దేవీ శేషాచలే శేషదేవం దదర్శ ।**
**ఫణైః సహస్రైః సువిరాజమానం నానాద్రుమైర్వానరైర్వానరీభిః ॥40॥**

ఈ విధంగా ఆ దేవి మార్గమునందు ధ్యానించుచున్నదై, తలపోయుచున్నదై, పెక్కు వృక్షాలతోను, వానరవానరీ బృందాలతోను కూడియున్న శేషాచలమునందు వేలకొలది పడగలతో ప్రకాశించుచున్న శేషదేవుని సందర్శించింది.

**అనంతజన్మార్జితపుణ్యసంచయాన్మయాద్య దృష్టః పరమాచలో హి ।**
**తద్దర్శనాద్బాష్పకలాకులేక్షణా సద్యః సముత్థాయ ననామ మూర్ధ్నా ॥41॥**

అనేక జన్మలలో సంపాదింపబడిన పుణ్యసమూహముల వల్ల, నాచే ఈ ఉత్కృష్టమైన పర్వతం చూడబడింది. దాని సందర్శనం వల్ల బాష్పకణాలతో నిండి, వ్యాకులత చెందిన నేత్రాలతో వెంటనే ఒక్కసారి పైకిలేచి, శిరస్సుతో ప్రణామం చేసింది.

**ముఖం చ దృష్ట్వా నమనం చ కార్యం పృష్ఠాదిభాగే నమనం న కార్యమ్ ।**
**నాపి ద్విషట్కం నమనం చ చక్రే శాలగ్రామం స్థాపయిత్వా పురోఽస్య ॥42॥**

ముఖాన్ని చూచి నమస్కారంచేయాలి. పృష్ఠం మున్నగు భాగాలను చూచి నమస్కరించడం యోగ్యం కాదు. అందువల్ల దానికి ఎదురుగా శాలగ్రామము నుంచి ఆమె పండ్రెండుసార్లు (సాష్టాంగ ప్రణామం)నమస్కారం చేసింది.

**ఇత్థం కార్యం వైష్ణవైః పర్వతస్య త్వవైష్ణవై ర్విపరీతం చ కార్యమ్ ।**
**మధ్యాంతఃస్థః పర్వతాగ్రేఽస్తి నిత్యం రమాబ్రహ్మాద్యైః పూజితః శ్రీనివాసః ॥43॥**

ఈ విధంగా పర్వతానికి పూజ(నమస్కారం) వైష్ణవులచే చేయబడాలి. దానికి భిన్నమైనది అవైష్ణవులచే చేయబడేది. రమ, బ్రహ్మ మున్నగు వారిచే పూజింపబడే శ్రీనివాసుడు నిత్యమూ పర్వతాగ్రమునందు అంతర్యామియై ఉంటాడు.

**సుసత్తమం పరమం శ్రీనివాసం ద్రక్ష్యేఽథాహం హ్యారురుక్షేఽచలం చ ।**
**ఇత్యేవ ముక్త్వా కపిలాఖ్యతీర్థే స్థానం చక్రే సా స్వపిత్రా సహైవ ॥44॥**

మిక్కిలి శ్రేష్ఠుడైన పరముడగు శ్రీనివాసుని ఇక చూడగలనని, ఆ పర్వతాన్ని అధిరోహించింది. ఈ విధంగా పలికి కపిలమనే పేరుగల పుణ్యతీర్థంవద్ద, తన తండ్రితో కలసి ఒక స్థానం కల్పించుకొంది.

**అత్రైవాస్తే శ్రీనివాసో హరిస్తుద్రవ్యేణ రూపేణ న చాన్యథేతి ।**
**ఆదౌ స్నాత్వా ముండనం తత్ర కృత్వాతీర్థశ్రాద్ధం కారయిత్వా సుతీర్థే ॥45॥**

**భూహిరణ్యాది సమస్త దానం దత్త్వా శైలం చారురోహాథ సాధ్వీ ।**
**శాలగ్రామం స్థాపయిత్వా స చాగ్రేపునః ప్రణామం సాపి చక్రే సుభక్త్యా ॥46॥**

శ్రీనివాసుడైన హరి ఇక్కడే ఉన్నాడు. ద్రవ్యంచేత కాని, రూపంచేత కాని, మరోవిధంగా గాని కాదు. అని ముందు స్నానం చేసి, ముండనం చేయించుకొని (తలనీలాలు సమర్పించుకొని), గొప్పదైన ఆ తీర్థమందు తీర్థశ్రాద్ధాన్ని చేయించుకొని (తీర్థపూజ చేయించుకొని), గోవు, భూమి, హిరణ్యం మున్నగు సమస్తదానాలను ఇచ్చి ఆ సాధ్వి శైలాన్ని అధిరోహించింది. తండ్రి ముందు ఎదురుగా శాలగ్రామంనుంచి ప్రణమిల్లగా, ఆమె కూడ మిక్కిలి భక్తితో మళ్లీ ప్రణామం ఆచరించింది.

**సోపానానాం శత పర్యంతమేవమారుహ్యా సాహ్యుపవిష్టా తు తత్ర ।**
**శుశ్రావ సా భాగవతం పురాణం శుశ్రావ వై వేంకటాద్రేః ప్రశంసామ్ ॥47॥**

నూరుమెట్లవరకు ఇట్లు అధిరోహించి, ఆమె అక్కడ ఒకచోట ఉపవిష్టురాలయింది. ఆమె భాగవతపురాణాన్ని శ్రవణం చేసింది. పిమ్మట వేంకటాద్రిగొప్పతనాన్ని కూడ శ్రవణం చేసింది.

**జైగీషవ్యాద్గురుపాదాత్సుభక్త్యా శుశ్రావ తత్త్వం వేంకటాద్రేశ్చ సర్వమ్ ॥48॥**

జైగీషవ్యుడనే గురుపాదుల ద్వారా భక్తితో భాగవతతత్త్వాన్ని, వేంకటాద్రి వృత్తాంతాన్ని అంతను శ్రవణం చేసింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే వేంకటేశ్వర గిరియాత్రాక్రమనిరూపణం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో వేంకటేశగిరియాత్రాక్రమం అనే ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం

## **చతుర్వింశోఽధ్యాయః** – ఇరవై నాల్గవ అధ్యాయం

## **శ్రీవేంకటేశగిర్యారోహణక్రమ తద్భక్త తత్పర్వత నామాది నిరూపణమ్** –

### శ్రీవేంకటేశ్వరపర్వతారోహణక్రమం, తద్భక్త, తత్పర్వతనామాలు

**జైగీషవ్య ఉవాచ**– జైగీషవ్యుడు వచించాడు.

**కన్యే! శృణు త్వం వేంకటాఖ్యాచలస్య స్మేరాననాం పుణ్యమాం రోహణేఽస్య ।**
**శ్రీగీతాయాః పఠనం చైవ కుర్వన్నారోహణం కురుతే సర్వలోకః ॥1॥**

కన్యా! నీవు విను. ఈ వేంకటాచలమనే పేరు గల గిరిని ఎక్కేటప్పుడు నవ్వుతూ ఉండే ముఖంతో, పవిత్రత పాటిస్తూ, గొప్పదైన గీతాపఠనం చేస్తూ సర్వజనమూ ఆరోహణం చేస్తూ ఉంటుంది.

**పదే పదే శ్రీనివాసశ్చ దేవస్త్వలం హ్యలం ప్రీయతే భక్తవర్గః ।**
**ప్రీణయన్మోక్షమాయాంతి సర్వే హరౌ తుష్టే కిమలభ్యం చ కన్యే! ॥2॥**

ప్రతిపదమునందు శ్రీనివాసుడు దేవుడంటూ, ఆయన సమర్థుడు అంటూ, భూషణుడంటూ, ఆయన చాలు అంటూ, భక్తవర్గం సంతోషిస్తుంది. అందరు ఇట్లు ఆనందిస్తూ, మోక్షం పొందుతున్నారు. కుమారీ! హరి సంతుష్టుడైతే లభ్యం కానిది ఏముంటుంది?

**సోపానదేశే యః పురాణం శృణోతి తదా కృతా సర్వతీర్థాదియాత్రా ।**
**తదా దివా ప్రస్తువంతీహ మార్గే సదా హరిం శ్రీనివాసం గురుం చ ॥3॥**

మెట్లమార్గమందు ఎవడు పురాణం వింటాడో అతడు అప్పుడు సర్వతీర్థయాత్ర చేసినట్లే. ఆ విధంగా మార్గమందు పగలు ఎల్లప్పుడూ ఇక్కడ హరియైన శ్రీనివాసుని, గురువును ప్రస్తుతిస్తూ ఉంటారు.

**సోపానానాం మహిమానం చ శ్రుత్వాశా(సా)లగ్రామం స్థాపయిత్వా చ తత్ర ।**
**నమస్కృత్వా పునరేవాపి సా తుసోపానాని త్వారురోహాథ సాధ్వీ ॥4॥**

సోపానాల మధ్యలో సాలగ్రామాన్ని స్థాపించి, అక్కడ ఆ దేవుని మహిమలు వింటూ, మళ్లీ మళ్లీ నమస్కరిస్తూ, ఆ సాధ్వి మెట్లను అధిరోహించసాగింది.

**సోపానానాం వీంద్ర! చారోహణే నత్వవైష్ణవానాం హరితోషో న చైవ ।**
**తేనైవ తేషాం సాధనం భూయ ఏవతమస్యంధే పాతయితుం ఖగేంద్ర! ॥5॥**

పక్షీంద్రా! మెట్లయొక్క ఆరోహణంచేత వైష్ణవులు కానివారికి హరిప్రీతి కలుగదు. ఖగరాజా! అంధతమస్సునందు వారిని పడవేయటానికి అదే మిక్కిలి సాధనమవుతుంది.

**స్థలే స్థలే ఏవమేవాపి కార్యం జైగీషవ్యం పునరేవాహ దేవీ ।**

**కన్యోవాచ –** కన్య పలికింది.

**జైగీషవ్యః శ్రీనివాసో హరిస్తుబ్రహ్మాదీనాం దృశ్యతే శ్రీనివాసః ॥6॥**

ప్రతిప్రదేశమందు ఇట్లే చేయసాగింది. ఆ దేవి మళ్లీ జైగీషవ్యునితో ఇట్లంది. జైగీషవ్యుడే శ్రీనివాసుడైన హరి. బ్రహ్మాదులకుకూడ శ్రీనివాసుడే(గురువుగా) కనిపిస్తున్నాడు. (గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః)

**జైగీషవ్య! కృపయా త్వం వదస్వజైగీషవ్యో హ్యేవముక్తో హరిం తు ।**
**ఉవాచ కన్యాం సోమపుత్రీం సతీం చ బ్రహ్మాదీనాం దృశ్యతే శ్రీనివాసః ॥7॥**

జైగీషవ్య సద్గురూ! నీవు దయయుంచి వచించు. ఆమె ఇట్లు పలుకగా జైగీషవ్యుడు హరినుద్దేశించి, సోమపుత్రియైన సాధ్వియగు ఆ కన్యతో ఇలా వచించాడు. బ్రహ్మాదులకుకూడ శ్రీనివాసుడు కనిపిస్తూ ఉంటాడు.

**అనంతరూపోఽధిక కాంత కాంతిమాన్ రుద్రాదీనాం దృశ్యతే వేంకటేశః ।**
**స సూర్యలక్షాధిక కాంతకాంతితో రుద్రాదీనాం దృశ్యతే వేంకటేశః ॥8॥**

అనంతరూపాలకన్న ఎక్కువైన కాంతితో ప్రకాశించువాడై వేంకటేశ్వరుడు రుద్రాదులకు కనిపిస్తాడు. లక్షసూర్యులకన్న మనోహరమైన వెలుగులతో ఆ వేంకటేశుడు రుద్రాదులకు గోచరిస్తాడు.

**సహస్రసూర్యాధిక కాంతికాంతః స విద్యుత్వాన్మానుషాణాం రమేశః ।**
**ఋష్యాదీనాం దృశ్యతే చంద్రవచ్చ సన్మానుషాణామపరోక్షో హరిస్తు ॥9॥**

వేయి సూర్యులకన్న ఎక్కువైన కాంతితో ప్రకాశించువాడై, మెరుపువలె మిరుమిట్లు గొల్పుతూ ఆ రమేశుడు మానుషులకు కనిపిస్తాడు. ఋష్యాదులకు చంద్రునివలె. సత్పురుషులైన మనుష్యులకు ప్రత్యక్షంగాను హరి కనిపిస్తాడు.

**నక్షత్రవద్దృశ్యతే శ్రీనివాసః సదా ఋషీణామపరోక్షో హరిస్తు ।**
**స సూర్యవద్దృశ్యతే శ్రీనివాసః సంసారిణాం వేంకటేశః ఖగేంద్ర ॥10॥**

ఋషులకు ఎల్లప్పుడు ప్రత్యక్షంగా శ్రీనివాసుడైన హరి నక్షత్రంవలె కనిపిస్తాడు. ఖగేంద్రా! సంసారులైనవారికి శ్రీనివాసుడైన ఆ వేంకటేశ్వరుడు సూర్యునివలె గోచరిస్తాడు.

**సందేహవద్దృశ్యతే వై ప్రకాశోమిథ్యావతాం దృశ్యతే శ్రీనివాసః ।**
**పాషాణవన్నైల్యరూపప్రకాశః శిలామాత్రే దృశ్యతే వై కలౌ చ ॥11॥**

మిథ్యాజ్ఞానం కలవానికి శ్రీనివాసుడు సందిగ్ధప్రకాశుడైనట్లుగా కనిపిస్తాడు. కలియుగంలో రాయివలె నీలరూపకాంతితో శిలామాత్రమందు గోచరిస్తాడు.

**నృణాం సర్వేషాం శ్రీనివాసో హరిస్తు కలౌ స్వరూపం శ్రీనివాసస్య దేవీ ।**
**న మానుషాః ప్రవిజానంతి సర్వే యతః కలౌ తామసా రాజసాస్తు ॥12॥**

కలియుగమందు సర్వనరులకు శ్రీనివాసుడైన హరి శ్రీనివాసుని దేవియొక్క స్వరూపంతో ఉంటాడు. ఎందువల్లననగా కలియుగమందలి మనుష్యులు రాజసులు, తామసులు గాన అందరూ ఆ దేవుని పూర్తిగా తెలియజాలరు.

**తత్సంగినః సాత్త్వికాః కేచిదేవ హ్యతో భక్తా దుర్లభా వై కలౌ చ ।**
**యే దృశ్యంతే భక్తవత్తే న భక్తాః శిశ్నోదరయో ర్భరణే చైవ సక్తాః ॥13॥**

భగవత్సాంగత్యం కల్గిన సాత్త్వికులు కొందరే ఉంటారు. అందువల్ల కలియుగంలో భక్తులు దుర్లభులు. భక్తులవలె ఎవరు కనబడతారో వారు నిజంగా భక్తులు కారు. వారందరు శిశ్నోదరసంభరణాసక్తులు మాత్రమే. (మైథునాసక్తి మఱియు ఉదరపోషణాసక్తి కలవారు మాత్రమే)

**కుర్వంతి యాత్రాం చ తదర్థమేవ భక్తిజ్ఞానం దుర్లభం వై కలౌ చ ।**
**భక్తా యే వై న విరక్తాః సదైవ తేషాం హరేర్దర్శనం దుర్లభం చ ॥14॥**

వాటికోసంమాత్రమే యాత్ర చేస్తారు. కలియుగమందు భక్తి, జ్ఞానం దుర్లభాలు. భక్తులుగా కనబడుతున్నవారు ఎల్లప్పుడు విరక్తులు కారు. వారికి హరియొక్క సందర్శనం దుర్లభం.

**భక్తస్వరూపం తవ వక్ష్యే ఖగేంద్ర! యో జ్ఞానపూర్ణః పరమే స్నిగ్ధ ఏవ ।**
**న చ ద్వేషైర్బంధురో భక్తియుక్తస్తవ ద్వేషాఞ్ఛృణు వక్ష్యే చ సమ్యక్ ॥15॥**

ఖగేంద్రా! భక్తిస్వరూపాన్ని నీకు చెప్తున్నాను. జ్ఞానసంపూర్ణుడు, పరమాత్మయందు వాత్సల్యం కలిగి యుంటాడు. భక్తితో కూడినవాడు (ద్వే)దోషాలతో నిండి ఉండడు. నీకు ద్వేషాలనుగూర్చి వివరిస్తున్నాను విను.

**జీవాభిదా హరిణాఽప్రాకృతేనస్వతంత్రేణ హ్యస్వతంత్రశ్చ నిత్యమ్ ।**
**జ్ఞానానందైః పరిపూర్ణే హరౌ చ గుణైరపూర్ణో హరిరిత్యేవ చింతా ॥16॥**

స్వతంత్రుడై, అప్రాకృతుడైన(ప్రకృతికి పరుడైన) జీవాభేదం(భేదదృష్టి లేని)కల హరియందెప్పుడు, అతడు అస్వతంత్రుడని భావించడం; జ్ఞానానందాలచే పరిపూర్ణుడైన హరియందు గుణాలచే హరి పూర్ణుడు కాదని భావించడం ద్వేషాలు.

**శ్రీబ్రహ్మరుద్రాది దివౌకసాం సదా తథా ద్విజానాం సంమానాయాశ్చ చింతా ।**
**విష్ణోః సకాశాద్బ్రహ్మరుద్రాదికానాం సదాధిక్యాలోచనం ద్వేష ఏవ ॥17॥**

లక్ష్మి, బ్రహ్మ, రుద్రుడు మున్నగు దేవతలతో అలాగే ద్విజులతోను హరిని సమానంగా లెక్కించడమనే చింత ఎల్లప్పుడును, ద్వేషమనబడుతుంది. విష్ణువుయొక్క అపేక్షచే బ్రహ్మరుద్రాదులను ఎల్లప్పుడు అధికులుగా ఆలోచించడంకూడ ద్వేషమే.

**విష్ణోర్భద్రే! హస్తపాదాదికానాం భేదజ్ఞానం ద్వేషభేదాదికం చ ।**
**అవతారాణాం చేదభేదాదికం చ తథోచ్యతే మరణస్యాపి చింతా ॥18॥**

భద్రురాలా! విష్ణువుయొక్క హస్తపాదాదికములయందు భేదజ్ఞానం కలిగియుండుటకూడ మహాత్ములు ద్వేషమని చెబుతారు. అవతారాలలో పరిచ్ఛేదం, భేదం పాటించడం, మరణం ఉందనే ఆలోచనకూడ అలాగే ద్వేషంగా భావింపబడుతుంది.

**తద్భక్తానాం ద్వేషణం చాహురార్యాస్తద్వాక్యానాం దూషణం ద్వేష ఏవ ।**
**న చ ద్వేషైః సంయుతా యే చ లోకేకన్యే! దృశ్యంతే న తు భక్తాః కదాచిత్ ॥19॥**

విష్ణుభక్తులను ద్వేషించడం దోషమని ఆర్యులు వచిస్తారు. వారి వాక్యాలను దూషించడం కూడ ద్వేషమే. కుమారీ! కాదు కాదు. లోకంలో ఈ దోషాలతో కూడియున్నవారే కనబడుతున్నారు. వారు ఎప్పుడును భక్తులు కారు.

**కన్యోవాచ** – కన్య పలికింది.

**జైగీషవ్య! బ్రూహి మే కే చ భక్తాభక్తిం కథం దర్శయామాసురేతే ।**
**తేషాం హరిః శ్రీనివాసో మహాత్మా త్రాతా సదా భక్తవర్గే దయాలుః ॥20॥**

జైగీషవ్యా! ఎవరెవరు భక్తులో నాకు తెలియజెప్పవలసింది. వీరు ఏవిధంగా భక్తిని ప్రదర్శిస్తారు? మహాత్ముడైన శ్రీనివాసుడగు హరి వారికి రక్షకుడు కదా! హరి ఎల్లప్పుడు భక్తబృందములందు దయగలవాడు కదా!

**జైగీషవ్యస్త్వేవముక్తో మహాత్మా ఉవాచ కన్యాం సంస్మరన్ భక్తవర్యః ।**

భక్తవర్యుడు మహాత్ముడైన జైగీషవ్యుడు ఈ విధంగా ప్రశ్నింపబడినవాడై, కన్యను స్మరిస్తూ, ఇలా పలికాడు.

**జైగీషవ్య ఉవాచ** – జైగీషవ్యుడు వచించాడు.

**ప్రహ్లాదాద్యా శ్రీనివాసస్య భక్తాః కృత్వా నృసింహే చోత్తమాం భక్తిమేవ ॥21॥**

**అవాప సామ్రాజ్యమనుత్తమం చ జ్ఞానం నృసింహాత్సమవాప పశ్చాత్ ।**
**పరాశరః శ్రీనివాసస్య భక్తోభక్తిం కృత్వా వ్యాసరూపం హరిం చ ॥22॥**

**స్తుత్వా తేన జ్ఞానతత్త్వం హ్యవాప్యజగామ మోక్షం భక్తిసంవర్ధితాత్మా ।**
**యో నారదః శ్రీనివాసస్య భక్తోభక్తిం కృత్వా గర్భవాసే హరౌ చ ॥23॥**

ప్రహ్లాదుడు మున్నగువారు శ్రీనివాసుని భక్తులు. నృసింహునియందు ఉత్తమమైన భక్తిని ప్రకటించి, అతడు సామ్రాజ్యం పొందాడు. అటుపిమ్మట నరసింహునివలన మిక్కిలి గొప్పదైన జ్ఞానం పొందగలిగాడు. పరాశరుడు శ్రీనివాసుని భక్తుడు. అతడు వ్యాసరూపుడైన హరిపై భక్తిని ప్రకటించి, హరిని స్తుతించి, అతనివలన జ్ఞానతత్త్వం పొంది, భక్తిచే వృద్ధిపొందిన మనస్సు కలవాడై మోక్షాన్ని పొందాడు. శ్రీనివాసుని భక్తుడైన ఏ నారదుడున్నాడో, గర్భవాసంలోనే హరియందు భక్తి కలిగి ఉన్నాడు,

**తయా భక్త్యా బ్రహ్మపుత్రత్వమాప జ్ఞానప్రాప్త్యా తేన ముక్తిం జగామ ।**
**యోహ్యంబరీషః శ్రీనివాసస్య భక్తః కృత్వా భక్తిం పరదేవే హరౌ చ ॥24॥**

**జప్త్వా జ్ఞానం ప్రాప్య దుర్వాసకశ్చాప్యవాప మోక్షం తేన సంవర్ధితాత్మా।**
**ముచుకుందో వై శ్రీనివాసస్య భక్తో వైరాగ్యతో భక్తిదార్ఢ్యం చ కృత్వా ॥25॥**

**తత్త్వజ్ఞానం ప్రాప్య విష్ణోర్మహాత్మాహ్యవాప మోక్షం తేన సంవర్ధితాత్మా।**
**స పుండరీకః శ్రీనివాసస్య భక్తః పిత్రాదిష్టో విష్ణుభక్తిం చ కృత్వా ॥26॥**

**హరిప్రసాదాత్ జ్ఞానమనుత్తమం చాప్యవాప మోక్షం భక్తి సంవర్ధితాత్మా।**
**బ్రహ్మా చ వాయుశ్చ సరస్వతీ చ జ్ఞాతవ్యాః సర్వే ఋజుయోగినశ్చ ॥27॥**

ఆ భక్తితో బ్రహ్మ పుత్రత్వాన్ని పొందాడు. అంతేకాదు, జ్ఞానం పొంది హరివలన ముక్తిని పొందాడు. శ్రీనివాసుని భక్తుడైన ఏ అంబరీషుడు ఉన్నాడో, పరదేవుడైన హరియందు భక్తిని ప్రకటించి, హరిని జపించి, జ్ఞానం పొంది, భక్తిచే వృద్ధిపొందిన మనస్సు కలవాడై మోక్షం పొందాడు. దుర్వాసుడుకూడ ముక్తి పొందాడు. ముచుకుందుడు శ్రీనివాసుని భక్తుడు. అతడు వైరాగ్యంతో భక్తిని దృఢంగా పెంచుకొని, విష్ణువువలన తత్త్వజ్ఞానాన్ని పొంది, ఆ మహాత్ముడు భక్తిసంవర్ధితాత్ముడై మోక్షాన్ని పొందాడు. పుండరీకుడు శ్రీనివాసుని భక్తుడు. అతడు తండ్రిచే ఆదేశింపబడినవాడై విష్ణుభక్తిని పెంపొందించుకొని, హరిప్రసాదంవలన ఉత్తమమైన జ్ఞానం పొంది, భక్తిచే పెంపొందింపబడిన మనస్సుతో మోక్షం పొందాడు. బ్రహ్మ, వాయువు, సరస్వతి, ఋజువులు, యోగులు అందరు భక్తులుగా తెలియదగినవారు.

**అచ్ఛిన్నభక్తాశ్చ సదా మురారే ర్నకామ్యరక్తాః శుద్ధరూపా హి తే చ।**
**గిరీశ నాగేశ ఖగేశ సంజ్ఞా దేవాః శుక్రారౌ గురుచంద్రేందుసూర్యాః ॥28॥**

**జలేశోఽగ్నిర్మనుధర్మౌ కుబేరో విఘ్నేశ నాసత్య మరుద్గణాశ్చ।**
**పర్జన్య మిత్రాదయ ఏవ సర్వే సదా హ్యేతే శ్రీనివాసస్య భక్తాః ॥29॥**

వారు ఎల్లప్పుడు మురారియొక్క అవిచ్ఛిన్న భక్తులు. వారు కామ్యకర్మాసక్తులు కారు. వారు పరిశుద్ధస్వరూపులు. గిరీశుడు, నాగేశుడు, ఖగేశుడు అను పేర్లు గల్గినవారు దేవతలు. శుక్రుడు, అరుడు(అంగారకుడు), గురువు, చంద్రుడు, ఇంద్రుడు, సూర్యుడు (చంద్రుడు– ఆహ్లాదపరచేవాడు. ఇంద్రుడు– మంచుకిరణాలచే తడిపేవాడు), జలేశుడు, అగ్ని, మనువు, ధర్ముడు, కుబేరుడు, విఘ్నేశుడు, అశ్వినీదేవతలు, మరుద్గణాలు, పర్జన్యుడు, మిత్రుడు మున్నగువారు అందరూ ఎల్లప్పుడు శ్రీనివాసుని భక్తులే.

**విశ్వామిత్రో భృగురౌర్వశ్చ కుత్సోమరీచి రత్రిః పులహః క్రతుశ్చ।**
**శక్తిర్వసిష్ఠో గౌతమీయో పులస్త్యో భారద్వాజః శ్రీనివాసస్య భక్తాః ॥30॥**

విశ్వామిత్రుడు, భృగుడు, ఔర్వుడు, కుత్సుడు, మరీచి, అత్రి, పులహుడు, క్రతువు, శక్తి, వసిష్ఠుడు, గౌతముడు, పులస్త్యుడు, భారద్వాజుడు, శ్రీనివాసుని భక్తులు.

**మాంధాతా నహుషోఽంబరీష సగరౌ రాజా పృథుర్ హైహయో**
**ఇక్ష్వాకుర్భరతో యయాతి సుతలౌ ధర్మో వికుక్షిస్తథా।**

**ఉత్తానశ్చ విభీషణో దశరథో హ్యేతే మహాజ్ఞానినః**
**శ్రీమద్వేంకట నాయకస్య చ గురోర్భక్తాః సదా సంస్మృతాః ॥31॥**

మాంధాత, నహుషుడు, అంబరీషుడు, సగరుడు, పృథుచక్రవర్తి, హైహయుడు, ఇక్ష్వాకువు, భరతుడు, యయాతి, సుతలుడు, ధర్ముడు, వికుక్షి, ఉత్తానుడు, విభీషణుడు, దశరథుడు వీరు మహాజ్ఞానులు. వీరందరును ఎల్లప్పుడు గురువైన శ్రీ వేంకటేశ్వరుని భక్తులుగా భావింపబడుతున్నారు.

**భాగీరథీ సముద్రశ్చ యమునా చ సరస్వతీ ।**
**గోదావరీ నర్మదా చ కృష్ణా భీమరథీ తథా ॥32॥**

**సరయూ ఫల్గు కావేరీ గండకీ కపిలాస్తథా ।**
**ఇత్యేతాశ్చ హరేర్భక్తాః సంతి చాత్రైవ భామిని! ॥33॥**

భాగీరథి, సముద్రుడు, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, కృష్ణ, భీమరథి, సరయువు, ఫల్గునది, కావేరి, గండకి, కపిల అను వీరందరూ భామినీ! హరిభక్తులు. అందరు ఇందే ఉన్నారు.

**అభిప్రాయం తత్ర వక్ష్యే శృణు కన్యే! మయా సతి! ।**
**యత్ర ప్రవర్తతే మార్గే కథా విష్ణోర్మహాత్మనః ॥34॥**

**వర్తంతే వైష్ణవా యత్ర హరితత్త్వార్థ బోధకాః ।**
**తత్రైవ భక్తాః సర్వేఽపి సంతి విష్ణో స్తథైవ చ ॥35॥**

కుమారీ! సతీ! నా అభిప్రాయం ఇప్పుడు చెప్తున్నాను. విను ఏ మార్గమందు మహాత్ముడైన విష్ణువుయొక్క కథ ప్రవచింపబడునో, ఎక్కడ హరితత్త్వంయొక్క భావాన్ని బోధించే వైష్ణవులు ఉంటారో, అక్కడ విష్ణుభక్తులు అందరును ఎప్పుడూ ఉంటారు.

**యే దేవయాత్రాం పరమాత్మ చింతయా కుర్వంతి తే హరిభక్తాశ్చ నాన్యే ।**
**యతో హరౌ పరమే వైష్ణవానాం సర్వం నిష్ఠామేతి కృత్యం ఖగేంద్ర! ॥36॥**

ఎవరైతే పరమాత్మభావనతో యాత్ర చేస్తారో, వారే హరిభక్తులు. మిగిలినవారు కారు. ఖగేంద్రా! ఎందువల్ల ననగా వారు పరముడైన హరియందు వైష్ణవులయొక్క నిష్ఠనంతను చేయదగినట్లుగా చేసి, కృతార్థత పొందుతారు.

**శేషాచలం సమాసాద్య హ్యన్న వస్త్రాదిభూషణమ్ ।**
**యో న దద్యాదభక్తః స తతః కో ను పరః పశుః ॥37॥**

శేషాచలాన్ని పొంది, అన్నం, వస్త్రం, భూషణం మున్నగువాటిని ఎవడు ఈయకుండ ఉంటాడో వాడు భక్తుడు కాడు. అంతకన్న మరో పశువు ఎవడు ఉంటాడు?

**భక్తా హరేః శ్రీనివాసాచలే చ గంగాది రూపేణ చ తత్ర తత్ర ।**
**తిష్ఠంతి సేవార్థమురుక్రమస్య తేషాం పూజా నైవ కార్యా చ దేవి! ॥38॥**

దేవీ! శ్రీనివాసాచలమందు హరిభక్తులు గంగాది రూపంలో అక్కడక్కడ ఉంటారు. ఉరుక్రముడైన విష్ణువుయొక్క సేవకోసమై అలా ఉంటారు. వారికి పూజ చేయవలసిన విధి లేదు.

**అభిప్రాయం తత్ర వక్ష్యే శృణు త్వం తత్ర స్థలే వస్త్రగంధాది ధూపైః ।**
**పురాణోక్తా అపి భేదేన పూజ్యాదృష్ట్వా చ తాన్వందయేత్ ప్రాజ్ఞ ఏవ ॥39॥**

ఇక్కడ నా అభిప్రాయం చెప్తున్నాను. నీవు విను. అక్కడ స్థల మార్గమందు పురాణోక్త భేదంచే ధూపదీపాదులచే వారు పూజింపబడుతున్నారు. ప్రాజ్ఞుడైనవాడు వాటిని చూచి నమస్కారం మాత్రమే చేయాలి.

**సద్బ్రాహ్మణాన్ వందయేత్పాదమూలే హస్తౌ చ ద్వౌ సంపుటీకృత్య దేవి! ।**
**సాష్టాంగరూపం వందనం చైవ విష్ణోః కుర్యాత్తథా గురవే విష్ణుబుద్ధ్యా ॥40॥**

దేవీ! సద్బ్రాహ్మణులయొక్క పాదాగ్రములయందు రెండుచేతులను ముడుచుకొని(దోయిలొగ్గి) నమస్కరించాలి. విష్ణువుకు సాష్టాంగదండ ప్రణామం చేయాలి. ఆ విధంగానే విష్ణుబుద్ధితో గురువుకు నమస్కరించాలి.

**గంగాదీనాం వందనం కార్యమేవ సాష్టాంగం వై తులసీనాం తథైవ చ ।**
**అశ్వత్థానాం నమనం కార్యమేవ గవాదీనాం నమనం మానసేన ॥41॥**

గంగాదులకు వందనం తప్పక చేయవలసిందే. తులసి మున్నగువాటికి కూడ సాష్టాంగప్రణామం చేయాలి. అశ్వత్థం మున్నగువాటికి నమనం(వంగి నమస్కరించుట) చేయవలసిందే. గోవు మున్నగువాటికి మానసికంగా వందనం చేయాలి.

**పూజా సదా దేవదేవస్య విష్ణోః కార్యా భక్త్యా వైష్ణవైరేవ నాన్యైః ।**
**యే నామకా జ్ఞానవంతః సుభక్తాః సదైవ కార్యా విష్ణుపూజా చ కన్యే! ॥42॥**

వైష్ణవులచే దేవదేవుడైన విష్ణువుయొక్క పూజ ఎల్లప్పుడు చేయదగియున్నది. ఇతరులచే మాత్రం కాదు. కుమారీ! ఎవరైతే జ్ఞానవంతులనే పేరు కల్గిన భక్తులున్నారో వారు ఎల్లప్పుడూ విష్ణుపూజ చేయాలి.

**యే నామకా జ్ఞానవంతః సుభక్తాః సదైవ కార్యా విష్ణుపూజా చ కన్యే! ।**
**యే ఽ నామకా విష్ణుభక్తాః సదైవ పూజా విష్ణోర్నైవ కార్యాత్ర దేవి! ॥43॥**

కుమారీ! ఎవరయితే జ్ఞానవంతులని ప్రసిద్ధి పొందిన సద్భక్తులు ఉన్నారో వారు ఎల్లప్పుడు విష్ణుపూజ చేయాలి. దేవీ! ఎవరయితే విష్ణుభక్తులు కానివారనే పేరుతో ఉన్నారో వారు విష్ణువుయొక్క పూజ చేయరాదు.

**మోహాద్యో వై పూజయేద్దేవదేవం మహాఽ ధర్మాద్యాతి చాంధం తమో వై ।**
**బ్రహ్మాది నామాని హరేర్హి దేవీవిష్ణోః స్వనామాని దదౌ దివౌకసామ్ ॥44॥**

మోహంతో దేవదేవుని పూజించేవాడు గొప్పదైన ఆ అధర్మంవలన అంధతమస్సును పొందుతున్నాడు. బ్రహ్మాది నామాలను, విష్ణువైన హరియొక్క నామాలను, తన నామాలను దేవి స్వర్గలోకవాసులకు ఇచ్చింది. (తెలియజేసింది)

**నాదాద్ధీరః కేశవాదీని కన్యే! స్వకం పురం ప్రవిహాయైవ రాజా ।**
**ఏవం మయోక్తం కన్యకే! సర్వమేతదేతత్‌పరం సమ్యగారోహణీయమ్ ॥45॥**

కుమారీ! కేశవ మున్నగు నామాల నాదంవల్ల ధీరుడైన ఆ ప్రభువు తన పురాన్ని విడిచివేశాడు. కన్యకా! ఇట్లు దీనినంతను నేను తెలియజేశాను. గొప్పదైన ఈ పర్వతాన్ని భక్తితో అధిరోహించవలసియుంది.

**గోవింద నారాయణ మాధవేతి యూయం మయా సర్వమారాధితవ్యమ్ ।**
**సర్వే మిలిత్వా పునరేవం ఖగేంద్ర! సమారుహన్వేంకటాద్రిం గృణంతః ॥46॥**

గోవిందా! నారాయణా! మాధవా! అంటూ మీరు అందరూ నాతో కలసి ఆరాధించడం కర్తవ్యం (అని గురువు చెప్పగా) ఖగేంద్రా! వారందరూ కలిసి మరల వేంకటాద్రిని స్వీకరించి, అధిరోహించారు.

**హరేర్నామాన్యత్ర పూర్వం గృణంతుస్త్వాస్వాదయంతః శ్రీనివాసస్య నామ ।**
**ద్రష్టుం సర్వే శ్రీనివాసం తథైవకుర్వంతస్తే తలశబ్దం నదంతః ॥47॥**

హరియొక్క నామాలను మొదట పఠించి, శ్రీనివాస నామమాహాత్మ్యం ఆస్వాదిస్తూ, అందరు శ్రీనివాసుని దర్శించుటకై తాలధ్వని ప్రతిధ్వనించేటట్లు చేశారు.

**ఇతి కృష్ణవచః శ్రుత్వా తార్‌క్ష్యః కృష్ణమువాచ హ ।**
**కథమాస్వాదనం చక్రురేతద్విస్తీర్యమేవ చ ॥**

ఈ విధంగా పలికిన కృష్ణవచనాలను విని, గరుడుడు వారు ఎట్లు ఆస్వాదనం చేశారు? దానిని విస్తరించి నాకు చెప్పవలసిందని శ్రీకృష్ణుని అడిగాడు.

**శ్రీకృష్ణ ఉవాచ–** శ్రీకృష్ణుడు వచించాడు.

**భో శ్రీనివాస తవ నామైవచైతన్నామ స్వామీ నను నామైవ స్వామీ ।**
**యాం బ్రహ్మాద్యా ఆశ్రయంతీతియస్మాత్తస్మాద్రామా శ్రీరితి నామ చాప ॥48॥**

ఓ శ్రీనివాసా! ఈ నీ నామమే స్వామివైన నీవు. స్వామియే నీ నామం. ఎవరిని బ్రహ్మాదులు ఆశ్రయించారో ఆ కారణంచే రమ 'శ్రీ' అనే పేరును పొందింది.

**రమాశ్రయత్వాన్నితరాం సర్వదా చేత్యతో హరిః శ్రీనివాసాభిధానః ।**
**భో శ్రీనివాసేతి తు నర్తయంతో రోమాంచ మాత్రా స్తల శబ్దకారిణః ॥49॥**

ఎల్లప్పుడూ అత్యంతమూ రమ హరిని ఆశ్రయించి యుండుటవలన (హరి రమను ఆశ్రయించుయుండుట వలన) హరి శ్రీనివాసుడనే పేరు కలిగినవాడయ్యాడు. ఓ శ్రీనివాసా! అంటూ నర్తనం చేస్తూ, తాలశబ్దం ధ్వనింపజేస్తూ వెంటనే రోమాంచంతో పులకించినవారయ్యారు. (భక్తులు)

**అద్యైవ పశ్యామ హరేస్తవాస్యం కదా వయం కృతకృత్యా భవామః ।**
**భోః కేశవాద్యైవ పదారవిందం సందర్శయిత్వా సుదయాం కురుష్వ ॥50॥**

హరివైన నీయొక్క వదనాన్ని ఇప్పుడే దర్శిస్తాం. మేము ఎప్పుడు ధన్యులమౌతామో కదా! ఓ కేశవా! ఇప్పుడే నీ పదారవిందాన్ని కనబడునట్లు చేసి, మాపై మిక్కిలి దయను ప్రకటించు.

**బ్రహ్మాణమాహుశ్చ పురాణమాహుః క శబ్దవాచ్యం సర్వలోకేశ మాహుః ।**
**ఈశం చార్హం రుద్రమిత్యేవ చాహుస్త్రత్పేరకం సృష్టి సంహారకార్యే ॥51॥**

బ్రహ్మ పురాతనుడని చెబుతారు. 'క' అనే శబ్దంచేత చెప్పబడేవాడు సర్వలోకేశ్వరుడని చెబుతారు. సృష్టిసంహార కార్యమందు అర్హుడైన రుద్రుని ఈశునిగా చెబుతారు.

**అతో హరిః కేశవ నామధేయోభోః కేశవేతి చ నర్తయంతః ।**
**ఆనందవాపీం సంస్రవతోఽభిజగ్ముర్నారాయణేతి ప్రవదంతో హి జగ్ముః ॥52॥**

అందువల్ల హరి కేశవుడనే పేరు గల్గినవాడయ్యాడు. ఓ కేశవా! అని నర్తనం చేస్తూ, ఆనందమనే బావిని తడుపుతూ వెళ్లారు. ఓ నారాయణా! అని గట్టిగా ఉచ్చరిస్తూ నడిచారు.

**అతో దోషా స్తద్విరుద్ధా గుణాశ్చ నారాశ్చ తేషామాశ్రయత్వాన్మురారిః ।**
**నారాయణేతి ప్రవదంతీహ లోకే నారానుబంధాత్సర్వముక్తాః ఖగేంద్ర! ॥53॥**

అందువల్ల దోషాలకు విరుద్ధములైనవి గుణాలు. అవియే 'నారాః' అని పిలవబడతాయి. మురారి వాటికి ఆశ్రయుడు అవడంవల్ల 'నారాయణుడు' అయ్యాడని లోకంలో అంటారు. ఖగేంద్రా! నారానుబంధంవలన అన్నింటినుండి ముక్తులవుతారు.

**నారాః ప్రోక్తా ఆశ్రయత్వాచ్చ తేషాం అతోఽపి నారాయణ ఏవ వీంద్ర! ।**
**ముక్తాశ్చ యే తు ప్రవదం ను జగ్మురండోదకం యస్య కటాక్షమాత్రాత్ ॥54॥**

**యదుత్పన్నం తేన నారాః ఖగేంద్ర! తేషాం సదాప్యాశ్రయత్వాచ్చ వీంద్ర! ।**
**నారాయణేతి ప్రవదంతీహ లోకే హ్యనంత బ్రహ్మాండ విసర్జకత్వాత్ ॥55॥**

పక్షీంద్రా! నీళ్ళు 'నారాః' అని చెప్పబడతాయి. వాటికి ఆశ్రయుడు అయిన కారణంచే నారాయణుడయ్యాడు. ఎవరు ప్రపత్తి చేస్తారో వారు ముక్తులవుతారు. ఎవని కటాక్షమాత్రంచేతనే బ్రహ్మాండోదకంలో, ఖగేంద్రా! ఏది అతనిచే ఉత్పన్నమయిందో, అదంతా 'నారాః' అని చెప్పబడుతుంది. పక్షీంద్రా! వాటికి ఎల్లప్పుడు ఆశ్రయమగుటవల్ల లోకమందు నారాయణుడయ్యాడని అనంతమైన బ్రహ్మాండ విసర్గంవల్లనుకూడ నారాయణుడయ్యాడని (నారాయణా!) అని లోకమందు వచిస్తారు.

**ఏవం ననృతుః పరిశంసయంతో గోవింద నాన్యో హి నచైవ దర్శనమ్ ।**
**గోశబ్దవాచ్యాస్తు సమస్త వాచోగోభిశ్చ సర్వైః ప్రతిపాద్యతే యతః ॥56॥**

**అతో హి గోవింద ఇతి స్మృతః సదాభో వేదవేద్యేతి తథా చ(న) ననృతుః ।**
**ఆనందబాష్పైశ్చ సమన్వితా హి హరే మురారే తవ దర్శనం హి ॥57॥**

**దేహి ప్రభో వై తవ దాసదాసాశ్చతుర్దశే భువనే సర్వదాపి ।**
**యత స్త్వమేవం వసతీతి వాసుశ్చాత్రైవ నిత్యం క్రీడతే సర్వదైవ ॥58॥**

గోవిందుడు మరియొకడు లేడు. మరొక్కరి దర్శనం వద్దు. ఈ విధంగా ప్రశంసిస్తూ నర్తనం చేశారు. సమస్తశబ్దాలు గోశబ్దంచే చెప్పబడతాయి. సర్వవాక్కులచేత ప్రతిపాదింపబడిన కారణంచే, అందువల్ల గోవిందుడని ఎల్లప్పుడూ చెప్పబడతాడు. ఓ వేదవేద్యా! అంటూ అలా నాట్యం చేశారు. ఆనందబాష్పాలతో కూడుకొన్నవారై హరీ! మురారీ! నీ దర్శనం, ప్రభూ! మాకు ఇమ్ము. చతుర్దశభువనములందునూ ఎల్లప్పుడు మేము నీ దాసాను దాసులం. నీవు ఎల్లప్పుడు ఉండెడివాడవైన కారణంచే 'వాసుః' అనే పేరు వచ్చింది. నిత్యమూ ఇక్కడనే అంతటా క్రీడిస్తావు.

**యతో దేవేత్యేవమాహు ర్మహాంతస్త్వతో హరిం వాసుదేవేతి చాహుః ।**
**భో వాసుదేవేతి ననృతుః సర్వదైవభో మాధవేతి ననృతుశ్చైవ సర్వే ॥59॥**

అందువలన మహాత్ములు నిన్ను దేవుడని వచిస్తారు. అందుచే హరిని వాసుదేవుడని అంటారు. ఓ వాసుదేవా! అని ఎల్లప్పుడూ నృత్యం చేశారు. ఓ మాధవా! అంటూ అందరును నర్తనం చేశారు.

**లక్ష్మీపతే చేతి వదంతి సర్వే ధనీతి శబ్దః స్వామి వాచీ యతో హి ।**
**అతోప్యార్యా మాధవేతి బ్రువంతి లక్ష్మీపతే పాహి తథైవ భక్తాన్ ॥60॥**

ధని అని శబ్దం స్వామివాచకమైన కారణంచే అందరును లక్ష్మీపతీ! అని సంబోధిస్తారు. అందువల్ల ఆర్యులు నిన్ను మాధవుడని వచిస్తారు(మాధవా!). లక్ష్మీపతీ! అలాగే భక్తులను రక్షించు.

**తే వై బ్రువంతో ననృతుశ్చ జగ్ముర్విష్ణో సదాస్మాన్పరిపాహి నిత్యమ్ ।**
**d Ÿ ÁQ Ôa̧j ÆK Í ˆ~ Ç ÔÂ Ã ఉ సి తస్మాద్ ఇత్యాది నామాని గృణంత ఏవ ॥**
**జగ్ముశ్చ సర్వే దదృశుశ్చ తీర్థం భక్త్యోపేతాః శ్రీనివాసం స్మరంతః ॥61॥**

విష్ణూ! నిత్యమూ మమ్ములను అన్ని విధాలా రక్షించు' అంటూ వారు నాట్యం చేస్తూ నడిచారు. నీవు అంతటా ఎల్లప్పుడూ ఉండే కారణంచే వితతుడవయ్యావు. ఇలా మొదలైన నామాలను ఉచ్చరిస్తూ నడిచారు. అందరూ శ్రీనివాసుని స్మరిస్తూ భక్తితో కూడుకొన్నవారై తీర్థాన్ని దర్శించారు.

**కన్యోవాచ** – కన్య పలికింది.

**కిం నామకం తీర్థమిదం మునీంద్ర! కిం కార్యమత్ర ప్రవదాస్మాన్ కృతీశ ।**
**కస్మై ప్రసన్నో భగవాఞ్ఛ్రీనివాస స్త్వస్మిన్ సుతీర్థం వద విస్తరేణ ॥62॥**

మునీంద్రా! ఈ తీర్థం పేరు ఏమి? జ్ఞానేశా! ఇక్కడ చేయవలసిన కార్యమేమియో మాకు చెప్పు. భగవంతుడైన శ్రీనివాసుడు ఈ గొప్పతీర్థమందు ఎవరికి ప్రసన్నుడయ్యాడు? విస్తరించి చెప్పు.

**జైగీషవ్య ఉవాచ** – జైగీషవ్యుడు వచించాడు.

**కన్యే! శృణు త్వం హ్యభవత్సు బుద్ధిమాన్ ప్రహ్లాద సంజ్ఞో హరిభక్తవర్యః ।**
**నిష్కామబుద్ధ్యా తు యదా జగామ శేషాచలస్థం శ్రీనివాసం చ ద్రష్టుమ్ ॥63॥**

కుమారీ! నీవు విను. బుద్ధిమంతుడైన ప్రహ్లాదుడనే పేరు గల్గిన హరిభక్తశ్రేష్ఠుడు ఒకడు ఉండెడివాడు. అతడు నిష్కామబుద్ధితో శేషాచలంలోనున్న శ్రీనివాసుని చూడటానికి ఒకప్పుడు వెళ్లాడు.

**అస్మిన్ స్థలే దైత్యకుమారకాన్ ప్రతిహరేశ్చ తత్త్వం పరిపృష్టవాన్ ప్రభుః ।**
**నృసింహరూపం శ్రీనివాసం భజస్వసుదుర్లభం మానుషం జన్మ కన్యే! ॥64॥**

ఈ స్థలమందు ఆ ప్రభువు దైత్యకుమారకులను ఉద్దేశించి (నృసింహరూపమును ధ్యానించి) హరితత్త్వాన్ని చెప్పినవాడయ్యాడు. కుమారీ! మానుషజన్మ మిక్కిలి దుర్లభమైనది. నృసింహరూపుడైన శ్రీనివాసుని భజించు.

**తత్రాపి విష్ణో ర్నృహరే సుతత్త్వం సుదుర్లభం సుష్ఠు యాత్రా తథైవ ।**
**యస్యాం యాత్రాయాం యత్ర కుత్రాపి దేశేహరేః కథా వర్తతే దైత్యవర్యాః ॥65॥**

అందుకూడ విష్ణువైన నృసింహునియొక్క గొప్ప తత్త్వం మిక్కిలి దుర్లభమైనది. అలాగే గొప్పదైన యాత్రకూడ. దైత్యవర్యులారా! ఏ యాత్రయందైనా ఎక్కడో అక్కడ ఒక ప్రదేశంలో హరికథ ప్రవర్తించునో(సాగునో),

**తత్ర స్థలే హరిరాస్తే సదైవయతో వ్యాప్తః సర్వతో వై నృసింహః ।**
**ఏతచ్ఛ్రుత్వా దైత్యకుమారకాస్తేప్రహ్లాదమూచు ర్భక్తవర్యం హరేశ్చ ॥66॥**

ఆ స్థలమందు ఎల్లప్పుడు హరి ఉంటాడు. ఎందువల్లననగా నృసింహుడు అంతటా వ్యాపించి ఉంటాడు. దైత్యకుమారకులు దీనిని విని, హరిభక్తశ్రేష్ఠుడైన ప్రహ్లాదునితో ఇలా పలికారు.

**వ్యాప్తో హరిశ్చేత్కథమత్ర వై సఖే! న దృశ్యతే జలరూపీ నృసింహః ।**
**స ఏవముక్తో దానవానాం సుతైశ్చ తుష్టావ విష్ణుం పరమాదరేణ ॥67॥**

"మిత్రమా! హరి అంతటా వ్యాపించియున్నవాడయితే, ఇందు జలరూపంలో నృసింహుడు ఎందుకు కనబడటం లేదు?" అని అతడు దానవులచే అడుగబడినవాడై మిక్కిలి భక్తితో హరిని స్తుతించాడు.

**తవ స్వరూపం మమ దర్శయస్వ స్వయోగ్యరూపం దానవానాం సుతానామ్ ।**
**ఇతి స్తుతః శ్రీనివాసో హరిస్తుతస్మిన్నంతర్జలరూపం సమాయాత్ ॥68॥**

"దానవపుత్రులయొక్క అర్హతకు అనుగుణంగా నీ స్వరూపం నాకు చూపించు" అని ప్రహ్లాదుడు స్తుతించగా శ్రీనివాసుడైన హరి ఆ తీర్థం మధ్యలోనికి జలరూపంలో వచ్చాడు.

**అస్మిన్ స్నానం యే ప్రకుర్వంతి తీర్థే తేషాం జ్ఞానం పరమం దృఢం స్యాత్ ।**
**అత్ర స్నానే మానుషాణాం చ తాత! బుద్ధి ర్నహి స్యాత్కలికాలే విశేషాత్ ॥69॥**

ఈ తీర్థమందు ఎవరు స్నానం చేస్తారో, వారికి జ్ఞానం మిక్కిలి దృఢమవుతుంది. నాయనా! ఇక్కడ స్నానం చేయుటవల్ల విశేషించి కలియుగంలో మానవుల బుద్ధి మందగించదు.

**దత్వా వరం దైత్యవరాయ విష్ణురంతర్దధే జలపూర్ణే సుకుండే ।**
**అద్యాప్యాస్తే జలమధ్యే నృసింహః ప్రహ్లాదోఽపి దైత్యకుమారకైః సహ ॥70॥**

ఇట్లు విష్ణువు ఆ దైత్యవరునకు వరమిచ్చి, జలంతో నిండిన గొప్ప కుండంలో అంతర్ధానమయ్యాడు. ఇప్పటికిని జలమధ్యంలో దైత్యకుమారకులతో కలసి ప్రహ్లాదుడు, నృసింహుడు వసించియున్నారు.

**తస్మిన్ సుతీర్థే పరిత స్తత్ర తత్ర జయేతి శబ్దః శ్రూయతే చాపరాహ్ణే ।**
**ఇదం తీర్థం నారసింహాభిధం చ కన్యే! స్నానం హ్యత్ర కార్యం మనుష్యైః ॥71॥**

గొప్పదైన ఆ తీర్థం చుట్టూ అపరాహ్ణమందు ఎక్కడ పడితే అక్కడ 'జయ' అనే శబ్దం వినబడుతూ ఉంటుంది. కుమారీ! ఈ తీర్థం నారసింహమనే పేరు గలది. ఇక్కడ మనుష్యులు స్నానం చేయాలి

**స్నానం కృత్వా తత్ర తీర్థే చ సమ్యక్ దీపం దత్వా ద్విజవర్యాయ ముఖ్యమ్ ।**
**ద్రష్టుం పునః శ్రీనివాసం ప్రజగ్ముర్గోవింద గోవింద ఇతి బ్రువంతః ॥72॥**

అక్కడ తీర్థంలో చక్కగా స్నానం చేసి, ప్రధానంగా ద్విజవర్యునకు దీపం దానం చేసి, గోవింద, గోవింద అని పలుకుతూ శ్రీనివాసుని దర్శించటానికి తిరిగి బయలుదేరారు.

**ముఖ్యప్రాణాధిష్ఠితం స్థానమాప్య ఉపావిశత్తత్ర దేవీహ్యువాచ ।**
**జైగీషవ్య శ్రీనివాసస్య విష్ణోః కథం కార్యం దర్శనం తద్వదస్వ ॥73॥**

ముఖ్యప్రాణంచే అధిష్ఠింపబడే స్థానాన్ని పొంది, అక్కడ దేవి కూర్చున్నదై తిరిగి ఇట్లు పలికింది. జైగీషవ్యా! విష్ణువైన శ్రీనివాసుని దర్శనం ఎలా చేయాలో చెప్పు.

**జైగీషవ్యః ప్రాహ సంతుష్ట చిత్తో బ్రవీమి తంత్రం శృణు కన్యకే! త్వమ్ ।**
**శ్రుత్వా మత్తః కురు సర్వం మయోక్తమాద్యం ద్వారం శ్రీనివాసస్య దృష్ట్వా ॥74॥**

**అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయా ।**
**తాని సర్వాణి మే దేవ! క్షమస్వ పురుషోత్తమ! ॥75॥**

**మానసాన్ వాచికాన్ దోషాన్ కాయికానపి సర్వశః ।**
**వైష్ణవద్వేషహేతూన్ మే భస్మసాత్ కురు మాధవ! ॥76॥**

జైగీషవ్యుడు సంతుష్టచిత్తుడై ఇలా పలికాడు. కన్యకా! నీవు విను. తంత్రం చెప్తున్నాను. నావలన విని అంతా నేను చెప్పినట్లు చేయవలసింది. శ్రీనివాసుని మొదటి ద్వారాన్ని చూచి, వేలకొలది అపరాధాలు రాత్రి, పగలు నాచే చేయబడుతున్నాయి. దేవా! పురుషోత్తమా! వాటినన్నింటిని క్షమించు. మానసిక, వాచిక, కాయిక దోషాలనన్నింటిని, మాధవా! విష్ణుద్వేష కారణాలనన్నింటిని భస్మం కావించు.(అని వేడుకోవాలి)

**ఆద్య ద్వారం శ్రీనివాసస్య దేవి! సమ్యక్ స్మరేద్విజయం వై జయం చ ।**
**దక్షాధ్వరే శ్రీనివాసస్య దేవి! చండం ప్రచండం సంస్మరేత్సమ్యగేవ ॥77॥**

దేవీ! శ్రీనివాసుని ఆదిద్వారమిది. జయుని, విజయుని అక్కడ భక్తితో స్మరించాలి. దేవీ! దక్షునియాగ సమయంలోని) చండుని, ప్రచండుని కూడ శ్రీనివాసుని ఆదిద్వారంవద్ద చక్కగా స్మరించాలి.

**పాశ్చాత్యభాగే శ్రీనివాసస్య దేవి! నందం సునందం సంస్మరేదేవ భక్త్యా ।**
**సవ్యద్వారే శ్రీనివాసస్య కన్యే! స్మరేత్కుముదాక్షం కుముదంతమేవ ॥78॥**

దేవీ! శ్రీనివాసుని పాశ్చాత్యభాగమందు నందుని, సునందుని భక్తితో స్మరించాలి. కుమారీ! శ్రీనివాసుని సవ్య(ఎడమ) ద్వారమందు కుముదాక్షుని, కుముదంతుని స్మరించాలి.

**యశ్చైవ దేహం ప్రవిశేద్భక్తిపూర్వం కదా ద్రక్ష్యే సాదరేణైవ దేవి! ।**
**ప్రదక్షిణ ద్వాదశకం చ కృత్వాపదే పదే సంస్మరే చ్ఛ్రీనివాసమ్ ॥79॥**

దేవీ! ఎవడయితే జన్మ ధరిస్తాడో, అతడు ఆదరంతో భక్తిపూర్వకంగా 'ఎప్పుడు శ్రీనివాసుని చూస్తానో కదా!' అనుకొంటూ పంద్రెండుసార్లు ప్రదక్షిణం చేస్తూ, అడుగు అడుగునందు శ్రీనివాసుని స్మరించాలి.

**శ్రీస్వామి తీర్థే సమ్యగాచమ్య నత్వా స్నాత్వా నత్వా భూవరాహం చ దేవి! ।**
**అయుద్వారం ప్రవిశేద్భక్తిపూర్వం గోవింద గోవింద ఇతి బ్రువన్వై ॥80॥**

శ్రీస్వామితీర్థంలో భక్తితో వంగి ఆచమించి, దేవీ! పిమ్మట స్నానమాచరించి, భూసమేత వరాహస్వామికి వంగి ప్రణమిల్లి, గోవింద! గోవింద! అంటూ భక్తిపూర్వకంగా అయుద్వారం (ప్రధానద్వారం) ప్రవేశించాలి.

**పశ్చాద్ధరేర్నమనం కార్యమేవసాష్టాంగరూపం ప్రవిశేద్దేవగేహమ్ ।**
**పునర్విశేషాద్ద్వారతః సంస్థితః సపీఠస్థదేవాన్ మనసా చింతయీత ॥81॥**

అటుపిమ్మట హరికి సాష్టాంగరూపమైన ప్రణామం చేసి, దేవమందిరాన్ని ప్రవేశించాలి. ద్వారంవద్ద ఉన్నవాడై అతడు పీఠమందలి దేవతలను మనస్సుచే ధ్యానిస్తూ తిరిగి ప్రవేశించాలి.

**మధ్యే పీఠం శ్రీనివాసం చ దేవి! నారాయణం ప్రణమేత్పూర్వమేవ ।**
**దేవస్య సవ్యే పీఠభాగాద్బహిశ్చ నమస్కార్యం గురుదేవాయ చైవ ॥82॥**

దేవీ! ముందు పీఠమధ్యమందు నారాయణుడగు శ్రీనివాసునికి నమస్కరించాలి. దేవునియొక్క ఎడమ భాగమందు పీఠభాగానికి వెలుపల గురుదేవునికి కూడ నమస్కరించాలి.

**పీఠస్యాగ్రాచ్చాపృథస్తాత్ ప్రదేశే ఆగ్నేయకోణే ప్రణమేద్వై ఖగేంద్ర! ।**
**నైరృత్యభాగే వ్యాసదేవాయ దేవి! నమస్కార్యో వైష్ణవః సర్వదాపి ॥83॥**

ఖగేంద్రా! పీఠానికి ఎగువ దిగువ తావులలో (ప్రదేశములలో) ఆగ్నేయకోణంలో నమస్కరించాలి. దేవీ! నైరృతిభాగంలో వ్యాసదేవుని నమస్కరించాలి. అంతటను విష్ణువుకు నమస్కారం చేయాలి.

**వాయవ్యకోణే భక్తిపూర్వం సుదుర్గాం నమస్కుర్యాద్భక్తి సంవర్ధితాత్మా ।**
**పీఠస్యోర్ధ్వం హ్యగ్నికోణేషు దేవిధర్మాధిభూతాయ నమో యమాయ ॥84॥**

వాయవ్యకోణమందు భక్తిసంవర్ధిత మనస్కుడై, వినయపూర్వకంగా దుర్గాదేవిని నమస్కరించాలి. దేవీ! పీఠానికి ఊర్ధ్వభాగంలో అగ్నికోణంలో ధర్మాధిదేవతయైన యమునకు నమస్కరించాలి.

**పీఠస్యోర్ధ్వం నైరృతస్యోర్ధ్వకోణే జ్ఞానాధిపం ప్రణమేద్వాయుదేవమ్ ।**
**పీఠస్యోర్ధ్వం వాయుకోణే చ సుభ్రూర్వైరాగ్యానామధిపం చైవ రుద్రమ్ ॥85॥**

పీఠంయొక్క పైభాగంలో నైరృతదిశను ఊర్ధ్వకోణంలో జ్ఞానాధిపుడైన వాయుదేవుని నమస్కరించాలి. మంచి కనుబొమలు గల దేవీ! పీఠం ఊర్ధ్వభాగంలో వాయుకోణంలో వైరాగ్యాధిపతియైన రుద్రుని నమస్కరించాలి.

**పీఠస్యోర్ధ్వం త్వీశకోణే చ దేవి! ఐశ్వర్యాణా మధిపం చేంద్రదేవమ్ ।**
**పీఠస్య పూర్వే ప్రణమేన్ నైరృతిం చ అర్యమ్ణానా మధిపం చాత్ర దేవి! ॥86॥**

దేవీ! పీఠానికి పైని ఈశానకోణంలో ఐశ్వర్యాలకు అధిపతియైన ఇంద్రునికి (దేవేంద్రునికి) నమస్కరించాలి. దేవీ! పీఠానికి తూర్పుభాగంలో అర్యములకు అధిపతియైన నైరృతిని నమస్కరించాలి.

**దేవస్య పీఠస్య చ దక్షిణేన దుర్గాం నమేదుగ్రరూపాభిధాం చ ।**
**పీఠస్య కన్యే! ప్రణమేత్పశ్చిమే వై ఆరోగ్యాణా మధిపం కామదేవమ్ ॥87॥**

దేవుని పీఠానికి దక్షిణంలో ఉగ్రరూపురాలని చెప్పబడే దుర్గకు ప్రణమిల్లాలి. కుమారీ! పీఠానికి పశ్చిమంలో ఆరోగ్యాలకు అధిపుడైన కామదేవునికి ప్రణామం చేయాలి.

**దేవస్య పీఠస్యోత్తరే రుద్రదేవమనైశ్వర్యాణా మధిపం సంస్మరేచ్చ ।**
**పీఠస్య మధ్యే ప్రణమేద్వై వరాహం సదా కన్యే! పరమం పూరుషాఖ్యమ్ ॥88॥**

దేవుని పీఠానికి ఉత్తరంలో వైరాగ్యాదులకు అధిపతియైన రుద్రదేవుని సంస్మరించాలి. పీఠానికి మధ్యప్రదేశంలో కుమారీ! ఎల్లప్పుడు పరమపూరుషుడని చెప్పబడే వరాహమూర్తికి ప్రణమిల్లాలి.

**తస్యోపరిష్టాచ్ఛక్తి సంజ్ఞాం చ లక్ష్మీమాధారరూపాం ప్రణమేచ్చైవ నిత్యమ్ ।**
**తస్యోపరిష్టాద్వాయుకూర్మౌ నమేచ్చ తస్యోపరిష్టాచ్ఛేషకూర్మౌ నమేచ్చ ॥89॥**

దానికి పైని శక్తి అనే పేరు కల్గిన ఆధారరూపయైన లక్ష్మికి నిత్యమూ ప్రణమిల్లాలి. దానికి పైని వాయు కూర్మాలకు నమస్కరించాలి. ఆపైని శేషునికి, ఆదికూర్మానికి నమస్కారం చేయాలి.

**తస్యోపరిష్టా దభిమానినీం భువోభూదేవతాం ప్రణమేచ్చైవ సుభ్రూః! ।**
**తస్యోపరిష్టాద్వరుణం సంస్మరేచ్చ క్షీరోదధేరధిపం చైవ దేవమ్ ॥90॥**

మంచి కనుబొమలు గల కుమారీ! ఆపైని భూమికి మిక్కిలి అభిమానదేవతయైన భూదేవికి ప్రణమిల్లాలి. ఆపైని క్షీరసాగరాధిపతియైన వరుణదేవుని సంస్మరించాలి.

**తస్యోపరిష్టాత్ ప్రణమేచ్చైవ లక్ష్మీం శ్వేతద్వీపాఖ్యం కన్యకే! పూజయేచ్చ ।**
**తస్యోపరిష్టా త్ప్రణమేచ్చైవ లక్ష్మీం మహాదివ్యాం మండపసంజ్ఞకాం చ ॥91॥**

కన్యకా! దానికి పైభాగాన లక్ష్మికి నమస్కరించాలి. శ్వేతద్వీపమని పిలువబడేదానిని కూడ పూజించాలి. దానికి పైభాగాన మహాదివ్యమైన మండపసంజ్ఞ కల లక్ష్మికి ప్రణమిల్లాలి.

**పీఠస్య మధ్యే యమసంజ్ఞాం చ లక్ష్మీం సమర్చయేద్యమ మధ్యే చ దేవీమ్ ।**
**యమస్య దేవస్య చ దక్షిణే చ సూర్యం నమేద్దీపరూపం చ భద్రే! ॥92॥**

పీఠంయొక్క మధ్యప్రదేశంలో యమునిమధ్యలో యమసంజ్ఞ కల లక్ష్మీదేవిని భక్తితో అర్చించాలి. భద్రురాలా! యమదేవునియొక్క దక్షిణభాగంలో దీపరూపంలో నున్న సూర్యునికి నమస్కరించాలి.

**యమస్య దేవస్య చ వామభాగే శ్రియం నమే ద్దీపరూపాం చ దేవీమ్ ।**
**యమస్య దేవస్య తు చాగ్రభాగే హుతాశనం దీపరూపం నమేచ్చ ॥93॥**

యమదేవుని వామభాగంలో దీపరూపయైన శ్రీదేవిని నమస్కరించాలి. యమదేవుని అగ్రభాగంలో దీపరూపంలో నున్న అగ్నికి నమస్కరించాలి.

**దేవస్యాగ్రే భూమినామ్నీం నమేచ్చ తత్త్వాభిమానాం సంస్మరేచ్చైవ నిత్యమ్ ।**
**పర్యంకరూపం శ్రీనివాసస్య విష్ణోస్తమోఽభిమానాం సన్నమేచ్చైవ దుర్గామ్ ॥94॥**

దేవుని అగ్రభాగంలో భూమి అనే పేరుగల దేవతకు నమస్కరించాలి. ఆ తత్త్వాభిమానను నిత్యమూ భక్తితో స్మరించాలి. విష్ణువైన శ్రీనివాసునియొక్క పర్యంకరూపాన్ని, తమోఽభిమానయైన దుర్గను భక్తితో నమస్కరించాలి.

**పూర్వాదిగం పీఠ సోపానరూపం ఆత్మానమేకం ప్రణమేచ్చ దేవి! ।**
**దక్షస్థ దిక్ప్రీత సోపానరూపం జ్ఞానాత్మకం ప్రణమేచ్చైవ కన్యే! ॥95॥**

దేవీ! తూర్పుదిక్కున నున్న పీఠ సోపానరూపమైన తనను తానుగా ఒక్కనిగా ప్రణమిల్లాలి. కన్యకా! దక్షిణంలోనున్న దిక్ప్రీతమగు సోపానరూపాన్ని జ్ఞానాత్మకంగా ప్రణమిల్లాలి.

**పద్మస్య పూర్వస్థ దలే చ దేవి! స్త్రీరూపాఖ్యం విమలాఖ్యామిమాం చ ।**
**బ్రహ్మాది దేవాన్ ప్రణమేచ్చ దేవి! ఆగ్నేయకోణస్థ దలే శృణు త్వమ్ ॥96॥**

**ఉత్కర్షనామ్నీం పరమాం చ దేవీం నమేద్రమాం బ్రహ్మావాయూ చ శేషమ్ ।**
**దక్షస్థ పద్మస్య దలాష్టకే చ నారాయణాకార శేషాదికానామ్ ॥97॥**

**స్త్రీరూపేభ్యో నమనం కార్యమేవకన్యే! మయా పశ్చిమస్థే దలే చ ।**
**గోపాఖ్య నారాయణ బ్రహ్మావాయువిప్రాదికానాం శేషరుద్రాదికానామ్ ॥98॥**

**స్త్రీరూపేభ్యో నమనం కార్యమేవ ఈశాన కోణస్థ దలేషు చైవ ।**
**ఈశాన నారాయణ మావిరించవాయుర్వియచ్ఛేష సురాదికానామ్ ॥99॥**

**స్త్రీరూపేభ్యో నమనం కార్యమేవ తథైవ పద్మస్య చ మధ్యభాగే ।**
**అనుగ్రహాఖ్యా విష్ణులక్ష్మీశ్చ దేవీవాయుర్వియచ్ఛేష రుద్రాదికానామ్ ॥100॥**

**స్త్రీరూపాణాం నమనం కార్యమేవ సుయోగపీఠస్య స్వరూపభూతమ్ ।**
**సదా నమేచ్ఛ్రీమదనంత సంజ్ఞమేనం నమేచ్ఛ్రీనివాసం చ దేవమ్ ॥101॥**

దేవీ! పద్మానికి తూర్పున నున్న రేకు(దళము)నందు స్త్రీరూపంలో ఉండే 'విమల' అనే పేరు గల ఈ శక్తిని (ఉపాసించాలి). అట్లే బ్రహ్మాది దేవతలకు ప్రణమిల్లాలి. దేవీ! నీవు ఆకర్ణించు. ఆగ్నేయకోణంలో నున్న దళమందు, 'ఉత్కర్ష' అను పేరు గల పరాశక్తియైన దేవిని, రమను, బ్రహ్మను, వాయువును, శేషుని నమస్కరించాలి. కుడిభాగాన ఉన్న పద్మంయొక్క ఎనిమిది దళములందు నారాయణాకారంలో ఉండే శేషుడు మున్నగువారికి, స్త్రీరూపాలకు నమస్కారం చేయదగియున్నది. కుమారీ! నేను చెప్పినట్లుగా(నాచే) పశ్చిమంలో నున్న దళమందు గోపాఖ్య నారాయణుడు, బ్రహ్మ, వాయువు, విప్రులు మున్నగు వారికి శేషుడు రుద్రుడు మున్నగువారికి, స్త్రీరూపాలకు నమస్కారం చేయదగియున్నది. ఈశాన కోణంలో నున్న దళాలయందు ఈశాన నారాయణుని, విరించుడు, వాయువు, ఆకాశం, శేషుడు, దేవతలు మున్నగు వారియొక్క స్త్రీరూపాలకు నమస్కారం చేయదగినది. అలాగే పద్మంయొక్క మధ్యభాగంలో 'అనుగ్రహ' అనే పేరు గల విష్ణుపత్ని యైన లక్ష్మీదేవి, వాయువు, వియత్తు, శేషుడు, రుద్రుడు మున్నగువారికి, స్త్రీరూపాలకు నమస్కారం చేయదగియున్నది. సుయోగపీఠ స్వరూపమైన అనంతుడనే పేరు గలవానికి ఎల్లప్పుడు నమస్కరించాలి. దేవుడైన శ్రీనివాసునికి ప్రణమిల్లాలి.

**శ్రీనివాసస్య వామే తు లక్ష్మీం చ ప్రణమేద్బుధః ।**
**శ్రీనివాసస్య సవ్యే తు ధరాయై ప్రణమేచ్ఛుభే! ॥102॥**

శుభస్వరూపురాలా! వివేకవంతుడైనవాడు శ్రీనివాసునకు వామ(ఎడమ) భాగమందు లక్ష్మికి ప్రణమిల్లాలి. శ్రీనివాసుని సవ్యభాగమందు(కుడిభాగం) శుభప్రదురాలా! ధరాదేవికి ప్రణామం చేయాలి.

**పీఠాద్బహిః పూర్వభాగే కృపోల్కం ప్రణమేచ్ఛుభమ్ ।**
**మహోల్కం దక్షిణే చైవ వీరోల్కం పశ్చిమే నమేత్ ॥103॥**

పీఠానికి వెలుపల తూర్పుభాగంలో శుభుడైన కృపోల్కునికి ప్రణమిల్లాలి. దక్షిణంలో మహోల్కునికి, పశ్చిమంలో వీరోల్కునికి ప్రణామం చేయాలి.

**ఉత్తరే చ నమః కుర్యాదుల్కాయ మహాత్మనే ।**
**చతుర్ష్వపి చ కోణేషు సహస్రోల్కం నమేత్సుధీః ॥104॥**

ఉత్తరమందు మహాత్ముడైన ఉల్కునకు నమస్కారం చేయాలి. విద్వాంసుడు నాలుగు కోణములయందు సహస్రోల్కునికి ప్రణమిల్లాలి.

**పూర్వే తు వాసుదేవాయ నమస్కుర్యాచ్చ దక్షిణే ।**
**సంకర్షణాయ దేవాయ ప్రద్యుమ్నాయ చ పశ్చిమే ॥105॥**

**ఉత్తరే హ్యనిరుద్ధాయ నమస్కుర్యాదతంద్రితః ।**
**ఆగ్నేయే చ నమస్కుర్యాత్కన్యే! మాయాం సదా శుభే! ॥106॥**

తూర్పున వాసుదేవునికి నమస్కరించాలి. దక్షిణమందు సంకర్షణదేవునికి, పశ్చిమాన ప్రద్యుమ్నునికి, ఉత్తరాన అనిరుద్ధునకు, ఉత్సాహంతో నమస్కరించాలి. నిత్యశుభస్వరూపురాలా! కుమారీ! (నిత్యశుభమైన) ఆగ్నేయమందు మాయాదేవికి నమస్కరించాలి.

**జయాయై చ నమస్కుర్యాత్ నైరృత్యే చాపి వాయవే ।**
**కృత్యే చైవ నమస్కుర్యాదీశాన్యే శాంతిసంజ్ఞకామ్ ॥107॥**

నైరృత్యభాగమందు జయకు నమస్కరించాలి. వాయవ్యమునందు కృత్యకు నమస్కరించాలి. ఈశాన్యమందు శాంతి అను పేరుగల యామెకు నమస్కరించాలి.

**కేశవాయ నమః పూర్వే తథా నారాయణాయ చ ।**
**మాధవాయ నమస్కుర్యా న్నైరృత్యే చాపి వాయవే ॥108॥**

తూర్పుభాగాన కేశవునికి నమస్కరించాలి. అలాగే నారాయణునకు మాధవునికి నైరృత్యమందు, వాయవ్యమందు నమస్కరించాలి.

**ఆగ్నేయే కన్యకే నిత్యం భక్త్యా తు ప్రయతః శుభే! ।**
**గోవిందాయ నమస్కుర్యా ద్దక్షిణే విష్ణవే తథా ॥109॥**

కుమారీ! శుభమైన ఆగ్నేయమందు నిత్యము భక్తితో కూడుకొన్నవాడై గోవిందునికి నమస్కరించాలి. అలాగే దక్షిణాన విష్ణువుకు ప్రణమిల్లాలి.

**మధుసూదనాయ భోః కన్యే! నమస్కుర్యాత్తు నైరృతౌ ।**
**పశ్చిమే త్రివిక్రమాయ వామనాయ తథైవ చ ॥110॥**

**విష్ణవే శ్రీధరాయాథ నమస్కుర్యాచ్చ భామిని! ।**
**ఉత్తరే తు మహాకన్యే! హృషీకేశాయ వై నమః ॥111॥**

ఓ కుమారీ! నైరృతియందు మధుసూదనునికి నమస్కరించాలి. పశ్చిమాన త్రివిక్రముడైన వామనునికి, అట్లే భామినీ! విష్ణువుకు, శ్రీధరునకు ప్రణమిల్లాలి. గొప్పదానివైన కుమారీ! ఉత్తరాన హృషీకేశునికి నమస్కరించాలి.

**తథా వై పద్మనాభాయ నమస్కుర్యాదతంద్రితః ।**
**దామోదరాయ చైశాన్యే నమస్కుర్యాచ్చ భామిని! ॥112॥**

అదేవిధంగా ఇంద్రియాలను స్వాధీనంలో నుంచుకొని, పద్మనాభునికి నమస్కరించాలి. భామినీ! ఐశాన్యమందు దామోదరునికి నమస్కారం చేయాలి.

**చతుర్థావరణే పూర్వే మహాకూర్మాయ వై నమః ।**
**వరాహాయ నమస్కుర్యాదాగ్నేయే కన్యకే! శుభే ॥113॥**

చతుర్థావరణంలో తూర్పున మహాకూర్మానికి నమస్కరించాలి. కన్యకా! శుభమైన ఆగ్నేయమందు వరాహమూర్తికి నమస్కారం చేయాలి.

**దక్షిణే నారసింహాయ వామనాయ నమో నమః ।**
**భార్గవాయ నమస్కుర్యా న్నైరృత్యే శుద్ధచేతసా ॥114॥**

దక్షిణాన నారసింహునకు, వామనునకు పదేపదే నమస్కరించాలి. నైరృత్యమందు పరిశుద్ధ చిత్తంతో భార్గవరామునికి ప్రణమిల్లాలి.

**పశ్చిమే మాధవాయాథ తథా కృష్ణాయ వై నమః ।**
**బుద్ధాయ చ నమస్కుర్యా ద్వాయవ్యే కన్యకే! శుభే ॥115॥**

పశ్చిమమందు మాధవునకు, అలాగే కృష్ణునకు నమస్కరించాలి. కన్యకా! శుభమైన వాయవ్యమందు బుద్ధునకు నమస్కారం చేయాలి.

**ఉత్తరే హ్యుల్కరూపాయ అనంతాయ నమోఽస్తు తే ।**
**ఈశాన్యే విశ్వరూపాయ నమస్కుర్యాదతంద్రితః ॥116॥**

ఉత్తరమందు ఉల్కరూపుడగు అనంతుడవైన నీకు నమస్కారం. ఈశాన్యమందు విశ్వరూపునకు జాగరూకుడై నమస్కరించాలి.

**ఆగ్నేయే వారుణీం చైవ గాయత్రీం చైవ నైరృతే ।**
**వాయవ్యే భారతీం చైవ ఈశాన్యే గిరిజాం నమేత్ ॥117॥**

ఆగ్నేయమందు వారుణికి , నైరృతమందు గాయత్రికి, వాయవ్యమందు భారతికి, ఈశాన్యమందు గిరిజకు నమస్కరించాలి.

**గిరిజా(ం)వామభాగే తు సౌపర్ణీం చైవ సంనమేత్ ।**
**ప్రాగింద్రాయ నమస్కుర్యాత్ సాయుధాయ తథైవ చ ॥118॥**

గిరిజయొక్క వామభాగంలో సౌపర్ణిని భక్తితో నమస్కరించాలి. తూర్పున ఆయుధంతో కూడుకొన్న ఇంద్రునికి నమస్కరించాలి.

**సపరిగ్రహాయ శ్రీవిష్ణోః పార్షదాయ నమో నమః ।**
**ఆగ్నేయే త్వగ్నయే తుభ్యం సాయుధాయేతి పూర్వవత్ ॥119॥**

సపరివారుడైన శ్రీవిష్ణువుయొక్క పార్షదునకు నమస్కరించాలి. ఆగ్నేయమందు సాయుధుడవైన అగ్నీ! నీకు నమస్కారం అంటూ పూర్వమునందువలె ఆచరించాలి.

**దక్షిణే తు యమాయైవ నైరృత్యాం నిరృతిం యజేత్ ।**
**పశ్చిమే వరుణాయైవ వాయవ్యే వాయవే నమః ॥120॥**

దక్షిణమందు యముని, నైరృతియందు నిరృతిని యజించాలి. పశ్చిమమందు వరుణునికి, వాయవ్యమందు వాయువుకు నమస్కరించాలి.

**ఉత్తరే చ కుబేరాయ ఈశాన్యే చ శివాయ చ ।**
**ఈశాన శక్రయోర్మధ్యే బ్రహ్మణే సాయుధాయ చ ॥121॥**

ఉత్తరమందు కుబేరుని, ఈశాన్యమందు శివుని నమస్కరించాలి. ఈశానునకు, ఇంద్రునకు నడుమ సాయుధుడైన బ్రహ్మను యజించాలి.

**నిరృత్యప్పతి మధ్యే తు శేషాయ చ నమో నమః ।**
**ఏవం కృత్వా నమస్కారం ప్రణమేచ్చ పునః పునః ॥122॥**

నిరృతికి, వరుణునికి మధ్యలో శేషునికి నమస్కరించాలి. ఈవిధంగా నమస్కారం చేసి, మళ్లీ మళ్లీ ప్రణమిల్లాలి.

**ఇత్యేతత్సర్వమాఖ్యాతం విధిపూర్వం తు దర్శనమ్ ।**
**ఇతః పరంతు గంతవ్యం దర్శనార్థం రమాపతేః ॥123॥**

ఇలా అంతయూ చెప్పబడినది. శాస్త్రవిధానంగా దర్శనం చేయాలి. ఇకమీదట రమాపతిదర్శనంకోసం వెళ్లాలి.

**ఏవముక్తా తు సా దేవీ తైః సార్ధం తు యయౌ ముదా ।**
**యదుక్తః శ్రీనివాసస్య దర్శనస్య విధిః ఖగ! ॥**
**కస్యచిన్నైవ వక్తవ్యో గోప్యత్వాచ్చ కదాచన ॥124॥**

ఆ విధంగా చెప్పగా ఆ దేవి వారందరితో కలిసి సంతోషంతో బయలుదేరింది. ఖగమా! శ్రీనివాసుని దర్శనవిధానం ఏదయితే చెప్పబడిందో అది రహస్యం కావున ఎన్నడు, ఎవరికి చెప్పరాదు సుమా!

**సమాగమో దుర్ఘట ఏవ వీంద్ర! సతాం చ సత్తత్త్వ విబోధకానామ్ ।**
**అనేక జన్మార్జిత పుణ్యసంచయాదభూద్గురోః సంగమ ఏవ తస్య ॥125॥**

పక్షీంద్రా! భగవత్తత్త్వం పూర్తిగా తెలిసిన సత్పురుషులయొక్క సమాగమం లభింపరానిది. అనేక జన్మలలో సంపాదింపబడిన పుణ్యపుంజంవలన అటువంటి గురువుయొక్క సంగమం లభిస్తుంది.

**పయో వికారం చ నిజం జహాతిశేషస్య శేషం నలినస్య పంకజమ్ ।**
**భావం చలం పంకజనాభయోగాత్ సత్సంగయోగా దశుభాని న స్యుః ॥126॥**

పయస్సు తన వికారాన్ని విడిచిపెడుతుంది. శేషునికి శేషం, నలినానికి పంకజత్వం అంటదు. పద్మనాభుని సందర్శన యోగంవలన, సత్సంగ యోగంవలన భావం, చలంవంటి అశుభాలు కలుగనేరవు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే శ్రీవేంకటేశ గిర్యారోహణక్రమ తద్భక్త తత్పర్వత నామాది నిరూపణం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో శ్రీవేంకటేశ్వరపర్వతారోహణక్రమం, తద్భక్త, తత్పర్వతనామాలు అనే ఇరవై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచవింశోஉధ్యాయః – ఇరవై ఐదవ అధ్యాయం
## దేవీకృతవ్యంకటేశదర్శనస్తుతీః – దేవి వేంకటేశ్వరుని దర్శించి స్తుతించుట

**సా ద్వారదేశే శ్రీనివాసస్య దేవీ స్వామిపుష్కరిణీం దదృశే కైశ్చ సార్థమ్ ।**
**స్వామిన్! హరే! శ్రీనివాసేతి సా తం బ్రహ్మాదీనాం తారకం సంప్రదధ్యౌ ॥1॥**

ఆ దేవి ద్వారదేశమందు శ్రీనివాసుని స్వామిపుష్కరిణిని దేవతలతో (కొంతమందితో) కలిసి దర్శించింది. స్వామీ! హరీ! శ్రీనివాసా! అంటూ ఆమె ఆ బ్రహ్మాదులను తరింపజేసే దేవుని ధ్యానించింది.

**దేవైః సార్థం పాలనార్థం చ విష్ణురస్త్యేవ నిత్యం పుష్కరిణ్యాం జలేషు ।**
**అతః స్వామిపుష్కరిణీతి చాహుస్తత్ర స్నానం కన్యకాన్యాశ్చ చక్రుః ॥2॥**

దేవతలతో కలసి విష్ణువు లోకపాలనంకోసమై నిత్యమూ పుష్కరిణీ జలములందు ఉంటాడు. అందువలన దానిని స్వామిపుష్కరిణిగా వచిస్తారు. అక్కడ కన్యక, మిగిలినవారు స్నానాలు చేశారు.

**శుచిర్భూత్వా శ్రీనివాసం చ దేవా స్తప్తుం వివిశుః శుద్ధభక్త్యా ఖగేంద్ర! ।**
**యథోపదిష్టం గురుణా తథైవచక్రే కన్యాశ్చ సర్వం ఖగేంద్ర! ॥3॥**

ఖగేంద్రా! పవిత్రతను పొంది దేవతలు పరిశుద్ధ భక్తితో శ్రీనివాసునిగురించి తపస్సుకొరకై ప్రవేశించారు. గురువు ఏవిధంగా ఉపదేశించాడో, ఆవిధంగా కన్యలు అంతా నిర్వహించారు.

**తదా హరిం దర్శయామాస తస్యైస్వకం రూపం సుప్రతీకే సుపూర్ణమ్ ।**
**సా కన్యకా శ్రీనివాసస్య రూపం దదర్శ భక్త్యా స్వమనోஉభిరామమ్ ॥4॥**

అప్పుడు ఆమెకు శ్రీనివాసుడు గొప్పదైన ప్రతీకమందు(విగ్రహమందు) మిక్కిలి పూర్ణమైన తన హరి స్వరూపాన్ని ప్రకటించాడు. ఆ కన్యక భక్తితో తన మనస్సుకు తగిన అందమైన శ్రీనివాసుని రూపాన్ని చూచింది.

**సువర్ణచిత్రం వసనం వసానం సోష్ణీషకం కంచుకం సందధానమ్ ॥5॥**

బంగారపు రంగు కలిగిన విచిత్రమైన వస్త్రం ధరించినవానిని, తలపాగా చొక్కా ,చక్కగా దాల్చినవానిని,

**మృగోత్థమద గంధేన సురభీకృత దిఙ్ముఖమ్ ।**
**పుండరీక విశాలాక్షం కంబుగ్రీవం మహాభుజమ్ ॥6॥**

కస్తూరి మృగమునుండి వచ్చిన మదగంధంచే పరిమళింపబడిన దిగ్భాగం కలిగిన వానిని (దిక్కులయందు వ్యాపించిన సుగంధంతో కూడినవానిని) తామరపూలవంటి విశాలమైన కన్నులు గలవానిని, శంఖంవంటి కంఠం గలవానిని, గొప్ప బాహువులు గలవానిని,

**హేమయజ్ఞోపవీతాంగం సాక్షాత్కందర్పసన్నిభమ్ ।**
**జగన్మోహన సౌందర్యం కోమలాంగం మనోహరమ్ ॥7॥**

**దృష్ట్వా చ కన్యా ముముదే రోమాంచిత సుగాత్రకా ॥8॥**

బంగారు యజ్ఞోపవీతంతో కూడిన శరీరం కలవానిని, సాక్షాత్తు మన్మథునితో సమానమైన వానిని, జగత్తును సమ్మోహపరచే సౌందర్యం కలవానిని, సుకుమారదేహుని, సుమనోహరుని చూచి, ఆ కుమారి ఆమె శరీరం పులకించింది. సంతోషించింది.

**తద్దర్శనాహ్లాద పరిప్లుతాశయాప్రేమ్ణాథ రోమాశ్రుకులాకులేక్షణా ।**
**ననర్త దేవీ పురతస్తస్య విష్ణోః సాధ్వస్తదోషా పరమాదరేణ ॥**
**ఆనంద! మాం పాహి సుఖం చ దత్త్వాముకుంద! మాం పాహి విముక్తి దానాత్ ॥9॥**

ఆ దేవుని సందర్శనంవలన నెరవేరిన ప్రయోజనంతో, ప్రేమతో నిండిన రోమాంచంతో, బాష్పబిందువులతో, ఆదేవి దోషములన్నీ తొలగిపోగా, మిక్కిలి భక్తితో ఆ విష్ణువు ఎదుట నర్తనమాడింది. ఆనందా! నన్ను ఆనందింపజేయి. సుఖాన్ని ప్రసాదించి, నన్ను రక్షించు. (ఆనందస్వరూపా!) ముకుందా! నాకు విముక్తి ప్రసాదించి కాపాడు.

**మాం పాహి నిత్యం హ్యరవిందనేత్ర! ప్రసన్నదృష్ట్యా కరుణా సుధార్ద్ర! ।**
**గోవింద! గోవింద! సుదుఃఖితాం మాం జ్ఞానాదిదానేన హి పాహి నిత్యమ్ ॥10॥**

తామరపూలవంటి కన్నులు కలవాడా!దయ అనే అమృతంతో తడిసినవాడా! ప్రసన్నమైన చూపుతో ఎల్లప్పుడూ నన్ను కాపాడు. గోవిందా! మిక్కిలి దుఃఖించే నన్ను గోవిందా! నిత్యమూ జ్ఞానమూ మున్నగు వాటినిచ్చి రక్షించు.

**జనార్దన! త్వం హి సుదుష్టసంగాన్ కామాదిరూపాన్ సతతం వర్జయిత్వా ।**
**హరే! హరే! మాం సతతం పాహి దైత్యాన్ సమాహృత్య ప్రబలాన్విఘ్నరూపాన్ ॥11॥**

జనార్దనా! నీవు నాకున్న మిక్కిలి దుష్టుల సాంగత్యాలను, కామాది రూపాలను నిత్యమూ పోగొట్టి(తొలగించి), హరీ! శ్రీహరీ! మిక్కిలి బలమైన విఘ్నరూపాలైన దైత్యగుణాలను పరిహరించి, నన్ను ఎప్పుడూ రక్షించు.

**రమేశ! మాం పాహి చతుర్ముఖేశ! విశ్వేశ! మాం పాహి సరస్వతీశ!**
**రమేశ! మాం పాహి నిదానమూర్తే! వృందారవృందై ర్వందిత పాదపద్మ! ॥12॥**

రమేశా! చతుర్ముఖేశా! నన్ను కాపాడు. విశ్వేశా! సరస్వతీశా! నన్ను రక్షించు. రమేశా! ఆదికారణమూర్తీ! దేవతాబృందాలచే నమస్కరింపబడే పాదపద్మాలు కలవాడా! నన్ను కాపాడు.

**ఏవం తు నత్వా పరమాదరేణతుష్టావ విష్ణుం పరమం పురాణమ్ ।**
**లక్ష్మ్యా సదా యేఽ విదితా గుణాశ్చ అసంఖ్యాతాః సంతి విష్ణౌ చ వీశ! ॥13॥**

ఈవిధంగా మిక్కిలి భక్తితో నమస్కరించి, పరముడైన పురాణపురుషుడైన విష్ణువును స్తుతించింది. పక్షీంద్రా! లక్ష్మికిగూడ ఎప్పుడూ తెలియరాని, లెక్కలేనన్ని గుణాలు విష్ణువునందు ఉన్నాయి.

**తేషాం సకాశాదతిబాహుల్యసంఖ్యాగుణా హరౌ తేఽ విదితా వై రమాయాః ।**
**అతో హరే! స్తవనే క్వాస్తి శక్తిస్తథాపి యత్నం స్తవనే తే కరిష్యే ॥14॥**

(వాటితో) వారితో ఉపలక్షించి చూస్తే రమకు కూడ తెలియరాని లెక్కలేనన్ని గుణాలు హరివైన నీయందు ఉన్నాయి. అందువలన హరీ! నిన్ను స్తుతించుటయందు నాకు శక్తి ఎక్కడ? అయినప్పటికి నిన్ను స్తుతించే ప్రయత్నం చేస్తున్నాను.

**తవ ప్రసాదాచ్చ రమాప్రసాదాద్విధిప్రసాదా ద్భారతీశ ప్రసాదాత్ ।**
**రుద్రప్రసాదాత్ స్తవనం కరిష్యేతథాపి విష్ణో! మయి శాంతిం కురుష్వ ॥15॥**

నీ అనుగ్రహంవలన, రమయొక్క ప్రసాదంవలన, విధియొక్క అనుగ్రహంవలన, భారతీశుని ప్రసాదంవలన, రుద్రుని అనుగ్రహంవలన నీ స్తవం చేస్తున్నాను. విష్ణూ! అయినప్పటికి నాయందు శాంతిని ప్రసాదించు.

**యది ప్రసన్నోఽసి మయి త్వమీశ! త్వత్పాదమూలే దేహి భక్తిం సదైవ ।**
**త్వద్దర్శనాద్దేవ! శుభాశుభం చ నష్టం మదీయం హ్యశుభం చ నిత్యమ్ ॥16॥**

ఈశ్వరా! నాయందు ప్రసన్నుడవైతే నీ పాదమూలమందు ఎల్లప్పుడూ భక్తిని ప్రసాదించు. దేవా! నిన్ను దర్శించుటలో గల అలోప లోపాలను అనుసరించి, శుభాశుభాలు కలుగుతాయి. నా శుభం పూర్తిగా తొలగిపోయింది.

**త్వన్మయా నష్టమిమం చ లోకం మదేన మత్తం బధిరం చాంధభూతమ్ ।**
**ఐశ్వర్యయోగేన చ యో హి మూలోజాతః సదా దీనగుర్వాదికేషు ॥17॥**

నీ మాయచే ఈ లోకం నష్టమవుతోంది. మదంతో మదించి చెవిటిది, గ్రుడ్డిది అవుతోంది. ఐశ్వర్యం కలిగి దీనులయందు గురువులు మున్నగువారియందు ఎల్లప్పుడు మూగవాడుగా జన్మిస్తున్నాడు.

**మా దేహి ఐశ్వర్యమనుత్తమం త్వత్ పాదారవిందస్య విరుద్ధభూతమ్ ।**
**త్వం దేవ మే దేహి సతాం చ సంగం తవ స్వరూప ప్రతిపాదకానామ్ ॥18॥**

నీ పాదారవిందసేవకు వ్యతిరేకంగా ఉండే శ్రేష్ఠత కాని ఐశ్వర్యం నాకు ఈయవద్దు. దేవా! నీ తత్త్వం ప్రతిపాదించే సత్పురుషుల సాంగత్యం నీవు నాకు ఇమ్ము.

**పుత్రాదీనా మైహికం వాసుదేవ! దగ్ధ్వా చ మే దేహి పాదారవిందే ।**
**సద్వైష్ణవే క్రియమాణం చ కోపం దగ్ధ్వా చ మే దేహి పాదారవిందే ॥19॥**

వాసుదేవా! ఇహలోకసంబంధమైన పుత్రాది సాంగత్యమోహాన్ని దహించి, నాకు నీ పాదారవింద భక్తి ప్రసాదించు. సద్వైష్ణవుని యందు ప్రకటించే కోపాన్ని భస్మం చేసి, నీ పాదారవిందసేవను అనుగ్రహించు.

**ద్రవ్యాదికే క్రియమాణం చ లోభే దగ్ధ్వా వై మే దేహి పాదాబ్జమూలే ।**
**పుత్రాదికే క్రియమాణం చ మోహం దగ్ధ్వా చ మే దేహి పాదాబ్జమూలే ॥20॥**

ద్రవ్యాదికాలయందు ఆసక్తితో చేసే లోభాన్ని దహించి, నీ పాదాబ్జమూలమునందు నాకు ప్రీతిని ప్రసాదించు. పుత్రాదుల యందు కనబరచే వ్యామోహాన్ని భస్మం చేసి, నా పాదపద్మమూలమందు సంప్రీతిని అనుగ్రహించు.

**విద్యాం పుత్రం ద్రవ్యజాతం మదం చ దగ్ధ్వా చ మే దేహి పాదాబ్జమూలే ।**
**సద్వైష్ణవాసహమాన స్వరూపందగ్ధ్వా మాత్సర్యం పాహి మాం వేంకటేశ! ॥21॥**

విద్యామదాన్ని, పుత్రమోహాన్ని, ద్రవ్యాదికాలవలన సంభవించే గర్వాన్ని దహించి, నీ పాదాబ్జమూలమునందు నాకు భక్తి ప్రసాదించు. సద్వైష్ణవులపట్ల అసహనబుద్ధితో కూడిన మాత్సర్యాన్ని భస్మం చేసి, వేంకటేశా! నన్ను రక్షించు.

**మంత్రం చే మే దేహి నిదానమూర్తే! యేనైవ మే స్యాత్తవ సంగశ్చ భూయః ।**
**నాన్యం వృణే తవ పాదాబ్జసంగాత్ తదేవ మే దేహి మమ ప్రసన్నః ॥22॥**

ఆదికారణరూపా! ఏ కారణంచేతనైతే ఎప్పుడూ నీతో సంగం కలుగుతూ ఉంటుందో దానికి సంబంధించిన మంత్రాన్ని నాకు ఉపదేశించు. నీ పాదపద్మ సాంగత్యంకన్న వేరయినదానిని నేను కోరను. నాకు ప్రసన్నుడవై దానినే నాకు ప్రసాదించు.

**ఇతీరితః శ్రీనివాసః ప్రసన్న ఉవాచ దేవో హ్యమృతస్రవంచ ।**
**అత్రైవ కన్యే! ప్రజపస్వ మంత్రం సుగోప్యరూపం పరమాదరేణ ॥23॥**

ఈవిధంగా స్తుతించబడిన దేవుడైన శ్రీనివాసుడు సుప్రసన్నుడగుచు అమృతాన్ని స్రవించే వచనాన్ని పలికాడు. కుమారీ! ఇక్కడే మిక్కిలి భక్తితో మిక్కిలి రహస్యరూపమైన మంత్రాన్ని చక్కగా జపించు.

**వక్ష్యామి మంత్రం పరమాదరేణ శృణుష్వ భక్త్యా పరమాదరేణ ।**
**అంతఃస్థమంత్యం హ్యాద్యసంయుక్తమేవ సబిందు తద్వత్ స్పర్శకాద్యకే న యుక్తమ్ ॥24॥**

**ఏకారయుక్తం ప్రథమాంతఃస్థయుక్తం సమత్రికోణే చోష్మణా సంయుతం చ ।**
**(త్వ)తకారసక్తం స్పర్శమంతఃస్థయుక్తమాద్యంత ఓంకార సమన్వితం చ ॥25॥**

మిక్కిలి రహస్యమైన(ప్రీతియుక్తమైన)మంత్రం చెప్తున్నాను. మిక్కిలి ఆదరంతో, భక్తితో ఇప్పుడు ఆకర్ణించు. చివరి అంతఃస్థం(వ్), ఆది అంతఃస్థ సంయుక్తం(య్, వ్య. అ ఇ =ఏ) బిందుసంయుక్తం.(వ్యం, వేం) అట్లే ఆది స్పర్శమైన కకారయుక్తం(క) ఏకారంతో కూడుకొన్నది. మొదటి అంతఃస్థంతో కూడుకొన్నది. ఆరు సమ మూడు వర్ణ కోణాలలో ఉండేది(ట) ఊష్మతో కూడుకొన్నది(శ) అకారంతో కూడుకొన్న స్పర్శ. అంతఃస్థం కలది. ఆద్యంతాలలో ఓంకారంతో కూడుకొన్నది(ఓం వ్యంకటేశాయ, ఓం వేంకటేశాయ ఓం)

**అనేన మంత్రేణ తవేప్సితం చ భవేద్ధి కన్యే! నాత్ర విచార్యమస్తి ।**
**ఏవం స ఉక్త్వా శ్రీనివాసో హరిస్తు ప్రతీకవద్దర్శయామాస రూపమ్ ॥26॥**

కుమారీ! ఈ మంత్రంచే నీ కోరిక నెరవేరుతుంది. ఇందు ఆలోచించవలసినది లేదు. ఈ విధంగా ఆ శ్రీనివాసుడైన హరి పలికి విగ్రహంగా తన రూపం కనబరచాడు.

**నత్వా తు సా శ్రీనివాసం చ దేవీ ఉవాస హ స్వామి సరఃసమీపే ।**
**తస్మిన్ దినే బ్రాహ్మణాదీంశ్చ సర్వాన్ సంతర్పయామాస చ షడ్రసాన్నైః ॥27॥**

ఆ దేవి శ్రీనివాసునికి నమస్కరించి, స్వామి పుష్కరిణి(సరస్సు) సమీపంలో ఉండిపోయింది. ఆ రోజున సమస్త బ్రాహ్మణాదులకు షడ్రసాన్నాలతో సంతర్పణ చేసింది.

**సాయంకాలే శ్రీనివాసస్య దృష్ట్వా ఉత్సాహరూపైః శ్రీనివాస ప్రతీకైః ।**
**సాకం భక్త్యా సంప్రణమ్యాథ దేవీ ప్రదక్షిణం శ్రీనివాసస్య సుష్ఠు ॥28॥**

సాయంకాలమందు శ్రీనివాసుని దర్శించి, ఆ దేవి ఉత్సాహరూపంగా వున్న శ్రీనివాసుని ప్రతీకలతో (చిహ్నాములతో) కలిసి భక్తితో శ్రద్ధగా నమస్కరించి, శ్రీనివాసునికి చక్కగా ప్రదక్షిణం చేసింది.

**ననర్త దేవీ సుప్రతీకస్యచాగ్రేలజ్జాం త్యక్త్వా జయదేవేతి చోక్త్వా ।**
**ఆనృత్తకాలే చ హరేశ్చ వక్త్రం దృష్ట్వా చ దృష్ట్వా తు పరం ననర్త ॥29॥**

ఆ దేవి గొప్పదైన విగ్రహం ఎదుట సిగ్గు వదలి, దేవా! జయం జయం అని పలుకుతూ నృత్యం చేసింది. నృత్యకాలం పూర్తి అయ్యేవరకు హరివదనాన్ని నేత్రాలతో వీక్షిస్తూ చక్కగా నర్తనమాడింది.

**మమాద్య గాత్రం పావితం శ్రీనివాస! మమాద్య నేత్రం సుఫలం సంబభూవ ।**
**మమాద్య పాదౌ సార్థకౌ చైవ జాతౌ ప్రదక్షిణం శ్రీనివాసేశ! కృత్వా ॥30॥**

శ్రీనివాసా! ఇప్పుడు నా శరీరం పావనమయింది. నా నేత్రాలు ఇప్పుడు సుఫలత్వాన్ని చెందాయి. నా పాదాలు ఇప్పుడు సార్థకాలయ్యాయి. శ్రీనివాసా! ఈశ్వరా! నీ ప్రదక్షిణం చేయుటవల్ల(ఇంత లబ్ధి చేకూరింది)

**హస్తౌ చ మే సార్థకావద్య జాతౌ అగ్రే కృత్వా హస్తశబ్దం మురారేః ।**
**ఏవం వదంతీ ప్రణయంతీ చ దేవం జగామ సా స్తోత్రవచఃకదంబైః ॥31॥**

ఈనాడు నా హస్తాలు సార్థకాలయ్యాయి. ఇలా పలుకుతూ, మురారి ఎదుట చప్పట్లు కొడుతూ, ఆ దేవుని సంతోషపరుస్తూ, స్తోత్రవాక్యాలు పదే పదే జరుపుతూ ఆమె బయలుదేరింది.(వెళ్లింది)

**దేవాస్తదా దుందుభయో వినేదిరేతన్మస్తకే చ పుష్పవృష్టిం చ చక్రుః ।**
**తస్మిన్ కాలే ఉభయోః పార్శ్వయోశ్చనృత్యం చక్రు ర్దేవతా వారనార్యః ॥32॥**

అప్పుడు దేవతలు దుందుభులు మ్రోయించారు.(ఆ దేవదేవుని శిరస్సుపై)పుష్పవృష్టిని కురిపించారు. ఆ సమయంలో ఉభయ పార్శ్వములందు దేవతాజాతికి చెందిన వారస్త్రీలు (అప్సరసలు) నృత్యం చేశారు.

**తథైవ తాస్తలశబ్దం చ కృత్వాతదా సర్వా నమనం చాపి చక్రుః ।**
**ఆనందశైలే సర్వదా త్విత్థమేవసా సర్వదా నర్తయంతీ చ వీంద్ర! ॥33॥**

అలాగే వారందరును చప్పట్లు కొట్టి, అప్పుడు నమస్కారం చేశారు. పక్షీంద్ర! ఆనందశైలంపై ఆ కన్య నిత్యం నర్తిస్తుండగా, అంతటా ఇలాగే జరిగింది.

**ఆనందమగ్నా సాపి దేవీ జగామస్వమాశ్రమం జైగిషవ్యేణ సార్ధమ్ ।**
**యాత్రామేవం యే న కుర్వంతి వీంద్ర! తేషాం చ సర్వం నిష్ఫలం చాహురార్యాః ॥34॥**

ఆ దేవికూడ ఆనందంలో మునకలు వేసి జైగిషవ్యునితో కలసి తన ఆశ్రమానికి వెళ్లింది. పక్షీంద్రా! ఈ విధంగా ఎవరు యాత్ర చేయరో వారి తీర్థయాత్ర అంతా నిష్ఫలమవుతుందని పెద్దలంటారు.

**గత్వాశ్రమం జైగిషవ్యేణ సార్ధం గురుం త్వపృచ్ఛద్ వేంకటేశస్య మంత్రమ్ ।**
**మంత్రస్యార్థం బ్రూహి మే జైగిషవ్య! మంత్రావృత్తిం కుర్వతాం వై ఫలాయ ॥35॥**

జైగిషవ్యునితో కలసి ఆశ్రమానికి వెళ్లి, వేంకటేశుని మంత్రంగురించి గురువును అడిగింది. జైగిషవ్యా! నాకు ఫలంకోసం చేసే మంత్రార్థమును, మంత్రావృత్తిని వివరించవలసిందని అడిగింది.

**జైగీషవ్య ఉవాచ–** జైగీషవ్యుడు వచించాడు.

**శృణుష్వ భద్రే! వేంకటేశస్య నామ్న ।**
**స్త్వర్థం శ్రుత్వా హృదయే సంనిధత్స్వ ॥36॥**

**వితి హ్యుత్తమ వాచీ స్యాద్యేతి జ్ఞానముదాహృతమ్ ।**
**కకారః సుఖవాచీ స్యాట్టేతి చిత్తముదాహృతమ్ ॥37॥**

భద్రురాలా! విను. వేంకటేశ నామంయొక్క అర్థం విని హృదయంలో గట్టిగా నిలుపుకొను. (ధారణ చేయవలసింది) వకారం ఉత్తమవాచి. యకారం జ్ఞానంగా చెప్పబడినది. కకారం సుఖవాచి. టకారం చిత్తంగా పేర్కొనబడినది.

**ఈశత్వమాత్మవాచి స్యాదేవం జ్ఞేయం తు కన్యకే! ।**
**పూర్ణజ్ఞానం సుఖం విత్తం వ్యాప్తత్వా ద్వ్యంకటాభిధః ॥38॥**

ఈశత్వం ఆత్మవాచి. కన్యకా! ఈ విధంగా తెలిసికొనవలసియున్నది. పూర్ణమైన జ్ఞానం, సుఖం, విత్తం, (చిత్తము). వ్యాపించుటవల్ల 'వ్యంకట' అనే పేరు వచ్చింది.

**వ్య(వే)మింద్రియాదికం ప్రోక్తం వ్యంగభూతం హరౌ యతః ।**
**కటశ్చ సముదాయార్థో వ్యం(వేం)కటశ్చేంద్రియౌఘకః ॥39॥**

వ్యం(వేం) హరియందు విశిష్టమైన అంగభూతంగా ఉండుటవలన ఇంద్రియాదికంగా చెప్పబడినది. 'కటః' అనేది సముదాయార్థకం. వ్యంకటః(వేంకటః) అనేది ఇంద్రియాల సమూహంగా చెప్పబడినది.

**స్వస్మిన్ ప్రేరయతే యస్మాత్తస్మా ద్వ్యంకటనామకః ।**
**విషయే ప్రేషయే న్నిత్యమతో వ్యంకటనామకః ॥40॥**

తనయందు ప్రేరేపింపబడే కారణంచే వ్యంకట నామం కలవాడయ్యాడు. నిత్యమూ విషయవాసనయందు పంపించే కారణంచే 'వ్యంకట' అనే పేరు కలవాడయ్యాడు.

**విశిష్టజ్ఞాన రూపత్వాద్ వ్యేతిముక్తాః సదా స్మృతాః ।**
**ముక్తానాం చ సమూహస్తు వ్యకటేతి ప్రకీర్తితః ॥41॥**

విశిష్టమైన జ్ఞానస్వరూపం కారణంగా 'వ్య' అనుదానిచే ఎల్లప్పుడు ముక్తులు స్మరింపబడతారు. ముక్తుల సమూహం కావున 'వ్యంకట' అనే పేరు చెప్పబడింది.

**సదా ముక్తసమూహానా మీశత్వాద్వ్యంటాభిధః ।**
**లింగదేహ మతో జీవో వ్యంకటేతి సమావృతః ॥42॥**

ఎల్లప్పుడు ముక్తుల సమూహానికి ఈశుడగుటవలన వ్యంకటేశుడుగా చెప్పబడుచున్నాడు. లింగదేహం కల్గిన జీవుడు వ్యంకటుడుగా చెప్పబడుతున్నాడు.

**లింగానాం చైవ స్వామిత్వా ద్వ్యంకటేశేతి సంజ్ఞితః ।**
**దైత్యానాం చ సమూహాస్తు జ్ఞానాది విధురా యతః ।**
**అతో దైత్యసమూహస్తు వ్యంకటేతి ప్రకీర్తితః ॥43॥**

లింగదేహాలకు స్వామి అగుటవలన వ్యంకటేశుడుగా చెప్పబడుచున్నాడు. దైత్యుల సమూహాలు జ్ఞానాదులను ఎడబాసి దూరంగా ఉంటాయి. కావున దైత్యసమూహం 'వ్యంకట' అని చెప్పబడుతోంది.

**తేషాం సంహరణే ఈశస్త్వతో వ్యంకటనామకః ।**
**ఆనందస్య విరుద్ధత్వాత్కామక్రోధాదయో గుణాః ॥44॥**

**వ్యంకటా ఇతి సంప్రోక్తా స్తేషాం నాశయితా ప్రభుః ।**
**అతస్తు వ్యంకటేశాఖ్య ఏవం జ్ఞాత్వా జపం కురు ॥45॥**

వారిని సంహరించుటయందు ఈశుడు కావున వేంకటేశుడనే పేరు వచ్చింది. ఆనందానికి విరుద్ధమైన కామ క్రోధాది గుణాలు, 'వ్యంకటాః' అని చెప్పబడుతున్నాయి. వాటిని నాశనం చేసే ప్రభువు కావున వ్యంకటేశుడు అని చెప్పబడుచున్నాడు. ఈ విధంగా తెలుసుకొని జపం చేయవలసింది.

**ఏవం వ్యంకటమాహాత్మ్యం శ్రుత్వా దేవీ ఖగేశ్వర! ।**
**నిద్రాం చకార తత్రైవ రాత్రౌ పిత్రా సహైవ చ ॥**
**బ్రాహ్మే ముహూర్తే చోత్థాయ హృది సస్మార కన్యకా ॥46॥**

ఖగేశ్వరా! ఈ విధంగా వ్యంకటమాహాత్మ్యం ఆ దేవి విని, అక్కడనే రాత్రియందు తండ్రితో కలసి నిద్ర చేసింది. బ్రాహ్మీముహూర్తమందు కన్యక మేల్గాంచి, హృదయంలో వ్యంకటేశుని స్మరించింది. (**వ్యంకటేశస్య ప్రాతః స్తుతిః** = వ్యంకటేశ్వరుని ప్రాతఃకాల స్తోత్రం.)

**శ్రీవ్యంకటేశస్య నృసింహమూర్తిః శ్రీవరదరాజశ్చ వరాహమూర్తిః ।**
**శ్రీరంగశాయీ చ అనంతశాయీ కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥47॥**

శ్రీవ్యంకటేశుడు, నృసింహమూర్తి, శ్రీవరదరాజు, వరాహమూర్తి, శ్రీరంగశాయి, అనంతశాయి అందరూ నాకు సుప్రభాతం (శుభోదయం) కల్గింతురు గాక!

**శ్రీకృష్ణమూర్తిశ్చ గదాధరశ్చ శ్రీవిష్ణుపాదస్తు ప్రయాగవాసః ।**
**నారాయణః శ్రీబదరీ నివాసః కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥48॥**

శ్రీకృష్ణమూర్తి, గదాధరుడు, ప్రయాగవాసుడైన శ్రీవిష్ణుపాదం, శ్రీబదరీనివాసుడైన నారాయణుడు వారు అందరూ నాకు శుభోదయం కల్గింతురు గాక!

**దామోదరో వా త్రిజగన్నివాసః శ్రీపాండురంగశ్చ నృసింహదేవః ।**
**శ్రీరామదేవశ్చ అమోఘవాసః కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥49॥**

త్రిలోకవాసుడైన దామోదరుడు, శ్రీపాండురంగవిభుడు, నృసింహదేవుడు, అమోఘవాసుడైన శ్రీరామదేవుడు అందరూ నాకు శుభోదయం కల్గింతురు గాక!

**శ్రీధర్మపుత్రశ్చ నృసింహమూర్తిః శ్రీపిప్పలస్థశ్చ ముహల్లవాసః ।**
**కోలానృసింహః శూర్పకారస్థ సింహః కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥50॥**

శ్రీధర్మపుత్రుడు, నృసింహమూర్తి, శ్రీ పిప్పలవాసుడైన ముహల్లవాసుడు, కోలానృసింహుడు, శూర్పకార వాసుడైన సింహుడు అందరూ నాకు శుభోదయం కల్గింతురు గాక!

**చతుర్ముఖ శ్చారు సరస్వతీ చ స్వభారతీ శర్వ సుపర్ణశేషాః ।**
**ఉమామహేంద్రశ్చ శచీముఖాస్తాః కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥51॥**

చతుర్ముఖుడు, అందమైన సరస్వతి, భారతి, శర్వుడు, సుపర్ణుడు, శేషుడు, ఉమ, మహేంద్రుడు, శచి మున్నగువారు అందరూ నాకు శుభోదయం కల్గింతురు గాక!

**ద్వారావతీ కాశికావంతికా చ ప్రయాగ కాంచ్యౌ మధురాపురీ చ ।**
**మాయావతీ హస్తిమతీ పురీ చ (సర్వా)కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥52॥**

ద్వారావతి, కాశిక, అవంతిక, ప్రయాగ, కాంచి, మధురాపురి, మాయావతి, హస్తిమతి, పురి అన్నియు నాకు శుభోదయం కల్గించుగాక!

**భాగీరథీ చైవ సరస్వతీ చ గోదావరీ సింధుకృష్ణే చ వేణీ ।**
**కలిందకన్యా యమునా చ నర్మదా కుర్వంతు సర్వే(సర్వా) మమ సుప్రభాతమ్ ॥53॥**

భాగీరథి, సరస్వతి, గోదావరి, సింధు, కృష్ణ, వేణి, కాలింది, యమున, నర్మద అన్నియు నాకు శుభోదయం కల్గించుగాక !

**వితస్తి కావేరి సుతుంగభద్రాః సువంజరా భీమరథీ వివాశా ।**
**సుతామ్రపర్ణీ చ పినాకినీ చ కుర్వంతు సర్వే(సర్వా) మమ సుప్రభాతమ్ ॥54॥**

వితస్తి, కావేరి, తుంగ, భద్ర, వంజర, భీమరథి, విపాశ, తామ్రపర్ణి, పినాకిని అన్నియు నాకు శుభోదయం కల్గించుగాక!

**స్వామి పుష్కరిణీ చైవ సువర్ణముఖరీ తథా ।**
**శ్రీపాండవీ తౌంబరుశ్చ కపిలా పాపనాశినీ ॥55॥**

**గురుర్వసిష్ఠః క్రతురంగిరాశ్చమనుః పులస్త్యః పులహశ్చ గౌతమః ।**
**రౌభ్యో  మరీచిశ్చ్యవనశ్చ దక్షః కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥56॥**

అలాగే స్వామిపుష్కరిణి, సువర్ణముఖరి, శ్రీపాండవి, తౌంబరువు, కపిల, పాపనాశని, గురువైన వసిష్ఠుడు(గురువు, వసిష్ఠుడు), క్రతువు, అంగిరసుడు, మనువు, పులస్త్యుడు, పులహుడు, గౌతముడు, రైభ్యుడు, మరీచి, చ్యవనుడు, దక్షుడు అందరూ నాకు శుభోదయం కల్గింతురు గాక!

**సప్తార్ణవాః సప్తకులాచలాశ్చద్వీపాశ్చ సప్తోపవనాని సప్త ।**
**భూరాదికాని భువనాని సప్తకుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥57॥**

సప్త మహాసముద్రాలు, సప్త కులపర్వతాలు. సప్త ద్వీపాలు, ఏడు ఉపవనాలు, భూలోకం మున్నగు ఏడు లోకాలు అన్నీ నాకు శుభోదయం కల్గించుగాక!

**మాంధాతా నహుషోఽ ంబరీష సగరౌ రాజా నలో ధర్మరాట్**
**ప్రహ్లాదః క్రతురాడ్ విభీషణ గయౌ వ్యాసో హనూమానపి ।**
**అశ్వత్థామ కృపావుమా ద్రుపదజా శ్రీజానకీ తారకా**
**మండోదర్యఖిలాః ప్రభాత సుమహం కుర్వంతు నిత్యం హరే! ॥58॥**

మాంధాత, నహుషుడు, అంబరీషుడు, సగరుడు, నలమహారాజు, ధర్మరాజు, ప్రహ్లాదుడు, క్రతుప్రభువు, విభీషణుడు, గయుడు, వ్యాసుడు, హనూమంతుడు, అశ్వత్థామ, కృపుడు, ఉమ, ద్రౌపది, శ్రీజానకి, తారక, మండోదరి మున్నగు వారందరును హరీ! నిత్యమూ నాకు మిక్కిలి గొప్పదైన ఉదయం కల్గింతురుగాక!

**అశ్వత్థస్య వనాని కించ తులసీ ధాత్రీవనాని ప్రభో!**
**పున్నాగస్య వనాని చంపక వనాన్యన్యాని పుష్పాణి చ ।**
**మందారస్య వనాని యాని చ హరే! సౌగంధికాన్యప్యహో**
**నిత్యం తాని దిశంతు మత్ప్రముదితం శ్రీవేంకటేశప్రభో! ॥59॥**

ప్రభూ! అశ్వత్థవనాలు, అలాగే తులసీవనాలు, ధాత్రీ(ఉసిరి)వనాలు, పున్నాగవనాలు, చంపకవనాలు, మిగిలిన(ఇతర) పుష్పాలు, మందార, సౌగంధికవనాలు హరీ! ప్రభూ! శ్రీవేంకటేశా! నిత్యమూ అన్నీ నాకు మిక్కిలి సంతోషాన్ని చేకూర్చుగాక!

**ఏవం స్మృత్వా శ్రీనివాసస్య దేవీకృత్వా శౌచం జైగిషవ్యేణ సాకమ్ ।**
**స్నాతుం యయౌ పుష్కరిణీం హరేశ్చస్నానం సమ్యక్ తత్ర చకార దేశే ।**
**సమ్యగ్ జప్త్వా వ్యంకటేశస్య మంత్రమువాచ సా జైగిషవ్యం గురుం చ ॥60॥**

ఈవిధంగా శ్రీనివాసుని స్మరించి, దేవి శౌచం ముగించి, జైగిషవ్యునితో కలసి స్వామి(హరి)పుష్కరిణికి స్నానం చేయుటకు వెళ్లింది. అక్కడ చక్కని ప్రదేశంలో శుభ్రంగా స్నానం చేసింది. వ్యంకటేశుని మంత్రాన్ని భక్తితో జపించి, గురువైన జైగిషవ్యునితో ఇలా పలికింది.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే దేవీకృత వ్యంకటేశదర్శన తత్స్తుత్యాది వర్ణనం నామ పంచవింశోఽ ధ్యాయః ॥25॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో దేవి వేంకటేశ్వరుని దర్శించి స్తుతించుట అనే ఇరవై ఐదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశోఽధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం

## వ్యంకటగిరి మాహాత్మ్యమ్ - వ్యంకటగిరి మాహాత్మ్యం

**కన్యోవాచ** - కన్య అన్నది.

**శ్రీనివాసః కిమర్థం వై ఆగతోఽత్ర వదస్వ మే ।**
**శేషాచలోఽపి కుత్రాభూత్ కదాయాతశ్చ పాపహా ॥**
**స్వామిపుష్కరిణీ చాత్ర కిమర్థం హ్యాగతా వద ॥1॥**

శ్రీనివాసుడు దేనికోసమై ఇక్కడకు వచ్చాడు? నాకు చెప్పు. శేషాచలంకూడ ఎక్కడ ఉంది? ఎప్పుడు ఇక్కడకు వచ్చింది? పాపాలను హరించే స్వామిపుష్కరిణికూడ దేనికోసమై ఇక్కడకు వచ్చింది? వివరించు.

**జైగీషవ్య ఉవాచ** - జైగీషవ్యుడు వచించాడు.

**శృణు భద్రే! మహాభాగే! వ్యంకటేశస్య చాగమమ్ ।**
**ఆవయో ర్దేవి! పాపాని విషమం యాంతి భామిని! ॥2॥**

మహాభాగా! భద్రరూపా! వ్యంకటేశుని రాకగురించి విను. భామినీ! దేవీ! మన ఇరువురి దోషాలు పటాపంచలవుతాయి.

**ఆసీత్పురా హిరణ్యాక్షః కాశ్యపో దితినందనః ।**
**సనకాదేశ్చ వాగ్దండాద్ద్వితీయ ద్వారపాలకః ॥3॥**

**బభూవ దైత్యయోనౌ చ దేవానాం కంటకో బలీ ।**
**సంజీవో విజయః ప్రోక్తో హరిభక్తో మహాప్రభుః ॥4॥**

కశ్యపుని పుత్రుడైన దితి కుమారుడగు హిరణ్యాక్షుడనేవాడు పూర్వం ఉండేవాడు. సనకాదులయొక్క వాగ్దండానికి గురి యైన రెండో ద్వారపాలకుడాతడు. దేవతలకు కంటకప్రాయుడై, బలవంతుడై, దైత్యయోనియందు సంభవించాడు. అతడు హరిభక్తుడునూ, మహాప్రాభవం కలవాడునూ అయి సంజీవుడు, విజయుడు అని చెప్పబడేవాడు.

**హిరణ్యాక్షః స్వయం దైత్యో హరిభక్త విదూషకః ।**
**ఏతాదృశో హిరణ్యాక్ష స్తపస్తప్తుం సముద్యతః ॥5॥**

**తదా మాతా దితిర్దేవీ హిరణ్యాక్షమువాచ హ ।**

హిరణ్యాక్షుడై (పుట్టి) స్వయంగా దైత్యుడు, హరిభక్తులను ద్వేషించేవాడు అయ్యాడు. ఇటువంటి హిరణ్యాక్షుడు తపస్సు చేయటానికి ప్రయత్నించాడు. అంతట తల్లియైన దితిదేవి హిరణ్యాక్షునితో ఇలా పలికింది.

**దితిరువాచ –** దితి వచించింది.

**వత్సలస్త్వం మహాభాగ! మా తపస్త్వాష్టహాయనః ॥6॥**

**త్వం మా దదస్వ దుఃఖం మే పాలయిష్యతి కోవిదః ।**
**క్షణమాత్రం న జీవామి త్వాం వినా జీవనం నహి ॥7॥**

**మా తప త్వం మహాభాగ! మమ జీవనహేతవే ।**
**ఏవముక్తస్తు మాత్రా స విజయావేశతోఽబ్రవీత్ ॥8॥**

"మహాభాగా! ఎనిమిదేండ్ల వయస్సు గల పసివాడవు నీవు. తపస్సు చేయవద్దు. నీవు నాకు దుఃఖం పంచిపెట్టవద్దు. జ్ఞాని పోషిస్తాడు. నిన్ను విడిచి క్షణకాలంకూడ జీవింపజాలను. (నీవు లేకుంటే ) నాకు జీవనం లేదు. మహాభాగా! నా జీవనహేతువుకొరకు నీవు తపస్సు చేయవద్దు." తల్లి ఈ విధంగా పల్కగా ఆ విజయుడు విజయావేశంతో ఇలా అన్నాడు.

**హిరణ్యాక్షో మాతరం ప్రాహ జాలం హిత్వావిష్ణోర్భజనేఽలం కురుష్వ ।**
**మయి స్నేహం పుత్రహేతో ర్విరూఢం సుఖదుఃఖే చేహలోకే పరత్ర ॥9॥**

హిరణ్యాక్షుడు తల్లితో వచించాడు. "మాయను విడిచి, విష్ణుభజనాన్ని సంపూర్ణంగా నిర్వహించు. పుత్రహేతుత్వంచే నాయందు ప్రేమ రూఢమయింది(మొలకెత్తింది). అది ఇహలోకమందు, పరలోకమందుకూడ సుఖదుఃఖహేతువు.

**యావత్ స్నేహం మయి మాతః! కరోషి తావత్ క్లేశం శాశ్వతం యాస్యసి త్వమ్ ।**
**మాతశ్చ తే మయి పుత్రత్వబుద్ధిస్త్వయ్యప్యేషా మాతృబుద్ధి ర్మమాపి ॥10॥**

అమ్మా! ఎంతకాలమయితే నాయందు ప్రేమ కల్గియుంటావో అంతకాలమూ నీవు శాశ్వతమైన క్లేశం పొందుతావు. తల్లీ! నీకు నాయందు పుత్రత్వబుద్ధి, నాకు నీయందు మాతృత్వ బుద్ధి కూడ క్లేశహేతువే!

**తాతే పూజ్యే పితృబుద్ధి ర్మమాస్తి తస్మింస్తు తే భర్తృబుద్ధిర్హి మిథ్యా ।**
**నిర్మాతి యస్మాద్ధరిరేవ సర్వం సమ్యక్ పాతా నియతోఽసౌ మురారిః ॥11॥**

పూజ్యుడైన తండ్రియందు నాకు పితృత్వబుద్ధి, ఆయనయందు నీకు ఉండే భర్తృత్వబుద్ధి అంతా మిథ్యయే సుమా! ఎందువల్లనంటే మురారియైన హరియే సర్వమూ నిర్మించేవాడు. చక్కగా రక్షించేవాడు. అతడు నియతుడు.

**అతో హి మాతా హరిరేవ సర్వదాత్వన్యాసాం వై మాతృతా చోపచారాత్ ।**
**నిర్మాతృత్వం యది ముఖ్యం త్వయి స్యాద్ద్రోణాదీనాం జననీ కా వదస్వ ॥12॥**

అందువల్ల ఎల్లప్పుడు తల్లి హరియే. మిగిలినవారియొక్క మాతృత్వమనేది ఔపచారికం మాత్రమే. నీయందు సృష్టి కర్తృత్వం ప్రధానమైతే, ద్రోణాదులకు తల్లి ఎవరవుతారో చెప్పు.(ద్రోణాదులు కలశోద్భవులు)

**మాతృత్వం వై యది ముఖ్యం త్వయి స్యాద్ధాత్రాదీనాం జననీ కా వదస్వ ।**
**యతః సదా యాతి జగత్తతోహరిః సదా పితా విష్ణురజః పురాణః ॥13॥**

మాతృత్వమనేది నీయందు ముఖ్యమైతే, బ్రహ్మాదులకు తల్లి ఎవరో తెలియజేయి. ఎవనివలన ఎల్లప్పుడు జగత్తు నడుస్తోందో ఆ విష్ణువు అజుడు, పురాతనుడునైన హరియే అందరికి ఎప్పుడూ తండ్రి.

**సదా పితా ముఖ్యపితా యది స్యాత్‌గర్భస్థ బాలే పాలకః కో వదస్వ ।**
**మాతాపిత్రోః పాలకత్వం యది స్యాత్‌కూర్మాదీనాం పాలకౌ కౌ వదస్వ ॥14॥**

సాధారణ పిత ప్రధానమైన పితయైనచో గర్భస్థుడైన బాలునకు పోషకుడు ఎవడో వచించు. తల్లిదండ్రులకే పాలకత్వం సత్యమైతే, కూర్మాదులకు పాలకులెవరో చెప్పు.

**మాతాపిత్రోః పాలకత్వం యది స్యాత్ కృపాదీనాం రక్షకౌ కౌ వదస్వ ।**
**పున్నామకా న్నరకాద్దేహభాజాంస్త్రస్మాత్త్రాతా పుత్ర విష్ణుః పురాణః ॥15॥**

మాతాపితలకు పాలకత్వమే ఉంటే, కృపాదులకు రక్షకులెవరో వచించు. దేహాన్ని పొందినవారికి ఆ పున్నామ నరకంనుండి రక్షించుటకు యోగ్యుడు పుత్రరూపంలో ఉండే పురాతనుడైన విష్ణువే.

**న తారకోஉహం నరకాచ్చ సుభ్రూర్న వై భర్తా నాపి పిత్రాదయశ్చ ।**
**న వై మాతా నానుజాదిశ్చ సర్వః సర్వత్రాతా విష్ణురతో న చాన్యః ॥16॥**

(మంచి కనుబొమలు కల) అమ్మా! నరకంనుండి తరింప జేయటానికి స్వయంగా నేను సమర్థుడను కాను.(తారకుడను కాను) భర్త కాదు. పిత్రాదులు కారు. తల్లి కాదు. తోడబుట్టినవాడు మొదలగు ఏ ఒక్కడూ కాడు. అందువలన సర్వత్రాత విష్ణువు మాత్రమే. మరొక్కడు కాడు.

**మాయాం మదీయాం జ్ఞానశస్త్రేణ ఛిత్వాభక్త్యా హరేః స్మరణం త్వం కురుష్వ ।**
**యద్భక్తిపూర్వం స్మరణం నామ విష్ణోః తత్సర్వథా పాపహరం చ మాతః! ॥17॥**

నాయందు ప్రేమ అనే మాయను జ్ఞానమనే శస్త్రంతో ఛేదించి, భక్తితో హరిస్మరణం చేయవలసింది. అమ్మా! భక్తిపూర్వకంగా విష్ణునామస్మరణం చేస్తే అది అన్నివిధాలా పాపాన్ని హరిస్తుంది.

**యో వా భక్త్యా స్మరణం నామ విష్ణోః కరోత్యసౌ పాపహరో భవిష్యతి ।**
**అయం దేవో దుర్లభః కర్మభూమౌతత్రాపి మధ్యే భజనం విష్ణుమూర్తేః ॥18॥**

భక్తితో విష్ణునామస్మరణం చేసినవాడు పాపములను పోగొట్టుకొనగలడు. కర్మభూమిలో ఈ దేహం (జన్మ) దుర్లభమైనది. అందువలన అవకాశం వచ్చినప్పుడెప్పుడూ విష్ణుమూర్తి భజనం కర్తవ్యం.

**ఆయుర్గతం వ్యర్థమేవ త్వదీయం శీఘ్రం భజేః శ్రీనివాసస్య పాదమ్ ।**
**ఉపదిశ్యైవం మాతరం పుత్రవర్యోదైత్యావేశాత్సోஉభవద్వై తపస్వీ ॥19॥**

గడచిపోయిన నీ సంబంధమైన ఆయువు అంతయూ వ్యర్థమే. లక్ష్మీనివాసుని(శ్రీనివాసుని) పాదాలను సేవించు". ఈ విధంగా తల్లికి ఉపదేశించి, ఆ పుత్రవర్యుడు దైత్యావేశంతో తపస్వి అయ్యాడు.

**చతుర్ముఖం ప్రీణయత్యైవ భక్త్యాహ్యవధ్యత్వం ప్రాప తస్మాన్మహాత్మా ।**
**తతో భూమిం కరవద్వేష్టయిత్వానిన్యే తదా దైత్యవర్యో మహాత్మా ॥20॥**

చతుర్ముఖుని భక్తితో సంతోషపరచి, ఆ మహాత్ముడు ఆ బ్రహ్మవలన అవధ్యత్వం పొందాడు. అంత ఆ దైత్యవర్యుడైన మహాత్ముడు చేతులతో భూమిని చుట్టి కొంపోయాడు.

**శ్రీముష్టదేశే ప్రాదురాసీద్ధరిస్తువారాహవిష్ణుస్త్వజనః పురాణః ।**
**భిత్వా చాబ్ధిం వివిశే తం మహాత్మారసాతలే సంస్థితం భూతలం చ ॥21॥**

జన్మలే లేనటువంటివాడు, పురాణుడు, విష్ణువు అయిన హరి శోభా సమృద్ధి కల్గిన ప్రదేశమందు ప్రాదుర్భవించాడు. ఆ మహాత్ముడు సముద్రాన్ని ఛేదించి, రసాతలంలో నున్న ఆ భూతలంలో ప్రవేశించాడు.

**స్వదంష్ట్రాగ్రే స్థాపయిత్వా ఽ ఽ జగామతదాగమాదాగతో దైత్యవర్యః ।**
**తం కర్ణమూలే తాడయిత్వా జఘానప్రసాదయామాస చ పూర్వవద్భువమ్ ॥22॥**

అతడు భూమిని తన కోరల పైభాగాన ఉంచి, వస్తున్నాడు. అంత విజయ ప్రయాణంలో అప్పుడు దైత్యవర్యుడు అచ్చటికి వచ్చాడు. అతడు కర్ణమూలమందు కొట్టి ఆ దైత్యుని వధించాడు. పూర్వంలా భూమిని అనుగ్రహించి నిలిపాడు.

**సుదిగ్గజాన్ స్థాపయిత్వా చ విష్ణుః శ్రీముష్టే వై సంస్థితః శ్రీవరాహః ।**
**తదా హరిశ్చింతయామాస విష్ణుర్భక్త్యా మదీయం మానుషం దేహమద్య ॥23॥**

అంత విష్ణువు గొప్పవైన దిగ్గజాలను స్థాపించి, శ్రీమంతమైన ప్రదేశంలో శ్రీవరాహుడై ఉండిపోయాడు. అప్పుడు విష్ణువైన హరి ఇక్కడ నాదైన మానుష దేహాన్ని భక్తితో ధ్యానించాడు.

**ఆరాధయిష్యంతి చ మాం క్వ ఏతే తేషాం దయాం కుత్రవాహం కరిష్యే ।**
**ఏవం హరిశ్చింతయిత్వా సుకన్యే! వైకుంఠలోకాదచలం శేషసంజ్ఞమ్ ॥**
**వీంద్రస్కంధే స్థాపయిత్వా స్వయం చ సమాగతోఽ భూద్భూతలం భూతలేశః ॥24॥**

ఎవరైతే నన్ను (ఇక్కడ) ఆరాధిస్తారో, వారు ఎక్కడ ఉన్నా వారిపై నేను దయను ప్రకటిస్తాను. సుకన్యా! ఈవిధంగా హరి ఆలోచించి, వైకుంఠలోకంనుంచి శేషుడను పేరు గల్గిన పర్వతాన్ని పక్షీంద్రుని స్కంధంపైనుంచి, ఆ భూతలనాథుడు స్వయంగా భూతలానికి వచ్చాడు.

**సువర్ణముఖరీతీర మారభ్య గరుడధ్వజః ।**
**శ్రీకృష్ణవేణీ పర్యంతం స్థాపయామాస తం గిరిమ్ ॥25॥**

గరుడుడు ధ్వజచిహ్నంగా గల హరి సువర్ణముఖరీ తీరం మొదలుకొని శ్రీకృష్ణవేణివరకు ఆ పర్వతాన్ని స్థాపనం చేశాడు.

**గిరేః పుచ్ఛే తు శ్రీశైలం మధ్యమేఽ హోబలం స్మృతమ్ ।**
**ముఖం చ శ్రీనివాసస్య క్షేత్రం చ సముదాహృతమ్ ॥26॥**

గిరియొక్క పుచ్ఛభాగాన శ్రీశైలం, మధ్యభాగాన అహోబిలం ఉన్నట్లు స్మరింపబడుతోంది. ముఖభాగం శ్రీనివాసక్షేత్రంగా చెప్పబడుతోంది.

**అల్పేన తపసాభీష్టం సిధ్యత్యస్మిన్నహోబలే ।**
**గంగాది సర్వతీర్థాని పుణ్యాని హ్యత్ర సంతి వై ॥27॥**

ఈ అహోబిలమందు తక్కువ తపస్సు చేతనే కోరిక అంతా నెరవేరుతుంది పుణ్య గంగాది తీర్థాలన్నీ ఈ ప్రదేశమందు ఉన్నాయి.

**య ఏనం సేవతే నిత్యం శ్రద్ధాభక్తి సమన్వితః ।**
**జ్ఞానార్థీ జ్ఞానమాప్నోతి ద్రవ్యార్థీ ద్రవ్యమాప్నుయాత్ ॥28॥**

శ్రద్ధ, భక్తి కలిగినవాడై నిత్యమూ ఈ దేవుని సేవించినవాడు, జ్ఞానార్థియైనచో జ్ఞానం పొందుతాడు. ద్రవ్యార్థి ద్రవ్యం పొందుతాడు.

**పుత్రార్థీ పుత్రమాప్నోతి నృపో రాజ్యం చ విందతి ।**
**యం యం కామయతే మర్త్య స్తం తమాప్నోతి సర్వథా ॥29॥**

పుత్రార్థియైనవాడు పుత్రుని పొందుతాడు. నృపుడు రాజ్యం పొందుతాడు. మానవుడు ఏయే కోరిక కోరుకొంటాడో ఆ యా కోరిక అన్ని విధాలా పొందుతాడు.

**చింతితం సాధ్యతే యస్మాత్తస్మాచ్చింతామణిం విదుః ।**
**పుష్కరిణ్యాశ్చ బాహుల్యాద్గిరావస్మిన్సరఃసు చ ॥**
**పుష్కరాద్రిరితి ప్రాహురేవం తత్త్వార్థవేదినః ॥30॥**

చింతించేది సాధింపబడుతుంది గాన చింతామణిగా దానిని గ్రహిస్తారు. పుష్కరిణియొక్క విస్తీర్ణతవల్ల ఈ గిరియందుండే సరస్సులవల్ల తత్త్వార్థవిదులు దీనిని పుష్కరాద్రి అనికూడా వచిస్తారు.

**శాతకుంభస్వరూపత్వాత్ కనకాద్రిం చ తం విదుః ।**
**వైకుంఠాదాగతేనైవ వైకుంఠాద్రిరితి స్మృతః ॥31॥**

సువర్ణస్వరూపంతో నుండుటవలన కనకాద్రి అనికూడ దానిని పిలుస్తారు. వైకుంఠంనుండి వచ్చిన కారణంచే వైకుంఠాద్రి అనికూడ స్మరింపబడుతోంది.

**అమృతైశ్వర్యసంయుక్తో వ్యంకటాద్రిరితి స్మృతః ।**
**వ్యంకటేశస్య శైలస్య మాహాత్మ్యం యావదస్తి హి ॥32॥**

**తావద్వక్తుం సమగ్రేణ న సమర్థ శ్చతుర్ముఖః ।**

అమృతమైన ఐశ్వర్యంతో కూడుకొన్నది కావున వ్యంకటాద్రి అని పిలవబడుతోంది. వ్యంకటేశ శైలంయొక్క మాహాత్మ్యం ఎంత ఉన్నదన్నచో, దానినంతటిని సమగ్రంగా చెప్పటానికి చతుర్ముఖుడుకూడ సమర్థుడు కాదు.

**వ్యంకటాద్రౌ పరాం భక్తిం యే కుర్వంతి దినే దినే ।**
**పంగుర్జంఘాల ఏవ స్యా దచక్షుః పద్మలోచనః ॥33॥**

వ్యంకటాద్రియందు పరమభక్తిని ప్రతిదినమందు ప్రకటించగలిగతే, కుంటువాడు గబగబ నడవగలడు. కన్నులు లేనివాడు తామరపూలవంటి నేత్రాలను పొందగలడు.

**మూకో వాగ్మీ భవేదేవ బధిరః శ్రావకో భవేత్ ।**
**వంధ్యా సా బహుపుత్రా చ నిర్ధనః సధనో భవేత్ ॥34॥**

మూగవాడు చక్కగా మాట్లాడగలడు. చెవిటివాడు వినికిడి శక్తి పొందగలడు. గొడ్రాలు పెక్కు బిడ్డలను కనగలదు. బీదవాడు ధనికుడు కాగలడు.

**ఏతత్సర్వం గిరౌ భక్తిమాత్రేణైవ భవేద్ధ్రువమ్ ।**
**తత్త్వతో వ్యంకటాద్రేస్తు స్వరూపం వేత్తి కో భువి ॥35॥**

ఇదంతా ఆ కొండయందు భక్తి కల్గియుండడంచేతనే తప్పనిసరిగా చేకూరుతుంది. వ్యంకటాద్రి తత్త్వస్వరూపాన్ని భూమియందు ఎవడు తెలుసుకోగలడు?

**యస్మాదస్య గిరేః పుణ్యం మాహాత్మ్యం వేత్తి యః పుమాన్ ।**
**మాయావీ పరమానందం త్యక్త్వా వైకుంఠముత్తమమ్ ।**
**స్వామి పుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥36॥**

అందువల్ల ఈ గిరియొక్క పుణ్యమాహాత్మ్యమును ఏ పురుషుడయినా తెలుసుకోవాలి. మాయను తన అధీనంలో ఉంచుకొనే భగవంతుడు ఉత్తమమై మిక్కిలిగా ఆనందనిలయమైన వైకుంఠం వదలి, స్వామిపుష్కరిణియొక్క తీరంలో రమాదేవితో కలసి ఆనందంతో ఉన్నాడు.

**కల్యాణాద్భుతగాత్రాయ కామితార్థప్రదాయినే ।**
**శ్రీమద్వ్యంకటనాథాయ శ్రీనివాసాయ తే నమః ॥37॥**

మంగళప్రదమై, ఆశ్చర్యదాయకమైన శరీరం కల్గిన, కోరుకొనే ప్రయోజనాలను నెరవేర్చే శ్రీమంతుడు వ్యంకటనాథుడైన శ్రీనివాసునికి నీకు నమస్కారం.

**శ్రీస్వామిపుష్కరిణ్యాశ్చ మాహాత్మ్యం శృణు కన్యకే! ।**
**స్వామిపుష్కరిణీ మధ్యే శ్రీనివాసోఽస్తి సర్వదా ॥38॥**

కుమారీ! శ్రీస్వామిపుష్కరిణియొక్క మాహాత్మ్యం విను. స్వామిపుష్కరిణిలోపల ఎల్లప్పుడు శ్రీనివాసుడు ఉంటాడు.

**స్నానం కుర్వంతి యే తత్ర తేషాం ముక్తిః కరే స్థితా ।**
**తిస్రః కోట్యర్ధకోటిశ్చ తీర్థాని భువనత్రయే ॥**
**తాని సర్వాణి తత్రైవ సంతి తీర్థే హరేః సదా ॥39॥**

అక్కడ స్నానం చేసే వారికి మోక్షం చేతిలోనే ఉంటుంది. మూడు లోకాలలోను మూడు కోట్ల ఏబది లక్షల పుణ్యతీర్థాలు ఉన్నాయి. అవన్నీ అక్కడే ఆ హరితీర్థంలో ఎప్పుడూ ఉంటాయి.

**తత్తీర్థం శ్రీనివాసాఖ్యం సర్వదేవ నమస్కృతమ్ ।**
**తదేవ శ్రీనివాసస్య మందిరం పరికీర్తితమ్ ॥40॥**

సమస్త దేవతలచే నమస్కరింపబడే ఆ తీర్థం శ్రీనివాసతీర్థంగా పేరు పొందింది. అదే శ్రీనివాసుని మందిరంగా పేర్కొనబడింది.

**తద్దర్శనాదేవ కన్యే! యాంతి పాపాని భస్మసాత్ ।**
**ఏకైక స్నానమాత్రేణ సత్సంగో భవతి ధ్రువమ్ ॥41॥**

కుమారీ! ఆ దేవుని దర్శనంవల్లనే సర్వపాపాలు భస్మమైపోతాయి. ఒక్క స్నానంచేతనే (ఒకే ఒక స్నానమాత్రంచేతనే) తప్పనిసరిగా సత్సంగం లభిస్తుంది.

**సత్సంగాజ్ జ్ఞానమాసాద్య జ్ఞానాన్మోక్షం చ విందతి ।**
**అధికారిణాం భవేదేవం విపరీతమయోగినామ్ ॥42॥**

సత్సంగంవల్ల జ్ఞానం పొంది, జ్ఞానంవల్ల మోక్షం పొందుతాడు. ఈవిధంగా అధికారులకు మాత్రమే సిద్ధిస్తుంది. అయోగ్యులైనవారికి ఇది విపరీతం (వ్యత్యస్తం).

**తీర్థానాం స్నానమాత్రేణ మోక్షం యాంతీతి యే విదుః ।**
**తే సర్వే అసురా జ్ఞేయా స్తే యాంతి అధమాం గతిమ్ ॥43॥**

తీర్థాలలో స్నానమాత్రంచేతనే మోక్షం పొందుతారని ఎవరు చెబుతారో (గ్రహిస్తారో) వారు అసురులు అని చెప్పబడతారు. వారు అధమగతిని పొందుతారు.

**శ్రీనివాసస్య తీర్థేఽస్మిన్ వాయుకోణే చ కన్యకే! ।**
**ఆస్తే వాయుః సదా విష్ణోః పూజాం కర్తుమనుత్తమమ్ ॥44॥**

కుమారీ! ఈ శ్రీనివాసతీర్థమందు వాయవ్యకోణంలో వాయువు ఎల్లప్పుడు మిక్కిలి గొప్పదైన విష్ణువుయొక్క పూజ చేయటానికి ఉంటాడు.

**వాయుతీర్థం చ తత్రోక్తం హస్తద్వాదశకాంతరమ్ ।**
**హస్తషట్క ప్రమాణం చ పశ్చిమే సముదాహృతమ్ ॥**
**ఉత్తరే హస్తషట్కం తు వాయుతీర్థముదాహృతమ్ ॥45॥**

దానికి పంద్రెండ్రుమూరల లోపల వాయుతీర్థమున్నట్లు చెప్పబడింది. పశ్చిమంనుండి ఆరు మూరల ప్రమాణ దూరంలో అది ఉంది. ఉత్తరంనుండి ఆరు మూరల లోపల వాయుతీర్థమున్నట్లు పేర్కొనబడుతోంది.

**యే వైష్ణవా వైష్ణవదాసవర్యాః స్నానం కుర్యుస్తత్ర పూర్వం సుకన్యే! ।**
**మధ్వాంతస్థాః శ్రీనివాసస్తు నిత్యమత్రస్నానాత్ ప్రీయతాం మే దయాలుః ॥46॥**

సుకన్యా! వైష్ణవులు, వైష్ణవదాసశ్రేష్ఠులు అక్కడ స్నానము చేస్తే వారు మధ్వతీర్థంలో కూడ స్నానం చేసినట్లే. నిత్యమూ శ్రీనివాసుడు అక్కడ ఉంటాడు. అక్కడి స్నానంవల్ల ఆ దయాపరుడు నాయందు సంతుష్టుడగు గాక!

**యే మధ్వతీర్థేషు స్నాతుమిచ్ఛంతి దేవి! రుద్రాదయో వాయుభక్తా మహాంతః ।**
**సదా స్నానం తత్ర కుర్వంతి దేవి! ప్రాతఃకాలే చోదయాత్పూర్వమేవ ॥47॥**

దేవీ! మధ్వతీర్థంలో స్నానమాడదలచిన, ఆ రుద్రాదులు, వాయుభక్తులు, మహాత్ములు ప్రాతఃకాలంలో సూర్యోదయానికి పూర్వమే, దేవీ! అక్కడ వాయుతీర్థంలో ఎల్లప్పుడు ముందు స్నానం చేస్తారు.

**యే వాయుతీర్థే విసృజంతి దేహజం మలం మూత్రం వమనం శ్లేష్మకం చ ।**
**యేఽపానశుద్ధిం లింగశుద్ధిం చ కన్యే! కుర్వంతి తే హ్యసురా రాక్షసాశ్చ ॥48॥**

వాయుతీర్థంలో దేహంనుండి పుట్టే మలం, మూత్రం, వమనం, శ్లేష్మం మున్నగువాటిని విడిచిపెట్టినవారు, కుమారీ! అపానశుద్ధి, లింగశుద్ధి జరుపుకొన్న వారు అసురులు, రాక్షసులు అవుతారు.

**శృణ్వంతి యే భాగవతం పురాణం కిం వర్ణయే తస్య పుణ్యం తు దేవి! ।**
**యే కృష్ణమంత్రం తు జపంతి దేవి! హ్యష్టాక్షరం మంత్రవరం సుగోప్యమ్ ॥49॥**

**తేషాం హరిః ప్రీయతే కేశవోఽలంమధ్వాంతస్థో నాత్ర విచార్యమస్తి ।**
**ఏవం దానం తత్ర కుర్వంతి యే వైద్విజాగ్ర్యాణాం వైష్ణవానాం విదాం చ ॥50॥**

**తేషాం పుణ్యం నైవ జానంతి దేవాజానాత్యేవం శ్రీనివాసో హరిస్తు ।**
**శాలగ్రామం వాయుతీర్థే దదంతేతేషాం పుణ్యం వేత్తి స వ్యంకటేశః ॥51॥**

దేవీ! అక్కడ భాగవతపురాణం శ్రవణం చేసేవారికి కలిగే పుణ్యంగురించి ఏమని వర్ణించగలను? దేవీ! ఎవరయితే పరమరహస్యమైన, మంత్రశ్రేష్ఠమయిన, అష్టాక్షరమయిన కృష్ణమంత్రమును జపిస్తారో, వారికి మధ్వాంతస్థుడైన కేశవుడగు హరి పూర్తిగా సంప్రీతుడవుతాడు. అందు ఆలోచించవలసినదేదీ లేదు. ఇదే విధంగా ద్విజశ్రేష్ఠులకు, విష్ణుభక్తులకు విద్వాంసులకు ఎవరయితే అక్కడ దానం చేస్తారో, వారి పుణ్యాన్ని దేవతలుకూడ తెలియజాలరు. దానిని శ్రీనివాసుడైన హరిమాత్రమే గ్రహింపగలడు. వాయుతీర్థంలో శాలగ్రామం దానం చేసేవారియొక్క పుణ్యాన్ని ఆ వ్యంకటేశుడే తెలియగలడు.

**సుదుర్లభో వాయుతీర్థేఽభిషేకో నిష్కామబుద్ధ్యా వైష్ణవానాం చ దేవి! ।**
**తత్రాపి తీర్థే లభ్యతే భాగ్యయోగాద్భాగవతస్య శ్రవణం విష్ణుదాసైః ॥52॥**

దేవీ! విష్ణుభక్తులకు నిష్కామబుద్ధితో వాయుతీర్థంలో స్నానమాచరించడం మిక్కిలి దుర్లభమైనది. అక్కడ భాగ్యవశం వలననే విష్ణుదాసులతో కలసి భాగవతశ్రవణం చేయడమనేదికూడ ఆ తీర్థంలో చేకూరుతుంది.

**తత్రైవ తీర్థే దుర్లభం తత్ర దేవి! శాలగ్రామస్య ద్విజవర్యే చ దానమ్ ।**
**జంబూఫలాకార సునీలవర్ణం ముఖద్వయం చక్రచతుష్టయాన్వితమ్ ॥53॥**

దేవీ! ఆ తీర్థమందు అక్కడ ద్విజశ్రేష్ఠునకు సా(శా)లగ్రామం దానం చేయడం కూడ దుర్లభమే. నేరేడుపండు రూపంలో ఉండేది, మిక్కిలి నల్లనైన రంగులో ఉండేది, రెండు ముఖాలతో ఉండేది, నాలుగు చక్రాలతో కూడి ఉండేది,

**సుకేశరైః సంయుతం స్వర్ణచిహ్నైర్ధ్వజాంకుశై ర్వజ్రచిహ్నై ర్యవైశ్చ ।**
**జానార్దనీం మూర్తిమాహు ర్మహాంతోదానం తస్యా దుర్లభం తత్ర తీర్థే ॥54॥**

కొనలయందు విడిపోయిన కేశరాలతో, బంగారపు రంగు గుర్తులు కల, ధ్వజం(టెక్కెం), అంకుశం(మంచి లక్షణములు కలది), వజ్రం(రత్నం, ఆయుధం), చిహ్నాలతో కూడి, యవల (ధాన్యవిశేషము) మూర్తిని (ఆకారం) మహాత్ములు జనార్దనస్వరూపంగా వచిస్తారు. తీర్థమందు అక్కడ అట్టి మూర్తిని దానం చేయడమనేది కూడ లభింపరానిదే.

**అత్యుత్తమం మూర్తిదానం తు భద్రే! సుదుర్లభం పరమం నాత్ర లోభః ।**
**సుదుర్లభం బహు దోగ్ధ్ర్యాశ్చ గృష్టేర్దానం తథా వస్త్రరత్నాదికానామ్ ॥55॥**

భద్రురాలా! మిక్కిలి గొప్పదైన మూర్తిదానం చేయటం కూడ తరచుగా చేకూరనట్టిదే. అది ఉత్కృష్టమైనది. అందు లోభం పనికిరాదు. అలాగే ఎక్కువగా పాలను ఇచ్చే ఒంటిఈత ఆవును, వస్త్రములు, రత్నములు మున్నగువాటిని దానం చేయటం కూడ ఎక్కువగా లభ్యమయ్యేది కాదు.

**అత్యుత్తమం ద్రవ్యదానం చ దేవి! స్వాపేక్షితం దానమాహుర్మహాంతః ।**
**స్వస్యానపేక్షం ఫలదానం చ వస్త్రదానం తస్య వ్యర్థమాహు ర్మహాంతః ॥56॥**

దేవీ! కోరిన ద్రవ్యాన్ని దానమీయడం మిక్కిలి ఉత్కృష్టమైన దానంగా మహాత్ములు చెప్తున్నారు. అతనిచేత కోరబడని ఫలదానం, వస్త్రదానం మున్నగునవి వ్యర్థమని మహాత్ములు వచిస్తారు.

**అత్యుత్తమం గృష్టిదానం చ పుణ్యం నైవాప్యతే దుగ్ధదోహాశ్చ గావః ।**
**అత్యుత్తమే వస్త్రదానే సుబుద్ధిః సుదుర్ఘటా పరమా వై జనానామ్ ॥57॥**

ఒకసారి ఈనిన ఆవును దానం చేయటం మిక్కిలి గొప్పదైన పుణ్యం. పాలను ఇచ్చే ఆవులు లభించుట కష్టం. జనులకు అత్యున్నతమైన వస్త్రదానం చేయుటలో దృఢబుద్ధి కల్గడమనేది మిక్కిలి దుర్లభమైనది.

**అత్యుత్తమం భాగవతస్య పుస్తకం సుదుర్ఘటం వాయుతీర్థే చ కన్యే! ।**
**అత్యుత్తమం ద్రవ్యదానం చ దేవి! సుదుర్ఘటం వాయుతీర్థే నృణాం హి ॥**
**సుదుర్లభో వైష్ణవై స్తత్త్వవిద్భిర్హరేర్విచారో వాయుతీర్థే చ కన్యే! ॥58॥**

కుమారీ! వాయుతీర్థమందు మిక్కిలి ఉత్తమమైన భాగవతగ్రంథాన్ని ఇవ్వటం సుదుర్లభం. దేవీ! నరులకు వాయుతీర్థంలో మిక్కిలి ప్రశస్తమైన ద్రవ్యదానం చేయుటకూడ లభింపరానిదే. కుమారీ! వాయుతీర్థమందు వైష్ణవులతోను, తత్త్వవేత్తలలోను హరిని గురించి గోష్ఠికూడ మిక్కిలి దుర్లభమే.

**శ్రీనివాసస్య తీర్థస్య ఉత్తరస్యాం దిశి స్థితమ్ ।**
**చంద్రతీర్థమితి ప్రోక్తం తత్రాస్తే చంద్రమాః సదా ॥59॥**

శ్రీనివాసతీర్థానికి ఉత్తరదిక్కునందున్న తీర్థం చంద్రతీర్థమని చెప్పబడుతోంది. అక్కడ ఎల్లప్పుడు చంద్రుడు సంచరిస్తుంటాడు.

**శ్రీనివాసస్య పూజాం చ తత్ర స్థిత్వా కరోత్యయమ్ ।**
**తత్ర స్నానం ప్రకుర్వంతి పుణ్యదేశే చ కన్యకే! ॥60॥**

అక్కడ ఉండి ఆ చంద్రుడు శ్రీనివాసుని పూజను చేస్తాడు. కన్యకా! ఆ పుణ్యప్రదేశంలో స్నానం భక్తితో చేస్తూ ఉంటారు.

**గురుతల్పాది పాపేభ్యో ముచ్యంతే నాత్ర సంశయః ।**
**తత్ర స్నాత్వా పూర్వభాగే శాలగ్రామం దదాతి యః ॥61॥**

**జ్ఞానద్వారే మోక్షమేతి నాత్రకార్యా విచారణా ।**
**దధివామనమూర్తేశ్చ దానం తత్ర సుదుర్లభమ్ ॥62॥**

వారు గురుతల్పగమనం మున్నగు పాపాలనుండి విముక్తులవుతారు. ఇందు సందియం లేదు. అక్కడ స్నానం చేసి, తూర్పుదిక్కుగా శాలగ్రామం దానం చేసినవాడు జ్ఞానమార్గంద్వారా మోక్షం పొందుతాడు. ఇందు ఆలోచించవలసింది ఏదీ లేదు. అక్కడ దధివామనమూర్తియొక్క దానం మిక్కిలి దుర్లభమయినది.

**బదరీఫలమాత్రం తు వర్తులం నీలవర్ణకమ్ ।**
**ప్రసన్నవదనం సూక్ష్మం సుస్నిగ్ధం కన్యకే శుభే! ॥63॥**

కుమారీ! శుభప్రదురాలా! రేగుపండు ప్రమాణంలో గుండ్రంగా ఉండేది; నల్లని రంగులో, ప్రసన్నమైన ముఖభాగంతో సూక్ష్మమైనది; మిక్కిలి నునుపుగా ఉండేది

**చక్రద్వయ సమాయుక్తం గోపురైః పంచభిర్యుతమ్ ।**
**చాపబాణ సమాయుక్తమనతం కుండలీకృతమ్ ॥64॥**

రెండు చక్రాలతో కూడుకొన్నది, అయిదు గోపురాలతో ఉండేది, విల్లమ్ములతో కూడి ఉండేది, వంగకుండా ఉండేది, కుండవలె గుండ్రంగా ఉండేది(కర్ణాభరణాకారంలో ఉండేది),

**వనమాలా ముఖయుతం మూర్ధ్నసాహస్రసంయుతమ్ ।**
**రౌప్యబిందు సమాయుక్తం సవ్యే భద్రార్ధమాత్రకమ్ ॥65॥**

వనమాలతో కూడిన ముఖంతో ఉండేది, వేయి శిరస్సులతో ఉండేది, వెండి చుక్కలతో కూడి ఉండేది, ఎడమభాగంలో సగం మాత్రమే భద్రకుంభం కలది,

**చంద్రేణ సహితం దేవి! దధివామనముచ్యతే ।**
**ఏతాదృశం కలౌ నృణాం దుర్లభం బహుభాగ్యదమ్ ।**
**లక్ష్మీనారాయణసమాం తాం మూర్తిం విద్ధి భామిని! ॥66॥**

చంద్రునితో కూడుకొన్నది అయిన మూర్తి దధివామనం అని చెప్పబడుతుంది. నరులకు కలియుగంలో మిక్కిలిగా సంపదలనిచ్చే ఇటువంటి మూర్తి లభించడం కష్టం. భామినీ! ఆ మూర్తిని లక్ష్మీనారాయణులతో సమానమైనదానినిగా తెలుసుకో.

**సుదుర్లభం తస్య మూర్తేశ్చ దానం తచ్చంద్రతీర్థే శ్రవణం దుర్ఘటం చ ।**
**సమ్యక్ స్వరూపం దధివామనస్య సుదుర్ఘటం శ్రవణం వైష్ణవాచ్చ ॥67॥**

ఆ మూర్తి దానం మిక్కిలి దుర్లభమైనది. చంద్రతీర్థంలో దానిని శ్రవణం చేయడం కూడ దుర్ఘటమైనది. వైష్ణవునిద్వారా దధివామనునియొక్క సంపూర్ణస్వరూపశ్రవణం కూడా మిక్కిలి దుర్లభమైనది.

**తత్ర స్నాత్వా వామనస్య స్వరూపశ్రవణాద్విదుర్దానఫలం సమం చ ।**
**దశహస్త ప్రమాణంతుచంద్రతీర్థముదాహృతమ్ ॥68॥**

అక్కడ స్నానం చేసి, వామనుని స్వరూపంగురించి శ్రవణం చేయడం దానం చేసిన ఫలంతో సమానమని చెబుతారు. (తెలుసుకొంటారు). చంద్రతీర్థం పదిమూరల ప్రమాణం(విస్తీర్ణం)తో ఉన్నదని తెలియబడుతోంది.

**మధ్యాహ్నే దుర్లభం స్నానం నృణాం తత్ర సుమంగలే ।**
**తత్ర స్థిత్వా ధన్యనరః సదా భజతి వై హరిమ్ ॥69॥**

సుమంగళా! అక్కడ నరులకు మధ్యాహ్న సమయంలో స్నానం చేయడం లభింపశక్యం కానిది. ధన్యుడగు నరుడు అక్కడ స్థిరంగా ఉండి ఎప్పుడూ హరిని భజిస్తూ ఉంటాడు.

**వరాహమూర్తి దానంతు శాలగ్రామస్య దుర్లభమ్ ।**
**జంబూఫలప్రమాణం తు ఏతద్వై కుక్కుటాండవత్ ॥70॥**

వరాహమూర్తి రూపంలోనున్న శాలగ్రామాన్ని (శాలగ్రామవరాహమూర్తిని) దానం చేయడంకూడ లభింపరానిదే. ఇది నేరేడుపండు ప్రమాణంలో, కోడిగ్రుడ్డు వలె ఉంటుంది.

**వదనం వలయాకారం ప్రమాణం చణకాదివత్ ।**
**దేవస్య వామభాగే చ మధ్యదేశం విహాయ చ ॥71॥**

**చక్రద్వయ సమాయుక్తం మూర్ధదేశే చ భామిని! ।**
**సువర్ణబిందునా యుక్తం భూవరాహాఖ్యముచ్యతే ॥72॥**

భామినీ! ముఖము గుండ్రంగా ఉండి, సెనగగింజ ప్రమాణంలో ఉండే దేవునికి ఎడమవైపున నడిమిన్న ప్రదేశం వదలివేసి, రెండు చక్రాలతో కూడుకొని, శిరోభాగంలో బంగారపు చుక్కతో ఉన్న మూర్తి 'భూవరాహం' అనే మూర్తిగా చెప్పబడుతుంది.

**పూజాం కృత్వా భూవరాహస్య మూర్తేర్దానం దత్త్వా శ్రవణం చాపి కృత్వా ।**
**తత్ర స్థితం భూవరాహం చ దృష్ట్వాస వై నరః కృతకృత్యో హి లోకే ॥73॥**

భూవరాహమూర్తికి పూజ చేసి, దానమొసంగి, తత్కథాశ్రవణంకూడ చేసి, అక్కడనున్న భూవరాహస్వామిని దర్శించిన ఆ నరుడు లోకమునందు ధన్యజీవుడవుతాడు.

**తత్ర స్నాత్వా భూవరాహస్య మూర్తేః శృణోతి యో లక్షణం సమ్యగేవ ।**
**స తేన పుణ్యం సముపైతి దేవి! సముక్తిభాజ్ నాత్ర విచార్యమస్తి ॥74॥**

దేవీ! అక్కడ స్నానమొనర్చి, భూవరాహమూర్తియొక్క లక్షణాన్ని చక్కగా విన్న నరుడు దానివల్ల పుణ్యం ఎక్కువగా పొందుతాడు. అతడు ముక్తికి భాజనుడవుతాడు. ఇందు ఆలోచించవలసినది లేదు.

**ఈశానకోణే శ్రీనివాసస్య దేవి! రౌద్రం తీర్థం పరమం పావనం చ ।**
**తత్ర స్థిత్వా రుద్రదేవో మహాత్మాపూజాం కరోతి శ్రీనివాసస్య నిత్యమ్ ॥75॥**

దేవీ! శ్రీనివాసునికి ఈశానకోణంలో మిక్కిలి పవిత్రమైన రుద్రతీర్థం ఉంది. మహానుభావుడైన రుద్రదేవుడు ఆ ప్రదేశమందు ఉండి ఎల్లప్పుడు శ్రీనివాసుని అర్చన చేస్తుంటాడు.

**హస్తాష్టకం తత్ప్రమాణం వదంతి తత్ర స్నానం వైష్ణవైః కార్యమేవ ।**
**తత్ర స్నాత్వా ప్రయతో వై మురారేః కథాం దివ్యాం శృణుయాదాదరేణ ॥**
**స్నానం పానం తత్ర దానం చ కుర్యాల్లక్ష్మీనృసింహ ప్రీతయే దేవి! నిత్యమ్ ॥76॥**

దాని ప్రమాణాన్ని(విస్తీర్ణం) ఎనిమిది మూరలుగా చెబుతారు. అక్కడ విష్ణుభక్తులచే స్నానం చేయదగియున్నది. అక్కడ స్నానమొనర్చి, నియతాత్ముడై, మురారియొక్క దివ్యమైన గాథను భక్తితో వినాలి. దేవీ! అక్కడ లక్ష్మీనృసింహస్వామి యొక్క సంతుష్టికోసమై ఎల్లప్పుడు స్నానం, పానం, దానం చేయాలి.

**బదరీఫలమాత్రం చ వర్తులం బిందుసంయుతమ్ ॥77॥**

**దేవస్య వామభాగే తు చక్రద్వయసమన్వితమ్ ।**
**సువర్ణరేఖా సంయుక్తం కించిద్రక్త సమన్వితమ్ ॥78॥**

**వైశ్యవర్ణం సవదనం పద్మరేఖాది చిహ్నితమ్ ।**
**లక్ష్మీనృసింహం తం విద్ధి భుక్తిముక్తి ప్రదాయకమ్ ॥79॥**

రేగుపండంత ప్రమాణంతో, గుండ్రంగా, బిందువుతో కూడుకొన్నదై, దేవుని వామభాగంలో రెండు చక్రాలు గలిగి, బంగారపు గీతతో కూడుకొని, కొద్దిగా ఎరుపురంగుతో, వైశ్యవర్ణంతో (చామనచాయ) చక్కని ముఖభాగం కల్గి, పద్మరేఖ మున్నగు గుర్తులు గల మూర్తి లక్ష్మీనృసింహమూర్తి. దానిని భుక్తి, ముక్తి ఇచ్చేదానినిగా తెలిసికొనుము (గ్రహించు).

**ఏతాదృశం గండికాయాః శిలాయాః మూర్తేర్దానం దుర్ఘటం విద్ధి వీంద్ర! ।**
**తత్ర స్నాత్వా శ్రీనృసింహస్వరూపం లక్ష్మీపతేః శృణయాద్భక్తియుక్తః ॥80॥**

**మూర్తేర్దానాత్ఫలమాప్నోతి దేవి! సత్యం సత్యం నాత్ర విచార్యమస్తి ॥81॥**

పక్షీంద్రా! ఇటువంటి గండికానదీ తీరంలో ఉండే శిలామూర్తిని దానం చేయడం దుర్లభమైనది గ్రహించు. దేవీ! అక్కడ స్నానం చేసి, లక్ష్మీపతియైన శ్రీనృసింహస్వరూపాన్ని భక్తితో శ్రవణం చేయాలి. అటువంటి మూర్తిని దానం చేయడంవల్ల సత్ఫలితం పొందుతాడు. ఇది సత్యం. ఇది సత్యం. ఇందు ఆలోచించవలసింది లేదు.

**ఈశాన శక్రయోర్మధ్యే బ్రహ్మతీర్థముదాహృతమ్ ।**
**దుర్లభం మానుషాణాంతు స్నానం సర్వార్థసాధకమ్ ॥82॥**

**శాలగ్రామస్య దానం తు దుర్లభం తత్ర వై నృణామ్ ।**
**లక్ష్మీనారాయణస్యైవ మూర్తే ర్దానం సుదుర్లభమ్ ॥83॥**

ఈశాన్యానికి, తూర్పునకు నడుమ బ్రహ్మతీర్థమున్నట్లు చెప్పబడింది. మనుష్యులకు సర్వప్రయోజనాలను చేకూర్చే స్నానం అక్కడ దుర్లభం. అక్కడ నరులకు సాలగ్రామాన్ని దానం చేయడం కూడ దుర్లభమే. అలాగే లక్ష్మీనారాయణమూర్తిని దానం ఈయడంకూడ మిక్కిలి దుర్లభమే.

**స్థలమౌదుంబరం సమం తత్ప్రమాణముదాహృతమ్ ।**
**ఛత్రాకారం వర్తులం చ ప్రసన్నవదనం శుభమ్ ॥84॥**

అత్తిపండుతో సమానమైన స్థలంలో (ఆకారపు రంగులో) దాని ప్రమాణం తెలియజెప్పబడుతున్నది. గొడుగు రూపుతో ఉండేది, గుండ్రమైనది, సౌమ్యమైన ముఖభాగం కలది, మంగళప్రదమైనది....

**చణకప్రదేశమాత్రం చ వదనం సముదాహృతమ్ ।**
**సవ్యే దక్షిణపార్శ్వే చ సమయోః పుష్కలాన్వితమ్ ॥85॥**

సెనగగింజంత ఆకారరూపంలో ముఖం ఉండేదిగా చెప్పబడింది. ఎడమవైపునను, కుడిప్రక్కను సమరూపాలలో పుష్కలాలతో కూడుకొనినది(పుష్కలములు=అగ్రములు)....

**గోయూథవత్స వర్ణం చ చతుశ్చక్రసమన్వితమ్ ।**
**గోఖురైశ్చ సమాయుక్తం సువర్ణ కిణసంయుతమ్ ॥86॥**

గోవత్స(ఆవు, దూడ) సమూహాల రంగులో ఉండేది, నాలుగు చక్రాలతో కూడుకొన్నది, బంగారపు గుర్తులతో కూడుకొన్నది....

**వనమాలాభిసంయుక్తం వజ్రపుంఖైశ్చ సంయుతమ్ ।**
**ఏతాదృశీం హరేర్మూర్తిం లక్ష్మీనారాయణం విదుః ॥87॥**

వనమాలతో కూడుకొన్నది, వజ్రపు పిడులతో కూడుకొన్నది. ఇటువంటి హరియొక్క మూర్తిని లక్ష్మీనారాయణమూర్తిగా చెబుతారు.

**కలౌ నృణాం తస్య లాభో దుర్లభః సంస్మృతో భువి ।**
**దానం చ సుతరాం దేవి! దుర్లభం కిం వదామి తే ॥88॥**

భూమియందు కలియుగంలో నరులకు అటువంటిమూర్తి లభించుట దుర్లభంగా చెప్పబడుతోంది. దేవీ! దానిని దానమిచ్చుట మిక్కిలి దుర్లభం. నీకు ఇంకా ఏమి చెప్పమంటావు?

**బ్రహ్మతీర్థే చ సంస్నాయ శ్రోతవ్యా వై హరేః కథా ।**
**గండికాయాః శిలాయాశ్చ లక్ష్మీనారయణస్య తు ॥89॥**
**లక్షణం యో విజానాతి తదా తత్సదృశం ఫలమ్ ।**
**ప్రాప్నోత్యేవ న సందేహో నాత్ర కార్యా విచారణా ॥90॥**

బ్రహ్మతీర్థంలో స్నానం చేసి, హరికథను శ్రవణం చేయవలసింది(చేయడం విధి). గండికానదీతీరంలోని లక్ష్మీనారాయణ శిలామూర్తియొక్క లక్షణాన్ని చక్కగా తెలుసుకొన్నవాడు అక్కడ దానితో సమానమైన ఫలాన్ని (దానఫలాన్ని) పొందుతాడు. అందు సందేహం లేదు. ఇందు వేరే ఆలోచించవలసింది కూడా లేదు.

**శ్రీనివాసస్య తీర్థస్య పూర్వే స్యాదింద్రతీర్థకమ్ ।**
**శ్రీనివాసస్య పూజాం తు కర్తుమాస్తే శచీపతిః ॥91॥**

శ్రీనివాసుని తీర్థానికి పూర్వభాగంలో (తూర్పున) ఇంద్రతీర్థం కలదు. శ్రీనివాసుని పూజ చేయటానికి శచీపతి అయిన ఇంద్రుడు అక్కడ ఉన్నాడు.

**శాలగ్రామ శిలాదానం కర్తవ్యం శ్రోత్రియాయ వై ।**
**శాలగ్రామ శిలాదానం హత్యాకోటి వినాశనమ్ ॥92॥**

అక్కడ శాలగ్రామ శిలాదానం శ్రోత్రియునకు చేయదగియున్నది. శాలగ్రామ శిలను దానం చేయడంవల్ల కోటిహత్యల పాపం నశిస్తుంది.

**తస్మింస్తీర్థే తు యో దేవి! సీతారామ శిలాభిధామ్ ।**
**దదాతి భూతలే భద్రే! భూపతేః సదృశో భవేత్ ॥93॥**

దేవీ! భద్రురాలా! ఆ తీర్థమందు సీతారామ శిల అనే పేరుగల మూర్తిని దానం చేసినవాడు భూతలమునందు భూపతి(నరపతి)తో సమానుడు కాగలడు.

**సీతారామశిలా దేవి! ద్వివిధా సంప్రకీర్తితా ।**
**పంచచక్రయుతా కాచిత్ షట్చక్రేణ చ సంయుతా ॥94॥**

దేవీ! సీతారామ శిల రెండు విధాలుగా ఉంటుందని చెప్పబడింది. ఐదు చక్రాలతో కూడేది ఒకటి, ఆరు చక్రాలతో కూడుకొనేది ఇంకొకటి.

**తత్రాపి షట్చక్రయుతా హ్యుత్తమా సంప్రకీర్తితా ।**
**పంచచక్రయుతాయాశ్చ ఫలం ద్విగుణమీరితమ్ ॥95॥**

అందునుకూడ ఆరుచక్రాలతో కూడుకొన్నది ఉత్తమశిలగా పేర్కొనబడింది. ఐదు చక్రాలతో కూడుకొన్న దానికన్న(కి) రెండు రెట్లు ఫలం ఎక్కువగా ఉంటుంది.

**కుక్కుటాండ ప్రమాణం చ సుస్నిగ్ధం నీలవర్ణకమ్ ।**
**వదనత్రయసంయుక్తం షట్చక్రైః కేసరైర్యుతమ్ ॥96॥**

కోడుగ్రుడ్డు ప్రమాణంలో ఉండేది, మిక్కిలి నునుపైనది, నల్లని రంగులో ఉండేది, మూడు ముఖాలతో కూడుకొన్నది, ఆరు చక్రాలతో , కేసరాలతో ఉండేది,

**స్వర్ణరేఖా సమాయుక్తం ధ్వజవజ్రాంకుశైర్యుతమ్ ।**
**ఏతాదృశం తు వై భద్రే! సీతారామాభిధం స్మృతమ్ ॥97॥**

బంగారపు గీతలతో కూడుకొన్నది, ధ్వజం, వజ్రం, అంకుశం అనే వాటితో కూడుకొన్నది ఇటువంటిదానిని భద్రురాలా! సీతారామశిల అనే పేరుగల మూర్తిగా చెప్పబడింది.

**వందనే వందనే దేవి! సీతారామస్య కోశకమ్ ।**
**దుర్లభం తు కలౌ నృణాం స్వసామ్రాజ్యప్రదం శుభమ్ ॥98॥**

దేవీ! సీతారామ దివ్య విగ్రహాన్ని (ముఖమును) పదేపదే నమస్కరించడం కలియుగంలో నరులకు లభింప శక్యం కానిది. మంగళప్రదమైన స్వీయ సామ్రాజ్య వైభవాన్ని ఇచ్చేది.

**ఇంద్రతీర్థే మహాదేవి! సీతారామాభిధా శిలా ।**
**యా తద్దానం దర్లభం తన్నాల్పస్య తపసః ఫలమ్ ॥99॥**

మహాదేవీ! ఇంద్రతీర్థమందు సీతారామమనే పేరుగల శిలను దానమిచ్చుట లభింప శక్యం కానిది. కొద్దిపాటి తపస్సువలన సిద్ధించే ఫలం కాదిది.

**దానస్య శక్త్యభావే తు శ్రోతవ్యం లక్షణం హరేః ।**
**శాలగ్రామశిలాదానాద్యత్ఫలం తత్ఫలం లభేత్ ॥100॥**

దానం చేసే శక్తి లేకపోయినా హరియొక్క లక్షణం వినదగియున్నది. శాలగ్రామ శిలాదానం చేయుటవలన ఏ ఫలం వస్తుందో, ఆ ఫలం శ్రవణం చేయడంవల్ల వస్తుంది.

**ఆగ్నేయకోణే శ్రీనివాసస్య దేవి! తీర్థ్యం త్వాస్తే వహ్నిసంజ్ఞం సుశస్తమ్ ।**
**స వహ్నిదేవః శ్రీనివాసస్య పూజాం కర్తుం హాస్తే సర్వదా తీర్థమధ్యే ॥101॥**

దేవీ! శ్రీనివాసునికి ఆగ్నేయకోణంలో ప్రశస్తమైన వహ్నితీర్థమనే పేరుగల తీర్థం ఉంది. తీర్థమధ్య భాగంలో ఆ అగ్నిదేవుడు శ్రీనివాసుని పూజ చేయుటానికి ఎల్లప్పుడూ అక్కడ ఉన్నాడు.

**యో వా తీర్థే వహ్ని సంజ్ఞే చ దేవి! భక్త్యా స్నానం కురుతేఽజం స్మరన్వై ।**
**జ్ఞానద్వారా మోక్షమాప్నోతి దేవి! తత్ర స్నానం దుర్లభం వై నృణాం చ ॥102॥**

దేవీ! వహ్ని అనే పేరు గల ఆ తీర్థంలో భక్తితో స్నానం చేసి, అజుని స్మరిస్తే, జ్ఞానంద్వారా మోక్షం పొందవచ్చు. దేవీ! అక్కడ నరులకు స్నానం లభింపశక్యం కానిది.

**జ్ఞాత్వా స్నానం దుష్కరం తీర్థరాజేభక్తిస్తస్మిన్ దుర్లభా చైవ దేవి! ।**
**శాలగ్రామే తచ్ఛిలాయాశ్చ దానంసుదుర్లభం వాసుదేవాభిధాయాః ॥103॥**

ఆ తీర్థరాజమందు స్నానం చేయుట కష్టంగా తెలుసుకోవాలి. (అక్కడ స్నానం దుష్కరం). దేవీ! అందు భక్తి ఉండుట కూడ దుర్లభమైనదే. వాసుదేవమని చెప్పబడే శిలారూప శాలగ్రామాన్ని దానమొనర్చుట కూడ మిక్కిలి దుర్లభమే. (లభింపరానిది).

**హ్రస్వం తథా వర్తులం నీలవర్ణం సూక్ష్మం ముఖం ముఖచక్రం సుశుద్ధమ్ ।**
**సువేణుయుక్తం వాసుదేవాభిధేయం దానం కలౌ దుర్లభం తస్య భద్రే! ॥104॥**

భద్రురాలా! పొట్టిగా ఉండేది, గుండ్రమైనది, నల్లని రంగులో ఉండేది, ముఖం సూక్ష్మంగా ఉండేది, ముఖంలో చక్రం యుండేది, పరిశుభ్రమైనది, చక్కని వేణువుతో కూడుకొన్నది, వాసుదేవమనే పేరు కల్గినది అయిన ఆ మూర్తియొక్క దానం కలియుగములో లభింప శక్యం కానిది.

**దానే తస్యాః శక్త్యభావే చ దేవి! స్నాత్వా తీర్థే వాసుదేవాభిధస్య ।**
**సమ్యక్ శ్రావ్యం లక్షణం వై శిలాయాస్తయో స్తుల్యం ఫలమాహుర్మహాంతః ॥105॥**

దేవీ! అటువంటి మూర్తిదానంచేసే శక్తి లేకపోతే వాసుదేవమనే పేరుగల తీర్థమందు స్నానమాచరించి, ఆ వాసుదేవ శిలయొక్క లక్షణాన్ని భక్తితో శ్రవణం చేయాలి. ఆ రెండింటికి, సమానమైన ఫలమని మహాత్ములు వచిస్తారు.

**దక్షిణే శ్రీనివాసస్య యమతీర్థం చ సంస్మృతమ్ ।**
**తత్రాస్తే యమరాజస్తు పూజాం కర్తుం హరేః సదా ॥106॥**

శ్రీనివాసునికి దక్షిణంలో యమతీర్థమున్నట్లు చెప్పబడింది. అక్కడ యమధర్మరాజు హరియొక్క పూజ చేయటానికి ఎప్పుడూ ఉంటాడు.

**తత్ర స్నానం చ దానం చాప్యక్షయం పరమం స్మృతమ్ ।**
**శాలగ్రామం శిలాదానం కార్యం తత్ర మహామునే! ॥107॥**

అక్కడ స్నానం, దానం మిక్కిలి అక్షయమవుతుందని చెప్పబడింది. మహామునీ! అక్కడ శాలగ్రామశిలను దానం చేయడం కర్తవ్యం.

**పట్టాభిరామ సంజ్ఞాయాః శిలాయా దానమిష్యతే ।**
**తచ్చూతఫలవత్ స్థూలం వదనత్రయసంయుతమ్ ॥108॥**

అక్కడ పట్టాభిరామమనే పేరు గల శిలయొక్క దానం పేర్కొనబడింది. అది చూత(మామిడిపండు)ఫలంవలె స్థూలమైనది (పెద్దది). మూడు ముఖాలతో కూడుకొనియుంటుంది.

**శిరశ్చక్రేణ రహితం సప్తచక్రైః సమన్వితమ్ ।**
**నీలవర్ణం స్వర్ణరేఖం గోఖురాద్యైః సమన్వితమ్ ॥109॥**

శిరస్సునందు చక్రంలేనట్టిది, ఏడు చక్రాలతో కూడుకొని ఉంటుంది. నల్లనిరంగు, బంగారురేఖతో, ఆవుకాలి గిట్టలు మొదలగువానితో కూడియుంటుంది.

**పట్టవర్ధనరామం తు దుర్లభం బహుభాగ్యదమ్ ।**
**పట్టవర్ధనరామం తు యో దదాతి చ తత్ర వై ।**
**పట్టాభిషిక్తో భవతి నాత్ర కార్యా విచారణా ॥110॥**

పెక్కు సంపదలను ఇచ్చే పట్టవర్ధనరామం లభించడం కష్టం(దుష్కరం). అక్కడ పట్టవర్ధనరామాన్ని దానం చేసినవాడు పట్టాభిషిక్తుడు అవుతాడు. అందు ఆలోచించవలసిన పని లేదు.

**శ్రీనివాసస్య నైరృత్యే నైరృతం తీర్థముత్తమమ్ ।**
**ఆస్తే హి నిరృతి స్తత్ర పూజాం కర్తుం చ సర్వదా ॥111॥**

శ్రీనివాసునికి నైరుతియందు ఉత్తమమైన నైరృతమనే తీర్థం ఉంది. అక్కడ ఎల్లప్పుడూ శ్రీనివాసుని పూజ చేయుటకై నిరృతి ఉంటాడు.

**తత్ర స్నానం ప్రకర్తవ్యం పునర్జన్మ న విద్యతే ।**
**శాలగ్రామ శిలాయాశ్చ పురుషోత్తమ సంజ్ఞితామ్ ॥112॥**

**మూర్తిం దదాతి యో మర్త్యః స యాతి పరమాం గతిమ్ ।**
**ఔదుంబర ఫలాకారం ప్రసన్నవదనం శుభమ్ ॥113॥**

అక్కడ స్నానం తప్పనిసరిగా చేయదగినది. అతనికి తిరిగి జన్మించడం ఉండదు. పురుషోత్తమం అనే పేరుగల శాలగ్రామ శిలకు సంబంధించిన మూర్తిని అక్కడ దానం చేసిన, మానవుడు అతడు ఉత్తమమైన స్థానం పొందుతాడు. మేడిపండు రూపంలో ఉండేది, ప్రసన్నమైన ముఖం కలది, మంగళప్రదమైనది....

**చక్రద్వయసమాయుక్తం శిరశ్చక్రసమన్వితమ్ ।**
**సువర్ణబిందుసంయుక్తం వజ్రాంకుశసమన్వితమ్ ॥114॥**

రెండు చక్రాలతో కూడుకొన్నది, శిరస్సునందు చక్రంతో కూడుకొన్నది, బంగారు చుక్కలతో(బిందువులతో) కూడుకొన్నది, వజ్రం, అంకుశం గుర్తులతో కూడుకొన్నది....

**తన్మూర్తిదానం దుర్లభం తత్ర దేవః ప్రీణాతి యస్మాచ్ఛ్రీనివాసో మహాత్మా ।**
**యదా దానం దుర్ఘటం స్యాచ్చ దేవితదా శ్రోతవ్యం లక్షణం తస్య మూర్తేః ॥115॥**

అయిన మూర్తిని దానం చేయడం దుర్లభం. అక్కడ ఆ దానం చేయడంవల్ల మహాత్ముడైన శ్రీనివాసదేవుడు సంప్రీతుడవుతాడు. దేవీ! అట్టి దానం చేయడం దుర్ఘటం, ఆ మూర్తియొక్క లక్షణాన్ని అక్కడ శ్రవణం చేయాలి.

**పాశినైరృతయోర్మధ్యే శేషతీర్థం పరం స్మృతమ్ ।**
**తత్ర స్నాత్వా శేషమూర్తిం ప్రదదాతి ద్విజాతయే ॥116॥**

వరుణ, నైరృతుల మధ్యలో ఉత్తమమైన శేషతీర్థం ఉంటుంది. అక్కడ స్నానం చేసి, ద్విజాతికి శేషమూర్తిని దానం చేయాలి.

**స యాతి పరమం లోకం పునరావృత్తివర్జితమ్ ।**
**ఔదుంబర ఫలాకారం కుండలాకృతిమేవ చ ॥117॥**

అతడు తిరిగిరాని ఉన్నత లోకాన్ని(పరమపదం) పొందుతాడు. మేడిపండు ఆకారంలో ఉండేది, కుండలంవంటి ఆకారంలో ఉండేది....

**శేషవద్వదనం తస్య తస్మింశ్చకద్వయం స్మృతమ్ ।**
**ఫలం తమేకచక్రేణ సంయుతం వల్మికాన్వితమ్ ॥118॥**

**కించిద్వర్ణసమాయుక్తం శేషమూర్తిమతిస్ఫుటమ్ ।**
**సుప్తా ప్రబుద్ధా ద్వివిధా శేషమూర్తిరుదాహృతా ॥119॥**

దాని ముఖభాగం శేషునివలె ఉంటుంది. అందు రెండు చక్రాలు ఉంటాయని చెప్పబడింది. ఒకే చక్రంతో ఉన్నా అదే ఫలితం. పుట్టతో కూడుకొని ఉండేది, కొద్దిపాటి రంగు కలిగి ఉంటుంది. అటువంటిది శేషమూర్తిగా స్పష్టం చేయబడింది. శేషమూర్తి సుప్త(నిదురించేది), ప్రబుద్ధ(మేల్కొని ఉండేది) అని రెండు విధాలుగా ఉంటుందని చెప్పబడింది.

**ఫణోన్నతా ప్రబుద్ధా స్యాత్ సప్తలక్ష ఫణాన్వితా ।**
**తత్రాపి దుర్లభా సుప్తా మహాభాగ్యకరీ స్మృతా ॥120॥**

ఎత్తబడిన పడగ కలది, ఏడుగా కనిపించే పడగలతో కూడుకొన్నది ప్రబుద్ధ అని చెప్పబడుతుంది. అందుకూడ సుప్తశిల లభింప శక్యం కానిది. అది మహాభాగ్యాన్ని చేకూర్చేదిగా చెప్పబడింది.

**ఇహలోకే పరత్రాపి మోక్షదా నాత్ర సంశయః నవచక్రాదుపక్రమ్య వింశత్యంతం చ యత్ర సః ॥121॥**

**అనంత ఇతి విజ్ఞేయో హ్యనంత ఫలదాయకః విశ్వంభరః స విజ్ఞేయో వింశత్యూర్ధ్వం వరాననే! ॥122॥**

అది ఈలోకమందును, పరలోకమందును మోక్షాన్ని ఇచ్చేది. అందు సంశయం లేదు. తొమ్మిది చక్రాలనుండి ప్రారంభమై, ఇరవై వరకు ఉండేది 'అనంతుడు' అని చెప్పబడుతుంది. అది అనంతమైన ఫలితాలను ఇచ్చేది. వరాననా! ఇరవై పైన చక్రాలు ఉన్నచో అది 'విశ్వంభరుడు' అని చెప్పబడుతోంది.

**తత్రాపి కేసరై శ్చక్రై ర్లక్షణైశ్చ సమన్వితమ్ ।**
**కలౌ తు దుర్లభం నృణాం తద్దానం చాతి దుర్లభమ్ ॥123॥**

అందుకూడ విడిపోయిన కొనలు గల (కేసరాలు) చక్రాలతో మంచి లక్షణాలు గల శేషశిల నరులకు కలియుగంలో లభింపరానిది. అటువంటిదానిని దానమిచ్చుటకూడ మిక్కిలి దుర్లభం.

**స్నానం కృత్వా శేషతీర్థే విశుద్ధేనైవ చేతసా ।**
**ఏతేషాం లక్షణం శ్రుత్వా ప్రయాతి పరమాం గతిమ్ ॥124॥**

శేషతీర్థమందు స్నానం చేసి, పరిశుద్ధమైన (నిర్మలమైన) మనస్సుతో వీటియొక్క లక్షణాన్ని విని, పరమగతిని పొందుతాడు. నరుడు

**తతః పరం మహాభాగే! వారుణం తీర్థముత్తమమ్ ।**
**తత్రాస్తే వరుణో దేవః పూజాం కర్తుం హరేః సదా ॥125॥**

మిక్కిలి సౌభాగ్యురాలా! అటుపైన ఉత్కృష్టమైన వారుణతీర్థం ఉంది. అక్కడ వరుణదేవుడు ఎల్లప్పుడూ హరికి పూజ చేయటానికి ఉంటాడు.

**తత్ర స్నానం ప్రకర్తవ్యం దాతవ్యం దానముత్తమమ్ ।**
**శిశుమారం చ మత్స్యం చ త్రివిక్రమమథాపి వా ॥**
**దాతవ్యం భూతికామేన తీర్థేఽస్మిన్ వరవర్ణిని! ॥126॥**

అక్కడ స్నానం చేయదగియున్నది. ఉత్కృష్టమైన దానంకూడ ఈయవలసియున్నది. వరవర్ణినీ! సంపద కోరుకొనేవాడు ఈ తీర్థంలో శిశుమారమూర్తిని కాని(మొసలి) మత్స్యమూర్తిని కాని (చేప), త్రివిక్రమమూర్తినిగాని దానం చేయాలి.

**జంబూఫల సమాకారా పుచ్ఛే సూక్ష్మా సబిందుకా ।**
**చక్రత్రయా చ వదనే పుచ్ఛోపరి సచక్రకా ॥127॥**

**శ్రీవత్సబిందు మాలాఢ్యా మత్స్యమూర్తి రుదాహృతా ।**
**పుచ్ఛాదధశ్చక్రయుతం శిశుమార ముదాహృతమ్ ॥128॥**

నేరేడు పండుతో సమానమైన ఆకారం కలది, తోకవైపున సూక్ష్మమైన (బాగా చిన్నదైన) బిందువులతో కూడుకొన్నది, ముఖభాగమందు మూడు చక్రాలతో కూడుకొన్నది, తోకపైన చక్రం కలిగియున్నది, శ్రీవత్సమనే బిందువుతోను, మాలతోను కూడుకొన్నది – దీనిని మత్స్యమూర్తిగా పేర్కొంటారు. తోకక్రింద చక్రం కలిగియుండే శిశుమారమూర్తిగా చెబుతారు.

**వక్రచక్రయుతశ్చేత్ స్యాత్ త్రివిక్రమ ఉదాహృతః ।**
**ఏతేషాం లక్షణం శ్రుత్వా వారుణే తీర్థ ఉత్తమే! ॥129॥**

**ఏతద్దానఫలం ప్రాప్య మోదతే విష్ణుమందిరే ।**
**పూర్వోక్తా మూర్తయో యస్మిన్ గృహే తిష్ఠంతి భామిని! ।**
**భాగీరథీ తీర్థవరా సంనిధత్తే న సంశయః ॥130॥**

వంకరగా ఉండే చక్రంతో కూడియుంటే త్రివిక్రమమూర్తిగా చెప్పబడుతుంది. ఉత్కృష్టమైన వారుణతీర్థంలో వీటి లక్షణాన్ని వింటే, వీటిని దానం చేసిన ఫలాన్ని పొంది, విష్ణులోకంలో సంతోషం పొందుతాడు. భామినీ! ఇంతకు ముందు చెప్పబడిన మూర్తులు ఎవని గేహంలో ఉంటాయో, అక్కడ నివసించటం తీర్థాలలోకెల్లా శ్రేష్ఠమైన గంగానది సమీపంలో ఉన్నట్లే. సందేహంలేదు.

**స్వామిపుష్కరిణీ స్నానం దుర్ఘటం తు కలౌ నృణామ్ ।**
**తత్ర స్థితానాం తీర్థానాం స్నానం చాప్యతిదుర్ఘటమ్ ॥131॥**

కలియుగంలో నరులకు స్వామిపుష్కరిణిలో స్నానం చేయడం దుర్లభమైనది. అక్కడ ఉన్న తీర్థాలలో స్నానం ఆచరించడం కూడ మిక్కిలి దుర్లభమైనది.

**శాలగ్రామ శిలాదానం దుర్ఘటం చ తథా స్మృతమ్ ।**
**స్వామిపుష్కరిణీతీరే కన్యాదానం సుదుర్ఘటమ్ ॥132॥**

**దుర్ఘటం కపిలా దానం భక్ష్యదానం సుదుర్ఘటమ్ ।**
**స్వామిపుష్కరిణీ తీర్థే తీర్థేష్వన్యేషు భామిని ॥133॥**

శాలగ్రామ శిలాదానం మిక్కిలి దుర్లభంగా చెప్పబడింది. స్వామిపుష్కరిణీ తీరంలో అలాగే కన్యాదానం మిక్కిలి దుర్ఘటమైనది. భామినీ! స్వామిపుష్కరిణీ తీర్థమందు, అలాగే తీర్థాలయందు కపిలా దానం చేయడం దుర్ఘటం. భక్ష్య దానం చేయడం కూడ మిక్కిలి దుర్ఘటమైనది.

**స్నానం కురు యథాన్యాయం శయ్యాదానం తథా కురు ।**
**జైగీషవ్యేన మునినా త్వేవ ముక్తా చ కన్యకా ॥134॥**

**స్వామిపుష్కరిణీ స్నానం సా చకార ధృతవ్రతా ।**
**తీర్థేష్వేతేషు సుస్నాతా దానం చక్రే సుభామినీ ॥135॥**

శాస్త్రవిధానంచే స్నానం ఆచరించు.అలాగే శయ్యాదానం చేయి. ఈ విధంగా ఆ కన్యక జైగీషవ్యుడనే మునిచే చెప్పబడినదై వ్రతనిష్ఠ చేబూని, స్వామిపుష్కరిణిలో స్నానం చేసింది.యోగ్యురాలైన ఆ కుమారి మిగిలిన ఈ తీర్థాలన్నింటిలోను స్నానం చేసినదై దానం ఆచరించింది.

**ఉవాస తత్ర సా దేవీ త్రిఃసప్తక దినాని చ ।**
**స్వామిపుష్కరిణీతీరమహిమానం శృణోతి యః ॥**
**సయాతి పరమాం భక్తిం శ్రీనివాసే జగన్మయే ॥136॥**

ఆ దేవి అక్కడ ఇరవైయొక్క రోజులు నివాసం చేసింది. స్వామిపుష్కరిణీతీరమహిమను విన్నవాడు, విశ్వమయుడైన శ్రీనివాసునియందు మిక్కిలి భక్తిని పొందుతాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే వ్యంకటగిరి మాహాత్మ్యే స్వామిపుష్కరిణ్యాదితీర్థ తత్రత్యదేవ తదీయశాలగ్రామలక్షణ తద్దానాది వర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో వ్యంకటగిరిమాహాత్మ్యమందలి స్వామిపుష్కరిణిమున్నగుతీర్థములు, అక్కడ ఉండే దేవతలు, ఆ శాలగ్రామలక్షణాలు వాటి దానాలు మాహాత్మ్యం అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తవింశోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం

## కన్యాకృత నానాతీర్థయాత్రాది నిరూపణమ్ -

కన్య దర్శించిన నానావిధ తీర్థయాత్రల నిరూపణం

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**సా గతా స్నాతుకామాథ నందాం పాపనివారిణీమ్ ।**
**పప్రచ్ఛ తం గురుం విప్రం వినయావనతా సుధీః ॥1॥**

పిమ్మట ఆమె స్నానం చేసే కోరికతో పాపాలను తొలగించే నందానదికి వెళ్ళింది. ఆ విద్వాంసురాలు వినయంతో వంగి నమస్కరించి ఆ గురువైన విప్రుని ప్రశ్నించింది.

**కిన్నామేయం నదీ విప్ర కిం కార్యం చాత్ర మే వద ।**
**జైగీషవ్యస్త్వేవముక్తో వాక్యమేతదువాచ హ ॥2॥**

"విప్రా! ఈ నది పేరు ఏమి? ఇక్కడ ఏమి చేయదగియుంది?" ఇట్లు అడుగబడిన జైగీషవ్యుడు ఇలా చెప్పాడు.

**జైగీషవ్యఉవాచ** - జైగీషవ్యుడు పలికాడు.

**శృణు భద్రే ప్రవక్ష్యామి మాహాత్మ్యం పాపనాశనమ్ ।**
**ఇయం నదీ మహాభాగే సదా పాపవినాశినీ ॥3॥**

భద్రా! విను. పాపాలను నశింపజేసే దీని గొప్పదనాన్ని చెబుతున్నాను. మహాభాగా! ఈ నది ఎల్లప్పుడు పాపాలను తొలగించేది.

**బ్రహ్మహత్యాది పాపౌఘో యత్ర స్నానేన నశ్యతి ।**
**ప్రత్యక్షం దృశ్యతే హ్యత్ర స్నానం కర్తుం సముద్యతైః ॥4॥**

బ్రహ్మహత్య మున్నగు పాపరాశులు ఇక్కడ స్నానంచే నశించిపోతాయి. ఇక్కడ స్నానం చేయటానికి ఉపక్రమించే వారికి ప్రత్యక్ష నిదర్శనం గోచరమవుతూ ఉంటుంది.

**జలం చాశుభ్రరూపేణ పాపైశ్చ పరిదృశ్యతే ।**
**యావ చ్ఛుభ్రోదకం దేవి తావత్ స్నానం చ కారయేత్ ॥5॥**

దేవీ! ఏ శుభ్రమయిన నీరయితే ఇక్కడ ఉందో, స్నానం చేసేటంత వరకు, ఆ నీరు అశుభ్రరూపంలో పాపాలతో కనబడుతూ ఉంటుంది.

**యావచ్ఛుభ్రోదకం నైవ తావత్పాపం న నశ్యతి ।**
**శుద్ధోదకం సమాయాతే పాపం నష్టమితి ధ్రువమ్ ॥6॥**

శుభ్రమయిన నీరు కనిపించకపోతే, (ఎంతవరకూ కనిపించదో),అంతవరకూ పాపంనశించలేదని, శుద్ధోదకాలు వచ్చినట్లయితే పాపం నశించిందని నిశ్చయం.

**కలావిత్థం విశాలాక్షి మహిమా దృశ్యతే భువి ।**
**అత్ర స్నానం ప్రకర్తవ్యం దాతవ్యం దానముత్తమమ్ ॥**
**తతశ్చ జ్ఞానమాసాద్య విష్ణులోకం సగచ్ఛతి ॥7॥**

విశాలాక్షీ! కలియుగంలో భూమియందు ఈ రీతిగా దీని మాహాత్మ్యం కనిపిస్తుంది. ఇక్కడ చక్కగా స్నానం చేయవలసి యున్నది. ఉత్కృష్టమయిన దానం కూడ ఈయవలసియున్నది.

**గురు స్త్రీ గమనాచ్చంద్ర అహల్యాయాం గతో హరిః ।**
**సురాపానశ్చ శుక్రస్తు సువర్ణ హరణాద్బలిః ॥8॥**

**బ్రహ్మహత్యాయాశ్చ రుద్రో నాగో దత్తాపహారకః ।**
**సూతస్య హననాద్రామో నిర్ముక్తో హ్యత్ర భామిని ॥9॥**

భామిని! గురువు యొక్క భార్యయైన తారను పొందిన చంద్రుడు, అహల్యను పొందిన ఇంద్రుడు, సురాపానం చేయుట వల్ల శుక్రుడు, సువర్ణాన్ని అపహరించుటవల్ల బలి, బ్రహ్మహత్యాదోషం నుండి (బ్రహ్మ యొక్క ఒక ముఖాన్ని త్రుంచుట) రుద్రుడు, ఈయబడిన దానాన్ని అపహరించుట వల్ల నాగుడు(తక్షకుడు), సూతుని చంపుట వల్ల బలరాముడు పొందిన పాపం నుండీ ఇక్కడ విముక్తి పొందారు.

**నానేన సదృశం తీర్థం న భూతం న భవిష్యతి ।**
**స్నానం కురు మహాభాగే తేన సిద్ధిం హ్యవాప్స్యసి ॥10॥**

దీనితో సమానమైన తీర్థం ఇదివరకు లేదు. ఇక ఉండబోదు. గొప్ప సౌభాగ్యం కలదానా! ఇందు స్నానం ఆచరించు! అందువలన సిద్ధి పొందగలవు.

**జైగీషవ్యేణ మునినా పిత్రా సహ చ కన్యకా ।**
**స్నానం చకార విధివదుదతిష్ఠచ్చ భామినీ ॥11॥**

జైగీషవ్యుడను మునితోడను, తండ్రితోను కూడుకొని ఆ కన్యక శాస్త్రవిధితో స్నానం చేసింది. ఆ భామిని అంత కొంతసేపు అక్కడ ఉంది.

**యావచ్చ పౌరుషం సూక్తం తావత్కాలం హి తిష్ఠతి ।**
**పశ్చాజ్జప్త్వా మహామంత్రం వేంకటేశాభిధం పరమ్ ॥12॥**

పురుషసూక్త పఠనం జరిగినంత సేపు ఆమె అక్కడ ఉంది. పిమ్మట వేంకటేశ నామంతో చెప్పబడే మిక్కిలి గొప్పదైన నామాన్ని జపించింది.

**ద్విజాతీన్ ప్రీణయిత్వా సా వస్త్ర ద్రవ్యాది భూషణైః ।**
**తస్మాచ్చ ప్రయయౌ దేవీ కుమారీ తీర్థముత్తమమ్ ॥13॥**

ఆ దేవి వస్త్రాలు, ద్రవ్యాలు, ఆభరణాలు మున్నగువాటిచే ద్విజాదులను సంతోషపరచి, అక్కడినుండి ఉత్తమమైన కుమారీతీర్థానికి బయలుదేరింది.

**కుమారీ మహిమానం చ శ్రుత్వా స్నానం చకార సా ।**
**పునరావృత్య సా దేవీ హ్యంతరా విరజానదీమ్ ॥14॥**

**దృష్ట్వా పప్రచ్ఛ సా దేవీ జైగీషవ్యం గురుం ప్రభుమ్ ।**
**కిం సంజ్ఞికేయం విప్రేంద్ర కిం కార్యం హ్యత్ర మే వద ॥15॥**

కుమారీతీర్థ మాహాత్మ్యం విని ఆమె స్నానం చేసింది. ఆ దేవి విరజానది యొక్క మధ్యప్రదేశానికి మళ్లీ సమీపించింది. ప్రభువైన గురువగు జైగీషవ్యుని ఆ దేవి దర్శించి ఇలా ప్రశ్నించింది. "విప్రేంద్రా! దీని పేరు ఏది? ఇక్కడ చేయవలసిందేమి? నాకు తెలియజేయవలసింది."

**జైగీషవ్యః పృష్ట ఏవమువాచ కరుణానిధిః ।**
**ఇయం భాగీరథీ కన్యే ఆయాతి హ్యంతరేణ తు ॥16॥**

ఈ విధంగా అడుగబడిన జైగీషవ్యుడు దయకు(గని) నిధివంటివాడై ఇలా పలికాడు. "కుమారీ! ఇది భాగీరథి. (గంగ) (భూమి) లోపలి భాగం నుండి వస్తోంది.

**అతః సా ప్రోచ్యతే హ్యంతర్గంగేతి పరమర్షిభిః ।**
**కన్యే త్వస్యాస్తు సలిలం శ్రీనివాసప్రియం సదా ॥17॥**

అందువలన ఆమె "అంతర్గంగ" అని గొప్పవారైన ఋషులచే చెప్పబడుతోంది. కుమారీ! దీని యొక్క నీరు ఎల్లప్పుడూ శ్రీనివాసునికి ప్రియమైనది.

**అత్ర స్నానం యః కరోతి స యాతి పరమాం గతిమ్ ।**
**స్నానం చకార సా కన్యా జలే పరమపావనే ॥18॥**

ఇక్కడ స్నానం చేసినవాడు, పరమగతిని పొందుతాడు. అంత ఆ కన్య పరమపవిత్రమైన సలిలాలలో స్నానం చేసింది.

**దానాదికం తథా జ్ఞాత్వా జజాప పరమం మనుమ్ ।**
**శ్రీనివాససమీపం తు పునరాగత్య భామినీ ॥19॥**

**అంగ ప్రదక్షిణం చక్రే భక్త్యా వేంకటనాయకమ్ ।**
**బ్రాహ్మణాదీన్ ప్రీణయిత్వా వస్త్రగంధాది భూషణైః ॥20॥**

అలాగే దానం మున్నగు వాటిని ఎఱుకతో నిర్వహించి, ఉత్కృష్టమైన మంత్రం జపించి, ఆ భామిని శ్రీనివాసుని వద్దకు మళ్లీ వచ్చి, భక్తితో వేంకటేశ్వరునకు అంగప్రదక్షిణం ఆచరించింది. బ్రాహ్మణాదులను వస్త్రం, గంధం, అలంకారం మున్నగు వాటితో సంతోషపరచింది.

**పునః పరదినే ప్రాతః స్వామి పుష్కరిణీజలే ।**
**స్నానం కృత్వా మహాభాగా యయౌ తుంబురు సంజ్ఞికామ్ ॥21॥**

**పప్రచ్ఛ తం గురుం దేవీ నాథం కిన్నామికా త్వయమ్ ।**

ఆ మరునాడు ఉదయాననే ఆ మహాభాగ మళ్లీ స్వామి పుష్కరిణీ జలాలలో స్నానమాడి, తుంబురుక అనే పేరుగల తీర్థానికి వెళ్లింది. అంతట దేవి ఆ ప్రభువైన గురువును 'ఇది ఏమి పేరుగల తీర్థం' అని ప్రశ్నించింది.

**జైగీషవ్య ఉవాచ –** జైగీషవ్యుడు వచించాడు.

**ఇయం తుంబురుకాభిజ్ఞా నారీ వై వరవర్ణినీ ॥22॥**

**పురా తుంబురుణా సాకం నారదస్తపసి స్థితః ।**
**అత్ర ప్రాదురభూద్విష్ణుర్నారదస్య హితాయ చ ॥23॥**

వరవర్ణినియైన తుంబురుక అను పేరు గల ఒకామె ఇక్కడ ఉండేది. పూర్వం తుంబురునితో కలసి నారదుడు ఇక్కడ తపస్సు చేశాడు. ఇక్కడ నారదునికి మేలు కలిగించడంకోసమై విష్ణువు ప్రాదుర్భవించాడు.

**స్నానం యః కురుతే హ్యత్ర సయాతి పరమాం గతిమ్ ।**
**అత్ర స్నానం మనుష్యాణాం సర్వేషాం దుర్లభం కలౌ ॥24॥**

ఇక్కడ స్నానం చేసినవాడు అతడు పరమమైన స్థితిని  పొందుతాడు. ఇక్కడ మనుష్యులకందరకూ కలియుగంలో స్నానం దుర్లభమైనది.

**అత్ర స్నానం మనుష్యాణాం నాల్పస్య తపసః ఫలమ్ ।**
**తత్ర స్నాత్వా చ పీత్వా చ దత్త్వా దానాన్యనేకశః ॥25॥**

**పునరాగత్య సా దేవీ శ్రీనివాసం ననామ హ ।**
**తస్మిన్దినే బ్రాహ్మణాంశ్చ తర్పయామాస భామినీ ॥26॥**

ఇక్కడ మనుష్యులకు స్నానమాచరించడం కొద్దిపాటి తపస్సు యొక్క ఫలితం వల్ల వచ్చేది కాదు. ఇక్కడ స్నానం చేసి పానీయాన్ని స్వీకరించి, పెక్కుదానాలు చేసి, ఆ దేవి తిరిగి శ్రీనివాసుని సన్నిధికి వచ్చి, నమస్కరించింది. అదే రోజున ఆ భామిని బ్రాహ్మణులను సంతోషపరచింది.

**స్వామిపుష్కరిణీం ప్రాప్య దీపాన్ ప్రాజ్వాలయత్సతీ ।**
**సోపానేషు మహాభాగా దీపావలిభిరంజసా ॥**
**ప్రీణయామాస దేవేశం శ్రీనివాసం జగద్గురుమ్ ॥27॥**

కుమారియైన ఆ మహాభాగ స్వామిపుష్కరిణికి వచ్చి (పొంది), మెట్ల యందు చకచకా దీపపంక్తులుగా దీపాలను వెలిగించింది. దేవేశుడై జగద్గురువగు, శ్రీనివాసుని సంప్రీతి పొందించింది.

**పునఃపరదినే ప్రాప్తే శక్రతీర్థమనుత్తమమ్ ।**
**కపిలాఖ్యోర్ధ్వదేశే తు తత్తీర్థం పావనం స్మృతమ్ ॥28॥**

ఆ మరునాడు సమీపించగా, ఆమె మిక్కిలి ఉత్కృష్టమైన శక్రతీర్థానికి మళ్లీ వెళ్లింది. ఆ పవిత్రమైన తీర్థం కపిలమనే పేరు గల తీర్థానికి పైభాగంలో ఉన్నట్లు చెప్పబడింది.

**తత్ర స్నాత్వా మహాభాగా తదూర్ధ్వం స్నాపయేత్ స్వయమ్ ।**
**విష్వసేన సరస్తత్ర సర్వపాపవినాశనమ్ ॥29॥**

ఆ మహాభాగ అక్కడ స్నానంచేసి, ఆపైన ఉన్న (శక్రుని) స్వయంగా స్నానం చేయించింది. అక్కడ సమస్తపాపాలను తొలగించే విష్వసేన సరస్సు ఉంది.

**తత ఊర్ధ్వం మహాభాగా యయౌ తత్ర దదర్శ సా ।**
**పంచాయుధానాం తీర్థాని తేషు స్నానం చకార సా ॥30॥**

అంత ఆ మహాభాగ దానికి పైకి వెళ్లింది. అక్కడ పంచాయుధతీర్థాలను సందర్శించింది. వాటియందు ఆమె స్నానం చేసింది.

**తదూర్ధ్వం చాగ్నికుండం స్యాద్దురారోహం తతోఽగ్రతః ।**
**తస్యోపరి బ్రహ్మతీర్థం బ్రహ్మహత్యా విమోచనమ్ ॥31॥**

దానికిపైన ఎక్కుటకు దుర్గమమైన అగ్నికుండం కలదు. దానికి ఎదుట అగ్నికుండంపైన బ్రహ్మహత్య నుండి విముక్తిని కల్గించే బ్రహ్మతీర్థం ఉంది.

**సప్తర్షీణాం తదూర్ధ్వం తు పుణ్యతీర్థం చ సత్ఫలమ్ ।**
**దశాధికఫలం తేషాం తీర్థానాముత్తరోత్తరమ్ ॥32॥**

ఆపైన మంచి ఫలితాలను ఇచ్చే సప్తర్షుల పుణ్యతీర్థాలు ఉన్నాయి. ఆ తీర్థాలకు ఒకదానికన్న వేరొకటి పదేసి రెట్లు ఎక్కువ ఫలితం ఉంది. (కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వసిష్ఠుడు, జమదగ్ని-వీరు సప్తర్షులు)

**ఏతేషాం చైవ మాహాత్మ్యం కో వా వక్తుమిహార్హతి ।**
**ఋషితీర్థేషు సా కన్యా చచార తప ఉత్తమమ్ ॥33॥**

వాటి యొక్క గొప్పదనాన్ని వర్ణించడానికి ఇక్కడ ఎవడు సమర్థుడు? ఋషితీర్థాలలో ఆ కన్య ఉత్కృష్టమైన తపస్సు ఆచరించింది.

**మమావతారపర్యంతం చరిత్వా తప ఉత్తమమ్ ।**
**యోగధారణయా దేహం త్యక్త్వా జాంబవతో గృహే ॥34॥**

**జాతా జాంబవతీ నామ వవృధే తస్య వేశ్మని ।**
**తస్యాః పితా జాంబవాన్ స సమాదాత్కన్యకాం తదా ॥**
**రుక్మ్యా అనంతరా సైషా మమ భార్యా ఖగేశ్వర ॥35॥**

నా అవతారం పూర్తి అయ్యేవరకు ఆమె ఉత్తమమైన తపస్సు ఆచరించింది. ఆమె యోగధారణచే దేహం విడిచి జాంబవంతుని గృహంలో జాంబవతి అనే పేరుతో పుట్టి, అతని ఇంటిలో పెరిగింది. ఆమె తండ్రి జాంబవంతుడు అప్పుడు ఆ కన్యకను నాకిచ్చాడు. పక్షీశ్వరా! రుక్మిణి తరువాత ఆమె నాకు భార్య అయ్యింది.

**ఇదం హి పరమాఖ్యానం వేంకటాద్రే మహాగిరే ।**
**కోవా వర్ణయితుం శక్తో మదన్యః పురుషో భువి ॥36॥**

గొప్ప కొండ అయిన వేంకటాద్రి యొక్క ఈ ఉత్తమమైన గాథను వర్ణించుటకు నాకన్న వేరెవడు సమర్థుడు కాగలడు?

**వేంకటేశస్య నైవేద్యం సదాలక్ష్మీః కరోతి వై ।**
**బ్రహ్మ పూజయతే నిత్యమేవం శాస్త్రస్య నిర్ణయః ॥37॥**

వేంకటేశ్వరునకు నైవేద్యం ఎల్లప్పుడు లక్ష్మిచేస్తుందని, నిత్యమూ బ్రహ్మ పూజిస్తాడని శాస్త్ర నిర్ణయం.

**నైవేద్యభక్షిణాం పుంసామపహాసం న కారయేత్ ।**
**స్వస్య ప్రాశస్త్య భావే తు నైవేద్యాది గుడాదికమ్ ॥**
**గ్రాహ్యమేవ న సందేహో అన్యథా నారకీ భవేత్ ॥38॥**

నైవేద్యాన్ని భక్షించే (తినే) పురుషులను అపహాస్యం చేయరాదు. గొప్పదయిన ఆ నైవేద్య ప్రాశనం లేకపోతే, గుడం(బెల్లం) మున్నగువాటి నైవేద్యం స్వీకరించాలి. సందేహం లేదు. ఇట్లు కానిచో నరకగతిని పొందుతాడు.

**శ్రీనివాసాత్పరో దేవో న భూతో న భవిష్యతి ।**
**స్వయం చ పాచయిత్వా త్వం ఘృతపక్వాదికం తథా ॥**
**శ్రీనివాసస్య నైవేద్యం దత్త్వా భోజనమాచరేత్ ॥39॥**

శ్రీనివాసునికన్న పరుడైన దేవుడు పూర్వమునందును లేడు. భవిష్యమునందు ఉండడు. నీవు స్వయంగా నేతితో పక్వాదికాలు వండి, శ్రీనివాసునికి నైవేద్యమిచ్చి, భోజనం చేయాలి.

**ఇదంతు పరమం గోప్యం తవోక్తం చ ఖగేశ్వర ।**
**న కన్యాపి చ వక్తవ్యం గోప్యత్వాత్ఖగ సత్తమ ॥**
**ఇతః పరం ప్రవక్ష్యామి తారతమ్యం శృణు ప్రభో ॥40॥**

ఖగరాజా! ఇది మిక్కిలి రహస్యమైనది సుమా! నీకు చెప్పబడింది. ఖగశ్రేష్ఠమా! గోప్యమైనదగుటవల్ల ఎవ్వరికినీ చెప్పరాదు. ప్రభూ! ఇక మీదట తరతమ భావం చెప్తున్నాను. విను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే కన్యాకృత నానాతీర్థయాత్రాది నిరూపణం నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో కన్య దర్శించిన నానావిధ తీర్థయాత్రల నిరూపణం అనే ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టవింశతమోఽధ్యాయః** – ఇరవై ఎనిమిదవ అధ్యాయం

## **విష్ణురేవ ఉపాస్యతత్త్వమితి నిరూపణమ్** – విష్ణువే ఉపాస్యతత్త్వమని నిరూపించుట

**యా పూర్వసర్గే దక్షపుత్రీ సతీ తురుద్రస్య పత్నీ దక్షయజ్ఞే స్వదేహమ్ ।**
**విసృజ్య సా మేనకాయాం చ జజ్ఞేధరాధరాద్ధిమవతో వై సకాశాత్ ॥1॥**

పూర్వసృష్టియందు దక్షుని కుమార్తెయై, రుద్రుని పత్నియైన ఏ సతీదేవి దక్షుని యజ్ఞంలో తన శరీరాన్ని విడిచిపెట్టి హిమవంతుడైన పర్వతేంద్రుని ద్వారా మేనక యందు తిరిగి జన్మించింది.

**సా పార్వతీ రుద్రపత్నీ ఖగేంద్రయా శేషపత్నీ వారుణీ నామ పూర్వా ।**
**సైవాగతా బలభద్రేణ రంతుంద్విరూపమాస్థాయ మహాపతివ్రతా ॥2॥**

ఖగేంద్రా! ఆ రుద్రపత్నియే పార్వతి అయ్యింది. పూర్వం ఏ మహాపతివ్రతయై, శేషుని పత్నియగు 'వారుణి' యే బలభద్రునితో రమించటానికి రెండు రూపాలను ధరించి వచ్చింది.

**శ్రీరిత్యాఖ్యా ఇందిరావేశ యుక్తా తస్యా ద్వితీయా ప్రతిమా మేఘరూపా ।**
**శేషేణ రూపేణ యదాహి వీంద్రతపశ్చచార విష్ణునా సార్ధమేవ ॥3॥**

ఆమె యొక్క ఎడమ రూపం శ్రీ అనే పేరుతో చెప్పబడుతోంది. ఇందిరయొక్క ఆవేశంతో కూడుకొని ఉంటుంది. మేఘరూపంలో నల్లగా ఉంటుంది. పక్షీంద్రా! శేషరూపుడైన విష్ణువు తపస్సు చేసినప్పుడు వానితో కలసి (తపస్సు చేసింది).

**తదైవ దేవీ వారుణీ శేషపత్నీతపశ్చక్రే ఇందిరాప్రీతయే చ ।**
**తదా ప్రీతా ఇందిరా సుప్రసన్నాఽఉవాచ తాం వారుణీం శేషపత్నీమ్ ॥4॥**

అదే సమయంలో శేషపత్నియైన వారుణీదేవి ఇందిర యొక్క సంప్రీతి కోసమై తపస్సు చేసింది. అప్పుడు ఇందిర సంతుష్టురాలై, సుప్రసన్నయై ఆ శేషపత్నియైన వారుణితో ఇలా అన్నది.

**యదా రామో వైష్ణవాంశేన యుక్తః సంపత్స్యతే భూతలే రౌహిణేయః ।**
**మయ్యావేశాత్సంయుతా త్వం తు భద్రే శ్రీరిత్యాఖ్యా బలభద్రస్య రంతుమ్ ॥5॥**

ఎప్పుడయితే రాముడు(బల) విష్ణువు అంశతో కూడుకొని, భూమండలంలో రోహిణీనందనుడై సంభవిస్తాడో, భద్రురాలా! అప్పుడు నీవు కూడ నా ఆవేశంతో (అంశభాగంతో) కూడుకొని, బలభద్రుని ఆనందింపజేయటానికి 'శ్రీ' అనే పేరుతో (జన్మిస్తావు).

**సంపత్స్యసే నాత్ర విచారమస్తీత్యుక్త్వా సా వై ప్రయయౌ విష్ణులోకే ।**
**శ్రీలక్ష్మ్యంశాచ్ఛ్రీరితీడ్యాం సమాఖ్యాం లబ్ధ్వా లోకే శేషపత్నీ బభూవ ॥6॥**

నీవు సంభవించగలవు. ఇందు ఆలోచింపవలసిందేమీ లేదు. అని ఆమె పలికి విష్ణులోకానికి వెళ్లినదయ్యింది. (వెళ్లిపోయింది.) ఆ వారుణి కూడ శ్రీమహాలక్ష్మి అంశతో "శ్రీ" అనే కొనియాడదగిన సమానమైన పేరును పొంది, లోకంలో శేషుని పత్ని అయ్యింది.

**యదాహీశో విపులాముద్ధరేచ్ఛతదా రామః శ్రీభిదా సంగమే చ ।**
**కరోతి తోషాత్సర్వదా వై రమాయాస్తస్యాప్యావేశో వ్యంస్త్రితమోనసంగమ్ ॥7॥**

ఎప్పుడయితే శేషుడయిన రాముడు శ్రీభిదా (నదినిభేదించే) సంగమంలో భూమిని ఉద్ధరించాడో (పైకి ఎత్తాడో), అప్పుడు రమతో ఉండి, ఎల్లప్పుడు సంతోషాన్ని చేకూర్చటానికి, ఆమె యొక్క ఆవేశాన్ని, సంగమాన్ని కొంతవదలి (విడిచివేసింది) వచ్చివేసింది.

**యా రేవతీ రైవతస్యైవ పుత్రీసా వారుణీ బలభద్రస్య పత్నీ ।**
**సౌపర్ణి నామ్నీ బలపత్నీ ఖగేంద్రయాస్తాస్త్రిస్రః షడ్విష్ణోశ్చ స్త్రీభ్యః ॥**
**ద్విగుణాధమా రుద్రశేషాదికేభ్యోదశాధమా త్వం విజానీహి పౌత్ర ॥8॥**

రైవతుని పుత్రియైన రేవతియు, బలభద్రుని పత్నియైన వారుణియు, సౌపర్ణి అను పేరుగల బలపత్నియు పక్షీంద్రా! ఆ ముగ్గురును విష్ణువుయొక్క ఆరుగురు స్త్రీల కన్న రెండు రెట్లు తక్కువవారు. పౌత్రా! రుద్రుడు, శేషుడు మున్నగు వారికన్న పది రెట్లు తక్కువవారని నీవు గ్రహించు.

**గరుడ ఉవాచ –** గరుడుడు వచించాడు.

**రామేణ రంతుం సర్వదా వారుణీ తు పుత్రీత్వమాపే రేవతస్యైవ సుభ్రూః ।**
**ఏవం త్రిరూపా వారుణీ శేషపత్నీ ద్విరూపభూతా పార్వతీ రుద్రపత్నీ ॥9॥**

మంచి కనుబొమలు కల వారుణి రామునితో సుఖించటానికి రేవతునకు పుత్రికగా జన్మించింది. ఈ విధంగా శేషపత్నియైన వారుణి మూడు రూపాలు పొందింది.

**నీచాయా జాంబవత్యాశ్చ శేషసామ్యం చ కుత్రచిత్ ।**
**శ్రూయతే చ మయా కృష్ణ నిమిత్తం బ్రూహి మే ప్రభో ॥10॥**

కృష్ణా! ప్రభూ! కొన్నిచోట్ల జాంబవతికన్న తక్కువగాను, కొన్నిచోట్ల శేషునితో సమానంగాను ఉన్నట్లు నాచే వినబడింది. దానికి కారణమేమిటో తెలియజెప్పవలసింది.

**ఉమాయాశ్చ తథా రుద్రః సదా బహుగుణాధికః ।**
**ఏవం త్వయోక్తం భగవన్ నిశ్చయార్థం మమ ప్రభో ॥11॥**

ఉమ కన్న రుద్రుడు ఎల్లప్పుడు పెక్కురెట్లు అధికుడు. భగవాన్! ప్రభూ! ఇలా నీచే చెప్పబడింది. నాకు నిశ్చయంచి చెప్పు.

**రేవతీ శ్రీయుతా శ్రీశ్చ శేషరూపా చ వారుణీ ।**
**సౌపర్ణీ పార్వతీ చైవ తిస్రః శేషాంశతో వరాః ॥12॥**

రేవతియే శ్రీయుతయైన శ్రీ. శేషరూపయైన వారుణి కూడ. సౌపర్ణి, పార్వతి ఈ ముగ్గురును మిగిలిన వారును, వందలరెట్లు ఎక్కువవారు (శేషునికన్న ఎక్కువవారు.)

**ఇత్యపి శ్రూయతే కృష్ణ కుత్రచిన్మధుసూదన ।**
**నిమిత్తం బ్రూహి మే కృష్ణ తవ శిష్యాయ సువ్రత ॥13॥**

మధుసూదనా! కృష్ణా! ఒకచోట ఇలాకూడ వినబడుతోంది. సువ్రతా! కృష్ణా! నీ శిష్యుడనైన నాకు కారణమేమిటో చెప్పు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**విజ్ఞాయ జాంబవత్యాశ్చ తదన్యేషాం ఖగాధిప ।**
**ఉత్తమానాం చ సామ్యం తు ఉత్తమావేశతో భవేత్ ॥14॥**

ఖగరాజా! జాంబవతికి, మిగిలినవారికి ఉత్తములతో సమానత్వం ఉత్తముల ఆవేశంతో వస్తుందని గ్రహించు.

**అవరాణాం గుణస్యాపి హ్యుత్తమానామధీనతా ।**
**అస్తీతిద్యోతనాయైవ శతాంశాధికముచ్యతే ॥15॥**

తక్కువవారియొక్క గుణాల అస్తిత్వంకూడ ఉత్తముల ఆధీనంలో ఉంటుందని విశదపరచటానికై నూరు రెట్లు అధికంగా చెప్పబడింది.

**యథా మయోచ్యతే వీంద్ర తథా జానీహి నాన్యథా ।**
**తదనంతరజాన్ వక్ష్యే శృణు కాశ్యపజోత్తమ ॥16॥**

పక్షీంద్రా! ఏవిధంగా నాచే చెప్పబడిందో, ఆవిధంగానే గ్రహించు. మరోవిధంగా మాత్రంగా కాదు. కాశ్యప సంతానంలో శ్రేష్ఠుడా! ఆ తరువాత జన్మించిన వారినిగురించి తెలియజేస్తున్నాను విను.

**చతుర్దశసు చేంద్రేషు సప్తమో యః పురందరః ।**
**వృత్రాదీనాం శరీరం తు పురమిత్యుచ్యతే బుధైః ॥17॥**

పదునాల్గురు ఇంద్రులలో ఏడోవాడు పురందరుడు. వృత్రుడు మున్నగువారి యొక్క శరీరం పురమని చెప్పబడుతోంది.

**తం దారయతి వజ్రేణ యస్మాత్తస్మాత్ పురందరః ।**
**చతుర్దశసు చేంద్రేషు మంత్రద్యుమ్నస్తు షష్ఠకః ॥18॥**

దానిని వజ్రంతో చీల్చివేసిన కారణమువల్ల పురందరుడని చెప్పబడ్డాడు. (పురందరుడయ్యాడు). పదునాల్గురు ఇంద్రులలో ఆరోవాడు మంత్రద్యుమ్నుడు.

**మంత్రానష్ట మహావీంద్ర దేవో ద్యోతయతే యతః ।**
**మంత్రద్యుమ్న స్తతో లోకే ఉభావప్యేక ఏవ తు ॥19॥**

గొప్పవాడవైన పక్షీంద్రా! ఆ దేవుడు ఎనిమిది మంత్రాలను నిర్మించి వెల్లడిచేసిన కారణంవల్ల లోకంలో మంత్రద్యుమ్నుడయ్యాడు. (లోకమందు) వీరిరువురు ఒక్కరే సుమా!

**మంత్రదుమ్నావతారోఽభూత్ కుంతీపుత్రోఽర్జునో భువి ।**
**విష్ణోర్వాయోరనంతస్య చంద్రస్య ఖగసత్తమ ॥20॥**

భూమియందు కుంతీపుత్రుడైన అర్జునుడు మంత్రద్యుమ్నునియొక్క అవతారమయ్యాడు. పక్షిశ్రేష్ఠమా! విష్ణువుయొక్క, వాయువుయొక్క, అనంతునియొక్క, ఇంద్రునియొక్క....

**పార్థశ్చతుర్భిః సంయుక్త ఇంద్ర ఇవ ప్రకీర్తితః ।**
**చతురేఽపి చ వాయోశ్చ విశేషోఽస్తి సదార్జునే ॥21॥**

నలుగురి అంశలతో కూడుకొన్నవాడై (అంశలతో) పార్థుడు ఇంద్రుడువలె కీర్తింపబడ్డాడు. నాలుగు అంశలలోను వాయువుయొక్క విశేషాంశ ఎల్లప్పుడు అర్జునునిలో విశేషించి ఉంది.

**వాలిర్నామ వానరస్తు పురందర ఇతి స్మృతః ।**
**చంద్రవంశే సముత్పన్నో గాధిరాజో విచక్షణః ॥22॥**

వాలి అనే పేరుగల వానరుడుకూడ పురందరునిగా స్మరింపబడినాడు. ఆ ఇంద్రుడే చంద్రవంశంలో గాధి విచక్షణుడైన రాజుగా ఉద్భవించాడు.

**మంత్రద్యుమ్నావతారః స విశ్వామిత్ర పితా స్మృతః ।**
**వేదోక్త మంత్రాగాః ప్రోక్తా ధియా సంధారయేద్యతః ॥23॥**

**అతో గాధిరితిప్రోక్త స్తదర్థం భూతలే హ్యభూత్ ।**
**ఇక్ష్వాకుపుత్రో యో వీంద్ర వికుక్షిరితి విశ్రుతః ॥24॥**

**స ఏవేంద్రావతారోఽభూద్ధరిసేవార్థమేవచ ।**
**విశేషణ హరిం కుక్షౌ విజ్ఞానాచ్చ హరిః సదా ॥25॥**

**అతో వికుక్షి నామాసౌ భూలోకే విశ్రుతః సదా ।**
**రామపుత్రః కుశః ప్రోక్త ఇంద్ర ఇవ ప్రకీర్తితః ॥26॥**

విశ్వామిత్రుని తండ్రియైన ఆ గాధి మంత్రద్యుమ్నుని అవతారంగా తెలియజేయబడుతున్నాడు. వేదంలో చెప్పబడిన మంత్రాలు"గాః" అని చెప్పబడినాయి. వాటిని (ధీ) బుద్ధిచే ధారణ చేసిన కారణంచేత అతడు గాధి అని చెప్పబడినాడు. అతడు అందుకోసమే భూమండలంలో అవతరించాడు. పక్షీంద్రా! ఇక్ష్వాకువుయొక్క కుమారుడైన వికుక్షి కూడ ఇంద్రుని అవతారమై ఉన్నాడు. హరిని సేవించుటకై, తన కుక్షియందు హరిని విశేషంగా ఉంచుకోవడం వల్ల (ధారణ చేయడం వల్ల), అతని జ్ఞానంవలన హరికూడ ఎల్లప్పుడు అట్లే ఉండడంవల్ల, అతడు ఎల్లప్పుడు భూలోకంలో వికుక్షి అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. రాముని పుత్రుడైన కుశుడు కూడ ఇంద్రుడే అని పేర్కొనబడినాడు.

**వాల్మీకి ఋషిణా యస్మాత్కుశేనైవ వినిర్మితః ।**
**అతః కుశ ఇతి ప్రోక్తో జానకీ నందనః ప్రభుః ॥27॥**

వాల్మీకి మహర్షిచే అతడు కుశంచే తిరిగి నిర్మింపబడినాడు.అందువల్ల ప్రభువైన జానకీ పుత్రుడు కుశుడని చెప్పబడినాడు.

**ఇంద్రద్యుమ్న పురేంద్రస్తు గాధీ వాలీ తథార్జునః ।**
**వికుక్షిః కుశ ఏవైతే సప్తచేంద్రాః ప్రకీర్తితాః ॥28॥**

ఇంద్రద్యుమ్నుడు, పురేంద్రుడు, గాధి, వాలి, అర్జునుడు, వికుక్షి, కుశుడు ఈ ఏడుగురు ఇంద్రులుగా కీర్తింపబడినారు.

**యః కృష్ణపుత్రః ప్రద్యుమ్నః కామ ఏవ ప్రకీర్తితః ।**
**ప్రకృష్ట ప్రకాశ రూపత్వాత్ ప్రద్యుమ్న ఇతి నామవాన్ ॥29॥**

కృష్ణునికుమారుడైన ఏ ప్రద్యుమ్నుడు ఉన్నాడో, అతడు "కాముడు"గా పేర్కొనబడినాడు. ప్రకృష్టమైన ప్రకాశరూపం కల్గినవాడు కనుక (ఎక్కువ కాంతి రూపం) ప్రద్యుమ్నుడనే పేరు పొందాడు.

**యో రామ భ్రాతా భరతః కామ ఏవాభవద్భువి ।**
**రామాజ్ఞాం భరతే యస్మాత్ తస్మాద్భరత నామకః ॥30॥**

కాముడే భూమియందు రాముని సోదరుడగు భరతుడు అయ్యాడు. రాముని ఆజ్ఞను భరించిన కారణంచే భరతుడనే పేరును పొందాడు.

**చక్రాభిమానీ కామస్తు సుదర్శన ఇతి స్మృతః ।**
**బ్రహ్మైవ కృష్ణపుత్రస్తు సాంబో జాంబవతీసుతః ॥31॥**

చక్రాన్ని అభిమానించే కాముడు సుదర్శనుడుగా పేర్కొనబడినాడు. కృష్ణపుత్రుడైన బ్రహ్మయే జాంబవతీ పుత్రుడైన సాంబుడు.

**కామావతారో విజ్ఞేయః సందేహో నాత్ర విద్యతే ।**
**యో రుద్రపుత్రః స్కందస్తు కామ ఏవ ప్రకీర్తితః ॥32॥**

అతడుకూడ కాముని అవతారంగా తెలియజేయబడినాడు. ఇందు సందేహం ఏమీలేదు. ఇందు ఏ రుద్ర పుత్రుడైన స్కందుడు ఉన్నాడో, అతడుకూడ కాము డనే పేర్కొనబడినాడు.

**రిపూనాస్కందతే నిత్యమతః స్కంద ఇతి స్మృతః ।**
**యో వా సనత్కుమారస్తు బ్రహ్మపుత్రః ఖగాధిప ॥**
**కామావతారో విజ్ఞేయో నాత్ర కార్యా విచారణా ॥33॥**

శత్రువులను ఎప్పుడూ పూర్తిగా శోషింపజేసేవాడు కావున స్కందుడని చెప్పబడినాడు. ఖగరాజా! బ్రహ్మనందనుడైన ఏ సనత్కుమారుడయితే ఉన్నాడో, అతడు కాముని అవతారంగా తెలియజేయబడుతున్నాడు. ఇందు ఆలోచింపవలసిన పనిలేదు.

**సుదర్శనశ్చ పరమః ప్రద్యుమ్నః సాంబ ఏవ చ ।**
**సనత్కుమారః సాంబశ్చ షడేతే కామరూపకాః ॥34॥**

సుదర్శనుడు, పరముడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, సనత్కుమారుడు, సాంబుడు ఈ ఆరుగురు కామరూపకులు.

**తతశ్చ ఇంద్రకామావప్యుమాదిభ్యో దశావరౌ ।**
**త్రయోర్మధ్యే తు గరుడ కామ ఇంద్రాధమః స్మృతః ॥35॥**

అందులోను ఇంద్రుడు, కాముడుకూడ ఉమాదులకన్న పది పాళ్లు తక్కువవారు. గరుడా! వారిలోపల కాముడు ఇంద్రునికన్న తక్కువవాడుగా చెప్పబడుతున్నాడు.

**ప్రాణస్త్వహంకార ఏవ అహంకారకసంజ్ఞకః ।**
**గురుత్మదంశో విజ్ఞేయః కామేంద్రాభ్యాం దశాధమః ॥36॥**

ప్రాణమయితే అహంకారమే. అహంకారకమనే పేరు గలది. అది గరుత్మంతుని అంశగా తెలియబడుతోంది. కామునికన్న ఇంద్రునికన్న పది పాళ్లు తక్కువది.

**తదనంతరజాన్వక్ష్యే శృణు వీంద్ర సమాహితః ।**
**శ్రవణాన్మోక్షమాప్నోతి మహాపాపాద్విముచ్యతే ॥37॥**

పక్షీంద్రా! ఆ తరువాత పుట్టినవారి గురించి చెబుతున్నాను. శ్రద్ధగా విను. ఆ విషయాలను వినడం వలన మహాపాపంనుండి విముక్తుడవుతాడు. మోక్షాన్ని పొందుతాడు.

**కామపుత్రోఽనిరుద్ధోఽపి హరేరన్యః ప్రకీర్తితః ।**
**స ఏవాభూద్ధరేః సేవాం కర్తుం రామానుజో భువి ॥38॥**

కాముని కుమారుడైన అనిరుద్ధుడు హరికన్న వేరుగా చెప్పబడుతున్నాడు. అతడే భూమియందు హరి సేవచేయటానికి రామానుజుడుగా జన్మించాడు.

**శత్రుఘ్న ఇతి విఖ్యాతః శత్రూన్ సూదయతే యతః ।**
**అనిరుద్ధః కృష్ణపుత్రో ప్రద్యుమ్నాద్యోఽజనిష్ట హ ॥39॥**

శత్రువులను హింసించువాడు కావున శత్రుఘ్నుడనే పేరుపొందాడు. కృష్ణపుత్రుడైన ప్రద్యుమ్నుని వలన అనిరుద్ధుడు సముద్భవించాడు. (వ్యూహతత్త్వంలో అనిరుద్ధుడు విష్ణుసంభవుడు).

**సంకర్షణాది రూపైస్తు త్రిభిరావిష్ట ఏవ సః ।**
**ఏవం ద్విరూపో విజ్ఞేయో హ్యనిరుద్ధో మహామతిః ॥40॥**

అతడు సంకర్షణుడు మున్నగు మూడు రూపాలతో ఆవిష్కరింపబడినవాడు. మహామతి అయిన అనిరుద్ధుడు ఇట్లు రెండు రూపాలు కలవాడు.

**కామభార్యా రతిర్యా తు ద్విరూపా సంప్రకీర్తితా ।**
**రుగ్మపుత్రీ  రుగ్మవతీ కామభార్యా ప్రకీర్తితా ॥41॥**

కామునియొక్క భార్య అయిన రతి రెండు రూపాలు కలదిగా చెప్పబడింది. రుగ్మని కుమార్తె అయిన రుగ్మవతి కాముని భార్యగా చెప్పబడింది.

**అతిప్రకాశయుక్తత్వాత్ తస్మాద్రుగ్మవతీ స్మృతా ।**
**దుర్యోధనస్య యా పుత్రీ లక్షణా సా రతిః స్మృతా ॥42॥**

మిక్కిలికాంతితో కూడుకొన్నదగుటవలన రుగ్మవతిగా తెలియజేయబడింది. దుర్యోధనుని పుత్రి అయిన లక్షణ కూడ రతిగా పేర్కొనబడింది.

**కాష్ఠా సాంబస్య భార్యా సా లక్షణం సంయునక్తృతః ।**
**లక్షణాభిధయా భూమౌ దుష్టవీర్యోద్భవా హ్యపి ॥43॥**

సాంబుని భార్య కాష్ఠ. ఆమె సులక్షణాలతో కూడియున్నది. అందువల్ల భూమియందు దుష్టుని వీర్యంనుండి ఉద్భవించినప్పటికి లక్షణ అనే పేరు కల్గినదయ్యింది.

**ఏవం ద్విరూపా విజ్ఞేయా కామభార్యా రతిః స్మృతా ।**
**స్వాయంభువో బ్రహ్మపుత్రో మనుస్త్వాద్యో గురౌ సమః ॥**
**రాజధర్మేణ విష్ణోశ్చ జాతః ప్రణయితుం హరేః ॥44॥**

ఈ విధంగా కామునిభార్య అయిన రతి రెండు రూపాలతో ఉన్నట్లుగా స్మరింపబడింది. స్వాయంభువుడు బ్రహ్మ యొక్క కుమారుడు మొట్టమొదటి మనువు. గురువుకు సమానుడు హరికి సంతోషం చేకూర్చటానికి రాజధర్మంతో పుట్టాడు.

**బృహస్పతిర్దేవ గురుర్మహాత్మాతస్యావతారా స్త్రయ ఆసన్ ఖగేంద్ర ।**
**రామావతారే భరతాఖ్యో బభూవహ్యంభోజజావేశయుతో బృహస్పతిః ॥45॥**

పక్షీంద్రా! మహాత్ముడైన బృహస్పతి దేవతలకు గురువు. అతనికి మూడు అవతారాలు ఉన్నాయి. రామావతార సమయంలో పద్మం నుండి పుట్టిన బ్రహ్మయొక్క ఆవేశంతో కూడుకొని భరతుడయ్యాడు.

**దేవావతారాన్ వానరాం స్తారయిత్వాశ్రీరామ దివ్యాచరితాన్యవాదీత్ ।**
**అతో హ్యసౌ నారనామా బభూవహ్యంగత్వమాప్తుం రామదేవస్య భూమ్యామ్ ॥46॥**

దేవతల అవతారాలైన వానరులను తరింపజేసి, శ్రీరామునియొక్క దివ్యకృత్యాలను తెలియజేశాడు. భూమియందు రామదేవుని అవయవత్వం (పరివారత్వం) పొందటానికై అతడు 'నార' అను పేరుగలవాడయ్యాడు. (నారుడు)

**కృష్ణావతారే ద్రోణనామా బభూవ అంభోజజావేశయుతో బృహస్పతిః ।**
**యస్మాద్ద్రోణాత్సంబభూవ గురుశ్చతస్మాదసౌ ద్రోణసంజ్ఞో బభూవ ॥47॥**

కృష్ణావతార సమయంలో బృహస్పతి బ్రహ్మ యొక్క ఆవేశం(అంశ)తో కూడుకొని ద్రోణుడనే పేరుపొందాడు. ఆ గురువు ద్రోణ (దొన్నె) మందు పుట్టిన కారణంచేత, అతడు ద్రోణుడనే పేరువచ్చింది.

**భూభారభూతాద్యుద్ధృతౌ హ్యంగభూతో విష్ణోః సేవాం కర్తుమేవాస భూమౌ ।**
**బృహస్పతిః పవనావేశయుక్తః స ఉద్ధవశ్చేత్యభిధానమాప ॥48॥**

భూభారాన్ని ఉద్ధరించే సమయంలో విష్ణుసేవ చేయటానికై భూమియందు కృష్ణపరివారంలో ఒకడయ్యాడు. బృహస్పతి మరల వాయువు అంశతో కూడుకొన్నవాడయ్యాడు. అతడు ఉద్ధవుడనే పేరుగల్గినవాడయ్యాడు.

**యస్మాదుత్కృష్టో హరిరత్ర సమ్యగ్ అతోహ్యసౌ బుధవన్నామ చాప ।**
**సఖా హ్యభూత్కృష్ణదేవస్య నిత్యం మహామతిః సర్వలోకేషు పూజ్యః ॥49॥**

ఇందు హరి సంపూర్ణంగా ఉత్కృష్టుడైన కారణంచే అతడు గ్రహించి బుధుడువంటి పేరును పొందాడు. అతడు కృష్ణదేవునకు నిత్యమూ సఖుడు. గొప్పబుద్ధి కలిగినవాడు. సమస్తలోకాలలోను పూజింపదగినవాడు.

**దక్షిణాంగుష్ఠజో దక్షో బ్రహ్మపుత్రో మహామతిః ।**
**కన్యాం సృష్ట్వా హరేః ప్రీణన్నాస భూమా ప్రజాపతిః ॥**
**పుత్రానుదపాదయద్దక్షస్త్వతో దక్ష ఇతి స్మృతః ॥50॥**

బ్రహ్మపుత్రుడైన మహామతియైన దక్షుడు కుడిచేతి బొటనవ్రేలి నుండి పుట్టాడు. కన్యా సమూహాన్ని సృష్టించి హరిని సంతోషపరుస్తూ గొప్ప ప్రజాపతిఅయ్యాడు. పుత్రుల ఉత్పత్తికి సమర్థుడైన కారణంచేత దక్షుడుగా స్మరింపబడినాడు. (సంతానోత్పత్తికి)

**శచీం భార్యాం దేవరాజస్య విద్ధితస్యా హ్యవతారం శృణు సమ్యక్ ఖగేంద్ర ।**
**రామావతారే నామ తారా బభూవసా వాలిపత్నీ శచీ సంజ్ఞకా చ ॥51॥**

ఖగేంద్రా! దేవేంద్రునియొక్క భార్య శచి ఆమె అవతారాన్ని శ్రద్ధగా విను. ఆమె రామావతార సమయంలో తార శచి యని పేరు గల్గిన ఆమె వాలికి పత్ని అయ్యింది.

**రామాన్మృతే వాలి సంజ్ఞే పతౌ హి సుగ్రీవ సంగం సా చకారాథ తారా ।**
**అతో నాగాత్స్వర్గలోకం చ తారాక్వ వా యాయాదంతరిక్షం చ పాపా ॥52॥**

రాముని వలన వాలి అనే పేరుగల పతి మరణించగా, ఆ తార సుగ్రీవునితో సాంగత్యం చేసింది. అందువలన తార స్వర్గలోకానికి వెళ్లలేదు. ఆ పాపాత్మురాలు ఎక్కడికో ఒకచోటికి అంతరిక్షానికి వెళ్లింది.

**కృష్ణావతారే సైవతారా చ వీంద్రబభూవ భూమౌ విజయస్య పత్నీ ।**
**పిశంగదేతి హ్యభిధా స్యాచ్చ తస్యాః సామీప్యమన్యా స్త్వర్జునేనైవ చాసీత్ ॥53॥**

పక్షీంద్రా! కృష్ణావతార సమయంలో ఆ తారయే భూమి యందు విజయునికి పత్ని అయ్యింది. పిశంగద అనే పేరు పొందింది. ఆమెకు అర్జునునితో సాంగత్యం చేకూరింది.

**ఉత్పాదయిత్వా బభ్రువాహం చ పుత్రం తస్యాం త్యక్త్వా హ్యర్జునో వై మహాత్మా ।**
**అతశ్శోభే తారచిత్రాంగదే చ శచీ రూపే నాత్ర విచార్యమస్తి ॥54॥**

మహాత్ముడైన అర్జునుడు ఆమెయందు బభ్రువాహనుడనే పుత్రుని ఉద్భవింపజేసి విడిచి(వెళ్లి) పోయాడు. అందువలన తార, చిత్రాంగద ఇరువురూ శచీరూపాలే. ఇందు ఆలోచింపవలసినది ఏమీ లేదు.

**పులోమజా మంత్రద్యుమ్నస్య భార్యాయా కాశికా గాధిరాజస్య భార్యా ।**
**వికుక్షి భార్యా సుమతిశ్చేతి సంజ్ఞాకుశస్య పత్నీ కాంతిమతీతి సంజ్ఞా ॥55॥**

మంత్రద్యుమ్నుని భార్య అయిన పులోమజ, గాధిరాజు భార్య అయిన కాశిక, వికుక్షి భార్య సుమతి కుశునియొక్క పత్ని కాంతిమతి

**ఏతా హి సప్త హ్యవరాశ్చ శచ్యాజానీహి వై నాస్తి విచారణాత్ర ।**
**శచీరతిశ్చానిరుద్ధో మనుర్దక్షో బృహస్పతిః షడన్యోన్యసమాః ప్రోక్తా అహంకారాద్దశాధమాః ॥56॥**

శచితో కలిసి ఈ ఏడుగురు తక్కువగా తెలిసికొనుము. ఇందు విచారించవలసిన అంశం లేదు. శచి, రతి, అనిరుద్ధుడు, మనువు, దక్షుడు, బృహస్పతి – వీరు ఆరుగురు పరస్పరం సమానులుగా చెప్పబడ్డారు. అహంకారంకన్న పదిపాళ్లు తక్కువవారు.

**అథ యః ప్రదహో వాయుర్ముఖ్యవాయోః సుతో బలీ ।**
**స వాయుషు మహానద్య స వై కోణాధిప స్తథా ॥57॥**

పిమ్మట బలవంతుడైన ముఖ్యవాయువుయొక్క కుమారుడు ప్రవహుడనే వాయువు వాయువులందరిలో గొప్పవాడు. అతడే కోణాధిపతి కూడ.

**నాసికాసు స ఏవోక్తో భౌతికస్తుల్య ఏవ చ ।**
**అతివాహః స ఏవోక్తః యతో గమ్యో ముముక్షుభిః ॥58॥**

**దక్షాదిభ్యః పంచగుణాదధమః సంప్రకీర్తితః ।**

నాసికారంధ్రాలలో ఉండే వాయువుగా అతడే చెప్పబడుతున్నాడు. పంచ మహాభూతస్థ వాయువుతో సమానుడు. అతడే అతివాహుడుగా చెప్పబడుతున్నాడు. మోక్షేచ్ఛ గలవారిచే పొందబడేది కూడ అతడే. అతడే దక్షాదుల కన్న ఐదు గుణాలు తక్కువవాడుగా చెప్పబడుతున్నాడు.

**గరుడ ఉవాచ –** గరుడుడు చెప్పాడు.

**ప్రవహశ్చేతి సంజ్ఞాం స కిమర్థం ప్రాప తద్వద ॥59॥**

**అర్థః కశ్చాస్తి తన్నామ్నః ప్రతీతస్తం వదస్వ మే ।**
**గరుడేనైవ ముక్తస్తు భగవాన్దేవకీ సుతః ॥**
**ఉవాచ పరమ ప్రీతః సంస్తూయ గరుడం హరిః ॥60॥**

"ప్రవహుడు" అను పేరు ఆయన కెలా వచ్చిందో చెప్పు. ఆ పేరుతో ఏ అర్థం ప్రతీయమానమవుతుంది? దానిని నాకు వివరించు". గరుడుడు ఈ విధంగా అడుగగా భగవంతుడైన దేవకీనందనుడు మిక్కిలి సంప్రీతుడై, గరుడుని కొనియాడి ఇలా చెప్పాడు.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు అన్నాడు.

**ప్రహర్షేణ హరే స్తుల్యాన్ సర్వదా వహతే యతః ।**
**అతః ప్రవహ నామాసౌ కీర్తితః పక్షిసత్తమ ॥61॥**

మిక్కిలి సంతోషంతో హరితో సమానమైన వాటిని ఎల్లప్పుడు దహించే కారణం చేత పక్షిశ్రేష్ఠమా! అతడు ప్రవహుడు అనే పేరుతో కీర్తింపబడుతున్నాడు.

**సర్వోత్తమో విష్ణురేవాస్తి నామ్నా బ్రహ్మాదయస్తదధీనాః సదాపి ।**
**మయోక్త మేతత్తు సత్యం న మిథ్యా గృహ్ణామి హస్తేనోరగం కోపయుక్తమ్ ॥62॥**

పేరు చేతనే విష్ణువు అందరికన్న ఉత్తముడైనాడు. బ్రహ్మాదులు ఎల్లప్పుడు అతని ఆధీనంలో ఉండేవారు. నాచే వచింపబడిన ఇదంతయూ సత్యమే. మిథ్య కాదు అందువలననే కోపంతో కూడుకొన్న ఉరగాన్ని(కాళియుని) చేతితో పట్టుకోగలిగాను. (అంతటా వ్యాపించియుండును కాన విష్ణువు)

**సర్వం ను సత్యం యది మిథ్యా భవేత్తుతదా త్వసౌ మాం దశతు హ్యహీంద్రః ।**
**ఏవం బ్రువన్నురగం కోపయుక్తం సమగ్రహీన్నాదశత్సోఽ ప్యురంగః ॥63॥**

చెప్పిన సత్యమంతయూ మిథ్యయే అయితే, అప్పుడు ఆ కాళియుడు నన్ను కరచు గాక! అని పలుకుతూ కోపంతో ఆ పామును పట్టుకొన్నాను. ఆ ఉరగంకూడ నన్ను కరవలేదు.

**ఏతస్య సంధారణాదేవ వీంద్రస వాయుపుత్రః ప్రవహేత్యాప సంజ్ఞామ్ ।**
**యో వా లోకే విష్ణుమూర్తిం విహాయదైత్యస్వరూపా రేణుకాద్యాః కుదేవాః ॥64॥**

పక్షీంద్రా! దీనిని చక్కగా ధారణ చేయుట వల్ల, ఆ వాయుపుత్రుడు ప్రవహుడనే పేరును పొందాడు. (ధారణ చేయుట= ధరించుట) ఎవరయితే లోకమందు విష్ణుమూర్తిని విడిచి, తక్కువవారైన రేణుకాది దేవతలను పూజిస్తారో వారు రాక్షస (దైత్య) స్వరూపులు.

**తేషాం తథా మత్పితౄణాం చ పూజావ్యర్థా సత్యం సత్యమేతద్బ్రవీమి ।**
**ఏతత్సర్వం యది మిథ్యా భవేత్తు తదా త్వసౌ మాం దశతు హ్యహీంద్రః ॥65॥**

అలాగే నా తల్లిదండ్రులకు చేసిన ఆ పూజ వ్యర్థమవుతుంది. సత్యం. సత్యమని దీనిని చెప్తున్నాను. ఇదంతా మిథ్యయే అయితే సర్పరాజు నన్ను కరచు గాక!

**పిత్ర్యం న యామి ప్రవిహాయైవ యే తుపిత్రుద్దేశాత్కేవలం యః కరోతి ।**
**స పాపాత్మా నరకాన్వై ప్రయాతీత్యేతద్వాక్యం సత్యమేతద్బ్రవీమి ॥66॥**

పితృ సంబంధమైన దానిని పొందను. పితృసంబంధమైన ఉద్దేశ్యమును (ఆదేశమును) పూర్తిగా ఉల్లంఘించి కేవలం అనాసక్తితో ప్రవర్తించిన పాపాత్ముడు నరకాలను పొందుతాడనే ఈ వచనాన్ని సత్యంగా చెప్తున్నాను.

**న శ్రీః స్వతంత్రా నాపి విధిః స్వతంత్రోన వాయుదేవో నాపి శివః స్వతంత్రః ।**
**తదన్యే నో గౌరి పులోమజాద్యాః కిం వక్తవ్యం నాత్ర లోకే స్వతంత్రః ॥67॥**

లక్ష్మియు స్వతంత్రురాలు కాదు. విధి(బ్రహ్మ) కూడ స్వతంత్రుడు కాదు. శివుడు కూడ స్వతంత్రుడు కాదు. మిగిలినవారైన గౌరి, పౌలోమి మున్నగువారుకూడ స్వతంత్రురాంద్రు కారు. చెప్పవలసినదేముంది? ఈ లోకంలో స్వతంత్రుడన్నవాడు లేదు.

**బ్రవీమి సత్యం పురుషో విష్ణురేవ సత్యం సత్యం భుజముద్ధృత్య సత్యమ్ ।**
**ఏతత్సర్వం యది మిథ్యా భవేత్తు తదా త్వసౌ మాం దశతు హ్యహీంద్రః ॥68॥**

సత్యంను చెప్తున్నాను విష్ణువే పురుషుడు. సత్యం పునః సత్యం. చేతులు పైకెత్తి సత్యం చెప్తున్నాను. ఇది అంతయూ మిథ్యయే అయితే ఆ నాగేంద్రుడు నన్ను కరచియుండు గాక!

**జీవశ్చ సత్యః పరమాత్మా చ సత్యస్తయోర్భేదః సత్యే ఏతత్సదాపి ।**
**జడశ్చ సత్యో జీవ జడయోశ్చ భేదోభేదః సత్యః కిం చ జడేశయోర్భిదా ॥69॥**

జీవుడు సత్యుడు పరమాత్మ సత్యుడు. వారికి భేదం సత్యం. ఇదంతా ఎల్లప్పుడు సత్యం. జడం సత్యమే. జీవజడ భేదం సత్యం. భేదమే సత్యం. ఇక జడమునకు, ఈశ్వరునకు భేదం సత్యం కాదా!

**భేదః సత్యః సర్వజీవేషు నిత్యం సత్యా జడానాం చ భేదా సదాపి ।**
**ఏతత్సర్వం యది మిథా భవేత్తుతదా త్వసౌ దశతు మాం హ్యహీంద్రః ॥70॥**

సమస్తజీవులయందు భేదం నిత్యమూ సత్యమే. జడములకు భేదం సత్యం. ఎల్లప్పుడూ భేదం ఉంటుంది. ఇదంతయూ మిథ్యయైతే, ఆ అహీంద్రుడు నన్ను కరచియుండు గాక!

**ఏవం బ్రువన్నురగం కోపయుక్తం సమగ్రహీన్నాదశత్సోఽప్యురంగః ।**
**ఏతస్య సంధారణాదేవ వీంద్రస వాయు పుత్రః ప్రవహేత్యాప సంజ్ఞామ్ ॥71॥**

ఈ విధంగా పలుకుతూ కోపంతో కూడిన ఉరగాన్ని పట్టుకొన్నాడు. ఆ భుజంగం కూడ అతనిని కరవలేదు. పక్షీంద్రా! దీనినంతా ధరించిన కారణంచే ఆ వాయుపుత్రుడు ప్రవహుడనే పేరును పొందాడు.

**ద్వయం స్వరూపం ప్రవిదిత్వైవ పూర్వంత్వం స్వీకురుష్వ ద్వయమేవ నిత్యమ్ ।**
**స్నానాదికం చ ప్రకరోతి నిత్యం పాపీ స ఆత్మా నైవ మోక్షం ప్రయాతి ॥72॥**

ముందు ద్వయంయొక్క స్వరూపం పూర్తిగా తెలుసుకొని, దానిని స్వీకరించు. నిత్యమూ స్నానాదికాన్ని, ద్వయాన్ని చక్కగా ఆచరించాలి. నిత్యమూ అట్లు చేయని ఆ పాపాత్ముడు మోక్షం పొందలేడు.

**తస్మాద్ద్వయం ప్రవిచార్యైవ నిత్యంసుఖీ భవేన్నాత్ర విచార్యమస్తి ।**
**ఏతత్సర్వం యది మిథ్యా భవేత్తుతదా త్వసౌ మాం దశతు హ్యవీంద్ర ॥73॥**

అందువలన ద్వయమును చక్కగా విచారిస్తే, నిత్యమూ సుఖం పొందేవాడవుతాడు. ఇదంతయును మిథ్యయే అయిననాడు, ఆ నాగేంద్రుడు నన్ను కరచియుండు గాక!

**గరుడ ఉవాచ** - గరుడుడు అడిగాడు.

**కింతద్ద్వయం దేవదేవేశ కిం వా తత్కారణం కీదృశం మే వదస్వ ।**
**ద్వయో స్త్యాగం కీదృశం మే వదస్వ త్యాగాత్సుఖం కీదృశం మే వదస్వ ॥74॥**

దేవదేవేశా! ఆ ద్వయము ఏమిటి? దానికి హేతువు ఏమి? అది ఎటువంటిది? నాకు వివరించు. రెండింటి త్యాగం ఎటువంటిదో నాకు తెలియజేయి. త్యాగం వలన ఎటువంటి సుఖమో నాకు చెప్పు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు వచించాడు.

**ద్వయం చాహుస్త్వింద్రియే ద్వే బలిష్ఠే దేహే హ్యస్మిన్ శ్రోత్రనేత్రే సుసృష్టే ।**
**అవాంతరే శ్రోత్రనేత్రే ఖగేంద్రద్వయం చాహు స్తత్స్వరూపం చ వక్ష్యే ॥75॥**

ఈ దేహమందు చక్కగా సృష్టించబడి మిక్కిలి బలంకల, శ్రోత్ర(చెవి), నేత్రాలు(కన్ను) అనే రెండు ఇంద్రియాలను ద్వయమని చెబుతారు. పక్షీంద్రా! అంతర్భాగంలో ఉన్న శ్రోత్ర, నేత్రాలను కూడ(శ్రవణ శక్తి, వీక్షణ శక్తి) ద్వయమని వచిస్తారు. వాటి స్వరూపం చెప్తున్నాను.

**శ్రోత్రస్వభావో లోకవార్తా శ్రుతౌ చ హ్యతీవమోద స్త్వాదరాస్వాదనేన ।**
**హరేర్వార్తా శ్రవణే దుఃఖజాలం శ్రోత్రస్వభావో జడతా దమశ్చ ॥76॥**

లోకవార్తలను వినుటయందు ప్రీతితో ఆస్వాదిస్తూ మిక్కిలిగా సంతోషించుట శ్రోత్రస్వభావం. హరియొక్క గాథాశ్రవణమందు దుఃఖస్వభావం, జడత్వం, దమం పొందుటకూడ శ్రోత్రస్వభావమే.

**నేత్రస్వభావో దర్శనే స్త్రీ నరాణాం హ్యత్యాదరాన్నాస్తి నిద్రాదికం చ ।**
**హరేర్భక్తానాం దర్శనే దుఃఖరూపో విష్ణోః పూజాదర్శనే దుఃఖజాలమ్ ॥77॥**

స్త్రీలను, పురుషులను మిక్కిలి ప్రీతితో చూస్తూ, నిద్రాదికాలు లేకుండుట నేత్ర స్వభావం. హరి భక్తులను దర్శించుట దుఃఖరూపం, విష్ణుపూజాదర్శనం కూడ దుఃఖరూపాన్ని పొందుట కూడ నేత్రస్వభావమే.

**తయోః స్వరూపం ప్రవిదిత్వైవ పూర్వం పునః పునః స్వీకరోత్యేవ మూఢః ।**
**శిశ్నం మౌర్ఖ్యాచ్చైవ కుత్రాపి యోనౌ ప్రవేశయేత్సర్వదా హ్యాదరేణ ॥78॥**

వాటి స్వరూపాన్ని ముందుగా తెలిసికొన్నవాడైనప్పటికీ మూఢుడు పదే పదే స్వీకరిస్తున్నాడు. ఎల్లప్పుడు ప్రీతి కలిగి మూర్ఖత్వంతో శిశ్నమును ఏదో ఒక యోనియందు ప్రవేశపెడుతున్నాడు.

**భయం చ లజ్జా నైవ చాస్తే వధూనాం తథా నృణాం వనితానాం యతీనామ్ ।**
**స్వసారం తేహ్యవిదిత్వా దినేఽపి సువామయజ్ఞేన స్వభావశ్చ వీంద్ర ॥79॥**

వధువులకు, స్త్రీలకు, నరులకు, అలాగే యతులకు భయం గాని సిగ్గు గాని ఉండుటలేదు. పక్షీంద్రా! తన సోదరిని కూడ తెలియక వారు వామాచారంలోనుండుట స్వభావమైయున్నది.

**రసాస్వభావో భక్షణే సర్వదాపి హ్యనర్పితస్యాన్న భక్షస్య విష్ణోః ।**
**తథోపహారస్యతత్స్వభావః అభక్ష్యాణాం భక్షణే తత్స్వభావః ॥80॥**

ఎల్లప్పుడు రసములేని దానిని (చప్పరించి) భక్షించుట యందు, విష్ణువుకు అర్పించని అన్నాన్ని భక్షించుట యందు, అలాగే ఉపహారాన్ని స్వీకరించుట యందు, దాని స్వభావం. తినగూడని వానిని తినుటయందునూ దాని స్వభావమైయున్నది.

**అలేహ్యా లేహస్య చ తత్స్వభావః పాతుం త్వపేయస్య చ తత్స్వభావః ।**
**ద్వయోః స్వరూపం చ విహాయ మూఢః పునః పునః స్వీకరోత్యేవ నిత్యమ్ ॥81॥**

నాకదగనిదానిని నాకుట దాని స్వభావం. త్రాగరాని దానిని త్రాగుట దాని స్వభావం. ఆ రెండింటియొక్క స్వరూపాన్ని వదిలివేసి మూఢుడు నిత్యమూ పదేపదే స్వీకరిస్తూ ఉంటాడు.

**తస్య స్నానం వ్యర్థమాహుశ్చ యస్మాత్ తస్మాత్త్యాజ్యం న ద్వయోః కార్యమేవ ।**
**అభిప్రాయం హ్యేతమేవం ఖగేంద్ర జానీహి త్వం ప్రహస్యైవ నిత్యమ్ ॥82॥**

అతని స్నానం కూడ వ్యర్థమని వచిస్తారు. అందువలన వాటిని ఎల్లప్పుడు వదలిపెట్టాలి. ద్వయాలను ఎల్లప్పుడు ప్రవర్తింపచేయరాదు సుమా! పక్షీంద్రా! ఈ అభిప్రాయంనే నిత్యమూ నవ్వుకొంటూ నీవు గ్రహించు.

**భార్యాద్వయం హ్యవిదిత్వా స్వరూపం స్వీకృత్య చైకాం ప్రవిహాయ చైకామ్ ।**
**స్నానాదికం కురుతే మూడబుద్ధిః వ్యర్థం చాహుర్మోక్ష భోగౌ చ నైవ ॥**
**ఏతత్సర్వం యది మిథ్యా భవేత్తు తదా త్వసౌ మాం దశతు హ్యహీంద్ర ॥83॥**

భార్యాద్వయమును వాటి స్వరూపాన్ని తెలియకుండా, ఒకదానిని స్వీకరించి, వేరొకదానిని పూర్తిగా విడిచిపెట్టి, మూఢబుద్ధి స్నానాదికాలు చేస్తూ ఉంటాడు. అది వ్యర్థం. మోక్షం, భోగం చేకూరవు. ఇదంతయూ మిథ్యయే అయితే అప్పుడు ఆ నాగేంద్రుడు నన్ను కరుచు గాక!

**గరుడ ఉవాచ –** గరుడుడు వచించాడు.

**భార్యాద్వయం కిం వద త్వం మమాపి తయోః స్వరూపం కిం వద త్వం మురారే ।**
**తయోర్మధ్యే గ్రాహ్యభార్యాం వద త్వం అగ్రాహ్య భార్యాం చాపి సమ్యగ్వద త్వమ్ ॥84॥**

మురారీ! భార్యాద్వయమంటే ఏమిటో నీవు నాకు వచించు. వాటి స్వరూపం ఏమిటో కూడ నాకు తెలియజేయి. వారి మధ్యలో గ్రహించదగిన భార్యను గురించి కూడ నీవు చెప్పు. గ్రహించకూడని భార్యను గురించి కూడ నీవు చక్కగా వివరించు.

**శ్రీకృష్ణ ఉవాచ –** శ్రీకృష్ణుడు వచించాడు.

**బుద్ధిః పత్నీ సా ద్విరూపా ఖగేంద్ర దుష్టా చైకా త్వపరా సుష్ఠురూపా ।**
**తయోర్మధ్యే దుష్టరూపా కనిష్ఠా జ్యేష్ఠా తు యా సుష్ఠుబుద్ధి స్వరూపా ॥85॥**

పక్షీంద్రా! బుద్ధి పత్ని. ఆమె రెండు రూపాలు కలది. ఒకటి దుష్టమైనది. రెండవది మిక్కిలి మంచిదైనది. వాటి లోపల దుష్టరూపమైనది తక్కువది (రెండోది). మంచి బుద్ధిరూపంలో ఉండేది మొదటిది.

**కనిష్ఠయా నష్టతాం యాతి జీవః సుతిష్ఠన్త్యాయాతి యోగ్యాం ప్రతిష్ఠామ్ ।**
**కనిష్ఠాయాః శృణు వక్ష్యే స్వరూపం శ్రుత్వా తస్యా స్త్యాగ బుద్ధిం కురుష్వ ॥86॥**

జీవుడు తక్కువదానిచేత నష్టం పొందుచున్నాడు. మిక్కిలి గొప్పగా ఉండేదానిచేత యోగ్యమైన ప్రతిష్ఠను పొందుతున్నాడు. కనిష్ఠయొక్క రూపం చెప్తున్నాను. ఆకర్ణించు. విని దాని యందు త్యాగబుద్ధిని ఆచరించు.

**జీవం యం వై ప్రేరయంతీ కనిష్ఠా కామ్యాం ధర్మం కురుతే సర్వదాపి ।**
**క్వ బ్రాహ్మణాః క్వ చ విష్ణుర్మహాత్మా క్వ వై కథా క్వ చ యజ్ఞాః క్వ గావః ॥87॥**

కనిష్ఠ ఏ జీవుని ప్రేరేపిస్తుందో, అతడు ఎల్లప్పుడూ కామ్యధర్మాలను మాత్రమే ఆచరిస్తాడు. బ్రాహ్మణులు ఎక్కడ? మహాత్ముడైన విష్ణువు ఎక్కడ? కథాప్రసంగమెక్కడ? యజ్ఞాలు ఎక్కడ? గోవులు ఎక్కడ?

**క్వ చాశ్వత్థః క్వ చ స్నానం క్వ శౌచమ్ ఏతత్సర్వం నామ నాశం కరోతి ।**
**మూఢం పతిం రేణుకాం పూజయస్వ మాయాదేవ్యా దీపదానం కురుష్వ ॥88॥**

అశ్వత్థమెక్కడ? స్నానం ఎక్కడ? శౌచం ఎక్కడ? ఇదంతా పేరుకు మాత్రమే. అంతయూ నశించిపోయేదే. మూఢుడైనా భర్తను, రేణుకను పూజించు. మాయాదేవికి దీపదానం ఈయవలసింది.

**సుభైరవాదీన్ భజ మూఢ త్వమంధ! హరిద్రచూర్ణం ధారయేః సర్వదాపి ।**
**జ్యేష్ఠాష్టమ్యాం జ్యేష్ఠదేవీం భజస్వ భక్త్యా సూత్రం గలబంధం కురుష్వ ॥89॥**

ఓరీ మూఢుడా! అంధుడా! నీవు భైరవుడు మున్నగువారిని భజించు. ఎల్లప్పుడు పసుపును ధరించు. జ్యేష్ఠమాసంలో అష్టమినాడు జ్యేష్ఠాదేవిని పూజించు. భక్తితో సూత్రం కంఠంలో ముడిగా వేసుకొమ్ము.

**మరిగంధాష్టమ్యాం మరిగంధం భజస్వతథా సూత్రం స్వగలే ధారయస్వ ।**
**దీపస్తంభం సుదినే పూజయస్వతత్సూత్రమేవ స్వగలే ధారయస్వ ॥90॥**

మరి(మిరియం) గంధాష్టమినాడు (వేసవికాలం) మరి గంధాన్ని సేవించు. అలాగే సూత్రాన్ని కంఠంలో ధరించు. మంచిరోజున దీపస్తంభాన్ని పూజించు. ఆ సూత్రాన్ని గళభాగంలో ధరించు.

**మహాలక్ష్మీం చాద్యలక్ష్మీం చ సమ్యక్ పూజాం కురు త్వం హి భక్త్యాథ జీవ ।**
**లక్ష్మీసూత్రం స్వగలే ధారయస్వ మహాలక్ష్మీవాన్ భావ సత్యుత్తరత్ర ॥91॥**

ఓ జీవా! నీవు భక్తితో ఆదిలక్ష్మి అయిన మహాలక్ష్మిని చక్కగా పూజచేయి. లక్ష్మీ సూత్రాన్ని స్వీయకంఠంలో ధరించు. తరువాత కాలంలో మహాలక్ష్మీసంపన్నుడవు కాగలవు.

**విహాయ మౌంజీ దివసే భాగ్యకామః సుగుగ్గులాన్ ధారయస్వాతిభక్త్యా ।**
**సువాసినీః పూజయస్వాశుభక్త్యాగంధైః పుష్పైర్ధూపదీపైః ప్రతోష్య ॥92॥**

మౌంజిని ధరించే దినాన్ని విడిచిపెట్టి మిక్కిలి భక్తితో భాగ్యములను కోరుకొంటూ, మంచి గుగ్గులాలను ధరించు. గంధపుష్పాలతోను, ధూప దీపాలతోను సంతోషపరుస్తూ, భక్తితో వెంటనే సువాసినులను పూజించు.

**వరార్తిక్యం కాంస్యపాత్రే నిధాయ కుర్వార్తిక్యం దేవతాదేవతానామ్ ।**
**పిచుమంద పత్రాణి వితత్య భూమౌ నమస్వ త్వం క్షమ్యతాం చేతి చోక్త్వా ॥93॥**

కంచుపాత్రలో శ్రేష్ఠమైన హారతి ఉంచి, దేవగణాలకు, దేవతాగణాలకు హారతిని ఇయ్యి. వేపాకులను నేలపై ఎక్కువగా పరచి "నన్ను క్షమించు" అంటూ నీవు నమస్కరించు.

**మహాదేవీం పూజయస్వాద్య భక్త్యా సద్వైష్ణవానాం మా దదస్వాప్యథాన్నమ్ ।**
**సద్వైష్ణవానాం యదివాన్నం దదాసి భాగ్యం చ తే పశ్యతో నాశమేతి ॥94॥**

ఇచ్చట ఎప్పుడు మహాదేవిని పూజించు. గొప్పవారైన వైష్ణవులకు అన్నం మున్నగువానిని మహాదేవిని పూజించక ముందు ఈయవద్దు. (పెట్టకుము). మహాదేవిని పూజించకముందు సద్వైష్ణవులకు భోజనం పెడితే, నీభాగ్యం చూస్తూఉండగానే నశించిపోతుంది.

**స్వవామహస్తే వేణుపాత్రే నిధాయ దీపం ధృత్వా సవ్యహస్తే పతే త్వమ్ ।**
**ఉత్తిష్ఠ భోః పంచగృహేషు భిక్షాం కురుష్వ సమ్యక్ ప్రవిహాయైవ లజ్జామ్ ॥95॥**

**ఆదౌ గృహే షడ్రసాన్నం చ కృత్వా జగద్గోప్యం భోజనం త్వం కురుష్వ ।**
**తచ్ఛేషాన్నం భోజయిత్వా పతే త్వం తాసాం చరే శరణం త్వం కురుష్వ ॥96॥**

తన ఎడమ చేతియందు వెదురుతో చేయబడిన బుట్టలో దీపాన్ని ఉంచి, దానిని ఎడమ చేతితోనే పట్టుకొని "నీవే విభుడవు. ఓయీ! పతీ! లెమ్ము అయిదు ఇండ్లలో చక్కగా (శ్రద్ధగా) సిగ్గువిడిచి భిక్షచేయి. (అందమైన కుడిచేతిలో బుట్ట ఎడమచేతిలో దీపం ధరించి) ముందు ఇంటిలో ఆరు రసాలతో కూడుకొన్న భోజనం లోకరహస్యంగా నీవు చేయి. పతీ! మిగిలిన ఆ అన్నాన్ని వారిచే తినిపించి, ఓయీ! నీవు శరణం కమ్ము అని అర్థించు.

**తాసాం హస్తాం పుస్తకే స్థాపయిత్వా త్రాహీత్యేవం తన్ముఖైర్వార్చయస్వ ।**
**త్వం ఖడ్గదేవం పూజయస్వాద్య భర్తస్తత్సేవకాన్ పూజయస్వాద్య సమ్యక్ ॥97**

వారిచేతిని పుస్తకంపై ఉంచి, నన్ను రక్షింపుమని వారి ముఖాలతో అర్చించు. ఓ పతీ! నీవు ఇప్పుడు ఖడ్గదేవతను పూజించు. ఆ సేవకులను కూడ ఇప్పుడు చక్కగా పూజించు.

**తైః సార్ధం త్వం శ్వానశబ్దం కురుష్వ హరిద్రా చూర్ణం సర్వదా త్వం దధస్వ ।**
**కురుష్వ త్వం భీమసేనస్య పూజాం పంచామృతైః షోడశభిశ్చోపచారైః ॥98॥**

వారి(టి)తో నీవు కలసి కుక్క అరచేటట్లుగా అరవవలసింది. ఎల్లప్పుడు నీవు పసుపు ధరించు. పంచామృతాలతోను, పదునారు ఉపచారాలతోను నీవు భీమసేనుని పూజను ఆచరించు.

**తత్కౌపీనం రౌప్యజం కారయిత్వా సమర్పయిత్వా దీపమాలాం కురుష్వ ।**
**తద్దాసవర్యాన్ భోజయస్వాద్య భక్త్యా గర్జస్వ త్వం భీమభీమేతి సుష్ఠు ॥99॥**

వెండి(చుక్కల)తో కౌపీనం చేయించి, సమర్పణజేసి, దీపమాల సమర్పించు. శ్రేష్ఠులైన ఆ సేవకులను భక్తితో అప్పుడు భుజింపజేయుము. నీవు భీమ! భీమ! అంటూ కేకవేయి.

**తద్దాసవర్యాన్ మోదయస్వ స్వవస్త్రైర్యద్వైర్మాంసద్రవ్యజాలేన నిత్యమ్ ।**
**మహాదేవం పూజయస్వాద్య సమ్యగ్ మహారుద్రైరతి రుద్రైశ్చ సమ్యక్ ॥100॥**

నిత్యమూ వారికి కావలసిన వస్త్రములతోను, మద్యములతోను, మాంసములతోను, ద్రవ్యసమూహాలతోను, ఆ దాస శ్రేష్ఠులను సంతోషపరచు. మహారుద్రంతోను, అతిరుద్రంతోను భక్తితో మహాదేవుని అప్పుడు చక్కగా పూజించు.

**హరేత్యుక్త్వా జంగమాన్ పూజయస్వ శైవాగమే నిపుణాన్శూద్రజాతాన్ ।**
**శాకంభరీం వివశః సర్వశాకాన్ సుపాచయిత్వా చ గృహే గృహే చ ॥101॥**

శైవాగమమునందు పరినిష్ఠితులైన శూద్రజాతులైన జంగములను"హరా! హరా!" అంటూ పూజించు. పరవశుడై సమస్త శాకాలను వండింపజేసి ప్రతి ఇంటిలో (పంచిపెట్టు).

**దదస్వ భక్త్యా పరమాదరేణస్వలంకృత్య ప్రాస్తువం స్తద్గుణాంశ్చ ।**
**కులాలదేవం పూజయస్వాద్య భక్త్యా త్వం దృగ్భ్యాం వై తద్దినే శంభుబుద్ధ్యా ॥102॥**

(పంచిపెట్టు.) శాకంభరిని మిక్కిలి ప్రీతితో భక్తిగా అలంకరించి, ఆమె గుణాలను ప్రస్తుతిస్తూ పూజించు. నీవు ఆ రోజున కన్నులతోనే కులాలదేవుని శంభుబుద్ధితో భక్తితో అప్పుడు పూజించు.

**తద్భక్తవర్యాన్ పూజయస్వాద్య సమ్యక్ తత్పాదమూలే వందనం త్వం కురుష్వ ।**
**సుపంచమ్యాం మృన్మయీం శేషమూర్తిం పూజాం కురుష్వ క్షీరలాజాదికైశ్చ ॥103॥**

ఆ భక్తశ్రేష్ఠులను ఇప్పుడు చక్కగా పూజించు. ఆ పాదమూలమునందు వినయంగా నమస్కరించు. గొప్పదైన పంచమినాడు మట్టితో చేసిన శేషమూర్తిని (పుట్టలోనున్న) పాలు, పేలాలు మున్నగువాటితో పూజించు.

**సునాగపాశం హి గలే చ బుద్ధ్వా తచ్ఛేషాన్నం భోజయేర్భోః పునస్త్వమ్ ।**
**దినే చతుర్థే భోజయస్వాద్య భక్త్యా నైవేద్యాన్నం భోజయస్వాద్య సుష్ఠు ॥104॥**

గొప్పదైన నాగపాశాన్ని కంఠంలో బంధించి, ఆ శేషనివేదనాన్ని ఓయీ! నీవు మళ్లీ భుజించు. నాలుగో రోజున (చతుర్థినాడు) భక్తితో భోజనం చేయి. ఇప్పుడు నైవేద్యాన్నాన్ని చక్కగా భుజించు.

**ఇత్యాదికం ప్రేరయిత్వా పతిం సాజీవేన నష్టం ప్రకరోత్యేవ నిత్యమ్ ।**
**తస్యాః సంగాజ్జీవరూపః పతి స్త్వాం సమ్యగ్దష్టామిహ లోకే పరత్ర ॥105॥**

ఈ మొదలయిన వాటిచే ఆ కనిష్ఠబుద్ధి పతిని ప్రేరేపించి నిత్యమూ జీవత్వం(జీవుని) నశించిపోయేటట్లుగా చేస్తూంటుంది. ఆమె యొక్క (ఆబుద్ధి యొక్క) సాంగత్యంచే జీవరూపుడైన పురుషుడు ఈ లోకమందు పరలోకమందు కూడ నిన్ను కరుస్తూఉంటాడు (ఉంటుంది).

**తస్యాః సంగం సువిదూరం విసృజ్య చేష్ట్వా సమగ్రం కురు సర్వదా త్వమ్ ।**
**సుబుద్ధిరూపా త్వీరయంతీ జగాద భజస్వ విష్ణుం పరమాదరేణ ॥106॥**

ఆమెయొక్క సంగమాన్ని మిక్కిలి దూరంలో విడిచిపెట్టి, నీవు ఎల్లప్పుడు మిక్కిలి గొప్పదైన యజనాది కృత్యాన్ని ఆచరించు. సుబుద్ధిరూపమైన జ్యేష్ఠాబుద్ధి ప్రేరేపిస్తూ "మిక్కిలి భక్తితో సేవించు" అని పలుకుతూ ఉంటుంది. (జ్యేష్ఠాబుద్ధి శ్రేష్ఠమైన బుద్ధి).

**హరిం వినాన్యం న భజస్వ నిత్యం సా రేణుకా త్వాం తు న పాలయిష్యతి ।**
**అదృష్టనామా హరిరేవం హి నిత్యం ఫలప్రదో యది న స్యాత్ ఖగేంద్ర ॥107॥**

నిత్యమూ హరిని విడిచి మరొకరిని భజించవద్దు. ఆ రేణుక నిన్ను రక్షించలేదు. అదృష్టం అనే పేరుతో ఉండేవాడు నిత్యమూ హరియే పక్షీంద్రా! అతడే ఫలితాలను అందజేసేవాడు. అయినా కంటికి కనబడని తత్త్వమది. (లేనట్లుంటుంది).

**జుగుప్సితాం శ్రుత్యనుక్తాం చ దేవీం పతిద్రుహాం సర్వదా సేవయిత్వా ।**
**తస్యాః ప్రసాదాత్ కుష్ఠ భగంధరాద్యైర్భుక్త్వా దుఃఖం సంయమినీం ప్రయాహి ॥108॥**

శ్రుతులయందు చెప్పబడిన, జుగుప్స కలిగించే (రోత),జీవునికి(పతికి) ద్రోహం చేసే దేవిని ఎల్లప్పుడు సేవించి, ఆమె అనుగ్రహం వల్ల కుష్ఠం, భగంధరం మున్నగువాటిచే దుఃఖం అనుభవించి సంయమినికి (యమరాజధానికి) పయనించు.

**తదా కుదేవీ కుత్ర గతా వదస్వ మే హ్యతః పతే త్వం న భజస్వ దేవీమ్ ।**
**పతే భజత్వం బ్రాహ్మణాన్ వైష్ణవాంశ్చ సంసారదుఃఖాత్తారకాన్ సుష్ఠురూపాన్ ॥109॥**

అప్పుడు ఆ కుత్సితురాలైన దేవి(కనిష్ఠబుద్ధి) ఎక్కడకు వెడుతుందో నాకు వచించు. కాబట్టి ఓ జీవుడా! నీవు ఆ దేవిని సేవించవద్దు. ఓ జీవుడా! సంసారదుఃఖం నుండి తరింపజేసే చక్కని రూపంతో ఉండే బ్రాహ్మణులను, వైష్ణవులను నీవు భజించు.

**సేవాదికం ప్రవిహాయైవ స్వచ్ఛం మాయాదేవ్యా భజనాత్కిం వదస్వ ।**
**జ్యేష్ఠాష్టమ్యాం జ్యేష్ఠదేవీం హ్యలక్ష్మీం లక్ష్మీతి బుద్ధ్వా పూజయిత్వా చ సమ్యక్ ॥110॥**

**తస్యాః సూత్రం గలబద్ధం చ కృత్వా నానాదుఃఖం హ్యనుభూయాః పతే త్వమ్ ।**
**యదా పతే యమదూతైశ్చ పాశైర్బద్ధ్వా చ సమ్యక్ తాడ్యమానైః కశాభిః ॥111॥**

**తదాహ్యలక్ష్మీః కుత్ర పలాయతేऽ సావతో మూలం విష్ణుపాదం భజస్వ ।**
**పతే భజత్వం సర్వదా వాయుతత్త్వం నచాశ్రయే స్త్వం సూక్ష్మ స్కందం చ మూఢ ॥112॥**

సత్యుడైన విష్ణువుయొక్క సేవాదికాలను వదలి, మాయాదేవిని భజించుట వల్ల ఏమి ప్రయోజనమో చెప్పు. జ్యేష్ఠమాసంలో అష్టమినాడు జ్యేష్ఠాదేవిని అలక్ష్మిని లక్ష్మీస్వరూపంగా భావించి, భక్తితో పూజించి, జీవుడా! నీవు ఆమె సూత్రం కంఠబద్ధం కావించుకొని అనేక విధాలైన దుఃఖాలను అనుభవించు. జీవుడా! ఎప్పుడయితే యమ కింకరులచే పాశాలతో కట్టబడి, వారు గట్టిగా కొరడాలతో కొడుతూ ఉండగా, (గుఱ్ఱాలను అదిలించే చవుకులతో) అప్పుడు అలక్ష్మి ఎక్కడికి పారిపోయింది? అందువల్ల విష్ణుపాదాలను భజించు. మూఢా! ఓ జీవుడా! నీవు ఎల్లప్పుడు వాయుతత్త్వాన్ని (వ్యాపించియున్న దానిని) భజించు. నీవు సూక్ష్ముడైన స్కందుని ఆశ్రయించవద్దు.

**తద్వత్తం త్వం నవనీతం చ భక్త్యా తదుచ్ఛిష్టం భక్షయిత్వా పతే హి ।**
**తస్యాశ్చ సూత్రం గలబద్ధం చ కృత్వా ఇహైవ దుఃఖాన్యనుభూయాః పతే త్వమ్ ॥113॥**

ఆవిధంగా నీవు ఆ నవనీతాన్ని భక్తితో గ్రహించి, ఆ ఎంగిలిని భక్షించి, ఓ జీవుడా! ఆమె సూత్రాన్ని కంఠబంధం గావించుకొని, పతీ! నీవు ఇక్కడనే దుఃఖాలను అనుభవించు.

**యదా పతే యమదూతైశ్చ పాశైర్బద్ధ్వా చ సమ్యక్ తాడ్యమానః కశాభిః ।**
**తదా స్కందః కుత్రపలాయతేఽసావతో మూలం విష్ణుపాదం భజస్వ ॥114॥**

జీవుడా! ఎప్పుడయితే యమకింకరులచే పాశాలతో కట్టబడి, వారు గట్టిగా కొరడాలతో కొట్టేటప్పుడు ఆ స్కందుడు ఎలా నిన్ను వచ్చి రక్షిస్తాడు? అందువల్ల విష్ణువుయొక్క పాదమూలాన్నే భజించు.

**దీపస్తంభం దాపయిత్వా పతే త్వం సూత్రం బధ్వా స్వగలే చ భక్త్యా ।**
**తదా బద్ధ్వా యమదూతైశ్చ పాశైర్దీపస్తంభై స్తాడ్యమాన స్తు సమ్యక్ ॥115॥**

జీవుడా! నీవు దీపస్తంభాన్ని దీపింపజేసి నీకంఠంలో సూత్రాన్ని భక్తితో బంధించుకొంటే, అప్పుడు యమదూతలచే పాశాలతో కట్టబడి దీపస్తంభాలతో గట్టిగా కొట్టబడినవాడవు అవుతావు.

**దీపస్తంభః కుత్ర పలాయితోఽభూదతో మూలం విష్ణుపాదం భజస్వ ।**
**లక్ష్మీదినే పూజయిత్వా చ లక్ష్మీంసూత్రం తస్యాః స్వగలే ధారయ త్వమ్ ॥116॥**

అప్పుడు దీపస్తంభం ఎక్కడకు పలాయిస్తుంది? అందువల్ల విష్ణుపాదాలను భజించు లక్ష్మీదినంనాడు లక్ష్మిని పూజించి, ఆమె సూత్రాన్ని నీవు ధరిస్తూఉండు అలాగే.

**యదా పతే యమదూతైశ్చ పాశైర్బద్ధ్వా సమ్యక్ తాడ్యమానః కశాభిః ।**
**తదా లక్ష్మీః కుత్ర పలాయతేఽసావతో మూలం విష్ణుపాదం భజస్వ ॥117॥**

జీవుడా! ఎప్పుడయితే యమదూతలచే యమపాశాలతో కట్టబడి కొరడాలతో కొట్టబడుతూ ఉంటే, అప్పుడు ఆ లక్ష్మి ఎక్కడకు పలాయించి ఉంటుంది? అందువల్ల నీవు విష్ణుపాదమూలం భజించు.

**వివాహమౌంజీ దివసే మూఢబుద్ధే జుగుప్సితాన్ ధారయిత్వా సుభక్త్యా ।**
**వరార్తిక్యం కాంస్యపాత్రే నిధాయ కృత్వార్తిక్యం ఉదఉదైతిశబ్దమ్ ॥118॥**

ఓ మూఢబుద్ధీ! వివాహమౌంజీ దినమందు మిక్కిలి ఆసక్తితో ఏవగింపు వచ్చేవాటిని ధరించి, శ్రేష్ఠమైన హారతిని కంచుపాత్రలో ఉంచి, హారతినిచ్చి, "ఉద, ఉద" (ఉం, ఉం) అంటూ ఉంటాడు.

**తథైవ దష్ట్వా పిచుమందస్య పత్రం సునర్తయిత్వా పరమాదరేణ ।**
**యదా తదా యమదూతైశ్చ పాశైర్బద్ధ్వా బద్ధ్వా తాడ్యమానశ్చ సమ్యక్ ॥119॥**

**తవ స్వామిన్ కులదేవో మహాత్మన్ పలాయితః కుత్ర మే తద్ వదస్వ ।**
**స్వదేహానాం పూజయిత్వా చ సమ్యక్ కంఠాభరణైర్విధురాణాం చ కేశైః ॥120॥**

**సంతిష్ఠమానే యమదూతా బలిష్ఠా సంతాడ్యమానే ముసలైర్భిందిపాలైః ।**
**యదా తదా కుత్ర పలాయితా సా కేశైర్విహీనా లంబకర్ణం చ కృత్వా ॥121॥**

**స్వవామహస్తే వేణుపాత్రం నిధాయ దీపం ధృత్వా సవ్యహస్తే చ మూఢః ।**
**గృహే గృహే భైక్షచర్యాం చ కృత్వా సంతిష్ఠమానే స్వగృహం చైవ దేవీ ॥122॥**

అదేవిధంగా వేపాకులు నోట గరచి, మిక్కిలి ఉత్సాహంతో గంతులు వేస్తూ ఉంటాడు. ఎప్పుడయితే యమకింకరులచే పాశాలతో పదేపదే కట్టబడి, గట్టిగా కొట్టబడుతూ ఉంటే, అప్పుడు స్వామి, మహాత్ముడునైన నీ కులదేవుడు ఎక్కడకు పారిపోయాడో నాకు చెప్పు. చక్కగా కంఠాభరణాలతో తన శరీరాంగాలనే పూజించుకొంటూ, కేశాలను విడచివేసి, ఉండగా, బలవంతులైన యమదూతలు ముసలాలతోను, భిందిపాలాలతోను కొడుతూ ఉంటే, ఆమె అప్పుడు ఎక్కడకు పారిపోయింది? ఆమె జుట్టులేకుండా, చెవులను వ్రేలాడేటట్లుగా చేసి, అందమైన తన ఎడమచేతియందు వెదురుబుట్టనుంచుకొని, దీపాన్ని ఉంచి ఎడమచేతితో పట్టుకొని, ఆ మూఢుడు ప్రతి గృహమందును భిక్షను అడుగుకొంటూ ఉండగా, ఆ దేవి స్వగృహంలోనే ఉంది.

**యదా తదా యమదూతైశ్చ మూఢదీపైః సహస్రైర్దహ్యమానశ్చ సమ్యక్ ।**
**నిర్నాసికా రేణుకా మూఢబుద్ధే పలాయితా కుత్ర సా మే వదస్వ ॥123॥**

మూఢుడా! అదే సమయంలో వేలకొలది దీపాలతో యమదూతలు పదేపదే కాలుస్తూ ఉండగా, ఓరీ మూఢబుద్ధీ! ముక్కు లేని ఆ రేణుకాదేవి ఎక్కడకు పారిపోయినట్లో నాకు చెప్పు.

**సదా మూఢం ఖడ్గదేవం చ భక్త్యా తం భక్తవత్పూజయిత్వా చ సమ్యక్ ।**
**తైః సార్ధం త్వం శ్వానవద్గర్జయిత్వా సంతిష్ఠమానే స్వగృహే చైవ నిత్యమ్ ॥124॥**

**యదా తదా యమ దూతైశ్చ సమ్యక్ సంతాడ్యమానస్తత్ర శబ్దం ప్రకుర్వన్ ।**
**సంతిష్ఠమానే భక్తవర్యం విహాయ తదా దేవః కుత్రపలాయితోఽభూత్ ॥125॥**

ఎల్లప్పుడూ మూఢంగా ఉండే ఖడ్గదేవతను భక్తితో, భక్తునివలె శ్రద్ధగాపూజిస్తూ, వారితో కలిసి నీవు కుక్క వలె అరుస్తూ, నిత్యమూ స్వగృహంలో ఉండే, ఎప్పుడయితే యమదూతలచే గట్టిగా కొట్టబడుతూ, అమ్మో! బాబో! అని గట్టిగా అరుస్తావో అప్పుడు, ఆ భక్తశ్రేష్ఠుని విడిచి ఆ ఖడ్గదేవుడు ఎక్కడికి పారిపోతాడో కదా!

**స పార్థక్యాద్భీమసేన ప్రతీకం పంచామృతైః పూజయిత్వా చ సమ్యక్ ।**
**స వ్యంజనేచాన్నకౌపీనమేవ దత్త్వా మూఢస్తిష్ఠమానే స్వగృహే ॥126॥**

**యదా తదా యమదూతైశ్చ సమ్యక్ సంతాడ్యమానే యమమార్గే చ మూఢ ।**
**భీమః స వై కుత్ర పలాయితోఽభూదతో మూలం విష్ణుపాదం భజస్వ ॥127॥**

అన్నింటికన్న వేరుగా భీమసేనుని ప్రతీకాన్ని ఏర్పరిచి, భక్తితో పంచామృతాలతో భజించి, చిత్రాన్నములను, రంగు రంగుల వస్త్రాలను సమర్పించియుండగా ఆ మూఢుడు తన మందిరంలోనే ఉండగా, ఎప్పుడయితే ఆ మూఢుడు యమమార్గంలో యమకింకరులచే గట్టిగా కొట్టబడుతూ ఉండగా, అప్పుడు ఆ భీముడు ఎక్కడకు పారిపోయాడు! అందువల్ల విష్ణువు యొక్క పాదమూలం భజించు.

**మహాదేవం పూజయిత్వా చ సమ్యక్ హరేత్యుక్త్వా స్వగృహే విద్యమానే ।**
**యదా గృహం దహ్యతే వహ్నినా తు తదా హరః కుత్రపలాయితోఽభూత్ ॥128॥**

మహాదేవుని భక్తితో పూజించి, హరా! హరా! అంటూ, తన ఇంటిలోనే ఉండగా, అగ్నితో ఇల్లు దగ్ధమైపోతూ ఉంటే, అప్పుడు ఆ హరుడు ఎక్కడకు పారిపోయాడు?

**శాకంభరీ దివసే సర్వమేవ శాకంభరీ చ దేవీ మహాత్మన్ ।**
**పలాయితా కుత్ర మే త్వం వదస్వ కులాలదేవం పూజయిత్వా చ భక్త్యా ॥129॥**

**కూర్పాసం వై తేన దత్తం గృహీత్వా సంతిష్ఠమానే యమదూతైశ్చ సమ్యక్ ।**
**సంహన్యమాన స్తీక్ష్ణధారైః కుఠారైః కులాలదేవం చ సుదంష్ట్రనేత్రమ్ ॥**
**విహాయ వై కుత్ర పలాయితోఽ భూన్న జ్ఞాయతేఽ న్వేషణాచ్చాపి కేన ॥130॥**

మహాత్మా! శాకంభరీ దినం నాడు సర్వమూ ఆ శాకంభరియే అని అంటూ నీవుంటే, ఆమె ఎక్కడకు పలాయిత అయిందో వచించు. కులాలదేవుని భక్తితో పూజించి, అతనిచే ఈయబడిన కూర్పాసాన్ని (పాదాలవరకు వేసికొనే చొక్కా) స్వీకరించి ఉండగా, యమకింకరులచే వాడియైన అంచులు కల కుఠారాలచే గట్టిగా, వాడి కోరలు, కన్నులు కల కులాలదేవునే కొడుతూ ఉండగా, నిన్ను విడిచి ఎక్కడకు పలాయితుడయ్యాడు? ఎంతవెదకినా, ఎవరిచేతనైనా తెలియబడలేదు కదా!

**యదా పంచమ్యాం మృన్మయీం శేషమూర్తింసంపూజ్య భక్త్యా విద్యమానే స్వగేహే ।**
**తదా బద్ధ్వా యమదూతాశ్చ సమ్యక్ సంహన్యమానే నాగపాశైశ్చ బద్ధ్వా ॥131**

పంచమినాడు మట్టితో చేసిన శేషమూర్తిని భక్తితో పూజించి తన ఇంటిలోనే ఉండగా, యమదూతలు వచ్చి గట్టిగా బంధించి, నాగపాశాలతో కట్టి కొడుతూ ఉండగా....

**స్వభక్తవర్యాం ప్రవిహాయ నాగః పలాయితః కుత్ర వై సంవద త్వమ్ ।**
**దూర్వాంకురైర్మోదకైః పూజయిత్వా వినాయకం పంచఖాద్యై స్తథైవ చ ॥132॥**

తన భక్తశ్రేష్ఠుని విడిచిపెట్టి, నాగం ఎక్కడకు పారిపోయిందో నువ్వు చెప్పు. వినాయకుని గరికపోచల చేతను, మోదకాలచేతను (అపూపవిశేషాలు), అయిదు భక్ష్యాలచేతను పూజించి....

**సంతిష్ఠమానే యమదూతైశ్చ సమ్యక్ సంతాడ్యమానే తప్తదండైశ్చ మూఢ ।**
**దంతం విహాయైవ చ విఘ్నరాజః పలాయితః కుత్ర మే త్వం వద త్వమ్ ॥133॥**

చక్కగా ఉండగా, ఓరీ మూఢుడా! యమదూతలచే కాలిన దండాలతో(కాగడాలతో) గట్టిగా కొట్టబడుతూ ఉండగా ఆ విఘ్నరాజు దంతాన్ని (ఆయుధాన్ని) విడిచి ఎక్కడకు పారిపోయాడో నువ్వే చెప్పు.

**వివాహకాలే పిష్టదేవీం సుభక్త్యాసంపూజయిత్వా విద్యమానో గృహే స్వే ।**
**యదా తదా యమదూతైశ్చ బద్ధ్వా (వద్ధ్వా) సంపీడ్యమానో యమమార్గే స మూఢః ॥134॥**

వివాహకాలమందు పిష్టదేవిని మిక్కిలి భక్తితో పూజించి, తన యింటిలోనే ఉండగా, ఆ సమయంలో యమ కింకరులచే బంధింపబడి, యమమార్గంలో ఆ మూఢుడు పీడింపబడుతూ ఉండగా....

**పిష్టదేవీ పీడ్యమానం చ భక్తం విహాయ సా కుత్ర పలాయితాஉభూత్ ।**
**వివాహకాలే రజకస్య గేహం గత్వా సమ్యక్ ప్రార్థయిత్వా చ మూఢః ॥135॥**

అప్పుడు ఆ పిష్టదేవి పీడింపబడుతున్న తన భక్తుని విడిచిపెట్టి, ఆమె ఎక్కడకు పారిపోయింది? ఆ మూఢుడు వివాహకాలంలో రజకుని ఇంటికి వెళ్లి చక్కగా ప్రార్థించి....

**య స్తంభసూత్రం కలశే పరీత్యపూజాం కృత్వా విద్యమానో గృహే స్వే ।**
**యదా తదా యమదూతైశ్చ సమ్యక్తం స్తంభసూత్రం తస్య ముఖే నిధాయ ॥136॥**

స్తంభసూత్రాన్ని కలశంలో చుట్టి ఉంచి, పూజ గావించి, తన గృహంలో ఉంటూ ఉండగా, అప్పుడు యమకింకరుడు వచ్చి చక్కగా ఆ స్తంభసూత్రాన్ని అతని ముఖంలో కుక్కివేసి....

**సంతాడ్యమానే స్తంభసూత్రస్థదేవీ పలాయితా కుత్ర మే సంవదస్వ ।**
**వివాహకాలే పూజయిత్వా చ సమ్యక్ చండాలదేవీం భక్తవశ్యాం చ తస్యాః ॥137॥**

కొడుతూ ఉండగా, ఆ స్తంభసూత్రంలో ఉన్న ఆ దేవి ఎక్కడకు పారిపోయిందో నాకు చెప్పు. వివాహకాలంలో భక్తవశంకరి అయిన ఆ చండాలదేవిని భక్తితో పూజించి....

**తద్భక్తవర్యైః శూర్పమధ్యే చ తీరే సంసేవయిత్వా విద్యమానే గృహే స్వే ।**
**యదా తదా యమదూతైశ్చ బద్ధ్వా సంతాడ్యమానో యమమార్గే మహద్భిః ॥138॥**

ఆమెను భక్తశ్రేష్ఠులు శూర్పమధ్యభాగమునందును, తీరభాగమునందును సేవించి, తమ ఇంటిలో ఉండగా, ఆ సమయంలో యమమార్గంలో గొప్పవారైన యమకింకరులచే బంధింపబడి, కొట్టబడుతూ ఉండగా....

**చండాల దేవీ క్వ పలాయితాభూత్ సుమూఢ బుద్ధే విష్ణుపాదం భజస్వ ।**
**జ్వరాదిభిః పీడ్యమానే స్వపుత్రే గృహే స్థితం బ్రహ్మదేవం చ సమ్యక్ ॥139॥**

ఓరీ! మిక్కిలి మూఢబుద్ధీ! ఆ చండాలదేవి ఎక్కడకు పారిపోయింది? కాబట్టి విష్ణుపాదాలను సేవించు. జ్వరాదులతో పీడింపబడుతూ, తన పుత్రుని గృహమందున్న బ్రహ్మదేవుని భక్తితో....

**ధూపైర్దీపైర్భక్ష్య భోజ్యైశ్చ పుష్పైః పూజాం కృత్వా విద్యమానశ్చ గేహే ।**
**యదా తదా యమదూతైశ్చ బద్ధ్వా సంతాడ్యమానే వేణుపాశాదిభిశ్చ ॥140॥**

ధూపాలతో, దీపాలతో, భక్ష్యాలతో, భోజ్యాలతో, పుష్పాలతో పూజచేసి, ఇంటిలో ఉండగా, అప్పుడు యమదూతలచే బంధింపబడి, వెదురులతోను, పాశాలతోను పీడింపబడుతుంటే....

**స బ్రహ్మదేవః క్వ పలాయితోஉభూత్ సుమూఢబుద్ధే విష్ణుపాదం భజస్వ ।**
**సంతానార్థం బృహతీం పూజయిత్వా గలేన బద్ధ్వా బృహతీం వై ఫలం చ ॥ 141**

ఓరీ మూఢబుద్ధీ! ఆ బ్రహ్మదేవుడు ఎక్కడకు పలాయితుడయ్యాడు? కాబట్టి విష్ణుపాదాలను సేవించు. సంతానం కోసం బృహతిని (వాకుడు చెట్టును) పూజించి, ఆ వాకుడుకాయను కంఠంలో బంధించుకొని....

**సంతిష్ఠమానే యమదూతైశ్చ బద్ధ్వా సంతాడ్యమానే బృహతీ కంటకైశ్చ ।**
**తదా దేవీ బృహతీ మూఢబుద్ధేపలాయితా కుత్ర మే తద్వద త్వమ్ ॥142॥**

ఉండగా, యమదూతలచే బంధింపబడి, వాకుడు చెట్ల యొక్క ముండ్లచే కొట్టబడుతూ ఉంటే, ఓరీ మూఢబుద్ధీ! అప్పుడు ఆ బృహతీదేవి ఎక్కడకు పారిపోయిందో, దానిని నువ్వే చెప్పు....

**భజస్వ మూఢ పరదైవతం చ నారాయణం తారకం సర్వదుఃఖాత్ ।**
**సుక్షుద్రదేవేషు మతిం చ మా కురు న చ శృణు త్వం ఫల్గువాక్యం తథైవ ॥143॥**

ఓరీ మూఢా! సమస్త దుఃఖాలనుండి తరింపజేసే, పరమదైవమైన నారాయణుని పూజించు. మిక్కిలి తక్కువయైన దేవతలయందు బుద్ధిని లగ్నం చేయవద్దు. అలాగే సారంలేని వాక్యాలను(మాటలను) నీవు వినవద్దు.

**సుక్షుద్రదేవాన్ భిందిపాలే నిధాయ విసర్జయిత్వా దూరదేశే మహాత్మన్ ।**
**సంధార్య త్వం  స్వకులాచార ధర్మం సంపాతనే నరకం హేతుభూతమ్ ॥144॥**

మిక్కిలి క్షుద్రదేవతలను భిందిపాలంలో (నరికే వారిని రక్షించే దానియందు) ఉంచి, మహాత్మా! దూరంగానున్న ప్రదేశంలో  విడిచిపెట్టి, నీవు స్వకులాచారధర్మం శిరసా ధరించి, నరకానికి కారణభూతమైన దానిని దూరంగా పడవేసి....

**పునీహి గాత్రం సర్వదా మూఢబుద్ధే మంత్రాష్టకైర్జన్మతీర్థే పవిత్రే ।**
**హృది స్థితాం మౌర్ఖ్యముద్రాం విహాయ కృత్వా భూషాం విష్ణుముద్రాభిరగ్ర్యామ్ ॥145॥**

మూఢబుద్ధీ! హృదయంలో శాశ్వతంగా ఉండిపోయిన మూర్ఖముద్రను విడిచిపెట్టి, విష్ణుముద్రలచే శ్రేష్ఠమైన భూషణాలు ధరించి, పవిత్రజన్మ తీర్థంలో(గంగలో) స్నానమాడి, అష్టాక్షరీమంత్రాలతో ఎల్లప్పుడు శరీరాన్ని పవిత్రం చేసుకొమ్ము.

**సదా మూఢో హరివార్తాం భజస్వ (సదాఽ మూఢో)హ్యాయుర్గతం వ్యర్థమేవం కుబుద్ధ్యా ।**
**సద్వైష్ణవానాం సంగమో దుర్లభశ్చక్షుబ్ధం జ్ఞానం తారతమ్యస్వరూపమ్ ॥146॥**

ఇప్పుడు అమూఢుడవై (బుద్ధిమంతుడవై) హరిప్రసంగాన్ని సేవించు. మూఢబుద్ధిచే ఇలా ఆయువు వ్యర్థమై గతించింది. (లేదా మూఢుడవై హరిని సేవించు అనెడి కుబుద్ధితో ఆయువు వ్యర్థమై గతించింది.) సద్వైష్ణవుల యొక్క సంగమం దుర్లభం సుమా! తారతమ్యస్వరూపంతో జ్ఞానం క్షుబ్ధమవుతుంది. (కలతపెట్టబడింది.)

**హరిం గురుం హ్యనుసృత్యైవ సత్యం గతిం స్వకీయాం తేన  జానీహి మూఢ ।**
**దగ్ధ్వా దుష్టాం బుద్ధిమేవం చ మూఢసు బుద్ధిరూపం మా భజస్వైవ నిత్యమ్ ॥147॥**

మూఢుడా! గురువైన హరిని అనుసరించి, అతనివలన స్వస్వరూపమైన సత్యగతిని తెలిసికొమ్ము. ఓరీ మూఢుడా! దుష్టబుద్ధిని ఈ భావనతో దహింపజేసికొని, నిత్యమూ నా సుబుద్ధిరూపాన్ని భజించు.

**మయా సార్ధం సద్గురుం ప్రాప్య సమ్యగ్ వైరాగ్యపూర్వం తత్త్వమాత్రం విదిత్వా ।**
**తేనైవ మోక్షం ప్రాప్నుమో నార్జవైర్యత్తార్యా విష్ణోః సుప్రసాదాచ్చ లక్ష్మ్యాః ॥148॥**

నాతో కలిసి, అంతేకాక సద్గురువును కూడ పొంది, వైరాగ్య ప్రధానమైన తత్త్వలక్షణాన్ని తెలిసికొని, దానితో మోక్షం పొందు. అది ఋజుదేవతలవల్ల వచ్చేది కాదు. విష్ణువుయొక్క గొప్ప అనుగ్రహంవలననే లక్ష్మికికూడ ఆ శక్తి ఉంది. కావున వారట్లు ఉన్నారు.

**ఇత్యాశయం మనసా సన్నిధాయతథాచోక్తం భక్తవర్యో మదీయః ।**
**అతో భక్తః ప్రవహేత్యేవ సంజ్ఞామవాప వీంద్ర ప్రకృతం తం శృణు త్వమ్ ॥149॥**

ఇంతటి అభిప్రాయం మనస్సులో ఉంచుకొని, అతడు నా భక్తశ్రేష్ఠుడని నీకు చెప్పబడింది. అందువల్లనే ఆ భక్తుడు "ప్రవహుడు" అనే పేరును పొందాడు. పక్షీంద్రా! ఇక ఆ ప్రస్తుతస్థితిని విను.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే తారతమ్య నిరూపణద్వారా విష్ణోరేవోపాస్యత్వమిత్యర్థనిరూపణం నామాష్టావింశతమోఽధ్యాయః ॥28॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండలో కృష్ణగరుడసంవాదంలో తారతమ్యనిరూపణం ద్వారా విష్ణువే ఉపాసింపదగిన తత్త్వం అనే అర్థాన్ని నిరూపించే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## **ఏకోనత్రింశోఽధ్యాయః** – ఇరవై తొమ్మిదవ అధ్యాయం

## **తత్త్వరహస్యమ్** – తత్త్వరహస్యవివేచనం

**ప్రవహానంతరాన్వక్ష్యే శృణు పక్షీంద్రసత్తమ ।**
**యో ధర్మో బ్రాహ్మణః పుత్రో హ్యాదిసృష్టౌ త్వగుద్భవః ॥1॥**

పక్షీంద్ర శ్రేష్ఠమా! ప్రవహుని తరువాత పుట్టిన వారి గురించి చెప్తున్నాను ఆకర్ణించు. ఆదిసృష్టియందు బ్రహ్మకు కుమారుడై త్వక్కునుండి ధర్ముడు ఉద్భవించాడు.

**సజ్జనాన్ సౌమ్యరూపేణ ధారణాద్ధర్మనామకః ।**
**స ఏవ సూర్యపుత్రోఽభూద్యమసంజ్ఞామవాప సః ॥**
**పాపినాం శిక్షకత్వాత్స యమ ఇత్యుచ్యతే బుధైః ॥2॥**

సజ్జనులను సౌమ్యరూపంతో ధరించుటవలన ధర్ముడు అనే పేరుగలవాడయ్యాడు. అతడే సూర్యుని పుత్రుడయ్యాడు. యముడనే పేరును పొందాడు. అతడు పాపులను శిక్షించుట వల్ల బుధులచే యముడుగా పేర్కొనబడినాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** – శ్రీకృష్ణుడు వచించాడు.

**ప్రహ్లాదానంతరం గంగా భార్యా వై వరుణస్య చ ।**
**ప్రహ్లాదాదధమా జ్ఞేయా మహిమ్నా వరుణాధికా ॥3॥**

ప్రహ్లాదుని తరువాత వరుణుని భార్య గంగయు, మహిమలో ప్రహ్లాదునికన్న తక్కువ, వరుణునికన్న ఎక్కువగా తెలియబడుతున్నారు.

**స్వరూపాదధమా జ్ఞేయా నాత్ర కార్యా విచారణా ।**
**జ్ఞానస్వరూపదం విష్ణుం యమో జానాతి సర్వదా ॥4॥**

స్వరూపం వల్ల తక్కువగా చెప్పబడుతున్నారు. ఇందు ఆలోచింపవలసిందేమీ లేదు. జ్ఞానస్వరూపాన్ని ఇచ్చే విష్ణువును ఎల్లప్పుడు యముడు తెలిసికొని యున్నాడు.

**అతో గంగేతి సా జ్ఞేయా సర్వదా లోకపావనీ ।**
**భక్త్యా విష్ణుపదీత్యేవ కీర్తితా నాత్ర సంశయః ॥5॥**

గంగ ఎల్లప్పుడు లోకాలను పవిత్రం చేసేదిగా చెప్పబడుతోంది. భక్తితో (ప్రీతితో) విష్ణుపది అని కూడ కీర్తింపబడుతోంది. ఇందు సందేహం లేదు.

**యా పూర్వకాలే యజ్ఞలింగస్య విష్ణోః సాక్షాద్ధరే ర్విక్రమతః ఖగేంద్ర ।**
**వామస్య పాదస్య నఖాగ్రతశ్చ నిర్భిద్య చోర్ధ్వాండకటాహ ఖండమ్ ॥6॥**

**తదుదర మతివేగాత్స్రప్రవిశ్యావహంతీం జగదఘతతిహంతుః పాదకింజల్కశుద్ధామ్ ॥**
**నిఖిలమలనిహంత్రీం దర్శనాత్స్పర్శనాచ్చ సకృదవగహనాద్వా భక్తిదాం విష్ణుపాదే ॥**
**శశికరవరగౌరాం మీననేత్రాం సుపూజ్యాం స్మరతి హరిపదోత్థాం మోక్షమేతి క్రమేణ ॥7॥**

పూర్వకాలంలో ఖగేంద్రా! యజ్ఞస్వరూపుడైన విష్ణువుయొక్క, సాక్షాత్తుగా హరియొక్క విక్రమంవలన వామపాదంయొక్క గోటికొన ద్వారా బ్రహ్మాండకటాహం బ్రద్దలయి ముక్కలై, దాని మధ్యనుండి మిక్కిలి వేగంతో ప్రవేశించి, ప్రవహించి జగత్తులోని పాపరాశులను నశింపజేసే, హరిపాదకింజల్కాలచే పరిశుద్ధమైన, దర్శనంవల్ల కాని స్పర్శనంవల్ల కాని సకలమాలిన్యాన్ని తొలగించే, భక్తిదాయకమైన విష్ణుపాదమందు (విష్ణుపది యందు) ఒక్కసారి స్నానమాచరిస్తే చంద్రకిరణాలవలె గౌరవర్ణం మీనాలవంటి నేత్రాలుగలిగి, మిక్కిలి పూజింపదగిన, హరి పాదంనుండి పైకి వచ్చిన గంగను స్మరిస్తే, క్రమంగా మోక్షం పొందుతాడు.

**ఇంద్రోఽపి వాయు కరమర్దిత వాయుకూట బిందు చ ప్రాశ్య శిరసి హ్యసహిష్ణుమానః ।**
**భాగీరథీ హరిపదాంకమితి స్మ నిత్యం జానన్ మహాపరమభాగవతప్రధానః ॥**
**భక్త్యా చ స్విన్నహృదయః పరమాదరేణ ధృత్వా స్వమూర్ధ్ని పరమో హ్యశివః శివోఽభూత్ ॥8॥**

ఇంద్రుడు కూడ శిరస్సునందు మోయలేక, వాయుతరంగాలచే మర్దింపబడి, వాయుసమూహ బిందువులనారగించి భాగీరథి హరిపాదచిహ్నాలతో కూడినదని నిత్యమూ తెలిసికొన్నవాడై, మిక్కిలి ఉత్కృష్టులైన భాగవతులలో ప్రధానమైనవాడయ్యాడు. మిక్కిలి ప్రీతితో కూడిన భక్తితో ప్రస్విన్నహృదయుడై గంగను తన శిరస్సున ధరించి, తాను అశివుడైనను, పరమశివుడయ్యాడు.

**భాగీరథ్యాశ్చ చత్వారి రూపాణ్యాసన్ ఖగేశ్వర ।**
**మహాభిషగ్జనేంద్రస్య భార్యా తు హ్యభిషేచనీ ॥9॥**

ఖగరాజా! భాగీరథికి నాలుగు రూపాలు ఉన్నాయి. మహాభిషక్కు అనే పేరుగల రాజేంద్రునియొక్క భార్య గంగయే.

**ద్వితీయేనైవ రూపేణ గంగా భార్యా చ శంతనోః ।**
**సుషేణా వై సుశేణస్య భార్యా సా వానరీ స్మృతా ॥10॥**

రెండవ రూపంతో గంగ శంతను మహారాజుకు భార్య అయింది. సుషేణుని భార్య అయిన సుషేణ అనే పేరుగల వానరకాంత గంగగా స్మరింపబడుతోంది.

**మండూకభార్యా గంగా తు సైవ మండూకినీ స్మృతా ।**
**ఏవం చత్వారి రూపాణి గంగాయా ఇతి కీర్తితమ్ ॥11॥**

మండూకుని భార్యయైన మండూకిని కూడ ఆ గంగగానే పేర్కొనబడింది. ఈవిధంగా గంగ నాలుగు రూపాలు కలిగి యున్నట్లు కీర్తింపబడింది.

**ఆదిత్యాచ్చైవ గంగాతః పర్జన్యః సముదాహృతః ।**
**ప్రవర్షతి సువైరాగ్యం హ్యతః పర్జన్యనామకమ్ ॥12॥**

ఆదిత్యుని వలన గంగనుండి పర్జన్యుడు ఏర్పడినాడు. గొప్ప వైరాగ్యాన్ని మిక్కిలి వర్షించువాడుగా "పర్జన్యుడు" అనే పేరు పొందాడు.

**శరం వరాయ పంచజన్యాచ్చ పంచహిత్వా జగ్ధ్వా గర్వకం షట్క్రమేణ ।**
**స్వబాణస్య స్వహృది సంస్థితస్యభజేత్సదా నైవ భక్తిం విషం చ ॥13॥**

పంచేంద్రియాలనుండి పంచవిషయాలను, బాణాన్ని విడిచి వేరుపరచి క్రమంగా ఆరు గర్వాలను దగ్ధంచేసి, తన బాణాన్ని తన హృదయంపై గురిపెట్టి ఎల్లప్పుడు వైరాగ్యంకోసం సేవనంచేయాలి కాని, విషంపై భక్తి (ప్రీతి) కలిగి యుండరాదు. (విషయం)

**లింగం పుష్టం నైవ కార్యం సదైవలింగం పుష్టం కార్యమేవం సదాపి ।**
**యోనౌ సక్తి ర్నైవ కార్యా సదాపియోనౌ ముక్తేఽ సంగతో యాతి ముక్తిమ్ ॥14॥**

ఎల్లప్పుడు లింగాన్ని పుష్టిగా ఉంచే పని చేయరాదు. కాని ఎప్పుడు దానిని(దేహయాత్రకై) పుష్టిగానే ఉంచాలి. ఎల్లప్పుడు యోని యందు ఆసక్తి చూపే పని చేయరాదు. యోని యందు ఆసక్తి విడిచిపెడితే అసంగత్వం వల్ల ముక్తిని పొందుతాడు.

**వైరాగ్యమేవం ప్రకరోత్యేవ నిత్యం అతః పర్జన్యస్త్వంతకః పక్షివర్య ।**
**ఏతావతా శరభాఖ్యో మహాత్మా స చాంతరో స తు పర్జన్య ఏవ ॥15॥**

పక్షిశ్రేష్ఠుడా! ఈ విధంగా నిత్యమూ వైరాగ్యం కలుగజేస్తాడు. అందువల్ల పర్జన్యుడు అంతకుడే. ఇంతకూ శరభుడనే మహాత్ముడు మనలోపలనే ఉన్నాడు అతడే పర్జన్యుడు.

**శశ్వత్కేశా యస్య గాత్రే ఖగేంద్రప్రభాస్యంతే శరభాఖ్యో పయోతః ।**
**యమస్య భార్యా శ్యామలా యా ఖగేంద్రయస్మాత్సదా కలిభార్యా ప్రియా చ ॥16॥**

పక్షీంద్రా! ఎవని శరీరమందు ఎల్లప్పుడు కేశాలు ప్రకాశించియుంటాయో, అతడు శరభుడనే పేరుగల (పయోతుడు) పయస్సు అయ్యాడు. అందువల్ల యముని భార్య అయిన శ్యామల ఎల్లప్పుడు కలికి ప్రియమైన భార్య.

**మత్వా సమ్యక్ మానసం యా కరోతిహ్యతశ్చ సా శ్యామలా సంజ్ఞకాభూత్ ।**
**మలం వక్ష్యే హరిభక్తేర్విరోధీసులోహ పాత్రే సన్నిధానం చ తస్య ॥17॥**

**తద్వైష్ణవైస్త్యాజ్యమేవం సదైవవస్త్రం దగ్ధం సంధిజం చైవ జన్యమ్ ।**

చక్కగా ఆలోచించి మానసిక క్రియ చేస్తుంది కాబట్టి ఆమెకు శ్యామల అను పేరు. ఇక మాలిన్యాన్ని గురించి చెబుతున్నాను. హరిభక్తికి విరోధియైనవాడు లోహపాత్రలో అతని సన్నిధానంలో, సంధి కాలంలో కాలిన బట్టను ఉంచాలి. అది ఎల్లప్పుడు వైష్ణవులచే విడిచిపెట్టదగింది.

**చికిత్సితం పరమదుఃఖం ఖగేంద్ర హరేర్భక్తై స్త్యాజ్యమేవం సదైవ ॥18॥**

ఖగరాజా! శత్రువుల దుఃఖానికి(ఇతరుల)చికిత్స చేయాలి. అది ఎల్లప్పుడు హరిభక్తులచే విడిచిపెట్టదగింది. (ప్రాయశ్చిత్త క్రియ)

**నోచ్చాశ్చ తే హరిభక్తైర్విహీనాస్తేషాం సంగో నైవ కార్యః సదాపి ।**
**పురాణ సంపర్క విసర్జనం చ పురాణతాలం చ పురాణవస్త్రమ్ ॥19॥**

**సుజీర్ణ కంథాజిన మేఖలం చ యజ్ఞోపవీతం చ కలిప్రియం చ ।**
**ప్రియం గృహం చోర్ణవితానికం చ సమిత్కుశైః పూరితం కుత్సితం చ ॥20॥**

హరిభక్తి విహీనులైనవారు ఉన్నతులు కారు. ఎప్పుడూ వారితో సాంగత్యం చేయదగింది కాదు. పాతకాలంవాటితో సంబంధం ఉన్నవాటిని విసర్జించాలి. పాతకాలంనాటి తాలాన్ని (పచ్చని ఖనిజం), పాతదైన వస్త్రాన్ని, మిక్కిలి చినిగిపోయిన బొంత, లేడి చర్మం, మేఖల, జీర్ణయజ్ఞోపవీతం, సాలెగూళ్లచే చాందినిగా ప్రియంగా కప్పబడింది. పనికిరాని (చివికిపోయిన) సమిధలు, దర్భలు వీటితో నిండి జుగుప్స కలిగించే ఇల్లు కలికి ప్రియమైనది.

**సర్వంచైతత్ కలిభార్యా ప్రియం చ నైవ ప్రియం శార్ఙ్గపాణేః కదాచిత్ ।**
**కాంస్యే సుపక్వం యావనాలస్య చాన్నం తుషః పిణ్యాకం తుంబ బిల్వే పలాండుః ॥21॥**

ఇటువంటిదంతా, కలిభార్యకు ప్రియమైనది. శార్ఙ్గపాణియైన హరికి ఎప్పుడూ కూడ ఇష్టమైనది కాదు. కాంస్య పాత్రల యందు యవధాన్యపు మొక్కల అన్నం, తాండ్రముద్ద, ఆనుగాకు నందు వెల్లుల్లి, (పులిసిన మజ్జిగ, రసహీన పదార్థం, మిక్కిలి కారం, ఎక్కువవేడి ఇవన్నీ కలి భార్యకు ప్రియమైనవి).

**దీర్ఘం తక్రం స్వాదుహీనం కటూష్ణమేతే సర్వే కలిభార్యా ప్రియాశ్చ ।**
**సుదుర్ముఖం నిందనం చార్యజానాం సతోఽవమత్యాత్మజానాం ప్రసహ్య ॥22॥**

పులిసిన మజ్జిగ, రసహీన పదార్థం, మిక్కిలి కారం, ఎక్కువవేడి ఇవన్నీ కలి భార్యకు ప్రియమైనవి. మిక్కిలి చెడ్డదైన ముఖం కలిగి, పెద్దవారి(పూజ్యుల) వల్ల పుట్టిన వారిని, సత్పురుషులను నిందించే తన సంతానాన్ని సహిస్తుంది,

**సుపీడనం సర్వదా భర్తృవర్గే గృహస్థిత వ్రీహివస్త్రాది చౌర్యాత్ ।**
**ప్రకీర్ణ భూతాన్మూర్ధజాన్ సందధానం కరైర్యుతం దేవ కలిప్రియం చ ॥23॥**

ఎల్లప్పుడు భర్తకు సంబంధించిన వారిని మిక్కిలిగా పీడించడం, ఇంటిలో ఉండే ధాన్యంను, వస్త్రాలు మున్నగువాటిని దొంగిలించటం, వెంట్రుకలను చేతులమీదికి విరబోసుకోవటం ఇవన్నీ కలి దేవునికి ప్రియమైనవి.

**ఇత్యాది సర్వం కలిభార్యా ప్రియం చ సునిర్మలం ప్రకరోత్యేవ సర్వమ్ ।**
**అతశ్చ సా శ్యామలేతి స్వ సంజ్ఞాం అవాప సా దేవకీ సంబభూవ ॥24॥**

ఇటువంటిదంతా, కలిభార్యకు ప్రియమైనదానినంతా, మిక్కిలి నిర్మలంగా ఎప్పుడూ చేస్తుంది. అందువల్ల ఆమె శ్యామల అను పేరు పొందినది. ఆమెయే దేవకిగా జన్మించింది.

**యుధిష్ఠిరస్యైవ బభూవ పత్నీసంభావితా తత్ర చ దేవకీ సా ।**
**చంద్రస్య భార్యా రోహిణీ వై తదేయమ్ అశ్విన్యాదిభ్యోఽ హ్యధికా సర్వదైవ ॥25॥**

ఆమె యుధిష్ఠిరునకు పత్నిఅయ్యింది. అక్కడ ఆ దేవకి బాగా మన్ననపొందింది. చంద్రుని భార్య రోహిణిగా ఈమె అశ్వినిమున్నగు వారికన్న ఎల్లప్పుడు అధికురాలుగా ఉండేది.

**రోణీం ధృత్వా రోహతి యోగ్యస్థానం తస్మాచ్ఛ సా రోహిణీతి ప్రసిద్ధా ।**
**ఆదిత్య భార్యానామ సంజ్ఞా ఖగేంద్రజ్ఞేయా సా నారాయణస్య స్వరూపా ॥26॥**

రోహిణి (ఒకానొక మణి) ధరించి, యోగ్యమైన స్థానాన్ని అధిరోహించింది గావున రోహిణి అనుపేరుతో ప్రసిద్ధురాలయ్యింది. పక్షీంద్రా! ఆదిత్యునిభార్య సంజ్ఞ అనేపేరు కల్గినది. ఆమె నారాయణస్వరూపురాలు

**సంజానాతీత్యేవ సంజ్ఞామవాపసంజ్ఞేతి లోకే సూర్యభార్యా ఖగేంద్ర ।**
**బ్రహ్మాండస్య హ్యభిమానీ తు దేవో విరాడితి హ్యభిధామాప తేన ॥27॥**

పక్షీంద్రా! చక్కగా తెలిసికొన్నది కావున సూర్యుని భార్యయైన సంజ్ఞ లోకమందు ఆ పేరును పొందింది. బ్రహ్మాండాన్ని అభిమానించే దేవుడయితే, ఆ కారణంచే "విరాట్" (విరాట్టు) అనే పేరును పొందాడు.

**గంగాది షట్కం సమమేవ నిత్యం పరస్పరం నోత్తమం నాధమం చ ।**
**ప్రధానాగ్నేః పావికాన్యేవ గంగా సదా శుభా నాత్ర విచార్యమస్తి ॥28॥**

గంగ మున్నగువారు ఆరుగురును ఎల్లప్పుడును సమానంగా నుండేవారే, పరస్పరం ఉత్తమత్వమూ లేదు. అధమత్వమూ లేదు. ప్రధానాగ్నిని పవిత్రం చేసేవే (చేసేవారే అందరు) అన్నీ వీరిలో గంగ ఎల్లప్పుడు పవిత్రురాలు. ఆలోచించవలసింది లేదు.

**ఆసాం జ్ఞానాత్ పుణ్యమాప్నోతి నిత్యం సదా హరిః ప్రీయతే కేశవోఽ లమ్ ।**
**గంగాదిభ్యో హ్యవరాహ్యగ్నిజాయాస్వాహా సంజ్ఞాది గుణా నైవ హీనా ॥29॥**

వీరిని గురించి తెలుసుకొనుటవలన నిత్యమూ పుణ్యం పొందుతాడు. ఎల్లప్పుడు కేశవుడైన హరి కూడ సంపూర్ణమైన ప్రీతిని పొందుతాడు. అగ్ని భార్యయైన స్వాహా(దేవి) అనే ఆమె గంగాదుల కన్న తక్కువదైనా, గుణాలను అనుసరించి మాత్రం తక్కువదైనది కాదు.

**స్వాహాకారో మంత్ర రూపాభిమానీస్వాహేతి సంజ్ఞామాప సదైవ వీంద్ర ।**
**అగ్నేర్భార్యాతో బుద్ధిమాన్ సంబభూవబ్రహ్మాభిమానీ చంద్రపుత్రో బుధశ్చ ॥30॥**

పక్షీంద్రా! స్వాహాకారమంత్రరూపాన్ని అనుసరించినందువల్ల ఎల్లప్పుడు ఆమె 'స్వాహా ' అను పేరును పొందింది. అగ్నికి భార్యవలన బుద్ధిమంతుడు కలిగాడు. చంద్రుని పుత్రుడైన బుధుడు బ్రహ్మను అభిమానించేవాడు.

**బుద్ధ్వా హరద్వై రాష్ట్రజాతం చ సర్వం ధృతం తతో బుధసంజ్ఞామవాప ।**
**ఏవం చాభూదభిమన్యుర్మహాత్మా సుభద్రాయా జఠరే హ్యర్జునాచ్ఛ ॥31॥**

విశ్వంలో పుట్టిన దానినంతను బుద్ధిచే గ్రహించి, ధరించినవాడు కావున బుధుడనే పేరు పొందాడు. ఈ విధంగా అర్జునునివలన సుభద్రకడుపున మహాత్ముడైన అభిమన్యుడు జన్మించాడు.

**కృష్ణస్య చంద్రస్య యమస్య చాంశైః స సంయుత స్తశ్వినోర్వై హరస్య ।**
**స్వాహాధమశ్చంద్రపుత్రో బుధస్తుపాదారవిందే విష్ణుదేవస్య భక్తః ॥32॥**

కృష్ణుని యొక్కయు, చంద్రుని యొక్కయు, యముని యొక్కయు, అశ్వినులయొక్కయు, హరునియొక్కయు అంశలతో కూడుకొన్నవాడతడు. చంద్రపుత్రుడైన బుధుడయితే స్వాహాదేవికన్న తక్కువవాడైనా, విష్ణుదేవుని పాదారవిందాలయందు భక్తి కల్గినవాడు.

**నామాత్మికాత్వశ్విభార్యా ఉషా నామ ప్రకీర్తితా ।**
**బుధాధమా సా విజ్ఞేయా స్వాహా దశగుణాధమా ॥33॥**

అశ్వి భార్య "ఉషా" అనే పేరుతో సార్థక నామం వల్లనే కీర్తింపబడినది. ఆమె బుధుని కన్న తక్కువది స్వాహాకన్న పది పాళ్లు తక్కువది.

**నకులస్య భార్యా మాగధస్యైవ పుత్రీశల్యాత్మజా సహదేవస్య భార్యా ।**
**ఉభే హ్యేతే అశ్విభార్యా హ్యుషాపి ఉపాసతే షడ్గుణం విష్ణుమాద్యమ్ ॥**
**అతోఽ ప్యుషా సంజ్ఞకా సా ఖగేంద్ర అనంతరాఞ్ఛృణు వక్ష్యే మహాత్మన్ ॥34॥**

నకులుని భార్య మాగధుని కుమార్తె. సహదేవుని భార్య శల్యుని కుమార్తె. వీరిరువురు అశ్విభార్యయైన ఉషయు ఆరు రెట్లు ఎక్కువగా ఆద్యుడైన విష్ణుని ఉపాసిస్తారు. ఖగేంద్రా! అందువల్ల కూడ ఆమె ఉష అను పేరు పొందింది. మహాత్మా ఆ తరువాతి వారినిగురించి చెబుతున్నాను. విను.

**తతః శక్తిః పృథివ్యాత్మా శనైశ్చరతి సర్వదా ।**
**అతః శనైశ్చరో నామ ఉషాయాశ్చ దశాధమః ॥35॥**

అంత పృథివి రూపశక్తి ఎల్లప్పుడు నెమ్మదిగా సంచరిస్తుంది. అందువల్ల శనైశ్చరుడనే పేరు వచ్చింది. ఇటువంటి వారు ఉష కన్న పది పాళ్లు తక్కువవారు.

**కర్మాత్మా పుష్కరో జ్ఞేయః శనేరథ యమో యతః ।**
**నయాభిమానీ పురుషః కించిన్న్యూనో దశావరః ॥36॥**

కర్మ స్వరూపుడు పుష్కరుడని చెప్పబడినాడు. శనికి తరువాత చెప్పబడినవాడు యముడు. నయాన్ని అభిమానించే పురుషుడతడు. కొంచెం తక్కువవాడు. పది పాళ్లు తక్కువవాడు.

**హరిప్రీతికరో నిత్యం పుష్కరే క్రీడతే యతః ।**
**అతస్తు పుష్కలో నామ లోకే స పరికీర్తితః ॥37॥**

నిత్యమూ పుష్కరంలో (నీటిలో) క్రీడించే కారణంవల్ల, హరికి సంప్రీతి కలుగజేసేవాడయ్యాడు. అందువల్ల లోకంలో అతడు పుష్కలుడనే పేరుతో కీర్తింపబడినాడు.

**హరిప్రీతికరాన్ ధర్మాన్ వక్ష్యే శృణు ఖగాధిప ।**
**ప్రాతఃకాలే సముత్థాయ స్మరేన్నారాయణం హరిమ్ ॥38॥**

ఖగరాజా! హరికి సంప్రీతిని కలిగించే ధర్మాలను చెబుతున్నాను. విను. ప్రభాతసమయంలోనే లేచి నారాయణుడైన హరిని స్మరించాలి.

**తులసీ వందనం కుర్యాచ్ఛ్రీ విష్ణుం సంస్మరేత్ ఖగ ।**
**దిణ్మూత్రోత్సర్గకాలే చ హ్యపానాత్మక కేశవమ్ ॥39॥**

ఖగమా! తులసికి వందనం చేయాలి. తరువాత విష్ణువును చక్కగా స్మరించాలి. మలమూత్రవిసర్జన కాలంలో అపానానికి ఆత్మయైన కేశవుని భావించాలి.

**త్రివిక్రమం శౌచకాలే గంగా పానకరం హరిమ్ ।**
**దంతధావనకాలే తు చంద్రాంతర్యామిణం హరిమ్ ॥40॥**

శౌచసమయంలో గంగానదీజలాలను పానయోగ్యంగా జేసిన త్రివిక్రముడైన హరిని, పండ్లుతోముకొనే సమయంలో చంద్రుని అంతరాత్మయైన హరిని స్మరించాలి. (అంతర్నియామకుడు)

**ముఖప్రక్షాలనే కాలే మాధవం సంస్మరేత్ఖగ ।**
**గవాం కండూయనే చైవ స్మరేద్గోవర్ధనం హరిమ్ ॥41॥**

ఖగమా! ముఖాన్ని కడుగుకొనే సమయంలో మాధవుని స్మరించాలి. గోవులను గోకే సమయంలో గోవర్ధనగిరిధారియైన హరిని స్మరించాలి.

**సదా గోదోహనే కాలే స్మరేద్గోపాలవల్లభమ్ ।**
**అనంతపుణ్యార్జిత జన్మకర్మణాం సుపక్వకాలే చ ఖగేంద్రసత్తమ ॥42॥**

**స్పర్శే గవాం చైవ సదా నృణాం వైభవత్యతో నాత్ర విచార్యమస్తి ।**
**యస్మిన్ గృహే నాస్తి సదోత్తమా చ గౌర్యంగణే శ్రీ తులసీ చ నాస్తి ॥ (ర్వ్యై)43॥**

**యస్మిన్ గృహే దేవమహోత్సవశ్చ యస్మిన్ గృహే శ్రవణం నాస్తి విష్ణోః ।**
**తత్సంసర్గాద్యాతి దుఃఖాదికం చ తస్య స్పర్శో నైవ కార్యః కదాపి ॥44॥**

ఆవుపాలు పితికే సమయంలో ఎల్లప్పుడు గోపాలవల్లభుని స్మరించాలి. పక్షీంద్రశ్రేష్ఠమా! అనేక జన్మలయందు సంపాదింపబడిన పుణ్యకర్మలు గొప్పగా ఫలించే సమయంలో నరులు ఎల్లప్పుడు గోవులను స్పర్శనం చేయాలి. (గోస్పర్శనం నరులకు కావాలి.) ఎవని ఇంటిలో ఉత్తమమైన గోవు ఉండదో, ఎవని ముంగిలిలో తులసికూడ ఉండదో, ఎవని ఇంటిలో దేవుని మహోత్సవం ఉండదో, ఎవని ఇంటిలో విష్ణువును గూర్చి శ్రవణం ఉండదో, ఆ ఇంటితో సంసర్గం వల్ల దుఃఖాలను పొందుతారు. కావున ఎల్లప్పుడు దానిని తాకరాదు.

**గోస్పర్శన విహీనస్య గోదోహనమజానతః ।**
**గోపోషణ విహీనస్య ప్రాహుర్జన్మ నిరర్థకమ్ ॥45॥**

గోస్పర్శనం లేక, ఆవుపాలు పితుకుట తెలియక, గోవులను పోషించుట చేయని వాని జన్మ నిరర్థకమని వచిస్తారు.

**గో(గ్రాసమ(ప్రదాతుశ్చ గోపుష్టించాప్యకుర్వతః ।**
**గతిర్నాస్త్యేవ నాస్త్యేవ (గ్రామచాండాలవత్ స్మృతః ॥46॥**

గోవుకు (గ్రాసం ఈయకుండా ఉండేవానికి, గోవును పోషించకుండా ఉండేవానికి ఉత్తమగతిలేదు. లేనేలేదు. అతడు (గ్రామచండాలునిగా పేర్కొనబడతాడు.

**వత్సస్య స్తనపానే చ బాలకృష్ణం తు సంస్మరేత్ ।**
**దధి నిర్మంథనే చైవ మంథాధారం స్మరేద్గిరిమ్ ॥47॥**

పిల్లవాని స్తనపాన సమయంలో బాలకృష్ణుని స్మరించాలి. పెరుగును చిలికేవేళ ఆధారమైన మంథరపర్వతాన్ని స్మరించాలి.

**మృత్తికాస్నాన కాలే తు వరాహం సంస్మరేద్ధరిమ్ ।**
**పుండ్రానాం ధారణే చైవ కేశవాదీంశ్చ ద్వాదశ ॥48॥**

మృత్తికాస్నాన సమయంలో వరాహమూర్తి అయిన హరిని స్మరించాలి. ఊర్ధ్వ పుండ్రాది ధారణ సమయంలో కేశవుడు మున్నగు పండ్రెండుగురిని స్మరించాలి.

**ముద్రాణాం ధారణే చైవ శంఖచక్రగదాధరమ్ ।**
**పద్మం నారాయణీం ముద్రాం క్రుద్ధోల్కాదీంశ్చ సంస్మరేత్ ॥49॥**

ముద్రలను ధరించే సమయంలో శంఖచక్రగదాధారియైన విష్ణువును స్మరించాలి. పద్మాన్ని, నారాయణిని, తత్సంబంధమైన ముద్రను స్మరించాలి. క్రోధ సమయంలో ఉల్కాదులను స్మరించాలి.

**శ్రీరామ సంస్మృతిం చైవ సంధ్యాకాలే ఖగోత్తమ ।**
**అచ్యుతానంతగోవిందా (శ్రాద్ధకాలే చ సంస్మరేత్ ॥ (న్+(శా) 50॥**

ఖగశ్రేష్ఠమా! సంధ్యాసమయంలో శ్రీరాముని సంస్మరించాలి. (శ్రాద్ధ సమయమందు అచ్యుతుని, అనంతుని, గోవిందుని స్మరించాలి.

**(ప్రాణాదిక పంచహోమే చాఽ నిరుద్ధాదీంశ్చ సంస్మరేత్ ।**
**అన్నాద్యర్పణ కాలే తు వాసుదేవం చ సంస్మరేత్ ॥51॥**

(ప్రాణాదికాల పంచ హోమాదివేళ, అనిరుద్ధాదులను సంస్మరించాలి. అన్నాదులను సమర్పించే సమయంలో వాసుదేవుని స్మరించాలి.

**అపోశనస్య కాలే తు వాయోరంతర్గతం హరిమ్ ।**
**వస్త్రధారణకాలే తు ఉపేంద్రం సంస్మరేద్ధరిమ్ ॥52॥**

అపోశనం ఆచరించే సమయంలో వాయువులోనున్న హరిని, వస్త్రధారణ సమయంలో ఉపేంద్రుడైన హరిని స్మరించాలి.

**యజ్ఞోపవీతస్య చ ధారణే తు నారాయణం వామనాఖ్యం స్మరేత్తు ।**
**ఆర్తిక్యకాలే చ తథైవ విష్ణోః సమ్యక్ స్మరేత్ పర్శురామాఖ్య విష్ణుమ్ ॥53॥**

యజ్ఞోపవీతాన్ని ధరించే సమయంలో వామదేవుడనే పేరు కల్గిన నారాయణుని స్మరించాలి. హారతి సమయంలో విష్ణువును స్మరించాలి. ప్రధానంగా భక్తితో పరశు(ర్శు)రాముడనే పేరుగల విష్ణువును స్మరించాలి.

**అపోశనే వైశ్వదేవస్య కాలే తదన్య హోమాదిషు భస్మ ధారణే ।**
**స్మరేత్తు భక్త్యా పరమాదరేణ నారాయణం జామదగ్న్యాఖ్యరామమ్ ॥54॥**

అపోశనమందు, వైశ్వదేవ సమయమందు, మిగిలిన హోమాది క్రియలందు, భస్మాన్ని ధరించే సమయ మందు, మిక్కిలి ప్రీతితో భక్తితో జమదగ్ని పుత్రుడైన పరశురాముడనే పేరు కల్గిన నారాయణుని స్మరించాలి.

**త్రివార తీర్థగ్రహణస్య కాలే కృష్ణం రామం వ్యాసదేవం క్రమేణ ।**
**శంఖోదకస్యోద్ధరణే చైవ కాలే ముకుందరూపం సంస్మరేత్సర్వదైవ ॥55॥**

ముమ్మారు తీర్థాన్ని స్వీకరించే సమయంలో వరుసగా కృష్ణుని, రాముని, వ్యాసదేవుని స్మరించాలి. శంఖోదకాన్ని తీసికొని పానం చేసేవేళ ఎల్లప్పుడూ ముకుందరూపుడైన విష్ణువును స్మరించాలి.

**గ్రాసే గ్రాసే స్మరణం చైవ కార్యం గోవింద సంజ్ఞస్య విశుద్ధమన్నమ్ ।**
**ఏకైక భక్ష్య గ్రహణస్య కాలే సమ్యక్ స్మరేదచ్యుతం వై ఖగేంద్ర ॥56॥**

పరిశుభ్రమైన అన్నమును ఆరగించే సమయంలో ముద్దముద్దకు గోవిందుడనే పేరుగల విష్ణువుని స్మరించడం కర్తవ్యం. పక్షీంద్రా! ఒకే ఒక భక్ష్యమును తినే సమయంలో భక్తితో అచ్యుతుని స్మరించాలి.

**శాకాదీనాం భక్షణే చైవ కాలే ధన్వంతరిం సంస్మరేచ్చైవ నిత్యమ్ ।**
**తథాపరాన్నస్య చ భోగకాలే స్మరేచ్చ సమ్యక్ పాండురంగం చ విష్ణుమ్ ॥57॥**

శాకాదులను భక్షించే సమయంలో నిత్యమూ ధన్వంతరిని స్మరించాలి. అదేవిధంగా పరాన్నభోజన సమయంలో భక్తితో పాండురంగవిభుని స్మరించాలి.

**హైయంగవీనస్య చ భక్షణే వై సమ్యక్ స్మరేత్తాండవాఖ్యం చ కృష్ణమ్ ।**
**దధ్యన్నభక్షే పరమం పురాణం గోపాలకృష్ణం సంస్మరేచ్చైవ నిత్యమ్ ॥58॥**

అప్పటికప్పుడు తీసిన వెన్నను తినే సమయంలో చక్కగా తాండవకృష్ణునిగా పేరొందిన వానిని స్మరించాలి. పెరుగు అన్నం భక్షించే సమయంలో పరమపురుషుడైన గోపాలకృష్ణుని స్మరించాలి.

**దుగ్ధాన్నభోగే చ తథైవ కాలే సమ్యక్ స్మరేచ్ఛ్రీనివాసం హరిం చ ।**
**సుతైల స్పర్శిఃషు విపక్వభక్షసంభోజనే సంస్మరే ద్వ్యంకటేశమ్ ॥59॥**

పాలన్నం ఆరగించే సమయంలో చక్కగా శ్రీనివాసుడైన హరిని స్మరించాలి. శుభ్రమైన నూనె, నేయితో వండిన భక్ష్యాలను భుజించే సమయంలో వ్యంకటేశ్వరుని స్మరించాలి.

**ద్రాక్షా సుజమ్బూ కదలీ రసాలనారింగ దాడింబ ఫలాని చారు ।**
**స్మరేత్తు రంభోత్తమ నారికేల ధాత్రీ సుభోగే ఖలు బాలకృష్ణమ్ ॥60॥**

ద్రాక్ష, నేరేడు, అరటి, తియ్యమామిడి, నారింజ, దానిమ్మ, రంభాఫలం, ఉత్తమమైన నారికేలం, ఉసిరికాయలను చక్కగా భుజించే సమయంలో బాలకృష్ణుని స్మరించాలి.

**సుపానకస్యైవ చ పానకాలే సమ్యక్ స్మరే న్నారసింహాఖ్య విష్ణుమ్ ।**
**గంగామృతస్యైవ చ పానకాలే గంగాతాతం సంస్మరేద్విష్ణుమేవ ॥61॥**

చక్కనైన పానకాన్ని పానం చేసే సమయంలో, భక్తిగా నారసింహుడని పిలువబడే విష్ణువుని స్మరించాలి. గంగామృతాన్ని పానంచేసే కాలంలో గంగాజనన కారకుడై తండ్రి అయిన విష్ణుని స్మరించాలి.

**ప్రయాణకాలే సంస్మరేత్తార్క్ష్యవాహం నారాయణం నిర్గుణం విశ్వమూర్తిమ్ ।**
**పుత్రాదీనాం చుంబనే చైవ కాలే సువేణుహస్తం సంస్మరేత్కృష్ణమేవ ॥62॥**

ప్రయాణం చేసే సమయంలో గరుత్మంతుడు వాహనమైన, విశ్వరూపుడు,నిర్గుణుడైన నారాయణుని స్మరించాలి. తన బిడ్డలను ముద్దు పెట్టుకొనే సమయంలో పిల్లనగ్రోవి చేతియందుకల్గిన కృష్ణుని స్మరించాలి.

**సుసంగకాలే స్వస్త్రియశ్చైవ నిత్యం గోపీకుచద్వంద్వ విలాసినం హరిమ్ ।**
**తాంబూలకాలే సంస్మరేచ్చైవ నిత్యం ప్రద్యుమ్నాఖ్యం వాసుదేవం హరిం చ ॥63॥**

తన భార్యతో సంగమించే సమయంలో నిత్యమూ గోపికాస్తనయుగ్మవిలాసియైన హరిని స్మరించాలి. తాంబూల, సేవన సమయంలో నిత్యమూ ప్రద్యుమ్నుడని పిలువబడే వాసుదేవుడైన హరిని స్మరించాలి.

**శయ్యాకాలే సంస్మరేచ్చైవ నిత్యం సంకర్షణాఖ్యం విష్ణురూపం హరిం చ ।**
**నిద్రాకాలే సంస్మరేత్పద్మనాభం కథాకాలే వ్యాసరూపం హరిం చ ॥64॥**

పరుండే సమయంలో నిత్యమూ సంకర్షణుడని పిలువబడే విష్ణురూపుడైన హరిని స్మరించాలి. నిద్రాకాలంలో పద్మనాభుని స్మరించాలి. కథాసమయంలో వ్యాసరూపుడైన హరిని స్మరించాలి.

**సుగాన కాలే సంస్మరేద్వేణుగీతం హరిం హరిం ప్రవదేత్సర్వదైవ ।**
**శ్రీమత్తులస్యాశ్ఛేదనే చైవ కాలే శ్రీరామరామేతి చ సంస్మరేత్తు ॥65॥**

చక్కని పాటపాడే సమయంలో పిల్లనగ్రోవిని మ్రోయించే(ఊదే) కృష్ణుని హరీ! హరీ! అని నిత్యమూ పలుకుతూ ఉండాలి. చక్కగా తులసిని కోసే సమయంలో“శ్రీరామరామ” అని సంస్మరించాలి.

**పుష్పాదీనాం ఛేదనే చైవ కాలే సమ్యక్ స్మరేత్కపిలాఖ్యం హరిం చ ।**
**ప్రదక్షిణే గారుడాంతర్గతం చ హరిం స్మరేత్సర్వదా వై ఖగేంద్ర ॥66॥**

పుష్పాదులను కోసే సమయంలో కపిలుడని చెప్పబడే హరిని భక్తితో స్మరించాలి. ప్రదక్షిణం చేసే సమయంలో ఖగేంద్రా! గరుడాంతర్గతుడైన హరిని ఎల్లప్పుడూ స్మరించాలి.

**ప్రణామ కాలే దేవదేవస్య విష్ణోః శేషాంతస్థం సంస్మరేచ్చైవ విష్ణుమ్ ।**
**సునీతి కాలే సంస్మరే న్నారసింహం నారాయణం సంస్మరేత్సర్వదాపి ॥67॥**

ప్రణామం చేసే సమయంలో దేవదేవుడైన విష్ణువుకు నమస్కరించేవేళ శేషాంతస్థుడైన విష్ణువును సంస్మరించాలి. చక్కగా నీతినుపదేశించే సమయంలో నారసింహుడైన నారాయణుని ఎల్లప్పుడు భక్తితో స్మరించాలి.

**పూర్తిర్యదా క్రియతే కర్మణాం చ సమ్యక్ స్మరేద్వాసుదేవం హరిం చ ।**
**ఏవం కృతాని కర్మాణి హరి ప్రీతికరాణి చ ॥68॥**

**సమ్యక్ ప్రకుర్వన్నేతాని పుష్కరో హరి వల్లభః ॥69॥**

కర్మల పరిసమాప్తివేళలో వాసుదేవుడైన హరిని భక్తితో స్మరించాలి.ఈ విధంగా చేసిన కర్మలు హరికి ప్రీతిని కల్గిస్తాయి. హరి భక్తుడైన పుష్కరుడు ఈ కర్మలను చక్కగా, భక్తిగా చేస్తూ ఉంటాడు.

**ఏతస్మా దేవ పక్షీశ కర్మ యత్సముదాహృతమ్ ।**
**పుష్కరాఖ్యా సమతులం శృణోతి శ్రద్ధయాన్వితః ॥**
**హరి ప్రీతి కరే ధర్మే ప్రీతియుక్తో భవేత్సదా ॥70॥**

పక్షీంద్రా! ఇందువల్ల సాటిలేని పుష్కరాఖ్యానమైన కర్మ నీకు చెప్పబడింది. శ్రద్ధతో దీనిని విన్నవాడు హరికి సంతోషం కలిగించే ధర్మమందు ఎల్లప్పుడు ప్రీతికలిగియుంటాడు.

**ఇతి శ్రీగారుడే మహాపురాణే ఉత్తరఖండే తృతీయాంశాఖ్యే బ్రహ్మకాండే కృష్ణగరుడసంవాదే తత్త్వరహస్యం నామైకోనత్రింశోఽధ్యాయః ॥29॥**

శ్రీగరుడమహాపురాణం ఉత్తరఖండం మూడవ అంశమనబడే బ్రహ్మకాండంలో కృష్ణగరుడసంవాదంలో తత్త్వరహస్యం అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

**సమాప్తమిదం గరుడ మహాపురాణమ్ ॥**

గరుడ మహాపురాణం సమాప్తం.